# తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం

మెరీనా ఆవరణం, చెన్నై - 600 005

సంపుటి : 27 సంచిక : 5 ప్రత్యేక సంచిక మార్చి - 2024 ISSN No. : 2457-0796

UGC APPROVED JOURNAL

# మూసీ ప్రత్యేక సంచిక

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక



## అంతర్జాతీయ సదస్సు



# కవిత్రయ మహాభారతం

## వర్తమాన సమాజం : సమాలోచనం

మార్చి 4, 5 & 6, 2024




సదస్సు సంచాలకులు

ఆచార్య విస్తాలి శంకరరావు

తెలుగుశాఖ



వ్యవస్థాపకులు

**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 5(2) మార్చి - 2024

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013


**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

# అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# కవిత్రయ మహాభారతం - వర్తమాన సమాజం : సమాలోచనం

**4, 5 & 6 మార్చి, 2024**

## మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక

ప్రథమ ముద్రణ : మార్చి, 2024

ప్రతులు : 500

కాపీలకు : **తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై - 600 005**

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

**ఎడిటోరియల్ చిరునామా**

మేనేజర్, **మూసీ మాసపత్రిక,**

2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,

బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

ఫోన్ : 934 797 1177

**email : editormusi@gmail.com**

# తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం

# కవిత్రయ మహాభారతం - వర్తమాన సమాజం : సమాలోచనం

**4, 5 & 6 మార్చి, 2024**

ప్రధాన సంపాదకులు

**ఆచార్య విస్తాలి శంకరరావు**

సహాయ సంపాదకులు

**డా. పాండురంగం కాళియప్ప**

**డా. మాదా శంకరబాబు**

**తెలుగు శాఖ**

**మద్రాసు విశ్వవిద్యాలయం**

**చెన్నై - 600005**

# సదస్సు లక్ష్యం

మహాభారతం మన జాతీయకావ్యం. మానవుడు "ధర్మం, అర్థం, కామం, మోక్షం" అనే నాలుగు పురుషార్థాలను సాధించడానికి అవసరమైన విజ్ఞానం అంతా ఈ కావ్యంలో నిక్షిప్తమయి ఉంది. అంతేకాదు వేదాలు, శాస్త్రాలు, పురాణాలు ఉపనిషత్తుల సారం అంతా ఇందులో చోటుచేసుకున్నందువలన ఇది "పంచమవేదం"గా, "భారతీయ విజ్ఞానసర్వసం" గా కీర్తింపబడింది. అంతేకాదు

**"యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్"**

ఈ కావ్యంలో ఏది ఉందో అదే ఎక్కడైన ఉంది. ఇందులో లేనిది మరెక్కడ లేదు అనే ప్రశస్తి పొందింది. దేవభాషలో అవతరించిన భారతం, దేశ భాషలలోకి అనుసృజన అయ్యింది. అలాంటి అనుసృజనలో 11,13 మరియు 14 శతాబ్దాలలో వెలువడిన కవిత్రయం (నన్నయ, తిక్కన, ఎర్రన) భారతం ఎంతో విలక్షణం. కృష్ణద్వైపాయనుడు ఏ పరమార్థాన్ని మూలంలో నిరూపించాడో అది చెక్కు చెదరకుండా ఆ సారాన్ని నిక్షప్తం చేసుకుని అవతరించిన స్వతంత్ర తెలుగు రచన "కవిత్రయ భారతం". ఈ 18 పర్వాల తెలుగు భారతం తెలుగు సాహిత్య, సాంస్కృతిక మందిరంపై నిర్మించబడిన సమున్నత సాహితీ కీర్తి శిఖరం.

కాలాలు మారినా, జీవన విధానాలు మారినా కొన్ని అంశాలు మాత్రం అన్ని కాలాలకు అమోద యోగ్యంగా ఉంటాయి. అలాంటి అమోదయోగ్యమైన గ్రంథాలలో తెలుగు భారతం ఒకటి. మరి తెలుగు భారతం 11,13 & 14 శతాబ్దాలు వెలువడినా అది నేడు 2024లో ఉన్నా మనకు అనేక సందర్భాలలో చర్చకు వస్తూనే ఉంది. అందులోని అనేక విషయాలు ఆదర్శనీయంగా నిలుస్తూనే ఉన్నాయి. ఇలాంటి అంశాలే నేటి సదస్సు ఆవిర్భావానికి మూలాలుగా నిలిచి నేడు కవిత్రయ భారతాన్ని సమాలోచన చేయాలనే ఆలోచన, ప్రేరణగా నిలిచింది ఎలా అంటే

తెలుగు భారతంలోని అంశాలు నాటి మానవునికే కాదు నేటి మానవుని జీవనానికి అవసరమైన అనేకాంశాలను ఆయా పాత్రలు ద్వారా, సంఘటనలు ద్వారా, సంభాషణల ద్వారా, నీతి, న్యాయం, ధర్మం, దానం ఇలా అనేకాంశాలకు సంబంధించిన నైతిక విలువలు బోధిస్తుంది. ఆ ధర్మలు, నీతులు, న్యాయాలు మానవుని స్వభావ చిత్రణను , జీవ ప్రమాణాలను ఉన్నతంగా పెంపొందించేవిగా ఉండడమే కాక అవి అన్ని కాలల్లోను, అని వయస్సులు వారు ఆచరించదగినవిగా నిలుస్తున్నాయి.

మరి ప్రస్తుత సాంకేతిక యుగంలోని మానవుని జీవితం అనేక మార్పులకులోనై అనేక సమస్యలను ఎదుర్కొనడమే కాక, మనిషికి కావలసిన ప్రాథమిక జీవన విలువలు కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. మరి నేటి సమాజంలోని వారికి తెలుగు భారతంలోని అంశాలు ఎలా ఉపకరిస్తాయో పరిశీలించి చర్చించాలనే లక్ష్యంతోనే ఈ అంతర్జాతీయ సదస్సు 'కవిత్రయ భారతం – వర్తమాన సమాజం : సమాలోచనం" అనే పేరుతో మీ ముందుకు వచ్చింది. సదస్సు నిర్వహణ కాదు. భవిష్యత్తు ప్రయోజనం దృష్ట్యా ఆ సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాలను ఒక ప్రత్యేక సంచిక రూపంలో మీ ముందుకు తీసుకువస్తున్నాం.

ఈ ప్రత్యేక సంచిక అతికొద్ది సమయంలోనే తీసుకురావడమైంది. వ్యాసరచయితలు దాదాపు అక్షరదోషాలు లేకుండా సరి చూసుకున్నార అక్కడక్కడ కొన్ని అక్షర ధోషాలు ఉండే అవకాశం ఉంది. ఈ తక్కువ సమయంలో మేము క్షుణ్ణంగా చదవడం సాధ్యం కాలేదు. కనుక ఏదైన దోషాలు ఉంటే తర్వాత ముద్రించే సంచికలో మార్పులు చేయగలనని తెలియజేస్తున్నాను.

నమస్కారాలతో

**ఆచార్య విస్తాలిశంకరరావు**
సదస్సు సంచాలకులు, తెలుగుశాఖాధ్యక్షులు,
మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై – 05.

# కృతజ్ఞతలు

మద్రాసువిశ్వవిద్యాలయం, తెలుగుశాఖ ఆత్మీయులందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు. తెలుగుశాఖ ఏ కార్యక్రమం చేపట్టిన దానికి వెన్నుదన్నుగా నిలిచిన మీ ప్రోత్సహం తెలుగుశాఖ ఎప్పటికీ మరువలేదు. ప్రస్తుత "కవిత్రయ భారతం – వర్తమాన సమాజం : సమాలోచనం" అనే అంతర్జాతీయ సదస్సు కూడా ఎప్పటిలాగే మీ అభిమానికి పాత్రమై విజయవంతంగా పూర్తి చేసుకుంది. మూడు రోజులు పాటు ఎంతో వైభవంగా పూర్తి చేసుకున్న ఈ సదస్సులో కీలక, సమాపనోత్సవ సందేశాలను అందించిన పెద్దలకు, అతిథులు, అధ్యక్షులు, పత్రసమర్పకులు, పరిశీలకులు, తెలుగు సాహిత్యాభిమానులు ఎందరో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు ఆత్మీయ పలుకులతో ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఒక సదస్సు నిర్వహించడమంటే ఎంతో కష్టంతో కూడిన పని అంతేకాక ఆ సదస్సులో సమర్పించబడిన వ్యాసాలను పుస్తక రూపంలో తీసుకువచ్చి అదే సదస్సులో ఆవిష్కరించడం అంటే దానిలో ఎంత శ్రమ ఉంటుందో ప్రతి ఒక్కరికీ తెలిసిందే. మా కోరికను మన్నించి సకాలంలో పరిశోధన వ్యాసాలను అందించిన రచయితలకు హృదయాపూర్వక కృతజ్ఞతలు.

ఆ వ్యాసాలను ఒక చక్కని గ్రంథంగా అమర్చడానికి రాత్రి, పగలు అని తేడా లేకుండా శ్రమించిన తెలుగుశాఖ అధ్యాపకులు డా॥ పాండురంగం కాళియప్ప గారి శ్రమ వెలకట్టలేనిది. నేను తీసుకున్న నిర్ణయానికి కాదు, లేదు అనే మాట లేక కట్టుబడి అనుకున్న సమయానికి చక్కగా రూపుదిద్దిన మిత్రులు డా॥.పాండురంగం కాళియప్పకు కృతజ్ఞతలు.

ఇక సదస్సు నిర్వహణలోగాని, కొన్ని వ్యాసాలు టైపు చేయడంలోని గాని అదీ ఇదీ అని కాకుండా అన్ని పనులను చక్కబెట్టేవారు తెలుగుశాఖ అధ్యాపకులు డా॥.మాదా శంకర బాబుకు, పరిశోధకురాలు ఎస్.శశికళకు గార్లకు కృతజ్ఞతలు.

నేను ఏ సదస్సు చేపట్టినా అందుకు అవసరమైన ఆహ్వాన పత్రిక గాని, బ్యానర్లుగాని, పుస్తక ముఖ చిత్రాలు కాని ఎదైనా సరే అందంగా తన మనో లేఖినితో చిత్రించే తమ్ముడు మదురై కామరాజు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అధ్యక్షులు డా॥. జొన్నలగడ్డ వెంకటరమణ గారికి, వారి మిత్రబృందానికి ధన్యవాదాలు.

సదస్సు నిర్వహించడంతో పాటు ప్రత్యేక సంచికను తీసుకురావాలనే సంకల్పం ఒక ఎత్తు అయితే, ఆ సంచికలోని వ్యాసాలు పలువురికి ఉపయోగకరంగా ఉండాలని ఉద్దేశ్యంతో యు.జి.సి. రెఫర్డ్ జర్నల్ తెలుగు "మూసి" పత్రిక సారథులు ఆచార్య సాగి కమలాకర శర్మగారు, డా॥ అట్టెం దత్తయ్య గార్లు తదితర ఎడిటోరియల్ సభ్యులను సంప్రదించగానే అంగీకరించి మన సదస్సు వ్యాసాలను అందులో ముద్రింపజేసిన మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగాను సహకరించిన ప్రతి ఒక్కరికి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నమస్కారాలతో

**ఆచార్య విస్తాలిశంకరరావు**

# విషయసూచిక

సదస్సు లక్ష్యం ... i
కృతజ్ఞతలు ... ii
1. మహాభారత వైశిష్ట్యం – ఆచార్య లింగంనేని బసవ శంకరరావు ... 1
2. మహాభారతము – మానవ సమాజము – డా॥ మేడసాని మోహన్ ... 6
3. ఆశ్రమవాస పర్వం – ఆధునిక సమాజం – ఆచార్య విస్తాలి శంకరరావు ... 12
4. వర్తమాన రక్షణగీత భారత భగవద్గీత – 'విశ్వర్షి' వాసిలి వసంతకుమార్ ... 17
5. కవిత్రయ భారతంలో ధృతరాష్ట్రుని పాత్రచిత్రణ–మరో చూపు – డా॥ జె. వెంకటరమణ ... 23
6. విదురనీతి–విశ్వగీతి – డా॥ శ్రీదేవీ శ్రీకాంత్ ... 29
7. అనుశాసనిక పర్వం – ఆధునిక సమాజం – విశ్లేషణ – డా॥ పాండురంగం కాళియప్ప ... 36
8. ఆంధ్రమహాభారతం – మానవతా విలువలు – మన సమాజ ప్రతిఫలనం
– డా॥ బత్తుల అశోక్ కుమార్ ... 45
9. ఆంధ్రమహాభారతము – ఆదిపర్వము – ఆచరణీయ సామాజిక విలువలు
– డా॥ పులవర్తి పైడిరాజు ... 50
10. శ్రీమదాంధ్రమహాభారతం– ఆదిమ గిరిజన తెగల ప్రస్తావన – డా॥ నూనావత్ రాంబాబు... 55
11. ఆంధ్ర మహాభారతం – ఏకలవ్యుని గురుభక్తి – డా॥ కల్యాడపు రమేశ్ ... 61
12. కవిత్రయ భారతం–ధర్మరాజు స్వభావ చిత్రణ – డా॥మల్లెపోగు మాదన్న ... 65
13. "భారతం... అభ్యుదయ భావుకత" – డా:.టి.పార్థసారథి .. 69
14. ఆంధ్రమహాభారతం – సప్తవ్యసనాలు – వర్తమాన సమాజం – పర్యవసానాలు
– డా॥ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి ... 72
15. తిక్కన భారతం – ధౌమ్య ధర్మోపదేశాలు – డా॥ పట్టపు. శివకుమార్ ... 78
16. మహాభారతం–పద్దెనిమిది పర్వాలు–విశేషాలు( క్లుప్తంగా) – డా॥ వి. వెంకటేశ్వర్లు ... 85
17. ఉద్యోగపర్వము – విదురనీతి – డా.॥ టి.ఆర్.ఎస్. శర్మ ... 93
18. మహాభారతం 'కర్ణుడు' – వర్తమాన సమాజం – ఆదర్శ జీవన విలువలు
– డా॥ మాదా శంకరబాబు ... 98
19. ప్రజలు మెచ్చిన ధర్మరాజు – డా. ఐ.వి.కాంతలక్ష్మి ... 106
20. మహాభారతకాలంనాటి – ఆశ్రమ, సాంఘిక జీవితాలు – నేటి యువతకు ఆదర్శాలు
– డా॥ పప్పుల వెంకటరమణ ... 111
21. మహాభారత ఉపాఖ్యానములు – మానవ స్వభావ చిత్రణ – డా॥ లింగాల మంగమ్మ ... 119
22. నన్నయ భారతంలోని సామాజిక స్పృహ – సమాలోచన – డా॥ కసుకుర్తి ఈశ్వరమ్మ ... 124

23. మహాభారతం – విశ్వశ్రేయస్సు – డా॥ ఎన్. భీమన్న ... 129
24. మహాభారతంలో కుటుంబవ్యవస్థ – డా॥ బి. తేజోవాణి ... 139
25. మహాభారతంలోని ధర్మమార్గములు – వాటి ఆవశ్యకత – కైపు. యర్రారెడ్డి ... 148
26. తిక్కన భారతం – మానవ సంబంధాలు – డా॥ భూక్య తిరుపతి ... 152
27. మహాభారతంలో మాతృ మూర్తులు: ప్రణాళిక – డా॥ జాడ సీతాపతి రావు ... 156
28. కవిత్రయ భారతం – సామాజిక హితబోధ – డా॥ ఆర్. విజయకుమారి ... 163
29. కవిత్రయ మహాభారతం – వ్యక్తిత్వ వికాసం – పెద్దాడ సాయి సూర్య సుబ్బలక్ష్మి ... 170
30. వ్యాఘ్రగోమాయు సంవాదం – సౌమ్యుల అసౌమ్యుల వివక్షత– డా॥ నూకల విజయలక్ష్మి ... 175
31. వీరభీష్మ – ఆదర్శనీయ వ్యక్తిత్వం – ఎస్. శశికళ ... 180
32. మహా భారతంలో యోగ దర్శనం – ఒక విశ్లేషణ – డా॥ నగిరి చాముండేశ్వర రావు ... 189
33. కవిత్రయ మహాభారతం – విశిష్టస్త్రీలు – పరిశీలన – డా॥ జి. శ్రీనివాస్ ... 194
34. కవిత్రయ భారతం – రాజధర్మం – డా॥ ఎన్.మురళి, –డా॥ సి.సుకుమార్ రెడ్డి ... 198
35. ఆంధ్ర మహాభారతంలోని సౌప్తిక పర్వ వైశిష్ట్యం – గరిక రమేష్ బాబు ... 202
36. కవిత్రయ భారత సంభాషణా నైపుణ్యం – వర్తమాన సమాజం – సమాలోచన
– డా॥ జడా సుబ్బారావు ... 205
37. మహాభారతంలో యయాతి హితవు – సామాజిక సందేశం– డా॥ పలివెల చిరంజీవిరావు... 211
38. తిక్కన మహాభారత శాంతిపర్వం – భీష్మ సందేశం – డా॥ కె.వి. సత్యనారాయణ ... 217
39. కవిత్రయ మహాభారతం – వర్తమాన సమాజం సమాలోచనం – భక్తిభావం
– డా॥ జి.లక్ష్మీనారాయణ ... 222
40. నన్నయ శకుంతలోపాఖ్యానం – గృహస్థాశ్రమ విశిష్టత – డా॥ పొట్లూరి శ్రీనివాసరావు ... 228
41. కవిత్రయ మహాభారతం – ఆధునిక మానవుని మనస్తత్వం – డా॥ శ్రీను కెతావత్ ... 231
42. భారతంలోని నాయకత్వ లక్షణాలు – నేడు వాటి ప్రాధాన్యత – సాకే హరిభక్త భానుశ్రీ ... 236
43. ఆంధ్రమహాభారతం – నేటి ఆధునిక జీవితం – ప్రేమ, ఒత్తిడి
– పొందుగుల బాలు భీంరావ్ ... 241
44. సత్యా ద్రౌపదీ సంవాదం – ద్రౌపది దాంపత్య ధర్మం – డా॥ సంగీతరావు మెడతోటి ... 245
45. నన్నయ భారతం – వ్యక్తిత్వ వికాసానికి ప్రతీక – యం.భీమయ్య ... 251
46. మహాభారతం నేటి మానవ స్వభావాలు – డా॥. జి. నళిని ... 256
47. కవిత్రయ భారతం – ఆధునిక సమాజం : స్త్రీల స్థితిగతులు – కిడాంబి శ్రావణి ... 260
48. ఆంధ్రమహాభారతంలో అబ్బురపరిచే మానవీయ విలువలు – ఆచరణ యోగ్యములు
– డా॥ భూక్య జ్యోతి ... 266

49. కవిత్రయ భారతం పాత్రలు – మనస్తత్త్వ చిత్రణ – రామాపురం శ్రీనివాసులు, బి. రజని... 270

50. శకుంతల దుష్యంతల కథ – సార్వకాలికం
– దేవిశెట్టి రామన్న మరియు పాండవ హరీష్ బాబు ... 273

51. నన్నయ్య గారి సభా పర్వం లోని సూక్తులు నేటి కాల ఉపయోగం
– డా॥ అద్దంకి ప్రజాపతి ... 277

52. ఆంధ్రమహాభారతం – గురుశిష్య సంబంధాలు – బొమ్మ మహాలక్ష్మి ... 281

53. ఆంధ్ర మహాభారతం కుటుంబ –వ్యవస్థ ఆధునిక జీవనం – కొమరం అనిత ... 286

54. నన్నయ 'యయాతి చరిత్ర' కథ – వర్తమాన సమాజానికి బోధించే నీతి – షేక్ జరీనా ... 292

55. మహాభారతం సత్య ప్రాధాన్యం – డా॥ ఎన్ ఎలిజబెత్ జయకుమారి ... 297

56. శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాములవారి గీతాభక్తితత్వం – డా॥ ఎం.దీనదయాళ్ ... 306

57. సినీరచనల్లో మహాభారతం (పాటలు మరియు సంభాషణలు) –డా॥ ఉడాలి విష్ణుప్రియ ... 314

58. మహాభారతం–వర్తమాన సమాజం...తులనాత్మక విశ్లేషణ
– డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి ... 325

59. మహాభారతం – వర్తమాన విద్యారీతులు – డాక్టర్ ఎం.మురళి ... 332

60. ఎర్రన ఆరణ్యపర్వభాగంలో యక్షప్రశ్నలు – డా॥ తిరుమల ఆముక్తమాల్యద ... 336

61. కవిత్రయ మహాభారతం – సామ, దాన, భేద, దండ చాతుర్యము
– ముక్కామల సాయి అనిరుధ్ ... 341

62. మహాభారతంలో సంజయ రాయబారం–వర్తమాన సమాజం – అన్నపూర్ణ బత్తుల ... 344

63. కవిత్రయ మహాభారత నాటకాలు – సామాజిక దృక్పథాలు – డా॥ చుక్కా యశోద ... 349

64. కవిత్రయ మహాభారతం – అరిషడ్వర్గాలు – ఆవశ్యకత – డా॥ బి. పావని ... 356

65. నేటి మహిళలకు "గాంధారి" ఆదర్శమేనా? – డా॥ గుంటుపల్లి గౌరి ... 360

66. అంబోపాఖ్యానం – వర్తమాన సమాజ సమాలోచనం – డా॥ టి. రాజశేఖర్ ... 365

67. ప్రమద్వరోపాఖ్యానం – వర్తమానసమాజ సమాలోచనం – డా॥ సింగమాల చంద్రయ్య ... 369

68. నాటి యయాతి – నేటి దృక్కోణాలు – డా॥ యం. రమాదేవి ... 372

69. మహాభారతంలో ద్రౌపది పాత్ర – మనస్థత్వ చిత్రణ – యు.లావణ్య ... 379

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 1. మహాభారత వైశిష్ట్యం

– ఆచార్య లింగంనేని బసవ శంకరరావు, చెన్నై

శ్రీమన్నారాయణుని ఏకవింశత్యవతారాల్లో వేదవ్యాసుడొక అవతారం. అందుకే 'వ్యాసో నారాయణో హరి:' అంటున్నారు. ఏక రాశీభూతమైన వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించడం వల్ల వేదవ్యాసుడైనాడు. వేదసారాన్ని, ఉపనిషత్సారాన్ని మహాభారతంలో నిక్షిప్తం చేశాడు. అందువల్ల పండితులు మహాభారతాన్ని పంచమవేదంగా పరగణిస్తున్నారు. వ్యాసుడు భారతాన్ని సంవత్సర త్రయంలో నిర్మించాడట.

**శ్లో. నారాయణం నమస్కృత్య – నరంచైవ నరోత్తమం**
**దేవీం సరస్వతీంవ్యాసం – తతో జయ ముదీరయేత్**

నారాయణుని, నరుని, సరస్వతిని వ్యాసునికి నమస్కరించి ఆ పిమ్మట జయాన్ని చదవాలట. జయం అనేది సంఖ్యాశాస్త్రాన్ని బట్టి 18 అవుతుంది. 18 పర్వాలున్న ఈ భారతాన్ని మొదట జయ మనేవారు. జయంలో మొదట 8000 శ్లోకాలుండేవట. వ్యాసుని శిష్యులైన పైల, సుమంత, జైమిన్యాదులు భారతాన్ని వ్యాప్తి గావించగా అది పెరిగి 25000 శ్లోకాల భారతమైందట. సూతుడు శౌనకాద్యఖిల మునీంద్రులకు భారతాన్ని వివరించి చెప్పగా అది పెరిగి 1,00,000 లక్షశ్లోకాలయ్యిందట.

భారతం ఎంత ప్రశస్తమైన గ్రంథమంటే భారతాన్ని చదివిన తర్వాత ఏ ఇతర గ్రంథాన్ని చదవటానికి ప్రయత్నించరని మా గురువులు పింగళి లక్ష్మీకాంతం ఇలాగ పేర్కొన్నారు.

**పారిజాతము తన కంటబడెడు వరకె**
**ద్రుమముద్రుమమున తిరుగు మధు వ్రతమ్ము**
**భారత కవిత్వరుచి పట్టువడెడు వరకె**
**ఇతర కావ్యాలు తడవు సాహిత్య వటువు**

పురుషార్థాలైన ధర్మార్థ కామ మోక్షాలకు ఆకరం మహాభారతం. ఈ పురుషార్థాలకు సంబంధించిన విషయాలు ఏదైనా అనుమానము వస్తే మహాభారతాన్ని పఠించాలి. మన అనుమానాలన్నీ భారత పఠనం వల్ల పటాపంచలై పోతాయట.

తిక్కన సోమయాజి ఈ విషయాన్ని మనోహరంగా వివరించాడు.

**వేదములకు, నఖిలస్మృతి**
**వాదములకు, బహుపురాణ వర్గంబులకున్**
**వాదైన చోటులను దా**
**మూదల ధర్మార్థ కామ మోక్షస్థితికిన్ ( 4-1-4)**

నన్నయ మహాభారత ప్రాశస్త్యాన్ని మనోజ్ఞంగా వివరించాడు. మహాభారత మొక ఆదర్శము. ఏ దృష్టితో చూస్తే అది భారతంలో ప్రతిబింబిస్తుందట.

**ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని**
**యధ్యాత్మ విదులు వేదాంత మనియు**
**నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని**

కవి వృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యంబని మహిగొనియాడు చుండ
వివిధ వేదతత్త్వ వేదివేదవ్యాసు
దాదిముని పరాశరాత్మ జుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండ జేసె భారతంబు (1-1-31)

**అష్టాదశ సంఖ్యా విశేషం**

భారతంలో 18 పర్వాలున్నాయి. 18ని కలిపితే 9 అవుతుంది. కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. 18రోజులే. అందులో పాల్గోన్నది 18 అక్షౌహిణుల సైన్యమే. భగవద్గీతలో ఉన్నవి 18 అధ్యాయాలే. ఒక అక్షౌహిణిలో రథాల సంఖ్య 21870. ఇది కలిపితే 9 అవుతుంది. అలాగే గజాల సంఖ్య కూడా 21870. అశ్వాల సంఖ్య 65610=18=9. సైనికుల సంఖ్య 109350=18=9 అయ్యింది. మొత్తం అక్షౌహిణి సంఖ్య 2,18,700 =18=9 అవుతోంది. అష్టాదశా క్షౌహిణీ సంఖ్య 18×218700 = 3936600 = 27 = 9 అవుతుంది. సంఖ్యల్లో 9 కి ఒక ప్రత్యేకమైన గుణం ఉంది. 9 ని దేనితో హెచ్చించినా చివరకు 9 వస్తుంది. 9×2=18=9, 9×3=27=9,9×4=36=9, అవుతుంది గదా!

**ఐదుతరాలు**

మహాభారత యుద్ధంలో 5 తరాల వారు పాల్గొని హతులయ్యారు. నేటి కాలంలో మూడు తరాలవారు యుద్ధం చేయలేరు. మరి ఆనాడు 5 తరాల వారు యుద్ధం చేశారంటే వారి వయ:పరిమితి ఎంతటిదో గదా. భారత యుద్ధానంతరం అగ్ని కార్యాలు చేయటానికి ధృతరాష్ట్ర ధర్మజాదలు పొలికలనికి వచ్చారా అప్పుడు సంజయుడు ధృతరాష్ట్రునితో 'భవత్పితామహా, పితృ, భ్రాతృ, పుత్ర పౌత్ర సఖి సుహృత్ సహాయులుందెగిరని చెప్పాడు. తగు జాగ్రత్తగా భారతాన్ని పఠిస్తేగాని 5 తరాలవారు మనకు తెలవరు. శంతనుని సోదరుడు బాహ్లికుడు భారత యుద్ధంలో భీముని చేతిలో చచ్చిపోయాడు. బాహ్లికుడు మొదటితరం. శంతను కుమారుడైన భీష్ముడు, బాహ్లికుని కుమారుడైన సోమదత్తుడు రెండవతరం వారు. సోమదత్తుని కుమారులైన భూరిశ్రవ, శల, శల్యులు ముగ్గురు మూడవతరం వారు దుర్యోధనాదులు నాల్గవ తరం వారు, లక్షణ, అభిమన్యాదులు ఐదోతరం వారు.

**వయ: పరిమితి**

ఆంధ్రమహాభారతం ప్రకారం పాండవులు శతశృంగ పర్వతం నుండి పాండురాజు చనిపోయిన తర్వాత హస్తినాపురానికి వచ్చారు. అప్పుడు ధర్మజుని వయసు16, భీముని వయస్సు15, అర్జునునికి 14, కవలలైన నకుల సహదేవుల వయస్సు 13. ద్రోణాచార్యుల వద్ద ధనుర్విద్య నభ్యసించినది 13 సంవత్సరాలు, అంటే ధర్మజునికి 29 సంవత్సరాలన్నమాట. లాక్షాగృహంలో 6 నెలలు, ఏకచక్రపురంలో 6 నెలలు కలిపి ధర్మజుని వయసు 30. ద్రౌపది వివాహనంతరం పాండవులు ద్రుపదినింట ఒక సంవత్సరం అంటే ధర్మజుని వయస్సు 31. పాండవులు హస్తినకు వచ్చి 5 సంవత్సరాలు కలిసిమెలిసి ఉన్నారు(36). ఆ పిమ్మట ఇంద్రప్రస్థంలో రాజ్యపాలన 23 సంవత్సరాలు చేశారు. అప్పటికి ధర్మజుని వయస్సు 36+23=59 సంవత్సరాలు. పిమ్మట అరణ్యవాసం, అజ్ఞాతవాసం 13 సంవత్సరాలు కలిపితే 59+13 =72 సంవత్సరాలు. యుద్ధానంతరం

ధర్మరాజాదులు రాజ్యపాలన కావించింది 36 సంవత్సరాలు అంటే ధర్మజుని వయస్సు 108 సంవత్సరాలు, భీష్మ, బాహ్లికుల వయస్సు యుద్ధకాలం నాటికి ఇంకా ఎక్కువగానే ఉండి ఉండాలి.

**భానుమతీదేవి**

భానుమతి దుర్యోధనుని భార్య అని సామాన్య జనం భావిస్తున్నారు. దానికి కారణం నన్నయ సభాపర్వంలో ద్రౌపది గాంధారిని దర్శించటానికి వచ్చినపుడు భానుమతి ప్రభృతి స్నుషా పరివృతయై యున్న గాంధారిని కాంచింది (2-2-159) భారతంలో ఇంకా ఎక్కడ భానుమతి ప్రస్తావన లేదు. నిజానికి భానుమతి దుర్యోధనుని భార్యగా భారతంలో ఎక్కడ పేర్కొనబడలేదు. అంతేకాదు సంస్కృత భారతంలో కూడా భానుమతి ప్రస్తావన లేదు. భట్టనారాయణుడు సంస్కృత వేణీసంహారంలో దుర్యోధనుని భార్య భానుమతి అని పేర్కొన్నాడు. దాన్ని చూసి నన్నయ అలాగే పేర్కొని యుండవచ్చు.

**శుభాంగిని**

శాంతిపర్వంలో దుర్యోధనుని భార్య శుభాంగిని అని పేర్కొనబడింది. కళింగాధీశుడైన చిత్రాంగదుని కూతురు శుభాంగిని. ఈమె స్వయంవరానికి దుర్యోధనుడు కర్ణునితో కలిసి వెళ్ళాడు. ఈ స్వయంవరానికి రుక్మి, శిశుపాల, జరాసంధాదులు కూడా వచ్చారు. ఈమె దుర్యోధనుని వరించకుండా ముందుకు సాగిపోగా ఆమెను చేపట్టి రథం మీద ఎక్కించుకుని బయలుదేరాడు. అప్పుడు జరిగిన యుద్ధంలో కర్ణుడు వారినందరిని నిలువరించాడు.

**ఏకలవ్యుడు**

ఆంధ్రమహాభారతంలో ఏకలవ్యుడు హిరణ్యధన్వుని కుమారుడని నిషాదుడనీ ఉంది. కాని హరివంశంలో (భారత ఖిల భాగం కదా!) వసుదేవుని చెల్లెలైన శ్రుతదేవికి కేక యేశ్వరుని వల్ల ఏకలవ్యుడు జన్మించాడనీ, నిషాదుల్లో పెరిగాడనీ ఉండటం విశేషం. మూల భారతంలో ఏకలవ్యుడు మయసభ కేతించినప్పుడు ధర్మరాజునకు బంగారు పాదుకల్ని సమర్పించాడని కలదు. విరాట నగరంలో పాండవులున్నప్పుడు సైన్య సహాయార్థమై ధర్మరాజు ఏకలవ్యుని, అతని కుమారుని తమ పక్షానికి రమ్మని వర్తమానం పంపించాడు. యుద్ధారంభానికి ముందే కృష్ణుడు, ఏకలవ్యుని వధించాడని మూలభారతంలో ఉండటం విశేషం. అంటే ఏకలవ్యుడు కృష్ణుని మేనత్త కొడుకని, పాండవులకు సోదరుడువుతాడన్నమాట.

**ధర్మం**

నేటి సమాజానికి అన్వయించుకునే విషయాలు భారతంలో కోకొల్లలుగా ఉన్నాయి. భారతంలోని ఎన్నో విషయాల్ని గ్రహించి మన జీవితాన్ని సరిదిద్దుకోవచ్చును. ఉత్తమ మానవధర్మం ధర్మాన్ని అనుసరించటం "ధర్మో రక్షతి రక్షిత:" అన్నారు.

**ఒరులేయవియొనరించిన**
**నరవర అప్రియముతన మనమునకగు తా**
**నొరులకు నవిసేయకునికి**
**పరాయణము పరమధర్మపథములకెల్లన్ (శాంతి 5- 220)**

సారమైన ధర్మం పాపం చేత చెడిపోతే దక్షులు రక్షించాలని రక్షించకపోతే వారికే చేటు వర్తిల్లుతుందని భారతం చెప్తుతుంది.

**సత్యం**

సత్యం మాట్లాడేవారు కరువు అయిపోతున్నారు. సెల్‌ఫోన్లు వచ్చాకే అసత్యాలు ఎక్కువ అయిపోతున్నాయి. సత్యదృష్టి మానవునికుండవలసిన ద్వితీయ ఉత్తమ లక్షణం. ధర్మం,సత్యం ఎంతగానో నేటి సమాజానికి అత్యంతావశ్యకం. సత్యం చాలా గొప్పదని శకుంతలోపాఖ్యానం చెపుతోంది.

**వెలుయంగ నశ్వమేధం**
**బులువేయను నొక్క సత్యమును నిరుగడలం**
**దులనిడి తూపగ సత్యము**
**వలననములు సూపు గౌరవంబున పేర్మిన్ (ఆది 4-93)**

నూరునూతులు కంటే ఒక బావి మేలు, మరి నూరు బావులు కంటే సత్క్రతువు మేలు. నూరు క్రతువుల కంటే పుత్రుడు మేలు. నూర్గురు పుత్రులు కంటే ఒక సూనృత వాక్యము మేలంటున్నారు.

**అసత్యం**

సత్యం మాటలాడటం ఎంత అవసరమో కొన్ని చోట్ల అసత్యం పలకటం కూడా మంచిదే అని భారతం చెపుతుంది.

**చనుబొంకక ప్రాణాత్యయ**
**మున, సర్వధనాపహరణమున, వధగావ**
**ఛ్చిన, విప్రార్థమున, వధూ**
**జన సంగమమున, వివాహ సమయములందున్ (ఆది 3-78)**

**హింస**

మానవులనే కాదు జంతువుల్ని కూడా హింసించరాదు. మనం దోమల్ని, చీమల్ని, ఎలుకల్ని చంపుతాం గదా! ఇది హింస కాదా అంటే అహింస అంటే ఏమిటో భారతం బోధిస్తోంది.

**హింస సేయనివాడు లేడిజ్జగమున**
**నొక్కడైనను తమ తమ యోపినట్లు**
**హింస తెరువునకెడ గల్గియేగవలయు**
**నదియచూవె యహింసనానతిశయిల్లు (ఆరణ్య 5 -60)**

**మాంసాహారం**

ఈ కాలంలో మాంసాహారం మంచిదికాదనీ, శాకహారం ఆరోగ్యకరమనీ వైద్యులు వేనోళ్ల చెపుతున్నారు. మాంసం రుచి కొనియాడదగిందే. రుచి ఎరిగిన వాడు మాంసాహారం మానివేస్తే ఆ మానవుడు ఉత్తముడు.

**జనవర! మాంసము చవిగడ**
**చినచవులరయంగ లేమిచేసి చవియెఱిం**
**గినవాడది యుడిగిన నా**
**తనిదేవసమానుడంద్రు ధర్మవిధిజ్ఞుల్ (అను 4 -293)**

దేవ సమానుడవుతారని చెప్పినా ఎందరు మాంసాహారం మానగలరు. మానవ జన్మ ఎత్తిన తర్వాత మనం చేసే పనుల్లో ఏది ఉత్తమము అంటే మాంసభక్షణం మానటం అట.

**అన్యమాంసమున నిజాంగ మాంసంబు పో**
**షింతుననుట కంటె చెట్టలేదు**
**మాంసభక్షణంబు మానుట కంటెను**
**మేలులేదు కర్మజాలకమున (అను 4- 306)**

**వాక్పారుష్యం**

సప్త వ్యసనాల్లో వాక్పారుష్యం ఒకటి. పరుషంగా మాట్లాడకూడదు. ఆ పలుకు ప్రల్లదమై హృదయశల్యమవుతుంది. ఎదుటివారిని నొప్పించేటట్లు మనం మాట్లాడరాదు.

**తనువున విడిగిన యలుగులు**
**ననువున బుచ్చంగవచ్చు, నతినిష్ఠురతన్**
**మనమున నాటిన మాటలు**
**వినుమెన్ని యుపాయములను నెడలునెయధిపా (ఉద్యోగ 1-262)**

**లంచం**

నేటికాలంలో ఎక్కడ చూచినా లంచాలే లంచాలు, అడుగుడుగున లంచం ఇవ్వాల్సివస్తోంది. భారతంలో ఎలా ఉందో చూడండి.

**చోరభయవరితముగా**
**ధారుణి పాలింతె యధిక ధనలోభమునం**
**చోరుల రక్షింపరుగా**
**వారలచే ధనముగొని భవద్భృత్యవరుల్ (సభా1-41)**

ఈ విధంగా భారతాన్నంతటిని పఠించాలే గాని నేటి సమాజాభివృద్ధికి, మానవాభ్యుదయానికి, మంచితనానికి అవసరమైన విషయాలు భారతంలో కోకొల్లలుగా ఉన్నాయి.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తిరమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. శ్రీ మహాభారతము - ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు
3. మహాభారతం - ఉప్పులూరి కామేశ్వరరావు

# 2. మహాభారతము - మానవ సమాజము

- డా॥ మేడసాని మోహన్, తిరుపతి

మహాభారతము వేదవ్యాసమహర్షి ప్రణీతము. సకలజీవరాసులలో ఉత్తమోత్తమజన్మగా పేర్కొనబడుచున్న మానవ జీవిత పరమార్థమును, గమ్యమును సమాజమునకు తెలుపుటకే వ్యాసమహర్షి మహాభారతమును రచించినాడు. భారతీయ సంప్రదాయ సాహిత్య దృక్పథములుగా అలంకారశాస్త్రములు పేర్కొనుచున్న "విశ్వశ్రేయ: కావ్యం", "వాక్యం రసాత్మకం కావ్యం" ఇత్యాది సిద్ధాంత సూక్తులకు అక్షరప్రాయమైన ఉదాహరణమే మహాభారత కావ్యము. జంతుప్రాయమైన క్రూర సంసార్కము నుండి విడివడి శాంతశమదమాదులతో గూడిన యోగమార్గమును అవలంబించి అంతర్ముఖీన సంస్కారమును, జ్ఞానమును పెంపొందించుటకు కావలసిన ప్రబోధము, సందేశము మహాభారతము నుండి లభించుచున్నవి.

భారతీయ విజ్ఞాన సర్వస్వమునకు మూలకందములైన వేదములు, ఉపనిషత్తులు, ఇతర ధర్మశాస్త్రముల సమాహారమే మహాభారతము. అనంతకాల ప్రవాహమున మానవ సమాజము ఎన్ని విధములైన మనుగడలకు, జీవన విధానములకు లోనగుచున్నదో, మానవ మస్తిష్కమున ఎన్ని పద్ధతులతో కూడిన ఆలోచనా ప్రస్థానములు సాగిపోవుచుండునో మహాభారతము తెలుపుచున్నది. మానవజీవితము సఫలీకృతము కావలయునన్నచో చతుర్విధ పురుషార్థములనబడు ధర్మ, అర్థ, కామ, మోక్షములను సాధింపవలసియున్నది. అందుకే వ్యాసభారతమిట్లు పేర్కొనుచున్నది.

**"ధర్మ చార్థేచ కామేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తినతత్క్వచిత్"** **(ఆది -56-53)**

అష్టాదశ పురాణములలో ప్రముఖమైన మార్కండేయ పురాణము నందు మహాభారత వైశిష్ట్యమును గూర్చి ఈ విధముగా ఉటంకింపబడి యున్నది.

**"తథే హ సర్వశాస్రాణాం మహాభారతముత్తమమ్**
**యత్రార్థశ్చైవధర్మశ్చ కామో మోక్షశ్చ వర్ణ్యతే**
**పరస్పరాను బంధాశ్చ సానుబంధాశ్చ తే పృథక్**
**ధర్మశాస్త్ర మిదం శ్రేష్ఠం అర్థశాస్త్ర మిదం పరమ్**
**కామశాస్త్రమిదం చాగ్ర్యం మోక్షశాస్త్రం తథోత్తమమ్**
**చతురాశ్రమ ధర్మాణాం ఆచారస్థితి సాధనమ్" -**

ఇదే అంశములను నన్నయ మహాకవి కూడా

**"ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రంబని ...................**
**......... విశ్వజనీనమై పరుగుచుండ జేసే భారతంబు** **(ఆది -1-32)**

అను పద్యమున ప్రతిపాదించియున్నాడు. మహాభారతము విశ్వజనీనములైన ఎన్ని మహత్తర విజ్ఞానాంశములకు నిలయమై యుండునట్లుగా వ్యాసమహర్షి నిర్మించి యుండెనో కూడా నన్నయ ఇట్లు వక్కాణించి యున్నాడు.

"కృష్ణద్వైపాయనుండను బ్రహ్మర్షి తొల్లి వేదంబు లేకీభూతంబులై యేర్పడకున్న ఋగ్యజుస్సామాథర్వంబులుగా విభాగించి, తన శిష్యులయిన పైల వైశంపాయన సుమంతు జైమినులంబంచి క్రమంబున జతుర్వేద సూత్రంబుల జేయించి, వేదవ్యాసుండై నిజతపో మహాత్త్వంబునం జేసి బ్రహ్మ చేత ననుజ్ఞాతుండై అష్టాదశపురాణంబులును, నీతి ధర్మశాస్త్రార్థతత్త్వంబులును, చతుర్వేద వేదాంతాభిప్రాయంబులను చతుర్వర్గవర్గాను బంధ బంధుర కథేతిహాసంబులును,చతుర్యుగ

మహర్షి రాజవంశ చరితంబులును, చతుర్వర్ణాశ్రమ ధర్మంబులును, చతుర్ముఖ ప్రముఖ నిఖల సురమునిగణ పూజితుండైన శ్రీ కృష్ణుని మాహాత్మ్యంబును పాండవాది భారతవీరుల మహాగుణంబులును, తన విమల జ్ఞానమయంబైన వాగ్దర్పణంబునందేర్పడి వెలుగుచుండ" (ఆది-1-31)

నన్నయ మహాకవి వ్యక్తీకరించిన ఈయభిప్రాయములనే తిక్కన మహాకవి సంక్షిప్తముగా విరాటపర్వం అవతారికలో ఇట్లు పేర్కొనినాడు.

**"వేదములకు, నఖిలస్మృతి**
**వాదములకు, బహుపురాణవర్గంబులకున్**
**వాదైన చోటులను, తా**
**మూదల ధర్మార్థకామ మోక్షస్థితికిన్"** **(విరాట-1-4)**

వ్యాస ప్రణీతమైన సంస్కృత మహాభారతమును నన్నయ, తిక్కన, ఎర్రన అను ముప్వురు మహాకవులు తెలుగులోనికి స్వతంత్ర అనువాదముగా రచించినారు. వీరే "కవిత్రయము" అని ప్రసిద్ధులైనారు. నన్నయ తన కవితా శిల్పలక్షణములను 1. ప్రసన్నకథాకలితాయుర్థయుక్తి, 2. అక్షర రమ్యత, 3. నానారుచిరార్థ సూక్తినిధి ప్రధానములుగా మూడు విధములుగా పేర్కొనినాడు. నన్నయ స్థూలముగా ఇట్లు పేర్కొనినను. సభాపర్వమున "శిశుపాలవధ" వంటి ఘట్టములలో "నాటకీయశైలి"ని కూడా కనబరిచినాడు. తిక్కన మహాకవి ప్రధానముగా నాటకీయ శైలిలోనే పదిహేను పర్వములు రచించినాడు. ఎర్రన మహాకవి వర్ణనాత్మకశైలిని అనుసరించి రచన సాగించినాడు.

వేదవ్యాసమహర్షి ఆదేశముతో వైశంపాయన మహర్షి పరీక్షిత్తుకు మారుదైన జనమేజయమహారాజునకు ప్రబోధించిన మహత్తర ఇతిహాసమే మహాభారతము. ఈ సందర్భమున మహాభారతము యొక్క మాహాత్మ్యము మూడు పద్యములతో నన్నయ మహాకవి ఈ విధముగా అభివర్ణించినాడు.

**"కమనీయ ధర్మార్థకామమోక్షములకు**
**నత్యంత సాధనం బయినదాని**
**వేడ్కతో దవిలి తన్ వినుచున్నవారల**
**కభిమతశుభకరం బయినదాని**
**రాజుల కఖిలభూరాజ్యాభివృద్ధిని**
**త్యాభ్యుదయప్రదం బయినదాని**
**వాఙ్మన: కాయ ప్రవర్తితానేకజ**
**న్మాఘనిబర్హణం బయినదాని.**
**సత్యవాక్ప్రబంధశతసహస్రశ్లోక**
**సంఖ్య మయినదాని, సర్వలోక**
**పూజ్యమయినదాని, బుధనుతవ్యాసమ**
**హామునిప్రణీత మయినదాని.** **(ఆది -3-9)**
**"వినుతపరాక్రముల్, ధృతవివేకులు, సత్యసమన్వితుల్, యశో**
**ధనులు, కృతజ్ఞు, లుత్తములు, ధర్మపరుల్, శరణాగతానుకం**

**పనులనగా బ్రసిద్ధులగు భారతవీరుల సద్గుణానుకీ**
**ర్తనముల నొప్పుదాని, విదితం బగుదాని సభాంతరంబులన్ (ఆది -3-10)**
**"ఆయుష్యం, బితిహాసవస్తుసముదాయం, బైహికాముష్మిక**
**శ్రేయ: ప్రాప్తినిమిత్తముత్తమ సభాసేవ్యంబు,లోకాగమ**
**న్యాయైకాంతగృహంబు నాబరగి నానావేదవేదాంతవి**
**ద్యాయుక్తం బగుదాని జెప్ప దొడగెం దద్భారతాఖ్యానమున్ (ఆది -3-11)**

**ప్రసన్నకథాకలితార్థయుక్తి**

నన్నయ రచనలో అర్థయుక్తితో కూడిన భావ విన్యాసము. శబ్దధార, సామాసిక చాలనము ప్రధానముగా గోచరించును. ఈ లక్షణములన్నియు ప్రసన్నధారాళశయ్యా విశేషముతో సాగిపోవుచుండును. ఆది, సభ, ఆరణ్య పర్వసన్నివేశాలలో ఏ ఉపాఖ్యానమును పరిశీలించినా, ఏ ప్రకృతి వర్ణనలను అధ్యయనము చేసినా, ఏ పాత్రలు అంతస్తత్త్వమును వివేచన చేసినా ఈ అంశము స్పష్టముగా అవగతమగును. ఉదాహరణమునకు యయాతిచరిత్రమును పరిశీలింపవచ్చును. ఆదిపర్వము నందు తృతీయాశ్వాసమున సుమారు 130 గద్య పద్యములలో యయాతి చరిత్రంబు చెప్పబడియున్నది. ఈ చరిత్రలోనే అనుబంధ కథావృత్తాంతముగా కచదేవయానుల కథా సన్నివేశము కూడా కానవచ్చును. శుక్రాచార్యుల వారి వద్ద మృతసంజీవని విద్య నేర్చుకొనుటకై బృహస్పతి కుమారుడైన కచుడు వచ్చి వినీతుడై శుక్రునకు నమస్కరించి యిట్లన్నాడు.

**"ఏను గచుం డనువాడ, మ**
**హానియమసమన్వితుడ, బృహస్పతిసుతుడన్**
**మానుగ వచ్చితి నీకును!**
**భానునిభా! శిష్యవృత్తి బని సేయంగన్ (ఆది -3- 108)**

కచుడు శుక్రునకు శిష్యుడై సేవించుచు, విద్యాభ్యాసము చేయుటకు వచ్చినాడనని పేర్కొని తాను బృహస్పతి కుమారుడనని స్పష్టముగా పేర్కొన్నాడు. "భానునిభా" అని శుక్రాచార్యుని సంబోధించుటలో ఆయన జ్ఞానభాస్కరుడు అని కచుని భావన. బృహస్పతి దేవతలకు గురువు. శుక్రుడు రాక్షసులకు గురువు. వృత్తిరీత్యా వారు పరస్పర విరోధులు. కాని విద్వత్తు, విజ్ఞానాది అంశములతో ఇరువురును సమున్నతులే కావున ఒకరిపై మరొకరిని గౌరవభావన ఉండియే ఉండును. అందుకే బృహస్పతి యంతటి మహానుభావుడు తన బిడ్డను, తన వద్ద శుశ్రూష చేయవలసినదిగా పంపించుట శుక్రుడు తన గౌరవ ప్రతిష్ఠలు ఇనుమడించినట్లుగా భావించి యుండవచ్చును. పైగా కచుని "సుకుమారత్వంబును, వినయ ప్రియవచన మృదు మధురత్వంబును, ననవరత నియమవ్రత ప్రకాశిత ప్రశాంతత్వంబును" – శుక్రుని మెప్పించిన సద్గుణ విశేషములు. ఈ యుపాఖ్యానమున కచుని పాత్ర ఒక ఉత్తమ విద్యార్థికి ప్రతీకాత్మకముగా నన్నయ తీర్చిదిద్దినాడు. అట్లే శుక్రునిపాత్రలో కూడా ఒక ఉత్తమ ఉపాధ్యాయుని లక్షణములు కనబడును.

కచుడు చిత్తశుద్ధితో శుక్రునకు శుశ్రూష చేయుచు, విధ్యాభ్యాసము సాగించుచున్నాడు. తమకు బద్ధవైరులైన దేవతల కుమారుడు తమ గురువు వద్ద చేరుట, గురు ప్రశంసార్హుడగుట రాక్షసులకు నచ్చలేదు. వారు కచునిపై అసూయా ద్వేషములు కల్గియుండిరి. హోమధేనువుల మేపుటకై అడవికేగిన కచుని రహస్యముగా చంపివేచి వాని శవమును ఒక చెట్టునకు వ్రేలాడదీసిరి. కచుడు తన వినయ సౌశీల్యాదులచే గురుని మెప్పించుటయే కాక, గురు కుమార్తెయైన 'దేవయాని' మెప్పును కూడా పొందియుండెను. దేవయాని మెప్పును ఎంతగా పొంది యుండెననగా ఆమె కచుని ఋజువర్తనము, నియమనిష్ఠలకు ప్రసన్నురాలై వలచి వరించియుండెను. హోమధేనువులు గాచుటకై అడవికేగిన కచుడు నిర్ణీత సమయము దాటినను రాకపోవుటచే తన తండ్రి వద్ద కేగి విచారగ్రస్త వదనముతో ఇట్లడిగినది.

**వాడిమయూఖముల్ గలుగువా దపరాంబుధి గ్రుంకె, ధేనువుల్**
**నేడిట వచ్చె నేకతమ, నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్**
**పోడిగ వేల్వగా బడియె బ్రొద్దును బోయె గచుండు నేనియున్**
**రాడు, వనంబులోన మృగరాక్షసపన్నగబాధ నొందెనో! (ఆది -3-112)**

నన్నయ శైలి సహజముగా తత్సమ పద బాహుళ్యముగా, సామాసికధారతో సాగిపోవుచుండును. పై పద్యము నందలి శైలి కొంత తద్భిన్నముగా నున్నది. ఈ ధోరణి నన్నయ లోకజ్ఞతకు నిదర్శనము. శుక్రుడు మృతసంజీవని ప్రభావముతో కచుని బ్రతికించినాడు. అయినా రాక్షసులు అంతటితో ఆగలేదు. కొంతకాలము తరువాత మరల కచుని చంపి, వాని శవమును భస్మము చేసి, ఆ భస్మమును మత్తుపానీయములో కలిపి, సురాపానవ్యసనుడైన తమ గురువు శుక్రాచార్యులతో త్రాగించినారు. దేవయాని మరల ఆక్రోశించినది. శుక్రుడు ఓదార్చినను ఆమె దు:ఖమాగలేదు.

**మతిలోకోత్తరుడైన యంగిరసుమన్మం, డాశ్రితుం, డాబృహ**
**స్పతికింబుత్రుడు, మీకు శిష్యుడు, సురూప బ్రహ్మచర్యాశ్రమ**
**వ్రత సంపన్నుడకారణంబ దనుజవ్యాపాదితుండైన న**
**చ్యుతధర్మజ్ఞ! మహాత్మ! యక్కచున కే శోకింప కెట్లుండుదున్? (ఆది -3-118)**

అని తండ్రిగారిని నిలదీసి అడిగినది. ఎట్టకేలకు శుక్రుడు దేవయానికి ప్రసన్నుడై కచుని మృతసంజీవని ప్రభావంతో బ్రతికింపదలచినాడు. కాని కచుడు తన ఉదరమున నుండుట వలన, ఉదరములో నున్న వానికే మృతసంజీవని మంత్ర ప్రబోధము చేసి పునర్జీవుడై తన ఉదరము చీల్చుకొని బయటకు వచ్చి తిరిగి తనను కూడా బ్రతికింపజేసుకున్నాడు. ఈ విధముగా రాక్షసులు అపకారము కచునకు మేలేచేసినది. కచుడు తన విద్యాభ్యాసము పూర్తియైనందున తిరిగి దేవలోకమునకు ప్రయాణమైనాడు. దేవయాని కచునితో తన అనురాగమును వ్యక్తీకరించినది. కచుడు సున్నితముగా ఆమె ప్రేమను తిరస్కరించుచు ఇట్లు పలికినాడు.

**గురులకు శిష్యులు పుత్రులు**
**పరమార్థము లోకధర్మపథ మిది, దీనిం**
**బరికింపక యీ పలుకులు**
**తరుణీ! గురుపుత్రి! నీకు దగునే పలుకన్. (ఆది -3-131)**

పై కందపద్యమున నన్నయ "పరమార్థము" - అని పేర్కొనిన సందర్భమున ఒక అంతరార్థమును ప్రతిపాదించియున్నాడు. కచుడు రెండవసారి రాక్షసులచే చంపబడినప్పుడు శుక్రుని ఉదరము నుండి వెలువడినాడు. అనగా శుక్ర గర్భసంజాతుడైనట్లే కావున దేవయానికి తనకు సోదరిసోదరబంధమున్నట్లే కచుడు భావించినాడు. ఒక విధముగా చూచినచో దేవయాని ప్రేమ భావనయు నిష్కల్మషమైనదే. కచుని ధార్మికనిష్ఠతో కూడిన ఆలోచనమును సముచితమే. ఇరువురికి వాగ్వాదము జరిగినది. పర్యవసానముగా దేవయాని కచుని శపించినది. కచుడు కూడా దేవయానిని శపించినాడు. ఆ శాపఫలముగా దేవయాని యయాతి మహారాజునకు ధర్మపత్నియైనది. కాలాంతరమున రాక్షసరాజైన వృషపర్వుని కుమార్తె "శర్మిష్ఠ" కూడా యయాతికి భార్యయైనది.

ఈ విధముగా గరుడోపాఖ్యానము, ఉదంకుని కథ, శకుంతలా దుష్యంతుల ప్రణయము, గంగా శంతన గాంగేయాదుల వృత్తాంతములు ఇలా నన్నయ రచన ఎక్కడ పరికించినను ఆ మహాకవి "ప్రసన్న కథాకలితార్థయుక్తి" ఎట్టిదో అవగతము కాగలదు.

**అక్షరరమ్యత**

"ఇతరు లక్షరరమ్యత నాదరింప" – అని నన్నయ మహాకవి పేర్కొనుటను బట్టి చెవికింపైన శబ్ద సంయోజనమతో, స్వరమిళితమైన కవనధారలతో నిండిన పద్యగద్యముల సమాహారమే వీరి కవిత్వ శిల్పమని భావింపవచ్చును. ఉదంకుడు చేసిన నాగస్తుతి

**బహువన పాదపాబ్ధికుల ......................................... (ఆది -1-104)**

**అరిది తపోవిభూతి ............................................. (ఆది -1-105)**

**దేవమనుష్యలోకముల ........................................... (ఆది -1-106)**

**గోత్రమహామహీధర............................................... (ఆది -1-107)**

**వంటి పద్యములు**

**సాగర సారవారిరుహ............................................ (సభా -2-110)**

**మందిత సూర్యరశ్మి ............................................. (సభా -2-111)**

వంటి పద్యములు, ఇంకను కోకొల్లలుగా "అక్షరరమ్యత"కు తార్కాణములుగా పేర్కొనదగియున్నవి.

**నానారుచిరార్థసూక్తినిధి**

ఆయా పాత్రలు, సన్నివేశముల నాధారముగా చేసికొని సమాజహితమునకు, మానవుని వ్యక్తిత్వ వికాసమునకు అనుగుణముగా నన్నయ మహాకవి ఎన్నో సూక్తులను తన కవిత్వ శిల్పమున శోభింపజేసియున్నారు.

1. **తగు నిది తగదని ఎదలో.................................... (ఆది -1-85)**
2. **తన యెఱిగిన యర్థంబు..................................... (ఆది -1-136)**
3. **భూనుత కీర్తి ................................................ (ఆది -1-157)**
4. **ఎఱుకగలవారి చరితలు..................................... (ఆది -3-203)**
5. **ఇచ్చునది పాత్రునకు........................................ (ఆది -3-204)**
6. **మనమునకు ప్రియంబును................................... (ఆది -3-205)**

ఈ విధముగా అసంఖ్యాకముగ గలవు.

**చతుర్విధ పురుషార్థములు**

ధర్మము, అర్థము, కామము, మోక్షము అను నాలుగు పురుషార్థములనబడుచున్నవి. "ఆచార ప్రభవోధర్మ: ధర్మస్య ప్రభురచ్యుత" అను ఆనునాసిక పర్వమున విష్ణుసహస్రనామ సందర్భమున' పేర్కొనబడుట అధ్యయనము చేయదగిన అంశము. అర్థము అనగా సంపద. ఇటువంటి సంపదను పురుషుడు అనగా జీవుడు ధర్మబద్ధముగానే సముపార్జింపవలెను అని భారతము బోధించుచున్నది. ధర్మావిరుద్ధోభూతేషు కామోస్మి భరతర్షభ" – అని గీతా ప్రబోధ సందర్భమున శ్రీకృష్ణభగవానుడు నుడివి యున్నాడు. "మోక్ష సాధన సామాగ్ర్యాం భక్తి రేవ గరీయసి" అని శంకరభగవత్పాదులు ప్రబోధించిన అంశమునకు అనుగుణముగా మహాభారతము శ్రీకృష్ణ లీలావిభూతిని కూడ నిరూపించుచున్నది. తిక్కన మహాకవి విరాటపర్వం అవతారికలో వర్ణించిన హరిహరనాథ సాక్షాత్కారము మొదలుకొని, ఆయా పర్వములలోని అనేక భక్తి జ్ఞానాంశములు విశేషములు, స్వర్గారోహణ మహాప్రస్థానికాదులు నాలుగవ పురుషార్థ వైభవమును విశ్లేషించుచున్నవి.

"సారపు ధర్మమున్ విమలసత్యము బాపముచేత బొంకుచే
బారము బొందలేక చెడబాతినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్షసేసి రది వారలచేటగు గాని ధర్మ ని
స్తారక మయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెదున్". (ఉద్యోగ -3-273)

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తిరమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# 3. ఆశ్రమవాస పర్వం – ఆధునిక సమాజం

– ఆచార్య విస్తాలిశంకరరావు, చెన్నై

తరాలు మారినా, కాలాలు మారినా కొన్ని అంశాలు అన్ని కాలాలకు, అన్ని సమాజాలకు అవసరమైన విధంగా స్థిరంగా ఉంటాయి. అలాంటివి అన్ని సమయాలలోను, అందరికీ ఆదర్శనీయాలే. అటువంటి వాటిలో ముఖ్యమైనది, విలక్షణమైనది భారతీయుల ప్రసిద్ధ ఇతిహాసంగా నిలిచిన గ్రంథం మహాభారతం. ఈ మహాభారతానికి వివిధ భాషలలోకి అనువాదాలు జరిగి ఆదరించబడ్డాయి. అలా అనువాదం అయిన భారతంలో ఎంతో ప్రత్యేకత కలిగిన భారతం తెలుగు భారతం. ఈ తెలుగు భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రన అనే ముగ్గురు మహా కవులు, మూడు కాలాలలో అనుసృజన చేశారు. ఈ అనుసృజన ఎలా ఉందంటే సామాన్య ప్రజానీకం హృదయాలను సైతం ఆకర్షించడమే కాక, వారి మనసులో చెరగని ముద్రను వేశాయి. అక్షరాస్యుల నుండి నిరక్షరాస్యుల వరకు తెలుగు భారతం తమ ఊరి భారతం, తన కుటుంబ భారతంగా భావించడమేకాక వారి జీవితాలలో మమేకమైనది. అది ఏ స్థాయికి వెళ్లిందంటే తెలుగు వారి నోళ్ళలో

**"తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి"**

అనేంతగా స్థిరపడింది. ఈ తెలుగు భారతం రచన 11,13,14 శతాబ్దాల కాలం నాటి రచన అయినా అది నేటి కాలంలో సమకాలీనులు రాసినట్లుగా అనుభూతిని కలిగిస్తుంది. అందులోని అంశాలు వీరి జీవితాలను చూసి రాశారా అన్నంతగా వారి జీవితాలతో మమేకం అయింది. ఈ భావన ఒక విధంగా సరైందే, ఎలా అంటే భారత రచనలు ఉగ్రశవసుడు భారతం యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ

**"యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి నతత్ క్వచిత్"**

(ఇందులో ఉండేది లోకంలో ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు.)

అనే మాటలు అక్షర సత్యాలు. దీనిని బట్టి మహాభారత రచయితలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుని మహాభారతం రచన చేశారో తెలుస్తుంది. అందులోను తెలుగు భారతం కవిత్రయం మనోదృష్టి నుండి మొత్తం 18 పర్వాలుగా ఆవిష్కరించబడింది.

ఈ కవిత్రయ భారత రచనలో ఒక ప్రత్యేకత ఉంది. ఒక రచనను ముగ్గురు మహాకవులు, మూడు కాలాలలో ఆయా సమకాలీన సమాజాలను స్వభావాలను సమన్వయం చేసుకుంటూ రాశారు. ఇలాంటి రచనలు చాలా అరుదు.

ఒక రచయిత ఒక అంశాన్ని ఒక కాలంలోరచన చేస్తేనే ఎన్నో వైవిధ్యాలు కనిపించే స్థానంలో సంస్కృత భారతాన్ని ఎన్నుకుని తెలుగు కవులు మూడు కాలాలలో రాసినా అది చదివే పాఠకుడికి ఒక రచయిత, ఒకే కాలంలో రచన చేసి ఉంటారు అనే అనుభూతికి లోనౌతారు అంటే ఆ భారత రచన విశిష్టత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఆ పద్దెనిమిది పర్వాల మహాభారతాన్ని పరిశీలిస్తే నాటి నుండి నేటి వరకు ఆయా సమకాలీన సమాజాలకు అద్దం పడుతూ ఆదర్శనీయంగా నిలవడం విశేషం కాబట్టే కవిత్రయ భారతం ఎప్పటికప్పుడు నూతనంగా దర్శనమిస్తూనే ఉంటుంది. ఆయా కాలాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. అందులో ప్రస్తావించిన అంశాలు వర్తమాన సమాజంలో ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి అనడంలో సందేహం లేదు.

ఈ నేపథ్యంలో కవిత్రయ భారతంలోని 18 పర్వాలలో 15వ పర్వం అయిన ఆశ్రమవాస పర్వంలోని అంశాలు వర్తమాన సమాజానికి ఎలా ఉపకరిస్తాయో సమన్వయం చేసే ప్రయత్నం చేద్దాం.

**ఆశ్రమవాస పర్వం – స్వర్గ ప్రయాణం**

ఆశ్రమవాస పర్వంలో రెండు ఆశ్వాసాలు ఉన్నాయి. ఈ రెండు ఆశ్వాసాలు మొత్తం 362 గద్యపద్యాలలో నిండి ఉంది.

14వ పర్వం అయిన అశ్వమేధయాగంతో హస్తినాపురంలో పాండవుల ప్రభుత్వం స్థిరపడింది. 15 ఏళ్ళ పాటు ధర్మరాజు పాలన ధర్మవర్తనంతో ప్రశాంతతో పాలన కొనసాగుతుంది. మహాభారత యుద్ధం జరగడానికి దుర్యోధనాది దుష్టచతుష్టయం, ధృతరాష్ట్రుడి ద్వంద్వ నీతి వలన ఏర్పడింది. ధృతరాష్ట్రుని సంతతి అంతా రణభూమికి అంకితం అయ్యారు. ధర్మరాజు సమక్షంలో ఉన్న ధృతరాష్ట్రుడు జరిగిన ఆ దోషాలన్నీ మననం చేసుకుని గాంధారిని శాంతింపచేశాడు. వారు ఇప్పుడు ఎప్పటిలాగే రాజభవనంలో ఉన్నారు. పుత్రశోకం దహించి వేస్తున్న వారిని ధర్మరాజు ఎంతగానో ఉపశమనం కలిగించాడు. వారికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ ఆశ్రమవాస పర్వంలో ధర్మరాజు ప్రవర్తన ఎంతో ఆదర్శనీయంగా, కాలాలకు అతీతంగా ఆచరించదగినదిగా ఉంటుంది.

15 ఏళ్ళు గడిచాక ధృతరాష్ట్రుని ఆలోచనలో మార్పు వచ్చి దహన సంస్కారాలు చేయదగిన కొడుకులు లేని హస్తినపురంలో నివసించడం గౌరవం కాదని గృహస్థాశ్రమంలో తనివి తీరిన తర్వాత సన్న్యాసం కాని, వానప్రస్థం గాని ఆశ్రమంగా స్వీకరించడం గృహస్థుడి ధర్మం. అలా ధర్మబద్ధంగా తనువు చాలించడం వంశమర్యాద అని బంధువులను పిలిపించి, ధర్మజుడితో తన వనవాసకోరికను వ్యక్తం చేయడం, ధర్మరాజు నిరాకరించడం, చివరికి తపోవనానికి అనుమతిస్తేనే అన్నం తింటానని భీష్మించుకుని కూర్చోవడం చివరకు వ్యాసుడు ధర్మరాజుకు ధర్మసూత్రం తెలపడం. ధృతరాష్ట్రుడు ఆశ్రమవాస వ్రతం స్వీకరించేటప్పుడు చేయవలసిన కర్మలన్నింటిని శాస్త్రోక్తంగా నిర్వహించడం, తర్వాత మొదట ప్రభువు అనుమతి, ఆ తర్వాత ప్రజల అనుమతి తీసుకున్నాడు. మృతులైన కొడుకులకు, జ్ఞాతులకు యథావిధిగా విశేష శ్రాద్ధకర్మలు నిర్వహించడం, వన ప్రస్థానానికి ముందు ధర్మరాజుకు రాజనీతి విశేషాలు బోధించాడు. గాంధారి ధృతరాష్ట్రులు ఆశ్రమ పయనం అయ్యారు. వల్కలాలు కట్టి ఆ వృద్ధదంపతులు గృహాన్ని పూజించి వస్తువులన్నింటిని త్యజించి అంత:పురాన్ని వదలి వెలుపలకు వచ్చారు.

విదురుడు, సంజయుడు ధృతరాష్ట్రుని వెంటనడిచారు. కృపాచార్యుడు కూడా వనగమనానికి సిద్ధం కాగా ధృతరాష్ట్రుడు వారించడం. అదే సమయంలో కుంతీదేవి గాంధారి ధృతరాష్ట్రుల వెంట వనవాసానికి సిద్ధం అయింది. గాంధారి ధృతరాష్ట్రులకు సేవచేయడానికి చేరింది ఎవరు చెప్పినా వినలేదు.

ఇక వారి ప్రయాణం చివరకు ముందు కుంతి, ఆమె భుజం మీద చేయి వేసి గాంధారి, ఆమె భుజం మీద చేయివేసి ధృతరాష్ట్రుడు సాగుతున్నారు. వారి వెంట విదురుడు పయనం అయ్యాడు. ధృతరాష్ట్రుడు శీతయూపాశ్రమ ప్రాంతంలో నివసించి తపస్సు ప్రారంభించాడు. 3 ఏళ్ళు తపస్సు చేసి తనువును త్యజిస్తాడని కుబేరుని సన్నిధానంలో వైభవంతో ఉంటాడని ఇంద్రుడు చెప్పినట్లు నారదుడు శతయూపుడికి తెలిపాడు.

ధృతరాష్ట్రుడు గంగా ద్వార పరిసరారణ్యాలలో ఉగ్రతపస్సు మొదలుపెట్టాడు. అతడు వాయుభక్షణంతోను, గాంధారి జలభక్షణంతోను తపస్సు సాగించాడు. కుంతి మాసోపవాస నియమంతో వ్రతం సాగించింది. భీకరమైన వాయువుతో దావాగ్ని చెలరేగి వారిని చుట్టుముట్టింది. సంజయుడు యోగమార్గంలో హిమవత్పర్వతం మీదకు వెళ్లాడు. కొడుకులు అన్ని కార్యాలు చేయవలసిన అవసరం లేకుండా తనువు చలించారు. తనువు చాలించిన ధృతరాష్ట్రుడు పుణ్య పురుషుడై ఉత్తమ లోకాలలో ఐక్యంకాగా, గాంధారి అతడిని అనుసరించింది. కుంతి యోగాగ్నితో తనువు త్యజించి పాండురాజును చేరుకుంది.

విదురుడు యతిగా మారి దిగంబరుడై తిరుగుతూ యోగమార్గంలో తనువు చాలించాడు. ఈ విధంగా ధృతరాష్ట్రునితో ఆశ్రమవాసం ఇలా వనగమనం చేసిన ఐదుగురికి యోగమార్గంలో అయిదు విధాలుగా స్వర్గానికి చేరుకున్నారు.

**ఆశ్రమవాసం – ఆధునిక సమాజం – సమాలోచన**

ఆశ్రమవాసంలో సన్నివేశాలు, పాత్రల మనస్తత్త్వ చిత్రణలో అనుసరించిన విధానాలు, జీవిత సత్యాలు ఇలా ఎన్నో విషయాలు ఆధునిక సమాజానికి అద్దం పడుతున్నాయి.

ఎలా అంటే కురుక్షేత్ర సంగ్రామానికి ముందు ఉన్న వ్యక్తుల ఆశలు, ఆశయాలు, అహంకారాలు వాటి కోసం చేసే వివిధ ప్రయత్నాలు. భావావేశపూరితంగా స్వార్థంతో శత్రుసంహారం ప్రధానంగా కొనసాగుతుంది. మహాభారత యుద్ధానంతరంలో ధర్మరాజు పాలన మొదలయిన నాటి నుండి అవే పాత్రలు తీరు తెన్నులు, ఆలోచన విధానాలు వాస్తవ రూపంలో దర్శనమిస్తాయి. ఈ ఆశ్రమవాసంలో ప్రధానంగా ధర్మరాజు, భీముడు, ధృతరాష్ట్రుడు, గాంధారి, సంజయుడు, విదురుడు ఈ పాత్రల లక్షణాలు నేటి ఆధునిక సమాజంలోని వ్యక్తులలోను దర్శనమిస్తూ ఉన్నాయి.

నిజానికి కురుక్షేత్రయుద్ధానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ గాంధారి ధృతరాష్ట్రుల పుత్ర ప్రేమ ఒక కారణం. యుద్ధంలో వారి కుమారులు మరణించిన తర్వాత ధృతరాష్ట్రుడు, గాంధారి ధర్మరాజు సమక్షంలో 15 సంవత్సరాల పాటు ఉన్నారు. ఈ 15 సంవత్సరాల కాలంలో ధృతరాష్ట్రుల పట్ల పాండవులు చూపిన తీరు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

అవకాశం దొరికింది కదా అని గాంధారి ధృతరాష్ట్రులపై ధర్మరాజు పగ తీర్చుకోకుండా కొడుకులు పోయిన దు:ఖంతో ఉన్నవారిని ఉపశమనం కలిగించేలా వ్యవహరించిన తీరు ఆదర్శనీయం. తాను భక్తి శ్రద్ధలతో కొలుస్తూ వారికి ప్రాధాన్యాన్ని ఇవ్వడమే కాక అతడివలే తన తమ్ముళ్ళు, కుంతి, ద్రౌపది, సుభద్ర, చిత్రాంగద, ఉలూపి మొదలయిన రాణులచేత మర్యాదలు చేయిస్తారు.

**కౌరవనాథ! కుంతియును గౌరవ మొప్పగ వచ్చి కొల్చు గాం**
**ధారి నతిప్రయత్నమున ద్రౌపది తాను సుభద్రయున్ ముదం**
**బారగ నిత్యముం గొలుతు రక్కురువంశమహత్తరన్ మహో**
**దారము లైనవస్తువు లుదాత్తత నిత్తురు వార లందఱున్.** **(ఆశ్రమవాసపర్వం 1-4)**

అంటే వీరు ముగ్గురిని ఇక్కడ ప్రస్తావించడం విశేషం. ఎలాగ అంటే కుంతి, ద్రౌపది, సుభద్ర ఈ ముగ్గురు కురుక్షేత్రంలో తమ కొడుకులను పోగొట్టుకున్నవాళ్ళు అయినా వారంతా అవి మరచి గాంధారి ధృతరాష్ట్రులను సేవించడం, వారి మీద భక్తిభావం ప్రకటించడం.నేటి సమాజంలో ఎందరికో ఆదర్శం. నేడు కుటుంబాలలో వ్యక్తుల మధ్య ఏర్పడిన కక్షలు కుటుంబాలనే నాశనం చేస్తున్నాయి. కనుక ఈ పాత్రల ద్వారా ఎవరు కూడా దీర్ఘకాలం పగ ప్రతీకారాలు, కక్షలు కలిగి ఉండకూడదని అనే ఒక నీతి వాక్యాన్ని తెలియజేస్తుంది.

అలాగే ఈ పర్వంలో భీముని పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. పాండవులు అందరూ గాంధారి ధృతరాష్ట్రుల మీద భక్తిభావం కలిగి ఉంటే భీముడు మాత్రం వారిని చూసి నప్పుడు దుర్యోధనుడు తనకు చేసిన కీడు గుర్తుకు వచ్చి తాము పడిన కష్టాలకు కారణం వీరు అని వారిని దెప్పిపొడుస్తూ తన భుజపరాక్రమాన్ని ప్రశంసించుకుంటూ వారిని నిందించేవారు. ఈ విషయం ఎవరికి తెలియదు.

**ద్యూతంబున దుర్యోధను। చేతం దమ పడిన పాటు చిత్తంబున క**
**త్యాతురత జేయుచుండుట। నాతడు ధృతరాష్ట్రు జూచి యలుగు మనమునన్ (ఆశ్ర. 1-12)**

అంటే పాండవులందరూ పడ్డ కష్టాలు భీముని బాధిస్తూనే ఉన్నాయి. ఇందులో అన్న మాటలు కోపం ఎంత ఆపుకున్నా వారికి సేవలు చేయడంలో భీముడికి కష్టంగానే ఉండేది. ఎవరైన ఇతరులకు బాధ కలిగించేవి ఎన్నడు మాసిపోవు, అని చెబుతూనే అన్నమాటను పాటించడం విశేషం.

**'అంధుని కొడుకులయం దొకరుని దప్పి । పోనిక త్రుంచితి భూరిశక్తి**
**దర్పితం బైన మద్బాహుపంజరము సొ। చ్చిన రిపురాజన్య సింహములకు**
**వెడలంగ వచ్చునే? వెంగలు లై వారు । కయ్యంబు సేసిరి గాక నన్ను**
**నెఱిగిన దొదరుదు రెట్టులు? దుర్యోధ। నాదుల ననిదెగటార్చినట్టి (ఆశ్ర. 1-19)**

ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నప్పుడు అతడికి కొంచెం సమీపంగా ఉండి గాంధారి వినేటట్లు పై విధంగా భీముడు అంటారని

ధృతరాష్ట్రుడు ఆశ్రమవాసానికి పయనమైనప్పుడు పెదతండ్రి ధృతరాష్ట్రుడు లేని హస్తినపురంలో తాను ఉండలేనని, రాజ్యం వద్దని, వైరాగ్యాన్ని ప్రకటించి ఇలా వేడుకుంటాడు.

**'తల్లియు దండ్రియున్ గురుడు దైవము నా కరయంగ నీవ భూ**
**వల్లభ! నీవు కానన నివాసము గోరి చనంగ నెట్టు లే**
**నుల్లము వట్టి హస్తిపురి నుండగ నేర్తు? యుయుత్సు బెంపు శో**
**భిల్లగ రాజు జేయు నిను బ్రీతి యెలర్పగ గొల్చి వచ్చెదన్ (ఆశ్ర. 1-32)**

తాను అనేక కష్టాలకు కారణమై ధృతరాష్ట్రుని మీద ప్రేమ చూపించడంతో పాటు, తాను లేని రాజ్యంలో ఉండలేననడం ధర్మరాజుకు పెదతండ్రిపై గల ప్రేమ, అనురాగం తెలుస్తుంది. నేటి సమాజంలో ఎందరో తమ వృద్ధికి కారకులైన తల్లిదండ్రులనే వృద్ధాశ్రమలలో నిర్దాక్షిణ్యంగా వదిలేస్తున్న నేటి సమాజంలో వ్యక్తులు ధర్మరాజును ఎలా ఆదర్శంగా తీసుకోవాలో గమనించాలి.

అంతే కాదు ధర్మరాజు ధృతరాష్ట్ర గాంధారిలకు సేవ చేసుకోవడానికి అనుమతి కోసం కుంతి అడగగా, వారి సేవ కోసం నేను వనవాసానికి వెళ్లి వారికి సపర్యలు చేస్తానని చెప్పడం ఎంతో గొప్ప విషయం. ఎలా అంటే తన బిడ్డలు కౌరవుల పట్ల ధృతరాష్ట్రుల వలప ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యక్షంగా చూసినవారు అయిన అవి అన్నీ మనసులో పెట్టుకోకుండా రాజ్యసౌఖ్యాలు అనుభవించాల్సిన సమయంలో వారి సేవకై పాటుపడటం నేటి సమాజంలోని ప్రతి ఒక్కరు పెద్దలు గౌరవించడం, వారి పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండడం ఎంతో విశేషం. కుంతి ధర్మరాజుతో ఇలా అంటుంది.

కర్ణుని మరిచిపోవద్దని, సహదేవుడిని అనురాగంతో చూడమని భీమార్జున నకులులను క్షేమంగా రక్షించుకోమని, ద్రౌపదిని దృఢమైన ప్రేమతో మన్నించుమని చెప్పిన ఆమె మాటలు వినకపోవడంలో కుంతి కఠినంగా వ్యవహరించి ఒప్పించిన విధానంలో ధర్మరాజు తల్లికి ఇచ్చిన ప్రాధాన్యత, బిడ్డల పట్ల తల్లి వ్యవహరించిన తీరు ఎంతో విలక్షణం.

ఈ ఆశ్రమవాస పర్వం భారతంలోని పాత్రలు స్థిరమైన చిత్తవృత్తిని కలిగి ఉంటాయి. అంగ, అధికార, రాజ్యకాంక్షలు, పగలు ప్రతీకారాలు, ఈర్ష్యాద్వేషాలు, సర్వం అణిగిపోయి, ఎలాంటి జీవితం గడిపిన వారైనా చివరకు ఇలాంటి స్థితికి చేరుకుంటారు అని ఒక అద్భుతమైన సందేశాన్ని ఈ పర్వం అందిస్తుంది.

కురుక్షేత్రయుద్ధం అయిపోయి, రాజ్యగర్వాలు అంతరించి చివరకు ఆశ్రమవాసం జీవితాన్ని చాలించడానికి ఆశ్రమవాసం ఉత్తమమైంది అని ఆ కాలం నాటి పాత్రలు ఆశ్రమవాస ప్రాధాన్యాన్ని తెలియజేస్తే

భారతకాలం నాటి ఆశ్రమాలు వ్యక్తుల మనోవాంఛలను తీరిస్తే అవే ఆధునిక కాలంలో బలవంతపు వృద్ధాశ్రమాలుగా, అనాధల శరణాలయాలుగా రూపొందాయనిపిస్తున్నాయి.

నాడు ఆశ్రమాలకు వెళ్లతానంటే ఒప్పుకోని సంతానం ఉంటే, నేడు బలవంతంగా ఒప్పించి ఆశ్రమాలలో చేర్పించే పరిస్థితి వచ్చింది. పెద్దలపట్ల గౌరవం, సేవాభావం, త్యాగం, ఇవే చివరకు మనిషికి తృప్తిని ఇచ్చేవి అని ఆశ్రమవాస పర్వం

సందేశాన్ని తెలియజేస్తుంది. ఎంత పెద్ద గాలివాన వచ్చినా అది అయిపోయిన తర్వాత ఏర్పడేది ప్రశాంతతేనని, అదే స్థిరమైన వాస్తవం అని జీవితంలో కామ క్రోధ మదమాత్సర్యాలు,అహంకారాలు ఆవేశాలు అన్ని అణిగి చివరకు మిగిలేది తృప్తినిచ్చేది సేవపరమార్థం అని.

ఆశ్రమవాస పర్వం సూచిస్తుంది. వృద్ధాప్యంలో అనాథ, వృద్ధాశ్రమాలలో పెద్దలను వదలక ప్రేమాభిమానాలను కలిగి ఈ ఆధునిక కాలంలో పుట్టకొక్కులుగా మొలుస్తున్న ఈ ఆశ్రమాలకు చరమగీతం పాడాలని ఆశ్రమవాస సందేశంగా భావించవచ్చు.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము (ఆశ్రమవాస పర్వం) – కృతికర్త తిక్కన సోమయాజి
– తిరమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2. శ్రీ మహాభారతము (విరాట, ఉద్యోగ పర్వాలు) – ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు

3. ఆంధ్రమహాభారతం (విశ్లేషణాత్మక వ్యాసాలు) – డా॥ విస్తాలి శంకరరావు.

# 4. వర్తమాన రక్షణగీత భారత భగవద్గీత

– 'విశ్వర్షి' వాసిలి వసంతకుమార్, సికింద్రాబాద్

మనిషి మనిషిగా పుట్టినరోజు జరుపుకోవటం ప్రాపంచికం !

మనిషి 'మనీషి'గా పరిణమించి జన్మదినం జరుపుకోవటం పారమార్థికం !!

మనీషి 'మహాత్మ'గా పరిఢవిల్లి – భౌతికాన్ని వీడిన తర్వాత – జయంతి జరగటం యౌగికం !!!

ఈ నేపథ్యంలో యౌగికం అంటే ఋషిత్వం.

ఋషిత్వం సాధ్యం కానిదే కావ్యం పుట్టదు. అంటే, కావ్యానిది కూడా మహా ఆత్మనే. కావ్యం మహత్ రచనే … మహత్తు కలదే.

ఈ దర్శనంతో, మహాభారత 'భీష్మపర్వం'లోని "శ్రీమత్ భగవద్గీత"ను అనుశీలిస్తే … ప్రపంచ సాహిత్యంలో దాని స్థానాన్ని పదిలపరచదలచుకుంటే … మహాత్ములకు ధీటుగా 'జయంతి' జరుపుకుంటున్న ఏకైక 'వర్తమానగీత' భగవద్గీత. అది నాటి, నేటి, రేపటి సమాజానికి, సామాజికులమైన మనకు 'రక్షణగీత'నే … 'అద్వితీయగీత'నే.

ఈ వర్తమాన రక్షణగీత ఎప్పటికప్పుడు 'కొత్తకోణా'లకు వేదిక అవుతుంటుంది. అందుకే ఈ 'గీతారహస్యాలు' నా కలానికి ఒక 'జీవనగీత'గాను, ఒక 'ఆత్మగీత'గాను, ఒక 'నాయకగీత'గాను, ఒక 'యౌగికగీత'గాను అందివచ్చి వేయి పుటలుగా విస్తరించాయి.

***

"కవిత్రయ మహాభారతం : వర్తమాన సమాజం" పేరిట మనం సాగిస్తున్న సమాలోచనలో నేను 'వర్తమాన రక్షణగీత'గా 'భారత భగవద్గీత' ఎలా ఉపకరిస్తోందో కొన్ని అంశాల ప్రస్తావనతో అనుశీలించే ప్రయత్నం చేస్తాను.

మొదటగా – **మనం కోరుకున్నవన్నీ జరగటమే జీవితం కాదు** అన్న తత్వాన్ని అండర్లైన్ చేసుకుని అర్థం చేసుకోగలిగితే భగవద్గీత అసలుసిసలు జీవనగీతగా, వర్తమాన సమాజ రక్షణగీతగా నాకూ, నీకూ, మనకూ, మన వ్యవస్థకూ మహావ్యాఖ్యానం అవుతుంది. జీవికను ఒక గురుతర బాధ్యతగా మనకు అందిస్తుంది.

***

**ప్రకృతీ ప్రవృత్తీ యోగిస్తేనే మనం … మన జీవితం !**

**సంఘటనలు, సమస్యలు సంయోగిస్తేనే జీవితం సక్సెస్ బాట పట్టేది !!**

మన కుటుంబం, మన సమాజం, మన వ్యవస్థ ప్రకృతిలో అంతర్భాగాలే. మన ప్రవృత్తిని ప్రభావితం చేసేవే. సంఘటనలు, సంఘర్షణలు సమకాలీనంగా జీవితాన్ని సానబెట్టేవే. జీవితంలో సంఘర్షించవలసిన సందర్భాలు ఎదురైనప్పుడు–

**సంయమనంతో వర్తించగలిగితే మనది రాజస ప్రవృత్తి.**

**సంఘర్షించాల్సిన సందర్భాలలో ఎదురుతిరిగినప్పుడు మనది తామస ప్రవృత్తి.**

**అన్ని పరిస్థితులలోను ఉదాసీనంగా ఉండగలిగితే మనది సాత్విక ప్రవృత్తి.**

ఈ మూడు ప్రవృత్తులు ఒకదానితో ఒకటి పోటీపడుతుండటమే మన వర్తమాన వర్తనం. ఇటువంటి భావోద్విగ్న బ్రతుకులో స్వేచ్ఛగా ఉంటూనే 'బాధ్యత' వహించటం మనందరికీ ఒక ఛాలెంజ్. 'లైఫ్ ఈజ్ ఎమోషనల్ … అయినా గెలవాల్సిందే' … తప్పదు.

భగవద్గీతలో ఎమోషనల్ అయ్యింది అర్జునుడు … గెలవాల్సిందే అని పట్టుబట్టినవాడు కృష్ణుడు. అందుకే పాండవ మధ్యముడి ఎమోషనల్ సీక్వెన్స్ కు విశ్వరూపి అయిన కృష్ణుడు జీవన రహస్యాలను విజయ రహస్యాల రూపంలో దర్శింపచేసాడు. అది విశ్వరూప దర్శనం … విశ్వదర్శనం.

***

**స్వధర్మాచరణ జీవన విజయ రహస్యమే**

**"శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" (3 : 35)**

అని అంటుంది గీత. పరధర్మ ఆచరణ కంటే స్వధర్మ ఆచరణే శ్రేష్ఠం అని. పరధర్మానికే వ్యవస్థ ఉన్నతాసనం వేస్తున్నప్పటికీ స్వధర్మం గుణ సంపన్నం కాకపోయినప్పటికీ స్వధర్మ ఆచరణే వ్యక్తి విజయ బాట. నిజానికి స్వధర్మం గుణ సంపన్నం కాకపోవటం అంటూ ఉంటుందా?

గుణధర్మం అనేది జాతిధర్మం, ఆశ్రమధర్మం, మతధర్మం, రాజధర్మం అనే నాలుగు బాటల కూడలి అయినా పంచమధర్మం అయిన ఆత్మధర్మానిదే ప్రధాన బాట, ప్రథమ బాట. మన పరిణతిపైన ఈ ఆత్మధర్మం నిలబడి ఉంటుంది. పాంచభౌతిక దేహంతో బాటు ఎదుగుతూ వచ్చిన సహజప్రవృత్తి ఆత్మధర్మాన్ని నిర్వచిస్తుంది. కాబట్టి వర్తమాన జీవితంలో స్వభావ సహజమైన ఆత్మధర్మమే మేటిధర్మం అవుతుంది.

**జీవన పోరాటంలో చివరికి మిగిలేది, గెలిచేది వ్యక్తి ఆత్మధర్మమే.**

***

**నేటి కార్పణ్యదోషోపహత స్వభావం రేపటి విజయ రహస్యమే**

జాతిధర్మం, ఆశ్రమధర్మం, మతధర్మం, రాజధర్మం అనే సమాజహిత ధర్మాలతో పెరుగుతూ, ఎదుగుతూ అస్త్ర, శాస్త్ర పారంగతుడైన అర్జునుడికి కురుక్షేత్రంలో అపారమైన తన ఆత్మీయుల్ని, బంధు సంతతిని చూసిన తర్వాత – ఈ పోరు పిదప – తనకు మిగిలేది ఏమిటి అన్న ప్రశ్న తలెత్తటంతో అన్నిధర్మాల స్థానంలో ఆత్మధర్మం నిలిచింది. జన్మతః తనలోని స్వధర్మమే ఆత్మ సమ్మతమూ, శాస్త్ర సమ్మతమూ అన్న ఎరుక కలిగింది. ఫలితంగా అస్త్రాలను జారవిడిచాడు … అయినవారితో పోరు చేయను అని కృష్ణుడి ముందు కుదేలయ్యాడు.

**"కార్పణ్యదోషోపహత స్వభావః**
**పృచ్ఛామిత్వామ్ ధర్మ సమ్మూఢచేతాః" (2 : 7)**

అనటంవల్ల అర్జునుడి స్వభావం దోషభూయిష్టమైందని, ఆ కారణంగా తన 'చేత' చేతనారహితం అవుతోందని స్పష్టం. కార్పణ్యదోషం వల్ల కర్మాచరణలో నిర్ణయాధికారం కొరవడుతుంది. అప్పుడు చేసే పనులు పిల్లచేష్టలు అనిపించుకుంటాయి. ఈ మనఃస్థితిని గురించి Ludwig Wittgenstein - "If people never did silly things, nothing intelligent would ever get done" అన్నట్టుగా అర్జునుడు సిల్లీగా ప్రవర్తించక ఉండి ఉంటే భగవద్గీత విజ్ఞానభాండంగా, ప్రజ్ఞాననిధిలా, విజయవిలాసంగా సర్వకాల సర్వావస్థలలోను రక్షణ గీత అయ్యేది కాదు.

మొత్తానికి వర్తమాన కార్యక్షేత్రంలో మనలా భ్రమసింది అర్జునుడు అయితే 'భ్రమించటం జ్ఞానానందం కాదు' అని తెలివిగా ఉపదేశించినవాడు అర్జునుడి రథానికి సారథ్యం వహించిన ప్రజ్ఞాననిధి అయిన కృష్ణుడు. "గతాసూన గతాసూంశ్చ నానుశోచంతి పండితాః" అన్న ఉపదేశంతో కృష్ణుడి ప్రజ్ఞానం ప్రభావిత మవుతోంది.

**"దేహభ్రమలతో కాక ఆత్మజ్ఞానంతో పోరాడటమే వర్తమాన జీవన కర్తవ్యం"** అన్న కృష్ణుడి జ్ఞానోపదేశాన్ని తలకెక్కించుకుని విజయాస్త్రాలతో సంశోభితుడైనవాడు నేటి పాండవ మధ్యముడు, కార్యక్షేత్ర కర్మసాక్షి, రేపటి విజయుడు.

***

**పోరాడలేకపోతే బ్రతుకంతా పారాడటమే**

**"సుఖ దుఃఖే సమే కృత్వా లాభా లాభౌ జయా జయౌ" (2 : 38)**

గీతను ఒక కోణంలో మాత్రమే చూస్తే గీతాచార్యుడి ఈ సందేశం సన్యాసయోగానికి సంబంధించిందిలా అనిపిస్తుంది. సరిగా అర్థం చేసుకోగలిగితే వర్తమాన జీవన వ్యవస్థకు ఉపయుక్తమయ్యే సందేశంగా కానవస్తుంది. కర్తవ్య నిర్వహణతో ఘర్షిస్తూ, సంఘర్షిస్తూ జీవిక సాగించటమే వర్తమాన మానవ జీవితం. రాజీపడుతూ బ్రతికేస్తుంటే పారాడటమే అవుతుంది. కాబట్టి కష్టనష్టాలతో, సుఖదుఃఖాలతో, జయాపజయాలతో మమేకమవుతూ దైనందిన జీవితంలో నిలదొక్కుకోవటమే పోరాట పటిమ.

"యుద్ధాయ కృతనిశ్చయః", "యుద్ధాయ యుజ్యస్వ" అనే రెండు పదాలు గీతలోని 'సాంఖ్యయోగం'లో కనిపిస్తాయి. గీత యుద్ధభూమిలో ఉపదేశింపబడింది కాబట్టి ఈ రెండు పదాలు చేర్చబడలేదు. ఈ పదాలు జీవనవేదనకు, జీవనవేదానికి నాదనినాదాలు. కాబట్టే వర్తమాన జీవనవ్యవస్థలో సైతం నాటి పోరుభూమి ప్రకంపనలు గోచరిస్తున్నాయి. ఆనాడు కురుక్షేత్రంలో అర్జునుడిని కుదిపేసినట్టుగా ఈనాడు మానవక్షేత్రాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి. ఆరోజుల్లో రాజుల పాలన ... ఈరోజుల్లో ప్రజా పాలన. అయినా మానవ పోరులో పెద్దగా మార్పులు లేవు. పారాడే పసితనం నుండి విడివడ్డతర్వాత జరుగుతున్న వ్యక్తిత్వ వికసనమంతా పోరాట ఫలితమే. ఒకవిధంగా నాటి మహాభారత సంగ్రామమంతా నేటి మానవేతిహాసంలోని సంగ్రామపర్వాన్ని అద్దంపట్టేదే. అర్జునుడి సందేహ ప్రవృత్తి మనందరి మనసులకు ప్రతిరూపమే. కాబట్టే కాల యవనికపైన ఎన్ని తరాలు మారుతున్నా, ఎంతలా తలరాతలు మారుతున్నా కృష్ణోపదేశం మానవతత్వాన్ని ఎప్పటికప్పుడు నిద్రలేపుతూనే ఉంది. నిద్రాణతత్వం నుండి జాగృతపరుస్తూనే ఉంది.

నిజానికి యుద్ధభూమిలో మనకు కనిపిస్తున్న అర్జునుడు జారవిడిచింది దృశ్యమానమయ్యే అస్త్రాలనే కానీ అదృశ్యంగా మనసును ఆక్రమించిన అస్త్రాలను కాదు. కాబట్టే కృష్ణుడు పరిపరివిధాల జీవితంలో ఈదులాడవలసిన పద్ధతులను చెప్పుకు రావలసి వచ్చింది. ఇక్కడ 'ఈదులాడవలసిన' అని ఎందుకంటున్నానంటే కృష్ణుడు ఏ ఒక్క మలుపులోనూ వెనుదిరగమని కానీ, పారిపోమని కానీ చెప్పలేదు. పైగా ప్రతి మలుపులో 'కృతనిశ్చయం'తో, 'ఆత్మవిశ్వాసం'తో ముందడుగు వేయమని చెప్పాడు. యుద్ధభూమిలోనే కాదు ప్రతి మానవ జీవితంలోను సమరాన్ని చూసాడు. **ఈ జీవనసమరంలో కనిపించే ప్రతీదీ వ్యవస్థలోని మరోవర్గంలో కనిపించేదే.** అంటే, **పోరాడి గెలవ వలసినవే.** ఇలా కృతనిశ్చయంతో మునుముందుకు సాగిపోతుంటేనే జీవన అస్తిత్వానికి సాక్షిసంతకం చేయగలం.

***

**అహాన్ని వీడటానికే మానవ విషాద యానం**

మానవ పుటకతో మనందరిదీ తొలుతగా విషాద యానమే. జీవితంలోని అనేకానేక మలుపులతో ఎదురయ్యే కష్టాలు, కన్నీళ్లు, బాధలు, బాధ్యతలు – అన్నీ మన అహాన్ని రుచి చూపించేవే. వీటినుండి బయటపడటం అంటే అహాన్ని వీడటమే. కాబట్టి మనం దృష్టి పెట్టవలసింది బయటి ప్రపంచంలో జరుగుతున్న యుద్ధంపై కాదు ... మనలో జరుగుతున్న పోరును పసిగట్టి. ఈ జీవన పోరు నుండి బయటపడటం జరగాలి. దీన్నే ప్రఖ్యాత తత్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ Battle Ground for Moral Struggle అంటారు. గత శతాబ్దపు యోగిపుంగవుడు అరవింద మహర్షి Field for Action అని అంటారు.

ఈనాటి గీతా విశ్లేషకుడు the war within, the struggle for self-mastery that every human being must wage if he or she is to emerge from life victorious అని అంటారు. గీతను అనుష్ఠించగలిగితే మనలో ఆత్మగౌరవం, స్వేచ్ఛ పెంపొంది సమత్వ భావన ఇనుమడిస్తుంది – అని అంటారు స్వామి రంగనాథానంద.

పై ప్రముఖుల నిర్వచనాల్లో భగవద్గీతను వర్తమాన రక్షణ గీతగా పరిగణించే దిశలో, దశలో Moral Struggle, Field for Action, Struggle for Self-mastery అన్న అర్థవంతమైన పదాలు జీవితాన్ని Battle Ground గా చూస్తున్నప్పుడు – Life Victorious గా పరిణమించాలనుకున్నప్పుడు – మన వర్తమాన వర్తనానికి బాసటగా నిలుస్తాయి.

అసలు జయం, విజయం అంటున్నప్పుడు అందులో పోరాట తత్త్వం ప్రతిధ్వనిస్తుంది. Success and Victory బాట పడుతున్నప్పుడు తొలి మలుపులో ఫైట్, ఫ్లైట్, ఫ్రీజ్ తత్త్వాలలో ఏదో ఒక తత్త్వం మనిషిని కుదిపేస్తోంది. దీన్నే ఈనాడు మనం fight or flight syndrome అంటున్నాం. ఈ మానసిక, జీవన తాత్త్వికతను A group of changes that occur in the body to help a person fight or take flight in stressful or dangerous situations. This is the body's way of helping to protect itself from possible harm అని నిర్వచించుకోవచ్చు. "While the fight-flight-freeze response causes physiological reactions, it's triggered by a psychological fear" అని మనస్తత్త్వ శాస్త్రం విశ్లేషిస్తోంది. అంటే, పోరుబాటలో పోరాడటమో, పారిపోవటమో, చేష్టలుడిగి స్థాణువు కావటమో జరుగుతుంది. కర్మక్షేత్రంలో అర్జునుడిది చేతలుడిగిన స్థితి. కాబట్టి చైతన్యపరిచి పోరాటానికి సన్నద్ధపరచగలిగాడు కృష్ణుడు. వర్తమానంలో మనలోని ప్రతిఒక్కరం ఈ చేతనారహిత స్థితి నుండి బయటపడి జాగృతం అయితేతప్ప మనం విజయులం కాలేము.

***

గీతా రహస్యాలు కొత్తకోణంలో ఆవిష్కృతమవుతుంటే – జీవితం ఆత్మక్షేత్రమే కానీ ఆటస్థలం కాదు అన్నది ఎరుక అవుతుంటుంది. జీవనం కర్మాచరణకే తప్ప క్రీడించటానికి కాదు – అన్నదీ అవగతమవుతుంటుంది. సేవాదృక్పథంతో స్పందిస్తుండటమే జీవనశ్వాస అనీ, స్వాభిమానంతో సాగిపోతుండటమే జీవితలయ అని అర్థమవుతుంటే దృశ్య అదృశ్యాలను సమంగా చూడటం, చర అచరాలను సమానంగా పొదువుకోవటం మానవ జీవన విజయ రహస్యం అని తేటతెల్లమవుతుంటుంది.

జీవితంలో ఎన్ని పురోగమనాలో అన్ని తిరోగమనాలు. ఎన్ని సుఖాలో అన్ని బాధలు. ఎన్ని ఆనందబాష్పాలో అన్ని విషాదాశృవులు. భరించలేనప్పుడు అన్నీ ఆందోళనలే ... అన్నీ అవరోధాలే ... అన్నీ అవహేళనలే ... అన్నీ అనుమానాలే. అర్థం చేసుకోప్రయత్నిస్తే అన్నీ అహంభావ ప్రతీకలే.

**గెలవటానికి కడక్షణంవరకు పట్టు విడవకూడదు ... దృశ్యంగాను, అదృశ్యంగాను.**

**జీవించటానికి తుదిశ్వాసదాకా పోరాడాల్సిందే ... కనిపించీ, కనిపించకుండా.**

ఈ క్షర, అ-క్షర వివేకచూడామణి భగవద్గీత. అంతేకానీ గీత ఒక్క కురుక్షేత్ర సంగ్రామానికి మాత్రమే విజ్ఞానసర్వస్వం అనుకుంటే మనం అన్నివిధాలా పొరబడుతున్నట్లే. అలా పొరబడుతుంటే జీవితం పోరాటక్షేత్రంగా మాత్రమే కనిపిస్తుంది. జీవితంలో గెలవటానికైనా పోరాడవలసిందే అన్న విషయావగాహన నేడు ఉండాల్సిందే, రేపూ ఉండాల్సిందే. ఆటంకాలు, అవరోధాలు, ఆందోళనలు, ఆవేదనలు, ఆవేశాలు, అవకాశాలు – అన్నీ దృశ్యంగాను, అదృశ్యంగాను మనల్ని మోటివేట్ చేస్తుంటాయి.

***

కృష్ణుడి ద్వారా గీతోపదేశం జరిగింది అర్జునుడికే అయినా –

అయిదు వేల సంవత్సరాల క్రితం ఉపదేశింపబడినప్పటికీ –

కౌరవ పాండవుల పోరుకి సంబంధించిందిగా అనిపిస్తున్నప్పటికీ –

రెండు వర్గాల,రెండు వ్యవస్థల మధ్య అధికార పోరుగా అభివర్ణితమైనప్పటికీ –

కాల యవనికపైన కొద్దికాలాన్ని అద్దంపట్టినప్పటికీ –

మానవ వర్తనలను, మానసిక వర్తనలను రికార్డు చేసినప్పటికీ –

ఇలా పైకి కనిపించే అంశాల కంటే కనిపించని అంశాలను అనేకానేక కోణాలలో ఆవిష్కరించిందనటానికి గీతలోని ప్రతి శ్లోకమూ అక్షర తార్కాణమే.

గీతోపదేశ అర్థాలు, అంతరార్థాలు, విశేషార్థాలు మచ్చుకు కొన్ని –

– మన ధర్మాలను, మన కర్మలను రచించుకోవలసింది మనమే.

– మానవ జీవితం తోలుబొమ్మ కాదు. ఆడించటం తెలిస్తే అదే లైఫ్ స్కిల్.

– మనం పోరాడాల్సింది మొదటగా ఆంతర్యంలోనే … గెలవటం అంటే ఆత్మస్థైర్యాన్ని పొదువుకోవటమే … దీనికి బాహ్యంగా కనిపించే భౌతిక జీవితమే కార్యక్షేత్రం.

– దృశ్యంగా మనది ఒంటిరిపోరాటమే అయినా అదృశ్యంగా సామూహికంగాను, సామాజికంగాను.

– అయినవారిని ప్రేమించటం ప్రేమనే … అవసరమున్నవారిని ఆదుకోవటం నిస్వార్థప్రేమ.

– ఆలోచనలన్నీ కామనలు కాకూడదు. కామనలను పోగేసుకోవటం సంపదను కూడబెట్టుకోవటం కాదు. ఆలోచనల రాకపోకలు ఎంతసహజాలో కాలమానాలు ఉధృతం కావటం, ప్రిదిలి పోవటం అంతే సహజం. మనం నిరపేక్షంగా ఉండటం ప్రధానం.

– ఆలోచనకు బుద్ధికుశలతను, ఆచరణకు నిబద్ధతను, జీవితానికి ఆత్మతత్వాన్ని జోడించాలి.

– మనకు మనమే పైకి మిత్రులం … లోన శత్రువులం. అయినా మనలోని మిత్రత్వ శత్రుత్వాలు సోదరతత్వాలే.

– భావోద్వేగాల రూపంలో ప్రకృతి కొన్ని బాధ్యతలను కట్టబెడుతుంది … భావోద్రేకాలతో ప్రవృత్తీ మరికొన్నింటిని జతచేస్తుంది. ఈ ప్రకృతినీ, ప్రవృత్తినీ బాలన్స్ చేసుకోవటమే జీవితం. వివిధ బాధ్యతల నడుమ సమతను సాధించటమే జీవితం.

– సందిగ్ధతలు, సంఘర్షణలతోనే మన వర్తమాన జీవితం సాగుతోంది. కారణం మన బంధాలు, బంధనాలు. ఇవి ప్రవృత్తికి చెందినవి, వృత్తికి సంబంధించినవి. అందుకే స్ట్రెస్, కన్ఫ్యూషన్ లు. ఈరోజు మనం సమాజాన్నీ కాదనలేం, కుటుంబాన్నీ కాదనలేం, వృత్తిజీవనాన్నీ కాదనలేం, మనల్ని మనమూ కాదనుకోలేం. ఇన్ని వ్యవస్థల అవస్థల నుండి మనం చెయ్యాల్సింది పారిపోవటం కాదు … విడివడటం. ఈ డిటాచ్మెంట్ సాధ్యమైతే తప్ప బ్రతుకు సజావుగా సాగదు.

***

**"ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ" (1 : 1)**

అన్నది భగవద్గీత తొలి అధ్యాయమైన 'అర్జునవిషాద యోగా'నికి శ్రీకారం చుట్టిన ధృతరాష్ట్ర ఉవాచ. ఈ అభ్యర్థనను మన్నిస్తూ సంజయుడు కురుక్షేత్ర కర్మక్షేత్రంలోని అర్జున సంవాదాన్ని 85 శ్లోకాల రూపంలోనూ, కృష్ణోపదేశాన్ని 574 శ్లోకాలలోనూ, ధృతరాష్ట్రుని సంబోధిస్తూ 41 శ్లోకాలలోనూ చెప్పటం మనకు తెలిసిన గీత.

ఈ గీతను వర్తమాన వర్తన గీతగా అనువదించుకుని – బ్రతుకు కావ్యంగా ఆదరించగలిగితే – అవగతమయ్యేది–

బ్రతుకు బాటలో నడక ప్రారంభించి గమ్యాన్ని చేరుకోవాలంటే ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాల్సిందే అని. మనలో వెలుగు లేనప్పుడు బాటకు రెండువైపులా ఉన్న దీపాలు వెలుతురును విరగకాస్తున్నట్లు అనిపించవు ... గుడ్డిదీపాల్లా అనిపిస్తాయి. ఈ గుడ్డి వెలుతురు కారణంగానే అర్జునుడు కురుక్షేత్రంలో తడబడ్డాడు ... మనమూ జీవనబాటలో తచ్చాడుతున్నాం. ఈ క్రాస్ రోడ్స్ లో అర్జునుడిదయినా, మనదయినా ఒకేవిధమైన మానసిక సంఘర్షణ. అర్జునుడిది ఉమ్మడి వ్యవస్థనే ... వర్తమానంలో మనదీ ఉమ్మడి అవస్థనే. ఈ కూడలిలో మనం తెలుసుకోవలసింది త్యాగానికంటే బాధ్యతకే బరువు ఎక్కువ అని ... సమయానికే బలం ఎక్కువ అని ... సమతాదృష్టిదే సూటిమార్గం అని.

ఈ వర్తమాన రక్షణ గీతను ముగించే ముందు మరికొన్ని మాటలు –

మనం విశ్లేషిస్తూ వచ్చిన గీతలో ఆవలితీరం భక్తియోగం ... ఈవలితీరం కర్మయోగం. ఈ రెండుతీరాల నడుమ ప్రవహించాల్సింది జ్ఞానయోగం. ఈ ప్రవాహ ఉధృతికి మనల్ని సంసిద్ధం చేసేదే జ్ఞానవివేచన. కార్యమగ్నమై అంటే కర్మాచరణతో జీవితంలో ఒక్కో మెట్టూ అధిరోహిస్తూ పోవలసిందే. ఈ ప్రయత్నంలో మరొకరిపై భారం మోపకూడదు. అంటే మన కర్మ పరంగా వేరెవరో బాధ్యత వహించరు ... మనకు మనమే బాధ్యత వహించాలి. ఎవరి సలహాలైనా, సహకారాలైనా మనలో విశ్వాసం నింపటానికే ... ఈ దిశగానూ మనకు ఆత్మవిశ్వాసమే అసలైన బలసంపద.

ఇక, విశ్వాసపరంగా భగవంతుడు ఒక ఆలంబన మాత్రమే. మనం ఇప్పుడు సూపర్ మాన్ లను చూసి ఆనందపడుతున్నట్లుగా భగవంతుడూ ఒక సూపర్ హ్యూమనే. అంటే, మన పరిణామ అవకాశానికి ఒక ప్రతిబింబం అన్నమాట. కాబట్టి కృష్ణోపదేశం ద్వారా వ్యక్తమైనవన్నీ మన మేధను తొలిచే ఆలోచనలే. కృష్ణుడు మానవాతీతుడు అయినపుడు మనలోని అర్జునులూ సూపర్ హుమన్స్ కాలేరా?! కాబట్టి గీత చేస్తున్న పని మనలో స్తబ్దంగా ఉన్న తత్వాన్ని జాగృత పరచటమే.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – తిరమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. శ్రీ మహాభారతము – ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు
3. మహాభారతం – ఉప్పులూరి కామేశ్వరరావు

# 5. కవిత్రయ భారతంలో ధృతరాష్ట్రుని పాత్రచిత్రణ - మరో చూపు

– డా॥ జె. వెంకటరమణ, మధురై

ప్రాచీన సాహిత్యంలో కానీ మరే ఇతర సాహిత్యంలోనైనా సరే ప్రస్తావించిన విషయాలను ఆనాటి కాలంలోనే కాకుండా ఇతర కాలాల్లో కూడా వాటిని ఉదహరించడం, ఆదర్శంగా తీసుకోవడం, ఆచరించడం అనేటటువంటి సంప్రదాయం ఉన్నది. భారత, భాగవత, రామాయణాలను, ఇతర కావ్యాలను, ప్రబంధాలను మొదలగు వాటిని అన్నిటిని కూడా దీనికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. కానీ ఆ రచనా నేపథ్యం, అందులోని పాత్రల సృష్టించడం వెనక ఉండేటటువంటి నేపథ్యాన్ని, కవి చెప్పదలుచుకున్న అంశానికి ఆ పాత్రను ఏ విధంగా ఉపయోగించుకున్నాడు. ఇలాంటి అనేక విషయాలను ముఖ్యంగా గమనించాలి.

ఇవి తర్వాత రోజుల్లో సామెతలుగా, సూక్తులుగా ఉపయోగించడం కనిపిస్తుంది. భారత భాగవత రామాయణాల్లోని అంశాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఉదా॥ *రామాయణంలో పిటకల వేటలాగా, అది పెద్ద భారతం,* ఇప్పటికీ కూడా సాధారణంగా చెప్పుకునేటటువంటి ఒక మాట కన్యాశుల్కంలో నాటకంలో *వెంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చినట్టు* ము॥వి.

ఇది ఒక కల్పిత కథని తెలిసి కూడా దానినే ఉదాహరణగా అనేక సందర్భాల్లో వాడుతున్నారు. అదే విధంగా కవిత్రయ భారతంలోని అనేక అంశాలను ఉదాహరణలుగా ప్రతినిత్యం ప్రయోగిస్తున్నారు. కానీ కొన్ని కొన్ని విషయాలను ఉదహరించేటప్పుడు వాటి విషయం పూర్తిగా తెలుసుంటే మంచిది. ప్రస్తుత సమాజంలో ఆలోచించి మరీ పేర్కొనాలి. ద్వాపరయుగం నాటి కథను, మూలభారతాన్ని, ఇతర వ్యాఖ్యానాల ఆధారంతో కలియుగంలో దాదాపుగా 11వ శతాబ్ద సమకాలీన సమాజంలో (కవిత్రయ) రాసిన కథను, తెలుగు ప్రాంతాల్లో ఉండే ఐతిహ్యాలను, కథనాలను కూడా తీసుకొని, జనరంజకంగా అందరికీ చేరేటట్లుగా రచన చేయడానికి ప్రయత్నించేటటువంటి క్రమంలో కొన్ని విషయాలు ఒక మూసలో వెళ్ళిపోడానికి అవకాశం లేకపోలేదు.

ఈ సదస్సు ఆనాటి గ్రంథాల్లో ఉండే విషయాలను ప్రస్తుతం సమాజంలో కూడా యథాతథంగా అన్వయించుకోవాలా? లేదా మార్పులు ఉన్నాయా? వాటిని విడిచి పెట్టాలా? అనే విషయాన్ని స్పష్టంచేస్తుంది. వాటిలో మార్పులు ఏవైనా చోటు చేసుకోవాల్సిన అవసరం ఉందా? అని గమనించి, ఆలోచించాలని చెప్పే ప్రయత్నమే ఈ పత్ర సమర్పణ లక్ష్యం. ఇక్కడ ధృతరాష్ట్రుని పాత్రచిత్రణలో కవిత్రయం వ్యాస భారతాన్ని యథాతథంగా అనుసరించారా? లేక తెలుగు భారతంలో మార్పులు ఉన్నాయా? ఉంటే అవి ఎలా ఉన్నాయో ప్రస్తావించడం, ధృతరాష్ట్రుని పాత్రచిత్రణలో ప్రధానంగా మూడు అంశాలను మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను.

అది యథాతథంగా వ్యాస, కవిత్రయ భారతాలకు అనుగుణంగానే చూడాలా? లేదా మార్పులు ఏమైనా వస్తే అవి ఏ రకమైనటువంటి మార్పులు. ఈ విషయాలను ఆలోచన చేయాలనే తప్ప వాటిని తప్పుగాను లేకపోతే ఇంకో రకంగానో చెప్పడం నా ఉద్దేశం కాదు.

*నానృషిః కురుతే కావ్యమ్* అని పెద్దలు అన్నారు. ఈ మాట వలన ఋషి కానటువంటివాడు కవి కాలేడు. భూత భవిష్యత్తు వర్తమానాలలో మార్పు చెందని దానినే దాదాపుగా రాసేవారు.

ఇంచుమించుగా చాలా పాత్రలు పుట్టుకకు కారణాలను చెబుతూ ఉంటారు. ఒక్కోసారి పూర్వజన్మల తాలూకు కర్మ ఫలితాలను చెప్పి, ఆ కర్మల వలన ఆయా పాత్రల స్వరూప స్వభావాలను చిత్రించటం చేశారు. దీంతో పాటుగా కొన్ని శాపాల కారణంగా కూడా కొన్ని పాత్రల గుణగణాల్లో మార్పులు కనిపించినట్లు చెప్పడం జరిగింది.

## ధృతరాష్ట్రుని జననం (అంధునిగా)

విచిత్రవీర్యుడు అనారోగ్యంతో మరణించడంతో, భీష్ముడు తన ప్రతిజ్ఞతో సింహాసనాన్ని అధిష్టించలేకపోయాడు. బాహ్లిక రాజ్యాన్ని విడిచిపెట్టడానికి ఇష్టపడని బాహ్లిక వంశానికి, హస్తినాపురంలో వారసత్వ సంక్షోభం ఏర్పడింది. సత్యవతి తన కుమారుడైన వ్యాసుని నియోగ సాధనలో రాణులైన అంబిక, అంబాలికలను గర్భం ధరించమని ఆహ్వానిస్తుంది. వ్యాసుడు అంబికను గర్భం ధరించడానికి వెళ్ళినప్పుడు,

**"మధ్యాక్కర. అవసర దయి వ్యాసుడేతెంచె నంత నత్తపసి**
**కవిలగడ్డంబును గవిలజడలును గవిల కన్నులును**
**దవినయన్నువ నల్ల నైన దీర్ఘపుఃదనువును జూచి**
**యువిద గన్నుంగవ మొగిచి తెఱవక యుండె భయమున" (ఆది.చతుర్థ. 254)**

ఆ ముని పసుపు పచ్చని రంగులోనున్న గడ్డాన్నీ, జడలను, కళ్ళను, సన్నగా, నల్లగా పొడుగ్గా ఉన్న శరీరాన్ని చూసి అంబిక భయంతో రెండుకళ్ళూ మూసుకొని తెరవకుండానే ఉండిపోయింది.

**వ. కృష్ణద్వైపానుండును దానికింబుత్రదానంబు సేసి 'యాయంబికయందు బలపరాక్రమవంతుం దయిన కొడుకు పుట్టు వాడు మాతృదోషంబున నంధం డగు.... (ఆది.చతుర్థ. 255)**

కాబట్టి ధృతరాష్ట్రుడు అంధునిగా జన్మించడానికి గల కారణం కేవలం తల్లి చేసినటువంటి పొరపాటు. తప్ప ఇంకోటి కాదు. ఎందుకంటే దీనికి సంబంధించిన కారణాలను వ్యాస, కవిత్రయ భారతాల్లో ఎక్కడా ప్రస్తావింపబడలేదని నా అభిప్రాయం. కానీ లోకంలో ప్రఖ్యాతం కాని ఒక కథన ఉంది. (దీనికి ఆధారం లభించలేదు)

ఒకనాడు ధృతరాష్ట్రుడు "కేశవా నాకు గత నూరు జన్మల విషయాలు గుర్తున్నాయి. కానీ వాటిలో ఎక్కడా కూడా నేను అంధుణ్ణి కావడానికి గల కారణాలు కనిపించలేదు. నీవు భగవంతుడివి కదా దీనికి కారణం ఏమై ఉండవచ్చు?" అని కృష్ణుడిని అడుగుతాడు. దానికి కృష్ణుడు "ఈ జన్మల కంటే ఇంకో ఐదు జన్మలకు పూర్వం అంటే 105వ జన్మలో ఒక పాముకు నీ వలన చూపు పోయింది. దానివలన నీకు ఈ జన్మలో అంధత్వం ప్రాప్తించింది" అని చెబుతాడట. ఇది కట్టుకథలా ఉంది. నమ్మశక్యంగా లేదు. కాబట్టి ధృతరాష్ట్రుడిని అంధుడవడానికి ఇంకేదైనా కారణం ఉందేమో చూడాలి.

## ధృతరాష్ట్రుడు ప్రతీకాత్మక పాత్ర

ధృతరాష్ట్రుడు అంటే *జాతికి ఆధారాన్నిచ్చేవాడు, భరించేవాడు* అనే అర్థాన్ని నిఘంటువులు చెబుతున్నాయి. సాహిత్యంలో కొన్ని పాత్రలను ప్రతీకాత్మక పాత్రలుగా చిత్రించడం పరిపాటి. వాటి పేర్లు కూడా అలా నిర్ణయిస్తుంటారు. అది ఆయా పాత్రల స్వభావాన్ని తెలియజేసేలా ఉంటుంది. అలాగే ధృతరాష్ట్రుని పాత్రచిత్రణ కూడా ఒక ప్రతీకాత్మక పాత్రేమో. తమ పిల్లల పట్ల విపరీతమైన వాత్యల్యాన్ని చూపిస్తూ (గారాబం చేస్తూ), వారి భవిష్యత్తు నాశనం కావడానికి కారణమవుతారు. ఈ పుత్రప్రేమ ధృతరాష్ఠుని తప్పొప్పులు చూడలేని అంధునిగా చేసింది. దీనికి ప్రతీకగా మహాభారతాల్లో ఈ పాత్ర సృష్టించబడిందేమో అనుకోవచ్చు. ఇది ప్రస్తుత సమాజంలోని పరిస్థితికి అద్దం పడుతుంది. ఈనాటికీ పిల్లలపై గుడ్డిప్రేమను చూపకూడదనే నీతిని తెలియజేస్తుంది.

## ధృతరాష్ట్రుని విద్యా నైపుణ్యాలు

పాండురాజు భీష్ముడు, కృపాచార్యులచే సైనిక కళలలో శిక్షణ పొందాడు. ధృతరాష్ట్రుడు తన వైకల్యం కారణంగా ధృతరాష్ట్రుడు ఆయుధాలను ప్రయోగించలేకపోయాడు, కానీ వ్యాసుడు ఇచ్చిన వరం వల్ల లక్ష ఏనుగుల బలాన్ని కలిగి ఉన్నాడు. అతను తన చేతులతో ఇనుమును నలిపివేయగలడని మహాభారతంలో చెప్పబడింది.

**బలవనేమదనాగాయుత**
**బలయుతుడు సుతుడు పుట్టె బ్రజ్ఞా చక్షుం**
**దలఘుదు ధృతరాష్ట్రుం డా**
**లనకు నంబికకు గురుకులప్రవరుం డై (ఆది.చతుర్థ. 256)**

బలం కలిగి మదించిన పదివేల ఏనుగుల బలంతో కూడుకొన్నవాడు, బుద్ధియే చూపుగా కలవాడు (కళ్ళు లేకపోయినా బుద్ధితో గ్రహింపకలిగిన వాడుబీ అల్పుడు కానివాడు అయిన ధృతరాష్ట్రుడు అంబికకు కురువంశ శ్రేష్ఠుడుగా కొడుకై పుట్టాడు.)

## దివ్యాంగ వివక్ష

### 1. రాజుగా నియమించుట

మూలభారతంలో అంధత్వం కారణంగా రాజ్యాధికారం ధృతరాష్ట్రుడికి కాకుండా పాండురాజుకు ఇవ్వడం కనిపిస్తుంది. తర్వాత పాండురాజు మరణం తర్వాత ఒక ఆపద్ధర్మ రాజుగా కనిపిస్తాడు. కవిత్రయ భారతంలో ధృతరాష్ట్రుడి పట్టాభిషేకం జరిగినట్లు చెప్పబడినది. ఇది కింది వచనం, పద్యంలో కనిపిస్తుంది. ఇక్కడ స్పష్టంగా ఈ విషయాన్ని చెప్పబడలేదు.

**" ........ సస్యసమృద్ధియు నగుచుండ, నాంబికేయు ధృతరాష్ట్రు రాజ్యాభిషిక్తుం జేసి, భీష్ముండు దనకు విల్లును విదురుబుద్ధియును సహాయంబులుగా రాజ్యంబు రక్షించుచున్నంత**

**ఆయము గర్వమున్ విడిచి యన్యపతుల్ పనిసేయ నిట్లు గాం**
**గేయభుజాబలంబున నికృత్తవిరోధిసమాజుఁ డై కుమా**
**రాయితశక్తిశాలి ధృతరాష్ట్రుఁడు రాజ్యము సేయుచుండె న**
**త్యాయతకీర్తితోఁ దనకు హస్తిపురం బది రాజధానిగన్ (ఆది.పంచ.5,6)**

ఇతర దేశాల రాజులు తమ ఆదాయాన్ని, గర్వాన్ని విడిచి, తనను కొలుస్తూ ఉండగా, భీష్ముని భుజబలంచేత శత్రురాజులను సంహరించి, కుమారస్వామి అంతటి శక్తిశాలి అయిన ధృతరాష్ట్రుడు హస్తినాపురాన్ని తనకు రాజధానిగా చేసికొని అత్యధిక కీర్తితో రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉన్నాడు.

మూలకథలో కొంత మార్పులా అనిపించినా చివరికి ఇది ఇంకో రూపంలో దివ్యాంగ వివక్ష కనిపిస్తుంది. ఆదిపర్వం షష్ఠాశ్వాసంలో పాండురాజే రాజైనట్లు చెప్పబడింది. ఇది దుర్యోధన – ధృతరాష్ట్రుల సంభాషణ ద్వారా తెలుస్తుంది. "పాండవులు వీరులని నేను భయపడుతున్నాను. దీనికే తగినట్లే నీవు పెద్దల ఎదుట మా అందరిలో పెద్దవాడైన ధర్మరాజునే యువరాజుగా చేశావు. అందరూ ధర్మరాజు వైపుచేరి, భీష్ముడు రాజ్యాన్ని చేపట్టడు, ధృతరాష్ట్రుడు రాజ్యాన్ని రక్షించలేడు. కాబట్టి వారినుండి మమ్మల్ని కాపాడాలంటే వారిని ఇంకోచోటికి పంపండి" అని దుర్యోధనుడు అంటాడు. దీనికి ధృతరాష్ట్రుడు ఇలా అంటాడు.

**"రాజయ్యెడువాడు తన రాజ్యభారంబు దాన చూచి యరయవలయు, నేను షడంగసహితంబుగా వేదాధ్యనంబునంబు సేసియు నర్థశాస్త్రంబునందు గృతనిశ్చయుండ నయి బలంబు గలిగియు నంగవైకల్యంబునం బరచక్రంబులకుం బ్రతివ్యూహంబులు రచియింప నేరమింజేసి రాజ్యంబునకు దగకున్న" (ఆది.షష్ఠా.124)**

అంటూ ధృతరాష్ట్రునిచే తాను రాజును కాలేకపోవడానికి గల కారణాన్ని వివరింపజేస్తాడు. అగ్రజునికి అధికారం రాకపోవడంపై దుర్యోధనుడు తర్వాతి తరాల ఇబ్బందులు వివరిస్తాడు.

**2. ధృతరాష్ట్రుని వివాహం**

సాహిత్యంలో చాలావరకు అనేక వివక్షలు కనిపిస్తుంటాయి. అందులో దివ్యాంగ వివక్ష కొంచెం ఎక్కువగానే కనిపిస్తుందనవచ్చు. ప్రస్తుతం కేవలం మహాభారతం, ధృతరాష్ట్రుని పాత్రకు పరిమితై చూస్తే. ఇందులో ధృతరాష్ట్రునికి చూపు లేదు. దీని తాలూకు వివక్ష వివాహ సమయంలో, రాజ్యాధికారం ఇచ్చే సమయంలో ఈ వివక్ష కనిపిస్తుంది.

**" 'వ. కావున ధృతరాష్ట్రునకు గాంధారిని వివాహంబు సేయుదముబీ గాంధారపతి మనతోడి సంబంధమునకుందగు' నని నిష్చయించి సుబలు పాలికి దగుముదుసళ్ళం బంచిన, సుబలుండును సుముఖుం డై 'కురుకులవిస్తారకుం డయిన ధృతరాష్ట్రుండ యిక్కన్యకకు నర్హుండు గావున నా రాజునకు గాంధారి నిచ్చితి' ననిన, వాని బంధుజనంబు లెల్ల దమలో ని ట్లనిరి.**

**అంగములలోన మే లుత్తమాంగ, మందు**
**నుత్తమంబులు గన్నుల యుర్విజనుల**
**కట్టి కన్నులు లే వను నదియకాక**
**యుత్తముడు గాడె సద్గుణయుక్తి నతడు" 10,11)**

చండశాసనుడైన గాంధారపతి తన కూమార్తెకు తగిన వరుడని నిర్ణయించాడు. దీనికి గాంధారి కూడా అంగీకరించి, వివాహానికి సిద్ధమౌతుంది. కానీ బంధువులు తమలోతాము చూస్తూ చూస్తూ గుడ్డిటవాడికి పిల్లనివ్వడం ఇష్టంలేక పై విధంగా వ్యంగ్యంగా గుసగుసలాడుకొన్నారని కవి చెబుతాడు.

**"వ. రాజయ్యెదువాడు తన రాజ్యభారంబు దాన చూచి యరయవలయు నేను షడంగసహితంబుగా వేదాధ్యయనంబు సేసియ నరథశాస్త్రంబునందు గృతనిశ్చయుండ నయి బలంబు గలిగియు ణంగవైకల్యబునం బరచక్రంబులకుం బ్రతివ్యూహంబులు రచియింప నేరమింజేసి రాజ్యంబునకు దగకున్న," (ఆది.షష్టా.124)**

సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్ – మానవులకు ఉండే అంగాలన్నిటిలో తల ముఖ్యమైనది. తలలోని భాగాలలో కళ్ళు ప్రధానమైనవని అర్థం. ఈ మాట స్థూలార్థంలో చెప్పింది. కానీ దీనిని వికలాంగులకు అన్వయించమని అర్థం కాదేమో. కళ్ళు ప్రధానమైనవే కానీ మనిషిలోని ప్రతి అంగము ముఖ్యమైనదే. కానీ వాటిలో ప్రత్యేకించి కళ్ళే ప్రధానమైనవి అని చెప్పడంతో సమాజంలో దీనిని అన్ని చోట్లా ఉపయోగించడం పరిపాటైపోయింది.

చిన్నయసూరి నీతిచంద్రికలోని ఈ పద్యంలో ఇలా అంటాడు...

**"పలు సందియములఁ దొలఁచును**
**వెలయించు నగోచరార్థ విజ్ఞానము, లో**
**కుల కక్షి, శాస్త్ర మయ్యది**
**యలవడ దెవ్వనికి వాఁడె యంధుఁడు జగతిన్ (సంపూర్ణ నీతిచంద్రిక14)**

(శాస్త్రం అనేక సందేహాలను తొలగించును. కంటికి కనబడని పదార్థములు వివేకాన్ని కలిగించును. కావున లోకులకు శాస్త్రమే కన్ను. అది లేని లోకంలో అంధుడు)

నిజానికి మాములు కనుల ద్వారా చూడలేనిది జ్ఞానం ద్వారా గ్రహించవచ్చు. మామూలు కంటితో చూడలేకపోతే, కళ్ళుండీ చూడలేనటువంటి వారిని అజ్ఞానులుగాను, అవివేకులుగాను పరిగణించారు. మరి జ్ఞానం కలిగిన అంధుడిని అవివేకిగాను, అజ్ఞానిగాను చూడలేము. కాబట్టి ప్రస్తుతం సమాజంలో ఏదో ఒక కారణంచే శరీరాంగాల లోపం కలిగితే

చిన్నచూపు చూసే రోజులు పోయి, మారుతున్న కాలమిది అని చెప్పుకునే రోజుల్లోకి వెళ్తున్నా కూడా వివక్ష మాత్రం ఖచ్చితంగా ఉంది.

మరి ఇది వ్యాసభారతం రాసే నాటికి, కవిత్రయ భారత రచన చేసే కాలం నాటికి ఏ స్థాయిలో ఉండొచ్చో ఊహించవచ్చు. ఆయా కాలాల్లో పరిస్థితుల్లో మార్పు గోచరిస్తుంది. ఈ మార్పు వల్లనే కవిత్రయ భారతంలో స్వల్పమైనటువంటి మార్పు ధృతరాష్ట్రుని పాత్ర చిత్రణలో కనిపిస్తుంది. మరి ఇలాగే ప్రస్తుతం మన అభిప్రాయాలను, ఆలోచనలను అభ్యుదయ దృక్పథంతో చూడావాల్సిన అవసరం ఉందని అనిపిస్తుంది. అంటే మహాభారత గొప్పతనం గురించి ఉగ్రశ్రవసుడు చెప్పిన (What is in Mahabharatha is every where; what is not in Mahabharatha is no where) భారతంలో ఉన్నదంతా అంతటా ఉన్నది. భారతంలో లేనిది ఎక్కడా లేదు. అనే ఈ మాటను గుడ్డిగా నమ్మడానికి వీలులేదు. కాబట్టి సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్ – అనేటటువంటి మాటను లోకాన్ని చూడడానికి ఉత్తమమైనదే. కానీ చూపులేకపోతే భవిష్యత్తు లేదనేంత గుడ్డినమ్మకం ఉండకూడదు. ఈనాటి సమాజంలో పూర్తిగా ఉగ్రశ్రవసుడు మాటలు సత్యమని చెప్పలేమేమో.

**పుత్ర వాత్సల్యం**

సాహిత్యంలో ప్రధానంగా పుత్ర వాత్సల్యాన్ని గురించి ప్రస్తావించినప్పుడు గుర్తొచ్చే పాత్రల్లో రామాయణంలో దశరథుడు, భారతంలో ధృతరాష్ట్రుడు. రామాయణంలో కన్న తండ్రి అనుకోని పరిస్థితులలో తన ప్రియ పుత్రుడినే అడవుల పాలు చేశాడు. ఆ పుత్ర శోకంతోనే మరణించాడు. ఇక భారతంలో దృతరాష్ట్రుడు కాకుండా మనకు ఒకటి రెండు చోట్ల ఈ పుత్ర ప్రేమ కనిపిస్తుంది. అర్జునుడి కుమారుడైన అభిమన్యుడు మరణానికి కారణమైన సైంధవుడుని సంహరించేంతవరకు కూడా అర్జునుడు శాంతించలేదు. అర్జునుడు ధీరోదాత్తునిగా వర్ణించినప్పటికీ దుఃఖం అనేది ఈ పాత్రలో కనిపిస్తుంది. అలాగే భీముడు ఘటోత్కజుని మరణానికి ఎంతో దుఃఖిస్తాడు. భీముడు శారీరకంగా ఎంతో బలవంతుడైనప్పటికీ ఎన్నో ఎదురుదెబ్బలను తట్టుకోగలిగినప్పటికీ, పుత్ర వాత్సల్యం కారణంగా తనను తాను తమాయించుకోలేదు.

ఈ రెండు పాత్రను చూసిన తర్వాత *ధృతరాష్ట్ర కౌగిలి* అనేమాట కుమారుని మరణానికి కారణమైన మనిషి ఎవరైనా సరే ఆవేశంలో వారిని చంపాలనుకోవడం కనిపిస్తుంది.

దుర్యోధనుని నాశనానికి కారణం అతను చేసిన పనులే. చిన్నయసూరి నీతిచంద్రికలోని ఈ పద్యంలో పిల్లలు చెడుమార్గాలలో పయనించడానికి కారణాలను చెబుతూ ఇలా అంటాడు...

**"పరువంబు, కలిమి, దొరతన,**
**మరయమి యనునట్టి వీనియం దొకఁడొకఁడే**
**పొరయించు ననర్థము నాఁ**
**బరఁగినచో నాల్గుఁ జెప్పవలయునె చెపుమా" (సంపూర్ణ నీతిచంద్రిక14)**

యౌవనం, సంపద, అధికారం (ప్రభుత్వం), అవివేకం అనే నాల్గింటిలో ఒక్కటొక్కటే కీడును కలిగించుననగా, ఆ నాలుగూ ఉంటే తప్పక కీడు కలుగునని వేరేగా చెప్పవలయునా చెప్పనక్కరలేదనని అర్థం. ఇలాంటి కారణాలతో దుర్యోధనుడు నాశనమయ్యాడు.

**బౌద్ధమతం – ధృతరాష్ట్రుడు**

బౌద్ధమతంలో నలుగురు దిక్పాలకులలో ధృతరాష్ట్రుని పూర్వదిక్కుకు అధిపతిగా పేర్కొంటారు. ధృతరాష్ట్రుడు సహజంగా దుర్మార్గుడేమీ కాదు. విదురుడు చెప్పే మంచి మాటలు శ్రద్ధాసక్తులతో వినేవాడు. కారణం ఆయనలోని గుణగణాలని చెప్పుకోవచ్చు.

**ఆధారగ్రంథాలు**

1. చిన్నయ సూరి, పరవస్తు వీరేశలింగం, కందుకూరి. 2003. సంపూర్ణ నీతిచంద్రిక. రోహిణి పబ్లికేషన్స్, రాజమండ్రి

2. శ్రీనివాసరావు, వేమూరి. 2010. పూర్వగాథాలహరి. వేంకట్రామ అండ్ కో, ఏలూరు

3. సుబ్రహ్మణ్యం, జి.వి.(సం.) 2009. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము. తి. తి. దే., తిరుపతి

4. జగదీశ కశ్యప్. 1979. సూత్రపిటక్కా దీఘ్ నికాయ్. భారతీయ బౌద్ధ శిక్షా పరిషత్, లక్నో

5. వేద వ్యాసుడు, సంస్కృత మహాభారతమ్.

6. *Apte, Vaman Shivaram (1957). A practical Sianskrit-English Dictionary. Poona: Prasad Prakashan.*

# 6. విదురనీతి-విశ్వగీతి

– డా॥ శ్రీదేవీ శ్రీకాంత్, క్లినికల్ సైకాలజిస్ట్, బోట్స్వానా

నిజమైన బలం నిశ్చలమైన ధర్మంలో ఉంది. అదే మన మార్గదర్శి. అదే మన విజయం.

(విదురుడు)

**ఉపోద్ఘాతం**

భారతదేశం సనాతన ధర్మానికి పుట్టినిల్లు. మన పవిత్ర ఇతిహాసం మహాభారతము దేశ ప్రజలకు సురభి వంటిది. మానవజీవితము, సమాజము ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా మనగలిగేట్లు చేయగలిగే సర్వోత్తమ గ్రంథం పంచమ వేదమయిన మహాభారతం. ఇంతటి పవిత్ర గ్రంథములో అత్యంత తెలివైన, నిబద్ధత గల వ్యక్తిత్వం వున్న మహామనీషి విదురుడు. ఏ సమాజం లో నైనా రాజు లేదా వ్యక్తి ఉన్నత మనస్తత్వం కలిగి , సకల సద్గుణ పారంగతునిగా గుర్తింపు పొందాలి అంటే విదురనీతిని ఆదర్శంగా తీసుకోని తనను తాను ఉన్నతునిగా మలచుకోవాలి. పాలకుల వ్యక్తిత్వం లో పరిపూర్ణత, నైతిక విలువలు, పాలనాసామర్థ్యం, కల్పనా శక్తి మొదలైన మంచి విలువలు అనేవి ఆదర్శ సమాజ రూపకల్పనకు తోడ్పడతాయి. విదురుని ధర్మనిరతి, తెలివి తేటలు, యుక్తాయుక్త విచక్షణ లకు సంబంధించిన గుణపాఠాలు – క్లిష్ట సమస్యలను ఎదుర్కొని చిత్త శుద్ధితో, దృఢ సంకల్పం తో నీతి వర్తనులుగా మనగలగడానికి చక్కని మార్గగాములు. విదురుని సందేశాలు చాలా సూక్ష్మ ధర్మ సిద్ధాంత సూత్రాలతో నీతి తో కూడి ఆచరించ తగిన జ్ఞానబోధలు.

**విదురుని జననం**

అంబిక వ్యాసుని వద్దకు రెండవ సారి తాను వెళ్లకుండా, తన పరిచారికను అలంకరించి పంపుతుంది. పరిచారిక వ్యాసుడి రూపాన్ని చూసి భీతి చెందదు. ఆ పరిచారికకు, వ్యాసునికి పుట్టినవాడు విదురుడు. వ్యాసమహర్షికి దేవర న్యాయం వల్ల పుట్టినవాడు విదురుడు. పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ కాబట్టి తండ్రి వంశము కుమారునికి సంక్రమిస్తుంది. దాసి వ్యాసుని మనస్ఫూర్తిగా స్వీకరించింది. మానసికశాస్త్రం ప్రకారం ఏకార్యమైనా ఆనందంతో తలపెట్టినప్పుడు అది సత్ఫలితాలను ఇస్తుంది. సమతౌల్య ఆనంద హార్మోనులకు అంతటి మహత్తు ఉంది. విదురుని జన్మం వెనుక ఉన్న మరొక గొప్ప విషయం – ధర్మం,సత్యం, నీతులకు మారు పేరు అయిన యమధర్మరాజే బ్రహ్మర్షి మాండవ్య మహాముని శాపం వల్లవిదురునిగా పుట్టాడు. పూర్వజన్మ వాసన తప్పక ఉంటుంది. జన్మ గొప్పతనం అనీది విదురుని వ్యాయక్తిత్వ వికాసంలో ఎంతగానో తోడ్పడింది.

**గుణగణాలు**

శ్రీమహాభారతంలో ప్రసిద్ధి చెందిన మహావీరులలో విదురుడు చెప్పుకోతగినవాడు. విదురుడు బాహు బలములో భీష్మునితో, విలువిద్యలో ద్రోణాచార్యులతో, ధర్మగుణంలో ధర్మరాజుతో, దైవభక్తికి ప్రహ్లాదాదులతో, జ్ఞానమున వ్యాసాదిఋషులతో సరి సమానుడు. సాధుస్వభావము గలవాఁడు.

న్యాయమార్గాన్ని ఆచరించేవాడు. సజ్జనప్రియుఁడు. పెద్దలయందు అధికారముగలవాఁడు. ధర్మనిర్ణయము చెయ్యడంలో మోమాట పడకుండా ధర్మాన్ని చక్కగా వివరించేవాడు. మిక్కిలి దూరాలోచనపరుఁడు. నిర్భయంతో ఇతరులకు మంచి చెడులనుపదేశించేవాడు. ఇలాంటి ఉత్తమ చరిత్రమున్న విదురుడు అందరికీ ఆదర్శ ప్రాయుడు అనడంలో అతిశయోక్తి లేదు.

పంచమవేదమని ప్రసిద్ధి పొందిన మహాభారతంలో విదురుని చరిత్ర ను కవిత్రయ భారతంలో వర్ణించిన తీరు విదురుని వ్యక్తిత్వం పట్ల ప్రతి ఒక్కరినీ ఆకర్షితులను చేస్తుంది. విదురునకు (ESP)... జరగబోయే సంఘటనలను చూడగల శక్తి ఉంది. కులవృద్ధుడు అయిన భీష్మాచార్యులకు కార్యాలోచనము చెప్పేవాడు.విదురుని ఈ గుణగణాలు ఈ తరం వారు తెలుసుకోవాలి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమయ్యి ఎవరికి వారు ఒక చిన్న కుటుంబాన్ని ఏర్పరచుకుని బ్రతుకుతున్న ఈరోజుల్లో విదురుని గుణగణాలను బోధించి భావి భారత దేశానికి ఉత్తమ పౌరులను తల్లి దండ్రులు, గురువులు ఇవ్వగలరు.విదుర నీతి ని అర్ధంచేసుకుని ఆచరిస్తూ పెరిగే పిల్లలు ఆరోగ్యకరమైన సమాజ వికాసానికి తోడ్పడగలరు.

## గృహస్థాశ్రమం

విదురుడు, దేవకుని కుమార్తె పారసవి అనే ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె సుమనోహరి, లలితభాషి, కౌశల శోభిత, మృదు మనస్విని, ,సుగుణరాసి. విదురునికి తగిన ఇల్లాలు. వీరిరువురి అనురాగ దాంపత్యం పండి అనసవ, అనుకేతు అనే ఇద్దరు కుమారులను పొందారు. వారిని ధర్మ వర్తనులుగా తీర్చి దిద్దారు. తల్లి దండ్రుల మధ్య అన్యోన్యత, పరస్పర అనురాగం, సహకారం, నమ్మకం కరువయితే పిల్లలు అసమర్థులుగా వ్యసన పరులుగా మారతారు. ఈ దంపతుల అన్యోన్య దాంపత్యం– పిల్లల పెంపకము– రోజురోజుకూ విచ్ఛిన్న మవుతున్న ఈనాటి కుటుంబ వ్యవస్థకు ఆదర్శం కాగలదు అనడంలో సందేహం లేదు.

## విదురుని నిర్భయత్వము

పుత్రుడు కలిగిన సంతోషంతో ధృతరాష్ట్రుడు పొంగి పోతున్న సంధర్భంలో – విదురుడు దుర్యోధనుని వల్ల రాబోయే అనర్థాలను దివ్యదృష్టి తో చూసి, "ఈ పుత్ర జననానికి ఆనందిస్తున్నావు కానీ, ఈ పిల్లవాడు పుట్టిన జననకాలాన్ని బట్టి ఈ వంశానికే కాక, లోకానికి కూడా అపాయం వాటిల్లుతుంది. ఇతన్ని త్యజించడం వల్ల మన వంశాన్ని, లోకాన్ని, ప్రజలను రక్షించిన వాడివి అవుతావు" అని లోక క్షేమాన్ని ఆకాంక్షించిన విదురుడు, ధృతరాష్ట్రునితో నిర్భయంగా చెప్పాడు.

ఈ కాలలంలో దివ్య దృష్టి తో చెప్పేవాళ్ళు మనకు లేరు. కానీ పిల్లలు పెరుగుతున్నప్పుడు వారి వ్యక్తిత్వం ముఖ్యంగా తల్లికి తెలుస్తుంది. సంఘవిద్రోహక మనస్తత్వం ఉన్న పిల్లవాడ్ని త్యజిస్తే సమాజాన్ని నాశనం చేసే హిట్లర్లు పుట్టరు.మహాభారతం లో ఆ తరువాత జరిగిన గాథను బట్టి విదురుని దూరదర్శక త పాటు కర్తవ్యాను రక్తి, ప్రజారక్షణాసక్తి, విదితమగుతున్నాయి. ఈనాటి యువతరం మహాభారతం చదివి ఆకళింపు చేసుకోవాలి.

నిశ్చల మనస్కులు కాగలగాలి.

## ధృతరాష్ట్రుని మంత్రిగా విదురుడు

హితోపదేశము, దూరదృష్టి, కార్యాలోచనము, రాజభక్తి, న్యాయాన్యాయ పరిశీలన మొదలైన ఉత్తమ గుణాలతో ధృతరాష్ట్రునికి గొప్ప మంత్రిగా విదురుడు భాసిల్లాడుఅనడం లో సందేహం లేదు. మంత్రి ఎంత గొప్పవాడు అయినా రాజు స్వార్థపరుడు అయితే ఆ రాజ్యం పతనం కాక తప్పదు. ఎంతమంది నిష్ణాతులు జ్ఞాన సంపన్నులు అయిన ఐఏఎస్,ఐపిఎస్,ఐఆర్ఎస్ అధికారులు, ఇతర నీటి గల మంత్రులు ఉన్నా రాజు నిరంకుశుడు, కేవలం తన, తనకుటుంబం వారి క్షేమాన్ని మాత్రమే కాంక్షిస్తే ఆ రాజ్యం పతనమవుతుంది అనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

## పాండవులతో విదురుడు

ఉత్తములను సత్పురుషులు ఆదరిస్తారు. విదురుని పాండవ పక్షపాతి అనడం పొరపాటు. ఆ పక్షపాతము అనేది

సద్గుణ జన్యం. పాండవుల తేజస్సు, సద్గుణాలు విదురుని ఆకర్షించాయి. దుర్యోధనుడు పాండవులను లక్క ఇంట్లో దహింప చేయాలి అనుకున్నప్పుడు ఆ విషయం తెలిసిన విదురుడు పాండవులను రక్షించాడు. విదురుడు ఉత్తమ పురుషుడు అవ్వడంవల్ల సాధుశీలురు అయిన పాండవులను దుష్టాత్ములయిన దుర్యోధనాదుల నుండి కాపాడ గలిగినాడు.

**ద్రౌపది వస్త్రాపహరణం**

దుర్యోధనుని ఆజ్ఞ మేరకు దుశ్శాసనుడు నిండుసభలో ద్రౌపదిని వివస్త్రను చేస్తున్న సంధర్భంలో "ఇది ఘోరాతి ఘోర చర్య. అధర్మం. మీరు చేసిన ఈ పాపానికి వంశనాశనం కలుగుతుంది" అంటాడు విదురుడు. మహాత్ముల మాటలుఊరికే పోవు. ఈనాటి సమాజంలో ఇలాంటి చర్యలకు పాలుపడుతున్న ఎందరో దుష్టులకు విదురుని మాటలు కనువిప్పు కాక తప్పవు. బాల్యం నుండే విదురనీతిని చెబుతూ బువ్వ తినిపించే అమ్మ ఆప్యాయతతో పెరిగిన పిల్లలు ఉత్తమ పౌరులుగా సమాజశ్రేయస్సును కాంక్షించే వారు అవుతారు అనడంలో సంశయములేదు.

**ధృతరాష్ట్రుడు**

దృతరాష్ట్రుడు విదురుని మాటలలో దాగిన అర్థాన్ని, సత్యాన్ని రాబోయే అనర్థాలను తెలుసుకుంటాడు. దుర్యోధన, దుశ్శాసనులు మయసభలో పాడవులను అవమానించిన తీరుకు పాండవులలో ప్రతి ఒక్కరూ ఏ ఏ విధంగా కలత చెందారో అలాగే ద్రౌపది దీర్ఘకేశాలలో ముఖాన్ని కప్పుకుని శోకభారంతో వెళ్లిందో చెప్పినప్పుడు అంతా విన్న ధృతరాష్ట్రుని మనసు కలచివేస్తుంది. "ధర్మపరులైన పాండవులను హింసించరాదని విదురుడు చెప్పినా పుత్రవాత్సల్యంతో నేను వినలేదు విదురుడు మహాజ్ఞాని" అంటూ సంజయుని వద్ద వాపోవడంలో అతని మాటల్లో విదురుని ధర్మనిరతి, జ్ఞానం పట్ల గల నమ్మకం విధితమవుతుంది. ధర్మాత్ముల బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకత్వాలు. యే సమాజం అయినా ఆచరించ తగిన ఆనంద బాటలు.

**శకుని**

"పరాధనానికి ఆశపడ వద్దు రాజా!" అని విదురుడు దృతరాష్ట్రుని తో చెబుతూ "శకుని సాంగత్యం వల్ల అధర్ములు మరింత అధర్మ కార్యకలాపాలలో పాల్గొంటారు." అని విదురుడు హితబోధ చేస్తాడు. స్వార్ధ పరులు, కక్ష్య సాధింపు చర్య, కుట్ర మనస్కులు, ఎదుటి వారి పత్యనాన్ని కోరేవారితో స్నేహం వినాశనానికి హేతువు అనే విదురుని వాక్యాలు యావత్తు విశ్వానికి గుణపాటాలు. ఈనాడు వ్యక్తులు విశ్వ వ్యాపకులు.

దుర్జన సాంగత్యం ఎంతకీ తగినది కాదు. విశ్వ ఉన్నతికి విద్రోహక మూకలతో మైత్రి మంచిది కాదు. విశ్వ వినాశనానికి హేతువు.

**విదురనీతి**

వ్యాస మహర్షి విరచిత మహాభారతంలో ఉద్యోగపర్వంలో ప్రజాగర పర్వం అనే పర్వం ఉన్నది. జాగర అంటే మేలుకొని ఉండడడం. ప్ర-జాగర అంటే మనోవేదన వలన ఎంతకూ నిద్రపట్టక పోగా నానా విధాలా బాధపడుతూ మేలుకొని ఉండడం అని అర్థం. సంజయరాయభారము విఫలమైన వార్తను సంజయుని వలన విన్న ధృతరాష్ట్రుడు భయకంపితుడై, బాధా తప్త హృదయుడై మంత్రి విదురుని తన వద్దకు పిలుస్తాడు.

ఆ సంధర్భంలో విదురుడు ధృతరాష్ట్రునికి ధర్మోపదేశం చేస్తాడు - ఈ ఉపదేశమే విదుర నీతిగా ఖ్యాతిని పొందింది. ఇప్పటికీ ఎందరో వ్యక్తిత్వాలను తీర్చి దిద్దడం లో ఆచరణ యోగ్యం అవుతూ వస్తున్నది ఈ విదురనీతి. విదురనీతి ధర్మ నిరతి గల సమాజానికి ఆదర్శము. ఆచరణీయము.

ధృతరాష్ట్రుడు విదురుని పిలిచి “విదురా! నాకు నిద్ర పట్టడం లేదు. నాకు ఉపశమనం కలిగేట్లు గా ఏవైనా నీతి వాక్యములు చెప్పు. నీ బోధలు అమృతతుల్యాలు నాకు ” అని అడిగే వరకూ ఆగాడు విదురుడు. ఈ విదుర నీతికి శ్రోత దృతరాష్ట్రుడు. విదురుడు ఎన్నో గొప్ప నీతి సూత్రాలను చెప్పడం మొదలుపెట్టాడు.

“ఆహ్వానం లేకుండా వెళ్ళేవారు, అడగని వానికి హితోక్తులు చెప్పేవారు, నమ్మతగని వ్యక్తిని నమ్మేవారు, నిద్రపట్టని వారు వీరు నరాధములు.ఎవని అనుగ్రహము, ఆగ్రహము రెండూ నిష్ప్రయోజనాలో అటువంటి రాజును ప్రజలు గౌరవించరు. ఇందులో నిగూఢ అర్థం ఉంది. ఈ వాక్యం నేరుగా ధృతరాష్ట్రునికే తగిలింది. పాపాన్ని చేసేది ఒక్కడే అయినా దాని ఫలితాన్ని అనేకమంది అనుభవిస్తారు. సత్ప్రవర్తన లేని వారివలన వలన వంశం నశించిపోయే ప్రమాదం ఉంది అని పుట్టినప్పుడే ధుర్యోధణుణ్ణి త్యజించమని నీకు చెప్పాను” అంటాడు.

సందర్భవశాత్తుగా కర్తవ్యాకర్తవ్యాలు, సామదానాది చతుర్విధోపాయాలు, సత్యాది షడ్గుణాలు, సప్త వ్యసనాలు, మూర? పండిత సన్మిత్ర లక్షణాలు, శుభాశుభ కర్మలు, వర్జ్య విషయాలు, శోక ఆనంద విషయాలు, రాజధర్మాలు రాజ్యపాలనా విధానం, రహస్య ఆలోచన చేయవలసిన విధానం, జితేంద్రియత్వం ఇలా అనేక సాంఘిక, ఆర్థిక, రాజకీయ, నైతిక విషయాలను విదురనీతిలో ఎంతో విపులంగా కవిత్రయ భారతంలో చూస్తాము. ధృతరాష్ట్రుడు విదురుడు చెప్పే నీతి వాక్యాలను ఎంతో బుద్ధిగా వింటాడు. “విదురా!నీవు పలికిన పలుకులన్నీ ప్రాజ్ఞులైన వారికి సమ్మతాలే” అనడంలో వాస్తవం లేకపోలేదు. “కానీ, నేను నా కుమారులను వదులుకోలేను. ధర్మం ఏ పక్షాన ఉంటుందో, ఆ పక్షంలోనే విజయం ఉంటుంది” అనడంలో ధర్మనిరతులైన పాండవులకు వున్న దీవెన ద్యోతకం అవడమే కాక ధృతరరాష్ట్రుని మనస్సులో కూడా ధర్మం పట్ల ఉన్న గౌరవం విధితమవుతుంది.

## ధర్మం

“ధర్మ వర్తనులైన మనుషులు ఉన్న సమాజం ఎంతో ఆదర్శ వంతమైనదని నైతికవిలువలు- వ్యక్తి శ్రేయస్సుకే కాకుండా సమాజ పురోభివృద్ధికి అన్నివిధాలా ఆచరించాల్సిన మూల సూత్రాలు” అని విదురుడు అనేక సందర్భాల్లో మహాభారతం లో చెప్పాడు. కాలం ఏదైనా ఆదర్శ సమాజానికి ధర్మం ఎంతో అవసరం. ముఖ్యంగా ధర్మము నాలుగు పాదాలా లేని కలియుగానికి విదురనీతిలోని లోతులను, వాటివల్ల కలిగే మంచి ఫలితాలు తెలుసుకోవడం ఎంతో అవసరం.

## విధి నిర్వహణ, బాధ్యత

“ప్రతి వ్యక్తి చక్కని ప్రణాళికతో తన విధులను పాటిస్తూ ఇతరులకు ఆదర్శ పాత్రుడు అవ్వాలి. అప్పుడే సమాజ వికాసము కలుగుతుంది” అని విదురుడు దృతరాష్ట్రునికి బోధించిన సత్యం ఈనాటి సమాజ వికాసానికి తోడ్పడుతుంది.

## జ్ఞానం, వివేచన

విధి నిర్వహణలో ప్రతి విష యాన్ని ఆమూలాగ్రం ఆకళింపు చేసుకుని, పరిపూర్ణ జ్ఞానాన్ని కలిగి ఉండడమే కాకుండా, మంచి చెడుల విచక్షణను గ్రహించి మెలగగలిగే జ్ఞానం రాజుకు అవసరం. రాజుకు స్వపర బేధాలు ఉండకూడదని విదురుడు చెప్పిన నీతి సూత్రాలను ఈనాటి పాలకులు అక్షరాలా అనుసరించాలి.

## నిర్లిప్తత

“కార్య సాధన చెయ్యాలి. ఫలితాలను ముందే ఆశించ కూడదు. నిబద్ధతతో చేసే ఏపనైనా సత్ఫలితాలను ఇస్తుంది. నిర్లిప్తత వహించి కార్యదీక్ష చేయగలిగితే దాని ఫలాలు అనంతాలు.పనిచేయకుండా ఫలితాలను ఆశించడం దుఃఖ హేతువు” అంటాడు విదురుడు.

**న్యాయం, నిష్కల్మషమైన మనస్సు**

"అంతః కరణ శుద్ధితో, నిష్కల్మష మైన మనస్సుతో న్యాయంగా వర్తించడంలో ధనికులు, నిర్భాగ్యులు అనే తేడా లేదు. మానవులంతా సమానులే. కార్య సాధనలో న్యాయ, నిష్కల్మష వ్యక్తిత్వానికి ఎంతో విలువ ఉంది" అనే విదురుని వాక్కులు అమృతతుల్యాలు.

**పనిలో – నీతి నియాలు**

"నిత్యం చేసే పనులు పూర్తిగా నీతి నియమాలకు కట్టుబడి, పూర్తి బాధ్యతతో నిర్వహించినప్పుడు దాని ఫలితాలు కేవలము ప్రస్తుతానికి మాత్రమే పరిమితం కాకుండా, ఫలశాఖలు తరతరాలకు విస్తృతం గా వ్యాపిస్తాయి. కనుక ఏదైనా కార్యం తలపెట్టినప్పుడు అంకిత భావంతో చేయాలి. అప్పుడే పరిపూర్ణతను సాధించ గలుగుతారు."

**నాయకత్వ లక్షణాలు**

"ఎల్లవేళలా ఆశావాద దృక్పథం కలిగివుండాలి. తన బృందంలోని సభ్యుల ప్రతిభను గుర్తించగలగాలి.వ్యక్తిలోని బలాలు బలహీనతలపై స్పష్టమైన అవగాహన కలిగివుండాలి. నిపుణతతో, ప్రభుత్వాన్ని జనరంజకంగా నడపగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. నిర్ణయాల అమలులో నీతికి ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే తన అనుయాయుల మంచిని కాంక్షించాలి."

**సాంఘిక న్యాయం**

"సమస్త మానవాళి పట్ల భూతదయ కలిగి అందరినీ సమదృష్టితో చూడ గలగాలి. సాంఘిక న్యాయం, సమానత్వం కోసం ప్రభుత్వం పనిచేయాలి. సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఇవి ప్రజల చక్కని భవిష్యత్తుకు పునాదులు.సామాజిక న్యాయం లేనిదే సాంఘిక ప్రగతి సాధ్యపడదు. సర్వజన సమానత్వం, మానవ హక్కుల రక్షణ రాజు బాధ్యతలు. అదే విధంగా ప్రజలను కూడా ఆ దిశగా చైతన్య వంతులను చేయాలి."

**పర్యావరణ పరిరక్షణ**

"మనం మన పర్యావరణ పరిరక్షణకు అమిత శ్రద్ధ వహించాలి. పర్యావరణం అనే పదం చాలా విస్తృత అర్థం కలిగింది. దాని ఫలితం కూడా అనంతమైనది. ఏరాజు అయితే తన పర్యావరణ పరిరక్షణ పట్ల అమిత శ్రద్ధ వహిస్తాడో ఆ రాజ్యం ఎన్నో విధాలా సుభిక్షంగా మనగలుగుతుంది. ఆ రాజ్యం గంగిగోవులా పవిత్రమైనది అవుతుంది. ప్రతికూలతలను అన్నింటినీ తొలగించి ఆరోగ్యమైన దేశంగా మనగలుగుతుంది."

**జూదం, చెడు వ్యసనాలు**

"అతిసర్వత్రా వర్జయేత్" అన్నారు. "ఏదైనా కొంతవరకు ఆనందాన్ని ఇస్తుంది. అదే వ్యసనంగా మారితే మనిషి పతనానికి దారి తీస్తుంది" అనడానికి మహాభారతంలో మాయా జూదం ఉదాహరణ.

**ఇతరుల సంపద**

"పరులసొమ్మును కాంక్షిస్తే పతనం తథ్యం" అంటాడు విదురుడు. పాండవుల రాజ్యాన్ని తిరిగి ఇవ్వవలసిందిగా చాకచక్యమైన న్యాయ వచనాలచే ఎన్నోసార్లు చెప్పాడు విదురుడు. పాండవుల వనవాసానికి ముందు కౌరవులతో ఎన్నో సంప్రదింపులు చేస్తాడు. కౌరవులకు మహాభారతంలో ఆదినుండి అంతమవరకు అధర్మ సంపద వల్ల వాటిల్లే భావి దుష్పరిణామాలను నొక్కి చెప్పాడు.

**కురుక్షేత్ర యుద్ధం**

విదురుడు యుద్ధం నివారించడానికి శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. సమాజ శ్రేయస్సును ఆశించేవారు ఒకటి రెండు సార్లు చెప్పి వదిలివేయరు. తమ వల్ల కాక పోతే మరో విధంగానైనా ప్రయత్నిస్తారు అనడానికి నిదర్శనం విధురుడు భీష్మునితో కూడా యుద్ధం వద్దని కౌరవులకు చెప్పిస్తాడు.

**విందు**

శ్రీ కృష్ణునికి దుర్యోధనుడు విందు ఏర్పాటు చేసినా విదురుని ఇంటికి విందుకు వెళతాడు. భగవంతుడు ధర్మాత్ముల ఆతిధ్యయాన్నే స్వీకరిస్తాడు.

**కుంతీ విలాపం**

"శ్రీకృష్ణా! నా ప్రాణంలో ప్రాణమైన ద్రౌపదిని నిండుసభలో పరాభవించినప్పుడు సభలో అందరూ కిమ్మనలేదు. విదురుడు మాత్రం ఈ చర్య అధర్మము అని నొక్కి వక్కాణించాడు" అని విదురుని ధర్మ నిరతిని పొగుడుతుంది కుంతి. కుంతీదేవి తన కోడలు ద్రౌపదిని, ప్రాణంలో ప్రాణం అనడంలో అత్తాకోడళ్ళ అన్యోన్యత ద్యోతక మవుతుంది. ఈనాటి సమాజంలో చాలా మంది కోడళ్ళు తమ తల్లి దండ్రులకు మాత్రమే విలువనిస్తూ అతహా మామలను, భర్త ఇంటివారిని, వారి బంధువర్గాన్ని దూరం పెడుతున్నారు. ఇది నిజానికి కుంచితత్వమే. సమాజ మనుగడకు అవరోధం.

**సంధి**

"యుద్ధం కంటే సంధి అన్ని విధాలా అందరికీ శ్రేయస్కరం రాజా!అలాగే కృష్ణుడు మీ వద్దకు సత్కారాలు పొందాలి అని రావడం లేదు. సత్కారాల కంటే యుద్ధం ఆపి ఇరుపక్షాల మధ్య సంధి కుదర్చడం ఎంతో శ్రేయస్కరం" అంటూ సంధి వల్ల కలిగే ప్రయోజనాలు చెబుతాడు.

**విదురనీతి – సందేశాలు**

ఈర్ష్య: ఇతరుల సంపదలను, విద్యా యోగ్యతలను, కీర్తి ప్రతిష్టలను, ఆరోగ్యాన్ని, బలాన్నిచూచి ఓర్వలేని వారు రోగపీడితులవలే బాధ పడతారు.

మాటలు: మన మాటలు మాధుర్య సుధారసభరితాలు కావాలి. వినేవారికి ఇంపుగా హితంగా ప్రియంగా ఉండాలి. ఇలా ఉండడం చేతకాకపోతే మౌనం మంచిది. ప్రియ వాక్కులు బాణ మొనకన్నా పదునైనవి. ఎదుటి వారి హృదయాన్ని గాయపరుస్తాయి.

కార్యములు: పుణ్యకార్యములు చేయడం, ధర్మ మార్గం లో నడవడం ఈ రెండింటిలో ధర్మ మార్గమే చాలా గొప్పది అని వేదాలు చెప్పాయి. ధర్మ మార్గాలను అవలంభించే వారి కీర్తి ఆచందరార్కం ఉంటుంది. అలా అవలంభించేవారు ఇహ పర లోకాల్లో సుఖాన్ని పొందుతారు.

సభ: ఉత్తములు లేని సభ సభ కాదు. ధర్మ నిర్ణయం చేయ లేని వారు ఉత్తములు కారు. సత్యం లేని ధర్మం ధర్మం కాదు.

స్త్రీ: స్త్రీ గృహానికి లక్ష్మి. సౌభాగ్య శీల. ఇంటికి అలంకారం స్త్రీ. స్త్రీలను గౌరవించాలి. అదే విధంగా కుటుంబ, వంశ దేశ రక్షణాలకు స్త్రీ క్షేత్రం.

పంచమవేదమైన మహాభారతం సమస్త విశ్వ జనులకు మార్గదర్శి. సర్వకాలికమైనది. మన జీవితాలను, సమాజాన్ని, ప్రపంచాన్ని క్రమబద్ధం చేసే నీతి బోధిని. మానసిక శాస్త్రం, రాజనీతి, ధర్మం, అహింసా, నీతి , న్యాయం, ఓర్పు, నేర్పు, తీర్పు, మార్పు, కూర్పు, దర్శన, ఆలోచన, పరిష్కారం, ఇలా ఎన్నో విషయాల సమాహారం. పందెం, జూదం, ఈర్ష్య,

అసూయ, అత్యాశ, అహంకారం, అధర్మ, అన్యాయం, మనిషిని ఏవిధంగా పతనం చేస్తాయో చెప్పే సమగ్ర సారాంశం. స్త్రీ వ్యామోహం, నింద,అసమానతలు, కలహం, కుట్ర, ప్రతికూల మనసు చర్యల పర్యవసానం ఇవన్నీ దుఃఖాన్ని కలిగించి మనిషి జీవితాన్ని అంధకారబంధురం చేస్తాయి అని చెప్పే నీతి గ్రంథం.

బంధు ప్రీతి, అన్నదమ్ముల ఐక్యత, తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గురువు పట్ల భక్తి ప్రపత్తులు భగవంతుని పాదాలయందు ఏకాగ్రత తో కూడిన నమ్మకం, భక్తి కలిగి వున్న జీవితాలకు సమాధానం ఆనందం అని చెప్పే అమృత సుధామయాక్షర సత్యదీపిక.

జీవితాన్ని నందనవనం చేసుకోవడంలో మనం ఆచరించవలసిన మధురాక్షర నీతి ఔషధం ఈకాలం లో ప్రతి సమస్యకు పరిష్కార మార్గం విధురనీతి. మనపై మనకు అపార నమ్మకాన్ని కలిగిస్తుంది. మనిషి గెలుపుకు బద్ధ శత్రువు భయం.

మనిషి వినాశనానికి దారి తీసేది అధర్మం. మనిషి విజయానికి సాధనం నీతి.

ఇతరుల ధనమును ఆశించిన రాజు పతననొందుతాడు అనే విదుర నీతి ఈనాటి పాలకులు అవలోకించి ఆచరించతగినది. సమర్ధులైన వారికి సింహాసనాన్ని ఇవ్వాలి. అసమర్ధులైన పుత్రులకు రాజ్యాలక్ష్మిని అప్పగించడంవల్ల వంశం, రాజ్యం, ప్రజలు ఎన్నో తరాలు నష్టపోతాయి అని విదురసూక్తి ఈనాటి పాలకులు అక్షరాలా అనుసరించాల్సిన సత్యం. కోపము, అధిక సంతోషం, గర్వం, అసంతృప్తి, దురభిమానం, అధిక సంతానం, స్వార్ధం దుర్గుణాలు.

విదురుడు ధర్మజ్ఞుడు, ధర్మకోవిదుడు, సౌజన్యనిధి, మహాబుద్ధి మంతుడు, అధీనసత్వుడు. విదురుడు ధృతరాష్ట్రుని కేవలం నిమిత్త మాత్రమైన శ్రోతగా చేసుకొని సమస్త మానవాళి అన్ని కాలాలలో ఆచరించవలసిన గొప్ప నీతి ప్రవచనం చేశాడు. ఈ విదుర నీతి సార్వకాలికమైనది. సార్వజనీనమైనది. కవిత్రయం మనకు అందించిన మహత్తర నిధి. అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి– జ్ఞాన తేజస్సును ప్రసాదించే ఉన్నతుడు విదురుడు. విదురుడు విశ్వ గురువు. విదుర నీతి విశ్వ గీతి.

**ఆధారగ్రంథాలు**

1. ఆధ్యాత్మిక సుధ – డా. పోలేపెద్ది రాధాకృష్ణ మూర్తి గారు
2. విదురుని ఉపదేశాలు – కేతవరపు వేంకటశాస్త్రి గారు

# 7. అనుశాసనిక పర్వం - ఆధునిక సమాజం

- డా॥ పాండురంగం కాళియప్ప, చెన్నై

**పరిచయం**

భారతదేశ చరిత్రలో మహాభారత ఘటన ఒక మహత్తర ఘటన. భారతీయ సాంస్కృతిక సాహిత్యంలో మహాభారత రచన ఒక మహారచన. అన్ని ఐతిహాసిక ఘటనలలాగే మహాభారతం కూడా ఒక ఐతిహాసిక ఘటన. సాహసోపేతమైన అదొక యుద్ధ ఘటన. ప్రాణాన్ని తెగించి సలిపిన అదొక సమర సంఘటన. అందులో అమానుషమైన దైవమహత్తులు మరేమీ లేవు. మహాభారత ఘటనకంటే ఎక్కువ వైశిష్ట్యం గలది మహాభారత రచన. మహాభారత యుద్ధం ముగిసిన తరువాత ఎంతకాలానికి మహాభారతం వేదవ్యాసుడనే రచయిత చేత రచించబడినదో కచ్చితంగా తెలియదు. దాని మాతృక మాత్రం సంస్కృతం. తరువాతి తరువాతి కాలంల్లో ఆ సంస్కృత మాతృకను ఆధారంగా తీసుకొని దేశభాషల్లో స్వతంత్ర అనువాదాలు బయలుదేరాయి. వాటిలోదే తెలుగులో కవిత్రయం వారి ఆంధ్ర మహాభారతం. నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడ ముగ్గురు చేసిన స్వతంత్ర అనువాదం అది.

మహాభారతం ఒక పురాతన భారతీయ ఇతిహాసం, ఇక్కడ ప్రధాన కథ రెండు కుటుంబాల చుట్టూ తిరుగుతుంది – పాండవులు మరియు కౌరవులు – కురుక్షేత్ర యుద్ధంలో, హస్తినాపుర సింహాసనం కోసం యుద్ధం చేస్తారు. ఈ కథనంలో ముడిపడివున్న వ్యక్తులు చనిపోయిన లేదా జీవించే వ్యక్తుల గురించి అనేక చిన్న కథలు మరియు తాత్త్విక ఉపన్యాసాలు. అందులో ఆనుశాసనిక పర్వంలోని విశేషాలు ఆధునిక సమాజానికి అనువర్తనం చేయదగ్గ ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. వాటి గురించి విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశం.

**ఆనుశాసనికపర్వం – పరిచయం**

తిక్కన మహాభారత రచనను ప్రధానంగా ఆనాటి కాల పరిస్థితులకు అనుగుణంగా రచించాడు. హరిహరనాథాంకితంగా తాను రచించిన భారత సంహితలోని ప్రతి పర్వంలో భేదం లేని భక్తితో శివకేశవులను స్తుతించాడు. ఇలా రచించడం వలన ప్రజలకు ఇహపరసౌఖ్యవిధాయకుడని చెప్పినట్లైనది. ఇలా ఆనుశాసనిక పర్వంలో సైతం తన మార్గాన్ని సుస్పష్టం చేశాడు. ఆనుశాసనిక పర్వము, మహాభారతంలోని 13వ భాగం. ఇందులో మొత్తం ఐదు ఆశ్వాసాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా వర్ణాశ్రమ ధర్మాలు, రాజు గొప్పతనం, జీవాత్మ స్త్రీ పురుషులు, పుణ్యములు, ధర్మములు, యోగము, పూజార్హులు మొదలైన అనేక విషయాలు ఉన్నాయి.

కురుక్షేత్రంలో మహాయుద్ధం ముగిసిన తర్వాత మహాజ్ఞాన యజ్ఞం మొదలయింది. దేవర్షులు, మహర్షులు, మహీపతులు, మేధావులు, జిజ్ఞాసువులు అసంఖ్యాకంగా చేరి శాంతనవుడు ప్రబోధించే ప్రజ్ఞాపూర్వక వాక్యాలను వాఙ్మయ వేదాలుగా వింటున్నారు. అందులో భీష్ముడు యుధిష్ఠిరునకు చేసిన చివరి ఉపదేశాలు (అనుశాసనాలు) ఈ పర్వంలోని ప్రధాన ఇతివృత్తం. వ్యాస పరిధి దృష్ట్యా ఇందులో కొన్ని విషయాలను మాత్రమే స్వీకరించడం జరిగింది. అందులోని ప్రధానమైన విషయాలు.

**ఆనుశాసనికపర్వం – వర్ణాశ్రమ ధర్మాలు**

పార్వతీదేవి మహాశివుని వర్ణాశ్రమధర్మాల గురించి వివరించమని అడిగింది. అందుకు శివుడు ఇలా చెప్తాడు.

**అజుడు మున్ లోకహితార్థంబుగా బ్రాహ్మ । ణులను సృజించి రాజులను వైశ్యు**
**లను శూద్రులను గ్రమం బొనరంగ గల్పించె । నాజాతులకు నోలి నతని ముఖము**

**బాహులు సూరులు బదములు సంభవ । స్థానంబు లగుటయు, దారతమ్య**
**భాగిను లగునని పార్వతి కాతండు । తత్తదాచరణీయ ధర్మములను**
**వినుము విస్తరించె; విప్రులు లోకధా । రకులు; వారియెడ బరాభవంబు**
**సేత యెల్ల చేటు జేయు; సమ్మాన దా। నములు సకల శోభనము నొనర్చు. (అను. 5-5)**

అంటే పూర్వం బ్రహ్మదేవుడు లోక హితం కొరకు నాలుగు వర్ణాలను సృష్టించాడు. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. బ్రహ్మ ముఖం నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు జన్మించారు. అందుకని ఆ జాతులలో తర, తమ భేదాలు కలిగాయి. వారు చేసే పనులలో కూడా తారతమ్యాలు కలిగాయి.

**అనుశాసనికపర్వం - విప్రులు**

తిక్కన అనుశాసనికపర్వంలో విప్రుల గురించి ఇలా పేర్కొన్నారు.

**ప్రియ మతి యజ్ఞనేనియు దరిద్రుని నేనియు విప్రు గంద జే**
**త యుభయలోక సౌఖ్యములు దవ్వుగ జేయు; దదీయమైన నిం**
**దయు నను బెట్టు దిట్టుట, యధర్మత నాతని సొమ్ము పుచ్చి కొం**
**టయును మదర్థముంగొనుట; దాపక చెప్పితి; నిక్క మింతయున్ (అను.5 - 6)**

అంటే విప్రులు లోకానికి ఆధారం. వారిని పరాభవిస్తే లోకానికి చేటు కలుగుతుంది. వారిని సన్మానించి వారికి దానధర్మాలు చేస్తే లోకానికి మేలు కలుగుతుంది. బ్రాహ్మణుడు పేదవాడైనా, ధనవంతుడైనా, విద్యావంతుడైనా, విద్యలేని వాడైనా అతడిని నిందించరాదు, బాధించరాదు. వారిని బాధించిన వారికి ఈ లోకంలోనే కాదు ఇహపరలోకంలో కూడా సుఖసంతోషాలు కలుగవు. కాబట్టి బ్రాహ్మణుడిని దూషించడం దైవాన్ని దూషించడంతో సమానం. బ్రాహ్మణుడి సొత్తును అన్యాయంగా దోచుకోవడం అంటే దేవుడి సొత్తును అన్యాయంగా దోచుకోవడంతో సమానం.

**అనుశాసనికపర్వం - విప్రుల ధర్మాలు**

తిక్కన అనుశాసనికపర్వంలో విప్రుల ధార్మన్ని గురించి పై పద్యంలో ఇలా పేర్కొన్నారు.

**అధ్యయనంబును యజనంబు దానంబు । సధ్యాపనంబును యాజనము .... (అను. 5 - 8)**

ఇక విప్రుల ధర్మాలు ఏవంటే వేదాధ్యయనం, యజ్ఞాలు చేయడం, ఇతరులతో యజ్ఞాలు చేయించడం, దానాలు చెయ్యడం, తాను నేర్చిన విద్యలు ఇతరులకు బోధించడం, ఇతరుల నుండి దానాలను స్వీకరించడం, మనసులో కాని, వాక్కులో కాని కోపం లేకుండా ప్రశాంతంగా ఉండడం, తపస్సు చేయడం, ఎల్లప్పుడు సత్యాన్నే పలకడం, శుచిగా ఉండడం ఇవి విప్రుల ధర్మం. ఆపద సమయాలలో తప్ప విప్రులు వాణిజ్యాలు చేపట్టరాదు. బ్రాహ్మణుడు ప్రతిరోజు అగ్ని కార్యం చెయ్యాలి. శూద్రులు ఇచ్చిన ఆహారం భుజించరాదు. పరకాంతలవంక కన్నెత్తి చూడకూడదు. తన నిజ భార్యతోనే తృప్తిపడాలి. రోజుకు రెండు పూటలు మాత్రమే భోజనం చెయ్యాలి. హింసాప్రవృత్తి పనికిరాదు. ఇంటిని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. అతిథులకు అన్నంపెట్టాలి. తపస్సు చేసుకోవాలి. ఇలాంటి ధర్మకార్యాల కొరకు ధర్మాన్ని పరిరక్షించటం కొరకు మాత్రమే బ్రాహ్మణులను సృష్టించాడు.

**అనుశాసనికపర్వం - క్షత్రియధర్మాలు**

క్షత్రియులకు బ్రాహ్మణులను రక్షించడం ప్రథమధర్మం. వారితోపాటు భూమిమీద ఉన్న సకలప్రాణులను రక్షించాలి. క్షత్రియుల వలన ఈ భూమి వర్ధిల్లుతుంది. క్షత్రియుల పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారు.

**రమణీ! యధ్యయనము యజ । నము దానము సాధుపోషణము దుర్జనులన్**
**దమియించుటయు సముత్సా । హము కల్మియు ధృతియు నృపుల కగు ధర్మంబుల్**

**(అను. 5 – 10)**

క్షత్రియులు వేదాధ్యయనం చెయ్యాలి, యజ్ఞం చెయ్యాలి, దానధర్మాలు చెయ్యాలి. సాధువులను రక్షించి పోషించాలి. దుష్టులను శిక్షించాలి. ఎల్లప్పుడూ ఉత్సాహంగా ధైర్యంగా ఉండాలి. ఇంకా క్షత్రియులు అస్త్రశస్త్ర విద్యలో నైపుణ్యం సాధించాలి. ప్రజలకు వచ్చిన అదాయంలో ప్రజాపాలన నిమిత్తం ఆరవ వంతు మాత్రమే పన్నుగా స్వీకరించాలి. తనవద్ద పనిచేసేవారిని దయతో చూడాలి. ప్రజలు తమ తగవులు తీర్చే సమయంలో నిష్పక్షపాతంగా ఉండాలి. ఇవి రాజుకు విధించిన ధర్మాలు అని పేర్కొన్నారు.

**అనుశాసనికపర్వం – వైశ్యధర్మాలు**

ఇక వైశ్యధర్మాలను గమనిస్తే

**వణిజులు లోక ప్రవర్తనంబుల కెల్ల । నుపకారకులు; గృషియును ననేక**
**భంగి బేహారంబు బసుల బెంచుటయు గృ । త్యంబులు; వారల కధ్యయనము**
**యజనంబు దానంబు నర్హ కర్మంబులు; । త్రైవర్ణిక ద్విజత్వమ్ము కతన**
**నాతిథ్యములు విధేయములు; వారికి దిల । గంధరసముల విక్రయము దగదు;**
**మూడు జాతుల శుశ్రూషమూల కార్య । గతి తదుపయుక్తి శూద్రుల కలిమి నడచు;**
**వారు శుశ్రూషకులు; విప్రవందనంబు । వినయ మక్రూరు లగుట తద్విహిత కృతులు.**

**(అను.5 – 12)**

అంటే వైశ్యులు ఎల్లప్పుడూ లోకానికి మేలుచెయ్యాలి. అందరికీ ఉపకారం చెయ్యాలి, అధికంగా శ్రమించాలి. వ్యాపారం, పశుపోషణ చెయ్యాలి. వైశ్యులు కూడా వేదాధ్యయనం, యజ్ఞాలు చెయ్యడం, దానాలు చెయ్యడం వైశ్యులకు విధించబడిన ధర్మాలు. ఉపనయన కర్మవలన వైశ్యులు ద్విజులు ఔతారు కనుక అతిథులను సత్కరించడం వైశ్యులకు పరమధర్మమైన విషయం. వైశ్యులు నువ్వులు, గంధము, రసముతో కూడిన పదార్థములతో వైశ్యులు వ్యాపారం చెయ్యరాదు. ఇక శూద్రులు మిగిలిన మూడు జాతులను సేవించి సేవచెయ్యడం సౌమ్యంగా విధేయులుగా ఉండడం వారికి విధించబడిన ధర్మము.

**అనుశాసనికపర్వం – ఆశ్రమవాస ధర్మాలు**

పార్వతి కోరిక మేరకు పరమశివుడు ఆశ్రమధర్మాలు ఇలా వివరించాడు. ఆశ్రమాలు నాలుగు. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వాన ప్రస్థము, సన్న్యాసము.

**బ్రహ్మ చర్యవ్రత పరమ నిష్ఠయు, గురు । నాశ్రయించుటయు, నధ్యయన కృతియు,**
**నగ్ని కార్యంబు, గుర్వర్థ సంచారంబు, । భైక్షచర్యయు గమలాక్షి! బ్రహ్మ**
**చారి ధర్మంబు; లాశ్రమములకెల్ల నా । శ్రయణీయమై గృహస్థత్వ మొప్పు:**
**శౌచంబు, నిజదార సంతుష్టియును, బంచ । యజ్ఞంబులును, నిగమాభిరతియు,**
**దాన హెూమ దయాతిథి మాననములు । వలయు గృహమేధికిని; వనవాస వన్య**
**భోజన బ్రహ్మచర్య జటాజిన ప్ర । ధారణములు వానప్రస్థ ధర్మకోటి.** **(అను. 5 – 15)**

మొదటి ఆశ్రమము బ్రహ్మచర్యము. ఈ ఆశ్రమంలో పరమనిష్ఠతో ఉండాలి. గురువును ఆశ్రయించి విద్యను నేర్చుకోవాలి. వేదాధ్యయనం చెయ్యాలి. ప్రతి రోజు అగ్ని కార్యము చెయ్యాలి. గురువుగారి కొరకు తన కొరకు భిక్షను స్వీకరించాలి. తరువాత గృహస్థాశ్రమధర్మము. ఇది మిగిలిన ఆశ్రమధర్మాలకు పునాది. గృహస్థాశ్రమంలో శుచిశుభ్రత పాటించడం, భార్యను సంతోషపెట్టడం, పంచయజ్ఞములు చెయ్యడం, పంచయజ్ఞములు అనగా దేవయజ్ఞము, పితృయజ్ఞము, భూతయజ్ఞము, బ్రహ్మయజ్ఞము, మనుష్యయజ్ఞము వీటిని నిష్ఠతోచెయ్యడం, వేదాధ్యయనమునందు ఆసక్తి కలిగి ఉండడం, దానధర్మాలు చెయ్యడం, హోమములు చెయ్యడం బ్రాహ్మణుడికి విధించబడిన ధర్మము. తరువాత వానప్రస్థాశ్రమం. ఈ వానప్రస్థాశ్రమంలో బ్రహ్మచర్యము పాటించడం, శాకాహారభోజనం, నారచీరలు ధరించడం, కోరికలు లేక ఉండడం వానప్రస్థాశ్రమ ధర్మాలు. తరువాతది సన్యాసాశ్రమం. సన్యాసికి కోపము రాకూడదు. ఇంద్రియ నిగ్రహము కలిగి ఉండాలి. తనకంటూ ఏమీ ఉంచుకొన కూడదు. ఓర్పుతో ఉండాలి. అడవులలో ఉన్న మునులతో కూడి సత్సంగంలో పాల్గొనాలి. ఎల్లప్పుడూ మనస్సును ప్రశాంతంగా పెట్టుకోవాలి. మంచి ప్రవర్తన కలిగి ఉండాలి. పరిశుభ్రంగా ఉండాలి. సత్యవ్రతము, అహింసావ్రతము ఆచరించాలి. భిక్షాటనతో జీవించాలి. నేలమీద పడుకోవాలి. సాటి మానవుల ఎడల, ప్రాణుల ఎడ కరుణతో మెలగాలి. ఎల్లప్పుడూ ఆత్మవిచారము, తత్త్వచింతనా చెయ్యాలి. ఇవి సన్యాసి ఆచరించవలసిన ధర్మాలు " అని పరమశివుడు పార్వతీదేవికి చెప్పాడు.

**ఆనుశాసనికపర్వం - మునుల తపస్సు**

మునుల తపస్సు ఎలాంటిదో ఆసక్తితో తెలుసుకోవాలని అనుకొన్న పార్వతీదేవికి శివుడు ఇలా చెప్పాడు. పార్వతి! చాలామంది ఏవోవో కోరికలు (భోగాలు) తీరాలని తపస్సు చేస్తూ ఉంటారు. కాని తపస్సు అంటే వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు చేసే ఒక ధర్మము. తపస్సు చేసే ముందు ఇంద్రియ నిగ్రహము పాటించాలి. ఉదయం, సాయంత్రం యోగాభ్యాసం చెయ్యాలి. అలా కాకుండా ఏవేవో కోరికలతో తపస్సు చేస్తే కొంతకాలం స్వర్గసుఖాలు అనుభవించి ఆ తపఃఫలం తరిగి పోగానే తిరిగి భూమిమీద జన్మిస్తారు. అంతే కాని తిరిగిరానిలోకాలకు వెళ్ళలేరు. ఇంకా కొంతమంది ఆ హారం తీసుకోకుండా కఠోరనియమాలతో పంచాగ్నుల మధ్య నిలబడి ఘోరంగా తపస్సుచేస్తారు. అలాంటి వారు కూడా కేవలం అప్సరకాంతలతో చేరి భోగాలు అనుభవించి తృప్తిపడతారు. ఆ తపః ఫలం పూర్తికాగానే తిరిగి మానవులుగా జన్మిస్తారు. అలా కాక ఎలాంటి కోరికలు లేకుండా తపస్సు చేసే వారు ముందుగా అహింసావ్రతము ఆచరిస్తారు. మనసా, వాచా, కర్మణా ఎవరికీ అపకారం హానిచెయ్యరు. సాటి ప్రాణుల పట్ల దయ, కరుణ కలిగి ఉంటారు. అందరి జీవులలో ఉండే ఆత్మ ఒక్కటే అని భావిస్తారు. అలాంటి వారు కూడా మరణానంతరం తమ భార్యాబిడ్డలతో స్వర్గ సుఖాలు అనుభవించి తిరిగి ఆ పుణ్యఫలం కరిగి పోగానే తిరిగి భూలోకంలో జన్మిస్తారు. ఈ రీతిగా తపస్సు చేసే వారందరూ స్వర్గసుఖాలతోనే తృప్తిపడుతుంటారు " అని పరమశివుడు పార్వతీ దేవికి వివరించారు ఈ క్రింది పద్యంలో.

**భోగార్థులై తపంబునకు జొత్తురు; ........ (అను. 5-18)**

**ఆనుశాసనికపర్వం - వనవాసం**

వనవాస విశేషాలు, దాని ఫలితాలు వివరించండి అని పార్వతీదేవి అడిగింది. అందుకు పరమశివుడు ఇలా అంటాడు.

**'ఉపవాసములు మౌన ముర్వీశయత్వ ........ అడుగు మింకను వలసిన యట్టి' వనుడు**

**(అను. 5-22)**

ఉపవాసవ్రతం అనగా ఆహారం తీసుకోకుండా ఉండడం, నేల మీద పడుకోవడం, మౌనంగా ఉండడం, యోగాసనములు చెయ్యడం, నియమిత వేళలలో తగు ఆహారం తీసుకోవడం అనే నియమాలు పాటించాలి. అలా చేస్తే

వారు చంద్రలోకము, వాయులోకము, యక్షలోకము, గంధర్వ లోకము, నాగ లోకము మొదలైన లోకములకు వెడతారు. అక్కడ కొంతకాలము నివసిస్తారు. ఈ వ్రతాలన్నీ వానప్రస్థములో చేసిన వారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి" అని శివుడు చెప్పాడు.

**అనుశాసనికపర్వం – భిక్షాటన**

విరాగులు ఇల్లిల్లు తిరిగి భిక్షను స్వీకరించి ఉదరపోషణ చేసుకుంటారు. భిక్షాటన చేసేవారు ఎక్కువగా ఉపవాసం చేస్తారు, ఉన్నచోట ఉండరు, ఊరూరు తిరుగుతుంటారు, పుణ్యతీర్థాలు సేవిస్తూ ఉంటారు. పుణ్యనదులలో స్నానం చేస్తుంటారు. తలంతా జడలుగట్టి భిక్షాటనతో జీవిస్తారు. నెలలో ఎక్కువ రోజులు ఉపవాసంతో గడుపుతారు కనుక శరీరంకృశించి ఉంటుంది. తృణధాన్యాలను వండుకుని తింటారు. మరణించిన తరువాత వారుకూడా స్వర్గసుఖాలు అనుభవిస్తారు.

**అనుశాసనికపర్వం – వైఖానసులు**

వైఖానసులు కఠోరనియమాలు కలిగిన వారు. వారు తృణధాన్యాలను (నివ్వరివడ్లు) సేకరించి దానిని రాతిమీద నలగ గొట్టి లేదా రోటిలో వేసి దంచి ఆహారంగా తింటారు. కొందరు పండ్లు మొదలైన వాటిని తింటారు. మరికొందరు పక్షుల మాదిరి దొరికిన గింజలను దొరికినట్లు తింటారు. కొందరు ఆకులను తింటారు. మరి కొందరు నీటినిమాత్రమే త్రాగి బ్రతుకుతారు. మరి కొందరు గాలిమాత్రమే భోజనంచేసి బ్రతుకుతారు. మరి కొందరు సుష్ఠుగా భోజనంచేస్తారు. వీరందరూ ఇంద్రుడికి ఇష్టమైన వారు. వారు చాలాకాలము స్వర్గసుఖాలు అనుభవిస్తారు. ఇవన్నీ వానప్రస్థాశ్రమంలో ఆచరించ వలసిన ధర్మాలు. ఇవి అన్నీ తపస్సు కిందకు వస్తాయి. వీళ్ళుగాక అంగుష్ఠ మాత్రులు ఉన్నారు. వారు వాలఖిల్యులు అనే మునీశ్వరులు. వారు సూర్య కిరణాలను ఆహారంగా స్వీకరిస్తారు. ఈ లోకాలన్నీ వారి వలననే నిలిచి ఉన్నాయి. ఇతరత్రా సాధించ లేని కార్యాలు తపస్సు వలన సాధించబడతాయి. తపస్సు గొప్పది.

**అనుశాసనికపర్వం – గృహస్థ ధర్మము**

ధర్మములలోకెల్లా గృహస్థధర్మము గొప్పది. అది అందరికీ యోగ్యమైనది. కాని ఎక్కువ సూక్ష్మమైనది. గృహస్థధర్మంలో అతి పనికిరాదు. ఏదైనా సమతుల్యంగా ఉండాలి. ఏ కాలంలో చేయవలసిన పనులు ఆయా కాలాలలో చెయ్యాలి. మనస్సు నిశ్చలంగా ఉంచుకోవాలి. ధర్మబద్ధంగానే ధనాన్ని సంపాదించాలి. ధర్మబద్ధంగానే కామోపభోగాలు అనుభవించాలి. అదే గృహస్థధర్మము. నివృత్తిధర్మము మోక్షానికి మార్గము. ఇంద్రియనిగ్రహం, భూతదయ, సత్యాన్నే పలకడం, కోరికలను విడిచిపెట్టడం, మనస్సు నిలకడగా ఉంచుకోవడం ఇవి నివృత్తిమార్గాలు. ఇంకా ఆకలిదప్పులతో వచ్చిన అతిథి దాహానికి నీళ్ళు ఇచ్చి ఆకలితీరేలా భోజనం పెట్టడం ధర్మాల్లోకెల్లా పరమధర్మం. ఈ అతిథి సత్కారం ఒక్క గృహస్థ ఆశ్రమంలోనే వీలుకలుగుతుంది. మిగిలిన ఆశ్రమాలలో అతిథి సత్కారాలకు వీలులేదు. అందుకని అన్ని ధర్మాలలోకెల్లా గృహస్థధర్మం గొప్పది.

**అనుశాసనికపర్వం – గృహస్థు చేయవలసిన పనులు**

గృహస్థుడు చేయవలసిన ముఖ్యమైన పనులను గమనిస్తే గృహస్థాశ్రమంలో సతికి పతిసేవ ముఖ్యము. పతిభక్తి ముఖ్యధర్మం. మానవునికి తల్లిదండ్రులు చనిపోతే, లేక భార్యకు భర్త చనిపోతే వారు చేయవలసిన పనులు ఏవి అంటే తల్లిదండ్రులు చనిపోయిన గృహస్థు ఏమరకుండా అతిథి సత్కారం, పితృతర్పణాలు, దేవతారాధనా చెయ్యాలి. భర్తను కోల్పోయిన భార్యలు బ్రహ్మచర్యం పాటించాలి. గృహస్థు అష్టమి, చతుర్దశి, పున్నమి, అమావాస్య రోజులలో బ్రహచర్యం పాటించాలి. తన ఇంటిలోని ధాన్యాన్ని ఎలుకలు, పక్షులు తిన్నట్లయితే అందుకు బాధపడక వాటి ఆకలితీరిందని సంతోషపడాలి. ఇంక యతీశ్వరులు ఎక్కడ ఉన్నా, ఏమి చేస్తున్నా ఆలోచనలు కట్టిపెట్టి నిస్సంగంగా ఉండాలి. అలా చేసిన వాడు ముక్తిపొందగలడు.

### అనుశాసనికపర్వం – రాజు యొక్క గొప్పతనం

రాజులకు కూడా సామాన్య మానవునిలాగే శరీరము, వాటి అవసరాలు, ఆకలిదప్పులు, స్నానం, భోజనం మొదలైన పనులు జరుగుతాయి. కాని రాజు ఎందులో అధికుడు? అందరూ అతడికి నమస్కారాలు ఎందుకు పెట్టాలి ? రాజు యొక్క ఆగ్రహానికి, అనుగ్రహానికి లోబడి ఎందుకు ఉండాలి? రాజులు సర్వాధికారులుగా ఎందుకు శోభిల్లుతూ ఉంటారు? అని గమినిస్తే రాచరికం అనేది పూర్వజన్మలో చేసిన అధికమైన తపస్సు ఫలితంగా లభిస్తుంది. ఆ కారణం చేత రాజు అందరి చేత గౌరవాభిమానాలు పొందుతాడు. అతడు తప్పుచేసిన వారిని శిక్షించడానికి, మంచివారిని రక్షించడానికి అధికారం కలిగి ఉంటాడు. కాని రాజు నీతిమంతుడై ఉండాలి. అతడి నీతి అతడిని కాపాడుతూ ఉంటుంది. రాజు నీతిమంతుడైతే ప్రజలు కూడా నీతిమంతులు ఔతారు. రాజు ఇంద్రియాలను జయించి శత్రువులను కూడా జయిస్తారు. రాజు యోగ్యులైన వారిని నీతి మంతులను తన వద్ద మంత్రులుగా నియమించాలి. తనవద్ద పని చేసే సైనికులను దయతో చూడాలి. అప్పుడే సైన్యము అతడికి విధేయులై ఉంటారు. రాజు ఎల్లప్పుడూ హితులైన వారినే తనవద్ద మంత్రులుగా దగ్గర చేర్చుకోవాలి. రాజు అనుసరించే నీతినిజాయితీ అతడికి ధనాన్ని సంపాదించి పెడుతుంది. అతడికోటను రక్షిస్తుంది. అతడి ప్రజలను రక్షిస్తుంది. రాజు అనవసర ఖర్చులు పెట్టకూడదు. అవసరమైన ఖర్చులు పెట్టడానికి వెనుకాడ కూడదు. రాజు తన స్వీయరక్షణలో ఏమరు పాటు చూపకూడదు. రాజు ఎప్పుడూ పుణ్యకార్యాలు చేస్తుండాలి. పాపకార్యాల జోలికి పోరాదు. న్యాయవిచారణ చేసి శిక్షలు విధించే సమయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. రాజు ఒకరిమీద ప్రేమ ఒకరి మీదకోపము ప్రదర్శించరాదు. తన గురించి తనపాలన గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో వేగుల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తదనుగుణంగా పాలన కొనసాగించాలి. రాజు ఎల్లప్పుడూ సత్యాన్నే పలకాలి. రాజైన వాడు ప్రియంగా పలకాలి. పరుషంగా మాట్లాడ కూడదు. విద్యాధికుడు అయి ఉండాలి. మిత్రుల పట్ల, శత్రువుల పట్ల ఉపాయంగా వ్యవహరించాలి. రాజు ఎవరితో అనవసరంగా కయ్యము పెట్టుకో కూడదు. కాని అవసర సమయంలో తన పరాక్రమం ప్రదర్శించాలి. రాజు యజ్ఞాలు, యాగాలు చేసి దానధర్మాలు చేయాలి. ఇంక రాజు అన్యాయం చేస్తే నరకానికి పోతాడు. రాజు చేసిన పాపాలు ఎన్నటికీ అతడిని వదలక జన్మజన్మాంతరం వెన్నాడుతూ ఉంటాయి. పైన చెప్పిన ధర్మాలను పాటించిన రాజు పుణ్య లోకాలకుపోతాడు" అని పరమేశ్వరుడు పార్వతీదేవికి వివరించాడు.

### అనుశాసనికపర్వం – పరమ ధర్మము

ధర్మాలలో పరమ ధర్మము ఏది అని గమనిస్తే అహింస అన్ని ధర్మాలలో ఉత్తమ ధర్మం. హింస చెయ్యకుండా మానవులు జీవించడం అసాధ్యం. మరి అహింసను ఎలా ఆచరించగలరు అంటే నేలమీద పాకేచీమలు, కంటికి కనిపించని సూక్ష్మజీవులు, దోమలు, నల్లులు, క్రిమి కీటకాలు చంపకుండా మనిషి బ్రతకలేడు. కాని ఆహారం కొరకు జీవహింస చేయడం పాపం. ఫలములు, కాయలు, ఆకులు తిని బ్రతకవచ్చు. పాలుత్రాగి బ్రతుక వచ్చు. ఇంద్రియనిగ్రహంతో జీవించిన వారు మహాత్ములు ఔతారు. కనుక అహింసను పాటించటం కష్టం కాదు అని వివరించబడింది.

### అనుశాసనికపర్వం – అహింస

అహింస అనేది మరో విధంగా చూస్తే... చావు పుట్టుకలు ప్రాణులధర్మం. దానిని ఎవరూ తప్పించ లేరు. ఒకడు పెట్టిన దీపంలో శలభములు పడి మరణించిన ఆ పాపం దీపం పెట్టిన వాడికి అంటదు. రైతు పొలము దున్నే సమయంలో నాగటిచాలులో పడి అనేక జీవులు చచ్చిపోతుంటాయి. ఆ పాపము దున్నేవాడికి అంటదు. అలాగే మానవులు తమతమ దైనందిన పనులు చేసుకుంటుంటే ఆయువు తీరిన ప్రాణులు చచ్చిపోతూ ఉంటారు. ఆ పాపాలు ఆయా మానవులకు అంటదు. ఆ ప్రాణులను తామే చంపామని అనుకోవడం మూర్ఖత్వమే ఔతుంది. పుణ్యకార్యాలకు కాని పాపకార్యాలకు కాని బుద్ధిముఖ్యం. ఏ పని అయినా బుద్ధి పూర్వకంగా చేస్తేనే ఆ ఫలము పనిచేసిన వాడికి సంక్రమిస్తుంది. అది ఎలా అంటే తమకు చావుమూడిన

గోవులు రంతిదేవుడు వద్దకు వెళ్ళి రంతిదేవుడు చేసే యజ్ఞంలో ఆహుతి అయ్యాయి. ఆ గోవులను చంపిన రక్తం చర్మణ్వతి అనే నదిగా ప్రవహిస్తుంది. ఆ నదిలో స్నానం చేసిన వారు పాపాలు నశించి పుణ్యాత్ములు ఔతారు. ఆ యజ్ఞంలో చనిపోయిన గోవులన్నీ ఉత్తమలోకాలకు పోయాయి కనుక ఆ గోవులను చంపిన పాపం రంతిదేవుడికి అంట లేదు.

**అనుశాసనికపర్వం – క్షత్రియుల హింస**

యుద్ధంలో ఇరుపక్షాలు ఒకరిని ఒకరు నరుక్కుంటారు. కాని యుద్ధంలో చచ్చిన వాళ్ళు స్వర్గానికిపోతారు. కనుక వాటిని హింస అని చెప్పడానికి వీలు కాదు. రాజుకు వేటకు పోవడం జంతువులను వేటాడడం రాజధర్మం. క్రూరమృగాలు పంట పొలాలను నాశనం చేస్తాయి. మానవులను చంపి వారికి హానిచేస్తాయి. రాజు వేటలో ఆ క్రూరమృగాలను చంపినందువలన అతడికి పాపం అంటదు. రాజుచేతిలో చచ్చిన మృగాలకు పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయి. రాజు దండించతగిన వారిని విడిచిపెట్టినా, దండించ తగని వారిని దండించినా, తప్పుచేయని వాడికి శిక్షవిధించినా, బ్రాహ్మణులను హింసించినా రాజు హింస చేసినట్లే. నహుషుడు బ్రాహ్మణులను హింసించి శాపోపహతుడైనాడు. అలాగే ఇంద్రుడు గౌతముడికి అపకారం చేసి శాపం పొందాడు. కనుక రాజైనవాడు బ్రాహ్మణులకు అపకారం చెయ్యకుండా రాజ్యపాలన చెయ్యాలి. అప్పుడే అతడికి సకల శుభాలు కలుగుతాయి. యజ్ఞాలలో, యాగాలలో జంతువులను ఊపస్తంభానికి కడతారు. వాటిని శాస్త్ర సమ్మతంగా వధిస్తారు. అలా వధించబడిన మృగాలకు పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. యజ్ఞం చేసిన వాడికి పూణ్యము వస్తుంది. కనుక యజ్ఞ యాగాలలో జంతువులను వధించుట హింస కాదు.

**అనుశాసనికపర్వం – లోక జీవనం**

లోకంలో ప్రజల జీవనవిధానం గురించి చేస్తే ఈ మానవ లోకం కర్మభూమి. స్వర్గం సుఖాలకు ఆలవాలం. భూమి మీద జంతువులు పుట్టడం దుఃఖాలకు మూలం. మానవులకు జీవనం గడపడానికి ధనం కావాలి. ధర్మంగా జీవించాలన్నా కోరికలు తీర్చుకోవాలి అనుకున్నా ధనం కావాలి. విద్య, వర్తకము, సేవావృత్తి, కర్షకవృత్తి ధన సంపాదనకు మూలాలు. విద్య కలవాడు నిందపడకుండా బతకాలి. కర్షకుడు నేల తత్త్వం తెలుసుకుని సేద్యం చేయాలి. వర్తకుడు వస్తువుల ధరల హెచ్చుతగ్గులు తెలుసుకుని వ్యాపారం చేయాలి. వచ్చిన లాభంలో కొంత మాత్రమే వాడుకుని మిగిలినది పెట్టుబడికి చేర్చి వ్యాపారం చేయాలి. అప్పుడే లాభాలు ఆర్జించగలడు. పశువుల యొక్క పోకడలు తెలుసుకోవాలి. ఆ ప్రకారం పశువులను కాచే సేవకుడు ధనము, కీర్తి పొందుతాడు. పరుల ధనము పరుల భార్యలను కోరకుండా ఉండడం దైవాన్ని పూజించడం, పితృదేవతలను ఆరాధించడం, ఇతరులపట్ల కరుణ కలిగి ఉండడం, అతిథులను ఆదరించడం ప్రతి మానవుడు ఆచరించవలసిన ధర్మాలు అని తెలియజేయబడింది.

**అనుశాసనికపర్వం – కర్మ పరిపక్వత**

మానవులు నాలుగు వర్ణములుగా విభజింపబడ్డారు. వారికి కర్మలు విధించారు. ఆ కర్మలు ఎలా పరిపక్వము ఔతాయి అని గమనిస్తే మానవులను వర్ణాలుగా విభజించిన తరువాత వారి వారికి తగిన కర్మలు విభజించబడ్డాయి. ఆ కర్మలు శ్రద్ధతోచేసే మానవులు స్వర్గంలో సుఖాలను అనుభవించి తిరిగి అదే కులంలో పుట్టి సుఖాలను అనుభవిస్తారు. అలా కాకుండా తమ వృత్తి ధర్మాలను వదిలి ఇతర ధర్మాలు ఆచరించిన మానవులు మరణం తరువాత ఆయాకులాలలో తిరిగి జన్మిస్తారు. మానవులు ఎంత పుణ్యం చేస్తే వారు అంతకంటే ఉత్తమకులంలో జన్మిస్తారు. తరువాత తిరిగిరాని లోకాలు పొందుతారు. దేవతాంశలలో జన్మించిన వారు ఆపదలు వచ్చినప్పుడు క్రుంగిపోరు. గర్వంతోమదించరు. తన శౌర్యంతో పాపులను గెలుస్తారు. తమ బంధుమిత్రులతో సఖ్యతతో మెలుగుతారు. దీనులను కరుణతో చూస్తారు. వారిని రక్షిస్తారు. దైవాంశతో పుట్టిన వారికి కోపం రాదు. సౌమ్యంగా ఉంటారు.

## అనుశాసనికపర్వం – నుంచి ఆధునిక సమాజం నేర్చుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు

పంచమవేదమైన మహాభారతం 18 పర్వాలు, లక్ష శ్లోకాలతో ప్రపంచంలోని అతిపెద్ద పద్య కావ్యాలలో ఒకటిగా ఖ్యాతికెక్కింది. 'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్... అంటే ఇందులో ఏది ఉందో అది ఎక్కడైనా ఉంది... ఇందులో లేనిది మరెక్కడా లేదు' అని ప్రశస్తి పొందింది. హిందువులకు ఎంతో పవిత్ర గ్రంథాలైన భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రం కూడా మహాభారతంలోని భాగాలే. దీనిని బట్టి ఈ కావ్య విశిష్టత ఏంటో అర్థం చేసుకోవచ్చు. దాయాదుల మధ్య ఆధిపత్య పోరు చివరకు కురు వంశ వినాశనానికే దారితీసింది. ద్వాపర యుగం నాటి మహాభారతంలో సంఘటనలు, సన్నివేశాలు నేటి కాలానికి అనేక పాఠాలుగా ఉపయోగపడుతోంది. భారతం నుంచి ముఖ్యంగా కొన్ని విషయాలను గ్రహించాలి.

జీవితంలో గెలవడానికి జాలి, దయ, మంచితనం మాత్రమే ఉంటే చాలదని, పరిస్థితులు, సమయాన్ని బట్టి నడుచుకోవాలనేది కర్ణుడు పాత్ర తెలియజేస్తుంది.

మంచితనానికి, ధాన ధర్మాలకి కర్ణుడు మారుపేరుగా నిలిచినా సమయాన్ని బట్టి నడుచుకోకుండా అధర్మంవైపు నిలబడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

చెడు స్నేహం ఊహలకి అందని జీవితం నాశనం చేస్తుందని శకుని ద్వారా వివరించాడు. కౌరవులతో స్నేహం నటిస్తూనే వారికి కలలో కూడా ఊహించని పరాజయాన్ని మిగిల్చాడు. కౌరవుల నాశనానికి పరోక్షంగా బీజాలు వేసింది కూడా శకునే. ఇలాంటి వారు నిజ జీవితంలో మనకు ఎదురవుతారు. అలాంటి వారు ఇచ్చే సలహాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

భేదాలు చూడని నిజమైన స్నేహం జీవితంలో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందనడానికి కృష్ణుడు, కర్ణుడు పాత్రలే ఉదాహరణ. కురుక్షేత్రంలో పాండవుల పక్షాన శ్రీకృష్ణుడు, కౌరవుల పక్షాన కర్ణుడు నిలిచి ఏ స్థాయిలో ఉపయోగపడ్డారో తెలిసిందే. కర్ణుడి లేని రారాజు బలం, కౌరవ సేనకు ధైర్యం ఊహించలేనిది. కుల, మత, పేద, ధనిక భేదాలను చూడకుండా మంచివారితో స్నేహం చేసేవారు కచ్చితంగా జీవితంలో విజయం సాధిస్తారు.

అధికం అనేది అత్యంత ప్రమాదకరమని కౌరవ సంతానం ద్వారా వ్యాసుడు వివరించాడు. వంద మంది కుమారులు ఉండటం వల్ల వారిని పెంచడానికి గాంధారి చాలా కష్టపడింది. రాజ్యాన్ని బిడ్డలకి సమానంగా పంచడం, వారి బాగోగులు చూస్తూ క్రమశిక్షణతో పెంచడం చాలా కష్టం. అలాగే దుర్యోధనుడి కోపం, అధికమైన రాజ్యకాంక్ష కారణంగా కౌరవులు నాశనం అయ్యారు. కాబట్టి అన్ని చోట్లా ముఖ్యంగా చెడు పక్షాన అధికం అనేది అత్యంత ప్రమాదకరమని తెలుస్తోంది.

ఎవరి పనులు వారే చేసుకోవడం వల్ల అత్యంత క్లిష్ట సమయంలో ఉపయోగపడతాయని పాండవులే ఉదాహరణ. అరణ్య వాసం, అజ్ఞాతవాసం సమయంలో పాండవులకు గతంలో నేర్చుకున్న ఇంటి, వంట పనులు ఉపయోగపడ్డాయి. అలాగే మనిషికి కూడా అవసరాల కోసం కొన్ని పనులు నేర్చుకోవాలి.

మనకి సంబంధించిన దాని కోసం ఎంత కష్టమైనా పోరాడాలని పాండవుల దృఢవైఖరి తెలియజేస్తోంది. కౌరవులతో పోల్చుకుంటే పాండవుల సైన్యం చాలా తక్కువ. అయినా కానీ, పాండవులు ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధితో పోరాటం చేసి విజేతలుగా నిలిచారు.

పిల్లల పట్ల అతి ప్రేమ నష్టం కలిగిస్తుందనడానికి ధృతరాష్ట్రుడే ఉదాహరణ. ఓవైపు బిడ్డల మీద ప్రేమ, ఇంకోవైపు తను నమ్ముకున్న సిద్ధాంతాల మధ్య ధృతరాష్ట్రుడు నలిగిపోయాడు. కొడుకుల వినాశనం తెలిసినా వారు చేస్తోన్న దురాగతాలను ఆపలేకపోయాడు. ఒకవేళ ధృతరాష్ట్రుడు తన బిడ్డల మీద అంత ప్రేమని పెంచుకోక, క్రమశిక్షణలో పెట్టి ఉంటే విషయం అంత వరకూ వెళ్ళేది కాదేమో. ఎవరి మీద అయినా అతి ప్రేమ, అతి నమ్మకం నాశనానికి, మోసానికి దారితీస్తాయి.

విద్యను జీవితాంతం నేర్చుకోవడమే ఉత్తమ బహుమతి అనడానికి అర్జునుడే ఉదాహరణ. జీవితం ఆసాంతం విద్యలు నేర్చుకుంటూనే ఉన్నాడు. ద్రోణాచార్యు నుంచి అస్త్ర విద్యలు, ఇంద్రుడు నుంచి దైవ సంబంధ ఆయుధాల ప్రయోగం, మహాదేవుడి నుంచి పాశుపతాస్త్రం, యుధిష్ఠిరుడు, కృష్ణుడి నుంచి రాజనీతులను ప్రతి దశలోనూ అభ్యసించడమే అర్జునుడికి ఓ ప్రత్యేక స్థానం దక్కింది. నిత్యం నేర్చుకోవడం వలన కచ్చితంగా విజయం వరిస్తుంది.

కొన్నిసార్లు శత్రువులు కూడా మిత్రుల రూపంలో ఎదురవుతారనేది ఈ పాత్రలే నిదర్శనం. విదుర, ద్రోణ, భీష్ములు కౌరవుల పక్షాన ఉన్నా వారిలో అనేక మంది పాండవులకు సాయపడ్డారు. రహస్యంగా పాండవులికి ఎంత సహాయం చేశారో. ఇక విదురుడు కౌరవుల ప్రతీ అడుగు పాండవులకి మోసుకొచ్చినవాడే.

మహిళలను ఆపదల నుంచి కాపాడాలని, అలా కాకపోతే అనర్థాలకు దారితీస్తుందనేది ద్రౌపది వస్త్రాపహరణమే ఉదాహరణ. అత్యంత బలవంతులు, శూరులు అయి ఉండి కూడా నిండు సభలో ద్రౌపదికి జరిగిన అవమానాన్ని అడ్డుకోలేకపోయారు.

మిడిమిడి జ్ఞానం పనికిరాదని అంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. పద్మవ్యూహంలోనికి వెళ్లడమే కానీ బయటపడటం తెలియక తనకున్న అర్ధ జ్ఞానంతో అభిమన్యుడు లాంటి మహావీరుడే నేలకొరిగాడు. ఏ పనిని అయిన పూర్తిగా తెలుసుకున్న తర్వాతే మొదలుపెట్టాలి. అలా కాకపోతే ఆ పనిని మధ్యలోనే వదిలేయాల్సిన పరిస్థితి వస్తుంది.

స్త్రీని అవమానించరాదనే సత్యం భారతంలోని ప్రధాన అంశం. కేవలం తనకు జరిగిన అవమానం వల్ల ద్రౌపది కౌరవులపై పెంచుకున్న కోపం చివరికి వారిని, సామ్రాజ్యాన్ని నామ రూపాలు లేకుండా చేసింది. స్త్రీలు దేవతలతో సమానం వాళ్లను అవమానించడం చాలా ఘోర తప్పిదం.

**ముగింపు**

మహాభారతంలో "ధర్మం" అనే ఏకసూత్రం అంతర్లీనంగా వుంది. దానిని పాటించే వారిని, పాటించని వారిని గమనించే "విధాత" పాత్ర శక్తిమంతంగా సందర్భాన్ని బట్టి పని చేస్తుంది. మనుషుల రాగద్వేషాలు, బలహీనతలు సన్నివేశాలను నడిపిస్తాయి. దాని పర్యవసానమే కురుక్షేత్ర మహాసంగ్రామం.

మహాసంగ్రామంలో పద్ధెనిమిది అక్షౌహిణీల సైన్యం ప్రాణాలు కోల్పోయింది. అసలు నాటి అక్షౌహిణికి బలం ఎంత? ఒక రథం, ఒక ఏనుగు, మూడు గుర్రాలు, అయిదుగురు భటులు కలిగిన బృందాన్ని "పత్తి" అంటారు. అలాంటి పత్తి సమూహాలు మూడు కలిస్తే ఒక "సేనాముఖం". మూడు సేనాముఖాలు ఒక గుల్మం. మూడు గుల్మాలు ఒక "గణం". మూడు గణాలు కలిస్తే ఒక "వాహిని". మూడు వాహినులొక "పృతన". మూడు పృతనలొక "చము". మూడు చములొక "అనీకిని". పది అనీకినులు కలిస్తే ఒక అక్షౌహిణి. అంటే అక్షౌహిణిలో ఇరవై ఒక్క వేల ఎనిమిది వందల డెబ్భై రథాలు, అంతే సంఖ్యలో ఏనుగులు, మూడింతలు గుర్రాలు, లక్షాతొమ్మిది వేల మూడు వందల యాభైమంది సైనికులు వుంటారు. దీనిని బట్టి వివిధ బలాలు, సైనికులు ఎందరు నశించారో తెలుసుకోవచ్చు. కేవలం పద్ధెనిమిది రోజులు జరిగిన యుద్ధం అది. ఈ యుద్ధం ముగియడంతో వాటి ఫలితంగా మహాజ్ఞాన యజ్ఞం ఆనుశాసనిక పర్వంలో మొదలైంది. ఆ మహాజ్ఞాన యజ్ఞమే నేటి ఆధునిక సమాజానికి మార్గదర్శాకాలు అని చెప్పవచ్చు.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – తిక్కన (అనుశాసనికపర్వము), తి.తి.దే., తిరుపతి.
2. శ్రీ మహాభారతతము – యార్లగడ్డ బాలగంగాధరరావు, శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ.
3. ఆంధ్రమహాభారతం (విశ్లేషణాత్మక వ్యాసాలు) – విస్తాలి శంకరరావు, జానపద కళాపీఠం, అద్దంకి.
4. భాషా సాహితీ విన్యాసాలు 2 – లింగంనేని బసవ శంకరరావు, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి, చెన్నై.

# 8. ఆంధ్రమహాభారతం - మానవతా విలువలు - మన సమాజ ప్రతిఫలనం

– డా॥ బత్తుల అశోక్ కుమార్, అనంతపురము

**పరిచయం**

తెలుగు సాహిత్య చరిత్రలో రామాయణ, భారతాలకున్న స్థానం, విలువ నిరుపమానం. మానవుడు పరిపూర్ణ మానవుడిగా రూపుదిద్దుకోవడానికి, సంఘంలో మంచి ఆదర్శవంతమైన వ్యక్తిత్వంతో జీవించడానికి ఈ రెండు గ్రంథాల్లో చెప్పిన అంశాలు నిజ జీవితంలో ఆచరణలో పెడితే, మన జీవితాలను ఉన్నతంగా సరిదిద్దుకోవచ్చు. సంస్కృత భాషలో ఉన్న ఈ రెండు గ్రంథాలు తెలుగుభాషలోకి వెయ్యేళ్ళ క్రితం అనువదించబడ్డాయి. మహాభారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రనలు తెనిగించారు. వారి తరువాత కొందరు కవులు భారతాన్ని ఆంధ్రీకరించినా అవి అంతగా ప్రచారంలోకి రాలేదు. వీరి కావ్యాలను ఆధారంగా తీసుకొని చాలామంది కవులు, కవయిత్రులు వివిధ ప్రక్రియల్లో రచనలు చేసినా అవి అంతగా రాణించలేదు. తెలుగు భారతాలలో కవిత్రయ భారతానికి ఉన్న పాఠకాదరణ ఎప్పటికి చెక్కు చెదరనిదని చెప్పవచ్చు. ఎందుకంటే ఆయా కావ్యాలలో ఉన్న కవిత్వ బిగువు, పటుత్వం అలాంటివి.

**తెలుగు ఇతిహాసాలు – మానవతావిలువలు**

రామాయణ, భారతాలు నేటి మానవ జీవితానికి నీతి, న్యాయం, ధర్మాలను చక్కగా వివరిస్తాయనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఆనాటి సమాజంలో సర్వమానవాళి శ్రేయస్సు అందరికీ ఆమోదయోగ్యంగా సత్యనిష్ఠతో, ఉమ్మడి కుటుంబ వ్యవస్థతో పటిష్టంగా సాగినట్లు మనకు ఆధారాలతో నిరూపితమైనాయి. ప్రస్తుతం మన సమాజంలో వ్యష్టి జీవితాలు ప్రబలంగా మారాయి. సమిష్ఠి కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మనుషుల మధ్య అనుబంధాలు దూరమవుతున్నాయి. సాంకేతిక విప్లవం మనుషులకు సౌకర్యాలను దగ్గర చేస్తూ వుంటే మరోవైపు మానవీయ విలువల్ని దూరం చేస్తూ వుంది. భారతీయ సమాజానికి కుటుంబ వ్యవస్థ ప్రధానం. కానీ నేడు ఆ కుటంబ వ్యవస్థ విలువలన్ని కోల్పోతూ వస్తోంది. "మనిషికి మనిషి మరింత దగ్గరవ్వడానికి పుట్టిన సాంకేతికత, ప్రతీ ఇద్దరిమధ్య దూరాన్ని పెంచుతోంది. మనుషులు తమలో ఉన్న మావవత్వమనే మౌలికమైన ధాతువుని విస్మరించి, సహృదయతని, సమత్వాన్ని మరచి అరిషడ్వర్గాలకు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) బానిసైపోతున్నారు." అని ఆంధ్రమహాభారతం – ఆధునిక జీవితం(2022) అన్న గ్రంథంలో డా॥ గరికిపాటి గురజాడగారు అంటారు.

డాలర్ మోజులో పడి తల్లిదండ్రులను, భార్యా పిల్లలను వదిలి పరాయి దేశాలకు వలస పోతున్న చిత్రాలు మనం చూస్తూనే వున్నాం. మరోవైపు ఉమ్మడి వ్యవస్థ నుంచి చిన్నచిన్న కుటుంబాలు విడివడుతున్నాయి. మనుషుల్లో స్వార్థ ప్రయోజనాలు హెచ్చుమీరుతున్నాయి. ఎంత ధనం, పేరు సంపాదించినా తల్లిదండ్రులను సరిగా చూడకుండా, ఉన్న మిత్రులను దూరం చేసుకోవడం, భార్యా పిల్లలకు దూరంగా బ్రతకడం షరా మామూలైంది.

ఎవనిచేత తల్లిదండ్రులు సంతృప్తులవుతారో, మిత్రులు అనురక్తులవుతారో, కీర్తిని లోకులు గానం చేస్తారో, అట్టి వాడు మూడు లోకాలు జయించిన వానితో సమానుడని ఆర్యధర్మం తెలుపుతున్నది. ప్రస్తుతం మన సమాజంలో కుటుంబ సంబంధాలు, తల్లిదండ్రుల పోషణపై పిల్లలు అవలంబిస్తున్న విధానాలు, భార్యాభర్తల సంబంధాలను పటిష్ట పరచడానికి మహాభారతం చక్కని వేదికగా నిలుస్తుందని భావిస్తున్నాను. మహాభారతంలో చర్చించిన వివిధ కథలు, అందులోని పాత్రలు మన భారతీయ సమాజం పటిష్టంగా నిలువడానికి దోహదం చేస్తాయనడంలో ఎలాంటి సందేహంలేదు. అందుకు ఆదికవి నన్నయ ఆంధ్రీకరించిన మహాభారతాన్ని, అందులోని పాత్రలను ఆంధ్రమహాభారతంలో మానవతా విలువలు – మన సమాజ ప్రతిఫలనం అనే ఈ వ్యాసంలో చర్చిస్తున్నాను.

**భార్యా భర్తల బంధం – భారతీయ సమాజ తత్త్వం**

మనిషి జీవితంలో వైవాహిక ఘట్టం చాలా ముఖ్యమైనది. దానికి సమాజంలో ఎన్నో కట్టుబాట్లు, నిబంధనలు వున్నాయి. కౌటుంబిక జీవనంలో గృహస్తు జీవనం మిక్కిలి క్లిష్టమైనది మరియు ప్రతి ఒక్కరు ఆచరించవలసిన ధర్మం. గృహస్థ ధర్మం చేయకుండా వ్యక్తి జీవనం పరిపూర్ణం కాదని పెద్దల మాట. అయితే నేటి కాలంలో భార్యభర్తల బంధంలో గాఢత తగ్గుతున్నట్లుగా విమర్శకులు భావిస్తున్నారు. భార్యభర్తల బంధం అనేది ఎంతో ఉత్తమమైన బంధం. కానీ నేడు ప్రపంచీకరణ పోకడలు హెచ్చుమీరుతున్న తరుణంలో ఆ బంధంలో విబేధాలు ఎక్కువగా పొడచూపుతున్నాయి. ప్రాచీక కాలంలో కూడా భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు అక్కడక్కడా కనిపించినా, అవి వ్యవస్థ పతనానికి మాత్రం దారితీయలేదు. కానీ నేటి ఆధునిక యుగంలో భార్యాభర్తల బంధం కేవలం ఆర్థిక సంబంధ బంధంపై నిలుస్తున్నట్లుగా కనిపిస్తోంది. పాశ్చాత్య పోకడలు దానికి తోడవడంతో సహజీవనాలు సర్వసాధారణాలయ్యాయి. ఈ తరుణంలో భారతీయ సమాజం ఉన్నతంగా జీవించడానికి, భార్యాభర్తల సంబంధం ఉన్నతంగా వుండాలంటే మహాభారతంలోని ఆదిపర్వం పంచమాశ్వాసంలోని వ్యుషితాశ్వుని వృత్తాంతం ద్వారా భార్యాభర్తల సంబంధాన్ని ఉదహరిస్తున్నాను.

భార్యాభర్తల బంధానికి వ్యుషితాశ్వుని వృత్తాంతం చక్కని నిదర్శనం. పూరు వంశంలో వ్యుషితాశ్వుడనే మహారాజు వంద అశ్వమేధ యాగాలు చేసి తన భుజ బలంతో నాలుగు దిక్కుల ఉన్న రాజులను జయించాడు. అటువంటి వ్యుషితాశు వ్డు తన భార్యమీద ఉన్న మితిమీరిన కామాసక్తుడై వ్యవహరించి క్షయరోగగ్రస్తుడై చనిపోయాడు. అతని భార్య భద్ర, కొడుకులు లేకపోవటంతో దు:ఖించి భర్త కోల్పోవటాన్ని సహించలేకపోయింది.

**పతియులేక జీవించు నయ్యతివ కయిన**
**జీవనము కంటె దానికి జావ లగ్గు**
**కాన నీతోన చనుదెంతు గాని నిన్ను**
**బాసి యిందుండగా నోప వాసవాభ! (ఆది. – పంచమాశ్వాసం –81వ పద్యం)**

భర్తలేకుండా జీవించటం కన్నా స్త్రీ చావటమే మేలు. అందువలన నేను నీతో వస్తాను కాని, ఇక్కడ ఉండలేను అన్నది. 'అట్లా కాకపోతే నాకు నీ పవిత్ర రూపం వంటి రూపం కల కొడుకులను ప్రసాదించు' అంటూ దర్భల పరుపుమీద పడుకొని భర్త శవాన్ని కౌగిలించుకొని ఏడుస్తూ ఉండగా, ఆమెతో అతని శరీరం నుండి ఒక దివ్యవాణి ఇట్లా అన్నది. "నీకు వరమిస్తాను. భయపడవద్దు. లెమ్ము. సుగుణాల చేత లోకాలను వశం చేసుకొనే వాళ్ళు, ఉత్తమమైన నడవడి కలవాళ్ళు అయిన కొడుకులు నీకు పుడతారు. బాధపడకుము. నీవు ముట్టయిన ఎనిమిదో రోజుగాని, పద్నాలుగో రోజుగాని పరిశు ద్ధురాలవై పడకమీద ఉండి నన్ను స్మరించుము" అని అనగానే ఆమె కూడా ఆ మాట ప్రకారం చేసి ముగ్గురు సాల్వులను, నలుగురు మద్రులను మొత్తం ఏడుగురు కొడుకులను కన్నది.

అంటే ఇక్కడ ఒకరిపై ఒకరికి అవ్యాజమైన ప్రేమ, ఆప్యాయతల వల్లనే వారికి సంతానం కలగడం, వారి వంశ వృద్ధి జరగడం అన్నది ఇక్కడ మనం అర్థం చేసుకోవాలి. భార్యాభర్తల బంధం నిలబడలాంటే అందుకు ఇద్దరిమధ్య పరస్పర అనురాగం చాలా ముఖ్యం. నేటి కాలంలో అది లోపిస్తోంది. ఇద్దరికీ అపనమ్మకమైన స్థితిలో పరస్పర ఆరోపణలతో జీవితాలను అర్థాంతరంగానే వీడ్కోలు పలుకుతుండటం మనం గమనిస్తున్నాం.

**పరస్త్రీకోసం అన్నదమ్ముల పోరు**

ఇద్దరూ సమానమైన బలం, తేజస్సు, బుద్ధి కలిగిన అన్నదమ్ములు ఒక పరస్త్రీని మోహించే విషయంలో ఒకరినొకరు చంపుకోవడం సాహిత్య చరిత్రలో అక్కడక్కడా కనిపిస్తాయి. మనిషి నీతి నిజాయితీ, క్రమశిక్షణలు, కుటుంబ విలువలతో

జీవించాలన్నదే సామాజిక ధర్మం. కానీ ఆ ధర్మాన్ని తప్పితే వ్యక్తి కష్టాలను ఎదుర్కొంటాడు. నేటి సమాజంలో అనేకమంది తమ చెడు ప్రవర్తన కారణంగా జీవితాల్ని ఫణంగా పెడుతున్నారు. ఇప్పుడు మన సమాజంలో పరస్త్రీ వ్యామోహంతో నిత్యం చంపుకుంటున్న వారిని చూస్తున్నాం. ఇలాంటి చెడు అలవాట్లు వుండకూడదని మహాభారతంలో చెప్పడం జరిగింది. దీనికి సుందోపసుందుల కథ ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

పూర్వం దితి కుమారుడైన హిరణ్యకశిపుని వంశంలో నికుంభుడు అనేవాడు జన్మించాడు. నికుంభునికి సుందోపసుందులనే ఇద్దరు కొడుకులు పుట్టారు. వారు సర్వాన్ని పొందుటకు మనోనిగ్రహాన్ని పాటిస్తూ తపస్సు చేయటానికి వింధ్య పర్వతానికి వెళ్ళారు. అక్కడ ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని వేసవికాలంలో అయిదగ్నుల మధ్య, వర్షాకాలం, చలికాలంలో నీటి మడుగులలో ఉండి గాలిని భక్షిస్తూ, ఒంటి కాలిమీద నిలబడి చేతులు పైకెత్తి తలలు వంచి చాలాకాలం తపస్సు చేశారు. వారి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. వారు చేతులు జోడించి 'మా కోర్కె తీర్చటానికి మీకు ఇష్టం ఉన్నట్లయితే, కోరిన రూపం కలిగి ఉండటాన్ని, కోరిన విధంగా వెళ్ళగలటాన్ని, అన్ని మాయలు కలిగి ఉండటాన్ని, ఇతరుల చేత చావు లేకుండా ఉండునట్లు అసలు చావే లేకుండా ఉండనట్లు' వరాన్ని అనుగ్రహించమని వేడుకున్నారు. అయితే బ్రహ్మ వారికి 'చావులేకుండుటం' అనే వరం ఒక్కటి తప్ప తక్కిన వాటినన్నింటినీ అనుగ్రహించాడు. వరాలు పొందిన గర్వంతో లోకాన్ని జయించాలనే కోరికతో, రాక్షసులకు ఆనందం కలుగునట్లు అకాల కౌముది అనే ఉత్సవాన్ని చేసి, లెక్కించుటకు సాధ్యం కానంత బలం కలవారైనారు.

సింహం, పెద్దపులి, ఏనుగు రూపాలు ధరించి అడవులలో తిరుగుతూ, ముని పల్లెల్లోకి ప్రవేశించి వారికి ప్రాణభయం కలిగిస్తూ,  పుణ్యవంతుల నిత్య నైమిత్తిక కర్మలకు ఆటంకాలు కలిగిస్తూ వచ్చారు. మునులంతా బ్రహ్మ దగ్గరకు వెళ్లి సుందోపసుందుల వల్ల పడుతున్న కష్టాలను ఏకరువు పెట్టారు. వారు చెప్పింది విని, వారు ఇతరుల చేత చావరని, ఒకరితో మరొకరు యుద్ధం చేసి మాత్రమే మరణించాలని ఆలోచించి, వెంటనే విశ్వకర్మను పిలిపించి 'అందం, కాంతిగల ఒక స్త్రీని సృజింపు'మని ఆజ్ఞాపించాడు. మహాప్రసాదమని భావించిన విశ్వకర్మ అందమైన తిలోత్తమ అనే స్త్రీని సృజించాడు. ఆమె బ్రహ్మ వద్దకు వెళ్లి కర్తవ్యాన్ని తెలుపమని కోరింది. అపుడామెతో బ్రహ్మ 'సుందుడు, ఉపసుందుడు అనే ఇద్దరు రాక్షసులు పొగరెక్కి లోకాలకు కీడుచేస్తూ వింధ్య పర్వత గుహలో ఉన్నారు. వాళ్ళిద్దరూ నీ కారణంగా తమలో తాము పోరాడుకొని మరణించేటట్లు చేయమని ఆజ్ఞాపించాడు. తిలోత్తమ బ్రహ్మదగ్గర సెలవు తీసికొని దేవసభకు ప్రదక్షిణం చేసింది. అపుడు బ్రహ్మ ఆమె సౌందర్యాన్ని చూడటానికి తనకు నాలుగు దిక్కులలో ముఖాలు కల్పించుకొని చతుర్ముఖుడయ్యాడు. మానవ లోకానికి మెరుపు తీగవలె ప్రకాశిస్తూ వింధ్య పర్వతానికి వెళ్ళింది.

ఒకే ఆసనం మీద కూర్చొంటూ, ఒకే ఆహారం భుజిస్తూ, ఒకే వాహనం ఎక్కుతూ, ఒకే ఇంట్లో ఉంటూ, ఒకే పడకమీద పడుకొంటూ, ఒకే పనిచేస్తూ ఒకటిగా ఉన్న బలవంతులు ఆ సుందోపసుందులిద్దరూ దైవ నిర్ణయం వలన ఒకే స్త్రీని కామించారు. కం॥"ఇది నా వల్లభ ఇది నా / హృదయేశ్వరి యనుచు గోరి యిరువురు మదనో / న్మదులయి పరిగ్రహించిరి / తదీయ కమనీయ సవ్య దక్షిణ కరముల్"

సుందోపసుందులిద్దరూ మిక్కిలి మదించిన వారై 'ఇది నాభార్య, ఇది నాభార్య అని ఆ తిలోత్తమ కుడి ఎడమ చేతులు పట్టుకున్నారు. 'సుందరీ! మా ఇద్దరిలో ఎవరిని కోరుతావో చెప్పుమని కోరారు. మీలో మీరు యుద్ధం చేసి ఎవడు గెలుస్తాడో అతడినే కోరుతాను అంటూ తిలోత్తమ చెప్పింది. ఆమె కారణంగా సుదోపసుందులు వ్యతిరేక బుద్ధితో కోపాత్ములై పిడుగుల వంటి గట్టి పిడికిటి పోట్లతో ఒకరినొకరు పొడుచుకొని చనిపోయారు. ధైర్యవంతులు కూడా స్త్రీల కారణంగా విరోధం పొందుతారు. అన్ని విషయాల్లో ఏక సూత్రత పాటించిన సుందోపసుందులు స్త్రీ విషయంలో విభేదించారు. ఆ కారణంగా చివరికి ఇద్దరూ మరణించారు.

శ్లో॥ ధర్మార్థ కామ మోక్షాణాం, ప్రాణాస్సంస్థితి హేతవ: ।
తాన్నిఘ్నతాం కింన హతం, రక్షతా కింన రక్షితమ్ ॥

'ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాల నిలకడకు ప్రాణాలు హేతువులగుతున్నాయి. అట్టి ప్రాణాలను పోగొట్టుకొన్న వాడు సర్వమును పోగొట్టు కొన్నవాడే అవుతున్నాడు. వాటిని రక్షించుకొంటే సర్వమూ రక్షించుకొన్నవాడే అవుతున్నాడు' అని మహాభారతం తెలుపుతున్నది. బతికి పురుషార్థాలు సాధించాల్సిన సుందోపసుందులు 'కామం' కోసం ప్రాణాలు పోగొట్టుకున్నారు.

నేటి సమాజంలో మనకు అనేకమంది సుందోపసుందులతో పాటు, కీచకులు సైతం ఎంతోమంది మనకు నిత్యం తారసపడుతుంటారు. అయితే సుందోపసుందుల వలే నేటి ఆధునిక మానవుడు కూడా పరస్త్రీ వ్యామోహంలో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నవారూ, హత్యలకు గురవుతున్నవారూ, హత్యలు చేస్తున్నవారూ, కనిపిస్తున్నారు. దీనివల్ల జరిగే అనర్థాలను మహాభారత సాహిత్యం ఏనాడో మనకు తేల్చిచెప్పింది. ఇక ఇప్పటికీ కీచక, దుశ్శాసనుల అకృత్యాలు నిత్యకృత్యంగా మన సమాజంలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ సంఘటనలను ఉదహరిస్తూ సమాజాన్ని మేల్కొలపటం సాహిత్యవేత్తలందరి నైతిక బాధ్యతగా మనం భావించాలి.

**కుటుంబ సంబంధం**

భారతీయ సనాతన ధర్మానికి కుటుంబ వ్యవస్థ పట్టుగొమ్మ. ఏ కాలానికైనా ఈ కుటుంబ వ్యవస్థను కాపాడుకుంటేనే మన భారతీయ సమాజం నిలదొక్కుకుంటుంది. కుటుంబ సభ్యుల మధ్య ఉండాల్సిన అన్యోన్యతను 'మందపాలోపాఖ్యానం'వివరిస్తున్నది.

పూర్వం మందపాలుడనే మహాముని బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరించి వెయ్యి దేవతా సంవత్సరాలు నిష్ఠతో భయంకరమైన తపస్సు చేశాడు. ఆ మందపాలుడు యోగాభ్యాసం చేత శరీరం విడిచి వెళ్ళి, పుణ్య లోకాలను ప్రవేశించలేక, వెంటనే వెనుతిరిగి దేవతలతో ధైర్యంగా ఇలా అన్నాడు. "నాకు పుణ్యలోకాలు లేకుండా పోవటానికి నేనేమి పాపం చేశాను?". ఆముని ప్రశ్నకు దేవతలు ఇలా అన్నారు. 'ఓ మునీశ్వరా! ఎంత తపస్సు చేసినా సంతానంలేనివాళ్ళు మోక్షాన్ని పొందగలరా? నీ తపస్సెందుకు? వెళ్ళి సంతానాన్ని పొందు' అన్నారు. వారి మాట ప్రకారం ఆ ముని మానవలోకానికి తిరిగి వచ్చాడు. త్వరగా తాను పుత్రులను పొందటం ఎట్లా సాధ్యమవుతుందో ఆలోచించాడు. పక్షులలో సంతానం ఎక్కువ కావటం చూచి తాను మగ 'లావుక' పక్షిరూపం ధరించాడు. ఆడ లావుక పక్షి జరితతో సంభోగించాడు. వారికి జరితారి, సారిసృక్కు, స్తంభమిత్రుడు, ద్రోణుడు అనే నలుగురు కొడుకులు పుట్టారు. ఆ నలుగురు గొప్ప బ్రహ్మజ్ఞానం కలవారు. వారిని ఖాండవ వనంలో ఉంచి తాను తన మొదటి భార్య అయిన లపితతో కలిసి విహరిస్తూ ఉండగా అగ్ని ఆ వనాన్ని కాల్చడం ప్రారంభించాడు. అప్పుడు మందపాలుడు అగ్ని సూక్తులతో అగ్ని దేవునికి స్తోత్రం చేశాడు. "ఓ అగ్నిహోత్రా! నీవు పరిపూర్ణ ధర్మమూర్తివి. నా వీర్యం నుండి పుట్టిన నలుగురు కుమారులు లావుక పిట్టలను దయతో రక్షింపుము" అని ప్రార్థించాడు.

దు:ఖిస్తున్న తల్లిని చూచి పెద్ద కొడుక జరితారి 'అమ్మా! కలుగులోకి దూరితే అక్కడుండే ఎలుక మమ్మల్ని చంపేస్తుంది. ఇక్కడే ఉన్నా అగ్నిదేవుడు కాలుస్తాడు. ఎలకచేత చావటం కంటే అగ్నిజ్వాలలో పడి మాడి పుణ్యలోకాలకు పోవటం మంచిది కదా! అన్నాడు. గాలి వశాన మంట తొలగితే మేము బ్రతుకుతాము. కష్టసమయాల్లో బాధ కలిగితే కలగవచ్చు. లేకుంటే తప్పిపోవచ్చు. కచ్చితంగా కూడా జరుగుతుందని తెలిసి తప్పు చేయటం కంటే సందేహం ఉన్న పనులు చేయడం మంచిది కదా! అందువల్ల మేము బిలంలోకి వెళ్ళం. నీవు మామీద మమకారాన్ని వదలి వెళ్ళు. మేము కాలిపోయినా నీవు జీవించి మళ్ళీ పుత్రులను పొందగలవు. నీ పుణ్యం వలన మాకు అగ్ని భయం తొలగిపోతే నీవు మా వద్దకు వచ్చి ఎప్పటిలాగే రక్షిస్తావు' అని నలుగురు కొడుకులు మ్రొక్కారు. వాళ్ళను చూసిన జరిత కన్నీరు కార్చింది. దహించి వేస్తూ వస్తున్న అగ్నినుండి తప్పించుకొనుటకు ఆకాశానికి ఎగిరింది.

**"నలుగురు నాలుగు వేద**
**ములమంత్రములొప్ప బ్రహ్మముఖములు వోలెన్**
**వెలయంగ సంస్తుతించుచు**
**నలఘులు మా కభయ మభయ మని రయ్యనలున్" (ఆదిపర్వం – అష్టమాశ్వాసం –312వ పద్యం)**

అంటూ ఆ నలుగురు అభయం ఇమ్మని అగ్నిదేవున్ని ప్రార్థించారు. మందపాలుని ప్రార్థన మన్నించి ఆనలుగురు ఉన్న వృక్షాన్ని కాల్చకుండా వదిలి పెట్టాడు అగ్నిదేవుడు.

అగ్నిహోత్రుడు తన ప్రార్థన మరచిపోతాడేమోనని, ఒకవేళ మరవకపోయినా నా పుత్రులు లావుక పక్షులను గుర్తించలేక పోతాడేమో, లేదా గుర్తించినా సమయం వచ్చినప్పుడు ప్రయత్నించి రక్షించక మోసగిస్తాడేమో, దుర్మార్గులను నమ్మ తగదుగదా! అంటూ మందపాలుడు సందేహించాడు. అపుడు లపిత 'ఓ మునీశ్వరా! నా ఎదుట నీవు ప్రార్థించినపుడు ఆ అగ్నిదేవుడు లావుక పక్షులను నలుగురిని రక్షిస్తానని పలికిన సంగతి మరచి పోయావా! అంటూ ప్రశ్నించింది భర్త మందపాలుని. ఇంకా భార్యమీద ప్రేమతో నీవు దాని యోగక్షేమాలు విచారిస్తున్నావు. అది పక్షి. ఎక్కడికైనా పరుగెత్తగలదు. దానికేమి కాదు. చింతించకు' అని లపిత ధైర్య వచనాలు పలికింది. అపుడు మందపాలుడు చిరునవ్వుతో 'వశిష్ఠుని వంటి పురుషుడిని అయినా అరుంధతి వంటి భార్య కూడా స్త్రీ విషయంలో అనుమానించకుండా ఉండదు. ఇది స్త్రీలకు సహజమే' అని లపితను వదిలి ఖాండవ వనానికి వచ్చి కొడుకులతో కూడి క్షేమంగా ఉన్న జరితను చూచి తృప్తి పొంది, అటు తర్వాత తనకు ఇష్టం వచ్చిన చోటికి పోయాడు.

అయితే నేటి కుటుంబ వ్యవస్థ చాలా పతనావస్థకు చేరువవుతూ ఉంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న భారతీయ కుటుంబ వ్యవస్థ నేటి వ్యష్టి కుటుంబ వ్యవస్థగా అనేక పరిణామాలను పొందుతూ ఉంది. అభివృద్ధి అవసరమే, అయితే అభివృద్ధి పేరు చెప్పుకుంటూ మన కుటుంబాల్ని మనమే చిన్నాభిన్నం చేసుకోవడం నీడనిచ్చే చెట్టు వేరును తుంచివేయడం లాంటిదే. అంతేగాక డాలర్ వ్యామోహంతో పరాయి దేశాలకు వలస వెళ్ళే భారతీయ యువత కూడా ఇలాంటి కథల్ని చదివితే, మాతృదేశ సంస్కృతి సమాజాలపై గౌరవం పెరుగుతుందని కూడా ఈ కథ వల్ల తెలుస్తుంది.

మహాభారత గ్రంథాన్ని నేటి సామాజిక, సాంస్కృతిక, మానవతా విలువల దృష్టితో అధ్యయనం చేయడం చాలా అవసరం. ఆ దిశగా మన ప్రయత్నాలను మొదలు పెడితే తగ్గిపోతూ వస్తున్న మన సంస్కృతీ సాంప్రదాయాలను మనం కాపాడుకున్నవారిమి అవుతాము. ఆ దిశగా మన ప్రయత్నాలు మొదలు పెట్టి సఫలీకృతం అవ్వాలని ఆశిద్దాం.

## ఆధార గ్రంథాలు


1. ఆచార్య రఘునాధశర్మ, శలాక (1952) భారత ధ్వని దర్శనము, ఆనందవల్లీ గ్రంథమాల, అనంతపురం
2. డా॥రామకోటిశాస్త్రి, కేతవరపు ( 1965) మహాభారత తత్త్వదర్శనము – గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ
3. డా॥ శ్రీరాములు, దక్కీపురం (2014), నన్నయభారతం –ఉపాఖ్యానాల విశ్లేషణ –(అముద్రిత పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం)
4. డా॥ రామప్రసాద్‌రెడ్డి, తప్పెట (2010) తిక్కన మహాభారత ఉపాఖ్యానాలు మానవ స్వభావ చిత్రణ – స్వీయప్రచురణ, కడప
5. శేషగిరిరావు, దేవరకొండ (1967) భారత కథలు – అంతరార్థము – శ్రీపతి ప్రెస్, కాకినాడ.
6. రామకృష్ణమాచార్య, నండూరి (2005), కవిత్రయము – సాహిత్యపీఠం, సికింద్రాబాదు
7. శ్రీరామచంద్రుడు, పుల్లెల (2012), మహాభారత సార సంగ్రహము, శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాదు.
8. డా॥ గురజాడ, గరికిపాటి (2022) ఆంధ్రమహాభారతం – ఆధునిక జీవితం, ఎస్.ఆర్. పబ్లికేషన్స్, విజయవాడ
9. భూమన్ (2007) (సంపాదకులు), కవిత్రయ మహాభారతము – జాతీయ సదస్సు ఉపన్యాస సంకలనం, తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ, తిరుపతి

# 9. ఆంధ్రమహాభారతము - ఆదిపర్వము - ఆచరణీయ సామాజిక విలువలు

– డా॥ పులవర్తి పైడిరాజు, వి.మాడుగుల, అనకాపల్లి

**ఉపోద్ఘాతం**

"హితేన సహితమ్ సాహిత్యమ్" – సమాజహితమే సాహిత్య పరమ లక్ష్యం. సమాజం సాహిత్యం చేత ప్రభావితమవుతుంది. సాహిత్యం సమాజం యొక్క ప్రతిబింబమే కాబట్టి సాహిత్యంలో సామాజిక అంశాలకూ చోటు దక్కుతుంది. అదే సందర్భంలో సామాజిక విలువలను కాపాడడానికి, పెంపొందించడానికి కవి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తాడు. తను చెప్పదల్చుకున్నది 'కాంత సమ్మితం'గా చెప్పి సామాజికునిలో పరివర్తనను తీసుకురావడానికి ప్రయత్నిస్తాడు. అట్టి ప్రయత్నమే ఎందరో ఋషులు (కవులు) చేసి ఆదర్శవంతమైన సమాజం నిర్మాణమవడానికి కారణభూతమైనారు. వారిలో విష్ణుసన్నిభుడు, ఆదిముని, పరాశరాత్మజుడైన వేదవ్యాసమహర్షి ఒకరు.

చతుర్విధ పురుషార్థాలను సాధించడానికి చతుర్వేదసారమైన "జయము"ను పంచమ వేదంగా ప్రవచించారు. వ్యాసమహర్షి అతని శిష్యుల ద్వారా "జయము"ను విశ్వవ్యాప్తం చేశారు. వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పినపుడు అది భారతంగాను, సూతమహర్షి శౌనకాది మహామునులకు చెప్పేటపుడు అది మహాభారతం గాను ప్రసిద్ధి పొందింది.

లోక ప్రసిద్ధమైన మహాభారతం భారతీయ భాషలలో పలుమార్పులకు గురైంది. రాజరాజనరేంద్రుడు భారత శ్రవణాసక్తుడై, విపులశబ్ద శాసనుడు, సంహితాభ్యాసుడు, బ్రహ్మాండాది నానా పురాణ విజ్ఞాన నిరతుడైన నన్నయ భట్టారకుని రావించి "కృష్ణద్వైపాయన ముని వృషభాభిహిత మహాభారత బద్ధ నిరూపితార్థ మేర్పడ దెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్"[1] అని ఆనతీయగా నన్నయ వినమ్రంగా "భారత భారతీ సముద్రము దఱియంగ నీదనువిధాతృకైనను నేరcబోలునే"[2] అని అంటూనే, విద్వజ్జనంబుల అనుగ్రహంతో "నా నేర్చు విధంబున" ఈ కావ్యమును రచియించెదనని పలికి, సర్వదేవతా ప్రార్థన చేసి, వాల్మీకాది మహాకవులను స్మరించి, వ్యాసుని సేవించి, తన సహాధ్యాయుడు, మిత్రుడున్నూ అయిన నారాయణభట్టు సహకారంతో "జగద్ధితంబు"గా భారత రచనకు పూనుకున్నాడు.

నన్నయ తన భారతావతారికలో భారతం ఎవరెవరికి ఎలా దర్శనమిస్తుందో చెప్తూ....

**"ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని**
**యధ్యాత్మ విధులు వేదాంత మనియు**
**నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని**
**కవి వృషభులు మహా కావ్యమనియు**
**లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని**
**యైతిహాసికు లితిహాసమనియుc**
**బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ**
**యంబని, మహి గొనియాడు చుండ**
**వివిధ వేద తత్త్వవేది వేద వ్యాసుc**
**డాది ముని పరాశరాంత్మజుండు**
**విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై**
**పరcగు చుండ c జేసె భారతంబు.**

మహాభారతాన్ని ఎలా చూస్తే అలా కన్పిస్తుందని నన్నయ తెలిపాడు. అట్టి భారతంలో అది పర్వంలోని అనేక వృత్తాంతాలు, ఉపాఖ్యానాలు నేటి సమాజానికి ఆచరణీయమైన విలువలను ప్రతిపాదిస్తున్నాయి. వాటిలో సరమ వృత్తాంతము, ఉదంకోపాఖ్యానము, గరుడోపాఖ్యానము, కచదేవయాని వృత్తాంతము మొ॥నవి ఉన్నత సామాజిక విలువలను ప్రతిపాదిస్తున్నాయని వివరించడమే ఈ పరిశోధన వ్యాస ముఖ్యోద్దేశ్యం.

### సరమ వృత్తాంతము

జనమేజయుడు యజ్ఞం చేసినపుడు ఆ ప్రదేశానికి దేవతల కుక్క 'సరమ' కొడుకైన సారమేయుడు వచ్చి యజ్ఞవాటిక చుట్టూ తిరుగుతుండగా జనమేజయుని సోదరులైన శ్రుతసేనుడు, ఉగ్రసేనుడు, భీమసేనుడు కోపించి సారమేయుడిని కొడతారు. అపుడు అది ఏడుస్తూ తల్లియైన సరమకు విషయాన్ని వివరిస్తుంది. అపుడు సరమ మిక్కిలి కోపంతో కూడినదై జనమే జయుని చెంతకు వచ్చి "ఓ! రాజా! అమాయకుడైన, చిన్నవాడైన నా బిడ్డని ఏమాత్రమే కనికరము లేకుండా నీ సోదరులు కొట్టారు" అని అంటూ....

**"తగునిది తగదని యెదలో**
**వగవక, సాధులకు పేద వారలకెగ్గల్**
**మొగిc జేయు దుర్వినీతుల**
**కగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్"**[4]

(ఈ పని యుక్తమైనది, అయుక్తమైనది అని తలచక బీదవారికి, అశక్తులైన వారికి, మంచి వారికి అపకారాలు చేసే నీతి రహితులకు కారణం లేకుండానే ఆపదలు వస్తాయి")

సరమ మాటల్లో నన్నయ ఈ సన్నివేశాన్ని ఆధారంగా చేసికొని సృష్టిలో కేవలము మానవులకే కాకుండా సర్వజీవరాశు లకు తమ బిడ్డల ఎడ అవ్యాజమైన ప్రేమ ఉంటుందని, ఆ బిడ్డకి ఎవరైనా కీడు చేస్తే ఆ తల్లి హృదయం తల్లడిల్లి దానికి కారణభూతమైన ఎంతటి వారినైనా ప్రశ్నించి తీరుతుందని, తన ఆక్రోశాన్ని వెళ్ళగక్కుతుందని తేటతెల్లం చేశాడు. మరియు ఏదైనా ఒక పని చేసేటపుడు అది స్వల్పమైనా, అనల్పమైనా ఈ పని చేయదగ్గరది, చేయకూడనిది అని ఒక్క క్షణం ఆలోచించి చేయాలని, అధికారబలం, ఆర్థిక బలంతో అహంకరించి పేదవారికి, అశక్తులకీ, మంచి వారికీ అపకారం చేస్తే ఎలాంటి వారికైనా ఆపదలు కలుగుతాయని దీని ద్వారా మనం గ్రహించాలి.

అంటే ఒక దుష్కర్మ చేస్తే ఆ పాప ఫలితాన్ని అడ్డుకోవడం ఏ శక్తి వల్లనూ సాధ్యం కాదు. అలాగే మన సత్కర్మల ఫలితాలను అందకుండా ఏ దుష్టశక్తి కూడా ఆటంక పరచలేదు.

### ఉదంకోపాఖ్యానం

పైల మహర్షి శిష్యుడైన ఉదంకుడు గురువుని సేవించి అణిమాది అష్టసిద్ధులను సాధించిన పిదప, గురుదక్షిణగా పౌష్యమహారాజు దేవేరి కర్ణాభరణాలను గురుపత్నికి కానుకగా సమర్పించడానికి సంకల్పించి ఒంటరిగా అడవి గుండా వెళు తుండగా ఒక దివ్యపురుషుడు నియోగించిన ఎద్దు పేడను తిని, అతని దయతో పౌష్యమహారాజు వద్దకు వెళ్ళి అతని దేవేరి కర్ణాభరణాలను అర్థించాడు. అపుడు పౌష్యుడు "ఆర్యా! నీవే ఆమె వద్దకు వెళ్ళి నా మాటగా కుండలాలను స్వీకరించు" అని పలుకగా ఉదంకుడు అంతఃపురంలో పౌష్యపత్నిని కానరాక తిరిగివచ్చి "ఓ! రాజా! నీ దేవేరిని నేను అంతఃపురంలో చూడలేకపోయాను. నీవే స్వయంగా ఆ కుండలాలను ఇప్పించు" అని పలుకగా పౌష్యుడు "నా దేవి అపవిత్రులకు కానబడదు" అని చెబుతాడు. అపుడు ఉదంకుడు గోమయ భక్షణము చేత తనకు అపవిత్రత కల్గిందని భావించి ఆచమనం చేసుకొని పవిత్రుడై పౌష్యదేవేరి చెంతకు పోగా ఆ దేవి ఉదంకునికి తన కుండలాలను ఇచ్చి "ఓ! మునిశ్రేష్ఠా ఈ కుండలాలపై

మాయావియైన సర్పరాజు తక్షకుడు కన్నేశాడు. కావున జాగురూకడవై ఉండు" అని హెచ్చరిస్తుంది. అలాగే అని ఉదంకుడు ఆమె వద్ద సెలవు తీసుకొని పౌష్యుని చెంతకు వెళ్ళగా "ఆర్యా! నీవు మా అతిథివి. మా ఇంటిలో భోజనం చేసి వెళ్ళు" అని కోరగా ఉదంకుడు అంగీకరించి భోజనం చేసేటపుడు అన్నం వెంట్రుకచేత అపవిత్రం కాగా కోపం తెచ్చుకొని ఉదంకుడు "పరీక్షింపబడని, అపవిత్రమైన అన్నం పెట్టినందువలన నీవు అంధుడివి అగుము" అని శపించాడు. దీనికి ప్రతిగా పౌష్యుడు కోపించి "చిన్న తప్పుకు శాపమిచ్చావు కాబట్టి నీవు సంతానము లేనివాడవగుము" అని మారు శాపమిచ్చాడు.

అప్పుడు ఉదంకుడు పౌష్యునితో "రాజా! నేను సంతానము లేనివాడను కాలేను నా శాపము తొలగించు" అని పలుకగా పౌష్యుడు "విప్రుల మనసు నవనీత తుల్యము, అదే రాజులకు వజ్రకఠినము కావున నేను శాపమును ఉపశమింపచేయలేను. నీవు నాకొసగిన శాపమును ఉపశమింపజేయుము" అని వేడుకోగా కొద్దికాలము మాత్రమే నీకు అంధత్వము కలుగుతుందని చెప్పి ఉదంకుడు ప్రయాణమవుతాడు.

దారిలో తక్షకుడు కుండలాలను అపహరించుకొని నాగలోకానికి పోతాడు. ఉదంకుడు తక్షకుని వెంబడించి సర్పరాజులను వివిధ రకాలుగా స్తుతించి, ఒక దివ్యపురుషుని చూచి అతని సహాయంతో నాగలోకాన్ని, తక్షకుణ్ని భయభ్రాంతులను చేసి కుండలాలను తక్షకుడి నుంచి గ్రహించి దివ్యపురుషుని అశ్వముపై ప్రయాణము చేసి గురుపత్నికి సభక్తికంగా సమర్పిస్తాడు.

ఉదంకుడిని గురువైన పైల మహర్షి ఎందుకింత ఆలస్యమైనదని అడుగగా అప్పుడు ఉదంకుడు జరిగిన విషయాన్ని వివరిస్తాడు. అప్పుడు గురువు ఎంతో ప్రియాన్ని పొంది "నీ యొక్క గురుఋణం తీరినది. నీ ఇచ్ఛ వచ్చినట్లు సుఖంగా జీవించు" అని దీవించి పంపెను. ఉదంకుడు అనేక సంవత్సరాలు తపస్సు చేసి తక్షకుడు తనకు చేసిన అపకారానికి ప్రతీకారం చేయడానికి జనమేజయ రాజు వద్దకు వెళ్లి సర్పయాగము చేయమని, "నీ తండ్రియైన పరీక్షిత్తు చావుకు కారణమైన తక్షకుణ్ని సంహరించుము" అని చెప్పి అతడిని సర్పయాగానికి పురిగొల్పుతాడు.

ఈ కథ ద్వారా ఉదంకుని వలె మనమూ సదాలోచనతో పని మొదలు పెట్టినప్పుడు మధ్యలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా అవి మన భావిజీవితానికి బంగారు బాటలుగా మారుతాయని తెలుస్తుంది. ఎందుకంటే ఉదంకుడు గురువు యొక్క కోరికను తీర్చి ఆయనను సంతోషపెట్టవలసిన సందర్భం వచ్చింది. ఉత్సాహంతో బయలుదేరి విజయాన్ని సాధించాడు. దీన్నిబట్టి మనకు అవగతమౌతున్నదేమిటంటే నేటి సమాజంలో మానవులకు నిజమైన ఆనందం, ఆత్మ సంతృప్తి, ఆత్మ విశ్వాసం, ప్రశాంతత, ధైర్యం కావాలంటే ఒకే ఒక మార్గం ఉంది. ఇది తప్ప మరోమార్గం లేదు. అది ఏమిటంటే పరులకు ఆనందం కలిగించడానికి మనం కొన్ని మంచి పనులు చేయాలి. ఎప్పుడైతే మనం మంచి పని చేయాలని ఆలోచిస్తామో, ఆ పని పూర్తిగా చేయలేకపోయినా చేయాలని ఆలోచిస్తే చాలు మనలో ధైర్యము, ఆత్మవిశ్వాసము ప్రవేశిస్తాయి. అంతేకాక అతీంద్రియ శక్తులు మనకు సహకరిస్తాయి. ఉదంకునికి దివ్యపురుషుని వరాలు ఇందులో భాగమే.

అందువలన ఆ పనిని పూర్తి చేస్తే ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు కలిగి మనకు ఆత్మవిశ్వాసము ధైర్యము, ఆనందము లభిస్తాయి. అయితే ఏ పనైనా సరే ముందుగా అవహేళన, ప్రతిఘటన, అసూయలు, అనంగీకారము, అవమానము ఎదురై తీరుతాయి. ఆ ఫలితాన్ని అనుభవించిన తరువాత సమాజము అంగీకరిస్తుంది. అంటే స్వర్గాన్ని చేరుకోవాలంటే నరకము గుండా ప్రయాణము చేయాల్సి ఉంటుంది. సుఖాన్ని పొందాలంటే దుఃఖపు దారుల గుండా ప్రయాణంచవలసిందే!

**కోపము అనర్థ హేతువు**

ఉదంకుని కోరికైన కుండలములను అడిగిందే తడవుగా పౌష్యుడు ఇచ్చి, తన ఆతిథ్యాన్ని స్వీకరించమని ప్రార్థించి

అతనికి భోజనం పెట్టించాడు. తలవెంట్రుకతో కూడిన అన్నాన్ని చూసి ఉదంకుడు తనకు మేలు చేసిన పౌష్యుని కనికరించడకుండా గ్రుడ్డివాడవు కమ్మని శపించడం అతని కోపప్రవృత్తికి తార్కాణం.దానికి ప్రతిగా పౌష్యుడు కూడా ఉదంకుణ్ని సంతానము లేనివాడవు కమ్ము అని శపించాడు. ఉదంకుని కోపం ఉపశమింపలేని శాపం అయ్యింది. కాబట్టి ఏ విధంగా చూసినా కోపం అనేది అనర్ధదాయకం. కోపం ఎదుటివారికి ఇబ్బందులు మాత్రమే కాదు మన అనారోగ్య హేతువు కూడా కాబట్టి శాంతమే నేటి సమాజానికి శరణ్యం.

### గరుడోపాఖ్యానము

ఈ కథలో కశ్యప ప్రజాపతికి వినత, కద్రువ అనే ఇద్దరు భార్యలు. వారిలో కద్రువ సంతాన్ని చూసి వినత అసూయతో తన అండాన్ని పగులకొట్టుకోగా అసంపూర్ణరూపుడైన అనూరుడు జన్మించి, తల్లికి శాపమిచ్చి సూర్యుని రథసారథిగా వెళ్ళిపోతాడు. కాబట్టి అసూయవలన తన సంతానము చేతే శాపము లభించడం ఏ తల్లికైనా తీరని శోకం. సవతికి దాసియై గరుత్మంతుని జననం కోసం నిరీక్షించిన వినత దుఃఖాన్ని దిగమింగింది. గరుడుడు కూడా అమిత బలపరాక్రమములు కలిగి ఉండి కూడా కద్రువకు దాసుడై ఊడిగం చేస్తూ ఉండేవాడు. తల్లి దాస్య విముక్తికై గరుడుడు అమృతం తేవడానికి స్వర్గానికి వెళ్లడం, ఇంద్రునితో యుద్ధం, చివరకు విష్ణువు వాహనంగా మారడం నేటి సమాజానికి ఆదర్శనీయం.

ఒక పక్షియై కూడా తల్లి యొక్క కష్టాన్ని చూసి చలించి, అసాధ్యమైన అమృతాన్ని సాధించడానికి దీక్షపూని సుదీర్ఘ ప్రయాణం చేసి ఆటంకాలను అధిగమించి తల్లి యొక్క దాస్య విముక్తియే పరమ లక్ష్యంగా భావించి దేవతాశ్రేష్ఠులతో యుద్ధం చేసి భయంకర విషాగ్నులు కల్గిన నాగులను ఎదిరించి అమృతాన్ని గ్రహించి, తనవద్దనే ఉన్న అమృతపు విలువను తెలిసి కూడా తాను ఒక గుక్క కూడా తాగకుండా ఉండడం వలన విష్ణువు గరుడునికి అనేక వరాలు ఇచ్చాడు.

ఈ కథ ద్వారా తల్లి యొక్క దాస్యవిముక్తియే ప్రధాన లక్ష్యమైన గరుడినికి భగవంతుడైన విష్ణువు మెచ్చి అతనికి ఉన్నతమైన స్థానాన్ని కల్పించాడు. అంతేగాక ఇంద్రుడు ఇతని స్నేహాన్ని ఆకాంక్షించాడు. దీన్ని బట్టి నేటికాలంలో తల్లిదండ్రుల ఆకాంక్షలు తీర్చిన సంతానానికి ఉన్నత స్థానాలు కలుగుతాయని, లక్ష్యశుద్ధి ఉంటే దైవానుగ్రహం తప్పక ఉంటుందని బోధపడుతుంది.

### కచ దేవయాని వృత్తాంతం

ఈ కథ అనేక సామాజిక విలువలకు పట్టుగొమ్మ వంటిది. గురువు శుక్రాచార్యుడు తన వైరి కొడుకైన బృహస్పతి పుత్రుడికి కూడా చదువు చెప్పడంలో గురువుకు విద్యనందించడంలో తారతమ్యాలు లేవని తెలుస్తుంది. అలాగే శుక్రాచార్యుడు సురాపాన మోహితుడై కచుని భస్మమిశ్రితమైన సురను సేవించి తుదకు సురాపానం వలన పతితులు పాపాత్ములౌతారని శపించడం నేటికాలంలో మద్యపాన దోషాలను ఆనాడే తెలియజేయడం జరిగింది.

మృతసంజీవనీ విద్య నేర్చుకున్న కచుడిని దేవయాని "నేను కన్యను, నీవు బ్రహ్మచారివి కనుక మనమిద్దరం వివాహం చేసుకుందాం" అని పలుకగా!

**"గురులకు శిష్యులు పుత్త్రులు**
**పరమార్థమ లోకధర్మ పథమిది; దీనిం**
**బరికింపక యీ పలుకులు**
**తరుణీ! గురుపుత్త్రి! నీకుఁ దగునే పలుకన్"[5]**

(గురువులకు శిష్యులు కొడుకులతో సమానం. ఇది పరమ సత్యము. లోకము అనుసరించవలసిన ధర్మమార్గము) అని కచుడు పలికెను.

దీనిని బట్టి ప్రస్తుత సమాజము గురుశిష్యుల సంబంధమును పునరాలోచించవలసిన ఆవశ్యకత ఎంతయో యున్నది. గురువులు ఈ విషయాన్ని గ్రహించి తమ శిష్యులను తన సంతానముగా భావించి వారిని సన్మార్గములో నడిపించుటకును, పెడత్రోవల నుండి మరలించుటకును ఒక తండ్రివలె దీక్షపూని వారి అభ్యున్నతికి పాటుపడి సంస్కారవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన సమయం ఆసన్నమైంది.

దాదాపు 5 వేల సంవత్సరాల క్రితం జరిగిందని భావిస్తున్న మహాభారతంలోని అంశాలు నేటికీ ప్రయోజనకరములై ఈనాటి సమాజాన్ని ప్రభావితం చేస్తూ చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలను సాధించడంలో సహాయపడతాయి. వింతపోకడలు పోతూ, సమాజం ఎటు వెళ్ళిపోతుందో తెలియని స్థితి నుంచి బయటపడాలంటే మహాభారతంలోని నీతిని గ్రహించి, కవి హృదయాన్ని తెలిసికొని మసలు కోవాలి. అలాగే రసానుభూతిని పొందుతూ మానసికంగా ఎదుగుతూ, మానవ సంబంధాలను మెరుగుపరుచుకుంటూ మనిషిని మనీషిగా మార్చే మహామంత్రమే మహాభారతం.

**"అసతోమా సద్గమయ!**
**తమసోమా జ్యోతిర్గమయ!**
**మృత్యోర్మా అమృతంగమయ!"**

అనే మహర్షుల మార్గాన్ని చేరుకోవాలంటే 'మహాభారతాన్ని' చేబూనాలి.

**పాదసూచికలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము–ఆదిపర్వము – ప్రథమాశ్వాసము– 16వ పద్యం– పుట 13
2. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము–ఆదిపర్వము – ప్రథమాశ్వాసము –19వ పద్యం– పుట 14
3. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము–ఆదిపర్వము– ప్రథమాశ్వాసము –32వ పద్యం– పుట 24
4. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము–ఆదిపర్వము – ప్రథమాశ్వాసము–85వ పద్యం – పుట 60
5. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము–ఆదిపర్వము–తృతీయాశ్వాసము–131వ పద్యం– పుట 258

**ఆధారగ్రంథాలు**

1) కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – ఆదిపర్వము – మొదటి భాగము – తి.తి.దే, తిరుపతి – 2008.
2) తెలుగు సాహిత్య సమీక్ష ప్రథమ సంపుటం : జి. నాగయ్య, నవ్యపరిశోధన ప్రచురణలు, 18.01.699, భవానీ నగర్, తిరుపతి.
3) ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయాలు – ప్రయోగాలు (ద్వి.ము) : డా॥ సి.నారాయణ రెడ్డి, శివాజీ ప్రెస్, సికింద్రాబాద్, 1977.
4) తెలుగు సాహిత్య చరిత్ర : ఆచార్య వెలమల సిమ్మన్న, దళిత సాహిత్య పీఠం విశాఖపట్నం, 2005.
5) సమగ్రాంధ్ర సాహిత్యం (1,2 సంపుటాలు) : ఆరుద్ర – ఎం.శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు, 1965.

# 10. శ్రీమదాంధ్రమహాభారతం- ఆదిమ గిరిజన తెగల ప్రస్తావన

- డా॥ నూనావత్ రాంబాబు, నెల్లూరు.

## పరిచయం

శ్రీమదాంధ్రమహాభారతం (T.T.D) వారు ప్రచురించిన 15 సంపుటాలలో గిరిజన ప్రస్తావన ఉన్న 9 పర్వాలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా ఈ 8 పర్వాలకు సంబంధించి ఇందులో ఆదిమ గిరిజనులను లోతుగా అధ్యయనం చేయడం ప్రధానం. తిరుమల తిరుపతి దేవస్థానం వారు తెలుగులో సరళవ్యాఖ్యాన సహితంగా ఉన్న శ్రీమదాంధ్ర మహాభారతము 9 పర్వాలు. అవి 1.ఆదిపర్వం (రెండోభాగం) 2.సభాపర్వం, 3. అరణ్యపర్వం, 4. అరణ్య పర్వ శేషము, 5. భీష్మపర్వం 6.ద్రోణపర్వం 7. శాంతపర్వం 8.అశ్వమేధపర్వం 9. మౌసలపర్వంలో ఉన్న ఆదిమ గిరిజనుల సామాజిక జీవనం ఎలా, ఏవిధంగా వుందనే అంశాలను లోతుగా అధ్యయనం చేయడం జరిగింది. ఇందులో ఉన్న ఆదిమ గిరిజనులకు సంబంధించిన అనేక అంశాలను వివరించడం ఈ పరిశోధన పత్రం ముఖ్య ఉద్దేశం.

## శ్రీమదాంధ్రమహాభారతం - ఆదిమ గిరిజన తెగల ప్రస్తావన

ఏకలవ్యుడు గురుదక్షిణ చెల్లించడం, హిడింబి వృత్తాంతం, భీమసేన హిడింబాసురుల యుద్ధం, భీముడు తల్లి అనుమతితో హిడింబిని వివాహమాడటం, హిడింబకు ఘటోత్కచుడు జన్మించడం, ధర్మరాజు రాజసూయయాగానికి పూనుకోవడం దానికి పాండవులు దిగ్విజయ యాత్ర చేయడం ద్వారా అనేక ఆదిమ గిరిజన రాజ్యాలను ప్రస్తావించడం వంటి అంశాలు, కిరాతార్జునీయంలో కిరాతకుడుగా దేవదేవుడు శివుడు అర్జునుడికి యుద్ధ వర్ణన, నలుడు దమయంతి అడవి పాలుకావడం, దానిద్వారా దమయంతికి కిరాతక గిరిజనుడు అడవిలో దారిచూపడం, కిరాతకున్ని దమయంతి శపించడం వంటి అంశాలు అన్నింటికంటే ముఖ్యంగా ధర్మవ్యాధోపాఖ్యానంలో కౌశికుడు అయిన బ్రాహ్మణునికి ధర్మ సందేహాలను, ధర్మవ్యాధుడు అయిన ఒక కిరాతక ఆదిమ జాతికి చెందిన గిరిజనుడు ధర్మసందేహాలను తీర్చడం, కిరాతకుడైన ధర్మం, అహింస, జీలవక్షణాలు, బ్రాహ్మణ విద్యను, సత్త్వ, రజ, తమోగుణాలు తెలియజేయడం, తల్లిదండ్రులు పూజించడం వంటి అంశాలను అతని పూర్వజన్మలో బ్రాహ్మణుడని ఒక శాపంవల్ల ఈ జన్మలో జీవనం కోసం మాంసం అమ్ముకొని బతికేవాడుగా కిరాతకుడుగా జన్మించినవాడనే భావన ధర్మవ్యాధోపాఖ్యానంలో వివరించడం జరిగింది.

ఘటోత్కచుడి యుద్ధతంత్రంలో మాయాబలం, ద్రోణాచార్యాదులతో యుద్ధం చేయడం, అలంబుడు చంపడం, అలాయుధాసురుడు యుద్ధంచేసి చంపుట, ఘటోత్కచుడు చేసే మాయా యుద్ధంలో కౌరవులు కకావికలం అవ్వడం గమనించిన దుర్యోధనుడు ఎలాగైనా ఘటోత్కచుడిని చంపమని కర్ణుడుని కోరడం, దానితో ఇంద్రుడిచ్చిన శక్తి ఆయుధంతో ఘటోత్కచుడు నేలరాలడం జరుగుతుంది. అందుకు శ్రీకృష్ణుడు ఘటోత్కచుని మరణాన్ని సంతోషంతో గంతులేస్తూ అర్జునుడికి చెప్పడం, దానికి పాండవు ఆశ్చర్యానికి లోనవ్వుతారు. అప్పుడు శ్రీకృష్ణుడు కర్ణుడు ఘటోత్కచునిపై ఇంద్రుడిచ్చిన ఆయుధాన్ని ప్రయోగించడంచేత కర్ణుడిశక్తి పూర్తిగా నశించింది. దానిద్వారా అర్జునుడికి కర్ణుడి నుండి ప్రమాదం తప్పినందుకు కృష్ణుడు సంతోషాన్ని వెలిబుచ్చాడు, వంటి అంశాల ఆదిమ గిరిజనుల ప్రస్తావన. లుబ్ధ కపోతోపాఖ్యానంలో కపోతం చేసిన త్యాగానికి బోయవాడు పరివర్తన చెందిన దివ్య మానవుడుగా రూపొందుట. ద్వారకానగరం కాలగర్భంలో కలిసిపోవడం, అక్కడ వున్న ద్వారకావాసులను, రాణులను రక్షించడంలో అర్జునుడు బోయలతో యుద్ధం చేయడం, ఆ యుద్ధంలో అర్జునుడు బోయలను నిలువరించలేకపోవడం. అర్జునుడు ఏకలవ్యుడి కుమారుడు యజ్ఞాశ్వం నిషాదరాజు దేశానికి వెళ్ళడం, ఆ దేశ ప్రభువు ఏకలవ్యుడి కుమారుడైన నిషాదదేశ సైన్యాన్ని ఓడించడం మొదలైన సందర్భాలలో ఆదిమ గిరిజన తెగల ప్రస్తావన ఉంది.

ధర్మవ్యాధుని ధర్మనిరతి, పెద్దలపట్ల అణకువ, దయ, బ్రహ్మజ్ఞానం, జీవలక్షణాలు, ప్రేమ, అనురాగం వంటి సద్గుణాలు కలిగిన ఒక గిరిజనుడే తత్త్వ సిద్ధాంతం అనే ఈ ధర్మవ్యాధుని ద్వారా సమాజ శ్రేయస్సు జరుగుతుంది. ధర్మాధర్మాల గురించిన విశ్లేషణ అది ఆనాటి నుండి ఈనాటి వరకు సమాజానికి ఉపయోగకరంగా ఉన్నజ్ఞానం, ధర్మవ్యాధుని ప్రస్తావన మహాభారతంలో ప్రస్తావించడం జరిగింది.

### నన్నయ

ఆది, సభా, అరణ్య పర్వాల్లో ఆదిమ గిరిజనుల గురించి అనేక సందర్భాల్లో ప్రస్తావించారు. వారిలో శబర, పుళింద, కిరాత, నిషాద, లుబ్ధ శబ్దాలతోపాటు, పర్వత నివాసులు, అరణ్య నివాసులు, పర్వతీయులు మొదల్కెన గిరిజనుల ప్రస్తావన ఉంది.

### తిక్కన

భీష్మ, ద్రోణ, శాంతి, అశ్వమేధ, మౌసల పర్వాల్లో గిరిజనుల్ని గూర్చి వర్ణిస్తూ కిరాత, శబర, బోయ, లుబ్ధ, నిషాద శబ్దాల్ని ప్రయోగించాడు. ద్రోణపర్వం చతుర్థాశ్వాసంలో 'కిరాతశబరసేనల' ప్రస్తావన ఉంది. శాంతిపర్వం తృతీయాశ్వాసంలో లుబ్ధ కపోతోపాఖ్యానం ఉంది. అశ్వమేధ పర్వం చతుర్థాశ్వాసంలో అర్జునుడు ఏకలవ్యుని కుమారున్ని జయించిన వర్ణన వర్ణించబడింది.

### ఎఱ్ఱన

అరణ్యపర్వ శేషములో ఆదిమ గిరిజన ప్రస్తావన ఉన్నది. ధర్మవ్యాధుడు మాంసం అమ్ముకొని జీవించే ఒక ఎరుకవాడు అయినా, అతను జన్మాంతం జీవహింస చేసినా, గొప్ప లక్షణాలు కలిగిన వాడిగా తన వృత్తిని చిత్రించాడు. అనేక సందర్భాలలో ఆదిమ గిరిజనుల ప్రస్తావన అరణ్యపర్వ శేషంలో వివరించాడు.

మహాభారతంలో పంచమాశ్వాసంలో 'ఏకలవ్యుని' వృత్తాంతాన్ని నన్నయ రాశారు. ఏకలవ్యుని ఉత్తమోత్తమ శిష్యునిగా నిర్మలమైన గురుభక్తికి ప్రతీకగా నన్నయ రాశారు. ఏకలవ్యుడు హిరణ్యధ్వనుడను ఎరుకల రాజుకుమారుడు. ద్రోణాచార్యుని ప్రసిద్ధిని విని అతడు విలువిద్యను నేర్పమని ద్రోణుని ప్రార్థిస్తాడు. నిషాద పుత్రుడనే కారణం చేత ద్రోణుడు ఏకలవ్యుని కోరికను నిరాకరిస్తాడు. కాని ఏకలవ్యుడు తన పట్టుదలను వీడకుండా ద్రోణున్నే తన గురువుగా భావిస్తాడు. అడవిలోనికి వెళ్లి మట్టితో ద్రోణుని బొమ్మను తయారుచేసి అధికమైన భక్తిశ్రద్ధతో సమస్కరిస్తూ విలువిద్యను అభ్యసిస్తాడు.

### ఏకలవ్యుడు

కురు కుమారుల కుక్క ఒకటి ఏకలవ్యుడున్న ప్రాంతానికి వచ్చి మొరగగా (అరవగా) ఏకలవ్యుడు ఏ కాలంలో ఏడు బాణాల్ని ఆ కుక్క నోటిలో వేస్తాడు. ఆ దృశ్యాన్ని చూచిన కురు కుమారులు ఆశ్చర్యపడి ద్రోణుని వెంటబెట్టుకొని ఏకలవ్యునివద్దకు వస్తారు. అప్పుడు ఏకలవ్యుడు ద్రోణునికి ఎదురేగి నమస్కరిస్తాడు. అప్పుడు ద్రోణుడు గురుదక్షిణను కోరగా ఏకలవ్యుడు తనదేహం, సంపద, నా సేవా సమూహంలో ఏది కావాలో కోరుకోమంటాడు. ద్రోణుడు ఏకలవ్యుని కుడిచేతి బొటన వేలును గురుదక్షిణగా ఇమ్మంటాడు. ఏకలవ్యుడు తన గురుభక్తికి నిదర్శనంగా తన కుడిచేతి బొటనవేలును ఖండించి గురుదక్షిణగా సమర్పిస్తాడు. ఏకలవ్యుడు కిరాతుడ్కెనా అతని మనస్సు నిర్మలమని, గురుభక్తియుతమని, గురుభక్తికి నిదర్శనంగా ఏకలవ్యుడు నిలిచిపోయాడని మనకు తెలుస్తుంది. గిరిజనుల నిర్మలమైన మనస్సుకి ఏకలవ్యుని వృత్తాంతం ఒక కలికితురాయి.

అప్పుడు రాజకుమాయి ఆ కుక్కను బాణాతో కొట్టినవాడికోసం వెతుకుతూ ఉండగా ధనస్సు బాణాలు పట్టుకొని ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తిని చూశారు రాజకుమాయి. అతడు జింకచర్మాన్ని వస్త్రంగా ధరించాడు. నల్లటి అతని శరీరమంతా మురికితో దుర్వాసన కొడుతోంది. రాకుమారుంతా అతడి నేర్పరితనాన్ని మెచ్చుకొని “నువ్వెవరవని” అడిగారు. అతడు“నేను హిరణ్యధన్వుడనే ఎరుకరాజు కుమారున్ని. ద్రోణాచార్య శిష్యున్ని నన్ను ఏకలవ్యుడంటారు” అన్నాడు.

అప్పుడు అర్జునుడు మాత్రం ద్రోణుడు ఒంటరిగా ఉన్నప్పుడు "విలువిద్యలో నీకంటె అధికుడెవ్వడూ లేకుండా నేర్పుతాననినతో అన్నారు. గురువర్యా! ఈ రోజున నాకేకాదు ముల్లోకాకే అధికుడ్కైన ఒక ఎరుక యువకున్ని చూశాం."

**నాకంటెను మీకంటెను? లోకములో నధికుడతి బలుండు ధనుర్వి**

**ద్యాకౌశమున నాతడు? మీకుం బ్రియ శిష్యుడటె యమిథ్యా వచనా! (ఆ.మ.భా.ఆది.5-240)**

'ఆచార్యదేవా! నేను చెప్పే మాట అసత్యమైనది కాదు. ఆ ఎరుకవాడు విలువిద్యలో మీకు ప్రియషిష్యుడట గదా" అన్న అర్జునుడి మాట విన్న ద్రోణుడు అదిరిపడ్డాడు. పదండి చూద్దాం అని వారిని వెంటబెట్టుకుని అడవికి వెళ్ళాడు. ద్రోణుడు రావడం ముందే తెలుసుకున్న ఏకలవ్యుడు వారికి ఏదురేగి గురువుగారిని సాదరంగా ఆహ్వానించి గురుసేవ చేశాడు. అందుకు ద్రోణుడు అతన్ని చూసి "అయితే నాకు గురుదక్షిణ ఇవ్వు" అన్నాడు. (ద్రోణుడు ముందు చూపు ఆలోచించి భవిష్యత్‌లో మహాభారత యుద్ధంలో అర్జునుడికంటే గొప్ప విలువిద్య నేర్పరి ఉండకూడదు అనే భావనతో గురుదక్షిణ ఇవ్వమని కోరాడు). ద్రోణుడతన్ని చూసి అందుకు సంతోషించిన ఏకలవ్యుడు "ఇది నా దేహం. ఇది నా ధనం. వీరంతా నా సేవకులు. ఇందులో మీకేది ఇష్టమో అది తీసుకోండి" అన్నాడు."అయితే నీకుడిచేతి బొటనవెలు కోసి నాకివ్వు" అని ద్రోణుడడిగాడు. ఎందువల్ల నంటే, ఏకలవ్యుడు కుడిచేతి బొటనవెలుని పోగొట్టుకోవడం వలన అతడు విలువిద్యా సంపద పోగొట్టుకున్నవాడవుతాడు. ఏకలవ్యుని ఉదంతం భారతేతిహాసంలో ధ్రువతారలా నిలిచిపోయింది. ఆటవిక వీరునకు ఏకలవ్యుడు తిరుగులేని ప్రతినిధి. ఆదిమ తెగ ప్రతిభాపాటవాకు నిలుటద్దంలా ఏకలవ్యుడు భాసించాడు. విలువిద్యలో ఆరితేరిన యోధుడిగా ఏకలవ్యుడు భారత చరిత్రతో విఖ్యాతుడ్కైనాడు.

ఆదిపర్వంలోని సప్తమాశ్వాసంలో(పు.106) శబరులు వశిష్టుని నందినీ ధేనువు వాలం నుండి, పుళిందులు శకృన్మూత్రా నుండి జన్మించారని నన్నయ వర్ణించాడు. సభాపర్వంలో భీమార్జున నకుల సహదేవులు తమ తమ దిగ్విజయ యాత్రల్లో రాజుల్కైన శబరుల్ని, పర్వతేయుల్ని, కిరాతుల్ని, పుళిందుల్ని, నిషాదుల్ని జయించారని నన్నయ పేర్కొన్నాడు......(సభా. ప్రథమ. 229 – 269 పద్యాలు)

**హిడింబి**

మహా భారత యుద్ధకాలానికి నేటి హిమాచల్ ప్రదేశ్ కిన్నెర ఖండమని పిలువబడేది. రమణీయమైన ప్రకృతి దృశ్యాలకు హిమాయాలు పుట్టినిల్లుగా వుండేవి. హిమాలయ లోయల్లో పార్వతేయుల నివసించే తెగల్లో అసుర గణాలుకూడా వుండేవి. నరమాంసభక్షణ కూడా మారుమూల లోయల్లో వున్నట్టు కొన్ని అసుర గణజీవన విధానం వల్ల బయటపడుతుంది.

జూదక్రీడకు ముందే పాండవులను లక్కయింటిలో విడిది చేయించి, నివాసం చేయడానికి కౌరవ నాయకుడు చేసిన ప్రయత్నం విఫలం కావడం, ఆ యింటి నుండి తప్పించుకొని, పాండవులు కొన్నాళ్ళు సంచార జీవులుగా వుండిపోయారు. ఈ దశలో పాండవులు తల్లి కుంతితో సహా హిమాచల్ ప్రదేశాల్లో తిరిగుతూ, మనాలి ప్రాంతానికి వచ్చి రాత్రి సమయం అయినందున భీముడు మాత్రం మేల్కొని వుండి, మిగిలిన పాండవులు, కుంతినిద్రకుపక్రమించారు. ఆ సమయంలో అక్కడకు హిడింబ అనే ఆటవిక రక్కసి స్త్రీల వచ్చి, భీముని చూసి మోహించింది. తన అన్న హిడింబాసురుడనీ, తాను తన అన్నతో కలిసి యీ ప్రాంతంలోనే నివసిస్తున్నామనీ, యీ ప్రాంతం అంతా. మా సోదరుని ఏలుబడిలోనే వున్నదనీ, మా అన్న మిమ్మల్ని చూడడం జరిగితే ప్రాణాలతో వదలడనీ చెబుతోంది. మీరు రక్షింపబడాలంటే, ముందే నీవు మా అన్నను చంపగలిగితే మీకు ఏ ఆపదా వుండదు. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నీ పైన నాకేర్పడిన మమకారం వల్ల నేను మీకు ముందుగానే రానున్న ఆపదను గురించి హెచ్చరిస్తున్నానని హిడింబి చెప్పిన సూచన ప్రకారం, భీముడు ముందుగానే సమాయత్తమై హిడింబాసురున్ని చంపుతాడు. హిడింబాసుర, భీమసేనుని యుద్ధం జరుగుతూ వుండగా, పాండవులు, కుంతి మేల్కొంటారు. హిడింబాసురుడు నశించిన తదుపరి, హిడింబి వృత్తాంతం భీముడు తన తల్లి కుంతికి, అన్న ధర్మారాజుకు వివరించి

చెబుతాడు. హిడింబి విలపిస్తూ కుంతి వద్దకు వచ్చి నిలుస్తుంది. ధర్మరాజు, కుంతి అంగీకారం మేరకు భీముడు, హిడింబిని గాంధర్వ వివాహం చేసుకుంటాడు. ఆ ప్రాంతంలోనే హిడింబి సహాయ సహకారంతో పాండవులు కొంతకాలం నివసిస్తారు. పాండవులు ఆ ప్రాంతం నుండి నిష్క్రమించే నాటికి హిడింబి గర్భిణిగా వుంది. తదుపరి హిడింబి ఆ ప్రాంతంలోనే సర్వధికారిణిగా వుంటూ ఘటోత్కచుడనే కుమారుని ప్రసవిస్తున్నది. కౌరవ పాండవ యుద్ధంలో ఘటోత్కచుడు పాండవుల పక్షాన పోరాడినట్లు మహాభారతం వల్ల తెలుస్తుంది.

నేటికి 'మనాలి'లో హిడింబి దేవాలయం స్థానిక ప్రజలచేత పూజలందుకుంటోంది. దీన్ని 'ధూంగ్రి' దేవాలయం అంటారు. దసరాకు యిక్కడ పెద్ద సంత జరుగుతుంది. ఆటవిక దేవతగా హిడింబి తరతరాలుగా నిలిచివుంది. హిడంబి దేవాలయం నాలుగు అంతస్తులుగా నిర్మితమైవుంది. దేవదారు చెక్కతో అతి ప్రాచీన దేవాలయంగా స్థానికులు ఎప్పటికప్పుడు దేవాలయాన్ని అందంగా అలంకరించుకుంటారు. సౌర సంవర్సరాది ధూంగ్రి దేవాలయంలో గొప్పగా వేడుకలు జరుగుతాయి. ఈ ప్రదేశాల్లో ఆటవిక ప్రజలు ఉత్సాహభరితంగా హిడింబి దేవతను కొలుస్తారు. ఈ విధంగా ఇప్పటికీ ప్రచుర్యం పొందిన గాథ ఒకటి వినిపిస్తుంది.

**కిరాతార్జునీయం**

పాండవ మధ్యముద్కెన అర్జునుడు దివ్యాస్త్రామైన పాశుపతాస్త్రాన్ని పొందే ఉద్దేశంతో అడవిలో తపస్సు చేసుకుంటూ వుండగా మూకాసాసురుడనే ఒక ఎలుగుబంటి అర్జునుని మీదికిలంకించి దూకుతుంది. అదే సమయంలో ఒకవైపు నుండి కిరాతుడొకడు బాణంతో మూకాసురుడిపై ప్రయోగిస్తాడు. అర్జునుడు కూడా ఆత్మరక్షణకు తన బాణాన్ని ఎలుగుబంటిపై సంధించడం జరిగింది. ఇరువురి బాణాలు సూటిగా ఎలుగుబంటిని తాకాయి. ఎలుగుబంటి చనిపోయింది. తన బాణం వల్లనే ఎలుగుబంటి చనిపోయిందంటూ కిరాతుడూ, అర్జునుడూ పరస్పరం వాదించుకోసాగారు. చివరకు యీ వాదన పెనుగులాటగా పరిణమించి, పరస్పరం బాణ ప్రయోగాలతో యుద్ధం చేస్తారు. ఇరువురి వద్దనున్న బాణాలు అయిపోగా, ముష్టియుద్ధానికి తలపడతారు. కిరాతకుని ముష్టిఘాతాకు తట్టుకోలేక అర్జునుడు మూర్చిల్లి పడిపోతాడు. తదుపరి కిరాతుడు శివుడిగా ప్రత్యక్షమై అర్జునునికి పాశుపతాస్త్రాన్ని యిచ్చాడని భారత కథనం. శివుడే కిరాతరూపంలో వచ్చాడని మహాభారతంలో ఊటంకించడంలోని వాస్తవాన్ని పరిశీలిస్తే మహాభారత కథా కాలం నాటికి కిరాతకులు బలంమైన జాతిగా వున్నట్టు తెలుస్తోంది. తాము నివసించే ఆడవుల్లో తెగల నాయకుగా ఆనాటి యుద్ధ వీరులకు ఏ మాత్రం తీసిపోకుండా, వారు యుద్ధ నిపుణులుగా వున్నట్లు కిరాతార్జునీయం సంఘటన తెలియజెస్తుంది. ఏకలవ్యుడు, కిరాతుడు వంటి సాహస ఆటవిక తెగలకు చెందిన వీరులు అప్పట్లో ఎందరో వున్నట్టు భారత యుద్ధకావ్యం నిరూపిస్తోంది. ఆటవిక జాతి అన్ని రంగాల్లో నాగరిక జాతికి ఏమాత్రం తీసిపోకుండా బలోపేతమైన జాతిగా నెలకొని వున్నట్లు అర్థమవుతోంది.

'ఆంధ్రమహాభారతం'లో నన్నయభట్టు ఎరుకుల రాజ్కెన ఏకలవ్యుని రూపాన్ని వర్ణిస్తూ...తేజిత బాణహస్తు దృఢదీర్ఘమలీమస కృష్ణదేహలుగ్రృష్ణాజిన వస్త్రున్. ...(1-5-235) అని అంటాడు. ఏకలవ్యుడు దృఢకాయుడుగా, దీర్ఘకాయుడుగా, నల్లటి దేహలుడుగా ఉన్నాడట. జింక చర్మాన్ని వస్త్రంగా ధరించాడట, గిరిజనులు సహజంగా దృఢకాయులుగా, నల్లని శరీర రంగు కలిగిన వారుగా ఉంటారు. అడవుల్లో కష్టపడి పని చేయడం వల్ల గిరిజనులు బలిష్ఠులుగా దృఢకాయులుగా ఉంటారు.

నన్నయభట్టు ఏకలవ్యుని వరిస్తూ 'తేజిత బాణ హస్తు దృఢ దీర్ఘ మలీమస కృష్ణదేహుడు' (ఆది.5-235) అని ఏకలవ్యుడు దృఢ మైన దీర్ఘ మైన శరీరం కలవాడని అంటారు 'ఆంధ్రమహాభారతం'లో గిరిజన రాజుల్ని ప్రస్తవించాడు. పాండవులు ఉత్తరదిక్కున సాగించిన దిగ్విజయ యాత్రలో శబరపతుల్ని, వనచర నాథుల్ని జయించారని చెప్పబడింది.

**తిక్కన**

ద్రోణ, శాంతి, అనుశాసనిక, అశ్వమేధ, మౌసల పర్వాల్లో గిరిజనుల్ని గూర్చి వర్ణిస్తూ కిరాత, శబర, బోయ,

లుబ్ధ, నిషాద శబ్దాల్ని ప్రయోగించాడు. ద్రోణపర్వం చతుర్థాశ్వాసంలో 'కిరాతశబర సేన' ప్రస్తావన ఉంది. శాంతిపర్వంలోని తృతీయాశ్వాసంలో 'లుబ్ధకపోతోపాఖ్యానం' లో బోయవాడు పక్షుల్ని చంపి తింటూ, పక్షుల మాంసాన్ని అమ్మి జీవనం సాగించే వాడని, ఒకనాడు వేటకై వెళ్లి పావురాల్ని పట్టుకొని బుట్టలో వేసుకొని వస్తుండగా వర్షం రావడం చేత చెట్టును ఆశ్రయించాడని, ఆసమయంలో ఆ చెట్టుపై ఉన్న పావురం తన భార్య రాలేదని విలపిస్తుండగా ఆ మాటలను బోయవాని బుట్టలోఉన్న కపోతి చూచి తన జన్మ ధన్యమైందని సంతసించి తన స్థితిని భర్తకు తెలిపిందని, శరణాగతుడ్కైన బోయవానికి అతిథి మర్యాదులు సలిపి వాని చలిబాధను తొగించమని చెప్పగా విన్న కపోతం చలిమంట వేసి బోయవానికి చలిబాధను తొగించిందని, చివరకు వాని ఆకలి తీర్చడానికి తన దేహాన్ని మంటల్లోవేసి వానికి ఆహారమైందనీ, అది చూచిన బోయవాడు సంతసించి తన బుట్టలోని పక్షుల్ని వదిలేశాడని, బయటకు వచ్చిన కపోతి భర్తలేని జీవితం వ్యర్థం అని తలంచి అగ్నిలో దూకి మరణించిందని వర్ణించబడింది. పక్షులను చంపితినే కిరాతుడు కపోతం శరణాగత వాత్సల్యానికి, అన్యోన్య అనురాగానికి ముగ్ధుడ్కై తన శరీరాన్ని కూడా ఆ దావానంలో దగ్ధం చేసుకొని ద్వైవత్వాన్ని పొందాడట. ఈ కథలోవున్న బోయవాని పరివర్తనం ఆకర్షణీయం.

తిక్కన భారతంలో కిరాత, శబర, బోయ, లుబ్ధ శబ్దాలతో పాటు పక్షి వైరి, పక్షిధ్వంసుడ అనే శబ్దాల్ని ప్రయోగించాడు. తిక్కన భారతంలో బోయవాడు పక్షుల్ని చంపివాటి మాంసాన్ని అమ్మి జీవనం సాగించేవాడని చెప్పబడింది.

**'పాపాత్ముడొకబోయ పక్షుల వధియించి**
**తినియును బెక్కమ్మికొనియునదియు**
**బ్రదుకుగా దానికి బహు సాధనంబులు**
**సవరించుకొని మహాటవి జరింప.....'** **(శాంతిపర్వం 3-307)**

'అశ్వమేధపర్వం'లో భీమార్జునులు యాగాశ్వాన్ని బంధించిన కిరాత, నిషాద రాజుల్ని జయించారని వర్ణించాడు.

'కిరాత ముఖదేశ నృపతులు ముట్టి నదగగెల్వు కొనుచు. .....(ఆంధ్రమహాభారతం- అశ్వమేధ.4-110)

**తురంగంబు నిషాదాధీశ దేశంబునకు జనిన నేకలవ్యు**
**నందనుండు పాకశాసననందను మీదన్కెషాద సేనా**
**సమేతుండ్కై తోతెంచిన.....'** **(ఆంధ్రమహాభారతం-అశ్వమేధ 4-111)**

ఈ విధంగా తిక్కన ఆంధ్ర మహాభారతంలో ఆదిమ, గిరిజనుల అనేక పర్వాలలో అనేక సందర్భాలలో ప్రస్తావించారు.

**ఎఱ్ఱన**

అరణ్యపర్వంలోని పంచమాశ్వాసంలో 'ధర్మవ్యాధుని' వృత్తాంతం వర్ణించబడింది."ధర్మవ్యాధుడు మిథిలానగర నివాసి. అతడు సత్యవాది. జితేంద్రియుడు. అహింసాపరుడు. మాతాపితృభక్తుడు. ధర్మజ్ఞుడు. వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించేవాడు. తపోధనుడు, బ్రాహ్మణుడు అయిన కౌశికుడు ధర్మవ్యాధుని వలన సకల ధర్మాల్ని, అహింస స్వరూపాన్ని, జీవలక్షణాల్ని సంపూర్ణంగా తెలుసుకొని తన జన్మం ధన్యమైందని ధర్మవ్యాధుడు కొనియాడాడు". మనిషి గొప్పతనానికి గుణం ముఖ్యమని కులం ప్రధానంకాదని, ధర్మవ్యాధుని వృంత్తాంతం ద్వారా ఎఱ్ఱాప్రగడ లోకానికి తెలియజేశారు.

'ఆంధ్రమహాభారతం'లో ధర్మవ్యాధుని వృత్తాంతాన్ని వివరిస్తూ ధర్మవ్యాధుడు తన కులాచారాన్ని అనుసరించి మాంసం విక్రయం చేసేవాడని వర్ణించాడు. కౌశికుడనే బ్రాహ్మణుడు పతివ్రత సలహాపై మిథిలానగరానికి వెళ్లి ధర్మవ్యాధుని ఇంటి జాడతెలుసుకొని వెళ్ళి అచట 'ముందటనల్ప మృగమాంస ఖండంబులంగడింబచరించి యమ్ముచున్న వానిని ననవరత విక్రయాగత జన సమావృతునక్కిరాతుం చూచాడట'....(ఆంధ్రమహాభారతం అరణ్య. 5-27)

కౌశికుడు ధర్మవ్యాధునితో సంభాషిస్తూ 'జీవహింస చేయడం ధర్మం కాదుకదా?' అని ప్రశ్నించగా అపుడు ధర్మవ్యాధుడు కౌశికునితో 'రాజులకు దండనీతియు.... పరమ ధర్మంబయి చల్లునట్లుగా మాకును మృగయోపజీవనంబు పరమధర్మంబు విశేషించి యిదివంశ క్రమాగతంబయిన యాచారంబు'........(ఆంధ్రమహాభారతం అరణ్య 5-32) అని సమాధానం చెబుతాడు.

రాజులకు దండనీతి కులధర్మమయినట్లుగా బోయలకు వంశపారంపర్యంగా లభించే ఆచారం మాంస విక్రయమని భావం. మార్కండేయ మహర్షి ధర్మవ్యాధుడి ధర్మోపదేశం గురించి మార్కండేయ మహర్షి, ధర్మరాజుకు చెప్పే సందర్భంలోనిది. ఎఱ్ఱన అరణ్యపర్వ సగభాగంలో ఆదిమ తెగకు చెందిన ధర్మవ్యాధుని గురించి ధర్మాధర్మాల గురించి వివరించాడు.

**ముగింపు**

ఈ విధంగా ఆంధ్రమహాభారతంలో ఎక్కువ సార్లు ఆదిమ గిరిజనుల ప్రస్తావన ఉంది. నా పత్రంలో నేను సేకరించిన అనేక పుస్తకాలలో ఈ ఆదిమ తెగల్లోని 'సవరలే' ప్రాచీన గ్రంథాల్లో 'శబరులనీ', రామాయణంలోని శబరి ఆదిమ తెగకు చెందిందేననీ, ఐతరేయ బ్రాహ్మణంలోని పుళిందులే 'ఎరుకలనీ', 'జోస్యం చెప్పేకోయలే' 'కోయదొరలనీ', ఒకప్పుడు వనాల్లో జీవించిన వనచరులే 'బంజారులనీ, అలనాటి వాల్మీకులే నేటి 'బోయలనీ' పూర్వం విల్లమ్ములు ధరించి యుద్ధాలు చేసినవారే 'భిల్లులనీ' కొందరు సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక శాస్త్రవేత్తలు ప్రమాణాలతో నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకా అనేక పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రాచీన సాహిత్యంలో గిరిజనుల సామాజిక విషయాను తీసుకోవడం ప్రస్తుత కాలంలో పరిశోధన రీత్యా ఎంత్కెనా అవసరం ఉంది. తెలుగువారు ఎంతగానో ఆరాధించే పవిత్ర గ్రంథాలలో ఆంధ్రమహాభారతం ఒకటి. ఈ కావ్యంలో గిరిజన జాతి మూలాలు వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ పరిశోధనకు పూనుకొన్నాను. నన్నయ, తిక్కన, ఎర్రన రాసిన కవిత్రయ విరచితమైన ఆంధ్రమహాభారన్ని తీసుకొని అందులోని ఆదిమ గిరిజనుల గురించి, వారి రాజ్యాలు గురించి, ఇంకా వారి యుద్ధ తంత్రాలు, ఆదర్శ జీవనం, ఆనాటి గిరిజనుల సామాజిక జీవనం ఏ విధంగావుంది మొదల్కెన అనేక అంశాలను తీసుకోవడం జరిగింది. తద్వారా సమాజంలో ఆదిమ గిరిజనులు ఎలాంటి ప్రాచీన సాంప్రదాయాలను కలిగి ఉన్నారో ఆనాటి సమాజంలో గిరిజన వీరుల ప్రతాపం, ప్రకృతితో ముడిపడిన ఆదిమ గిరిజన సామాజిక జీవనాన్ని మనం తెలుసుకోవచ్చు. ఈ విధంగా ఆదిమ గిరిజనులయిన బోయరాజ్యాలు, ఏకలవ్యుడు, 'లుబ్ధకపోతోపాఖ్యానం' కిరాతకులు, ఆదిమ రాక్షస జాతయిన హిడింబి వంటి వారి గురించిన ప్రాచీన ఆదిమ గిరిజనుల ప్రస్తావన ఉందని నా పత్రం ద్వారా వివరించే ప్రయత్నం చేశాను.

**ఆధారగ్రంథాలు**

1. ప్రతాప్, ఆర్. ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాతులు, హైదరాబాద్: ఆదివాసి సాంస్కృతిక పరిశోధన సంస్థ, 1995.
2. రామాచార్య , బి. తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి. హైదరాబాద్ : 1993.
3. చినవెంకటేశ్వర్లు, భూక్యా, ట్రైబల్లైఫ్ (ఆదిమ తెగల, గిరిజనుల సమగ్ర జీవిత చిత్రణ), గుంటూరు యోజిత్ బుక్ లింక్స్, 1994.
4. వెంకటేశ్వర్లు, చిలుకూరు. శ్రీమదాంధ్రమహాభారతము (1,2). హైదరాబాద్: రామకృష్ణమఠం, 2018.
5. వేణుగోపాల్, విట్ట. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో 'గిరిజన జీవన చిత్రణ (18వశతాబ్దంవరకు). హైదరాబద్.
6. శ్రీమదాంధ్రమహాభారతము (సరళవ్యాఖ్యానసహితం). సంపుటలు1/15(తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానము, 2013.
7. ఉమాదేవి, ముదిగొండ. మహాభారత ఉపాఖ్యానము. హైదరాబాద్, కిషన్ ఆర్ట్ ప్రింటర్స్, 2018.
8. చంద్రశేఖర రెడ్డి, డి. (సం.) తెలుగు వ్యాఖ్య. సుందరాచార్యు, కె.వి. భారవి కిరాతార్జునీయము, హైదరాబాద్ ఎమెస్కో బుక్స్, 2012.
9. రాంబాబు, సునావత్, "ఆంధ్రమహాభారతం – గిరిజనుల సామాజిక జీవనం" ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, భారతీయ భాషా సంస్థ, మైసూరుకు సమర్పించిన ప్రాజెక్టు (2018-20)

# 11. ఆంధ్ర మహాభారతం - ఏకలవ్యుని గురుభక్తి

– డా।। కల్యాడపు రమేశ్, నెల్లూరు

## పరిచయం

ఆదికవి నన్నయ్య భట్టారకుడు (11వ శతాబ్దం) తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధుడయ్యాడు. అతడు వేదాధ్యాయ సంపన్నుడు, శబ్దశాసనుడు, వేదవేదాంగవిదుడు, సంహితాభ్యాసుడు. నానాపురాణ విజ్ఞాన నిలయుడు అవిరళ జపహోమ తత్పరుడు, వయ్యాకరణి, వాగనుశాసనుడు. సంస్కృత, ఆంధ్రభాషలలో పాండిత్యం కలవాడు. సంస్కృత మహాభారతానికి అనుసృజనయైన శ్రీమదాంధ్ర మహాభారతం రచించిన కవిత్రయంలో మొదటివాడు. మహాభారతమే తెలుగులో తొలి కావ్యంగా ప్రసిద్ధిచెందింది. మహాభారతానికి తెలుగు సాహిత్యంలో ఎంతో సాహితీపరమైన విలువ కలిగివుంది. చంపూ కవిత శైలిలోని మహాభారతం అత్యుత్తమ రచనాశైలికి అద్దంపడుతూ నిలిచింది.

నన్నయ ఆంధ్ర మహా భారతంలోని ఆది, సభా, అరణ్య పర్వాల్లో శబర, పుళింద, కిరాత, నిషాద, లుబ్ధ శబ్దాలతో పాటు పర్వత నివాసులు, అరణ్య నివాసులు, పార్వతీయులు మొదలైన శబ్దాలను ఆటవికుల గూర్చి ప్రయోగించాడు. మహాభారతంలో పంచమాశ్వాసంలో 'ఏకలవ్యుని' వృత్తాంతాన్ని నన్నయ రాశారు. ఏకలవ్యుని ఉత్తమోత్తమ శిష్యునిగా నిర్మలమైన గురుభక్తికి ప్రతీకగా నన్నయ రాశారు. ఏకలవ్యుడు హిరణ్య ధ్వనుడను ఎరుకల రాజకుమారుడు. ద్రోణాచార్యుని ప్రసిద్ధిని విని అతడు విలువిద్యను నేర్పమని ద్రోణుని ప్రార్థిస్తాడు. నిషాద పుత్రుడనే కారణం చేత ద్రోణుడు ఏకలవ్యుని కోరికను నిరాకరిస్తాడు. కాని ఏకలవ్యుడు తన పట్టుదలను వీడకుండా ద్రోణున్నే తన గురువుగా భావించి అడవిలోనికి వెళ్లి మట్టితో ద్రోణుని బొమ్మను తయారుచేసి అపారమైన భక్తిశ్రద్ధలతో సమస్కరిస్తూ విలువిద్యను అభ్యసిస్తాడు.

## ఏకలవ్య కథ

ఒక నాడు అడవిలో ఏకలవ్యుడున్న ప్రాంతానికి కురు కుమారుల శునకం ఒకటి వచ్చి మొరగగా (అరవగా) ఏకలవ్యుడు ఏక కాలంలో సప్త బాణాల్ని ఆ కుక్క నోటిలో వేస్తాడు. ఆ దృశ్యాన్ని చూచిన కురు కుమారులు ఆశ్చర్యపడి ద్రోణుని వెంటబెట్టుకొని ఏకలవ్యునివద్దకు వస్తారు. అప్పుడు ఏకలవ్యుడు ద్రోణునికి ఎదురేగి నమస్కరిస్తాడు. ఇది చూసిన కురు కుమారులు ఈర్ష్య చేత ద్రోణుడితో చెప్పగా అర్జునుణ్ణి మాత్రమే విలువిద్య నైపుణ్యంగలవాడిని చెస్తాను అని మాట ఇవ్వడంతో ద్రోణుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ద్రోణుడు గురుదక్షిణను కోరగా ఏకలవ్యుడు తనదేహం, సంపద, పరిజనాల్లో ఏది కావాలో కోరుకోమంటాడు. ద్రోణుడు ఏకలవ్యుని కుడిచేతి బొటన వేలును గురుదక్షిణగా ఇమ్మంటాడు. ఏకలవ్యుడు తన గురుభక్తికి నిదర్శనంగా తన కుడిచేతి బొటనవేలును ఖండించి గురుదక్షిణగా సమర్పిస్తాడు. ఏకలవ్యుడు కిరాతుడైనా అతని మనస్సు నిర్మలమని, గురుభక్తియుతమని, గురుభక్తికి నిదర్శనంగా ఏకలవ్యుడు నిలిచిపోయాడని మనకు తెలుస్తుంది. గిరిజనుల సచ్ఛీలతకు ఏకలవ్యుని వృత్తాంతం ఒక కలికితురాయి.

## ఏకలవ్యుడు ద్రోణుని గురువుగా స్వీకరించడం

ద్రోణాచార్యుల కీర్తి విన్న హిరణ్యధన్వుడనే ఎరుకలరాజు కొడుకైన, ఏకలవ్యుడు క్షత్రీయుడు కాదనే నెపంతో ద్రోణాచార్యులు అతడికి విద్య నేర్పడానికి అంగీకరించలేదు. అప్పుడు ఏకలవ్యుడు నిరుత్సాహపడకుండా అడవిలో విద్య నేర్చుకోవడానికి ద్రోణాచార్య ప్రతిమ చేసి గురువుగా పూజిస్తూ విలువిద్య నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఒకనాడు కౌరవ పాండవులు ద్రోణాచార్యుని అనుమతితో అడవిలో వేటకోసం వెళ్ళారు. అలా అడవిలో తిరుగుతూ ఉండగా వారితో తెచ్చుకున్న వేటకుక్క దారితప్పి ఏకలవ్యుడు సాధన చేస్తున్న చోటుకు పోయి మొరగడం ప్రారంభించింది. అక్కడ ఆ కుక్క మొరగకుండా

ఉండేట్లుగా ఏడు బాణాల్ని ఏకకాంలో ఉపయోగించి అతినేర్పుతోను, ఆశ్చర్యం కలిగేటట్లుగాను ప్రయోగించి కుక్క మొరగకుండా చేశాడు.

### ఏకలవ్యుడు ద్రోణున్ని ఆరాధించి విలువిద్య నేర్చుకోవడం

**వచనం :** మఱియు గదాకార్ముకప్రాసాసితోమరకుంతశక్త్యాది వివిధాయుధంబులయందును గుమారుల నందఱ జితశ్రములం జేయుచున్న ద్రోణాచార్యుల మహాప్రసిద్ధి విని హిరణ్యధన్వుం డను నెఱుకురాజుకొడు కేకలవ్యుం డనువాఁడు ధనుర్విద్యాగ్రహణార్థి యయి వచ్చినవాని నిషాదపుత్త్రుం డని శిష్యుంగాఁ జేకొన కున్న వాఁడును ద్రోణుననుజ్ఞ వడసి చని వనంబులోన '. **(ఆం.మ.భా. ఆది. సం.5 -231)**

అంతేకాకుండా గద, ధనుస్సు, ఈటె, కత్తి, తోమరం, కుంతం, శక్తి మొదల్కైన అనేక విధాల్కైన అయుధ విద్యలలో రాకుమారు లందరిని నేర్పరులను చేస్తున్న ద్రోణాచార్యు కీర్తి విని, హిరణ్యధన్వుడనే ఎరుకరాజు కొడుకు ఏకలవ్యుడ అనేవాడు విలువిద్యను నేర్చుకోవాలని వచ్చాడు. ఏకలవ్యుడు ఎరుకలవాని కుమారుడని ద్రోణుడు శిష్యునిగా అంగీకరింపలేదు. అప్పుడు ఏకలవ్యుడు ద్రోణుని అనుమతి పొంది వెళ్లి అడవిలో.

**వినయమున ద్రోణురూపు మన్నున నమర్చి**
**దాని కతిభక్తితోడఁ బ్రదక్షిణంబుఁ**
**జేసి మ్రొక్కుచు సంతతాభ్యాసశక్తి**
**నస్త్ర విద్యారహస్యంబు లర్థిఁ బడసె. (ఆం.మ.భా .ఆది .సం.5 -232)**

ఏకలవ్యుడు వినయంతో ద్రోణుని బొమ్మను మట్టితో చేసి ప్రతిష్టించి దానికి భక్తితో ప్రదక్షిణ నమస్కారాలు చేస్తూ, ఎడతెగని సాధనబలంచేత తానే విలువిద్యా రహస్యాలన్నీ గ్రహించాడు. ఇక్కడ హస్తినాపురంలో పాండవులు, కౌరవులు కలిసి ద్రోణాచార్యుని అనుమతి పొంది, వేటపట్ల ఎంతో ఆసక్తి కలవాళ్ళయి, మిక్కిలివేగం గల వేటకుక్కలతో కూడిన భటుల సమూహంతో అడవికి వెళ్ళారు. ఈ విధంగా వెళ్లి వెళ్లి, అడవిలో తిరుగుతూ ఉండగా ఒక భటుడి కుక్క తోడు తప్పి పరిగెత్తి ఒకచోట ఒంటరిగా బాణాలు వేస్తున్న ఏకలవ్యుడి దగ్గరగా వెళ్లి మొరిగింది. అతడు ఏడు బాణాలను ఒక్కటిగా వింట సంధించి అతిచాకచక్యంగా, ఆశ్చర్యకరంగా ఆ కుక్కనోట కొట్టాడు. అది బాణాలతో నిండిన నోటితో కురుకుమారుల దగ్గరికి పరుగెత్తింది. దాని చూచివాళ్లు ఆశ్చర్యపడి ఈ విధంగా కొట్టినవాడేవ్వడని వెదకుతూ వస్తుండగా ఎదురుగా...

**తేజితబాణహస్తు, దృఢదీర్ఘమలీమసకృష్ణదేహుఁ, గృ**
**ష్ణాజినవస్త్రు నస్త్ర విషయాస్తవిషాదు నిషాదుఁ జూచి యా**
**రాజకుమారు లందఱుఁ బరస్పరవక్త్రవిలోకనక్రియా**
**వ్యాజమునం దదీక్షణనివారితు ల్కై రతిమత్సరంబునన్. (ఆం.మ.భా. ఆది.5 -235)**

పదును పెట్టిన ధనస్సు బాణాలు పట్టుకొని ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తిని చూశారు రాజకుమారులు. అతడు జింకచర్మాన్ని వస్త్రంగా ధరించాడు. నల్లటి అతని శరీరమంతా మురికితో దుర్వాసన కొడుతోంది. అస్త్రవిద్యలో లోటు లేనివాడు అయిన ఏకలవ్యుడిని చూచి, ఆ రాకుమారుంతా విపరీతమైన మాత్సర్యంచేత అతడిని చూడలేక ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

**వ:** అ క్కుమారులు వాని శరలాఘవంబునకు మెచ్చి 'నీ వెవ్వండ వెవ్వరిచేత విలువిద్యఁ గఱచి? తని యడిగిన వారికి నయ్యెఱు కి ట్లనియె. (ఆం.మ.భా.ఆది. 5 – 236)

ఆ కుమారులు అతని బాణప్రయోగంలోనే నేర్పరితనానికి మెచ్చి, 'నీవెవ్వడవు? నీవు ఎవ్వరి వద్ద విలువిద్య నేర్చుకున్నావు? అని అడుగగా వారితో ఏకలవ్యుడు ఈ విధంగా అన్నాడు.

**వినుఁ! డే హిరణ్యధన్వుం**
**డను వనచరనాథుకొడుకబీ నాచార్యుఁడు ద్రో**
**ణునకున్ శిష్యుఁడ నెందును**
**ననవద్యుఁడ బీ నేకలవ్యుఁ డనువాఁడ మహిన్. (ఆం.మ.భా. ఆది. 5 – 237)**

వినండి, నేను హిరణ్యధన్వుడనే కిరాతరాజకుమారుని. ద్రోణాచార్యుల శిష్యుడిని. ఏ కల్మషం లేని వాడిని నా పేరు ఏకలవ్యుడు అనగావిని, కురుమారులందరూ తిరిగి వచ్చి ద్రోణునికి ఆ విషయమంతా చెప్పారు. ఆపైన అర్జునుడు ఏకాంతంగా ఒకనాడు గురుదేవునితో ఈ విధంగా అన్నాడు.

**విలువిద్య నొరులు నీ క**
**గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు నని మున్**
**బలికితిరిబీ నాక కా దీ**
**త్రిలోకముల కధికుఁ జూచితిమి యొక యెఱుకున్. (ఆం.మ.భా. ఆది. 5 – 239)**

అప్పుడు అర్జునుడు మాత్రం ద్రోణుడు ఒంటరిగా ఉన్నప్పుడు "విలువిద్యలో నీకంటె అధికుడెవ్వడూ లేకుండా నేర్పుతానని నాతో అన్నారు. గురువర్యా! ఈ రోజున నాకేకాదు ముల్లోకాలకే అధికుడ్కెన ఒక ఎరుక యువకున్ని చూశాం.

**నాకంటెను మీ కంటెను**
**లోకములో నధికుఁడతిబలుండు ధనుర్వి**
**ద్యాకౌశలమునబీ నాతఁడు**
**మీకుం బ్రియశిష్యుఁడటె యమిథ్యావచనా! (ఆం.మ.భా. ఆది. 5 –240)**

**వ.** అనిన విని ద్రోణుం డదరిపడి 'వానిం జూతము ర'మ్మని యర్జునుం దోడ్కొని, యనవరతశరాస నాభ్యాసనిరతుండయి యున్న యేకలవ్యుకడ కేఁగిన, నెఱింగి వాఁడు నెదురు పఱతెంచి ద్రోణునకు మ్రొక్కి తన శరీరంబు సర్వస్వంబును నివేదించి, 'యేను మీశిష్యుండబీ మి మ్మారాధించి మీ ప్రసాదంబున నివ్విలువిద్యఁగఱచితి' నని కరకంబులు మొగిచియున్నం జూచి, ద్రోణుం డట్లేని మాకు గురుదక్షిణయి మ్మనిన సంతసిల్లివాఁడిట్లనియె'.

**(ఆం.మ.భా. ఆది. 5–241)**

"గురువర్యా! నేను చెప్పే మాట అసత్యమైనది కాదు. ఆ ఎరుకవాడు విలువిద్యాలో మీకు ప్రియషిష్యుడట గదా" అన్న అర్జునుడి మాట విన్న ద్రోణాచార్యులు అదిరిపడ్డారు. పదండి చూద్దాం అని వారిని వెంటబెట్టుకుని అడవికి వెళ్ళాడు. ద్రోణుడు రావడం ముందే తెలుసుకున్న ఏకలవ్యుడు వారికి ఏదురేగి గురువుగారిని సాదరంగా ఆహ్వానించి గురుసేవ చేశాడు. అందుకు ద్రోణుడు అతన్ని చూసి "అయితే నాకు గురుదక్షిణ ఇవ్వు" అన్నాడు. (ద్రోణుడు ముందు చూపు ఆలోచించి భవిష్యత్‌లో మహాభారత యుద్ధంలో అర్జునుడికంటే గొప్ప విలువిద్య నేర్పరి ఉండకూడదు అనే భావనతో గురుదక్షిణ ఇవ్వమని కోరాడు). అందుకు సంతోషించి ఏకవ్యుడు ఇట్లా అన్నాడు.

**ఇది దేహం, బిది యర్థంబీ**
**బిది నా పరిజనసమూహబీ మిన్నిటిలో నె**
**య్యది మీ కిష్టము దానిన**
**ముద మొదవఁగ నిత్తు గొనుఁ డమోఘుం బనినన్. (ఆం.మ.భా.ఆది. 5 – 242)**

'నెమ్మిని నీ దక్షిణహ
స్తమ్మున పెనులుద్రేలు దునిమి దక్షిణ యిబీ మ్మి
ష్ట మ్మిది నా 'కనపుడు విన
యమ్మున వాఁడిచ్చె దాని నాచార్యునకున్. (ఆం.మ.భా.ఆది.5 – 243)

ఇది నా దేహం. ఇది నా ధనం. వీరంతా నా సేవకులు ఇందులో మీకేది ఇష్టమో అది తీసుకోండి" అన్నాడు."అయితే నీకుడిచేతి బొటనవెలు కోసి నాకివ్వు" అని ద్రోణుడడిగాడు. ఎందువల్ల నంటే, ఏకలవ్యుడు కుడిచేతి బొటనవెలుని పోగొట్టుకోవడం వలన విలువిద్యా సంపద పోగొట్టుకున్నవాడవుతాడు. ఏకలవ్యుని ఉదంతం భారతేతిహాసంలో ధ్రువతారలా నిలిచిపోయింది. ఆటవిక వీరుడికి ఏకలవ్యుడు తిరుగులేని ప్రతినిధి. ఆదిమ తెగ ప్రతిభాపాటవాలకు నిలువుటద్దంలా ఏకలవ్యుడు భాసించాడు. విలువిద్యలో ఆరితేరిన యోధుడిగా ఏకలవ్యుడు భారత చరిత్రతో ప్రసిద్ధి చెందాడు.

## ముగింపు

ఏకలవ్యుడి దగ్గరికి ద్రోణాచారులే స్వయంగా వచ్చి గురుదక్షిణ కోరటమే కొండంత భాగ్యంగా భావించి ఉన్నదంతా ఆయన ముందు ఉంచిన ఏకలవ్యుని ఉన్నతోన్నత గురుభక్తికి అతని మాటలో సర్వార్పణ భావంతోటు ముగ్ధభక్తి మూర్తి కట్టింది. ఈ ఏకలవ్య ఇతిహాస కథ ద్వారా మానవుడిలో పట్టుదల, ఏకాగ్రత, సాధించాలనే కోరిక ఉంటే దేనినైన కూడా సాధించవచ్చు అని నన్నయ మనకు సూచించాడు. అంతేగా ఏకలవ్యుడి లాగా సంకల్పబలంతో నేర్చుకుంటే లక్ష్య సాధన సులభమని కృషివుంటే మనిషి మహాఋషి అవుతాడని కవి మనకు ఏకలవ్యుని వృత్తాంతం ద్వారా తెలిపాడు.

## ఆధారగ్రంథాలు

1. నన్నయ, ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం భాగం –2, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, 2013
2. రామారావు, బొనిగల, 'నిషాద రాజ్య యువరాజు "ఏకలవ్య", మౌర్య పబ్లికేషన్స్, 2019
3. మహాభారత ధర్మశాస్త్రము (శాంతి, అనుశాసనిక పర్వములు – వచనము), ప్రసన్న భారతీ గ్రంథమాల, విశాఖపట్నం.
4. వేంకటేశ్వర శర్మ, గుత్తికొండ, 'పంచమ వేదం (సంపూర్ణ మహాభారతం)', మోహన్ పబ్లికేషన్స్, 2012
5. శ్రీరామచంద్ర మూర్తి, యమ్జీపి, 'ఆంధ్ర మహాభారతములో ధర్మసూక్ష్మములు', ఆర్.కె. ప్రింటర్స్, హైదరాబాద్, 2000

# 12. కవిత్రయ భారతం-ధర్మరాజు స్వభావ చిత్రణ

- డా॥మల్లెపోగు మాదన్న, తిరుపతి

**ఉపోద్ఘాతం**

తెలుగు సారస్వత క్షేత్రంలో మహాభారతం ప్రసిద్ధిచెందిన ఇతిహాసం. ఇది తెలుగు కావ్యంగా వినుతికెక్కింది. సంస్కృతంలో వ్యాసమహర్షి రచించిన మహాభారతాన్ని తెలుగులో కవిత్రయులైన నన్నయ, తిక్కన, ఎఱ్ఱన రచించారు. దీనిని పూర్తిగా తెలుగులో స్వతంత్ర కావ్యంగా రచించినట్లు రచించడం విశేషం. సంస్కృత మహాభారతం నూరు పర్వాల ఇతిహాసం కాగా, తెలుగు మహాభారతం పద్దెనిమిది పర్వాల కావ్యేతిహాసం. మహాభారతం ఒక విజ్ఞాన సర్వస్వమని చెప్పవచ్చు. ప్రస్తుతం మహాభారతం లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఇంటిలో ఇదొక విజ్ఞాన సర్వస్వంగా వెలుగొందుతోంది.

భారతంలో లేనిది ఎక్కాడ లేదు. లోకంలో ఉన్నది భారతంలో ఉండకపోదు అన్న వాఖ్య కూడా భారతానికి విశిష్టస్థానాన్ని సంపాదించి పెట్టింది. పంచమవేదంగా ఖ్యాతిగాంచిన భారతం మానవకోటికి ఒక విజ్ఞాన సర్వస్వం. మానవ జీవిత ప్రస్థానానికి ధర్మానికి, మహాభారతం పెట్టింది పేరు. మానవ జీవితాన్ని సమగ్రంగా దర్శించి జీవితపరమార్థాన్ని ప్రబోధించిన మహాగ్రంథం మహాభారతం. మానవ స్వభావాన్ని ప్రజా జీవనాన్ని సమగ్రంగా ఆవిష్కరించింది మహాభారతం. మానవ జీవితానికి సంబంధించిన ఆయా వేదాంత విషయాలు మహాభారతంలో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఇందులో జీవిత పరమార్థాన్ని తెలిపే నీతి ప్రబోధకాలైన సంఘటనలు అడుగడుగున కన్పిస్తాయి. ప్రజా జీవితానికి సంబంధించిన అనేక అంశాలు మహాభారతంలో విరివిగా కన్పిస్తాయి.

మానవునికి ధర్మాచరణ మీద ఏకాగ్రత కల్గటమే కష్టం. ఇదే లక్ష్యంగా దానిపై ప్రయత్నించే సంకల్పం కల్గడం మరింత కష్టం. సంకల్పం కల్గినా అందుకు కావల్సిన సాధన సామగ్రి చేకూర్చుకోవడం మరికొంత కష్టం. ఇవన్నీ కల్గినాయనుకున్న తరుణంలో పంచేంద్రియాలు, అరిషడ్వర్గాలు మన దృష్టిని మరల్చుతూ వుంటాయి. మానవుడు ఈ అడ్డంకులన్నీ యెదుర్కొని నిజమైన మానవత్వం సంపాదించుకోవడం ఎంత కష్టమో ఆలోచించాలి. వీటినన్నిటిని అధిగమించి చిత్తశుద్ధితో ధర్మమార్గంలో పయనించిన వారు హరిశ్చంద్రుడు, ప్రహ్లాదుడు, ధర్మరాజు, సీత, సావిత్రి, దమయంతి, ద్రౌపది వంటివారు ధర్మ ప్రతీకలుగా చరిత్రలో నిలబడ్డారు. ధర్మాన్ని పరిరక్షించి ఆదర్శప్రాయులయ్యారు. సంజయుడు ధృతరాష్ట్రునితో ధర్మ స్వరూపం గూర్చి వివరిస్తూ...

**"ఒరులే యవి యొనరించిన**
**నరవర! అప్రియము తన మనంబున కగుదా**
**నొరునకు నది సేయకునికి**
**పరాయణము పరమధర్మ పథముల కెల్లన్"**

యిక్కడ ధర్మ సూక్ష్మతను పరమ రమణీయంగ చెప్పబడింది. కేవలం సూత్రాలు చెప్పడం వరకే సరిపోదు. దాని ఆంతర్యాన్ని ఆచరణలో పెట్టాలి. అలాంటి గొప్ప హృదయం కలవాళ్ళే మహామనీషులవుతారు.

వ్యాసులవారు మహాభారత సారాంశాన్నంతా రెండుముక్కలలో నిరూపించారు.

**"రోష మయమహాతరువు సుయోధనుడు**
**స్కంధమందులోన కర్ణుడలరు,**

**కొమ్మ సౌబలుండగు కుసుమ ఫలంబులు దు**
**శ్శాసనుండు, మూల శక్తి తండ్రి”**
**ధర్మజుండు ధర్మతరువు అర్జునుండు ఘన**
**స్కంధ మనిలసుతుడు శాఖ కవల**
**పుష్పఫలము నేను భూసురలు వేదములు**
**తదీయమైన మూలచయము**

ఇక్కడ దుర్యోధనుని ఆధర్మమయమైన మహా వృక్షంగా, కాండం కర్ణుడు, శకుని కొమ్మలు, దుశ్శాసనుడు విరగబూచిన పుష్పఫలాలు, మూలం అమనీషి యైన ధృతరాష్ట్రుడని చెప్పి ఆధర్మ స్వరూపాన్ని చూపించాడు.

అక్కడ యుధిష్టిరున్ని ధర్మమయమైన మహా వృక్షంగా, అందులో అర్జునుండు స్కంధంగా, భీమసేనుడు, కొమ్మలుగ, నకుల సహదేవులు చక్కగా రూపొందిన ఫల పుష్పాలుగ, మూలము కృష్ణుడు, వేదములు, బ్రాహ్మణులు అని చెప్పి భారతంలో పాత్రల మనోవిశ్లేషణకు చక్కటి సమన్వయంతో అధ్యయనం చేసేటందుకు దారి చూపించాడు.

**ధర్మరాజు స్వభావ చిత్రణ**

ధర్మరాజు ధర్మమయమైన మహావృక్షం. తల్లిదండ్రులు అతనికి పెట్టిన పేరు యుధిష్టిరుడు, తన ప్రవృత్తితో సాధించిన పేరు ధర్మరాజు. ఈ చెట్టుకు మూలం శ్రీకృష్ణుడు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ధర్మసంస్థాపన కోసం అవతరించే పరమాత్ముడాయన. ఈ చర్యలో ఆయనకు సహరించేవి, వేదములు, బ్రాహ్మణులు. ఈ సమాహారం ధర్మమయమైన మహావృక్షానికి మూలం. ఇది తన త్యాగమయమైన జీవన విధానంతో ఆకృతితత్వము పొందుతుంది.

ధర్మరాజు మహాభారత కావ్యానికి నాయకుడుగా గుర్తించదగ్గ సాత్త్విక శిరోమణి. కరుణాశీలుడు, శాంతి, సంయమనం ఈయనకు శిరోభూషణాలు. 'క్షమా శక్తస్య లక్షణం' అనేది ధర్మరాజుకు గౌరవప్రదమైన ఆభరణం. ఇతడు సత్యసంధుడు. అయినా శ్రీకృష్ణుని ప్రేరణతో విధిలేని పరిస్థితుల్లో 'అశ్వత్థామ హతంః' అని అసత్యం పలికాడు. దీనిని బట్టి వ్యాసభగవానుడు ఉత్తమ పాత్రలో కూడ లోపదోషాలను ఎత్తిచూపి వాస్తవికతను ప్రదర్శించాడని చెప్పవచ్చు.

ధర్మరాజు వాసుదేవుని కరుణా కటాక్ష్యాలచే, తమ్ముల పరాక్రమముచే కష్టార్జితంగా సాధించిన రాజ్యమును, తమ్ములను తుదకు అర్ధాంగిని ఒక్క పాటున జూదంలో ఒడ్డి ఓడిపోయాడు. ఈ పరిస్థితుల్లో భార్యకాని, తమ్ములు గాని సహించారే కాని వెనక్కి తిరగబడి అగౌరవపరచలేదు. నిజానికి యిలాంటి సమయంలో ఆవేశం కట్టలు తెంచుకొని రావాలి. యెదురు తిరిగి వ్యతిరేకించాలి. తన వారిపైన, యెదుటి వారిపైన యెదురుదాడికి దిగాలి. దానివల్ల జయమో, అపజయమో కల్గవచ్చు. కాని అపఖ్యాతి మాత్రం తథ్యం. ఇక్కడ ధర్మరాజు బేలపడక సంయమనంతో శత్రువుల దుశ్చర్యలను ధర్మ బద్ధంగా యెదుర్కొని సానుభూతి సంపాదించాడు. సమయ స్ఫూర్తితో లోకుల సానుభూతితో స్థిర విజయాన్ని సాధించి సుస్థిర కీర్తిని సముపార్జించాడు.

ధర్మరాజు తాను గౌరవించు వ్యక్తుల ప్రభావానికి లోనై ప్రవర్తిల్లడం కన్పిస్తుంది. ధృతరాష్ట్రుని పితృసమానంగా చూశాడు. శ్రీకృష్ణున్ని, కుంతీదేవిని గౌరవించాడు అందువలనే వారిద్దరి ప్రభావం స్పష్టంగా కన్పిస్తుంది. ఎవరినైనా నమ్మితేపూర్తిగా నమ్మడం ధర్మరాజు బలహీనత. అతనిలో చాలా మంచితనమే ఆపత్కారి అనటం ధర్మరాజు విషయంలో యధార్థం.

మహాభారతంలో పాత్ర మనస్తత్వ చిత్రీకరణ చాలా క్లిష్టమైనది. వ్యాసభారతం ఒక సంప్రదాయక మహాకావ్యం. అందులో వ్యాసుడు భారత కథకు మూలపురుషుడు కావడం చేత పాత్రల ప్రవర్తనలను యధాతథంగా నిరూపించుకుంటూపోయాడు. కాని ఆంధ్ర భారతం స్వతంత్ర కావ్యం కాదు. సంస్కృత కావ్యానికి పునరవతరణం. వ్యాసునిది

ఇతిహాసిక దృష్టి. కవిత్రయ భారతం కావ్యసృష్టి. ఆంధ్రభారతంలోని పాత్రలు సహజత్వంతో పాటు సౌందర్యాన్ని సంతరించుకున్నాయి.

ధర్మరాజు ప్రాజ్ఞత, దూరదృష్టి, మాటలనేర్పు, ఓర్పు రాయబార ఘట్టములందు అమోఘంగా ప్రదర్శితమైంది. సంధి ప్రయత్నంలో ప్రధానంగా శల్యుని విషయంలో ధర్మరాజు ప్రవర్తన నిరుపమానం. శల్యుడు కౌరవ పక్షంలో చేరిపోయిన తర్వాత దాన్ని తప్పుగా తర్కించక, అతని బలహీనతను తాను ఉపయోగించుకొని శత్రు పక్షానికి చేయగలిగినంత అపకారం చేయాలని ఆలోచించిన రాజనీతి పరుడు.

అందుకనే శల్యునొప్పించి 'సమర సమయమున నిరాకరించి పలికి కర్ణుచిత్తంబునకు కలక పుట్టించి పార్థు రక్షింపవలయు అని ప్రార్థించెను. ఏ నోట శల్యుడు దుర్యోధనునికి సాయం చేయుదుననెనో ఆ నోటనే కౌరవ నాథుడా నహుషుకైవడి నాశము పొందునని' పలికించడంలో ధర్మరాజు దూరదృష్టి అవగతమైంది. శ్రీకృష్ణుదుని రాయభారానికి పంపినపుడు ధర్మరాజు చూపిన ప్రాజ్ఞత, వాక్చాతుర్యత వర్ణనాతీతములు చెప్పవలసిన విషయములన్నియు చెప్పి చివరలో ఆయన మనస్సు కష్టపడకుండవలెనను భావనతో..

**"మమ్మెరురుగు దెదిరి నెరుగుదు**
**నెమ్మి యెరుగు దర్థసిద్ధి నెరి యెరుగుదు వా**
**క్యమ్ముల పద్ధతి నెరుగుదు**
**పొమ్మెవ్వడ నేను నీకు బుద్ధులు సెప్పన్"**

అని సాంత్వనపరచి సంధి, యుద్ధంల నిర్ణయాధికారం అతనికే అప్పగించిన తీరు ధర్మరాజు దూరదృష్టిని ప్రదర్శిస్తున్నది.

వ్యాసభారతంలో దుర్యోధనుడు, ద్రౌపది వంటి పెద్ద పాత్రలే కాదు. చిన్న పాత్రలు సైతం యేదో ఒక ప్రయోజనాన్ని సాధించి అదృశ్యమవుతూ వుంటాయి. ఆంధ్ర భారతంలో ఆ ప్రయోజనంతో పాటు రస పోషణముకు ఉపకరించి, తమ వ్యక్తిత్వానికి తగిన చోటు సంపాదించుకొని ప్రకాశిస్తుంటాయి. కావుననే తిక్కన 'తను కావించిన సృష్టి తక్కొరుల చేతన్గాదని' ప్రశంసల నందుకొన్నాడు. కావ్యంలో శృంగారాదిరసాలకు ఆలంబనం పాత్రలు. అందువలననే సజీవ పాత్ర నిర్మాణమే మహాకవి ప్రతిభా నిరూపణకు సాక్షీ భూతాలు.

ధర్మ పరిరక్షణలో భాగంగా కృష్ణ భగవానుడు రాయభార ఘట్టంలో దక్షులైన భీష్మ, ద్రోణాదుల ఉదాసీనతను యెండగదుతూ...

**"సారపు ధర్మమున్ విమల సత్యము పాపముచేత బొంకుచే**
**బారము పొందలేకచెడ బారినదైన యవస్థ దక్షు లె**
**వ్వార లుపేక్ష సేసిరదివారల చేటగుగాని ధర్మని**
**స్తారకమయ్యు సత్య శుభదాయక మయ్యును దైవముండెడున్" (ఉద్యోగ-3ఆశ్వా-273)**

ధర్మాన్ని, సత్యాన్ని రక్షించడానికి దైవం వున్నాడు సుమా అని ఉద్బోధించినట్లైంది. ఉపేక్షకూడా ఒక ఆధర్మమని సూచించినట్లైంది. ఇది ఒక ధర్మదీపమైన భావన. క్లిష్ట పరిస్థితుల్లో భగవంతుడు ధర్మాన్ని, ధర్మాత్ములను రక్షిస్తాడని, ఆధర్మాన్ని, ఆధర్మాత్ములను శిక్షిస్తాడని విశ్వసిస్తుంటాయి. ధర్మ సత్యాలు చెడబారే పరిస్థితులు యేర్పడినపుడు ధర్మోరక్షతి రక్షితః అనే న్యాయాన్ననుసరించి ధర్మాత్ములు, సత్యశీలురు వాటిని శక్తియుక్తులతో రక్షించి ప్రయత్నం చేయాలి. ఈ విషయంలో ఉపేక్షిస్తే వారు బలహీనులైన పాపాలకు, అసత్యాలకు బలైపోతారు. మానవులు దక్షులై వుండి కూడ తమ విద్యుక్త ధర్మాన్ని మరచిన వారికి చేటు తప్పదని, ఔదాసీన్యము కూడ ఆధర్మమే యగునని సూచించినట్లైంది.

**ముగింపు**

దుర్యోధన, ధర్మరాజులిద్దరు రాజ్యం కొరకు ప్రయత్నించినవారే ఒకరి ప్రయత్నం అపకీర్తి ధూషితం. మరొకరి ప్రయత్నం కీర్తికారణమైంది. కర్ణుడంతటి శత్రుపక్షవీరుడే ధర్మజుని పాలన గూర్చి "అట్టిధార్మికుడాధి పత్యంబుజేయ వలపదే శాశ్వతంబుగ వసుధ యొల్ల" అని కీర్తించాడు. ధర్మజుని ఇంత కీర్తికి కారణం అతని సమత. వ్యక్తిత్వ పక్వతయే సమత. అది ప్రతి మానవుడు సాధన చేసి పొందవలసిన మానసిక స్థితి. మహాభారతంలో పాత్రల స్వభావ చిత్రీకరణలో మానసిక విశ్లేషణ వాస్తవికతా మనోహరాలు. ఏకాలంలోనైనా కనిపించే వ్యక్తులకు ప్రతిబింబాలు. అందుకే మహాభారతం సార్వకాలికమై, సార్వజనీనమై దేదీప్యమానంగా అన్నిభాషల్లో అనువదింపబడి నేటికి ప్రజల హృదయాల్లో సజీవంగా కల్గింది. ఇది ఒక మహాకల్ప వృక్షము. జనజీవన విజ్ఞాన సర్వస్వమనుట యధార్థం.

**అధార గ్రంథాలు**

1. డా.సుబ్రహ్మణ్యం.జి.వి.–"శ్రీమదాంధ్ర మహాభారతం", తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, తిరుపతి–2006.

2. డా. నాగయ్య. జి – "తెలుగు సాహిత్య సమీక్ష" నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి–1999.

3. ఆచార్య నారాయణరెడ్డి.సి – "ఆంధ్ర మహా భారతోపన్యాసములు" ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ, హైదరాబాదు–2007.

4. డా. శాస్త్రి. ద్వా.నా. – "తెలుగు సాహిత్య చరిత్ర", విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్–1998.

# 13. "భారతం... అభ్యుదయ భావుకత"

- డా:.టి.పార్థసారధి, కన్నాపురం, ఏలూరు జిల్లా

పంచమ వేదం 'అన్న ప్రశస్తిని పొందిన మహాభారతం లో ఏముందో ,..... ప్రపంచంలో అదే ఉంది .ఏది లేదో..... అది బయట మరెక్కడా లేదు. అది మానవుడి జీవిత నిబంధన లాంటిది .ఎలా బతకాలో, ఎలా బతక కూడదో సోదాహరణంగా భారతంలో కనబడ్డట్లు మనకు మరి దే నిలో కనబడదు. ఒక్కో మనిషిది ఒక్కో చరిత్ర. ఒక్కో వ్యక్తి ది ఒక్కొక్క వ్యక్తిత్వం. మళ్లీ అందులో 'మల్టీ షర్ట్స్'. పరిశీలన కొద్దీ మనకు కొత్త కోణాలు ఎన్నో బయటపడుతూనే ఉంటాయి. వెరసి మహాభారతంఒక పెద్ద అమృత సముద్రం .ఏ పరిమాణం కల పాత్రలో ముంచుకుని తాగాలో మన ఇష్టం.

మన భారత దేశ సంస్కృతిలో పురాణాలను గురించిన ప్రస్తావించే సందర్భాలలో చాలామందికి పుక్కిట పురాణాలు అనడం పరిపాటి. అయితే అవి పుక్కిట పురాణాలు ఎంత మాత్రమూ కావు. చక్కటి పురాణాలు అనడంలో ఎంత మాత్రమ అతిశయోక్తి లేదు. ఇక పురాణాలు గురించిన రెండవ మాట... పుణ్యం, పురుషార్థం అనడం సర్వసాధారణమైన విషయంగా లోకంలో చలామణిలో ఉంది. అయితే పుణ్యం వస్తుంది అనే మాట ఎంత నిజమో తెలియదు కానీ, చతుర్విధ పురుషార్థముల సాధన గురించి పురాణాలలో వివరించబడిన ప్రతి మాట అక్షర సత్యం. ఆచరణీయం. అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

"ధర్మో విశ్వస్య జగత: ప్రతిష్టా"... అని వేదం చెబుతున్న మాట. అనగా ధర్మమే ఈ సమస్త ప్రపంచం నడవడానికి ఆధారం అని అర్థం. ప్రపంచంలో కొన్ని ధర్మాలు స్థిరంగా, శాశ్వతంగా ఉంటాయి. కొన్ని ధర్మాలు కాలాన్ని బట్టి మారుతూ ఉంటాయి.

**శ్లో:: "ధర్మాచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ**
**యది హస్తి తదన్య త్రయన్నే హస్తిస తత్ క్వచితా"....**

మహాభారతంలో లేనిది ఏది సృష్టిలో లేదు .సృష్టిలో ఉన్నదంతా మహాభారతంలో ఉన్నది అని పై శ్లోకానికి అర్థం. మనదేశ చరిత్రలో అతి ప్రాచీనమైన ,సృజనాత్మకతతో రచించ బడిన కావ్యం మహాభారతం .మహాభారతం భారతీయుల విజ్ఞాన సర్వస్వం. భారతంలో చెప్పని ధర్మము అంటూ లేదు .ధర్మంగా ప్రవర్తిస్తే మానవులకు జయం తప్పదు. కనుక భారతానికి "జయ కావ్య"మని పేరు సార్ధకమైనది. మానవ జీవితాలలో నిత్యం తారసపడే కార్య ,కారణ సంబంధాలు భారతంలో వివరించబడ్డాయి .మానవ స్వభావాలలో కనిపించే ప్రేమ, పగ , క్షమ, అసహ్యం ,ఔదార్యం, కరుణ, లోభం ,మాత్సర్యం ....అన్ని ఒక్క మహాభారతంలోనే మనకు సోదాహరణంగా కనిపిస్తాయి.

(ఆది పర్వము.... నన్నయ్య గారి పద్యం)

**సీ: ధర్మ తత్వజ్ఞులు ధర్మశాస్త్రం బని**
**యధ్యాత్మవిదులువేదాంతమనియు**
**నీతి విచక్షణుల్ నీతి కావ్యంబని**
**కవి వృషభులు మహాకావ్య మనియు**
**లాక్షణికులుసర్వలక్ష్యసంగ్రహమని**
**యైతిహాసికులితిహాసమనియు**
**పరమ పౌరాణికుల్ బహు పురాణ సముచ్చ**
**యంబనిమహిఁగొనిమాడుచుండ.**

**వివిధ వేదతత్త్వవేదివేదవ్యాసు**
**దాదిముని పరాశరాత్మజుండు**
**విష్ణు సన్నిభుండువిశ్వజినీనమై**
**పరుగుచుండజేసే భారతంబు.**

మహాభారతాన్ని ఎవరు ఏ దృష్టితో చదివితే అదే విధంగాఅర్థంగోచరిస్తుంది. ధర్మం తెలిసిన వారు ధర్మశాస్త్రమని, ఆధ్యాత్మికులు వేదాంత గ్రంథం అని, నీతి తెలిసినవారు నీతి కావ్యమని, కవులు మహాకావ్యమనియూ, ఇతిహాసకులు ఇతిహాసమనియు, పురాణవేత్తలు పౌరాణిక గ్రంథం అని, ఎవరికి తోచిన విధంగా వారు భావిస్తుంటారు.

మహాభారత కథలలో ప్రతిపాత్రకు ఏదో ప్రత్యేకత,... నైతిక విలువలు ఆపాదించబడ్డాయి. పైన చెప్పినట్లు చెప్పబడిన మార్గదర్శికతను వ్యక్తులు వారికి అనుకూలంగా మలుచుకోవచ్చు. వ్యక్తి మానసిక విచక్షణ, పరివర్తనపై ఆధారపడి ఉంటుంది.

'బుక్కులు' కవితా ఖండిక కు ' కుక్కపిల్ల',,' అగ్గిపుల్ల'.. అంటూ మొదలుపెట్టిన క్షణాల్లో శ్రీశ్రీ మనసులో ఏంమెదులుతూ ఉండినదో చెప్పలేము. కానీ, శౌనకాది మహామునులు మహాభారత కథా శ్రవణం మొదలుకు మాత్రం ఈ రెండిట్లోనూ సంబంధం ఉంది.

పాండవుల సామ్రాజ్యానికి వారసులైన పరీక్షిత్తుమహారాజు కుమారుడు జనమేజయుడు. తన పాలనలో ప్రజా క్షేమం కోరి దీర్ఘకాలం కొనసాగే యజ్ఞం ఒకటి చేస్తుండగా ,ఒక కుక్క పిల్ల ఆడుకుంటూ, అటు., ఇటు తిరుగుతూ ఆ యజ్ఞం జరుగుతూ ఉన్న ప్రదేశం లోకి వచ్చింది. అది మామూలు కుక్కపిల్ల కాదు. సరమ అనే పేరు ఉన్న ఒక దేవ శునకం మగసంతానం. సారమేయుడు అన్నది ఆ కుక్క పిల్ల పేరు. అలా యజ్ఞం జరుగుతున్న ప్రదేశంలోకి చిన్నదైన ఒక కుక్క రావడం సహించలేని జనమే జయ మహారాజు ముగ్గురు సోదరులు... శ్రుతసేనుడు, భీమసేనుడు, ఉగ్రసేనుడు అనేవారు దానిని అవతలికి తరిమే ఉద్దేశంలో అదిలించి కొడతారు. వారి చేతిలో దెబ్బతిన్న సారమేయుడనే ఆ కుక్కపిల్ల బాధతో కుయ్యో.. మొర్రో... అని ఏడుస్తూ వెళ్లి తన తల్లితో జరిగినదంతా మొరపెట్టుకుంటాడు.

పిల్ల ఏడుపు వింటున్న ఏ తల్లికి కోపం రాదు .అభంశుభం తెలియనిఈకుక్కపిల్లనికొట్టడానికి మహారాజుకు చేతులెలా వచ్చాయో??.. కనుక్కొని సంగతి తేల్చుకోవాలన్న కోపంతో వచ్చిన సరమ ఏకంగా జనమేజయ మహారాజునే అడుగుతుంది.

**క్షితినాథ ! కడు నకరుణా**
**న్వితులై నీతమ్ము లతివివేకవి దూరుల్**
**మతి( దల ( పక నా పుత్రకు**
**నతి చాలకున నపరాధు నడిచిరి పెలు చన్ (ఆదిపర్వం.. ప్రథమ శ్వాసం 84 కందపద్యం)**

జనమే జయ మహారాజా!.. నువ్వేమో నీ ప్రజల క్షేమం కోరి మహా గొప్పగా యజ్ఞం చేస్తున్నానంటున్నావు. అటువైపు నీ తమ్ములేమో జాలి, దయ, అనేవి ఏమాత్రం లేని వివేక హీనుల్లా, రాక్షసుల్లా . కల్లాకపటం తెలియని వయసులో ఉన్న వాణ్ణి, అతి బాలకుడైన నా కొడుకును, ఏ తప్పు చేయని వాడిని, పసివాడని కూడా చూడకుండా, వాడు అక్కడ అడుగు పెట్టడంతోనే అదేదో పెద్ద ఆపచారం జరిగిపోయినట్లుగా భావించి.... ఇది చేయదగిన పనేనా?.. కాదా??.. అని ఒక్క క్షణమైనా ఆలోచించకుండా దెబ్బలు తగిలి ఏడ్చేలా కొట్టారు. ఆ పాపం ఊరికే పోతుందనుకున్నావా?... పోదు.

**తగు నీది తగదని యెదలో**

**వగవక, సాధులకు బేదవారల కెగ్గుల్**

**మొగి జేయు దుర్వినీతుల**

**కగు నిమిత్తా గమంబు లయిన భయంబుల్ (ఆదిపర్వం ప్రథమా శ్వాసం 85 కందపద్యం).**

పనిచేసే ముందు ఈ పని చేయదగిన పనేనా ?..కాదా?.. అని ఒక్కటంటే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా, సాధుస్వభావులైన వారికి, పేదవారికి హాని కలిగించే పనులు చేసే నీతిమాలిన మనుషులకు ఊహించడానికి కూడా అలవి కాని ఆపదలు సంభవిస్తాయి అని తిట్లతోపాటు ఒక పాటి భయం కూడా మనసులో గట్టిగా నాటుకునేలా చెప్పి పిల్లవాడితో అదృశ్యమైపోతుంది సరమ.

జనమేజయుని వైపు నుంచి ఆలోచిస్తే.... ప్రజల, పురోహితుల సమక్షంలో జరుగుతున్నది చాలా పెద్ద రాచకార్యం .ఒకటి రెండు రోజులలో ముగిసేది కాదు. ఎన్నో రోజుల పర్యంతం జరిగే ఒక బృహత్తర యజ్ఞం. అంత పెద్ద కార్యం జరుగుతుండగా, విధివశాన సంభవించినది ఒక చిన్న సంఘటన. 'సారమేయుడు 'అనే కుక్కపిల్ల, యజ్ఞం జరిగే ప్రదేశంలోతెలియక తిరుగాడడం అన్నది .కానీ ఆ సంఘటనే జనమేజయుని మనసులో ఒక శంకకు కారణమై... అతనికి ఆ తరువాత నిద్రను దూరం చేసింది కదా.' సరమ' మాటలలోని ఆపదలకు ప్రతిక్రియగా జనమేజయుడు మరిన్ని యాగాలను చేయవలసిన అవసరాన్ని సృష్టించింది కూడా ఆ చిన్న సంఘటనే కదా.

కుక్కపిల్ల అని చులకనగా చూసి చేయి చేసుకుని చివాట్లు తిన్నారు జనమేజయుడు, అతని తమ్ములు. కాబట్టి చులకనగా చూడకు దేన్నీ అన్నదే కదా ఇందులోని సారాంశం మహాభారతంలో సృష్టించబడిన ప్రతి పాత్ర విశిష్టమైనది ఆ పాత్రల ద్వారా మనకు నైతిక విలువల ప్రభోగం చిన్న కథల రూపంలో చక్కగా చెప్పబడుతుంది అర్థం చేసుకున్న వారికి వారి జీవిత అభ్యుదయాన్ని రోగములో పురోగమనములో నడిపించుకోవడానికి వీలవుతుంది.

"బుక్కులు"... కవితా ఖండికలో. శ్రీ శ్రీ. రాసింది కూడా ఇదే." హీనంగా చూడకు దేన్నీ.... కవితామయమేనోయ్ అన్నీ". బుక్కులు కవితా ఖండికకు మాటలు వెతుకుకొనే క్షణాలలో శ్రీ శ్రీ మనసులో ఏం మెదులుతూ ఉందో చెప్పలేనని మొదటి వాక్యంలో అన్నాను. కానీ, ఇప్పుడు ఈ చిన్నపాటి విశ్లేషణ తరువాత భారతంలోని ఈ ఉదంతం ప్రభావం ఈ క్షణాలలో శ్రీ శ్రీ ఆలోచనలో లేకపోవచ్చునని ఎలా అనుకోగలం...? అని వ్రాయడానికి సందేహించవలసిన అవసరం లేదేమో అనుకుంటున్నాను.

ఈ చిన్న సంఘటన ద్వారా ఎంత మంచి భావాన్ని మహాభారతం అందించిందో..... ప్రతి సంఘటన, ప్రతి కథ, ప్రతి అంశం మన జీవితాలకు అన్వయించుకుంటే భారతం ఒక అభ్యుదయ భావుకతే.

అందుకే పెద్దలు అన్నారు" వింటే భారతం వినాలి. తింటే గారెలు తినాలి" అని.

**ఆధారిత గ్రంథాలు**

శ్రీ శ్రీ సాహిత్యం.

మహాభారత కథలు కథాపర్వం.

ఆంధ్రజ్యోతి దినపత్రికలు.

# 14. ఆంధ్రమహాభారతం - సప్తవ్యసనాలు - వర్తమాన సమాజం - పర్యవసానాలు

- డా॥ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి, నెల్లూరు.

భారతీయ సాహిత్య చరిత్రలో మహాభారతానికున్న స్థానం విశిష్టమైంది. సంస్కృత భాషలో వ్యాసమహర్షి మహాభారతాన్ని 'జయం' అను పేరుతో రచించాడు. తరువాత నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు ఈ మహాభారతాన్ని ఆంధ్రీకరించారు. ఆంధ్ర మహాభారతం ఒక విజ్ఞాన సర్వస్వం కాబట్టి దీన్ని ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని, ఆధ్యాత్మవేత్తలు వేదాంతమని, నీతి విచక్షణులు నీతిశాస్త్రమని, కవిశ్రేష్ఠులు మహాకావ్యమని, లక్షణకారులు సర్వలక్షణ సంగ్రహమని, ఐతిహాసికులు ఇతిహాసమని, పురాణకారులు పురాణసముచ్చయమని పేర్కొన్నారు. కాబట్టి మహాభారతంలో మానవజీవితానికి సంబంధించిన సమస్త విషయాలు ఉన్నాయి. ముఖ్యంగా ధర్మసూక్ష్మానికి సంబంధించి మానవుని ఉన్నతికి తోడ్పడే విషయాలతో పాటు, అధర్మానికి సంబంధించి మానవుని అధోగతికి కారణమైన వ్యసనాలను గురించి వివరించింది.

ప్రాచీన సాహిత్యంలోను, అర్వాచీన సాహిత్యంలోను వ్యసనాలవల్ల పతనమైన అనేక మానవగాథలు ఉన్నాయి. ప్రతి మనిషిలోను మంచి, చెడు అలవాట్లు ఉంటాయి. ముఖ్యంగా చెడు అలవాట్లు మనిషి జీవితంలో ఒక భాగంగా మారిపోయి అతణ్ణి బానిసగా మారిస్తే దాన్ని వ్యసనం అనవచ్చు. వ్యసనం అనే పదానికి ఆపద, చింత, నిష్ఫలయత్నం వంటి పర్యాయపదాలున్నాయి. ఏ సమాజంలోనైనా వ్యసనపరుడు మామూలు మనిషిలా కాకుండా వివేకం, బుద్ధి ఉపయోగించే శక్తిని కోల్పోతాడు.

### వ్యసనం – నిర్వచనం

చెడు లక్షణాలను అలవాటుచేసుకొని దేనికయితే మనం బానిసగా మారుతామో దాన్ని వ్యసనం అంటారు. వ్యసనం అంటే కామక్రోధాలవల్ల కలిగే దోషం అని ఆంధ్రమహాభారతం చెబుతుంది.

### శాస్త్రపరంగా చెప్పబడిన సప్తవ్యసనాలు

**శ్లో: ద్యూత మాంస సురావేశ్య**
**ఖేట చౌర్య పరాంగనాః**
**మహాపాపాని సప్తైవ**
**వ్యసనాని త్యజేత్బుధః**

జూదం, మాంసం తినడం, సురాపానం, వేశ్యాసంగమం, వేట, దొంగతనం, స్త్రీలోలత్వం కలిగివుండడం సప్తవ్యసనాలుగా మన శాస్త్రాలు పేర్కొన్నాయి.

### ఆంధ్రమహాభారతంలో చెప్పబడిన సప్తవ్యసనాలు

ఆంధ్ర మహాభారతం ఉద్యోగపర్వంలో ధృతరాష్ట్రునికి, విదురుడు తన 'విదురనీతి'ని వినిపించే సందర్భంలో సప్తవ్యసనాలను పేర్కొన్నాడు.

**తే: వెలది, జూదంబు, పానంబు, వేట, పలుకు**
**ప్రల్లదంబు, దండంబుఁ బరుసదనము**
**సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేఁత**
**యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల (ఉద్యోగ. 2-44)**

స్త్రీవ్యామోహం, జూదం, మద్యపానం, వేటాడటం, కఠినంగా మాట్లాడడం, పరుషంగా మాట్లాడుతూ దండించడం, ప్రయోజనం లేకుండా సొమ్ము వృథాగా ఖర్చుపెట్టడం అనేవి సప్తవ్యసనాలు. అయితే శాస్త్రపరంగా పేర్కొన్న సప్తవ్యసనాల్లో దొంగతనం, మాంసభక్షణను ఇక్కడ పేర్కొనలేదు. అయితే ఆపదలకు కారణమైన ఏ అలవాటునైనా వ్యసనంగా పరిగణించవచ్చు. పొరపాటున ఏ మనిషైనా వ్యసనాలకు అలవాటు పడితే జీవితంలో బాగుపడలేదు. వ్యసనాలకులోనై జీవితాన్ని కోల్పోయిన వారెందరో ఉన్నారు. ఈ కాలంలోనే కాదు పురాణాలలో కూడా వ్యసనాలకు అలవాటుపడి కొందరు రాజ్యాలను కోల్పోగా, మరికొందరు ప్రాణాలను కోల్పోయారు. ఈ సప్తవ్యసనాలు ఏ కాలంలోనైనా మనిషి జీవితాన్ని నాశనం చేస్తాయి. మరి 'ఆంధ్రమహాభారతం'లో సప్తవ్యసనాల ద్వారా పతనమైన వారిని గురించి తెలుసుకుందాం.

## 1. స్త్రీ వ్యామోహం

ప్రపంచంలో అన్నిటికంటే శక్తివంతమైనది, ఆకర్షణీయమైనది స్త్రీ. ఏ కాలంలోనైనా స్త్రీ వ్యామోహం కలిగినవారు పతనంకాక తప్పదు. ఆంధ్రమహాభారతంలో ద్రౌపదిని కామించిన సైంధవుడు అవమానానికి గురికాగా, కీచకుడు ప్రాణాలను కోల్పోయాడు. ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలో జూదంలో ఓడిపోయి పాండవులు వనవాసం చేస్తూంటారు. ఒకరోజు పాండవులు తమ పరివారంతో దూరంగా వేటకు వెళతారు. ద్రౌపది ఒంటరిగా ఆశ్రమ ప్రాంగణంలో చెట్టునీడన ఉంది. ఆ సమయంలో సైంధవుడు తన పరివారంతో, మిత్రులతో రథాలమీద వెళుతూ ద్రౌపదిని సమీపించి తన వాంఛను తెలియజేస్తాడు. ద్రౌపది తాను పాండవ పత్నినని, సైంధవునికి చెల్లెలి వరుస అవుతానని ఎంత చెప్పినా వినకుండా ద్రౌపదిని బలాత్కరించి రథం మీద ఎక్కించి ఎత్తుకుపోతూ ఉంటాడు. వేటనుండి తిరిగివచ్చిన పాండవులు ధౌమ్యుని ద్వారా విషయం తెలుసుకొని తమ రథాలతో సైంధవుణ్ణి వెంబడిస్తారు. సైంధవుణ్ణి భీముడు బంధించి చంపడానికి ప్రయత్నిస్తాడు. ఉభయవంశాలకూ ఒకేఒక ఆడబిడ్డ దుస్సల. సైంధవుణ్ణి చంపి ఆమెను అనాథచెయ్యడం మంచిదికాదని ధర్మరాజు చెబుతాడు. ధర్మరాజు మాటప్రకారం భీముడు సైంధవుణ్ణి చంపకుండా గుండుగొరిగించి పరాభవిస్తాడు. గుండు గొరిగించడం అంటే చావుతో సమానమే కదా. కాబట్టి సైంధవుడు ద్రౌపదిని బలాత్కరించి చావుతో సమానమైన అవమానాన్ని పొందాడు.

అలాగే ఆంధ్రమహాభారతం విరాటపర్వంలో పాండవులు విరాటరాజు వద్ద అజ్ఞాతవాసం చేస్తున్న సమయంలో విరాటరాజు భార్య సుధేష్ణ తమ్ముడు కీచకుడు ద్రౌపది (సైరంధ్రి)ని అత్యాచారం చేయ ప్రయత్నించగా తరువాత రోజు భీముడు నర్తనశాలలో కీచకుణ్ణి అంతమొందిస్తాడు. అలాగే ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలో శంతనమహారాజు యమునాతీరంలో సత్యవతిని కామించి, తన పుత్రుడు దేవవ్రతుని త్యాగంవల్ల ఆమెను వివాహంచేసుకొని దేవవ్రతుని జీవితాన్ని అంధకారం చేశాడు. ఏ కాలంలోనైనా స్త్రీవ్యామోహం గలవారు తమ కుటుంబాన్ని, ఆరోగ్యాన్ని, సంపదను నాశనంచేసుకొంటారు. వారికి స్త్రీలపట్ల గౌరవభావం ఉండదు. స్త్రీని కేవలం వినోదవస్తువుగా చూస్తారు. మరికొందరు స్త్రీకి బానిసలుగా తయారవుతారు. కాలంమారినా మనిషిని పీడించే స్త్రీ వ్యామోహం అనే అలవాటు త్రికాలబాధితంగా కొనసాగుతూంది.

## 2. జూదం

పాచికల దగ్గరనుండి పేకాటవరకు ఎలాంటి జూదమైనా మనిషి విచక్షణను దెబ్బతీస్తుంది. అందులో ఓడిపోయినవాడు ఎలాగైనా గెలవాలనే తలంపుతో ఒంటిమీద గుడ్డల్ని సైతం తాకట్టుపెట్టేందుకు సిద్ధపడతాడు. ఆంధ్రమహాభారతంలో జూదం ఆడడం వల్ల ధర్మరాజు రాజ్యాన్ని పోగొట్టుకొని అవమానాలకు గురి అయ్యాడు. ఆంధ్రమహాభారతం సభాపర్వంలో ధర్మరాజు శకుని చేతిలో జూదంలో తన సర్వస్వాన్ని, సోదరులను, చివరకు తన భార్య ద్రౌపదిని ఒడ్డి ఓడిపోతాడు. అయితే ధృతరాష్ట్రుడు తన కుమారుడు దుర్యోధనుడు చేసిన తప్పును గ్రహించి పాండవుల్ని దాస్యవిముక్తుల్ని చేసి, వాళ్ళ రాజ్యం తిరిగి ఇచ్చివేశాడు. అయితే జూదరి అయిన ధర్మరాజు రెండోసారి కౌరవులతో జూదం ఆడతాడు. జూదంలో ఓడిపోయి తన సోదరులు, భార్య ద్రౌపదితో కలసి పన్నెండేండ్లు అరణ్యవాసం, ఒక్క ఏడు అజ్ఞాతవాసం

చేసి నమ్ముకున్నవారందరినీ కష్టాలపాలు చేశాడు. అలాగే అరణ్యపర్వంలోని నలమహారాజు చరిత్ర అనే కథలో కలి ప్రభావం వలన నలమహారాజు తన దాయాది పుష్కరునితో జూదం ఆడి రాజ్యాన్ని కోల్పోయి అష్టకష్టాల పాలవుతాడు.

మహాభారతకాలంలో జూదమంటే పాచికలాట. ఆ జూదమే నేడు పేకాట, క్రికెట్ బెట్టింగ్, గుర్రపుపందాలు మొదలగు అవతారాలెత్తింది. ప్రస్తుతం ఇంటర్నెట్ జూదం కూడా అందుబాటులో ఉంది. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం కూడా ఒక రకమైన జూదమే. నేటి సమాజంలో కూడా ఎందరో రకరకాల జూదాలు ఆడి ఆస్తుల్ని పోగొట్టుకొని బికారులవుతున్నారు.

### 3. మద్యపానం

ప్రాచీనకాలంనుండి మనిషి మద్యానికి బానిస అవుతూనే ఉన్నాడు. మద్యానికి బానిస అయిన మనిషి సమయం, సంపద, కుటుంబం అన్నీ వదులుకునేందుకు సిద్ధపడతాడు. తన కుటుంబాన్ని బజారున పడేస్తాడు.

ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలో రాక్షసగురువైన శుక్రాచార్యుడు మద్యపానం వల్ల కలిగే అనర్థాలను వివరించాడు. రాక్షసగురువైన శుక్రాచార్యుని వద్దకు దేవతల గురువు బృహస్పతి కుమారుడు కచుడు మృతసంజీవని విద్య నేర్చుకోవడానికి వచ్చి శిష్యునిగా చేరతాడు. శుక్రాచార్యుడు కచుని అభిమానించడం చూసి రాక్షసులు అతణ్ణి చంపడానికి ప్రయత్నిస్తారు. చంపిన ప్రతిసారి శుక్రాచార్యుని కూతురు దేవయాని కోరికమేరకు మృతసంజీవని విద్య ద్వారా కచుని బతికిస్తాడు. ఇలా కాదని రాక్షసులు కచుడిని చంపి, కాల్చి బూడిదచేసి, ఆ బూడిదను సురలో కలిపి శుక్రాచార్యుని చేత తాగిస్తారు. దేవయాని కచుని జాడ తెలియక దుఃఖిస్తుంది. శుక్రాచార్యుడు దివ్యదృష్టిని సారించి తన కడుపులో కచుడు ఉన్నాడని తెలుసుకుని పశ్చాత్తాపపడతాడు. ఈ సురాపానం (మద్యపానం) వ్యసనంతోనే కదా శిష్యుణ్ణి దూరంచేసుకున్నానని బాధపడతాడు. మద్యపానం వల్ల కలిగే అనర్థాల్ని వివరిస్తాడు.

**మొదలి పెక్కుజన్మములఁ బుణ్యకర్మముల్**
**పరఁగఁ బెక్కుసేసి పడయఁ బడిన**
**యట్టి యెఱుక జనులకాక్షణ మాత్రన**
**చెఱుచు మద్యసేవ సేయనగునె?**

**భూ సురులాదిగఁ గల జను**
**లీసుర సేవించిరేని యిది మొదలుగఁ బా**
**పాసక్తి బతితు లగుదురు**
**చేసితి మర్యాద, దీని చేకొనుదు జనుల్** **(ఆది. 3-120,121)**

“మద్యపాన వ్యసనంతో ఎన్నో జన్మల పుణ్యఫలంగా పొందిన జ్ఞానం సమూలంగా క్షణాల్లో నశిస్తుంది. బ్రాహ్మణులు గానీ, మరెవరైనా గానీ సురాపానం చేస్తే పతితులైపోతారు. వారికి పాపం కలుగుతుంది” అంటూ శుక్రాచార్యుడు దేవయానిని ఓదార్చాడు. ఇకపై మద్యపానం చేయకూడదని నిశ్చయించుకున్నాడు. నేటికాలంలో కూడా యువత బీరు, బ్రాంది వంటి వివిధ రకాల బ్రాండ్‌ల రూపంలో వాటిని సేవిస్తూ మద్యపాన మత్తుకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

### 4. వేటాడటం

ప్రాచీనకాలంలో ఆదిమానవునికి వేట ప్రధానమైన వృత్తి. ఆహారం కోసం జంతువులను వేటాడేవాడు. తరువాత కాలంలో కొందరు వినోదం కోసం జంతువులను వేటాడేవారు. ఆంధ్రమహాభారంతంలో రాజులు వేటాడటం సంప్రదాయంగా

పేర్కొనడం జరిగింది. ఆంధ్రమహాభారతంలో పాండురాజు జింకలను వేటాడి శాపంవల్ల ప్రాణాలు కోల్పోయాడు. ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలో శంతనమహారాజు వేట, దుష్యంతుడి వేట, సభాపర్వంలో కురుపాండవ కుమారుల వేట వర్ణింపబడినాయి. ముఖ్యంగా ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలో పాండురాజు వినోదంగా వేటాడుతూ ఒకరోజు ఒక పొదలో జింకల రూపంలో సంగమిస్తున్న ఋషి జంటను అతిదారుణంగా బాణాలతో కొడతాడు. మృగాన్ని చంపానన్న ఆనందంతో జింకల వద్దకు వెళతాడు. అప్పుడు మగ జింక పాండురాజుతో 'రాజా! నేను జింకను కాదు కిందముడనే మహర్షిని. నేను నా భార్య జింకల రూపం ధరించి కామభోగాల్ని అనుభవిస్తున్నాం. వేటాడడం అనేది రాజ లక్షణం, దాన్ని కాదనను. అయితే నువ్వు చేసిన ఈ పని అధర్మం. ఆయాసంతో పరిగెత్తలేని వాటిని, మైమరచి రమిస్తున్న వాటిని, ఈనడానికి సిద్ధంగా ఉన్నవాటిని, రోగాలతో బాధపడుతున్న వాటిని కిరాతకులు కూడా వేటాడరు. భరతవంశంలో పుట్టిన నువ్వు మమ్మల్ని హింసించావు, నిరపరాధులైన మమ్మల్ని చంపావు, కనుక నువ్వుకూడా నీ భార్యతో సంగమించిన మరుక్షణం చస్తావు, నీతోపాటు నీ భార్యకూడా చస్తుంది, నువ్వు చేసిన పాపానికి ఇదే నీకు తగిన శిక్ష' అని శపించి ప్రాణాలు వదిలాడు. కిందముడి శాపంతో పాండురాజు అహంకారం దిగిపోయి తన తప్పు తెలుసుకున్నాడు.

**ఎట్టి విశిష్ట కులంబునఁ**
**బుట్టియు సదసద్వివేకమును గల్గియు మున్**
**గట్టిన కర్మఫలంబులు**
**నెట్టన భోగింపకుండ నేర్తురే మనుజుల్ (ఆది. 5-58)**

ఎంత గొప్ప వంశంలో పుట్టినా, మంచి చెడు విచక్షణా జ్ఞానం ఉన్నా, పూర్వ జన్మ కర్మఫలాన్ని అనుభవించకుండా ఎవరైనా ఉండగలరా? వేట అనే వ్యసనం వల్లే తనకింత ఆపద కలిగిందని, వేదనచెంది హింసని వదలిపెట్టాలని నిశ్చయించుకుంటాడు. ఆధునికకాలంలో వేట మూలంగా ఎన్నో జాతులు అంతరించిపోతున్నాయి. అందువల్ల ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు పక్షులను, జంతువులను వేటాడడం చట్టరీత్యా నిషేధించాయి. మరికొన్ని దేశాలు ఆదాయం కోసం వేటను ప్రోత్సహిస్తున్నాయి. ఏది ఏమైనా వినోదం కోసం జంతువుల్ని చంపడం మహాపాపం.

### 5. కఠినంగా మాట్లాడడం (వాక్పారుష్యం)

వాక్పారుష్యం అంటే మాటల్లో కాఠిన్యం. క్రోధంవల్ల, దురుసుతనం వల్ల విచక్షణ కోల్పోయి మాట్లాడడం వల్ల మనిషి విపరీతంగా నష్టపోతాడు. వాక్పారుష్యం వల్ల మనుష్యులు దూరమవుతారు. పరుషమైన మాట మనిషి మనసును గాయపరచగలదు. మాట అదుపులేని వారు తిరిగి అదే తప్పు చేస్తూవుంటారు. కొంతమంది తమ మాటకు ఎదురులేకపోవడం వల్లకాని, అహంకారం వల్లకాని ఎంత తోస్తే అంత మాట్లాడేస్తూ ఉంటారు. అందుకే విచక్షణ లేకుండా వాక్పారుష్యంతో మాట్లాడడాన్ని సప్తవ్యసనాలలో ఒకటిగా పెద్దలు పరిగణించారు. ఆంధ్రమహాభారతం ఉద్యోగపర్వంలో విదురుడు ధృతరాష్ట్రునికి నీతిబోధ చేసే సందర్భంలో వాక్పారుష్యం గురించి వివరించాడు.

**బెడిదముగఁ గత్తిఁ గొడ్డటఁ**
**బొడువఁ దెగిన ప్రాన జిగురు వొడముఁ, బలుకులం**
**జెడఁ దునిసిన కార్యంబు ని**
**గుడనేరదు పిదప నెట్టుఁ గురువంశనిధీ** **(ఉద్యోగ 2-61)**
**తనువున విఱిగిన యలుఁగుల**
**ననువున బుచ్చంగ వచ్చు, నతి నిష్ఠురతన్**

**మనమున నాటిన మాటలు**
**వినుమెన్ని యుపాయములను వెడలునె యధిపా! (ఉద్యోగ 2-62)**

రాజా! గొడ్డలితో భయంకరంగా నరకబడ్డ మాను తిరిగి చిగురిస్తుందేమో కానీ, పరుషమైన మాటలతో చెడగొట్టబడ్డ పని ఎప్పటికీ, ఏవిధంగాను సఫలంకాదు అలాగే దేహంలో గుచ్చుకున్న ములుకులను ఏదో ఒక ఉపాయంతో తీసివేయవచ్చు కానీ మిక్కిలి గట్టిగా హృదయంలో దిగబడిన మాటలు ఎన్ని ఉపాయాలతోనూ వెలుపలికి తీయలేము అని విదురుడు వాక్పారుష్యం వలన కలిగే నష్టాలను వివరించాడు.

అలాగే ఆంధ్రమహాభారతంలో వాక్పరుష్యం వల్ల శిశుపాలుడు శ్రీకృష్ణుని చేతిలో ప్రాణాలను కోల్పోయాడు. ఆంధ్రమహాభారతం సభాపర్వంలో ధర్మరాజు శ్రీకృష్ణుని అనుమతితో రాజసూయ యాగం పూర్తిచేశాడు. యాగానంతరం భీష్మపితామహుడు ధర్మరాజుతో ముందుగా పూజింపదగినవాడు శ్రీకృష్ణుడు అని చెప్పగానే ధర్మరాజు శ్రీకృష్ణుని పూజించి అర్ఘ్యాన్ని భక్తితో సమర్పించాడు. అప్పుడు శిశుపాలుడు ఆగ్రహంతో ధర్మరాజుని ఆక్షేపిస్తూ భీష్మణ్ణి, శ్రీకృష్ణణ్ణి కఠినమైన మాటలతో నిందిస్తాడు. సహనశీలియైన ధర్మరాజు శిశుపాలునితో ఇలా అన్నాడు.

**భూరిగుణోన్నతు లనదగు**
**వారికి, ధీరులకు, ధరణివల్లభులకు వా**
**క్పారుష్యము చన్నె? మహా**
**దారుణమది విషముకంటె, దహనముకంటెన్ (సభా 2-17)**

'శిశుపాలా! మహాగుణవంతులలో శ్రేష్ఠులైనవాళ్ళకు, ధీరులకు, నీలాంటి మహారాజులకు వాక్పారుష్యం తగునా? అది అగ్నికన్నా, విషముకన్నా భయంకరమైనది సుమా! శ్రీకృష్ణుడు త్రిలోక పూజ్యుడు ఇందులో దోషంలేదు అని ధర్మరాజు శిశుపాలుని శాంతిపచేస్తుండగా భీష్ముడు శిశుపాలునితో అల్పుడవైన నీకు కృష్ణతత్వం తెలియదని ఆగ్రహిస్తాడు. అప్పుడు సహదేవుడు శిశుపాలుని పరుషపదజాలంతో హెచ్చరించగా శిశుపాలుడు యుద్ధసన్నద్ధుడవుతాడు. భీష్ముడు శిశుపాలుణ్ణి జాగ్రత్తగా మసలుకోమ్మని హెచ్చరిస్తాడు. శిశుపాలుడు భీష్ముని మాటలు లెక్కచేయక అనరాని మాటలతో భీష్మణ్ణి, శ్రీకృష్ణణ్ణి నిందిస్తాడు. వాక్పారుష్యంతో శ్రీకృష్ణుని దూషిస్తాడు. కోపించిన శ్రీకృష్ణుడు సుదర్శనచక్రాన్ని శిశుపాలునిపై ప్రయోగించగా అతని తలతెగి అమాంతంగా నేలపై పడుతుంది. శిశుపాలుడు మరణిస్తాడు. శిశుపాలుడు రాజు అనే అహంకారంతో పెద్దలైన భీష్మణ్ణి, శ్రీకృష్ణణ్ణి వాక్పారుష్యంతో నిందించి ప్రాణాలు కోల్పోయాడు కాబట్టి ప్రతి మనిషి వాక్పారుష్యాన్ని వదలిపెట్టాలి. మంచిమాటలతో ఇతరుల హృదయాన్ని గెలవాలి.

### 6. దండపారుష్యం(కఠినంగా దండించడం)

ఇతరులను దండించడంలో కఠినంగా వ్యవహరించడాన్ని దండపారుష్యం అంటారు. ఇది కఠినాత్ములైన రాజులు, అధికారులు, న్యాయాధికారులు కఠినదండనలు విధిస్తూవుంటారు. దేశాన్ని పాలించే వ్యక్తి కావచ్చు, ఇంట్లో పిల్లల్ని అదుపుచేసే తండ్రి కావచ్చు, విద్యార్థుల్ని శిక్షించే ఉపాధ్యాయుడు కావచ్చు. దండించే అధికారం ఉన్నవారికి అలా దండించడంలో కనుక తృప్తి లభించడం మొదలుపెడితే అతనిని అదుపుచేయడం చాలా కష్టం. అందుకే నియంతలు లక్షలమందిని పొట్టనపెట్టుకొన్న జీవితాలు చరిత్రలో అడుగడుగునా కనిపిస్తాయి. చేసిన తప్పుకి ప్రతిఫలంగా ఇతరులకు గుణపాఠంగా దండన ఉండాలే కానీ ప్రతీకారంగా ఉండకూడదు. ఆంధ్రమహాభారతంలో భీముడు దుర్యోధనుని కఠినంగా దండనకు గురిచేసి ఉపపాండవుల ప్రాణాలు, శిఖండి, ధృష్టద్యుమ్నుని ప్రాణాలు పోవుటకు కారకుడయ్యాడు. ఆంధ్రమహాభారతం శల్యపర్వంలో యుద్ధాంతంలో మరణభయంతో దుర్యోధనుడు మడుగులో దాక్కుంటాడు. ధర్మరాజు రెచ్చగొట్టగా దుర్యోధనుడు అసహనంతో రగిలిపోతూ

మడుగులోంచి తన గదాయుధంతో బైటకొచ్చాడు. భీముడు దుర్యోధనునితో తలపడ్డాడు. అధర్మబద్ధ యుద్ధంలో భీముడు దుర్యోధనుని తొడలపై గదతో కొట్టి నేలకూల్చాడు. ఆవేశపరుడైన భీముడు అంతటితో ఆగక దుర్యోధనుడి తలను కాలితో తన్ని అట్టహాసం చేశాడు. అంతలో రక్త మడుగులో పడివున్న దుర్యోధనుని వద్దకు అశ్వత్థామ, కృపాచార్య, కృతవర్మలు వచ్చారు. వాళ్ళు రారాజు దుస్థితిని చూసి భోరున విలపించారు. నిస్సహాయ స్థితిలో పడివున్న రారాజు తలను భీముడు కాలితో తన్నాడని తెలుసుకొన్న అశ్వత్థామకి పాండవుల మీద ఆగ్రహం పెల్లుబికింది. తనను ఆజ్ఞాపిస్తే పాండవులనందరినీ హతమారుస్తానని అనగానే ప్రభుభక్తికి మెచ్చి దుర్యోధనుడు అశ్వత్థామను చివరి సేనాధిపతిగా నియమిస్తాడు. సౌప్తికపర్వంలో కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మలు పాండవ శిబిరానికి వెళ్తారు. అప్పుడు రాత్రి కావడంతో పాండవ శిబిరంలోని వారు గాఢ నిద్రలో ఉన్నారు. ముందుగా అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడి శిబిరంలోకి వెళ్ళి అతని మెడకు తన బాణం వింటినారిని బిగించి చంపుతాడు. తరువాత ఉప పాండవులను, శిఖండిని ఆవేశంతో నరికేశాడు. పాండవ శిబిరాన్ని తుత్తునియలు చేశాడు. రక్తపుమడుగులో అసహాయస్థితిలో ఉన్న దుర్యోధనుని తలను భీముడు కాలితో తన్నడంవలన ప్రభుభక్తి గల అశ్వత్థామ ఉపపాండవులను చంపివేశాడు. కావున ఎవరినైనా దండనకు గురిచేసేటప్పుడు కఠినంగా వ్యవహరించడం కూడదు. కఠినంగా దండించడం కూడా ఒక వ్యసనమే.

### 7. సొమ్ము వృధాగా ఖర్చుపెట్టడం

మానవునిలో అన్నిటికన్నా ఖరీదైన వ్యసనం సొమ్ము వృధాగా ఖర్చుచేయడం "అతిదానాత్ హతః కర్ణః" – అంటే అతిగా దానంచేయడం వల్లే కర్ణుడు మృతిచెందాడని భావం. ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలో పాండవులకు మేలుచేయాలని భావించి ఇంద్రుడు కర్ణుని వద్దకు వచ్చి కవచకుండలాలను అపహరించాలని అనుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సూర్యుడు కర్ణునివద్దకు వచ్చి "ఇంద్రుడు బ్రాహ్మణ రూపంలో వచ్చి నీ కవచకుండలాలను అడుగుతాడు. వాటిని దానంచెయ్యొద్దు అవి నీవద్ద ఉన్నంతకాలం నిన్ను ఎవరూ చంపలేరు" అని చెబుతారు. కర్ణుడు "దివాకరా! బ్రాహ్మణులు వచ్చి ఏదికోరినా ఇస్తాను, నన్ను క్షమించు" అంటాడు. సూర్యుడు చెప్పినట్లే ఇంద్రుడు కపట బ్రాహ్మణుని వేషంలో కర్ణునివద్దకు వచ్చి కవచకుండలాలను దానంచేయమంటాడు. వెంటనే తన సహజ కుండలాలను చీల్చి ఇంద్రునికి ఇస్తాడు. కవచకుండలాలను ఇంద్రునికి దానం చేయకుండా ఉంటే కర్ణుడు మహాభారత యుద్ధంలో అర్జునుని చేతిలో మరణించి ఉండేవాడు కాదు. కావున అతిదానం వల్ల కర్ణుడు ప్రాణాలను కోల్పోయాడు.

పై సప్తవ్యసనాలు లెక్కలోకి వచ్చినా, రాకపోయినా పరిమితి, నియంత్రణ లేని అలవాట్లన్నీ వ్యసనాలే. నేటి సమాజంలోని మనుషులు వ్యసనాలకు దూరంగా ఉంటే మంచిది. వాటికి లొంగిపోతే మనిషి నాశనమవుతాడని మన పురాణాలు, ఇతిహాసాలు ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి. అది ఆనాటికీ, ఈనాటికీ, ఏనాటికైనా వర్తించే సత్యం. కావున నేటి సమాజంలోని మనుషులు వ్యసనాలకు దూరంగా ఉండి ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మిస్తారని ఆశిద్దాం.

### ఆధారగ్రంథాలు

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణలు
2. మహాభారతము (కవిత్రయ భారత సంక్షేప వచనానుసరణము) – శ్రీ పుత్తా పుల్లారెడ్డి
3. మహాభారతం (సంగ్రహవచనం) – డా॥ జయంతి చక్రవర్తి
4. వ్యసనములు – వికీపీడియా
5. సప్తవ్యసనములు – వికీపీడియా

# 15. తిక్కన భారతం - ధౌమ్య ధర్మోపదేశాలు

- డా॥ పట్టపు. శివకుమార్, తిరుపతి

మహాకవి తిక్కన సోమయాజి కవిత్రయంలో ద్వితీయుడైనా, కవిత్వంలో అద్వితీయుడుగా ప్రసిద్ధిని పొందినాడు. తిక్కన మహత్వాన్ని గురించి మారన తన మార్కండేయ పురాణ పీఠికలో '*'ఉభయ కవిత్వతత్త్వ విభావోజ్జ్వలు, సంహితాధ్వర క్రియా ప్రభు . . . .*" (మార్కండేయ పురాణం. పీఠిక. 10) అంటూ తిక్కనను మహాకవిగా కీర్తించినాడు. తిక్కన వేదవిహిత యజ్ఞక్రియలను నిర్వహించినవాడు. పండితులకు ఆత్మబంధువు, ముల్లోకాలలో వ్యాపించిన కీర్తి కలిగినవాడు. అందుకే మారన తిక్కనను 'అభినవ పరాశరసూనుడు'గా పేర్కొన్నాడు. తిక్కనకు వంశపారంపర్యంగా లభించిన విశేష గుణ సంపద వలన అతనికి కావ్యతంత్రం, రణతంత్రం, రాజ్యతంత్రం సులువుగా అలవడినాయి. అందువలననే తిక్కన మూర్తిమత్వం మనకు అతడిని ఒక మంత్రిగా, సేనానిగా, ధర్మవేత్తగా, రాయబారిగా చూపుతుంది. అలాగే ఆంధ్ర మహాభారత రచనకు తిక్కనను ఉత్తమాధికారిగా పేర్కొంటూ, *"ఈ పంచమ వేదమును సవిమర్శనముగా విభజించినపుడు అందు మూడే ముఖ్య విషయములు గోచరించును. అవి. 1. రాజనీతి 2. యుద్ధతంత్రము 3. బ్రహ్మ విద్యోపదేశము. పుట్టుకచేతను, నడవడిచేతను, విజ్ఞానముచేతను ఈ మూడు మహాధర్మములను ఆత్మధర్మములుగా నిర్వహించి అనుభవ గోచరములు చేసికొనిన కవి తెలుగునాట తిక్కన యొక్కడే. ఈ కారణముల చేత భారత రచనకు తిక్కనయొక్కడే యుత్తమాధికారి యని చెప్పనగును."* (లక్ష్మీకాంతం, పింగళి. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పు.222) అని పింగళి లక్ష్మీకాంతం గారు ప్రశంసించారు.

## విరాటపర్వం

ఆంధ్ర మహాభారతంలో నాలుగవది విరాటపర్వం. అందుకే తిక్కన దీనిని 'హృదయాహ్లాది చతుర్దమూర్జిత కథోపేతము నానారసాభ్యుదయోల్లాసి . .' గా పేర్కొన్నాడు. తిక్కన దృష్టిలో విరాటపర్వం హృదయానికి ఆహ్లాదం కలిగించేది. ఈ విషయాన్ని గురించి ఆంధ్ర మహాభారతం లోని విరాటపర్వ పీఠికలో, *"హృదయానికి ఆహ్లాదాన్ని కలిగించేది విరాట పర్వమట! ఈ లక్షణం అన్నిటికంటె మొదట లెక్కించతగిందట! ఆహ్లాదం కలిగించేది ఎవరికి? సహృదయులకు. పేరు విరాటపర్వం. విరాట నగరంలో పాండవులు అజ్ఞాతవాస జీవితాన్ని నిర్వహించిన కథను చెప్పేది కాబట్టి అది విరాటపర్వం. ఆహ్లాదం విరాటుడి వలన పాండవులకు కలుగవచ్చునుబీ పాండవుల వలన విరాటుడికి కూడా కలుగవచ్చునుబీ కథను తన్మయత్వంతో భావించే సహృదయులకు వారిరువురి వలన ఆహ్లాదం కలుగవచ్చునుబీ కవి వర్ణనల వలన, కల్పనల వలన పఠితలకు ఆహ్లాదం కలుగవచ్చును. ఈ విధంగా నాలుగు రకాల ఆహ్లాదం కలిగించే స్వభావం విరాటపర్వ కథకు సహజంగా ఉన్నదని తిక్కన నిర్దేశం."* (ఆం.మ.భా. విరాటపర్వం. పీఠిక. 26) అని పేర్కొనడం కనిపిస్తుంది. అంతటి విశిష్టత కలిగిన విరాటపర్వం లోని ప్రథమాశ్వాసంలో, పాండవులకు వారి పురోహితుడైన ధౌమ్యుడు బోధించిన ధర్మోపదేశాలు 116 వ పద్యం నుంచి 140 వ పద్యం వరకు ఉన్నాయి.

## విరాటపర్వం - ధర్మోపదేశం

అంధ్ర మహాభారతం లోని తిక్కన కృతమైన విరాటపర్వం ఆనందంతోపాటు మంచి ఉపదేశాన్ని కూడా మనకు అందిస్తుంది. *"రామాయణంలో సుందరకాండకు వలె మహాభారతంలో విరాట పర్వానికి ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. చతుర్విధ పురుషార్థాలకు సంబంధించిన అనేకాంశాలు ఈ పర్వంలో సముచితంగా సంగ్రహంగా సందర్భోచితంగా సంతరించబడ్డాయి. విరాటపర్వం చదివిన పఠిత ఎంతటి విపత్తులలో ఉన్నా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని విజయుడౌతాడు. దానికి తగిన వ్యుత్పత్తి ఇందులో అక్షరబద్ధం చేయబడి ఉన్నది."* (ఆం.మ.భా. విరాటపర్వం. పీఠిక. 83) అనే విరాటపర్వం పీఠిక లోని ప్రశంస అందుకు చక్కని ఉదాహరణ అని చెప్పవచ్చు. అందుకు నిదర్శనంగానే విరాటపర్వంలో పాండవులకు వారి పురోహితుడైన ధౌమ్యుడు అనేక ధర్మాలను ఉపదేశించాడు.

**ధౌమ్యుని ధర్మోపదేశం**

విరాటపర్వంలో ధౌమ్యుడు పాండవులకు చేసిన ధర్మోపదేశంలో ప్రధానంగా రాజసేవాధర్మాలు కనిపిస్తాయి. అంతేకాకుండా ఈ రాజసేవాధర్మాలు అన్నీ కూడా ఆ కాలంలో రాజాస్థానాలలో పనిచేసే ఉద్యోగులకు ఏర్పరచిన ప్రవర్తన నియమావళిగా కూడా కనిపిస్తాయి. విరాటపర్వం ప్రథమాశ్వాసంలో ధౌమ్యుడు చేసిన ఈ ఉపదేశాలు అన్నీ కూడా కథలో అన్వయించక పోవచ్చు. అలాగే కొన్ని మాత్రం కథలో అన్వయించి కనిపించవచ్చు. అయితే ఈ ఉపదేశాన్ని వ్యాసుడు, తిక్కన కూడా కథాంశంగా కంటే ప్రబోధాంశంగానే భావించారు అని చెప్పవచ్చు.

పండితులు ఎల్లవేళలా సమాజ శ్రేయస్సును కోరి అనేక మంచి విషయాలను యథోచితంగా బోధిస్తూ ఉంటారు. అందులోనూ తమకు ఆప్తులైన వారి విషయంలో అయితే ఆ బోధ పురుషార్థ ప్రదాయినిగా ఉంటుందని చెప్పవచ్చు. అటువంటిదే విరాటరాజు కొలువులో అజ్ఞాతవాసం చేయబోతున్న పాండవులకు ధౌమ్యుడు చేసిన సేవాధర్మాల ఉపదేశం. అయితే ధౌమ్యుడు పాండవులకు సేవాధర్మాల బోధ మొదలుపెట్టబోతూ,

*"ఎఱింగెడువారికి నైనను*
**గఱపక తక్క రుచిత ప్రకారము శుభముం**
**గొఱలు హితులీ లట్లగుట నం**
*దఱకును జెప్పంగవలయుఁ దగియెడు బుద్ధుల్"* **(ఆం. మ. భా. విరాట. 1-116. పు. 54)**

అని 'లోకంలో అనేక విషయాలు తెలిసిన వారు ఉండవచ్చు. అంతేకాకుండా వినేవారికి ఈ చెప్పబోయే విషయాలు తెలియనివి కావు. కాని ధర్మార్థ కామ పురుషార్థ వ్యుత్పత్తి లోకానికి యథావకాశంగా జ్ఞాపకం చేయటం ఋషులకు, ఆచార్యులకు, కవులకు సహజధర్మం. అందువలన ఎదుటివారి మేలుకోరే వారు తెలిసిన వారికి కూడా తగిన బుద్ధులు చెప్పకుండా ఉండలేరు. కావున సందర్భానుసారంగా అందరికీ తగు విధంగా నీతులు చెప్పవలసిందే' అని అన్నాడు. ఈ మాటలు సమాజం పట్ల మహనీయులైన ధౌమ్యుని వంటి వారికి గల బాధ్యతను తెలుపుతున్నాయి. అదేవిధంగా ధౌమ్యుడికి పాండవుల పట్ల గల ఆదరాభిమానాలు కూడా మనకు ఇక్కడ వ్యక్తమవుతున్నాయి.

ధౌమ్యుడు పాండవులను ఉద్దేశించి చెబుతూ, 'మీరు కురువంశంలో పుట్టినవారు. గౌరవంగా పెరిగినవారు. మీవంటి వారు మరొక సామాన్య మానవ మాత్రుడిని సేవిస్తూ, తద్వారా ఎదురయ్యే మానావమానాలు సహిస్తూ అణిగిమణిగి సవినయంగా ఉండటం అనేది అంత సులువైన పని కాదు. ఎందుకంటే వివిధ రకాల అస్త్రాలు మంటల వంటివి. వాటిని ధరించే పాండవులు కూడా అగ్నుల వంటివారు. అయినప్పటికీ పాండవులు వారికి ప్రాప్తించిన కాల విరోధాన్ని మరచిపోకూడదు. అలా కాదని మండిపడితే, అనగా బాహాటంగా తమ పరాక్రమాదులను ప్రదర్శిస్తే, దానివలన వారు తమ ఉనికిని బహిర్గతం చేసుకుంటారు. దాని ఫలితంగా అజ్ఞాతవాసం భంగం అవుతుంది. దానివలన ప్రారంభించిన కార్యం కాస్తా చెడిపోతుంది.' అని పలికినాడు. ఇక్కడ ధౌమ్యుని మాటలలో పాండవులు తమ అజ్ఞాతవాస కాలాన్ని గడపడానికి తగిన సూచనలు వినిపిస్తున్నాయి. కురువంశ ప్రతిష్టను నిలపడం, ఇంతవరకు వారికి అనుభవంలో లేని సేవావృత్తిలోకి ప్రవేశించడం, దాని వలన ఎదురు కాబోయే అవమానాలు, సన్మానాలు అన్నింటికీ సిద్ధంగా ఉండమని ధౌమ్యుని బావన. అలాగే పాండవులు అజ్ఞాతవాస కాలంలో తమ నిజ రూపాలను దాచుకోవడం ఎంత ముఖ్యమో, అదేవిధంగా వారి ఆయుధాలను కూడా దాచిపెట్టడం అంతే ముఖ్యమని మనకు తెలుస్తున్నది.

ధౌమ్యుడు పాండవులను 'పాండు కుమారులారా! మీకు ఎటువంటి ప్రమాదం కలగకుండా ఉండాలని నా ఆశయం. అందుచేత నాకు చేతనయిన విధంగా ఉపదేశం చేస్తాను. రాజులను సేవించి జీవించే వారు మిక్కిలి జాగ్రత్తగా ఉండాలి. అందువలన రాజసేవలో ఇబ్బందులకు లోనుగాని విధంగా సాధారణ నీతిని సంగ్రహంగా చెపుతాను. శ్రద్ధగా వినండి' అని పలికినాడు.

**రాజ కొలువులో ప్రవేశించుట**

ధౌమ్యుడు పాండవులతో, 'పాండు కుమారులారా! తగిన పద్ధతిలో రాజ సభలోనికి అడుగుపెట్టాలి. తన స్థానానికి తగిన ఆసనంలో కూర్చొవాలి. తన రూపంగాని వేషంగాని వికృతంగా ఉండకుండా చూచుకొనాలి. సమయం తెలిసికొని మసలుకొంటూ సేవించాలి. ఆ విధంగా చేయగల వ్యక్తి మాత్రమే రాజు గౌరవానికి పాత్రుడౌతాడు. అయితే రాజులు సహజంగా అధికారదర్పం వలన తరచూ కోపపడతారు. ఒక్కోసారి కొలువుకూటంలో అంగీకారం లేక ప్రవేశించడం కూడా వారి ఆగ్రహానికి కారణమవుతుంది. అట్లాగే అర్హతలకు అనుగుణంగా వేసిన ఆసనాలు గుర్తించి తన స్థాయికి తగిన స్థానంలో కూర్చొనాలి. అదేవిధంగా సభలో రాజు ప్రసంగించే వేళ, సమయం చూసి తనకు అవకాశం కలిగినప్పుడు మాత్రమే మాట్లాడటం మంచిది. లేకుంటే అనవసర ప్రసంగం అవుతుంది. సాధారణంగా రాజసభలోని వారు నాగరకులు అయి ఉంటారు. అందువల్ల నాగరకుల యొక్క వేషానికి భిన్నంగా ఉండే వేషధారణ చేయటం అనేది రాజు కొలువులో పనికిరాదు. అంతేకాకుండా వికృత వేషంతో కొలువులోకి ప్రవేశించడం 'ఎబ్బెట్టుగా' కూడా ఉంటుంది. రాజు కొలువులోని సేవకుడు, 'నేను రాజు కొలువులో ఉన్నాను. రాజుతో చనువుగా తిరుగుతున్నాను. నా కేమిటి? అని అనుకొంటూ నిర్భయంగా మర్యాదను అతిక్రమించి ప్రవర్తించడం మంచిది కాదు. అటువంటి ప్రవర్తన వలన మొదటికే మోసం వస్తుంది సుమా!' అని ధౌమ్యుడు పాండవులను హెచ్చరిస్తున్నాడు.

**రాజును అనుకరించుట**

రాజు కొలువులో పనిచేసే సేవకులు ఏ విధంగాను కూడా రాజును అనుకరించే ప్రయత్నం చేయకూడదు. దాని గురించి చెబుతూ,

*"రాజగృహంబుకంటే నభిరామముగా నిలు గట్టఁ గూడ, దే*
**యోజ నృపాలుఁ డాకృతికి నొప్పుగు వేషము లాచరించు, నే**
**యోజ విహారముల్ సలుప మల్లమునం గడువేడ్క సేయు, నే**
*యోజ విదగ్ధుఁడై పలుకుబీ నొద్దులకుం దగ దట్లు సేయఁగన్"*

**(ఆం. మ. భా. విరాట. 1-123. పు. 57)**

అని ధౌమ్యుడు పాండవులకు తెలిపినాడు. అనగా రాజు కొలువులో ఉండే సేవకులు రాజుగారి ఇంటికన్నా అందంగా ఇల్లు కట్టు కొనకూడదు. రాజుగారి వేషధారణ పద్ధతిలోనే ఏ సేవకుడు కూడా విలువైన, అందమైన దుస్తులు ధరించకూడదు. అలాగే రాజు చేసే విహారం వలెనే ఏ సేవకుడు కూడా విహరించకూడదు. అదేవిధంగా రాజు మాట్లాడే పద్ధతిలో తాను కూడా మాట్లాడటం అనేది సేవకుడికి ఎంతమాత్రం తగదు అనేది ధౌమ్యుని యొక్క ఉద్దేశ్యం. ఈ మాటలు రాజ సేవకుల యొక్క వ్యవహార శైలిని గురించి చెబుతున్నాయి.

లోకంలో సహజంగా రాజులు ఎవరైనా కూడా అందరికంటే తాము అధికంగా ఉండాలని కోరుకుంటారు. రాజసం అనేది వారి లక్షణం. అందుచేత సేవకులు రాజుకంటే ఎందులోనూ అధికులుగా ఉండరాదు అని గ్రహించాలి. రాజభవనం కంటే ఎత్తైన భవనాన్ని సేవకుడు కట్టుకుంటే, సంపదలో రాజుకంటే మించిన వాడనే భావన కలుగుతుంది. అదేవిధంగా వేషధారణ అనేది వైభవానికి, విహారం అనేది విలాసానికి సంబంధించిన ఆయా రంగాలలో సేవకుడు తన అధిక్యాన్ని ప్రదర్శించకుండా అణకువతో జీవించటం మంచిది అని ఇందులోని అంతరార్థం.

**రాజుల స్వభావం**

రాజుల స్వభావం అతి చిత్రమైనది. వారు ఏ విషయానికి ఎలా ప్రతిస్పందిస్తారో తెలియదు. అందువలన సేవకులు రాజు కొలువులో తమ విధి నిర్వహణలో తగు జాగ్రత్తగా ఉండాలని ధౌమ్యుని ఉద్దేశ్యం. అందుకే ధౌమ్యుడు

పాండవులతో, 'రాజులు తమ ఆజ్ఞను మీరిన వారిని కొడుకులు అని గాని, మనుమలు అని గాని, సోదరులు అని గాని, స్నేహితులు అని గాని భావించరు. అంతేకాకుండా రాజులు తమ మేలుకోసం, భద్రతకోసం సొంత వారిని కూడా చివరికి శత్రువులు గానే పరిగణిస్తారు. అనుమానం కలిగితే కోపం పెంచుకొని చివరికి వారిని అంతం చేయడానికి కూడా వెనుదీయరు' అని పలికినాడు.

సాధారణంగా ఏ కాలంలో అయినా రాజకీయాలలో నీతిని పాటించేవారు అరుదుగా ఉంటారు అనే చెప్పాలి. అందువలన రాజ శాసనాన్ని ధిక్కరించే వారు ఎవరైనా సరే రాజును ధిక్కరించినట్లుగా పరిగణించబడతారు. అటువంటి ధిక్కారాన్ని ఏ రాజు కూడా సహించడు. అంతేకాకుండా చిన్నపామునైనా సరే పెద్దకర్రతో కొట్టాలనే భావనతో, పుత్రుడైనా, తమ్ముడైనా, మిత్రుడైనా, సేవకుడైనా అతడిని తనకు శత్రువుగానే భావిస్తాడు. ఒక్కోసారి కోపంతో చంపటానికి కూడా పూనుకుంటాడు. అందువలన రాజధిక్కారం అనేది ఏ రూపంలో అయినా సేవకుడికి హానికరం అని చెప్పవచ్చు.

**రాజుల కొలువులో వ్యవహరించాల్సిన తీరు**

రాజుల కొలువులో సేవకులు వ్యవహరించవలసిన తీరును గురించి ధౌమ్యుడు పాండవులతో ఈ విధంగా పేర్కొన్నాడు.

*"పనువాని చేయుకార్యం*
**బున కడ్డము సొచ్చి నేరుపున మెలఁగుచుఁ దా**
**నును బయిఁ బూసికొనుటఁ దన**
*మును మెలఁగిన మెలకువకును ముప్పుగుఁ బిదపన్"* **(ఆం. మ. భా. విరాట. 1-125. పు. 57)**

అని ధౌమ్యుడు 'పాండు కుమారులారా! ఏదయినా సరే సాధించుకోగలిగిన సమర్థుడి పనికి ఎప్పుడు కూడా అడ్డు పోకూడదు. ఆవిధంగా అడ్డు వెళ్లి ఆ పనిని తన మీద వేసికొని, పూసుకు తిరిగితే అసలు స్థితికి (ఉద్యోగానికి) కూడా ముప్పురాక తప్పదు' అని హెచ్చరిక చేశాడు.

ఆ తర్వాత ధౌమ్యుడు పాండవులతో రాజు కొలువులో సేవకులు నడుచుకోవలసిన తీరును గురించి పేర్కొంటూ, 'పాండు నందనులారా! సేవకులు కూడా రాజుతో సన్నిహితంగా ఉండటంలో ఎటువంటి తప్పు లేదు. కాని రాజువద్ద ఉండే చాలామందికి కష్టం కలిగించే పనులలో మాత్రం ఎటువంటి జోక్యం కల్పించుకోరాదు అని గ్రహించండి. అటువంటి పనులవలన ఒక్కోసారి సేవకుడి నిజ శక్తి బహిర్గతం కావచ్చును. కానీ దాని ఫలితంగా ఆ తర్వాత ఊహించని హాని కలగటం మాత్రం తథ్యం. అందుచేత తెలివిగలవారు అటువంటి పనులకు పూనుకోరు' అని తెలిపినాడు. ఈ మాటలు జరగబోయే కథలో భీముడు సభలో ద్రౌపదిని అవమానించిన కీచకుని మీదికి వెళ్లే సందర్భాన్ని గుర్తుచేస్తున్నాయి. అందువల్లనే ధౌమ్యుడు ముందుగా పాండవులను అటువంటి సంఘటనలకు సన్నద్ధం చేస్తున్నాడని తెలుస్తున్నది.

అయితే రాజు కొలువులో అన్ని విషయాలలో కల్పించుకోరాదు అని చెప్పినంత మాత్రాన, రాజు దగ్గర పూర్తిగా మౌనంగానూ ఉండకూడదు. అలాగని పదిమందితో ఆర్భాటంగా మాట్లాడటం కూడా సరికాదు. తనకు దగ్గరి వారైన సేవకులతో కలిసి తాను రాజుతో మాట్లాడటం సబబుగా ఉంటుంది అనేది ధౌమ్యుని సూచన. అలాగే సేవకుడు తాను రాజు దగ్గర ఉన్నప్పుడు వ్యతిరేకత కలిగించే విధంగా ఇతరులకు సమాధానం చెప్పకూడదు. అవసరం కలిగితే మాత్రం తనంతట తానే ముందుకు వచ్చి రాజాజ్ఞను నిర్వర్తించాలి.

రాజు కొలువులో సేవకులు మాట్లాడవలసిన తీరును గురించి పాండవులకు తెలుపుతూ,

*"ధరణీపు చక్కఁ గట్టెదురు దక్కి పిఱుందును గాని యట్లుగా*
**నిరుగెలనం దగం గొలిచి యే మమనో, యెటు సూచునొక్కొ!యె**

వ్వరి దెన నెప్పు డే తలఁపు వచ్చునొ యాతని కంచుఁ జూడ్కి న
*స్థిరముగఁ దమ్మ ఖంబునవ చేర్చుచు నుండుట నీతి కొల్వునన్"* (ఆం. మ. విరాట. 1-129. పు.59)

అని పలికినాడు ధౌమ్యుడు. 'రాజ సభలో ఉన్నప్పుడు సేవకుడు రాజుకు మరీ ఎదురుగా ఉండకూడదు. అట్లాగని రాజుకు వెనుకవైపు కూడా ఉండకూడదు. అందువలన రాజును సభలో ఏదో ఒక పక్కన నిలబడి మాత్రమే సేవించాలి. కొలువులో రాజు ఎప్పుడు ఏమంటాడో, ఎటువైపు చూస్తాడో, ఎవరిని చూస్తే అతడికి ఎటువంటి ఆలోచన కలుగుతుంది అనే భావాలను సేవకుడు తన మనసులో ఉంచుకొని, ఎల్లప్పుడూ రాజు ముఖం మీదనే దృష్టి సారించి సభలో మెలగాలి' అని ధౌమ్యుడు పాండవులకు తెలిపినాడు.

**అంతఃపుర రహస్యాలు**

రాజు కొలువులో అత్యంత క్లిష్టమైన పని అంతఃపుర రహస్యాలతో వ్యవహరించడం. దాని గురించి ధౌమ్యుడు పాండవులకు తెలుపుతూ, 'అంతఃపురాల లోని రహస్యాలు ఎప్పటికీ బయట పెట్టరాదు. ఇతర చోట్ల ఎక్కడయినా సరే రాజుకు సంబంధించిన మాటలు విన్నప్పుడు ముందు ఆలోచించాలి. ఆ తరువాత ఆ మాటలు రాజు వినదగినవయితేనే చెప్పాలి. అంతఃపుర విశేషాలు బయటకు పొక్కితే వాటి గురించి ఆరా తీస్తారు. నిజం తెలిస్తే చెప్పినవాని ప్రాణం నిలవదు. అదేవిధంగా సేవకుడు ఇతర చోట్ల తెలిసిన విషయం రాజుకు చెప్పకపోయినా కూడా తప్పే. కాబట్టి సేవకుడు ఇటువంటి విషయాలలో కొంత విచక్షణ చూపాలి' అని తెలిపినాడు. కాబట్టి సేవకుడు తాను విన్న మాటలలో అసలు నిజాన్ని ముందుగా తెలుసుకోవాలి. తరువాత ఆ విషయం రాజుకు చెప్పదగినదా, కాదా అని ఆలోచించాలి. ఆ మాటలు రాజు వినదగినవైతేనే చెప్పాలి. అనవసరమైన విషయం అయితే చెప్పరాదు. అంతేకాదు రాజుకు అప్రియమైన విషయం ఎప్పుడూ చెప్పరాదు అని గ్రహించాలి.

అదేవిధంగా రాజ భటుడు అంతఃపురంతో వ్యవహరించాల్సిన తీరును గురించి ధౌమ్యుడు ఈ విధంగా పలికినాడు. 'పాండు కుమారులారా! భటుడికి అంతఃపురంతో సంబంధం ఎంతమాత్రం మంచిది కాదు. పైగా అటువంటి సంబంధం హానికారి కుడా. అంతేకాకుండా అక్కడ తిరిగే పరిజనమైన గూనివారు, పొట్టివారు, పరిచారికలు మొదలైన వాళ్ళతో స్నేహం అంతకంటే కీడు కలిగిస్తుంది' అని పలికినాడు. ఈ మాటలు "బహు వృత్తాంతాని రాజకులాని నామ" అనే భాసుని ప్రతిమా నాటకం లోని సూక్తిని తెలుపుతున్నాయి.

**ఇతర సేవా ధర్మాలు**

పాండవులకు అజ్ఞాతవాస కాలంలో పాటించదగిన సూచనలను బోధిస్తున్న ధౌమ్యుడు ఇతర సేవా ధర్మాలను వినిపిస్తూ ఇలా అన్నాడు. 'రాజు అనుగ్రహిస్తేనే సేవకులు సభలో ఆసనాలు అధిరోహించాలి. అదేవిధంగా వాహనాలు కూడా రాజానుగ్రహం లేకుండ ఎక్కకూడదు. అంతేకాకుండా శ్రేష్ఠమైన ఆసనాలు, పెద్ద పెద్ద వాహనాలు కూడా సేవకులు తమంతట తాము ఎన్నుకొనటమో, అధిరోహించటమో చేయరాదు. అది ఎంతగా రాజగౌరవం పొంది ఉన్న వారికైనా మంచిది కాదు' అని తెలిపినాడు.

*"మన్నన కుబ్జక, యవమతి*
**దన్నొందిన స్రుక్కబడక, ధరణీశుకడన్**
**మున్నున్న యట్ల మెలఁగిన,**
*యన్నరునకు శుభము లొదవు నాపద లడఁగున్"* (ఆం. మ. భా. విరాట. 1-133. పు. 60)

'పాండు కుమారులారా! రాజు తనను గౌరవించాడని సేవకుడు ఎప్పుడు కూడా పొంగి పోరాదు. అలాగే అవమానించాడని కూడా కుంగి పోకూడదు. ఆ రెండింటిని లెక్కించక వెనుకటి వలెనే రాజు దగ్గర ప్రవర్తించే సేవకులకు మంచి జరుగుతుంది. ఆపదలు కూడా తొలగిపోతాయి' అని ధౌమ్యుడు పాండవులతో పలికినాడు. ఈ మాటలు ఉద్యోగులకు

ఉండవలసిన ఆత్మవిశ్వాసాన్ని తెలుపుతూ, వృత్తి జీవితంలో ఎదురయ్యే ఆటుపోటులను తట్టుకొని నిలవాలనే స్ఫూర్తిని నింపుతున్నాయి.

ఇక సేవకులకు సంబంధించిన ఇతర ధర్మాలను గురించి తెలుపుతూ, 'ఒక వేళ రాజు ఎవరినైనా సంరక్షించాలని అనుకోవచ్చును. లేదా శిక్షించాలని అనుకోవచ్చును. ఆ విషయాలు తనకు తెలిసినా, అవి అమలు కాకముందే తనంతట తాను బయట పెట్టే సేవకుడైనవాడు మూరు?డు' అని పలికినాడు. అదేవిధంగా 'సేవకుడు కర్తవ్య నిర్వహణలో ఎండకు, వానకు కూడా సహించాలి. తన ఇల్లు అని, పొరుగుచోటు అని అనుకోరాదు. ఆకలి వేస్తుంది, అలసిపోతాను, నిద్రకు సమయం మించిపోతుంది. దాహం వేస్తున్నది, ఒక్కడినే ఎట్లా? అనే ఆలోచనలకు అవకాశం ఎప్పుడూ ఇవ్వకూడదు. అనుకోకుండా రాజు ఒక పనిని సూచించినట్లయితే ఆ పనిని శ్రద్ధతో, భక్తితో చెయ్యాలి' అని ధౌమ్యుడు పాండవులతో చెప్పినాడు. ఈ మాటల వలన ఉద్యోగి తన వృత్తి నిర్వహణలో చూపవలసిన నిజాయితీ, నిబద్ధతలను తెలుపుతున్నది. అదేవిధంగా విధి నిర్వహణలో ఎవరైనా కూడా ఆకలి, నిద్ర, అలసట, దాహం అనే వాటిని కూడా లెక్క చేయకూడదని ఈ మాటలు తెలుపుతున్నాయి.

ఇక రాజుకు సంబంధించిన ధనం అనేది ఎవరికైనా కూడా సంగ్రహించదగింది కాదు అనే అంశాన్ని గురించి ధౌమ్యుడు పాండవులకు తెలుపుతూ,

*'తా నెంత యాప్తుఁడైన మ*
**హీనాయకుసొమ్ము పామునెమ్ములుగా లో**
**నూనిన భయమునఁ బొరయక**
*మానినఁగా కేల కలుగు మానము బ్రదుకున్?"* **(ఆం. మ. భా. విరాట. 1-136. పు. 61)**

అని అన్నాడు. 'పాండు కుమారులారా! రాజసభలో మెలిగే సేవకుడు రాజుకు తాను ఎంత ఆప్తుడయినా కావచ్చును. అయినప్పటికీ రాజధనాన్ని పాము ఎముకల మాదిరిగానే భావించాలి. రాజధనాన్ని కేవలం పరికించాలి. అంతేగాని ఆ ధనాన్ని తీసుకోవాలనే ఆలోచన చేయకూడదు. సేవకులు అటువంటి రాజధనాన్ని సంగ్రహించే గుణం మానితేనే గాని వారి మానమూ, ప్రాణమూ నిలువవు అని గ్రహించాలి' అంటూ ధౌమ్యుడు పాండవులతో పలికినాడు.

ఈ సందర్భంలో మనకు 'పరుల సొమ్ము పాము వంటిది' అనే సూక్తి గుర్తుకు వస్తుంది. మన పూర్వీకులు పరుల ధనాన్ని పాముతో పోల్చినారు. ఆ విధంగానే తిక్కన కూడా ధౌమ్యుని చేత 'రాజు సొమ్ము పాము ఎముకల వంటిది' అని పలికించినాడు. ఈ పోలిక మూలంలో లేదు. 'విషతుల్యములైన పాము ఎముకలు సేకరించకూడనివి' అని లోక ప్రసిద్ధి ఉంది. అంతేకాకుండా పాము ఎముకలను సేకరిస్తే ప్రాణహాని కలుగుతుంది అనే అభిప్రాయం లోకంలో ఉంది. అలాగే రాజధనం కూడబెట్టటం కూడా ప్రమాదం కలిగిస్తుందని ఇందులోని భావం.

### రాజసభలో చేయకూడని పనులు

పాండవ పురోహితుడైన ధౌమ్యుడు అజ్ఞాతవాసం గడపబోతున్న సందర్భంలో వారికి మేలు కలిగించే విధంగా అనేక ధర్మ సూక్ష్మాలు తెలిపినాడు. అందులో భాగంగానే సేవావృత్తిలోకి ప్రవేశించబోతున్న వారికి రాజుకోలువులో చేయకూడని పనులను గురించి చెబుతూ, 'రాజు కొలువు తీరినపుడు సేవకుడు ఆవులించకూడదు. అలాగే తుమ్మటం మంచిది కాదు. ఇక నవ్వటం అసలే పనికిరాదు. ఉమ్మి వేయటం అనేది కూడా తప్పు అవుతుంది. కనుక వీటిని బహిరంగంగా చేస్తే ప్రక్క వాళ్ళకు అవి అసహ్యాన్ని కలిగిస్తాయి. కాబట్టి అటువంటి చేష్టలను చాలా గోప్యంగా చేయాలి' అని ధౌమ్యుడు తెలిపినాడు. వాస్తవానికి ఇటువంటి అవలక్షణాలు ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఈనాడు కూడా ఎవరికైనా సరే పరిహరించదగినవే అని చెప్పవచ్చు.

ఆ తర్వాత నీచులతో చేసే సహవాసం వల్ల కలిగే కీడును గురించి తెలుపుతూ, 'శత్రువుల దూతలు, భేద భావాన్ని కలిగించేవారు, రాజు ఆగ్రహానికి పాత్రులై నిరాకరించబడిన వారు, పాపాత్ములు అయిన వారికి దగ్గరగా ఉండటం అనేది సేవకులకు ఎంతమాత్రం మంచిది కాదు. ఎందుకంటే దీనివలన సేవకులకు చివరకు కీడు, నింద కూడా కలుగుతాయి' అని ధౌమ్యుడు తెలిపినాడు. ఈ మాటలు 'దుష్టులతో సహవాసం మంచిది కాదు' అనే సూక్తిని తెలుపుతున్నాయి.

అలాగే సేవకులు ఎప్పుడు ఎవరితోనూ వైరం కలిగి ఉండటం మంచిది కాదని చెబుతూ, 'రాజు దగ్గర మెలిగే ఏనుగుతో అయినా, దోమతో అయినా సరే వైరం కలిగే విధంగా ప్రవర్తించడం మంచిది కాదు. భటుడు తాను ఎంత పూజనీయుడైనా కూడా రాజు కొలువుకు సంబంధించిన జనులతో స్నేహం కలిగి ఉండటం ఎంతో మేలు' అని ధౌమ్యుడు పాండవులకు తెలిపినాడు. ఆ తర్వాత ధౌమ్యుడు సంపదల వినియోగం గురించి పాండవులకు ఇలా తెలిపినాడు. 'భోగాలను అనుభవించడానికే కదా సంపదలు అని సేవకుడు విచ్చలవిడిగా భోగించరాదు. ఎందుకంటే అటువంటి భోగ విలాసాల వలన రాజుకు సేవకుల మీద కంటగింపు కలుగవచ్చు. కావున సేవకులు నమ్రతతోనే ఎటువంటి వేడుకలు అయినా చేసుకోవాలి' అని ధౌమ్యుడు పాండవులకు రాజు కొలువులో ఆచరించదగిన అనేక సేవా ధర్మాలను గురించి తెలియజేసినాడు.

**ముగింపు**

అరణ్యవాసం పూర్తి చేసుకొని, అజ్ఞాతవాసం లోకి ప్రవేశించబోతున్న పాండవులకు వారి పురోహితుడైన ధౌమ్యుడు అనేక సేవా ధర్మాలను తెలియజేసినాడు. ధౌమ్యుడు తెలిపిన సేవా ధర్మాలు ఆనాటికి, ఈనాటికి కూడా ఆచరణీయాలే అని చెప్పవచ్చు. ఎందుకంటే వృత్తి ధర్మంలో, ఉద్యోగ నిర్వహణలో కూడా నేడు మనకు ఎదురవుతున్న అనేక సమస్యలకు పరిష్కారాలు ఈ ప్రకరణంలో మనకు కనిపిస్తాయి. సభలోను, ఉన్నత అధికారులు, పెద్దల యొక్క సాన్నిధ్యంలో ఉద్యోగాలు నిర్వహించే సందర్భంలో ఈ ధౌమ్య ధర్మోపదేశాలు అన్నీ కూడా మనకు ఎంతగానో ఉపకరిస్తాయి. మార్గనిర్దేశనం చేస్తాయి. ఉదాహరణకు రాజసేవలో ఉన్నవాడు తాను గర్వించి, ఉత్తమ ఆసనాలు, ఉత్కృష్ట వాహనాలు ఎక్కకూడదని తెలిపినాడు. అందుకే సేవా వృత్తిలో కొనసాగినంత కాలం విరాటపర్వ కథలో పాండవులు ఇతరుల వాహనాలనుగానీ, పీఠాలనుగానీ ఎక్కిన జాడలు మనకు కనిపించవు. వారు అజ్ఞాతవాసం అయిపోయిన తరువాత తమ రాజాధిరాజ పదవిని నిరూపించుకోవటానికి రాజసింహాసనాన్ని గ్రహించారు.

సుదేష్ణ కీచకుడి మందిరానికి వెళ్ళి మద్యం తెమ్మని సైరంధ్రిని ఆజ్ఞాపించింది. సైరంధ్రిగా రాజ్ఞిసేవలో ఉన్న ద్రౌపది తనను పంపవద్దని వేడుకున్నదే కాని, ఆమె ఆజ్ఞను తిరస్కరించలేదు. అందుకు ఈ సేవాధర్మమే కారణం అని చెప్పవచ్చు. అలాగే మూలంలో ధౌమ్యుడు బోధించిన ఈ ధర్మాలను రాజు కొలువులో స్థిరంగా ఉండే లక్షణంగా చెప్పబడినవి. అయితే తెలుగులో మాత్రం వీటిని ఆపదలు తొలగి, శుభాలు కలిగే లక్షణంగా చెప్పటం తిక్కన భారతంలోని సందర్భోచితమైన రచనాశిల్పం అని చెప్పవచ్చు.

**ఆధారగ్రంథాలు**

1. తిక్కన సోమయాజి. (2013) శ్రీమదాంధ్ర మహాభారతము. టిటిడి ప్రచురణ. తిరుపతి.
2. శ్రీరామమూర్తి, గురజాడ. (1913) కవిజీవితములు. వావిళ్ల రామస్వామిశాస్త్రులు సన్స్, చెన్నపురి.
3. ఆరుద్ర. (2003) సమగ్ర ఆంధ్ర సాహిత్యం. తెలుగు అకాడమీ, హైదరాబాదు.
4. లక్ష్మీకాంతం, పింగళి. (2002) ఆంధ్ర సాహిత్య చరిత్ర. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
5. వేంకటావధాని, దివాకర్ల. (1961) ఆంధ్ర వాఙ్మయ చరిత్ర. ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు.
6. ప్రతాపరెడ్డి, సురవరం. (1949) ఆంధ్రుల సాంఘిక చరిత్ర. సాహిత్య వైజయంతి ప్రచురణ, హైదరాబాదు.
7. ద్వా.నా. శాస్త్రి. (2004) తెలుగు సాహిత్య చరిత్ర. ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాదు.

# 16. మహాభారతం-పద్దెనిమిది పర్వాలు-విశేషాలు( క్లుప్తంగా)

- డా॥ వి. వెంకటేశ్వర్లు, నెల్లూరు

**పరిచయం**

మహాభారతం హిందువులకు పంచమ వేదముగా పరిగణించబడే భారత ఇతిహాసము. పురాణ సాహిత్య చరిత్ర ప్రకారం మహాభారత కావ్యము వేద కాలం తర్వాత, అనగా సుమారు సామాన్య శకపూర్వం 4000లో దేవనాగరి లిపిగల సంస్కృత భాషలో రచించబడింది. దీనిని వేదవ్యాసుడు చెప్పగా గణపతి రచించాడని హిందువుల నమ్మకం. 18 పర్వములతో, లక్ష శ్లోకములతో (74,000 పద్యములతో లేక సుమారు 18 లక్షల పదములతో) ప్రపంచము లోని అతి పెద్ద పద్య కావ్యములలో ఒకటి. ఈ మహా కావ్యాన్ని 14వ శతాబ్దంలో కవిత్రయముగా పేరు పొందిన నన్నయ, హొతిక్కన, ఎర్రనలు తెలుగు లోకి అనువదించారు. మహాభారతం ఒక పురాతన భారతీయ ఇతిహాసం, ఇక్కడ ప్రధాన కథ రెండు కుటుంబాల చుట్టూ తిరుగుతుంది - పాండవులు మరియు కౌరవులు - కురుక్షేత్ర యుద్ధంలో, హస్తినాపుర సింహాసనం కోసం యుద్ధం చేస్తారు. ఈ కథనంలో ముడిపడివున్న వ్యక్తులు చనిపోయిన లేదా జీవించే వ్యక్తుల గురించి అనేక చిన్న కథలు మరియు తాత్విక ఉపన్యాసాలు. కృష్ణ-ద్వైపాయన్ వ్యాస, స్వయంగా ఒక ఇతిహాసం, వ్యాసుడు చెప్పగా వినాయకుడు మహాభారతాన్ని వ్రాశాడని పురాణ కథనం కూడా .ఇప్పుడు ఏ ఏ పర్వంలో ఏ ఏ అంశాలు చెప్పబడిందో ఒకసారి చూద్దాం ...

**1) ఆది పర్వము**

ఇందులో మహాభారత కధ మొత్తం సంగ్రహంగా చెప్పబడుతుంది. మీరడిగిన ప్రశ్నకు సమాధానంగా రెండవ అధ్యాయంలో " సర్వ సంగ్రహ పర్వము" అన్న పేరిట ఏ పర్వంలో ఏమున్నదో సంగ్రహంగా చెప్పబడుతుంది.

ప్రతీ పర్వంలోను అనేక ఉపపర్వాలు ఉంటాయి. ఉదాహరణకు అదిపర్వంలో 19 పర్వాలు ఉన్నాయి. కౌరవ పాండవుల కధ మేరకు పరిశీలిస్తే వారి వారి పుట్టుకనుంచి (నిజానికి వారు పుట్టకముందునుంచి, ఇంకా ముందునించి కూడా), వారి బాల్యం, విద్యాభ్యాసం. కురు పాండవుల తగాదాలు, ధర్మరాజు యువరాజుగా అభిషిక్తుడవడం, లక్క ఇల్లు కాలడం, పాండవులు చనిపోయారని అందరు నమ్మడం, విదురుడి సహాయంతో పాండవులు బయపడి రహస్య జీవితం గడపడం, హిడింబాసుర వధ, హిడింబ ద్వారా ఘటోత్కచుడిని కొడుకుగా పొందడం, ఏకచక్రపురంలో బ్రహ్మచారులుగా జీవితం, భీముడు బకాసురిని చంపడం, వ్యాసుని సలహా మేరకు ద్రౌపది స్వయంవరంలో పాల్గొని ఆమెను అర్జునుడు గెలుచుకోవడం, పాండవులు ఐదుగురు ఆమెను వివాహమాడటం, మొదటిసారిగా కృష్ణుడి పాత్ర ప్రవేశం, వారి సమాగమం, ధృతరాష్ట్రుడు రాజ్యం విభజించి ధర్మరాజును ఖండవప్రస్తం ఏలుకోమనడం, ధర్మరాజు పట్టాభిషేకం,ఇంద్రాప్రస్థనిర్మాణం, కృష్ణార్జునుల వల్ల ఖాండవదహనం, అర్జునిడికి గాండీవం, అక్షయ తూణీరం, కపిధ్వజంతో ఉన్న రథం అమరడం, ఇంద్రుడి యుద్ధవిరమణ, మయ పరిచయం ఇత్యాదులు.

**2) సభా పర్వం**

మయసభ కారణంగా దీనికి ఆ పేరు వచ్చి ఉండవచ్చు. ద్యూతసభ కారణం కూడా కావచ్చు. ఇంద్రప్రస్థ రాజ్యాన్ని పొందాక ధర్మరాజు రాజసూయ యాగం చేస్తాడు. దానికి గాను నలుగురు తమ్ముళ్ల నాలుగు దిక్కులు జయించడం, దానికి ముందుగా జరాసంధ వధ, రాజసూయ యాగం, శిశుపాల వధ, మయసభలో దుర్యోధనుని అవమాన ఆభాస. ధృతరాష్ట్రుడు శకుని వ్యూహానుసారం ధర్మరాజును జూదానికి పిలవడం, ధర్మరాజు తనను, తమ్ముళ్లను, ద్రౌపదిని కూడా ఒడ్డి ఓడిపోవడం, ద్రౌపదిని సభకు దుశ్శాసనుడు జుట్టు పట్టుకుని లాక్కు రావడం, ద్రౌపది ప్రశ్న,ద్రౌపదివస్త్రాపహరణ విఫల ప్రయత్నం, భీముడి రౌద్ర ప్రతిజ్ఞలు,ద్రౌపదిని అనుగ్రహించి ధృతరాష్ట్రుడు సర్వం తిరిగి ఇచ్చేయడం, అనుద్యూతం, ధర్మరాజు ఓడిపోయి 12 ఏళ్ళ అరణ్యవాసానికి 1 ఏడాది అజ్ఞాతవాసానికి కట్టుబడి రాజ్యాన్ని వదిలి అడవులకు పోవడం.

### 3) అరణ్యపర్వం

పాండవులు కామ్యకవనం చేరడం, కిర్మీర వధ, యాదవులు, పాంచాలులు, చేది, కేకయ రాజులు వచ్చి కలుసుకోవడం, యుద్ధానికి ధర్మరాజు విముఖత, ద్వైత వనం చేరడం, వ్యాసుడి సలహా మేరకు అర్జునుని ధర్మరాజు ప్రతిస్మృతి ఉపదేశించి తపస్సుకు పంపడం, పరమశివుని గురించి తపస్సు చేయమని ఇంద్రుడు చెప్పడం, అర్జునిడి ఉగ్ర తపస్సు, కిరాతకుని రూపంలో శివుని రాక, పరీక్షా, పాశుపతాస్త్ర ప్రదానం, దిక్పాలకులు అనేక అస్త్రాలు ఇవ్వడం, అర్జునిని దేవేంద్రుడు స్వర్గలోకం తీసుకువెళ్లడం, చిత్రసేనుడు వద్ద సంగీతనృత్యాలు నేర్చుకోవడం, ఇంద్రుడి వద్ద ధనుర్విద్యలో మెళుకువలు తెలుసుకోవడం, ఊర్వశి శాపం, నివాతకవచులను జయించి పెట్టడం, ఇలా ఐదేళ్లు గడిపి గంధమాదన పర్వతం మీద తనవారిని కలుసుకోవడం, ఈలోపు మిగిలిన పాండవులు లోమసమహర్షితో అనేక తీర్థాలు తిరిగి గంధమాదనం చేరడం. భీముడికి సంబంధించి నహుష వృత్తాంతం, జటాసుర వధ, సౌగంధిక పుష్పాలు తేవడం, కుబేరుడి అనుచరులతో యుద్ధం, దారిలో హనుమంతునితో కలయిక, కుబేరుని అనుచరుడు మణిభద్రుడిని చంపడం,అందరు కలిసి తిరిగి ద్వైత వనం చేరడం, దుర్యోధనుడి ఘోష యాత్ర, చిత్రసేనుడి చేతిలో పరాభవం, పాండవుల ద్వారా విడుదల, కర్ణుడి శపథం, దిగ్విజయ యాత్ర, వైష్ణవ యాగం, ఇంద్రుడు కవచకుండలాలలను హరించడం, ద్రౌపతిని జయద్రధుడు అపహరించడం, జయద్రధ పరాభవం, కర్ణుడు వాసవీ శక్తీ పొందడం. పాండవుల అరణ్యవాస సమయ పూర్తి, యక్షప్రశ్నలు, యముని ఆశీర్వాదం. పాండవులు విరాట నగరం చేర నిర్ణయం. ఈ పర్వంలోనే ఋషుల ద్వారా ధర్మరాజు అనేక పురాణ గాధలు వినడం. నలదమయంతుల కథ, రామాయణం, అగస్త్య వృత్తాంతం, సావిత్రి చరిత్ర మొదలైనవి. బృహదశ్వుని ద్వారా ధర్మరాజు అక్షవిద్య కూడా అభ్యసిస్తాడు. మరో మారు జూదం ఆడాల్సి వస్తే ఓడిపోకుండా ఉండటానికి.

### 4) విరాట పర్వం

పాండవులు వివిధవేషాలతో విరాటుడి కొలువులో చేరుతారు.ధర్మరాజు కంకుడనే జూదమిత్రుడుగా, భీముడు వలలుడనే పేరుతో వంటవాడిగా, అర్జునుడు బృహన్నలపేరుతో పేడి వేషంలో ఉత్తరకు నృత్య శిక్షకుడిగా, నకుల సహదేవులుగ్రంధికుడు, తంత్రీపాలుడు అన్నపేర్లతో అశ్వ శిక్షకుడు, గోరక్షకుడుగా చేరుతారు. ద్రౌపది మాలిని అన్న పేరుతో సైరంధ్రిగ రాణి సుధేష్ణ దగ్గర ఆంతరంగిక పరిచారికగా చేరుతుంది. కీచకుడు చివర్లో ద్రౌపదిని మోహించడం, అవమానించడం, భీముని చేతిలో వధింపబడటం, ఉపకీచకులు వంద మంది ద్రౌపదిని తమ అన్న కీచకుడితో పాటు దహనం చేయడానికి తీసుకుపోతూ వుంటే భీముడు గంధర్వుడిలా వచ్చి అందరిని సంహరించడం, కీచక వద్ద భీముడే చేసి ఉంటాడని దుర్యోధనుడు ఊహించడం. త్రిగర్త రాజు సుశర్మ దక్షిణ గోగ్రహణం హస్తినాపురం సైన్యం ఉత్తర గోగ్రహణం ఒక రోజు తేడాలో చేయడం. విరాటుడిని సుశర్మ బారి నుండి భీముడు రక్షించి సుశర్మను పరాభూతుడిని చేయడం ఉత్తర గోగ్రహణాన్ని అడ్డుకోవడానికి ఉత్తర కుమారుడు బృహన్నల సారధ్యంలో వెళ్లడం, భయపడ్డాఉత్తరుడికి నిజం చెప్పి అర్జునుడు నిజరూపంలో ఉత్తరుడు సారధిగా కౌరవులను జయించడం, విరాటుడు ముందు పొరబడినాపాండవులను గుర్తించి గౌరవించడం, ఉత్తరను అర్జునుడు అభిమన్యుడి భార్యగా ఒప్పుకోవడం, పాంచాలులు, యాదవులు విరాటనగరం రావడం, శ్రీకృష్ణుని సమక్షంలో ఉత్తర అభిమన్యుల వివాహం జరగడంతో విరాట పర్వం ముగుస్తుంది.

### 5) ఉద్యోగ పర్వం

ఉత్తరాభిమన్యుల వివాహానంతరం పాండవ పక్షీయులందరు ఉపప్లావ్యంలో సమావేశం. దుర్యోధనుడు మంచి మాటలతో లొంగడు కనుక ఒక పక్క యుద్ధ సహాయం సమీకరించుకుంటూనే అనుకున్న ఒప్పందం ప్రకారం తమ రాజ్యాన్ని ఇవ్వవలసినదని ద్రుపదుడి పురోహితుడు ద్వారా రాయబారం జరిపిస్తారు. శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోతాడు. రాయబారితో ధృతరాష్ట్రుడు సమాధానం పంపుతానని తమ తరపున సంజయుడిని పంపిస్తాడు. సంజయుడు ధృతరాష్ట్రుని మనోగతాన్ని వివరిస్తాడు. తన కొడుకు తన మాట వినడు కనుక ధర్మరాజు నాశనాశనకరమయిన యుద్ధం చేయవద్దని సలహా. ఈలోపుగా ఇరు పక్షాలు యుద్ధ ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. శ్రీకృషుని దగ్గరకు అర్జునుడు దుర్యోధనుడు

సహాయానికి వెళితే యుద్ధం చేయని కృష్ణుని అర్జునుడు సారథిగా కోరుకుంటాడు, దుర్యోధనుడు ఒక అక్షౌహిణీ నారాయణసేనతో తృప్తి పడతాడు. బలరాముడు తాను ఎవరి తరపున యుద్ధం చేయనని చెబుతాడు. కృతవర్మ ను కలిసి దుర్యోధనుడు ఆనందంగా వెళ్ళిపోతాడు. పాండవుల కు సహాయం చేయడానికి వచ్చే శల్యుడిని దుర్యోధనుడు మభ్యపెట్టి తనవైపు యుద్ధం చేసేలా తిప్పుకుంటాడు. ఆ విధంగా పాండవులకు ఏడు, కౌరవులకు పదకొండు అక్షోహిణీల సైన్యం సమకూరుతుంది. సంజయ రాయబారిని ప్రతిగా శ్రీకృష్ణుడు కౌరవుల వద్దకు వెళతాడు దుర్యోధనుడు అయిదు ఊళ్లు ఇవ్వడానికి కూడా నిరాకరించి శ్రీకృష్ణుడిని బందీ చేద్దామనే ఆలోచన చేస్తాడు. శృకృష్ణుడు కోపించి తాను ఒక్కడే రాలేదనీ తనలో అనంత విశ్వం ఉన్నదనీ విశ్వరూపం చూపిస్తాడు. అంత అయినాక ధృతరాష్ట్రుడు తన అసహాయత వ్యక్తం చేస్తాడు. శ్రీకృష్ణుడు వెళ్తూ వెళ్తూ కర్ణుడికి అతడి జన్మరహస్యం గుర్తు చేసి పాండవపక్షంలో యుద్ధం చేయమని కోరుతాడు. అది సమంజసం కాదని కర్ణుడు నిరాకరిస్తాడు. కుంతి కూడా అదే కోరిక కర్ణుడిని కోరితే కర్ణుడు తాను దుర్యోధనుడి తరపున యుద్ధం చెయ్యక తప్పదని, అయితే యుద్ధంలో అర్జునుడు తప్ప మిగిలిన నలుగురిని అవకాశం వచ్చినా చంపనని మాట ఇస్తాడు. భీష్ముడికి సర్వసైన్యాధిపత్యం ఇవ్వబడుతుంది. తమ పక్షంలోను పాండవ పక్షంలోను ఉన్న వీరుల బలాబలాలు లెక్కచూపే సమయంలో కర్ణుడిని అర్ధరథుడిగా నిర్ధారిస్తే, భీష్ముడు యుద్ధరంగంలో ఉన్నన్నిరోజులు తాను యుద్ధం చేయనని కర్ణుడు శపథం చేస్తాడు. పాండవుల తరపున ద్రుష్టద్యుమ్నుడిని సర్వసైన్యాధిపతిగాను, అర్జునిడిని సేనాపతులకు అధినేత గాను, కృష్ణుని అర్జునికి అధినేతగాను, సారథి గాను ధర్మరాజు ప్రకటిస్తాడు. చివరగా శకుని కొడుకు ఉలూకుని ద్వారా దుర్యోధనుడు యుద్ధానికి రమ్మని రెచ్చగొడుతూ సందేశం పంపిస్తాడు. అతడిద్వారానే పాండవులు ప్రతిసందేశం పంపిస్తారు. భీష్ముడు తాను శిఖండితో యుద్ధం చేయనని చెబితే ఆ వృత్తాంతం వినగోరుతాడు దుర్యోధనుడు. భీష్ముడు తాను కాశీరాజు కుమార్తెలను ఎత్తుకొని రావడం, అంబావృత్తాంతం, శిఖండి పుట్టుక, ముందు స్త్రీగా పుట్టి పురుషుడిగా మారిన వైనం చెబుతాడు. కురుక్షేత్రం యుద్ధభూమిగా నిర్ణయించబడుతుంది. కురు పాండవ సేనలు యుద్ధానికి బయలుదేరడంతో ఈ పర్వం ముగుస్తుంది.

### 6) భీష్మ పర్వం

ఇక్కడనుంచి, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య పర్వాలు నాలుగు యుద్ధ పర్వాలు.

వ్యాసమహాముని ఇచ్చిన దివ్యదృష్టితో ధృతరాష్ట్రుడికి యుద్ధ వివరాలు చెప్పడానికి నియుక్తుడయి ముందుగా ద్వీపాల వివరాలు, అవీ చెబుతాడు. యుద్ధం మొదలవుతుంది. ధర్మరాజు భీష్మాదుల ఆశీర్వచనాలు తీసుకుంటాడు. యుయుత్సుడు పాండవ పక్షానికి చేరుతాడు. అర్జునుడి విషాదయోగం, గీతోపదేశం జరిగాక యుద్ధం మొదలవుతుంది. భీష్ముడి పరాక్రమం తట్టుకోలేక పాండవులు భీష్ముడిని వధోపాయం అడుగుతారు. శిఖండిని అడ్డు పెట్టుకొనియుద్ధం చెయ్యమని సలహా ఇస్తాడు. పదిరోజులు యుద్ధంలో భీష్ముడు పరాక్రమించి, పదోరోజు శిఖండి అర్జునుడి వేసిన బాణాల వల్ల తీవ్రంగా గాయపడి రథం మీదనించి పడతాడు. అంపశయ్య పై వాలిన భీష్ముడికి శరాలతో తలదిండు అమర్చి, గంగను రప్పించి దాహం తీరుస్తాడు అర్జునుడు. తాను పోయిన తర్వాతనయినా సంధి చేసుకోమని దుర్యోధనుడిని అడుగుతాడు. అలా బాణాల మీద పడుకుని ఉత్తరాయణం గురించి ఎదురు చూసే భీష్ముడి వద్దకు కర్ణుడు వచ్చి ఆశీర్వాదం తీసుకుంటాడు.

### 7) ద్రోణ పర్వం

ఇది భీష్ముడు పడిన అనంతరం అయిదు రోజులపాటు ద్రోణుని సేనాధిపత్యంలో జరిగిన యుద్ధ కథ. చాలామంది వీరులు మరణించిన పర్వం కూడా. ద్రోణుడికి సర్వసైన్యాధక్ష పదవినిచ్చి గౌరవిస్తాడు దుర్యోధనుడుబీ ధర్మరాజును ప్రాణాలతో పట్టివ్వమని కోరుతాడు. కర్ణుడు కూడా రంగ ప్రవేశం చేస్తాడు. చక్రవ్యూహంలో అభిమన్యుడి వధ. ప్రతీకారంగా అర్జునుడి చేతిలో సైంధవ సంహారం, భూరిశ్రవుడిని అర్జునుడు చేయి నరకడం, ప్రాయోపవేశంలో ఉన్న అతడి తలను సాత్యకి నరకడం, రాత్రియుద్ధం మొదలు. ఆలంబసుడుని ఘటోత్కచుడు చంపి విజృంభిస్తే గత్యంతరం లేక అర్జునుడి కోసం దాచిన శక్తి ఆయుధాన్ని ఘటోత్కచుడిని చంపడానికి వాడటం, చివరగా, ధర్మరాజు 'అశ్వద్ధామఅతః కుంజరః' అనే అర్ధసత్యంతో

ద్రోణుడిని యుధవిముఖుడిని చేయడం, యోగంలోఉన్న ద్రోణుడి తలని ధృష్టద్యుమ్నుడు ఖండించడం, అశ్వద్ధామ కోపించి నారాయణాస్త్రం ప్రయోగించి తీవ్ర నష్టం కలిగంచడంతో ఈ పర్వం ముగుస్తుంది.

### 8) కర్ణ పర్వం

ద్రోణుని మరణం తరువాత కర్ణుడు సర్వసైన్యాధిపత్వం వహిస్తాడు. అతను యుద్ధం చేసింది స్వీయ నాయకత్వంలో ఒకటిన్నర రోజులే. తల్లికిచ్చిన మాట నిలబెట్టుకుంటాడు కర్ణుడు. దుశ్శాసనుడితో సహా అనేకమంది కౌరవులను భీముడు చంపేస్తాడు. కర్ణుడు భార్గవాస్త్రంతో పెద్ద నష్టం కలిగిస్తాడు. తనని పరామర్శించడానికొచ్చిన అర్జునిడిని ధర్మరాజు కర్ణుడికి వెరచి వచ్చావని నిందిస్తే అర్జునుడు తన గాండీవాన్ని దూషించిన వారిని వధించే వ్రతనియమం ఉన్నా కృష్ణుని సలహా మేరకు నిందించి వ్రత పాలన పాటిస్తాడు. తరువాత నిందించినందుకు బాధపడి ఆత్మహత్య చేసుకోబోతే దానికి మారుగా తనని తాన పొగుడుకంటే అది ఆత్మహత్యతో సమానమనే కృష్ణుని సలహా పాటించి బయటపడతాడు.

ఆ విధంగా శ్రీకృష్ణుడు వారిద్దరిని ఒకటి చేసి అర్జునిడిని కర్ణ వధకు తీసుకెళతాడు. చివరి రోజు కర్ణుడికి శల్యసారధ్యం లభిస్తుంది. ధర్మరాజు కోరిక మేరకు శల్యుడు కొంత తేజోవధ చేస్తాడు. ఇద్దరికి పెద్ద వాదన అవుతుంది. దుర్యోధనుడు ఇద్దరికీ సర్ది చెబుతాడు. కర్ణుడి కొడుకు వృషసేనుడుని అర్జునుడు చంపేస్తాడు. కర్ణార్జునల మధ్య పెద్ద యుద్ధం జరుగుతుంది. కర్ణుడి నాగాస్త్రం విఫలమవుతుంది. అతడి శాపాలు పని చేయడం ప్రారంభిస్తాయి. రధచక్రం భూమిలో కూరుకుపోతుంది. యెంత ప్రయత్నించినా రాదు. కర్ణుని చివరి ఘడియలు సమీపిస్తాయి. శ్రీకృష్ణ ప్రేరణతో అర్జునుడు వేసిన బాణం వల్ల కర్ణుడి తల తెగి పడుతుంది. ధర్మరాజు వచ్చిపడిపోయిన కర్ణుడిని చూసి హర్షిస్తాడు. దుర్యోధనుడు విచారిస్తే శల్యుడు ఓదారుస్తాడు. పదిహేడవ రోజు యుద్ధం, కర్ణపర్వం ముగుస్తాయి.

### 9) శల్య పర్వం

శల్యుడు సర్వసైన్యాధిపతి అవుతాడు. సర్వశక్తులతో అద్భుతంగ యుద్ధం చేసినా చివరికి ధర్మరాజు చేతిలో మరణిస్తాడు. సహదేవుడు శకునిని అతని కొడుకు ఉలూకుడిని తన ప్రతిజ్ఞ నిలబెట్టుకుంటూ చంపేస్తాడు. కూరవుల తరపున అశ్వద్ధామ, కృతవర్మ, కృపాచారుడు తప్ప వీరులు, మిత్రులు, కుమారులు, సోదరులు ఎవ్వరూ మిగలరు. అలిసిపోయి, నిరాశతో దుర్యోధనుడొక్కడు కేవలం గద తీసుకుని నడుచుకుంటూ ఒక మడుగులో జలస్తంభన విద్య ప్రయోగించి కూర్చుంటాడు. పాండవులు వెదకడంలో తెలుసుకుని మడుగు చుట్టూ చేరుకొని దుర్యోధనుడిని మాటలతో యుద్ధానికి ప్రేరేపిస్తారు. తన ఇష్టమయిన ఆయుధంతో యుద్ధం చేయవచ్చని దుర్యోధనుడు చెప్పగా భీముడితో గద యుద్ధానికి సిద్ధపడి మడుగునుంచి బయటకు వస్తాడు. ఈ లోగాబలరాముడు కూడా అక్కడికి చేరుకుంటాడు. ద్వంద్వ యుద్ధంలో దుర్యోధనుడి తొడల మీద గద ప్రహారం చేసి, పడగొట్టి విజయం సాధిస్తాడు భీముడు. బలరాముడు భీముడు తొడల మీద కొట్టడం తప్పని నిరసన వ్యక్తం చేసి వెళ్ళిపోతాడు. దుర్యోధనుడుశ్రీకృష్ణుడిని నిందిస్తే, అతని అధర్మాలన్నీ గుర్తు చేస్తాడు కృష్ణుడు. దుర్యోధనుడు స్పృహ కోల్పోగా శ్రీకృష్ణుడు పాండవులు వెనుకకు మరలి ఆ రాత్రికి నాదీ తీరంలో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తరువాత దుర్యోధనుడిని వెదుకుకుంటూ అశ్వద్ధామ, కృతవర్మ, కృపాచార్యుడు వచ్చి చూస్తారు. అతని స్థితి చూసి బాధపడతారు. అశ్వద్ధామ యుద్ధం ఇంకా ముగియలేదని, తానూ ప్రతీకారం తీర్చుకుంటాని చెబితే దుర్యోధనుడు అతడిని సర్వసైన్యాధిపతిగా నియుక్తుని చేస్తాడు. అశ్వద్ధామ ఆ ఇరువురిని తీసుకుని బయలుదేరడంతో శల్యపర్వం ముగుస్తుంది.

### 10) సౌప్తిక పర్వం

అశ్వద్ధామ, కృతవర్మ, కృపాచార్యుడు ఆ రాత్రి తమ శిబిరాలకు వెళ్లరు, అప్పటికే పాండవులు ఆ శిబిరాలను ఆక్రమించారు. కౌరవ స్త్రీలందరు, మంత్రులు యుయుత్సుడి ఆధ్వర్యంలో హస్తినాపురానికి వెళ్లిపోయారు. ఒక చెట్టు క్రింద కూర్చుని ఆలోచిస్తున్న అశ్వద్ధామకు చీకట్లో ఒక గుడ్లగూబ పక్షుల్ని నాశనం చేయడం కనిపిస్తుంది. అశ్వద్ధామ ఆ రాత్రికే

యుద్ధం చేయాలనీ నిశ్చయించుకుని ఇద్దరు వీరులను నిద్ర లేపుతాడు. ముందు వారించినా అశ్వద్ధామ పట్టుదలతో వారూ అతడిని అనుసరిస్తారు. అశ్వద్ధామ ఒక్కడే శిబిరంలో ప్రవేశించి శివుడి అనుగ్రహం ద్వారా ల అసాధారణ కార్యం సాధించి ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉపపాండవులుతో బాటు అడ్డు వచ్చిన వీరులందరని ఊచ కోత కోస్తాడు. కృప కృతవర్మలు శిబిరానికి నిప్పు పెట్టి బయటకు వచ్చినవారినందరిని చంపేస్తారు.ఆ విధంగా మారణకాండ సాగించి ఆ వార్త చనిపోబోతున్న దుర్యోధనుడికి చెబుతారు. దుర్యోధనుడు వారిని కౌగలించుకుని స్వర్గస్తుడవుతాడు.

జరిగిన సంగతి తెలిసి భీమార్జునులు పారిపోయిన అశ్వద్దామను వ్యాసాశ్రమంలో పట్టుకుంటారు. ఆ యుద్ధంలో అశ్వద్ధామ ఓడిపోయి తన శిరోమణి ఇచ్చేసి జీవం దక్కించుకుంటాడు, అయితే అశ్వద్ధామ బ్రహ్మ శిరోనానామక ఉత్తర గర్భం మీద అస్త్రంఅమంత్రిస్తాడు. 'అపాండవం చేస్తానని చెప్పి వేసిన అస్త్రం అది. దీనితో సౌప్తిక పర్వం ముగుస్తుంది.

## 11) స్త్రీ పర్వం

యుద్ధం ముగిసింది. విదురుడు ధృతరాష్ట్రుడిని ఊరడిస్తాడు. చనిపోయినవారిని చివరిసారిగా చూడటానికి ధ్రితరాష్ట్రుడు, గాంధారి, కుంతి, విదురుడు, కౌరవుల భార్యలు, కోడళ్ళు, కర్ణుని భార్యలు, అనేకమంది రాజుల భార్యలు కురుక్షేత్రానికి వస్తారు. పాండవులు, ద్రౌపది, మిగిలిన స్త్రీలు చాలామంది వస్తారు. గాంధారికి వ్యాసుడు కొడుకులందరిని చూసుకునే శక్తీనిస్తాడు. విలపిస్తున్న కోడళ్లను చూసిన గాంధారికి పాండవుల మీద కోపం వచ్చి శపించాలనుకొంటుంది. ఆ సంగతి గ్రహించిన వ్యాసుడు ఆమెకు నచ్చచెప్పి మనసు మళ్లిస్తాడు. భీముణ్ని కౌగలించుకుని ధృతరాష్ట్రుడు గట్టిగ అదుముతాడు. కృష్ణుడు ఉండగానే గ్రహించి భీముడికి బదులు ఇనపవిగ్రహం పెట్టడంతో భీముదు రక్షింపబడతాడు, విగ్రహం పిప్పి అయిపోతుంది. ధృతరాష్ట్రుడు కోపం తగ్గి పాండవులందరిని ఆదరిస్తాడు. పాండవులు గాంధారికి ప్రణామం చేస్తారు. గాంధారి కోపం, శోకం అణుచుకున్నా ఆమె చూపు ధర్మరాజు పాదాల మీద పది గోర్లు నల్లగా కమిలిపోతాయి. ఒక్క కొడుకునీ మిగల్చలేదని ,దుర్యోధనుడిని తొడలమీద కొట్టాడని,దుశ్శాసనుడు రక్తం తాగాడని భీముడిని నిష్టూరమాడుతుంది. తన ప్రతిజ్ఞ వల్ల ఆలా చేసానని,లేకుంటే ఆమె కొడుకును చంపడం సాధ్యం కాదని, రక్తం నోటిలో తీసుకున్న తగ్గలేదని చెప్పి తప్పుకుంటాడు భీముడు. గాంధారి కోపం కృష్ణుడి మీదకు మళ్లుతుంది. యాదవులందరు కృష్ణబలరాములతో సహా ఇప్పటినించి 36 సంవత్సరాలకి నాశనం అవుతారని శపిస్తుంది. విధి అలాగే నిశ్చయించనుందని శ్రీకృష్ణుడు శాపాన్ని స్వీకరిస్తాడు. దహనసంస్కారాల సమయంలో కర్ణుడు కూడా తన కొడుకేనని అతనికి కూడా పాండవులు తర్పణం వ్వవలసి ఉన్నదని కుంతి కర్ణుడి జన్మరహస్యం చెబుతుంది. స్త్రీలనోట్లోరహస్యాలు దగకూడని ధర్మరాజు అంటాడు. కర్ణుడి తన అగ్రజుడని తెలిసిన ధర్మరాజుతో బాధ మొదలవుతుంది. ధర్మరాజు ప్రేతకర్మలు నిర్వర్తించి, భారమయిన గుండెతో, సోదరులతో గంగ ఒడ్డున నిలిచియున్న సమయంలో స్త్రీ పర్వం పూర్తి అవుతుంది.

## 12) శాంతి పర్వం

కర్ణుని జన్మ వృత్తాంతం, విప్ర శాపం, పరశురామ శాప వృతాంతం, కర్ణుడి సాయంతో దుర్యోధనుడు కళింగ రాజకన్యను అపహరించడం, కర్ణుడు జరాసంధుని ఓడించి మాలిని నగరాన్ని పొందడం ఉంటాయి. ధర్మరాజు రాజ్యం తీసుకోనని పట్టుబడితే అందరు అనేకరకాలుగా చెప్పి ఒప్పిస్తారు. మహా యుద్ధ పాపాన్ని అశ్వమేధ యాగం చేసి పోగొట్టుకోవచ్చని చెప్పిన మీదట ధర్మరాజు రాజ్యం స్వీకరించడానికి ఒప్పుకుంటాడు. పట్టాభిషేకం జరుగుతుంది, భీష్ముడు మరణించే వ్యవధిలోగా ఆయనవద్ద రాజధర్మం, అనేక సస్త్ర రహస్యాలు తెలుసుకోమన్న శ్రీకృష్ణుని సలహా ప్రకారం ధర్మరాజు బీష్మని కలసి అనేక విషయాలు నేర్చుకుంటాడు.

ఇది నిజానికి అన్నిటి కన్నా పెద్ద పర్వం. కథ సాగదు కానీ ధర్మసంబంధమయిన ఎన్నో విషయాలు ఇందులో చర్చించబడతాయి.

### 13) అనుశాసన పర్వం

భీష్మ ధర్మరాజ సంవాదమే ఈ పర్వమంతాను. దీనిలోనే అందరికి పరిచయమయిన విష్ణు సహస్ర నామ ఉపదేశం, భీష్ముని ద్వారా యుధిష్ఠరుడిని ఉంటుంది.

అనేక ధర్మ రహస్యాలు ఇందులో నిక్షిప్తమై ఉన్నాయి.

భీష్ముడు ధర్మరాజు సందేహాలన్నీ నివృత్తి చేసాక హస్తినాపురం చేరడానికి అనుమతి ఇచ్చి ఉత్తరాయణం వచ్చాక తనకు కలం తీరే సమయం వస్తుందని, అప్పుడు రావలసినదని చెప్పి పంపిస్తాడు. ధర్మరాజు హస్తినకు తిరిగి వచ్చి మృతవీరుల కుటుంబాలకు ఇతోధిక ధనసహాయం చేసి ఏభై రోజుల తరువాత దక్షిణయాం ముగిసి ఉత్తరాయణం వస్తోందని తిరిగి భీష్ముని చెంతకు ధృతరాష్ట్రుని, గాంధారిని, కుంతిని, సోదరులని, ఇతర ముఖ్యులను వెంటపెట్టుకుని వెళ్తాడు. ఋషులతో కూడి ఉన్న భీష్ముడు ధర్మరాజును, ధృరాష్ట్రుడిని చివరి సందేశాలిచ్చి, ప్రాణాలు విడవడానికి శ్రీకృష్ణుని అనుమతి కోరుతాడు. అందరిని చివరిసారి ఆప్యాయంగా కౌగలించుకొని శరీరంలో ఒక్కొక్క భాగాన్ని యోగంలోంచి ఉపసంహరిస్తాడు. బాణాలన్నీ ఒక్కక్కటిగా విడివడతాయి. భీష్ముని ప్రాణాలు శిరస్సు ఛేదించుకుని బయటకు వచ్చి అనంతవాయువులలో కలిసిపోతాయి. అందరు అగ్నిసంస్కారం చేసి గంగానది చేరుతారు,తర్పణ సమర్పణకు. గంగ నేయీటినుంచి బయటకు వచ్చి కుమారుని మరణానికి సోకిస్తుంది. వ్యాసుడు కృష్ణుడు ఆమెను ఓదార్చగా తిరిగి నీటిలో ప్రవేశిస్తుంది. అందరు గంగకు పూజలు చేసి వెనక్కి మరలడంతో అనుశాసన పర్వం ముగుస్తుంది.

### 14) అశ్వమేధిక పర్వం

భీష్మ నిర్యాణం తరువాత ధర్మరాజు తీవ్రమయిన విచారానికి లోనవుతాడు. తాతగారిని చంపినా పాపం నుంచి తనకు ఎలా నివృత్తి లభిస్తుంది అని అడిగితే అశ్వమేధ యాగం చేయమని సలహా ఇస్తాడు. యుద్ధానికే ఖజానా ఖాళీ అయినా తానూ యాగం ఎలా చెయ్యగలుగుతానని మళ్ళీ అడుగుతాడు ధర్మరాజు. మరుత్త మహారాజు వెనుకటి యుగంలో దాచిని అనంత ధనరాశులు హిమాలయాల్లో భద్రంగా ఉన్నాయని, వాటితో నిర్వహించవచ్చుననీ సలహా చెబుతాడు వ్యాసుడు.

శ్రీకృష్ణుడు, సుభద్రను తీసుకుని తిరిగి శ్వమేధసమయానికి ముందుగానే వస్తానని ద్వారకా చేరుకొని యుద్ధ వృత్తాంతం, అభిమన్యు వధతో సహా వాసుదేవుడికి తెలియపరుస్తాడు. పాండవులు హిమాలయాలకు వెళ్లి బంగారం, మణులు తెచ్చుకుని వచ్చే లోపు ఉత్తర ప్రామృతశిశువును కంటుంది. అశ్వద్ధామ అస్త్ర ప్రభావం అది. సమయానికి చేరుకున్న శ్రీకృష్ణుడు శిశువుకు జీవప్రదానం చేసి పరీక్షిత్తు అని పేరు పెడతాడు. తరువాత అర్జునుడు అశ్వం వెనుక వెళ్లి అనేక రారాజులు జయించి తిరిగి వస్తాడు. తన కొడుకు భభ్రువాహనుని చేతిలో అర్జునుడు హతమవ్వడం, ఉలూపి నాగమణి ద్వారా అతడిని బతికించడం, తద్వారా వసువుల శాపానికి ప్రతిక్రియ జరిపామని చెప్పడం ఒక విశేషం. అశ్వమేధ యాగం విజయవంతంగా సమాప్తి అవుతుంది. శ్రీకృష్ణుడు అర్జుననకు ఉపదేశించిన బ్రాహ్మణా గీత, అనుగీత అని కూడా అంటారు, ఇందులోనిదే. శ్రీకృష్ణుడు భగవద్భక్తుల గురించి, వైష్ణవ ధర్మం గురించి ఉపదేశించి తిరిగి ద్వారకకు వెళ్లడంతో అశ్వమేధిక పర్వం ముగుస్తుంది.

### 15) ఆశ్రమవాసిక పర్వం

ధర్మరాజు ధృతరాష్టుడిని, గాంధారిని స్వంత కొడుకులాచూసుకుంటాడు. అయినా భీముడు మాత్రం అపుడపుడు పెదనాన్న వినేలాగా నిష్టుర వాక్యాలు పలుకుతూ ఉంటాడు. ఇలా నిర్వేదానికి గురి అయిన ధృతరాష్ట్రుడు ఉపవాసాలతో శరీరం శుష్కిన్పచేసుకుని శల్యావశిష్ఠుడవుతాడు. తానూ, గాంధారి వానప్రస్థానానికి వెళతామని చెబుతాడు. వ్యాసుడు కూడా ధర్మరాజుని అడ్డు పెట్టవద్దని చెబుతాడు. ధృతరాష్ట్రుడు కొడుకులందరికి ఆఖరిసారిగా తర్పణాలు ఇచ్చి, విరివిగా దానాలు చేసి గాంధారి సహితంగా అడవులకు బయలు దేరతాడు. కుంతి తాను కూడా వారి సేవలో వెళ్లిపోతానని,

పాండవులను దుఃఖంలో ముంచి వెళ్ళిపోతుంది. వారు శతరూప ఆశ్రమంకు వెళ్లి అక్కడే నివాసం ఏర్పరచుకుంటారు. విదురుడు, సంజయుడు కూడా వారితో వెళ్లిపోతారు.

పాండవుల దుఃఖానికి అంతులేదు. ఒక సంవత్సరం తరువాత పాండవులు అందరు భార్యలతో కలిసి పెద్దల దర్శనానికి బయలు దేరుతారు. అత్తమామలను చూడడానికి కౌరవ పత్నులందరు బయలుదేరుతారు.

అందరు సమాగమయినప్పుడు వ్యాసుడు కూడా వారిని కలుస్తాడు. వెళ్లిన రోజే విదురుడు ఎక్కడని అడిగితే అతడు సన్యాసాశ్రమంలో అడవులలో తిరుగుతూ ఉన్నాడని ఎప్పుడయినా కనిపిస్తూ ఉంటాడని చెబుతారు. విదురుడిని వెదుకుతూ ధర్మరాజు అడవులలోకి వెళ్లి దూరంగా చూస్తాడు. పిలుస్తూ దగ్గరకు వెళ్లేసరికి ఒక చెట్టునానుకుని ధర్మరాజు కళ్ళలోకి చూస్తూ ప్రాణం విడుస్తాడు విదురుడు.

వ్యాసమహర్షి ధృతరాష్ట్రాదుల అభ్యర్ధన మేరకు చనిపోయిన వారందరిని దేవా లోకాలలోనుంచి రప్పిస్తాడు, ఒక రాత్రికి. అందరూ తమతమ ప్రియబంధువులను కలిసి ఆ రాత్రి ఆనందంగా గడుపుతారు. తెల్లవారగానే వచ్చినవారందరు వారి వారి రధాలలో గంగానదిలోకివెళ్ళిఅదృశ్యమవుతారు. కౌరవుల భార్యలందరూ వ్యాసుడి అనుమతితో గంగలో మునిగి ప్రాణాలు విడిచి భర్తలను చేరుకుంటారు. ఎక్కువ సమయం అక్కడ ఉంటె మునులదినచర్యలు కుంటుపడతాయని ధృతరాష్ట్రుడు చెప్పి ధర్మరాజును తిరిగి పంపుతాడు. మరి రెండు సంవత్సరాల తరువాత నారదుని ద్వారా దావానలం లో ధ్రితరాష్ట్రుడు, గాంధర్, కుంతి ప్రాణాలు వదిలారని, సంజయుడు తప్పించుకుని హిమాలయాల్లో తపస్సుకొరకు వెళ్లాడని తెలుస్తుంది. పాండవులు విలపించి పెద్దలకు చేయవలసిన కర్మలు చేసి విరక్తులవుతారు. ఈ పర్వం ఆలా ముగుస్తుంది.

**16) మౌసల పర్వం**

యుద్ధానంతరం దాదాపుగా 36 సంవత్సరాలు గడిచాయి.గాంధారి నియమించిన గడువు కూడా అదే. ద్వారకలో శ్రీకృష్ణిడిని చూడడానికి విశ్వామిత్రాది ఋషులు వస్తారు. కొంతమంది యాదవులు ఋషులను పరిహాసం చేయడానికి సాంబుడికి ఆడ వేషం వేసి, అతను భభ్రుది భార్య అనీ, ఆమె గర్భంలో ఉన్న శిశువు అడా మగా అని ప్రశ్నిస్తారు. వారి ఆగడానికి విసిగిన మునులు ఆమె కడుపులో ముసలం పుడుతుందని, అది వంశ వినాయాసనానికి కారణమవుతుందని శాపమిస్తారు. సాంబుడు మరునాడే ఒక ముసలన్నీ కంటాడు. ఉగ్రసేనుడు దానిని చూర్ణం చేసి సముంద్రంలో పాడేయిస్తాడు. సముద్ర తీరంలో ఆ చూర్ణం ప్రభావంతో రెళ్ళు దట్టంగా పెరుగుతుంది.

ఒక నాడు శ్రీకృష్ణుడు అందరిని తీసుకొని సముద్ర తీరం చేరుతాడు. అక్కడా అందరు మధువు సేవించి ఆ మత్తులో సాత్యకి, కృతవర్మ మహాభారతంలో వైరి పక్షం చేసిన అన్యాయాల విషయంలో వాదులాడుకుంటారు కృతవర్మను సాత్యకి చంపితే, సాత్యకిని కృతవర్మ సహచరులు పానపాత్రలతో సాత్యకిని కొట్టి చంపేస్తారు. ఆ కొట్లాటలో శ్రీకృష్ణుడు కూడా రెళ్ళు గడ్డి తో కొంతమందిని చంపుతాడు. రెల్లుగడ్డి కత్తుల్లా మారుతుంది.

బలరాముడు యోగంలో ప్రాణం విడుస్తాడు. శ్రీకృష్ణుడు కూడా తండ్రి దగ్గర సెలవు తీసుకుని, చేయవలసిన పనులు చెప్పి అడవిలోకి వెళ్లి ఆలోచనా ముద్రలో శాయనిస్తాడు జరా అనే బోయగాడు ముసలం రజనున్న ములికితో బాణం వేస్తె వెలికి తగిలి నెమ్మదిగా ప్రాణాలు విడిచిపెడతాడు. దారుకుడి ద్వారా అర్జునుడికి ఈ వార్త తెలిసి వెంటనే బయలు దేరి వెళ్తాడు. వసుదేవుడు కూడా ప్రాణాలు విడిస్తే అర్జునుడు యాదవ స్త్రీలను. పిల్లలను తీసుకొని ద్వారకను వదిలి పెడతాడు.అర్జునుడితో పాటు గంగ ప్రవహించి ద్వారకను ముంచెత్తుతుంది' అర్జునుడు వస్తూ ఉండగా దారిదొంగలు ఎదుర్కొంటారు.గాండీవం పనిచేయదు. కొంతమందిని చంపగలిగినా దొంగలు కొందరు స్త్రీలను ఎత్తుకొని , దానం దోచుకుని పోతారు అర్జునుడు శ్రీకృష్ణ నిర్యాణం చెప్పగానే పాండవుల కందరికి జీవితం మీద ఆసక్తి సన్నగిల్లుతుంది.

## 17) మహాప్రస్థానిక పర్వం

విరక్తి చెందిన పాండవులు రాజ్యాన్ని పరీక్షిత్తును రాజుగా అభిషేకించి, యుయుత్సుడికి అతడి బాగోగులు చూసే భాధ్యత అప్పగిస్తారు. పరీక్షిత్తు గురువు మళ్ళీకృపాచార్యుడే. సుభద్రకు రెండు రాజ్యాల మధ్య ( హస్తినాపురం, ఇంద్రప్రస్థాల మధ్య) భేదభావం లేకుండా చూసుకోమని ధర్మరాజు చెబుతాడు. ద్రౌపదీ సహితంగా పాండవులు భూప్రదిక్షణం చేసి ఉత్తరదిక్కుగా పయనిస్తారు. అగ్నిదేవుడిచ్చిన గాండీవాన్ని వరుణదేవుడికి ఇచ్చివేయమని చెబితే అలాగే సముద్రంలో సమర్పిస్తాడు అర్జునుడు. పశ్చిమ దిక్కుకు వెళ్ళినప్పుడు సముద్రంలో మునిగిన ద్వారక కనిపిస్తుంది. దానికి నమస్కరించి ప్రయాణం కొనసాగిస్తారు. చివరి ప్రయాణం ఉత్తరాభిముఖ ప్రయాణం. గంధమాదనం దాటి మీరు పర్వతం వైపు. వారిని ఒక కుక్క అనుసరిస్తూ ఉంటుంది.

మొదటగా ద్రౌపది పడిపోతుంది. ఆగకుండా నడుస్తున్న అగ్రజుడిని అనుసరిస్తారు తమ్ముళ్లు. 'అన్నా ఆమె ఆలా పడిపోవటానికి కారణమేమిటి?' అని ప్రశ్నిస్తాడు భీముడు. ఆమె అందరికీ భార్య అయినా ఒక పిసరు అర్జునిడిని ఎక్కువ ప్రేమించింది అంటాడు ధర్మరాజు. తరువాత వరుసగా సహదేవుడు, నకులుడు, అర్జునుడు భూపతనమవడం, భీముడు ప్రశ్నించడం జరుగుతుంది. తన తెలివితేటల పట్ల, అందం పట్ల, సౌర్యం పట్ల అహంకారం తో వారు పడటం సంభవించినట్లు చెబుతాడు ధర్మరాజు. చివరగా తానూ పడిపోతూ తన సంగతేమిటని అడిగిన భీమునితో అతనికి తిండి మీద ఉన్న అత్యాసక్తి కారణమని ముందుకు సాగుతాడు. స్వర్గంనుండి దేవేంద్రుడి విమానం అతడిని సశరీరంగా స్వర్గానికి తీసుకెళ్లడానికొస్తుంది. అనుసరించి వస్తున్న కుక్క కూడా తనతో రావాలంటాడు ధర్మరాజు. ఒప్పుకోదు మరోలా ఎన్ని చెప్పినా. ఆ కుక్క అప్పుడు యమధర్మరాజుగ ప్రత్యక్షమయి ధర్మరాజును అభినందిస్తుంది. సర్వదేవతలు ఋషుల అభినందనల మధ్య ధర్మరాజు ఇంద్రవిమానంలో స్వర్గానికి సాగుతాడు. స్వర్గంలో పాండవులు ,కర్ణుడూ కనిపించరు. దుర్యోధనుడు ఆనందంగా కనిపిస్తాడు. సహించలేని ధర్మరాజు తనని తన తమ్ముళ్ల దగ్గరకు తీసుకెళ్ళమంటాడు. ఇక్కడితో మహాప్రస్థానికపర్వం ముగుస్తుంది.

## 18) స్వర్గారోహణ పర్వం

ధర్మరాజు అడిగిన మీదట అతడిని సోదరులు ఉన్న చోటకు ఇంద్రడు పంపిస్తాడు. ధర్మరాజునరకంలో సోదరుల, ద్రౌపది కేకలు వింటాడు. నరక లోక బాధలు, ఆ వాతావరణం ప్రత్యక్షంగా చూస్తాడు. తనకు స్వర్గమక్కరలేదని అక్కడే ఉంటానని చెబుతాడు ధర్మరాజు. అది అసత్యమాడినందువల్ల కలిగిన దోష పరిహారార్థం అనీ, రాజుకు నరకదర్శనం తప్పదని, నిజానికి సోదరులందరు స్వర్గం చేరారని చెబుతాడు. ఇంద్రుని ఆదేశం ప్రకారం దేవగంగలో స్నానం చేసి మానుష శరీరాన్ని విడిచిపెడతాడు. స్వర్గంలో ఉన్న, ఇతరలోకాలలో ఉన్న అందరు బంధువులను మిత్రులను, కృష్ణార్జునలతో సహా చూడగలుగుతాడు.

ఈ కథంతా విన్న జనమేజయుడు, అర్జునిడి మనుమడు, తరువాత ఏమైంది అని అడిగితే వారు వారు కర్మఫలాలు ముగిసిన తరువాత వారు స్వాలోకాలకు నిజరూపాలతో వెళ్లారని, వెళ్తారని చెబుతాడు వ్యాసుడు.

జనమేజయుడు యాగం ముగిసినది కనుక దానధర్మాలు నిర్వహించి తక్షశిలనుండి తిరిగి రాజ్యపాలనకై హస్తినాపురానికి మరలి వెళ్తాడు ఇదీ నేను అక్కడ విన్న కథ అని రోమహర్షణ సౌతి సౌనకాది మునులకు చెబుతాడు. భారత కథ ముగుస్తుంది. ధర్మాన్ని సేవించమన్న వేదం వ్యాసుని భారత సావిత్రి సందేశంతో స్వర్గారోహణపర్వం, మహాభారతం ముగుస్తుంది.

**ఆధార గ్రంథాలు**

1. సంక్షిప్త మహాభారతము – గీతా ప్రెస్, గోరఖ్పూర్
2. మహాభారతము – పిలకా గణపతి శాస్త్రి
3. మహాభారతము – ఉప్పులూరి కామేశ్వరరావు, జయలక్ష్మి పబ్లికేషన్స్, హైదరాబాద్.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 17. ఉద్యోగపర్వము - విదురనీతి

– డా.॥ టి.ఆర్.ఎస్. శర్మ (శ్రీ శ్రీ లక్ష్మి ప్రియ), చెన్నై

యుగాలు మారినా సామాజిక వ్యవస్థలో కొట్టొచ్చిన మార్పులు ఎన్ని కలిగినా మవులికంగా మానవుడు మాత్రము స్వార్థమనే సాలెగూటిలో చిక్కి తానే చెడినా పై పై మెరుగులకోసం పరుగులు తీయడమన్నది నాటికీ నేటికీ ఏనాటికీ ఇంకా పాత పంచాంగంగానే ఉంటున్నది గదినిలో గణనకూ జగతిలో యధార్థస్థితికీ పొంతనం కుదరడమే లేదు. మానవుల నైజాలూ నైపుణ్యాలు జగమే మాయ అన్నట్లు స్థానానికి తగినట్లు నేటికీ తారుమారగుచు మానవుడు పరిణతి నొందక స్వార్థసాగరములో నిమగ్నుడయ్యే ఉన్నాడు.

సంజయ రాయబారము ఫలించలేదు. సంగ్రహంగా చెప్పిన మాటలు గమనార్హములు. ఈ ధర్మరాజునకు భోగముల కంటెను ధర్మమే ప్రియము. అహింసా పరమోధర్మః అన్న మాటయందు కూర్మి గలవాడు మానవశక్తి కొంత దైవము నాధారముగా భావించెడివాడై పుణ్యపాపములను నీపై నిడి నీ తీర్పునకై ఎదురుచూచుచున్నాడు. పొట్టేలు కొండతో ఢీ కొనగలదా! ఖండన భీముడొక్కడే చాలు నీకొడుకులు నీల్గడానికి ధర్మరాజు తమ్ములకడ్డుపడి వారి యుద్రేకమును మాన్పుచున్నాడు. సాధుశీలుడు రేచ్చిపోవుచో వాని ఎదిరింప నేరికీ సాధ్యముకాదు మహారాజా! తెలివి తెచ్చుకొనుము పోరునాపుము. పాలు పంచుమని బోధించి సంజయుడు తన దారిని పోయెను.

ఆ మాటలు విన్నప్పటి నుండి ధృతరాష్ట్రునికి నిప్పులలో పొర్లినట్లున్నది. నిద్రపట్టుటలేదు. నీతిమంతుడు, నిష్పక్షపాతి, ధర్మచింతనా పరుడుడైన విదురుడు కురురాజును సమీపించి, కుశలము విచారించి అన్యాపదేశంగా ధృతుతరాష్ట్రుని మనోవికల్ప కారణాలను ఏకరువు పెట్టుచున్నాడు. "కురుపతీ! బలవంతుడు తనపై దండెత్తి వచ్చినపుడు బలహీనుడును, సిరిని కోల్పోయిన వాడును, స్తేనాయతమునస్కుడును, కామాకుల చిత్తుడును అగువారు నిద్రదేవిచే బాధపడుదురు. నీయందీలక్షణము లేవయిన నున్నవా? పాండుసూనుల రాజ్యభాగమును నీ వొక్కడవే మ్రింగఁజాచుచుంటివా? ఇట్టి ఏ కారణమో ముసురుకున్న నీమానసము నీకు నిద్రాభంగము కావించెనా? అని సున్నితంగా అడుగగా "ధర్మసుతుని మాట చొప్పెట్లుండునో తెలియకపోవుటయే నా చింతకు కారణము. విదురా! నీవంతయు తెలిసినవాడవు. ధర్మజుని ప్రస్తుతస్థితి ఎటులుండునో తెలిపి నా వ్యాకులతను మాన్పుము అని కోరుకొనెను.

విదురుడు కార్యకారణ సందర్భాలలో, న్యాయ ఔచితిని మనసున నిడి కురుపాండవులకు ఉభయతారకంగా మాటలాడెడి స్వభావి. నెమ్మది నెమ్మదిగా ఆచి తూచి మాటలాడినా ధర్మనిర్వహణా భావంతో ధృతరాష్ట్రునితో ఇట్లనెను.

ధర్మతనయుడు నీకును పుత్రసమానుడే. సానుకూలుడే. చక్కని ఆలోచననిచ్చే సేవకుడే. అతడు సత్యభాషి. శాంతస్వరూపి. వినయశీలి. వివేకి. అతడేనాడును కీడుపలుకడు. కానీ నీవు నీ కొడుకు అవివేకులై వారలను వెడలగొట్టితిరి. ఇంక చాలును వారి పాలు వారికి ఇవ్వడం మీకే శ్రేయస్కరం. ఇదే న్యాయముకాడా అంతా మాదే. మాకే దక్కవలెనన్నచో చెల్లునా? చక్రవర్తిగా నీవు స్వతంత్రించక కర్ణ శకుని దుశ్శాసనలపై రాజ్య భారమును మోపి కిమ్మనక కూర్చుంటివి. ఇది చివరికంటూ నిలవదుసుమా! ముందు ఎవరి శక్తి ఎంతని చూచుకొనవలెను. తొందరపాటు పనికిరాదు. ప్రభుత్వమనగా పట్టు విడుపులు, సహనము ఉండవలెను కదా?

రాజా! జనులకు అనుకూల వర్తనులగుచు, లోకనిందార్హమౌ పనులను పోనాడి, పరుల కలిమికి అసూయపడక కలివిడిగా బ్రతకవలెను. కోపము, గర్వము తృప్తిలేమి, దురభిమానము నున్నవి దుర్జనులు లక్షణములు.

పాలకుని, దైవాన్ని దారను, బంధువులను తగురీతిని సంతృప్తులను చేయని పాపి ఫలితమును మాత్రమాశించును ఎదుటివారి ఆదిత్యతను తెలిసి తెలిసి వారిని ఎదురించుట కడునీచము.

"దుష్టులకు ధనము, విద్య, వంశము, గర్వకారణము

సుజనులకు ఇవి వినయ విధేయతలను కూర్చును"

గొప్ప విలుకాని బాణము – ఎదటివానిని నొప్పించును లేదా తప్పిపోవును

కానీ నేర్పరియగువాని కౌశలము – శత్రురాజును అతని రాజ్యమును నాశము చేయును.

సముద్రమును దాటుటకు ఓడవాలె జీవితయాత్రకు సత్యమే సాధనము. కావున సత్యమును మించిన గుణము వేఱొకటి లేదుసోదరా!

ఓ ధరణీశా! న్యాయార్జితములగు ధనములను పాత్రుల కీ కుందుటయు అపాత్రుల కిచ్చుటయు చేటున కాకరములగును.

మగువ, మధిర, జూదము, వేట, వాక్పారుష్యము, తీవ్ర దండనము, దుఃబారాఖర్చు అన్నవి సప్త వ్యసనములు.

కానీ తగిన వేషము, ఆత్మస్తుతిలేమి, బాధపడియు కీడు పలుకకుండుట, దానముచేసి చింతిల్లకుండుట, ఎంతటి దుస్థితిలోనైనను మార్గము తప్పకుండుట అన్నవి శీలమునకు వన్నె తెచ్చెను.

స్నేహము
సంభాషణ
విరోధము
యుద్ధము

} అనునవి సమానులతో తప్ప అధికులతో చేయరాదు

"ఉన్నదానిని పంచుకొని అనుభవించుట

కష్టపడి పనిచేసి ఏ కొంచెమైనను సుఖించుట

శత్రువు అర్థించిన ఇచ్చుట యునునవి సల్లక్షణాలు".

స్నేహ వైరములు, జ్ఞానాజ్ఞానములు, ధర్మా ధర్మములు, సజ్జన దుర్జనత్వములు అను నీ ద్వంద్వములు మన మాటల వల్లనే వ్యక్త ములగుటచే మెలకువగా తగురీతిలో మాట్లాడవలెను.

"పదునైన కత్తితో గానీ, గొడ్డలితోగానీ నరుకబడిన మ్రాను తిరిగి చిగురించును. కానీ

మాటలతో చెడిన పని మరల బాగుపడదు."

"శరీరమును గ్రుచ్చుకొనిన బాణమును మెలకువతో తీయగలము! కానీ

గాఢముగా మనస్సున నాటుకొన్న మాటలను ఎన్ని మాటలతో నైనను ఉపాయములతోనైనను వెలికి తీయలేము".

చూడురాజా! ధర్మనందను నినుండి ఒక కీడూ పలుకబడదు

నీ కొడుకులు పోటీపడి నీచమైన అవాకులు, చవాకులు ప్రేలుదురు

నీవు దుర్యోధనాదుల మాటలకు వ్యధనొందక మిన్నకుండుట నీకు తగునా?

నీ బుద్ధి పాండవుల పట్ల విరోధాన్ని మానకపోవడం అది మహా పాపము. మన వంశానికి కీర్తిప్రతిష్టలు తేగలిగినట్టి ధైర్యవంతుడు. ధార్మికవాదియునైన నీ సోదరుని కుమారుడైన ధర్మరాజు, ఈ వంశపు సిరిసంపదలకు దూరమై ఉండుటయు నీకెగ్గగునే కానీ మంచికగునా? పెద తండ్రివగు నీయెడల గల గౌరవము వల్లనేకదా తాను సహనము వహించియున్నది?

న్యాయము కలవానికి ఇహలోకమునందు సత్ఫలములు కీర్తియును కలుగును కావె! వేదములు సైతము న్యాయమును తప్పకుండుటనే కదా ప్రోత్సహించుచున్నవి? పూర్వము తాను రాక్షసుడే అయినా ప్రహ్లాదుడు తనకుమారుడగు విరోచనునిపై పక్షపాతమును త్యజించి అంగీరసుని కుమారుడగు సుధన్వుని గెలిపించి ఆ సుధన్వునివలన తనపుత్రుని జీవితమును దానముగా ఇచ్చి కాపాడుకొనలేదా? ఈ క్రమము మేరకు నీవును ధర్మము తప్పక, అధర్మ ప్రవర్తకులగు నీ కొడుకులందరినీ పక్షపాత వైఖరిని వీడి తగినట్లు నడుచుకొందువేని నీ సంతతి సుఖముగా జీవించును. నీవును శోకముతీరి సంతసింతువు కదా?

ఆర్యులైనవారు (భీష్మద్రోణాదులు) ప్రియముగా పలుకని నీ సభ సభయగునా? ధర్మాసముచితములైన మాటలు పలుకని వారు పెద్దలా?

సత్యము కాని దొక ధర్మమా?

నెపముగల ఆ తీరు ఒక సత్యమా?

నీవు చక్కగా ఆలోచించుకొనుము. నీతి బాహ్యత ఎంతటి నీచమో నేను చెప్ప వలసిన పనిలేదు.

1) నీతిమార్గమున బ్రతక నేర్చుట – ఉత్తమము

2) శౌర్యముచే సంపదలనార్జించి బ్రతుకుట – మధ్యమము

3) పరులకు భారముగా నడచుకొనుట – అధమము

నీతి బాహ్యులైనవారిని ఉత్తములు మెత్తురా? అటుండనిమ్ము

నీ కొడుకులు బాల్యమునుండియు కయ్యమునకే కాలు, ద్రవ్విరి కదా? వారి మంత్రులు సైతము, అనగా కర్ణాదులు నీవారిని కయ్యము కొరకే కవ్వించినారుకదా!

నీవేమో నీతిమార్గమున కాలుమోపవు

పాండవులు కౌరవుల శౌర్యమునకు వెఱవరు

పాండవులకు ప్రజల అభిమానము కలదు. అట్టివారి శౌర్య పరాక్రమ జ్వాల విజృంభించినచో దాని నార్పనేరికి శక్యము?

పాండు తనయులు ఇంకను నిన్ను తండ్రిగనే తలచి నీ యందు భక్తితో సన్మార్గ వర్తనులైయున్నారు. } కనుక నీవు నిర్మల చిత్తుడువై వారిని నీకన్న కొడుకులను వలె దగ్గర చేర్చు కొనుము.

నీవు రాజ్యాధిష్టుడవైనను అశక్తుడవై రాజ్య విస్తీరణము కావింపలేదు. కానీ పాండురాజు తన బాలపరాక్రమాలతో దిగ్విజయము కావించి సాధించినది కాదా ఈ రాజ్యమూ? జేష్ఠ పుత్ర సామ్యమున పదవి నలంకరించిన నీవు ఇపుడు నీకు సాయమందించిన పాండు కుమారులపట్ల కృతఘ్నుడైతివి.

అట్టి కృతఘ్నుని కళేబరమును నక్కలైనను కోరవు

కాబట్టి నీ పరమభక్తుడైన పాండు పుత్రులు నీకు ఆదరణీయులు. వారిని నీవు ఆదరింపుము.

జీవితమునందు: బాగుపడుట, చెడిపోవుట, నిందలపాలగుట,

ప్రశంసలొందుట, ఇచ్చుట, వేడుకొనుట అనెడి

సుఖ దుఃఖములనే ద్వంద్వములు పరంపరాగతములు వీటికై చింతింపరాదు.

చింతచే బలము తగ్గును, రూపము చెడును, మతి దారితప్పును, రోగము వచ్చును. ఇట్టి చింతవలన నీవు కృశించితివేని శత్రువులు సంతసింతురు, చింతను పారద్రోలుము.

**తే॥ నియత తాపమును నింద్రియ నిగ్రహంబు**
**భూరి విద్యయు శాంతికి కారణములు**
**వాని యన్నింటికన్న మేలైన శాంతి**
**కారణము లోభముడుగుట కౌరవేంద్ర !!**

కలిసి యున్న కలదు సుఖము. పరస్పర అన్యోన్యతలతో మెలగుచో పంకజ కాసారము బోలె సంపదల కాశ్రయము కాగలరు.

ఒంటి చెట్టు గజతురగాల ధాటికి పతనము నొందును

కానీ గుంపుగా నున్న వృక్షముల కట్టి బాధలుండవు. నామాటలు గమనమున నుంచుకొనుము.

| | | |
|---|---|---|
| కౌరవులు | పరస్పర | వెలసిన, వారిని |
| పాండవులు | ఆశ్రయమున | ఎవ్వరూ జయింపలేరు. |

శత్రు సంఘర్షణా రహిత రాజ్యము మహిమోపేతమగును. నామాట వినుము

వనవాసక్లేశము ననుభవించిన పాండవులను వెంటనే పిలిపి బంపుము. వారాల కుచిత స్థానము నొసగి నిలుపుట నీ కొడుకులను నిలుపు కొనుటయగును.

ఆనాడే జూద ప్రసక్తి వచ్చినపుడు నేను అడ్డుకొంటిని. నీవు ఇష్టపడవని సందేహించక ఉన్నదున్నట్లు వచించితిని

ఆపధ్యావ్యాధి గ్రస్తుడవైన నీకు పథ్యాహారము రుచింపదాయె కాకులను అక్కున చేర్చుకొని నెమళులను నిరసించితివి.

మార్జాలములను ఆదరించి సింహమును దూరముంచితివి.

దుష్ట చతుష్టయమును చేరదీసి సాధువర్తనులైన పాండవులను విడిచి పెట్టితివి

ఇరువైపుల బలాబలములను లెక్కింప మానితివి

ఇప్పటికినీ మించిపోయినది లేదు. గుణసంపన్నులై నీ అనుగ్రహమును కోరెడి జ్ఞాతులను విడువతగదు. నా మాట వినుము. వారల జీవనావశ్యకతకు తగినంతగా కొన్ని పల్లెలనైన దుర్యోధనుని ఒడంబడజేసి ఇచ్చుట ఉత్తమము. ఇపుడు నీవు ఉపేక్షింతువేని పశ్చాత్తాపము వలన లాభములేదు. దానికి ప్రతీకారమూ లేదు. కాబట్టి అన్ని విధముల నాలోచించి పాండవులతో సంధి చేయుము.

ఇదియు నీకును నీ సంతతికిని ఆలంబన కావలసిన ఈ విదురుని నీతి. ఆపై నీ ఇష్టము, నీ కష్టము.

**ఆధార గ్రంధాలు**


1. సంక్షిప్త మహాభారతము – గీతా ప్రెస్, గోరఖ్పూర్
2. మహాభారతము – పిలకా గణపతి శాస్త్రి
3. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము (ఆశ్రమవాస పర్వం) – కృతికర్త తిక్కన సోమయాజి – తి.తి.దే., తిరుపతి.

# 18. మహాభారతం 'కర్ణుడు' - వర్తమాన సమాజం - ఆదర్శ జీవన విలువలు

– డా॥ మాదా శంకరబాబు, చెన్నై

## పరిచయం

భారతీయ సంస్కృతికి మూలం వేదాలు. ఇవి ధర్మమూలమైనవి. వేదాలసారమే రామాయణ మహాభారతం. ఈ మహాభారతాన్ని శ్రీ మహావిష్ణువు అవతారమైన వేదవ్యాసుడు సంస్కృతంలో రచించాడు. దీనిని తెలుగులో అనుసృజన చేసిన వారు నన్నయ, తిక్కన, ఎఱ్ఱన. వీరిని కవిత్రయం అంటారు. కవిత్రయం వారు ఆంధ్ర మహాభారతాన్ని “న భూతో న భవిష్యతి” అన్నట్లుగా అపురూపంగా కూర్చి తెలుగువారికి అందించారు. సాహిత్యం యొక్క ప్రయోజనాలు రెండు అవి. 1. ఆనందం, 2. ఉపదేశం. ఈ రెండింటిని మహాభారతం సమగ్రంగా అందిస్తుంది. మహాభారతం ఒక విజ్ఞాన సర్వస్వం. మానవ మనుగడకు సంబంధించిన అన్ని విషయాలకు ఆలవాలం ఈ గ్రంథరాజం. మహాభారత కథలో వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారం సముచితంగా ఉన్నందువలన ఇది పంచమవేదంగా ప్రసిద్ధి చెందింది.

“మహాభారతంలో వున్నదంతా లోకంలో వుంది అందులో లేనిదేదీ ఈ లోకంలో లేదనేది” లోకోక్తి. అలాగే “వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి” అనే సామెత జనవ్యవహారంలో బాగా వ్యాప్తి చెందిందంటే భారతం గొప్పతనమేంటో తెలుస్తుంది. కవిత్రయ మహాభారతం చతుర్వేద సారముగా పేరుపొందింది. విశ్వసాహిత్యంలో మహాభారతానికి ప్రత్యేక స్థానం ఉంది. లక్ష శ్లోకాలకు పైగా ఉన్న మహాకావ్యం ఇది. ఈ మహాకావ్యానికి జయ, మహాభారతము, సంహిత, ఇతిహాసము, పంచమవేదము, పురాణమని పేర్లు కలవు. మహాభారతం ద్వారా రాజనీతి, మానవస్వభావ చిత్రణ, వేదాంతం, మానవ జీవిత పరమార్థము మొదలగునవి మనకు దర్శనమిస్తాయి. మానవ సమాజం ప్రశాంతంగా కొనసాగడానికి నియమబద్ధమైన పాలన అవసరం. అందుకు రాజనీతిపై అవగహన అవసరం. ఈ రాజనీతిని పరిపూర్ణంగా అందించే గ్రంథం మహాభారతం. ఇందులోని కథ కౌరవ పాండవుల చరిత్ర.

శ్రీకృష్ణుని అవతార ప్రయోజనం, ధర్మజుని ధర్మనిరతి, విదురుని వైదుష్యం, భీష్మద్రోణుల ధర్మపరాయణతత్త్వం, ధృతరాష్ట్రుని పుత్ర ప్రేమ, దుర్యోధనుని ఈర్ష్య, కర్ణుని దానగుణం, భీముని దుష్టశిక్షణ, అర్జునుని ఉదాత్త పరాక్రమం, గాంధారి ధర్మభీరుత్వం, కుంతి ఉత్తమ మాతృహృదయం, ద్రౌపది వీర పత్నిత్వం మొదలయిన అంశాలను తెలియజేసేది ఈ కవిత్రయ మహాభారతం.

కవిత్రయ మహాభారతము అనే గొప్ప కావ్యాన్ని నన్నయ, తిక్కన, ఎఱ్ఱన అనే మహాకవులు రాశారు. కవిత్రయం మహాభారతం మొత్తం 18 పర్వాలు. ఈ 18 పర్వాలను ఆది పంచకము, యుద్ధషట్కము, శాంతి సప్తకము అని మూడు భాగములుగా వ్యవహరింపవచ్చును. యుద్ధషట్కములో వచ్చే పర్వమే కర్ణపర్వం. ఇది 18 పర్వాలలో 8వది. మహాభారతంలో కర్ణుడు దాతృత్వానికి, ధైర్యానికి, నమ్మకానికి ప్రతీక. మహాభారతంలోని కర్ణుని గురించి తెలియని వారు ఉండరని చెప్పుటలో అతిశయోక్తిలేదు. ఎందుకంటే దానగుణానికి నేటి వర్తమాన సమాజంలో ఎవరైనా ఉదాహరణకు చెప్పాలంటే ముందుగా అందరి మనస్సులో మొదటి గుర్తుకు వచ్చే పేరు కర్ణుడు. అందులో భాగంగా నేను “మహాభారతం 'కర్ణుడు' – వర్తమాన సమాజం – ఆదర్శ జీవన విలువలు” అనే అంశాన్ని పరిశీలించాను. ఇందులో కర్ణపర్వం వైశిష్ట్యం, మహాభారతంలో కర్ణుని పాత్ర, కర్ణుని ప్రత్యేకత, కర్ణుని పాత్ర ద్వారా వర్తమాన సమాజం తెలుసుకోవాల్సిన ఆదర్శనీయ జీవన విలువల్ని గురించి చెప్పడమే నా వ్యాస పరిశోధన సారాంశము.

## కర్ణపర్వం – వైశిష్ట్యం

కవిత్రయ మహాభారతంలోని 'కర్ణపర్వాన్ని' తెలుగు చేసిన మహానుభావుడు కొట్టరువు తిక్కనామాత్యుడు. తిక్కన

ప్రతిభాశాలియైన మహాకవి. ఆయన లోకజ్ఞత, శ్రోత్రియత్వం, రాజనీతి, సర్వధర్మ పరిజ్ఞానం, సమస్తము సమయోచితంగా భారతంలో వివిధ ఘట్టాలలో పొదిగి, దానిని మరొక ప్రపంచంగా సృష్టించి తన కవిబ్రహ్మత్వాన్ని సార్థకం చేసుకొన్నారు. తిక్కన తెలుగులో 'కర్ణపర్వాన్ని' మూడు ఆశ్వాసాలుగా విభజించి రాశారు. అందులో ప్రథమాశ్వాసంలో 319 గద్య పద్యాలున్నాయి. ద్వితీయ, తృతీయాశ్వాసాలలో 796 గద్య పద్యాలు ఉన్నాయి. కర్ణపర్వంలో మొత్తం 1115 గద్య పద్యాలు ఉన్నాయి. తిక్కన సోమయాజి కవిబ్రహ్మ కావటం చేత కర్ణపర్వాన్ని విష్ణుమయ మహాయజ్ఞంగా భావించాడు. మహాభారతాన్ని ప్రబంధమండలిగా సంభావించాడు. కాబట్టి కర్ణపర్వాన్ని ప్రబంధంగా నిర్మించాడు. ఇది సమరరూప యజ్ఞంగా నిర్వహించినవారు అర్జునుడు, కర్ణుడు. యజ్ఞాన్ని ప్రవర్తిల్లచేసినవారు అగ్ని, సూర్యుడు, చంద్రుడు. అందుచేత ఇది పుణ్యప్రబంధంగా పరిగణించబడింది. కర్ణపర్వం గురించి ఒక్క మాటలో చెప్పాలంటే వీరుల పరాక్రమ ప్రదర్శనశాలగా చెప్పవచ్చు. అలాగే యోగ మార్గాన్ని జ్ఞానమార్గంతో ముడిపెట్టుకోవాలని తెలియజేసే తత్త్వమే కర్ణపర్వం పరమార్థం అని వేదుల సత్యనారాయణ శర్మ తన అంతరార్థ భారతంలో తెలిపారు.

కర్ణపర్వంలో శల్య సారథ్యం, త్రిపురాసుర వృత్తాంతం, హంసకాకీయోపాఖ్యానం, కర్ణుని కుమారుడైన సత్యసేనుని భీముడు చంపటం, దుశ్శాసనుడు భీముని చేతిలో చనిపోవటం, నాగాస్త్ర ప్రయోగంతో అర్జునుని కిరీటం కిందపడటం, కర్ణుని రథం భూమిలో క్రుంగటం, కర్ణవధ అనేవి ప్రధానాంశాలుగా చెప్పవచ్చు.

కర్ణపర్వం ప్రథమాశ్వాసంలో సుయోధనుడు కర్ణుని కౌరవ సేనకు సర్వసైన్యాధ్యక్షుడిని చేయడం ప్రధాన విషయం. కర్ణుని మొదటి రోజు యుద్ధం ప్రథమాశ్వాసంలో చెప్పబడింది. నకులుడు కర్ణుని చేతిలో ఓడిపోవడం, దుర్యోధనుడు ధర్మరాజు చేతిలో మూర్ఛపోవడం ఇందులోని అంశాలు. కర్ణుని రెండవరోజు యుద్ధం కూడా ప్రథమాశ్వాసంలో చెప్పబడింది. దుర్యోధనుని ప్రార్థన మేరకు కర్ణునికి శల్యుడు రథసారథి అవుతాడు.

కర్ణుని ఉత్సాహానికి శల్యుడు విఘ్నకరమైన వాక్యాలు చెప్పడంతో ద్వితీయాశ్వాసం ప్రారంభమవుతుంది. శల్యుడు అర్జునుని పరాక్రమాన్ని వర్ణిస్తూ కర్ణుని తక్కువ చేసి మాట్లాడతాడు. కోపం వచ్చిన కర్ణుడు శల్యుని దురాచారాల్ని ఎత్తిచూపుతాడు. ప్రతిగా శల్యుడు కాకి, హంసల కథను చెప్పి కర్ణుని కాకి గాను, అర్జునుని హంసగాను పోలుస్తాడు. పరాక్రమశాలి అయిన కర్ణుడు ధర్మరాజుపై విజృంభించి అవమానిస్తాడు. ఆ సమయంలో భీముడు కర్ణుని కొడుకైన సత్యసేనుని చంపుతాడు. అశ్వత్థామ అర్జునుల యుద్ధం కూడా ఈ ద్వితీయా శ్వాసంలో చోటు చేసుకుంది.

కర్ణార్జునుల ద్వంద్వ యుద్ధం ప్రారంభమౌతుంది. బ్రహ్మ, రుద్ర, ఇంద్రాదులు ఈ యుద్ధాన్ని గురించి ప్రస్తావించుకుంటారు. అశ్వత్థామ పాండవులతో సంధి చేసుకోమని దుర్యోధనునికి హితోపదేశం చేస్తాడు. కాని, దుర్యోధనుడు తిరస్కరిస్తాడు. కర్ణార్జునుల యుద్ధం భీకరంగా సాగుతుంది. సర్పముఖ శరంబున అర్జునుని కిరీటం భూమి మీద పడుతుంది. బ్రాహ్మణ శాప కారణంగా కర్ణుని రథం భూమిలో క్రుంగిపోతుంది. అర్జునునిచే విడువబడిన ఘోరశరం కర్ణుని శిరస్సును త్రుంచి వేస్తుంది. ఇలా కర్ణుని మరణంతో కర్ణపర్వం ముగుస్తుంది.ఇది కర్ణపర్వం సంక్షిప్త కథా సారాంశం. ఈ కర్ణపర్వం కథాసారాంశంలోని కొన్ని విశేషాలను పరిశీలిద్దాం.

కురుక్షేత్ర యుద్ధం ప్రారంభంలోనే అవమానించబడ్డాడు కర్ణుడు. నువ్వు అర్ధరథునివి కర్ణా అంటాడు భీష్ముడు. నేను అర్థరథున్నో, మహారథున్నో, మహారథ శ్రేష్ఠున్నో ప్రజలు నిర్ణయిస్తారు. కాలం నిర్ణయిస్తుంది. చరిత్ర నిర్ణయిస్తుంది అని చెబుతూ తాత! పక్షపాతంతో చేశావు ఈ నిర్ణయం, ఈ నిర్ణయంతో నాకు నిమిత్తం లేదు. యుద్ధరంగంలో నువ్వు పడిపోయేదాక నేను బాణమే పట్టను అంటాడు కర్ణుడు. పది రోజులు సంకుల సమరం చేసి భీష్ములవారు పడిపోయారు. అయిదు రోజులు ప్రళయ భీకరంగా యుద్ధం చేసి ద్రోణాచార్యులు వారు అస్తమించారు. పదహారవరోజు కర్ణుడు సర్వ సైన్యాధిపతి అయ్యాడు. మొదటి రోజు యుద్ధంలో కర్ణుడు వీరులు మెచ్చే రీతిలో చిచ్చరపిడుగై విరోధి వర్గాన్ని కబళించి, వీర విహారం చేసి పాండవులను గడగడలాడించాడు.

కర్ణపర్వం రెండు రోజుల కురుక్షేత్ర యుద్ధ వర్ణనతో నిండి ఉంది. ఇందులో యుద్ధక్రియా వర్ణన, యుద్ధభూమి వర్ణన, యుద్ధవీరుల వర్ణనల్ని తిక్కనగారు చాల చక్కగా వివరించారు. అలాగే ఈ పర్వంలో ద్వంద్వ యుద్ధాలు ఎక్కువగా కనిపిస్తాయి. నకులుడు కర్ణుడితో ఓడిపోవడం, ధృష్టద్యుమ్నుడు కృపాచార్యుని ధాటికి పారిపోవడం, శిఖండి కృతవర్మతో యుద్ధం చేయడం, సాత్యకి వింధానువిందుల్ని సంహరించడం, ప్రతి వింధ్యుడు చిత్రుడిని వధించడం, సత్యసేనుడు శ్రీకృష్ణుని శరీరానికి గాయాలు కల్పించడం, ధర్మరాజు చేతిలో దుర్యోధనుడు మూర్ఛపోవడం, దుశ్శాసనుని భయంకరంగా భీముడు చంపడం మొదలయిన ఘట్టాలు యుద్ధ వీరాన్ని తలపింపజేస్తాయి.

యుద్ధభూమిలో కర్ణుని వీర విహారాన్ని వర్ణిస్తూ తిక్కన చెప్పిన ఈ క్రింది పద్యాన్ని చూద్దాం.

**సింహంబుబారి జొచ్చిన గజంబుల భంగి - బులి కగ్గమైన జింకల విధమున**
**జ్వలనంబు గిట్టిన శలభంబులట్లు బాం - చాల యోధుల జేది సైనికులును**
**దను దాకి పొలియ రాధాతనూభవు దని - దనివోక ధర్మనందనుని యున్న**
**చక్కటి కదర ధృష్టద్యుమ్నుదును ద్రౌపదీపుత్రులును సహదేవుడును శి**
**ఖండియును సాత్యకియు నకులుండు జేయ - గల మహీశులు బొదివి రక్కర్ణు: నతడు**
**పెక్కు పాములు వొదివిన బెనగు గరుడు । ననువు దోపగ బోరాడె మనుజనాథ. (కర్ణ 2-273)**

చేది పాంచాల వీరులు తనను తాకగా వారిని సంహరించి అంతటితో తృప్తి చెందక కర్ణుడు ధర్మరాజు ఉన్న దిశకు సాగగా, ధృష్టద్యుమ్నుడు, ఉపపాండవులు, నకుల సహదేవులు, శిఖండి, సాత్యకి అతడిని చుట్టుముట్టిన కర్ణుడు వారితో గరుడునివలె వారిని ఎదుర్కొంటూ యుద్ధం చేశాడు. ఈ పద్యం ఆలంకారికంగాను, కథాకథనంగాను చక్కగా సాగుతుందని చెప్పవచ్చు.

శాంతిపర్వంలో నారద మహర్షి ధృతరాష్ట్రునితో కర్ణుని మరణాన్ని గురించి ప్రస్తావిస్తూ ఎంతమంది ఎన్ని విధాలుగా కర్ణుని మరణానికి కారకులైనారో ఈ విధంగా తెలియజేశాడు.

**'వినుము నరేంద్ర! విప్రు డలివెన్: జమదగ్ని సుతుండు శాప మి**
**చ్చె : నమరభర్త వంచనము సేసె: వరం బని కోరి కుంతి మా**
**న్చె నలుక :భీష్ముదర్ధరథుజేసి యదంచె : గలంచె మద్ర రా**
**జనుచిత మాడి, శౌరి విధి యయ్యె, నరుండని జంపె గర్ణునిన్'. (శాంతి 1-35)**

లోకంలో చాటువుగా ప్రసిద్ధికెక్కిన పద్యమిది. ఒక వీరుని మరణానికి ఇంతమంది ఇన్ని విధాలుగా కారకులు కావడం ఒక కర్ణుని విషయంలోనే జరిగింది.

'కర్ణపర్వం' గురించి తిక్కన ఫలశ్రుతిలో

**అనలుడు భాస్కరుండును సుధాంశుడు నధ్వరసంప్రవర్తకుల్**
**వినుము! నరేంద్ర! యీ క్రతువు విష్ణుమయం: బిది నిర్వహించి ర**
**ర్జునుడును గర్ణుడున్ సమరరూపమునం దగ : నీ ప్రబంధ మిం**
**పొనర బఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్యసంపదల్. (కర్ణ 3 -397)**

అంటే ఈ కర్ణపర్వం అనే ప్రబంధాన్ని ఆసక్తితో చదివినా, వినినా శాశ్వత సౌఖ్యాలను, సంపదలను మానవులు పొందుతారని తిక్కన తెలియజేశారు.

## మహాభారతం – కర్ణుని పాత్ర

మహాభారతం భారతీయ సనాతన సంప్రదాయాలకు పునాది వంటిది. జనజీవన ప్రవంతిలో మనకు మనకు భారత పాత్రలు నిత్యం తారసపడుతూనే వుంటాయి. వ్యాసమహర్షి తానూ కథాగమనంలో ప్రధానపాత్ర. తన కళ్లతో వారి జననమరణాలను దర్శించాడు. ఆశీర్వదించాడు. అభివృద్ధికి మార్గదర్శకుడయ్యాడు. ఆయన మలచిన పాత్రలు సజీవశిల్పాలు. అలాగే ఆ మహాభారతాన్ని సంస్కృతం నుండి తెలుగులో అనుసృజన చేసిన కవిత్రయంలో రెండవ వారు తిక్కన. తిక్కన మహాభారతంలో సృష్టించిన వైవిధ్యమైన పాత్రలలో కర్ణుడు ఒకడు. మహాభారతంలో కర్ణుడి కథ ఆరు ఘట్టాలలో అద్భుతంగా ప్రకాశిస్తుంది. 1. సూర్యుడివరంతో కన్య అయిన కుంతికి పుట్టి ఆమెచేత పరిత్యక్తుడై రాధేయుడుగా పెరగటం: జన్మరహస్యం దేవరహస్యంగా మిగలటం.(కర్ణుని జన్మ వృత్తాంతం ఆది, ఆరణ్యపర్వాల్లో చెప్పబడింది.) 2.గురువుల వద్ద వివిధాస్త్ర శస్త్ర పాండిత్యాన్ని సాధించటం. 3.బ్రాహ్మణ భార్గవాదుల వలన కలిగిన శాపాల వృత్తాంతాలు. 4. దుర్యోధనుడితో స్నేహం చేసి, అతడికొరకు చేసిన యుద్ధాలలో కలిగిన విజయ పరాజయాలు. 5. కురుక్షేత్ర యుద్ధంలో క్రమంగా శాపాల ప్రభావాలకు గురికావటం. 6. కర్ణమరణానంతరం అతడిని గురించిన ప్రశంసలు, స్మృతులు. కర్ణుని కథను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

'కర్ణుడు' కన్య అయిన కుంతీదేవికి దుర్వాసమహర్షి ఉపదేశించిన మంత్ర ప్రభావంతో సూర్యభగవానుడి వల్ల జన్మించాడు. పుట్టిన తక్షణమే తల్లిచేత పరిత్యజించబడి సూతపుత్రుడుగా పెరిగి, రాధేయుడుగా పిలువబడ్డాడు. కవచకుండలాధారీ, అసహాయపరాక్రమశాలి అయిన కర్ణుడిలో తేజస్సు సహస్ర కిరణాలతో వెలగొందుతూ ఉండేది. దానికి గుర్తింపు, గౌరవం కావలసివచ్చింది. అదే అతని జీవితలక్ష్యం. ఆ లక్ష్యసిద్ధికై సహాయం చేసి, అతడిని ఆదరించినవాడు దుర్యోధనుడు. అందువల్ల అతని జీవితమంతా సుయోధనుడితోనే ముడిపడింది. సహజ కవచకుండలాలతో జన్మించాడు కాబట్టి కర్ణుడు అని, రాధ చేత పెంచబడ్డాడు కాబట్టి రాధేయుడు అని, సూర్యుని వరంతో పుట్టినాడు కాబట్టి సూర్యపుత్రుడు అని, వసువు (బంగారం)తో దొరికాడు కాబట్టి వసుషేణుడు అని కర్ణునికి వివిధ పేర్లు కలవు.

బ్రాహ్మణుని శాపం, పరుశురామ శాపం, భీష్ముని ఎత్తిపోడుపులు, దేవేంద్రునికి కవచకుండలాల్ని దానం చేయుట, తన జన్మరహస్యం తెలిపిన శ్రీకృష్ణుడు మాట్లాడిన మాటలకు మనసు వికలమవడం, కుంతీదేవి అభ్యర్థనలకు లొంగి ఆమెకు అభయమివ్వడం, యుద్ధరంగంలో శల్యుడి వచనాలు, అర్జునుడి సంహరించడానికి తాను నమ్ముకున్న శక్తి, నాగాస్త్రం వ్యర్థమవడం మొదలయినవి కర్ణుని క్షోభింపజేసిన ఘట్టాలుగా చెప్పవచ్చు.

దానశీలత, కర్ణుని కవచకుండలాల్ని పోగొట్టింది. గురువుకు నిద్రభంగం కాకూడదని ఓర్చుకొని ఉండడం పరుశురాముని శాపానికి గురిచేసింది. మాతృభక్తి ప్రతిపక్షం వారైన పాండవులలో నలుగురికి అభయప్రధానం చేయించింది. కృతజ్ఞతాభావం దుర్యోధనుడి కార్యాల్ని సమర్థించి దుష్టచతుష్టయంలో కర్ణుడు ఒక్కడన్న అపఖ్యాతిని తెచ్చిపెట్టింది.

### కర్ణుని ప్రత్యేకత

భారతంలో కర్ణుడు, దాతృత్వానికి, ధైర్యానికి, నమ్మకానికి ప్రతీక. మహాభారత కథలో కర్ణుడు ఒక విషాదాంత వీరుడు. ఉప ప్రతినాయకుడు. జీవితాంతం విధికి ఎదురీది స్వయంగా ప్రజ్వలించిన మహాగ్నిజ్వాల కర్ణుడు. కర్ణుని స్వభావాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే ద్వేషంలో దయ, పగలో ధర్మవిచక్షణ ఉంటుంది.

కర్ణునిలోని రెండు గొప్ప గుణాలు స్నేహం, దానం. ఎంతటి పెను తుఫానులు వచ్చినా ఈ రెండు ధర్మాలను కాపాడుకుంటూ వచ్చాడు. కర్ణుడు తన పక్షంలో లేకపోతే దుర్యోధనుడు సంధి చేసుకొని పాండవులకు అర్థరాజ్యం ఇచ్చేవాడేమో, దుర్యోధనుని దుష్టశక్తికి కర్ణుడు కారణం కావచ్చు కాని అతనిలోని ఈ రెండు గుణాలు మహా భారతంలో కర్ణుని ధీరోదాత్తునిగా నిలబెట్టినాయి. హద్దులు మీరిన దాతృత్వంతో ఎన్నో దాన ధర్మాలు చేసి మహాత్యాగిగా కీర్తిపొందినవాడు కర్ణుడు.

శల్యుడు సారథియై కర్ణ హృదయమునకు శల్యమై క్రుంగదీసినను చలించక, స్థిర సంకల్పముతో యుద్ధము చేసి, తన కర్తవ్యమును, నియమమును పాటించుటకు ఆత్మార్పణము చేయగల్గిన సాహసి ఈ రాధేయుడు. తన సర్వస్వమును రారాజు యశశ్రీకి, రాజ్యశ్రీలకి వినియోగించి, తన ఋణమును తీర్చుకొనిన కృతజ్ఞతాపరుడు కర్ణుడు. చేజిక్కిన ధర్మరాజుని కూడా వధింపక విడిచిపెట్టిన సత్యవాక్య పరిపాలకుడు. విక్రమ మున్నను విధిచే వంచితుడైన వీరోత్తముడు. విధి కెదురీదిన విషాదవీరుడు ఈ రాధేయుడు.

చావు తనను సమీపిస్తున్నదని తెలిసి, తల్లి కిచ్చినమాట కోసం తమ్ముళ్ళు(పాండవులు) తనచేత చిక్కినప్పటకీ చంపకుండా వదలిన మహామనిషి. కేవలం తన ప్రధాన శత్రువు అర్జునునితో పోరాడుతాననినే చెప్పిన భారతవీరుడు. కర్ణుని మరణానంతరము ధర్మజునిచే రాధేయునకు తిలోదకము లిప్పించుటయే కుంతి కర్ణునికి చేసి మహోపకారము.

ఇప్పటికి నేటి వర్తమాన సమాజంలో ఒక వ్యక్తి జీవితం ఒడిదుడుకులకు గురిఅయి తేరుకోలేని స్థితిలో ఉన్నప్పుడు అతని కర్ణుని లాంటి శాపగ్రస్తుడిలా చెప్పడం పరిపాటి అయింది. అంతటి మహోన్నత చరిత్ర గల్గినవాడు కర్ణుడు.

## విషాదాంత వీరుడు

ప్రతినాయకునిపై లేని సానుభూతి అతని ఉపనాయకునిపై ఎందుకు కలుగుతున్నది? సూక్ష్మంగా పరిశీలిస్తే అతని వ్యక్తిగత చరిత్రం. అంతర్వర్తనం దానికి కారణాలని తోచకమానదు. విధి కెదురీత ఈదిన విషాద వీరుడు కర్ణుడు. అతని బ్రతుకులో అతని వలన లాభం పొందినవారే కాని, అతని మేలు కోరినవారు తక్కువ. అతడు స్వయంగా ప్రజ్వలించిన మహాగ్నిజ్వాల! దాని చుట్టూ చేరిన మిత్రులు గాని, శత్రువులు గాని తల కొక ఇంధనాన్ని ఇవతలికి తీసి మంట నార్పటానికి యత్నించినవారే కాని సాదరంగా ఒక్క సమిధను సవరించినవారు లేరు. కర్ణుడు తన అంతర్గతతాపాన్ని తనలోనే దాచుకొన్నాడు కాని పరులకు పంచి ఇచ్చి తాను సుఖించలేదు. అతడు మహావీరుడు. మహాదాత. ఉజ్జ్వలుడు. అతడు స్వతంత్ర నాయకుడై రాణించగలిగినాడు. కాని, విధి అతనికి అవకాశం ఇవ్వలేదు. అతని ఉజ్జ్వల గుణాలను గుర్తించి గౌరవించినవాడు. దుర్యోధనుడు. కాని, అతడు అతని స్వతంత్ర వ్యక్తిత్వాన్ని మన్నించలేదు, సహించలేదు. అతడు అతని స్వప్రయోజనాలకొరకు వాడుకొన్నాడు. అందువలన దుర్యోధనుడి కొరకై కర్ణుడు చేసిన కార్యకలాపమంతా అర్థసాధనైకలక్షితమై శుద్ధధర్మాన్ని విరోధించింది.

## కర్ణుని స్నేహధర్మం

కర్ణుడు ధర్మస్వరూపం తెలియని అజ్ఞాని కాదు. అతను ఎంతటి వీరుడో అంతటి ధర్మజ్ఞుడు. అర్జునుడి కంటే మేటివీరుడు అనిపించుకోవాలనుకున్నాడు. ఆ పనికి సూతకులం అడ్డు వచ్చింది. ఆ సమయంలో అతనికి రాచరికం కల్పించినవాడు దుర్యోధనుడు. దీంతో అతనికి అర్జునుని ప్రత్యర్థి నిలువగలిగే అర్హత లభించింది. దుర్యోధనునిచేత కురురాజ్యాన్ని ఏలించడం కర్ణుని సేవాధర్మమైంది. దుర్యోధనుడు ధర్మబద్ధంగా రాజార్హత లేనివాడు. పాండవులు అతని ప్రత్యర్థులు. వాళ్ళ ధర్మనిరతులు. ఆ సంగతి అతనికి తెలుసు. అయినా పాండవులకు కీడు తలపెట్టితేగాని అతని సేవా ధర్మం, వీరధర్మం నిలబడవు. అంపశయ్య మీద ఉన్న భీష్ముడు కర్ణునితో అతని జన్మ వృత్తాంతాన్ని తెలిపి పాండవులతో కలిసి ఉండమని హితవు చెప్పినప్పుడు "మత్సేవా ధర్మం నిర్వహించెద" నన్నాడు. కాబట్టి పాండవులతో ద్వేషబుద్ధితో కాకుండా, దుర్యోధనుడు తనను నమ్మి పోషించినందుకు ప్రతిఫలంగాను, తన కర్తవ్యంగాను పాండవ ద్వేషాన్ని వహించాడు. సేవాధర్మానికి తన జీవితాన్ని అంకితం చేశాడు కర్ణుడు.

## మహాభారతంలో "కర్ణుడు" – వర్తమాన సమాజం – ఆదర్శనీయ జీవన విలువలు

మహాభారతంలోని ఇతివృత్తాలు, పాత్రలు మన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పడుతాయి. ఇందులోని ప్రతికథలోను, ప్రతి పాత్రలోను ఒక సందేశం ఉంది. అది మానవుల జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగపడతాయి.

మానవ జీవితంలో ఏర్పడే సుఖం– దు:ఖం, మంచి–చెడు, ఆనందం–ఆవేశం, కోపం వంటి లక్షణాలను అధిగమించి జీవితంలో వచ్చే ఒడిదుడుకులను ఎదుర్కొనే సామర్థ్యం నేర్పుతాయి. అందుకు ఉదాహరణగా మహభారతంలో కర్ణుని పాత్రను చెప్పవచ్చు. కర్ణుని పాత్ర ద్వారా వర్తమాన సమాజం అలవరుచుకోవాల్సిన ఆదర్శనీయ జీవన విలువలను పరిశీలిద్దాం.

సద్గుణాలకు దుర్గుణాలకు కలిగిన భీకర సంఘర్షణయే కర్ణుని జీవితం. ఒక వ్యక్తి గొప్పతనం అతడు చేసిన మంచి చెడులపై ఆధారపడి ఉంటుంది. ఎవరి జీవితంలోనైనా ఇతరులకు మంచి చేస్తేనే అది వారి గొప్ప జీవితము. అందుకు విరుద్ధమైన జీవితము ఎంత గొప్పదైనా దానికి విలువ లేదు. కాని స్వార్థమే పరమావధిగా ఉన్న జీవితము భయంకర పరిణామమునకు దారి తీస్తుంది. అది మానవులకు హితము కలిగించకబోగా జాతినే ధ్వంసం చేస్తుంది. ఈ పరిణామునకు ప్రతీకయే 'కర్ణుడు' అని చెప్పవచ్చు.

కర్ణునిలో సుగుణాలు అయిన ధైర్యం, నిస్వార్థగుణం, ధీరత్వం, స్వామిభక్తి, స్నేహధర్మం, దానగుణం, దైవభక్తి, బుద్ధికుశలత, ఇచ్చిన మాటమీద నిలబడటం అన్నీ నేటి ఆధునిక మానవులకు సదా అనుసరణీయంగా పేర్కొనవచ్చు.

మనిషి వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైందైనా అధర్మపరులకు అండగా నిలిస్తే ముప్పుతప్పదని తెలిపేవి కర్ణుడి శాపాలు. ఉదాహరణకు పరశురాముని శాపం వల్ల ఒక విషయం స్పష్టమవుతుంది. ఆధర్మమార్గాన పొందిన సంపద ఏదైనా, అది అస్త్రవిద్య అయినా నిలువదు. అటువంటి సంపద వల్ల కోరినఫలం పొందినా, పొందినట్లు కన్పించినా ఆ ఫలితం ఎక్కువకాలం నిలువదు. అందుకు ఉదాహరణ మహాభారతంలో కర్ణుని పాత్ర.

కర్ణుడు అర్జునుని మీద కోపంతోనే కౌరవపక్షం చేరినాడు. ఒక విధంగా అధర్మ పక్షం చేరినాడు. అతడు దుర్యోధనుని స్నేహాన్ని వదలలేక ప్రాణాలు పోగొట్టుకున్నాడు. చరిత్రలో చెడ్డవారి పక్షపాతిగా మిగిలిపోయాడు. ఒకరి మీద శత్రుత్వంతో విరోధి వర్గంలో చేరుట అనే మానవస్వభావం ఇక్కడ కనబడుతుంది. కడివెడు పాలలో ఒక్క చుక్క విషం పడ్డా, పాలన్నీ పనికి రావని తెలస్తుంది. అందుకే మనిషిలో మంచి లక్షణాలు ఎన్ని వున్నా, ఒక చెడ్డ లక్షణం వుంటే చాలు. అది అతన్ని అధ: పాతాళానికి తీసుకెళుతుందన్న నీతిని మరియు చెడ్డవాడుగా మిగిలిపోతారన్న నీతిని మహాభారతంలోని 'కర్ణుడు' పాత్ర మనకు నేటి వర్తమాన సమాజానికి తెలియజేస్తుంది.

మనిషిలో ఎన్ని సుగుణాలున్నా ఒక దుర్గణం అతనిని నాశనం చేయగలదనేది వాస్తవం. ఈ వాస్తవం మహాభారత గ్రంథంలో అతి విశదంగా విస్తృత ప్రాతిపదికపై చెప్పబడిందని చెప్పాలి. ఇతర వ్యసనాలేమి లేని సుయోధనుడు ధర్మమూర్తులైన పాండవుల పట్ల అసూయా పీడితుడై దుర్యోధనుడుగా పరిణమించి తన దుర్గతికి తానే కారణభూతుడైన విధంగానే క్షత్రియోచిత గుణాలతో అన్ని విధాల స్వచ్ఛంద వ్యక్తిత్వాన్ని పోషించుకొనవలసిన కర్ణుడు పార్థుని పట్ల ఆకారణ ద్వేషాన్ని పెంచుకొని అధర్మాచరణకు పూనుకున్న దుర్యోధనునకు బాసటగా నిలవడం, తత్ఫలితంగా ధర్మవిద్రోహులైన దుష్ట చతుష్టయంలో ఒకడుగా చరిత్రలో నిలిచాడు కర్ణుడు.

మహాభారతంలోని దుష్ట చతుష్టయంలోని ఇద్దరు ప్రముఖులలో శకుని మొదటివాడు కాగా కర్ణుడు రెండవవాడు. శకునిది వైయక్తికరమైన ప్రయోజనం కలిగిన పాత్ర కాగా కర్ణునిది సాంఘిక ప్రయోజనం గల పాత్ర. ద్వేషాగ్నిని రాజేసినవాడు శకుని కాగా దాన్ని ఊది ప్రజ్వలింపజేసినవాడు కర్ణుడు. ఆరంభంలో కర్ణుడు అనాలోచితంగా రంగప్రవేశం చేసిన జన్మగతమైన ఆభిజాత్యంతో సుయోధనుని ప్రయోజనార్థం అందలాన్నధిరోహించాడు. ఆ తరువాత వ్యక్తుల స్వభావాలను, పరిస్థితుల ప్రాబల్యాన్ని అవగాహన చేసికొని సందర్భోచితమైన పాత్రను నిర్వహించాడు. కర్ణుడు నిర్వహించినది ప్రత్యక్షంగా ప్రజాభిమానం లేని ప్రతి నాయక పాత్ర అయినా పరోక్షంగా మాత్రం అది ధర్మస్ఫూర్తి కలిగిన సదుద్దేశంతో ప్రజా సంక్షేమం కోసం, ఆదర్శ రాజ్యస్థాపన కొరకు నాయక పాత్ర అని చెప్పుటలో అతిశయోక్తి లేదు.

దుర్యోధనుడు దుర్మార్గుడని తెలిసి కూడా కేవలం స్నేహం కోసం అతని వైపే పోరాడి అకారణంగా ప్రాణాలు కోల్పోయిన మంచి మిత్రుడు కర్ణుడు. కురుక్షేత్రంలో తన తమ్ముళ్లు, చుట్టాలు, ఇలా ఎంతో మంది మరణం చూసినా చలించని దుర్యోధనుడు.. స్నేహితుని మరణంతో విరక్తి చెందాడు. అది కదా స్నేహం అంటే అందుకే అమ్మ అనే పదం తర్వాత ఆత్మీయతను ధ్వనింపజేసే మాట స్నేహం. స్నేహం అనేది దేవుడిచ్చిన గొప్ప వరం.నిజమైన మిత్రులకు స్నేహాన్ని మించిన ఆస్తిలేదు. కనుక స్నేహితులు అంటే కర్ణుడు ,దుర్యోధనుడిలా ఉండాలని కోరుకుంటారు.

శ్రీకృష్ణుడు కర్ణుని కౌరవుల నుండి విడదీసి పాండవులలో చేర్చి తద్వారా యుద్ధ నివారణకు యత్నించిన సందర్భంలో ఆయన బోధకు కర్ణుడు స్పందించిన తీరు, "సూతునికి దొరికి, సూతుని పాలు తాగి, సూతుని అన్నము తిని, సూతకులజునిగా ఉన్న నేను ఈ రోజు పాండవులలో చేరమంటే నా మనసు సమ్మతించదు. మనుషులు పోతారు. కీర్తి శాశ్వతంగా ఉంటుంది. మనిషితో పాటు వెళ్లేవి పుణ్యం – పాపం, మంచి –చెడు, కీర్తి – అపకీర్తి. అశాశ్వతమైన ఈ జీవితం కోసం నన్ను ఎంతగానో ప్రేమించిన దుర్యోధనున్ని వదలి పెట్టి పాండవ పక్షాన చేరడం తగదు. ఎందుకంటే స్వామి ద్రోహం చేసేవాడిని, కృతఘ్నుని భూమి భరించలేదు. అలాగే నన్ను ఇన్ని సంవత్సరాలు పెంచి పెద్ద చేసిన నా తల్లి రాధ దగ్గరకు వెళ్లి నేను నీ కొడుకును కాదంటే ఆ తల్లి హృదయం ఎంతో భాధపడుతుంది స్వామి నన్ను క్షమించండి. అంతేకాక 'ద్రౌపది వస్త్రాపహరణం నాడే యుద్ధం జరుగుతుందని నాకు తెలుసు కృష్ణా. యుద్ధం చేసే వాడు అర్జునుడు, చేయించేది మీరే. ఈ దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, నేను అందరం ఈ యజ్ఞంలో ద్రవ్యమై, ఆజ్యమై ఆహుతైపోతాము. ఈ యజ్ఞానికి ఫలితం తమరు తలపెట్టిన దుష్టశిక్షణ, శిష్టరక్షణ, మీ అవతార ప్రయోజనం నెరవేరుతుంది నన్ను క్షమించండి, నేను పాండవ పక్షాన చేరను" అంటాడు. ఈ మాటలు కర్ణుని ఆదర్శ వ్యక్తిత్వానికి శిలాక్షరాలనే చెప్పాలి. అవి అతని పాత్రలోని ఔచిత్యానికి ప్రత్యక్ష ప్రమాణాలుగా చెప్పవచ్చు.

కర్ణుని దాన గుణం గురించి కవిత్రయ భారతంలోని సంస్కృత మహాభారతంలోని ఉన్న కథను చూద్దాం. దానం గొప్పదా, తపస్సు గొప్పదా అని చర్చ చేసినప్పుడు దానమే గొప్పదని నిర్ధారించారు పెద్దలు. ఎందుకంటే తపస్సు మనకు లేని దాని కోసం చేసేది. అదే దానం మనకు ఉన్న దానిని ఇచ్చేది. కావున ఎప్పటికైనా దానమే గొప్పది. తన దగ్గరకు వచ్చిన వారికి కాదు, లేదు అనకుండా జీవితాంతం దానాలు చేస్తూనే ఉన్నాడు కర్ణుడు. ఈ కాలంలో ఈ చెట్టు ఈ పుష్పాలను ఇస్తుంది. ఈ చెట్టు ఈ ఫలాలను ఇస్తుంది. అనే నియమం ఉంటుంది కాని కర్ణుడు అనే దానవృక్షం అన్ని కాలాలలో పుష్పిస్తుంది. ఫలాలను ఇస్తుంది. కర్ణుని దాన ధర్మాల గురించి ఎన్నో కథలు సంస్కృత మహాభారతంలో ఉన్నాయి. ఉదాహరణకు ఒక కథను పరిశీలిద్దాం. ఒకసారి కృష్ణార్జునులు మాట్లాడుకుంటూ "దానం చేయడంలో కర్ణుని తర్వాతే ఎవరైనా" అని అర్జునునితో అంటాడు. ఆ మాటకు అర్జునుడు నేను కూడా దానం చేయగలను బావా అంటాడు. దానికి శ్రీకృష్ణుడు ఒక పరీక్ష పెట్టాడు. ఒక వెండి కొండను సృష్టించి, ఒక రోజులో గ్రామ ప్రజలకు దానం చెయ్యమని చెబుతాడు. అర్జునుడు ఉదయం నుంచి దానం చెయ్యడం మొదలు పెడతాడు. సాయంత్రం అయినా మంది తరుగుతున్నారు కాని, కొండ తరగడం లేదు. అర్జునా నీ వల్ల కాదు అన్నాడు శ్రీకృష్ణుడు. అదే సమయంలో ఆ దారిలో కర్ణుడు వెళుతూ కనిపించాడు. శ్రీకృష్ణుడు కర్ణుని పిలిచి కర్ణా ఈ మిగిలిన వెండి కొండను ఉన్న జనానికి సూర్యాస్తమయంలోగా పంచి పెట్టాలన్నాడు. అప్పుడు కర్ణుడు మిగిలిన గ్రామ ప్రజలను పిలిచి ఈ వెండి కొండను తలా ఇంత తీసుకోమని చెప్పి వెళ్లిపోయాడు. అదే కర్ణుని గొప్పదనం. ఏ కొంతో సహాయం చేసి ఎంతో చేశామని ప్రచారం చేసుకుంటున్న నేటి సమాజంలో కర్ణుడు చేసిన త్యాగాలను, దానాలను లెక్కపెట్టగలమా!. నేటి సమాజంలోని మానవులు తమకు తామే ప్రశ్నించుకోవాలి. పై అంశాలను బట్టి దానగుణానికి నిలువెత్తు నిదర్శనంగా కర్ణుడు అని నిస్సందేహంగా అతిశయోక్తిలేదు. నేటి వర్తమాన సమాజంలో దానం చేసే వారి కన్నా, దానం స్వీకరించే కర్ణులే ఎక్కువగా కనిపిస్తున్నారు.

వ్యక్తిత్వ వికాసంలో సజ్జనమైత్రి కీలకమైనది. దుర్జనమైత్రి కూడదు. కర్ణుడు చాలా సద్గుణాలు కలిగి వున్న దుర్యోధనునితో స్నేహం కారణంగా 'దుష్టచతుష్టయం'లో ఒకడైనాడు. కాబట్టి సజ్జనులతో స్నేహం అన్ని విధాలా మంచిది. మహాభారతంలోని కర్ణుని పాత్ర ద్వారా మనం తెలుసుకోవచ్చు. అలాగే మహాభారతంలోని కర్ణుని పాత్రను ప్రధానంగా చేసుకుని ఎన్.టి.రామారావు గారు 'దాన వీర శూర కర్ణ' అనే సినిమా తీశారు అంటే మహాభారతంలో కర్ణుని పాత్ర ఎంత ప్రఖ్యాతిపొందినది నేటి వర్తమాన సమాజం తెలుసుకోవచ్చు.

## ముగింపు

మహాభారతములో 'కర్ణుని' మూలపురుషుడుగా పేర్కొనవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ మహాభారతము కర్ణునితో ప్రారంభమై, ఇతనితో అంతమగుచున్నది. "కర్ణుడు లేకపోతే భారతమే లేదు" అన్న లోకోక్తి కలదు. 'కర్ణునేదల భారతంబు' కర్ణుని చరిత్ర మిక్కిలి ప్రశంసనీయమైనది. కురుక్షేత్ర రణరంగములోను ద్వితీయ భారతవీరుడుగా ప్రకాశించిన మేటి ఈ మహానుభావుడు. కర్ణుని పరాక్రమము వర్ణనాతీతము. కర్ణుని ఔదార్యగుణము లోకోత్తరమైనది. ధర్మరాజుకి దుర్యోధనుడు అంటే భయం లేదు గాని, కర్ణుడనిన కలవరపాటు అని చెప్పుటలో ఇతని పౌరుష పరాక్రమములు ఊహింపదగినవి. అతడు మహాదాత. పుట్టుకతో వచ్చిన కవచకుండలాలను సైతం ఇంద్రుడికి దానం చేసి దానకర్ణుడు అనిపించుకున్న వాడు. విధి విలాసం వలన విషాదాంతానికి గురి అయిన వీరశేఖరుడు. మహాభారతంలో 'కర్ణుని' పాత్ర మనుష్యులను ఎంతగా ప్రభావితం చేసిందంటే ప్రపంచంలోని అతిపెద్ద ముస్లిం దేశం ఇండోనేషియా మాజీ అధ్యక్షుడు సుహర్తో కర్ణుని కథ చదివి అతని గుణగణాలు నచ్చి తన పేరును సుకర్ణ అని మార్చుకున్నాడు. తన ప్రాణం పొయ్యే వరకు దాన, ధర్మాలు చేస్తూ లోకానికంతటికి ఆదర్శప్రాయుడయ్యాడు కర్ణుడు.

## ఆధారగ్రంథాలు

1. కవిత్రయం విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము కర్ణపర్వం - కృతికర్త తిక్కన సోమయాజి
   - తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. కవిత్రయం విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము శాంతిపర్వం - కృతికర్త తిక్కన సోమయాజి
   - తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
3. కవిబ్రహ్మ కర్ణపర్వము - ఒక పరిశీలన - జి. సుగుణ
   - (ఆముద్రిత లఘుసిద్ధాంత వ్యాసం 1979, మద్రాసు విశ్వవిద్యాలయం)
4. కవిత్రయ భారతం జనజీవన విజ్ఞాన సరస్వం (జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక)
   - పి.వి.కె.ఎన్ కళాశాల, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్.
5. భాషా సాహితీ విన్యాసాలు 2 - డా.లింగంనేని బసవశంకరరావు - అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి, చెన్నై.
6. మహాభారత ప్రమదావలోకనం - డా॥.ప్రభల(నముదూరి) జానకి

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 19. ప్రజలు మెచ్చిన ధర్మరాజు

– డా. ఐ.వి.కాంతలక్ష్మి, బర్కత్‌పుర, హైదరాబాద్

ధర్మ శబ్దానికి పుణ్యం, నీతి, స్వభావం ఆచారములనే అర్థములున్నవి. ఇది ఒక ప్రవర్తనా సరళికి ప్రతిబింబం. కాలం కర్మం, విధి, నియతిననుసరించి సాగే సృష్టి స్థితి లయాత్మకమైన లోక వ్యవస్థను ఎంతమాత్రం సడలింపులు కానీ, సర్దుబాట్లు కానీ పాటించని అతి నిర్దుష్టం నిష్కర్షం అయిన ధర్మ పాలనము యమధర్మరాజుది. ధర్మ శబ్దము ఈ మహానియంతకు వర్తిస్తుంది వేద నిధులై యజ్ఞ యాగములను నిర్వహించే సోమయాజికి కూడా ధర్మ శబ్దం వర్తిస్తుంది. ధృ అనగా ధరించునది. విశ్వమును ధరించునది ధర్మము అనగా లోకమునకు ఆధారం ధర్మం.

ధర్మమును ధరించువాడు అనగా ఆత్మపరంగాను, స్వభావపరంగాను ఆచార వ్యవహారానుష్ఠాన పరముగాను ఎట్టి పరిస్థితులలోను ధర్మమును విడువకుండా పాటించేవారిని ధర్మపరుడు, ధర్మమూర్తి, ధర్మశీలి, ఇత్యాదిగా అభివర్ణిస్తారు. ఈ విశేషములకన్నిటికి రూపుదాల్చినవాడు మహాభారతములోని ధర్మరాజు. ధర్మపాలనకు అధిపతియైన యమధర్మరాజు దివ్యాంశముతో జన్మించినవాడు. ధర్మశీలి అయిన పాండురాజుకు తనయుడు. ధర్మనిష్ఠా గరిష్ఠులైన భీష్మ విదురాది పెద్దలకడ పెరిగినవాడు. సాక్షాత్తు ధర్మావతారుడైన శ్రీకృష్ణపరమాత్మ వాత్సల్యమునకు పాత్రుడైనవాడు ధర్మరాజు. సత్‌సంప్రదాయ నిష్ఠులైన గురుశ్రేష్ఠులు ద్రోణకృపాచార్యులవద్ద శిక్షణ పొందిన ఉత్తమ శిష్యుడు. ధర్మమూర్తులు, ధర్మ జ్ఞానవేత్తలైన మహాఋషిగణముల సంపర్కముతో పరిణతి చెందినవాడు. వేదచోదితమైన ఒక శాస్త్ర విషయముగా ధర్మమును అభ్యసించడం లేదా సంప్రదాయబద్ధమైనట్టి అనూచానముగా పాటించే అనుష్ఠాన కర్మాచరణమును చేయుట సాధారణ విషయము కావచ్చును. జన్మత: వంశానుగతముగా సంక్రమించిన ధర్మాచరణ శీలమేకాక ధర్మసంకటమేర్పడినప్పుడు ధర్మరాజులో నిక్షిప్తమైన జిజ్ఞాస అతని విశిష్టత. ఒక అసాధారణము అనూహ్యమైన పరిస్థితిలో ధర్మవిధి యేది అని ధర్మ సూక్ష్మములను తర్కించి యెరుగుట పరిశీలనా బుద్ధితో ఒక పరిశోధనా ప్రవృత్తితో ధర్మతత్త్వమును గురించి తెలిసికొనే కుతూహలం కలిగి ఉండడమే ధర్మరాజులోని సంస్కారగతమైన ప్రవృత్తి. ఇందువల్లనే అతడు ఎందరో మహానుభావులు, మహాఋషులు, మునిప్రవరులు, భక్తశిఖామణులు ప్రముఖుల ముఖంగా ఎన్నో ధర్మతత్త్వ రహస్యములను తెలిసికొన్నాడు. అనేకానేక వైరుధ్యములు సంకట సంక్లిష్ట పరిస్థితులు, వైషమ్యములు ఏర్పడినచోట ధర్మహాని కలుగని విధానమును గురించి తరిచి తరిచి తెలిసికొన్నవాడు ధర్మరాజు. ఒక విషయమును గురించిన జ్ఞానమును పొందడం దానిని అవగాహన చేసికొని విశ్లేషించుకోవడం తదనుగుణంగా ఆచరించడం పాడవాగ్రజుడు సాధించిన ఘనత. పెద్దలు విజ్ఞులు, పండితులు, మహాఋషులవంటి మాన్యులచేతనేకాక సాధారణ ప్రజల మన్నన కూడా అత్యధికంగా పొందిన ధర్మమూర్తి ధర్మరాజు.

ఇంద్రప్రస్థపురం రాజధానిగా కురుసామ్రాజ్య విభాగానికి ఏలికయై రాజసూయ యాగమును ఘనవిజయముగా నిర్వహించి సర్వుల ప్రశంసలను పొంది అతులితమైన ఐశ్వర్య విభూతితో దానధర్మాదికములతో ధర్మబద్ధమైన ప్రజాహితమైన పరిపాలన కొనసాగిస్తూ విలసిల్లాడు ధర్మరాజు. పాండవులపై ఆజన్మ విరోధం విపరీత లోభ, మద, మాత్సర్యములకు కారణముగా దుర్యోధనుడు తన హితవరులతో కలసి ఆడిన కపటద్యూతములో ఘోర పరాభవమును పొంది సమస్తమును దారుణముగా కోల్పోయి అత్యున్నత స్థితి నుండి అతి హీన స్థితికి పతనం చెందారు పాండవులు. నిండు సభలో కౌరవులు చేసిన అమానుషమైన అతిదారుణమైన దుశ్చేష్టితములతో అధర్మం వికృతమైన అట్టహాసం చేసింది. కాని కులపెద్దలు, వంశవృద్ధులు, గురువులు, రాజనీతి చతురులు, ధర్మవేత్తలు, సభ్యతా మర్యాదలు గల సభాజనులతో నిండి వున్న నాటి మహాసభ భయంకరమైన మౌనముద్రను దాల్చింది. తలలువాల్చింది, మూగబోయింది. అట్టి దారుణము వికృతమైన దుస్థితిలో సాధువర్తనులు ధర్మపరాయణులైన పాండవులు తమ ధర్మపత్ని మహాసాధ్వి ద్రౌపది వెన్నంటి రాగా తమ ధైర్య, వీర్య, గాంభీర్యాది పౌరుషములను ఆత్మౌన్నత్యమును త్రొక్కిపెట్టుకొని ఘోరారణ్యముల వైపు తరలిపోవడమును చూసిన ప్రజానీకం

మాత్రం తాళలేకపోయింది, నివ్వెరపోయింది. 'విగత హృదయులైన దుర్యోధన ధృతరాష్ట్రులు ఈ విధంగా పాండురాజ పుత్రులను వనగతులను చేయడం తగునా!' గాంగేయుడు, ద్రోణకృపాచార్యాదులు విదురుడు ఎందులకు వారింపలేదు అంటూ వాపోయారు. అందరి దోషమును తప్పును స్పష్టంగా ఎత్తిచూపి దూషించారు. తాము ఏమి చేయాలి! ఇంతటి దురాగతమును అవినీతిని, అధర్మమును సహించడమా? అన్న ప్రశ్న అందరిలోను తలెత్తింది. ఇంతకాలం ధర్మరాజు తన సహధర్మ వర్తనులైన సద్గుణ పుంగవులైన తన సోదరుల సహకార సమాలోచనములతో విరివిగ దానధర్మాధి సత్కార్యములు యజ్ఞయాగాది పుణ్యకర్మలు సత్యం, శాంతి, సహనాది సద్భావములతో ప్రజారంజకముగా సాగించిన పాలనలో ప్రజలు అన్ని వర్గముల వారు సుఖశాంతులతో సంతోషంగా వర్తిల్లినారు. దుర్యోధనుడు దుర్బుద్ధులు అధర్మవర్తనులైన దుశ్శాసన కర్ణ శకునుల సాంగత్యముతో లోభత్వమునకు వశుడై క్రూర చిత్తుడై కపటోపాయంతో పాండవులను తమకు సాటి ప్రభువులైనవారిని అడవులపాలు చేసినాడు. అంతటి దుష్టుడైన దుర్యోధనుడి పాలనలో ఉండి అవినీతిని, అధర్మమును, సహించడమా? అన్న ప్రశ్న అందరిలోను తలెత్తింది. అధర్మమును ప్రోత్సహించునట్టి కర్ణాదులు ఆప్తులుగ రాజ్యపాలనం చేస్తే తామేవిధముగా ఉండగలరు. ఇక తమబోటి ప్రజలను కాపాడువారు ఎవరు? ఇంక ధర్మం ఎక్కడ మనగలదు. కనుక దుర్యోధనుడి రాజ్యమును బహిష్కరించి పరమధార్మికులైన పాండుసుతులను అనుసరించి వెడలిపోవడమే యుక్తమని తమ కర్తవ్యంగా నిశ్చయించుకొన్నారు. అధికార బలం, మదముతో ఉన్న రాజు అవినీతిపరుడైతే వానిని తాము ఏమిచేయలేరు గనుక తమ నిరసనను అట్టి ప్రభువును త్యజించడం ద్వారా ప్రకటించదలచారు. అంతేకాని ఉపేక్షించి ఊరుకోలేదు. అది నాటి ప్రజా హృదయం. అప్పటి పాలనా వ్యవస్థలో సరైనవారు లేకపోతే వారిని పదవీ చ్యుతులను చేయలేరు కనుక బహిష్కరణమే మార్గమని భావించారు. ధర్మనిరతులు సదాచార వర్తనులైన పాండవులను వెన్నంటి పోదలచారు. ధర్మమునకు నాటి ప్రజలు ఇచ్చిన ప్రోద్బలం ప్రాముఖ్యములవి.

ధర్మం, నీతి న్యాయములు ప్రత్యేకాంశములు కావు. ఐచ్ఛికములు కావు. శరీరములో రక్తప్రసరణము వంటిది మానవ జీవితములో ధర్మమనే అంశము. ధర్మాచరణము ప్రతివారికి, ప్రతి అంశములోను విధ్యుక్తం.

ప్రభు ధర్మం లేక పాలకుల ధర్మం ప్రజాహితమును నెరవేర్చుట. సమాజమునకు ఒక జాతికి న్యాయసమ్మతముగాను సర్వులకు శ్రేయోదాయకముగాను, సుఖశాంతులకు ఆలవాలముగాను తమ పాలనా విధానమును ఏర్పరచుకోవాలి. సామూహిక సంఘ జీవితములో న్యాయవ్యవస్థ పటిష్టముగా ఉండాలి. సంఘ నీతి, పాపభీతి లేని ప్రభుత్వం కాని, సమాజము లేదా జాతి కాని వర్ధిల్లలేవు. అన్ని వర్గములవారికి సముచితమైన న్యాయం లభించాలి. పుణ్యం, పాపం అనే ఒక రేఖలో వేదధర్మం సర్వులకు శ్రేయోదాయకము. దీనిని అధిగమించే హక్కు గాని, అవకాశం గాని ఎవరికీ లేదు.

పాడవులలోని ధర్మప్రవృత్తినే ప్రజలంతా హర్షించారు. 'సాధుసమ్మతంబులైన గుణంబులనొప్పి జన్మవిద్య కర్మంబులన్ బ్రశస్తులరై యార్య వృత్తులరైన మీ సహవాసంబుననుండి ధర్మపరులమై కృతార్థులమగుదుము' (ఆరణ్య −1−7) అని తమ నిర్ణయమునకు కారణము వివరిస్తారు. సాంగత్యమును బట్టి గుణ, దోషములుంటాయి. జనులు తమంతతాముగా దుష్కర్మములకు పూనుకొనని వారుకూడా దుష్టసాంగత్యముచేత ధర్మ భ్రష్టులౌతారు. పాప పంకిలములో పడుతారు. అదే సత్సాంగత్యములో ఉంటే ధర్మపరులై జీవితమును చరితార్థం చేసికోగలరు. 'తిలలు (నువ్వులు) నీళ్లు, వస్త్రములు, పుష్పముల సుగంధం చేత తాముకూడ ఆ సుగంధమును పొంది వన్నెకెక్కుతాయి.' (ఆరణ్య - 1 - 6వ పద్యం) సత్సాంగత్యమువలన సద్గుణములు పెంపువహిస్తాయి. దీనికి విపర్యయముగా దుష్టసాంగత్యము చేత దుర్మార్గము, దుర్ణీతి, దుర్బుద్ధి పెరుగుతాయి. అంతకుముందు తామే దుర్మార్గమును చేయకపోయినా జనులు దుర్జన దర్శన, సంభాషణ, సహాసనముల (కలిసి కూర్చొనుట) వలన ఒకరిని చూచి ఒకరు దుర్మార్గులై ధర్మవిహీనులౌతారు. ఆ విధంగా సమాజమంతా దుష్టమైపోతుంది. ప్రజాహితం, శ్రేయస్సు, ఉండనేరవు. అందువల్లనే ఇట్టి ధర్మహీనుడైన దుర్యోధనుని త్యజించి మేమందరము సాధు సమ్మతములైన సద్గుణములతో మెలగుతు జన్మవిద్యా కర్మలలో ప్రశస్తులైన మిమ్మల్ని అనుసరించి మీతోనే మేము వస్తామని అప్పుడే మేము

ధర్మాత్ములమై ధన్యులము కాగలమని ఇందులకు అనుమతినిమ్మని ఏక కంఠముతో ప్రజలందరు ధర్మరాజును ప్రార్థిస్తారు. (ఆరణ్య -1- 7) ఇందుకు తమ జీవన సౌఖ్యమును కూడా విడువడానికి సంసిద్ధులౌతారు. వనవాసం సుఖప్రదం కాకపోగా భయానకమైనదైనా వారు లెక్కచేయలేదు. ప్రజాహితమును కోరినవాడు, ప్రేమ కరుణలకు ఆస్పదుడైన ధర్మజుడు వారి అభ్యర్థనను అంగీకరించడు. వినయసంపన్నుడైన ఆతడు వారి ప్రశంసలకు పొంగిపోలేదు.

**'మాయందు లేని గుణములు / మీయనురాగమున చేసి మిగిలి వెలింగెన్**

**మీయనుగతి మాకనఖి / ప్రాయము వనవాస దుఃఖభర మోపుదురే (ఆరణ్య -1-8) అంటూ**

'వలవదుడుగుందు మీరని' (ఆరణ్య - 1-9) వెనుకకు మరలిస్తాడు. ధర్మరాజు మాటను అధిగమించలేని పౌరులు ఆర్తనాదులై వెనుదిరుగుతారు. స్వస్థ చిత్తుడై ధర్మరాజు తమ్ములతో ధౌమ్యునితోనూ కలసి గంగాతీరంలో మరునాడు గడుపుతాడు. అంతటితో ఈ ప్రజా సమస్య ఆతణ్ణి వీడలేదు. సామాన్య పౌరులకు నచ్చజెప్పి పంపాడేకాని ఆ మరునాడు అగ్నిహోత్రములు, బంధులు, శిష్యులు తోడుగ పండితోత్తములైన విప్రవర్యులందరు చేరి వేదఘోషలు చేయుచు ధర్మరాజు వద్దకు చేరుతారు. వారు బ్రహ్మదేవునితో సమానులు. వేదానుష్ఠానము పఠనము వలన పాపరహితులైన పూజనీయులు. మేము కూడా నీతోనే వనములకు వస్తామని పట్టుదలతో వచ్చినవారు తాము అభ్యసించిన విశ్వసించిన వేదసంస్కృతికి, వేదాచారమునకు ప్రత్యక్ష రూపము ధర్మరాజు. వారి దృఢ సంకల్పములు విని ఎంతో భక్తి గౌరవములతో ఆదరించి పౌరజనులకు చెప్పినట్లే తనను అనుసరింప దగదని చెప్పుతాడు. దాయాదులవలన సర్వస్వం అపహరింపబడి కోల్పోయి కష్టతరమైన వనవాస క్లేశంతో దొరికిన ఫలశాకములను తిని బ్రతుకవలసిన తమతో వచ్చియుండుట తగదని వారిస్తాడు. మాతో వచ్చి మీరెందుకు శ్రమపడుతారు. పైగా అనేక ఉగ్ర జంతువులతో భయానకమైన వనవాసము మీకు తగదని నచ్చబలుకుతాడు. దానికి ఆ బ్రాహ్మణోత్తములంతా వ్యథతో

**మీరగాని మాకునొండు గతిలేదు**

**మమ్ము నన్య శరణ్యుల విడుచుట ధర్మంబుగాదు (ఆరణ్య- 1- 15)**

యెట్టివారు తమనాశ్రయించిన ఆశ్రితులను విడువరు. అట్టిది నీవంటి ధార్మికుడు మావంటి ఆశ్రితులను, భక్తులను విడువదగునా (ఆరణ్య- 1-16) అని దృఢంగా ఒక్కమాటగా పలుకుతారు. పైగా నీకెట్టి సంశయము వద్దు మమ్ములను పోషించుట ఎట్లాగని వ్యథ చెందకు. మాకు మేమే వనములలో దొరికే కందమూలాదులు తెచ్చుకొని తినగలము. మా అగ్నిహోత్రాదికములను జపతపములను మేమే నిర్వహించుకొంటాము. అది నీకు ప్రీతికొరకు అంతేకాని 'అధర్మవర్తనులై మీకపకారమును సేసిన ధార్త రాష్ట్రుల రాష్ట్రంబున నుండనోప' (ఆరణ్య -1-17) మని ఘంటాపథముగా చెప్పివేస్తారు. ధర్మరాజును మారుపలుకనీయలేదు.

ధర్మరాజు మనసు మాత్రం విప్రవర్యులపట్ల పరితాపముతోనే ఉంది. వారికెట్టైన పోషణ చేయవలెనని చాలా ఆర్తితో శౌనకముని వద్ద తన వ్యథను, నిస్సహాయతను వెల్లడిస్తాడు. ఆ ముని వ్యతిరేకమైన పరిస్థితులలో ధైర్యములు విడనాడకూడదని ధనము కొరకు వ్యాకులపడవద్దని అనేక ధర్మములను కూడా బోధిస్తాడు. ధర్మరాజు ధనము తన కొరకు కాదని తాను ఎంత చెప్పినా వినకుండా తన్నంటి వెంట వచ్చు విప్రులకు ఆహారాదులు, సమకూర్చుట గృహస్థ ధర్మమని చెప్పుతాడు. ఈ సందర్భములో గృహస్థ ధర్మములెన్నో అన్నింటిని విపులీకరిస్తాడు. ఆకలిదప్పులను తీర్చుట అవశ్య కర్తవ్యమంటాడు. ఏది ఏమైనా వారికి భోజనం సమకూర్చి తీరవలెనన్న నిర్ణయమును మరల్చుకొనలేకపోతాడు. వారు ఘోర వనాలలో తమను అనుసరిస్తూ పడే పాట్లను యిడుములను ఊహించుకొని వ్యాకుల చిత్తుడౌతాడు. అంత అతని పురోహితుడు ధౌమ్యుడు లోకమునకు అన్నప్రదాత సూర్యభగవానుడేనని ఆహారమునకు కర్త ఆయనేనని చెప్పి ఆ స్వామిని గురించి తపము చేసి అనుగ్రహమును పొందుమని ఉపదేశిస్తాడు. ధర్మరాజు అత్యంత భక్తిశ్రద్ధలతో సూర్యుని ఆరాధించి ఆ దేవుని అనుగ్రహమును పొందుతాడు. మీ తపమునకు

మెచ్చితినని చెప్పి సూర్యభగవానుడు ధర్మరాజు వనవాసం పన్నెండు సంవత్సరములు కూడా వనములలో లభించే శాకములు, ఫలములు ద్రౌపదిచేయు వంట పరిపాకముగా అమృతతుల్యమైన భోజనపదార్ధములుగా తయారగునని చెప్పి అందుకు ఒక తామ్ర పాత్రను బహుకరిస్తాడు. ధర్మజుని వేదన తీరిపోయింది. ఆతనిలోని ధర్మవ్యగ్రత ఆతనికి దైవానుగ్రహమును సిద్ధింపజేసింది. తనతోవచ్చిన విప్రవర్యులకేకాదు అతిథి అభ్యాగతులెవ్వరెవరు తారసపడినా వారికందరకు ఒక ఉత్తమ సంపన్న గృహస్థువలె మృష్టాన్న భోజనములతో తృప్తిగావించగలిగాడు. తానెంతగా వారించినా ఒప్పుకొనకుండా మా ఆహారం మేమే సంపాదించు కొంటామని పట్టువిడువకుండా తన వెంటే వున్న విప్రవర్యులను అట్లే కానిమ్మని వారి మానాన వారిని వదలి వేయలేదు. వారిపై ధర్మరాజుకుగల ప్రీతి మన్ననను తానప్పుడు ప్రభువుకాకపోయినా గృహస్థుదేగనుక ఆశ్రితులకు భోజనాది సదుపాయములు సమకూర్చి తీరవలెనని కర్తవ్య దీక్షతో తపస్సు చేసి సూర్యుని మెప్పించి తన లక్ష్యమును సాధించాడు. మానవయత్నమునకు మించినది దైవసహాయం. అత్యవసర విధిగా సూర్యదేవుని మెప్పించి తన అభీష్టమును గృహస్థ ధర్మమును నెరవేర్చుకొన్నాడు. చిత్తశుద్ధితో కోరినట్లైతే ప్రేమాభిమానములు, గౌరవాదరములు సద్బుద్ధి ఔదార్యములు మానవ బంధములను పటిష్టము చేస్తాయి. అదే బంధము ప్రజలకు ధర్మరాజుతో. సామాన్య పౌరులకైనా వేదజ్ఞాన సంపన్నులు తపోధనులు అయిన విప్రవర్యులైనా ఒకేబంధమును కలిగించింది. ఆభిజాత్యము వంశౌన్నత్యము పరాక్రమ ప్రతాపములు అతులిత సంపదలు మొదలైన సర్వ అర్హతలు ఘనతలు ధర్మరాజాదులతో సరిసమానముగా ఉన్నప్పటికి దుర్బుద్ధి లోభత్వము, అసూయాద్వేషములు, అవినీతి, అధర్మాచరణకు వెరువక పోవడము కారణములుగా దుర్యోధనాదులకు చివరికి నాశనము తప్పలేదు. శాశ్వత అపకీర్తి పాలైనారు.

ధర్మజునిలోని సౌజన్యం ప్రసన్నత, ఉదారత, ప్రేమాభిమానములు పామరులను, పండితులను కూడ మెప్పించాయి. దగ్గర చేశాయి. స్వీయ సుఖజీవనముకంటే కూడా ఇక్కట్లతో కూడినదైనా ఆతనితోడి సాంగత్యమును వారంతా కోరుకొనేలాగా చేసినది. కన్న తండ్రివలె ప్రభువు ప్రజలను పాలించడం ఆ ప్రభువును ప్రజలు భక్తి గౌరవములతో సేవించడం అనూచానంగా సాగుతూ వచ్చింది. వైదిక సంస్కృతిలో ఈ అనుబంధమే మనం మన పౌరాణిక గాథలద్వారా తెలుసుకొంటాం. పురాణములు ఒకప్పటి వాస్తవ చరిత్ర అన్నదే మన విశ్వాసం. మనం విన్న ఆయా ఉదంతములలోని వ్యక్తులు, చక్రవర్తులు వాస్తవికతకు నిదర్శనంగా భావిస్తాం. సూర్య చంద్ర వంశముల రాజుల చరిత్రలు ఇటువంటివి.

ప్రభువులెప్పుడు ప్రజా ప్రతినిధులే. ప్రజల శ్రేయస్సును వారి సుఖ జీవనమును సమాజనీతిని క్రమబద్ధం చేసి ధర్మవ్యవస్థకు, న్యాయవ్యవస్థకు పటిష్టతను చేకూర్చవలసినవారు ప్రభువులు లేదా ప్రభుత్వం. వారి అధికార ప్రాబల్యం కాని సారభౌమత్వముకాని తిరుగులేనివైనప్పటికి ప్రజాపాలనము కొరకు వారి శ్రేయస్సుకొరకు ఉద్దేశింపబడినవే. ఇవన్ని తమ ఏలుబడిలో ఎంతెంతగా ప్రజాభివృద్ధికి దోహదం అవుతాయో ఎంతగా ప్రజారంజకత్వమును కలిగిస్తాయో అంతంత సార్థకములు. సంఘనీతి, పాపభీతి కలిగి ధర్మబద్ధమైన రీతిలో తమకు లభించిన అధికార ప్రాబల్యమును ఉన్నత పదవిని వైభవ ప్రాభవములను ప్రజాహితంకొరకే వినియోగించే పాలకుడు మాత్రమే ఆదర్శవంతుడు, పుణ్యవంతుడు, మాననీయుడు. అట్లుకాక పాపభీతి లేక లోభత్వం అధికార దుర్వినియోగం స్వార్ధపరత్వం దురహంకార ప్రవృత్తి, కఠినచిత్తం కలిగిన పాలకుడు దుర్మార్గుడు పాపి, ఆతడి పాలనలో ధర్మమునకు, న్యాయమునకు నీతినియమములకు తావుండదు. సమాజ వ్యవస్థకు ఇది భంగకరం. జాతి మనుగడలో సుఖశాంతులు ఉండవు. మానవుడు సంఘజీవి. వ్యక్తి, కుటుంబం, తాను జీవించే సంఘం, దేశం, జాతి, ఈవిధంగా పరస్పర అనుబంధములతో ఆశ్రయములతో సహజీవనం గావించేవాడు. స్వార్ధంతోనే జీవించుటకు వలనుపడదు. స్వార్ధపరత్వం లేకుండా స్వేచ్ఛాశ్రేయస్సులకు భంగం కాకుండా మనుగడ సాగించే నాగరకతయే మనువు ఏర్పరచిన విధానం. దీనిని అనుసరించువాడే మానవుడు. ధర్మార్థకామ మోక్షములనే పురుషార్థసాధనములు సాధించుట కొరకే కనుక ధర్మమునకు నీతికి బాహ్యముగ నడుచుకొనడం అటు సర్వాధికారియైన సార్వభౌముడు లేక ప్రజాపాలకునికైనా ప్రజలకైనా చెందదు. వ్యవస్థను క్రమబద్ధం చేయుటకై ఒక ఆధికారికమైన పాలనావ్యవస్థ అవసరమేకానీ, నీతి యొక్క సుస్థిరతను ధర్మ పటిష్టతను కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులకు కూడా ఉంది. దీని వైఫల్యమును సహించం అనే లక్ష్యమునే ధర్మరాజు కాలంలో ప్రజలు ప్రదర్శించారు.

ఈ దృష్టితో నేటి మన ప్రజాస్వామ్యం, ప్రజాజీవితం, ఆధునిక వ్యవస్థ తీరుతెన్నులు విశ్లేషిదాం. అధర్మం, అవినీతి, దుష్టత్వం, వంచన మొదలైన అక్రమ వర్తనం ఏ కాలంలోను, ఏ సమాజానికి, ఏ జాతి మతాలకు వర్జనీయమే. సహింపరానిది, సహింపకూడనిది. వ్యక్తిపరంగా అయితే తల్లిదండ్రుల పెంపకం వలన గురువుల శిక్షణవలననో పరిస్థితుల ప్రభావం వలననో అరికట్టవచ్చును. కానీ సమాజపరమైనప్పుడు ఈ దుష్టత్వాదులను అరికట్టుట ఎలా? ముఖ్యంగా కంచె చేను మేసిందన్నట్లు ప్రజా క్షేమం, జాతి సంక్షేమం కట్టుబాట్లతోను, చట్టపరమైన ఆంక్షలతోను సంరక్షింపవలసిన ప్రభుత్వం కానీ పాలకులైన నాయకులు గాని, ఇట్టివాటికి కేంద్రంగా మారితే ఉపేక్షించి ఊరకుంటే గత్యంతరమేమిటి? అనేది నేటి ప్రశ్న. నేటి మన పరిస్థితులలో ఈ ఆరాచకత్వం పెచ్చుపెరిగి మితిమీరిపోయింది అన్నది ప్రత్యక్షసత్యం. అంగీకరించక తప్పనిది. దీనికి గురై ఏదో విధంగా కష్టనష్టములను ఎదుర్కొంటున్నది పర్యవసానంగా ప్రజలే. అపరిమితమైన ధనలోభం, లంచగొండితనం, మితిమీరిన స్వార్థపరత్వం, పదవీ వ్యామోహంతో గద్దెలు ఎక్కడం, తరతరముల వరకు తమ ఒక్కరి అభ్యున్నతికే నన్న దుర్లోభం, దుష్టనీతి, విశృంఖలముగా తాండవిస్తున్నాయి. ఇది అందరు గర్హించవలసినది గర్హిస్తున్నదే, అయినప్పటికి ఎవరికివారు తమ బాధ్యత కాదన్నట్లు ఉదాసీనత వహించడం యథా రాజా తథా ప్రజా అన్నట్లు ఎవరి పరిధిలో వారు తమతమ స్వార్థకాంక్షలను నెరవేర్చుకోవడం పరిపాటిగా ఉంది. సద్బుద్ధిగలవారు, నీతిమంతులు స్వార్థపరత్వమునకు లోనుకానివారు ధర్మమును గురించి యోచించని వారు బొత్తుగా లేరనికాదు. సాత్త్వికత మంచితనం అనేవి ఉగ్రంగా ఉండవు. తీవ్రంగా కనపడవు. ఎప్పటికైన అవినీతిని నీతియే అణచివేయగలదు. ధర్మరాజును అనుసరించిన ప్రజానీతి ఎంతపటుత్వం గలదో అవగతమౌతుంది. అవినీతిని, అధర్మమును ఒప్పకపోవడం ధర్మాన్ని అనుసరించుటమే నీతి అని నాటి ప్రజలు ఆచరణలో చూపారు. అందుకు సుఖజీవనం, సుస్థిర జీవితం వదలుకొనడానికి కూడా సంసిద్ధులైనారు. కడగండ్లు ఎదురుకొనుటకు వెనుదీయలేదు. ప్రజాశక్తి, ప్రజాసంకల్పం ఎంత దృఢమైనవో పునీతమైనవో గ్రహించవచ్చు. ఈనాటి పరిస్థితులను చక్కబరచుకోవడానికి నీతి బాహ్యులైన పాలకులకు నాయకమ్మన్యులకు బుద్ధిచెప్పడం ప్రజల చేతిలో ఉంది. ఈనాడు ప్రబలమైనది ప్రజాస్వామ్య వ్యవస్థ. దానిని బలోపేతముగా సార్థకంగా సఫలీకృతంగా చేసికోవడానికి మన సనాతన ఆర్ష ధర్మమును నైతిక విలువలను పట్టుకొమ్మలుగా చేసుకోవాలి. జాతి, సమాజము తన్మూలంగా వ్యక్తులు సుఖశాంతులను పొందవచ్చు. ఇది జరగాలంటే పంచమవేదమై మన సంస్కృతిని వేదధర్మమును ప్రబోధించే మహాభారతాన్ని అవగతం చేసుకోవాలి. కథల రూపంగా ధర్మసూత్రాల రూపంగా బోధించిన ఉదంతాలను సంస్మరించుకోవాలి. ఇందుకు తగిన విధంగా పిన్నలకు, యువతకు పౌరులందరకు కూడా కవిత్రయ విరచిత ఈ మహాభారత గ్రంథ సారాంశమును జీర్ణింపజేయాలి. ఇందుకు విద్యావిధానం, పాఠ్యాంశములు, బోధించే తీరులు రూపొందించాలి. విశ్లేషణాత్మకమైన పరిషత్తులు, సదస్సులు అధ్యయన మండలులు (స్టడీ సర్కిల్స్) సత్‌సంగములను నిర్వహించాలి, ప్రోత్సహించాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. యువతకు వీటిపై ఆసక్తిని పెంపొందించి వారిని పాల్గొనేలాగ చేయాలి.

నిజానికి ఇట్టి మహదాశయముతో వేదవ్యాసమునీంద్రుడు వేదశాస్త్రములకు సమీక్షలను విస్తృతంగా పురాణ గ్రంథ రచనలను గావించాడు.

తన శిష్యులు మునుల ద్వారా తపోవనములలో ఆయా ధర్మ ప్రతిపాదితమైన అనేకాంశములను గూర్చి ఉపన్యసింపజేసి ఈనాటి సత్సంగాలకు సదస్సులకు అధ్యయన మండలులకు శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. సర్వజనులకు సులభతరముగా అందుబాటులోనికి తేవడానికి ధర్మతత్త్వం, నీతివిచక్షణ, ఇత్యాదిగా లౌకిక, అలౌకిక, ఆధ్యాత్మిక సమస్త శాస్త్ర విషయములతో పంచమ వేదంగా మహాభారత గ్రంథ రచన చేశారు. ఆ మహానుభావుడు ఆరంభించిన ఈ పౌరాణిక సామాజిక ధర్మసందేశ ప్రచారం మనం కూడా అత్యంత శ్రద్ధాభక్తులతో కొనసాగించడానికి నడుముకట్టుకోవాలి. ప్రజాబలం వర్ధిల్లాలి.

**ఆధార గ్రంథాలు**

1. సంక్షిప్త మహాభారతము – గీతా ప్రెస్, గోరఖ్పూర్
2. మహాభారతము – పిలకా గణపతి శాస్త్రి

# 20. మహాభారతకాలంనాటి - ఆశ్రమ, సాంఘిక జీవితాలు - నేటి యువతకు ఆదర్శాలు

- డా॥ పప్పల వెంకటరమణ, శ్రీకాకుళం.

ఆంధ్ర మహాభారతం ఇతిహాసం మాత్రమే కాక ధర్మ శాస్త్రము, వేదాంతశాస్త్రము, నీతి శాస్త్రము, మహాకావ్యము, లక్షణ గ్రంథము, పురాణం కూడా అవుతుందని వ్యాస మహర్షి తెలిపిరి. చతుర్విధ పురుషార్థములైన ధర్మార్థ కామ మోక్షములు ఇందు సాధింపబడెను. దానిని నన్నయభట్టారకుడు అనువదించి తెలుగువారికి పుణ్యఫలమును చేకూర్చిరి. మహాభారతం చదివినా, వినినా వారికి ఆయురారోగ్య అష్టైశ్వర్యములు కలుగును. మహాభారతం భీష్మ పర్వములోని భగవద్గీత ఈనాడు మనదేశంలో సర్వోన్నత న్యాయస్థానంలో ప్రామాణిక గ్రంథముగా ఉన్నది.

**"ధర్మ తత్వజ్ఞులు ధర్మశాస్త్రం బని**
**యాధ్యాత్మ విధులు వేదాంతమనియు**
**నీతి విచక్షణుల్ నీతి శాస్త్రం బని**
**కవి వృషభులు మహాకావ్యమనియు**
**లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని**
**యైతిహాసికులు లితిహాసం మనియు**
**బరమ పౌరాణికుల్ బహు పురాణ సముచ్ఛ**
**యంబని, మహి గొనియాడుచుండ దగి యున్నదని"**

నన్నయపట్టు భారతమును ప్రస్తుతించెను. ఈ పద్యములో నేటి యువతీ యువకులు ఎలా జీవించాలి, సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, వారి జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలను ఎలా పరిరక్షించుకోవాలి, తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను ఎలా గౌరవించాలి, ధర్మం అంటే ఏమిటి? నీతి అంటే ఏమిటి? అనే విషయాలను నేటి సమాజానికి తెలియజేసి వారు సన్మార్గంలో ప్రయాణం చేయడానికి మహాభారతంలోని ఈ పద్యం వివరిస్తుంది. మహాభారతాన్ని ఎవరు ఏ విధంగా అనుకుంటే వారికి ఆ విధంగానే కనిపిస్తుంది. మహాభారతము పంచమ వేదమనబడుతున్నది. కాబట్టి వేదములలో సర్వశాస్త్రార్థములు సంగ్రహముగా ఉన్నట్లే మహాభారతంలో కూడా అనేక విషయములు ఉన్నవి. మహాభారతంలో కణికనీతి, విదురనీతి, ధృతరాష్ట్రనీతి, భీష్మ నీతి, సంజీయనీతి ఇత్యాది నామములతో నీతి శాస్త్ర గ్రంథ భాగములు ఉన్నవి. మహాభారతము నీతినిధి అనుటలో నీతి పదము ఇప్పుడు సామాన్యంగా లోకములోని వాడుకలో ఉండే తీరునకు కులాచారాది లోక ధర్మముల ననుసరించిన ప్రవర్తన అని ఉద్దేశము.

## ఆశ్రమ జీవితము

ఆశ్రమ జీవితం అంటే అరణ్యాల్లో ఆశ్రమాలు ఏర్పరచుకుని అచ్చట నివసించే వారి జీవితం అన్నమాట. ఈ ఆశ్రమ శబ్దము రెండు విధాలుగా ఉపయోగపడుతుంది. ఒకటి వర్ణాశ్రమ ధర్మములు అన్న సందర్భంలో వర్ణములు నాలుగు– బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు. ఇవి పుట్టుకతో ఏర్పడేవి. అలాగే ఆశ్రమములు కూడా నాలుగు– బ్రహ్మచర్యము, గార్హస్యం, వానప్రస్థము, సన్యాసము. ఇవి ఒక జన్మలోనే లేదా జీవితంలోనే కలుగు భిన్నావస్థలు. ప్రస్తుతం మనం పరిశీలింపదలచుకున్నది ఈ ఆశ్రమాల గురించి కాదు. ప్రాచీన కాలంలో మన దేశంలో మనకు మహత్తర విజ్ఞానాన్ని అందజేసిన మహర్షులు అరణ్యాల్లో అనువైన చోట్ల నివాసాల ఏర్పరచుకొని కుటుంబాలతో శిష్య వర్గంతో అక్కడే నివసిస్తూ ఉండేవారు. అచ్చటి ఆ మహర్షుల నివాసాలకు కూడా ఆశ్రమాలని పేరు. మహాభారత కాలంలో ఈ ఆశ్రమాలు ఎట్లుండేవో

అందు నివసించే మహర్షుల జీవితాలు నేటి యువతకు ఏ విధంగా విజ్ఞానాన్ని వెలుగును నింపుతున్నాయో తెలుసుకుందాం. ఈ ఆశ్రమ జీవితం, సాంఘిక జీవితం విషయములను పూర్తిగా పరిశీలించనిచో రెండు సిద్ధాంత గ్రంథములకు మించి విషయము సేకరించవచ్చు.

భారతీయ సమాజంలో హైందవ విజ్ఞానము– సంస్కృతి అనే వాటికి– అరణ్యక విజ్ఞానం సంస్కృతి అనే ప్రసిద్ధి ఒకటి ఉన్నది. ఎందుచేతనంటే ఇదంతా అరణ్యాల్లోని ఆశ్రమాల్లో నివసించిన భారతీయ మహర్షుల మూలంగా ఏర్పడి పెంపొందినది గనుకనే. మొదట చిరకాలము క్రితం ప్రాచీన ఆర్యులు ఈ దేశంలోకి ప్రవేశించినప్పుడు అది అంతా అరణ్యమయంగా ఉండేది. ఎవరో కొందరు అటవిక జనము, దశ్యులు, నిశాదులు అనే వారచ్చటచ్చట ఉండి, పైనుండి వచ్చిన ఆర్యులతో పోరాడుతూ వారి స్థావరాలకు, పురోగమానికి అడ్డంకులు కలిగిస్తూ వచ్చినా, కొంతకాలానికి ఈ ఆర్యులు వారి కన్నా బలవంతులు, నాగరికులు అగుటచేత వారిని లోపరుచుకుని, తమ సంఘంలో నాలుగవ జాతిగా వారిని చేర్చుకుని, వారితో సఖ్యపడి, తమ నాగరికత ఈ దేశమున వ్యాప్తి గావించుచూ వచ్చారు. క్రమంగా ఈ ఆర్య మహర్షులు అచ్చటి అటవిక జనాల్నే కాక, ప్రకృతిలోని విశ్వమును కూడా ఆత్మ భావంతోనే చూడగలిగినారు గనుక. అచ్చటి జంతుజాలమును వృక్షజాతులను కూడా ఎంతో సానుభూతితో ప్రేమతో చూచుచు తమకు స్వాధీనమగునట్లు చేసుకోగలిగినారు. అక్కడి జంతువులు తమ సహజ వైర భావమును కూడా మరిచి వారిని సేవిస్తూ ఉండేవి. కాబట్టే అరణ్యంలోని ఆ ఆశ్రమాలు శాంతిభద్రతలు కలిగి పుష్పఫలమూలాదిభరితములై, మహర్షుల తపోవనాలుగాను, భారతీయ విద్యా కేంద్రాలుగాను, ఆధ్యాత్మిక సాధన స్థానాలుగాను, అనాథ శరణాలయాలుగాను ఉపయోగిస్తూ ఉండేవి. పట్టణాలు ఏర్పడి క్షత్రియ ప్రభువులు ధర్మపరిపాలన సాగించుచున్నప్పుడు కూడా, అరణ్యాల్లోని ఈ ఆశ్రమాలకు దుష్ట మృగముల వలన బాధలు ఏమి కలుగకుండా చూసుకుంటూ, తమకేమైనా బాధలు కలిగినప్పుడు ఆ ఆశ్రమాలలోని మహర్షుల సలహాలను సహాయమును పొందుతూ ఉండేవారు.

నేటి మన సమాజంలోనూ, పాశ్యాత్య దేశాల్లోనూ ప్రకృతితో మానవునికి ఇలాంటి సానుభూతి ఉన్నట్లు కనపడదు. దీనికి ఒక చక్కని ఉదాహరణ చూపినారు రవీంద్రనాథ్ ఠాగూర్. ప్రాచీన కాలంలో ఆర్యుల వల్లే ఇటీవల కాలంలో యూరోపియనులు కొందరు అమెరికా అరణ్య భాగాల్లో ప్రవేశించారు. వారికి కూడా దేశీయులగు అనాగరిక జాతులతోనూ ప్రకృతితోనూ పోరాటము కలిగినది. కానీ అది తుది వరకు సాగుచునే వచ్చినది. అతడక్కడ ప్రకృతితో పోరాడి స్వాధీనం చేసుకొని, దాని మూలంగా తన ఐహికానుభవములను, ప్రాభవమును పెంపొందించుకొనగలిగినాడే గాని, దానితో తన సానుభూతినిగాని, ఆత్మ భావమును గాని వ్యక్తపరచలేకపోయాడు. కాబట్టే ప్రాచీన హిందూ దేశం నుండి అడవులట్టి మహర్షుల ఆశ్రమములకు స్థానములైనవి. హైందవ నాగరికత, సంస్కృతి అచ్చటి నుండియే పెంపొందినవగుట చేత అరణ్యక నాగరికత– సంస్కృతియని పేరొందినది.

నేటి మన ఆధునిక సమాజంలో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు ఏర్పడినప్పటికీ ఆనాటి విద్యా వ్యవస్థను రూపొందింప లేకపోయినవి. ఈనాడు జంతుజాలమును వృక్షజాతులను ప్రేమతో చూడకుండా మానవుడు తనకు నచ్చినట్లు విధ్వంసమును సృష్టించి కరువుకాటకులకు కారకులుగా మారారు. ఆనాడు అరణ్యాలలో దొరకే ఆకులు, అలములు, దుంపలనబడే సాత్విక ఆహారం తిని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేవారు. అరణ్యములలో దొరికే ఆ వనమూలికలే నేడు ఆయుర్వేద శాస్త్రముగా ప్రఖ్యాతిగాంచి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుచున్నది. ఆ స్థానంలో నేడు అరణ్యాల్లోని జంతువులను ఇష్టము వచ్చినట్లుగా వేటాడి మాంసాహారమునకు అలవాటు పడి తమోగుణములు పెంపొందించుకొని రాక్షసానందమును అనుభవిస్తున్నారు. విచక్షణారహితముగా అడవులను నరికి పర్యావరణమునకు హాని కలిగించి గ్లోబల్ వార్మింగ్ నకు కారకులగుచున్నారు. నేడు విశ్వ మానవ ప్రేమను చూపకుండా కుల, మతకలహాలు సృష్టించి సమాజ విచ్చిన్నతను సృష్టిస్తున్నారు. పంచమ వేదమైన మహాభారతం చదివినా, వినినా కొంతవరకైనా ఇలాంటి దుష్ట సాంప్రదాయములను విడనాడవచ్చు. ఆరోగ్యకరమైన సమాజమును నిర్మింపవచ్చు.

మహాభారత కాలమునాటి పట్టణాల్లోని ప్రభువులు మృగయాసక్తులై అరణ్యాల్లో సంచరించినా, సామాన్యంగా ఆశ్రమాలకు అవరోధమేమీ కలగకుండా చూచుకునేవారు. మృగయాసక్తుడై సేనలతో అరణ్యమునకు పోయిన దుష్యంతునకు పదక్రమ వేదధ్వనులు, అవిచ్ఛిన్న హుయామా అగ్నిహోత్ర స్వాహా శబ్దములు, విద్వత్సభా సంభాషణ ఘోషణంబులు, వేదార్థ మీమాంసక గోష్ఠి వివాద నాదంబులు ఇవన్నీ దూరంనుండే వినబడ్డాయి. వీటిని బట్టి అది ఒక ముని ఆశ్రమని నిశ్చయించాడుడతడు. అరణ్యాల మధ్య మునుల ఆశ్రమాలు అంటే ఇలా ఉండేవన్నమాట. ఆ తపోవన వృక్షముల రామణీయకమును జూచుచు దగ్గరికి పోయేసరికి, అక్కడ చెట్ల మీద చిలుకలు సామగానం చేస్తున్నాయట. ఆ గానాన్ని వినుచు నిలబడిన ఏనుగుల శీతలఛాయలో సింహాలు పడుకున్నాయట. ఎలుకలు, పిల్లులు కలసి సహజ వైరాన్ని మరిచి, ఆ ఆశ్రమవాసులు పెట్టు నీవారన్న పిండాలను తింటున్నయట. ఇదంతా చూసి ఆ కణ్వ మహాముని తపః ప్రభావమే గదా అని ఆశ్చర్యపడి, ఆశ్రమ వాసులకేమీ బాధ కలుగకుండా తన సేనను, అమాత్యులను దూరముగా నిలిపి, తానొక్కడే ఆ మునింద్రునికి నమస్కరించి రాబోయినాడు. ఆ అరణ్యాలలోని కందమూలఫలాదులే ఆ ఆశ్రమవాసులకు ఆహారము. వచ్చిన అతిథులను ఆసనార్ఘ్యపాద్యాది విధులతో పూజించి, ఆ ఫలమూలాదులతోనే తృప్తి పొందించేవారు.

నేటి ఆధునిక సమాజంలో జంతువులను వేటాడుట ఒక విలాసవంతమైన జీవితమని భావించుదురు. ఇష్టము వచ్చినట్లు జంతువులను విచక్షణా రహితముగా వధించుట ఒక క్రీడగా భావించుదురు. ఆనాటి రాజుల స్థానంలో వచ్చిన నేటి మంత్రులు ప్రోటోకాల్ పేరుతో, మందీ మార్బలముతో, వందల వాహనములతో రోడ్లపైకి వచ్చి ప్రజలను ఇబ్బంది పెట్టి మహానందమును పొందుదురు. ప్రజా జీవనమును అస్తవ్యస్తము చేయుచుందురు. ఆనాటి కాకులు దూరని కారడవులను నేడు కరువులకు కారణమైనట్లుగా చేసిరి. కొండలను, గుట్టలను ఆక్రమించుకొని లేఔట్లుగా మార్చి కోట్లాధిపతులైన రాజకీయ నాయకులు ఈనాడు మనకు కోకొల్లలుగా కనిపించుదురు.

వాల్మీకి మహర్షి తన ఆశ్రమము సమీపము నందలి అరణ్యములో విడువబడిన సీతను, తన ఆశ్రమమునకు తీసుకొని వచ్చి శరణం ఇచ్చినట్లే, తల్లిదండ్రులచే విడువబడి, పక్షులచే పెంచబడుతున్న అనాధశిశువగు శకుంతలను తన ఆశ్రమమునకు తెచ్చి తన కుమారికగా పెంచి పెద్దదాన్ని చేసినాడు. దుష్యంతుడు ఆమెను గాంధర్వ విధిని వివాహం చేసుకున్నాడు. ఇట్లీ ఆశ్రమాలు బహుళార్థ సాధకములైన తపోవనాలుగా ఉండేవి. కొన్ని ఆశ్రమాల్లో మహర్షులు లోక కళ్యాణాన్ని సాధించడానికిగాను సత్రయాగాలు జరుపుతూ ఉండేవారు. నైమిశారణ్య పుణ్యక్షేత్రములో శౌనకమహాముని ఒకసారి ద్వాదశ వార్షిక సత్రయాగం చేసినాడుట. అనగా 12 ఏండ్లు అవిచ్ఛిన్నంగా జరిగే యాగమన్నమాట. ఈ శౌనకముని ఒక కులపతి. కులపతి అనగా పదివేల మంది మునుల కన్నవస్త్రములిచ్చి వేదాధ్యయనము చేయించే వారిని కులపతి అంటారు. అంటే అతని ఆశ్రమము ఒక పెద్ద విశ్వవిద్యాలయం వంటిదన్నమాట. ఇంతేగాక అతడు బ్రహ్మర్షి గణ సముపార్శితుడై ఉండి ద్వాదశ వర్ష సత్రయాగాన్ని మొదలుపెట్టినాడు. ఆ యాగము జరుగుతూ ఉంటే అక్కడ చేరిన మునులకందరికి సూతుని వంటి పౌరాణికులు వచ్చి అనేక పుణ్య కధలను వినిపిస్తూ ఉండేవారు.

ఈ భారత కథ కూడా ఆ సత్రయాగము జరుగుతూ ఉంటే, పుణ్య కథాకథన దక్షుడైన రోమహర్షిణి చేత అలా చెప్పబడినదే. భారత కథానాయకులకు పాండవులు 12 ఏళ్లు అరణ్యవాసము చేయవలసి వచ్చినప్పుడు, ఆయా అరణ్యాలలో ఉండే తపోవనాలు, అందలి మహర్షులతోడి సాంగత్యము, వారు చేసిన బోధనలు, వారి వలన విన్న పుణ్య కథలు, వారికి చిత్తశాంతికి, కార్యసాధనకు చాలా ఉపకరించినవి. కొన్నాళ్లు ద్వైత వనంలో ఉన్నారు. అది సకల కాల కుసుమ ఫలభరితము. మయూర కోకిలాలప మధురము. విమల శీతలజల ప్రవాహ నదీశోభితము. మహర్షి గణ సేవితమై యుండినది. పిదప కామ్యకవనమున మునులచే నభినందితుడై ధర్మరాజు ఉండగా కృష్ణుడు సత్యభామాదులతో గూడి చూడవచ్చాడు. నారదుడు, మార్కండేయుడు వచ్చి అనేక పుణ్య కథలు చెప్పి వారికి దుఃఖోపశమనం చేసినారు. తార్క్యుడనే మహా మునీంద్రుని ఆశ్రమం ఒకటి ఉన్నది. ఆ ముని యొక్క ఆ ఆశ్రమం యొక్క ప్రభావం ఎట్టిదో చూడండి – అతడంటాడు "వినుమెన్నడు మా యాశ్రమమున నెవ్వారలకు లేవు భూరిభయ వ్యాధి నిరోధ మృత్యు దోసాధ్యనేక దోషములు శ్రీ జగదాశ్చర్యముగాన్".

ఇది నిజంగా ఆశ్చర్యకరమైన విషయం. కారణమేమంటే ఇది అస్మదీయ ప్రభావ మూలంబన్నాడు ఆ ఋషి. హైహయుడను రాజు అచ్చటి బ్రాహ్మణ బాలుని మృగం అనుకుని కొట్టినాడు. కొట్టి పశ్చాత్తాపుడై ఆ ఋషి యొద్దకు వచ్చి పాప పరిహారమును వేడినాడు. కానీ ఆ బాలుడు చావనే లేదట. కారణం ఆ ఆశ్రమంలోని ధర్మ జీవన ప్రభావమేనంటాడు. ఆ జీవనమెట్టి దయ్యా అంటే – "ఆలస్యం బొక యింత లేదు శుచి యాహారంబు, నిత్య క్రియాజాలం బేమర, మర్చనీయుల తిథుల్ సత్యంబ పల్కం బడున్ మేలై శాంతియు బ్రహ్మచర్యమును నెమ్మిందాలు మట్లౌటంనె క్కాలంబున్ బటు మృత్యురోగ భయ శంకం బొందమే మిమ్ములన్" అన్నాడు.

నేటి ఆధునిక సమాజంలో చాలామంది బాబాలు, సిద్ధులు, దేరాలు ఏర్పడి దొంగ బాబాలుగా, దొంగ దేరాలుగా మారి ప్రజలను వంచించి సమాజమును అస్తవ్యస్తం చేయుచున్నారు. వందలు వేల ఎకరాల భూములను ఆశ్రమాలుగా ఏర్పరిచి అందులో అసాంఘిక కార్యకలాపాలకు చోటిచ్చి రాజకీయ నాయకుల దన్నుతో చలామణి అవుతున్నారు. అభం శు భం తెలియని చిన్న పిల్లలను సైతం వారి లైంగిక కోరికలకు బలి చేయుచున్నారు. ఈనాడు చాలామంది రాజకీయ నాయకులు యజ్ఞములు, యాగములు పేరుట ప్రజాధనాన్ని దుర్వినియోగపరిచి వారి స్వలాభానికి వాడుకుంటున్నారు. నీతి నిజాయితీతో గాని ప్రజా సంక్షేమం కోరి ఇలాంటి పనులు చేయడం లేదు. రాజకీయ నాయకులు పెంచి పోషిస్తున్న ఈ దొంగ బాబాల ఆశ్రమాలలో చదువుల పట్ల గాని, విద్యలపట్ల గాని, యజ్ఞ యాగాదుల పట్ల గాని, యోగాసనంల విషయంలో గాని ఎటువంటి శిక్షణ ఇవ్వకుండా వారి రాజకీయ కార్య స్థానాలుగా వాడుకుంటున్నారు. రాజకీయ నాయకులకు బినామీలుగా ఈ బాబాల స్థావరాలు ఉంటున్నాయి. నేటి ఈ బాబాల ఆశ్రమంలో హత్యాయత్నాలు, మానభంగాలు జరిపి, నిజాయితీపరులపై నెపం మోపి, అసలు వారు తప్పించుకొని తిరుగుతున్నారు. నేటి యువతీ యువకులు అవగాహన లోపంతో ప్రేమ పేరు చెప్పుకొని అగాధములో కూరుపోతున్నారు. ఎందరో పసి మొగ్గలు ప్రేమ విషయం తెలియక మాయదారి వేషాలకు లొంగి తమ జీవితాలను దుర్భరం చేసుకుని తల్లిదండ్రులకు తీరని వేదనను కలిగిస్తున్నారు. ఎందరో "నిర్భయ" లాంటి నారీ రత్నములు కామందుల దాహానికి బలైపోతున్నారు. నేటి సమాజంలో సరైన విలువలు పాటించని యువత పెడదోవ పడుతున్నారు. చతుర్విధ పురుషార్థములలో కామమే యువతను ప్రభావితం చేస్తుంది. తమ మాటలకు చేతలకు లొంగని యువతులపై పాశవికంగా మానభంగం చేసి, యాసిడ్ దాడులను చేసి తీవ్రమైన వేదనను కలిగిస్తున్నారు.

మహాభారత కాలము నాటి ఆశ్రమాలు అనేక విద్యలు, మహిమలు, శక్తులు కలిగిన అనేక తాపసలకు ఋషులకే గాక వాన ప్రస్థాశ్రమం అవలంబింప తలచిన రాజర్షులకు కూడా ఆవాస స్థానములయ్యేవి. చిరకాలము ధర్మ పరిపాలనము చేసి వృద్ధులైన రాజులు రాజ్యము కుమారుల కప్పగించి, మోక్షకాంక్షకలిగి తుదికాలమును తపోనుష్టానముతో గడుపుటకు ఈ ఆశ్రమాలను చేరేవారు.

యయాతి ప్రకృతి జనంబుల నొడబరచి కుమారుడగు పూరునకు రాజ్యమిచ్చి తపోవనంపున కరిగి నియతాత్ముండై అనేక వర్షంబులు తపంబు సలిపి, దేవలోకంబునకు, బ్రహ్మలోకంబునకు వెళ్ళినాడట. అట్లే దుష్యంతుడు చాలాకాలం రాజ్యసుఖంబు లనుభవించి రాజ్యంబు భరతునకిచ్చి తపోవనంబున కరిగినాడు. భారత యుద్ధానంతరము ధర్మరాజు రాజయి రాజ్యము చేయుచుండగా, ధృతరాష్ట్రుడు ధర్మజుని యొక్క, పౌర జానపదుల యొక్క అనుమతిని బడసి, గాంధారియుతుడై, కుంతీవిదుర సంజయులు కూడా తోడురాగా హస్తినాపురం వీడి, గంగానది దాటి ఒక పుణ్య ఆశ్రమమున ఉండగా, అచ్చట తపస్సు చేయుచున్న శతాయుపుడను రాజర్షి వీరిని తన ఆశ్రమమునకు తోడుకొని పోయి ఆతిధ్యమిచ్చి తన ఆశ్రమ సమీపమున పర్ణశాలలు వేయించి వారినందు నివసింప గోరెను. అది చాలా పుణ్య ప్రదేశమని, ఆ ఆశ్రమంలో శతయూపుని తండ్రి తాతలు తపస్సు సలిపి ఇంద్రలోకమును పొందినారని, ధృతరాష్ట్రదులు ఉత్తమ గతి పొందుదురని నారదుడు వచ్చి చెప్పినాడు. పిదప కొంత కాలంబునకు తమను చూడవచ్చిన ధర్మజాదులకు ధృతరాష్ట్రుడు తాను ఉపయోగించు

వన్యఫలమూలాదులనే ఆహారముగా పెట్టగా వారు వానినె గ్రహించి భూమిపైనే నిద్రించి అట్లు కొంతకాలముండి వీరతి కష్టముతో హస్తినాపురంనకు బోయిన పిదప ధృతరాష్ట్రాదులు వాయుభక్షణ, జలభక్షణాది తీవ్ర వ్రతములు ఆచరించుచు, తుదకు కరణ్యమార్గముల సంచరించుచు, కార్చిచ్చు తమ్ము చుట్టుకొనగా యోగ మార్గమున తనువుల వీడి సద్గతిని పొందిరి. అరణ్యములలోని ఆశ్రమములు ఈ విధముగా భారతీయ మహర్షుల జీవితములకు సంస్కృతికి పట్టుకొమ్మలైనవి.

నేటి ఆధునిక సమాజంలో పాశ్చాత్యుల మోజులోపడి, నాగరికులమని చెప్పుకొని తల్లిదండ్రులను దూరముగా ఉంచి వారిని అనాధాశ్రమాలలో చేర్పించి, అనాధలుగా చేసి రాక్షసానందమును పొందే కుమారులు ఎక్కువైపోయారు. నేటి కుమారులు సంపద యాతనలో పడి, భార్యాభర్తలు ఉద్యోగముల వేటలో మునిగిపోయి, తల్లిదండ్రులను పిల్లలను దూరం చేసుకొని కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నతకు కారకులగుచున్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా మన ఇతిహాసములైన భారత, భాగవత, రామాయణాలను చదివి ఆకలింపు చేసుకుని వారి మనసులో మార్పు చెందాలని ఆశిద్దాం.

సాంఘిక జీవితము: వెనుకటి కాలంలో కంటే ఈ కాలంలో రోజులు త్వరగా మారిపోతున్నట్లున్నాయి. ఈ విషయం చిన్నవాళ్ళగు విద్యార్థులు అంతగా గుర్తింప లేకపోవచ్చుగాని, పెద్దవాళ్లంతా బాగా గుర్తిస్తారు. రోజులు మారినాయనేది సినిమాలో కూడా ప్రసిద్ధికెక్కింది. వెనుకటి కాలంలో మార్పు ఇంత త్వరగా జరుగుతున్నట్లుగా కనబడేది కాదు. మార్పులకు కారణమేమిటి అంటే “సర్వాధారః కాలః” అని, అన్ని మార్పులకు కారణము కాలమేనని పెద్దలంటారు. కాని కాలాన్ని బట్టి కలిగే ఈ మార్పులకు కూడా రాజే కారణమని “రాజా కాలస్య కారణం” అని చెప్పేవారు కూడా కొందరు లేకపోలేదు. ఏమైనా మహాభారత కథాకాలం నాటి అనగా పాండవ దుర్యోధనాధుల కాలమునాటి సాంఘిక జీవితానికి, ఈనాటి సాంఘిక జీవితానికి చాలా తేడాలు మాత్రం కనబడతాయి.

మార్పులనేకం ఇటీవలి కాలమున పెరుగుతూ వచ్చినవే కాని, ఆంధ్ర భారత రచనా కాలము నాటికి అనగా చాళుక్య ప్రభువగు రాజరాజ నరేంద్రుని కాలము నాటికి కూడా అంతగా పెరగలేదని, సంఘస్థితి ప్రాచీన ఆదర్శాలు వెనుకటివే అప్పటికింకా నిలిచి ఉన్నాయని, రాజరాజనేంద్రుని గూర్చి నన్నయ చెప్పిన మాటలే నిదర్శనం అవుతాయి. రాజరాజనరేంద్రుడు ఎట్టి వాడో చూడండి. త్రిమూర్తులను పూజించి తత్ప్రసాదముచే మహీరాజ్య విభవమును పొందినవాడు. దాన గుణాభిరతి గలవాడు. సమస్త వర్ణాశ్రమ ధర్మ రక్షణ మహామహిమన్ మహినొప్పు సర్వలోకాశ్రయుడు. ఆదిరాజ విభూడు. మనుమార్గ వర్తనుడు. విప్రకులము నెల్ల బ్రోచుచు దేవభోగముల దనరజేయువాడు. ఇట్లు దైవ బ్రాహ్మణ భక్తి, వర్ణాశ్రమ ధర్మ రక్షణము, దాన గుణాభివృద్ధి మొదలగునవి భారతదేశంలో మునుమార్గ వర్తనులగు నాదిరాజుల చరిత్రకు సంబంధించిన లక్షణాలు. యయాతి వర్ణధర్మములు గాచుచు వసుధ నెల్ల ననఘచరితుడై యేలినాడు. దుష్యంతుడు ఉర్వీతలము ప్రజాసమృద్ధి వెలసి ధర్మ చరిత వెలగచు నుండన్ ఆదిక్షత్ర చరిత్ర నేలినాడు. పరీక్షిత్తు- అతని కొడుకు జనమేజయుడు ధరణియెల్లా రక్షించిన ధర్మచరితులు. రాజర్షులై ప్రజల ధర్మ చరితను గాపాడుచు పాలించుటయే ఆ కాలపు ఆదిక్షత్ర చరిత్ర. ఇవి కేవలం కులబ్రహ్మణుల స్తోత్ర పాఠాలేమో అని ఇప్పుడు అందరికీ తోచవచ్చును గాని, చాలా కాలం వరకు ధర్మరక్షణమే క్షత్రియ ధర్మముగా పరిగణింపబడినదనుటకు సందేహము లేదు.

ఈ వర్ణాశ్రమ ధర్మములు పూర్వజన్మ సంస్కార ఫలములే యని సామాన్య జనులలో కూడా గట్టి నమ్మకం ఉండుట చేత, వర్ణాశ్రమ ధర్మతత్వము హైందవ సంస్కృతికి మూలాధారము వంటిదైనది. పాశ్చాత్య సంసర్గ ప్రభావము కూడా దీనిని కూల ద్రోయలేకపోయినది. ఆధునిక నాగరికత ప్రభావము, ప్రపంచ పరిస్థితులను బట్టి ఇది రూపుమాసిపోవచ్చును. కాని గుణకర్మ విభాగము వలన కలుగు భేదం ఎల్లప్పుడూ ఉండునదే. ఎట్టి సామ్యవాదమైనా దీనిని త్రోసిపుచ్చ జాలదు. సంస్కార భేదము వలన కలిగిన ఈ వర్ణాశ్రమ వ్యవస్థ సంకరము కాకుండా ధర్మ మార్గమున ప్రజలను నడుపుతూ పాలించుటయే ఈ కాలపు రాజకీయ నాయకులు తమ ధర్మముగా గ్రహించి వారు సామాన్య ప్రజలను తమ ధర్మములను నిర్వర్తించుచు

తమ వృత్తులను నడుపుచుండవలెను. ఈ దేశ ప్రజలకు జన్మాంతరములందు, లోకాంతరమునందుగల ఈ నమ్మకమును బట్టియే, దైవాంశ సంభూతులు కొందరు అప్పుడప్పుడు లోక కార్యములను నడుపుట కవతరింతురను నమ్మకము కూడా ఉండెడిది. భీష్మాది భారత వీరులందరూ దేవదానవుల అంశమున పుట్టినవారు. కలి దానవుల అంశమున దుర్యోధనాదులు, యమేంద్రాదుల యంశమున ధర్మరాజాదులు పుట్టిరి. కావుననే వీరికి పోరు తప్పలేదు. కొందరి జన్మలు విచిత్రమైనవి. ఈ కాలమునకు వికృతములే. ద్రోణుడు కుంభంనందు పుట్టినాడు. ద్రౌపది, దృష్టద్యుమ్నుడు అగ్నికుండమున పుట్టిరి. భీష్ముడు గంగకు పుట్టెను. వ్యాసుడు ఓడ నడుపు పల్లెదానికి పుట్టినాడు. అంతేగాక సంతానము లేని వంశములను నిలబెట్టుటకు నియోగమును పద్ధతి ఒకటి ఉండేది. మునులు క్షత్రియ స్త్రీలకు సంతానము కలిగించెడివారు. ఆ విధముగా వేదవ్యాసుని గడ్డము జడలు చూచి కన్నులు మూసుకున్న స్త్రీకి ధృతరాష్ట్రుడు గుడ్డివాడుగా జన్మించినాడు. మరియొకమారు వెలవెలబోవుటచే తెల్లని రంగుగల పాండురాజు ఉదయించినాడు. రాక్షస స్త్రీకి భీముని వలన ఘటోత్కచుడనే రాక్షసుడే కలిగినాడు. నేడు వీటి స్థానములో అద్దెగర్భములు, టెస్ట్ ట్యూబ్ బేబీలు అవతరించినవి.

క్షత్రియుల అనేక కన్యలను వివాహమాడుట కలదు గాని, ఒక స్త్రీకి అనేకులు పతులగుట హైందవ సంప్రదాయముగా కనిపించదు. భిన్నదేశీ యమో, జాతీయమో కావచ్చు. కాబట్టే తండ్రి ద్రుపదుడు కూడా దీనిని శంకించడం, మహర్షులు వచ్చి జన్మాంతర కథలతో దీనిని సమర్థింపవలసి రావడం తటస్థించింది. క్షత్రియల స్త్రీలకు స్వయంవరం అని ఉండేది. అనగా తండ్రి చేసిన ప్రకటనను బట్టి అచ్చట కూడిన రాజలోకము నుండి తాను కోరిన వరుని వరించి వివాహమాడుట. ఈ సందర్భంలో హతాశులైనవారు యుద్ధమునకు దిగుటో లేదా మరొక విధముగా సాధించుటో కూడా కలదు. ద్రౌపది స్వయంవరంలో కర్ణ దుర్యోధనాధులు యుద్ధమునకే దిగినారు. దమయంతి స్వయంవరం సందర్భంలో కలిపురుషుడు దంపతులకు వియోగము కల్పించి చాలా బాధలకు లోను చేసినాడు. గాంధర్వము, రాక్షసములనే వివాహ రీతులు కూడా క్షత్రియులలో ఉండేవి. శకుంతలను దుష్యంతుడు గాంధర్వ రీతిలో పెండ్లాడెను.

కృష్ణుడు రుక్మిణిని రాక్షసవిధి నెత్తుకుపోయి పెండ్లి చేసుకున్నాడు. సామాన్యంగా కన్యలు తాము వరించినవారినైనా తల్లిదండ్రుల అంగీకారంతో గాని భర్తలను వరించేవారు కాదు. సుభద్ర అర్జునుని వరించినా, అతడు గాంధర్వ రాక్షసముల క్షత్రియుల కుత్తమ వివాహములని చెప్పినా – "నన్ను నీ నర్వులెల్ల నిందున్నవారు వార యెరిగి చేయుదురు అన్నది గాని" అతని మాటలకు ఇష్టపడలేదు. హిందూధర్మంలో అగ్నిసాక్షిగా జరిగిన వివాహవిధి చాలా ముఖ్యమైనది. ద్రౌపది వివాహమును భూ సురేంద్ర పుణ్యాహ రవ– వివిధ తూర్యవీణారవములతోనూ, మంత్రాహుతుల వ్రేల్చుటతోను– పాణిగ్రహణంతోనూ సరిపెట్టగా, తిక్కన ఉత్తర వివాహమును క్రతువు నడపడం, వధూవరుల మధ్య తలంబ్రాలు పూసుకోవడం, తెరయెత్తడం, పాండవాదులకు కట్టనిచ్చి, అల్లున కరణమివ్వడం మొదలైన వాటిని వర్ణించినాడు. వీనిలో కొన్ని ఆంధ్రదేశీయాచారాలుగా కనబడతాయి. నేడు మన తెలుగు రాష్ట్రాలలో ఆనాటి మహాభారత కాలం నాటి వివాహ పద్ధతులు, వివాహము జరుగు తీరుతెన్నులులు కనిపించును.

మహాభారత కాలమునాటి స్త్రీకి సంఘంలో ప్రభలమైన స్థానమే ఉండేది. తమ పాతివ్రత్యం చేత వారు ఆస్థానానికి మరింత శోభ కల్పించుకున్నారు. తన భార్య ఎక్కడో పౌష్య మహారాజు ధరించే కుండలాలు కావాలని కోరిందని, ఉదంకుని గురువామె కోరిక తీర్చడమే గురుదక్షిణగా అతనికి నియమించాడు. ఉదంకుడు సమయం తప్పకుండా ఎన్ని కష్టాలైనా పడి తీసుకొనివచ్చి ఆమెకు ఇచ్చి గురువుగారి ఋణం తీర్చుకున్నాడు. ద్రౌపది కౌరవ సభలో వేసిన ప్రశ్నలు, అరణ్యవాసంలో పాండవుల స్థితి చూసి దుఃఖముతో ధర్మరాజుని యుద్ధమునకు ప్రేరేపించు వాక్యములు, సంధి రాయబారమునకు పోవుచున్న కృష్ణునితో ఆమె ఆడిన తీవ్రమైన మాటలు, కీచకవధకై భీముని ప్రేరేపించిన విధము, పుత్రఘాతియగు అశ్వద్ధామను విడిచిపుచ్చిన హృదయరీతి, రాయబారమునకు వచ్చి తనను చూడవచ్చిన కృష్ణునితో కుంతి తన కొడుకులను గూర్చి చెప్పిన

యుద్ధప్రేరేకములైన మాటలు– మొదలగునవి ఆ కాలములో స్త్రీలకార్య దక్షతను కొంతవరకు సూచింపగలవు. గాంధారి మహాపతివ్రత. తనను ధృతరాష్ట్రునకు ఇవ్వదలచాడు తండ్రి అని విన్నంతనే తాను కూడా కన్నులకు అడ్డం కొట్టుకొనినదట. పతివ్రతయగు భృగుపత్ని నెత్తుకుపోయిన రాక్షసుడు, గర్భచ్యుతుడగు చ్యవనుని చూసినంతనే భస్మమైపోయాడు. దమయంతి తన పాతివ్రత్య మహిమచేతనే అరణ్యమున తన వెంటదగిలిన కిరాతుని భస్మం చేసినది. సావిత్రి భర్తజీవములను గొనిపోవుచున్న యముని వెంట దగిలి తన భర్తను మృత్యువు నుండి కాపాడినది. ఒకసారి ద్రౌపదిని చూడవచ్చి సత్యభామ అడిగిందామెను – నీ కైదుగురు భర్తలు గదా! వారందరు నీయందు అనురక్తులై ఉండేటట్లు ఎలా ఉంటున్నావో, వ్రతము పెంపా, మంత్రౌషధ వైభవమా, నేపథ్య కర్మ కౌశలమా– ఏమిటి కారణం అంటే– నన్నిట్టి దుష్టవనితగా జనునే తెలపన్– నీవాపురుషోత్తమ వనితవు కాదగవు– అని మందలించి– "వారి ఇచ్చవచ్చినట్లు మెలంగుటయేగాని మగువ నీవు సెప్పు నింద్రజాలములును నేనెరుంగ" అని చెప్పగా సిగ్గుపడి, "ఎరుగక అట్లడిగినాను, నా నేరమునైపవలయు నగవుగ గనుమీ" అని సర్దుకున్నది. ఆ కాలపు స్త్రీల విద్యలో నృత్యం ఒకటి ప్రధానం. విరటుడు ఉత్తరను నాట్యాచార్యుడగు బృహన్నలకు "కర్పూర తాంబూలంబునెట్టి చీనాంబరములు" ఆభరణములు ఇచ్చి ఒప్పించినాడు. అనేక సందర్భాలలో ఈ తాంబూలమొక ప్రధాన సాంఘిక ఆచారముగా కనబడుతుంది. పాండవుల వద్ద నుండి సంధి మాటలకు వచ్చిన బ్రాహ్మణునకు ధృతరాష్ట్రుడు భూషణాంబరములతో తాంబూలంబులు పెట్టి వీడ్కోలుపలికిను. తుదకు దుర్యోధనుని వద్దనుండి వచ్చి పరుషంబులు పలికిన ఉలూకునకు కూడా ధర్మనందనుడు తాంబూలాభరణంబులిచ్చి పంపినాడు.

ఈనాటి సాంఘిక జీవితమునకు మహాభారత కాలం నాటి సాంఘిక జీవన విధానం ఒక ఆదర్శము. ఆనాటి పాతివ్రత్య మహిత్యము గల స్త్రీలు నేటి యువతకు ఆదర్శం. పాశ్చాత్యుల వ్యామోహంలో పడి, విదేశీ మోజులోపడి వికృత వస్త్రధారణలతో, వింత అనుభవాలతో, తాగుతూ తూలుతూ పెడదోవ పట్టుతున్న ఈనాటి యువతకు మహాభారతంలోని ఇలాంటి వ్యక్తులజీవితాలు ఆదర్శం.

ఆనాటి సమాజంలో రాజులు ధర్మాన్ని కాపాడుటయేకాక ప్రజలకు ఎట్టి కష్టములు కలుగకుండా చూచేవారు. యుద్ధానికి వెళ్ళేటప్పుడు, ఋష్యాశ్రమములకు నలజడి కాకుండా పరిహారంబు చేయుచు వెళ్లేవారు. వర్ణ ధర్మములను కాపాడినట్టే ఆశ్రమ ధర్మములను కూడా కాపాడుతుండేవారు. విద్యార్జన కాలమున బ్రహ్మచర్యము వలెనే వార్ధక్యమున రాజ్యమును కొడుకుల కప్పగించి వానప్రస్తాశ్రమమును స్వీకరించేవారు. పురుషులే కాక స్త్రీలను వానప్రస్తాశ్రమమును సేకరించేవారు. రాజులలో ద్యూతక్రీడ, మద్యపానం ప్రబలముగా ఉండెను. ధర్మరాజు ద్యూతక్రీడాసక్తి ఆధారం చేసుకొనియే శకుని అధర్మ ద్యూతము మూలముగా అతని వంచింపదలచుట వలననే భారత యుద్ధమునకు దారితీయుట తటస్తించినది. నలుడు– విరటుడు కూడా ద్యూతక్రీడాసక్తి వలన దెబ్బతిన్న వారే. కీచకునింట వాచవియగు మదిరాసవ యుండెడిదట. మదిరాపానమత్తులయ్యే యాదవులు తమలో తాము పోరు సలుపుకుని నాశనమొందిరి. పెక్కు జన్మములందలి పుణ్యము వలన సంపాదించిన జ్ఞానమును కూడా ఈ మధ్య సేవ క్షణమాత్రంలో చెరుచును అనే విషయమును స్వానుభవంవలన తెలుసుకున్నాడు గనుకనే రాక్షసుల గురువైన శుక్రుడు "సురాపానము మహాపాతకముగా" శపించినాడు. స్త్రీలు పరలోక గతులైన భర్తలతో సహగమనము చేయుట కూడా ఆ కాలమున గలదని పాండురాజుతో మాద్రి సహగమనము చేయుటను బట్టి తెలియ వచ్చుచున్నది.

నేటి మన సమాజంలో రాజకీయ నాయకులకు పదవీ విరమణ లేదు. ఎంత వృద్ధాప్యంతో బాధపడుతున్నప్పటికీ పదవీ వ్యామోహం తగ్గదు. తరతరాలుగా సరిపోయే ఆస్తులను కూడబెట్టి వంశపారంపర్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. మత్తుమందు వ్యాపారమునకు, నల్లమందు, గంజాయి వ్యాపారం ప్రోత్సహించి యువతను పెడదారి పట్టుటకు కారణం అవుతున్నారు. హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. మహిళల పట్ల మానవ మృగాలుగా తయారవుచున్నారు. నేటి

యువత రాజకీయ నాయకులు ఆడే వింత నాటకంలో, ఓటుబ్యాంకు రాజకీయాలలో పడి సమిధలుగా మారిపోతున్నారు. ఇలాంటి అన్ని రకాల సమస్యలకు మహాభారతం పరిష్కారం చూపెడుతుంది. మహాభారతంలో రాక్షస స్వభావము కలిగిన వ్యక్తులు, చెడు అలవాట్లు కలిగిన వారు ఎలా నాశనము పొందిరో తెలియుచున్నది. అలాగే ధర్మ స్వభావము కలిగిన వారు ఏనాటికైనా విజయం సాధిస్తారని ధర్మో రక్షతి రక్షితః (ధర్మాన్ని మనము రక్షిస్తే ఆ ధర్మమే మనలను ఏనాటికైనా రక్షిస్తుందని మన ఇతిహాసముల ద్వారా తెలియుచున్నది) అనే సూక్తిని నేటి యువత ఆకలింపు చేసుకుని ఉత్తమ మార్గంలో జీవించగలరని మహాభారతం మనకు తెలియజేయుచున్నది.

ఇట్లు ప్రధానంగా భారత, వేద కాలమున సాంఘిక జీవనమున ధర్మ మార్గ ప్రవర్తనమునకు ప్రాధాన్యము కలగని వ్యక్తమగుచున్నది. మహాభారతంలోని సూక్ష్మాంశములను నేటి యువతీ యువకులు ఆకలింపు చేసుకుని సన్మార్గంలో ప్రయాణం చేస్తారని ఈ వ్యాస రచయిత ముఖ్య ఉద్దేశం.

**ఆధారగ్రంథాలు**

1. ఉషశ్రీ – భారతం(2005) తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతం(2005) – తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణ, తిరుపతి.
3. ఉషశ్రీ – భారతంలో నీతి కథలు(2005) తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ, తిరుపతి.
4. ప్రొఫెసర్ రఘునాథాచార్య ఎస్.బి.(2005) మన సమస్యలకు భగవద్గీత పరిష్కారాలు, తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణ, తిరుపతి.
5. ప్రభాకర శాస్త్రి వేటూరి – వ్యాస ప్రభాకరము(1990), ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్.
6. శ్రీ రామకృష్ణయ్య కోరాడ, సాహితీ నీరాజనం(1990) – శ్రీ కోరాడ రామకృష్ణయ్య శత జయంతి ప్రత్యేక సంచిక, కళాజ్యోతి ప్రెస్, హైదరాబాద్.
7. తెలుగులో కవిత్వోద్యమాలు – భక్తి కవిత్వం (2003) తెలుగు అకాడమీ, హైదరాబాద్.
8. మహతి (సమీక్ష వ్యాస సంకలనం)– (1972), యువభారతి, సికింద్రాబాద్.
9. కుటుంబరావు కొడవగంటి (1967) – సాహిత్య ప్రయోజనం, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 21. మహాభారత ఉపాఖ్యానములు - మానవ స్వభావ చిత్రణ

- డా॥ లింగాల మంగమ్మ, బేగంపేట, హైద్రాబాద్.

**ఉపాఖ్యానము పరిచయం**

ఆఖ్యానం అనగా స్వయముగ చూచిన దానిని చెప్పుటనీ, ఉపాఖ్యానం అనగా ఇతరుల వలన విన్నదానిని చెప్పుట యని విజ్ఞులు నిర్వచించినారు.

**'స్వయం దృష్టార్థ కథనం ప్రాహురాఖ్యానకం బుధాః'**
**కావ్యాలంకార సంగ్రహము (సన్నిధానము వారి వ్యాఖ్య) పుట. 264**
**'శ్రుత స్వార్ధస్య కథన ముపాఖ్యానం ప్రచక్షతే'**
**కావ్యాలంకార సంగ్రహము (సన్నిధానము వారి వ్యాఖ్య), పు.264**

ఆర్షవిజ్ఞాన సర్వస్వమున -

**'ఆఖ్యానైశ్చా ప్యుపాఖ్యానై ర్గాథాభిః కల్పశుద్ధిభిః**
**పురాణ సంహితాం చక్రే భగవాన్బాదరాయణః'**
**ఆర్ష విజ్ఞాన సర్వస్వము - ప్రథమ భాగము. పుట. 174.**

అనే శ్లోకము ఉదాహరింపబడింది. 'ఆఖ్యానము లనగా తమ కన్నులముందే కనిపించు వృత్తి గలిగినవీ, ఉపాఖ్యానము లనగా పరోక్షమందు చిరకాలమున జరిగిన వృత్తములనీ, గాథలనగా పారంపర్యముగ వినబడి కర్త తెలియకుండు వృత్తములనీ, కల్పశుద్ధులనగా ఐతిహాసిక సంబంధు'అనీ చెప్పబడింది.

ఉపాఖ్యానము ప్రధాన కథకు పరిపోషముగ చెప్పబడు ఉపకథ. ప్రధాన కథలో ఆయా సందర్భాలలో అవసరమైన ధర్మ విశేషాలను చెప్పుటకు, పాత్ర శీలస్వభావాదులను వివరించి వ్యాఖ్యానించుటకు సామాన్యముగ ఈ ఉపాఖ్యానములు చెప్పబడతాయి.

ఉపాఖ్యానమునకు కథాకథనమున ఒక సహజస్థానం ఉంది. కథను చెప్పేటపుడు అక్కడక్కడ సూత్రరూపమున ఉన్న ధర్మతత్త్వం, మనోధర్మతత్త్వం శ్రోతలకు స్పష్టముగ అర్థముగాని స్థితియేర్పడుతుంది. ఒకవేళ అర్థమైననూ వారి హృదయమున హత్తుకొని నిలువలేకపోవడం. సూత్రరూపమున చెప్పిన ధర్మమును లేదా మనోధర్మమును వివరించి చెప్పడం. శ్రోతల హృదయాన్ని హత్తుకొనేటట్లు చేయడాకి ఉదాహరణ ప్రాయముగ ఒక ఉపాఖ్యానమును చెప్పడం అవసరమవుతుంది. సిద్ధాంత గ్రంథములలో ఉదాహరణములకు ఎలాంటి స్దానమున్నదో మహా కావ్యంలోని ఉపాఖ్యానములకు అట్టి స్థానమున్నది.

ఉపాఖ్యానము సంక్షిప్తముగా, ప్రధానకథకు అధీనమై నడవాలి. పాఠకుని దృష్టిని ప్రధాన కథ నుండి మరలించేంత దీర్ఘంగా ఉపాఖ్యానము ఉండరాదు. అందుచేత వ్యక్తి జీవితానికి సంబంధించిన ఏ ఒకటి రెండంశములో ఉపాఖ్యానములో ఉండాలి. ఒకవేళ వ్యక్తి జీవితమునంతా చెప్పి, ఒక ధర్మానికో, మనోధర్మానికో అన్వయింపవలసిన అవసర మేర్పడిననూ, అది ఎంతో సంక్షిప్తముగా ఉండాలి. ఎట్టి పరిస్థితులలో గూడ ఉపాఖ్యానము ప్రధానకథకంటే విస్తృతిని పొందకూడదు. అలా జరిగితే కావ్యమున వస్త్వైక్యము దెబ్బతింటుంది.

సంక్షిప్తతోపాటు స్పష్టతగూడ ఉపాఖ్యానమునకు ఉండవలసిన మరో ముఖ్య గుణము. ఉపాఖ్యానమున చెప్పే విషయము సూటిగా పాఠకుని హృదయాన్ని తాకాలి. అన్వయ కాఠిన్యము, అస్పష్టత ఉపాఖ్యాన ప్రయోజనమునకే భంగం

కలుగుతుంది. అంతేగాక సందర్భశుద్ధి గూడ ఉపాఖ్యానమునకు ఉండవలసిన ముఖ్య గుణమే. సూత్రరూపమున చెప్పిన ధర్మమునకు లేదా మనోధర్మమునకు తలలూపని శ్రోతలు ఉపాఖ్యానాన్ని విన్నంతనే 'ఔ నౌ'నని తలలూపాలి. సందర్భశుద్ధి లేనిదే అది సాధ్యపడదు.

మహాభారతము పెక్కుపాఖ్యానములకు పుట్టినిల్లు. ఆదిపర్వమున, శాంతిపర్వం, అనుశాసనిక పర్వంన ఉపాఖ్యానాలు ఎక్కువగా ఉన్నాయి. అవి ద్రష్టలైన మహర్షులచేత, విజ్ఞానము, విశేష లోకానుభవముగల భీష్ముని వంటి పరిణతవ్యక్తుల చేత చెప్పబడ్డాయి. ఇవి వివిధ ధర్మసూక్ష్మాలను, అగాధ మనోధర్మాలను వివరించుచున్నాయి. వంశక్రమాలను, పౌరాణికాంశాలను, చారిత్రక విషయాలను, ఆచార విశేషాలను తెలుపు ఉపాఖ్యానాలను వదలివేస్తే – మిగిలిన ఉపాఖ్యానాలు చాలావరకు ధర్మం, మనోధర్మం తటద్వయంగా కలిగి ప్రవహించు ఉపనదులే. ఈ ఉపనదులలో బహుముఖాలుగా సాగిపోవు కొన్ని ఉపాఖ్యానములలోని మానవ స్వభావాన్ని మనం దర్శించడం ప్రస్తుతాంశము.

**ఉదంకోపాఖ్యానము**

జీవితంలో అపకారికి ఉపకారము చేయడం మహోదారగుణము. కాని మానవులలో పెక్కుమందికి ఈ గుణం ఉండదు. అపకారానికి ప్రత్యుపకారము చేయడం సామాన్య మానవ స్వభావము. ఈ ప్రత్యుపకారము చేయగలశక్తి తనకు లేపుడు మానవుడు తన పక్కవానిని ప్రత్యర్థిపైకి ఉసుగొల్పుతాడు. అతనికి గూడ ఎప్పుడైనా తన ప్రత్యర్థి వలన అపకారము జరిగివుంటే – అతని పని ఇంక చాలా సులభమవుతుంది. ఉభయులకు ప్రత్యర్థి వలన కలిగిన అపకారాలను ప్రస్తావించి, అతనిని ఇద్దరికీ విరోధిగా చిత్రిస్తాడు. హతమార్చే ఉపాయాన్ని గూడా సూచిస్తాడు. పక్కవానిని రెచ్చగొట్టి ఈ ప్రయత్నంలో పొగడ్తను మందుగా వాడతారు. పక్కవాని వెనుక జేరి ప్రత్యర్థిని హింసిస్తారు. తన గాయాన్ని మార్చుకొని తృప్తిపొందుతారు.

ఉదంకోపాఖ్యానమున పై స్వభావము వ్యక్తమవుతుంది. తనచేతి కుండలాలను అపహరించిన తక్షకుని వెతుకుతూ ఉదంకుడు నాగలోకము చేరతాడు. ఉదంకునికి స్థానబలము లేదు. అందుచేత తక్షకుని, తక్కిన నాగులను స్తుతించి, ఏదో ఒక విధముగ తన పనిని సాధించుకొని బయటపడతాడు. అయినను తక్షకుడు చేసిన అపకారము ఉదంకుని హృదయాన్ని బాధిస్తుంది. కాని ఏమి చేయగలడు. పేదవాని కోపము పెదవికిచేటు. అయినప్పటికీ ఉదంకుడు ఊరకుండలేదు. ఉపాయం ఆలోచించాడు. తక్షకుడు అపకారానికి ప్రతీకారము చేయ సంకల్పించాడు. జనమేజయ మహారాజు చేసిన పాలికి వెళ్ళాడు. 'మితహితసత్యవాక్య జనమేజయ భూజన వంద్య'– అని ప్రశంసాపూర్వకముగ ఆ మహారాజును సంబోధించి, అతికుటిల స్వభావుడైన తక్షకుడు, పరాత్మ విశేష వివేకశూన్యుడై, అకారణముగ తనకు అపకారము చేశాడని చెప్పాడు. అనవరతార్థ దానయజనాభిరతుడు, భరతాన్వయాభివర్ధనుడు, సకల ప్రజాహిత విధానుడు, ధనంజయ సన్నిభుడు అయిన మీ తండ్రి పరీక్షిత్తును గూడ ఆ తక్షకుడే కాటువేసి చంపాడని గుర్తుచేశాడు. జనమేజయునిలో తక్షకునిపై క్రోధము కలిగించాడు. తక్షకాది సర్పసమూహానంతటిని దగ్ధము చేయడానికి సర్పయాగాన్నిఆ మహారాజుచే చేయించాడు.

విరోధిని తానేమీ చేయలేక, విరోధి విరోధిని చేరి పూర్వవైరాలను గుర్తుచేసి అతనిని ఉసుగొల్పి, అతనిచే తన విరోధిని ఏ 'కోర్టు వ్యవహారము'లలోనో, 'పోలీసు కేసు'లలోనో ఇరికించే ఉదంకులు, ఈనాటికి సమాజమున కనపడతారు గదా. కాలము మారిననూ మానవస్వభావము మారదు.

**సౌవర్ణోపాఖ్యానము**

మానవ స్వభావంన మాత్సర్యం అంటే ఈర్ష్య చాలా చెడ్డగుణం. ఇది ఒక విధముగా బలహీనతకు చిహ్నం. ఈ మాత్సర్య గుణం మగవారికంటే ఆడవారిలో అధికం. అందునా సవతుల మధ్య, తోడికోడళ్ళ మధ్య దీని తీవ్రత చెప్పనక్కరలేదు. అంతేగాక ఆడవారిలో పంతాలు, పట్టింపులు గూడా అధికమే. ఉబుసుపోక ఇరుగింటి పొరుగింటి చేరి వారి మధ్య పంతాలను,

పట్టింపులను, ప్రజ్వలింపజేస్తారు. ఒక్కొక్కసారి వీటిని చెల్లించుకోటానికి వారు తమ శ్రేయస్సును గానీ, భర్త శ్రేయస్సును గానీ, పిల్లల శ్రేయస్సును గానీ లెక్కచేయరు. అనుకొన్నది జరిగే వరకూ విశ్రమించరు.

స్త్రీ స్వభావంలోని ఈ గుణాలను మహాభారతంలో సౌవర్ణోపాఖ్యానములో ఉన్న కద్రువ వినతలలో చిత్రించబడినది. కద్రూవ వినతలు కశ్యపప్రజాపతి భార్యలు, సవతులు. ఒకనాడు ఇరువురూ ఆయన వద్దకు సంతానాపేక్షతో వెళ్ళి ఆయనను భక్తితో సేవించారు. సంతోషించిన కశ్యపుడు వారిని అనుగ్రహంతో చూసి మీకేం కావాలో కోరుకోండని అన్నాడు. ఇద్దరూ తమకు సంతానం కావాలని ప్రార్థించారు. ఆ క్రమంలో కద్రువ...నాథా....వినుత సత్త్వులు, దీర్ఘదేహులు, అనలతేజులు (అగ్నిలాంటి తేజస్సు కలిగినవారు) అయిన ఒక వేయిమంది పుత్రులు కావాలని కోరుకొన్నది. ఇక వినత మంచి మంచి కుమారులు, తేజోవంతులు అయిన ఇద్దరు కుమారులు కావాలని కోరింది. (ఈ కోరడంలో కద్రువలోని అత్యాశ, వినతలోని లోకజ్ఞత ప్రకటితమవుతాయి. వినత కోరిక విన్న కద్రువలో తెలియని అశాంతి. తాను బలవంతులైన సంతానాన్ని వేయిమందిని కోరితే వినత తెలివిగా ఇద్దరినే ఈ వేయిమందికన్నా బలవంతులను కోరడం ఆమె జీర్ణించుకోలేతపోయింది. వినతను ఎలా దెబ్బతీయాలని ఆలోచించింది.) తథాస్తు అన్నాడు ..కశ్యపుడు.

కశ్యపుడు పుత్రకామేష్టి యాగాన్ని నిర్వహించి ఆ ప్రసాదాన్ని వారికిస్తూ ర్భాలను జాగ్రత్తగా కాపాడుకోండని తపస్సుకు వెళ్తాడు. ఆ ప్రసాదాన్ని స్వీకరించిన వారిరువురూ గర్భవతులవుతారు. కొంతకాలానికి గర్భాలు అండాలుగా మారడం జరుగుతుంది. కద్రువకు వేయి అండములు, వినతకు రెండు అండములు కలుగుతాయి. ఇరువురూ ఆ అండాలను నేతి కుండలలో భద్రపరచి జాగ్రత్తగా కాపాడారు. కద్రువ అండాలు ముందుగా అవిసి సంతానము కలుగుటలో వినత ఓర్వలేక మాత్సర్యముతో తన అండము నొకదానిని తొందరపడి పగలకొడతుంది. అందులోనుండి తొడలు(ఊరువులు)లేనికొడుకు (అసూరుడు) పుట్టడానికి కారణభూతురాలై, అతనిచే సవతికి సేవచేయమనే శాపాన్ని పొందినది. తానెవరిని చూచి అసూయపడెనో ఆమె దగ్గరే సేవచేయుట కంటె స్త్రీకి జీవితములో శిక్ష యేమున్నది? మొత్తము మీద మాత్సర్యము వినతకు అంత దారుణశిక్ష విధించినది.

సముద్రతీరమునకు విహారమేగిన కద్రూవినతలు తెల్లగుఱ్ఱమును చూచారు. ఆ గుఱ్ఱము తెల్లదనాన్ని వినత మెచ్చుకొన్నది. సవతి మాటకు కద్రువ తలఊపినా? ఆ గుఱ్ఱము తోక నలుపని తాను అన్నది. కాదని వినతబీ అవునని కద్రువ. మాట పట్టింపు వచ్చి ఇద్దరు పందెము వేసికొన్నారు. కద్రువ యింటికివచ్చి కొడుకులను పిలిచి, పందెము విషయము చెప్తుంది. తన మాట నెగ్గించుటకు గుఱ్ఱముతోక నల్లచేయుడన్నది. ఒక్క కర్కోటకుడు తప్ప తక్కిన కొడుకు లెవ్వరు తల్లి అన్యాయపు కోర్కెను మన్నింపలేదు. అందుకామె కోపించి కొడుకులను శపించినది.

సవతి మీది మాత్సర్యంతో వినత గుడ్డును పగులగొట్టగా, సవతి మీది పంతంతో కద్రువ కొడుకులను శపించినది. పట్టింపులు అంత తీవ్రముగా ఉంటాయి. స్త్రీ స్వభావమున మాత్సర్యము, పంతాలు, పట్టింపులు అంత తీవ్రం.

## మరికొన్ని ఉపాఖ్యానములలో మానవ స్వభావం

కాంతాకనకములకు లొంగిపోవుడం సామాన్య మానవస్వభావం. ఒక్కొక్కసారి జితేంద్రియులు అనుకొన్న మహానుభావులు గూడా పరిస్థితుల ప్రభావముచే శృంగార పరవశులవుతారు. బ్రహ్మర్షులనుకొన్న పెద్దలు కూడా బంగారానికి లొంగి పోతారు. మానవ స్వభావముపై కాంతాకనకముల ప్రభావ మట్టిది. మహాభారతము కాంతనునుజూచి మోహపరవశు డైన మహర్షిని పరాశరునిలో ప్రదర్శించినది. కనకమును జూచి లొంగి పోయిన బ్రహ్మర్షిని కశ్యపునిలో చూపినది.

ప్రపంచమున స్త్రీ లెక్కువగ గౌరవించునది ప్రయోజకుడైన భర్తనే. ప్రయోజకుడు గాని తండ్రిని పిల్లలు గూడ చులకనగ చూస్తారు. అలాగని లోకమున ఆర్జనలేక, వికలాంగులై వ్యర్థజీవులైన భర్తలను ఆరాధించు సతీమతల్లులు,

అట్టితండ్రులను పూజించు పుత్రులు కూడా ఉన్నారు. సామాన్యముగ ప్రయోజకత్వాన్ని బట్టే ఇంట పురుషునకు గౌరవము లభించును.

దీర్ఘతముడు వేదవేదాంగవిదుడు. కాని జాత్యంధుడు. అందుచేత అతని భార్యయైన ప్రద్వేషిణి మీద, కొడుకులైన గౌతమాదులమీద ఆధారపడి జీవిఞపవలసి వచ్చినది. కొంత కాలమునకు ప్రద్వేషిణి భర్తను మెచ్చని పరిస్థితులు ఏర్పడినవి. నన్నేల మెచ్చుటలేదనని దీర్ఘతముడు అడుగగా ఆమె చెప్పిన సమాధాన మిది.

**'పతియు భరియించుc గావున భర్త మయ్యె**
**భామ భరియింపcబడుc గాన భార్య యయ్యెc**
**బరంగ నవి మనయందు వీడ్వడియె నిన్ను**
**నేన యెల్లకాలము భరియింతుగాన' (భా.ఆది.చతు.ప.227)**

అంతేగాక – 'నిన్నీవిధమున ఎంతకాలము భరింతునని, ఎక్కడికైన వెళ్ళుమని'పలికినది. అంతతో ఆగకుండ కొడుకులను పిలిచి 'ఇమ్ముదుకని నెట యేనియుం గొనిపొండు' అని ఆదేశించినది. ఆ కొడుకులు పాపమతనిని కట్టెలలో కట్టి గంగలో పారవేసినారు.

ఇంత జరుగకున్నను ఇప్పటికిని లోకమున ప్రయోజకుడు గాని ముసలిభర్తను, ఈ ముసలాడని తేలికగ మాటాడు భార్యలు, ఆ తండ్రిని అంతకంటే తేలికగాచూచు తనయులు అక్కడక్కడ కనిఎపిస్తూనే ఉంటారు. మానవ స్వభావము ప్రయోజకత్వమునకు ఇచ్చు విలువ అంత ఎక్కువ.

మానవునికి వెలుగునిచ్చు వానిలో విజ్ఞానము చెప్పదగినది. కాని స్వధార్మనుష్ఠారము విజ్ఞానమునకంటె గూడ వ్యక్తికి వెలుగు నీయగలదని ధర్మవ్యాధోపాఖ్యానము వ్యక్తం చేయుచున్నది.

కౌశికుడు తపస్వి: విజ్ఞాని. అతని కోపపు చూపునకు చెట్టుమీది కొక్కెరయే చచ్చిపడినది. అతని వెలుగు, శక్తి అంతటిది. కాని అంతటి కౌశికుడు ఒక పతివ్రతామతల్లి ముందు చేతులు జోడించి నిలువవలసి వచ్చినది. మాంస మమ్ము కొను కసాయివాని కడ ధర్మసూక్ష్మములు నేర్చుకొనవలసి వచ్చినది. ఆ పతివ్రతకు, ధర్మవ్యాధునికి అంత వెలుగు నిచ్చినది స్వధర్మానుష్ఠానమే.

కులము, ధనము, పదవి – ఇవి మూడును మానవునికి మదము కూర్చు నట్టివే. పైగా పదవిని ఒకసారి రుచి చూచిన వ్యక్తి ఒక మాత్రమున దానిని వదలలేడు. ఇది ఈనాటికి ప్రత్యక్షమగుచున్న రాజకీయ సత్యము. అంతేగాదు. ఒక వ్యక్తిని తాత్కలికముగ ఒక పదవిలో నిలిపినను, అతడు అనతికాలముననే అధికార మదోన్మత్తుడై కన్నుమిన్నుగానక వ్యవహరించును. కోరగూడని వానిని కోరతాడు. తనకేమి తక్కువయని ఆలోచిస్తాడు. పొగరుపట్టి ప్రవర్తిస్తాడు. పూజింపదగిన వారిని అవమానించును. తన అధికారము తాత్కాలికమని గూడ మరచిపోవును. అధికారము మానవుని పతనమొందించును.

అన్నివిధముల యోగ్యుడని దేవతలు నహుషుని తీసుకొచ్చి దేవేంద్రపదవిలో నిలిపారు. అతనికా పదవి కేవలము తాత్కాలికము. అయినను ఆ పదవిని అధిరోహించుట తోడనే ఆ పదవికున్న అధికార వైభవముల నహుషుడు చవిచూచాడు. శచీదేవి తనకుకావలెనన్నాడు. తన అందలమును మహర్షులచేత మోయించినాడు. మంత్ర విషయమున తన అభిప్రాయముతో ఏకీభవించని అగస్త్య మహర్షిని తలదన్నినాడు. ముని శాపమున పదభ్రష్టుడైనాడు. భూలోకమున పెక్కు సంవత్సరములు పాముగ పడియున్నాడు. అధికారమదోన్మత్తం ఎంత శీఘ్రముగ వ్యక్తి తలకెక్కగలదో, ఎంత శీఘ్రముగ అతనిని పతనమొందింపగలదో మన మీ ఉపాఖ్యానమున చూడవచ్చును.

ప్రభువు క్రొత్తవ్యక్తిని చేరదీసి విశేషముగ ఆదరించినచో, ఆ ప్రభువు నాశ్రయించి యున్న ప్రాత భృత్యులు ఆ వ్యక్తిపై అసూయాద్వేషములు వహిస్తారు. అందును ఈ క్రొత్తవ్యక్తి గుణవంతుడై, ప్రాతభృత్యుల అన్యాయకృత్యములలో చేయి కలుపక, ప్రభువుపట్ల విశ్వాసపాత్రుడై ప్రవర్తించెనా వారి అసూయాద్వేషములు అంతకు రెండంతలగును. వారందరు క్రొత్తవ్యక్తిపై ప్రభువుతో చాడీలు చెప్పుదురు. అతనిపై లేనిపోని నిందలు మోపుతాడు. ప్రభువుకు అతనిపై విశ్వాసము పొడగునట్లు ప్రవర్తిస్తారు. పదవినుండి అతనిని పడద్రోయ ప్రయత్నిస్తారు.

ఇట్టి సందర్భములలోనే ప్రభువులు మెలకువతో వ్యవహరింపాలి. త్వరపడి నిర్ణయములు తీసుకోరాదు. నెమ్మదిగ సత్యాసత్యములు విచారింపాలి. లేకపోతే విశ్వాసపాత్రులు శిక్షితులవుతారు. విశ్వాసఘాతుకులు భూషితులవుతారు. మహాభారతమందలి వ్యాఘ్ర గోమాయు సంవాదమే ఇందుకు నిదర్శనము.

మానవ స్వభావమునేగాక ఎన్నో ఇతర విషయములను చెప్పు ఉపాఖ్యానములు మహాభారతమున చాలా ఉన్నాయి. మాండవ్యునికథ, అజగరోపాఖ్యానము మానవుని సంచితకర్మానుభవమును తెలుపుతున్నాయి. సావిత్ర్యుపాఖ్యానము, నలోపాఖ్యానము పుణ్యసతుల చరిత్రలను వర్ణించుచున్నాయి. ముద్గలోపాఖ్యానము, సక్తుప్రస్థుని చరిత్ర దానమహిమను ప్రకటించుచున్నాయి. అంతేగాక ఆపద్ధర్మ, రాజధర్మ, మత్తుని మోక్షధర్మములను, ఎన్నో ఆచార విధులను ప్రబోధించు ఉపాఖ్యానములు మహాభారతములో అనేకములు. మహాభారతము పెద్ద స్మృతి గ్రంథముగ ప్రసిద్ధి నొందుటకు ఈ ఉపాఖ్యానములే ఎక్కువ దోహదము చేసినవని చెప్పవచ్చును. మహాభారత వటవృక్షమునకు ఈ ఉపాఖ్యానములు ఊడలలాంటివి. ఇవి ఆ మహావృక్షమునకు ఎంతో వ్యాప్తిని, బలమును కలిగించాయి.

**ఆధారగ్రంథాలు**

1. ఉమాదేవి, ముదిగొండ, మహాభారత ఉపాఖ్యానము. హైదరాబాద్ :కిషన్ ఆర్ట్ ప్రింటర్స్, 2018.
2. వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, బొమ్మకంటి. శ్రీ మదాంధ్ర సంపూర్ణ మహాభారతము -వ్యవహారికాంధ్ర వచనము. రాజమండ్రి: గొల్లపూడి వీరాస్వామి సన్, 2001.
3. వెంకటేశ్వర్లు, చిలుకూరు. శ్రీ మదాంధ్ర మహాభారతము (1.2) హైదరాబాద్ రామకృష్ణ మఠం 2018,
4. వేంకటసుబ్బయ్య,అప్పజోడు. మహాభారతం – మానవ స్వభావం. కర్నూలు:చినుకు ప్రచురణలు, 2009.
5. సుబ్రహ్మణ్యం, జి.వి (ప్ర.సంపా) కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహభారతము (సవర వ్యాఖ్యాన సహితం). సంపుటం -1-15).పర్వములు తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు: 2013.
6. సత్యనారాయణ, కంభంపాటి ఆంధ్రుల సంస్కృతి -చరిత్ర 1. హైదరాబాద్ :హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1981.

# 22. నన్నయ భారతంలోని సామాజిక స్పృహ - సమాలోచన

- డా॥ కసుకుర్తి ఈశ్వరమ్మ, నెల్లూరు.

ప్రపంచ సాహిత్యంలో పరిమాణం రీత్యా ప్రథమస్థానాన్ని ఆక్రమించిన గ్రంథం సంస్కృతంలో వ్యాసుడు రచించిన మహాభారతం. ఇది పంచమవేదంగా ప్రసిద్ధి పొందింది. ప్రశంసలందుకున్నది. సంస్కృత మహాభారతం హరివంశంతో కలిసివున్నప్పుడే మహాభారతం అనిపించుకుంటుంది. లేకుంటే కేవలం భారతం అని మాత్రమే వ్యవహరింపబడుతుంది. అటువంటి భారతాన్ని ఆంధ్రుల ఆదికవి నన్నయ, తెలుగులో కావ్యేతిహాసంగా మలచి మనకు అందించాడు. అయితే, దురదృష్టవశాత్తూ అరణ్యపర్వం 4వ అశ్వాసం 142వ పద్యం వరకు మాత్రమే రాయగలిగాడు. ఆంధ్రుల అదృష్టం అంతవరకే కావచ్చు కాని, మన ఆదికవి రచించిన ఆ రెండున్నర పర్వాలలోనే తన కాలంనాటి సామాజిక పరిస్థితుల్ని, మూల మహాభారతం ద్వారా తెలియవచ్చే ద్వాపరయుగంనాటి సామాజిక వ్యవస్థను సభ్యతగాను, ప్రత్యక్షంగాను, కొన్ని చోట్ల పరోక్షంగాను తెలియజెప్పాడు. ఆ విషయాలను వివరంగా చెప్పటమే ఈ వ్యాసం ఉద్దేశం.

### నన్నయకాలంనాటి సామాజిక స్థితి

నన్నయకు చాలా పూర్వమే తెలుగుభాష పద్యరూపాన్ని ధరించినట్టు కొన్ని తెలుగు శాసనాలలోని తరువోజలు, మధ్యాక్కరలు మొదలైనవి తెలియజేస్తున్నాయి. కాని, క్రీ.శ.11వ శతాబ్దం దాకా ఏ రూపంగా గాని తెలుగులో గ్రంథ రచన జరగకపోవటానికి కారణమేంటని ప్రశ్నించుకున్నప్పుడు, సమాధానం నన్నయగారి కావ్యావతారికలో లభిస్తుంది. నిశితంగా పరిశీలిస్తే..

రాజరాజనరేంద్రుడు నన్నయను తన చంద్రవంశపు రాజుల్లో ప్రఖ్యాతులయిన పాండవుల చరిత్రను తెలిపే మహాభారతాన్ని తెలుగులో రచింపమని కోరినప్పుడు, నన్నయ వినమ్రుడై మహాసముద్రంలాంటి భారత వ్మాయసముద్రాన్ని యీదటం బ్రహ్మకైనా సాధ్యంకాదు అని చెప్పి, అయినను "దేవా! నీ యనుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునం జేసి నా నేర్చువిధంబున నిక్కావ్యంబు రచియించెద" నన్నాడు (నన్నయ భారతం, అది 1 ఆశ్వాసం 20 వచనం.

తెలుగులో ప్రథమంగా ఒక కావ్య నిర్మాణం జరగటానికి వీలులేని పరిస్థితులు క్రీ.శ.11వ శతాబ్దం నాటికి కూడా ఉండేవన్నమాట. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే రాజానుగ్రహం కన్నా, పండితుల అనుగ్రహమే నాడు అత్యంత ప్రధానమయిన విషయం. అందువల్లనే నన్నయగారు పండితుల్ని ప్రశంసిస్తూ ప్రత్యేకంగా ఒక పద్యం కూడా (ఆది-1అశ్వాసం-24పద్యం) చెప్పారు. గ్రంథారంభ పద్యాన్ని తెలుగులో కాకుండా. సంస్కృతంలో రాశాడు. ఈ సందర్భంలో ఆరుద్రగారు చెప్పిన వాక్యాలు స్మరింపదగ్గవి. "రాజానుమతి దొరికింది గనుక విద్వజ్ఞనులు అనుగ్రహించారు. అప్పటిదాకా ఈ విద్వాంసులు తెలుగులో కావ్యాలు రచించడానికి అడ్డువచ్చారని తలచినా తప్పులేదు. కట్టమంచి రామలింగారెడ్డిగా రన్నట్టు "వారికి దేవభాషేగాని దేశభాష పనికిరాదు". ఆ రోజుల్లో విద్యంటే సాంస్కృతిక విద్యే విద్య, మిగతా భాషలను వారు ఈసడించేవారు" (సమగ్రాంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి, తెలుగు అకాడమి, హైదరాబాదు, 2002, పుట. 126) అని చెప్పారు.

పై వాక్యాలనుబట్టి గ్రహించవలసింది ఏమంటే క్రీ.పూ. రెండు మూడు శతాబ్దాల నాటికే తమిళ సంగసాహిత్యం స్వతంత్రంగా, ఒక ప్రణాళికా బద్ధంగా కావ్యాలను నిర్మించటం సాగిస్తూ పోతూవుంటే, ఆంధ్రభాష మాత్రం సంస్కృతభాషాపండితుల అనుగ్రహం కోసం పడిగాపులు కాస్తూ ఉండిపోయిందని, ఆంధ్రులకున్న యీ అలవాటు నేటికీ మారలేదు. ఆంగ్లభాషను బ్రతుకుదెరువుకోసం పఠించటం మంచిదేకాని, ఆ భాషా వ్యామోహంలోపడి మాతృభాషను నిర్లక్ష్యం

చేయటం జరుగుతూఉంది. అందువల్లనే నన్నయ కాలంనాటి మన భాష ఉన్న పరిస్థితి ఇక్కడ ప్రత్యేకించి ప్రస్తావించవలసివచ్చింది.

ఇక, నన్నయగారు తాము రాసిన భారతంలో తెలిపిన సామాజిక సందేశాన్ని గురించి తెలుసుకుందాం.

జనమేజయుడు చేసే సత్రయాగ స్థలంలో ఆడుకోవటానికి వచ్చిన, సరమ అనే దేవతల ఆడుకుక్క కొడుకుని అతని తమ్ములు కొట్టి బాధించటంతో భారతకథ ప్రారంభమౌతున్నది. ఈ కథ ఇలా ప్రారంభించబడటానికి కారణమేంటి? సూక్ష్మంగా ఆలోచిస్తేనే కానీ ఇది అర్థంకాదు. వ్యాసమహర్షి తను రాయదలచిన భారతానికే 'జయ'మని పేరు పెట్టాడు. జయమంటే ఎందులో మానవస్వభావాన్ని ఆవిష్కరించటంలో, అందువల్లనే మహాభారతంలో కొన్ని వందలపాత్రలు, విభిన్న మనస్తత్వాలు కనిపిస్తాయి. వాటిన్నిటిలోకి మొదట చెప్పవలసింది మానవతప్పిదాలు. అందువల్లనే ఒక కుక్కపిల్లను కొట్టిన ఘట్టాన్ని మొదటగా చెప్పాడు, సూక్ష్మగ్రాహి అయిన నన్నయ మూలభారతంలోని యీ ప్రారంభఘట్టాన్ని మార్చకుండా యధాతథంగా స్వీకరించాడు. అనవసరంగా ఒక ప్రాణిని బాధిస్తే కలిగే కీడు ఏమిటో సరమనోట ఇలా చెప్పించాడు.

**కం॥ తగునిది తగదని యెదలో, వగవక సాధులకు బేదవారల కెగ్గుల్**
**మొగి జేయు దుర్వినీతుల, కగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్ (సభా-1 ఆశ్వా., 85 పద్యం)**

"బీదలను, శక్తిహీనుల్ని, మంచివారిని అనవసరంగా హింసిస్తే, అటువంటి వారికి కారణం లేకుండానే ఆపదలు కలుగుతూ ఉంటాయి" అన్నాడు.

నిష్కారణంగా ఒకరిని హింసించినప్పుడు, ఆ హింసింపబడ్డ వ్యక్తి కనిపించినప్పుడల్లా హింసించినవాడు భయపడుతూ ఉండటమనేది లోకంలో కనిపిస్తున్న సత్యం. దానినే యీ ఘట్టంలో పరోక్షంగా చెప్పటం జరిగింది. అంతేకాదు, తనవల్ల దెబ్బతిన్న వ్యక్తి పనిగట్టుకొని ప్రతీకారం చెయ్యకపోయినా ఆ పాపం మాత్రం వ్యక్తిని పీడిస్తుంది. కూడా అని చెప్పటం జరిగింది.

అలాగే ఉదంకోపాఖ్యానం ద్వారా గురువులపట్ల శిష్యులకుండవలసిన భక్తి, విధేయతలతో కూడిన కార్యసాధనదక్షత్వం, అదే సమయంలో ఎంత బ్రాహ్మణ వటువైనా తొందరపడి ఎదుటివారిపై నోరుచేసుకుంటే భంగపడక తప్పదనే సత్యాన్ని పౌష్యమహారాజును ఉదంకుడు శపించిన ఘట్టంలో వివరించటం జరిగింది.

ప్రమద్వర వృత్తాంతంలో, రురుని ప్రవర్తన వల్ల దంపతుల మధ్య పరస్పరం ఉండే ప్రేమాతిశయం తెలుస్తుంది. రురుడు పాముకాటుకు గురై మరణించిన తనకు నిశ్చయమైన ప్రమద్వర కోసం అకాశవాణి చెప్పిన ప్రకారం తన ఆయుర్దాయంలో సగం ధారవోసి బ్రతికించుకుంటాడు. సహస్రపాదుని వృత్తాంతంలో బ్రాహ్మణునికి ఉండవలసిన లక్షణాలు చక్కగా వివరించబడ్డాయి.

సౌపర్ణోపాఖ్యానంలో శక్తిమంతులైన బిడ్డలవల్ల తల్లిదండ్రులకు ఒకానొక సమయంలో కష్టం కలిగినా, మళ్ళీ ఆ బాధలు వారివల్లనే తొలగిపోతాయనే వాస్తవం అనూరునివల్ల తల్లి అయిన వినత శప్తురాలయినా, ఆమె చిన్నకుమారుడు గరుడుని వల్ల దాస్యవిముక్తురాలు కావటం జరిగింది తెలుస్తుంది. అదే సమయంలో స్త్రీకి సవతిమాత్సర్యం సహజమని, అయితే అది ఎంతమాత్రం మంచిదికాదని గూడా అర్థమవుతుంది. జరత్కారుని కథవల్ల ఆనాడు నియమంతో కూడిన వివాహాలు జరుగుతూ ఉండేవని, నియమోల్లంఘన జరిగిన వెంటనే దాంపత్యబంధం తెంచుకోవటం సులభంగా జరిగిపోయేదని అర్థమౌతుంది. గాంగా శంతనుల సమయం గూడా ఇదే విషయాన్ని తెలుపుతున్నది.

మహామంత్రవేత్త అయిన కశ్యపుని వృత్తాంతంవల్ల, నాడు ఘోరవిషాగ్నితో దగ్ధమైపోయిన వాటిని గూడా తిరిగి పునరుజ్జీవింపజేయగలిగిన అద్భుత సంజీవ మంత్రవిద్య ఉండేదని తెలుస్తుంది. కచదేవయాని సంవాదఘట్టంవల్ల గూడా మృతసంజీవనీ విద్యను గురించి తెలుస్తుంది. అదే సమయంలో గురుపుత్రిని సోదరిగా భావించే కచునివంటి జితేంద్రియులు, సౌశీల్యవంతులు నాడు కూడా ఉండేవారని బోధపడుతుంది.

యయాతి మహారాజు, శంతన మహారాజు గాథలవల్ల తండ్రుల సుఖం కోసం తమ సుఖాలను పరిత్యజించటానికి సిద్ధపడే బిడ్డలు ఆనాడు కూడా ఉండేవారని విశదమౌతుంది. దేవయాని శర్మిష్టల వృత్తాంతంలో దేవయాని శుక్రాచార్యుని కూతురై ఉండి కూడా గర్విష్టికావడం వల్ల ఆమె, ఆమె సంతానం కూడా అపకీర్తిని మూటగట్టుకోవటం, శరిష్ట దైత్యరాజు సంతానమై కూడా భర్త ప్రేమను చూరగొనటం, యోగ్యుడైన పూరునికి తల్లి కాగలటం అనేవి వ్యక్తుల వ్యక్తిత్వానికి ప్రాధాన్యతను సూచిస్తాయి. మనసు మంచిదిగా లేకుంటే గొప్పవంశంలో పుట్టినా ప్రయోజనం లేదని తెలుపుతాయి.

శకుంతలా దుష్యంతుల కథలో స్త్రీ సౌశీల్యమే ఆమెను ఆపదలనుండి కాపాడే మహాసాధనమనే విషయం అర్థమవుతుంది. నిజానికి సంస్కృతంలోని శకుంతలోపాఖ్యానానికి తెలుగులో నన్నయ మెరుగులు దిద్దాడు.

ఆ రోజుల్లో స్త్రీల వ్యక్తిగత అభిప్రాయాలకు పెద్దగా విలువలేదని, వీరులైనవారు. ఆడవాళ్లను ఎత్తుకురావడమనేది గొప్ప విషయంగా భావింపబడేదని కాశీరాజు కుమార్తెల విషయంలో భీష్ముడు ప్రవర్తించినతీరు తెలుపుతుంది. ఇందులో అంబ భీష్ముడిపాలిట మృత్యువుగా పరిణమిస్తే, అంబిక అంబాలికల సంతానం శారీరక లోపాలతో ఉద్భవించింది. వారిసంతానం ఆ తరువాత కురుక్షేత్ర సంగ్రామానికి కారణమయింది.

ధృతరాష్ట్ర పాండురాజుల పుట్టుక విషయంద్వారా, సంగమం సమయంలో శ్రీ పురుషుల మానసిక స్థితి ఏకోన్ముఖంగా ఉండాలనేది ముఖ్యంగా గుర్తించవలసిన విషయం.

మాండవ్యమహర్షి వృత్తాంతంవల్ల, అంతకు పూర్వం పిల్లలు నేరం చేసినా ఏదో ఒకవిధమైన దండనలు ఉండేవని, మాండవ్యుడు కట్టడి చేశాకనే 14 సంవత్సరాల మానవుడు బాల్యావస్థలో ఉంటాడని, ఆ వయసులోపల మనిషి చేసిన పనులు పెద్దగా పాపపుణ్యాలకు గురి కావని, కాని, బాలునికి యితరులు కీడుచేస్తే అది తప్పక పాపమౌతుందని తెలుస్తుంది. ద్వాపరయుగంనాడు స్త్రీ పురుషులలో కొంత స్వేచ్ఛావిహారం ఉండేదని పరాశరుడు మత్స్యగంధితో వ్యవహరించిన తీరు, గంగ ప్రతిపునితోను, శంతనునితోను ప్రవర్తించిన విధానం, జరత్కారుడు తన భార్యపట్ల చూపిన ప్రవర్తన తెలియజేస్తాయి. అలాగే అవివాహిత తల్లికావటం ఆనాడు గూడా గర్హింపబడే విషయమేనని మత్స్యగంధి పరాశరునితో పలికిన మాటలవల్ల, కుంతి కర్ణుని నీళ్ళపాలు చేసిన చేతల వల్ల అర్థమౌతుంది. అలాగే సంతానం లేనివారు నియోగపద్ధతిలో సంతానాన్ని పొందటం ఆనాటి సమాజం సమ్మతించిందని, బలి అనే రాజు తన భార్య సుదేష్ణను దీర్ఘతముని వద్దకు పంపటం, వ్యాసునివల్ల అంబిక అంబాలికలు ధృతరాష్ట్ర పాండురాజుల్ని కనడం, పాండురాజు తన భార్యలైన కుంతి మాద్రులు దేవతలద్వారా సంతానాన్ని పొందటానికి ఇష్టపడటం అనేవి తెలుపుతాయి.

ఒక స్త్రీ అయిదుగురికి భార్య కావటమనేది మహాభారతకాలంనాడు కనిపించే ఒక సామాజిక వైచిత్రి.

కృప ద్రోణాదుల జన్మవృత్తాంతాలు మార్మికతతో కూడి ఉన్నాయి.

బాల్యంలో కురుపాండువులమధ్య కలహానికి బీజం పడింది, భీముని దుడుకుచేష్టలు వల్ల, దాన్ని నన్నయ మూలాన్ననుసరించి చక్కగానే వర్ణించాడు. (ఆది-5అశ్వాసం-166. పద్యం కాని, భీముని చేష్టలకున్నా, దుర్యోధనుని దుష్టచేష్టలే ప్రసిద్ధిలోకి వచ్చాయి. ఈ సందర్భంలో అన్నిటికన్నా విచిత్రమనిపించేది భీముడు కౌరవుల్ని బాధించిన విషయాలు గాని, దుర్యోధనుడు భీముని చంపించటానికి చేసిన ప్రయత్నాలను గురించి గాని భీష్మ ధృతరాష్ట్రాదులకు తెలియకుండానే ఉంటుందా? అనేది. ఈ విషయంలో నన్నయగూడా ఏమీ చెప్పలేదు. కాబట్టి, దేవదానవుల అంశలతో కురుపాండువులు యీ భూమిపై అవతరించినట్లు చెప్పిన విషయంలోనే తర్కానికి అతీతంగా యివన్ని సమసిపోయాయని ఊహించుకోవాలి.

రాజసూయానికి ముందు జరాసంధాదుల వధలుగాని, రాజసూయంలో శిశు పాలుని వధగాని భవిష్యత్తులో మహాసంగ్రామానికి బీజం వేసిన సంఘటనలే.

మహాభారత కాలంనాడు విద్య అంటే ధనుర్వేదమేనేమో అనిపిస్తుంది. ఈ యుద్ధ విద్యలు, ద్రోణుడు సంగ్రహించిన వివిధ అస్త్రశస్త్రాలు యుద్ధంపట్ల సుముఖతను పెంచేవిగానే కనిపిస్తాయి. బ్రాహ్మణ క్షత్రియులేకాక, యితర కులాలవారు గూడా యీ విద్యపట్ల ఆకర్షితులైనవారు ఉన్నారని, కాని వారు కులం కారణంగా తిరస్కరింపబడ్డారని ఏకలవ్య, కర్ణుల విద్యాభ్యాసం ఘట్టాలే వివరిస్తాయి. అయితే ఏకలవ్య కర్ణాదులు ఆ తరువాత గొప్ప వీరులుగా (ఏకలవ్యుని వీరత్వం హరివంశంలో ప్రత్యేకంగా చెప్పబడింది) ఖ్యాతి గాంచటం చెప్పదగిన విశేషం.

ధనమదం, అధికార అహంకారాలు ఎంతటివారికైనా మంచిని చేకూర్చవు అనే విషయం ద్రోణ ద్రుపదుల స్నేహసంబంధాలలో నడిచిన పొరపాటు పనులు తెలుపుతాయి. అదృష్టవంతుల్ని చెరపగలిగినవాడు, అదృష్టహీనుల్ని బాగుచేయగలిగినవారు లేరు. కౌరవ పాండవుల మధ్య నడిచిన దాయాది కలహాలలో భాగమైన లాక్షాగృహదహన ఘట్టం తెలుపుతుంది.

ద్వాపరంనాడు నరమాంసభక్షకులుండేవారని, బకాసుర, హిడింబాసురాదులు వధఘట్టాలు నిరూపిస్తాయి. అయితే, అటువంటి నరమాంసభక్షకుల జాతుల్లో కూడా ప్రేమాభిమానాలు కలిగిన వారు ఉండేవారని హిడింబి వృత్తాంతం తెలుపుతుంది.

ఆనాడు క్షత్రియులు తమకంటూ యింటి పురోహితుడు ఒకడు ఉండాలని కోరుకునే వారని, పాండవులు ధౌమ్యుణ్ణి పురోహితుణ్ణిగా చేసుకోవటమనే అంశం తెలియజేస్తుంది. ఈనాడు యీ పద్ధతిని ఉన్నత కుటుంబాలవారు అందరూ పాటిస్తున్నారు.

పాండవులకు ఇంద్రప్రస్థపురాన్ని, కృష్ణునికి సముద్రంలో ద్వారకానగరాన్ని విశ్వకర్మ నిర్మించి యివ్వటంవల్ల, ఆనాడు దేవతలకు దేవతా సదృశులైనవారికి గృహం, నగరాదులు. నిర్మించేవారిని విశ్వకర్మలన్నారని, రాక్షసులు వాస్తుశిల్పిని మముడు లేక మయబ్రహ్మ అన్నారని ధర్మరాజాదుల కోసం మయసభను నిర్మించిన మయుని వృత్తాంతంవల్ల అర్థమౌతుంది. వాస్తుశిల్పుల్లో విశ్వకర్మలకున్నా మయబ్రహ్మలే ఎప్పుడూ గొప్పవారుగా ఉండేవాడని గూడా మయసభలో దుర్యోధనును చూచిన విశేష విషయాలవల్ల బోధపడుతుంది.

భీముడు హిడింబను, అర్జునుడు ఉలూపిని వివాహమాడటంవల్ల నాడు క్షత్రియేతర జాతులతో కొందరు క్షత్రియులు వివాహ సంబంధాలు నేరపేవారని అర్థమౌతుంది. వృద్ధులైన జరాసంధుణ్ణి యువకుడైన భీముడు బహుప్రయాసపడి చంపినట్లు పరోక్షంగా ద్యోతకమౌతోంది. సహదేవుని దక్షిణ దిగ్విజయ యాత్రలో మాహిష్మతీపుర స్వేచ్ఛా విహారిణులుగా ఉండటానికి అగ్నిదేవుడు కారణం కావటమనేది ఆశ్చర్యం కలిగించే విషయం. దీనివల్ల అగ్నిహోత్రంలాంటి వారి శీలాన్ని శంకించక తప్పదు, ఎందుకంటే, మన భూమిపైన అగ్నిహోత్రానికి, అగ్నిహోత్రంలాంటి వారికి భేదం పాటింపబడదు కాబట్టి.

ధర్మజుని రాజసూయంలో శిశుపాలునివధ యాగవిధిగానే కనిపిస్తుంది. కాని, శిశుపాలుకు కృష్ణుని అధిక్షేపించటం కారణంగా చూపబడింది. దీన్ని నన్నయ యథామూలంగానే రాశాడు. రాజసూయ యాగంలో ఆడవలసిన పాచికలాట, ఆ తరువాత శకునితో ధర్మరాజు ఆడినట్లు చూపటం కౌరవులు దుర్మార్గులని నిరూపించటానికే అనేది స్పష్టం.

వనవాసానికి వెళ్తున్న ధర్మరాజుతో విదురుడు చెప్పిన వాక్యాలు నర్మగర్భితాలు. అరణ్యపర్వంలోని నలోపాఖ్యానంలోని నలుడు పంచపాండవులకు ప్రతినిధిగా కనిపిస్తాడు. అతడు తన సమాపదాయాది పుష్కరునితో జూదమాడి ఓడి భార్యతో అడవికి వెళ్ళాడు. కర్కోటకుని విషప్రభావంవల్ల రూపం మారి కొంతకాలం అయోధ్యరాజు ఋతుపర్ణుని వద్ద బాహుకుడనే పేరుతో అజ్ఞాతవాసం చేశాడు. అతనిభార్య దమయంతి కూడా తన పినతల్లి యింట్లోనే అజ్ఞాతంగా కొంతకాలం గడిపింది. నలుడు వంటలవాడు. గూడా. గుర్రాలను మచ్చిక చేసుకొని నడిపించటంలో నకులుని మాదిరే గొప్పమేధావి. జూదం మత్తులోపడి తనభార్య దమయంతిని పణంగా ఒడ్డుకపోవటం, రెండవ మారు జూదంలో పుష్కరునిపై గెలిచినా అతన్ని

క్షమించి వదిలేయటం అనేవి నలునిలోని గొప్ప గుణాలు. ధర్మాత్ముడైన ధర్మరాజు కురుక్షేత్ర సంగ్రామానికి దారితీసిన అన్ని ముఖ్య సంఘటనలకూ మూలకారకుడయ్యాడు.

సుకన్యాచ్యవనుల గాథలో పాతివ్రత్య మహిమ కొనియాడబడింది. ధర్మరాజును నహుషుడు అడిగిన ప్రశ్నలలో మానవులకుండవలసిన ముఖ్య గుణాలు ఏమిటనేది ఉగ్గడింపబడ్డాయి.

ఈ విధంగా నన్నయ తన భారతంలో ప్రతిఘట్టంలోనూ సమాజానికి సంబంధించిన ఏదో ఒక అంశాన్ని స్పృశిస్తూ తన రచన కొనసాగించి రెండున్నర పర్వాలవరకు (ఆది, సభా, ఆరణ్యపర్వం 4వ అశ్వాసం–142వ పద్యం) రాశాడు.

అయితే, భారతాన్ని సంస్కృతంలో వ్యాసుడు రాసినా, తెలుగులో కవిత్రయం వారు రాసినా ఆ కథలో గుర్తించవలసిన ముఖ్యాంశాలు రెండు ఉన్నాయి. ఒకటి – వ్యక్తి వ్యసనాలకు బానిసకాకూడదు, రెండు ఆయుధాలపట్ల మోజు కలిగి ఉండ కూడదు. ఈ రెండింటివల్లనే 18 అక్షౌహిణుల వీరసైన్యం హతమయ్యింది.

ధర్మరాజుకున్న ద్యూతవ్యసనం భార్యానుజుల్ని అరణ్యమార్గం పట్టించింది. ద్రోణునికున్న ఆయుధాల సేకరణ వ్యసనం కురుక్షేత్రానికి దారితీసింది. ద్రోణుడు తనతండ్రి అయిన భరద్వాజుని వద్ద మొదట విలువిద్య నేర్చుకున్నాడు. తరువాత అగ్నివేశ్యుడనే ముని వద్ద ధనుర్విద్య నేర్చుకుని ఆగ్నేయాస్త్రం మొదలైన అనేక దివ్యాస్త్రాలు గ్రహించారు. గృహస్థుడయ్యాక పరశురాముని వద్దకు ధనం యాచించటానికి వెళ్ళాడు. అప్పటికే ఉన్న ధనమంతా దానం చేసిన భార్గవుడు నా వద్ద ధనంలేదు, శస్త్రాస్త్రాలు, శరీరం మాత్రల మిగిలాయి, కావలసింది కోరుకోమన్నప్పుడు మౌనంగా తిరిగిరాలేదు. శస్త్రాస్త్ర చయాన్నే కోరుకున్నాడు. ఈ విధంగా సాధించిన శస్త్రాస్త్ర పరిజ్ఞానాన్ని నాటి రాజకుమారులకు అందించాడు. ద్రోణుని దగ్గరకు వచ్చిన వారంతా ధనుర్వేదాన్ని అభ్యసించటానికే వచ్చారు. ఇక్కడ ఒక్క రహస్యం గ్రహించాలి. వివిధ ఆయుధాలతో సాధించిన యుద్ధవిద్యలు వీరుల్ని మౌనంగా కూర్చోనీయవు. ఒకవేళ వీరులు శాంతచిత్తులైనా ఆయుధాలు మౌనంగా ఉండలేవు. వాటి లక్షణమే అంత. ప్రపంచీకరణ పేరుతో ఒక వైపు తీపికబుర్లు చెబుతూనే, మరోవైపు వివిధ మారణాయుధాలను సమున్నతంగా పేర్చుకుంటూ, కొత్త ఆయుధాల్ని నిర్మిస్తూపోతున్న ప్రపంచంలోని ప్రముఖదేశాల చర్యలను చూస్తే భీతికలగకమానదు. మహాభారత రణక్షేత్రం మానవాళికి చేస్తున్న హెచ్చరిక ఇదే. ఎన్ని నీతులు, ఎన్ని ధర్మాలు వల్లించినా, బోధించినా చివరకు యుద్ధంవల్ల ఓడిన వారైనా గెలిలిన వారైనా దుఖింపకతప్పదు. ద్వాపరంనాటి యుద్ధవీరులకి ఆయుధాల్ని ప్రయోగించటం, ఉపసంహరించటం గూడా తెలిసివుండవచ్చు. కాని, మనకు ప్రయోగించటం మాత్రమే తెలుసు. కాబట్టి యిప్పటి ఆయుధాలన్నీ ఒక్క అగ్గిపుల్లకు సమానం. కోట్లకు కోట్లు వెచ్చించి. నిర్మిస్తున్న యీ ఆయుధాలవల్ల కొందరికి కొన్ని అధికారాలు దక్కవచ్చు తాత్కాలికంగా. కాని, కాలం ఎప్పుడూ ఒకే రీతిగా నడవదు కాబట్టి–

**"ఒరులేయవి యొనరించిన**
**నరవర అప్రియంబు తన మనమునకు తా**
**నొరులకు యవి సేయకునికి**
**పరాయణము పరమధర్మ పథములకెల్లన్" అని సర్వులూ గ్రహించటం మంచిది.**

**ఆధారగ్రంథాలు**

1.కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – తి.తి.దే., తిరుపతి.

2. ఉమాదేవి, ముదిగొండ, మహాభారత ఉపాఖ్యానము. హైదరాబాద్ :కిషన్ ఆర్ట్ ప్రింటర్స్, 2018.

# 23. మహాభారతం - విశ్వశ్రేయస్సు

- డా॥ ఎన్. భీమన్న, తిరుపతి

శ్రీమన్నారాయణుడే వ్యాసభగవానునిగా లోకంలో అవతరించాడని భారతీయమైన విశ్వాసం. వేదాలను విభజించి, పురాణాలను లోకానికి అందించిన వ్యాసుడే "పంచమవేదమై"న మహాభారతాన్ని రచించాడు. లోకశ్రేయస్సును కోరి భారతకథను విరచించి, శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశాడు. ఈ మహాభారతాన్ని స్వతంత్రకావ్యంలా సంతరించాలనే కోరికతో, పరమార్థాన్ని తమబాణీలలో తెలుగువారికి కవిత్రయం అందించారు. నన్నయ భారతరచనకు తెలుగులో శ్రీకారంచుట్టాడు. రాజరాజు మహాభారతాన్ని తెలుగుచేయడానికి నన్నయకు చక్కని అభిప్రేరణ ఇచ్చాడు. అధికమైన బుద్ధిసంపద అలరారేటట్లుగా వ్రాయమనికోరాడు-

**హిమకరుఁదొట్టి పూరుభరతేశకురుప్రభు పాండుభూపతుల్**
**క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పిన యస్మదీయ వం**
**శమునఁ బ్రసిద్ధులై, విమల సద్గుణ శోభితులైన పాండవో**
**త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్.**

చంద్రుడు మూలపురుషుడుగా కల వంశం చంద్రవంశం. ఈ వంశంలో పూరుడు, భరతుడు, కురురాజు, పాండురాజు అనే ముఖ్యులైన వారిని 'వంశకర్తలుగా కీర్తించాడు రాజరాజు. స్వచ్ఛమైన యోగ్యమైన గుణాలతో ప్రకాశించిన వీరి ప్రఖ్యాతిని చరిత్రగా తెలుసుకోవాలని ఆకాంక్షించాడు. భారతకథ వినడం వల్ల పరిశుద్ధమైన బంగారు తొడుగుతో కూడిన కొమ్ములును, గిట్టలును కల వంద కపిల గోవులను వేద విదులకు దానం చేసిన ఫలం కలుగుతుంది. ఈ విషయాలను విన్న నన్నయ, నారాయణభట్టు సహాయంతో మొదలుపెట్టాడు.

**సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కవితార్థయుక్తిలో**
**నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింప నా**
**నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా**
**భారత సంహితా రచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్.**

చదువగానే అర్థమయ్యే రీతిలో, మనోహరమైన అర్థాలతో సామాన్యులు మెచ్చే అక్షరాల విన్యాసంలో వివిధ నీతులతో, జాతీయాలతో, నానుడులతో బాటుగా లోకానికి శ్రేయస్సు కలిగేటట్లుగా భారతాన్ని రచించడానికి ప్రారంభించాడు. ఈ భారతకథను వ్యాసమహర్షి అన్ని వర్ణాలవారికీ, అన్ని ఆశ్రమాలలో (బ్రహ్మచర్య గృహస్థ, వానప్రస్థ, సన్యాస) చేయవలసిన విధులయొక్క జ్ఞానాన్ని తెలియజేస్తూ ఆర్షభావ బంధురంగా రచించాడు. అందువల్ల ఈ మహాభారతం ఒక విజ్ఞానకోశంగా అనేక శాస్త్రాల సమాహారంగా రూపొందిందని నన్నయ పేర్కొన్నాడు.

**ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని । యధ్యాత్మవిదులు వేదాంత మనియు**
**నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని । కవివృషభులు మహాకావ్యమనియు**
**లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని । యైతిహాసికులితిహాస మనియు,**
**బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ । యం బని, మహిఁగొనియాడుచుండ**
**వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసుఁ డాదిముని పరాశరాత్మజుండు**
**విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండ జేసె భారతంబు.**

విశ్వజనీనమైనది అంటే సర్వజనులకు హితాన్ని కలిగించేది మహాభారతం. ఈ శ్రేయోదాయకమైన భారతం ధర్మ స్వభావం తెలిసినవారికి ధర్మశాస్త్రగ్రంథంగా, పరమాత్మ జీవాత్మ సంబంధం తెలిసిన వారికి వేదాంతశాస్త్రంగా, నీతివిషయాలపై నేర్పుకలవారికి నీతిశాస్త్రంగా, పూర్వకథలు తెలిసినవారికి ఇతి హాసంగా, పౌరాణికులకు పురాణాలసారంగా, గోచరిస్తున్నది. సర్వవేదాల సత్యస్వరూపాన్ని తెలిసిన వ్యాసుని రచన లోకానికి విజ్ఞానదీపంగా వెలుగునిస్తున్నది. అందువల్ల ఈ భారతం విన్న వారికి పాపాలు పటాపంచలు అవుతాయి. అంతేకాదు–

**ఆయురర్థులకు దీర్ఘాయు రవాప్తియు । నర్థార్థులకు విపులార్థములును**
**ధర్మార్థులకు నిత్యధర్మసంప్రాప్తియు । వినయార్థులకు మహావినయమతియు**
**బుత్త్రార్థులకు బహుపుత్రసమృద్ధియు, సంపదర్థుల క్లిష్టసంపదలును**
**గావించు నెప్పుడు భావించి వినుచుండు, వారికి నిమ్మహా భారతంబు**
**భక్తియుక్తులైన భాగవతులకు శ్రీ । వల్లభుండు భక్తవత్సలుండు**
**భవ భయంబులెల్లఁ బాచి యిష్టార్థసం । సిద్ధిఁ గరుణతోడఁ జేయునట్లు.**

ఈ భారతకథాశ్రవణం వల్ల, సంసారభయం తొలగుతుంది. కోరికలు ఈడేరుతాయి. ఆయువు వృద్ధిచెందుతుంది. ధనలాభం కలుగుతుంది. ధర్మవృద్ధి చేకూరుతుంది. వినయం, పుత్రసంపద, ఐశ్వర్యం కలుగుతాయి. లక్ష్మీనాథుడైన విష్ణువు ఈ ఫలాలను భారతకథపై మక్కువకలవారికి ప్రసాదించి పాపాలను కూడా పరిహరిస్తాడు. ఇంతటి ఉత్తమఫలసంపదను రమానాథుడు కటాక్షించడానికి ధృతవివేకులు, శరణాగత రక్షణవ్రతులు, యశోధనులైన భారతవీరులు ధర్మరక్షణపరులు కావడం ముఖ్యకారణం.

**ఆయుష్యం బితిహాసవస్తుసముదాయం బైహికాముష్మిక**
**శ్రేయః ప్రాప్తి నిమిత్త, ముత్తమ సభాసేవ్యంబు, లోకాగమ**
**న్యాయైకాంతగృహంబు నాఁబరగి నానావేద వేదాంత వి**
**ద్యాయుక్తం బగుదాని జెప్పఁదొడగెం దద్భారతాఖ్యానమున్.**

ఇహపర శ్రేయఃప్రాప్తిని ప్రసాదించే భారతకథలో రాజరాజు కోరిన పూరుమహారాజు, భరతమహారాజు కురుమహారాజు, పాండుమహారాజు కథలు ప్రధానమైనవి. వాటితోపాటు ఇంకా ఎందరో రాజన్యుల వృత్తాంతాలు, విలక్షణమైన కథలు, ఉపాఖ్యానాలు వంటివి వర్ణించబడినాయి.

కానీ తన తండ్రికోసం నిండు యౌవనాన్ని త్యాగంచేసిన పూరురాజు ధీరత్వం. ఆదర్శవంతంగా అఖండ సామ్రాజ్యాన్ని ఏలిన భరతుని ధర్మతత్పరత. యజ్ఞయాగాదులలో కర్మవీరుడిగా ప్రసిద్ధిచెందిన ధరరక్షణాదీక్షాపరుడు కురురాజు ఔన్నత్యం. ఉదాత్తయుద్ధవీరుడు, ధర్మమూర్తులైన పాండవుల తండ్రి పాండురాజు వైభవం, రాజరాజుకు మిక్కిలి మక్కువ కలిగించాయి.

ఈ వంశకర్తల ఉత్తమగుణాలన్నీ భగవంతుడైన శ్రీకృష్ణపరమాత్మ రక్షణలో ఉన్న పాండవుల చరిత్రలో పరిపూర్ణత చెందాయి. ఉత్పన్నమవుతున్న ధర్మాన్ని పరామర్శిస్తూ, ధర్మప్రాధాన్యాన్ని సంభాషణలద్వారా కవిత్రయం పరవళ్లు తొక్కించారు. వ్యాసుడు ధర్మ, కర్మల ప్రాధాన్యతను వ్యంగ్యం చేయలేదు. కావ్యధర్మం అల్పసంస్కారులకు సైతం రససిద్ధిని అందించాలి. ఇందుకై తెలుగుభారతం ముందునిలిచింది. భారతంలో నిత్యనైమిత్తక కర్మలనే కాదు ప్రధాన సంచిత, ఆగామికర్మలను విశ్లేషిస్తూ ప్రారబ్ధ కర్మను తెలియజేసింది. కర్మసూత్రానికి సారభూతమైన స్వరూపం సర్పయాగకథ భారతకథామతల్లికి తిలకంలా శోభిల్లుతున్నది.

కల్యాదిలో సర్పయాగం జనమేజయుడు చేశాడు. కద్రూవినతలు త్రేతాదిలో ఉచ్చైశ్రవాన్ని చూశారు. పన్నిదం చరిచారు. ఆ మరురోజు లోపలే కద్రువ తన కడుపున పుట్టిన అండజాలను జనమేజయయాగాగ్నిలో మరణించేట్లుగా

శపించింది. ఈ శాపం కర్మ స్వరూపంతో సాగుతోంది. ఇందులో ఉదంకుడి కథ అనుస్యూతమైంది. రురుప్రమద్వరలకథ కలిసిపోయింది. ఆస్తీకుడు వచ్చాడు. పరీక్షిత్తు వేటకు వెళ్ళి ఋషి మెడలో మృతసర్పాన్నివేశాడు. శాపాన్ని పొందాడు. ఇలా బహుకథోప నదులను సమీకరించుకొని ఈ కర్మకథాప్రవాహం భారత సముద్రాభిగామిని అయ్యింది అందుకే నన్నయ-

**ఎట్టి విశిష్టకులంబున । బుట్టియు, సదసద్వివేకములు గల్గియు మున్**
**గట్టిన కర్మఫలంబులు । నెట్టన భోగింపకుండనేర్తురె మనుజుల్.**

మానవులు ఎంతటి ఉత్తమ వంశంలో పుట్టినా, మంచిచెడులపట్ల పరిజ్ఞానం ఉన్నా, పూర్వకర్మల ఫలం అనుభవించక తప్పదు. ఈ సత్యాన్ని పలికే పద్యాలు, భారతంలో అనేకం ఉన్నాయి.

ఇక భారతంలోని ఉపాఖ్యానాలు సైతం ఈ కర్మ వైభవాన్ని అనేక రూపాలలో ఆవిష్కరిస్తున్నాయి. ఆనుశాసనిక పర్వంలోని గౌతమీలుబ్ధక సర్పమృత్యు సంవాదం ఒక చక్కని ఉదాహరణగా పేర్కొనవచ్చును. ఇందులో గౌతమికొడుకు పాము కరవడంచేత మరణించాడు. కిరాతుడు క్రోధంతో పామును కట్టి తెచ్చి చంపుతానని చెప్పగా గౌతమి వారిస్తుంది. మృత్యువు నేను కాలుడి పాటించానంటుంది. కాలుదు వచ్చి 'ఆ బాలకుదు పాముకఱచి చనిపోయే దుష్కర్మచేశాదు మరణించాడు' అని అంటాడు.

గౌతమి "తన యెఱుకయు దేవాలాపములు నొక్క తెరువై యున్నన్" అలాంటి కర్మచేసి పాము చేత మరణించే కొడుకును కనే కర్మచేశాను. ఇప్పుడు పుత్రమరణంచేత దుఃఖాన్ని పొందుతున్నానని వాపోతుంది. గౌతమి శోకం ధృతరాష్ట్రుని అంతరంగాన్ని గుర్తుచేస్తుంది.

కర్మకథాప్రవాహమైన భారతకథలో జీవలక్షణంతో భాసిల్లే ధర్మతత్వం వరణీయమైనది. ఈ ధర్మ భావన ఈ ప్రపంచాన్ని నైతిక మార్గం పై నడిపిస్తున్నది. పురుషార్థాలలో తురీయమైన మోక్షమే జీవిత లక్ష్యం. కానీ మానవుడికి ధర్మమే ఆ ఫలాన్ని అందుకొనే శక్తిని ప్రసాదిస్తున్నది. అర్థ, కామాలు కూడా వరణీయములే కానీ వాటిని ధర్మమార్గం ద్వారానే పొందాలన్నది ఆర్ష విజ్ఞాన సందేశం. ఇందుకు భారతం చక్కని ఉపదేశం చేస్తున్నది. ఇందువల్ల విశ్వశ్రేయస్సు చేకూరుతున్నది. ఈ విశ్వశ్రేయస్సులో- వ్యక్తి శ్రేయస్సు, కుటుంబ శ్రేయస్సు. గ్రామ, నగర రాజ్యాదుల శ్రేయస్సు మమేకమై ఉంటాయి. ఆనందంలో బ్రహ్మానందంలా, శ్రేయస్సులలో విశ్వశ్రేయస్సు ఉత్కృష్టమైనది. ఈ విశ్వశ్రేయస్సు దుష్టశిక్షణ శిష్టరక్షణాల వల్ల చేకూరుతుందని సంప్రదాయజ్ఞుల విశ్వాసం. ఇందుకు భగవదవతారాదులు ఉద్దిష్టమై ఉన్నాయి. ఈ శ్రేయః పరంపరలు దుర్వృత్తాలవల్ల దూరమవుతాయి. ఈ విషయాన్ని అల్పజీవియైన శునకం నుండి అఖిల ప్రాణులలో అంతర్యామియైన పరమాత్మవరకు భారతంలో తేటతెల్లం చేశారు.

**తగునిది తగదని యెదలో, వగవక, సాధులకు, బేదవారల కెగ్గుల్**
**మొగిజేయు దుర్వినీతుల । కగు ననిమిత్తాగమంబు లయిన భయంబుల్.**

సరమ అనే కుక్క తన కొడుకైన సారమేయుడిని జనమేజయుని తమ్ముళ్లు కొట్టినవేళ మిక్కిలి కోపంతో పలికిన వాస్తవం పై పద్యం. యుక్తాయుక్త జ్ఞానం లేకుండా బీదవారికీ, అశక్తులైనవారికీ మంచివారికీ అపకారాలు పూనికతో చేసే నీతిరహితులకు అకారణంగా ఆపదలు చుట్టుముట్టుతాయని తెలియజేసింది. ఈ పద్యంలోని వైదిక సందేశం అతిప్రాచీనమైనది. ధార్తరాష్ట్రులు ఈ సూక్తిని పట్టించుకోక పోవడం వారి దుర్గతికి మూలం అయ్యింది.

హరిహరాత్మకమైన తత్వదర్శనంతో అపూర్వమైన అద్భుతమూర్తిని దర్శించిన తిక్కన విరాటపర్వం నుండి భారతాన్ని తెలుగుచేశాడు. దైవాంకితమైన ఆంధ్రవైరాటంలో, ద్రౌపది సుదేష్ణతో పలికిన మాటలలో ఆశ్రితుల రక్షణలో వైమనస్యాన్ని అధర్మంగా తెలియజేస్తున్నది.

**సాధులు సేరి నెమ్మిగ నిజస్థిర వృత్తము దుష్టకోటిచే**
**బాధల (బొందకుండ cదమపాల వసించినc బెద్దవారు ది**
**క్కై ధరియించి వారికొక యాపద పుట్టకయుండ cగాచు టొ**
**ప్పై ధర కీర్తి కెక్కదె? యపాయము సేసిన నింద పుట్టదే?**

సజ్జనులు ఇతరులనుండి తమను కాపాడుకోవడానికి పెద్దలను ఆశ్రయిస్తారు. వారు యోగక్షేమాలను చూసి ఆపదలనుండి గట్టెక్కించాలి. వారే అపాయానికి గురిచేస్తే నిందలపాలవుతారని–ద్రౌపది భావాన్ని చక్కని సందేశంగా భావించాలి. ఇక ఉద్యోగపర్వంలో ఈ కృష్ణ పలికిన సూక్తిని స్మరింపజేసిన కృష్ణపరమాత్మ సందేశం ఇది–

**సారపు ధర్మమున్ విమల సత్యముc బాపము చేత బొంకుచే**
**బారముc బొందలేక చెడc బాఱినదైన యవస్థ, దక్షు లె**
**వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగు cగాని ధర్మ ని**
**స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్.**

ధర్మంలోని సారం, సత్యంలోని విమలత్వం దైవమే. ఆ దైవం ధర్మోద్ధారకుడు, సత్యశుభదాయకుడు. ధర్మం, సత్యం ఎంతటి గుణాలో అంతటి ఆచరణాలు, రక్షణీయమైన దివ్య తత్త్వాలు. వాటిని రక్షించే శక్తి కలిగినా అశ్రద్ధతో ఉపేక్షిస్తారో వారు హాని పొందుతారు. సత్యాన్ని, ధర్మాన్ని పరమాత్మతానే పూనుకొని పరిరక్షిస్తాడు.

ఇలా ఎన్నో పద్యాలలో కవిత్రయం మహాభారతంలోని సారభూతమైన ధర్మాన్ని విశ్లేషించారు. స్మృతుల కంటే ముందే పుట్టిస్మృతుల సారాన్ని యథావకాశంగా తనలో ఇముడ్చుకొన్నది. ఈ మహేతిహాసం విశ్వశ్రేయస్సుకోసం ధర్మలక్షణాలను పాత్రలుగా, పాత్రలద్వారా తీర్చి సందేశమిస్తున్నది.

**"ధృతి క్షమా దమో స్తేయం శౌచ మింద్రియ నిగ్రహః**
**ధీర్విద్యా సత్య మక్రోధః దశకం ధర్మలక్షణమ్. (మనుస్మృతి 6–92)**

విశ్వశ్రేయస్సును ప్రసాదిస్తున్న ప్రధానమైన ఈ పది ధర్మలక్షణాలు, శ్రుతి–స్మృతి–పురాణా లన్నింటిలోను ప్రతిపాదించబడ్డాయి. మహాభారతంలో ఈ లక్షణాలను సూక్ష్మంగా సోదాహరణంగా పరిశీలించడమే ఈ లఘువ్యాసంలోని సంకల్పం.

ధృతిః అన్నపదానికి ధైర్యమని సామాన్య అర్థం.

ఆరణ్యపర్వం తృతీయాశ్వాసంలో దధీచి కథ ఈ ధృతి అన్న లక్షణాన్ని చక్కగా చాటుతున్నది. కృతయుగంలో వృత్రాసురుడు కాలకేయులనే రాక్షసులతో కలసి గర్వంతో దేవతలను పీడిస్తున్నాడు. దేవతలు విధాతను ప్రార్థించారు. సరస్వతీ నదీ తీరంలో నిష్ఠతో తపస్సు చేస్తున్న దధీచి మహర్షి ఎముకలతో చేసిన ఆయుధాలు శత్రువులను జయించగలవని తెలియజేశాడు. దేవతల ద్వారా ఈ వృత్తాంతాన్ని విన్న దధీచి దేవతల మేలుకోసం తన ప్రాణాలను విడిచాడు. ఆరణ్యపర్వంలో మూడవ ఆశ్వాసంలోని శిబి చక్రవర్తి కథ కూడా ఈ సందర్భంలో స్మరణీయమైనది. ఇంద్రుడు, అగ్ని డేగ పావురాల రూపంలో శిబిచక్రవర్తి వద్దకు వచ్చారు. డేగరూపం దాల్చిన ఇంద్రుడు పావురం తన ఆహారమని ఇమ్మని పేర్కొన్నాడు. తన ఆహారమైన పావురం నాశరణువేడిందని శిబి వదలనన్నాడు. నేను మరణించి, నా భార్యాపిల్లలు నాపై ఆధారపడి ఉండడం వల్ల వారు మరణిస్తారని శ్యేనరూపంలోని ఇంద్రుడు పేర్కొన్నాడు.

**ధర్మజ్ఞులైన పురుషులు ధర్మువునకు బాధ సేయు ధర్మువునైనన్,**
**ధర్మముగా మదిc దలcపరు । ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్. (ఆరణ్య–తృతీయ–230)**

ధర్మస్వరూపాన్ని ఎరిగిన జ్ఞానులు ధర్మానికి ఏమాత్రం కీడు కలిగించే ధర్మాన్నైనా, ధర్మంగా మనస్సులో భావించరు. అచ్చమైన ధర్మం జగత్తు కంతటికీ మేలు చేకూర్చాలి. ఈ పద్యంలోని భావం ఒక ధర్మానికి హాని కలిగించే మరోధర్మం విశ్వజనీనంకాలేదు. అది ఆభాస ధర్మమేకాని పరమ ధర్మం కాదని తెలియజేస్తున్నది. అయితే శిబి వెంటనే అశ్రిత రక్షణం ధర్మమన్నాడు.

**నాకు విహితభక్షణంబిది, యిప్పక్షిc । బూని కావ నీకు బుద్ధియేని**

**యవనినాథ! దీనియంత నీమాసంబుఎదూంచి నాకుcబెట్టు తొలగcకిపుడ.**

ఓ రాజా! ఈ పావురం నాకు ప్రకృతి సహజ ఆహారం. దీన్ని రక్షించాలని సంకల్పించావు కనుక దీనితో సమానంగా నీ శరీర మాంసం ఇచ్చి నీ చిత్తశుద్ధి తెలియజేయమని–డేగ కోరింది. శిబి సంతోషించాడు. కానీ అతడి మాంసం దేహంలోనిcదంతా కోసి సమర్పిస్తున్నా పావురం బరువుకు సరితూగడం లేదు. ఇక లాభం లేదని త్రాసులోకి తానే ఎక్కాడు. ఆత్మార్పణ పూర్వకమైన త్యాగానికి, గొప్పగుణానికి అభినందిస్తూ– ఇంద్రాగ్నులు స్వస్వరూపాలతో ప్రత్యక్షమయ్యారు. త్యాగం, ధైర్యం, శౌర్యం మొదలైన గుణాలుకల శిబి చక్రవర్తి కథ– మానవులు శబ్దబ్రహ్మాన్ని ఉపాసిస్తున్నంత కాలం ఈ లోకంలో విలసిల్లుతుందని వరమిచ్చారు.

క్షమః ఈ గుణాన్ని మనం ధర్మరాజులో విశేషంగా చూడవచ్చు. అన్నీ ధర్మగుణాలుకల ధర్మరాజు వృత్తాంతం మహోన్నతమైనది. భారతంలో రురుని కథ, ఉదంకుని కథ చదివిన తరువాత ధర్మజుని కథను స్మరిస్తున్నప్పుడు ఈ క్షమాగుణంలోని ఔన్నత్యమే రాశీభూతమైన ధర్మజుని స్వరూపమన్న జ్ఞానం చేకూరుతుంది. భృగువంశ కీర్తనంలోనిది రురునికథ. యౌవన మదానికి ఆస్పదమైన ప్రమద్వర పాదమర్ధితమై యొక్క – పన్నగంబుగఅచెబీ తప్పు పాముదికాదు కన్నియలతో ఆడుతున్న ప్రమద్వరదే. ప్రమద్వర అంటే ప్రాణంగా ప్రేమిస్తున్న రురుడు పాముజాతి మీదనే పగబట్టి ఎన్నో పాములను వెదకి వెదకి చంపాడు. ఇక ఉదంకుడు కూడా తక్షకునివల్ల ఇబ్బందిపడ్డాడు. కానీ పాములన్నింటినీ సర్పయాగం చేసి మట్టుపెట్టమని జనమేజయుని ప్రేరేపించాడు.

**ప్రల్లదుcడైన యొక్క కులపాంసను చేసిన దానcదత్కులం**

**బెల్లను దూషితం బగుట యేమి యపూర్వము? (ఆది–1–125)**

అని పలికిన ఉదంకుని ప్రతీకారవచనాలు అపూర్వమైనవి. ఈ నేపథ్యంలో పాండవుల 'విపులగుణోన్నతి సైపక' దుర్యోధనుడు చేసిన అకృత్యాలు ఘనమైనవి. సర్పధ్వజుడు భీమునికి విషాన్నం పెట్టాడు. శూరులైన పాండవులను లక్క ఇంట్లో దహనం చేయాలని ప్రయత్నించాడు. ద్రౌపదిని నిండు సభలో ఘోరంగా అవమానించాడు. మాయాజూదంతో రాజ్యాన్ని అపహరించాడు. ఘోషయాత్ర ద్వారా ప్రయత్నించాడు. ఇలా ఎన్నో పాపాలను చేసి ధర్మరాజాదులను కష్టపెట్టడం అనుచితమని ధృతరాష్ట్రునితో పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు.

**దానికి నీ వొడంబడితి, ధర్మజుcడంతయు, జూచి సత్యముం**

**బూని వృకోదరార్జునులు భుగ్నులుగా, బెడచేతc గన్ను నీ**

**రూనcగ నొత్తుకొంచుcజని యుగ్ర వనంబున దుఃఖమగ్నుడై**

**దీనత నుండి పూన్కి దగ దీర్చియుc గూడి మనంగ cగోరెడిన్.**

ధర్మరాజు తన కొచ్చిన కష్టాలకు యాతనలు పడుతున్నా సత్యం తప్పలేదు. కంటి నుండి కారు కన్నీటిని పెడచేతితో తుడుచుకొంటూ ఘోరారణ్యాలకు వెళ్ళాడు. అక్కడ దుఃఖాలలో మునిగి తన చేత అంతస్సారం కోల్పోయి దైన్యంతో నున్న భీమార్జునులతో ప్రతిజ్ఞను సక్రమంగా నెరవేర్చాడు. అయినా ఇప్పుడు "కూడి మనంగగోరెడిన్" మీ తో ఒద్దికగా జీవించాలని కోరుతున్నాడు.

ధర్మరాజు 'అజాత శత్రువు' అన్న విషయాన్ని శ్రీకృష్ణపరమాత్మ తెలియజేస్తున్నాడు. ధీరోదాత్తుడు, శాంతికాముకుడైన ధర్మజుడు. బంధునాశనాన్ని కోరకపోవడం ఇక్కడ సుస్పష్టమవుతున్నది. అందువల్ల

**తనుఁ దాన పోలుగా కే, మనవచ్చు? నజాత శత్రు నతిశాంతతయున్,**

**వినయము సత్యము మున్నే? జన పతులకుఁ గలవు సెపుమ? సౌజన్యనిధీ!**

ధర్మపుత్రునికి సాటి మరొకడులేడు. ఎంతని కొనియాడగలం. ధర్మజుని శాంత స్వభావము, అణుకువ సత్యనిష్ఠ ఇంతకుముందు ఏ రాజులకున్నది. అని భగవంతుడైన కృష్ణుడు ప్రశంసచేశాడు. సంగ్రామంకన్న సంధికే ఎక్కువగా మక్కువకల ధర్మజుని అంతరంగ క్షమాగుణానికి నిధిగా నిధానంగా శోభిల్లింది. ఈసార్వకాలీనమైన ధర్మభావన ఆచంద్రార్కం విశ్వశ్రేయస్సును ఇవ్వగలదనడం అతిశయోక్తి కానేరదు.

**దమము**

ఇంద్రియాలను వశమునకు తెచ్చుకొనుటే దమము. ఆజ్యంవల్ల అగ్ని శిఖలు పెరిగినట్లుగా, కోరికలు అనుభవించడం వల్ల మరింతగా వృద్ధిచెందుతాయి. విషయసుఖాలకై నిరంతరం పరిగెడు తుంటాయి. యయాతి వృత్తాంతంలో పూరుడు ఈ ఇంద్రియాలపై జయాన్ని సాధించిన ఘనుడిగా గోచరిస్తాడు. యయాతి కూడా ధర్మపాలకుడైన ప్రభువు. తప్పని పరిస్థితుల్లో శుక్రాచార్యుని కుమార్తె దేవయానిని పెళ్ళాడాడు. కానీ శర్మిష్ఠను అనురాగంతో పరిగ్రహించాడు. ఇద్దరివల్ల సంతానాన్ని యయాతి పొందాడు. దేవయానికి అన్యాయం జరిగిందని భావించిన శుక్రాచార్యుడు ముసలితనంతో దఃఖాన్ని పొందమని యయాతిని శపించాడు. శుక్రుడు కోపం తగ్గాక నీ కుమారులు ఎవరైనా జరాభారాన్ని స్వీకరిస్తే నీకు యౌవనం సిద్ధిస్తుందని చెప్పాడు. సోదరులు మిగతావారంతా కాదన్నా పూరుడు తన యౌవనాన్ని తండ్రికి ఇచ్చాడు. శర్మిష్ఠ కొడుకులలో చిన్నవాడైన పూరుడు పుత్రధర్మాన్ని పాటించాడు. ఇక్కడ పూరుని ధర్మం త్యాగం. ఈ త్యాగానికి ఇంద్రియాలను జయించగలిగిన దమం మూలకారణం. ఈ ధర్మగుణం పూరుడికి అమృతత్వమైన కీర్తినిచ్చింది. సామ్రాజ్యంతోబాటు, వంశకర్త అయ్యే యోగ్యతను కూడా కలిగించింది.

**అస్తేయము**

చౌర్యరహితమైన బుద్ధితో జీవించడం వల్ల మానవుడు లోకంలో ఆరాధించబడుతాడు. సమస్త సంపదలను పొందగల మహావీరుడు, రాజన్యుడైన భీష్ముడు తండ్రిసుఖంకోసం ఆ జీవనం బ్రహ్మచర్య దీక్షను చేపట్టాడు. శంతనుడు సత్యవతిని చేసుకోవడానికి రాజ్యసుఖాలకు భీష్ముడు ధూరమయ్యాడు. రాజ్యానికి మూలమైనవాడిగా ఆదరింపబడుతున్నా తామరాకుపై నీటిబొట్టులా రాజ్యసుఖాలకు దూరమైన త్యాగసింధువు భీష్ముడు. భీష్ముని వృత్తాంతం ఇతరులదని భావించిన ఏ వస్తువునూ తను పొందరాదన్న ధర్మభావనను మదిలో స్థిరపరుస్తుంది.

**శౌచం**

మానవుడిలోని అంతరింద్రియ శుచిత్వం వల్ల సమాజశ్రేయస్సు మాత్రమేకాక ప్రకృతి కూడా ప్రసన్నమవుతుంది. ఈ విషయాన్ని ఆరణ్యపర్వంలోని ఋశ్యశృంగుని వృత్తాంతం స్పష్టపరుస్తున్నది. విభాండకుడు తనకుమారుడైన ఋశ్యశృంగునిని బ్రహ్మచారిగానే వుండాలని పెంచాడు. ఋశ్యశృంగుడు పరమ పవిత్రుడవడం వల్ల అతడు ఎక్కడ వుంటే అక్కడ వానలుపడే మహిమ కలవాడయాడు.

అంగదేశాన్ని ఏలే రోమపాదుడు విప్రులపట్ల అపరాధం చేశాడు. అందువల్ల దుర్భిక్షం ఏర్పడింది. రాజు తండ్రిలేని సమయం చూసి వారకాంతలను పంపి ఋశ్యశృంగుని తన రాజ్యానికి తెప్పించుకొన్నాడు. ఋశ్యశృంగుడు వేశ్యలవెంట వెళ్ళినా సంపర్క సుఖాన్ని పొందలేదు. అతడి రాకతో అంగరాజ్యం సుభిక్షమయ్యింది. రోమపాదుడు తన కుమార్తె నిచ్చి

వివాహం చేశాడు. విభాండకుడు కొడుకును కోడలిని ఆశ్రమానికి తెచ్చు కొన్నాడు. శాంతాఋశ్యశృంగులు అరుంధతీ వశిష్ఠుల్లా, లోపాముద్ర అగస్త్యుల్లా ఉత్తమ దంపతులై జీవించారు. ఈ కథ నిశ్శబ్దంగా ఒక నీతిని ప్రబోధిస్తున్నది. వ్యక్తి అమలినమై జీవనం సాగిస్తే సమాజం, సంసారం, సర్వజగత్తు, శ్రేయస్సును పొందుతుందని తెలియజేస్తున్నది.

**ఇంద్రియనిగ్రహం**

ఇంద్రియ నిగ్రహం వల్ల తాత్కాలికంగా ఏదన్నా మనః క్లేశం కలిగినా కాలాంతరంలో అది వరంగా పరిణమిస్తుంది. ఆరణ్యపర్వం ప్రథమాశ్వాసంలో అర్జునుడు స్వర్గానికి వెడతాడు. దేవవేశ్య ఊర్వశి మనస్సు అర్జునునిపై పడుతుంది. ఇంద్రునివరం వల్ల కుంతికి జన్మించిన అర్జునుడు మాతృభావనతో ఊర్వశి కామభావాన్ని తిరస్కరిస్తాడు.

నీవు మర్త్యలోకంబున మానవర్జితుండవై మానినీ మధ్యంబున నపుంసకుండవైయుండు మని శాపం బిచ్చింది. దేవేంద్రునికి అర్జునుని ఇంద్రియనిగ్రహం సంతోషాన్ని కలిగించింది.

**నీ యట్టి ధైర్యవంతుని । నే యుగముల నైనఁగాన మెన్నండునుబీ ధ**
**ర్మాయత్తమతివిబీ మునులకు? నీ యింద్రియజయము గీర్తనీయము తండ్రీ ।**

తండ్రీ! అర్జునా! ధర్మాత్ముడివి. నీ వంటి ధైర్యవంతుని ఏకాలంలో చూడలేము. ఇంద్రియాలపై సాధించిన విజయం ఋషీశ్వరులుకూడ కీర్తించతగినదని ఇంద్రుడు–అభినందించాడు. శాపం వరంగా మారిన ఈ వృత్తాంతం విన్నవారికి సకల పాపాలనుండి విముక్తి లభిస్తుందని వైశంపాయనుడు జనమే జయుడికి వివరించాడు.

ధీ : భారతంలో ఎందరో బుద్ధిమంతులైన జీవుల వృత్తాంతాలు ఉన్నాయి. అందులో ఆదిపర్వంలోని ద్వితీయాశ్వాసంలోని ఆదిశేషుని వృత్తాంతం చిత్తహరమైనది. తన తల్లి, తమ్ములు చేసిన ధర్మవిరుద్ధమైన పనులకురోసి పుణ్యక్షేత్రాలలో వేల ఏళ్ళు తపస్సు చేశాడు. శేషుని తపస్సుకు ప్రసన్నుడైన బ్రహ్మ అతని సమబుద్ధికి మెచ్చి– అఖిల భూభారాన్ని మోసే వరాన్ని ప్రసాదించాడు. ఈ వృత్తాంతంలో అమలిన ధర్మ బుద్ధిమంతులు ఎంతటి ఫలాన్ని పొందుతారో సుస్పష్టమవుతున్నది.

విద్యా: 'సా శిక్షా యా విముక్తయే" అని చిరంతన భారతీయ వాఙ్మయం కీర్తిస్తున్నది. పరీక్షిన్మహారాజు అభిమన్యుడి పుత్రుడు. ఆరణ్యానికి వేటకై వెళ్లి శమీకుని మెడలో సర్పశవాన్ని వేశాడు. కేవలం ముని తన ఆగమనాన్ని తెలుసుకోలేదన్న విషయం కోపం తెప్పించింది, ఆ ముని కుమారుడు తండ్రిని ఇలా అవమానించడంతో కోపంతో పరీక్షిత్తు వారం రోజులలో తక్షక విషంతో మరణిస్తాడని శపించాడు. శాపవృత్తాంతం తెలిసిన తరువాత పరీక్షిత్తు సప్తాహకాలంలో ముక్తిని పొందడానికి తగిన విద్యను శుకమహర్షి నుండి పొందాడు.

**కొనిప్రచ్చుడు, లోపల నల్లనిక్రిమియైతోచి చూడ లత్తుక వర్ణం**
**బునఁబామై, విషవహ్నులు, దనుకగ గురువీరుఁ గఱచి తక్షకుడరిగెన్.**

తక్షకుని విషం యొక్క శక్తిని చాటేందుకు నన్నయ అల్లిన ఈ పదం రమ్యమైనది. ఒక పండులో నల్లని పురుగై కనబడి, చూస్తూండగానే పారాణివంటి ఎఱ్ఱని రంగుతో పామై, విషాగ్నులతో పరీక్షిత్తును తక్షకుడు కఱచి వెళ్ళాడు. ఈ పద్యంలోని సర్పం కాలసర్పం. పరీక్షిత్తు జీవుడు. మృత్యువు కబళించే లోపు ప్రతి వ్యక్తి సన్మార్గాన్ని ఆశ్రయించాలి. అర్హులైనవారికి దానధర్మాదులను చేయడం వల్ల మరణానంతరం ఉత్తమ గతినిచ్చే కర్మలు పరీక్షిత్తుకై పురోహితులు మొదలైనవారు చేశారు. కనుక ధర్మశాస్త్రం "గృహీత ఇవకేశేషు మృత్యునా ధర్మమాచరేత్!" అని ప్రబోధిస్తున్నది. జీవులు నివృత్తిమార్గంలో పయనించేందుకు ఉపకరించే విద్యయే సత్యమైనది.

**సత్యము**

వేదసాహిత్యం నుండి, నేటి సారస్వతం వరకు ఎన్నో సత్యనిష్ఠను తెలిపే గాథలు, ఉపదేశాలు, సందేశాలు నిత్యహరితంగా అలరారుతున్నాయి. హరిశ్చంద్రాది రాజుల కథలు ఏనాటికీ మనోఫలకంపై శిలాలేఖలై శోభిల్లుతున్నాయి. అయితే ఆంధ్రభారతంలో ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో శకుంతలాదుష్యంతుల వృత్తాంతం విలక్షణమైనది. కామైక పరత్వంతో దుష్యంతునితో గాంధర్వవివాహానికి తలవంచిన శకుంతల పుత్రుడు జన్మించిన తరువాత కణ్వుని ఆశ్రమంనుండి దుష్యంతుని కొలువుకు వెళ్ళింది. పుత్రుడైన భరతుని తమ ప్రణయఫలంగా పరిచయం చేసింది. లోకభీతితో నిన్నునే నెఱుగనని తిరస్కరించాడు దుష్యంతమహారాజు. ఖిన్నురాలైన శకుంతల అనేక విధాలుగా రాజును వేడుకొన్నది. చివరికి మన వివాహమైన నాడు నాకిచ్చిన వరమనే సత్యం నిలచి ఉండగా, అపారగుణవంతుడు, వంశవిస్తారకుడు, అయిన పుత్రుడిని ఏకారణం లేకుండానే కాదనటం తగునా? అని నిలదీసింది.

**నుత జలపూరితంబు లగు నూతులు నూటిటి కంటె సూనృత**
**వ్రత! యొక బావి మేలుబీ మరి బావులు నూటిటికంటె నొక్కస**
**త్క్రతువదిమేలుబీ తత్క్రతుశతంబునకంటే సుతుండుమేలు, త**
**త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలుసూడగన్.**

మంచినీటితో నిండిన నూతులు నూరింటికంటే ఒక దిగుడుబావి మేలు. అటువంటి వంద బావులు కంటే ఒక మంచి యజ్ఞం మేలుబీ అటువంటి వంద యజ్ఞాలు కంటే ఒక్క పుత్రుడు మేలు. అట్టి పుత్రశతం కంటే కూడా ఒక్క సత్యవాక్యం మేలు. కనుక దుష్యంతరాజా సత్యాన్ని ఆశ్రయించు అని పేర్కొంది.

అంతే కాకుండా-

**వెలయంగ నశ్వమేధం। బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం**
**దుల నిడి తూపగ సత్యము ? వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్.**

ఒక త్రాసులో వేయి అశ్వమేధాల ఫలాన్ని ఒకవైపు, ఒక్క సత్యాన్ని మాత్రమే మరోవైపు ఉంచి రెండువైపులా తూచితే త్రాసు సత్యం వైపే బరువు వలన మొగ్గుచూపుతుంది. తద్వారా సత్యమే శ్రేష్ఠమని నిరూపిస్తుంది, అని సత్యం యొక్క ఘనతను విశ్లేషించింది. అంతేకాక ధర్మాలన్నింటిలో సత్యమే గొప్పదని కూడా తెలియజేసింది.

**'సర్వతీర్థాభిగమనంబు సర్వవేద, సమధిగమము సత్యంబుతో సరియుఁగావు**
**ఎఱుగుఁ మెల్ల ధర్మంబుల కెందుఁబెద్ద। యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.**

తీర్థాలన్నింటినీ సేవించడం, వేదాల నన్నింటినీ అధ్యయనం చేయడం సత్యంతో సాటికావు. ధర్మం బాగా తెలిసిన ఋషులు ఎల్లప్పుడు అన్ని ధర్మాలకంటే సత్యమే గొప్పదని శ్లాఘిస్తారు అని కూడా ప్రబోధించింది. దుష్యంతుడు నిర్మలమైన బుద్ధితో సత్యం గొప్పదిగా భావించాలని ఆకాంక్షించింది. తను క్షత్రియులలో ఉత్తముడైన విశ్వామిత్రునికి పవిత్రురాలైన మేనకకి పుట్టిన దానిని కనుక తనకు అసత్యం పలికేంత అధర్మం లేదని చెప్పింది. కానీ దుష్యంతుడు అంగీకరించక పోవడంతో శకుంతల దుఃఖంతో విలవిలలాడింది. ఎడతెరపి లేకుండా కారే కన్నీళ్ళను అప్పుడప్పుడు ఒత్తుకుంటూ వెనుదిరిగింది. దైవమే శరణ్యమని భావించింది. ఆ సమయంలో ఆ సభలోని వారంతా విని ఆశ్చర్యపడేటట్లు ఆకాశవాణి పలికింది. భరతునికి శకుంతల తల్లి అని ఆమె మహాపతివ్రతయని, నీ ఇల్లాలును స్వీకరించి పోషించమని ప్రకటించింది. లోకనిందకు భయపడిన దుష్యంతుని ముందు శకుంతల పలికిన సత్యవాక్కులు ఆమె శీలస్వచ్ఛతను ప్రపంచీకరించాయి. సత్యం దైవస్వరూపం కనుక సత్య ప్రశంస దైవప్రశంస ఫలాన్నిస్తున్నది.

**అక్రోధం**

క్రోధం ధర్మబాహ్యమైనది. కనుక క్రోధం లేకుండా మానవుడు జీవనయాత్రను సాగించాలి. బుద్ధిమంతులను సైతం ఈ క్రోధం సమ్మోహపరిచి స్మృతిని తొలగించి వినాశనాన్ని చేకూరుస్తున్నది. ఇందుకు మహాభారతంలోని ద్రోణాచార్యుని వృత్తాంతం చక్కని ఉదాహరణ. శరవిద్యకు, వేద వేదాంగాలకు పరమగురువు ద్రోణుడు. శుక్రుని అంశతో జన్మించిన ఘనుడు. మునీశ్వర ప్రవరుడు భరద్వాజునికి కుమారుడు. అతని సహాధ్యాయి ద్రుపదుడు. పాంచాల దేశపురాజు వృషతుని కుమారుడు. కాలాంతరంలో ద్రుపదుడు రాజయ్యాడు. అతని వద్దకు వెళ్ళి నీ బాల్య మిత్రుడనని ద్రోణుడు గుర్తుచేశాడు. కానీ ద్రుపదుడు సహాధ్యాయి అయితే మిత్రుడవు ఎలా అవుతావని తిరస్కరించి నోరుమూసుకొని పొమ్మని చెప్పాడు.

**ధనపతితో దరిద్రునకు, దత్త్వవిదుం డగు వానితోడ మూ**
**ర్ఖునకుఁ బ్రశాంతుతోడఁ గడు ఁగ్రూరునకున్ రణశూరు తోడ భీ**
**రునకు, వరూథి తోడ నవరూథికి సజ్జనుతోడ గష్టదు**
**ర్జనునకు నెవ్విధంబునను సఖ్యము దా నొడఁగూడ నేర్చునే?**

దరిద్రునిగా, మూరు?నిగా, క్రూరునిగా, పిరికిపందగా, అరక్షితునిగా, దుర్మార్గునిగా ద్రోణుని నిందించి నీతో నాకేవిధంగా సఖ్యం చేకూరుతుందని ప్రశ్నించాడు. ద్రోణుడు ద్రుపదుని మాటల వల్ల అవమానం పాలయ్యాడు. కలతచెందాడు. ద్రోణుడు అక్కడనుండి హస్తినాపురానికి చేరాడు. భీష్ముడు ద్రోణుని ఆదరించాడు. కౌరవపాండవులకు గురువుగా నియమించాడు.

ద్రోణుడు వారందరినీ చేరదీసి మీ అందరకూ నేను అస్త్రవిద్యలు నేర్పుతాను. కానీ నా కోరిక మీలో ఎవరు తీరుస్తారని అడిగాడు. అర్జునుడు ముందుకు వచ్చాడు. దానితో ద్రోణునికి అర్జునినిపై అభిమానం కలిగింది.

కుమారాస్త్ర విద్యా సందర్శనం తరువాత ద్రోణుడు తన శిష్యులను సహాధ్యాయియైన ద్రుపదునిపై యుద్ధానికి పంపాడు. మహాయుద్ధంలో అర్జునుడు ద్రుపదుని జయించి రథచక్రానికి కట్టి తెచ్చి గురుదక్షిణగా ద్రోణాచార్యుని ముందుంచాడు.

**వీరెవ్వరయ్య? ద్రుపదమ హారాజులె! యిట్లు కృపణులయి పట్టువడన్.**
**వీరికి వలసెనె? యహహా! మ ? హారాజ్యమదాంధకార మది వాసెనొకో?**

రాజ్యమదం చేత కలిగిన కన్నుగానని ద్రుపదుని గర్వాన్ని పరిహసించాడు ద్రోణుడు. అయితే వెంటనే వాడిని విడిచి పెట్టాడు. కానీ ద్రుపదుని ఆ కోపం ద్రోణుడినుండి బదిలీ అయ్యింది.

**ఉల్లాసంబు లాడి యోడకు పొమ్మని । ద్రుపదు విడిచి పుచ్చె ద్రోణుచేత,**
**నట్లు విడువబడి తదవమాన తప్తుడై । పృషతనందనుండు పెద్ద యలిగి ॥ (ఆదిపర్వం 7-7)**

ద్రుపదుడు అవమానంతో మిక్కిలి కోపించి యుద్ధంలో ద్రోణుని చంపగల పుత్రుని పొందాడు. నాలుగు పాడి ఆవులను అడగడానికి వచ్చిన ద్రోణుని తూలనాడిన ద్రుపదుడు, లక్షపాడి ఆవులను ఇస్తానని ఆశపెట్టి యాజుని ఆశ్రయించాడు. యజ్ఞం చేయించి దుష్టద్యుమ్నుని వరపుత్రుడిగా పొందాడు.

ఇలా ద్రోణాచార్యుడు తన సహాధ్యాయిపై కోపం కారణంగా, మృత్యుస్వరూపమైన దుష్టద్యుమ్నుని జననానికి కారణం అయ్యాడు. ద్రోణుని ఈ ప్రవర్తనవల్ల కౌరవపాండవులలో ప్రతీకారం పాదులూనింది. క్రోధంతోనే కురుపాండువంశాలు కురుక్షేత్రం వేదిక చేసుకొని, క్షయమయ్యాయి. ద్రోణపుత్రుడు అశ్వత్థామ క్రోధంతోనే అమానుషంగా ఉపపాండవ సంహారం చేశాడు. దీర్ఘరోగం పొందే శాపాన్ని వ్యాసుని నుండి పొందాడు.

ఈ వృత్తాంతాలు–కోపంతో చరించే గురువునేకాక శిష్యులను తద్వారా సమాజాన్ని అంతా కోపాగ్ని బూడిద చేస్తుందని తేటతెల్లం చేస్తున్నాయి. అభ్యుదయాన్ని కోరే ధర్మవర్తనులైన మానవాళి అక్రోధనులై సమాజంలో జీవించాలన్నది– ద్రోణుని కథ ద్వారా భారతమిస్తున్న సందేశం.

ఇలా ధర్మగుణాలకు కలిగే ఉత్తమఫలాలను, ధర్మగుణాలను విడనాడితే వచ్చే ఆపదలను భారతం ఉపదేశిస్తున్నది. ఈ ధర్మగుణాలు కుటుంబానికి, గ్రామాదులకేకాదు– యావత్సమాజానికి ఆదర్శవంతంగా నిలిచే శీలసంపదనిస్తాయి. విశ్వశ్రేయస్సుకు మూలస్తంభంగా మనగలిగే ఆత్మశక్తులను ప్రసాదిస్తాయి. ఇటువంటి గుణసంపదను ప్రబోధిస్తున్న ఈ భారతకావ్యం విశ్వశ్రేయస్సుకు పట్టుకొమ్మ.

**ఆధార గ్రంథాలు**

1. మహాభారతం – ధ్వని – ఆచార్య శలాక రఘునాథశర్మ.
2. మహాభారతం – తి.తి.దే. ప్రచురణలు

# 24. మహాభారతంలో కుటుంబవ్యవస్థ

- డా॥ బి. తేజోవాణి, తిరుపతి

పూరిళ్ళగోడలకు కూడ వ్రేలాడే రామకృష్ణుల చిత్రపటాలు. భారతీయుల గుండెల్లో గుడికట్టుకొన్న ఆ మహాపురుషుల దివ్యరూపాలు. భారతీయుల పెదవుల మీద నిత్యము నినదించే ఆ అవతారపురుషుల పవిత్ర నామాలు.

వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ధర్మశాస్త్రాలు, వివిధ పురాణాలు మన సనాతన ధర్మానికి, సంస్కృతీ సంప్రదాయాలకు, జీవనవిధానానికి, జీవితపరమార్థానికి పునాదులే అయినా- అవి, ఎంతమందికి అందాయి? అవి ఎంతమందికి అర్థమయ్యాయి? అవి, ఎంతమందిని ప్రభావితం చేశాయి? భారతీయ జనసామాన్యాన్ని ప్రభావితం చేసింది రామాయణ భారత భాగవతాలే కదా.

శ్రీమద్రామాయణం త్రేతాయుగ రాకుమారుని చరిత్ర. మూడు రాజ్యాలకథ (అయోధ్య, కిష్కింధ, లంక) మూడుజాతుల కథ (నర, వానర, రాక్షస జాతులు). మూడు మౌలిక గుణాలకథ (సత్యం, రజస్సు, తమస్సు-మానవత్వం సత్యం, వానరత్వం, రజస్సు, రాక్షసత్వం తమస్సు). ధర్మస్వరూపుడైన ఒక మానవుని కథ. ఆదర్శపురుషుని కథ. ఆదర్శప్రభువు కథ.

మహాభారతం ద్వాపరయుగరాజవంశ చరిత్ర- కురువంశ చరిత్ర. అంతేకాదు. ఆనాటి రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక చరిత్ర. అన్నింటిని మించి - మానవస్వభావానికి, మానవజీవితానికి అద్దంపట్టే కథ. మంచి చెడులతో కూడిన మనిషి కథ. రకరకాల మనస్తత్వాలతో మన చుట్టూ ఉండే మనుషుల కథ. వ్యక్తి సుఖశాంతులకు, శ్రేయస్సుకు- కుటుంబ సుఖశాంతులకు, శ్రేయస్సుకు- సమాజసుఖశాంతులకు, శ్రేయస్సుకు, అవసరమైన ధర్మాన్ని, ధర్మసూక్ష్మాలను మానవజీవితానికి సమన్వయించి రసమయంగా చెప్పేకథ. ధర్మబద్ధంగా సాగిన జీవితం చివరకు ఎంత ఉన్నత స్థితిని అందుకుంటుందో, ధర్మ విరుద్ధంగా సాగిన జీవితం చివరకు ఎంతదారుణంగా పతనమౌతుందో మానవాళికి తెలియచెప్పే కథ మానవ జీవిత మహాప్రస్థానకథ. మనవేదవిజ్ఞానానికి, సనాతన ధర్మానికి, సంస్కృతీ సంప్రదాయాలకు, జీవన విధానానికి పెద్దభాండాగారంగా నిలిచిన కథ.

## భారతీయకుటుంబవ్యవస్థ - మహాభారతంలో కుటుంబవ్యవస్థ

మానవజాతి చరిత్రలో నాగరికతలేని దశ ఒకటి ఉంది. నాగరికత పుట్టి పెరిగినదశ ఒకటి ఉంది. నాగరికత వెర్రితలలు వేసే దశకూడ ఒకటి ఉంటుంది. ప్రస్తుతం మనం ఈ దశలోనే ఉన్నామేమో?

మానవుడు నేల మీద పుట్టింది మొదలు అతడు సాధించిన నాగరికతలో ఒక మహోన్నత శిఖరం అతని కుటుంబవ్యవస్థ. కుటుంబవ్యవస్థే లేకుంటే అతనిది జంతుజీవితమే కదా. మానవజీవితాన్ని క్రమ బద్ధం చేసింది, సక్రమంగా విస్తరించింది, మానవజీవితానికి ఒక పుష్టిని, తుష్టిని సమకూర్చింది, విశేషించి మనిషితో మనిషి కలిసిజీవించే సహజీవన సంస్కృతిని మనిషికి నేర్పించింది, అన్నింటిని మించి మానవ జీవితానికి ఒక అర్థాన్ని, పరమార్థాన్ని ఏర్పరచింది- అతని కుటుంబ వ్యవస్థే.

సామాజిక శాస్త్రవేత్తలు కుటుంబము, సమాజము వ్యక్తి కేంద్రంగా వివిధ వ్యాసాలతో ఏర్పడిన వృత్తాలే అన్నారు. ప్రాచీన గ్రామాలు కూడ విస్తరిల్లిన కుటుంబాలే అన్నారు.

కాగా, భారతీయకుటుంబవ్యవస్థకు యావత్ప్రపంచంలో ఒక విశిష్టత ఉంది. ఒక పవిత్రత ఉంది. ఒక పారమార్థికత ఉంది. మహాభారత కుటుంబ వ్యవస్థ స్థూలంగా భారతీయకుటుంబ వ్యవస్థే. స్థూలంగా అని అనటం ఎందుకంటే- మానవీయమైన ఏ వ్యవస్థలో అయినా దేశకాల పాత్రాలను బట్టి మార్పులు, చేర్పులు, అపవాదాలు (exceptions) తప్పవుకనుక.

భారతీయ కుటుంబవ్యవస్థ మనవైదిక సంస్కృతి రూపొందించిన జీవన విధానంలో భాగమే. భారతీయ మహర్షులు తపస్సుచేసి చేసి, అగుపించని పరమాత్మ తత్వాన్ని, అగుపించే జగత్తత్వాన్ని, జీవుడి తత్వాన్ని ఈ మూడింటికీ సమన్వయాత్మకంగా నిలిచి ఉన్న ధర్మతత్యాన్ని దర్శించారు – సమగ్రంగా దర్శించారు. మానవుడు ఆత్మ స్వరూపుడే అయినా, మానవజీవిత పరమార్థం పరమాత్మలో లీనం కావటమే – మోక్షాన్ని పొందటమే అయినా, అతనికి ఒక దేహం ఉంది. మనస్సుంది. దేహము మనస్సు లేకుంటే అసలు మనిషే లేడు. మానవలోకమే లేదు. అందువల్ల భారతీయమహర్షులు మానవజీవితపరమార్థమైన మోక్షాన్ని మాత్రమే కాక, మానవుని ఐహికజీవితాన్ని, అతని ఐహిక జీవితానికి అవసరమైన అర్థకామాలను, అతని దైహిక మానసిక పరిణామాలను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయము, సౌష్ఠవము, సమగ్రము, ఆచరణ యోగ్యము అయిన ఒక జీవనవిధానాన్ని ఏర్పరచారు. చతుర్విధపురుషార్థాలను జీవిత లక్ష్యాలుగా, చతుర్విధ ఆశ్రమాలను జీవిత దశలుగా నిర్ణయించారు. అతని ఐహిక సుఖశాంతులకు, ఆముష్మిక ఉన్నతికి ధర్మాన్ని ఆలంబనంగా నిలిపారు.

ఈ సువ్యవస్థీకృత జీవన విధానంలో భాగమే భారతీయకుటుంబ వ్యవస్థ, మహాభారత కుటుంబ వ్యవస్థ.

ఇది మానవజీవితంలో అర్థకామాల అనుభవానికి సంబంధించిన భాగం. చతుర్విధాశ్రమాల్లో గృహస్థా శ్రమానికి సంబంధించిన భాగం. మానవుని ఐహిక జీవితంలో అతి ప్రధానపాత్ర వహించే భాగం. జనసామాన్యాన్ని విశేషంగా ఆకర్షించే భాగం.

**కుటుంబ వ్యవస్థ – వివాహవ్యవస్థ**

భారతీయకుటుంబ వ్యవస్థకు పునాది వివాహవ్యవస్థ. భారతీయ కుటుంబ వ్యవస్థకే కాదు, ఏజాతి కుటుంబ వ్యవస్థకైనా పునాది వివాహవ్యవస్థే. వివాహ వ్యవస్థకు పునాది స్త్రీ పురుష ఆకర్షణ. మానవీయమైన అనుబంధాలన్నింటిలో అన్నిటికంటే ఆద్యమైనది, అత్యంత బలీయమైనది – స్త్రీ పురుష ఆకర్షణ. ఇది, సమాజంలో తరువాత తరువాత ఏర్పడిన జాతి, మత, కుల, స్థాయీ భేదాలకు– ఒక్కోసారి వయోభేదాలకు కూడ అతీతమైనది. ఈ ఆకర్షణ ఎంత బలీయమైనదో మనం మహాభారతంలో వ్యాసమహాముని జన్మ సందర్భంలో చూడవచ్చు, 'గతమదమత్సరుండు, త్రిజగద్వినుతుండు, వసిష్ఠపౌత్రుడు, శక్తి పుత్రుడు, అఘనాశన ఘోరతపోధనుండు' అయిన పరాశరమహర్షి ఎక్కడ? తనువు మిన్నాల వొల్చు' జాలరిది దాశకన్య ఎక్కడ? ఆమె యౌవనపువంపు సొంపులు, పడవనడిపే ఆమె వయ్యారం, అప్పటి వాతావరణం అంత జితేంద్రియుడైన ఆ మహర్షి మనస్సునే చలింపచేశాయి. ఆమె పట్ల ఆకర్షితుడయ్యేటట్లు చేశాయి. అందుకే నన్నయ్యగారు

**ఎంతశాంతులయ్యు నెంత జితేంద్రియు**
**లయ్యుఁ గడు వివిక్తమైనచోట**
**సతులగోష్ఠిఁ జిత్తచలనమొందుదు రెందు**
**గాముశక్తి నోర్వగలరె జనులు**

– అన్నారు. వాత్స్యాయనుడుకూడ 'శరీరస్థితి హేతుత్వా దాహార స ధర్మణోహి కామః' అన్నాడు.

ఈ స్త్రీ పురుష ఆకర్షణకు నాగరికము, సంస్కార సంపన్నము అయిన వ్యవస్థీకృత రూపమే వివాహ వ్యవస్థ– భార్యాభర్తృ సంబంధం– దాంపత్యధర్మం. సుసంఘటిత కుటుంబవ్యవస్థకు, సహజీవన సంస్కృతికి, సమాజస్థితికి, దాని ప్రగతికి దాంపత్యధర్మమే బలమైన పునాది. అందుకే భారతీయ సంస్కృతి అతి ప్రాచీన కాలంలోనే దాంపత్యధర్మానికి అంత ప్రాధాన్యమిచ్చింది. అంత పవిత్రతను సమకూర్చింది.

భారతీయ సంస్కృతి దాంపత్యాన్ని ఎవరో ఇద్దరు స్త్రీ పురుషుల వైయక్తిక శృంగార జీవిత వ్యవహారంగా భావించలేదు. ఒక బాధ్యతాయుతమైన విశిష్ట సామాజిక జీవన విధానంగా భావించింది. భార్యాభర్తలకు అనేక బాధ్యతలు అప్పగించింది.

ఎన్నో ధర్మాలు ప్రబోధించింది. మహోన్నత లక్ష్యాలు నిర్దేశించింది. భార్యా భర్తలది, వేరు-వృక్షంలాంటి సంబంధంగా భావించి, పురుషుడు సమాజముఖంగా ఒక మహావృక్షంలా ఎదగాలని, పదిమందికి నీడ ఇవ్వాలని, సమాజానికి ఎన్నో రసవత్ఫలాలను అందివ్వాలని, స్త్రీమూర్తి తల్లి వేరులా నిలిచి ఆ మహావృక్ష పటిష్ఠతకు, పెరుగుదలకు అన్ని విధాల సహకరించాలని, కుటుంబవ్యవస్థ దృఢంగా, బలంగా, ఆరోగ్యకరంగా, ఛిన్నాభిన్నమై పోకుండ ఉండాలని ఆశించింది. పురుషునికి ఏకపత్ని వ్రతాన్ని, స్త్రీ మూర్తికి పాతివ్రత్యాన్ని నిర్దేశించింది. అందుకే భారతీయదాంపత్య ధర్మానికి అంతవిశిష్టతబీ అంత పవిత్రత.

కాగా, ఆంధ్రమహాభారతం దాంపత్యధర్మానికి అద్దం పట్టే

**శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాగ్గేషు యే**
**లోకానాం స్థితి మావహన్త్య విహతాం స్త్రీ పుంసయోగోద్భవాం**
**తే వేదత్రయ మూర్తయః........**

అన్న అద్భుతశ్లోకంతో ఆరంభం కావటం ఒక విశేషం.

మహాభారతంలో దుష్యంతుని ఆస్థానంలో శకుంతల ప్రసంగం- దాంపత్య జీవన మాధుర్యాన్ని దూరం చేసుకొనే దౌర్భాగ్యులందరికి అద్భుతసందేశం.

ఆలాగే ద్వైతవనంలో ద్రౌపదీదేవి సత్యభామకు చెప్పిన పవిత్రతా ధర్మాలు స్త్రీ జాతికి శిరోధార్యాలు.

పాతివ్రత్యం అంటే ఈనాటి మహిళా లోకంలో అనేక అపోహలున్నాయి. పాతివ్రత్యం అంటే బానిసత్వంకాదు. భర్తలకు నీడలా అస్తిత్వం లేకుండా బ్రతకటం కాదు. తన మనోభావాల్ని భర్తతో చెప్పుకోలేని మూగతనం కాదు. కళ్ళు మూసుకొని భర్త ననుసరించి అడుగులు వేసే గ్రుడ్డితనం కాదు. భర్త చెపుతున్నాదని అన్నింటికి తలవంచే తక్కువతనం కాదు. ఆత్మాభిమాన రాహిత్యం, వ్యక్తిత్వవిహీనత అంతకంటె కాదు.

పాతివ్రత్యం ఒక పవిత్ర సహజీవన విధానం. మనః పూర్వక సహకార ప్రదానం. అన్నింటిని మించి ఆగని ఒక అనురాగ ప్రవాహం.

మహాభారతంలో మహాపతివ్రతగా పేరుపొందిన ద్రౌపదీదేవి వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైనదో, ఎంత స్వతంత్రమైనదో, ఎంత విశిష్టమైనదో ఆరణ్య, విరాట, ఉద్యోగ, శాంతిపర్వాల్లో చూడవచ్చు. ఆలాగే గాంధారీదేవి విశిష్ట వ్యక్తిత్వాన్ని ఉద్యోగ స్త్రీపర్వాల్లో చూడవచ్చు.

భారతీయసంస్కృతి దాంపత్యజీవితానికి ఏకపత్నీవ్రత పాతివ్రత్యాలను ముఖ్యధర్మాలుగా నిర్దేశించినా- వ్యక్తి దృష్ట్యా, కుటుంబదృష్ట్యా, సమాజదృష్ట్యా అవి ఎంతో ఆరోగ్యకరాలే అయినా, సుఖశాంతులకు ఆలవాలాలే అయినా కాలక్రమాన పురుషాధిక్య సమాజంలో, అనేక కారణాలవల్ల బహుభార్యాత్వం ప్రబలింది. పాతివ్రత్యం కూడా సడలింది. పాతివ్రత్యాన్ని అవకాశంగా తీసుకొని భార్యలను బాధించటం, వారి వ్యక్తిత్వాలను అణచివేయటం జరిగింది. మానవీయాలైన వ్యవస్థల్లో ఇలాంటివి తప్పవు. మానవస్వభావం అలాంటిది. అట్లని బహుభార్యాత్వం కాని, భార్యను బాధించే పురుషాహంకార ప్రకృతికాని ఏ మాత్రం క్షమించదగినవి కావు. సభ్యసమాజం గట్టిగా గర్హించవలసినవిబీ కఠినంగా శిక్షించవలసినవి.

అట్లని లోకంలో భర్తలను బాధించే భార్యలు లేరనికాదు. మహాభారతంలోనే ప్రద్వేషిణి, సంపాదన లేని భర్త నాకెందుకని నిర్దాక్షిణ్యంగా తన భర్తను కొడుకులతో చెప్పి గంగలో వేయించలేదా?

మహాభారతంలో బహుభార్యాత్వాన్ని గూర్చి చెప్పనే అక్కరలేదు. ధృతరాష్ట్రపాండురాజులే కాదు- పాండవులు కూడ బహువచన సంఖ్యలో భార్యలున్నవారే. చిత్రమేమంటే మహాభారతంలో బహు భర్తృత్వం కూడ ఉంది. కారణం ఏదైనా అది ప్రధాన స్త్రీ పాత్ర అయిన ద్రౌపది విషయంలోనే ఉంది. అయితే పాండవ లైదుగురితో ఆమెకున్నది పవిత్ర వివాహబంధం.

మహాభారతంలో ప్రాధాన్యాన్ని బట్టి ప్రత్యేకంగా వర్ణించబడిన వివాహాలు రెండు– ఒకటి, కథానాయిక ద్రౌపదీవివాహంబీ మరొకటి, పాండవ వంశానికి వారసుని అందించిన ఉత్తరాభిమన్యుల వివాహం. ద్రౌపదీ వివాహం అసాధారణమైనదైనా, పెద్దల అంగీకారంతో, వధూవరుల ఇష్టప్రకారం జరిగిన వివాహం. ఉత్తరాభి మన్యులది పూర్తిగా సంప్రదాయపద్ధతిలో పెద్దలు జరిపిన వివాహం. తిక్కనగారు తెలుగు భారతంలో ఈ వివాహాన్ని తెలుగువారి పెళ్ళిగా తీర్చిదిద్దారు.

ధృతరాష్ట్రుని వివాహం కూడ పెద్దలు జరిపించిందే– భీష్మసుబలులు జరిపించింది. పాండురాజు వివాహం స్వయంవర వివాహమైనా, భీష్ముని అనుమతితోనే జరిగింది. మహాభారతంలో సంప్రదాయపద్ధతిలో కాకుండ, క్షత్రియోచితాలుగా జరిగిన గాంధర్వ రాక్షసవివాహాలు కూడ ఉన్నాయి. శకుంతలా దుష్యంతులది గాంధర్వవివాహం– ప్రేమ వివాహం. భీష్ముడు బలవంతంగా కాశీరాజు కూతుళ్ళను తెచ్చి విచిత్రవీర్యునికి చేసిన వివాహం ఒక విధంగా రాక్షసవివాహమే.

అంతేకాదు. మహాభారతంలో వర్ణాంతర జాత్యంతర వివాహాలు కూడ ఉన్నాయి. దేవయానీ యయాతులది, దాశకన్యాశంతనులది వర్ణాంతర వివాహం అయితే – హిడింబా భీమసేనులది, ఉలూపీ అర్జునులది జాత్యంతర వివాహం. కారణాలు ఏవైనా, భారతంలో వివాహపూర్వ శృంగారాలు, కన్యాగర్భ ధారణలు, వివాహం లేని స్త్రీ పురుష సంబంధాలు, సంతానోత్పత్తులు కూడ ఉన్నాయి.

**కుటుంబవ్యవస్థ – సంతానము**

భారతీయ సంస్కృతిలో కుటుంబవ్యవస్థకు పునాది అయిన వివాహవ్యవస్థ కేవలం స్త్రీ పురుషుల ధర్మబద్ధకామానుభవానికి కాదు– ఐహికాముష్మికాలు రెండింటికి ప్రయోజనకరమైన సంతానోత్పత్తికి సత్సంతానోత్పత్తికి– వంశవృద్ధికి. అందుకే బలిజేపల్లివారు తేట తెలుగులో 'అరయన్ వంశము నిల్పనే గద వివాహంబు' అన్నారు. మహాకవి కాళిదాసు 'ప్రజాయై గృహమేధినః' అన్నారు. వేదం 'అఙ్గాదఙ్గత్సంభవసి హృదయా దధిజాయసే' – 'పున్నామ్నో నరకాత్రయత ఇతిపుత్రః' అని సంతాన ప్రాధాన్యాన్ని తెలిపే అనేక మంత్రాలను ప్రవచించింది.

మహాభారతంలో మనకు ఆశ్చర్యాన్ని కలిగించే సంతానమే కాక, మన ఊహకందని సంతానం. కూడ ఉంది. సర్వసాధారణంగా భార్యాభర్తల కలయిక వల్ల కలిగే సంతానంతో పాటు నియోగ పద్ధతివల్ల దేవరన్యాయం వల్ల వంశం నిలుపుకోవటానికి ఒకరి భార్యయందు వేరొక పురుషుని నియోగించి సంతానాన్ని పొందటం ఉంది. ఒక విధంగా ఇది ఈనాటి Sperm Donation బీజదానం లాంటిది. ఈ నియోగ పద్ధతిలో మానవదైవికాలు రెండూ ఉన్నాయి. ధృతరాష్ట్ర పాండురాజుల జననం మానవీయ నియోగం వల్ల జరిగితే, పాండవజననం దైవ నియోగం వల్ల జరిగింది.

మహాభారతంలో కృష్ణద్వైపాయన కర్ణులవంటి కన్యాపుత్రులున్నారు. క్షేత్రం లేకుండ బీజంతోనే జన్మించిన ద్రుపదద్రోణులవంటి వారున్నారు. క్షేత్ర బీజాలు రెండూ లేకుండ జన్మించిన ద్రౌపదీ ధృష్ట ద్యుమ్నులవంటి అయోనిజులున్నారు. కౌరవులు పుట్టుక కూడ ఒక వింతే– ఒక పిండాన్ని ముక్కలు చేసి ఘృతకుండాల్లో ఉంచటం, ఆ ముక్కలు పిల్లలుగా పుట్టడం. ఇవన్నీ ఈనాటి మానవుడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో ఇంకా ఛేదించవలసిన జీవోత్పత్తి రహస్యాలు.

భారతీయ కుటుంబవ్యవస్థలో ప్రేమాభిమానాలతో పిల్లల్ని పెంచి పెద్ద చేయటం తల్లిదండ్రుల బాధ్యత. అలాగే తల్లిదండ్రులను శ్రద్ధాభక్తులతో సేవించటం సంతాన ధర్మం– ముఖ్యంగా పితృస్వామ్య వ్యవస్థలో పుత్రధర్మం. కాని, ఈనాడు తల్లిదండ్రులు, పిల్లల పెంపక బాధ్యతను ఇతరులకు అప్పగిస్తే పిల్లలు తల్లిదండ్రుల సేవాబాధ్యతను వృద్ధాశ్రమాలకు అప్పగిస్తున్నారు. ఇది యాంత్రిక యుగప్రభావంబీ అవాంఛనీయ పరిణామంబీ కుటుంబ వాతావరణ కాలుష్యకారణం.

మహాభారతంలో తండ్రి యయాతికొరకు తనయౌవనాన్ని ధారపోసిన తనయుడు పూరుడైతే, తండ్రి శంతనుని కొరకు తన గృహస్థాశ్రమాన్ని, రాజ్యాధికారాన్ని అంటే అర్థకామాలు రెండింటిని – త్యాగం చేసి, యావజ్జీవ బ్రహ్మచారిగా నిలిచి, తన శక్తిసామర్థ్యాల నన్నింటిని కడదాక కురుకుటుంబం కొరకు ధారవోసిన అద్వితీయ పితృభక్తుడు భీష్ముడు.

"'తనయుండు తల్లిదండ్రులు పనిచిన పనిసేయడేని వాడు తనయుండనబడునే? పితృధనమున కర్హుండగునే?' అని తనమాట వినని కొడుకులను శపించి, తనమాట విన్న చిన్న కొడుకు పూరునికి రాజ్య మిచ్చిన తండ్రి యయాతి అయితే, తన కొరకు జీవితంలో మహోన్నత త్యాగం చేసిన కొడుకు భీష్మునికి స్వచ్ఛందమరణ వరం ప్రసాదించిన మరో తండ్రి శంతనుడు.

కాగా, తనమాట వినలేదని పరమదారుణంగా పుత్రులను శపించిన తల్లికూడ ఉంది. సవతి మీది మాత్సర్యంతో అధర్మమైన కోరికకోరి, అది తీర్చలేదని కొడుకులను క్రూరంగా శపించిన తల్లి-కద్రువ-నాగమాత.

మహాభారతంలో మాతాపితృసేవతో మహనీయుడైన మాంసవ్యాపారి ధర్మవ్యాధుడైతే, మాతా పితృ సేవను విస్మరించి ధర్మవ్యాధుని ముందు తలదించుకొన్న తపస్వి కౌశికుడు.

**కుటుంబ వ్యవస్థ - బంధుమిత్రులు**

భారతీయకుటుంబ వ్యవస్థమీద బంధుమిత్రుల ప్రభావం మెండు. ఆలివంకవారిని ఆత్మ బంధువు లన్నారు- వీరు ఆస్తుల్లో భాగాలు పంచుకోరు కనుకబీ తమ కూతురికాపురం సుఖశాంతులతో సాగాలని కోరుకుంటారు కనుక. తండ్రి వంకవారిని దాయాదులన్నారు. వీరిలో కొందరికి ఆస్తిమీద కొంత హక్కు, ఆశ రెండూ ఉంటాయి. వీరిని జ్ఞాతులని కూడ అన్నారు. 'జ్ఞాతిశ్చేదనవేనకిం' అనికూడ అన్నారు. అంటే జ్ఞాతి ఉంటే వేరే నిప్పు అక్కరలేదన్నమాట- ఆ కుటుంబాన్ని కాల్చటానికి, బాధించటానికి.

మహాభారతంలో పిల్ల నిచ్చిన మామలుగా గాంధారి తండ్రి సుబలుడుగాని, కుంతి తండ్రి కుంతి భోజుడుగాని, మాద్రితండ్రి మద్రదేశాధీశ్వరుడుగాని ధృతరాష్ట్ర పాండురాజుల కుటుంబ విషయాల్లో జోక్యం పుచ్చుకోలేదు. కౌరవుల మామలుగాని, పాండవుల మామలుగాని మహాభారతయుద్ధం దాకా అల్లుళ్ళ కుటుంబ వ్యవహారాల్లో కలుగచేసుకోలేదు. ద్రుపదుడు ద్యూత పునర్ద్యూతాల్లో గాని, పాండవుల వనగమనంలో గాని జోక్యం పుచ్చుకోలేదు. ఆలాగే ఆయన కొడుకు ధృష్టద్యుమ్నుడుకూడ. నిజానికి పాండవులకు జరిగిన అన్యాయ విషయంలో, ద్రౌపదికి జరిగిన అవమాన విషయంలో ద్రుపద ధృష్టద్యుమ్నులు కలుగ చేసుకోవలసినవారే. అయినా అది వాళ్ళ కుటుంబ వ్యవహారమని సరిపెట్టుకొన్నట్లున్నారు. అంతేకాదు. ధర్మరాజు తన ద్యూతవ్యసనకారణంగా తనకు తానై దాయాదులతో కష్టాలు, నష్టాలు కొనితెచ్చుకొన్నాడు. అందుకు ద్రుపదుడేమి చేయగలడు? ధృష్టద్యుమ్నుడేమి చేయగలడు? అంతటి శ్రీకృష్ణుడే ఊరకున్నాడు కదా. ద్రౌపది మొరపెట్టుకొంది కనుక కృష్ణుడు ఆమెకు అక్షయ వస్త్రప్రదానం చేశాడు. ద్రుపదుడు ఉత్తరాభి మన్యుల వివాహానంతరం, అందరు కోరితే, తన పురోహితుని కౌరవుల దగ్గరికి రాయబారిగా పంపాడు.

మహాభారతంలో కురుపాండవుల కుటుంబ వ్యవహారాల్లో మొదటినుండి విపరీతంగా జోక్యం పుచ్చుకొన్నవాడు, ఉభయపక్షాల మధ్యకక్షలు పెంచినవాడు, కయ్యానికి దోహదం చేసినవాడు- ధృతరాష్ట్రుని బావమరది, కౌరవుల మేనమామ - శకుని. శకుని గాంధారి వెంటవచ్చి, హస్తినలోనే ఉండటం వల్లనే కురు పాండవకుటుంబానికి అంతకీడు జరిగింది. గాంధారీ ధృతరాష్ట్రులు అతనిని తన దేశానికి తిరిగి పంపి ఉంటే, మహాభారతకథ- కురుపాండవ కుటుంబచరిత్ర మరో విధంగా ఉండేదేమో!

మహాభారతంలో బావగారి ఇంట్లో ప్రముఖపాత్ర వహించి ప్రాణాలు పోగొట్టుకొన్న మరో బలమైన బావమరది కీచకుడు. శల్యుడు మాద్రేయుల మేనమామే అయినా మహాభారతయుద్ధందాకా కురుపాండవుల కుటుంబ వ్యవహారాల్లో కలుగచేసుకోలేదు.

ఇక మిత్రుల విషయం. మహాభారతంలో దుర్యోధనుని మిత్రుడు కర్ణుడు- కురుపాండవ కుటుంబ వ్యవహారాలను విశేషంగా ప్రభావితం చేశాడు. కౌరవపక్ష కార్యనిర్ణేతకూడ అయ్యాడు. ఆలాగే శ్రీకృష్ణుడు కూడ పాండవులకు బంధువుకంటే

మిత్రుడుగా కురుపాండవ కుటుంబ వ్యవహారాలను ఎంతో ప్రభావితం చేశాడు. పాండవపక్ష కార్యనిర్ణేత అయ్యాడు. కర్ణుడికి, కృష్ణుడికి ఇద్దరికి మహాభారతయుద్ధం ఇష్టమే – అయితే కర్ణుడికి స్వీయప్రయోజనానికి, శ్రీకృష్ణునికి విస్తృతసామాజిక ప్రయోజనానికి.

**కుటుంబవ్యవస్థ – అన్నదమ్ముల అనుబంధం**

భారతీయ కుటుంబవ్యవస్థలో కుటుంబసభ్యుల ఐకమత్యం, కుటుంబసుఖశాంతులు, కుటుంబ అభ్యున్నతి ఆధారపడి ఉండేది– అన్నదమ్ములు అనుబంధాలమీదబీ ఆత్మీయతల మీదబీ అంతకంటే ఎక్కువగా తరువాతి తరం వారైన అన్నదమ్ముల కొడుకుల అనుబంధాలమీదబీ ఆత్మీయతల మీదబీ అంతకంటె ఇంకా ఎక్కువగా ఆధారపడి ఉండేది– ఆస్తి విషయంలో, కుటుంబ ఆధిపత్యం విషయంలో ఏ తరానికి ఆ తరంలో, అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు వహించే వైఖరిమీద. ఇక సంపన్న కుటుంబాల్లో, రాజ కుటుంబాల్లో ఈ విషయం విశేషించి చెప్పనే అక్కరలేదు.

భారతీయ సంస్కృతిలోని కుటుంబవ్యవస్థలో తండ్రి తరువాత కుటుంబ, ఆధిపత్యం జ్యేష్ఠ పుత్రునిదే. అందుకే 'జ్యేష్ఠం పితృ సమం' అన్నారు. తండ్రి తరువాత అన్నగారి ఆజ్ఞను కుటుంబంలో తమ్ములందరు పాటించవలసిందే. అన్నగారిని అనుసరించి నడువవలసిందే. కాని, అన్నదమ్ముల అనుబంధాల్లో, ఆత్మీయతల్లో తేడావస్తే, ఇందులో తేడా వస్తుంది. కుటుంబ ఐకమత్యం దెబ్బతింటుంది. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమౌతుంది. ఆస్తుల పంపకాలకు దారి తీస్తుంది. అసూయాద్వేషాలకు అవకాశమేర్పడుతుంది. ధర్మం దెబ్బతింటుంది. సుఖశాంతులు లోపిస్తాయి. సంఘర్షణలు చోటు చేసుకొంటాయి. హింససంభవిస్తుంది.

ఆస్తి పంపకం జరిగినా పెద్దవాడిదే పెద్ద భాగం. ఇది భారతీయకుటుంబ ధర్మం.

ఇక రాజ్యవిషయం, రాజకుటుంబాల విషయం. రాజ్యం అవిభాజ్యం కనుక, అది విభాగాలైతే బలహీనమౌతుంది కనుక, శత్రురాజుల ప్రమాదం పెరుగుతుంది కనుక, ప్రజాసంక్షేమం దెబ్బతింటుంది కనుక– రాజకుటుంబాల్లో రాజ్యవారసత్వం జ్యేష్ఠునిదే. అతని తరువాత అతని జ్యేష్ఠపుత్రునిదే. తమ్ములకు, తమ్ములపిల్లలకు రాజ్యాధికారం ఉండదు– ఏదో జరిగితే తప్ప– అంటే జ్యేష్ఠునికో, జ్యేష్ఠుని జ్యేష్ఠ పుత్రునికో అంగవైకల్యమో, తీరని అనారోగ్యమో, సంతాన విహీనతో ఏర్పడితే తప్ప. ఇది భారతీయ ధర్మశాస్త్రాలు చెప్పిన ధర్మం. కాని, స్వార్థం ఎంతో అదుపులో ఉంటే తప్ప, ధర్మనిష్ఠ ఎంతో పటిష్ఠంగా ఉంటే తప్ప, రాజకుటుంబాల్లో తమ్ముళ్ళు, తమ్ముళ్ళకొడుకులు ఈ ధర్మంతో సమాధాన పడటం చాల కష్టం. అందుకే రాజకుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య అనేక కలహాలు, హత్యలు.

కురువంశకుటుంబంలో భీష్ముడు, చిత్రాంగద విచిత్రవీర్యులు ఒకే తల్లి పిల్లలు కాకున్నా, ఆ అన్న దమ్ముల మధ్య అనుబంధం ఎంతో ఆత్మీయంగానే సాగింది. రాజ్య వారస్వత్వం జ్యేష్ఠుడైన భీష్మునిదే అయినా, తండ్రికొరకు ఆయన త్యాగం చేశాడు కనుక, తమ్మునికి లభించింది. అంతేకాక భీష్ముడు తన తండ్రికొరకు గృహస్థాశ్రమాన్ని కూడ వదలుకొని, తమ్ముల భవితవ్యానికి సంబంధించిన బాధ్యతలు స్వీకరించాడు. పట్టాభిషిక్తుడైన చిత్రాంగదుడు మితిమీరిన అహంకారంతో గంధర్వులతోకూడ కయ్యానికి కాలుదువ్వి ఆకాల మరణం చెందాడు. తరువాత పట్టాభిషిక్తుడైన విచిత్రవీర్యుడు మితిమీరిన శృంగారంతో అనారోగ్యం పాలై అకాలమరణం చెందాడు. ఇద్దరు కురువంశానికి వారసులు అందివ్వకుండానే మరణించారు.

తరువాత ధృతరాష్ట్రపాండురాజులు. ఇద్దరు ఒకే తల్లి పిల్లలు కాకున్నా, ఆ అన్నదమ్ముల మధ్య అనుబంధం ఎంతో ఆత్మీయంగానే సాగింది. రాజ్య వారస్వత్వం జ్యేష్ఠుడైన ధృతరాష్ట్రునిదే అయినా, అంధత్వం వల్ల ఆయన రాజ్యానర్హుడైనా, తమ్ముడు పాండురాజు రాజైనా రాజ్య వారస్వత్వం, వారిద్దరిమధ్య వైరానికి దారి తీయలేదు. ధర్మాత్ముడైన పాండురాజు అన్నగారికి ఏ అసంతృప్తి కలుగకుండ, అన్నీ అన్నగారిని సంప్రతించే చేశాడు. అన్నగారి భోజనాది విషయాల్లోకూడ శ్రద్ధవహించాడు. ప్రజారంజకుడైన పాలకుడుగా, రాజ్యాన్ని విస్తరించిన విజేతగా విఖ్యాతి గడించాడు.

కురువంశకుటుంబంలో ఏర్పడిన సమస్య అంతా ఆ అన్నదమ్ముల కొడుకులైన కౌరవులు పాండవుల మధ్య. కాని, కౌరవులు వందమంది అయినా ఆ అన్నదమ్ముల మధ్యకలతలు లేవు. అందరు అన్నగారైన దుర్యోధనుని అనుసరించి నడుచుకొన్నవారే. వికర్ణుడు ఒక్కసారి అన్నగారిని వ్యతిరేకించినా, కర్ణుడతనిని అణగకొట్టాడు. పాండవులైదుగురు ఒకే తల్లి పిల్లలు కాకున్నా, సవతుల పిల్లలైనా వారిది ఎంతో ఆత్మీయమైన అనుబంధం. మహాప్రస్థానానికి కూడ అందరు కలిసి వెళ్ళారు. అయితే భీముడు మాత్రం రెండుమార్లు మహాతీవ్రంగా అన్నగారికి ఎదురుతిరిగాడు. ఆ రెండుమార్లూ అర్జునుడే భీముని చల్లబరిచాడు.

మహాభారతంలో ప్రధానరాజవంశమైన కురువంశకుటుంబంలో, ధృతరాష్ట్రుని అంధత్వం వల్ల, కిందముని శాపంవల్ల అన్నదమ్ముల పిల్లలైన కౌరవపాండవులమధ్య రాజ్య వారస్వత్వాన్ని గూర్చిన సమస్య ఏర్పడినా– అది ధృతరాష్ట్రుని పుత్రమమకారం వల్ల, దుర్యోధనుని అసూయాగ్రస్త మనస్తత్వం వల్ల, కర్ణదుర్యోధనులమైత్రివల్ల, శకుని కౌటిల్యం వల్ల ఆ సమస్య ఎంతో తీవ్రమైంది. దానికి శాశ్వత పరిష్కారంగా రాజ్యవిభాగం జరిగినా, ధర్మరాజు మహావైభవోపేతంగా చేసిన రాజసూయ యాగంవల్ల, మయసభావిచిత్ర వైభవంవల్ల పరిష్కారమైందని అనుకొన్న వారస్వత్వ సమస్య దుర్యోధనునికి ప్రబలరాజకీయ సమస్యగా, తీవ్రాతి తీవ్రమైన మానసిక సమస్యగా మారింది. 'ఓర్వ వచ్చునే సపత్నుల వృద్ధియు ఆత్మహానియున్' అని అతడు క్రుళ్ళి కృశించేటట్లు చేసింది. 'పాండవుల సంపద నెవ్విధంబున నపహరింపనగు' అన్న దురాలోచనకు కూడా పూరికొల్పింది. అన్నదమ్ముల అనుబంధాన్ని అమితంగా దెబ్బతీసింది. ధర్మరాజు ద్యూతవ్యసనం, శకుని మాయాద్యూతం ఈ సమస్యను దుర్యోధనునికి అనుకూలంగా మలుపు త్రిప్పినా– ద్రౌపదీమానభంగం, భీముని ప్రతిజ్ఞలు ఈ సమస్యను ఆరని అగ్నిగుండంగా మార్చాయి. "వాడి సూది మొన యించుక మోపినయంత మాత్రయున్ భూమి యొనర్చి పాండునృప పుత్రుల కిత్తునే, యెవ్వరైన సం? గ్రామమునన్ జయంబుగొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్" అని దుర్యోధనుడు నిండు సభలో చేసిన నిశ్చయాత్మక మూర?ప్రకటన, అగ్నికి అంతులేని ఆజ్యం పోసినట్లయింది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపన రూపమైన శ్రీకృష్ణుని మహోద్యమ లక్ష్యం పెనుగాలిలావీచి, ఆ కురువంశరాజకుటుంబ సమస్య యావద్భారత సమస్యగా మారటానికి, మానవజాతి మరువలేని మహామారణ హోరీమం జరుగటానికి దోహదం చేసింది.

ఓడినవాళ్ళు యుద్ధరంగంలో ఏడిస్తే, గెలిచినవాళ్ళు ఇంటికి వెళ్ళి ఎంతకాలమో ఏడ్చారు.

ఇంతకీ ఒక కుటుంబంలో అన్నదమ్ముల మధ్య ఇంత యుద్ధం ఎందుకు జరిగింది? భూమి కొరకు.

**మహాభారతంలో కుటుంబ వ్యవస్థ – మానవాళికి సందేశం**

మానవుడు భూమి మీదికి వచ్చాడు గాని, ఏ మానవుడూ ఈ భూమిని తాను తేలేదు. భూమి అందరిది. అందరు మానవులకు మౌలికమైన ఆస్తి ఈ భూమే. దీన్ని అనుభవించటానికి అందరికి సమానమైన హక్కు ఉంది. భూమిమిది హక్కుల్లో, భూమి మీది ఆక్రమణల్లో కాలక్రమాన ఏర్పడిన తేడాలన్నీ– బలవంతుడు బలహీనుని అణిచివేయటం వల్ల ఏర్పడినవే.

ఇది మౌలికసత్యం. ఈ మౌలిక సత్యాన్ని మరచి బలవంతుడు అంతకంతకు స్వార్థపరుడై అంతా తనకు కావాలని, అన్నీ తనకే ఉండాలని, ఎదుటివారికి ఏమీ ఇవ్వనని దుర్యోధనునిలా ప్రవర్తించినందు వల్లనే ఈ నేలమీద అనేక స్వామ్యసంఘర్షణలు – భూమిపోరాటాలు, నీటిపోరాటాలు, ఆస్తిపోరాటాలు, అధికారపోరాటాలు– మారణ హోమాలు.

కాని, పంపకం మానవజీవితంలో, మానవ సమాజంలో అపరిహార్యభాగం. మానవసంఖ్య పెరిగే కొందీ, మనిషిలో సామాజిక చైతన్యం బలపడేకొందీ, నాగరికత పేర ఐహికవాంఛలు అధికమయ్యేకొందీ పంపకానికి ప్రాధాన్యం పెరుగుతుంది. ఉన్నవాడు తన స్వార్థాన్ని అదుపుచేసుకొని, పరార్థభావాన్ని పెంపొందించుకోకుంటే, అతడికి లేనివారితో పోరు తప్పదు.

ఎంతబలమున్నా తుదకు దుర్యోధనునిలా పతనం కూడా తప్పదు. ఏదో ద్వాపరయుగంలోనే కాదు– ఈ యుగంలో కూడ ప్రపంచదేశాల్లో ఈలాంటి సంఘటనలు అనేకం. ఈ యుగంలోనే కాదు– ఏ యుగంలో నైనా ఈలాంటివి తప్పవు. మొత్తం మానవాళికి, ప్రత్యేకించి ఉన్నవాళ్ళకు, బలవంతులమని అనుకొనే వాళ్ళకు మహాభారతంలో కురుపాండవ కుటుంబ సమస్య ఇచ్చే మొదటి సందేశం– మానవుని సహజీవన సంస్కృతికి ఎంతో అవసరమైన సందేశం– 'పోరు నష్టం పొందు లాభం' అనిబీ ఉన్నవాళ్ళు స్వార్థాన్ని తగ్గించుకొని పరార్థభావాన్ని పెంచుకొంటే మంచిదని.

భారతీయులది ప్రధానంగా వ్యావసాయిక యుగ సంస్కృతి. మానవత్వపు విలువలతో కూడిన సంస్కృతి (Value oriented culture). పాశ్చాత్యులది ప్రధానంగా పారిశ్రామికయుగ సంస్కృతిబీ అంగడివీథి సంస్కతి (Market oriented culture) ఆర్థిక సంస్కృతి (Money oriented culture).

ఈనాడు ప్రపంచమంతా పాశ్చాత్య సంస్కృతే వ్యాపించి ఉంది. మానవుడు మితిమీరిన ధనాశతో మానవత్వపు విలువల్ని విస్మరించి అధర్మమార్గంలో అతివేగంగా పరుగులు తీస్తున్నాడు. కనిపెంచిన తల్లి దండ్రులను, కట్టుకొన్న భార్యను, కన్న పిల్లల్ని, అన్నదమ్ముల్ని, బంధుమిత్రుల్ని ప్రేమాభిమానాల దృష్టితో కాక, లాభనష్టాల దృష్టితో చూస్తున్నాడు. ఎంతో ఆహ్లాదంగా కటుంబసభ్యులతో, బంధుమిత్రులతో గడుప వలసిన పండుగలను కూడ బస్టాండ్లలోనో, రైల్వేస్టేషన్లలోనో, కాఫీ హొటళ్ళలోనో గడుపుకొంటున్నాడు. చాల కుటుంబాల్లో ఆర్జనయోగం ఉన్నా అనుభవయోగం లేదు. అనేక కుటుంబాల్లో ఆర్జనయోగం, అనుభవయోగం రెండూ ఉన్నా, ఆనందయోగం లేదు. కుటుంబ సభ్యులు విలాసవంతమైన హొటలు గదుల్లో విహారయాత్రకు వచ్చిన వారిలా జీవిస్తున్నారు. ఆత్మీయతలతో, అనురాగాలతో, ప్రశాంత మనోహరమైన సహజీవన సంస్కృతితో, పరస్పర సహాయ సహకారాలతో ఐహిక జీవితమాధుర్యాన్ని అనుభవించటానికి, ఆముష్మికమహొన్నతిని అందుకోటానికి ఏర్పడిన భారతీయ కుటుంబవ్యవస్థ, అతిశయించిన అర్థాశతో, మితిమీరిన స్వార్థంతో, ఆత్మీయతలకు, అనురాగాలకు దూరమై, ప్రశాంతత కరువై, కలహాలకు నిలయమై ముక్కలు ముక్కలుగా విడిపోతున్నది. సంపన్న కుటుంబాలకు ఆర్థిక సమస్యలుండవు. సౌకర్యాల కొరతలుండవు. ఉండేవన్నీ వ్యక్తుల మనస్తత్వాల సమస్యలే.

మహాభారతంలో కురువంశకుటుంబానికి లోటేమిటి? ఎంత ఐశ్వర్యం! ఎంత అధికారం! ఆనాడు భారతదేశంలో అదే కదా పెద్దరాజ్యం. అయినా కౌరవులు గాని, పాండవులుగాని ప్రశాంతంగా బ్రతికారా? జీవితంలో ఆనందాన్ని స్థిమితంగా అనుభవించారా? అందుకు కారణం ఆ కుటుంబంలో కొందరి మనస్తత్వాలే కదాబీ మితి మీరిన స్వార్థమేకదా.

అందుకే మహాభారతంలో కురుపాండవ కుటుంబసమస్య ఇచ్చే మరో సందేశం– ఎంత అధికారైశ్వర్యాలున్నా– కుటుంబసభ్యుల మనస్తత్వాలు సరిగాలేకుంటే, కొంతమంది కుటుంబ సభ్యుల్లో స్వార్థం మితిమిరితే ఏ కుటుంబం కూడ ప్రశాంతంగా బ్రతుకలేదనిబీ కుటుంబసభ్యులెవ్వరు ఆనందంగా ఉండలేరనిబీ తమవల్ల తమకే అనర్థాలు సంభవిస్తాయని. సరోవరంలో బండపడితే ప్రకంపనలు ఒకచోటికే పరిమితమౌతాయా? సరోవరం అంతా వ్యాపిస్తాయి. మొత్తం సరోవరం అల్లకల్లోలమౌతుంది.

మహాభారతంలో ఆర్జనయోగం లేకున్నా ఆత్మీయతలతో, అనురాగాలతో, కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అది అందరిదన్న సమష్టి భావనతో, అవసరమైతే ఒకరికొరకు మరొకరు తమ స్వార్థాన్ని త్యాగం చేసే మహొన్నత మనస్తత్వంతో, పరోపకార ప్రకృతితో ఆనందంగా జీవించిన ఏకచక్రపురాగ్రహార బ్రాహ్మణ కుటుంబంనుండి, సక్తుప్రస్థుని కుటుంబం నుండి మానవాళి నేర్చుకోవలసింది ఎంతోఉంది.

కుటుంబవ్యవస్థ అర్థకామానుభవానికి ఆటపట్టే అయినా, మధురాతిమధుర మాధ్వీక కాసారమే అయినా– మానవుడు ఆ తేనెలో ఈగలా అట్టె పడి ఉండకూడదు. అలా అయితే అతని జీవితం అసంపూర్ణం, జీవిత పరమార్థసాధనకు దూరం.

అందుకే భారతీయ సంస్కృతి వానప్రస్థసన్యాసాశ్రమాలను మన జీవిత దశలలో చేర్చింది. మన జీవన విధానాన్ని రూపొందించింది. వానప్రస్థం అంటే తప్పని సరిగా అందరు ఒక దశలో అడవులకు వెళ్ళాలని కాదు. వానప్రస్థం ప్రధానంగా ఒక మానసిక స్థితి. కుటుంబ సభ్యులను, ఆస్తులను, వస్తువులను అంటిపట్టుకునే గుణాన్ని వదలుకొనే స్థితి. తామరాకు మీది నీటి బొట్టు తత్త్వాన్ని అలవరచుకొనే స్థితి. సన్న్యాసం అంటే అందరిని, అన్నింటిని వదలుకొన్న స్థితి. సర్వసంగాలను పరిత్యజించిన స్థితి. పరమాత్మలో మనస్సును పూర్తిగా లగ్నం చేసిన స్థితి.

తాత్త్వికంగా ఆలోచిస్తే కుటుంబంలోని ఈ తల్లిదండ్రులు, ఈ భార్యాబిడ్డలు, ఈ అన్నదమ్ములు, ఈ బంధుమిత్రులు గత జన్మలో ఎవరు? వచ్చే జన్మలో? అందువల్ల మితిమీరిన మమకారంతో అతిగా వాళ్ళను అంటిపట్టుకోవటం, వాళ్ళకొరకు అనేక అధర్మాలు, అక్రమాలు చేసి ఆర్జించటం ఎంత మూర?త! పది జన్మలకు సరిపడే పాపాన్ని మూటగట్టుకోవటం ఏమి విజ్ఞత?

చివరికి ఎవరైనా అందరిని వదలుకోక తప్పదు. అన్నింటిని వదలుకోక తప్పదు. ఇది మానవజీవిత మౌలికసత్యం. ఈ మౌలికసత్యానికి అద్భుతమైన ఇతిహాసోదాహరణమే కురుపాండవకుటుంబ చివరిస్థితి.

కురుపాండవ కుటుంబ సభ్యులంతా గత జన్మలో ఎవరికెవరు? వచ్చే జన్మలో ఎవరికెవరు ఏమౌతారు? అంత పుత్రమమకారంతో కొడుకుల అక్రమాలను, అన్యాయాలను ఉపేక్షించిన ధృతరాష్ట్రుని గతి చివరకు ఏమైంది? కడకు ఒక్క కొడుకైనా ఆయనకు మిగిలాడా? జీవితచరమదశలో ఎంత క్షోభ అనుభవించాడు? హస్తినలో ఉండగలిగాడా? ఆలాగే, పినతండ్రి కొడుకులైన పాండవుల రాజ్యం అపహరించి, వాడిసూది మొన ఇంచుక మోపినంత భూమికూడ వాళ్ళకు ఇవ్వనని అంతమొండిపట్టు పట్టి, అన్ని దుర్మార్గాలకు పాల్పడ్డ దుర్యోధనుడు, అతని సోదరులు చివరికి ఏమయ్యారు? వాడి సూది మొన మోపినంత భూమి నైనా వెంట తీసుకొని వెళ్ళగలిగారా? జీవితంలో ఎంతో కష్టపడి, అంత పెద్ద యుద్ధం చేసి, రాజ్యాన్ని సంపాదించుకున్న పాండవులు కూడ అంతావదిలి, అన్నీ వదలి మహాప్రస్థానం సాగించలేదా? అర్జునుడు అంత ఇష్టపడి మహాప్రస్థానంలో కూడ వెంట తెచ్చుకొన్న గాండీవాన్ని కూడ వదలక తప్పలేదుకదా?

అందువల్ల మితిమీరిన మమకారాలతో అతిగా అన్యాయాలు చేసి, కుటుంబం కొరకు ఆస్తులను, వస్తువులను కూడబెట్టేవాళ్ళకు, చివరి శ్వాసదాకా వ్యాపారలాభాలు చాలటం లేదనో, కోర్టు వ్యవహారాలు అనుకూలించటం లేదనో, రాజకీయాలు ఫలించటం లేదనో, మనుమలకు మనుమరాళ్ళకు పెళ్ళిళ్ళు కావటం లేదనో ఆరాటపడే వ్యక్తులకు- ఒక విధంగా మహాభారతంలో కురువంశ కుటుంబ పరిణామాలు కనువిప్పు కలిగిస్తాయి. మానవ జీవితతత్త్వాన్ని గూర్చి ప్రతిమానవుడు ఆలోచించుకొనేటట్లు చేస్తాయి.

మానవుడు కుటుంబవ్యవస్థను తన ఐహిక జీవితానికి వరంగా చేసుకోవాలిగాని, ఆముష్మికోన్నతికి శాపంగా మార్చుకోకూడదు.

**ఆధార గ్రంథాలు**

1. మహాభారతం – ధ్వని – ఆచార్య శలాక రఘునాథశర్మ.
2. మహాభారతం – తి.తి.దే. ప్రచురణలు

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 25. మహాభారతంలోని ధర్మమార్గములు - వాటి ఆవశ్యకత

– కైపు. యర్రారెడ్డి, మదురై

వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల నాల్గింటి సారం ఇందులో చోటుచేసుకున్నందువల్ల భారతాన్ని పంచమవేదంగా పిలుస్తున్నాము. ఇది భారతీయ విజ్ఞాన సర్వస్వంగా ప్రశస్తి పొందింది. భారతాన్ని మహాభారతం అని వ్యవహరిస్తుంటారు. ఈ భారతానికి ముందు వాడే మహత్ అనే శబ్దం ఒక్క భారతానికి మాత్రమే వాడుతారు. మరే ఇతర ఆధ్యాత్మికమైనటువంటి గ్రంథాలకు ఆపాదించరు. రామాయణాన్ని మహా రామాయణం అని కానీ, భాగవతాన్ని మహాభాగవతము అని కానీ సంబోధించము. కేవలం ఒక్క భారతానికి మాత్రమే మహత్ అనే శబ్దాన్ని ఉపయోగించి మహాభారతము అని ప్రయోగిస్తాం. భారతంలో 18 పర్వాలు, ఎన్నో వేల శ్లోకాలు ఎన్నో వేల పాత్రలు ఎన్నో వందల వేల విశిష్ట పాత్రల గొప్పదనం గురించి మహాభారతం తెలియజేస్తుంది.

ఆంధ్ర మహాభారతం అదొక మహాసముద్రం. మహాసముద్రాలలో ఎన్నెన్నో విషయాలు, మరెన్నో నిక్షేపాలు దాగి ఉన్నట్లుగానేబీ మహాభారతంలో ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు, నైతిక విలువలు, ఎన్నో ఉపదేశాలు, ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సమాధానాలు దాగి ఉన్నాయి. చారిత్రకంగా మనం చూసినట్లయితే ఈ ప్రపంచంలో రెండు మహా ప్రపంచ యుద్ధాలు సంభవించాయి. అవన్నీ కూడా దేశాలకు మరో దేశాలకు మధ్య జరిగాయి. కానీ చరిత్రలో గొప్ప ఇతిహాసంగా పేరొందిన మహాభారతంలోని యుద్ధం మాత్రం కురు వంశానికి పాండవులకు మధ్య జరిగింది. కౌరవులకు పాండవులకు మధ్య జరిగింది. మంచికి చెడుకు మధ్య జరిగింది. ధర్మానికి అధర్మానికి మధ్య జరిగింది.

అన్నదమ్ముల బిడ్డలు అన్నదమ్ములు గాక వారి మధ్య వైరం కొట్లాట వరకు వెళ్లింది అని అంటే దాని వెనుక ఎంత బలమైనటువంటి కారణాలు, ఎంత బలమైనటువంటి పరిస్థితులు ఉండి ఎంతటి ఉపద్రవానికి దారి తీసాయో మనం గ్రహించగలగాలి. ఎటువంటి క్లిష్ట పరిస్థితులైనా వ్యక్తులను, సమాజంలోని సంబంధ బాంధవ్యాలను తారుమారు చేస్తాయో అర్థం చేసుకోగలగాలి. పరిస్థితులన్నీ ఒకే విధంగా ఎప్పుడూ ఉండవు. పరిస్థితులకు అనుగుణంగా మార్పు చెందుతూ ఉండాలి. పరిస్థితి ఏదైనా, సందర్భం ఏదైనా, కాలం ఏదైనా, దేశం ఏదైనా మన ప్రవర్తన తీరు ఒకే విధంగా ఉన్నట్లయితే మనల్ని ఎవరు ఏమి చేయలేరు. మంచిని ఎప్పుడూ కూడా చెడు జయించలేదు. ధర్మాన్ని ఎప్పుడూ కూడా అధర్మం గెలవలేదు. కానీ ఆనాడు జరిగినటువంటి యుద్ధం యొక్క ప్రతిఫలాన్ని మాటల్లో వర్ణించలేము. దానివల్ల జరిగిన నష్టం ఊహించలేనిది. అన్నదమ్ముల మధ్య జరిగిన పోరులోని తీవ్రత అంతా ఇంతా కాదు. అన్నదమ్ములలో రగిలిన రాజ్యకాంక్ష ఆ రాజ్యంలో నెత్తుటేరులను పారించింది. ఒక్క ఆడదాని పరాభవ ప్రతీకార ప్రతిఫలం కురువంశ వినాశనానికి నాంది పలికింది. ఈనాడు లోకంలో ఒక గొప్ప సామెత ఉంది. “ఆడదాని ఉసురు తగిలితే బాగుపడరు రా” అని మన పెద్దలు అంటూ ఉంటారు. ఆడదాని వల్ల ఎన్నో రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయి ఒక్క ఆడదాని వల్లే కురువంశ నాశనం జరిగింది. మహాభారతంలో 18 రోజులు మహా యుద్ధం సంభవించింది. దీనికి ముందు ఎన్నో సంఘటనలు, దీనికి ముందు జరిగినటువంటి ఎన్నో విపత్కర పరిస్థితులు కౌరవుల హృది లోలోపల అనిగిమనిగి ఉన్న కోపావేశాలన్నింటికి ఈ ఒక్క సంఘటన హోమాగ్నిలో ఆజ్యం పోసినట్లైంది. ఆనాడు మయసభలో జరిగినటువంటి ఒకే ఒక్క సంఘటన కురువంశంలో అగ్రజుడైన దుర్యోధనుని మనసులో ఉన్నటువంటి కోపావేశాలను బ్రద్దలు కొట్టింది. “శేషం కోపేన పూరయేత్” అని సంస్కృతంలో ఒక గొప్ప మాట. ఒక సమస్యనో, చర్చనో, వివాదాన్నో తుదిదాకా ఓపికగా సర్దుబాటు (హ్యాండిల్) చేయడం చేతకానివారు మధ్యలోనే కోప్పడి– ఆ కోపంతోనే ఆ శేషాన్ని పూరించినట్లు అనుకుంటారట. కర్ణుని చావుకు వంద కారణాలు అన్నట్లుగా మహాభారత యుద్ధం జరగడానికి దుర్యోధనుని మితిమీరిన కోపం కూడా ఒక అందుకు కారణమే. మయసభలో దుర్యోదనునకు ఏర్పడిన అవమాన ప్రతీకార జ్వాలలే తర్వాత రోజులలో జరిగిన యుద్ధానికి ప్రేరకాలు.

ఈ సంగ్రామానికి సాక్షాత్తు దైవమే ఒకరి పక్షాన నిలబడి సాక్షి భూతంగా సంగ్రామాన్ని నడిపించింది అంటే ఇక్కడ కొంతమందికి దైవము పక్షపాతం వహించింది అని అనిపించవచ్చు. కానీ లోతైన అవగాహన, ధర్మాధర్మముల విచక్షణ, ఆధ్యాత్మికతా జ్ఞానం కలిగినటువంటి ప్రతి ఒక్కరికీ అవగతమయ్యే విషయం ఏమిటంటే ఆ దైవం ధర్మపక్షాన నిలిచింది అని, ధర్మం వైపు మాత్రమే నిలబడింది అని తెలుస్తుంది.

ధర్మాన్ని కాపాడిన వ్యక్తిని ధర్మం ఏ విధంగా కాపాడుతుందో మహాభారతంలో మనకు కోకొల్లలుగా ఉదాహరణలు కనిపిస్తుంటాయి. అందుకే మన పెద్దలు "ధర్మో రక్షతి రక్షితః" అని అన్నారు. మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుంది.

సమాజంలో ప్రతి వ్యక్తికి ఎన్నో క్లిష్టమైన పరిస్థితులు ఎదురవుతుంటాయి. ప్రతినిత్యం వాటితో పోరాడవలసి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఆ పరిస్థితులకు లొంగిపోవాల్సి వస్తుంది కూడా. అయినప్పటికీ వ్యక్తి ఏ సూక్ష్మ బిందువును అంటుపెట్టుకుని ధైర్యంగా స్థైర్యంగా నిలబడుతున్నాడో ఆ సూక్ష్మ బిందువు యొక్క ప్రతిరూపాలు అయినటువంటి ధైర్యం, స్థైర్యమే ధర్మ మార్గం. ఆ ధర్మ మార్గాన్ని ఎవరైతే వీడరో ఎవరైతే అంటిపెట్టుకొని ఉంటారో వారిని మాత్రమే ఆ ధర్మం తన శ్వాస పవనాలను ఆ వ్యక్తికి అందిస్తుంది. తన అరచేతుల్లో అంటిపెట్టుకొని ఉంటుంది.

మహాభారతంలోని ధర్మాన్ని అనుసరించిన వ్యక్తులలో ధర్మరాజు నిజంగా ధర్మాన్ని పాటించాడా? నిజంగా ధర్మరాజు ధర్మాన్ని పాటిస్తే మరి తమ్ముళ్ళు, ఆలియైన పాంచాలి అని పిలవబడే ద్రౌపది ఎందుకు కష్టాల పాలయ్యారు? ఒక వ్యక్తి ఎప్పుడైతే ధర్మ మార్గాన్ని అనుసరిస్తాడో అప్పుడు దైవం మనల్ని ఇంకా ఇంకా పరీక్షిస్తుంది. ఎటువంటి క్లిష్ట సమయాల్లో కూడా వ్యక్తి ధర్మ మార్గాన్ని వీడకుండా అలాగే ఉంటాడో అని మనల్ని ఇంకా ఇంకా పరీక్షిస్తుంది. అట్లాంటి సమయంలో మనం విచక్షణా జ్ఞానాన్ని కోల్పోకుండా ఎప్పుడైతే ధర్మాన్ని మాత్రమే అనుసరిస్తామో లోకం మొత్తం దాసోహం అవుతుంది. ధర్మ మార్గాన్ని అంటిపెట్టుకొని ఉన్నారు కాబట్టి పాండవులు ఎంత కష్టపడ్డా, తుదకు వారికి తగిన మోక్షం లభించింది.

ఆనాటి ప్రజలు దైవం మన పక్కనే మనతోనే ఉన్నది అనుకోని బ్రతికారు. అందుకే వారు అధర్మ మార్గం వైపు వెళ్లలేదు. కానీ ఇప్పటి సమాజంలో ధర్మం, న్యాయం అనే మాటలను అర్థ విపరిణామానికి అద్దేకిస్తాము కావాలంటే తీసుకోండి అని జి.ఎన్.రెడ్డి గారిని అడుగుతారు. అవకాశం ఉంటే వాటితో లావాదేవీలు కూడా జరుపుతారు. అంతటి ప్రబుద్ధులే. ఈ జనరేషన్ అటువంటిది మరి.

ఇప్పటి సమాజానికి ఆనాటి ధర్మం, సత్యం, దైవం, ప్రేమ, మానవత్వం ఏ విధంగా ఒంటపట్టించాలి. సమాజాన్ని ఏ విధంగా సన్మార్గం వైపు నడిపించాలి. ఈ నడుస్తున్న సమాజ కాలువల్లోకి ధర్మం అనే చక్కెర నీటిని ఎలా పారించాలి. ఈ సమాజంలో ధనవంతులు, పేదవారు, బక్కవారు, లావుగలవారు, పొడుగువారు, పొట్టివారు, బలవంతులు, బలహీనులు, చదువుకున్న వారు, చదువులేని వాళ్ళు, జ్ఞానం ఉన్నవారు, జ్ఞానం లేనివారు, మంచివారు, చెడ్డవారు ఇలా భౌతికంగా ఎంతో సారూప్యం కలిగిన వ్యక్తులు చాలా మంది ఉన్నారు. భౌతికంగానే వ్యక్తుల మధ్య ఇంత వైవిధ్యం ఉంటే మరి మానసికంగా వైవిధ్యం కలిగిన వారు కోకొల్లల మంది ఉంటారు. ఇంతమంది ఉన్నటువంటి ఈ సమాజంలోని వ్యక్తుల హృదయాంతరాల్లోకి సన్మార్గ పువ్వుల పరిమళాల పవనాలను ఏ విధంగా ప్రసరింపజేయాలి. వారి జీవనశైలి నరాల్లోకి మానవత్వం ఇంజక్షన్లు ఎలా ఎక్కించాలి. వీటన్నింటికీ సమాధానం ఒక మహాభారత గ్రంథం మాత్రమే. ఇదొక ఎన్సైక్లోపీడియా అని అనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఇంతటి గొప్ప గ్రంథాన్ని ఇప్పుడున్న సమాజానికి ఏ విధంగా చేరువ చేయాలి?

మన చుట్టూ ఉన్నటువంటి ఈ సమాజంలోని వ్యక్తుల పట్ల మనం ఏ విధంగా నడుచుకోవాలి? ఏ విధంగా మసలుకోవాలి? మన నడవడికను నలుగురు విమర్శించకుండా మెచ్చుకునేలా ఏ విధంగా బ్రతకాలి? అనేటువంటి గొప్ప విషయాలను ఈ గ్రంథం తెలియజేసింది. అధిక కోపం కలిగి ఉంటే ఎంత వినాశనం సంభవిస్తుందో మహాభారతంలోని

పాత్రలు చూపించాయి. కోపం, పగ, ఆవేశం ఇవన్నీ కూడా మనిషి యొక్క పతనానికి నాంది పలుకుతాయి. ఇవన్నీ కూడా వ్యక్తి యొక్క ఉన్నతాన్ని, వ్యక్తిత్వాన్ని, హుందాతత్వాన్ని ఒక్కొక్క మెట్టు దిగజారుస్తాయి. మనిషి యొక్క వ్యక్తిత్వ వికాసనాన్ని హరింపజేస్తాయి. మనిషి యొక్క మూర్తిమత్వాన్ని మరుగున పడేస్తాయి. వ్యక్తి కోపం కలిగి ఉండాలి. ఎంతవరకు మాటల్లో మాత్రమే కోపాన్ని కలిగి ఉండాలి. మనసు నిండా ప్రేమను నింపుకోగలగాలి. కానీ కొన్ని పాత్రలు అందుకు భిన్నంగా కోపమే జీవిత పరమావధిగా బ్రతికి జీవితాన్ని ఏ విధంగా సర్వనాశనం చేసుకున్నారో మహాభారతంలోని ఎన్నో పాత్రలు తెలిపాయి. ఆనాడు మయసభలో దుర్యోధనకు జరిగిన ఘోర పరాభవాన్ని తలుచుకొని పరిచారికలతో పగులబడి నవ్వినటువంటి పాంచాలి మీద పగ సాధించుటకై, పాండవులందరిపై పగ సాధించుటకు యావత్తు కురువంశాన్ని చేజేతులా నాశనం చేసినటువంటి పాత్రను గురించి మనం తెలుసుకోవాలి. అందులో ఉన్న నీతి ఏంటి తెలుసుకోవాలి. ఆ పాత్ర చేసినటువంటి తప్పిదాలు ఏంటో తెలుసుకోవాలి. ఆ పాత్ర అధర్మ మార్గం వైపు నడిచిన కోణం గురించి మనం తెలుసుకోవాలి. ఆ పాత్రను అధర్మ మార్గంవైపు నడిపించిన మరెన్నో పాత్రలను గురించి తెలుసుకోవాలి. అసలు ఎందుకు కొన్ని పాత్రలు అధర్మ మార్గం వైపు నడిచాయి అనేది తెలుసుకోవాలి. ధర్మ మార్గం వైపు ఎందుకు నడవలేకపోయాయి అనేది తెలుసుకోవాలి. ధర్మ మార్గాన్ని గనక అనుసరించి ఉంటే జరిగే పరిణామాలను మనం విశ్లేషించగలగాలి.

మనల్ని నవమాసాలు మోసి, కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పించి, ఇంతటి ఉన్నత స్థానంలో నిలిపినటువంటి తల్లిదండ్రులకు తిరిగి మనం ఏమివ్వగలం. ఏమిచ్చి వాళ్ళ రుణాన్ని మనం తీర్చుకోగలం. తన ప్రాణాన్ని పణంగా పెట్టి మనకు జన్మనిచ్చే తల్లి, తన సౌఖ్యాన్ని, సుఖాలను వదిలి ఎన్నింటినో త్యాగం చేసి మనం అడగకముందే మన అవసరాలను తీర్చే తండ్రి, మన సంతోషమే తమ సంతోషమని బ్రతికే తల్లిదండ్రుల పేగు బంధానికి ఈ సృష్టిలో వెలకట్టే వస్తువు అంటూ ఏదీ లేదు. పేగు బంధాన్ని తూచగల త్రాసు ఈ విశ్వంలోనే లేదు. మాతృ ప్రేమను కొలవగల కొలబద్ద లేనే లేదు. నేటి సమాజంలో మనం తల్లిదండ్రులకు తిరిగి ఏమివ్వగలం? తల్లిదండ్రుల పట్ల మనకు ఉన్నటువంటి ప్రేమానురాగాలు ఏ పాటివి అని ప్రతీ ఒక్కరు ప్రశ్నించుకోవాలి. సమాజంలో మంచి చెడ్డలు ఉంటాయి. ప్రతీ చలన చిత్రంలోనూ మంచి చెడులు ఉన్నట్లుగానే ప్రతీ గ్రంథంలోను మంచి చెడులు ఉంటాయి. ఈ రెండింటిలో మంచిని పట్టుకున్న వాళ్ళు ధర్మమార్గం వైపు మాత్రమే పయనిస్తాడు. చెడు మార్గం ఎంచుకున్నవాడు అధర్మం మార్గం వైపు పయనిస్తాడు. పాండవులు తన తల్లి అయిన కుంతీదేవి పట్ల చూపించిన ప్రేమానురాగాలు మనకు ఆదర్శం.

రామాయణంలో రాముని అంతటివాడే మానవ రూపం ధరించి తండ్రి మాట కోసం 14 సంవత్సరాలు అరణ్యవాసం చేసినటువంటి వ్యక్తి మనకు ఆదర్శప్రాయుడు. అదేవిధంగా మహాభారతంలో కుంతి మాట కోసం విలువిద్యలో గెలిచి వచ్చినటువంటి ద్రౌపదిని అన్నదమ్ములు పంచుకోండి అనగానే కన్నతల్లికి ఒక్క మాట ఎదురు చెప్పకుండా కన్నతల్లి మాట జవదాటనటువంటి పాండవులు గొప్పవారు. వారు నడిచినది ధర్మ మార్గం.

కన్న తల్లిదండ్రుల పట్ల ఏ విధంగా ముసలుకోవాలి అని ప్రస్తుత సమాజంలో శిక్షణా తరగతులు పెట్టి మరీ నేర్చుకుంటున్నారు అంటే సమాజం ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. విద్యాబుద్ధులు నేర్పి మనల్ని ఎంతో ఉన్నతంగా నిలబెట్టిన గురువులను ఏ విధంగా గౌరవించాలి.

**"ఓం, అసతో మా సద్గమాయ**
**తమసో మా జ్యోతిర్గమాయ**
**మృత్యోర్మ అమృతం గమాయ**
**ఓం శాంతి, శాంతి, శాంతి!"**

మన చీకటి జీవితంలో వెలుగు రేఖలను నింపగల వ్యక్తి గురువు మాత్రమే. గురువు లేని విద్య గ్రుడ్డి విద్య అన్నారు మన పెద్దలు. నాడు గురువుగారి ఆజ్ఞ అంటే తప్పనిసరిగా పాటించేవారు. ఏది చేయమన్నా ఎదురు చెప్పకుండా చేసేవారు. గురువుగారి కోసం శిక్షణ సమయంలో ఎన్నో కష్టమైన పరిస్థితులను కూడా ఎదుర్కొన్న ఎన్నో పాత్రలను చూశాము. అయితే నేటి సమాజంలో గురువులు పట్ల అదేవిధమైన భయము, గౌరవము, భక్తి శ్రద్ధలు ఉన్నాయా? లేవనే చెప్పుకోవాలి. గురువులతో ఎలా ప్రవర్తించాలో తెలియదు. గురువుల పట్ల ఎలా నడుచుకోవాలి తెలియదు. మరి ఆనాటి గురుకులాలలో ఉన్నటువంటి గౌరవము, భక్తి శ్రద్ధలు కరువు అవడానికి కారణం సామాజికంగానూ రాజకీయంగానూ ఏర్పడినటువంటి ఎన్నో పరిస్థితుల కావచ్చు. కాలానుగుణంగా వచ్చిన అనేక మార్పులు సమాజాన్ని నడిపించటంలో కీలక పాత్రను పోషిస్తుంటాయి. అప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు అని అంటే ముమ్మాటికి మనమే కారకులం.

ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా మనకు తోడుగా ఉంటూ సలహాలను ఇస్తున్న మన స్నేహితుల పట్ల ఎటువంటి విధేయతను చూపిస్తున్నాం అని ప్రతీ ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

మన పుట్టుకకు కారణం ఒక స్త్రీ. అటువంటి స్త్రీల పట్ల మనం చూపించాల్సిన ఔదార్యం ఎటువంటిది. మనకిచ్చిన మానవ జన్మ నలుగురికి సహాయం చేయడం కోసం అని గ్రహించాలి. నిస్సహాయులకు సహాయం చేయలేని బ్రతుకు ఎందుకు? అని మనకి మనమే ప్రశ్నించుకోవాలి. బంధువుల పట్ల ఏ విధంగా నడుచుకోవాలి? పెద్దవారితో ఏ విధంగా మాట్లాడాలి? పరుల సొమ్ము పట్ల మనకు ఉండాల్సిన ఔదార్యమే కానీ ఆశ కాదు. ఇటువంటి ఎన్నో విషయాలను కొన్ని వందల వేల సంవత్సరాల క్రితమే వ్యాసుల వారు మన కోసం భారతంలో అందించారు. కానీ మనం ఏం చేస్తున్నాము. ప్రతి ఒక్కరు ఎవరికి వారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి ఏది తప్పు, ఏది మంచి, ఏది గొప్ప, ఏది నీచము, ఏది నిజం, ఏది అబద్ధం అని ఆత్మ పరిశీలన చేసుకున్నప్పుడు మాత్రమే వ్యక్తుల ప్రవర్తనలలో మార్పులు అనేవి వస్తాయి. ఆ సన్మార్గం మార్పులను శాశ్వతంగా ఉంచేవి మంచి మిత్రుల స్నేహం, పుస్తక పఠనం, పెద్దవారి ఆశీస్సులు, దైవానుగ్రహం మొదలగునవి.

నేటి సమాజంలో ఒక మంచి కొడుకుగా, ఒక మంచి విద్యార్థిగా, ఒక మంచి స్నేహితుడిగా, ఒక మంచి రక్త సంబంధీకుడిగా, నిజమైన మానవత్వం కలిగిన మంచి మనిషిగా ఎదగటానికి మహాభారతంలో కొన్ని వేల పాత్రలు మనకు ఉదాహరణలుగా ఉన్నాయి. ఆ పాత్రలు నడిచిన మార్గాలు అనేకం కావచ్చు పాత్రల చుట్టూ అల్లుకుపోయిన బంధాలు, స్నేహాలు, మంచి చెడులు అనేకం కావచ్చు. కానీ ఆ పాత్రలు నడయాడిన ధర్మ మార్గం వైపు నేటి సమాజం కనుక నడవగలిగితే వృద్ధాశ్రమంలో తల్లిదండ్రులను చేర్పిస్తున్న కొడుకులను అసలు చూడం. గురువులను కించపరుస్తున్న విద్యార్థులు నేటి సమాజంలో అసలే ఉండరు. స్నేహం కోసం నడుస్తున్నది అధర్మ మార్గమైనా సరే, వెళుతున్న మార్గం మృత్యు ఒడిలోకి అని తెలిసినా సరే స్నేహ ధర్మం కోసం ప్రాణాలు విడిచిన గొప్ప యోధుడైన కర్ణునిలా ఎంతోమంది తయారుకాగలరు. స్త్రీల పట్ల మృగాల్లాగా ప్రవర్తిస్తున్న వారిని సైతం స్త్రీల పట్ల సఖ్యతగా నడుచుకునే భావిభారత పౌరులగా దేశం గర్వించదగ్గ యువతగా అందరికీ ఆదర్శమైన నడవడికను నేర్చుకోగలరు.

**ఆధారగ్రంథాలు**

1. మహాభారతం – కవిత్రయం (నన్నయ, తిక్కన, ఎఱ్ఱన)
2. ధర్మం – వివేకానందరెడ్డి

# 26. తిక్కన భారతం - మానవ సంబంధాలు

– డా॥ భూక్య తిరుపతి, హైదరాబాద్

ఉభయ కవిమిత్రుడైన తిక్కన నన్నయ ప్రారంభించిన కావ్యేతిహాసాన్ని చేపట్టి స్వీయ కవితారుచితో దానిని రచించాడు. కవిబ్రహ్మ భారత రచన ద్వారా హరిహరనాథతత్త్వాన్ని ప్రవేశపెట్టాడు. పదమూడవ శతాబ్దానికి చెందిన తిక్కన వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తే రెండు రకాలుగా విశ్లేషించవచ్చు. రామాయణం తిక్కన, భారతం తిక్కనగా విభజించవచ్చు. ఇవి రెండు కూడా అతనిలో పూర్వార్థం ఉత్తరార్థంగా భావించవచ్చు. పూర్వార్థ రామాయణ రచనలో ప్రయోగం, ఉత్తరార్థ భారతరచనలో ప్రయోజనం కనిపిస్తుంది. తిక్కన మహాభారతాన్ని ప్రబంధమండలిగా పేర్కొన్నాడు. తిక్కనను కేతన ముగ్గురు సంస్కృత కవులైన మయూర సన్నిభ మహాకవి, ఆర్యభోజుడు, భారవికల్పుడులతో సమానంగా పోల్చాడు. ఈ సంస్కృత కవుల రచనలలో ఉన్న వైవిధ్యం తిక్కన రచనలో కనిపిస్తుందని తెలియచేశాడు. తిక్కన భారతంలో లౌకిక, అధ్యాత్మిక వర్ణనలు రెండు సమానంగా కనిపిస్తాయి. ఏ కవికైనా గొప్పతనం తన సేకరించిన వస్తువు మీద ఆధారపడి ఉంటుంది. తీసుకున్నటువంటి వస్తువును ఏ విధంగా ప్రదర్శించాడు అనేది ఆ కవికున్న నైపుణ్యం మీద ఆధారపడి ఉంటుంది. తిక్కన భారత రచనలో ప్రదర్శించిన రాజనీతి, వేదాంత విషయాలు, ఉద్యోగపర్వంలో చూపించిన రాయబార సన్నివేశం, భారతంలోని లౌకికపరమైన విషయాలు పాత్రల మనస్తత్వాలు, సంధికార్య విషయాలన్ని నాటకీయ శైలిలో చాలా చక్కగా ప్రదర్శించారు.

భారత రచనలో తిక్కన హరిహరనాథ తత్త్వ సిద్ధాంతంను స్థాపించాడు. శైవ వైష్ణవ మతాల సారాంశం ఒక్కటేనని సిద్ధాంతాన్ని సమాజంలోకి తీసుకొని పోవడానికి ప్రయత్నం చేసి సఫలీకృతుడైనాడు. హరిహరాద్వైత ధర్మాద్వైతము ప్రతిపాదకమైన పరతత్వం గురించి తిక్కన ఈ పద్యంలోనే పేర్కొన్నాడు.

**“శ్రీయన గౌరినాఁబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ**
**ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూ**
**పాయ నమశ్శివాయ యని పల్కెదు భక్తజనంబు వైదిక**
**ధ్యాయితకిచ్చమెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్” (విరాటపర్వము 2008, పుట-1)**

తిక్కన రచనలో కథ కావ్య విధానం కనిపిస్తుంది. తిక్కన చుట్టూ రామాయణం కంటే భారతమే ఎక్కువగా తిరిగింది. ఆనాటి సమాజంలో అంతర్యుద్ధాలూ, ఆర్థికపరమైన లోటు, మతావేశాలు ఎక్కువగా ఉన్నాయి. దానిని రూపుమాపడం కోసం తిక్కన చేసిన ప్రయత్నమే హరిహరనాథ తత్త్వం దీనికి సంబంధించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఇలా అంటారు “తిక్కన చుట్టూ రామాయణం కంటే భారతమే ఎక్కువ తిరిగింది. మతావేశాలూ, ప్రభుత్వ రాజకీయాలూ ఏకమైతే దేశంలో అంతర్యుద్దాలు ప్రాణ నష్టం, అశాంతీ, ఆర్థిక సంక్షోభం, ఆధ్యాత్మిక తిరోగమనం ఏర్పడతాయని తిక్కనకు పల్నాటి వీరుల పోరు ప్రత్యక్షంగా బోధించింది. మనుమసిద్ధి సింహాసన చరిత్ర తిక్కనను మహామంత్రత్వాన్ని, రాయబారపు నైపుణ్యాన్ని, యుద్ధనీతిని లోకవృత్తాన్నీ, సమృద్ధిగా నేర్పింది. దాయాదుల పోరును కన్నారా చూచాడు. చేతులారా నిర్వహించాడు. విజయాన్ని సాధించి రాజుకు సమర్పించాడు. అజ్ఞాతవాసం అనుభవంలోకి వచ్చింది. గణపతిదేవుని అండ గోపాలుని కైదండగా అందింది. తానే ఒకప్పుడు ధర్మరాజై, మరొకప్పుడు కృష్ణుడై, మరొక్కప్పుడు వ్యాసుడై, జీవిత భారతాన్ని నిర్వహించాడు. తిక్కన జీవితమే మహాభారతం. ముందు ఎంత కథ నడిచినా దాయాదుల కుట్రకు గురియై మనుమసిద్ధి గద్దెను కోల్పోయి అడవులలో అజ్ఞాతవాసం చేస్తున్న తరుణంలోనే తిక్కన పాత్ర కీలకపాత్రగా మారింది. తిక్కన భారత రచనం కూడా అక్కడే మొదలైంది” (పుట-56, 2005) రాయబారానికి సంబంధించిన విషయాలు తిక్కన ఉద్యోగపర్వంలో సంజయ రాయబారం, శ్రీ కృష్ణుని రాయబారంలో తనకున్న పూర్వ అనుభవాలు ఆధారంగా చేసుకొని నాటకీయ శైలితో ప్రదర్శించాడు.

స్వప్నవృత్తాంతంను చెప్పిన మొదటి కవి తిక్కన. భారత రచనలో తిక్కన ప్రౌఢోక్తి, రసాసక్తి, వర్ణనానురక్తి కనిపిస్తుంది. తిక్కన లక్షణం ప్రతీకవాదం, బ్రహ్మానంద స్థితిని కోరి హరిహరనాథుని నమస్కరింపగా ఆ భగవంతుడు "జననమరణాదులైన సంసార దురితములను నగపడకుండంగ దొలగ తెరువుగను వెలుంగు నీ కిచ్చితి" నని వరమిచ్చెను. తిక్కన వైదిక మార్గ నిష్టచే, భేదాలు లేని భక్తిచే నిరంతర భగవత్పాద పద్మ సంస్మరణచే భగవంతుని ప్రార్థించాడని చెప్పవచ్చు. మహాజ్ఞాని, కారణజన్ముడైన పూర్ణ పురుషుడైన తిక్కన విరాట పర్వ ఆరంభంలో వ్యాసుని "విద్వత్సంస్తవనీయ భవ్య కవితావేశుని"గా వర్ణించాడు. సర్వలోకాలకు ధర్మం మూలం. ధర్మానికి వేదం మూలం. వేద సర్వస్వ విస్తరమైన భారతం పంచమవేదం. దానిని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించడం అసామాన్య విషయం. దానిని తిక్కన సుసాధ్యం చేశాడు. భారత రచన ప్రారంభం నుండి తుదివరకు యజ్ఞదీక్షితుడై రచనను పూర్తిచేసినట్లు కనిపిస్తుంది.

పంచమ వేదమును మహాభారతంలో తిక్కన చిత్రించిన రాజనీతిని పరిశీలిస్తే తన జీవితంలోను, కావ్యంలోను సమానంగా ఉన్నట్లు ఉద్యోగపర్వం ద్వారా మనకు అర్థమవుతుంది. సంజయ రాయబారం అలాగే శ్రీకృష్ణరాయబార ఘట్టంద్వారా అవగాహన చేసుకోవచ్చు. తిక్కన స్వయంగా రాయబారిగా గణపతిదేవుని ఆస్థానానికి వెళ్లిన అనుభవంలో భారతంలో రాయబార సన్నివేశ విషయాలు చిత్రించినపుడు తిక్కన ప్రదర్శించిన రాజనీతి పరిజ్ఞానం అసామాన్యమైనది. సంజయ, శ్రీకృష్ణుని రాయబారంలో పాత్రలు ఒకదానితో ఒకటి మాట్లాడినట్లు సంస్కృత భారతంలో లేని అనేక భావాలను తిక్కన భారతంలో కల్పించాడు. సంజయుడు ధృతరాష్ట్రుని దగ్గర పనిచేసే వాడు, మేధావి, మాటలలో రాజకీయంలోను ఆరితేరిన, ముఖప్రీతిగా మాట్లాడే నేర్పరి, సంభాషణ చతురునిగ, సమయోచితంగా మాట్లాడేవాడు.

ఉద్యోగ పర్వంలో ఉన్న ఉద్యోగ శబ్దానికి ప్రయత్నమని అర్థం, యుద్ధానికి శాంతికి జరిగే ప్రయత్నం. ధృతరాష్ట్రుడు సంజయుని ఉపప్లావంలో ఉన్న పాండవుల దగ్గరకి ధృతరాష్ట్రుని పక్షాన రాయబారానికి పంపుతాడు. సంధి ప్రయత్నాలు రెండు ఏకకాలంలో జరుగుతాయి. సంధి విఫలైనప్పుడే సమరం మొదలవుతుంది. యుద్ధం వద్దని మంచి మాటలతో ఒప్పించాలని చూశాడు. సంజయునికి కురుపాండవులలోని ఇరుపక్షాల బలాలు బలహీనతలు పూర్తిగా తెలిసినవాడు అందుకే పాండవుల దగ్గర వారి బుద్ధి వైశిష్ట్యాన్ని పొగిడాడు. తరువాత మెల్లగా కౌరవులు చేసింది, చేస్తున్నది అన్యాయమని అనిపించినా ధర్మరాజుతో నీవు ధర్మాత్ముడవు, రక్తపుటేరులతో పండిన అన్నాన్ని తినలేవు అని పలుకుతాడు. ఈ మాటల వల్ల సంజయుని రాజనీతికి నిదర్శనంగా కనిపిస్తాయి. సంజయుని మాటల్లో ఉన్న మర్మం ఏమిటో తెలుసుకోలేనంత అమాయకుడు కాదు ధర్మరాజు. లోకజ్ఞానం తెలిసిన మెత్తని పులి ధర్మరాజు.

రాయబార ఘట్టాలలో అతిముఖ్యమైనది శ్రీ కృష్ణరాయబారం. శ్రీకృష్ణపరమాత్ముడు రాయబారానికి బయలుదేరేటప్పుడు ధర్మరాజు పలికిన పలుకులు పరమాత్మ మేము తండ్రిలేని బిడ్డలం, అన్ని విధాల మీరే మాకు ఆధారం. "ఆపద గడవంబెట్టగ, నోపి శుభంబైన .... నిన్నుఁ జూపిచనియె మహాత్మా (ఉద్యోగ. 2-61) సంధి జరగదని తెలిసిన లోక కళ్యాణం కొరకు, పాండవులు చివరి ప్రయత్నం కొరకు వెళ్లాడు. శ్రీకృష్ణరాయబార సమయానికి భారత కథ మిక్కిలి ఘట్టానికి చేరుతుంది. కౌరవ పాండవుల మధ్య సంధి జరిగితే సర్వజన శ్రేయస్సు. సమరం జరిగితే విపరీతమైన ప్రాణనష్టం జరుగుతుంది. శ్రీ కృష్ణుడు అందరివలే సామాన్యుడు కాదు. మానవ రూపంలో ఉన్న పరమాత్ముడు. రాయబారానికి వెళ్ళే సందర్భంలో మాధవుడు పాండవులందర్ని ఒక్కొక్కర్ని కలిసి వారి వారి అభిప్రాయాలు తెలుసుకొంటాడు. వారి వారి సమస్యలను వారు మాధవునితో పంచుకుంటారు. ఈ సందర్భంలో ధర్మరాజు శ్రీకృష్ణునితో పలికిన పలుకులు రాజనీతితో కూడుకొని ఉంటాయి. ఇదే విషయాన్ని "ధర్మరాజీ సందర్భంలో గంభీరమైన ఉపన్యాసం చేశాడు. ఇది అతని రాజనీతి నేతృత్వాన్ని చాటి చెప్పేదిగా ఉంది. సంధి విషయంలో తన అభిప్రాయమేమిటో వివరంగా చెప్పి, కౌరవుల సభలో శ్రీకృష్ణుడు నిర్వహించవలసిన కార్యాన్ని సవిస్తరంగా విశదీకరించి చివరకు, "పొమ్మెవ్వడ నీకు నేను బుద్ధులు చెప్పన్" అని అంటాడు.. (నారాయణదాసు పొట్లూరి, మార్చి 2016)

శ్రీకృష్ణుడు పాండవుల దగ్గర సెలవు తీసుకొని హస్తినాపురానికి చేరుకుంటాడు. ధృతరాష్ట్రుని, కుంతిని కలుసుకొని విధురుని ఇంటికెళ్ళి మరుసటి రోజు కౌరవసభలో శ్రీకృష్ణుడు అందరి ముందు నిర్వహించిన ఘట్టాన్ని మహోజ్జ్వల ఘట్టంగా చెప్పవచ్చు. రాయబార ఘట్టంలో శ్రీకృష్ణుడు ప్రదర్శించిన చాతుర్యం రాజకీయ రంగమున తిక్కన గడిపిన అపారమైన అనుభవానికి చక్కని నిదర్శనంగా చెప్పవచ్చు. శ్రీకృష్ణుని సందేశం సభలోని వారందరూ విన్నారు. పాండవుల చివరికోరిక కూడా తెలియచేశాడు. శ్రీ కృష్ణ పరమాత్ముని ఉపన్యాసం దుర్యోధనాధులకు తప్ప మిగిలిన వారందర్నీ ఆకర్షించింది. అతడి వాదాన్ని ఏకగ్రీవంగా అంగీకరించేటట్లు చేసింది. భీష్మాది కురువృద్ధులు, విదురాదులు సంధిని అంగీకరించమని కోరారు. దుర్యోధనుడు అందుకు అంగీకరించలేదు. చివరికి శ్రీకృష్ణుని బందింప ప్రయత్నిస్తే ఆ పరమాత్ముడు విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. పాండవుల చివరి ప్రయత్నం కూడా విఫలమైంది.

తిక్కన చిత్రించిన గాంధారి, కుంతి, ద్రౌపది పాత్రలు గాంధారి చెడ్డవాళ్ళని కన్న మంచి తల్లి. యుద్ధానికి వెళ్ళుతూ తన కొడుకు దీవెనల కోసం వస్తే ఎటు ధర్మం ఉంటే అటే జయం ఉంటుంది, వెళ్ళు అని దీవించిన ఉత్తమురాలు. కుంతి పరుల పంచన విధిలేక పడి ఉన్న పరాధీనురాలు. రాయబారానికి వచ్చిన తన మేనల్లుడు చుట్టమునైన కృష్ణుని చూచి అసహాయురాలైన ఆమే ఏ విధంగా రోదించిందో తిక్కన చక్కగా చిత్రించాడు. కుంతి తన కొడుకులు కోడలు తన ఎదుటనే అధర్మవర్తులచే భంగపాట్లు పడడం చూచి కుమిలిపోతుంది. ద్రౌపది అభిమానవంతురాలు, అవమానం ఏమాత్రం భరించలేదు. అందుకు తన భర్తలను పురికొల్పుతుంది. భర్తనైనా సరే అనాదరించగల స్వాభిమానం ఉంది. కీచకుడు వెంటపడి బాధించినప్పుడు అర్ధరాత్రి వంటింటికి పోయి భీమునితో మొరపెట్టుకొంది. తాము పడ్డ అవమానాలకన్నింటికి ప్రతీకారంగా భీకర యుద్ధం జరుగుతుందని ఆమె ఆశించింది. ఆ ఆశ నిరాశగా మారి ఐదు ఊళ్ళకు ధర్మరాజు మెత్తపడినందుకు ఆమెకు కోపం వచ్చింది. ధర్మరాజు నుండి ఇటువంటి మాటలు రావడం ఆమె భరించలేకపోయింది. తిక్కన ద్రౌపది హావభావ చేష్టలు అన్నీ కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

స్త్రీ పర్వంలో పద్దెనిమిది రోజుల ఘోర యుద్ధం ముగిసాక అందరూ మరణించిన తరువాత స్త్రీలందరూ తమ భర్తల కోసం, కొడుకుల కోసం, కన్నబిడ్డల కోసం వారి శవాలను చూడడానికి వచ్చినపుడు తల్లడిల్లిన వారి హృదయాలలో మనోవేదన చెందుతున్నట్లు చిత్రించాడు. ఇదే విషయాన్ని ఆరుద్రగారు ఇలా అంటారు. "స్త్రీ పర్వంలో పద్దెనిమిది రోజుల ఘోరయుద్ధం, పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం నేలకొరిగాక, నక్కలూ, కాకులూ, రాబందులూ, గద్దలూ, తోడేళ్ళూ శవాలకోసం కొట్లాడుకుంటున్న యుద్ధభూమిలో తాళికట్టిన భర్తకోసం, తమతోపుట్టిన సోదరులకోసం, పదినెలలు మోసిన కన్నబిడ్డలకోసం, బ్రతుకును పంచుకున్న బంధువులకోసం వెదుక్కోవడానికి స్త్రీలు అంతఃపురాలు వదిలి ఎండనుబడి రావడం తిక్కనగారు ఎలా ఈ పద్యంలో వర్ణించారో పరిశీలిస్తే అర్థమవుతుంది.

"చెతులు నడుదల సేర్చు టుత్కటనేక మాశామరులు దాల్చినట్టు లుండ .... గురు కుమార! నారీజన కోటివచ్చె" (స్త్రీ-1-98, పుట-314, 2012) స్త్రీ పర్వం నిజంగా గాంధారిది. ఆమె అందులో మూర్తీభవించిన శోకదేవత. తన కడుపులో నూరుగురు కుమారులు పడుతే అందరూ మరణించారు. భీముడు ఏ ఒక్కర్నీ బ్రతకనివ్వలేదని శోకిస్తుంది.

శ్రీ కృష్ణుని ఆదేశానుసారం అంపశయ్యపై ఉన్న భీష్ముని దగ్గరకు ధర్మసూత్రాలు తెలుసుకోడానికి వెళ్ళాడు ధర్మారాజు. భీష్ముడు ధర్మరాజుతో వత్సా రాజైనవాడు కొన్ని నియమాలు ఆచరించాలి. సత్యాన్నే పలకాలి. లేదంటే ఎవరు నమ్మరు. మిత్రులు దూరమైపోతారు. అతిగా కోపం చూపిస్తే భయంతో ఎవ్వరూ దగ్గరికి రారు. ధర్మరక్షణే పాలకుల ముఖ్యకర్తవ్యం. ప్రజల సుఖదుఃఖాలు తనవిగా భావించడం రాజు కర్తవ్యం సేవకులను ఎగతాళి చేయకూడదు. రాజు వ్యసనాలకు బానిస కాకూడదు. ఎప్పుడు యుద్ధం చేయాలి? ఎప్పుడు సంధి చేయాలి? అంటే రాజు మొదట్లోనే అనుభవజ్ఞులు, విశ్వాసపాత్రులైన మంత్రులతో ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలి అని సరైన సలహాలు ఇచ్చాడు.

సామాజికాభివృద్ధికి, పరిపాలకులకూ రాజనీతిని బోధించడంలో తెలుగు కవులు తమ వంతు కృషి చేశారు. అది స్వతంత్ర రచన కావచ్చు. లేదా అనువాద రచన కావచ్చు. ప్రత్యేకంగా రాజనీతిని బోధించే కావ్యాలు సాహిత్యంలోకి ఎన్నో వచ్చాయి. అవి కవిత్రయ భారతం, హరివంశం, రంగనాథ, భాస్కర రామాయణాలు, కేయూర బాహు చరిత్ర, విక్రమార్క చరిత్ర మొదలైనవి. భారతీయ రాజనీతికి ధర్మం మూలం ధర్మాన్ని రక్షించడం రాజుల కర్తవ్యమనే విషయం మహాభారతం ద్వారా తెలుస్తోంది.

**ఆధార గ్రంథాలు**

1) ఆరుద్ర – సమగ్ర ఆంధ్ర సాహిత్యం, 2002.
2) నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష.
3) ఆచార్య సుబ్రహ్మణ్యం, జి.వి. – సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, 2005.
4) శ్రీమదదాంధ్ర మహాభారతం – తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.
5) ఈమాట డాట్.కామ్.

# 27. మహాభారతంలో మాతృ మూర్తులు: ప్రణాళిక

- డా॥ జాడ సీతాపతి రావు, నూజివీడు, ఏలూరు

మహాభారతం కుటుంబ జీవనానికి ఒక సూచిక. అది చాలా అంశాల్ని భారతం ధ్వనింపజేస్తోంది. కుటుంబ జీవనానికి మాతృ మూర్తి వెన్నెముక. ప్రేమను పండించే క్షేత్రాలు. అలాంటి మాతృ మూర్తుల్ని చూపడం, ప్రణాళికా బద్ధంగా భారతాన్ని ఎలా చూపాలా చెప్పిన రాజరాజు సూచనల్ని నన్నయ వాడుకోవడం కూడా గమనించవచ్చు. ఇది నేటి ఆధునిక సమాజానికి ఒక అవసరం.

**హిమకరు దొట్టి పూరు భరతేశు కురుప్రభు పాండుభూపతుల్**
**క్రమమున వంశకర్తలనగా మహి నొప్పిన యస్మదీయ వం**
**శమున బ్రసిద్ధులై విమల సద్గుణశోభితులైన పాండవో**
**త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్(ఆంధ్ర. భారతం. ఆది 1-14)**

చంద్రునితో మొదలు పెట్టి, పూరుడు, భరతుడు, కురువు, పాండురాజు క్రమంగా వంశకర్తలైన నా వంశంలో ప్రసిద్ధులు, సద్గుణవంతులు అయిన పాండవోత్తముల చరిత్ర నాకు ఎప్పుడూ వినాలనే ఉంటుంది నన్నయభట్టారకునితో రాజరాజనరేంద్రుడు అనడం గమనించాలి.

పాండవులు పుట్టిన నాటికే పూరుడు, భరతుడు, పాండురాజు వంశకర్తలుగా తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నలుగురు రాజుల తల్లులు కథనం వ్యక్తిత్వాన్ని గమనించాలి. కాలాన్ని అనుసరించి పుట్టినవాడు పూరుడు. తల్లి శర్మిష్ఠ. తండ్రి యయాతి.

శర్మిష్ఠ వృషపర్వుడనే రాక్షస రాజుకూతురు. శుక్రాచార్యుడనే రాక్షస గురువు కూతురు దేవయాని. శర్మిష్ఠ ఒకరోజు తన వంద మంది పరిచారికల్తో దేవయానితో సహా వనవిహారానికి వెళ్ళడం. అక్కడ అలసిపోయి చివరకు జలక్రీడకు పూనుకోవడం, ఒడ్డున బట్టలు పెట్టడం, గాలికి చెల్లా చెదరవడం, తొందరలో శర్మిష్ఠ దేవయాని చీరను కట్టుకోవడం, దేవయాని చీరను శర్మిష్ఠ కట్టుకోవడం. దాంతో శర్మిష్ఠ విడిచిన వస్త్రామే దేవయానికి మిగిలింది. దాన్ని కట్టుకోవడం దేవయానికి ఇష్టం లేదు. నీవు కట్టి విడిచిన వస్త్రాన్ని నేను కట్టుకోలేదా? దానికి సమాధానంగా దేవయాని నేను పురోహిత దుహితను అంటుంది. దానికి శర్మిష్ఠ పంతంగా నేను నీ వస్త్రం కట్టుకోలేదా? నా వస్త్రం నీవు ఎందుకు కట్టుకోవు? నీ గొప్పలు నా దగ్గర కాదు లే. మీ అయ్యా దగ్గర ఇచ్చాకాలు చెప్పి జీవనం చేస్తున్నాడు. నేను రాచబిడ్డను. అని కోపంతో దేవయానిని అక్కడున్న నూతిలోకి తోసేసి పరిచారికలతో నగరానికి వెళ్లిపోయింది.

**క. మా యయ్యకుఁ బాయక పని**
**సేయుచు దీవించి ప్రియము సెప్పుచు నుండున్**
**మీ యయ్య వెండి మహిమలు**
**నాయొద్దన పలుక నీకు నానయు లేదే(1-3-137)**

తాను వస్త్రాలను ధరించనని చెబుతూ నా వస్త్రాలు తీసుకొని కట్టుకోవడం విధేయ లక్షణం కాదని హెచ్చరిస్తూ మాట్లాడుతున్న దేవయానిని చూచిన శర్మిష్ఠ మీ తండ్రి అయిన శుక్రుడు మా తండ్రి వృషపర్వుని సేవిస్తూ ఆశీర్వదించి ప్రియవాక్యాలు పలుకుతూ ఉంటాడు. మరి మీ గొప్ప తనాలు నా దగ్గరే పలికేందుకు (పలుకడానికి )నీకు సిగ్గు కూడా లేదా? అని రోషంతో దేవయానిని మాట్లాడింది. ఇలా వారిద్దరూ ఒకరిపై ఒకరు కోపగించుకొనే స్థాయికి వెళ్లారు. ఇక్కడ శర్మిష్ఠ పాత్రలో

ఆమె గర్వంతోపాటుగా అమాయకత్వం, చిన్నతనం, తెలియని తనం కనిపిస్తున్నాయి. లౌక్యం తెలీదు. ఉన్నది ఉన్నట్లు మాట్లాడే తత్త్వం. ఆ వయసు పెరిగే తత్త్వం రాచకుటుంబ వాతావరణం ఆమెచేత అలమాట్లాడించి ఉంటాయి. ఈ ఘట్టంలో శర్మిష్ఠ వయసులో చిన్నది కావడం వల్ల ప్రాజ్ఞత లేనిదానిగా, రచరికపు వైభవం తెచ్చిన అహంకార స్వభావం కనిపిస్తుంది.

నూతిలోపడిపోయిన దేవయానిని వేటకు వచ్చిన యయాతి రక్షిస్తాడు. శర్మిష్ఠ నూరుగురు చెలికత్తెలతో సహా తనకు దాసిగా ఉంటేనే తాను నగరంలో అడుగు పెడతానని తండ్రికి దేవయాని చెప్తుంది. కూతురుమీద ప్రేమతో ఆమెతో పాటు తానుకూడా అరణ్యంలోనే ఉండిపోతానని శుక్రాచార్యులు అంటాడు. గత్యంతరం లేక వృషపర్వుడు రాజ్యం కోసం, ప్రజల కోసం దేవయానికోరిక తీరుస్తాడు. శర్మిష్ఠ తండ్రి ఆజ్ఞను శిరసావహించి దాసిగా మారింది. ఇక్కడ తండ్రి ఆజ్ఞను శిరసా వహించాడాన్ని గమనించాలి. దేవయాని పరిచారికలతో శర్మిష్ఠతో సహ వనవిహారానికి వెళ్లింది. అక్కడే మళ్ళీ యయాతి తారసపడ్డాడు.

దేవయాని అంతకుముందే తెలుసు కాబట్టి అతిశయ రూప లావణ్యాలతో ఉన్న శర్మిష్ఠను చూసి, ఆమె ఎవరని దేవయానిని అడిగాడు. రాజు భావాన్ని దేవయాని పసిగట్టింది. ఆమె రాక్షసరాజు కూతురు అని చెప్తునే, తనకు దాసి అని, అంతకు పూర్వమే నూతిలోనుంచి పైకి లాగినపుడే తన కుడి చేయి పట్టుకున్నాడని అప్పుడే భర్త అయ్యిపోయావని, తనను పెళ్లి చేసుకుంటే ఈ శర్మిష్ఠతో సహా దేవకన్యాల్లాంటి వీరందరూ అతనికి ప్రీతికలిగిస్తారని ఆశపెడుతుంది. బ్రాహ్మణపుత్రికను వివాహ మాడడ0 ధర్మ విరుద్ధంగా భావిస్తాడు. శాపానుగ్రహ సమర్థుడైన శుక్రాచార్యులు ఒప్పుకుంటావా అని అడిగి దేవయాని ముందరి కాళ్ళకు బంధమేస్తుంది. ఈ విధంగా దేవయాని మోసంతో, ప్రలోభం పెట్టీ, ఒక రకంగా భయపెట్టీ యయాతిని పెళ్లి చేసుకుంది.

దేవయానిని యయాతితో పంపేటప్పుడు శుక్రుడు శర్మిష్ఠను చూపి, ఈ రాచకూతురును మిగిలిన అన్ని విషయాలలోనూ దేవయానితో సమానంగా చూడమని యయాతికి చెప్పాడు. యయాతి తన రాజ్యానికి వచ్చిన తర్వాత దేవయాని అనుమతి తోనే ఆమెను అశోకవనంలో ఉంచాడు. ఇదంతా దేవయాని ప్రతీకారేచ్ఛతోనే చేసింది. అయినా ఒక్క మాటకూడా ఆడని కష్టసహిష్ణుత శర్మిష్ఠలో ఉంది అని గమనించాలి.

దేవయానిం యయాతిొ యదువు, తుర్వాసుడు కొడుకులు పుట్టారు. ఒక రోజు ఋతుమతి అయిన శర్మిష్ఠ వనంలో విహరిస్తూ దేవయాని ఏమి తపస్సు చేసి భర్తను పొందిందో అనుకుంది.

**క. పతిఁ బడసి సుతులఁ బడయఁగ / నతివలు గోరుదురుబీ గోరినట్టుల తనకుం**
**బతిఁ బడసి సుతులఁ బడసెనుబీ / సతు లీభార్గవికి భాగ్యసంపద నెనయే. (1-3-171)**

స్త్రీలు భర్త, సంతానాన్ని సహజంగా కోరుకుంటారు. కోరుకున్నట్లు దేవయాని పొందింది. దేవయాని అదృష్టం మరెవరికీ రాదు అనుకుంది. ఇది శర్మిష్ఠ నిర్మత్సర బుద్ధికి నిదర్శనం. ఆ వనంలో తిరుగుతున్న రాజును చూసింది.

**తరువోజ. ఈ రాజునంద నా హృదయంబు దవిలి యెప్పుడు నుండుబీ న న్నీతఁడు గరము**
**కారుణ్యమునఁ బ్రీతిగలయట్లు సూచుఁబీ గమలాక్షి భార్గవకన్య దా నెట్లు**
**గోరి యీతనిఁ దనకును బతిఁ జేసికొనియె నటుల యేను గోరి లోకైక**
**భారధురంధరుఁ బరహితు ధర్మపరు నహుషాత్మజుఁ బతిఁ జేసికొందు. (1-3- 172)**

ఈ యయాతి మహారాజుపట్ల నా మనస్సు ఎప్పుడూ ఆసక్తి కలిగి ఉ0ది. నన్నా రాజు మిక్కిలి దయతో చూస్తాడు. పద్మాలవంటి నేత్రాలుకల శుక్రుడి కూతురు దేవయాని తా నేవిధంగా వాంఛించి యయాతిని తనకు భర్తగా చేసుకుందో అలాగే నేను కూడా కోరి లోక భారాన్ని వహించే వాడు, ఇతరులకు మేలు చేసేవాడు, ధర్మమందాసక్తి కలవాడు నహుషుడి

కుమారుడైన యయాతిని భర్తగా చేసుకొంటాను అనుకుంది. తన మనసు రాజుమీద ఇష్టంతో తగుల్కొంది అనడంలో ఆమె ధర్మజ్ఞత ఆ రోజుకు కూడా తనపట్ల ప్రీతి ఉందని కనిపెట్టడంలో లోకజ్ఞత, దేవయానిలా అతడిని కోరుకోవడం అనడంలో వివేకం, యయాతిని మోస్తున్న బాధ్యతలకు తను ఊరటను ఇవ్వాలనుకోవడంలో అతడి విశేషాలను వేయడం ఇవన్నీ ఆమె లోకజ్ఞతను సూచిస్తున్నాయి.

యయాతి తన దగ్గరకు రాగానే ఆశ్చర్యంతో వినయంగా మ్రొక్కి అతడి పట్ల తనకు ఉన్న సానుకూల భావాన్ని పసిగట్టి

**ఉ. నీలగళోపమాన! కమనీయగుణోన్నతిఁ జెప్పఁ జాలు న**
**న్నేలిన దేవయానికి నరేశ్వర! భర్తవు గాన నాకునుం**
**బోలఁగ భర్త వీవబీ యిది భూనుత! ధర్మపథంబుబీ నిక్కువంబీ**
**బాలును దాసియున్ సుతుఁడు నన్నవి వాయనిధర్మముల్ మహిన్.(1-3-174)**

నన్నేలిన దేవయానికి భర్తవు, కాబట్టి నాకూ భర్తవే అంటుంది. ఇది ధర్మ మార్గం. భార్య, దాసి, బిడ్డలు అనే బంధ వీడరానిది కదా. దేవయానిని నువ్వు భార్యగా పొందినపుడే నేను నీకు భార్యనైపోయాను.. అంది. విజ్ఞతతో, చమత్కారంతో, మారుమాటకు అవకాశం ఇవ్వలేదు. ధర్మవాక్యాలు చెప్పింది యయాతిని ఆకట్టుకుంది. కట్టుకుంది. యయాతి శుక్రుడు చెప్పిన మాటలను జ్ఞాపకం చేశాడు. వివాహస సమయంలో ఇచ్చిన మాటలకు అసత్య దోషం లేదని ముని వచనాన్ని చూపింది. నీలగళోపమాన! అంటే నీలగళుడు శివుడు. అతడి సాటిగలవాడవని అర్థం. శివుడికి విషం మింగకుండా, కక్క కుండా కంఠంలో ఉంచుకోవడం నీలగళత్వం. అలాగే నువ్వు నా విషయాన్ని బయట పెట్టకుమని సూచన. శివుడికి ఇద్దరు భార్యలు అంటూ సమయస్ఫూర్తిని ప్రదర్శించి తన ఇష్టాన్ని సాధించుకుంటుంది.

యయాతి శర్మిష్ఠ కోరిక తీర్చాడు. ఆమెకు కొడుకు కలగడం విని, దేవయాని ఆశ్చర్యపోతుంది. ముక్కున వేలేసుకుంటుంది. అందుకు శర్మిష్ఠ తలవంచుకొని సిగ్గుతో, ఎక్కడనుంచో వేదవేదాంగుడైన ఒక మహాముని వచ్చి ఋతుమతి అయిన నాకు పుత్ర సంతానం ప్రసాదించాడు అని చెప్తుంది. దేవయాని ఆమెను ఉత్తమ శీలం, వినయం, గౌరవం, నిర్వికార ఉన్న దానిగా వర్ణించాడు. శర్మిష్ఠ ఉదాత్తతకు, ఔన్నత్యానికి, సద్గుణాలకు దేవయాని ఇచ్చిన ప్రశంస ఇది. తర్వాత యయాతితో శర్మిష్ఠ ద్రుహ్యుడు, అనుడు, పురుడు కొడుకుల్ని కన్నది. చివరకు యయాతి ముసలితనాన్ని పురుడు స్వీకరించడంతో కథ ముగుస్తుంది.

ఇలా శర్మిష్ఠ నుంచి ఆమెలో ఉన్న అమాయకత్వం, తెలియనితనం పురుడులో కనిపిస్తాయి. అది దేవయాని మీ తల్లిదండ్రులు ఎవరు అన్నపుడు అమాయకంగా శర్మిష్ఠ యయాతుల్ని చూపిస్తాడు. శర్మిష్ఠలోని తండ్రి ఆజ్ఞను పాటించడం, కష్ట సహిష్ణత ఇలాంటివి అన్నీ పురుడుకి వస్తాయి. తండ్రినుంచి పరహిత ధర్మ పరత్వం, లోకైక భార ధురంధరత్వం, లాంటివి వస్తాయి. మిగిలిన లోకజ్ఞత, ఉచితజ్ఞత, విజ్ఞత, ధర్మజ్ఞత లాంటివి తల్లిని నుంచే వస్తాయి. ఇలా వంశకర్తను ఉండే వ్యక్తిత్వం పూరుడికి సంక్రమిస్తాయి.

రెండో వంశకర్త భరతుడు. శకుంతల కణ్వ మహర్షి పెంపుడు కూతురు. పౌరకుల శ్రేష్ఠుడైన దుష్యంతుడు వేటకోసం అడవికి వెళ్ళడం, అక్కడ కణ్వ ఆశ్రమాన్ని చూడడం. శకుంతల సౌందర్యానికి ఆశ్చర్యపడడం, ఆమె వృత్తాంతం తెలుసుకోవడం. మేనకావిశ్వామిత్రుల కుమార్తె అయినందున గాంధర్వ వివాహం చేసుకోవచ్చని ఆమెను కోరడం. కొడుకును యువరాజుగా చేయమని నియమాన్ని, కోరికను శకుంతల చెప్పడం, దుష్యంతుడు అంగీకరించడం. సుఖించి త్వరలో తన మంత్రులను పంపి తీసుకువెళ్తానని చెప్పి రాజ్యానికి దుష్యంతుడు వెళ్లిపోవడం.

అప్పటికే వచ్చిన కణ్వమహర్షికి శకుంతల తన గాంధర్వవివాహాన్ని చెప్పడం, ఆయన అంగీకరించడం జరిగాయి. ఆమె కడుపులో పుట్టిన బిడ్డ చక్రవర్తి అవుతాడని దివ్య దృష్టితో చూసి వరం కోరుకోమన్నాడు. ఎప్పుడూ ధర్మమ్మీదే నా మనసు నిలవాలని, తన కొడుకు ఆయురారోగ్య ఐశ్వర్యా బాల సంపన్నుడు, వంశకర్త కావాలని కోరుకుంది. గర్భవతి అయిన శకుంతల మగ బిడ్డను కంది. పెరిగి పెద్దయ్యాడు. కణ్వుడు రాజోచిత విద్యాబుద్ధులు నేర్పాడు. ఎక్కువకాలం పుట్టింట్లో ఉండకూడదని దుష్యంతుడి దగ్గరికి, ఆమె కొడుకుతో సహా ఇద్దరు మునుల సాయంతో పంపాడు.

దుష్యంతుడి సభామందిరం. అతడిని చూసినప్పుడే అతడిలోని ఉన్న విరసత్వాన్ని గమనిస్తుంది శకుంతల. అయినా ధైర్యం కోల్పోక అతడికి విషయాన్ని వివరిస్తుంది. దుష్యంతుడు నువ్వు ఎవరో తెలియదని చెప్పాడు. చాలా రకాలుగా ధర్మం గురించి, సత్యాన్ని గురించి, పుత్రగాత్ర పరిష్వంగన సుఖం గురించి చెప్పింది శకుంతల.

**క. ఏ నెట? నీ వెట? సుతుఁ డెట? ఎ యే నెన్నఁడు తొల్లి చూచి యెఱుఁగను నిన్నున్‌బీ**
**మానిను లసత్యవచనలు ఎ నా నిట్టు లసత్యభాషణం బుచితంబే? (1-4-100).**

నేనెక్కడ? నీవెక్కడ? కుమారుడెక్కడ? నిన్నింతవరకు చూడలేదు. ఆడవారు అబద్ధాలు ఆడతారు అన్నట్లుగా ఇలా అసత్యాన్ని పలకడం నీకు తగునా? అంటాడు. "అసత్య వాచానార్యః" అని మూలంలో ఉంది. దీన్ని నన్నయ ఔచిత్యంగా మార్చాడు. స్త్రీ అసత్య వచనాలు అనటంలో ఆడువారు అసత్యాలు మాట్లాడుతారు అనే నిశ్చయాన్ని కాకుండా ఆడువారు అబద్ధాలు చెబుతారేమో అనే విధంగా నాన్- అనగా అనే ప్రయోగ0ద్వారా ఒక ఔచిత్యాన్ని చూపాడు. స్త్రీ జాతికి అపకీర్తి తేవద్దు అనే హెచ్చరిక కూడా ఉంది.

భారత సంశోధిత ప్రతిలో వనకన్యయట నేనట! వనమున గాంధర్వ వివాహంబట... విపరీతోక్తుల్ అని ఉంది. దుష్యంతుడు ఈ మాటలు అనుచిత్యంతో కూడిన నిందా వాక్యాలతో అధిక్షేపించేటల్లు సంస్కృత భారతం లో ఉంది. నన్నయ ఈ మాటల్ని వదిలేయడం ద్వారా ప్రకరనౌచిత్యాన్ని పాటించాడని చెప్పడానికిఈ పద్యం సహకరిస్తుంది. ఇలా కఠినంగా తిరస్కరించాడు దుష్యంతుడు. చేసేదిలేక ఏడుస్తూ వెనుదిరిగింది శకుంతల. ఇంతలో ఆకాశవాణి శకుంతల సాధ్వి అని సాక్ష్యం చెప్పింది. అందరూ విన్నారు. సంతోషించారు. లోకాపవాద భీతితో ఇలా చెప్పానని దుష్యంతుడు చెప్పాడు. భార్యాపుత్రులను స్వీకరించాడు.

మేనకంవిశ్వామిత్రుగ శకుంతల. తల్లినుంచి సౌందర్యం. రూపలావణ్య విలాస విభ్రమ గుణ సుందరత్వం వచ్చాయి. మనోరజ రాజ్యలక్ష్మి, సర్వ లక్షణ లక్షిత సర్వాంగ సుందరి. మొదటి చూపులోనే దుష్యంతుడి మనసు దోచుకుంది. అందం పట్ల ఆకర్షితమయ్యే గుణం కూడా ఈమెకు ఉంది. ఆమెకు తనపై కలిగిన అనురాగాన్ని దుష్యంతుడూ గుర్తించాడు.

విశ్వామిత్ర కూతురు అయినందుకు ఈమెలో రాజసం, ధైర్యం, వివేకం, ఠీవి, నిర్భయత్వం, లోకజ్ఞత లాంటి గుణాలు ఉన్నాయి. తనకు ఎంత ఇష్టం ఉన్నా తనకు పుట్టబోయే కొడుకుకు యౌవరాజ్య పట్టాభిషేకం చేస్తానని మాట ఇమ్మని అడిగినప్పుడు శకుంతల ముందుచూపు కనిపిస్తుంది. కణ్వుడు వరం కోరుకోమన్నప్పుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలు, బాలసమన్వితుడై, వంశకర్త కావాలని కోరుకున్న ఉత్తమురాలు. తన మనసు ఎప్పుడూ ధర్మం మీదే ఉండాలని కోరుకున్న ధర్మజ్ఞ. ఈ ధర్మ తత్పరత, ధర్మ జ్ఞానం ధర్మ బోధ చేయగల శక్తి ఇవన్నీ కణ్వ పెంపకంలో అలవడిన సుగుణాలు.

**లోకజ్ఞత:**

దుష్యంతుడిని సభలో అడుగు పెట్టిన వెంటనే అతడిని చూడగానే అతడి చూపులు విరసాలై, చేతులు క్రూరంగా ఉన్నాయని గ్రహించగలగడం లోకజ్ఞత.

**మహానుభావత్వం**

బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధినాథులను నమ్మకూడదు అనుకుంది. తెలిసీ, తెలియనట్లు ఉన్నవాడికి బ్రహ్మదేవుడు కూడా చెప్పడం సాధ్యం కాదనుకుంది. ఆపద ఎదురైంది. అయినా నిరాశతో వెనుదిరక లేదు. ధైర్యం తెచ్చుకుంది.

**"ఆపదలందు ధైర్య గుణ మంచిత సంపదలందు తాల్మియున్**
**భూపసభాంతరాళమున పుష్కల వాక్చతురత్వమాజి బా**
**హా పటుశక్తియున్ యశమునం దనురక్తియు విద్యయందు వాం**
**ఛా పరివృద్ధియున్ బకృతి సిద్ధ గుణంబుల సజ్జనాళికిన్"**

ఆపదలు వచ్చినప్పుడు ధైర్య0, ఐశ్వర్యం వచ్చినప్పుడు ఓర్పు, సభల్లో వాక్చతుర్య0, యుద్ధంలో శౌర్యాన్ని చూపడం, కీర్తిపట్ల ఆసక్తి, విద్యల్ని నేర్చడంలో గొప్పకోరిక మహాత్ములకు పుట్టుకతో వచ్చిన స్వభావగుణాలు అని భర్తృహరి సుభాషితం, శకుంతలలోని మహానుభావత్వాన్ని సూచిస్తుంది.

**ధీరత్వ గుణం**

తన ప్రయత్నం ప్రారంభించింది. తనను భార్యగా స్వీకరించమని ముందు అడగలేదు. ఇచ్చిన మాట ప్రకారం కొడుకును యువరాజును చేయమంది. అనుచితంగా మాట్లాడ వద్దని దుష్యంతుడు చెప్పాడు. వచ్చిన చోటుకే తిరిగి వెళ్లమన్నాడు. కోపంతో, దుఃఖంతో కళ్ళు ఎరుపెక్కాయి. అయినా దుఃఖాన్ని దిగమింగి, దృఢ చిత్తంతో ధర్మోపన్యాసం ఇచ్చిన ధీర.

**ధర్మ బోధత్వ గుణం వేద ప్రామాణ్య జ్ఞానం**

తప్పబలుక నగునే ధార్మికులకు అని మొత్తగా మొదలు పెట్టి అవజ్ఞ(అవమానించడం/తిరస్కరించడం) చేవద్దని మందలించింది. భార్య పుత్రుల ముఖాలు చూస్తే దిగుళ్లు తీరిపోతాయని నచ్చ చెప్పింది. భార్య ప్రాశస్త్యం, ప్రాధాన్యతను ఉగ్గడించింది. పుత్ర సౌఖ్యాన్ని విడమరిచి బోధించింది. జనకుడే పుత్రుడిగా పుడతాడని వేద వచనాలను (అంగాత్ అంగాత్ సంభవసి) చెబుతుంది. సత్యవాక్య మహిమను వక్కాణిస్తుంది. మేనకా విశ్వామిత్రులకు పుట్టిన తాను అబద్ధం ఆడనని, నమ్మమని అర్థించింది. అయినా దుష్యంతుడు వినలేదు. తనకు తప్ప ఎవరికీ తెలియని ఈ విషయం నిండు కొలువు ఆమెను నగుబాటు చేసింది. వచ్చిన చోటుకే పొమ్మన్నాడు. ఆడవాళ్ళు అబద్ధాలు ఆడడంలో నేర్పరులు అని అవమాన పరిచాడు. కానీ ఆకాశ వాణి:

**చ. 'గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండుబీ సే**
**కొని భరియింపు మీతనిబీ శకుంతల సత్యము వల్కె,సాధ్వి, స**
**ద్వినుత, మహాపతివ్రత వివేకముతో' నని దివ్యవాణి దా**
**వినిచె ధరాధినాథునకు విస్మయ మందఁగఁ దత్సభాసదుల్. (1-4-105)**

ఈ భరతుడు, శకుంతలా నీ వాళ్ళే. ఇతనిని స్వీకరించి పోషించు. ఇల్లాలు, ఉత్తమ కీర్తి కలిగిన మహాపతివ్రత అని, శకుంతల నిజమే సభలో వారంతా ఆశ్చర్యపడేలా చెప్పింది.

ఇందులో కథా నిర్వహణ అద్భుతం. స్వతస్సిద్ధంగా ఏర్పడిన అర్థ శక్తివాళ్ళ కలిగిన వస్తువు చేసే వస్తుధ్వని ఏనెట సుతుడెట అన్న దుష్యంతుడి మాటలకు పరోక్ష సమాధానం దివ్యవాణి ఇచ్చిన సాక్ష్యం. పురుషుడి వృత్తాన్ని గమనిస్తూ ఉండే మహా పదార్థాలలో శబ్ద గుణం కలిగిన ఆకాశ0 సాక్ష్యం చెప్పడం అద్భుత, ఔచిత్యాలు. అమూర్తమైన ఆకశవాణి మానవీకరణం వస్తుకళా విశేషం. గొనకొని వీడు నీకును శకుంతలకుం బ్రియ నందనుండు అనే వాక్యాలు దుష్యంతుడిలో ఉన్న ఆక్షేపాలకు

సమాధానాలు. తల్లిదండ్రులకు ఇష్టమైన కొడుకు అని పేర్కొడనడం రాజూకావాలన్న ఆ సత్యాన్ని దాస్తున్నాడని ధ్వని. కొడుకును స్వీకరింపును అనడం ధర్మబోధ. శకుంతల చెప్పింది సత్యం అనడంలో శకుంతల సత్యవ్రత. ఆమె తన ఉపన్యాసంలో గృహిణీత్వాన్ని చెప్పి సాధ్విగా అనిపించుకుంది. చక్రవర్తి కాబోయే కొడుకు గొప్పతనాన్ని వివరించి సద్వినుత అయ్యింది. సత్యం మహాపదార్థాల చేత రక్షిస్తుందని చెప్పి భర్తను శపించకుండా మహాపత్రివ్రతగా గుర్తుంపు పొందింది. దుష్యంతుడిని సుమారంగా మందలించిసత్యాన్ని ప్రతిష్ఠాపించిన ఆకాశవాణి మాటలు కూర్చిన ఈ రచనలో సౌకుమార్య శబ్ద గుణం సార్థకంగా పోషించారు. పరుష వాక్యాలతో తిరస్కరించినా దివ్యవాణి సుకుమారంగా ధర్మాన్ని నిర్దేశించింది. ఇలా వస్తుధ్వనిని నిర్వహించడంలో నన్నయ రచనాశిల్పం అద్భుతం.

ఇంతటి మహాసాధ్వి, లోకజ్ఞురాలు, ధర్మజ్ఞురాలు, విశిష్ట గుణాన్విత కడుపున పుట్టిన వాడు భరతుడు. అతడిని వర్ణించేటప్పుడు బాలార్కతేజుడు, పౌరవకులరత్నాలంకారుడు, ఉదారగుణాలయుడు, కరతలాంకృత చక్రుడు, చక్రవర్తి లక్షణ లక్షితుడు, సింహసంహనుండు, దీర్ఘబాహుడు, అనంత జవసత్త్వ సంపన్నుడు... అన్నిటికీ మించి అతీతానాగతులైన రాజులందరికి వంశకర్తగా వర్ధిల్లాడు. మునులు సర్వదమనుడు అని పేరు పెట్టారు. పుట్టినప్పుడే ఇతడు వంద వాజపేయాలు చేస్తాడని అందరూ వినేలా సరస్వతి చెప్పిందట. (1-4-110) ఇలా వంశకర్తను కనడంలో తల్లి పాత్రను గమనించాలి. కథ సుఖాంతం.

మూడవ కురు మహారాజు. తపతీంసంవరణుడుుగకురుమహారాజు. పాండవులు ఏకచక్రపురంనుంచి పాంచాల దేశానికి ద్రౌపదీ స్వయంవరానికి వెళ్తూదారిలో ఒక రాత్రివేళ గంగానదీ తీర్థంలో స్నానం చేయడానికి పూనుకున్నారు. అక్కడ అంగారపర్ణుడు అనే గంధర్వుడు అర్జునిడితో యుద్ధానికి దిగి ఓడిపోయి మైత్రి చేసుకున్నాడు. ఆ సందర్భంలో వారికి పురోహితుడి ఆవశ్యకతను వివరిస్తూ వారిని తాపత్యులు అని సంబోధిస్తాడు. మేముకౌంతేయులం కదా? తపత్యులమెలా అయ్యాం? అని ప్రశ్నించిన అర్జునుడికి సమాధానంగా తపతీ సంవరణోపాఖ్యానం వస్తుంది.

పౌరవ వంశంలో అజమీఢుడనే వానికి కైకేయి, గాంధారి, రుక్ష అని ముగ్గురు భార్యలున్నారు. వారికి బలవంతులైన 124 కొడుకులు పుట్టారు. వారిలో వారిలో సంవరణుడు సర్వగుణయుతుడు, ధర్మ విదుడు, అఖిల రాజ్యోన్నతుడు, పౌరవకుల వర్ధనుడు. అనవతర కీర్తి విదితుడు. నిర్మలాభిజాత్యుడు. గగనంలో సూర్యుడు వెలుగొండేటట్లు జగతిలో వెలుగొండేవాడు. సంతోషించిన సూర్యుడు తన కూతురు తపతికి ఇతడే తగిన వరుడని నిశ్చయించుకున్నాడు.

తపతి, సూర్యానందన, సావిత్రికి చెల్లెలు. ఉత్తమ లక్షణాలున్న నిర్మలాంగి. తెల్లటి కళ్ళతో సౌమ్యంగా ఉంటుంది. సురుచిరగుణాలు ఈమె సొత్తు. కోమల కనక ప్రభ. అవినయవర్జిత. అజమీఢనందనుడు సంవరణుడు. ఒకరోజు వేటకు వెళ్ళి అడవిలో తిరిగి తిరిగి గుర్రం అలసిపోయి ఉండడం వల్ల ఒంటరిగా కాలినడకన తిరుగుతున్నాడు. అలా తిరుగుతున్నప్పుడు ఒక పర్వతం దగ్గర ఒక కన్య కనబడింది. ఆమె అందాన్ని చూసి రూపవిలాసాలను తదేక దృష్టితో చూస్తూ, నివెవ్వరివి ఇలా ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు అని అడిగాడు. అతడి మాటలకు బదులు చెప్పకుండానే ఆమె మేఘంలోని మెరుపులా అదృశ్యమైపోతుంది. ఆమె కనబడక పోవడంతో చాలా విలపిస్తాడు.

అతడి వయసు, సొగసు చూసిన తపతికి కూడా అతనంటే ఇష్టం కలిగింది. వెంటనే అతడి ఎదుటికి వచ్చి ఎందుకలా విలపిస్తున్నవని మధురంగా అడిగింది. ఇంతవరకు ఎవరికి భయపడలేదని, తాను మన్మథుడికి భయపడుతున్నానని, తనకు ప్రాణదానం చేయమని వేడుకుంటాడు. గాంధర్వ వివాహం చేసుకుందామా అన్నాడు. తపతి తన్ను తాను పరిచయం చేసుకుని తనను వివాహం ఆడాలని ఉంటే వచ్చి తన తండ్రిని అడగమంది. స్త్రీలకు ఈ విషయంలో స్వాతంత్ర్యం లేదని నీకు తెలుసు కదా అని తన అభిప్రాయాన్ని చెప్పింది. జపనీయమ నమస్కారాలతో సూర్యుడిని ఆరాధించమని చెప్పి వెళ్లిపోయింది.

సంవరణుడు ఆ పర్వతం మీదే సూర్యుడిని ఆరాధిస్తూ ఉండిపోయాడు. పురోహితుడైన వసిష్ఠుడిని భక్తితో తలచుకున్నాడు. 12 వ రోజున వసిష్ఠుడు వచ్చి విషయం తెలుసుకున్నాడు. సంవరణుడికోసం ఎన్నో యోజనాలు ప్రయాణించి

ఆదిత్య లోకం చేరి, సూర్యుడిని వేద మంత్రాలతో స్తుతించాడు. సూర్యుడు ప్రసన్నుడై వరుడుని, గుణవతి అయిన కూతుర్ని కన్నందుకు గుణవంతుడైన, అనూరుపుడైన వరుడికి ఇవ్వడం కంటే కోరుకోదగినది లేదని చెప్పాడు. సూర్యుడు సంతోషించి తన కూతుర్ని అతని వెంట పంపాడు. వసిష్ఠుడు వారిద్దరికి విధ్యుక్తంగా వివాహం చేశాడు. 12 సం.లు తపతితో కలసి అడవుల్లో సుఖంగా గడిపారు. అతడు రాచకార్యాలు, రాజధర్మాలను వదిలేయడం వల్ల అనావృష్టి కలిగింది. వసిష్ఠుడు అది తెలుసుకొని శాంతి కపౌష్టిక క్రియలు చేయించి మళ్ళీ సంవరణుడిని హస్తినా పురానికి తీసుకువచ్చాడు. ప్రజలకు సంతోషం కలిగింది. అనావృష్టి తొలగిపోయింది.

తపతి గుణగణాలను చూస్తే ఈమె సూర్యుడి కూతురు. కాబట్టి అభిజాత్యం కలది. వనవిహారానికి భూలోకానికి ఒంటిరిగా వచ్చింది. నిర్భయరాలు, ధీరురాలు. సంవరణులు తదేకంగా తన్ను చూస్తున్నదని సమాధానమైన చెప్పకుండా అదృశ్యమైపోవడం, ఆమె అభిజాత్యానికి, స్వాభిమానానికి, సత్సంప్రదాయానికి తార్కాణం. అతని విలాసాన్ని చూసి అతని అందచందాలను గుర్తించి, తనకు కూడా ఇష్టం కలగడం– ఆమె మనస్వితకు, కరుణార్ద్ర హృదయతకు సంకేతం. మృదు మధురంగా ప్రశ్నించడం ఆమె ఉచితజ్ఞతకు నిదర్శనం. వివాహ విషయంలో తండ్రిని అడుగు అనడం ఆమె వివేకానికి, వినయానికి రుజువు. స్త్రీలకు ఈ విషయంలో స్వాతంత్ర్యం లేదని నీకు తెలుసు అనడం ద్వారా తన మనసును అతనికి సూచనా మాత్రంగా తెలియజేసిన జాణ. అందులోనే పరోక్షంగా అతనికి ధైర్యాన్ని ఓదార్పును ప్రసాదించిన నేర్పరి. గాంధర్వవివాహాన్ని కాదని, వసిష్ఠుడు అంతటి వాడు తన తండ్రి వద్దకు రప్పించి కుల గౌరవాన్ని నిలిపిన మర్యాదస్తురాలు. 12 సం.లు పతి తనతోనే లోకంగా జీవిమ్మెల్లా చేసిన అనురాగవతి. వంశకర్తయైన కురు మహారాజును కని పుట్టినింటికి మెట్టినింటికి కూడా కీర్తిని తెచ్చిన ఆదర్శ స్త్రీ మూర్తి. తల్లిని బట్టే తనయులు.. అనే లోకరీతిని నిరూపించిన సాధ్వి.

నాల్గవ వంశకర్త పాండు భూపాలుడు. మారుతున్న కాలానికి, సమాజానికి ఇతని పుట్టుక, ఇతడి పుట్టుక కొడుకుల పుట్టుక ఒక బలీయమైన ఉదాహరణగా నిలుస్తుంది. కృతాత్రేతా యుగాలు గడిచిపోయాయి. ద్వాపరం కూడా ముప్పాతిక మూడు పాళ్ళు గడిచింది. ద్వాపరి కలియుగాల సంధికాల ప్రవేశించింది. ఆచారాలు మారాయి. కొత్త అవసరాలు తలెత్తాయి. అయినా ఎలాంటి మార్పులు ఎన్ని వచ్చినా ప్రజలను సుఖశాంతులు, ధర్మ0 ఇవే ప్రాధాన్యతను వహించాయి.

పాండురాజు తల్లీ అంబాలిక. తండ్రి విచిత్ర వీర్యుడు. అంబాలిక కాశీరాజు కూతుళ్ళైన అంబ, అంబిక, అంబాలికలలో కడగొట్టుది. వీరు ముగ్గురికి తండ్రి స్వయంవరం ప్రకటించాడు. స్వయంవరానికి వచ్చిన రాజులందరినీ ఓడించి భీష్ముడు ఆ ముగ్గురినీ తన తమ్ముడుకిచ్చి పెళ్లి చేయాలనే ఉద్దేశ్యంతో తన వెంట తీసుకోపోయాడు. అంబాలిక తండ్రి మాటను జవదాటలేదు. భీష్ముడి చర్యను వ్యతిరేకించలేదు. పెద్దదైన అంబ మాత్రం భీష్ముడిని కాదంది. వైరం పెంచుకుంది. పగపట్టింది. ప్రతీకారం తీర్చుకుంది. ప్రేమించిన అక్క జీవితం ఎలా మలుపులు తిరుగుతోందో మౌనంగా గమనిస్తూ వస్తున్న అంబాలిక తనకంటూ ఏ భావాలు లేని, ఆలోచనలు లేని, స్వేచ్ఛను కోరుకొని విధి చేతిలోని కీలు బొమ్మలాంటిది అనిపిస్తుంది. కానీ కాదు. తన జీవితానికి సామాజిక రక్షణను, గౌరవాన్ని పొందగలిగిన వివేకవతి. సొంత నిర్ణయాలతో జీవితాలను ఛింద్ర0 చేసుకునే వారికంటే మౌన0గా జీవితాన్ని చక్కదిద్దుకునే వారే తెలివైన వారుగా లోకంలో పరిగణించారు. ఎప్పటికైనా లోకరీతిని అనుసరించి, కాలానుగుణంగా పదుగురి మన్ననలు పొందేవారే ఆదర్శ ప్రాయులవుతారు.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్ర మహాభారతం, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, తిరుపతి.
2. మంత్ర కవాటం తెరిస్తే మహాభారతం మనచరిత్రే – కల్లూరి భాస్కరం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్
3. మహాభారత వైజయంతి సంపుటాలు, ప్రకాశకులు: భారతీధార్మిక విజ్ఞాన పరిషత్, గుంటూరు – 6.

# 28. కవిత్రయ భారతం - సామాజిక హితబోధ

- డా॥ ఆర్. విజయకుమారి, తిరుపతి.

## పరిచయం

మహాభారతం పంచమ వేదంగా ప్రశంసించబడుతున్నది. ఈ భువిపై మానవ జాతి ఉన్నంత వరకూ భారతం అవసరం ఉండేటట్లు వ్యాసభగవానుడు సృజించాడు. ఇందులో మనిషి ఎలా నడుచుకోవాలో ఉంది. ఎలా నడుచుకోకూడదో ఉంది. ధర్మ వ్యవహారం ఉంది. సత్య మహిమ ఉంది. పశుపక్ష్యాదుల పట్ల ఎలా వ్యవహరించాలో ఉంది. నవరసాల పోషణ ఉంది. శాంత స్వభావ చిత్రణ ఉంది. పురుషార్థాల సాధన విధానం ఉంది. శాస్త్రీయ దృక్పథం ఉంది. ఒక్కటేమిటి మానవ జీవితానికి కావలసిన అనంత విజ్ఞానం ఇందులో ఉంది.

## 1. నిష్కారణ ప్రాణిహింస చేయరాదు

భారతం కథా ప్రారంభంలోనే జనమేజయుని తమ్ములు చేసిన నిష్కారణ ప్రాణిహింసవల్ల సరమశాపం అనుభవించాల్సి వచ్చింది. జనమేజయుడు దీర్ఘసత్ర యాగం చేస్తూ వుంటాడు. ఆ యాగప్రాంగణానికి సారమేయుడనే వాడు క్రీడార్థం వచ్చి అక్కడ తిరుగుతూ వుండగా జనమేజయానుజులు శ్రుతసేన, భీమసేన, ఉగ్రసేనులనేవారు దాన్ని కొట్టారు. అది ఆక్రందన చేస్తూ తల్లి సరమ దగ్గరకు వచ్చి విషయం చెప్పింది. అప్పుడా సరమ జనమేజయుని వద్దకు వచ్చి ఇలా అంటుంది.

**కం : "క్షితినాథ కడు నకరుణాన్వితులై నీ తమ్ములతి వివేక విదూరుల్**
**మతి దలపక నా పుత్రకు నతిబాలకు ననపరాధు నడచిరిపెలుచన్"**
**కం: "తగునిది తగదని యెదలో వగవక సాధులకు బేదవారలకెగ్గుల్**
**మొగిజేయు దుర్వినీతుల కగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్"**

- అని గట్టిగా హితవు పలికింది.

**(ఆదిపర్వం - 1వ ఆశ్వాసం - 85, 86 పద్యాలు)**

సాధువుల్ని బీదవాళ్ళను హింసిస్తే ఏదో ఒకనాటికి కష్టాల్లో చిక్కుకోక తప్పదని సరమ హెచ్చరిస్తుంది. ఈ ఘటన ద్వారా అల్పులను, సామాన్యులను అనవసరంగా హింసించరాదనే నీతి చెప్పబడింది.

ప్రారంభంలోనే వ్యక్తి వ్యక్తిత్వంలోని ఒక లోపాన్ని గురించి చెప్పి, దానివల్ల వ్యక్తికి కలిగే నష్టం ఎలాంటిదో చెప్పటం జరిగింది. సరకు చెప్పినట్లుగానే జనమే జయాదులు కొన్ని సమస్యలను ఎదుర్కొన్నారు.

## 2. అమాయకులను బాధించరాదు

వ్యక్తికి వ్యక్తికి మధ్య వచ్చిన కలహం ఒక్కవ్యక్తిని కష్టాల పాల్జేస్తే అది కొంత వరకు భరించవచ్చు. కానీ ఇద్దరు వ్యక్తుల మధ్య వచ్చిన జగడం, అందులోని ఒక వ్యక్తితాలూకు ప్రజల్ని అందర్నీ ఆపదల పాల్జేయటంగూడా ఒక్కోమారు జరుగుతుంది. ఇలాంటి దారుణానికి తక్షక ఉదంకుల కలహాన్ని ఉదాహరణగా చూపవచ్చు.

ఉదంకుడు (ఉత్తంకుడు) పైలుని శిష్యుడు. గురుపత్ని కోసం పౌష్య మహారాజు భార్యనర్థించి అమె చెవికుండలాలు తెస్తుండగా వాటిని దారిలో తక్షకుడపహరించాడు. ఉదంకుడు చాలా కష్టమ్మీద వాటిని తక్షకుని నుండి రాబట్టగలిగాడు. దీంతో తక్షకుని పై కక్ష పెట్టుకుని జనమేజయుని వద్దకు వెళ్ళి "కాదనకిట్టి పాటి యపకారము తక్షకుడేక విప్ర సంబోధన

చేసి చేసె "...." అన్నాడు. అంటే మీ తండ్రి పరీక్షిన్మహారాజును తక్షకుడు కేవలం ఒక బ్రహ్మణుని శాపాన్ని అడ్డం పెట్టుకొని కావాలని వచ్చి కాటు వేశాడయ్యా! అన్నాడు. అంతేనా ! " ప్రల్లదుడైన యొక్క కులపాంసను చేసిన దాని తత్ కులంబెల్లను దూషితంబగుట యేమి యపూర్వము" అన్నాడు. కాబట్టి ఓ రాజా! నువ్వు దీన్ని సాకుగా చూపి 'సర్పయాగం' చేసి నాగజాతి మొత్తాన్నే నాశనం చెయ్యి అని అతన్ని రెచ్చగొట్టాడు.

సరమవచ్చి జనమేజయునితో మాట్లాడింది. ఉదంకుడూ సంభాషించాడు. ఇద్దరూ బీదవాళ్ళే. కానీ ఉదంకుని వద్ద విద్యాధనం 'ఉంది. అందువల్ల సరమేమో తన బిడ్డకు ఎవరి వల్ల బాధ కలిగిందో వారిని శపించి వెళ్ళింది. కానీ ఉదంకుడు తనని బాధించిన వాడి తాలూకు జనం మొత్తం నాశనం కావాలని వాంఛించాడు. కాబట్టి ఎవరెంతటి సమర్థులో మనకు తెలియదు. కావాలని తప్పు చెయ్యరాదు. అలా చేస్తే ఒక్కోమారు ఒక వ్యక్తి చేసిన అపరాధం ఆ ఒక్కరికే కాక అతని రక్తసంబంధీకులైన వారి మెడకు చుట్టుకుంటుంది. కాబట్టి ఇతరులను హింసించరాదు. వారు కష్టాలపాలు కావాలని కోరోకోరాదు. శత్రువులకు సంబంధించిన వారందరినీ బాధించరాదు.

### 3. ఆవేశముండరాదు

నాగ జాతి మొత్తమే నాశనం కావాలని కోరుకున్న ఉదంకుడే ఒకచోట శాపానికి గురయ్యాడు. పౌష్యుని భార్య నడిగి ఆమె కుండలాలు తీసుకున్నాక, పౌష్యుని అభ్యర్థన మేరకు అతని ఆతిథ్యాన్ని అంగీకరించి భోజనం చేస్తుండగా అన్నంలో వెంట్రుక వచ్చింది. అందుకు కోపించి పౌష్యుణ్ణి 'అంధుడవు' కమ్మని శపించాడు. దీనికి ప్రతిగా రాజు 'నీవు నిస్సంతు వగుదువుగాక!" అన్నాడు. ఉదంకుడు "నేననపత్యుండగా నోప దీనింగ్రమతింపు మనిన' రాజునా వల్ల కాదన్నాడు. చివరకు ఉదంకుడే తన శాపం కొద్దికాలం మాత్రమే పని చేస్తుందని వెనక్కు తగ్గవలసి వచ్చింది. రాజు ఉదంకునికి ఆతిథ్యాన్ని నిండు మనస్సుతోనే యిచ్చాడు. 'అన్నంబు కేశదుష్టం' బైనదనేచిన్న పొరపాటుకు (దీనికి పౌష్యుడు బాధ్యుడు కాడు) శాపం పెట్టేస్తే ఆ శపించినవాడు ఎంత బ్రాహ్మణుడే అయినా దాని ప్రతిఫలం అనుభవించక తప్పదు. కాబట్టి ప్రతి చిన్న విషయానికీ ఆవేశపడటం మంచిది కాదనే హితం ఈ సంఘటన వల్ల మనకు బోధపడుతున్నది.

### 4. విలాసాలకు జంతుహింస చేయరాదు

విలాసార్థమో, వ్యసనానికి లోబడో నోరులేని మృగాల్ని (నిష్కారణంగా) వేటాడరాదని పాండురాజుకు కలిగిన శాపవృత్తాంతం తెల్పుతుంది.

కుంతి మాద్రుల్ని పెండ్లాడి సుఖాల్లో తేలిపోతున్న పాండురాజు క్రమంగా వేటవ్యసనంలో తగుల్కొని... "ఒక్కనాడు పెక్కు మృగంబుల నెనచి యొక్కటి నేనియు నేయంగానక కలిసి యొక్కయెడ" బాణ ప్రయోగం చేస్తాడు. ఈ ఘటనను మానవతా దృక్కోణంతో...

**"మనసిజరాగంబున పెనగిన యిఱిని లేడిజూచి కృతహస్తుడు పెల్చిన యేనమ్ముల నారెంటిని డ్రెళ్ళగనేసె గడు కఠిన హృదయుండై" అంటాడు నన్నయ.**

అందులో ఆడజింక మరణించింది. మగజింక కొన ఊపిరితో మానవభాషలో "ఏనుగిందముడనిన్, మృగముతో నిరంతరము నిట్లు రమింపబోయిన దద్రవ్వతం చెడగోరి సుందరమృగాకృతి నేను భార్యయు దారుణాట విగామభోగరతి నుండితిమి...." మృగంబులమైయున్న మమ్ము వధియించిన దీన నీకు దోషంబులేదు. వేటాడుటయు మృగంబుల జంపుటయు రాజులకు కర్తవ్యంబు'...." (ఆది-5-51, 52) అని పాండురాజు కర్మను అంతబాధలోనూ సమర్థించింది. కాని, ఏఏ స్థితిలో వున్న జంతువుల్ని వేటాడరాదో, ఆ స్థితిలో వున్న జంతువుల్ని ఎటువంటి వారు వేటాడలో కిందముడు ఇలా చెబుతాడు.

"పరిగెత్తలేక పడివున్న దాన్ని, రతిలో వున్నవాటిని, ప్రవిస్తున్న దాన్ని, రోగంతో బాధపడుతున్న దాన్ని- వీటిని వేటమీదే జీవనం సాగించే వాళ్ళైనా వేటాడరు సుమా!" అంటుంది. వెంటనే పాండురాజుకు కోపం వచ్చింది. "తొల్లి అగస్త్య మునీంద్రుండు మృగమాంసంబున శ్రద్ధంబు చేయుచుండా మృగవధ దోషం లేకుండ నిర్మించే దీని నీకు నిందింపదగును... "అన్నాడు పాండురాజు. అలా అన్నప్పుడు మృగంలో క్రోధం విజృభించి" సర్వ ప్రాణులకు సాధారణంబుయి యిష్టంబగు సుఖావసరంబున నున్న మమ్ము ననపరాధుల వధించితి గావున నీవును ప్రియా సంగమంబయిన నప్పుడ పంచత్వంబొందెదు మని..." శాపం పెట్టింది పిమ్మట పాండురాజు పశ్చాత్తాపపడ్డాడు. నన్నయగారు"... గత ప్రాణములై పడియున్న మృగంబులం జూచి శోకించి పాండురాజు పరమ నిర్వేదనపరుండయి చింతిస్తాడు." (ఆది 5 ఆ-57) ఏమైనా మూగజీవాల్ని నిష్కారణంగా వేటాడితే వాటి శాపం తగిలి తీరుతుందని పై వృత్తాంతం బోధపరుస్తుంది.

### 5. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

ఏ విద్యను గడించాలన్నా గురువు లేకుండా సాధ్యంకాదంటుంది సాంప్రదాయం. కానీ ఇందుకు విరుద్ధంగా కేవలం గురుభక్తితో కోరుకున్న విద్యను సాధించవచ్చు నంటుంది పంచమవేదం. 'ఏకలవ్యుని కథే దీనికి నిదర్శనం.

హిరణ్య ధన్వుడనే ఎరుకలరాజు కుమారుడు ఏకలవ్యుడు. ద్రోణాచార్యుని కీర్తి ప్రతిష్టలు విని ఆయన వద్ద విలువిద్య నేర్చుకుందామని వెళ్ళాడు. ఐతే ద్రోణుడు... 'వచ్చిన వాని నిషాద పుత్రుడని శిష్యుంగాజేకొనకున్న" నూ ఏకలవ్యుడు "ద్రోణుననుజ్ఞవడ"శాడు. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. ద్రోణుడు కటిక బీదరికంతో బాధపడ్డవాడు. సహాధ్యాయుడైన ద్రుపదుడు తనకు సాయం చేస్తాడు గదా అని నమ్మి వెళ్ళి భంగపడ్డవాడు. చివరకు భీష్ముని వల్ల కురుపాండవులకు గురువుగా కుదురుకొని ప్రశాంతంగా జీవితం కొనసాగిస్తున్నవాడు. అందువల్ల తనకాలం నాటి సంఘునియమాల్ని అతిక్రమించే ధైర్యం ఆయనలో లేకపోయుండవచ్చు. అంతేగాని సహజంగా అతనిలో ఏ దురాలోచనా వున్నట్టు కనిపించదు. కర్ణుడు సూతపుత్రుడనే బ్రహ్మాస్త్రం నేర్పనన్నాడు. కానీ, కన్న కొడుకైన అశ్వత్థామకు బ్రహ్మశిరాస్త్రాన్ని నేర్పటానికి యిష్టపడలేదు. ఏకలవ్యుడు వ్యవస్థ నెదిరించలేని బలహీనుడు మాత్రమే. ఆ బలహీనతే తనను చంపటానికి పుట్టాడని ద్రోణునికి తెలిసి కూడా ధృష్టద్యుమ్నుణ్ణి శిష్యుడుగా స్వీకరించటానికి కారణమయ్యింది. ద్రోణుడు ఏకలవ్యునికి విద్య నేర్పకపోయినా, తనపై అతనికున్న గురి ఎలాంటిదో గ్రహించాడు. అందుకే...."వాడును ద్రోణుననుజ్ఞ వడసిచని"... అంటాడు. ఇక్కడ అనుజ్ఞవడయట మంటే ఆశీర్వాదం పొందటమనేదే భావం.

**"వినయమున ద్రోణురూపుమన్నునమర్చి, దాని కతిభక్తితోడ(బదక్షిణంబు**
**జేసి మ్రొక్కుచు సంతతాభ్యాసశక్తి, నస్త్ర విద్యారహస్యంబులర్థిబడసె" అంటాడు. (ఆది-5ఆ -232)**

ఒక విద్యను సాధించగలగాలంటే వ్యక్తికి శ్రాద్ధాసక్తులవసరం. అంతేగానీ అతడు పుట్టిన వర్ణం వల్ల విద్యపట్టుపడదు. ఒకేసారి ఒకే చోట ఏడుబాణాలను గురి తప్పకుండా వేయటం ద్రోణునికే తెలియని విద్య. అటువంటి విద్యను ఏకలవ్యుడు సాధించాడు. తాను ఏ మాత్రం ఏకలవ్యునికోసం కష్టపడకపోయినా అర్జునుడికిచ్చిన మాట నిలబెట్టుకోవటంకోసం ద్రోణుడు అతని కుడిచేతి బొటనవేలును గురుదక్షిణగా అడిగినపుడు ... "వినయమ్మున వాడిచ్చె దాని నాచార్యునకున్". ఈ సన్నివేశాన్ని నన్నయ ఇలా రాశాడు.

**"దక్షిణాంగుష్ఠ మిచ్చిన దానజేసి, బాణ సంధాన లాఘవ భంగమన నెఱుకు విలువిద్య కలిమికి హీనుడయ్యె, బార్థునకు మనోరుజయునుబాసెనంత" (95-5-244 ) అంటాడు.**

కుడిచేతి బొటనవేలు లేకపోయినా ఏకలవ్యుడు మహాయోధుడుగా వెలుగొందినట్టు భారతానికి ఖిలసంహితగావున్న హరివంశం చెపుతున్నది. హరివంశం ప్రకారం ఇతడు జరాసంధుని సేనలకు ఆధిపత్యం వహించినవాడు. జరాసంధుడు మధురపై ఎన్నిసార్లు దండయాత్రలు చేశాడో అన్ని మార్లూ అతని సర్వసైన్యాధ్యక్షుడు ఏకలవ్యుడు. ఈ హరివంశాన్ని ఎర్రన తెనిగించారు. అందులో ఏకలవ్యుని గురించి చెప్పబడింది.

**6. మెతకవైఖరి చూపరాదు**

విశేషాధికారాలు కలిగిన ప్రముఖులు మెతకవైఖరి వహిస్తే అది క్రమంగా ఎటువంటి విషమ పరిస్థితులకైనా ఒక్కోసారి దారితీస్తుందనివచ్చు. దారి భారతంలో ధృతరాష్ట్రుని వ్యక్తిత్వం ద్వారా జరిగింది అదేననవచ్చు.

శతశృంగ పర్వతంపైన పాండురాజు మరణించాక మాద్రి అతని శవంతో సహగమనం చేసింది. చిన్నవాళ్ళైన పాండవుల్ని ఐదుగురినీ తీసుకొని హస్తినకు వచ్చింది కుంతి. తమ్ముని మరణానికి ఎంతో దుఃఖించిన ధృతరాష్ట్రుడు పాండవుల్ని ఆదరించాడు. కౌరవులు పాండవులు కలిసి పెరుగుతున్నారు. అందరూ కలసి ఆటలాడుకునే సమయంలో భీముడు ఒక్క దుర్యోధనుణ్ణి తప్ప తక్కిన కౌరవులందర్నీ చావగొట్టి వదిలేవాడు. ఈ సన్నివేశాన్ని నన్నయఇలా తెలిపాడు.

**కం : "తనసుతులు పాండు సుతులని, మనమున భేదింపకతి సమంజస భావం**
**బున నొక్కరూప కాజేకొని యుండెం బాండురాజు కొడుకుల బ్రీతిన్"**
**కం : ధృతరాష్ట్రునెయ్యమున సం, తత వర్ధితులగుచు బాండు తనయులు వినయా**
**న్వితులు కుమారక్రీడా, రతులయి, యొడగూడి ధార్తరాష్ట్రులతోడన్"**
**కం : "గిఱపునెడ నేయునెడ వడి, బఱచు నెడంబెనగునెడ నపారబలంబుల్**
**మెఱయునెడ భీమునకునం, దొఱగీద్పడ దొడగి రుద్ధతులు రాజసుతుల్"**
**కం : "వదలక పెనగిపదుంద్రం, బదియేవుర నొక్కపెట్ట పట్టి ధరిత్రి**
**జెదర బడవైచి పవనజు, డదయుండయి వీపులొలయనందఱనీడ్చున్"**
**సీ : కూడిజల క్రీడలాడుచో గడగియా, ధృతరాష్ట్రతనయులనతులశక్తి**
**లెక్కించియు బదుంద్రనొక్కొక్క భుజమున, నెక్కించుకొని వారియుక్కడంగ**
**గ్రంచఱనీరిలో ముంచుచునెత్తుచు, గారించి తీరంబు జేరబెట్టు**
**గోరి ఫలార్థులై వారల యెక్కన మ్రాకుల మొదళుల వీకబట్టి**
**ఆ : వడిగదల్చు బండ్లు దడబడివారల, తన ధరణి మీద దొరగుచుండ**
**నిట్టి పాట గాద్పుపట్టిచే దుశ్శాస, నాదులెల్ల బాధితాత్ములైరి. అంటాడు. (ఆది-5 -162-166)**

భీమునివి బాల్యచేష్టలే అయినా అలా వ్యవహరించి ఉండకూడదు.

**7. దృఢమైనవ్యక్తికి అపజయముండరాదు**

మానసికంగాను, శారీరకంగాను దృఢమైన వ్యక్తి తనకెదురయ్యే అన్ని కష్టాలనూ సమర్థవంతంగా ఎదుర్కొని తాను నిలవటమేగాక, తనను నమ్ముకున్నవారిని గూడా ఒడ్డుకు చేర్చగలడు అనే విషయాన్ని మనకు మహాభారతలోని శ్రీకృష్ణుని పాత్ర తెలియజేస్తుంది.

కృష్ణుడు యదువంశంలోని వృష్ణిశాఖకు చెందినవాడు. సొంత మేనమామే ఇతన్ని పుట్టిన వెంటనే చంపెయ్యాలని నిర్ణయించటంతో ఈయన కష్టాలు యెలాంటివో ప్రత్యేకించి చెప్పవలఽసిన పనిలేదు. వసుదేవునికి పుట్టి నందుని యింట్లో పెరిగాడు. కౌమారదశ దాటుతూ వుండగా మేనమామను చంపాడు. ఇంతటితో ఈయన కష్టాలు తొలగలేదు సరికదా, కష్టాల పరంపర ప్రారంభమయింది. కంసుని మామ జరాసంధుడు. అతనిపై పగబట్టాడు. మధురపై దండయాత్రలు సాగించాడు. జరాసంధుని దాడుల నుండి యాదవుల్ని కాపాడదలిచి కృష్ణుడు సముద్రం మధ్యలో వున్న దీవిలో ద్వారకానగరం కట్టించాడు. తనలాగే కష్టాల పాలవుతున్న మేనత్త కుమారులు పాండవులకు బాసటగా నిలిచాడు. అందులో పాండవమధ్యమునికి

తన చెల్లెలు సుభద్ర భార్య అయ్యేట్లు చేశాడు. ఆమె సంతతివారికే కురురాజ్య సింహాసనం దక్కేట్లు చేశాడు. ఎక్కడ ఎప్పుడు ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించాడు. అందువల్లనే యదుకులంలో పుట్టి పేరు ప్రఖ్యాతలు సాధించుటమే కాదు, మొదట మహావీరుడిగా ఆరాధింపబడి తుదకు భగవంతుడుగా నేడు నిత్య నీరాజనాలందుకుంటున్నాడు.

**8. సొంతవ్యక్తిత్వం ఉండాలి**

దురదృష్టం ఎన్ని విధాలుగా వెంటాడి వేధించినా తనదైన సొంతవ్యక్తిత్వంతో సత్ప్రవర్తనతో సమాజంపై తనదైన ముద్ర నిల్పి శాశ్వత కీర్తిని సాధించవచ్చని తెలిపేదే కర్ణుని జీవితం.

కృష్ణునిలాగానే ఈయన కూడా పుట్టుకతోనే దురదృష్టవంతుడు. మహాభారతకథలో ఇన్ని కష్టాలు అవమానాలు భరించిన వ్యక్తి మరొకరు లేరు. కృష్ణుణ్ణి మా సరివాడవా? అని ప్రశ్నించిన వారినందరినీ అతడు అవమానించి తగిన విధంగా శాస్తిజేస్తూ పోతే, కర్ణుడు మాత్రం తలవంచుకొని మౌనంగా ఉండిపోయాడు. కురుపాండవ కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయాన కృపాచార్యుడు అర్జుననితో ద్వంద్వయుద్ధానికి తలపడబోయిన కర్ణుని 'నీకులగోత్రాలేంటో చెప్పు' మన్నప్పుడు ఇతను సిగ్గుపడి తలవంచుకున్నాడు. ఆ ఘట్టంలోనే దుర్యోధనుని చేత అంగరాజ్యాభిషిక్తుడైన కర్ణున్ని భీముడు–

**ఉత్తమక్షత్రియ ప్రవరోప యోగ్యమైన యంగ రాజ్యంబు నీకర్హమగునె**
**మంత్రపూతమై గురుయజమానభక్ష్య, మగు పురోడాశమది కుక్కకర్హమగునె? –అంటూ హేళనగా**
**(ఆది. షష్ఠ ఆశ్వా 57ప)**

మాట్లాడతాడు. తెల్లమొహం వేశాడు. ఇతనిలో ఉన్న బిడియాలు గొంకు జంకులే యితరులు యితన్ని మానసికంగా హింసించేందుకు అవకాశం ఇచ్చాయనవచ్చు. అదేవిధంగా కర్ణుడు బాలం నుంచి శాపాలే ఎదుర్కొన్నాడు. వాటిని తిక్కన ఇలా తెలిపాడు.

**"వినుము నరేంద్ర విప్రుడలివెన్ జమదగ్ని సుతుండు శాపమి**
**చ్చె, నమరభర్త వంచనము సేసే వరం బనికోరి కుంతిమా**
**న్నైనలుక, భీష్మదర్థరథుజేసి యదంచె కలంచే మద్రరా**
**జనుచితమాడి, శౌరి విధి యయ్యె, నరుండటజంపే కర్ణునిన్ – అన్నాడు.**

ఇంతమంది ఇన్ని విధాలుగా చేస్తే తప్ప అర్జునుడు అతన్ని చంపలేకపోయాడు. అప్పుడు గూడా కర్ణుడు నిరాయుధుడుగా ఉన్నప్పుడే అర్జునుడు చంపాడు.

**"మాత్ర పురీషాదులు తమ, గాత్రములందింక వారు గారవమెసగం**
**బుత్రుండని సంవర్ధిత, గాత్రునిగాజేసిరింత కాలము గూర్మిన్ (తి.భా. ఉద్యోగ 4 ఆ : 34 ప)**

అని కృష్ణుని అసహ్యకర ప్రతిపాదనను సందర్భోచితంగా తిప్పికొట్టాడు. దేవేంద్రుడొచ్చి కవచకుండలాలు దేబిరించినపుడు ధీరుడై దాన మిచ్చాడు. ఆ విషయంలో కర్మసాక్షి వాక్యాలను గూడా లెక్కచేయలేదు. తన నియమాన్ని తప్పలేదు. ఇన్ని విధాల సద్గుణవంతుడైన వ్యక్తి భారతఘోరరణంబులోనే కాదు, ఏ రణంలోనైనా, గెలిచినా ఓడినా మరణించినా కీర్తిహంస అతని శిరస్సుపై నిలుస్తుందిగాని తొలగదు. అలాంటి కీర్తిని కర్ణుడు సొంతం చేసికున్నాడు.

**9. సకల సద్గుణాలు ఉండాలి**

మానవజన్మ విశిష్టమైనది. కాని మానవ స్వభావం విచిత్రమయింది. ఏసమయానికి ఎలా స్పందిస్తుందో చెప్పటం

కష్టం. కొందరి హృదయాలు ప్రశాంత గంభీరాలు. కొందరి జీవితం మనస్సులు క్రోధావేశపూరితాలు. కొందరి చిత్రం ఈర్ష్యాఅసూయగ్రస్తాలు. ఇవి అన్నీ కలగలసి ఒకే వ్యక్తిలో ఉంటే అతడు మహాభారతంలో అశ్వత్థామ ఔతాడు.

బాల్యంలో బీదరికపు బాధను కొంత చవిచూచాడు. భీష్ముడు తన తండ్రిని ధనురాచార్యుడుగా మన్నించటంతో లేమి సమస్య తీరింది. కౌరవ పాండవులతో పాటు అశ్వత్థామ కూడా తండ్రి వద్దనే యుద్ధవిద్యలు నేర్చుకోసాగాడు. ఐతే గురువుగారు బోధించిన విద్యను అవగతం చేసుకోవటంలోను, వినయ విధేయతలలోను అర్జునుడు ఎప్పుడూ ముందుండేవాడు. అశ్వత్థామలో ఇది విద్యామాత్సర్యాన్ని రేపింది. చీకట్లో లక్ష్యాన్ని ఛేదించే విద్యను అర్జునుడు నేర్చుకొకూడదనే ఉద్దేశ్యంతో వంటలవాడితో అర్జునుడికి ఎప్పుడూ చీకట్లో భోజనం పెట్టవద్దని చెప్పాడు. అతడు అశ్వత్థామ చెప్పినట్లే చేస్తూ వచ్చాడు. ఒకరోజు రాత్రి అర్జునుడు భుజిస్తూ ఉన్నాడు. అప్పుడు అర్జునునికి ఒక సత్యం బోధపడింది. 'చీకట్లో గూడా యుద్ధం చేసే విద్య ఉందని. దాన్ని అభ్యాసం చేయసాగాడు. అతడి ధనుష్టంకార ధ్వని విని వచ్చిన ద్రోణుడు అర్జునుణ్ణి మెచ్చుకుని నీకు మించిన విలుకాండ్రు లేరన్నట్లుగా నిన్ను తయారు చేస్తానని వాగ్దానం చేశాడు. అశ్వత్థామ అశయం నెరవేరలేదు, సరికదా, గురుకృప అర్జునునిపై మరింత అధికంగా నిలిచింది.

ఉత్తరగోగ్రహణ సమయంలో ద్రోణున్ని దుర్యోధనుడు అధిక్షేపించినపుడు అశ్వత్థామ...... "పుత్రనిర్విశేషుండగు నిజ ప్రియ శిష్యు గ్గించుట గురునకు గొఅంతయే యింక సిగ్గుమాలి రణంబు సేసేనేనియు ద్రోణుండ చేయుంగాని యేనట్టి దానికోర్వ..." నని ఘాటుగా ఎదుర్కొన్నాడు. బీరాలు పలికిన కర్ణున్ని అధిక్షేపిస్తూ ఇలా అంటాడు.

**"నినునీవపొగడికొని పలి, కిన పలుకులు పెక్కుకలవు క్రీడి యనికి వ**
**చ్చిన వాడిదె పులివలె మా, ర్కొన రాదే కర్ణ సేనకుంబ్రియ మెసగన్ (విరాట - 5 -22)**

- అని సూటిగా ప్రశ్నిస్తూ పరిహసించారు. ద్రోణుడు అర్జునునితో తలపడ్డాడు. ఐతే ద్రోణుని భుజబలం అంతకంతకు తగ్గటం చూచి తండ్రికి బాసటాగా అశ్వత్థామ నిలిచాడు. అర్జునుని వింటినారిని బాణం దెబ్బతో తెంచాడు. కొంతసేపు యిద్దరూ భీకరంగా పోరాడారు. ఇంతలో వింతగా "ద్రోణతనయు తూణీరంబులు శరశూన్యంబు'..." లైనవట. అర్జునుని 'తూణీరంబు లక్షయబాణంబు' అయినవట. అంతకంతకు విజృంభిస్తున్న అర్జునుని అటోపానికి అడ్డుకట్టగా కృపాచార్యుడు తారసిల్లాడు.

అశ్వత్థామ ఎంత శ్రీఘ్రకోపి అయినా, ఆయా సందర్భాల్లో దుర్యోధన కర్ణాదుల్ని కటువుగా మాట్లాడినా యుద్ధరంగంలోనూ భీష్మ ద్రోణుల వలె పక్షవాతంతో కూడిన యుద్ధం ఎన్నడూ చెయ్యలేదు. అశ్వత్థామ ఆకాస్త పక్షపాతం కూడా లేనివాడు. అంతేకాదు, కురుక్షేత్రసంగ్రామంలో యితడు ఉపయోగించినన్ని మారణాస్త్రాలు మరెవ్వరూ ఉపయోగించలేదు. ద్రోణుడు మరణించాక కర్ణుణ్ణి తర్వాత శల్యుణ్ణి సర్వసైన్యాధిపతుల్ని చేయమని దుర్యోధనునికి చెప్పింది యితడే. పరాజయ పరంపరలతో విషణ్ణచిత్తుడైన రారాజుకు దైన్యం పోగొట్టటానికి, అతడిలో ఉత్సాహం నింపటానికి సోమకులతో తలపడి ఘోరంగా యుద్ధం చేశాడు. వాళ్లను తరిమికొట్టాడు. తండ్రి ద్రోణుడు ధర్మరాజు వంచనకు గురయి మరణించాడని తెలసి క్రుద్ధుడై నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రానికి విరుగడు నమస్కారాస్త్రమనే విషయం కృష్ణార్జునులకు తెలియదనే భావించాడు. ఈ విషయంలో అశ్వత్థామ అమాయకత్వం మనకు బోధపడుతుంది. అలవి మాలిన ఆత్మవిశ్వాసం ఎప్పుడూ మంచిది కాదు. ఎవరెంతటి మేధావంతులో, ఎవరెంతటి శక్తివంతులో ఆయా సందర్భాలు వచ్చినప్పుడు మాత్రమే తెలుస్తుంది. కృష్ణార్జునులపై ఇతడెన్ని అస్త్రాలు ప్రయోగించాడో లెక్కలేదు. అవన్నీ వ్యర్థమై పోవటం చూచి హతాశుడై ధనుస్సును రథంపై పడేసి యుద్ధరంగం నుండి వెళ్ళిపోయాడు. అలా వెళ్తున్న వానికి వ్యాసుడు కనిపించి కృష్ణార్జునులంటే ఎవరో చెప్పాడు. ఏమి చెప్పినా చివరకు అవేవీ అశ్వత్థామవద్ద పనిచేయలేదు.

### ముగింపు

ప్రజలు అనేక ఒడిదుడుకులతో కష్టనష్టాలతో మానసిక ఆందోళనతో జీవనం సాగిస్తున్నారు. ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారు. జంతువులను హింసిస్తున్నారు. అమానవీయంగా జీవనం సాగిస్తున్నారు. ఇంకా అనేక దుర్గుణాలతో కూడిన రీతుల్లో జీవిస్తున్నారు. భారతం వీటన్నిటి నుంచి మానవ జాతికి విముక్తి కలిగిస్తూ, వికాసానికి దారి చూపిస్తున్నది. ఆ దారిలో నడవడం మన కర్తవ్యం.

### ఆధారగ్రంథాలు

1. వ్యాస భారతం – వ్యాసమహర్షి
2. భారత సవురు – డా॥టి.రంగస్వామి
3. మహాభారతం – మానవ ప్రబోధం – వడ్లమూడి గిరిధర్
4. ఉషశ్రీ భారతం – పురాణ పండ రంగనాథ్
5. వ్యాసభారతము – పుల్లెల శ్రీరామచంద్రుడు
6. కవిత్రయ భారతం.

# 29. కవిత్రయ మహాభారతం - వ్యక్తిత్వ వికాసం

- పెద్దాడ సాయి సూర్య సుబ్బలక్ష్మి, నంగనల్లూర్, చెన్నై.

## పరిచయం

మహాభారతం మానవ స్వభావాలను ప్రతిబింబించే మహేతిహాసం. అందునా కవిత్రయ ఆంధ్రమహాభారతం, నన్నయ్య వస్తుధ్వనినీ, తిక్కన రసధ్వనినీ, ఎఱ్ఱన అలంకారధ్వనినీ నింపుకుని మనిషికి మనోవికాసాన్ని పెంపొందించే మహత్తర గ్రంథం. తెలుగువారికి గారెలంటే ఎంత ఇష్టమో, ఆంధ్రమహాభారతం వినడం, చదవడం, అంతే ఇష్టం. ఆధునిక విద్యావిధానంలో 'చదవడం' వలన కవిత్రయ మహాభారతం పరిచయం అయినప్పటికీ ప్రాచీనకాలంనుండే 'శ్రవణం' ద్వారా నిరక్షరాస్యులు కూడా భారతాన్ని ఆస్వాదించి అనుసరించారు. దృశ్యమాధ్యమాల ద్వారా చూసి, విని, రసాస్వాదం ఓ కోణమైతే కవిత్రయ మహాభారతంలో లోతుగా ఉండే అంతరార్థాన్ని, జీవిత పరమార్థాన్ని అర్థంచేసుకోవడం మరొక కోణంనుండి ఈ గ్రంథాన్ని విశ్లేషించడం.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్" అని పేర్కొన్నట్లుగా భారతంలో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది, లేనిది ఎక్కడా ఉండదు. ఈ 'జయసంహిత' విలువలతో కూడిన విజయాలని అందుకోవడంలో ప్రతీవ్యక్తికీ జీవితంలో ఎంతో దోహదపడుతుంది. ఓ వ్యక్తి శక్తిగా ఎదిగినా యుక్తిగా వ్యవహరించాలన్నది కవిత్రయ మహాభారతంలో తేటతెల్లంగా తెలుపబడింది. మనిషికి ముఖ్యమైనది నడవడిక అని పాత్రల చిత్రీకరణ ద్వారా చెప్పబడింది. ఈ పుడమిపై జన్మించిన ప్రతీ వ్యక్తి జంతుశాస్త్రం ప్రకారం ఓ జంతువే! వ్యక్తికి సమన్వయ వ్యక్తిత్వం లేకపోతే ఓ క్రూరమృగం కన్నా భయంకరమైన ప్రాణి మనిషే. శారీరక దృఢత్వానికి వ్యాయామం ఎంత అవసరమో, వ్యక్తిత్వ వికాసానికి కవిత్రయ మహాభారతంలో ప్రతీ పద్యం ఓ హృద్యం. మరి ఈ ప్రక్రియలో వ్యక్తిత్వ వికాసానికి కవిత్రయ మహాభారతంలోని కొన్ని పర్వాల ద్వారా ఓ విశ్లేషణ చెయ్యడానికి ప్రయత్నిద్దాం.

## విశ్లేషణ

లౌకిక విద్యాభ్యాసమే జీవిత పరమావధిగా మారిన ఈ రోజుల్లో విద్య అంటే ఉద్యోగార్జనకి ఓ అర్హత. కానీ పూర్వం విద్య ఇహాన్నీ, పరాన్నీ రెండింటినీ సమన్వయపరచేవిధంగా గురుకులాల్లో అభ్యసించిన రోజుల్లో భారత-రామాయణాలు నేర్చుకొని, ఇటు ఇహానికి, అటు పరానికి కావలసినవి సమకూర్చుకొని, వ్యక్తిగా ఎదుగుతూ, విద్య వలన వికాసాన్ని పొంది, విద్యాభ్యాసం పూర్తయ్యేసరికి పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దబడి, సమాజహితం కోరేవారిగా జీవనాన్ని సాగించేవారు. మరి నేడో, అలాంటి పరిస్థితులు కనుమరుగై వ్యక్తిత్వ వికాసానికి నోచుకోని చదువులతో పట్టభద్రులై, స్వీయ ఉన్నతే ముఖ్యమని, స్వార్థం నిండినవారై సమాజం గురించి ఆలోచించలేని పరిస్థితులలో ఉన్నారు. అప్పుడు విలువలతోకూడిన సమాజం ఎలా నిర్మింపబడుతుంది? సామాజిక శ్రేయస్సు, వ్యక్తిగత శ్రేయస్సు ఓ నాణానికి బొమ్మ-బొరుసు వంటివి. ఇటివంటి పరిస్థితులలో మనిషియొక్క వ్యక్తిత్వ నిర్మాణంలో, వికాసంలో కవిత్రయ మహాభారతం ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తుందో పరిశీలిద్దాం.

సంస్కృతంలో వ్యాసభగవానుడు రచించిన ఈ పంచమవేదాన్ని తెనిగించిన కవిత్రయం - నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన ప్రతీ తెలుగువానికీ ప్రాతఃస్మరణీయులు. ఈ మహాభారత నిధిని పెన్నిధిగా అందించినందుకు ప్రతీ తెలుగువాడూ ఆజన్మాంతం ఋణగ్రస్తులే! ఆ ఋణం తీర్చేందుకైనా ఈ కవిత్రయ భారతాన్ని చదువుకోవాలి, చదివించాలి. మన ఈ సాంస్కృతిక వారసత్వ సంపదని తరతరాలకీ అందించగలిగినప్పుడే ప్రజాహితంకోరే నాయకులు, పిల్లల ఉన్నతినేకాక క్షేమాన్ని కాంక్షించే తల్లితండ్రులు, వాత్సల్యంతో విద్యని బోధించే గురువులు, ఆడవాళ్ళని గౌరవించే సమాజం, ధర్మంవీడని ప్రజలతో మన దేశం సంస్కృతీ-సాంప్రదాయాలతో సుభిక్షంగా ఉండి, సంపదలకు నిలయమవుతుంది.

కవిత్రయంలో మొదటివాడు, ఈ మహోన్నతకార్యానికి శ్రీకారంచుట్టినవాడు, ఆంధ్రసాహిత్యానికి అపర వాల్మీకి ఆదికవి నన్నయ్య భట్టారకుడు. క్రీ. శ. 11వ శతాబ్దంలో ఆది, సభా పర్వాలను, అరణ్యపర్వంలోని చతుర్థాశ్వాసంలో కొంతభాగాన్ని రచించి దివంగతుడు కాగా, 13వ శతాబ్దానికి చెందిన తిక్కన విరాటపర్వంనుండి స్వర్గారోహణపర్వం వరకు 15 పర్వాలను రచింపగా, ఆ తరువాత 14వ శతాబ్దపు ఎఱ్ఱన అరణ్యపర్వశేషాన్ని పూర్తిగావించాడు. రెండున్నర శతాబ్దకాలంలో 18 పర్వాల జయకావ్యమును కవిత్రయంచేత ఆంధ్రీకరింపబడినా, ముగ్గురు మహాకవులు వేరు-వేరు కాలాలలో రచించినా, చదువుకునేటప్పుడు ఒకే కవి ఏకకాలంలో రచించిన అనుభూతిని అందిస్తుంది. ఇది ఆంధ్రులకే పరిమితమైన అదృష్టం అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఈ గ్రంథంలో ఇంకా కథలోకి వెళ్ళకుండానే ఆదికవి నన్నయ్య వ్యక్తిత్వంలోనే మనకి వికాసం కనిపిస్తుంది. ఓ కవియొక్క కవితాశైలి, అతని సాహిత్యదర్శనంనుండే వ్యక్తిత్వం పుడుతుంది అనడానికి ఉదాహరణ ఏమిటంటే 11వ శతాబ్దపు సామాజిక పరిస్థితులను, అటు రాజకీయంగా, ఇటు ప్రజాభిప్రాయాల్లో కలిగే మార్పులకు తగిన వస్తువు మహాభారతం అని గ్రహించిన అత్యంత వ్యక్తిత్వ వికాస నిపుణుడు నన్నయ్య. తన స్వతంత్రశైలిలో ఆధునిక కవితాదృక్పథంతో కావ్యశైలిని నిర్మించి తద్వారా ప్రజల వ్యక్తిత్వ వికాసానికి ఆనాడే మహాభారత రచనతో మార్గం వేసాడు నన్నయ్య భట్టారకుడు. మతముద్ర వేసుకొన్న పురాణప్రక్రియతోకాక, ఇతిహాసమైన మహాభారతాన్ని ఎన్నుకొని ప్రజలలో మార్పు తేవాలనుకున్నాడు నన్నయ్య. మనజీవితంలో ధర్మార్థకామమోక్షసాధన సమగ్రచిత్రీకరణ, దానికి సంబంధించిన శాస్త్రబోధనం చేయగల 'జయసంహిత'ను ధర్మదృష్టితో తొలి తెలుగుకావ్యంగా మలిచాడు.

కవిత్రయ మహాభారతం - వ్యక్తిత్వ వికాసం విశ్లేషణలో ముందు నన్నయ్య వ్యక్తిత్వాన్నే ఓసారి పరిశీలిస్తే... తొలి తెలుగుకావ్యరచన చేసే కవిసార్వభౌమునకు సంస్కృతాంధ్ర పరిజ్ఞానం ఎంత విస్తారంగా ఉండాలి మరి? వివిధ వేదశాస్త్ర విజ్ఞానం, లోకవ్యవహార జ్ఞానం తెలిస్తే తప్ప పంచమవేదాన్ని వ్రాయడం సాధ్యంకాదు. పాత్రల చిత్రీకరణలలో అపారమైన నైపుణ్యం, ఉభయభాషా పరిజ్ఞానం, అపూర్వమైన ప్రజ్ఞతో ప్రకాశించే మహాకవి, తన రచనలో మొట్టమొదటగా వ్యాసవాల్మీకులను కీర్తించి, గురుస్మరణతోనే ఏ పనినైనా మొదలుపెట్టాలన్న ధర్మాన్ని తాను ఆచరించి ఆదర్శంగా నిలిచాడు నన్నయ్య. గుర్వాశీర్వచనం లభిస్తే అన్నీ లభించినట్లే. "గురు సాక్షాత్ పరబ్రహ్మ" అన్న వాక్కును పాటించి, జీవితం సాఫల్యం చేసుకోవడానికి గురువుని ఆశ్రయించడం అనేది నన్నయ్య ఇచ్చిన వ్యక్తిత్వ వికాసానికి మొదటి సందేశం. సత్ఫలితంగా వాల్మీకి కవితానైపుణ్యం, వ్యాసుని జ్ఞానాన్ని సమగ్రంగా పొంది, సంస్కృత భారతాన్ని తెలుగులో కావ్యేతిహాసంగా రచించి, తన రచనలో వాల్మీకి, వ్యాసుల వ్యక్తిత్వాలు ప్రతిబింబించేలా రచన చేసాడు.

**ఆదిపర్వం ప్రథమాశ్వాసంలోని మంగళశ్లోకము**

**శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే**
**లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవామ్**
**తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై**
**ర్భూయాసు: పురుషోత్తమామ్బుజభవశ్రీకన్ధరా శ్శ్రేయసే.**

ఆదిపర్వం మొదటి ఆశ్వాసంలోని మంగళశ్లోకంలో నన్నయ్యచే త్రిమూర్తులు సతీసమేతంగా కీర్తించబడ్డారు. స్త్రీపురుష సంయోగ రూపమైన ఈ లోకానికి శ్రేయస్సును కలిగించడం ఈ శ్లోకం అంతరార్థం. సమాజంలో గృహస్థాశ్రమ ధర్మం కేంద్రంగానే ధర్మం ఉద్ధరించబడుతుంది - ఇళ్ళు చక్కగా ఉంటే ఊరంతా శుభం. అన్ని ఊళ్ళూ శుభంగా, సుభిక్షంగా ఉంటే దేశం సుభిక్షంగా, క్షేమంగా ఉంటుంది. అందుకే మన గృహస్థాశ్రమ ధర్మం ఎంతో యుక్తాయుక్తంగా పాటించాలని ఉటంకిస్తుంది ఈ కవిత్రయ భారతం.

**నన్నయ్య రచించిన పర్వాలలో వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే అంశాలు**

కౌరవుల దుర్బుద్ధి ఎంత బలంగా చిత్రీకరించబడ్డాయంటే వారి గుణాలు అలాంటివి మరి. ఉదాహరణ:

1. దుర్యోధనుడు భీముని బలాన్ని సహించలేక అతడిని చంపే యత్నాలు చేయడం.

2. అర్జునుడు విలువిద్యలో ప్రకాశిస్తూ ఉంటే ప్రత్యర్థిగా కర్ణుని అంగరాజు చేయడం. ఇక్కడ ధృతరాష్ట్రుని గుడ్డి పుత్రప్రేమను కూడా పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

3. దుర్యోధనుడు దుష్టబుద్ధితో, ధృతరాష్ట్రుని అండదండలతో, శకుని, కర్ణుల సహాయంతో పాండవులకు కీడుతలపెట్టడం, లక్కఇంటిదహనయత్నం చేయడం.

4. పాండవులు హస్తినలో ఉంటే రాజ్యం దక్కడం అసాధ్యమని భావించి, తండ్రిని ప్రేరేపించి వారిని ఖాండవప్రస్థానికి పంపడం.

అసూయ, ఓర్వలేనితనం ఓ వ్యక్తి వినాశనానికి ఎంత కారణం అవుతాయో సుయోధనుని పాత్ర అధ్యయనం చేస్తే తెలుస్తుంది.

ఆదిపర్వంలోనే నన్నయ్య జీవితానికి ఆది, అంతం ఏమిటో వివరించేసాడు. కవిత్రయ మహాభారతంలో ఆదిపర్వం ఎంత గొప్పదంటే కురుక్షేత్ర సంగ్రామంలో ప్రజ్వలించే ప్రతీకార జ్వాలలకు ఆదిపర్వంలో అసూయ బీజాల ద్వారా అంకురార్పణ జరిగింది. అలాగే పురుషప్రయత్నం ప్రతిఫలాపేక్ష లేకుండా సక్రమంగా నిర్వహిస్తే ఆ ప్రయత్నానికి దైవకృప తప్పక తోడవుతుందనీ, విజయం తథ్యమని ఆదిపర్వంలోనే ప్రతిపాదించాడు నన్నయ్య.

ఇక సభాపర్వంలో చెప్పినవన్నీ చెయ్యకూడనివే! జూదంలాంటి వ్యసనం ఎంతటివారికైనా తగదని, స్త్రీని నిండు సభలో అవమానిస్తే నెత్తుటేర్లు ప్రవహించడం అనివార్యం అని ఉపదేశం చేసాడు. అలా ఆది, సభా, అరణ్యపర్వంలో కొంతభాగం వరకూ రచన చేసాక నన్నయ్య ఘంటం ఆగిపోయింది. నన్నయ్య తరువాత సుమారు 2 శతాబ్దాల వరకు భారత రచన అలాగే ఆగిపోయింది. కవులు పుట్టారు, కావ్యాలు రచింపబడ్డాయి, కానీ పంచమవేద ఆంధ్రీకరణం మాత్రం కొనసాగలేదు. ఎట్టకేలకు ఆ సరస్వతీ **కటాక్షంవల్ల తిక్కన సోమయాజి ఆ బృహత్కార్యాన్ని పున: ప్రారంభించాడు. అక్షరజ్ఞానం కలవారిలో తిక్కనను గూర్చి తెలియనివారుండరు. విరాటపర్వంనుండి మిగిలిన 15 పర్వములు ఆంధ్రీకరించిన తిక్కన మూడొంతులు భారతాన్ని ఆంధ్రీకరించిన కవిశిరోమణి. రచనంతటా తెలుగుదనమును పూర్తిగా నింపినవాడు తిక్కనే. నెల్లూరు ప్రాంత మహీపాలుడైన మనుమసిద్ధి ఆస్థానకవి.**

తిక్కన భారతం ఎంత గొప్పదంటే భౌగోళిక విషయాలు, చారిత్రక విషయాలు ప్రత్యేకంగా చదువుకునే గ్రంథాలు అవసరంలేకుండా ఈ మహేతిహాసంలోనే ఆ జ్ఞానాన్ని ఆయా విషయాలకనుగుణంగా ఇనుమడింపజేసాడు తిక్కన. భారత రచనకు ముందు నన్నయ్యను గురువుగా స్వీకరించి సాటి కవిని గురువుగా పూజించిన ఔన్నత్యాన్ని దక్కించుకున్నాడు.

**తిక్కన భారతంలో తెలుసుకుని ఆచరింపదగిన వ్యక్తిత్వ వికాసోన్నతాంశాలు**

– విరాటపర్వం: అజ్ఞాతవాసంలో కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, రాజభోగాలకు దూరమైనా ధర్మనిష్ఠతో ఎలా ఉండాలి, కష్టకాలాన్ని తమకు తెలిసిన నైపుణ్యతతో ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేస్తుంది.

– ఉద్యోగపర్వం: ఉద్యోగమనగా యత్నం. పాండవులు రాజ్యభాగము సాధించుటకై చేయు యత్నమే ఉద్యోగపర్వం. కార్యసాధనకై చెయ్యవలసిన ప్రయత్నం ఎలా ఉండాలో ఈ పర్వం చాటిచెప్తుంది. అయితే యత్నం పాండవులదే అయినా అన్నీ తానై కథ ముందుకు నడిపినది శ్రీకృష్ణుడు. అంటే సంకల్పం నెరవేరడానికి మానవప్రయత్నం, దైవ సహాయం సమపాళ్ళలో ఉండాలి అని మనం తెలుసుకోవాలి.

– భీష్మపర్వం: ఈ పర్వంలోని మొదలయ్యే భారతయుద్ధం ఓ పెద్ద కనువిప్పు. బాల్యంలో మొదలైన ద్వేషం, చిలికి–చిలికి గాలివానగా మారి, ఓ మహాసంగ్రామంగా రూపుదాల్చడం, ఎప్పటికైనా ధర్మానిదే విజయమన్న సత్యాన్ని నిరూపిస్తుంది ఈ పర్వం. వ్యక్తిత్వ వికాసానికి ప్రపంచంలో ఏ దేశంవారికైనా, ఏ జాతివారికైనా ఆయువుపట్టైనటువంటి భగవద్గీత వ్యాసభారతంనుండి పూర్తిగా అనువాదం చేయకుండా, శాంతి, అనుశాసనిక, అశ్వమేధ పర్వాలలో గీతార్థాన్ని రకరకాలుగా వ్యాప్తిచేసాడు తిక్కన సోమయాజి. కర్మని ప్రతిఫలాపేక్షలేకుండా నిర్వర్తించాలని, ఫలితమేదైనా భగవత్ప్రసాదమని స్వీకరించాలన్నదే ఈ పర్వాల సందేశం. ఇంకా, యుద్ధం ఎంత ప్రమాదకరమో భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలలో ఒక భాగంగా, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలలో మరొక భాగంగా చెప్పి, కర్ణవధతో కురుక్షేత్రయుద్ధం సమాప్తిగావించి, యుద్ధంవలన జరిగే ఘోరనష్టం గురించి వివరించింది తిక్కన భారతమే. యుద్ధంలో దుష్టులేకాదు, శిష్టులుకూడా మరణిస్తారు. పాపప్రవర్తకులయెడ ఔదార్యాన్ని వహించి, ప్రతిఘటించలేని శిష్టులుకూడా పాపఫలాన్ననుభవిస్తారనే ప్రతిధ్వనించే సత్యాన్ని పరమాత్మునిచేత ఈ విధంగా పలికించాడు తిక్కన.

**సారపుధర్మమున్ విమలసత్యము బాపముచేత బొంకుచే**
**బారముబొందలేక చెడబాతిన దైన యవస్థ దక్షు లె**
**వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుగాని ధర్మ ని**
**స్తారక మయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్.**

– కర్ణపర్వం: ఎంతటి ముప్పు వచ్చి పడినా, తన జీవిత లక్ష్యమును విడనాడని ధీరుడు కర్ణుడు. కర్తవ్యమును, నియమమును పాటించుటకు ఆత్మార్పణ చేసిన సాహసి. "కర్ణుడు లేని భారతమా!" అనేంత ఖ్యాతినార్జించినా, ధర్మపక్షాన ఉండక, అధర్మపక్షాన చేరడం వలన, దుష్టచతుష్టయంలో ఒకడై మిగిలిపోయాడు. సాంగత్యంయొక్క ప్రాముఖ్యత వ్యక్తిత్వ వికాసానికెంత అవసరమో కర్ణపర్వం వివరిస్తుంది.

– శల్యపర్వం: ధర్మస్థాపనకి పార్థసారథి చేసిన విచిత్ర లీలలలో ఒకటి శాస్త్రవిరుద్ధంగా దుర్యోధనుని తొడలు విరగ్గొట్టించడం. తొడలు విరిగి చచ్చిపడినా పగతో రగిలే రారాజు వ్యక్తిత్వం నీచాతి నీచం. ఆ నాడు ఒకడే దుర్యోధనుడు. ఈ నాటి సమాజంలో పెక్కుమంది మానధనులు. మూర్ఖత్వం వల్ల వ్యక్తిత్వ వికాసం శూన్యమనేదే ఈ పర్వ సారాంశం.

– సౌప్తికపర్వం: గాఢనిద్రలో ఉన్న ధృష్టద్యుమ్నుని, ఉపపాండవులను వధించి, ఇంకా జన్మించని ఉత్తర గర్భస్థ శిశువుపై దివ్యాస్త్ర ప్రయోగం చేసిన అశ్వత్థామ కిరాతకానికి పరాకాష్ఠ. శ్రీకృష్ణుని శాపం, కిరాతకం తప్పక శిక్షింపబడుతుందని తీర్మానిస్తుంది.

– స్త్రీపర్వం: పుత్రశోకం, బంధుమిత్ర మరణ వేదన పాండవులకు సైతం తప్పలేదు. ఇంత జరిగినా భీముని చంపాలనే ధృతరాష్ట్రుని కుటిల తంత్రం, దానినుండి భీముని వాసుదేవుడు రక్షించడం, అడుగడుగునా పరమాత్మ ధర్మపక్షపాతేనని ఋజువు చేస్తుంది.

తిక్కన 15 పర్వములు పూర్తిచేసినా, అరణ్యపర్వశేషం ఇంకా మిగిలి ఉండిపోయింది. ప్రబంధ పరమేశ్వరుడై జన్మించిన ఎఱ్ఱన అరణ్యపర్వశేషమును పూర్తిచేసి, కవిత్రయంలో చేరినాడు. ధీరవిచారుడైన ఎఱ్ఱన, లోకారాధన బుద్ధితో ప్రతిఫలాపేక్షలేకుండా అరణ్యపర్వశేషమును పూర్తిచేసి, తన కవితా సంపత్తిచే ఈశ్వరారాధన చేసి తరించిన నిత్యతృప్తుడు, శంభుదాసుడు. తిక్కనవలె నన్నయ్యను తన రచనలో ప్రశంసించి, తన ఉత్తమ వ్యక్తిత్వాన్ని చాటినాడు. అరణ్యపర్వశేషమును పూర్తిచేసి, గంగాయమునలవంటి ప్రవాహములుగల నన్నయ్య, తిక్కనల రచనలకు నడుమ సరస్వతీ నది వంటి కవితాఝురిని అంతర్వాహినిగా చేసి, ఆంధ్రమహాభారతమునకు కవితాత్రివేణీసంగమ పవిత్రతను సమకూర్చాడు. సౌమ్యుడైన ఎఱ్ఱన,

సౌందర్యమైన తన శైలితో సగంలో ఆగిపోయిన పనికి పూనుకోవడం అవమానమని భావించక, దానిని పూర్తిచేసి, ఆంధ్రమహాభారతమునకు పూర్ణత్వం, తెలుగుభాషకు పరిపూర్ణత్వం అనుగ్రహించిన మహోన్నత వ్యక్తి, వికాసానికి శక్తి.

**ముగింపు**

మహాభారతాన్ని మనం ఏ కోణంలో చూస్తే మనకి ఆ గ్రంథం అలాగే కనిపిస్తుంది. వ్యక్తిత్వ వికాసానికి ఏమి వినాలో, ఏమి వినకూడదో, ఏమి అనాలో, ఏమి అనకూడదో, అసలు ఏమి చదవాలో, ఏమి చదవకూడదో ఇలా చెప్పారు:

**ఏయది హృద్య మపూర్వం**
**బేయది యెద్దాని వినివ నెఱుక సమగ్రం**
**బై యుండు నఘనిబర్హణ**
**మే యది? యక్కథయ వినగ నిష్టము మాకున్.**

ఓ కథను చదివితే అది హృద్యంగా, అంటే మనసును ఆకట్టుకునేటట్టుగా ఉండాలి. అపూర్వంగా, అంటే అంతకుముందు చెప్పబడనిదై, "ఇంతకన్న గొప్పది వినలేదే!" అనిపించేటట్టుగా ఉండాలి. ఆ కథ వింటే జీవితాన్ని సార్థకం చేసుకునే జ్ఞానం సమగ్రంగా కలగాలి. కథ విన్నా లేక చదువుకున్నా, శ్రోత/పాఠకుల మనసులో ఉత్తమ పరిణామం రావాలి కానీ తీవ్ర పరిణామాలకి దారి తీయకూడదు. అటువంటి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే కథే కవిత్రయ మహాభారతం.

ప్రస్తుతం ప్రపంచం కుగ్రామంగా మారి, జీవితంలో ప్రతిదినం కురుక్షేత్ర మహాసంగ్రామం జరుపుతున్న మనిషికి కవిత్రయ మహాభారతం ఆయూతనిచ్చి, ఆత్మీయునిగా నిలచి, అధోపతనంవైపు కాక, ఆదర్శాలవైపుకు సమాజాన్ని నడిపిస్తుంది అన్నది ఋజువు అవసరంలేని నిజం.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. ఆంధ్రమహాభారత పీఠికలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

# 30. వ్యాఘ్రగోమాయు సంవాదం - సౌమ్యుల అసౌమ్యుల వివక్షత

– డా॥ నూకల విజయలక్ష్మి, హైదరాబాద్,

'వ్యాఘ్రగోమాయు సంవాదం' ఈ కథ మహాభారతం శాంతిపర్వం నందు తృతీయాశ్వంలోనిది. భీష్ముడు ధర్మరాజుకి ధర్మం, న్యాయం, నీతి గురించి బోధనలు చేస్తున్నప్పుడు అందులో భాగంగా ధర్మరాజు మానవుల భిన్న ప్రవర్తన గురించి తెలుసుకోవాలంటే ఏ విధంగా గుర్తించాలి అని భీష్ముడిని ప్రశ్నిస్తాడు. అందుకు బదులుగా "వ్యాఘ్రగోమాయు సంవాదం' కథ ద్వారా వివరించి చెప్పడం జరుగుతుంది. కథాపరంగా చూస్తే ఇందులోని పాత్రలు అన్ని జంతువులు అయినప్పటికీ వాటి ద్వారా మానవుల భిన్న ప్రవర్తనలు తెలియజేయడం ఈ కథ యొక్క ముఖ్య ఉద్దేశం. పైకి కఠినంగా ప్రవర్తించి, లోపల సౌమ్యులుగా కనిపించేవాళ్ళు కొందరయితే, పైకి సౌమ్యులుగా కనిపిస్తూ లోపల కఠినంగా ప్రవర్తించేవాళ్ళు మరికొందరు. అలాంటి వారిని రాజు ఎలా గుర్తించాలి, వారితో ఎలా ప్రవర్తించాలి. తన విచక్షణ జ్ఞానంతో ఎలా తెలుసుకో గలగాలి అన్న విషయాన్ని ధర్మరాజు భీష్ముదుని ప్రశ్నిస్తాడు. సౌమ్యులు, అసౌమ్యుల వివక్షత అన్నది ముఖ్యంగా నేటి కాలానికి, ఈనాటి సమాజానికీ ఎలా ఈ విషయాలు అన్వయించాలో తెలుసుకుందాం.

రాజ్యాన్ని పరిపాలిస్తున్న రాజు ఎందరో గణజనులపై ఆధారపడి ఉండాలి. వారు చెప్పే విషయాలు వినాలి. అనేక కారణాల వలన వీరు ఒకరిపై ఒకరు ఈర్ష్య, అసూయలు పెంచుకుని ఒకరితో ఒకరు పోట్లాడుకునే అవకాశం ఉన్నందున ఇది, రాజుకు ఒక్కొక్కసారి ప్రమాదంకాగలదు. అప్పుడు అలాంటి వారిని రాజు ఎలా గుర్తించాలి. వారు చెప్పిన విషయాలలో ఏవి నమ్మతగ్గవి, ఏవి నమ్మతగినవి కావు, రాజు ఎవరిని నమ్మాలి, ఎవరిని నమ్మకూడదు అన్న మీమాంస కలుగుతుంది. ఇటువంటి సంశయాలు తీరాలంటే రాజుకి విచక్షణ జ్ఞానం ఉండాలి. దానితో పాటు రాజుకు స్వీయ నియంత్రణ ఉండాలి. కాబట్టి రాజు మీద ఎన్నో విషయాలు, ఎన్నో వ్యవహారాలు ఆధారపడి ఉండడం చేత వాటి మీద రాజుకు పూర్తిగా అవగాహన ఉండాలి. ఒకవేళ ఎవరయినా తప్పు చేసి సరి అయిన నిర్ణయం తీసుకోకుండా తప్పుడు నిర్ణయం తీసుకున్నట్లయితే, అది బుద్ధిపూర్వకంగా చేశారా లేక పొరపాటున చేశారా అన్న విషయం రాజు గ్రహించగలిగేలా ఉండాలి.

రాజుకి ద్రోహం చేసేవాళ్ళు చాలామంది ఉంటారు. వారు తన రాజ్యంలోనివారు కావచ్చు, శత్రు రాజ్యంలోని వారు కావచ్చు. అందులో కొందరు రాజ్యాన్ని చీల్చడానికి ప్రయత్నిస్తే, అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకునే వారు మరికొందరు. అటువంటి వారి ప్రయత్నాలను ముందుగానే గుర్తించ గలగాలి. రాజుతో సౌమ్యులుగా నటిస్తూ రాజు యొక్క రహస్యలను తెలుసుకోవాలనుకునేవాళ్ళు మరికొందరు. అలాంటి వారిని గుర్తించడం ఎలా సాధ్యం అన్న మీమాంస రాజుకు కలుగుతుంది. ఇవేకాకుండ కొన్ని సార్లు రాజుకు అనుకోని విధంగా సమస్యలు వచ్చినప్పుడు ఎవరు చెప్పినవి నమ్మాలి, ఎవరు చెప్పినవి నమ్మకూడదు అన్న సంశయం కలుగుతుంది. అలాంటి పరిస్థితులలో కొందరు రాజు విన్న విషయాలు సరైనవి కావని చెప్పేవాళ్ళు ఎందరో ఉంటారు. మరి అటువంటి వారి సలహాలను నమ్మవచ్చా? నమ్మకూడదా? అంత విచక్షణ జ్ఞానం కలిగి ఉండడం రాజుకి అంత సులువా? ఇటువంటి ఎన్నో రకాల సమస్యలతో రాజు ఉన్నప్పుడు అలాంటి వారిని రాజు గుర్తించడం ఎంతో కష్టసాధ్యం. రాజుతో సన్నిహితంగా ఉంటూ పైకి సాధువులా ప్రవర్తించి లోపల దొంగదెబ్బ తీసేవాళ్ళు కొందరయితే, పైకి కటువుగా ఉండి, లోపల మెత్తని హృదయం గల వారు మరికొందరు. వారి మధ్య తేడాలను ఎలా గుర్తించాలో భీష్ముడు చెప్పిన 'వ్యాఘ్రగోమాయు సంవాదం' కథ ద్వారా తెలుసుకోవచ్చును.

పురికపురాన్ని పౌరికుడు అనే రాజు పరిపాలించేవాడు. ఆ రాజు చాలా క్రూరుడు. అతడు మరణించి మరు జన్మలో నక్కగా పుడతాడు. పూర్వం జన్మ జ్ఞాన ఫలితం వలన కనీసం ఈ జన్మలో బాగా బ్రతుకుదాయనే కోరికతో అహింసా వ్రతం ఆచరిస్తూ, ఆకులు అలములు తింటూ చిక్కి శల్యమైంది. అది చూసిన తోటి నక్కలు "మాంసాహారులం అయిన

మనం ఇలా శాకాహారము తినవచ్చా?" అంటూ ప్రశ్నిస్తాయి. అయినా వాటికి బదులు చెప్పదు. ఈ విషయం అడవికి రాజు అయిన పులికి తెలిసి, నక్క వద్దకు వచ్చి "నక్కా! నీవు చాలా సౌమ్యుడివి అని విన్నాను. నువ్వు నాతో స్నేహం చెయ్యి లోకం అంతా నన్ను క్రూరుడు అంటున్నది. నీవు నా ప్రక్కన ఉంటే అపకీర్తి పోతుంది" అని తనతో స్నేహం చెయ్యమని అడుగుతుంది.

సహజంగా లోకంలో చెడ్డ పనులు చేసేవాళ్ళు మంచి వాళ్ళతో కలిసి తిరిగితే, వారికి మంచి పేరు రావడం, మంచి వాళ్ళని పించుకునే అవకాశం కలుగుతుంది. ఈ కథలో పులి అహింసావ్రతం చేస్తున్న నక్కతో కలిసి తిరగటం వలన పులి మంచివాడనిపించుకోవచ్చు. ఇక్కడ పులి అనుకున్నట్లుగానే మనుషులకి కూడా ఈ విషయం వర్తిస్తుంది. చెడ్డపనులు చేసే మనుషులు మంచి వారితో కలిసి తిరగడం వలన వాళ్ళు మంచివారుగా గుర్తించబడతారు. పైకి మంచితనంతో ప్రవర్తిస్తూ లోపల క్రూరంగా, దుర్మార్గంగా ప్రవర్తించేవాళ్లు ఈనాటి కాలంలో ఎందరెందరో.

పులి తనతో స్నేహం చెయ్యమని నక్కని అడగడమేకాక, తనతో వచ్చి ఉండమని, నీకు ఇష్టమైన భోగాలు అనుభవించమంటుంది. నాకు సుఖాలు అనుభవించాలనే కోరిక లేదు. నీ మాటలు నాకు నచ్చడం లేదు. అయితే ఏమి, నేను నీకు మంచి చెడ్డలు చెపుతానంటుంది. అందుకు పులి అంగీకరిస్తుంది.

స్వయంగా రాజు తనని పిలవడం, నీకు ఇష్టమైన బోగభాగ్యలు అనుభవించమని చెప్పడంతో స్నేహ ధర్మం, ఐక్యత, సమభావం వాటి మధ్య కనిపిస్తున్నాయి. ఇక్కడ పేరుకి జంతువులు పాత్రచిత్రణ అయినప్పటికీ ఈ ధర్మాలన్నీ మానవులకి చెందిన ధర్మాలే. అధికులతో సామాన్యుడి స్నేహం సంబంధం వారి ఇద్దరి మధ్య మైత్రి సంబంధంతోపాటు పరస్పర సంబంధ బాంధ్యవాలని ఏవిధంగా పాటించాలి, వాటిని పాటిస్తున్నప్పుడు మంచి, చెడులపట్ల విచక్షణ లేకపోయినట్లయితే, అవి ఎలా వైఫల్యం చెందుతాయి అన్న విషయాలను ఇక్కడ గుర్తించవచ్చును.

తనతో స్నేహం చేస్తున్న పులిని నక్క హెచ్చరిస్తుంది. మీ పాత అనుచరులు, ఆత్మీయులు, సేవకులు మన స్నేహాన్ని ఓర్వలేక నిందిస్తారు. నిన్ను రెచ్చకొడతారు. మన అంతరాలు, స్వభావాలు వేరయినా నా మీద నిందలు మోపుతారు. నిన్ను ముందరే హెచ్చరిస్తున్న. నా మీద ఒకసారి నమ్మకం పోయిన తరువాత మన ఇద్దరి మధ్య స్నేహం నిలవదు అని నక్క హెచ్చరిస్తుంది. ఎందుకంటే మీ పులిజాతి మా కంటే బలవంతులు, అధికులు మీరు నాకులోబడి ఉండడం ఓర్వలేక నా మీద నిందలు మోపుతారు. అయినప్పటికీ నా స్వభావం కొంత విలక్షణమైనదే. పాపాత్ముల పట్ల నేను కఠినంగా వ్యహరించలేను. చాలా దూరం ఆలోచిస్తున్నానని నక్కపులిని హెచ్చరిస్తుంది.

ఇక్కడ నక్క నియమబద్ధంగా జీవించడానికి పూర్వ జన్మలో తాను చేసిన పాప ఫలితం ఈ జన్మలో నక్కగా పుట్టానని గ్రహించిన నక్క తిరిగి క్రూరంగా దుర్మార్గంగా జీవించడానికి ఇష్టపడదు. సాధు జీవితాన్ని గడుపుతూ తాను ధర్మంగా జీవిస్తుంటుంది. అనిష్టం కలిగే జీవితానికి ఇష్టపడదు. అందువలన దానికి వైరాగ్యం కలుగుతుంది. తన జాతికే ఆదర్శంగా నిలుస్తుంది.

మనిషి ఇంద్రియాలను అదుపులో ఉంచుకోగలిగితే, మనస్సుకి కళ్ళెం వేసి బుద్ధిని ఆధీనంలో ఉంచిన వాడికి అరిషడ్వర్గాలను అదుపు చెయ్యడం సాధ్యమవుతుంది. అటువంటి వారు సౌమ్యులు సత్ప్రవర్తకులు అవుతారు. కాని ఈనాటి మనుషులు ఈర్ష్య, అసూయ, పగ, కోపం, ద్వేషాలతో బాధపడుతున్నారు. మనిషిలో స్వార్థం, లోభం, మోహం పెరిగిపోతున్నాయి. అందువలన అక్రమ మార్గంలో సంపాదించాలనే అత్యాశ పెరిగిపోతున్నది. దానితో విచక్షణ జ్ఞానం కోల్పోయి, మంచి, చెడులను నిర్ణయించే వివక్షత లోపిస్తున్నది. రెండు భిన్న వర్గాలకు చెందిన వారి మధ్య స్నేహం ఎప్పుడు ప్రమాదకరమే. ఇక్కడ పులి, నక్క స్నేహం వలన అటు పులి జాతి, ఇటు నక్క జాతి రెండు అసూయ చెందుతాయి. గొప్పవాడితో స్నేహం చేస్తున్నదని నక్క వర్గం. తమకంటే తక్కువ వాడితో స్నేహం చేస్తున్నది పులి వర్గం ఈర్ష్య, అసూయలు చెందుతాయి. ఇది

లోక సామాన్యం. పులి నక్కతో స్నేహం చేయడం కడుపుమంటగా ఉంటుంది కొందరికి. పైకి సౌమ్యులుగా ఉండి, లోపల కఠినులుగా ఉంటారు. ఇదే నక్క విషయంతో జరుగుతుంది. బలవంతులైన పులులని, బలహీనులైన నక్కలుఏమి చెయ్యలేవు. కానీ బలహీనులైన నక్కలను బలవంతులైన పులితో స్నేహం చేయడం వలన సాటి పులులకి కూడా ఈర్ష్య, ద్వేషం, అసూయ కలుగుతుంది. కారణం ఇన్ని రోజులు తమతో కలిసి మెలిసి ఉన్న మృగరాజు ఇప్పుడు నక్కను మంత్రిగా చెయ్యడంతో వాటి ప్రాముఖ్యత తగ్గడం, నక్కను గౌరవించడం, దాని సలహాలను పాటించడం వలన పులి జాతి ఈర్ష్య, అసూయ పెంచుకుంటాయి. రెండు భిన్న స్వభావాలకి చెందిన ఇద్దరి మధ్య స్నేహం కుదిరినప్పటికీ పులిజాతి మొత్తం భగ్గుమని, నక్కను ద్వేషించసాగారు. దానితో వారి అందరి మనస్సులో దుష్టత్వం నిండిపోయింది. అవి ఒక గుంపుగా ఏర్పడి నక్కతో స్నేహాన్ని ప్రకటించి తమతో పాటుగా దోషిని చెయ్యాలని ప్రయత్నించసాగాయి. ఎన్ని ప్రయత్నాలు చేసిన తెలివి గల నక్కలొంగదు. అది గట్టి నిఘా ఏర్పరచడంతో ఒకప్పుడు ఇతరుల వస్తువులు లాగేసుకొని, స్వయంగా వాటిని అనుభవిస్తూ ఉండేవారు. నక్క రాకతో ఇప్పుడు ఎవరి సొత్తును తీసుకోలేకపోతున్నారు. తమపై గట్టి నిఘా ఉండడం వలన, వారు నక్కను కూడా దిగజార్చాలని కోరుకుంటారు. అనేక ప్రలోభాలకు గురి చేస్తారు. చివరికి ధనం ఆశ చూపించినా నక్క దేనికి లొంగదు.

ఇంత జరుగుతున్నా పులి, నక్కల మధ్య స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. అది గమనించిన కొంతమంది, వారి ఇద్దరి స్నేహం గురించి అడగకపోయినా సలహాలు ఇవ్వడం, హెచ్చరించడం వంటివి చేస్తారు.

సమాజంలో అధికులు, సామాన్యుల మధ్య స్నేహం కుదిరితే, వారి ఇద్దరిని విడదీయడానికి, ధనం వల్ల అంతరాలు లేదా కులం వల్ల ఏర్పడే అంతరాలు సృష్టించి విడదీసే ప్రయత్నాలు జరుగుతాయి. ఇది నేటి కాల పరిస్థితులు.

ఎంత ప్రయత్నించినా దేనికి లొంగని నక్కను నాశనం చేయాలని పులి పూర్వమంత్రులు కంకణం కట్టుకొని ప్రయత్నించసాగారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న వారు, ఒకరోజు పులి తినడానికి ఉంచిన మాంసాన్ని దొంగిలించి నక్క బిలంలో ఉంచుతారు. పులి ఆహారం కోసం వచ్చినప్పుడు ఆ మాసం నక్క దొంగిలించిందని చెప్పి దానిపై నేరం మోపుతారు. వారి చెప్పుడు మాటలు విన్న పులి పూర్వపరాలు ఆలోచించకుండా నక్క దొంగ అని భావించి దానిని చంపమని ఆజ్ఞాపిస్తుంది.

ఇక్కడ రాజు చెప్పుడు మాటలు వినడం వలన ఎంత ప్రమాదం ఏర్పడిందో తెలుసుకోవచ్చు. అందుకనే గొప్పవారితో స్నేహం ఎప్పటికీ ప్రమాదకరమే. ఇక్కడ రాజు ఎవరు సౌమ్యులు, ఎవరు అసౌమ్యులు అని గుర్తించకలేకపోవడం తనపై తనకి స్వీయ నియంత్రణ లేకపోవడం విచక్షణా జ్ఞానం లేకపోవడం చేత చెప్పుడు మాటల వలన నక్కను చంపమని ఆజ్ఞ ఇవ్వడం జరుగుతుంది.

మొదట పులి నక్కతో స్నేహం చేయమని అడిగినప్పుడు ఇటువంటి ప్రమాదం ముందే ఊహించిన నక్క చెప్పుడు మాటల వినకు, ఎవరి మోసాలకు లొంగిపోయి నన్ను చంపకు అని హెచ్చరిస్తుంది. కాని పులి ఇతరుల చెప్పుడుమాటల వలన విచక్షణా జ్ఞానం కోల్పోయి నక్కను చంపమని ఆజ్ఞ ఇచ్చింది. విషయం తెలిసిన నక్క పులితో నీవు ఇంతకుముందు నన్ను గౌరవించావు. ఆ తరువాత అవమానించావు. ఇక నేను నీ వద్ద ఉండనని అంటుంది.

పులి తల్లికి ఈ విషయం తెలిసి పులిని మందలిస్తుంది. చెప్పుడు మాటలు విని నక్క విషయంలో తప్పు చేస్తున్నావు. నక్కను అనుమానించి విచారించకుండా చంపమని ఆజ్ఞ ఇచ్చావు. రాజైనవాడు వెనుక ముందు పరిశీలించకుండానే నక్కకు హాని చేయాలనుకున్నావు. రాజుకు ఎవరినైన చంపించడం కష్టం కాదు. దాని వలన అతడికి గుణం కలగదు. బలవంతుడికి క్షమాగుణం ఉంటే దానినే ప్రశంసిస్తారు. దానివల్ల కీర్తి పెరుగుతుంది. తొందరపడకు ఆలోచించమని తల్లి పులికి బోధన చేస్తుంది. యోగ్యుడయిన మంత్రి ఎంతో కష్టపడితేగాని నీకు దొరకడు. అతడు నీకు స్నేహితుడు, హితుడు కాబట్టి అతడిని

రక్షించు అని నచ్చచెబుతుంది. కొన్ని సార్లు ధర్మం అధర్మంగాను, అధర్మం ధర్మంగా కనిపిస్తుంది. కనుక ఈ రెండింటి మధ్య బేధం తెలుసుకోవాలి. "రాజైనవాడు కులంకషంగా విచారించి నిర్ణయించాలి కాని తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదు" అని తల్లి బోధించింది.

తల్లి మాటల ప్రభావం పిల్లల మీద ఎంతగానో ఉంటుంది. పుట్టినప్పటి నుంచి పిల్లల ఆలనా పాలనా చూసేది తల్లి. దైవం కన్నా ముందు తల్లికే ప్రాధాన్యత ఇచ్చాయి మన శాస్త్రాలు. తల్లి పిల్లలకి మంచి, చెడుల గురించి బోధించడం. వివేకం, విచక్షణ తెలిసేలా చెప్పడం పిల్లలకి ఎప్పుడు మంచి పనులు, మంచి మాటలు నీతి, ధర్మాల గురించి చెప్పడం తల్లి బాధ్యత. ఈ కథలో కీలకమైన మలుపు తల్లిమాటలే. పెద్దలు తమ అనుభవాలతో ఎన్నో మంచి విషయాలు పిల్లలకి చెప్పడం జరుగుతుంది. పెద్దలు వారి అనుభవాల ద్వారా పిల్లలని ఉన్నతులుగా ఎలా తీర్చిదిద్దవచ్చునో, తప్పు చేస్తే అది వారికి తెలిసేలా హితవు చెప్పడం ఎంత ముఖ్యమో ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చును. ఈ కథలో పులికి తల్లి తన మాటల ప్రభావం చేత దానిలో మళ్ళీ వివేకం, విచక్షణ జ్ఞానం కలిగించేలా చేసి తన తప్పుని గ్రహించేలా చేస్తుంది. పులి తల్లి ధర్మం, అధర్మం గురించి పులికి చెప్పడం చేత, తల్లి మాటలు ఎంత శక్తివంతమైనదో వారిని ఎంతగా ప్రభావితం చేస్తాయో ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చును.

**ముగింపు**

ఆధునిక కాలంలో సౌమ్యులు అసౌమ్యులుగా, అసౌమ్యులు సౌమ్యులుగా మనకి కనిపిస్తుంటారు. అలాంటి వారిని నేటి కాలంలో ఎలా గుర్తించాలి. మనుషులు వారి విచక్షణ జ్ఞానంతో ఎలా గుర్తించాలి అన్న విషయంపై మనకి కూడా కొంత అవగాహన ఉండాలి. ఎందుకు ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. నేటి కాలంలో అని ప్రశ్నించుకుంటే మనుషులలో ఈర్ష్య, అసూయలు పెరిగిపోయాయి. అందరిలో స్వార్థం చోటుచేసుకుంది. మనుషులలో చాలా మంది డబ్బుని సులభంగా సంపాదించాలనే ఉద్దేశ్యం కలగడం. సాంకేతిక పరంగా ఎంతో అభివృద్ధి చెందడం వలన ఎన్నో సదుపాయాలతో, సౌకర్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నప్పటికీ మనిషిలో ఇంకా ఏదో కావాలనే ఆశ నిరంతరం వెంటాడుతోంది. ఐహిక సుఖాలు, సంపాదన పైన వ్యామోహం పెరిగిపోయింది. అవినీతి సంఘంలో ఎంతో లోతుగా పాతుకుపోయింది. ఒకరిని వంచించి వారి సంపదను అనుభవించడం, మనుషులు అనేక ప్రలోభాలకు లొంగిపోవడం నీతి, నియమాలు తప్పి జీవించడం, ఒకరిని ఒకరు మోసగించడం నేడు సంఘంలో ఏర్పడిన పరిణామాలు. కష్టపడి సంపాదించాలనే మనస్తత్వం పోయి సులభ పద్ధతిలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యం ఎక్కువ మందిలో కనిపిస్తోంది. వీటన్నింటి ఫలితం మోసం చెయ్యడం లేదా మోసపోవడం. అటువంటి మోసాలు బారిన పడకుండా మనం ఎక్కడికక్కడ జాగ్రత్త పడకపోతే, మంచి, చెడుల విచక్షణ లేకపోయినట్లయితే, ప్రస్తుత సమాజంలో ఎన్నో ఇబ్బందుల పాలవుతాము. అందుకని మంచి, చెడుల విచక్షణ ధర్మరాజుకే కాదు. నేటి సమాజంలో మన అందరికి కూడా ఎంతో అవసరం.

నేటి కాలంలో జరుగుతున్న మోసాలను గమనిస్తే ఉద్యోగం ఇస్తామని నమ్మించి డిపాజిట్ రూపంలో డబ్బులు వసూలు చెయ్యడం, బ్యాంకు నుంచి వచ్చామని చెప్పి క్రెడిట్ డెబిట్ కార్డుల బ్లాక్ చేస్తామని మెసేజీలు పెట్టడం, ప్రభుత్వ శాఖల నుంచి వచ్చామని ఒకరు. ఓటర్ వెరిఫికేషన్ పేరుతో చేసే మోసాలు. ఎలెక్టోరల్ వెరిఫికేషన్, మున్సిపాలిటీ నుంచి వచ్చామని, మాల్వేర్ అటక్, మొబైల్ అడ్ సిస్టమ్ హ్యాకింగ్, ఇల్లు అద్దెకు కావాలని వచ్చి చేసే మోసాలు, అడ్రస్ చెప్పమని ఇంట్లో ప్రవేశించే మోసాలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేదని లింక్ పంపించి బిల్లు చెల్లించమని చేసే మోసాలు, ఆధార్ లేదా పాన్ అప్‌డేట్ చేయడానికి ఓటిపి చెప్పమని చేసే మోసాలు, బ్యాంక్ అకౌంట్ అప్‌డేట్‌లో వ్యక్తిగత వివరాలకి సంబంధించిన మోసాలు, కొత్త వ్యక్తులు ఫోనుద్వారా సంప్రదించి మనతో సంభాషిస్తూ టెక్స్ట్ మెసేజ్ పెట్టి మోసాలు చేయడం ఇలా ఎన్నో

రకాల మోసాలు ఆధునిక ప్రపంచంలో జరుగుతున్నాయి. ఇది కేవలం చదువుకోని వారే కాదు, చదువుకున్న వారు కూడా ఇలాంటి మోసాలకు గురవుతున్నారు.

మరి ఇలాంటి సమస్యల నుంచి బయటపడాలంటే నేటి మానవులకి ఆలోచన, విచక్షణ జ్ఞానం ఎంతో అవసరం. మంచి, చెడులను నిశితంగా పరిశీలించకుండానే నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి ఎన్నో మోసాలను ఎదుర్కోవలసి వస్తుంది. కాబట్టి మంచి, చెడులను నిర్ణయించుకోవాలంటే విచక్షణా జ్ఞానం ఎంతో అవసరం. దానిని 'వ్యాఘ్రగోమాయు సంవాదం' కథ ద్వారా భీష్ముడు మహాభారతంలో ధర్మరాజుకి వివరించాడు.

పంచతంత్ర కథలలో మానవుడికి కావలసిన నీతి, బుద్ధి, వివేచన విచక్షణ జ్ఞానం, జంతువుల పాత్రల ద్వారా చెప్పించడం జరిగింది. ఇది కూడా ఇంచుమించు అటువంటి కథే. ఈ కథ ద్వారా విచక్షణ జ్ఞానం తప్పకుండా ఆ కాలానికే కాదు, నేటి కాలానికి కూడా అవసరం అని గుర్తించవచ్చును. ఈ కథలో జరిగిన సంఘటనలు, పాత్రలను గమనిస్తే ఇది మొత్తం మనుషుల మధ్య జరిగే సంఘటనలుగా భావించవచ్చును. నేడు ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. కాబట్టి ప్రపంచంలో ఉన్నది లేదా జరుగుతున్నదే మహాభారతంలో చెప్పబడింది అనడం ఎటువంటి సందేహం లేదు.

### ఆధార గ్రంథాలు

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము (సంపుటము–12) – ప్రధాన సంపాదకుడు : డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి – 2013.
2. సంక్షిప్త మహాభారతము, ద్వితీయ ఖండము – సంపాదకులు : డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, గీతాప్రెస్, గోరఖ్‌పూర్.
3. మహాభారతం – మానవధర్మం – డాక్టర్ డి.విద్యేశ్వరి, డాక్టర్ ఐ.వి.కాంతాలక్ష్మి, ముద్రణ – 2018.

# 31. వీరభీష్మ - ఆదర్శనీయ వ్యక్తిత్వం

- ఎస్. శశికళ, చెన్నై

## పరిచయం

ఆంధ్ర వాఙ్మయంలో పరమ ప్రామాణికమైంది, మన తెలుగు వారికి పవిత్రమైంది మహాభారతం. హిందువులకు పంచమ వేదంగా పరిగణించబడే ఇతిహాసాన్ని వేదవ్యాసుడు చెప్పగా గణపతి రచించాదని హిందువుల నమ్మకం. ఈ మహాభారతాన్ని అనేక భాషలో అనువదించబడింది. సంస్కృతంలో వేదవ్యాసుడు రచించగ తెలుగులో కవిత్రయ పండితులైన నన్నయ, తిక్కన, ఎఱ్రన వంటి ఉద్ధండ కవులు రచించారు. అయితే మహాభారతంలో విరాట పర్వం నుండి చివరి పర్వం అయిన స్వర్గారోహన పర్వం దాకా 15 పర్వాలను ఒంటి చేతో నడిపించిన విలక్షణమైన కవి తిక్కన. ఒక్కోక్క పర్వంలోని సంభాషణ శైలి, పాత్ర చిత్రణ, వర్ణనలు, సన్నివేశ కల్పనలు, యుద్ధరణరంగాన్ని తమ అద్భుతమైన శైలితో పాఠకుల హృదయాలను మెప్పించ కలిగారంటే అతిశయోక్తి కాదు. అయితే ఇంత పవిత్రమైన మహా గ్రంథాన్ని అందరికి తెలియజేయడం ఉత్తమం అని పండితులు తలిచారు.

అందుకె మహాభారత కథను చెప్పడానికి స్వర్గలోకంలో నారద మహర్షిని, పితృలోకంలో చెప్పడానికి దేవల మహర్షిని, గరుడ గంధర్వ లోకాలలో చెప్పడానికి శుక మహర్షిని, సర్పలోకంలో చెప్పడానికి వైశంపాయన మహర్షిని నియమించాడు వ్యాసుడు. అంటే మహాభారతం వంటి పవిత్రమైన గ్రంథాన్ని గురించి తెలియని లోకం, తెలియని మనిషి ఉ ండకూడదనే ఉద్దేశపూర్వకం ప్రస్పూటంగా అర్థం అవుతుంది. అంతేకాదు మహాభారతాన్ని చెరుకు గడలతో పోల్చారనే విషయం అందరికి తెలిసిందే. అంటే పర్వం అంటే చెరుకు కణపు అనీ 18 కణుపులు (పర్వాలు) కలిగిన పెద్ద చెరకుగడ మహాభారతం. చెరుకు నములుతున్న కొద్ది రసం నోటిలో వచ్చి, నోరు తీపి ఎక్కుతుంది. అలాగే భారతాన్ని చదివిన కొద్దీ జ్ఞానం పెరుగుతుంది.

అందుకే నన్నయ ఈ మహాభారత కావ్యాన్ని "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమనీ, ఆధ్యాత్మవిదులు వేదాంతమనీ, నీతి విచక్షణులు నీతి శాస్త్రమనీ, కవులు మహాకావ్యమనీ" అంటారని పేర్కొన్నారు. 18 పర్వాలతో, లక్ష శ్లోకాలతో (74,000 పద్యాలతో సుమారు 18 లక్షల పదాలతో ప్రపంచంలోని అతి పెద్ద పద్య కావ్యాలలో ఒకటిగా పరిగణించబడింది.

ఇంతటి విశిష్టతను కలిగిన సంపూర్ణ మహాభారతాన్ని చదివి అవపోషణ చేయటం కత్తి మీద సాము లాంటిదే. అందుకే మహాభారత కథను ఇతివృత్తంగా ఎన్నో తెలుగు సినిమాలుగా ఎప్పటి నుంచో మనకు అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని సీరియల్స్‌గా కూడా అర్థం అయ్యే విధంగా తెలియజేస్తూ పౌరాణిక ఇతివృత్తాలను తెరకెక్కించడంలో తెలుగు వారికున్న నైపుణ్యం కారణంగా చాలా సినిమాలు చిరస్థాయిగా జనాదరణ పొందాయి. మహాభారతం, దానవీరశూరకర్ణ, భీష్మ చరిత్ర, వంటి చలన చిత్రాలను తెరకెక్కించి ప్రజలందరికి అర్థంమయ్యే రీతిలో అద్భుతంగా చిత్రించారు. మహా భారతంలోని పాత్రలలో ఒక విలక్షణమైన పాత్ర భీష్ముని పాత్ర. అటువంటి వీర భీష్ముని గురించి పరిశీలిద్దాం.

## భీష్మ పర్వం కథాసాగరం

ఇంతటి ప్రాచుర్యం కలిగిన మహాభారతంలోని 18 పర్వాలలో భీష్మ పర్వం ఎంతో విశిష్టమైంది. మూడు అశ్వాసాలతో కూడిన వైవిధ్యమైన కథాసాగరం. ఆది పంచకం అయిపోయిన తరవాత యుద్ధషట్కం ప్రారంభంమౌవుతుంది. ఈ యుద్ధషట్కం ఒక ప్రత్యేకతను కలిగిందిగా చెప్పవచ్చు. ఎందుకంటే భీష్మ పర్వంలో ధర్మం అధర్మం ఎవరివైపు ఉందనేది ప్రస్పూటంగా తెలుస్తుంది. ఎంతటి బలపరాక్రమ సమన్వితులైన సరే ఆధర్మ పక్షవర్తులైన భీష్మాదులు నేలకొరగటం యుద్ధషట్కం విశేషం.

మరో వైపు పాండవ విజయాన్ని ధ్వనింప చేసే భీష్మ కథ ఆది పర్వం నుండే ఆరంభం అయ్యి శాంతి పర్వం దాకా సాగుతుంది. అయితే భీష్ముని పాత్ర లేని పర్వం లేదనే చెప్పాలి. భీష్ముని వ్యక్తిత్వం ఉత్తమమైన వీరుల లక్షణం కలవాడు. యుద్ధ వీరం, దయావీరం, ధర్మవీరం, సత్యవీరం, పాండత్య వీరం, క్షమావీరం, బలవీరం, అనేవి భీష్ముని చిహ్న పతాకాలు. అటువంటి విశిష్టత కలిగించిన భీష్మడి పాత్ర తీరు తెన్నులను వర్ణించడంలో తిక్కన వంటి మహా కవికే సాధ్యం. అంతటి వీర సామార్ధ్యాలు కలిగిన భీష్ముడు హస్తినాపురం రాజైన శంతన రాజు గంగాదేవి పుత్రుడు. ఇతనికి గాంగేయుడు, దేవపుత్రుడు అని పేర్లు ఉన్నాయి. శంతన మహారాజు వంశానికి ఎంతో ఘనత తెచ్చిపెట్టిన భీష్ముడు తండ్రి మీద అమితమైన అనురాగంతో గౌరవంతో రాజ్య పరిపాలనలో ధర్మాన్ని అనుసరిస్తూ ఉన్నాడు.

శంతన మహారాజు సముద్రం వైపు పయనిస్తున్న సమయంలో దాశరాజు కుమార్తె అయిన సత్యవతిని చూసి ఇష్టపడి దాశరాజుని కలిసి సత్యవతిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నానని దాశరాజుకి చెప్పాడు. అందుకు దాసరాజు మా కుమార్తె సత్యవతికి జన్మించిన కుమారులే రాజ్యపాలన చేయాలనే నిబంధనలను పెట్టడం శంతన మహారాజు మదిలో భీష్ముడు మెలిగి దాశరాజు పెట్టిన నింబంధనను తిరస్కరించి అక్కడ నుండి వెళ్ళిపోయాడు. కానీ శంతన మహారాజుకి సత్యవతి మీద ఉన్న ఇష్టం మరువలేక రాజ్యపరిపాలనకు దూరంగా ఉంటూ చింతుస్తూ ఉన్నాడు. తండ్రి విచారాన్ని గమనించిన భీష్ముడు విషయం తెలుసుకుని దాశరాజు దగ్గరకు వెళ్ళి మీ నిబంధనలకు మేము స్వీకరిస్తున్నాం. జీవితాంతం ఆజన్మప్రబహ్మాచారిగా ఉంటాననీ, సత్యవతి అమ్మకి కలిగిన సంతానమే హస్తినాపురానికి రాజులవుతారినీ ప్రతిజ్ఞ చేశాడు.

నిండు సభలో అందర్ని కూర్చోబెట్టి తండ్రికి నమస్కరించి, అందరి సమక్షంలో తమ మనుసులో ఉన్న మాటను భీష్ముడు తెలియజేశాడు. దానికి తండ్రి సమ్మతించకపోగ తండ్రిని ఒప్పించి, సత్యవతిని ఇచ్చి వివాహం జరిపిస్తాడు. తండ్రిపై ఉన్న భక్తి, ప్రేమ వాత్సల్యం, అనురాగాన్ని శంతన మహారాజు మెచ్చి 'అవధ్యత్యం', 'స్వచ్ఛందమరణం' వారాలను ప్రసాదించాడు.

తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం ఆజాతబ్రాహ్మచర్యాన్ని పాటిస్తూ రాజ్య కర్తవ్యాలను, తమ్ముళ్ళైన విచిత్ర వీర్యుడు, చిత్రాంగదలకు విలు విద్యలు నేర్పిస్తూ హస్తినాపురానికి రాజుల్ని చేశాడు. కానీ దురదృష్టవశాత్తు తండ్రి శంతనమహారాజు అనారోగ్య కారణంగా మరణించడం, తమ్ముళ్ళు యుద్ధంలో మరణించడం ఇవన్నీ కూడా భీష్ముడిలో కురువంశం నశించిపోతుందేమోనన్న వేదన కలిగింది.

ఎన్నో సార్లు భీష్ముని వివాహం చేసుకుని కురువంశాన్ని నిలబెట్టమని తల్లి సత్యవతి చెప్పిన భీష్ముడు వినలేదు. ఆడిన మాట తప్పి లోకనిందపాలు కాలేను తల్లి అని తమ వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలబడ్డాడు భీష్ముడు. వేదవ్యాసుడు ద్వారా మహాభారతంలో కథ మరో మలుపు తిరిగి ధృతరాష్టుడు, పాండురాజు జన్మించారు. ధృతరాష్ట్రుడుకి వంద మంది కౌరవులు జన్మించడం, పాండురాజుకి పంచపాండవులు జన్మించటం ఇరువురుకి రాజ్యపాలనలో వైరం ఏర్పడి ఘర్షణ జరిగే ప్రతి సారి భీష్ముడు ధర్మపాలనను దృష్టిలో ఉంచుకుని ఏం చేయలేని నిస్సాహాయ పరిస్థితితో వేదన చెందుతూ ఉన్నాడు.

పాండవులు జూదంలో కౌరవుల చేతిలో ఓడినప్పుడు పాండవుల వనవాసం అనంతరం శ్రీకృష్ణుని శరణం కోరి విషయం చెప్పి కౌరవుల దగ్గరకు రాయబారానికి పంపడం, రాజ్యాన్ని ఇవ్వటం కుదరదు యుద్ధంలో కలుద్దామని దుర్యోధనుడు చెప్పడం. అన్నదమ్ముల మధ్య జరగపోయే వైరాన్ని తలచి రాజ్యపాలన కింద తలవంచక తప్పదని భీష్ముడు మదిలో చింతిస్తూ ఉండగా దుర్యోదునుడు వెళ్ళి పితామహా మా కౌరవ పక్షాన యుద్ధరంగంలో మీరు మా వైపు నిలిస్తే విజయం మాతో ఉన్నట్లే, అందుకే కౌరవసేనాధిపతిగా మిమ్మల్ని నియమిస్తున్నాను. మీ యుద్ధప్రావీణ్య వీరత్వాన్ని పాండవుల మీద ప్రదర్శించి మాకు విజయాన్ని ప్రసాదించండని ప్రార్ధించడం. దుర్యోదనుడు మాటలను భీష్ముడు సమ్మతించి యుద్ధరంగంలోకి సైన్యాల్ని సిద్ధం చేసుకోవడంతో కురుక్షేత్ర యుద్ధం మలుపు తిరిగింది.

**భీష్ముడి మొదటినాటి యుద్ధం**

కుడివైపు శ్రీకృష్ణుడిని శరణువేడిన పాండవ సైన్యం. ఎడమ వైపు మోహావృత్తమైన కౌరవసైన్యం. ఇరువురి మధ్య యుద్ధం శంఖభేరీమృదంగాలతో భీష్ముడి మొదటి నాటి యుద్ధం ప్రారంభం అయింది. దుర్యోధనుడు ప్రేరేపించగా భీష్ముడు ప్రళయతాండవం చేసే పరమేశ్వరుడిలా పాండవసైన్యం మీద శత్రువుల తలలు రాలాయి. విల్లులు విరిగాయి. పాండవుల నెత్తురు ఏరులై పారాయి. భీష్ముడిని ఎదుర్కోనే వీరులే లేక పాండవ సైన్యం భయభ్రాంతిలో మునిగి తేలుతున్నారు. భీష్మార్జునులు మధ్య జరిగే యుద్ధం అందరినీ ఆశ్చర్య పరుస్తుంది. అప్పటికే సమయం మధ్యాహ్నమయింది.

పచ్చని అడవిని కాల్చినట్లు పాండవ సైన్యాన్ని చీల్చిచెండాతున్నాడు. అప్పుడు చంద్రవంశజుడైన భీష్ముడు సూర్యుడిలా ఒక వెలుగు వెలిగాడు. అది చూసి సిగ్గుపడుతున్నట్లు సూర్యుడు అస్తమించాడు. యుద్ధం ఆగిపోయింది.

**భీష్ముడి రెండవనాటి యుద్ధం**

భీష్ముడు మహాసైన్యంతో నడిమి భాగంలో నిలిచి పాండవ కౌరవ పక్షాల యుద్ధానికి తలపడ్డారు. పాండవులు క్రౌంచవ్యూహాన్ని భీష్ముడు చల్లాచెదురు చేసి విజృంభించాడు. అర్జునుడు భీష్మ ప్రతాపాన్ని అడ్డుకొన్నాడు. కౌరవల సైన్యం మీదకు విరుసుకుపడ్డాడు. కౌరవులు కూడా ఎదుర్కున్నాడు కానీ అర్జునుడు దాడికి ఎదురుదాడి చేయలేకపోయారు. ఆ సమయంలో దుర్యోదునుడు భీష్ముడితో "తాతా!" అర్జునుడు మన వీరులందనీ చీల్చి చెండాడుతున్నాడు. నువ్వు ఇలా చూస్తు ఉండటం న్యాయమేనా? కర్ణుని యుద్ధంలో పాల్గొనవద్దని నిషేదించావు. ఆరకంగా అన్యాయమే కదా? అని పలికిన మాటలకు భీష్ముడిలో కలత చేరింది. వెంటనే అర్జునుడు వైపు భీష్ముడు దూసుకెళ్ళి బాణాలను వదిలాడు. ఈ విధంగా ఇద్దరు సమ యుద్ధం చేశారు. అప్పటికి మధ్యాహ్నమయింది.

వెంటనే దృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, భీముడి కంటే ముందుగా భీష్ముడిని ఎదిరించారు. ఒక్క శిఖండిని తప్ప మిగిలిన వారిపై బాణాలు సంధించి భీష్ముడు భీముడి రధాన్ని విరగొట్టాడు. సాత్యకి భీష్ముడి రధసారధిని చంపాడు. భీష్ముడి రధాశ్వాలు వాయువేగంతో అతడి రధాన్ని దూరంగా తీసుకొనిపోయాయి. భీష్ముడు కోపంతో దుమ్ములు రేగేటట్లు విజృంబించి పాండవ సైన్యం రక్తపాతంతో అణచేటట్లు చేశాడు. అర్జునుడు కౌరవసైన్యాన్ని ముక్కులు, ముక్కలుగా చేసి రణరంగాన్ని భీభత్సంగా మార్చాడు. భీష్ముడు ఆ దృశ్యం చూసి కృపసారధ్యంతో యుద్ధం చేస్తున్న అర్జునుడి పరాక్రమానికి మురిసిపోయాడు. పోరు నేటికి చాలిద్దామని భీష్ముడు రెండవనాడు యుద్ధాన్ని చాలించారు.

**భీష్ముడి మూడవ నాటి యుద్ధం**

మూడవ నాడు భీష్ముడు గరుడవ్యూహం ఏర్పాటు చేసాడు. పాండవులు అర్ధచంద్రాకారంలో వ్యూహంతో యుద్ధం అతి ఘోరంగా ప్రారంభం అయ్యింది. భీముడి దుర్యోధన మీద భాణం వేసాడు. దుర్యోధనుడు మూర్చపోయాడు. రధసారధి రధాన్ని దూరంగా తీసుకొనిపోయాడు. కొంత సమయం తరువాత మూర్చ నుండి తేరుకుని రధాన్ని పితామహుని దగ్గరకు తీసుకువెళ్ళి భీష్ముని లాంటి వీరులైన మీరు ఉండగా మన కౌరవుసేన ఇంతటి దురవస్తకు పాలుకావాలా? మీరు పాండవుల మీద అలుక పొందరన్న విషయం ముందుగానే నాకెందుకు చెప్పలేదు. అప్పుడే నాకు కర్ణుడు చెప్పాడు. పాటుపడతామని. మీ చేత అడియాసపాలయ్యామని పలికాడు. దుర్యోధనా! పాండవులు వైపు దేవబలం అధికం. దేవబలంతో నువ్వు ఎదిరించి గెలవగలవా? తెలిసి తెలిసి నువ్వు ఇలా అనటం న్యాయమా? అయినా నాకు చేతనైనంత వరకు పాండవ సైన్యాన్ని చంపుతాను నువ్వు చూస్తూ ఉండని పలికాడు భీష్ముడు.

భీష్ముడు మార్తాండడులా విజృంభిస్తున్నాడు. భీష్ముని యుద్ధం చూసి శ్రీకృష్ణుడు అర్జునితో భీష్ముడి ఆవేశం చూస్తుంటే ఈ రోజే యుద్ధం ముగిసేలా ఉంది. కౌరవుల మీద విజయం సాదించాలనే నీ కోరిక ఏమైపోయిందని కృష్ణుడు అర్జునుడితో

పలికాడు. కృష్ణా! ఇన్ని మాటలెందుకు రథం భీష్ముడి వైపు పోని అని అర్జునుడు అన్నాడు. ఇరువురి మధ్య యుద్ధం ఘోరంగా జరుగుతుంది. అర్జునుడు గాండీవాన్ని సారించి భీష్ముడి విల్లును రెండుసార్లు విరగకొట్టాడు.

భీష్ముడు విడవకుండా కృష్ణుడిపై, గుర్రాల మీద, అర్జునుడి మీద బాధ కలిగేటట్లు బాణాలను వదిలాడు. ఇలానే సాగితే భీష్ముడు ఈ రోజే దుర్యోధనుడి కోర్కెలన్నీ తీర్చేటట్లున్నాడు. ఇప్పుడు నేను ఊరుకుంటే కాదు భీష్ముడిని చంపి ధర్మరాజుకి విజయం చేకూరుస్తానని కృష్ణుడు మదిలో తలుస్తుండగా అంతలో భీష్ముడు క్రూరబాణాలతో అర్జునుని కొట్టాడు. వెంటనే శ్రీకృష్ణుడు దుర్యోధనుడు జయించి రాజ్యం ఏలటం నేనుండగా జరగని పని. ఈ రాజ్యం పాండవులు హస్తగతం చేస్తాను. నా చక్రాయుధంతో భీష్ముడిని నేలకూలుస్తాను అని ఆవేశంగా రథం దిగి భీష్ముని వైపు ముందుకు దూసుకెళ్ళాడు.

భీష్ముడు వినయంతో చేతులు జోడించి "పరమేశ్వరా! ఈ విధంగా కృతార్థుడిని చేస్తావా?" నీ ఇష్టం వచ్చినట్లు చేయి కృష్ణా అని పలికాడు. అంతలో అర్జునుడు రథం నుండి దూకి కృష్ణా నువ్వు పాండవులకు రక్షకుడువు. నేను యుద్ధం చేయను సారథిగా ఉంటానని ప్రతిజ్ఞా చేశావు. అలాంటి నువ్వే ప్రతిజ్ఞ తిప్పితే లోకం దృష్టిలో నిందపడతావా? ప్రతిజ్ఞాపరుడైన ధర్మరాజు శౌర్యం, ధర్యం, నశించపోతుంది కదా! నా పరాక్రమం వృథా అవుతుంది. నాకు అపకీర్తి తేవడానికి నువ్వు చక్రం పడుతావా? అని ప్రార్థించగా శ్రీకృష్ణుడు శాంతించాడు. అంతలో సూర్యాస్తమయం అయింది. యుద్ధాన్ని చాలించారు.

## భీష్ముని ఐదవనాటి యుద్ధం

అయిదవనాడు భీష్ముడు మకరవ్యూం పన్నాడు. పాండవులు శ్యేనవ్యూహం తీర్చారు. భీముడు మకర వ్యూహాన్ని భేదించి లోపలకి ప్రవేశించి భీష్ముడిని ఎదుర్కొన్నాడు. భీష్ముడు భీముని నొప్పించాడు. అంతలో అర్జునుడు వచ్చి అతనికి బాసటగా నిలిచి భీష్ముడి ప్రతాపాన్ని తగ్గించి కౌరవవీరులపై బాణాలను సంధించాడు.ఆ తరువాత తురుముల యుద్ధం జరిగింది. భీమభీష్ముల విజృంభణం హెచ్చుగా సాగింది. అప్పుడే సమయం మధ్యాహ్నం అయ్యింది. అర్జునుడు ప్రచండంగా పరవళ్ళు త్రొక్కాడు. మంటలో పడిన మిడతలా కౌరవసైన్యం అర్జునుడు బాణాగ్నిలకు ఆహుతి అయ్యింది. అప్రతిహతంగా సాగిన అర్జునుడి యుద్ధ యాత్ర సాయంత్రం కావటంతో నాటికి యుద్ధం ఆగింది.

## భీష్ముడి ఆరవనాటి యుద్ధం

ఆరవనాటి ఉదయం అర్జునుడు మకరవ్యూహం ఏర్పాటు చేయమని సేనాపతికి చెప్పాడు. కానీ భీష్ముడు పాండవ వ్యూహానికి ప్రతిగా క్రౌంచవ్యూహాన్ని ఏర్పాటు చేసాడు. సైనికులందరూ క్రౌంచాకారంలో నిలిచి పాండవులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. భీష్ముడు ద్రోణుడికి తోడై చుట్టు ఉన్న రాజులను దూరంగా పంపాడు. భీముడు మాత్రం వెనుకాడకుండ కౌరవసైన్యాన్ని నురుమాడాడు.

ఆరవనాటి యుద్ధంలో ద్రోణభీష్మ ప్రతాపం పాండవ వీరులకు గట్టిగా ఎదురు దెబ్బ తాకింది.

ఉభయపక్షాల వీరులూ పగతో పోరాడి పరాక్రమాలు ప్రదర్శించారు. అంతలో సూర్యాస్తమయం అయింది. పోరు చాలించారు. ఆరవనాట రాత్రి దుర్యోధనుడు భీష్ముడితో మనం వ్యూహాన్ని చాలా నైపుణ్యంతో ప్రదర్శించాం. కానీ భీముడు చేతులో నేను భంగపడ్డాను. నిన్ను నా వైపు నిలుపుకుంటే పాండవులను జయించగలనని ఆశ ఉండేది. కానీ నాకు ఇప్పుడు ఆ ఆశ లేదు. నువ్వు దేవతలైన లెక్కచేయవు, అయితే నీ ముందు పాండవులు ఇంతటి బలవంతులుగా ఎలా రాణిస్తున్నారని అడిగాడు. దానికి భీష్ముడు దుర్యోధనా! నువ్వు నన్ను అలా అనవద్దు, యుద్ధంలో నేను చాలించినట్లు ఎప్పుడైనా చూశావా? శత్రువులను వెనుకాముందు చూడకుండా వెంటాడుతున్నాను కదా! శ్రీకృష్ణ పరమాత్మ ఉన్నంత కాలం వరకు పాండవులను జయించడం సాధ్యం కాదని నీకు ఎప్పుడు చెప్తున్నాను కదా! అయినా ఎటువంటి దాపరికం లేకుండా నీకు జయాన్ని కోరుతూ యుద్ధం చేస్తున్నాను అని భీష్ముడు దుర్యోధనుడితో అన్నాడు.

### భీష్ముడి ఏడవ నాటికి యుద్ధం

మరుసటి రోజు ఉదయం భీష్ముడు మండలవ్యూహం ఏర్పాటు చేశాడు. దానిని గమనించిన ధర్మరాజు వజ్రవ్యూహాన్ని పన్నాడు. శిఖండిని దృష్టద్యుమ్నుడు నకుల సహదేవులను పలువురు రాజులు కలిసి భీష్ముడిని రోషాలతో ఎదుర్కొన్నారు. బాణవర్షం కురిపిస్తున్న రాజలోకం మీద అర్జునుడు ఇంద్రాస్త్రం ప్రయోగించాడు. వారు భయంతో పరిగెత్తి భీష్ముడిని ఆశ్రయించారు. భీష్ముడు పాండవ వీరులపై క్రూరబాణాలు వేసి ఎదుర్కొన్నాడు.

తాటికాయలు రాలినట్లు పాండవ సైనికుల తలలు నేలకు రాలుతున్నాయి. అప్పటికీ సూర్యాస్తమయం కావడంతో అందరూ యుద్ధం చాలించారు.

### భీష్ముడి ఎనిమిదవ నాటి యుద్ధం

భీష్ముడు కూర్మవ్యూహం ఏర్పాటు చేశాడు. దృష్టద్యుమ్నుడు శృంగాట వ్యూహం రచించాడు. భీష్ముడు సింహంలా గర్జిస్తూ బయలుదేరాడు. పాండవ సైన్యం భయపడి ముందడుగు వేయలేకపోయారు. ఆ సమయంలో భీముడు ఒక్కడే భీష్ముడి రథాన్ని వేగంగా దూసుకొస్తు కౌరవుల సైన్యం తలలు రాలుస్తు వచ్చాడు. వెంటనే దుర్యోధనుడు భీష్ముని ఆశ్రయించి, భీష్మా! ఈ విధంగా భీముడు వరుసపెట్టి నా తమ్ములను చంపుతూ ఉంటే చూస్తు ఉన్నావా? రోషకోషాలు లేవా నీకు? అందరూ చావలని కోరుకుంటున్నావా అని ఏడ్చాడు.

ఆ మాటలకు భీష్ముడు కలత చెంది దుర్యోధనా! ఈ సంగతి నీకు ముందే నేను, ద్రోణుడు విదురుడూ వివరించి చెప్పాం. పాండవుల ఎదరుగా నిలిచి గెలవటం మా వల్ల అవుతుందా? దీనికి దు:ఖించాల్సిన అవసరం లేదు. వీర స్వర్గమే సంపదగా భావించి నువ్వు యుద్ధం చేయి. నేను నా వంతు చేతనైనంత వరకు చేస్తాను. మనకు విజయం కలిగితే వదులుకుంటామా? అని చెప్పి భీష్ముడు భయంకరంగా భీముడి వైపు రథాన్ని నడిపించాడు.

పాండవులు యుద్ధం పోరు ఎక్కువైంది. కౌరవసైన్యం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఆ సమయంలో దుర్యోధనుడు భీష్ముడు దగ్గరకు వచ్చి

**అనిమొన దేవదానవుల కైనను మార్కొనరాదు నిన్ను నే**
**డెనిమిది నాళ్ళు లయ్యె సమయింపవు నొంపవు సవ్యసాచి న**
**ప్పని యటులుండనిమ్ము నిను బ్రార్థన సేసెద నింతవట్టు నా**
**చనువున బోవ నిచ్చి నృపసత్తమ పోరికి గర్ణుబంపవే** (భీష్మ. 3. 171)

కురుముఖ్యా! నిన్ను నమ్మి పాండవ ప్రాభావాన్ని నేను లెక్కచేయలేదు. అయితే నువ్వు ఇప్పుడు చేస్తున్న యుద్ధ వైఖరులను ఎన్నింటినో గమనించాను. నువ్వు పాండవులను యుద్ధంలో ఎదుర్కొంటావు, కానీ చనువు ఇచ్చి వారిని చంపవు. ఇక మీరు యుద్ధం చేయకండి. నిన్ను యుద్ధంలో దేవతలు కూడా గెలవలేరు. ఇప్పటికే ఎనిమిది రోజులయ్యింది. అర్జునుడిని చంపవు, ఓడించవు, సరే అది అలా ఉండనీ పోనీ నా మీద ఉన్న మమకారంతో అయిన నా ప్రార్థన విని కర్ణుడిని యుద్ధం చేయటానికి అనుమతిని ఇవ్వు అని పలికాడు.

దుర్యోధుని మాటలకు భీష్ముడు మనుసుకు తగిలి అత్యంత విషాదంలో మునిగాడు. కొంత సేపు తల వాల్చుకుని కూర్చున్నాడు. కొంత సమయం తరవాత నిట్టూర్చి, చివరకు తలయెత్తి, భూపాలా! నీ కోసం ప్రాణాలు తాకట్టుపెట్టి యుద్ధం చేస్తున్నాను. నువ్వు ఇలా మాట్లాడం బాగుందా? నా రాజభక్తి అంత బూడిదలో పోసిన పన్నీరయింది నీ మాటలతో. ఆ అర్జునుడు సామాన్యుడా! అప్పట్లో ఇంద్రాదులను జయించి ఖాండవనాన్ని దహించలేదా? గంధర్వుల చేతులతో ఓడిపోయిన కర్ణుడిని, నిన్ను, నీ తమ్ములను విడిపించలేదా? ఇలా చెప్పుకుంటూపోతే ఇంకెన్నో మహా విజయాలు సాధించిన మహావీరుడు

అర్జునుడు. అటువంటి జగజెట్టితో ఇన్నాళ్ళు ఈ విధంగా యుద్ధం చేసి కూడా నీ చేత ఈ నాడు ఇటువంటి వేడి మాటలు వినవలసి వచ్చింది.

అంతేకాదు ఇటువంటి పనికిరాని మాటాలు ఆపి మళ్ళి చెప్తున్న విను, నేను గాండీవిని గెలవలేను, శిఖండిని చంపలేను. మరెవరైనా సరే యుద్ధంలో ఉగ్రంగా చెండాడుతాను. ఇంతముందే నీకు చెప్పాను. నేనూ, నా సేవలూ కలసి ద్రుపద, విరాట, యాదవాదులు సైన్యాలతో యుద్ధం చేస్తాం. మీరందరూ పాండవులను జయించటానికి సిద్ధం అవ్వండి. ఇలా అర్థరాత్రి వేళ వచ్చి ఈ విధంగా నన్ను హేళన చేసి మాట్లాడం నీకు జయం కలుగుతుందా? అంటూ భీష్ముడు దుర్యోధనుడితో పలికాడు.

## భీష్ముడి తొమ్మిదవనాటి యుద్ధం

భీష్ముడు సర్వతోభద్ర వ్యూహం ఏర్పాటు చేశాడు. పాండవ సైన్యం గట్టి వ్యూహాన్ని రచించింది. భీష్ముడు అనేకమంది రధికులతో కలిసి అభిమన్యుడిని ఎదిరించాడు. భీష్ముడిని పాండవ వీరులు చుట్టుముట్టారు. దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనులను భీష్ముడికి సహాయంగా పంపారు. మధ్యాహ్నం వరకు ఒకరిపై నొకరు యుద్ధ తీవ్రతను విజృభించారు.

మధ్యాహ్నం నుండి ప్రచండభానుడిలా విజృంభించాడు. వరుసగా భీష్ముడు ధర్మరాజును, భీముడిని నకుల సహదేవులను, సాత్యకిని, దృష్టద్యుమ్ముడిని నొప్పించాడు, అప్పుడు మాత్స్య, పాండ్య, సోమిక, మగధ వీరులు బలాలు భీష్ముడిని చుట్టుముట్టారు. కానీ భీష్ముడు వారందరనీ ఎదుర్కొన్నాడు. చెల్లాచెదురు అవుతున్న సైన్యాన్ని అర్జునుడు కూడపెట్టుకుని భీష్ముడిని సమీపించి కోపంతో భీష్ముడి విల్లు విరిచాడు. భీష్ముడు మరో బాణం విల్లెత్తాడు. దానిని కూడా అర్జునుడు త్రుంచాడు.

అర్జునుడిని విలు విద్యను మెచ్చుకుంటూ మరోక వింటితో శరపరంపర గుప్పించి పార్థుడిని నొప్పించాడు. అయినా అతడు భింకంతో పోరు సాగించాడు. భీష్ముడు విజృంభించి పార్థుడిని బాధిస్తు ఉండగ ఎవ్వరూ ఎదురు రాలేకపోయారు. అంతలో సూర్యుడస్తమించాడు. యుద్ధం ఆగిపోయింది.

ఆ రోజు అర్థ రాత్రి ధర్మరాజు, అతడి తమ్ములు, శ్రీకృష్ణుడు సామాన్య వేషాలతో అతి రహస్యంగా భీష్ముడి మందిరంలో ప్రవేశించారు. భక్తితో స్తుతిస్తూ పాదాభివందనం చేశారు. భీష్ముడు అందరినీ క్షేమమా అని అడిగి ఇక్కడికి మీరందరూ కలిసి వచ్చిన పని ఏమటి? మీకు ఏది కావాలో అడగండి, ఎంతటి అసాధ్యమైనా వెంటనే సాధించి మీకు ఇచ్చి సంతోషపెడతాను అన్నాడు. అప్పుడు ధర్మరాజు మాకు ఏ విధంగా సామ్రాజ్యం సమకూరుతుందో ఆ మార్గాన్ని దయతో చెప్పండి అన్నాడు.

అప్పుడు భీష్ముడు 'తాతకి దగ్గులు నేర్పటమా "అని చిన్న నవ్వు నవ్వి ఇంతమంది ఇక్కడకి వచ్చి అడుగుతుంటే మీకు ప్రియమైన కార్యం చేయటం కంటే నాకు వేరే పుణ్యం ఉందా! సరే చెప్తా వినండి. నా చేతిలో ధనువు ఉండగా దేవతలు సైతం నన్ను గెలవలేరు. అందుకే నేను ఆయుధాలను ప్రయోగించడం మానినప్పుడే నన్ను జయించడం వీలవుతుంది. జోడు పుచ్చినవాడిని, ఆయుధం క్రిందపెట్టినవాడిని, జెండా దించినవాడివని, స్త్రీని మొదట స్త్రీగా ఉండినవారిని, ఆడువాని పేరు పెట్టుకొన్నవాడిని, తలగుడ్డను తీసివేసినవాడిని, సోదరులు లేనవాడిని పుత్రులు లేనివాడిని చూస్తే నేను యుద్ధం చేయను. నాకు మరోక నియమం ఉంది.

పుట్టినప్పుడు లేకుండా నుమ దైవమిచ్చిన పురుషుత్వం కలవాడితో యుద్ధం చేయను. కాబట్టి మీకు ఒక ఉ పాయం చెబుతాను. ద్రుపద సంతానమైన శిఖండి అటువంటివాడు. మీకు తెలుసు, కాబట్టి అర్జునుడు అతడిని ముందు పెట్టుకుని వస్తే నేను బాణప్రయోగం మానితే నన్ను మీ బాణాలతో ఓడించి, ఆ తరవాత బంధమిత్రులైన కౌరవులను జయించడం తేలికపని అవుతుందని ఆజ్ఞ ఇచ్చారు. భీష్ముడు అది వినివ ధర్మరాజు అందరూ నమస్కరించి బయలుదేరారు.

**భీష్ముడి పదవనాటి యుద్ధం**

మరుసటి రోజు సూర్యోదయ సమయంలో పాండవులు సేనావ్యూహాన్ని రచించారు. శిఖండిని ముందు నిలిపారు. భీష్ముడు ప్రళయకాలం భైరవుడిలా భయంకరంగా బాణాలును సంధిస్తున్నాడు. శిఖండి భీష్ముడి మీద క్రూరస్త్రాలు ప్రయోగించడం ప్రారంభించాడు. కానీ భీష్ముడు అతడివైపు కూడా చూడకుండా తల ప్రక్కకు తిప్పుకుని ఇలా అన్నాడు. నువ్వు మగవాడవని నేను అనుకోవటం లేదు. కాబట్టి స్త్రీ అయిన నేను బాణాలతో కొట్టను. నా మీద నువ్వు ఎన్ని బాణాలు వేసినా నేను నవ్వుకుంటాను తప్ప కోపం రాదని పలికాడు.

?వెంటనే శిఖండి నేను ఎవ్వరినైతే ఏమి నాతో యుద్ధం చేయి. ఇవ్వాళ ఎలాగైనా నీ పొగరు అణుస్తాను. నిన్ను బాధిస్తాను. మహావీరుడవనే బిరుదును పగలగొడతాను. పరాక్రమంలో అస్త్ర విద్యను నీ మీద ప్రయోగిస్తానని పలికాడు. పాండవులు కౌరవసైన్యాన్ని తరిమి తరిమి వెంటాడారు. దుర్యోధనుడు వచ్చి పితామహా! నువ్వు ఉండగా మన సైన్యం ఇంత దీనంగా మారటం న్యాయమా? అని పలిరకాడు. దానికి భీష్ముడు దుర్యోధనా! పదివేల మందిని చంపుతానని నీకు మాట ఇచ్చాను, నా మాట నిలబెట్టుకున్నాను. నీ ఋణం తీర్చుకున్నాను. ఇంక నా శరీరంలో బలం తగ్గుతుంది. ఈ రోజు పాండవులు నన్నైనా చంపాలి లేదా నేనైనా వాళ్ళని చంపాలి అంటూ పాండవుల మీదకు విరుచుకుపడ్డాడు భీష్ముడు.

భీష్ముడు ప్రచండుడై వీరవిహారం చేశాడు. అప్పటికి మధ్యాహ్నమయింది. భీష్ముడికి తనలో తాను ఈ పదిరోజులు పాటు ఉత్తమ క్షత్రియులెందరినో నా బాణాలతో బలిచేశాను. ఇక నాకు అలసినట్లుంది. ఇంక నా శరీరంతో పొత్తు మానాలనిపిస్తుందని మనుసులో తలచాడు. యుద్ధం చేస్తున్నట్లుగా నటిస్తూ ధర్మరాజును సమీపించి పుట్టినప్పటి నుండి క్రూరంగా రాజులను చంపుతునే కాలం గడిచింది. మీరు నా మేలు కోరేవారైతే శిఖండిని ముందు పెట్టుకుని వచ్చి అందరూ కలిసి నా మీద దాని చేయండి అని చెప్పి పాంచాల సైన్యం మీదకి పోనిచ్చాడు.

శిఖండిని ముందుకు తెచ్చి, తెరపి కలిగించి, భీష్ముడిపై బాణాలు వేయమని పురికొల్పాడు. శిఖండి విజృంభించాడు. భీష్ముడి భుజామధ్య ప్రాంతంలో బాణాలు వేశాడు. భీష్ముడు మంత్రించిన వాడివె నవ్వుతూ పాండవులందరనీ నా ఒక్క వింటితోనే గెలువలేనా? శ్రీకృష్ణుడు వీరికి అండగా ఉన్నాడు కాబట్టి బ్రతికిపోయారు. అది అలా ఉంచితే పాండవులు కీడుపడి శ్రీకృష్ణుడిని వెంటపెట్టుకొని నా దగ్గరకు వస్తే నా వధవిధానం చెప్పాను.

ఇక యుద్ధం మాని శాంతంగా ఉంటాను. ఈ ఆర్భాటం ఎందుకు అని మనుసులో అనుకున్న మాటలు ఆకాశంలో దేవతలు సైతం సమ్మతించారు. ఆ సమయంలో శిఖండి విల్లు వెనుక తన విల్లు ఉంచి అతడే వేస్తున్నట్లు అర్జునుడు దొడ్డబాణాలును భీష్ముడిపై ప్రయోగించాడు. "ఎండ్రాకాయ కడుపువలె నా శరీరాన్ని వ్రక్కలు చేస్తు ఈ బాణాలు శిఖండికి ఎక్కడున్నాయి?" యమదూతలవలె ప్రాణాలను లాగే ఈ బాణాలు శిఖండి ఎన్నడు వేశాడు? ఈ బాణాలు దృఢమైనవి, ప్రకాశవంతమైనవి, లక్ష్యశుద్ధి కలవి, ఇలువంటి బాణాలు అర్జునుడికి కాక శిఖండి కేమి సాధ్యమౌతాయి?" అని దుర్యోధనుడితో అర్జునుడు అన్నాడు. అంతలో సూర్యుడు అస్తగిరికి చేరాడు. భీష్ముని శరీరం నేలకొరిగే సమయంలో కృష్ణుడు ఇలా అన్నాడు. అర్జునా! భీష్ముని వంటి వీరును నేలకి ఒరగటం మంచిది కాదు నీ బాణాలతో భీష్మునికి పాన్పుగా అమర్చు అన్నాడు.

ఆకాశంలో దేవతలు అయ్యో! పుణ్యాత్ముడైన భీష్ముడు దక్షిణాయనంలో చనిపోతున్నాడే' అని చింతించారు. దేవతలారా! నా కాలగతి మనుస్సులో నేను కోరుకొన్నదే. నా ప్రాణాలను శరీరంలో ఉంచుకొన్నాను. బాధపడకండి. సత్యవతీ వివాహ సమయంలో నా తండ్రి నన్ను మెచ్చి నాకు 'అవధ్యత్వం' స్వచ్ఛంద మరణం' వరాలుగా ఇచ్చాడు. వాటి ప్రభావం వలన నా వధ నేను అంగీకరించకపోతే కలగదు. ప్రాణత్యాగం కూడా నా వశమై ఉంది. అని భీష్ముడు పలికాడు. దేవతలు సంతోషించారు.

మనుమలనూ, రాజులనూ, చూసి ఇలా అన్నాడు. 'సూర్యుడిని ధ్యానిస్తూ ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేంత వరకు ఈ అంపశయ్య మీదనే సంతోషంతో శయనించి ఉంటాను. ఈ రోజులలో నాకు గట్టి రక్షను కల్పించమని కోరి

తనకు దాహమౌతున్నట్లు సూచించి నీటిని అడిగాడు. దప్పిక తీర్చె నీళ్ళు కౌరవులు తెప్పించారు. భీష్ముడు ఆ నీళ్ళు నాకు అంత మంచిది కాదు భూమినుండి పుట్టిన పుణ్యజలాలను త్రాగటమే మంచిదని చెప్పాడు. అటువంటి పుణ్యజలాలను పుట్టించే శక్తి అర్జునుడుకి ఉందని అర్జునుడిని కోరాడు. అప్పుడు పార్థుడు తాతకు ప్రదక్షిణం చేసి పర్జన్యమంత్రంతో ఒక బాణాన్ని అభిమంత్రించి భూమి చీలేటట్లు ప్రయోగించాడు. వెంటనే భూమిలో నుండి ధారలుగా పైకి లేచి భీష్ముని దాహం తీర్చాయి. మనుమళ్ళకు తగిన మంచి చెడులు చెప్పి ఉత్తరాయణ పుణ్యకాలంలో శ్రీకృష్ణ పరమాత్మని దర్శించి స్వచ్ఛందమరణం పొందాడు. అటువంటి ఆదర్శనీయమైన వ్యక్తిత్వం గల భీష్ముడి వీర మరణం, ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరిచింది అని చెప్పవచ్చు.

## భీష్మ పాత్ర ఆదర్శనీయ వ్యక్తిత్వం

భీష్మ పర్వంలో అన్ని పాత్రలు ఒక ఎత్తు అయితే భీష్ముడి పాత్ర కీలకమైన పాత్రగా చెప్పవచ్చు. మహాభారతంలో భీష్ముని పాత్ర ఎంతో వైవిధ్యంతో కూడా అనేక మలుపులు తిరుగుతూ హితాన్ని బోధించే విధంగా ఉంటుంది. భీష్ముని పాత్ర నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయంగా ఉంటుందని చెపవచ్చు. భీష్ముని చేసిన వీరకార్యాలే ఆయనకు పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి. భీష్ముడు పుట్టినప్పుడు నుంచి అంపశయ్యకు చేరేంత వరకూ కూడా సమాజానికి ఎన్నో ఆదర్శనీయమైన సందేశాలను ఇచ్చారు.

తల్లిదండ్రులు మీద స్వార్థబుద్ధితో ప్రవర్తిస్తున్నవాళ్ళే అధికంగా ఉన్నారు. కానీ తండ్రి మీద ఉన్న మమకారంతో రాజ్యాన్ని వదులుకోవడానికి సిద్ధపడి, జీవితాంతం ఆజాతబ్రహ్మచార్యం స్వీకరించిన గొప్ప వ్యక్తిత్వం కలవాడు భీష్ముడు. వంశవృద్ధి కోసం ఎంతో చింతన పడ్డాడు. తమ్ముళ్ళను ఎంతో ఆదరించాడు. చివరకు అంపశయ్య మీద ఉన్నప్పుడు కూడా మనమళ్ళకు మంచి ని బోధిస్తూ అర్జునుడితో ఇలా అన్నాడు.

**నారదుచేత నిన్ను మునినాథుని గాగ నెఱింగి యుండుదున్;**
**శౌరియు నీవుగూడిన నసాధ్యము లెవ్వియు లేవు;దర్పదు**
**ర్వారుడ వైన నీ వలని వైరము గీడని చెప్పజెప్ప నీ**
**కౌరవరాజు మానడు; దెగం జెడు గా కిటమీద భీమురచేన్; (భీష్మ. 3.434)**

అంటే కురు వంశం నశించకూడదని అన్నదమ్ముళ్ళు మధ్య వైరం పెరగకూడదనే భీష్ముడి వ్యక్తిత్వం నేటి సమాజంలోని కుటుంబాలకి ఎంతగానో ఆదర్శనీయంగా ఉంటుంది. స్వార్థంతో అన్నదమ్ములు మధ్య జరిగే విపరీత కారణాలు వలన గొడవలుకు భీష్ముని వంటి వ్యక్తిత్వాన్ని దర్శించినట్లైతే కొంత వరకు మంచి జరుగుతుందని చెప్పవచ్చు. ఎంతగానో నేను దుర్యోదునికి చెప్పి చూసాను. కానీ దుర్యోదనుడు ఏ మాత్రం నా మాట వినలేదు. అర్జునుడితో యుద్ధం నాశనానికి కారణం అవుతుంది. దానికి తోడు కృష్ణుడు తోడైయ్యాడు విజయం సాధ్యం కాదని చెప్పాను వినకుండా వినాశనాన్ని కోరుకున్నాడు అని చెప్పాడు. అలాగే భీష్మిడుకి దుర్యోదనుడుతో ఇలా అన్నాడు.

**నరుడత్యద్భుతవిక్రమం డతని కానారాయణుం డాప్తుడె**
**వ్వరికిన్ వీరి జయింపరాదు సమరావష్టంభముం దక్కిధ**
**ర్మరతుం డైనయజాతశత్రునకు నింద్రవస్థ మి మ్మర్థరా**
**జ్యరమం బొందుము మీరు గొదఱయినం జాకున్న నీ కొప్పదే? (భీష్మ. 3.436)**

అర్జునుడు, శ్రీకృష్ణుడు ఏకమైతే ఎంతటి బలవంతులైన విజయం సాధించలేరు. కాబట్టి యుద్ధ ప్రయత్నాన్ని గెలుస్తామనే గర్వాన్ని ఇకనైనా మానుకో, ధర్మదేవత అంశాన పుట్టినవాడు అర్జునుడు, ఇంద్రప్రస్థాన్ని ఇచ్చి మిగిలిన సగం రాజ్యాన్ని నువ్వు పాలించు. యుద్ధాన్ని చాలిస్తే మీలో కొందరైనా బ్రతుకుతారు అని మంచిని చెప్పాడు భీష్ముడు. చివరకు

చనిపోయి సమయంలో కూడా అటు ధర్మరాజుకి ఇటు దుర్యోధనుడికి నచ్చచెప్పి మనమళ్ళకు మంచి జరగాలనే ప్రయత్నం ఆదర్శనీయం అని చెప్పవచ్చు.

అనాడు ఇచ్చిన మాట ఎలా కాపాడలో ఆలోచించి మాటకు కట్టుబడే వ్యక్తిత్వం గల మనుషులు ఉంటే, నేటి కాలంలో ఇచ్చిన మాట ఎలా తప్పాలా అనే తిరిగే వ్యక్తులు ఎక్కువైయ్యారే చెప్పాలి. అలాంటి వ్యక్తులు ఉన్న నేటి సమాజానకి భీష్మని వంటి ప్రజ్ఞాపరుడు ఎంతో ఆదర్శనీయం.

యుద్ధంలో శరణం కోరిన వారిని భీష్ముడు ఎప్పుడు వధించడు. సహాయాన్ని కోరిన వాళ్ళని దగ్గరకు తీసుకుని ఆదరించే గొప్ప వ్యక్తిత్వం కలవాడు. కానీ నేటి సమాజంలో శరణం కోరిన వారినీ, లేదా సహాయం కోరిన వారినీ చూసి నవ్వుకునే వాళ్ళకి భీష్మని వంటి వ్యక్తిత్వం ఆదర్శనీయంగా ఉంటుందని చెప్పవచ్చు. అర్జునుడు, శ్రీకృష్ణుడు, ధర్మరాజు రహస్యంగా భీష్ముడిని కలిసి విజయం సాధించడానికి మార్గం కోరగా స్వయంగా తన మరణ రహస్యాలను సైతం చెప్పి యుద్ధంలో గెలవమని ఆశీర్వదించిన సన్నివేశం విశేషం. ప్రాణ భయంతో ఎదట వాళ్ళ ప్రాణాలు తీసే నేటి సమాజంలోని మనుషులకు ఇలాంటి అద్భుతమైన భీష్మని ప్రాణ త్యాగం ఆదర్శం.

**ఆధార గ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము భీష్మ పర్వం
2. ఆంధ్ర మహాభారతం వ్యక్తిత్వ విలువలు ఒక పరిశీలన – జి సావిత్రి
3. శ్రీ మహాభారతము (విరాట, ఉద్యోగపర్వాలు) – ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు
4. ఆంధ్రమహాభారతం విశ్లేషణాత్మక వ్యాసాలు – ఆచార్య విస్తాలి శంకరరావు
5. సాహితీ విన్యాసాలు (వ్యాస సంకలనం) – ప్రాచార్య లింగంనేని బసవ శంకరరావు, ఆచార్య అత్తోట ఆంబ్రాణి

# 32. మహా భారతంలో యోగ దర్శనం - ఒక విశ్లేషణ

- డా॥ నగిరి చాముండేశ్వర రావు, తిరుపతి

## ఉపోద్ఘాతం

మహా భారతంలో యోగదర్శనాంశాలు ప్రస్తావింపబడినవి ప్రథమంగా యోగం అంటే ఏమిటి అన్న ప్రశ్నకు పతంజలి మహర్షి తన యోగసూత్రాలలో వివరించడమైనది.

## యోగ: చిత్తవృత్తి నిరోధః

యోగసూత్రాలు - పతంజలి - 1వ సూత్రం. చిత్తము యొక్క వృత్తులను నిరోధించడమే యోగమని చెప్పడమైనది.
భగవద్గీతలో గీతాచార్యులు యోగానికి ఇలా నిర్వచనం ఇచ్చారు.

**శ్లో॥ ॥బుద్ధి యుక్తో జహతీహ ఉభే సుకృత దుష్కృతే**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్॥ భగవద్గీత - అధ్యాయం-2 శ్లోకం-50**
**శ్లో॥ ॥యోగస్థ: కురు కర్మాణి సంగం తృక్త్వా ధనంజయ**
**సిద్ధ్య సిద్ధ్యో: సమోభూత్వా సమత్వం యోగ ముచ్యతే॥ అధ్యాయం - 2 శ్లోకం-48**

జీవుడు చేసేం పనిని కర్మ అంటారు. దానిని నైపుణ్యంతో, కౌశలంతో చేస్తే కర్మయోగం అంటారు.

బుద్ధి బలంతో చేసే పనిని జ్ఞానం అంటారు. దానికి నైపుణ్యం జోడించి చేస్తే జ్ఞాన యోగం అంటారు.

గీతాచార్యులు 'సమత్వబుద్ధితో సుకృత, దుష్కృతము వదిలి నిష్కామంతో చేసే కర్మను నేర్పుతో చేస్తే దానిని కర్మయోగం అని చెప్పడమైనది.

ఇక్కడ యోగిది మాత్రమే నిష్కామకర్మ అవుతుంది. ప్రతిఫలం మీద ఆశ లేకుండా, పనిమీద మాత్రమే శ్రద్ధ ఉంటుంది.

## హరసనత్కుమార సంవాదం - యోగదర్శనాంశాలు

పరమశివుడు సనత్కుమారుని వద్దకు రాగా ఆయన అతిథి మర్యాదలు చేసి, ఏకార్యం కొరకు వచ్చారో తమరు మనవి చేస్తే దానిని చేయడానికి సంసిద్ధుడను" అని వినమ్రంగా చెబుతాడు.

అప్పుడు హరుడు 'ఓతమ్ముడా! నీతో ప్రసంగించాలనే కోరికతో వచ్చాను అని అనగానే సనత్కుమారుడు సర్వజ్ఞుడైన తమరు తెలుసుకోవలసిన దేమి? అని ప్రశ్నించగాది 1) ధ్యానంలో చూడదగిన వస్తువేది! 2) చక్కగా భావించదగిన తత్త్వాలు ఎన్ని? జ్ఞానమూ, యోగమూ ఏవిధంగా ప్రవర్తిస్తాయి. అని పరమ శివుడు అడగగానే సవత్కుమారుడు శివా! తత్త్వాలు 24 అని కొందరు, 23 అని కొందరు, 25 అని కొందరు అంటారు. మనస్సు యొక్క పరిశుద్ధతే బుద్ధి అనేవారు 24 అని అంటారు. అయితే నేను చూసే మార్గంలో యోగతత్త్వాల గురించి వివరిస్తాను అని అన్నాడు.

సనత్కుమారుడు బాలుడు ఒక మహాయోగి, ఋషి శివుడు సర్వజ్ఞుడు అయినప్పటికీ లోకులకు ఆదర్శంగా వుండడానికి గురుపంపర సంప్రదాయాన్ని గౌరవించి ఇదే పద్ధతిని తరువాతి తరాల వారు ఆదర్శంగా తీసుకొని జ్ఞానసముపార్జన చేయాలనే ఉద్దేశ్యంతో ఇలా శివుడు ఈ సంవాదాన్ని చేశాడు.

**శ్లో॥ ॥యద్యదాచరతి శ్రేష్టః తత్తదేవేతరోజనాః**
**సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥ భగవదీత - అధ్యయం-2, శ్లోకం-2**

దేనిని శ్రేష్ఠులు ఆచరిస్తారో దానినే ఇతరులు ప్రమాణంగా భావించి అనుసరిస్తారు. శివుడంతటి వాడు ఒక బాలుని వద్ద జ్ఞానాన్ని తెలుసుకోవాలని కోరిక కలిగి అడిగితే మిగిలిన వారికి అది ప్రమాణంగా స్వీకరించి అనుసరిస్తారు.

**శ్లో॥ ॥తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**
**ఉపదేక్ష్యంతి తేజ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః॥ భగవద్గీత అ-4, శ్లో-34**

తత్త్వమును దర్శించిన వారి వద్ద జ్ఞానాన్ని శరణాగతితో శ్రద్ధతో అడిగి తెలుసుకోవాలని గీతాచార్యులు బోధించారు.

సనత్కమారుడు "అధిష్ఠానం" అనే రూపంతో 25వ తత్త్వం వున్నది. 24 తత్త్వాలను తన అదుపులో ఉంచుకుంటుంది. వాటికి ప్రకాశాన్ని, చైతన్యాన్ని కలిగిస్తుంది. పరమశివా! 5 పంచ భూతాలు అవి 1) నేల, 2) నీరు, 3) నిప్పు, 4) గాలి, 5)నింగి - 5 వాటి గుణాలు

1. గంధం, 2. రసం, 3. రూపం, 4. స్పర్శ 5. శబ్దం-5

**10 ఇంద్రియాలు**

5 కర్మేంద్రియాలు -1, వాక్కు, 2. చేతులు, 3. కాళ్లు, 4. పాయు, 5. ఉపస్థ,

5 జ్ఞానేంద్రియాలు-1, చర్మము, కన్ను, 3. చెవి, 4. నాలుక, 5. ముక్కు

1) మనస్సు, 2) బుద్ధి, 3) అహంకారము, 4) ప్రకృతి-20 4 కలిపితే 24 తత్త్వాలు.

**1. మనస్సు నిర్వచనం**

పతంజలి మహర్షి "యోగాసూత్రాలు"

"సంకల్ప వికల్పాత్మక మనః

ఒక పనిని చేద్దామా? వద్దా? అనే సంశయం అయోమయంలో ఉన్న స్థితినే మనస్సు అని పేరు. ఎప్పుడూ ఆలోచనలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. చంచలంగా గాలివలె ఉంటుంది మనస్సు అని పతంజలి మహర్షి వివరించారు.

**2. బుద్ధి**

"నిశ్చయాత్మక బుద్ధిః" అని పతంజలి మహర్షి "యోగ సూత్రాలలో నిర్వచించారు"

ఒక కార్యాన్ని తప్పక చేయాలి అనే దృఢ నిశ్చయంతో ఉన్న దానిని బుద్ధి అంటారు.

**3. అహంకారం**

"నేను" అనే స్ఫురణను కలిగి ఉండేది.

ఉదా॥ ఈ శరీరం "నేను" నా వారు అనే మమకారం కలిగినది అహంకారం.

**4. ప్రకృతి**

ప్రబలమైన శక్తితో సృష్టించబడిన ఆకృతే ప్రకృతి. పంచభూతాత్మకమైన ప్రపంచమే ప్రకృతి. దీనినే "మాయ" అని కూడా అద్వైతంలో అంటారు. ఈ 24 తత్త్వాలకు అతీతమైన, అధిష్ఠామైన ఒక చైతన్య స్వరూపమే "పురుషుడు" దానిని ఆత్మ అని కూడా అంటారు. క్షేత్రజ్ఞుడు అని కూడా అంటారు. 24 తత్త్వలు దేహ సముదాయం అయితే అందులో నిశ్చలమైన

సాక్షి భూతుడు, కూటస్థుడు జీవాత్మ. ఇది 25వ తత్త్వం. బొటన వ్రేలు పరిమాణంలో హృదయ కుహరంలో, హృదయాకాశంలో వెలుగుతూ వుంటాడు. ప్రణహ స్వరూపంలో ప్రణవనాదం ధ్వనిస్తూ ఉంటుంది. ఆ చక్రం హృదయ చక్రము మరియు అనాహత చక్రం అని పేరు. ముకుళితమైన కమలం వలె వుంటుంది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వత్మతత్త్వాన్ని చెబుతూ కట్టె కాలుతూ వున్నప్పుడు గాలికి కదిలి ఎగిరేనిప్పు కణం యొక్క పరిమాణంలో పరమాత హృదయాకాశంలో ప్రకాశిస్తూ ఉంటారని చెప్పడమైనది.

భగవాన్ రమణ మహర్షి తన "అక్షర రమణ మాల" లో "అరుణాచల మనుచు స్మరియింపువారల అహము నిర్మూలింపు మరుణాచలా" అని స్మరించడం జరిగింది.

అహంకారం నశించినపుడు జీవాత్మ, పరమాత్మలో లీనమవుతుంది. వేదం ఈ 25వ తత్త్వాన్ని పురుష తత్త్వము, బ్రహ్మమని, అమృత తత్త్వమని చెప్పడమైనది.

25వ తత్త్వం ప్రభావం వంటిది 24 తత్త్వాలను శాసిస్తుంది. తన ఆధీనంలో ఉంచుకుంటుందని సనత్కమారుడు శివునికి యోగ రహస్యాన్ని బోధించడమైనది.

కట్టెలో నిప్పు దాకి వున్నట్లుగానే ఈ 24 తత్త్వాల సముదాయం లో ఆత్మ అంతర్లీనంగా అవ్యక్తింగా దాగి వుంటుంది.

ఈ 25వ తత్త్వము అవ్యక్తము 2. వ్యక్తము అణి రెండు విధాలు.

### 3. యోగ జ్ఞానాన్ని పొందడానికి గల అర్హతలు

1. శ్రద్ధ లేని వారికి, చిత్తాన్ని ఏకాక్రంగా నిలుపలేని వారికి, ఇంద్రయాలను గెలవలేనివారికి, వేద జ్ఞానం లేని వారికి దీనిని సవత్కుమారుడు చెప్పకూడదని అన్నాడు.

### 4. ఆత్మతత్త్వాన్ని దర్శించడం

10 ఇంద్రియాలు మనస్సులోకి, మనస్సు, అహంకారాలోనికి, అహంకారం బుద్ధిలోకి ఇవన్నీ ప్రకృతిలోకి, ప్రకృతి ఆత్మలోకి లీనమైనపుడు అంతర్ముఖమైనపుడు "ఆత్మదర్శణ" కలుగుతుంది. దీనినే క్రవల్యమనీ, అద్వైతమనీ చెప్పబడింది.

వేదంలో "తత్త్వమసి" అని చెప్పడమైనది. అదే బ్రహ్మము లేదా ఆత్మయే నీవు అయి వున్నావు అని అర్థం.

వ్యక్తి బ్రహ్మమును చూస్తాడు అట్లా చూచిని విశేష స్థితిని అవ్యక్తం అంటారు. ప్రబుద్ధుడు దానిని దర్శిస్తాడు. ఆత్మతత్త్వం క్షర, అక్షిర, పర అనే పేర్లతో వేరువేరు దశలలో ఉంటుంది. ఆ 25 తత్త్వమైన వాడి పేరు ప్రబుద్ధుడు.

అడగని విషయం అడగని వారికి చెప్పరాదని ధర్మశాస్త్రవచనం. క్రీడాతపస్వీ, పరమయశస్వీ ముముక్షవు, జీజ్ఞాసువు అయిన యోగి శ్రద్ధతో ప్రశ్నించినపుడు మాత్రమే ఆ బ్రహ్మీ, ఆత్మ తత్త్వాన్ని విశదీకరించాలని ధర్మశాస్త్ర వచనం.

ఆత్మదర్శనం కలిగిన వారికి అష్ట సిద్ధులైన 1) అణిమ, 2) గరిమ, 3) మహిమ, 4) లఘిమ, 5) ప్రాప్తి, 6) ప్రాకామ్యం, 7) ఈశత్వం, 8) వశిత్వం వశం అవుతాయి. అయితే ఐహిక భోగాలనోనం ఉపయోగిస్తే యోగి యోగ భ్రష్టుదౌతాడని, లోక హితం కోసం వాటిని ఉపయోగించాలని సనత్కుమారుడు శివునితో చెప్పడమైనది.

తిరుమల గిరులలో ఇప్పటికీ సనక సనంద తీర్థం ఉన్నది.

1) సనత్కుమారుడు, 2) సనందుడు, 3) సనకుడు, 4) సనత్సుజాతుడు వీరు నలుగురు బ్రహ్మ మానస పుత్రులు యోగులు, సిద్ధులు. వీరు నలుగురూ సర్వకాలంలో నిత్యయవ్వనంతో బ్రహ్మతేజస్సుతో బాలురవలె ప్రకాశిస్తూ వుంటారు.

వీరు శేషాచల అరణ్యాలలో సంచరించినట్లు వారి తీర్థంలో తరిగొండ వెంగమాంబ దర్శించి పునీతమైనట్లు చెప్పబడినది. సనక సనంద తీర్థంలో స్నానం ఆచరిస్తే నిత్యయవ్వనులుగా ఉంటారని లోక ప్రసిద్ధం.

### 5. ఆధునిక సమాజం – అష్టాంగ యోగము

ఆధునిక సమాజంలో తీవ్ర ఒత్తిడులకు లోనై ఎన్నో రకాల మనోవ్యాధులకు జనులు గురౌతున్నారు. కేంద్ర ప్రభుత్వం జూన్ 21వ తేదిని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవడానికి కృషి చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ప్రత్యక్షంగా యోగాసనాలు వేయడం జరిగింది. ఇది భారతీయ యువతకు స్ఫూర్తిదాయకం అని చెప్పవచ్చు.

పతంజలి మహర్షి అష్టాంగ యోగంలో 8 పద్ధతులు వివరించడమైనది. అవి

1) యమ, 2) నియమ, 3) ఆసన, 4) ప్రాణాయమ, 5) ప్రత్యాహార, 6) ధారణ, 7) ధ్యాన, 8) సమాధి.

### యోగా సూత్రాలలో యమము నిర్వచనం

### 1. అహింస

సద్గురు మలయాళ స్వాముల వారు "అహింసా పరమోధర్మః" అని పరమ ధర్మమని చెప్పారు.

"అహింసా ప్రతిష్ఠాయాం వైరత్యాగః" సర్వజీవుల పట్ల దయతో ప్రవర్తిస్తే వైరం రాదు. అరణ్యాలలో కూడా వైర జంతువులు ఋషుల సాన్నిధ్యంలో స్నేహంగా మెలగుతాయి.

మనసావాచా కర్మణా సాటి మానవులతో స్నేహంగా, ప్రేమగా కలిసిమెలసి జీవించడం, సాత్త్వికమైన ఆహారాన్ని తీసుకుంటాయి. శాంత జీవన విధానాన్ని అలవరచుకోవడమే అహింస అని చెప్పవచ్చు. రమ మహర్షి ఆశ్రమంలో జీవ వైవిధ్యం చూడవచ్చు.

### 2. నియమము

**శ్లో॥ "శౌచ సంతోషతపః స్వాధ్యాయ ఈశ్వర ప్రణిధానాని నియమాః"**

అని యోగసూత్రాలలో పతంజలి మహర్షి చెప్పడమైనది.

### 3 ఆసనము

**శ్లో "స్థిర సుఖం ఆసనం"**

కదలకుండా నిశ్చలంగా నిటారుగా రెండుకను బొమ్మల మధ్య దృష్టిని నిలిపి సుఖంగా కూర్చునే స్థితిని ఆసనం అంటారు.

గీతలో గీతాచార్యులు ఆసనం గూర్చి

**॥శ్లో॥ శుచౌదేశే ప్రతిష్ఠాప్యే స్థిరమానస మాత్మనః గీత**
**నాత్యుచ్ఛితం నాతి నీచం చైలా జీవకుశోత్తరం॥**

పరిశుద్ధమైన నేలపై ఒక పీఠం వేసుకొని దానిమీద దర్భతో చేసిన చాప వేసుకొని దానిమీద జింక చర్మాన్ని పరచుకుని లేదా మెత్తడి వస్త్రం వేసుకొని మరీ ఎత్తుకాకుండా మరీ తక్కువ కాకుండా ఆసనా వేసుకొని పద్మాసనాగాని ఒక ఆసనంలో కదలకుండా కన్నులు మూసుకొని దృష్టిని భ్రూ మధ్య ఉంచడమే నిజమైన ఆసన స్థితి. ఈ సమయంలో శరీరం నిటారుగా ఉండాలి. కదలిక ఉండకూడదు.

॥శ్లో॥ సమంకాయా శిరో గ్రీవం ధారయన్న చలంస్థిరః
సంప్రేక్ష్య నాసికాగ్రం దిశశ్చానవలోకయన్॥ భగద్గీత- అ-6, శ్లో-13

సాధకులు ఒక గురువు ద్వారా వాటిని నేర్చుకొని అభ్యాసం చేస్తే త్వరగా అవి సాధింపబడతాయి. యోగ సాధనవల్ల మనస్సే, బుద్ధి స్థిరమై ఎటువంటి ఒత్తిడలను అయినా అధిగమించవచ్చు. ప్రాణాయామా ద్వారా 72 నాడులు శుద్ధి అవుతాయి. శరీరంలోకి గ్రంధులు చక్కగా పనిచేస్తాడు. శరీర మాధ్యమాధ్యమం ఖలుధర్మసాధనం" శరీరం వల్లనే ధర్మ సాధన చేయగలము.

## ముగింపు

కర్మను వదిలిపెట్టమని భగవద్గీతలో గీతాచార్యుడు చెప్పలేదు. చేసే కర్మ నైపుణ్యంతో, నేర్పుతో చేయమని చెప్పాడు. శీతల, ఉష్ణ, లాభం, నష్టం, మానము, అవమానము, జయం, అపజయం పట్ల సమత్వం కలిగి వుండాలని బోధించాడు. కృష్ణపరమాత్మ భీష్ములని చేత ధర్మరాజుకు ఎన్నో ధర్మసూక్ష్మాలు, యోగ రహస్యాలు బోధింపచేశాడు. ఇది గురుపరంపరను గౌరివించడం కోసం అలా చేశాడు. ఇది ఒక గొప్ప సాంప్రదాయం దేవుడైనా సరే గురువును గౌరవించాలి గురువు వద్ద సేవచేసి జ్ఞానాన్ని పొందాలని చెప్పడమే. ఈ మహా భారత పరమార్ధమని చెప్పవచ్చు.

## ఆధార గ్రంథాలు

1. శ్రీమదాంధ్ర మహా భారతము
2. పతంజలి యోగ సూత్రాలు
3. భగవద్గీత
4. శ్రీ రమణ మహర్షి లేఖలు

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 33. కవిత్రయ మహాభారతం - విశిష్టస్త్రీలు - పరిశీలన

- డా॥ జి. శ్రీనివాస్, రాజమహేంద్రవరం

**పరిచయం**

తెలుగు సాహిత్యపు విలువలను, సంస్కృతి సంప్రదాయాలను, నీతులను దేశచరిత్రను మానవ జీవన వికాసానికి అవసరమైన జ్ఞానాన్ని మనకు అందించిన మహత్తరమైన గ్రంథరాజము కవిత్రయ ఆంధ్ర మహాభారతం.

నన్నయ, తిక్కన, ఎర్రన రచించిన ఈ భారతం ఒక స్వతంత్ర కావ్యంగా నేటికి విరాజిల్లుతుంది. ఎంతో గొప్ప విజ్ఞాన సంపదను తెలుగువారికి అందించింది.

**"భారతంలో లేనిది ప్రపంచంలో లేదు**
**ప్రపంచంలో ఉన్నది భారతంలో లేకుండా లేదు"**
**"తింటే గారెలే తినాలి – వింటే భారతమే వినాలి"**

వంటి ఎన్నో నానుడులు భారతం గురించి ప్రచారంలో వున్నాయి. కవిత్రయంగా ఈ కవులు సృష్టించిన గొప్ప సంపద గొప్ప జ్ఞాన నిధి భారతం. ఏ కాలంలో నైనా ఆకాలానికి కావలసిన ఎన్నో ధర్మాలను, నీతులను, విలువలను, మానవ సంబంధాలను, రాజనీతులను అందిస్తున్న మహోత్తరమైనది. ఈ కవిత్రయ మహాభారతం.

మహాభారతాన్ని ఎన్నో మలుపులు త్రిప్పిన గొప్ప వ్యక్తులు మనకు ఇందులో కనిపిస్తారు. కాని ఈ మహాభారతాన్ని ముందుకు నడిపించడంలో విశిష్టమైన పాత్రలను పోషించి తమ జీవితాలను త్యాగం చేసిన ఎంత మంది స్త్రీలు ఇందులో కనిపిస్తారు. వారి నేర్పు, ఓర్పు, ఔదార్యం, జ్ఞానం, రాజనీతి, ధర్మనిష్టత, త్యాగం, విలువలు, ఎన్నో ఇందులో ఉన్నాయి.

అటువంటి ఉదాత్తమైన లక్షణాలతో ఆంధ్రమహాభారతంలో తమ కంటూ విశిష్ట స్థానాన్ని పొందిన కొద్ది మంది స్త్రీ పాత్రల గురించి ఈ వ్యాసంలో పరిశీలన చేద్దాం. ఈ పరిశీలన వలన ఆధునిక మహిళలు ఇంకా ఉజ్వలమైన జీవితాన్ని, చైతన్యాన్ని పొందడానికి ఆదర్శంగా నిలుస్తాయి.

**1. సత్యవతి**

మహాభారతంలో శంతనుని భార్య కౌరవ వంశమాత దాశరాజు కూతురు. ఈమెకు మత్స్య గంధ ని పేరు. ఈమెకు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అను ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె పరాశర మహర్షి వలన కృష్ణ ద్వైపాయని(వ్యాసున్ని) కంటుంది.సత్యవతి తన కుమారులకు పుత్ర సంతానం లేక భాదపడుతుంది. వంశాన్ని నిలపడం కోసం ఆమె తనకు వరం పుట్టిన వ్యాసుని పిలిచి తన కోడళ్ళకు సంతానాన్ని ఇవ్వమని అడుగుతుంది.

వ్యాసుడు తల్లి కోరిక మేరకు వారిని సంతానాన్ని ప్రసాదిస్తాడు. సత్యవతి తీసుకున్న నిర్ణయం వలనే కౌరవ వంశం నిలపబడింది. మంచి జాతిలో పుట్టిన వారి చేత 'దేవర న్యాయం' పేరిట ఇటువంటి గొప్ప నిర్ణయాన్ని తీసుకుని ఆమె కొత్త విధానానికి నాంది వేసింది. స్త్రీలలో ఇంతటి గొప్ప తెలివి, తెగువ, జ్ఞానం ఉండుట ఎంతో విశేషమైనది.

నేటి సమాజంలో మనం గమనిస్తే ఎంతో మంది ఈ రోజు వైద్యుల పర్యవేక్షణలో ఇదే పద్ధతిలో సంతానాన్ని పొందడం మనం గమనించవచ్చు. ప్రతి విషయాన్ని పురాణాల, కథల దృష్టిలో కాకుండా కొత్త శాస్త్ర సాంకేతిక పరంగా పరిశీలిస్తే ఇటువంటి ఎన్నో అంశాలు మనకు జీవితంలో ఉపయోగపడతాయి. అనుటకు 'సత్యవతి' వృత్తాంతం నిదర్శనం.

**2. అంబ, అంబిక, అంబాలిక**

**2.1 అంబ**

కాశీరాజు కూతురు ఈమె సాళ్వుడిని ప్రేమిస్తుంది. అది తెలియని భీష్ముడు బలవంతంగా తీసుకుని వెళ్ళి తన తమ్ములకు వివాహం చేయాలని అనుకుంటాడు. అంబ దానిని తిరస్కరించి తన ప్రేమ విషయం చెబుతుంది. భీష్ముడు అంబను తీసుకుని వెళ్ళి సాళ్వుడికి ఇస్తాడు. కాని అతడు స్వీకరించడు. దానికి అంబ కోపించి సన్యాసిగా మారి శివుడి గురించి తపస్సు చేసి శిఖండిగా పుట్టి భీష్ముడి చంపే వరం కోరుకుంటుంది. దాని కోసం అగ్ని ప్రవేశం చేసి మరణిస్తుంది. మళ్ళి పుట్టి కురుక్షత్రంలో భీష్ముడి చావుకు కారణం అవుతుంది.

**2.2 అంబిక, అంబాలిక**

కాశీరాజు కూతుర్లు, విచిత్ర వీర్యుని పెళ్ళి చేసుకుంటారు. పిల్లలు పుట్టక పోవడంతో చివరకు వ్యాసుని వలన పిల్లలను కంటారు. వంశవృద్ధి కోసం, అత్తగారి అనుజ్ఞతో ఇంతటి గొప్ప సాహసం చేయడం ఎంతో గొప్ప విషయం. వీరికి పుట్టిన వారే పాండురాజు, దృతరాష్ట్రుడు.

ఈ మూడు పాత్రలు ఎంతో వైవిధ్యమైనవి. స్త్రీ తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని సాధించిన వీర వనితలు పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని చరిత్రలో నిలిచి పోయారు.

**3. గాంధారి**

గాంధార రాజు కూతురు గ్రుడ్డివాడైన దృతరాష్ట్రుని వివాహం చేసుకుంటుంది. ఎంతో గొప్ప సౌందర్యవతి. కాని తన భర్త అంధుడు కాబట్టి తను కూడా జీవితాంతం అంధురాలిగానే వుండి పోతానని శపథం చేసి కళ్ళకు గంతలు కట్టుకుని జీవితమంతా అలానే వుండి పోయింది. మన సనాతన ధర్మంలో భర్త పట్ల ప్రేమ, త్యాగం కలిగి వుండటం ఇటువంటి స్త్రీ మూర్తుల జీవితాలే ఉదాహరణ.

గాంధారి గర్భవతిగా ఉన్నప్పుడు ప్రమాదం వలన పిండం క్రిందపడి బ్రద్దలైపోతుంది. దానిని వ్యాసుడు సేకరించి 101 కుండలలో ఆ పిండపు ముద్దలను పెట్టి జాగ్రత్తగా చూసుకోమని ఇందులోని పిండాలు పిల్లలుగా పుడతారని చెబుతాడు. అలాగే గాంధారి వాటిని కాపాడుతుంది. అలా పుట్టిన వారే 101 మంది కౌరవులు.

కుండలలోని అండాలు పిల్లలుగా మారిన తీరు నాటి కట్టుకథ కాదు. నేటి సైన్సుకు అదొక ఆనవాలు. మనం సరిగా మన భారతాన్ని చదివి అర్థం చేసుకుంటే ఇటువంటివి ఎన్నో మనకు కనిపిస్తాయి. గాంధారి భర్త కోసం లేని గ్రుడ్డి తనాన్ని తెచ్చుకుంది. పిల్లల కోసం ఎంతో కష్టపడి గొప్ప ఫలితాన్ని సాధించిన ఆదర్శవంతురాలు గాంధారి.

**4. కుంతి దేవి**

కుంతిభోజుని కూతురు. పాండు రాజు భార్య చిన్నతనంలో దుర్వాస మహర్షి వలన వరం పొందుతుంది. ఆ వరం వలన కోరిన దేవుడి వలన సంతానం పొందవచ్చు. ఆమెకు నిజంగా ఆ వరం పని చేస్తుందా అని సూర్యుని ప్రార్థిస్తుంది. అలా సూర్యుని వలన కర్ణునిడికి జన్మనిస్తుంది.

ఆ తరువాత పాండు రాజు చనిపోవడంతో తనకు పిల్లలు పుట్టక పోవడం వలన ఆమె దేవతలను ఉపాసన చేసి వారి వలన '5' పాండవులను పొందుతుంది. తరువాత తన పిల్లల కోసం అడవులకు వెళుతుంది. ఎన్నో అవమానాలను పొందుతుంది. తండ్రి లేక రాజ్యం లేక బాధలు పడుతున్న తన పిల్లల కోసం ఎన్నో కష్టాలు భరిస్తుంది.

ఈ కుంతి పాత్ర ఎన్నో విషయాలను నేర్పుతుంది. సంతానం కోసం స్త్రీలు పడే బాధలు, కష్టాలు, త్యాగాలు, గొప్పగా కనిపిస్తాయి. మన సమాజంలో మనం ప్రతినిత్యం కుంతి లాంటి వారిని చూస్తూనే వుంటాము. కుంతి పాత్రలో మంచి చెడులు సమాంతరంగా కనిపిస్తాయి.

**5. ద్రౌపది**

ద్రుపద మహారాజు పుత్రిక. పాండవుల సతి గొప్ప జ్ఞానవంతురాలు. స్వయం వరంలో అర్జుని భార్యగా వెళ్ళి చివరకు పంచపాండవులకు భార్యగా మారుతుంది. అప్పటి నుండి ఆమె బహు భర్తలు కలిగిన స్త్రీ గా విలక్షణమైనదిగా కనిపిస్తుంది. భారతంలో ఈమెది ఒక విశిష్టమైన పాత్ర. సత్యం, ధర్మం, తెలిపిన ప్రాజ్ఞురాలు

కౌరవ సభలో, అరణ్యవాసంలో ఎన్నో అవమానాలను భరిస్తుంది. తనకు జరిగిన అన్యాయాన్ని నిండుసభలో ధైర్యంగా ప్రశ్నిస్తుంది. తన భర్తలతో కలసి అరణ్య, అజ్ఞాతవాసాలు చేస్తుంది. శ్రీకృష్ణ రాయభారం సమయంలో తనకు జరిగిన పరాభవాన్ని గురించి చెప్పి తనకు న్యాయం చేయమని కోరుతుంది. యుద్ధము జరగాలని కోరుకుంటుంది.

ద్రౌపది సౌందర్యంలోనూ, విజ్ఞానంలోనూ, జ్ఞానంలోనూ, తిరుగులేని శక్తి కలిగిన మహాసాధ్వి. ధర్మాధర్మాలు, రాజనీతి, చతురత, అమె నైజం. ఐదుగురు భర్తలతో సంసారం చేయడం, వారితో సఖ్యతగా ఉండటం అది ఒక గొప్ప విషయం. అందుకే ఆమె గొప్ప యోధురాలు.

**6. భానుమతి**

ఈమె కాంభోజ రాజ్యానికి చెందిన రాజపుత్రిక ధుర్యోధనుని భార్య. ధుర్యోధనుడి చేసిన ఎన్నో దుర్మార్గాలను సహించింది. ఈమె భారతంలో ఎక్కడ కనిపించదు. ఆమె ప్రస్తావన చాలా తక్కువగా వుంది. కాని ఇక్కడ భానుమతి ఔదార్యం, ఓర్పు సహనం, సమయానుకూలత తన భర్త వలన పడిన కష్టాలు భానుమతి గొప్పదనాన్ని చూపిస్తాయి.

ధుర్యోధనుడి చేసిన ఎన్నో దుర్మార్గాలను ఆమె ఖండిస్తుంది. ద్రౌపదికి జరిగిన అవమానాన్ని భానుమతి సాటి స్త్రీ గా తప్పని చెబుతుంది. తన భర్త చేసిన తప్పులకు బాధపడుతుంది. ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపింది.

తండ్రి మాటను గౌరవించి స్వయంవరంలో తనకు వచ్చిన వాడిని వదలుకుని ధుర్యోధనుని పెళ్ళి చేసుకుంటుంది. పరిస్థితులకు తగినట్లుగా జీవితాన్ని మార్చుకోవడం, అర్థం చేసుకోవడం. స్త్రీలకు వుండే గొప్ప లక్షణాలలో భానుమతి జీవితం మనకు కనిపిస్తుంది.

**7 దేవకి**

దేవకుడి కూతురు. వసుదేవుడి భార్య, శ్రీకృష్ణుని తల్లి.

దేవకి జీవితమంతా చెరసాలలోనే గడిపింది. దేవకి పిన తండ్రి కంసుడు. వసుదేవుడితో వివాహం జరిగిన తరువాత వారిని రాజ్యానికి తీసుకుని వస్తున్నప్పుడు ఒక అశరీరవాణి దేవకి అష్టమ గర్భంలో జన్మించిన వాడి వల్ల మరణం వుందని చెబుతాడు. దానికి కంసుడు దేవకిని చంపబోతాడు. అప్పుడు వసుదేవుడు అడ్డుపడి పుట్టిన ప్రతిశిశువును నీకు ఇస్తామని చంపవద్దని చెబుతాడు. కంసుడు అంగీకరిస్తాడు.

అప్పటి నుండి వారికి పుట్టిన బిడ్డలను పురిటిలోనే కంసుడు చంపుతాడు. చివరకు అష్టమ గర్భంలో కృష్ణుడు పుడతాడు. వసు దేవుడు ఆ పిల్ల వాడిని నందుడి ఇంట చేర్చుతాడు.

దేవకీ మాతృ ప్రేమను పంచుకుని పుట్టిన బిడ్డలను చంపుకుని జీవిస్తుంది. స్త్రీలకు మాతృ ప్రేమకన్నా గొప్పది ఏది లేదు. అలాంటిది. కన్న బిడ్డలను చంపుతుంటే చూస్తూ వుండి పోయింది. మాతృ ప్రేమను చూపుతుంది. చివరకు కృష్ణుడు పెరిగి పెద్దవాడై వచ్చి కుంసుడిని చంపే వరకు ఆమె భర్తతో కలసి చెరసాలలో జీవించింది. ఇంతకంటే గొప్ప త్యాగం స్త్రీ లకు తప్ప ఎవరికి ఉంటుంది.

**8. యశోద**

యాదవ రాజు నందుని భార్య. శ్రీకృష్ణుని పెంచిన తల్లి, మహావిష్ణువు ద్వాపర యుగంలో కృష్ణావతారంగా ఈ భూమి

మీద జన్మించారు. ఆయన చిన్నతనం అంతా గోకులంలో గడిచింది. యశోద గోపాల కృష్ణుడికి తల్లిగా మారి పెంచింది.

తల్లి బిడ్డల బంధం బాల్యంలో ఎలా వుంటుందో యశోద కృష్ణులను చూస్తే తెలుస్తుంది. కృష్ణుని చిలిపి చేష్టలు, ఆటలు, పాటలు, గొడవలు, అలకలు, దండనలు, కోపాలు బాల్య క్రీడలు చూసి యశోద మురిసిపోతుంది. పిల్లలపట్ల తల్లులు చూపించే ప్రేమ, వాత్సల్యం యశోదను చూస్తే తెలుస్తుంది. అలా గోకులంలో ఆమే కృష్ణుని పెంచింది.

చివరకు కృష్ణుడు ఆ మహాసాధ్వి యశోద మాతకు తన నోరు తెరచి అండపిండ బ్రహ్మాండాది సకల అవతారాలను, విశ్వాసాన్ని చూపించి మోక్ష సిద్ధిని ఇచ్చాడు. అలా ఆ తల్లి యశోద చిన్ని కృష్ణుని బాల్యానికి మురిసిపోయింది. ఇప్పటికి ఆ యశోద కృష్ణుల అనురాగాలు మనకు నిత్యం మన ఇండ్లలో కనిపిస్తూనే వుంటాయి. మన ప్రతి ఇంటిలో ఒక యశోదమ్మ తప్పక వుండి తీరుతుంది.

### 9. రాధ

'రాధ' మహాభారతంలో ఒక అద్భుతమైన ప్రేమ రసమయ మూర్తి. అనురాగానికి, ప్రేమకు, స్వచ్ఛమైన అనుబంధానికి ప్రతీక. శ్రీకృష్ణుని ప్రియురాలు. ఆమె ఒక తాత్విక. బృందావనంలో కృష్ణునితో జరిపిన శృంగార రసభావాలకు, అలౌకికమైన సౌందర్యానికి రాధ ప్రేరణ ఒక భూమిక. ఒక సుందర స్వప్నం.

రాధా కృష్ణులది అచంచలమైన ప్రేమ అది కామోద్రేకం కాదు. శరీరాలకు చెందినది కాదు. అదొక స్వాప్నిక భావన. వారు జీవితమంతా ప్రేయసి ప్రియులుగానే వుండి పోయారు. ఆనంద పారవశ్యం వారి మధ్య వుంది. ఇప్పటికి ప్రేమ ప్రతి రూపంగా భావించే నిశ్చలమైన నిష్కలంకమైన ప్రేమ రాధా కృష్ణులది.

'రాధ' ప్రేమ ఒక అనంతమైన భావోద్వేగస్థితి. మాటలకు అందనిది. భారతంలో ఇంతటి గొప్పప్రేమికురాలు మనకు కనిపించదు. భాగవతంలో రాధ ప్రస్తావన ఎంతో విస్తృతంగా కనిపిస్తుంది. 'రాధ' ప్రేమకు ప్రతిరూపం. ఆ ప్రేమ మనసుకు మాత్రమే చెందినది. నేటితరం వాళ్ళు అర్థం చేసుకోవలసిన అపురూప కావ్యం 'రాధ' కృష్ణుల ప్రేమతత్వం.

### ఉపసంహారం

"కవిత్రయ మహాభారతం – విశిష్ట స్త్రీలు – ఒక పరిశీలన" అనే ఈ వ్యాసం ద్వారా మన సనాతన ధర్మాన్ని పరిరక్షించే సమస్త విలువలు కలిగిన మహాగ్రంథం చదివి ఇటువంటి ఎంతో మంది గొప్ప ఉన్నత ఆశయాలు, ఆదర్శాలు, కలిగిన స్త్రీల గురించి తెలుసుకుని ఈనాటి తరం వారు వారిని మార్గదర్శిగా భావించి ముందుకు సాగితే ఎంత గొప్పతరం మన సమాజంలో, దేశంలో, కుటుంబంలో కనిపిస్తుంది. ఈ వ్యాసం ద్వారా ఒక పరిశీలన చేసి చూపించడం జరిగింది. మారుతున్న కాలానుగుణంగా అందులోని మంచి గ్రహించవలసిన బాధ్యత, అవసరం మన మీద ఎంతైనా ఉందని నాభావన.

### ఆధార గ్రంథాలు

1. నన్నయ ఆంధ్ర మహాభారతం
2. తిక్కన ఆంధ్ర మహాభారతం
3. ఎర్రన ఆంధ్ర మహాభారతం
4. మహాభారతం పాత్రచిత్రాలు మహిళా దర్శనం – ఎన్. శాంతమ్మ
5. మహాభారతం – విశ్లేషణ – ఇండియన్ న్యూస్
6. మహాభారతం – శ్రీజయలక్ష్మీ పబ్లికేషన్స్ 2020
7. శ్రీమదాంధ్ర సంపూర్ణ మహాభారతం – వసుంధర పబ్లికేషన్స్.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 34. కవిత్రయ భారతం - రాజధర్మం

– డా॥ ఎన్.మురళి, శ్రీకాళహస్తి, –డా॥ సి.సుకుమార్ రెడ్డి, శ్రీకాళహస్తి

మహా భారతం భారతదేశ జాతీయేతిహాసం. వ్యాసుడు భారతాన్ని ఇతిహాసంగా తీర్చిదిద్దగా కవిత్రయంవారు కాంతా సమ్మితమైన కావ్యంగా రూపొందించారు. వైదిక మార్గ వర్తనాని కనుగుణమైన విషయాలేకాక సంప్రదాయ, సాంఘిక, నైతిక, రాజకీయాది అంశాలు మహాభారతంలో విపులంగా ప్రస్తావించబడ్డాయి. మహా భారతం కావ్యంగా కన్నా ఒక జాతి జీవన విధానంగా రూపం సంతరించుకొని జాతి జీవన స్రవంతిలో ఒక విడదీయలేని భాగంగా పెనవేసుకుపోయింది. భారతం లో అధిక భాగం రాజనీతికి ప్రాధాన్యం వహిస్తున్నది. మహా భారతంలో 'రాజనీతి' మకుటాయమానమైన స్థానంను పొందినది. భారత కథకు మూలస్థంభము అయిన ధర్మరాజు పేరును తిరగవేస్తే రాజధర్మంగా వస్తుంది. రాజు ఏ విధంగా వుండాలో ధర్మరాజు ఇందులో వివిధ పర్వాలలో ప్రబోధించినాడు, ఆచరించి చూపించాడు. అనుశాసనిక పర్వం నిండా నారద మహర్షి గొప్ప రాజనీతి చెప్పినాడు – భారత రాజనీతికి భారతం ఒక పట్టు కొమ్మ – రాజనీతి, రాజధర్మం – సమస్త మానవజాతి కల్యాణానికి దోహదం చేస్తుంది. ప్రమాదం నుండి ప్రజలను ప్రభుత్వంను రక్షించడమే రాజనీతి అని భారతం నిర్వచించింది. “రాజధర్మానుశాసులు రాజత్వ మూలకారణంబు ప్రజా సంరక్షయ యనిరి. కావున నెత్తెరుంగ నైనను లోక రక్షణంబు రాజున కవశ్య కర్తవ్యంబు – ఈ రక్షాధర్మాన్ని నిర్వర్తించే రాజుకు నిర్దేశకసూత్రాలవసరం – ఈ సూత్రాలన్నీ రాజనీతి శాస్త్రం అయింది. రాజ్య వ్యవస్థను అధ్యయనం చేసేది రాజనీతి శాస్త్రం ఇందులో రాజ్యావతరణ, రాజ్యలక్షణాలు, రాజ్యాధికారం, పాలనా విధానం, రాజ్యం యొక్క కర్తవ్యాలు మొదలైన విషయాలను గూర్చిన నిగూఢమైన వివరణ వుంటుంది. రాజనీతిపై మన దేశంలో వెలువడ్డ కౌటిల్యుని అర్థశాస్త్రంకు, కామందకుని నీతిసారంకు, వైశంపాయనుని నీతి ప్రకాశికకు మహాభారతంలోని శాంతి పర్వం లోని రాజనీతి మార్గదర్శకంగా వుంది. రాజులకు తపస్సులు కన్నా యజ్ఞాల కన్నా – ప్రజల పాలనయే ముఖ్యం అని చెప్పింది. రాజ్యం అనేది రాజులకు 2 రకాలుగా లభిస్తుందని – 2 ముఖ్యమైన సిద్ధాంతాలను ప్రతిపాదించింది – 1. దైవదత్తాధికార సిద్ధాంతం 2. ఒడంబడిక సిద్ధాంతం – ఈ రెండు సిద్దాంతాలపైన రాజధర్మం నిలబడి వుంటుంది.

### రాజు – రాజ ధర్మాలు – స్వరూప, స్వభావాలు

### రాజు

భారతం ప్రకారం రాజు రాజ్యానికి ప్రధానాంగం. రాజ్యం అనే రాజకీయ సౌధానికి రాజు పునాది లాంటి వాడు. రాజు లేకుండా రాజ్యం లేదు అనే విషయం శాంతి పర్వంలో చెప్పబడింది. “యథా రాజా తథా ప్రజా” అన్నట్లు పవిత్రుడైన రాజును ప్రజలు ఆరాధిస్తారు కాబట్టి రాజు పవిత్రమైన నడవడి కలిగి ఉండాలని భారతం వాంఛిస్తున్నది. నా విష్ణుః పృథివీ అని భారతం కొనియాడింది. రాజును రాజు దైవాంశ సంభూతుడు అని పేర్కొంది.

### రాజు నిర్వచనం

రాజన్ శబ్దానికి రాజ్ అంటే ప్రకాశించేదని అర్ధం ప్రజలను రంజింప చేసేవాడు కాబట్టి రాజు అని శాంతి పర్వం చెబుతుంది. రాజు అనే పదానికి గల అర్ధంను విపులంగా

**బ్రహ్మాణ క్షత్ర త్రాణ తత్పరత జేసి**
**క్షత్ర యాభిదానంబు రంజనమునెల్ల**
**ప్రజకుఁ జేయుటకతమున రాజనాలి,**
**మును బ్రవర్తిల్లి నాన్నృపాలునకు నధిప**

అని రాజు యొక్క అర్థంను గొప్పగా వివరించబడింది

**రాజుకుండాల్సిన అర్హతలు**

**కులము గలవాడు శౌర్యము**
**గలవాడును నధిక సేన గలవాడును భూ**
**తలమున రాజను నామము**
**విలసిల్లగ దాల్చు మూడు విధముల పేర్మిన్**

కులంగలవాడు, శౌర్యం గలవాడు, అధికసేనగలవాడు మాత్రమే రాజను నామానికి అర్హుడని భారతం చెప్పింది. రాచరికం ప్రకారం రాజ్య వారసత్వంతో లభించిన రాజ్యం రాజుల సొంతం కాదు. ప్రతిభతో, బలంతో రాజ్యం ను నింపుకోవాలని సూచించింది. సప్త వ్యసనాలకు కూడా రాజు దూరంగా ఉండాలి అని వివరించింది.

**రాజధర్మం – భారతం**

ధర్మశాస్త్ర మందొక భాగమైనట్టి రాజనీతి శాస్త్రానికి ఆంధ్ర మహాభారతం ప్రాముఖ్యం ఇచ్చింది. అనేక సందర్భాల్లో రాజధర్మం వివరించబడింది. రాజరికమంటే విముఖత్వాన్ని పొంది రాజత్వమంటే విరక్తి చెందిన పాండవాగ్రజుడ్ని, సింహాసనాభిముఖుని చేయడానికి ప్రవృత్తి ధర్మమైన రాజరికం యొక్క ఉత్తమ తత్వాన్ని పొంది శాంతిపర్వం ద్వితీయ, తృతీయాశ్వాసాలలో భీష్ముడు బోధించాడు. సభాపర్వంలో ధర్మరాజుకు రాజసూయ యాగం పట్ల ఆసక్తి కలిగించడానికి నారదుడు రాజ్య క్షేమాన్ని గురించి ప్రశ్నించి – రాజనీతిని ప్రబోధించాడు – ఆశ్రమవాస పర్వంలో ధృతరాష్ట్రుడు తపస్సుకై వనవాసానికి వెళ్తూ ధర్మరాజుకు రాజధర్మం చెప్పాడు – భీష్ముడు ధర్మరాజు కల ప్రతిఫలింప చేసిన రాజధర్మంలో మనుస్మృతిలోని పద్యాలు ఎక్కువగా యథాతథంగా ప్రతిఫలించాయి. – (రాజనీతి, సంవాద రూపంలో వెలువడింది. భారతం వ్యక్తి శ్రేయస్సుకన్నా సమాజ శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. భారతం ఒక ధర్మజ్యోతి – ధర్మ స్వరూపంను వివరించిన ఈ పద్యం భారతంలో మకుటయమానమైనది 81– (సారపుధర్మం). భారతామ్నాయంలో ధర్మ స్వరూపంగా, ధర్మ బోధకులుగా – శ్రీకృష్ణుడు, భీష్ముడు, విదురుడు, వ్యాసుడు, ధర్మరాజు కనిపిస్తారు.

**అర్ధ సిద్ధి కంటె నరయ నెక్కుడు ధర్మ**
**సిద్ధి దాన సకల సిద్ధులును ప్ర**
**శస్త భంగిఁ జేరు, శాశ్వత కీర్తియు**
**సంభవించు గలుగు సద్గతియును**

రాజు ధనం కంటె ధర్మానికధిక స్థానాన్నియ్యాలి. ధర్మం వల్ల సర్వ సిద్దులు చేకూరుతాయి. ధర్మ విరహితమైన అర్ద కామాలు అనర్ద హేతువు. కాబట్టి రాజుకు ధర్మ వివేచనం ముఖ్యం.

**ధర్మ మధర్మము భంగి న**
**ధర్మము ధర్మంబు మాడ్కిదనయా, తోచున్**
**నిర్మల మతి నరయ వలయు**
**ధార్మికతం గోరు వాడు తన నేర్పడగన్**

నిర్మలమైన బుద్ది కలవాడే ధర్మ నిర్ణయం చేయగలుగుతాడు. అర్ధ కామ దూషితమైన చిత్తం ధర్మాధర్మ వివేచనం చేయజాలదు. ధర్మం శక్తి వంతమైనదనీ, రాజ్యాధికారాన్ని దుర్వినియోగం చేయకుండా నిరోధించేదే ధర్మమని పై పద్యం యొక్క అభిప్రాయం లోని అంతరార్థం. అధర్మ పరుడైన వేణుడనే రాజును ఋషులు చంపినట్లు శాంతి పర్వంలో చెప్పబడింది.

**రాజధర్మం అనుసరించవలసిన దండనలు**

దండనీతి అంటే దండనను విధించే శాస్త్రం అని అర్థం. రాజనీతిలో దండ నీతి అనేది ముఖ్యమైనది. ధర్మానికి హాని కలిగినపుడు రాజ్యం దుష్ట శక్తుల చేత ఓడింపబడుతున్నప్పుడు రాజు దండ నీతిని అనుసరించాలి. 1. సైనిక శక్తి 2. అమాత్యశక్తి 3. ఐశ్వర్యశక్తి 4. ఆభిజాత్యశక్తి 5.మేధాశక్తి దండనీతిలో భాగాలు. ఇవి రాజ్య ధర్మానికి రక్షక కవచాలు లాంటివి అని మహాభారతం పేర్కొంది. శ్రీకృష్ణుడు, ధర్మ స్థాపన కోసం ఈ దండనీతిని అవలంబింప చేశాడు. – సమాజ కళ్యాణం సాధించాడు. ఈ దండనీతి రాజుకు తర తరాలుగా అందింపబడ్డ సంప్రదాయం అని రాజధర్మం నడిపిస్తున్నదని కృష్ణుడు చెప్పాడు. దండనీతిలో మరణ దండన అనేది అన్నింటికంటే క్రూరమైనది ధర్మానికి హాని కలిగించే దుష్టులకు ఇది విధించాలి.

మహాభారతం ప్రవృత్తి రూప ధర్మానికి నివృతిరూప ధర్మానికి సమ ప్రాధాన్యత ఇచ్చింది ప్రవృత్తి రూప ధర్మంలో రాజధర్మంకు ఉన్నతమైన పీఠం వేసింది. ప్రవృత్తి రూపధర్మంకు ధర్మరాజు పెట్టని కోటవంటి వాడు. సర్వ ధర్మాలు రాజధర్మమందు ఇమిడిపోయాయని భారతంలో చెప్పబడినది.

**ఏనుంగు హజ్జలో నెల్ల సత్త్వంబుల**
**హజ్జలు నడcగిన యట్ల పోలె**
**రాజితక్షత్ర ధర్మమునకు లోనయి**
**సర్వధర్మంబులుc జనుః ముఖములు**
**వేదంబు లును శుభ వృత్తంబులును దండ**
**నీతి మాసిన జెడు భూతలంబు**
**సంస్కార రహితమై చాల హీనత బొందు**
**నట్టైన బ్రజకు జేరూవహిల్లు**
**రాజులరసిన నిమ్మది బ్రదుకుcగాన**
**రాజు సర్వోత్తముడు ధర్మరాజియందు**
**రాజధర్మంబ యెక్కుడు రాజనంగ**
**ధర్మ దేవత యన వేఱ ధర్మతనయ.**

ఏనుగు పాదంలో తక్కిన అన్ని జంతువుల పాదాలు ఇమిడి పోయినట్లుగా రాజుధర్మం లో సమస్త ధర్మాలు ఒదిగి వుంటాయి. దండనీతికి నష్టం వస్తే వేదాలు నశిస్తాయి. రాజు ధర్మ స్వరూపుడు. రాజు ధర్మ దేవత ఇద్దరు ఒక్కటే. రాజ ధర్మం నశిస్తే సమస్త ధర్మాలు నశిస్తాయి అని మాంధాతృడనే రాజుకు ఇంద్రుడు రాజ ధర్మంను బోధిస్తూ చెప్పాడు. ఇదే విషయాన్ని భీష్ముడు ధర్మరాజుకు వివరిస్తాడు. ధర్మం రాజ్యానికి ప్రతిపాదిక – సంఘంలో ధర్మం ప్రవర్ధమానమవడానికి రాజు ఒక సాధనం. ఆవిధంగా రాజ్యంధర్మరాజుపై ఆధారపడి నడుస్తుంది – రాజు భూలోకంలో ధర్మావతారం. అటువంటి రాజు ధర్మంపైన అవగాహన కలిగి వుండాలి. అంటూ భీష్ముడు ధర్మరాజుతో

**ఒరు లేమేమి యొనర్చిన**
**నరవర యప్రియము దన మనంబున కగుcదా**
**నొరులకు నవి సేయకునికి**
**పరాయణము పరమ ధర్మ పదముల కెల్లన్ ॥**

ఈ పద్యం మనకు ఎదుటివారి వలన ఎటువంటి అపకారం కలిగిందో అటువంటి అపకారం వారికి మనం తిరిగి చేయకుండ వుండటమే గొప్ప ధర్మం అని భారతం ప్రభోదిస్తుంది.

## రాజధర్మంలో అనుసరించ వలసిన మిత్ర ధర్మం

రాజధర్మంలో మైత్రి బంధం అనేది ఒక ప్రముఖమైనది. ఒక రాజ్యంకు మిగిలినటువంటి రాజ్యాలతో మంచి స్నేహ సంబంధాలు వుండాలి. ఆపద సమయం లో ఈ మైత్రీ ధర్మం రాజ్యంను రక్షిస్తుంది. మహాభారతంలో మిత్ర ధర్మాన్ని గురించి ఈ విధంగా చెప్పబడింది.

**మైత్రింబోలెదు ధర్మము**
**ధా త్రదివిజులకు లేదు దాని నడిపినం**
**బుత్రా! యే కర్మంబు ప**
**విత్ర తయును వలవదది వివేకము జేర్చున్**

రాజులకు స్థిరమైన మిత్రుడు లభిస్తే కలిగే లాభం సువర్ణాదులు లభించినదాని కంటె ఎక్కువ ధర్మజ్ఞుడు కృతజ్ఞుడు, రాజు నిడ అనురాగం గలవాడు ఉత్తమ మిత్రుడని మనువు చెప్పాడు.

## రాజ్యధర్మం అనుసరించవలసిన దౌత్య నీతి

రాజకీయాలకు దౌత్య నీతి (మంత్రాంగం) మూలమని మహాభారతం చెప్తున్నది. అంతర్ రాజ్య సంబంధాలు రాజకీయాభివృద్ధికి దౌత్య నీతి మూలస్థంభం. శాంతి పర్వంలో దూత లక్షణాలను ఈ విధంగా చెప్తున్నది.

**కులము శీలంబు హిత వాక్యములను నేర్పు**
**గార్య వాదిత్వ సద్వచో గౌరవంబు**
**దలపు గలుగుట దక్షత యలఘుగణము**
**లంద్రు దూతకు నియ్యేడు నార్యజనులు**

సర్వ శాస్త్ర విశారదుడు, ఇంగితంకలవాడు, చేష్టల చేతనే భావాలను గ్రహింపగలవాడు, సమర్థుడైన దూత. దూత వలన రాజ్య కార్యాలు చక్కదిద్ద బడతాయి. రాజ్యంకు వేరొక రాజ్యంలో యుద్ధము వచ్చినప్పుడు రాయబారులు జరపడంలో ఇది ముఖ్య పాత్ర వహిస్తుంది. ఉద్యోగపర్వం లో సంజయ రాయబారం, కృష్ణరాయభారం, దౌత్య నీతిలో భాగములై పైన వివరించిన విధంగా భారతంలో రాజ్యధర్మ స్వరూపం ఉన్నది.

## ముగింపు

మహా భారతమే ధర్మ శాస్త్ర గ్రంథం అందుకే అవతారికలో నన్నయ గారు "ధర్మ తత్త్వజ్ఞులు – ధర్మ శాస్త్రంబనిరి" అని పదం ప్రయోగించారు. అధర్మం పైన ధర్మం ఎప్పుడు విజయం పొందుతుంది కాబట్టి మహాభారతంకు 'జయం' అనే పేరు ఉంది. ఇక్కడ జయం ధర్మానికీ, ధర్మ స్వరూపుడైన అచ్యుతునికీ చెందింది.

## ఆధార గ్రంథాలు

1. కవిత్రయ విరచిత (ఆంధ్రా మహాభారతం – తి.తి.దే ప్రచురణ.
2. కవిత్రయ భారతం రాజనీతి – నేతి అనంతరాయశాస్త్రి.
3. మహాభారత ధ్వని దర్శనం – శలాక రఘునాథ శర్మ.
4. ఆంధ్ర మహాభారతం (వచనం) – ఉషశ్రీ
5. ఆంధ్ర మహాభారతోపన్యాసములు – విశ్వనాథ సత్యనారాయణ.
6. మహాభారతం – మానవ స్వభావ చిత్రణ – అప్పజోడు వెంకట సుబ్బయ్య.

# 35. ఆంధ్ర మహాభారతంలోని సౌప్తిక పర్వ వైశిష్ట్యం

– గరిక రమేష్ బాబు, తిరుపతి

మహాకవిత్వ దీక్ష బూని రచించిన తిక్కన సోమయాజీ కలం నుండి జాలువారిన కావ్యాంమృతం ఆంధ్ర మహాభారతం సంస్కృతంలో వ్యాసుని చేత వ్రాయబడిన ఈ భారతం తెలుగులోనికి కవిత్రయం వారి కృషి వలన వచ్చింది. ఆంధ్ర భారతంలో అధిక భాగం తిక్కన గారు తెనుగించారు. విశ్వనాథ గారు చెప్పినట్లుగా తిక్కన తెలుగుల శిల్పంపు తోట. భారత రచన కోసం ఆయన కవితా రూపమైన తపస్సు చేశాడు. విరాట పర్వం మొదలుకొని స్వర్గారోహణ పర్వం వరకు ఏకదాటిగా 15 పర్వాలు తెలుగులోకి తీసుకొని వచ్చారు. భారతంలో 18 పర్వాలను ఆది పంచకం, యుద్ధ షట్కం, శాంతి సప్తకం అని మూడు రకాలుగా పిలిచే ఆచారం ఉంది. మహా భారతానికి మూలం పంచకం, ప్రాణం షట్కం, సారం సప్తకంగా పెద్దలు నిర్ణయించారు. యుద్ధ షట్కం భీష్మ పర్వంతో ప్రారంభమై సౌప్తక పర్వంతో ముగుస్తుంది. ఈ ఆరు పర్వాలలోను వీరరసం ప్రధానంగా వున్నప్పటికీ సౌప్తిక పర్వంలో భీభత్స రసం అంగిరసంగా కనబడుతుందనీ, ప్రముఖ సాహితీ విమర్శకులు జి.వి. సుబ్రహ్మణ్యం గారు వీర రసం అనీ గ్రంధంలో పేర్కొన్నారు.

## సౌప్తిక పర్వం అర్ధ వివరణ

సుప్తావస్థ అంటే – నిద్రావస్థ – మానవదేహానికి 4 అవస్థలుంటాయి 1. జాగ్రదవస్థ 2. స్వప్నావస్థ 3. సుప్తావస్త 4. తురీయావస్థ మొదటి 3 అవస్థలు మానవవులు అందరు అనుభవించేవవి – చివరిది అయిన తురియావస్థ యోగులు, అవధూతలు పొందే అవస్థ.

**నుత సౌప్తి కాది పర్వ**
**త్రితయంబున దనరి వసుమతీశ్వరు వరుస**
**మృతమై సౌప్తిక పర్వము**
**ప్రతిభ వినంబొలుచు దశమ పర్వంబనగన్**

అని నన్నయ సౌప్తిక పర్వం యొక్క విశిష్ఠతను చాలా గొప్పగా వివరించాడు.

తిక్కన తన భారతంను హరిహర నాధునికే అంకితం ఇచ్చాడు. హరిగా శ్రీకృష్ణుడు వ్యక్త స్వరూపం, హరుడనగా శివుడు అవ్యక్త స్వరూపం సౌప్తిక పర్వం శివుడు ఒక మహాభూతంగా అశ్వత్థామకు కనిపించి, అతనిని పరీక్షించి మహా ఖడ్గంను అనుగ్రహించి తనలోపలి సంహారకశక్తిని అనుగ్రహిస్తాడు. అందుకే మహాభారతంలో 18 రోజులు జరిగిన యుద్ధం ఒక ఎత్తు. ఆశ్వత్థామ అర్ధరాత్రి వేళ పాండవ శిబిరాలపైన పడి చేసిన యుద్ధం ఒక ఎత్తు. మృత్యుదేవతకు ప్రతిరూపంగా అశ్వత్థామ ఇందులో మనకు కనిపిస్తాడు. బ్రాహ్మణత్వపు సౌశీల్యతను విడిచి పెట్టి తన తండ్రిని చంపినాడు అన్న పగతో రాక్షసునిగా, పశువుగా ప్రవర్తిస్తాడు. అశ్వత్థామ (అనగా గుర్రం వలె అరిచేవాడు.) పశుతుల్యుడు అనే తన నామంను ఈ పర్వంలో సార్ధక్యం చేసుకున్నాడు. తిక్కన ప్రతిభ అంత ఈ పర్వమును నిర్మించడంలో దాగి వుంది. గొప్ప శిల్పాన్ని ఉపయోగించి కథా నిర్మాణం ను చేశాడు. నాటకీయతను ప్రయోగించాడు. మనకళ్ళ ముందు జరిగినట్లుగా ప్రతి ఘట్టంను సాక్షాత్కరింప జేసినాడు.

## సౌప్తిక పర్వంకు నాంది బీజం – శల్య పర్వ తుది ఘట్టం

శల్య పర్వ ఉత్తరార్ధంలో కౌరవ సైన్యం అంతా నశిస్తుంది. కౌరవ పక్షాన ముగ్గురు మిగులుతారు 1. అశ్వత్థామ 2. కృపాచార్యుడు 3. కతృ వర్మ. ద్వైపాయన హ్రదంలో దాగివున్న దుర్యోధనుని గదా యుద్ధ ధర్మానికి విరుద్ధంగా తొడలు పైన గదతో మోది భీముడు పడగొట్టినాడనీ తెలిసి మృత్యు దేవత ఒడిలోకి దుర్యోధనుడు జాఱుకొనే సమయానికి అశ్వత్థామ వెళ్లాడు. తన రాజుకు కలిగిన ఈ అవస్థను చూసి చాలా బాధపడతాడు. దుర్యోధనుడు పాండవ సంహారం చేసి నా పగను

తీర్చమని కోరుకుంటాడు. అప్పుడు అశ్వత్థామ – "యదరియందఱంబాంచాలు రాదిగాఁగ గలుగు బాంధవ మిత్ర సంఘములతోడఁగూడ నేడిదె కృష్ణుండు సూడ ద్రుంతునె" (2-412) అని శపథం చేస్తాడు. దుర్యోధనుడు తన సైన్యాధ్యక్షునిగా అశ్వత్థామను నియమించి కృపాచార్యుని చేత అభిషేకం చేయిస్తాడు. శత్రుసంహారం జరుగబోతుంది అన్న ఆనందంతో కన్ను మూసి వీరస్వర్గం చేరుకుంటాడు. తెల్లవారగానే జరిగిన వృత్తాంతం తెలుసుకొని ద్రౌపది, పాండవులు తల్లడిల్లిపోతారు. అశ్వత్థామను తనకు ప్రాణాలతో పట్టి ఇవ్వమని ద్రౌపది పాండవులను అడుగుతుంది. భీముడు రౌద్రంతో గదను భుజాన వేసుకొని అశ్వత్థామ సంహారానికి వెళ్తాడు. భీముని వెంట కృష్ణార్జునులు, ధర్మరాజు బయలు దేరతారు.

**అశ్వత్థామ బ్రహ్మ శిరోనామకాస్త్ర ప్రయోగం**

తనను చంపటానికి పాండవులు వస్తున్నారు అని భావించిన అశ్వత్థామ తన పక్కనే వున్న గడ్డి పరకపైన బ్రహ్మశిరోనామకాస్త్ర మంత్రం అభిమంత్రించి ప్రయోగించాడు, పాండవేయ గర్భలకు కూడ హాని చేయమన్నాడు. అర్జునుడు దానికి ప్రతి సంహార అస్త్రంను ప్రయోగించాడు. చివరకు భీముడు అశ్వత్థామను బంధించి ద్రౌపదిముందు పడవేశాడు. అతనిని చంపకుండా అతని శిరోరత్నంను తీసుకుంటారు. భారతంలో ఎవరినీ శపించని వ్యాసుడు అశ్వత్థామను శపిస్తాడు రక్తం, చీము, నెత్తురు కారుతూ అడవులలో చిరంజీవిగా సంచరించు అని. ఈ సందర్భంగా అల్పుడైన అశ్వత్థామకు ఇంత శక్తి ఎలా వచ్చిందో శ్రీకృష్ణుడు పాండవులకు వివరించాడు.

**సౌప్తిక పర్వ విశేషం**

ఇది భీభత్స రస ప్రధానం, ఈ భీభత్సరసానికి ప్రధమాశ్వాసం లోనే గుడ్ల గూబ, అర్ధరాత్రి కాకుల్ని అతి భయంకరంగా చంపి ఆనందించింది అనే ఘట్టంతో బీజం వేశాడు తిక్కన – ఈ పద్యం ద్వారా.

**కొన్నిటి కంఠముల్ నులుపుఁ గొన్నిటి కాళులు ద్రుంచునుగ్రతం**
**గొన్నిటి పక్షముల్ నఱకుఁగొన్నిటి పొట్టలువ్రచ్చు లీలమైఁ**
**గొన్నిటి నప్పళించు కొని కోలె ముకల్ నుఱుమాడు నిట్టుల**
**య్యన్నిటినయ్యులూకము రయంబెసగన్ వధియించె భూవరా (1-18)**

ఇందులో భీభత్సరసం. దానికి మేళవింపుగా వీరరసంను జోడించి చివరకు కరుణా రసంతో కథను ముగించాడు. ఇక్కడ తిక్కన శిల్ప వైశిష్ట్యం కనబడుతుంది.

**సౌప్తిక పర్వం లోని కథాంశం**

పాండవ శిబిరంలో విజయోత్సవంతో చేసే కోలాహలం విని తమ ముగ్గురిని పట్టుకోవటానికి వాళ్ళు చేస్తున్న శబ్దాలుగా భ్రమపడి భయంతో అక్కడి నుండి పారి పోయి నది తీరాన వున్న ఒక మర్రి చెట్టు క్రింద విశ్రమిస్తారు. మార్గాయాసం వలన కృతవర్మ, కృపాచార్యుడు నిద్రలోకి జారుకుంటారు. పగతో రగిలిపోయే అశ్వత్థామ పాండవులను ఎలా సంహరించాలా! అని ఆలోచిస్తూ వుంటాడు. ఇంతలో చీకటి పడుతుంది. ఆ మర్రి చెట్టు పైన నివాసం వుండే కాకులపైకి ఒక ఉలూకం వచ్చి దాడి చేస్తుంది. వాటిని చంపి, చీల్చి పారవేయసాగింది. అది చూసి అశ్వత్థామ తాను గూడా అలాగే పాండవులు నిద్రావస్థలో వుండగా వారిని చంపి పగతీర్చుకోవాలి అనుకుంటాడు. కృపాచార్యుని నిద్ర లేపి తన ఉద్దేశం వివరిస్తాడు. కృత వర్మ ఇది చాలా పాపం లోకం నిన్ను క్షమించదు వద్దు అంటాడు. అయినా వినడు. తనకు శత్రు సంహారం ముఖ్యం. ధర్మ, అధర్మాలకు ఇక్కడ తావు లేదు అని పాండవ శిబిరాల వైపుకు వెళ్తూ వుంటాడు. ఆ మార్గంలో ఒక మహాభూతం అశ్వత్థామకు ప్రత్యక్షమై పరీక్షిస్తుంది. అందులో అశ్వత్థామ విజయం పొందుతాడు. ఒక దివ్యమైన ఖడ్గంను అనుగ్రహిస్తుంది ఆ మహాభూతం. శివ శక్తి అతని లోకి ప్రవేశిస్తుంది. శిబిర ద్వారం వద్ద కృపాచార్య కృతవర్మలను వుంచి తాను శిబిరంలోనికి వెళ్ళి తన తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుడిని అల్లెత్రాడితో గొంతు బిగించి చంపుతాడు, ఆ రోజు

పాండవులు ద్రౌపది శిబిరంలో ఉండరు. అభిమన్యుని మరణంను జీర్ణించుకోలేని ఉత్తరను ఓదార్చడానికి విరాటనగరం వెళ్తారు. పాండవులు అనుకొని ఉప పాండవులు ఐదుగురిని చంపేస్తాడు. పాండవుల సైన్యాన్ని ఏనుగులు, గుర్రాలు, రథాలు, అన్నింటినీ విధ్వంసం చేస్తాడు.

తాను చేసిన సంహార వృత్తాంతాన్ని దుర్యోధనునికి చెప్తాడు "పుణ్యలోకమునకు బోయినప్పుడు ద్రోణుఁగాంచి నీకు ద్రోహియైన జన వినింద్య చరితుఁ జంపె దృష్ట ద్యుమ్ను ననఘ! నీతనూజుఁడనుము తొలుతన్" అని చెప్తాడు. ఆ తరువాత కాషాయ వస్త్రం ధరించి – తపోవనంకు పోయి తపోనిష్ఠలో వుంటాడు.

## సమకాలీన సమాజానికి సౌప్తిక పర్వం ఇచ్చే సందేశం

వేదవ్యాస మహర్షి ప్రవచించినట్టు – "యదిహాస్తి తదన్యత్ర–యన్నే హాస్తినతత్ క్వచిత్" భారతంలో ఉన్న విషయాలు ఈ విశాల విశ్వంలో ఎక్కడైనా ఉన్నాయి. ఇందులోలేని విశేషాలు మరెక్కడా లేవు. భారతం సమకాలీన సమాజానికి మార్గనిర్దేశం చేసే జ్ఞానమార్గాన్ని నేటి సమాజానికి చూపింది. మితిమీరిన పగ, ద్వేషం – ఎంత ప్రమాదకరమో, అవి ఎంతటి రక్తపాతాన్ని, భీభత్సాన్ని సృష్టిస్తాయో, మారణకాండకు దారితీసి నరమేధం సృష్టిస్తాయో! సౌప్తికపర్వం మనకు విపులంగా విశదీకరించింది. పగ, ద్వేషం వలన అశ్వత్థామ మానవత్వం కోల్పోయి రాక్షసునిలామారి రక్తపాతం సృష్టించి భారత చరిత్రలో అత్యంత దుష్టునిగా నిలబడి పోయినాడు. చివరకు పాండవుల చేతిలో పరాజయం పొంది వ్యాసమహర్షి శాపం వలన నేటికి కూడ బాధింపబడుతున్నాడు. శాంతమే అన్ని వేళలా వ్యక్తి, కుటుంబానికి, సమాజానికి, సామ్రాజ్యానికి శ్రేయోదాయకం అనే శాంతి సూక్తాన్ని తిక్కన మహాకవి ఈ సౌప్తిక పర్వం ద్వారా సమకాలీన సమాజానికి బోధించాడు.

విజయం కలుగగానే సంబరపడకూడదు అని వ్యసనాలకు లోను అయ్యి ఏమరుపాటుగా వుంటే శత్రువుల చేతిలో పరాభవం తప్పదు అనే సందేశం కూడా ఇచ్చాడు, ఋణశేషం, రణశేషం ఎప్పటికి ప్రమాదమే అనే తత్త్వాన్ని ఈ పర్వం ద్వారా తిక్కన సమాజానికి తెలియజేశారు. ద్రౌపది పాత్ర ద్వారా మాతృహృదయం అంటే ఎంత ఉన్నతంగా వుంటుందో వివరించాడు. తన కుమారులు ఉపపాండవులు ఐదుగురిని చంపిన అశ్వత్థామను భీముడుచంపబోతుంటే. బిడ్డలను పోగొట్టుకొన్న తల్లిపడే బాధ చాలా దారుణం. మీ గురుపత్నికి గర్భశోకం కలిగించవద్దు అని ఆమె భీమసేనుని వారిస్తుంది. నేటి సమాజంలోని ప్రతి వ్యక్తి ఈ క్షమాగుణాన్ని అలవరచుకుంటే సమాజంలో ఎటువంటి రక్తపాతము జరుగకుండా శాంతి, సుస్థిరత, శ్రేయస్సులతో ప్రజలు, దేశం సుభిక్షంగా వుంటుంది అనే సందేశాన్ని సౌప్తిక పర్వం అందిస్తుంది.

## ముగింపు

సౌప్తిక పర్వంలో అశ్వత్థామ, ద్రౌపది, భీముడు ప్రధానాంగాలుగా నిలుస్తారు అటు ప్రకృతి, ఇటు పాండవ శిబిరం సుప్తావస్థలో ఉన్నప్పుడు సాగే ఘోరం ఇందలి ప్రధానాంశముగా మారి ఆ ఘోరంకు మూలమైన అశ్వత్థామ అణచివేతతో ముగుస్తుంది. అంతేకాకుండా రాత్రి వేళ కాకుల పాలిట అరివీర భయంకరమైన ఉలూకం పగలు ఆ కాకుల చేతనే చిత్ర హింసలనుభవించడం ప్రకృతిలో కనిపించడం సహజం. అశ్వత్థామ కూడ పగలు పాండవుల చేత పరాభవం పొందుతాడు. ఇది సౌప్తిక పర్వ విశిష్ఠత, కావ్య నిర్మాణ రహస్యం. తిక్కన రచన వైశిష్ట్యంకు ఇది ఒక మచ్చుతునక.

## ఆధార గ్రంథాలు

1. కవిత్రయ విరచిత (ఆంధ్ర మహాభారతం – తి.తి.దే ప్రచురణ)
2. మహాభారతం మానవ స్వభావ చిత్రణ – అప్ప జోడు వెంకట సుబ్బయ్య.
3. ఆంధ్ర మహాభారతం (వచనం) – ఉషశ్రీ
4. తిక్కన కావ్యశిల్పము – కేతవరపు రామకోటి శాస్త్రి
5. తిక్కన చేసిన మార్పులు – ఔచిత్యపు తీర్పులు – సుమతీ నరేంద్ర.
6. కవిత్రయ భారతం ప్రతిపర్వ వివేచనం – (గల్లా చలపతి అభినందన సంచిక)

# 36. కవిత్రయ భారత సంభాషణా నైపుణ్యం - వర్తమాన సమాజం - సమాలోచన

- డా॥ జడా సుబ్బారావు, నూజివీడు, ఏలూరుజిల్లా

## 1.0. పరిచయం

ఆదికావ్యంగా ప్రసిద్ధి చెందిన మహాభారతానికి, మానవ జీవితానికి అవినాభావ సంబంధం ఉంది. లోక నీతుల్ని, లోక రీతుల్ని అత్యద్భుతంగా చిత్రించి 'మానవ మహేతిహాసం'గా ప్రసిద్ధికెక్కింది. ధర్మశాస్త్రంగా, వేదాంత గ్రంథంగా, నీతికావ్యంగా, మహాకావ్యంగా, లక్షణగ్రంథంగా, ఇతిహాస గ్రంథంగా, బహుపురాణ సముచ్చయంగా కొని యాడబడుతున్న మహాభారతం నైతిక ప్రవర్తనకు, ధర్మబద్ధ జీవితానికి పెద్దపీట వేసిందని చెప్పడం అతిశయోక్తి కాదు. మహాభారతంలో వేదార్థాలు వివరించబడడం వల్ల పంచమవేదంగా ఖ్యాతి పొందింది. ధార్మిక, అధార్మిక శక్తులకు మధ్య జరిగిన యుద్ధంలో ధార్మిక శక్తులకు విజయం లభించడం వల్ల దీనికి జయం అనే నామాంతరం కూడా కలదు.

## 1.1. కవిత్రయం

'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్' అన్నట్లు 'లోకంలో ఉన్నదంతా భారతంలో ఉంది, భారతంలో లేనిదేదీ లోకంలో లేదు' అనేంతగా ఆంధ్రమహాభారతం తెలుగుజాతి గుండెల్లో ఈనాటికీ సజీవంగా ఉంది. పద్దెనిమిది పర్వాల భారతానికి నన్నయ-తిక్కన-ఎర్రనలు ప్రాణప్రతిష్ట చేశారు. కవిత్రయంగా ప్రసిద్ధులైన ఈ ముగ్గురు మహాకవుల అపూర్వ కృషివల్ల మహాభారతం మహాకావ్యంగా గణుతికెక్కింది. తరతరాలుగా వ్యక్తిత్వ వికాసాన్ని పొందడంలో తోడ్పడుతూనే ఉంది.

### 1.1.1. నన్నయ

పదకొండో శతాబ్దంలో నన్నయ ఈ కావ్యరచనకు పూనుకుని 'ఆదికవి'గా వినుతికెక్కాడు. రాజరాజ నరేంద్రుని కోరిక మేరకు నన్నయ సంస్కృత భారతాన్ని తెలుగులోకి అనువాదం చేశాడు. అయితే నన్నయ్య దానిని స్వతంత్ర కావ్యంగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. తెలుగువారి సంప్రదాయాల్ని, ఆచారాలను, అలవాట్లను మొత్తంగా సమాజ నిర్మాణాన్ని కళ్లకు కట్టినట్లుగా చిత్రించాడు.

ఆంధ్రశబ్ద చింతామణిలాంటి వ్యాకరణ గ్రంథమే కాకుండా ఆంధ్రజాతి సర్వస్వంగా భారతాన్ని మలిచాడు. ఆది, సభా, అరణ్యపర్వాలే రాసినప్పటికీ కథాకథన పద్ధతికి ప్రారంభోత్సవం చేశాడు. తెలుగుజాతికి నీతుల్ని బోధించే ఎన్నో వేల కథల సమాహారంగా భారతాన్ని తీర్చిదిద్దాడు. అక్షరరమ్యత, ప్రసన్నకథా కలితార్థయుక్తి, నానారుచిరార్థ సూక్తిని కావ్యంలో ప్రవేశపెట్టాడు. సామాన్య జనవ్యవహారంలో ఉన్న పదాలను సేకరించి, సంస్కరించి వాటికి కావ్యంలో సముచిత స్థానం కల్పించాడు. వ్యక్తుల నైతిక ప్రవర్తనకు, ధర్మబద్ధ జీవితానికి, మంచిచెడుల విశ్లేషణకు అధిక ప్రాముఖ్యతకు కావ్యంలో చోటు కల్పించాడు. శబ్దస్వరూపంలోను, వాక్య నిర్మాణంలోనూ ఒక పద్ధతి లేకుండా ఉన్న భాషను సుశబ్దశోభితంగా, నియతరూపంతో కావ్యభాషకు అనుకూలంగా మార్చి వాగనుశాసనుడు, శబ్దశాసనుడు అనే బిరుదులు పొందాడు నన్నయ.

### 1.1.2. తిక్కన

ఉభయ కవిమిత్రుడుగా ప్రసిద్ధుడైన తిక్కన మనుమసిద్ధి ఆస్థానకవి. 13వ శతాబ్దానికి చెందిన తిక్కన తొలి రచన నిర్వచనోత్తర రామాయణం. నన్నయ వేసిన మార్గాన్ని పాటిస్తూనే కావ్య రచనలో తన విలక్షణతను కనపర్చాడు. అసమానమైన తన ప్రతిభతో కావ్యాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. 'మామా' అని పిల్చే మనుమసిద్ధికి తన నిర్వచనోత్తర రామాయణాన్ని అంకితం ఇచ్చాడు. నన్నయ కాలంలో చెలరేగిన బౌద్ధ, జైనమతాల ఘర్షణలను రూపమాపడానికి వైదిక మతాన్ని బోధించడానికి భారత రచన చేపడితే, తిక్కన తన కాలంలో చెలరేగిన శైవ వైష్ణవ భేదాలను రూపుమాపడానికి హరిహరనాథతత్వాన్ని ప్రతిపాదించాడు.

విరాటపర్వం మొదలుకొని స్వర్గారోహణపర్వం వరకు మొత్తం పదిహేను పర్వాల భారతాన్ని ఒంటిచేత్తో రచించి కవిబ్రహ్మగా వినుతికెక్కాడు. 'ఆంధ్రావాళి మోదమొందు'నట్లుగా భారతాన్ని రచించాడు. తెలుగుభాషమీద అత్యంత అనురక్తినీ, తెలుగు పలుకుబళ్లమీద అసమాన అభిమానాన్ని ప్రకటించాడు. మానవ మనస్తత్వంలోని విభిన్న కోణాలను, వైరుధ్యాలను, విలక్షణతను ఆయా పాత్రల స్వభావాల ద్వారా తేటతెల్లం చేశాడు. కావ్యాన్ని కళ్లకు కట్టినట్లుగా దృశ్యమానం చేయడంలో నాటకీయ శిల్పాన్ని వాడి అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు తిక్కన.

### 1.1.3. ఎఱ్ఱన

పద్దెనిమిది పర్వాలను తెనిగించడానికి పూర్తి ప్రణాళికను సిద్ధంచేసుకున్నా దురదృష్టవశాత్తు రెండున్నర పర్వాల అనువాదంతోనే నన్నయ కలం ఆగిపోయింది. మిగినల పదిహేణు పర్వాల భారతాన్ని తిక్కన పూర్తిచేశాడు. మూడవ పర్వం సగంలో ఆగిపోయిన భారతాన్ని తన ప్రతిభతో పూర్తిచేసి కవిత్రయంలో చోటు సంపాదించిన ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడిగా కీర్తిగాంచాడు. ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవిగా ప్రసిద్ధుడైన ఎఱ్ఱన భారతానికి తన వంతు పాత్ర పోషించడంలో ప్రముఖ పాత్ర వహించాడు.

ప్రబంధశైలికి ఆద్యుడిగా కీర్తించబడ్డాడు. వర్ణనా కౌశలంతో పాటు చతురోక్తులను కావ్యంలో ప్రయోగించాడు. మధురోక్తులతో కావ్యాన్ని పరిపుష్టం చేశాడు. అందుకే ఎఱ్ఱన గురించి చెప్తూ "ఎఱ్ఱన మహాకవి రచన నన్నయ, తిక్కనల త్రోవలను తప్పిపోవక అటనట వర్ణనలు కథాభావములందు సరళముగా, శిథిల మధురమగు నడకతో మాఘమాసపు సరస్వతీ ప్రసన్నతతో మృదువుగా చదువరులను ఆకర్షించును' అంటారు శిరోమణి వేదాల తిరువేంగళాచార్యులు.

### 1.2. కవిత్రయ భారత సంభాషణా నైపుణ్యం

మానవ ధర్మబద్ధ జీవితానికి అవసరమైన అన్ని విషయాలను పొందుపర్చిన మహాభారతం ఎంతో ప్రశస్తి పొందిన గ్రంథం. ఎన్నో పాత్రలతో, అద్భుతమైన సంభాషణలతో మానవ జీవన వికాసానికి అవసరమైన అన్ని అంశాలకు ప్రాధాన్యతను చేకూర్చింది. నన్నయ, తిక్కన ఎఱ్ఱనలు సంతరించిన మహాభారతంలో ఆయా సందర్భాలలో ప్రసిద్ధి చెందిన సంభాషణలను కొన్ని పాఠాల ద్వారా తెలియజేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యంగా భావిస్తున్నాను.

### 1.2.1. నన్నయ సంభాషణా నైపుణ్యం

మహాభారతంలోని ఆదిపర్వం తృతీయాశ్వాసంలో ఉన్న యయాతి పాఠ్యభాగం ఎంతో విశిష్టమైంది. పరిపాలించే మాహారాజుకు మాత్రమే కాకుండా పాఠకులు కూడా నేర్చుకోదగిన ఎన్నో గొప్పగొప్ప అంశాలను నన్నయ ఈ పాఠంలో పొందుపర్చాడు. యయాతి మహారాజు తన కొడుకైన పూరునికి రాజ్య పట్టాభిషేకం చేస్తూ ఎన్నో నీతుల్ని బోధించాడు. తల్లిదండ్రుల పట్ల కొడుకుల బాధ్యతను గుర్తుచేస్తూనే ఎవరితో ఎలా మాట్లాడాలో వివరంగా బోధిస్తాడు. వ్యక్తిత్వ వికాసానికి, సంభాషణా నైపుణ్యాన్ని పెంపొందించుకోడానికి ఈ పాఠ్యభాగం ఎంతో ఉపయోగపడుతుంది.

**మనమునకు బ్రియంబును హిత**
**మును బథ్యము తథ్యమును అమోఘము మధురం**
**బును బరిమితమును అగు పలు**
**కొనరగ పలుకునది ధర్మయుతముగ సభలన్**

మహారాజు కాబోతున్న కొడుకు పూరుడికి ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియజెప్పే పద్యం ఇది. మన గురించి ఎదుటి వ్యక్తికి తెలియజెప్పేది మన మాటతీరు. ఎలాంటి సందర్భమైనా మనం నలుగురిలో ఉన్నప్పుడు మన మాటతీరు ఎంత జాగ్రత్తగా ఉండాలో చెప్తున్నాడు.

సంభాషణ అనేది మనిషికి దేవుడిచ్చిన వరం. మన మాటతీరు వల్ల మిత్రులైనా, శత్రువులైనా కలుగుతారు. మన వ్యక్తిత్వం ఎలాంటిదో మన మాటలవల్ల తెలుస్తుంది. ఉత్తమ సంస్కారవంతుడైన మనిషి మాటను ఇతరుల ప్రయోజనాలకు ఉపయోగిస్తాడు. మూరు?డైన మనిషి తన మాటతీరును మానవ వినాశనానికి ఉపయోగిస్తాడు. మహాభారతంలో ఈ రకమైన మాటతీరు కలిగిన పాత్రలెన్నో మనకు దర్శనమిస్తాయి. అజాతశత్రువుగా పేరుపొందిన ధర్మరాజు తన మాటతీరు వల్ల ఎంతోమందికి ఆదర్శవంతుడయ్యాడు. తన అహంకార పలుకుల వల్ల దుర్యోధనుడు పెద్దలను అవమానించాడు.

కేవలం సభలలోనే కాకుండా ఎవరితో మాట్లాడినా ఇతరులకు మేలు కలిగించే మాటలు మాట్లాడాలి. ఇష్టంతో కూడిన మాటలే మాట్లాడాలి. సత్యంతో కూడిన మాటల్ని, విసుగు తెప్పించేలా విస్తృతమైన మాటల్ని మాట్లాడకూడదు. ధర్మయుక్తమైన మాటల వల్ల ఇతరులు కూడా ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి ఉత్సుకత చూపుతారు. అన్నింటినీ మించి మన మాట 'పరిమితం'గా ఉంటే ఎంతో మేలు. అపరితమైన మాటలు, అనవసరమైన మాట్ల వల్ల వివాదాలకు దారితీస్తాయి. యుద్ధాలకు దారితీస్తాయి. అదుపులో లేని మాటలు ఎన్నో అనర్థాలను కలుగుతాయి. కనుకనే మనసుకు ఇష్టమైన మాటలు మాట్లాడాలి.

అంతేగాక మన మాటలు ఇతరులను గాయపర్చేవిగా ఉండకూడదని చెప్తూ "వదన బాణాసన వ్యక్తముక్తములైన పలుకులన్కడు వాడి బాణతతుల' అంటాడు నన్నయ. ముఖమనే విల్లునుండి వెలువడే మాటలు ఇతరుల హృదయాలను చీల్చి వాళ్లను మానసికంగా ఎంతగా బాధపెడతాయో చెప్తున్నాడు.మనిషిలో మంచితనం వెల్లివిరియడం, మానవత్వం పొంగిపొర్లడం మాటల వల్లే సాధ్యమవుతాయి. కనుక ఇతరులను బాధించడానికి కాకుండా ఇతరులకు ప్రయోజనాన్ని కలిగించడానికి మాటను వాడడం మానవ మనుగడకు మేలు చేకూర్చుతుంది.

యయాతిని మానవజాతికి ఒక ఉత్తమపాత్రగా చెప్తూనే పెద్దల ముందు ఎలా ప్రవర్తించకూడదో కూడా నన్నయ ఈ పాఠ్యభాగంలో చెప్తాడు. ఎన్నో సంవత్సరాలు ఘోరమైన తపస్సు చేసి ఇంద్రలోకానికి చేరుకుంటాడు. యయాతిని గౌరవించిన ఇంద్రుడు నువ్వు ఎంతో పుణ్యాత్ముడవు, ఇన్నివేల సంవత్సరాల నీ తపస్సుకు కారణం చెప్పమని అడిగితే దానికి సమాధానంగా తనలోని అహంకారాన్ని ఈ కింది పద్యంలో ఇలా చెప్తాడు యయాతి.

**అమరవిభుండు దాని విని యల్గి 'మదంబున నుత్తమావమా**
**నము దగునయ్య చేయ' నని నన్ను నధోభునవ ప్రపాతన సం**
**భ్రమ వివశాత్ము జేసి నది పాడియ యెందును నల్పమయ్యు ద**
**ర్పము బహుకాల సంచిత తపః ఫలహాని యునర్చకుండునే**

మన మాటతీరు గర్వంతో ఉంటే మనకొచ్చే ఉత్తమ గతులను ఎలా పోగొట్టుకుంటామో పై పద్యం చెప్తుంది. మనలోని వినయం మన మాటతీరుకు మరింత బలం చేకూర్చుతుంది. ఇంద్రుడికి యయాతి చెప్పిన సమాధానం గర్వంతో కూడుకున్నది. అహంకార పూరితమైంది. ఇతరులను కించపరుస్తూ మాట్లాడే మాటలవల్ల మన గౌరవాన్ని మనమే పోగొట్టుకుంటాము. శత సహస్ర సంవత్సరాలు తపస్సు చేసి ఎన్నో గొప్ప పుణ్యలోకాలలో ప్రవేశం పొందిన యయాతి ఇంద్రుడితో అహంకార పూరితంగా మాట్లాడి ఇంద్రలోకంలో నివాసాన్ని పోగొట్టుకున్నాడు. కనుక మనం చిన్నదైనా, పెద్దదైనా ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఇతరులతో వ్యవహరించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలనే విషయాన్ని నన్నయ యయాతి హితవు పాఠ్యభాగం ద్వారా చెప్తాడు. ఈ పాఠ్యభాగం ద్వారా వర్తమాన సమాజంలోని మనుషులు ఎన్నో విషయాలను నేర్చుకుని తమను తాము ఉన్నత సంస్కారం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దుకుంటారు.

### 1.2.2. తిక్కన సంభాషణా నైపుణ్యం

'అల్పాక్షరముల ననల్పార్థ రచన' చేసిన తిక్కన సంభాషణలు లోక ప్రసిద్ధమే. మన మాటతీరైనా, ప్రవర్తనైనా శ్రు

తిమించకుండా ఉండడం అనే విషయాలను తిక్కన భారతం తెలియజేస్తుంది. పదిహేను పర్వాల తిక్కన భారత రచనలోని ప్రతీ పద్యం అనర్ఘరత్నమే. పాత్ర చిత్రణలోనూ, సంభాషణాశైలిలోనూ తిక్కన ఆరితేరిన కవి. నాటకీయశిల్పాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దిన ఉభయకవి మిత్రుడుగా తిక్కన ప్రసిద్ధుడు. ఈ కింది పద్యాల ద్వారా తిక్కనలోని మనస్తత్వ విశ్లేషణను, సంభాషణా చాతుర్యాన్ని తెలుసుకోవచ్చు.

ఆంధ్రమహాభారతంలోని శాంతిపర్వం తృతీయాశ్వాసంలో ఉన్న వ్యాఘ్రగోమాయు సంవాదం అనే పాఠ్యభాగం ఎంతో ప్రసిద్ధి చెందింది. మానవ మనస్తత్వ విశ్లేషణలోని భిన్నకోణాలను చిత్రిక పట్టిన పాఠ్యభాగం. పులికి, నక్కకు మధ్య జరిగిన సంభాషనే అయినా ఇందులో తిక్కన సంభాషణా నైపుణ్యం ద్యోతకమవుతుంది. లోకంలో మన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న ఎంతోమంది సజ్జన, దుర్జనులను గుర్తించడానికి ఈ పాఠ్యభాగం ఎంతో ఉపయోగపడుతుంది. ఆలోచనారహితమైన చేష్టల వల్ల ఎదురయ్యే అవాంతరాలు, చెప్పుడు మాటలవల్ల కలిగే దుష్పరిణామాల్ని చెప్తూనే మానవజాతికి అవసరమైన లౌకికజ్ఞానాన్ని కలిగిస్తుంది.

**"బుద్ధిమంతుని వలన దుర్బుద్ధి లధికు/ వలన హీనుడు రూపసి వలన గొనటి**
**వా రసూయలు సేయుదు రీరసమున / నింత యెరుగంగ వలవదె యూవు కొడుక"**

పురిక నగరంలో పౌరికుడు తన క్రూరకర్మల వల్ల మళ్లీ జన్మలో నక్కగా జన్మించి సాధిజీవిగా జీవిస్తుంటాడు. మాంసం తినకుండా రాలిన పళ్లను తింటూ మునిలాగా జీవిస్తుంటాడు. ఈ నక్క గురించి విన్న పులి దానితో స్నేహం చేసి తనకు మంచీచెడూ చెప్పడానికి మంత్రిలా నియమించుకుంటుంది. కాలక్రమంలో పులి తన మూలభృత్యుల చెప్పుడు మాటలు విని నక్కను చంపమని ఆజ్ఞాపిస్తుంది. ఆ మాటలు విన్న పులి తల్లి పులితో పై పద్యం చెప్తుంది.

లోకంలో మనుషులు భిన్న రకాలుగా ఉంటారు. పైకి సున్నితంగా లోపల కఠినంగా ఉంటారు. ధర్మయుతంగా ప్రవర్తిస్తున్నట్లుగా ఉంటూనే ఎన్నో అధర్మ కార్యక్రమాలకు పాల్పడుతుంటారు. అందుకే బుద్ధిమంతుల్ని లోకం ఓర్చుకోలేదని, ధనవంతుల్ని, అందంగా ఉన్నవాళ్లను చూసి లోకం అసూయపడుతుందని చెప్తుంది. ఏది మంచి, ఏది చెడో గ్రహించే క్రమంలో మనుషులు తమ విచక్షణాజ్ఞానాన్ని ప్రదర్శించాలనే నీతిని బోధిస్తాడు తిక్కన. అంతేకాకుండా ముందు అవమానించి, తర్వాత అక్కున చేర్చుకునే వ్యక్తుల మనస్తత్వాన్ని, సంభాషణను ఈ కింది పద్యంలో చెప్తాడు.

**అనవుడు నక్క రాబనిచి యప్పులి కౌగిట జేర్చి బాష్పము**
**ల్గనుగవ గ్రమ్మనుం బలుకులం దగ బెద్దయు గారవించిన**
**'న్వినుము మృగేంద్ర! మున్నటుల నీవు సభన్ నను వీడు మంచివా**
**డని కొనియాడి యిప్డు దెగటార్చితి పెంపును నాదు మానమున్**

తల్లి మాటలు విన్న పులి నక్క విషయంలో తన తొందరపాటును గమనించి తిరిగి నక్కను పిలిపించి తన తప్పును క్షమించమంటుంది. దానికి సమాధానంగా నక్క తొందరపాటుతోనో, అహంకారంతోనో, గర్వం వల్లనో ఎదుటి వ్యక్తుల్ని అవమానించి తర్వాత జరిగిన తప్పుకు క్షమాపణలు వేడుకోవడం మంచిది కాదని చెప్తుంది. ఎవరూ తమ వ్యక్తిత్వాన్ని చంపుకుని అహంకారుల వద్ద, నోటిదురుసు వున్న వ్యక్తుల దగ్గర పనిచేయరు. అనాలోచితంగా మాట్లాడకూడదనే విషయాన్ని ఈ పాఠ్యభాగం ద్వారా చెప్తాడు తిక్కన. పైకి ప్రేమను ప్రకటిస్తూ లోపల అసూయతో రగిలిపోయేవారికి చెంపపెట్టులా ఈ పాఠ్యభాగాన్ని తీర్చిదిద్దాడు.

### 1.2.3. ఎర్రన సంభాషణా నైపుణ్యం

'స్ఫురధరుణాంశు రాగ రుచి' అనే పద్యంతో భారతాంధ్రీకరణ ప్రారంభించిన ఎర్రన ప్రబంధ పరమేశ్వరుడిగా

పెరుపొందాడు. భారత అరణ్యపర్వంలోని ఉపాఖ్యానాలను స్వతంత్ర ప్రబంధాలుగా రచించడంలో ఎర్రన ప్రతిభ తేటతెల్లమవుతుంది. శ్రీ మదాంధ్ర మహాభారతం అరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంలో ఉన్న సావిత్ర్యుపాఖ్యానం ఎంతో ప్రసిద్ధి చెందిన పాఠ్యభాగం. తన మాటతీరుతో, వాక్చాతుర్యంతో పోయిన భర్త ప్రాణాలను తిరిగి తెచ్చుకున్న సావిత్రిని ఎర్రన మనకు ఉన్నతంగా పరిచయం చేస్తాడు.

జీవితంలో త్రికరణ శుద్ధి కలిగిన వారు ఎలాంటి పనినైనా సాధించగలరనే మంచి సందేశంతో పాటు సంభాషణా చాతుర్యంతో ఎలాంటి వారినైనా మెప్పించగలమని ఈ పాఠ్యభాగం తెలియజేస్తుంది. మనుషుల్లోని ఆత్మ విశ్వాసం, ఆత్మస్థైర్యం, సద్గుణాలు, వినయం అనే లక్షణాలు వారిలో ధైర్యాన్ని నింపుతాయని, ఎలాంటి కష్టాన్నైనా సహించే శక్తినిస్తాయని చెప్తుంది.

మనసులో సత్యవంతుడే తన భర్త అని త్రికరణశుద్ధిగా నమ్ముతుంది సావిత్రి. అందుకే పెళ్లైన సంవత్సరానికి సత్యవంతుడు చనిపోతాడని తెలిసినా అతన్ని వివాహం చేసుకుంటుంది. సంవత్సరం గడిచిన తర్వాత సత్యవంతుడికి మరణం ఆసన్నమవుతుంది. ఒకరోజు అడవికి సావిత్రితో కలిసి వెళ్ళిన సత్యవంతుడు సొమ్మసిల్లి పడిపోతాడు. భయపడిన సావిత్రి ఎక్కడా తన ధైర్యాన్ని కోల్పోకుండా భర్త ప్రాణాలను తీసుకెళ్లడానికి వచ్చిన యమధర్మరాజును చూస్తుంది. యమధర్మరాజు సత్యవంతుడి శరీరంలోని జీవుడిని పరిగ్రహించి వేగంగా దక్షిణదిక్కుగా వెళ్తుంటాడు. అది గమనించిన సత్యవంతుడి దేహాన్ని ఒకచోట దాచిపెట్టి యమధర్మరాజును వెంబడిస్తుంది. దానిని చూసి యమధర్మరాజు 'ఈ విధంగా నన్నెందుకు వెంబడిస్తున్నావు? ఈ దారి నువ్వు రావడానికి అనుకూలమైనది కాదు' అని చెప్తాడు. దానికి సమాధానంగా సావిత్రి చెప్పిన ఈ కింది పద్యం ఆమెలోని అసమాన ధైర్యసాహసాలతో పాటు సంభాషణా నైపుణ్యాన్ని వ్యక్తపరుస్తుంది.

**పతులెదు జనిన నచటికి / సతులుం జనవలదె? నీ ప్రసాదమునను మ**
**త్పతి భక్తి కతమునను సం / స్తుతగుణ! నాకరుగరాని చోటుం గలదే?**

అన్ని దారులలో ముఖ్యమైన దారి ధర్మమే అనీ, ధర్మాన్ని అనుసరించి చూపేవారు సజ్జనులనీ, అలాంటి సజ్జనులలో నీవు శ్రేష్టుడవనీ యమధర్మరాజుతో పలుకుతుంది సావిత్రి. కాబట్టి సజ్జనుల సందర్శనం వ్యర్థం కాదనీ, పైగా భర్తలు వెళ్ళిన చోటికి భార్యలు కూడా వెళ్లాలనే ఆర్యోక్తి ఉంది కాబట్టి నేనెక్కడికైనా రాగలననీ ఎంతో ధైర్యంగా యమధర్మరాజుతో పలుకుతుంది సావిత్రి. మనసు ఒకటీ, మాట ఒకటి, క్రియ ఒకటి కాకూడదనీ, ఎవరి పట్లా హింసను ప్రదర్శించరాదని, దీనుల పట్ల దయ చూపించాలనీ కోరుతుంది. దానం చేసేటప్పుడు ఎటువంటి కొరతను కలిగించకుండా కోరినవారు సంతృప్తి చెందేటట్లు సంపూర్ణంగా చేయాలనీ పలుకుతుంది.

ఏదైనా పనిని సాధించాలంటే ఎంత పట్టుదల ఉండాలో ఈ ఉపాఖ్యానం తెలియజేస్తుంది. ఎటువంటి ఆపద ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలనీ, మంచిగా మాట్లాడి మన కార్యాన్ని సాధించుకోవాలని తెలియజేస్తుంది. పెద్దలతో మాట్లాడేటప్పుడు ఎలా వ్యవహరించాలో ఇందులో ఉన్న పద్యాల ద్వారా తెలియజేస్తాడు ఎర్రన.

వయసులో చిన్నదైనా ఎన్నో ధర్మ సూక్ష్మాలను చెప్తున్న సావిత్రి సంభాషణా చాతుర్యానికి ఆశ్చర్యపోతాడు యమధర్మరాజు. అయినా 'భర్త ప్రాణాలను' తప్ప దేన్నైనా కోరుకోమంటాడు. రాజ్యాన్ని కోల్పోయి అడవుల్లో బతుకుతున్న అత్తమామలకు పూర్వవైభవం ప్రసాదించమని కోరుతుంది. దానికి అంగీకరించిన యమధర్మరాజు సత్యవంతుడి ప్రాణాలను తిరిగి ఇవ్వడానికి ఒప్పుకోడు. ఆ సందర్భంలో సావిత్రి పలికే ఈ కింది పద్యం భర్త పట్ల అనురాగాన్ని, సంభాషణలోని త్రికరణశుద్ధిని మనకు తెలియజేస్తుంది.

**పతి విరహంబు దుస్సహము, భర్తృ వినాకృతయైన కాంత దూ**
**షిత యగు సర్వమంగళ విశేషములందును గాన మత్ప్రియుం**

**దతులిత కీర్తిశాలి సుగుణాఢ్యుడు సాళ్వసుతుండు లబ్ధ జీ**
**వితుడుగ నిమ్ము ధర్మ పదవీ పరిరక్షణా! పుణ్య వీక్షణా!**

భర్త పట్ల స్త్రీకి ఉండే సహజమైన అనురక్తినీ, అవ్యాజమైన ప్రేమను తెలియజేస్తూనే, భర్త లేని జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో చెప్పడం సావిత్రిలోని సంభాషణా చాతుర్యానికి నిదర్శనం. భర్తను కోల్పోయిన స్త్రీ సంఘంలో ఎంతగా నిరాదరణకు గురవుతుందో, శుభకార్యాలకు వెళ్ళే అవకాశాన్ని ఎలా కోల్పోతుందో తన మాటల ద్వారా యమధర్మరాజుకు తెలియజేస్తుంది. స్త్రీలు మానవతులనీ, భర్తను కాపాడుకోవడానికి ఎంతకైనా తెగిస్తారనీ చెప్పడం వెనుక ఎర్రనలోని సంభాషణాశైలి గూఢమై ఉంది.

**ముగింపు**

తెలుగుజాతికి జీవనాడిని అందించిన ఉత్తమగ్రంథం మహాభారతం. ఎన్నో ఉపాఖ్యాల ద్వారా మానవాళి జీవన రీతులకు, నీతులకు సంబంధించిన ధర్మాలను పొందుపరిచింది. ధర్మార్థ కామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను మానవ జీవితానికి అన్వయించి అరిషడ్వర్గాలను అదుపులో పెట్టుకోకపోతే కలిగే దుష్పరిణామాలను విశదీకరించిన మహాభారతం ఎన్ని వందల సంవత్సరాలు గడిచినా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే ఉంది. పద్దెనిమిది పర్వాలతో మహాభారతాన్ని మహోత్కృష్టంగా తీర్చిదిద్దిన కవిత్రయం ప్రతిభ లోకానికి తేటతెల్లమవుతూనే ఉంది. మానవుల్లోని న వా జ వై న భావోద్రేకాలను అత్యంత సహజమైన సంభాషణలతో రచించిన కవిత్రయం తెలుగుజాతికి మహోపకారం చేశారని చెప్పడం అతిశయోక్తి కాదు.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతము (సరళ వ్యాఖ్యాన సహితం), సంపుటం-1, 2013, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.
2. ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, చతుర్థాశ్వాసం, వావిళ్ల రామస్వామి శాస్త్రులు & సన్స్, చెన్నపురి.
3. కవిత్వంలో వ్యక్తిత్వ వికాసం-2, ద్వానాశాస్త్రి, సుజనరంజని మాసపత్రిక, ఏప్రియల్, 2007.

# 37. మహాభారతంలో యయాతి హితవు - సామాజిక సందేశం

- డా॥ పలివెల చిరంజీవిరావు, శ్రీకాకుళం

వ్యక్తిత్వవికాసం పొందడానికి, సంభాషణా విధానాన్ని తెలుసుకోవటానికి, మానవ సంబంధాలను అర్థం చేసుకోవటానికి, సద్గుణాలను పెంపొందించుకోవటానికి, అహంకారం వల్ల కలిగే అనర్థాన్ని గ్రహించటానికి, నా వ్యాసం ఒక దిక్సూచిగా పనిచేస్తుంది. అంతేగాక ఈ వ్యాసం వల్ల తండ్రికుమారుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేది తెలియజేస్తుంది. తండ్రికి కలిగిన ఎటువంటి కష్టాన్నైనా తీర్చటానికి సంసిద్ధుడయ్యే కుమారుడే అసలైన పుత్రుడు. అలాంటివాడే తండ్రి సంపదకూ నిజమైన వారసుడని కూడా తెలుపుతుంది. తండ్రి మంచిచెడ్డలు చూడలేని పుత్రుడు తండ్రి ఆస్తిని మాత్రం తీసుకోవడానికి ఎలా అర్హుడవుతాడని ప్రశ్న తలెత్తుతుంది. నిజంగా ఈ కాలంలో తల్లిదండ్రుల కష్టసుఖాలను పట్టించుకోకుండా వారి సంపాదనను మాత్రం అనుభవించాలని చూసే కుమారులు మనకు తారసపడుతున్నారు. మహాభారతంలో యయాతి పాత్ర ద్వారా గుణపాఠంగా నేర్పుతుంది. తల్లిదండ్రులు పట్ల కుమారులు తీసుకోవలసిన బాధ్యతను గుర్తుచేస్తుంది. ప్రతివ్యక్తి నిజజీవితంలో ధర్మాన్ని ఎలా గ్రహించాలి. ధరాన్ని ఎలా ఉపయోగించుకోవాలి. ఎవరితో ఎలా మాట్లాడాలో, ఎలాంటి సద్గుణాలను అలవరచుకోవాలో మొదలైన అంశాలు తెలియపరుస్తుంది యయాతి హితవు.

**కావ్య పరిచయం**

మన భారతీయ సాహిత్య చరిత్రలో మహాభారతం మొదటి కావ్యం కాకపోయినా మొదట అధ్యయనం చేయవలసిన గ్రంథం మహాభారతమే. ఎందుకంటే అది మన జాతీయకావ్యం (National Epic) ఈ గౌరవం ఈ కావ్యానికి లభించడానికి గల కారణం ఇది భరతుని చరిత్ర కలిగి ఉండడమే. భరతుడు మన దేశాన్ని పరిపాలించాడు. అందువల్ల మనదేశానికి భారతదేశమనే పేరు వచ్చింది. అలాగే భరతుని చరిత్ర కలిగినది భారతం అయింది.

**కవి పరిచయం**

సంస్కృతంలో వ్యాసమహర్షి రచించిన మహాభారతాన్ని రాజరాజనరేంద్రుని కోరికపై నన్నయ్య తెలుగులో అనువదించారు. ఈయన క్రీ.శ. 1053 ప్రాంతంలో రాజమహేంద్రవరం రాజధానిగా వేంగి దేశాన్ని పరిపాలించిన చాళుక్యరాజైన రాజరాజనరేంద్రుని ఆస్థానకవి నన్నయ రాజరాజనరేంద్రుని కోరికపై మహాభారతాన్ని అనువదించడానికి పూనుకున్నారు. తెలుగులో మొట్టమొదట కావ్యరచనకు శ్రీకారం చుట్టినందుకు తెలుగువారు నన్నయను ఆదికవిగా పేర్కొంటారు. నన్నయకు పూర్వం తెలుగుభాష శబ్దస్వరూపంలోను, వాక్యనిర్మాణంలోను నిర్దిష్టమైన పద్ధతిలేక అస్తవ్యస్థంగా ఉండేది. దాన్ని ఉన్నయ సుశబ్దశోభితంగా, నియతరూపంతో కావ్య నిర్మాణానికి అనువైన భాషగా తీర్చిదిద్దాడు. అందుకే ఆయనకు శబ్దశాసనుడు, వాగనుశాననుడని బిరుదులేర్పడినాయి

మహాభారతాన్ని వ్యాసమహర్షి 18 పర్వాలలో సంస్కృతంలో రచించారు. ఇందులో ఆయన ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే వాటిని సాధించటానికి అవసరమయ్యే విజ్ఞానమంతా చక్కగా పొందుపరచారు. అందుకే శౌనకాది మునులకు సూతమహర్షి భారతకథను చెప్పి **"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్.."–** అని ఇందులో ఉండేదే ఎక్కడైన ఉంటుంది ఇందులో లేనిది ఎక్కడా ఉండదని చెప్పారు. ఇంతకంటే ఈ గ్రంథం ప్రాశస్త్యం చెప్పటానికి వేరేది అవసరం లేదు. భారతంలో వేదార్థాలు వివరించబడ్డాయి కనుక దీనికి పంచమవేదమని ప్రఖ్యాతి ఏర్పడింది. వేదాల, శాస్త్రాల, పురాణాల, ఉపనిషత్తులసారం భారతంలో నిభిడీకృతమై ఉండడంవల్ల ఇది భారతీయ విజ్ఞాన సర్వసంగా ప్రశస్తి పొందింది. మహాభారతం ధార్మిక శక్తులకు అధార్మికశక్తులకు మధ్య జరిగిన సంఘర్షణ. అదే కురుక్షేత్ర సంగ్రామం.

అందులో ధార్మికశక్తులకు జయం లభించింది. కనుక మహాభారతానికి "జయం" అనే నామాంతరం కూడ ఉంది. వ్యాసుని సంస్కృత మహాభారతాన్ని తెలుగులోనికి నన్నయ, తిక్కన, ఎఱ్ఱన అనే ముగ్గురు కవులు అనువదించారు. తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి అనే సామెత ఈ కవిత్రయం వారి తెలుగు మహాభారత రచనకే ఏర్పడింది.

### కథా సందర్భం

యయాతి మహారాజు గుణవంతుడైన తనపుతుడు పూరుడు అనేవానికి రాజ్యపట్టాభిషేకం చేశాడు. ఆ సమయంలో కుమారునికి యయాతి భోధించిన నీతులు ఎలాంటివని స్వర్గలోకం చేరిన యయాతిని ఇంద్రుడు ప్రశ్నిస్తాడు. అప్పుడు యయాతి తన కుమారునికి బోధించిన హితోక్తులను ఇంద్రునితో చెప్పే సందర్భమే ప్రస్తుత పాఠ్యాంశంగా గ్రహించబడింది.

ఇది నన్నయ్య రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం తృతీయాశ్వాసం నుండి తీసుకున్నాను..

### 1. యయాతి పూరునికి బోధించిన నీతులు

జ్ఞానం కలవారి చరిత్రలు చదువుతూ, సజ్జనుల గోష్ఠిలో కదలకుండా, ధర్మం తెలుసుకొంటూ, తెలుసుకొన్నదానిని మరిచిపోకుండా న్యాయబుద్ధితో ఆదరించాలని చెప్పే పద్యం ఇది.

**ఏఱుక గలవారి చరితలు**
**గఱచుచు, సజ్జనుల గోష్ఠి గదలక ధర్మం**
**బెఱుగుచు నెరిగిన దానిని**
**మఱక కనుష్ఠంచునది సమంజసబుద్ధిన్... (మహాభారతం 203)**

వ్యక్తిత్వ వికాసానికి సంబంధించినది పద్యం. ఒక మనిషి తన వ్యక్తిత్వాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే జ్ఞానుల చరితలు చదివి, సజ్జనుల సాన్నిహిత్యంలో ధర్మం తెలుసుకొని, వాటిని మర్చిపోకుండా ఆవరణలో పెట్టాలని తెలుపుతుంది. వ్యక్తిత్వ వికాసానికి జ్ఞానం, ధర్మం రెండూ ప్రధానమైనవని తెలుసుకుంటే జీవితం చాలా బాగుపడుతుంది.

అర్హుడికి తగినట్లుగా ధనమివ్వాలి. ఇంకొకడిని అడగకుండా ఉండాలి. ఎదురుగా వచ్చిన యాచకులను వ్యర్థంగా పంపించకూడదు. నిరాశపుచ్చక సకల జీవులకును తృప్తిని కలిగించాలి. ధనాన్ని ఎలా సద్వినియోగం చేయాలో తెలిపే పద్యమిది.

**ఇచ్చునది పాత్రునకు ధన**
**మచ్చుగ నొరు వేడుకుందునది యథిముఖులై**
**వచ్చిన యాశార్థుల వృథ**
**పుచ్చక చేయునది సర్వభూత ప్రీతిన్.... (మహాభారతం -204)**

ఒక మనిషి ఎప్పుడూ ఇంకొకరికి ధనాన్ని ఇచ్చే స్థితిలో ఉండాలి కాని అడిగే స్థితిలో ఉండకూడదు. దానం అర్హులకు ఇవ్వటం వల్ల దానఫలం మహరంగా ఉంటుందని పై పద్యం తెలుపుతుంది. అనర్హుడికి దానమిస్తే అనర్థం కలుగుతుంది. ధనాన్ని సద్వినియోగం చేయాలి.

ఖచ్చితంగా, సవ్యంగా, చక్కగా సభలలో మనసుకు ప్రీతి కలిగించేది, మేలైనదీ, ఉచితమైనదీ, నత్యమైనది, తీయనిదీ, విస్తృతం కానివైన మాటలను ధర్మంతో కూడుకొని ఉండేటట్లుగా పలకమని తెలుపుతుంది. అదేవిధంగా మనం ఎప్పుడు ఎలా మాట్లాడాలో చెప్పే పద్యమిది.

**మనమునకు బ్రియంబును హిత**
**మును బథ్యము దథ్యమును నమోఘము మధురం**
**బును బరిమితమును నగు పలు**
**కొనరగ బలుకునది ధర్మయుతముగ సభలన్.... (మహాభారతం-205)**

మాట్లాడటం మనిషికి దేవుడిచ్చిన వరం. ఆ మాట్లాడే విధానం వల్లనే మనిషి వ్యక్తిత్వం, మంచితనం తెలుస్తుంది. కాబట్టి హితం మితం కలిగిన మాటలను పలకటం ఉత్తమమని అర్థం. మధురమైన, సత్యమైన వాక్కులు లోకానికి మనకు కూడ మేలు చేస్తాయి. దుష్టులకు దూరంగా ఉండాలని చెప్పే పద్యం.

**వదన బాణాసన వ్యక్తముక్తములైన**
**పలుకులనుడు వాడిబాణతతుల**
**బరమర్మలక్ష్యముల్ పాయక భేదించు**
**చుండెడి దుర్జనయోధవరుల**
**కడనుండ కున్నది కరుణ యార్జవమక్ష**
**జయము సత్యంబును శమము శౌచ**
**మను నివి యెద నిల్పునది శత్రుషడ్వర్గ**
**జయమందునది శుద్ధశాంతబుద్ధి**
**మదము గ్రామము గోరంబు మత్సరంబు**
**లోభమును మోహమును నను లోని సహ**
**వైరివర్గంబు నౌడిచినవాడ యొదుచు**
**సశ్రమంబున వెలుపలి యహిత తతుల.... (మహాభారతం- 206)**

ముఖమనే విల్లునుండి వెలువడిన మాటలనే వాడియైన బాణాల సమవాహంతో, ఇతరుల జీవస్థానాలనే లక్ష్యాలను చీల్చుతూ ఉండే దుష్టులైన యోధశ్రేష్టుల చెంత నివసించకూడదు. దయ, ఋజుత్వం, ఇంద్రియజయం, సత్యం, బహరింద్రియ నిగ్రహం, శుచిత్వం అనే వాటిని హృదయంలో నిలపాలి. నిర్మలమైన శాంతబుద్ధితో కామాదివైరులనే ఆరుగురిని జయించాలి. గర్వం, కామం, కోపం, మత్సరం, పిసినారితనం, అజ్ఞానం సహజమైన అంతశ్శత్రువుల సముదాయాన్ని ఓడించినవాడే బహిశ్శత్రువుల సముదాయాన్ని శ్రమ లేకుండా ఓడిస్తాడు.

ఇతరుల మనస్సును గాయవచ్చే దుర్మార్గులకు దగ్గరలో ఉండకూడదు. అరిషడ్వర్గాలనే లోపలి శత్రువులను జయించినవాడు బయటి శత్రువును జయించడం సులభమని అర్థమని పూరునికి బోధించాను. ఆ మహాత్ముడు ఇతరులను బోధించగల సర్వగుణాలతో కూడినవాడు (అతనికి ఇతరులు బోధించనవసరం లేదని భావం), అని యయాతి పలుకగా విని ఇంద్రుడు మరల యయాతితో ఇట్లా పలికాడు. పుట్టుకతోనే కొందరు సద్గుణ సంపన్నులుగా ఉంటారు. అయినా లోకంలో తమ సంతానానికి తల్లిదండ్రులు నీతినియమాలను నేర్పించడం బాధ్యతగా భావించాలి. ఓ మహారాజా! నీవు ఏమి తపస్సు చేశావు? స్వర్ణలోకభోగాలను మిక్కిలి తేజస్సుతో లక్షసంవత్సరాలు అనుభవించావు. ఇవి సామాన్యమా? సత్యం, ధర్మం, తపస్సు మొదలైనవాటిని నియతంగా ఆచరించినవారికి సద్గతులు తప్పక లభిస్తాయి. అని ఇంద్రుడు పలుకగా యయాతి ఇలా పలికాడు.

**2. యయాతి స్వర్గంనుండి అధోగతిపాలు**

యయాతి మహారాజు అహంకారాన్ని ప్రదర్శించిన పద్యం. దేవతలకు రాజువైన ఓ ఇంద్రుడా! దేవతల, దైత్యుల, యక్షుల, రాక్షసుల, మానవుల, ఆకాశసంచారుల, సిద్ధుల, మునుల సముదాయాలలో శ్రేష్ఠులైనవారి ప్రకాశించే తపస్సులు. చేయశక్యం కాని తీవ్రమైన నాతపస్సుకు సమానం కావని ఇక్కడ యయాతి తన తపస్సు గురించి గొప్పగా చెప్పుకున్నాడు. ఎవరు కూడా తనగొప్పతనాన్ని తానే చెప్పుకోకూడదు. అది గర్వమువుతుంది. ఆ గర్వం వాళ్ళ పతనానికే దారితీస్తుంది. అంటూ తపస్సు గర్వంచేత మహామునుల తపస్సులను తక్కువచేసి పలుకగా, ఆ యయాతి గర్వానికి సహించక ఇంద్రుడు కోపించి "నీకు స్వర్గలోకసుఖాల ననుభవించుటలోని పుణ్యం క్షీణించింది". నీ గర్వం నీకు ఇంతహాని చేసింది. ఇక ముందు అధోలోకాలకు వెళ్ళమని పలుకగా యయాతి నేను మానవలోకానికి వెళ్ళలేనని ప్రార్థించగా అప్పుడు ఆకాశంలో, నక్షత్రలోనికి వెళ్ళమని ఇంద్రుడు ఆజ్ఞాపిస్తాడు.

**అంతరిక్షంబువలన దిగంతరములు**
**వెలుగ అనుదెంచు నాతని విములదీప్తి**
**సూచి సద్గణములు గడు జోద్యమంది**
**రురుతరద్యుతి యిది యేమి యొక్కొయనుచు... (మహాభారతం -210)**

ఆకాశంలో దిక్కులందు ప్రకాశిస్తూ వచ్చే యయాతి నిర్మలమైన కాంతిని చూచి అధికమైన ఈ కాంతి ఏమో కదా! అంటూ నక్షత్రగణాలు ఎక్కువ ఆశ్చర్యాన్ని పొందినాయి. ఇది యయాతి గొప్పతనాన్ని సూచించే పద్యం. నక్షత్రాలు కాంతిమంతమైనవి. అవే యయాతి కాంతిని చూచి ఆశ్చర్యపడ్డాయి. అంటే యయాతి నక్షత్రాలకంటే గొప్పవాడని అర్థం వస్తుంది.

**3. నీవెవరివి? ఎక్కడినుండి ఏ కారణాన వచ్చావు**

ఆ తర్వాత యయాతి కూతురు కొడుకులైన అష్టకుడు, ప్రతర్ధనుడు, వసుమంతుడు, ఉశీనరుడయిన శిబి అనే నక్షత్రలోక నివాసులైనవారు తమవద్దకు వచ్చిన గొప్పతేజస్సుతో కూడిన అధికమైన పుణ్యం రూపుధరించినట్లున్న యయాతిని చూశారు. సహజమైన ప్రేమతో అభ్యాగతులకు చేయవలసిన పూజలతో సంతోషపెట్టి "నీవెవరివి? ఎక్కడినుండి ఏ కారణాన వచ్చావు" అని అడుగగా వారితో ఆ యయాతి ఇట్లా పలికాడు? నక్షత్రలోకంలో యయాతి మనుమలు కూడా ఆయన కాంతిని చూచి ఆశ్చర్యపోయారు. అనింద్యం, ధర్మయుక్తమైన చరిత్రచేత అధికుడైన నహుషుని కుమారుడను, పూరుడనే పేరు కల మధ్యమలోకాన్ని పరిపాలించే రాజు తండ్రిని, నేను యయాతి అనే పేరు గలవాడను. యయాతి తండ్రి నహుషుడు కూడ ఇంద్రపదవిని అధిష్ఠించి అహంకారంతో మునులను అవమానించి అధోగతి పాలయ్యాను. అధికమైన తపస్సు వైభవం చేత బ్రహ్మలోకం మొదలైన దేవలోకాలలో వరుసగా పుణ్యఫలాలను అనుభవించాను. ఇంద్రుడి చెంతక నేను వెళ్ళానని మనవలతో చెప్పి ఎంత తపస్సు చేసినా ఎన్ని లోకాలు తిరిగినా పుణ్యం శాశ్వతం కావాలంటే సద్గుణాలను అలవర్చుకోవాలని తెలుసుకోవాలి. అప్పుడే విలువ ఉంటుందని తెలిపాడు. ఆ తర్వాత

**సురపతి నా తపమున క**
**చ్చెరువడి నీ తపము పేర్మిజెప్పుము యనిసన్**
**సురసిద్ధమునీంద్ర తప**
**శ్చరణలు నాతపముతోడ సరిగా వంటిన్... (మహాభారతం -216)**

దేవతకు రాజైన ఇంద్రుడు నేను చేసిన తపస్సుకాశ్చర్యపడి "నీ తపస్సు యొక్క మహత్త్వం చెప్పు"మని అడుగగా

'దేవతల, సిద్ధుల, మునిశ్రేష్ఠుల నీ తప:కార్యాలు నాతపస్సుతో సమానం కావని పలికాను. అందువల్ల నాకు ఈ పరిస్థితి వచ్చిందని ఈ పద్యంలో చెప్పడం జరిగింది. యయాతి ఆహంకారాన్ని సూచించేది. తన గొప్పతనాన్ని తాను పొగడుకోవటంలో ఇతరులను కించపరచాను దానివల్ల నేను దారుణమైన ఫలితం పొందాను. అహంకార ప్రదర్శనలో ఇతరులను కించపరచటం మన నాశనాన్ని మనమే కొని తెచ్చుకోవటమంటే ఇదే అన్నట్టు భావం మనకు కనిపిస్తుంది.

దేవేంద్రుడు నామాట విని కోపించి గర్వంతో శ్రేష్ఠులైనవారిని అవమానించటం తగునా? అని నన్ను క్రిందిలోకాలకు వెళ్ళమన్నారు. ఇంద్రుడు తొందరపాటులో వశం తప్పినవానిగా చేశాడు. అది న్యాయమే. ఎందుకంటే ఎక్కడైనా స్వల్పమైనదైనా గర్వం పెద్దకాలం చేసిన తపస్సు యొక్క ఫలాన్ని నాశనం చేయకుండా ఎట్లా ఉంటుంది?

యయాతి తన తప్పును తాను అంగీకరించడం గొప్పవిషయం. ఇంద్రుని శాపం సరైనదిగానే అతడు చెప్పడం అతని ఔదార్యగుణాన్ని సూచిస్తుంది. స్వల్పమైన గర్వంకూడ గొప్పపుణ్యాన్ని నాశనం చేస్తుంది. ప్రతి మనిషికి గర్వం మంచిది కాదని తెలిపినాడు యయాతి.

ఈ విధంగా కోపించిన ఇంద్రుడి వాక్కుతో పీడించబడినవాడై, అతడి ఆజ్ఞచేత నక్షతలోకానికి వచ్చాను అని యయాతి పలుకగా ఆ యయాతి తమ మాతామహుడవటం చేతను, అతని గొప్పతనం సమస్త లోకాలలో ప్రసిద్ధి చెందటం చేతను, అన్ని విషయాల గురించిన అతని జ్ఞానసంపదను తెలిపికొని అష్టకుడు మొదలైనవారు అన్ని ధర్మాలను. అధర్మాలను, మంచిచెడ్డగతుల స్వభావాలను, జీవుల విధానాన్ని, వర్ణాశ్రమ ఆచారాలను అడుగగా అష్టకాదులకు యయాతి ఇట్లా చెప్పాడు. యయాతి మనుమలు సర్వజ్ఞానసంపన్నుడైన అతని ద్వారా నీతిధర్మాలను గ్రహించటం విశేషంగా మనం చెప్పుకోవచ్చు.

## 4. యయాతి తన మనుమలకు బోధించిన నీతులు

**సర్వభూతదయకు సత్యవాక్యమునకు**
**నుత్తమంబు ధర్మ వొం డెరుంగ**
**నొరుల నొప్పి కోడ కుపతాప మొనరించు**
**నదియ కడు నధర్మ మనిరి బుధులు... (మహాభారతం -219)**

ఎల్లజీవులయందు దయ కలిగి ఉండటం కంటెను, సత్యవాక్యం పల్కటంకంటెను, శ్రేష్టమైన ధర్మమింకొకటి నాకు తెలియదు. జంకులేక ఇతరులను బాధించడం, సంతాపం కలుగచేయటం మిక్కిలి అధర్మమని పండితులు చెప్పారు. సత్యం, దయ అనేవి పరమధర్మాలు. ఇతరులను బాధించడమే అధర్మమని భోదిస్తాడు.

**వేదవిహితవిధుల నాదరించుట యూర్ధ్వ**
**గతికి దెరువు; విధులగడచి యెందు**
**నాగబడినవాని లోగక చేయుట**
**యధమగతికి మార్గ మనిరి మునులు... (మహాభారతం - పద్యం 220)**

వేదమందు విధించబడిన కార్యాలను పాటించటం ఉన్నతమైన గతికి మార్గం. వేదమందు విధించబడిన కార్యాన్ని అతిక్రమించి, ఎల్లయెడల నిషేధించబడినవాటిని వెనుదీయక చేయటం నీచమైన గతికి మార్గమని మునులు చెప్పారు. ఇది వాస్తవం కూడా.

**ముగింపు**

వ్యక్తిత్వ వికాసానికి జ్ఞానం, ధర్మం రెండూ ప్రధానమైనవి. దుష్టులకు, దుష్టగుణాలకు దూరంగా మనం

ఉండటం మంచిది. పిల్లలను సంస్కారవంతులుగా మన తల్లిదండ్రులే తీర్చిదిద్దాలి. సద్గతికి సత్ప్రవర్తన చాలా ముఖ్యం. అందుకని ఋజుత్వం, సక్రమమైన పద్ధతి, ఇంద్రియ జయం కలిగి ఉండాలి. గర్వం ఎంతగొప్పవారికైనా మంచిది కాదు. తనను తాను పొగడుకోవటం ఆహంకారమే అవుతుంది. అహంకారం అనర్ధానికి దారితీస్తుంది. మనల్ని మనం ఎంతవరకు తగ్గించుకుంటే అంత బాగుంటాము. అహంకారాన్ని జయించలేని వారికి పతనం తప్పదు. ఎంత భక్తి చేసినా ఎన్ని లోకాలు తిరిగినా, పుణ్యం శాశ్వతం కావాలంటే సద్గుణాలను కూడా నిలుపుకోవాలి. తప్పును తెలుసుకొని పశ్చాత్తాప పడటం ఉత్తముల లక్షణం భావించాలి. సజ్జనుల గోష్ఠిలో ధర్మాన్ని తెలుసుకోవాలి. నీతిని పాటించడం శ్రేయస్కరం. సత్యవాక్కు, సర్వభూతదయ పరమ ధర్మాలని అందరు గ్రహించగలగాలి. వేదవిహిత ధర్మాలను ఆచరిస్తే ఉన్నతులుగా నిలుస్తాం. అదే విరుద్ధంగా నడుచుకుంటే అధోగతి పాలవుతాం. అందుకే ఉత్తమమార్గాన్ని ఎంచుకోవాలి. అందుకు సద్గుణాలను అలవరుచుకోవాలని నా ఈ వ్యాసం ద్వారా తెలుపుతున్నాను.

**పాద సూచికలు**

1. శ్రీమదాంధ్ర మహాభారతం - పుట -123
2. శ్రీమదాంధ్ర మహాభారతం - పుట -124
3. శ్రీమదాంధ్ర మహాభారతం - పుట -125
4. శ్రీమదాంధ్ర మహాభారతం - పుట - 126

**ఆధారగ్రంథాలు**

1. కవి సమ్రాట్ శ్రీ విశ్వనాధ సత్యనారాయణ - ఆంధ్ర మహాభారతం- ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ- కళాభవనం- హైదరాబాదు - 4
2. డా.జి.వి. సుబ్రహ్మణ్యం -2013 - శ్రీమదాంధ్ర మహాభారతం - తిరుమల తిరుపతి దేవస్థానం- తిరుపతి
3. ఆర్వీయస్ సుందరం 1993- నన్నయ భారతం వచనం- మానస గంగోత్రి- మైసూరు
4. నా నలచక్రవర్తి కానల -1996- సకల వేదాంతాల సారభూత గ్రంథం- శ్రీ వెంకమాంబ పబ్లికేషన్స్- తిరుపతి

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 38. తిక్కన మహాభారత శాంతిపర్వం - భీష్మ సందేశం

– డా|| కె.వి. సత్యనారాయణ, నెల్లూరు

## ఉపోద్ఘాతం

ఆధునిక కాలంలోని మానవుని జీవితం వేగాన్ని, యాంత్రికతను సంతరించుకుంటోంది. నానాటికి భౌతిక ప్రపంచంలోని అస్థవ్యస్థత సగటు మానవుని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ప్రజలు అసంతృప్తితో, అసహనంతో, అసూయా ద్వేషాలతో, ధనకాంక్షతో మనశ్శాంతి లేక అల్లాడుతున్నారు. ఈ దశలో మానవ మనస్తత్వానికి దర్పణంగా నిలిచి, అల్లకల్లోలమైన మనస్సులకు ఎంతో కొంత ఉపశాంతిని కలిగిస్తూ, నైతిక ధర్మాన్ని బోధించి, కారు చీకటిలో కాంతి రేఖలా మార్గదర్శనం చేసే గ్రంథం మహాభారతం. మహాభారతాన్ని చదవడం, అధ్యయనం చేయడం అత్యంతావశ్యకం.

## శాంతిపర్వ విశిష్టత

మహాభారతంలోని 18 పర్వాలలో శాంతిపర్వం విశిష్టమైంది. ఇది అన్ని పర్వాల కంటే పెద్దదని విజ్ఞులంటారు. మహాభారత యుద్ధం పరిసమాప్తమై యావత్ కురువంశ సామ్రాజ్యం పాండవుల హస్తగతమైంది. ధర్మరాజు సింహాసనం అధిష్టించి సామ్రాజ్యాన్ని పరిపాలించాలి. కానీ ధర్మరాజులో వైరాగ్యం, నైరాశ్యం ముంచుకొచ్చాయి. ఈ రెండింటినీ పారద్రోలి అతనిలో కర్తవ్యనిష్ఠను, ధర్మదీక్షను కల్గించడానికి కురువృద్ధుడైన భీష్మాచార్యులు కృష్ణుని ప్రోత్సాహంతో నడుం కట్టారు. ఆయన బోధించిన వివిధాంశాలే శాంతి పర్వానికి ఒక విశిష్టతను చేకూర్చి పెట్టాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. విశ్వజనీనమైన విజ్ఞానం ఈ పర్వ తాత్పర్య వివేచనం. ధర్మజుడు ధర్మజిజ్ఞాసకు ప్రతినిధి. శాంతనవుడు సర్వలోక హితబోధకు ప్రజ్ఞానిధి. వీరిద్దరి సంవాదం లోకహితార్థమై ప్రవర్తిల్లిన జ్ఞానయజ్ఞం. అందుకే ఈ శాంతిపర్వ వస్తువైభవాన్ని గురించి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు “భారతదేశపు ప్రాచీన విజ్ఞానానికి వివృత భాండాగారము” అని ప్రశంసించడం జరిగింది.

శాంతిపర్వంలో కథ తక్కువ, బోధ ఎక్కువ. రాజైన వ్యక్తికి మొదట రాజ ధర్మ పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ క్రమంలో రాజైన వాడు ధర్మ నిర్వహణలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పడమే కాదు సమస్త లౌకిక విషయాలతో పాటు సృష్టిక్రమం మొదలైన పారమార్థిక విషయాలను ధర్మజుని ఆసక్తి మేరకు వివరించాడు భీష్మపితామహుడు. ఈ విషయాలన్నిటినీ భీష్ముడు అనేక కథలు, గాథలు, సంవాదాల రూపంలో మన ముందుంచాడు. అందుకే ఇతిహాసమైన భారతంలో ఐతిహాసిక ప్రవృత్తిలో శాస్త్రబోధ చేసే ఆఖ్యాన శిల్పానికి శాంతిపర్వం ఒక చక్కని ఉదాహరణం అని పెద్దలంటారు. శాంతి పర్వమంతా ఒక మహోపదేశం. అది శ్రీకృష్ణుడి సాక్షిగా పలికిన శాంతనవగీత.

మహాభారతంలోని శాంతిపర్వం కథలను పరిశీలిస్తే తిర్యక్కులు జడములకు మధ్య జరిగిన సంవాదానికి సంబంధించిన కథలు, మానవులకు – తిర్యక్కులకు మధ్య జరిగిన సంవాదాలు, మానవులకు –దేవతలకు, దేవతలకు–దేవతలకు మధ్య, రాజులకు –రాజులకు మధ్య మానవులకు – మహర్షులకు, మహర్షులకు – రాజులకు మధ్య జరిగిన సంవాదాలు 8 విభాగాలుగా కనిపిస్తాయి. కథలలో కన్పించే వివిధ అంశాలను పరిశీలించినట్లైతే

1. రాజనీతి శాస్త్ర విషయాలు
2. నైతిక విషయాలు
3. మత, ధార్మిక, సంస్కృతి పరమైన విషయాలు
4. ఆముష్మిక విషయచింతన
5. సామాజిక అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయి.

## 1.0 రాజకీయ, సామాజిక, అంశాలు

### 1.1 రాజు – రాజనీతి

భారతంలో అధిక భాగం రాజనీతికి ప్రాధాన్యం ఇవ్వబడింది. అందులోనూ శాంతి పర్వంలో రాజనీతిని గురించిన విస్తృతమైన వివరణ ఉంది. ఆనాటి సమాజంలో రాజే సర్వాధికారి. ఏ రాజును ప్రజలు సన్మానిస్తారో ఆ రాజే 'రాజ' శబ్దానికి అర్హుడని చెప్తోంది. ప్రయత్నం, చురుకుదనం, ఇంద్రియ నిగ్రహం. యుద్ధ నిర్వహణ కౌశలం, ఆత్మ నిగ్రహం, పరాక్రమం మొదలగు రాజుకుండాల్సిన విశిష్ట లక్షణాలని భారతం వివరిస్తోంది.

రాజు తన మనస్సులో ఉంచుకోవాల్సిన ముఖ్యమైన నీతులను శాంతి పర్వంలో పశు పక్ష్యాదుల కథల మూలంగా మహాభారతకర్త వ్యక్తం చేశాడు. ఈ కథలలో ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క ధర్మానికి, ఒకొక్క స్వభావానికి ప్రతీకగా గోచరిస్తుంది. ఈ పశుపక్ష్యాదులు మానవ ప్రవృత్తులకు ప్రతినిధులుగా తయారై, పఠితలకు ఉపదేశం చేస్తాయి.

శాంతి పర్వం 3వ ఆశ్వాసంలో దీర్ఘదర్శి, ప్రాపకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడనే మూడు చేపల కథ ఉంది. దీని ద్వారా రాజైన వాడు దూరదృష్టి కల్గి ఉండాలనీ, రాబోయే ఆపదలను ముందుగా గుర్తించి రాజ్యాన్ని రక్షించాలని తెలుస్తోంది.

అదే 3వ ఆశ్వాసంలో "మూషిక మార్జాల కథ" ఉంది. హీన బలుడైన రాజుపై అనేక మంది శత్రువులు ఒకే సమయంలో వచ్చి దాడి చేస్తే ఎలా ఆత్మ రక్షణ చేసుకోవాలో చక్కగా వివరిస్తుంది.

ప్రభువు చెప్పుడు మాటలు చెవిన పెట్టక తనకు హితులెవరో, అహితులెవరో తానే జాగ్రత్తగా పరిశీలించుకొని తెలుసుకోవాలి అనే రాజ ధర్మానికి ఉదాహరణే 'వ్యాఘ్రగోమాయు సంవాదం'. ఇది ఈనాటికీ ఆచరించాల్సిన ముఖ్య కర్తవ్యం.

ఉష్ట్రము కథ. అసహాయత్వం అనేది రాజుకు ప్రమాదకరమని తెలియజేస్తుంది.

కరువు మొదలైన బాధలు కలిగినప్పుడు ఆహారం సంపాదించుకోవడం చాలా కష్టం అవుతుంది. అలాంటి సమయాల్లో ఎలా నడుచుకోవాలో చెప్పేదే 'విశ్వామిత్ర ఛండాల సంవాదం'.

శత్రువు బలవంతుడు అయితే అల్పుడైన రాజు ఏ విధంగా ఆ ఆపద నుండి తనను తాను ఎలా రక్షించుకోవాలో "సముద్ర సరిత్" వృత్తాంతంలో చెప్పబడింది.

ప్రబ్బలి చెట్లు నదీ ప్రవాహం ఎక్కువ అయినప్పుడు ఆ ప్రవాహానికి ఎదురు నిలవక వంగుతాయి. ప్రవాహం ముగిసిన పిదప యధాప్రకారం నిలుచుంటాయి. అలాగే శత్రువు బలవంతుడు అయినప్పుడు తనని తాను యుక్తిగా రక్షించుకోవాలనే సూత్రం ఈ కథలో ఇమిడి వుంది. ఇది ఎప్పటికీ అనుసరణీయమే. ముఖ్యంగా ప్రభువు అనేవాడు తన బలాన్నీ, ఎదుటి బలాన్నీ చక్కగా బేరీజు వేసుకుని అప్పుడే శత్రువుని ఎదిరించాలని ఈ కథ సందేశం. ఒకవేళ శత్రువు తనకంటే అధికుడు అయినప్పుడు అతనిశాంతిశాంతో రాజీపడి సంధి కుదుర్చుకోవడం ఎంతో ముఖ్యం.

రాజైన వాడు నీచ కులస్థులను ముఖ్యమైన స్థానాల్లో నియమించకూడదు.అల్పులకు అధికారం ఇస్తే వారు చివరికి ఆ రాజుకే అపకారం చేస్తారని కుర్కుర కథ తెలియజేస్తుంది.

కష్టాల్లో ఉన్నవాళ్ళ కన్నీళ్ళు తుడవడం రాజు ముఖ్య కర్తవ్యం. కానీ స్వార్థపరులైనటువంటి చెడ్డవారు రాజు చుట్టూ చేరి అతన్ని తప్పుదోవ పట్టిస్తారని 'గృధ్ర జంబుకోపాఖ్యానం' వివరిస్తుంది. ఎవరి స్వార్థం కోసం వాళ్ళు ప్రవర్తిస్తుంటారని గ్రద్ధ, నక్కల కథ వల్ల తెలుస్తోంది. శరణాగతుడైన వాడికి ప్రభువు తన ప్రాణాన్ని సైతం ఇవ్వాలని, బోయవాడు – కపోతం కథ తెలియజేస్తుంది.

బలవంతునితో దుర్బలుడైన వాడు మాశ్చర్యాన్ని పొందరాదని 'పవన శాల్మలీ తరు సంవాదం' చెప్తోంది. రాజైనటు వంటివాడు మిత్రద్రోహి, కృతఘ్నులను ఎలా గుర్తించాలో చెప్తూ భీష్ముడు గౌతముడనే బ్రాహ్మణుడి కథను ధర్మరాజుకి చెప్తాడు. దీనినే "నాడీ జంఘోపాఖ్యానం" అని పిలుస్తారు.

ప్రభువు విపరీతమైన ధనార్జన చేయకూడదని 'మంకి' కథను ధర్మరాజుకి చెప్తాడు భీష్ముడు. రాజైన వాడు ధనం కంటే ధర్మానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ధర్మం వల్ల సర్వసిద్ధులూ చేకూరతాయి. ధర్మం రాజ్యానికి ప్రాతిపదిక. ధర్మస్వరూపుడైన రాజు ధర్మాల్లోని సారాన్ని గ్రహించి నడుచుకోవాలి. రాజు మంచి వాళ్లతో సహవాసం చేసినప్పుడే ధర్మ నిర్ణయం చేయగలుగుతాడు. అర్థ కామదూషితమైన మనస్సు, ధర్మా ధర్మ వివేచన చేయజాలదని భీష్ముడు అంటాడు. ఇలా చెప్తూ అధర్మపరుడైన వేణుడనే రాజును ఋషులు చంపినట్లు భీష్ముడు ధర్మరాజుకి బోధిస్తాడు. దీన్ని బట్టి మహాభారత కాలంలో అధర్మపరులైన రాజులను ప్రజలు తిరుగుబాటు చేసి తొలగిస్తారని, సంహరిస్తారని తెలుస్తోంది.

రాజు భూలోకంలో ధర్మావతారం. అతడు ధర్మాల్లోని సారాన్ని గ్రహించి నడుచుకోవాలి. ధర్మాధర్మ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. నిరంతరం మంచి వాళ్ళతో గడపాలి. దుర్మార్గుల పట్ల రాజు కఠినంగా వ్యవహరించాలని "కాపవ్యుడు – దొంగల కథ" ను భీష్ముడు చెప్తాడు. రాజులు అనుసరించదగు దండనీతులు, న్యాయవిమర్శల యందు వారు నడుచుకోవాల్సిన పద్ధతులు శాంతి పర్వంలో సమగ్రంగా వివరింపబడ్డాయి. న్యాయం విక్రయింపబడకూడదని, ధనాపేక్షతో ధర్మాన్ని అరికట్టకూడదని శాంతిపర్వం చెప్తుంది.

## 1.2 శిక్షలు

శాంతి పర్వంలో ద్యుమత్సేన మహారాజుకు అతని కుమారుడైన సత్యవంతునకు, మరణదండనకు సంబంధించిన సంభాషణ జరుగుతుంది. శిక్షా స్వరూపంలో మార్పులు తీసుకురావాలని ఈ కథ చెప్తుంది. నేరస్థుడికి వేసే శిక్షల గురించి చాలా విస్తృతమైన అభిప్రాయాలను భీష్ముడు ధర్మరాజుకు చెప్తాడు. దోషిని సన్మార్గంలో పెట్టడం కోసమే నేరానికి ఉచితమైన శిక్షణ విధించాలి. నేరానికి మించిన శిక్షణ విధించడం వల్లనే యమధర్మరాజు మాండవ్య మహర్షి శాపం చేత విదురుడుగా పుట్టాల్సి వచ్చిందని భారతం చెప్తుంది.

నేరస్థుడు తాను మారి సంఘంలో మంచి వారి మధ్య మంచివాడుగా జీవించే అవకాశాన్ని రాజు అతనికి ఇవ్వాలని ఎంతో ఆదర్శవంతమైన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తాడు. శాంతి పర్వంలోనే నేరస్థుడికి వేసే శిక్షల గురించి చాలా విస్తృతమైన అభిప్రాయాలను భీష్ముడు ధర్మరాజుకి చెప్పాడు.

## 1.3 పన్నులు

రాజు ప్రజల రక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటాడు. అందుకు ప్రతిగా ప్రజలు అతనికి పన్నుల రూపంలో కానుకలు చెల్లిస్తారు. ప్రజలు తమ ఆదాయంలో ఆరోవంతు పన్నుగా చెల్లించాలని ఒకచోట, పదోవంతు పన్నుగా చెల్లించాలని మరోచోట భీష్ముడు చెప్తాడు. కరువు కాటకాలలో రాజులు పన్నులు రద్దుచేసి ప్రజలకు ఊరట కల్పించాలి. రాజులు విపరీతంగా పన్నులు విధిస్తే అతనికి పదవీ గండం తప్పదని భీష్ముడు హెచ్చరిస్తాడు. పన్నులు వేసేటప్పుడు కూడా ప్రజలకు ముందుగా చెప్పి ఆ తర్వాతనే వసూలు చేయాలంటాడు. ప్రజలు గోవు లాంటి వారు. తోటమాలి కుసుమఫలాన్ని సున్నితంగా కోసినట్లుగా రాజు పన్నులను విధించాలి. అలాగే ప్రజల నుండి పన్నుల ద్వారా రాబట్టిన ధనాన్ని రాజులు తన భోగాల కోసం కాక రాజ్య క్షేమానికి, ప్రజా సంక్షేమానికి ఉపయోగించాలి.

కానీ నేటి పాలకులు పన్నుల విధానంలో ఎలాంటి హేతుబద్ధత పాటించకుండా తన,పర అనే భేదాలను పాటిస్తున్నారు. ఒక్కొక్కసారి రాత్రికి రాత్రే పన్నులను ఇష్టారాజ్యంగా పెంచేయడం చూస్తున్నాం. అందుకే దేశంలో అరాచకం ఏర్పడుతోంది. ధనవంతుడు మరింత ధనవంతుడిగా, పేదవాడు మరింత పేదవాడిగా మారిపోతున్నాడు. పైగా ఆదాయాన్ని తమ వ్యక్తిగత విలాసాలకు విపరీతంగా ఖర్చుపెడుతున్నారు.

## 2.0 సామాజిక అంశాలు

భీష్ముడు ధర్మరాజుకు చెప్పిన శాంతి పర్వ కథల్లో అనేక సామాజిక అంశాలు తొంగి చూస్తాయి. మహాభారత కాలానికి ప్రజాభిప్రాయానికి విశేషమైన ప్రాముఖ్యం ఉండేది. రాజు దైవాంశ సంభూతుడని చెప్తున్నప్పటికీ అతడు ప్రజలకు సేవకుడు మాత్రమే. అతడు ధర్మనిష్ఠతో భూమిని పరిపాలించాలి. కోపాన్ని, కోరికలను, అహంకారాన్ని, అసూయను రాజు విడనాడాలి. అధర్మవర్తనుడైన రాజును తొలగించే అధికారం ప్రజలకు ఉందని వేణుడనే రాజు వృత్తాంతం తెలియజేస్తుంది. రాజులు పన్నులతో ప్రజలను బాధించరాదని, ఆవుదూడ, పాలను ఎలా స్వీకరిస్తుందో, తుమ్మెద మకరందాన్ని ఎలా గ్రోలుతుందో అలా ఉండాలని భారతం చెప్తుంది. ఆ కాలంలో బ్రాహ్మణులకు విశేషమైన గౌరవ ప్రతిపత్తులు ఉండేవి. వేద విధులను ఆచరించే బ్రాహ్మణుల నుండి పన్నులు వసూలు చేసేవారు కాదు. యుధిష్టరుడు జూదంలో బ్రాహ్మణుల ఆస్తిని మినహాయించి సర్వస్వాన్ని పందెంలో ఒడ్డుతాడు.

'గర్భిణీ స్త్రీ తన ఆరోగ్యాన్ని తన కడుపులోని బిడ్డయొక్క ఆరోగ్యాన్ని ఎంత జాగరూకతతో చూస్తుందో రాజు ప్రజల పట్ల, తన పట్ల అంత జాగ్రత్త వహించాలని శాంతి పర్వం ఉద్ఘోషిస్తుంది.

## 3.0 మత ధార్మిక, సంస్కృతీ పరమైన విషయాలు

శాంతి పర్వంలో మతధార్మిక, సంస్కృతీ పరమై విషయాలను చర్చించే కథలు అనేకం కన్పిస్తాయి. యుధిష్టరుడు ధర్మ విషయమై భీష్ముని ప్రశ్నింపగా ఆయన జాజలి – తులాధారుల కథను వినిపిస్తాడు. జాజలి మహర్షి చాలా కఠోరమైన తపస్సు చేసేవాడు. ఆ తపస్సుకి ఫలితంగా పెరిగిన జఠలలో ఒక పక్షి జంట గూడు కట్టుకుంది. అయినప్పటికీ ఆయన ఏమాత్రం చలించలేదు. ఇలా వుండగా కొంతకాలానికి తాను మహా ధర్మాత్ముడనని అనుకున్నాడు. ఆకాశాన్ని చూసి నేను ధర్మాన్ని సాధించాను అని గట్టిగా పలికాడు. అప్పుడు ఆకాశవాణి "జాజలీ ! నీవు ధర్మంలో తులాధారికి సాటిరావు" అని అంటుంది. తులాధారి జాజలి మహర్షికి దర్మాన్ని ఆచరించినందువల్లే నేను ఇంతటి స్థితిని సంపాదించానని చెప్తాడు.

ఇలాగే విచఖ్నుడు అహింసా ధర్మాన్ని ప్రశంసిస్తూ చెప్పిన "చిరకారి కథ" ధర్మ ప్రాధాన్యాన్ని చెప్పిన "బ్రాహ్మణ కుండధారుల కథ" ఈ కోవకు చెందినవే. అలాగే జైగీషవ్యుడు దేవలునికి సమత్వబుద్ధిని ఉపదేశిస్తూ చెప్పిన కథ, అలాగే సాధు వర్తనుల విషయంలో ఎలా మెలగాలో చెప్పిన "అజగరముని సంవాదం" మనిషికి సద్బుద్ధి వుండాలని చెప్పే "ఇంద్ర – కశ్యపుల సంవాదం" అలాగే జపమహిమను తెలిపే ఒక బ్రాహ్మణుని కథ, కపిలుడు స్యూమరశ్మికి ధర్మమే శ్రేష్ఠమని చెప్పిన కథ ఎంతో ముఖ్యమైనవి.

## 3.1 నైతిక విషయచింతన

శాంతి పర్వంలోని చాలా కథలు రాజులలో, ప్రజలలో నైతిక నిష్ఠను పెంచేవిగా కనిపిస్తాయి. ఇంద్ర ప్రహ్లాదుల కథ ఈ కోవకు చెందినదే. రాక్షస రాజైన ప్రహ్లాదుడు ఒకసారి ఇంద్రుని రాజ్యాన్ని హస్తగతం చేసుకుంటాడు. ఇంద్రుడు బృహస్పతి వద్దకు వెళ్ళి తన బాధలు తీరే మార్గం చెప్పమంటాడు. బృహస్పతి ఇంద్రుని శుక్రాచార్యుని వద్దకు, శుక్రాచార్యుడు ప్రహ్లాదుని వద్దకు పంపుతారు. బ్రాహ్మణుడి వేషంలో ప్రహ్లాదుని సేవించుకున్న ఇంద్రుడు అతడు వరం కోరుకోమన్నప్పుడు "తమ శీలాన్నే దయచేయండి" అని ప్రార్థిస్తాడు. ప్రహ్లాదుడు దానమిస్తాడు. ఎప్పుడైతే శీలాన్ని దానం చేసాడో అతని నుండి తేజోమూర్తి అయిన శీలం ఇంద్రుని వద్దకు వెళ్లిపోతుంది. శీలం వెళ్లిపోయాక వరుసగా ధర్మం, సత్యం, సదాచారం, బలం, చివరికి లక్ష్మీదేవి కూడా అతని నుండి బయలుదేరి ఇంద్రుని చేరుతుంది. అందువల్ల శీలము కనుక లేనట్లైతే మనిషిలో అన్ని గుణాలు నశిస్తాయని ఈ కథ తెలియజేస్తుంది. కావున రాజులు శీలనిర్మాణం కల్గి ఉండాలని శాంతి పర్వం నిర్ద్వంద్వంగా చెప్తోంది.

అలాగే దమము యొక్క ప్రభావాన్ని వివరిస్తూ ప్రహ్లాద ఇంద్రుల కథ శాంతి పర్వంలో ఉంది. ఈ కథలో ప్రహ్లాదుడు మనిషి సరళంగా, జాగరూకుడై, నిర్మల బుద్ధి, చిత్తస్థిరత్వం కలిగి, పెద్దలను, వృద్ధులను సేవిస్తే గొప్ప స్థితిని పొందవచ్చని ఇంద్రునికి బోధిస్తాడు. ఇలాంటి కథలు శాంతిపర్వంలో కోకొల్లలుగా దర్శనమిస్తాయి.

### 3.2 ఆముష్మిక విషయచింతన

మహాభారత శాంతి పర్వంలో ఆముష్మిక విషయాలు చెప్పే కథలు ఎన్నో కనిపిస్తాయి. భీష్ముడు ధర్మరాజుతో ధర్మార్థకామాల్లో ఒకదాన్ని మాత్రమే గ్రహించినట్లైతే వాడు అధముడని, రెండింటినీ ఆచరించినవాడు మధ్యముడని, అన్నింటికీ సమ ప్రాధాన్యాన్ని ఇచ్చినవాడు ఉత్తముడని అంటాడు. ఈ మాటలను విన్న ధర్మరాజు మోక్షాన్ని పొందడమే ఉత్తమ ధర్మమని తెలుసుకుంటాడు. నారద దేవల సంవాదం, మాండవ్య జనక సంవాదం, జనక మహారాజు – పరాశరుని సంవాద కథలు, యాజ్ఞవల్క్యుడు జనకునికి, వ్యాసుడు శుకునకు చేసిన ఉపదేశాలు, నరనారాయణులు – నారదుడు, ఉ పరిచరవసుకథ ఇవన్నీ కూడా ఆముష్మిక విషయాలను చర్చించేవే.

### ముగింపు

ఈ విధంగా మహాభారత శాంతి పర్వం సృష్టి క్రమం మొదలుకుని రాజులు, రాజ్యాలు వారి విధులు ఆనాటి సాంఘిక వ్యవస్థ, వర్ణాశ్రమ ధర్మాలు, ఆధ్యాత్మిక తత్వం, పంచభూతాలు, ప్రళయం, మృత్యుస్వరూపం, యోగసాంఖ్యలు, శివ విష్ణు పారమ్యాలు, బ్రహ్మ స్వరూపం మొదలైన వాటిని విస్తృతంగా చర్చించింది. రాజ్యపాలనలో ధర్మలోపం కలుగుతుందేమోనన్న ధర్మజుని భీతి శాంతి పర్వంలో అడుగడుగునా దర్శనమిస్తుంది. మోక్షావలంబనమే ఉత్తమ ధర్మమని తెలియజేయబడుతుంది. రాజులకు నీతిని బోధించడం వలన మానవ సమాజాన్ని అరాచకం, అవ్యవస్థల పాలు కాకుండా ఉండడానికేమో తెలుస్తుంది. తద్వారా మానవ సమాజం వసుధైక కుటుంబంగా మనుగడ సాగించాలని మహాభారతం ఆకాంక్షిస్తుంది మహాభారతంలో భీష్మాచార్యులు బోధించిన ఈ ధర్మ సూక్ష్మమైన కథలు నేటి ఆధునిక మానవునికి తప్పక వర్తిస్తాయి. ఈ కథలను కేవలం పురాణ కథలుగా కొట్టిపారేయకుండా విమర్శనాత్మక దృష్టితో అధ్యయనం చేస్తే ఆనాటి రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలు వెలికితీయవచ్చు. తద్వారా వర్తమాన సమాజానికి అన్వయించుకుని మన పూర్వుల అనుభవాలను మన భావి పురోగతికి సోపానాలుగా చేసుకోవచ్చు. రాజకీయ, సామాజిక, సాంస్కృతికాంశాల విషయంలో “యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్” అనే మాటను శాంతిపర్వంలోని భీష్మ సందేశం సార్థకం చేస్తుంది.

### ఆధారగ్రంథాలు

1. ఆరుద్ర – సమగ్ర ఆంధ్ర సాహిత్యం (1,2,3, సంపుటాలు)
2. కుటుంబరావు, కొడవటిగంటి – సాహిత్య ప్రయోజనం
3. తిక్కన సోమయాజి – కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతం 12, 13 సంపుటాలు (తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి)
4. నరసింహం, కె.వి.ఆర్ – సాహిత్య దర్శనం
5. రామచంద్రారెడ్డి, రాచమల్లు – సాహిత్య వ్యాసాలు
6. లక్ష్మీకాంతం, పింగళి – ఆంధ్ర సాహిత్య చరిత్ర

# 39. కవిత్రయ మహాభారతం - వర్తమాన సమాజం సమాలోచనం - భక్తిభావం

- డా॥ జి.లక్ష్మీనారాయణ, కరీంనగర్

**వ్యాసవిరచిత భారతామ్నాయ మాంధ్ర భా**
**షగ నొనర్చి జగతిఁబొగడు గనిన**
**నన్నపార్యు తిక్కనను కృతక్రతు, శంభు**
**దాసు నెఱ్ఱ సుకవి దలతు భక్తి**

**భారతావతరణం –భక్తి ప్రాతిపదికత**

"శ్రీ వాణీగిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే" అనే శ్లోకంతో తెలుగు భారతం మొదలయింది.

దేవతాస్తుతి, సృష్టిస్థితి లయాత్మకత, మొదలైన అంశాలను ధ్వనింపజేసిన శ్లోకం ఇది.

నన్నయ భారతం రాయడానికి కారణం రాజరాజ నరేంద్రుని కోరిక మాత్రమే.అనేక పురాణాదులు విన్నప్పటికీ భారతమంటే నాకిష్టం కనుక దాన్ని తెనిగించుమని కోరాడు.

**"ఏయది హృద్యమపూర్వం**
**బేయది, ఎద్దాని వినిన ఎఱుక సమగ్రంబై యుండు"**

అక్కథ వినిపించుమన్నాడు రాజు. ఇందులో ఎఱుక అనేది జ్ఞానం అనే మాటకు అచ్చుతెలుగు పదం. ఈ జ్ఞానం భగవత్తత్త్వము మాత్రమే.

రాజు ఈ కోరిక కోరడానికి తన వంశీయుల కథ అనే విషయం అట్లా ఉంచి ఆనాటి సమాజంలో జైనము, బౌద్ధము వంటి వాటికి ప్రాచుర్యం పెరిగి భక్తి భావన కంటే ఇతరేతర విషయాలపై ప్రజలను మళ్ళించుటయే జరుగుతున్నది. బహుభాషల బహువిధముల

**బహుజనముల వలన వినుచు భారత బద్ధ**
**స్పృహులకు వారికి**
**బహుయాగంబుల ఫలంబు పరమార్థమిలన్. ...........**

అని అప్పటికే బహుభాషలలో భారతం వచ్చినప్పటికీ బహువిధాలుగా చెప్పబడింది అని అనడం పంపభారతం వంటివి భక్తి ప్రధానం కాక జైనాది మతప్రభావ జనితం అని ధ్వనింపజేశారు.

తత్కారణంగా వైదిక విషయాలను కేవల వేదాంతం గా కాక కథారూపంలో ఉన్న పంచమ వేదం అనదగిన మహాభారతం తెలుగులో ప్రకటింప జేయాలని చాళుక్యరాజు రాజరాజ నరేంద్రుని అంతరంగం. "మోక్ష సాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ" అని శాస్త్రోక్తికి కవిత్రయం వారి తెలుగు మహాభారతం ఒక నిదర్శనం. భారతం ఆవిర్భావానికి నాటి సామాజిక వాతావరణం కూడా ఒక ప్రధాన కారణం అని భావించాలి.

నన్నయ ప్రారంభించిన దేవతాస్తుతి వంటి అవతారికలు తరువాతి వారికి సంప్రదాయమై నిలిచాయి.కవిత్రయం లో తిక్కన కూడా " శ్రీయన గౌరినా బరగు చిత్తము చెల్వకు చిత్తము పల్లవింప" అని శివకేశవాభేద తత్త్వాన్ని ప్రతిపాదిస్తూ జ్ఞాన మార్గాన్ని మరింత స్పష్టం చేశారు. ఇదికూడా సమకాలీనమైన శైవ, వైష్ణవ భేదాభిప్రాయాలు తొలగించి జ్ఞానం ఒక్కటేనని తెలుపడం.

సామాన్యులకు కథ ఇష్టం. ఆ కథతో పాటు జ్ఞానాన్ని ఇవ్వాలి. అంతే కాదు అందుకు అవసరమైన మార్గాన్ని సూచించాలి. ఆ మార్గం భక్తి మార్గం. నిజానికి ఇది భాగవతంలో ఉన్నంత స్పష్టంగా భారతంలో లేకపోయినప్పటికీ ' లోనారసి' చూసిన వారికి అర్థమయ్యే విషయం. కేవల భక్తి మార్గమే ప్రచారం చేస్తే జీర్ణించుకొనే దశ ఆనాటి సమాజానికి లేకపోవచ్చు. జైనమత ప్రాబల్యం వల్ల మహాభారతం కన్నడంలో పంప కవి " విక్రమార్జున విజయం" అనే పేరుతో కథా ప్రాధాన్యతా క్రమాన్ని మార్చి రాసిన తీరు ఆనాటి పండితులకు పరిచితమే! ఆ అంశాలను దృష్టిలో ఉంచుకొని మహాభారతం ఎట్లా రాయాలనే ప్రణాళికను ఒక విధంగా రాజు సూచిస్తే అంతకన్నా అద్భుతంగా నన్నయ ఆరంభించాడు. తిక్కన, ఎఱ్ఱన ఆమార్గాన్ని మరింత స్పష్టం చేస్తూ పూర్తి చేశారు.

భారతం యొక్క అవతారికయే వైదిక విషయాలను ఉద్ధరించడం, అందుకని భక్తి భావాన్ని కలిగించడం అని అర్థమవుతుంది.

వ్యాసమహర్షి ప్రతిపాదించిన జ్ఞానమే ఇందులో ప్రకటితమైనప్పటికీ ఈ సమయంలో తెలుగులోకి రావడం అనేది చారిత్రక సందర్భం.

**కవిత్రయం వారి భక్తి భావన**

నన్నయ ప్రారంభ శ్లోకంలో లక్ష్మీ సరస్వతి గిరిజా దేవతలను కూడియున్న విష్ణువు బ్రహ్మ శివులను స్తుతించాడు. ప్రజలకు సతీసమేతమైన దేవతా స్వరూపాలను, వారి కర్తవ్యాలను తెలియజేయడమే ఐనా కవి స్వీయ ఆరాధనా భావాన్ని వ్యక్తం చేశాడు.

తిక్కన "శ్రీయన గౌరినాబరగు చెల్వకు చిత్తము పల్లవింప" అనే పద్యంలో కూడా శివకేశవాభేదాన్ని ప్రతిపాదిస్తూనే ఇద్దరి ఉనికిని స్పష్టం చేశాడు.

ఎఱ్ఱన 'అంబ నవాంబుజోజ్వల కరాంబుజ' అనే పద్యంలో సరస్వతిని స్తుతించాడు.

కవిత్రయం వారు స్వయంగా తమ భక్తిని చాటుకుంటూ సందర్భం వచ్చినపుడు ఆయా దేవతలను స్తుతించడం కనబడుతుంది.

**ప్రధాన కథ - భక్తి భావన**

మహాభారతంలో దేవతలు వారి పట్లభక్తి గల పాత్రలు అనేకం ఉన్నాయి. కురుపాండవ పితామహుడు భీష్ముడు శ్రీకృష్ణుని గురించి తెలిసిన వాడు. ఆయన అవతారమని గ్రహించిన వాడు. కృష్ణుని పట్ల భక్తి గలవాడు. ధర్మరాజు రాజసూయ యాగంలో కృష్ణుని సభకు పూజ్యుడుగా ఉండదగినవాడని సూచించాడు భీష్ముడు.

**ఆదిజుడైన బ్రహ్మ యుదయంబున కాస్పదమైన వాడు వే**
**దాది సమస్త వాఙ్మయములందు ప్రశంసితుడైనవాడు లో**
**కాది త్రిపూజ్యుడని యాత్మ నెఱింగి పితామహుండు దా**
**మోదరు జెప్పె పూజ్యుడని యుక్తమ కాకిది యేమి దోసమే...........**

అన్నాడు. నన్నయ ఇక్కడ భీష్ముని భక్తి హృదయాన్ని ఆవిష్కరించాడు.

ఆరణ్యపర్వంలో అర్జునుడు పాశుపతాస్త్రము కోసం శివుని గురించి తపస్సు చేయడం మారు రూపంలో ఉన్న శివుని తో పోరాడి మెప్పించడం ఆ పరమ శివుని ద్వారా పాశుపతాస్త్రాన్ని పొందడం అనే ఘట్టం భక్తి ప్రధానమైనదే.

శివుడు ప్రత్యక్షం కావడం అర్జునుడు స్తుతించడం వర్ణించబడింది.

**వరదు సురాసుర వందితు**
**కరుణాకరు హరు పినాకధరుం కరి చర్మాం**
**బరు శంకరు గిరిజా సుం**
**దరు నిట్లని స్తుతియించి తద్దయు భక్తిన్**

అని యిక్కడ శివుని స్తోత్రం చేస్తూ ఒక దండకం కూడా రచించాడు నన్నయ.

అర్జునుడు దుర్యోధనుని గంధర్వుల బారినుండి రక్షించడానికి వారితో యుద్ధం చేయడం అతని పరాక్రమమే అయినా ఇంద్రుడు మెచ్చి అర్ధసింహాసనమిచ్చి గౌరవించిన సందర్భం, ఇంద్రాది దేవతల ప్రాధాన్యాన్ని తెలుపడమే.

ద్రౌపది పూర్వ జన్మ వృత్తాంతం లో పరమ శివుడు ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనగా ఐదు మార్లు పతిభిక్ష వేడిందని అందువలన ఐదుగురు భర్తలుగా వచ్చారని తెలిపారు. ఈ సందర్భంలో శివుని వర ప్రసాదం కూడా శివుడు భక్తవరప్రసాదుడు అని చెప్పడం భక్తి భావాన్ని వ్యక్తం చేయడమే.

అరణ్యపర్వ పంచమాశ్వాసంలో కుమార స్వామి పుట్టుకను గురంచిన కథకూడా శివుని గురించి తెలుపునదే. ద్రోణ పర్వంలో కృష్ణార్జునుల గురించి వ్యాసుడు తెలుపుతూ విష్ణువు శివుని స్తుతంచిన విషయాన్ని వివరించారు. ఇక్కడ విష్ణువు, శివుని స్తుతించడం ఒకరికంటే ఒకరు ఎక్కువ అని కాకుండా ఇరువురు పరస్పర భక్తి విశ్వాసాలతో ఉన్న అంశాన్ని కవి మనకు తెలియజెప్పడం.

కర్ణపర్వంలో త్రిపురాసుర సంహారమున్నది. ఇది శివప్రాధాన్యతను తెలుపడమే.

అనేక సందర్భాలలో శివుని గురించి అతని వరప్రసాద గుణాలను గురించి శక్తులను గురించి తెలుపడం భారత పాఠకులకు శివుని పట్ల భక్తి భావన కలిగించుటకు కారణమని భావించవచ్చును.

సంజయుడు రాయబారానికి పాండవుల వద్దకు ఉపప్లావ్యమునకు వెళ్ళినపుడు ''సంజయుండు కృష్ణు సద్భక్తి వీక్షించి, పవనపుత్రు పార్థు కవల ద్రుపద తనయ సవినయమున కనుగొని.. అన్నారు తిక్కన. సంజయుడు కృష్ణుని భక్తితో చూశాడు అనే అంశం ఇక్కడ గమనార్హం.

ధర్మరాజు రాయబారానికి కృష్ణుని పంపించే ముందు

**"ఆపద గడవం బెట్టగ**
**నోపి శుభంబైన దాని నొడగూర్పగ , మా**
**కీ పుట్టువునకు పాండు**
**క్ష్మాపాలుడు నిన్ను జూపి చనియె మహాత్మా"**

అని చెప్పడం ఆయనచేతిలో తమ తండ్రి పెట్టినాడనే పితృభక్తి తో పాటు శ్రీకృష్ణుడు మాత్రమే ఎల్లవేళలా కాపాడ గలిగే దైవం అనే అర్థం ధ్వనించే విధంగా ధర్మరాజు మాటలు స్పష్టమవుతున్నాయి.

రాయబారానికి వెళ్లిన కృష్ణుడు కుంతిని కలుసుకోగా ఆమె పలువిధాలుగా తమ బాధలను చెప్పికొని దుఃఖించింది అంతే కాదు

**"వారలక యేల మాధవ /**
**కౌరవులకు మఱియు నీజగంబుల కెల్లం/**

**జేరుగడ నీ పలు/**

**కారయ వేదంబ కాద యఖిలంబులకున్" ...**

అని అంటుంది. కృష్ణుడు వేదస్వరూపుడు అనే అర్థంతో పాటు నీ మాటలు చేతలు వేదాల వంటి ప్రామాణ్యము కలవి అని లోకోక్తి గా కనపడుతుంది. కాని ఈ జగములకన్నిటికీ నీవే రక్షకుడవు అని వేదం చెప్పిన మాట ఇక్కడ స్పష్టం. " సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ " అని భగవద్గీతలో చెప్పిన భక్తి భావార్థం ఇందులో వ్యక్తమవుతున్నది.

విదురుడు శ్రీకృష్ణునికి విందుఏర్పాటు చేసి అత్యంత భక్తి తో "

**గోవింద! సంభ్రమము సం**

**భావింపుము మాకు నిదియ పరమ ధనం బొం**

**దేవిధమున నీ కర్చన**

**గావింపంజాలువాడు కలడే యెందున్..............**

అన్నాడు. గోవింద అనే సంబోధన నిన్ను అర్చించగలవాడెందులేడనుట ఆయన మహత్యాన్ని గుర్తించి భజించడమే.

**"అతని వచన రచన ఆత్మలో తలపోసి**

**యిట్టి వాడు కలడె యెందు ననుచు**

**పాలకడలి పాటియై యెప్పు న**

**ప్పాన్పునందు శౌరి పవ్వళించె..................**

ఇక్కడ కృష్ణుడు సాక్షాత్తూ విష్ణుమూర్తియే అని చెప్పకయే చెపుతున్నాడు తిక్కన . ఇది వర్ణనాంశమే కాని ఇక్కడ భగవద్విషయాన్ని వెల్లడించడం తిక్కన భారతార్థవివరణా నైపుణ్యంగా భావించాలి.

**ఉపాఖ్యానాలు – భక్తి భావము**

ప్రధానకథలోనే కాక శాంతి పర్వం మొదల్కెన వాటిలోని అనేక కథల ద్వారా శ్రీవైష్ణవ భక్తి ప్రపత్తులను వివరించే ఘట్టాలు, కథలు, సంవాదాలు ఉన్నాయి.

వ్యాసభీష్ములు, భీష్మనారదులు, ధర్మరాజు ఆయా ఆశ్రమాలలో మునుల ద్వారా విన్నకథలలో శ్రీ మహావిష్ణువు గురించి భగవంతుని గురించి అనేక కథలు, సందర్భాలు ప్రస్తావించబడినాయి.

భగవద్గీత మహాభారత మధ్య మణి వంటిది. తిక్కన దానిని యథాతథంగా అనువదించక పోయినప్పటికీ సంక్షిప్తంగా కర్మప్రాధాన్యాతను, భగవత్తత్వాన్ని ప్రతిపాదించారు. కర్మ, భక్తి, జ్ఞాన యోగములను గురించి వ్యక్తం చేశారు.

గరుడోపాఖ్యానంలో దేవతలగురించి, సావిత్రి ఉపాఖ్యానంలో యముని ఎదిరించడం, నలదమయంతుల ఉపాఖ్యానంలో దైవవిధిని నిరూపించడం, ఉదంకోపాఖ్యానంలో ప్రతీకలుగా కాలాన్ని, సృష్టి స్వరూపాదులను వివరించడం, నాగదేవతలను స్తుతించడం వంటివి ఎన్నో శతాధిక సన్నివేశాలు కవిత్రయం వారి భారతంలో దర్శనమిస్తున్నాయి.వీటన్నిటిలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో భక్తి భావమే ప్రకటితమవుతూ ప్రజలను క్రమంగా ఆయా దేవతలవైపు మనసు మళ్ళించడమే జరిగింది.

ఆనాడు తపస్సులు చేశారు. యజ్ఞయాగాదులు చేశారు. స్తోత్రాలు చేశారు.

ఈనాడు వర్తమాన సమాజంలో కలియుగంలో అవతార రూపాలు లేవు కనుక అర్చారూప మూర్తుల ఆరాధనమే ప్రధానం కనుక అదే అనుసరిస్తున్నారు.

మార్కండేయ మహర్షి ధర్మరాజుతో కలిగురించి తెలుపుతూ

**జపనియమ స్వాధ్యాయ**

**ప్రపంచములు విడువగలరు బ్రాహ్మణులు జనా**

**ధిప శూద్రులు విపుల తపః**

**క్షపితులు కాగలరు వినవె కలికాలమునన్ ..................**

అన్నారు. కలియుగ ధర్మం ప్రకారం బ్రాహ్మణ బ్రాహ్మణేతర భేదం లేకుండా భక్తి భావన ఎల్లెడలా ప్రకటితమవుతున్నది. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వంటి ఆలయాలకు లక్షలాది భక్తజనం ప్రతిరోజూ వెళ్ళటం ఈనాటి జనుల భక్తికి ఉదాహరణ. కాశీ విశ్వనాథుడు, శ్రీశైలాది క్షేత్రాలు, కేదారినాథ్, బదరీనాథ్ వంటి క్షేత్రాల దర్శన అమితంగా ఈనాడు కనపడుతున్నది.

జ్ఞానభక్తి తగ్గినా, అమాయకపు భక్తి దైవం పట్ల విశ్వాసం భక్తి భావన ఈనాడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అట్లే శివకేశవ వైషమ్యాలు లేవు. ఇరుదైవాలను అర్చించేవారు. భక్తితో భజించే వారున్నారు. అయ్యప్ప స్వామిని కోట్లాది భక్తులు హరిహరనాథ తత్త్వంగా ఆరాధిస్తున్నారు. నియమనిష్టలను పాటిస్తూ సేవిస్తున్నారు. శ్రీరాముడు, ఆంజనేయుడు, దుర్గ, మహంకాళి, సరస్వతీ పూజలు జరుగుతున్నాయి. యథాశక్తి గ్రామదేవతల రూపాలలో కూడా పూజిస్తున్నారు.

శ్రీ వైష్ణవాచార్యులు, శ్రీశంకర శారదా పీఠాధిపతులు, పాంచరాత్ర, వైఖానసాది ఆగమశాస్త్రాల ప్రకారం ఇప్పటికీ యజ్ఞయాగాదులు నిర్వహింపబడుతున్నాయి. దానధర్మాది అంశాలు ప్రజలలో భక్తి భావనతో ముడిపడి అలవడుతున్నాయి. అయ్యప్ప, దుర్గ, హనుమాన్, శ్రీరామ, శ్రీవేంకటేశ్వర, శ్రీశివ మొదలైన పేర్లతో దీక్షలు చేపడుతున్నారు. నియమనిష్ఠలు పాటిస్తున్నారు. ఇంత భక్తి భావనకు మన దేవతలు వారిని గురించి తెలిపిన మహాభారతం వంటి వేదాస్త్రము, ఇతిహాసము, తెలుగులో ప్రచారం కావడం కూడా కారణమేనని సందర్భ సహితంగా స్పష్టమవుతున్నది. భారతంలోని కథాసన్నివేశాలు, జరిగిన మన భారతదేశ స్థలాలు, పర్వతాలు, నదులు పుణ్యస్థలాలుగా తీర్థాలుగా క్షేత్రాలుగా భావించబడి అశేషజనంతో ఆరాధింపబడుతుండడం కూడా మహాభారత ప్రాశస్త్యాన్ని తెలుపుతున్నాయి. తెలుగు ప్రాంతంలో అర్జునుడు తపస్సు చేసినాడని ఇంద్రకీలాద్రి అని పిలువబడే క్షేత్రం ఇందుకు ఒక ఉదాహరణ. హిమాలయాలలో కేదారినాథుడు వెలసినందుకు పాండవుల కథనే తెలుపుతారు. కురుక్షేత్రం, బదరీవనం మొదలైనవెన్నో దేశంలో మహాభారత కథాసన్నివేశాలకు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ నేటికీ భక్తి భావపరిపూర్ణాలు.

ఇదంతా తెలుగునాట ఈనాటికి కనపడుతున్న భక్తి భావనయే. ఈ భావన సనాతనంగామన దేశంలో తెలుగు వారిలో ఉన్నప్పటికీ ఆయా చారిత్రక కారణాలచేత మరుగుపడుతున్న దశలో తెలుగులో కవిత్రయం మహాభారతం వెలువడడం తెలుగునాట భక్తి బీజాలు నాటబడినాయి. అవి ఇప్పుడు శాఖోపశాఖలుగా విస్తరించి భక్తి భావాన్ని పరిమళింపజేస్తున్నాయి.

నన్నయగారు చెప్పినట్లు "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని ............. పద్యంలో

**వివిధ తత్త్వవేది వేద వ్యాసు**

**దాదిముని పరాశరాత్మజుండు**

**విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై**

**పరగు చుండ జేసె భారతంబు..................**

అని భారతాన్ని అనేకార్థాలలో ఎవరు ఏ దృష్టితో పరికిస్తే ఆ జ్ఞానం కనిపించేలా విశ్వజనులందరికీ ఆకర్షణగా భారతాన్ని విష్ణుస్వరూపుడైన వ్యాసుడు తెలిపాడు.

ఈ అనేక విషయాలలో భక్తి భావన ప్రధానమైనది.

యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి నతత్ క్వచిత్ (what is in MahaBharata is every where, what is not in MahaBharata is no where esle) మహాభారతంలో ఉన్నదే నేటికీ ఉన్నది. అందులో లేనిది నేటికీ ఏదీ లేదు. అందులో కేవలం ఒక భక్తి భావ అంశాన్ని స్థాలీపులాక న్యాయంగా మీ ముందుంచాను. విజ్ఞులు గ్రహిస్తారని, విద్యార్థులు పరిశోధకులు ఈ అంశాన్ని మరింత అవగాహన చేసుకోవడానికి కవిత్రయం మహాభారతాన్ని మరోసారి అధ్యయనం చేస్తారని ఆశిస్తున్నాను, ఇంత చక్కటి అంశాన్ని సదస్సులో ఏర్పాటు చేసి నాకు మాట్లాడే అవకాశం కల్పించి మరోసారి నేటి ప్రజలకు భక్తిభావన కలిగించేందుకు దోహదం చేసిన విశ్వవిద్యాలయ నిర్వాహకులకు ధన్యవాదాలు.

**నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్**
**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్**

**ఆధార గ్రంథాలు**

1. కవిత్రయ మహాభారతం – తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి
2. మహాభారతం పాత్రచిత్రాలు మహిళా దర్శనం – ఎన్. శాంతమ్మ
3. శ్రీమదాంధ్ర సంపూర్ణ మహాభారతం – వసుంధర పబ్లికేషన్స్.

# 40. నన్నయ శకుంతలోపాఖ్యానం - గృహస్థాశ్రమ విశిష్టత

– డా॥ పొట్లూరి శ్రీనివాసరావు, చింతలపూడి, ఏలూరుజిల్లా

## 1. ఉపోద్ఘాతం

ప్రతీ మనిషికీ నైతిక జీవితం చాలా అవసరం. కానీ ప్రస్తుత సమాజంలో అటువంటి నైతిక ప్రవర్తన కొరవడింది. ప్రతీ వ్యక్తి వ్యక్తిగతంగా నీతిని కలిగివుండడంతో పాటు సంఘపరంగా కూడా తన నైతిక విలువల్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. ప్రధానంగా నీతి అనేదానిని ఉపదేశంగా స్వీకరించినా దానిలో అంతర్లీనంగా ఇమిడివున్న ధర్మం, సత్యం అనే అంశాలను కూడా మనం గ్రహించాలి. ఎందుకంటే, సంఘంలో మంచివాడుగా నటించే క్రమంలో చాలామంది నీతి అనే ముసుగును ధరిస్తున్నారు. అది ఎప్పటికీ మంచిది కాదు. విలువలతో కూడిన నీతివంతమైన జీవితానికి ప్రాధాన్యత నివ్వడం, ధర్మానికి కట్టుబడివుండటం, సత్యాన్ని జీవితంలో భాగంగా కలిగివుండటం అనే లక్షణాలను ప్రతీ మనిషి అలవాటు చేసుకోవడం వల్ల వాటిని తర్వాతి తరాలు కూడా అనుసరించే అవకాశం ఉంది. ఈ విషయాలను నన్నయ్య మహాభారతంలో ఎంతో ప్రతిభావంతంగా చిత్రించాడు.

## 2. నన్నయ మహాభారతము – విశిష్టత

తెలుగు సాహిత్య చరిత్ర అనువాదంతో ప్రారంభమైందనేది నిర్వివాదాంశం. యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్ అన్నట్లు 'లోకంలో ఉన్నదంతా భారతంలో ఉంది, భారతంలో లేనిదేదీ లోకంలో లేదు' అనేంతగా ఆంధ్రమహాభారతం తెలుగుజాతి గుండెల్లో ఈనాటికీ సజీవంగా ఉండడమే కాక నన్నయ్యను ఆదికవిగా నిలబెట్టింది. ఆంధ్రమహాభారతం అనువాదం అని చెప్పబడుతున్నప్పటికీ నన్నయ్య దానిని స్వతంత్రకావ్యంగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు.

మూలగ్రంథంలోని కథాంశాన్ని గ్రహించి దానిని తెలుగు వారి సంస్కృతికి, సంప్రదాయాలకు అనుగుణంగా తీర్చిదిద్దాడు. అందుకే 'ధర్మతత్త్వజ్ఞులచేత ధర్మశాస్త్రమని, అధ్యాత్మవిదులచేత వేదాంతమని, నీతి విచక్షణులచేత నీతి కావ్యమని, కవివృషభులచేత మహాకావ్యమని, లాక్షణికులచేత సర్వ లక్షణగ్రంథమని, ఐతిహాసకుల చేత ఇతిహాస గ్రంథమని, పరమ పౌరాణికులచేత బహుపురాణ సముచ్చయమని' మహాభారతం కొనియాడబడుతోంది. వ్యక్తుల నైతిక ప్రవర్తనకు, ధర్మబద్ధ జీవితానికి, మంచిచెడుల విశ్లేషణకు అధిక ప్రాముఖ్యతనిచ్చింది మహాభారతం. అందుకే మహాభారతంలోని పాత్రలన్నీ మన కళ్ళముందు సజీవంగా నిలిచివున్నాయంటే దానికి కారణం పాత్రల సజీవ రూపకల్పనలో నన్నయ అనుసరించిన విశిష్టతేనని చెప్పవచ్చు. సంస్కృతంలో వ్యాసమహర్షి మహేతిహాసంగా మహాభారతాన్ని తీర్చిదిద్దితే దాన్ని అత్యంత ప్రతిభా వ్యుత్పత్తుల చేత నన్నయ రామణీయకంగా తీర్చిదిద్దాడు. భారతంలో ఎన్నో కథలున్నాయి. ఉపాఖ్యానాలున్నాయి. వర్ణనలకూ, అలంకారాలకు అత్యంత ప్రాధాన్యాన్ని ఇస్తూనే ఉపదేశాన్ని ఉక్తి వైభవంతో మేళవించి భారతాన్ని రచించాడు.

అందులో ప్రత్యేకంగా శకుంతలోపాఖ్యానం విశిష్టమైంది. ఇందులో దాంపత్య ధర్మాలకు పెద్దపీట వేశాడు నన్నయ. సమాజంలో కుటుంబానికి ఉండాల్సిన లక్షణాలను, భార్యాభర్తల మధ్య ఉండాల్సిన ప్రేమానురాగాలను, నమ్మకాన్ని, భార్య ఔన్నత్యాన్ని, పుత్ర ప్రాధాన్యాన్ని వివరిస్తూనే సత్యం యొక్క విశిష్టతను తెలియజెప్పాడు. ఒకరకంగా చెప్పాలంటే గృహస్థాశ్రమ ధర్మానికి చక్కని ఉదాహరణగా శకుంతలోపాఖ్యానాన్ని తీరిచిదిద్దాడు.

## 3. శకుంతలోపాఖ్యానము – విశిష్టత

పద్దెనిమిది పర్వాలను తెనిగించడానికి పూర్తి ప్రణాళికను సిద్ధంచేసుకున్నా దురదృష్టవశాత్తు రెండున్నర పర్వాల అనువాదంతోనే నన్నయ కలం ఆగిపోయింది. తాను రాసిన ఆది, సభా, అరణ్య పర్వం అనే రెండున్నర పర్వాలలోనే చెప్పదలచుకున్న విషయాలను ఉపాఖ్యానాల రూపంలో ఎంతో ప్రతిభావంతంగా చిత్రించాడు నన్నయ.

అంతేగాక శకుంతలోపాఖ్యానం మొదలైన ఉపాఖ్యానాల ద్వారా మానవులు నడుచుకోవలసిన రీతిని, అనుసరించవలసిన నీతినీ బోధించాడు నన్నయ్య. అందుకు ప్రతిబింబంగా నిల్చే ఉపాఖ్యానం శకుంతలోపాఖ్యానం. జీవితాన్ని సవాలుగా స్వీకరించి ప్రతికూలమైన పరిస్థితులకు ఎదురొడ్డి నిలిచిన తెలుగింటి ఆడపడుచుగా శకుంతలను నన్నయ తీర్చిదిద్దాడు. అంతేగాక చతురాశ్రమ ధర్మాలలో విశిష్టమైన గృహస్థాశ్రమధర్మ ప్రాధాన్యత కూడా ఈ ఉపాఖ్యానంలో వివరించ బడింది.

మేనక – విశ్వామిత్రుల కుమార్తెగా జన్మించినా వారిచేత విడువబడి అనాథగానే కణ్వాశ్రమంలో పెరుగుతుంది శకుంతల. వేటసమయంలో దుష్యంతుడు కణ్వాశ్రమానికి రావడం, శకుంతలను చూసి మోహించడం, శకుంతల తన జన్మవృత్తంతాన్ని వివరించడం, ఆమె క్షత్రియకన్య అని తెలుసుకున్న దుష్యంతుడు వివాహానికి అంగీకరించమని కోరడం, తన పుత్రుణ్ణి యువరాజుగా చేస్తాననే మాట ఇమ్మని కోరడం, అందుకు అంగీకరించిన దుష్యంతుడు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకోవడం మొదలైన అంశాలు ఈ ఉపాఖ్యానంలో ప్రముఖంగా మనకు కనిపిస్తాయి.

వివాహానంతరం తిరిగి వెళ్ళిపోతూ సకల లాంఛనాలతో తన రాజ్యానికి తీసుకువెళ్తానని చెప్పి దుష్యంతుడు తన రాజ్యానికి వెళ్ళిపోతాడు. ఈ సమయంలోనే శకుంతల గర్భం ధరించి భరతుడికి జన్మనిస్తుంది. బాలుడు పెరిగి పెద్దవాడవుతాడు. అతనికి పట్టాభిషేక సమయం దగ్గరపడిందని కణ్వమహర్షి చెప్పడంతో కుమారుణ్ణి తీసుకుని దుష్యంతుడి ఆస్థానానికి బయలుదేరుతుంది శకుంతల. తనను మర్చిపోయినట్లుగా నటిస్తూ నిరాకరిస్తున్న దుష్యంతుణ్ణి చూసి ఎంతో ఆవేదనకు గురవుతుంది శకుంతల. 'నేను నీ భార్యను, వీడు నీ కుమారుడు' అని ఎంతగా చెప్పినా వినని దుష్యంతునికి సత్యం యొక్క విలువను, ధర్మజీవితం ప్రాధాన్యతను వివరిస్తుంది శకుంతల.

## 4. శకుంతల ధర్మ దృష్టి – ధర్మోపదేశం

ధర్మో రక్షతి రక్షిత: అన్నట్లు ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుంది. ఈ విషయంలో శకుంతల ధర్మనిష్ఠ మనకు అవగతమవుతుంది. ధర్మానికి కట్టుబడి, హృదయం సదా ధర్మాధీనం కావాలని కోరుకున్న ఉదాత్తమైన పాత్రగా శకుంతల ఈ ఉపాఖ్యానంలో మనకు కనిపిస్తుంది. అందుకే తనను వివాహమాడి కూడా ఏమీ తెలియని వాడిలాగా నటిస్తున్న దుష్యంతునితో శకుంతల చెప్పే ఈ క్రింది మాటలు వ్యక్తిగత నీతికీ, ధర్మపద్ధతికీ తార్కాణాలుగా మనకు కనిపిస్తాయి.

**"విమల యశోనిధీ! పురుష వృత్త మెఱుంగుచు నుండు జూవ వే**
**దములును పంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్**
**యముదును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా**
**ర్థము లివి యుండగా నరుదు దక్కొన నేర్చునె తన్ను బ్రుచ్చిలన్"**

మనిషి తాను చేసే పనుల్ని ఎవరూ గమనించడం లేదని భావిస్తాడు. అందుకే ఎన్నో తప్పుల్ని యథేచ్ఛగా చేస్తాడు. కానీ నాలుగు వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, ఉభయసంధ్యలు, మనస్సు, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి అనే మహా పదార్థాలన్నీ మనల్ని నిత్యం గమనిస్తూనే ఉంటాయి. కాబట్టి మనిషి తన అసత్య మార్గాన్ని విడిచి పెట్టి సత్యమార్గంలో పయనించేటట్లుగా తన అంతరాత్మ ప్రబోధాన్ని అనుసరించి నడుచుకోవాలని చెప్పడం శకుంతల ధర్మదృష్టికి నిదర్శనంగా చెప్పవచ్చు.

అంతేగాక మంచి భార్య పుత్రుల వల్ల గృహస్థాశ్రమధర్మం ఆటంకాలు లేకుండా ఎలా నిర్వ హించబడుతుందో, ఎటువంటి సద్గతులుంటాయో కూడా శకుంతల ద్వారా మనం గ్రహించవచ్చు. ఈ క్రింది పద్యం భార్యాభర్తల మధ్య ఉండవలసిన అనురాగాన్ని, ప్రేమను వివరించడంతో పాటు భార్య యొక్క విశిష్టతను కూడా మనకు తెలియజేస్తుంది.

**"ధర్మార్థ కామసాధన కుపకరణంబు గృహనీతి విద్యకు గృహము విమల**
**చారిత్రక శిక్ష కాచార్యకం బన్వయస్థితికి మూలంబు సద్గతికి నూత**
**గౌరవంబున కేక కారణం బున్నత స్థిరగుణమణుల కాకరము హృదయ**
**సంతోషమునకు సంజనకంబు భార్యయ చూవె భర్తకు నొండ్లు గావు ప్రియము"**

ధర్మార్థకామాలను సాధించడానికి సాధనం, గృహనీతి అనే విద్యకు స్థానం, నిర్మల చరిత్రను నేర్పే గురువు, వంశస్థితికి మూలకారణమైనది, ఉత్తమగతికి ఆధారమైనది, గౌరవానికి ముఖ్యకారణంగా భాసింపబడేది, ఉన్నతమగు స్థిరగుణములు కలిగి సంతోషాన్ని కలిగించే భార్య ఎంతో విశిష్టమైంది అనే విషయాన్ని చెప్తూనే, గుణవంతురాలు, పుత్రవంతురాలు, అనుకూలవతి అయిన భార్య వల్ల పుత్రప్రాప్తిని పొందినవాడే గృహస్థాశ్రమ ధర్మాన్ని సంపూర్ణంగా నెరవేర్చి ఇహపరాలు రెండింటికీ అర్హుడౌతాడు అని దుష్యంతుడితో చెప్తుంది శకుంతల. దీనినిబట్టి శకుంతల పాత్రద్వారా ధర్మదృష్టిని, ధర్మ ప్రబోధాన్ని దుష్యంతుడికి బోధించినా అవి మనుషులందరూ పాటించవలసినవే అని చెప్పడం అతిశయోక్తి కాదు.

### 5. శకుంతల నీతి, సత్యబోధ

ఈ ఉపాఖ్యానంలో చెప్పుకోవలసిన మరొక ముఖ్యాంశం శకుంతల చేసిన నీతి, సత్యబోధలు. ధర్మాన్ని, సత్యాన్ని అనుసరించడం మానవుని నీతియుక్తమైన జీవితానికి పునాదులు వేస్తుందనే విషయం మనకు ఈ ఉపాఖ్యానంలో వివరించబడింది. అందుకే తనను స్వీకరించడానికి అభ్యంతరం చెప్పి అసత్యమాడుతున్న దుష్యంతునికి సత్యం యొక్క విశిష్టతను ఎంతో విపులంగా వివరిస్తుంది శకుంతల ఈ క్రింది పద్యంలో.

**"నుతజల పూరితంబులగు నూతులు నూతిటికంటే సూనృత**
**వ్రత యొక బావి మేలు మరి బావులు నూతిటి కంటె నొక్క స**
**త్క్రతువది మేలు తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు త**
**త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్"**

సత్యవాక్యం యొక్క ప్రతిఫలనం ఎలా వుంటుందో అద్భుతంగా వివరించబడిన పద్యం ఇది. 'మంచినీరు గల నూతులు నూతిటికంటే ఒక దిగుడుబావి, అటువంటి వంద దిగుడుబావుల కంటే ఒక యజ్ఞము, అట్టి వంద యజ్ఞలకంటే ఒక పుత్రుడు, అటువంటి వందమంది పుత్రులకంటే ఒక సత్యవాక్యం మంచిది' అంటూ దుష్యంతుడికి సత్యబోధ చేస్తుంది శకుంతల. అంతేగాక వెయ్యి అశ్వమేధయాగాల ఫలాన్ని ఒకవైపు, ఒక సత్యవాక్య ఫలాన్ని ఒకవైపు త్రాచులో వుంచి తూస్తే ముల్లు సత్యంవైపే మొగ్గు చూపుతుందని కనుకనే అన్ని ధర్మాలకంటే సత్యమే పరమధర్మమని మునులు చెప్పారనే విషయాన్ని ఎంతో గొప్పగా వివరిస్తుంది శకుంతల. గృహస్థాశ్రమధర్మంలో సత్యం యొక్క ప్రాధాన్యతను, సంతానం కంటే సత్యమే గొప్పదనే విషయాన్ని వివరిస్తుంది శకుంతల.

### ముగింపు

మహాభారతంలోని ఆదిపర్వం చతుర్థాశ్వాసంనుండి తీసుకున్న చిన్న కథ శకుంతలోపాఖ్యానం. కానీ ధర్మ విశిష్టతను, సత్య ప్రాధాన్యతను విశేషంగా, విపులంగా చర్చించిన ఉపాఖ్యానంగా దీనిని మనం గుర్తించవచ్చు. చతురాశ్రమ ధర్మాలలో ప్రాముఖ్యమైన ధర్మంగా వెలుగొందుతున్న గృహస్థాశ్రమధర్మానికి అత్యంత గౌరవాన్ని, విలువనూ ఇచ్చే ఉపాఖ్యానంగా చెప్పవచ్చు. అనుకూలమైన భార్య వున్నవాడు ఇంద్రియ నిగ్రహాన్ని కలిగివుండి పుత్రప్రాప్తిని పొంది సర్వకర్మలను నిర్వహిస్తూ గృహస్థాశ్రమ ధర్మాన్ని సంపూర్ణంగా నిర్వహిస్తాడు. కనుకనే ప్రవిత్రవతి, అనుకూలవంతురాలు, గుణవతి, సంతానవతి అయిన భార్యను విడనాడే వాడికి ఈ లోకంలోనేకాక పరలోకంలో కూడా ఉత్తమ గతులు ఉండవని తెల్పే శకుంతలోపాఖ్యానం గృహస్థాశ్రమధర్మాల్ని ప్రతిఫలించే ఉపాఖ్యానంగా చెప్పవచ్చు.

### ఆధారగ్రంథాలు

1. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతము (సరళ వ్యాఖ్యాన సహితం), సంపుటం-1, 2013, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

2. ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, చతుర్థాశ్వాసం, వావిళ్ల రామస్వామి శాస్త్రులు ం సన్స్, చెన్నపురి.

3. కవిత్వంలో వ్యక్తిత్వ వికాసం-2, ద్వానాశాస్త్రి, సుజనరంజని మాసపత్రిక, ఏప్రియల్ 2007

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 41. కవిత్రయ మహాభారతం - ఆధునిక మానవుని మనస్తత్వం

– డా॥ శ్రీను కెతావత్, తెలంగాణ

మద్రాసు విశ్వవిద్యాలయం తెలంగాణ శాఖ 'కవిత్రయ మహాభారతం– వర్తమాన సమాజం, సమాలోచన' అనే శీర్షికతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో ప్రస్తుత ప్రపంచీకరణ ప్రభావ నేపథ్యంలో సమాజంలోని ఆధునిక మానవుని జీవితంలో వస్తున్న మార్పుల కారణంగా మానసిక సంఘర్షణని, మానవీయ కోణాన్ని విశ్లేషణాత్మకంగా క్లిష్టపరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోలేని మానవునికి భారతంలోని ఆయా పాత్రల ద్వారా అవసరమైన జీవన ప్రమాణాలను పెంపొందించే ఆలోచనాత్మక అంశాలను పరిశీలించాలనే ఉద్దేశంతో ఈ అంతర్జాతీయ సదస్సులో నా పరిశోధనాంశంగా 'కవిత్రయ మహాభారతం – ఆధునిక మానవుని మనస్తత్వం' అనే అంశాన్ని పత్ర సమర్పణకు ఎన్నుకోవడం జరిగింది.

సంస్కృత సాహిత్యంలో వాల్మీకి ఆదికవి. కన్నడ సాహిత్యంలో పంపడు ఆదికవి. తెలుగు సాహిత్యంలో 11వ శతాబ్ధికి చెందిన ఆది కవియైన నన్నయ ఆంధ్రమహాభారతంలో ఆది, సభా పర్వాలను, అరణ్యపర్వంలో 4వ ఆశ్వాసంలో శారదరాత్రులుజ్జ్వల... పద్యం వరకు రచించి ప్రసిద్ధి పొందారు. తర్వాత 13వ శతాబ్దంలో కవిబ్రహ్మ 'తిక్కన' విరాటపర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలను కావ్యేతిహాసంగా రచించి 'ప్రబంధ మండలి'గా పేర్కొన్నారు. ఆ తర్వాత 14వ శతాబ్ధంలో ప్రబంధ పరమేశ్వరుడు 'ఎఱ్ఱాప్రగడ' అరణ్యపర్వ శేషాన్ని పూరించాడు. ఈవిధంగా విభిన్న కాలాల్లో రచించిన 18 పర్వాల మహాభారతం కవిత్రయ భారతంగా వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారంగా జయకావ్యంగా పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన సర్వస్వంగా ప్రశస్తి పొందింది. ఈ కవిత్రయ మహాభారతంలో చందోబద్ధమైన పద్యాలలో ఒక ప్రత్యేకత, భావుకత, సౌందర్యంతోపాటు ఆ పద్యాలు అందించే మూల ధర్మాన్ని కూడా అవగాహన చేసుకొన్నప్పుడు నూతన విషయాలను విజ్ఞానాన్ని పొందవచ్చు. మానవుల మనస్తత్వాన్ని ఆంధ్రమహాభారతంలో కవిత్రయ కవులు ఎంతో పరిశీలనతో వివిధ పాత్రల రూపంలో సృజనీకరించారు. ఇందులో భాగంగా నన్నయ మహాభారతం ఆదిపర్వం నుంచి ఉదంకోపాఖ్యానంలో గురు శిష్య మనస్తత్వం, తిక్కన మహాభారతం, విరాటపర్వం చతుర్థాశ్వసము నుంచి ఆధునిక విద్యా వ్యవస్థలో ఒత్తిడి కారణంగా నేటి విద్యార్థుల మనస్తత్వం, ఎర్రన మహాభారతంలో అరణ్యపర్వశేషంలో యక్ష ప్రశ్నలులో భాగంగా అన్నదమ్ముల మనస్తత్వం పరిశీలించే ప్రయత్నం.

ఆదిపర్వంలోని ప్రథమ ద్వితీయాశ్వాసాలలో సూతుడు శౌనకాది మునులకు మహాభారత కథను వినిపించడానికి ఏర్పడిన పరిస్థితులు తత్కథా ప్రారంభాన్ని వైశంపాయనుడు జనమే జయుడికి తెలిపే వృత్తాంతంలో భాగంగా సరమ వృత్తాంతం, ఉదంకోపాఖ్యానం ఉదంకుడు జనమే జయుడికి సర్పయాగం చేసే బుద్దిని కలిగించే వృత్తాంతం చెప్పబడ్డాయి. ఉత్తంకుడు లేదా ఉదంకుడు, పైలుడు–ధర్మపత్ని యొక్క గురుకులంలో గొప్ప గురుభక్తుడు, గురుకులంలో ఎంతో మంది విద్యార్థులు సకల శాస్త్రాలు నేర్చుకొని వెళ్తున్నారు కాని చాలా కాలంగా విద్యరాకపోయిన సేవలు చేస్తూ వృద్ధాప్యం వచ్చిన అక్షరజ్ఞానం లేకుండానే మరణిస్తానేమో అనే దు:ఖం మనస్సులో కలిగి సంశయం వ్యక్తం చేయగా గురువుగారు పైలుడు హస్తమస్తక సంయోగం ద్వారా సమస్త విద్యలు (64 కళలు)తోపాటు నిత్య యవ్వనత్వం ఉదంకుడుకి ప్రాప్తించాయి. ఇదంతా మీ గురుపత్ని దయే అని పల్కగా ఉదంకుడు గురువుకి–పత్నికి మనస్ఫూర్తిగా నమస్కరించి గురుదక్షిణగా ఏదైన ఇవ్వదలచాను అనుగ్రహించండి అనగా గురుపత్ని 'అశూన్యసయనవ్రతం (భార్య, భర్తలిద్దరు ఒకేసారి మరణించే వ్రతం నారదపురాణంలో ఉంది) కార్తీకమాసంలో చేసేది దానికొరకు పతివ్రత యొక్క కుండలాలు (ఉద్యాపనకోసం) కావాలి.

అయోధ్యనగర రాజైన పౌష్యుడు–పత్ని మదయంతిని యాచించి తెమ్మనగా ఉదంకుడు గురువుగారికి భక్తితో నమస్కరించి బయలుదేరాడు. దారిలో ఓ దివ్య పురుషుడు ఎద్దుపై ఎదురొచ్చి ఈ పెడ తిను అంటే తినేశాడు. తిరిగి

చూడగానే అదృశ్యమైపోయారు. అలా ఉదంకుడు పౌష్య రాజవద్దకి చేరగానే పైలుడి శిష్యులు మీరు మీ రాకకు గల కారణం తెల్పమనగానే మాగురుపత్నీ–మీపత్నిగారి కవచ కుండలములు అడిగారని చెప్పగా పరిచారికల ద్వారా మదయంతి వద్దకు పంపారు కాని ఆశ్చర్యంగా ఆమె కనబడలేదు. తిరిగి రాజు వద్దకు వచ్చి చెప్పగా రాజు గారు ఆమె మహాపతివ్రత కాబట్టి అశూచికి కనబడదు. శూచికి మాత్రమే దర్శనమిస్తారు. మీరా! అశూచి అనలేను అనగానే దారిలో జరిగిన విషయం తెల్పి ఆచమనం చేసి వెళ్లగానే ఆశ్చర్యకరంగా మదయంతి స్వయంగా తన కవచ కుండలము ఇస్తూ 'జాగ్రత్త సుమా!' ఈ కుండలము ధరిస్తే అదృశ్య శక్తులు వస్తాయి. తక్షకుడితో ప్రమాదం పొంచి ఉందనగా తదనంతరం రాజు గారు మధ్యాహ్నం భోజనం చేసి వెళ్లండి అని ఏర్పాట్లు చేసి భోజనం వడ్డించారు. అందులో తల వెంట్రుక వస్తే క్షణికావేశంలో రాజుగారిని గ్రుడ్డివాడైపో అని శాపం పెట్టగా ప్రతిశాపంగా రాజు ఉదంకుడ్ని 'నీకు సంతానం లేకుండుగాక', దాంతో ఉదయకుడు నాశాపం వెనక్కి తీసుకుంటున్నాను మీరు మీ శాపాన్ని తిప్పుకొండనగా రాజుగారు శాపం ఇవ్వగలను కాని తిరిగి తీసుకోలేను ఉద్రేకంతో తొందరపడ్డావు కాబట్టి అనుభవించు అని పల్కి

**"నిండుమనంబు నవ్యనవనీతసమానము, పల్కు దారుణా**
**ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు: నిక్క మీ**
**రెండును రాజులందు విపరీతము: గావున విప్రు డోవు, నో**
**పం డతిశాంతు డయ్యు నరపాలుడు శాపము గ్రమ్మతింపగన్."(100-72 పుట సంఖ్య)**

తా॥. లోకం చేత స్తుతింపబడినవాడా! ఉదంక మహామునీ! బ్రాహ్మణులలో వారి నిండు హృదయం అప్పుడే తీసిన వెన్నతో సమానంగా మిక్కిలి మృదువుగా ఉంటుంది. మాట భయంకరమైన ఇంద్రుని వజ్రాయుధంతో సమానంగా ఉంటుంది. పరుషమైనది. ఇది నిజం. మనసూ, హృదయమూ అనే ఆ రెండున్నూ రాజులలో అందుకు విరుద్ధంగా ఉంటాయి. అంటే రాజులందు మనస్సు వజ్రతుల్యంగానూ, పల్కు నవనీతంగానూ ఉంటాయి. కాబట్టి బ్రహ్మణుడు ఇచ్చిన శాపాన్ని ఉపసంహరించుకోవటానికి శక్తుడౌతాడు. మిక్కిలి శాంత స్వభావం కలవాడైన రాజు ఉపసంహరించుకోవడానికి శక్తుడు కాదు" 1. ఈ విధంగా మనోవేదనకు గురైన ఉదంకుడు పౌష్యుడిని కరుణించి బయలుదేరి ఒక సరస్సును చూసి ఆచమనం చేస్తుండగానే దిగంబరుడైన తక్షకుడు ఆ కుండలాలు గ్రహించి పరుగెత్తాడు. ఉదంకుడు కూడా తక్షకుడిని వెంబడించగా నగ్నరూపం విడిచి తక్షక రూపంతో నాగలోకానికి వెళ్లగా ఉదంకుడు కూడా నాగలోకానికి వెళ్లి సర్పరాజులందరిని స్తుతించే ప్రసిద్ధ పద్యాలలో ఒకటి.

**"బహువన పాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ**
**సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళి దాల్చి దు**
**స్సహతర మూర్తికిన్ జలధిశాయికి బాయక శయ్య యైన య**
**య్యహిపతి దుష్కృతాంతకు డనంతుడు మాకు బ్రసన్ను డయ్యెడున్." (104-75 పుట సంఖ్య)**

తా॥ పెక్కు అడవులతోను, చెట్లతోను, సముద్రాలతోను, కులపర్వతాలతోనూ, నీటితోనిండిన సరస్సులతోను, నదులతోను కూడిన గొప్ప భూమి యొక్క బరువును ఎల్లప్పుడూ వేయిపడగల సముదాయంతో ధరించి మిక్కిలి సహింపశక్యం కాని విగ్రహం గల నారాయణుడికి విడువక శయ్యగా ఉండి, పాపాలను అంతరింప జేసే అనంతుడనే పేరుగల ఆ నాగరాజు మా పట్ల అనుగ్రహం కలవాడు అగుగాక! అని ఇందులో నన్నయగారు సర్పమును మహాద్భుతంగా ఆవిష్కరించారు (బుసలు కొడుతున్న సర్పం) మొత్తంమీద నాగలోకమంత కలత చెందె విధంగా చేసి కుండలాలు గ్రహించి, నేటికి నాల్గవరోజున ఈ కుండలాలు ధరించే దినం ఈనాడే. ఎట్ల బయటికి వెళ్లడం అని మిక్కిలి విచారంతో కలత చెందియున్న ఉదంకుడికి ఆ దివ్యపురుషుడు నీవీ గుర్రం ఎక్కి వెళ్ళుము, ఇది మనస్సు కంటే గాలి కంటే వేగం కలిగింది అని పల్కగా గుర్రమెక్కి

గురువుగారింటికి చేరాడు. ఇంతలో ఏకారణం చేతనో ఇంత ఆలస్యం చేశావో! అనగా ఉదంకుడు జరిగిందంతా చెప్పి ఇదంతా ఏమిటి? దీని అంతరార్థం తెలుపమని కోరగా! గురువైన పైలుడు ఎద్దుపై వచ్చిన దివ్య పురుషుడు ఇంద్రుడు, ఆ ఎద్దు ఐరావతం. పేడ అమృతం. నాగలోకంలోని ఇద్దరు స్త్రీలు ధాత విధాత వారు నేసే వస్త్రం తెలుపు పగలు, నలుపు రాత్రి పన్నెండాకులు నెలలు ఆరుగురు యువకులు ఋతువులు ఆ గుఱ్ఱం అగ్ని దానినెక్కిన దివ్యపురుషుడు పర్జన్యుడు (ఇంద్రుడి మిత్రుడు వర్షాధి దేవత) వారి అనుగ్రహం చేత కుండలాలు లభించాయి. నీవుకొరినవి ఫలించాయి. గురుసేవ వల్ల దేవతా ప్రసన్నులౌతారని ఆర్యోక్తి.

నేటి ఆధునిక భారతంలో గురు-కులాలు వారిగా విభజించి (పాలకులు - ప్రజలు) తమ గుప్పిట్లో తెచ్చుకునేందుకు అనేక ప్రలోభాలకు గురిచేసి ముమ్మరంగా ప్రయత్నాలు చేసి పాలకులుగా మారి ప్రజా సంక్షేమం పట్టించుకోకుండా పట్టి పీడిస్తున్నారు. ఇతరుల రాజ్యకాంక్ష కోసం ఒక వర్గం మరొక వర్గాన్ని శత్రువుగా చిత్రీకరిస్తూ నిత్యం ప్రజలను దోపిడికి గురిచేస్తున్నారు. ఆధునిక వర్తమాన సమాజానికి కావాల్సింది నేడు న్యాయకోవిధులు, ధర్మకోవిధులు, గొప్ప రాజనీతి, యుద్ధనీతి తెలిసిన లౌకిక విషయాలు, వ్యవహారాలు నడపడంలో ధీటైన మేధావులు పాలకులు కావాల్సిన అవసరం ఎంతో ఉంది అని ఉదంకోపాఖ్యానం ద్వారా బుసలు కొట్టి విషంచిమ్మే పాలకుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సింది, బానిస మనస్తత్వం వీడి సమాలోచన చేయాల్సింది ఎంతో ఉంది.

**ఉత్తర గోగ్రహణం**

ధుర్యోధనుడు భీష్మ ద్రోణ కృపాదులతో ఉత్తరదిక్కున విరాటుడి గోవులను తోలుకోపోసాగాడు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి ఉత్తరుడు తనకు తగిన సారథియే దొరికితే గోవులను అవలీలగా తెస్తానని ప్రగల్భాలు పల్కగా ద్రౌపది ఈ క్లిష్ట పరిస్థితిలో బృహన్నల నేర్పును ఉత్తరద్వారా ఉత్తరుడు బృహన్నల రథమెక్కారు. ఉత్తర బొమ్మపొత్తిళ్ళు కోరింది. ఎట్టకేలకు కౌరవసేనను చూసి కంపించిపోయి, తడబడుతూ

**"భీష్మ ద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు, దుర్యోధన**
**గ్రీష్మాదిత్య పటుప్రతాప విసరాకీర్ణంబు, శస్త్రాస్త్ర ప్రజా**
**లోష్మాస్ఫార చతుర్విధోజ్జ్వల, బలాత్యుగ్రం, బుదగ్రధ్వజా**
**ర్చిష్మత్త్వా కలితంబు సైన్యమిది యే జేరంగ శక్తుండనే? " (52-482)**

ఆ కౌరవ మహావీరుల గురించి తెలియక యుద్ధానికి వచ్చాను ఎదుర్కొనేశక్తి, ధైర్యం నాకు లేదని గడపగడ వణుకుతూ ఉత్తర కుమారుడు రథాన్ని వెనక్కి త్రిప్పమన్నాడు. అర్జునుడు ఉత్తరుడికి ధైర్యం చెప్పి రథసారథ్యం చెయ్యమని చెప్పి అజ్ఞాతవాసం గడవుముగిసిందని భీష్ముడు ద్రోణుడికి గూఢంగా హెచ్చరించడంతో ఆచార్యుడు పరమేశ్వరుడి ద్వారా పాశుపతాస్త్రాన్ని పొందినవాడికి ఆవులను మరలించడం అవలీల అంటూ..

**"సింగంచాకటితో గుహాంతరమునం జేద్పాటు మైనుండి మా**
**లింగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చునో**
**జం గారిద్రార నివాసకిన్నమతి నస్మత్సేనపై వీడేవ**
**చ్చెం గుంతీసుత మద్యముందు సమర సేమాభిరామాకృతిన్." (95-502)**

అర్జునుడు ముందుగా గోవులను మళ్లించి గాండీవంతో భీష్మ ద్రోణులకు నమస్కార, యోగక్షేమ బాణాలు వేశాడు. సింహం చాలా కాలం ఆకలిగొని ఒక్కసారిగా ఏనుగుల గుంపుపై విచురుకుపడ్డట్లు కౌరవ సైన్యం మీద విరుచుకుపడ్డాడు. భీకర పోరు సాగింది. పార్థుడు ఉత్తర మాటలు తలచి సమ్మోహనాస్త్రాన్ని సందిస్తే వీరులందరు మూర్ఛపోగా ఉత్తరుడు

బొమ్మపొత్తికలు సేకరించాడు. చివరగా బృహన్నల అంత:పురానికి వెళ్లి ఉత్తరను సంతోషపెట్టాడు. ఉత్తరుడికి కలిగిన మానసిక, శారీరకమైన భయాన్ని తిక్కన చిత్రీకరించాడు.

ఆధునిక విద్యావ్యవస్థలో ముఖ్యంగా ఆంగ్లం, తెలుగు ఇలా వివిధ భాషా మాధ్యమాల ప్రభావం కార్పోరేట్ విద్యావ్యవస్థలో విద్యార్థుల మానసిక ఎదుగుదలపై పెను ప్రభావం చూపిస్తుంది. ఆటలు పాటలు ద్వారా ప్రయోగాల ద్వారా పెంపొందించాల్సిన జ్ఞానం, విజ్ఞానం కేవలం బంధనాల ద్వారా ర్యాంకుల పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకను బంధించి పాఠశాల స్థాయి నుంచి పరిశోధనల స్థాయివరకు శాస్త్రసాంకేతికతల్లో కూడా మానసికంగా కృంగి కృషించి పోతున్న వైనం నేడు భారతదేశం అంతట సాక్షాత్కరమిస్తుంది. తగినంత స్వేచ్ఛ లేక ఈ కార్పోరేట్ యుగంలో రానించాలని ఒకటే లక్ష్యం మాత్రమే విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఒత్తిడే దీనిని అధిగమించే స్థైర్యం, ధైర్యం వారికి ప్రభోధించాలనేది మహాభారతంలోని ఉత్తర గోగ్రహణం ద్వారా సమాలోచన చేద్దాం! ప్రగతిని ఆశిద్దాం!.

ఓ రోజు మృగమొక్కటి తన కొమ్ములకు అరణిని తగిలించుకొని పారిపోయింది. అదిలేక నిత్యానుష్ఠానం ఆగిపోతుంది కాబట్టి అరణిని తెచ్చి ధర్మస్థితిని కాపాడాల్సిందిగా ధర్మరాజును బ్రహ్మణుడు వేడుకున్నాడు. దాంతో ధర్మరాజు తమ్ములతో కలిసి అరణి కోపం వెళ్లాడు. మృగం వారికి కనిపించకుండా పోయింది. దాహం వేసి మర్రి చెట్టు నీడన విశ్రాంతి కోసం ఆగారు. వారి మధ్య ఈ సంభాషణ జరిగింది.

**నకులుడు**

"ఉత్తమ కుల శీలాలతో, దయాగుణంతో, ధర్మాచరణ బుద్ధితో జీవిస్తున్న మనకు ఈ విధమైన అలజడి రావడానికి మూలకారణమేమిటి?

**ధర్మరాజు**

సుఖ దు:ఖాలకు కారణం వారు చేసికొన్న పూర్వ కర్మమే. మరొక కారణం ఉండటానికి వీలు లేదని ప్రాజ్ఞులంటారు.

**భీముడు**

ఆనాడు ప్రాతికామిపోయి పాంచాలిని నిండు కొలువులోనికి తెచ్చినప్పుడు కోపోద్రేకంతో కౌరవులందరిని మట్టుపెట్టకుండా నే నూరుకొన్నందుకు ఈ ఆపద మనకు కలిగింది.

**అర్జునుడు**

తమ్ముడా! ఆనాడు ఆ సభలో ఆ కర్ణుడు మదించి ఆవిధంగా పలికిన మాటలను విని కూడా కోపగించుకొనకుండా తలవంచుకొని సామాన్య జనుడివలె అడవులకు నడిచిరావడం వలననే మనకీ అనంత దు:ఖాలు మీదపడ్డాయి.

**సహదేవుడు**

కపట ద్యూతపరుడు, దుష్టుడు అయిన ఆ శకునిని పట్టి వెంటనే ప్రాణాలు తీయకపోవడం వలననే మనం అడవులలో ఈ అగచాట్లు పడుతున్నాం." (117 పుట)

ఈ క్రమంలో ధర్మరాజు నకులుడితో దగ్గరలో నీటి కొలనుంటే వెళ్లి తెచ్చి దాహం తీర్చుమనగా చెట్టెక్కి సరోవరాన్ని చూసి అందులో దిగబోగా అశరీర భూతం నీటిని త్రాగాలంటే తన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని లెక్క చేయక నకులుడు సరోవరంలోకి దిగి పడిపోయాడు. తర్వాత సహదేవుడు, అలాగే పడిపోయాడు ఆ తర్వాత అర్జునుడు, భీముడు చివరకు ధర్మరాజు తమ్ములను చూసి

**"కని డెందంబున దల్లడం బడర దీర్ఘశ్వాస వైవర్ణ్యముల్**
**దనుకం దాల్మి చలింప విస్మయపరీతస్వాంతుడై శోకబా**
**ష్పనిరుద్ధాకులలోచనుం డగుచు మూర్ఛల్ పైకొనం గొంతసే**
**పు నరేంద్రోత్తము దుండె జిత్రమున రూపుంబోలే దా నచ్చటన్." (407-1295పుట)**

కొమ్మబారిపోయి కదలక మెదలక చిత్రంలో గీసిన చిత్రంవలె కొన్ని క్షణాలు హృదయం ద్రవించి మొగం పాలిపోయి ఆశ్చర్యానికి గురై ఓర్పు నశించిన దు:ఖాన్ని దిగమింగి కన్నీరు కారుతున్న మూర్ఛపోయి తెరుకున్నాడు. నలువైపులా చూసి కొలనులోకి దాహార్తికోసం దిగపోయాడు.

"ఓ ధర్మరాజా! నేనొక కొంగను, నీ తమ్ములు నా మాట వినక ప్రాణాలు కోల్పోయారు. నీవు అలాగే చేస్తే అంతే సంగతి. ముందుగా నేనడిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి నీరు త్రాగమని హెచ్చరించింది. ధర్మరాజు మీరేవరు? నానేర్చు విధంగా చెపుతాను అడగమన్నాడు.

**యక్షుడి ప్రశ్నలు- సమాధానాలు**

- సూర్యుడిని నడిపే శక్తి ఏది? - బ్రహ్మము
- గాలికంటే వేగం కలిగినదేది? - మనస్సు
- గడ్డిపోచకంటే హీనమైనదేది? - చింత" (పుట 118)

ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు ధర్మరాజు. సంతోషించిన యక్షుడు వీరిలో ఒకరినే బ్రతికిస్తాను అనగా కుంతీ పుత్రులలో నేనున్నాను, మాద్రి పుత్రులలో నకులుడు బ్రతకడం 'ధర్మం' అని పల్కగా ధర్మరాజు ధర్మబుద్ధికి, మనస్తత్వానికి మెచ్చి అందరిని బ్రతికించాడు. అదేవిధంగా మీరు అజ్ఞాతవాసం చేయాల్సి ఉంది. ఆ సమయంలో మీరు కోరుకునే రూపం పొందే వరం ఇస్తున్నాను అని ధర్మదేవత ఆశీస్సులు పొందారు.

ఈ యక్ష ప్రశ్నలు ఘట్టం ద్వారా ఎలాంటి క్లిష్టపరిస్థితులు వచ్చిన న్యాయం, ధర్మం, బుద్ధి కుశలత్వం ద్వారా, నిజాయితీ ద్వారా దేనిన్నైనా సాధించవచ్చు. మన మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే మంచి ఆలోచనలు వస్తాయి. ఆధునిక మానవుని జీవన ప్రయాణంలో పోటి ప్రపంచంలో సాటి మానవునికి సహాయపడాలనే తపన, కనీసం కనికరం, దయ, జాలి అనేవి లేకుండా ఆధునిక నాగరిక మానవుడు మృగంలా ప్రవర్తిస్తున్నాడు. పశుపక్ష్యాదులను సైతం గౌరవించే గొప్ప జాతి మనది మానవజాతిది. జీవితమనే పరిక్షలో నెగ్గాలంటే ఎదిగిన కొద్ది ఒదిగి ఉండే మనస్తత్వం అలవర్చుకోవాలని కవిత్రయ మహాభారతం ద్వారా అనేకానేక విషయాలు వర్తమాన సమాజ హితం కోసం ఈ సదస్సు దోహదపడాలని ఆకాంక్షిస్తూ.

**ఆధార గ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - సంపుటము -1, ఆదిపర్వం
2. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - సంపుటము -6, విరాటపర్వం
3. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - సంపుటము -5, అరణ్యపర్వ శేషము

తిరుమల, తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2013.

# 42. భారతంలోని నాయకత్వ లక్షణాలు - నేడు వాటి ప్రాధాన్యత

- సాకే హరిభక్త భానుశ్రీ, అనంతపురము

నాయకుడు అంటే నడిచేవాడు కాదు, నడిపించేవాడు. అది సమాజాన్ని అయినా సమూహాన్ని అయినా సరే. ఒక లక్ష్యం కోసం తను ముందుకు నడుస్తూ తన వెనుక ఉన్నవారిని ముందుకు నడిపించేవాడు, ఇసుమంతైనా స్వార్థం లేనివాడు, సాటివారిలో ప్రేరణ కలిగిస్తూ ముందుకు తీసుకెళ్లే వ్యక్తి నాయకుడు. అటువంటి నాయకుడి ఉనికి లేకపోతే సమూహం యొక్క ఉనికి లేకుండా పోతుంది. నాయకత్వం అంటే పెత్తనం చేయటం కాదు, పెత్తనం చేస్తే వారు యజమాని అవుతారు కానీ నాయకులు గారు. యజమాని సరే అంటే నాయకుడు చేద్దామంటాడు. అటువంటి నాయకుడికి కొన్ని లక్షణాలు ఉండాలి. నిజానికి నాయకత్వ లక్షణాలు పుట్టుకతోనే లభిస్తాయి అని అంటారు, వాటిని మెరుగుపరుచుకొని నాయకుడిగా రూపుదిద్దుకోవటం వారి చేతుల్లోనే ఉంటుంది. నాయకుడికి ఎటువంటి లక్షణాలు ఉండాలి? అన్న ప్రశ్నకు సరైన సమాధానం మన ఇతిహాసం, పంచవేదంగా పేరు పొందిన 'మహాభారతం' లో లభిస్తుంది. నిజానికి ఇందులో నాయకుడు అనే వాడు ఎలా ఉండాలి అన్న విషయం కేవలం కథానాయకుల ద్వారా మాత్రమే కాదు, ఉప కథలలో ఉన్న కొన్ని విశిష్ట పాత్రల ద్వారా కూడా మనకు తెలుస్తుంది. అయితే ప్రతినాయకులు కూడా కొన్ని నాయకత్వ లక్షణాలతో ఉన్న, అదే సమయంలో కొన్ని అవలక్షణాలను కూడా వారిలో గమనించవచ్చు. వీటిని అర్థం చేసుకోవటం వల్ల నాయకుడికి ఉండకూడని లక్షణాలు ఏవో కూడా మనం తెలుసుకోవచ్చు.

నేడు యువత నేర్చుకోవాల్సిన, అలవాటు చేసుకోవలసిన నాయకత్వ లక్షణాలు పంచమ వేదంలో లక్షణంగా చెప్పబడ్డాయి. నేడు సరైన నాయకులు లేని కారణంగానే దేశాలు వెనుకబడి ఉన్నాయి. దీనిని అధిగమించాలి అంటే యువత సరైన నాయకత్వం లక్షణాలతో ఎదగాలి. అది జరగాలి అంటే పూర్వపు నాయకులను గురించి తెలుసుకోవడంతో పాటు, మన ఇతిహాసలలో ఉన్న నాయకత్వ లక్షణాలను ఆకలింప చేసుకోవాలి. అటువంటి లక్షణాలు కలిగిన నాయకులు మహాభారతంలో ఎందరో కనిపిస్తారు. ఎన్నో ఘట్టాలలో నాయకత్వ లక్షణాలు గురించి చెప్పడం జరిగింది. మహాభారతాన్ని అధ్యయనం చేయటం వలన ఒక నాయకుడికి ఎటువంటి లక్షణాలు ఉండాలి, ఎటువంటి లక్షణాలు ఉండకూడదు అన్న విషయం సంపూర్ణంగా మనకు తెలుస్తుంది. మహాభారతాన్ని ఎవరు ఎలా చూస్తే వారికి అలా ఉపయోగపడుతుంది అన్న నానుడి ప్రకారం, యువత ఇందులో ఒక న్యాయమైన నాయకుడిగా ఎదగడానికి కావలసిన లక్షణాలను స్వీకరించి, ఒక నాయకుడిగా సమాజాన్ని ముందుకు నడిపించడానికి మహాభారతాన్ని ఆయుధంగా భావించాలి. అప్పుడే తను బాధ్యతాయుతంగా ముందుకు సాగుతూ, తన ప్రజలను కూడా అభివృద్ధి వైపు, బాధ్యత యుతమైన సమాజం వైపు నడుపుతాడు.

## భారతంలో నాయకత్వ సూత్రాలు

మహాభారతంలో ధర్మాన్ని బోధించేటప్పుడు, ఒక నాయకుడికి ఉండాల్సిన అంశాలను కూడ చాలామంది ఋషులు, విశిష్ట వ్యక్తులు చెప్పుకొచ్చారు. అందులో నారదుడు, భీష్ముడు, ధౌమ్యుడు, కుబేరుడు, మార్కండేయ మహర్షి, యాయతి వంటి వారు చెప్పుకొచ్చిన ఉత్తమ నాయకుడి యొక్క వ్యక్తిత్వం లక్షణాలు మనం గుర్తుపెట్టుకొని, ఆచరించాల్సినవి ఎన్నో ఉన్నాయి. ఇవి సర్వకాలాలలోనూ ఆచరించదగిన అంశాలు. నేటి పాలకులైనా, ఇతర సంస్థలలోని నాయకులైనా ఎవరైనా సరే వీటిని విధిగా ఆచరిస్తే గొప్ప నాయకులుగా పేరు పొందుతారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## యయాతి చెప్పిన నాయకత్వ లక్షణాలు

మహాభారతంలో యయాతి మహరాజు చరిత్రకు ఒక గొప్ప స్థానం ఉంది. యయాతి మహారాజు తన పుత్రుడు పూరువుని పట్టాభిషిక్తులన్ని చేసే సమయంలో నాయకత్వ లక్షణాలు ఏమిటో, వాటిని ఎలా పెంపొందించుకోవాలో చక్కగా వివరించాడు. అయితే యయాతి చెప్పిన విషయాలను ఆదికవి నన్నయ్య గారు కంద పద్యాలలో కమనీయంగా తీర్చిదిద్దిన తీరు చాలా చక్కగా ఉంది.

**వచన బాణాసన వ్యక్తముక్తము లైను**
**పలుకుల న్నడువాఁడి బానతతులఁ**
**బరమర్మలక్ష్యముల్ పాయక బేధించు**
**చుండెడి దుర్జనయోధరుల**
**కడనుండ కున్నద్మి కరుణ యర్జవమక్ష**
**జయము సత్యంబును శమము శౌచ**
**మను నివి యెద నిల్పునదిబీ శత్రుషడ్వర్గ**
**జయమందునది శుద్ధశాంతబుద్ధిబీ**

**మదముఁ గామముఁ గ్రోధంబు మత్సరంబు**
**లోభమును మోహమును నను లోని సహజ**
**వైరివర్గంబు నొడిచినవాఁడు యొడుచు**
**నగ్రమంబున వెలుపలి యహితతతులు.** **(ఆదిపర్వం, ఆశ్వాసం 3, పద్యం 206)**

ఇలా ఒక నాయకుడు ఏం తెలుసుకోవాలి, ఎవరికి దానం చేయాలి, ఎలా చేయాలి? ఎక్కడ ఏం మాట్లాడగలగాలి, ఎలా మాట్లాడగలగాలి, ఎలా జీవించాలి, ఎవరితో జీవించాలి అన్న అంశాలను సమగ్రంగా వివరించాడు యయాతి. ఏ కాలంలో ఆయన ఒక నాయకుడు పాటించదగిన అంశాలు ఇవి. ఎందుకంటే ఒక నాయకుడు తన పూర్వుల గురించి తెలుసుకున్నప్పుడే తాను ఎలా పాలించాలో నేర్చుకుంటాడు. ఎవరికీ ఎంత దానం చేయాలో తెలుసుకున్నప్పుడే తన ప్రజలను సోమరులుగా మార్చకుండా బాధ్యత తెలిసిన పౌరులుగా నడిపించగలడు. ఎక్కడ ఎలా ఎవరితో ఏం మాట్లాడాలో తెలుసుకున్నప్పుడు ప్రజల నమ్మకాన్ని పొందగలడు, తన వాక్చాతుర్యంతో ఎక్కడైనా గెలవగలడు. ఎటువంటి వారితో జీవించాలో తెలుసుకున్నప్పుడే మోసానికి గురి కాకుండా, ఎటువంటి స్వార్థం, ఆశ లేకుండా తనను నమ్మిన వాళ్లని నడిపించగలడు. అందుకే పైన చెప్పిన అంశాలు నేటి కాలంలో నాయకులకు కూడా ఎంతగానో అవసరం. నేటి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, పథకాల పేరుతో ప్రజలను సోమరులను చేయడం, మొదట నాయకులే దోపిడీ దొంగలుగా మారడం, వంటివి మనం చూస్తూనే ఉన్నాం కదా! ఇది మారాలంటే ఒక నాయకుడిగా అతనికి ఈ అంశాలన్నీ ఉండాలి. అప్పుడే నేటి సమాజం కూడా పూరూరవుడు రాజ్యంలా వర్ధిల్లాగలదు.

## మార్కండేయుడు బోధించిన నాయకత్వం లక్షణాలు

నాయకుడు ఎప్పుడు విజ్ఞానాన్ని సంపాదిస్తూనే నిత్యం విద్యార్థిగానే ఉండాలి. ఎందుకంటే ఒక నాయకుడు కాలానుసారంగా వచ్చే మార్పులను ముందుగానే గమనించి వాటిని తగిన విధంగా ఆచరణలో పెట్టగలగాలి. నూతన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తూ ఉండాలి. మానవుడు ఎప్పుడూ కొత్తదనాన్ని ఇష్టపడతాడు కాబట్టి ఆ కొత్తదనాన్ని శాస్త్రీయ దృక్పథంతో ఆచరణలో పెట్టే సామర్థ్యం నాయకుడికి ఉండాలి. ఇదే అంశాన్ని మార్కండేయ మహర్షి ధర్మరాజును ఆశీర్వదిస్తూ చెప్పిన నాయకత్వ సూత్రం.

**సకల భూతములందు సద యాత్ముఁడవు గమ్మబీ**
**పాలింపు ప్రజల నీ ప్రజలఁ బోలెబీ**
**విశదవృద్ధాచారవేదివై ధర్మంబు**
**సలుపుము దురుతవర్జనము గాఁగబీ**

నెఱుఁగమిఁ బాప మొక్కించుక దొదరినఁ
జయ్యన ప్రతికారశాలి వగుమిబీ
గర్వంబు విడువుము, గరము ప్రియంబును
నిజమునుగా వచోనియతి నడుపుబీ
కాలగతు లెల్ల నెఱిఁగి యస్థలితబోధ
యుక్తుఁడవు గమ్మిబీ భరతవంశోద్భవుఁడవు
నీవు గావున నత్యంతనిర్మలుఁడవు
ప్రాజ్ఞుఁడవుబీ నీవు వ్రేఱ చెప్పంగ నేల? (అరణ్యపర్వం, ఆశ్వాసం 4, పద్యం136)

"ఈ సృష్టిలో ఉన్న చరాచరమైన సమస్త భూతాల పట్ల జాలి కలిగిన వాడివి కమ్ము. నీ రాజ్యంలోని పౌరులను నీ కన్నా బిడ్డల వలె పరిపాలించు ధర్మాన్ని నిర్ణయించుకునేటప్పుడు జ్ఞానవృద్ధులైన మహానుభావులు పూర్వం ఏ విధంగా ఆచరించారో, పరిశీలించారో ఆ విధంగా ప్రవర్తించి పాపాన్ని పరిహరించుము. అజ్ఞానాన్ని ప్రబలకుండ చూడు. అహంభావాన్ని విడిచిపెట్టి సత్యాన్ని ప్రియంగా మాట్లాడు, కాలాన్ని అనుసరించి జ్ఞానం పరిమితి చెందుతుందని విషయాన్ని మరవకుండా నీ తెలివితేటలు జారిపోకుండా ఉండుగాక. నీవు భరత వంశంలో పుట్టిన వాడవు కాబట్టి మిక్కిలి పవిత్రుడవు కల్మషం లేనివాడిని సర్వ విషయాలు బాగా ఎరిగిన ప్రజ్ఞుడవు నీకు ఇంతగా విస్తరించి చెప్పనవసరం లేదు" అని ధర్మరాజుతో మార్కండేయ మహర్షి అన్న మాటలు ఇవి. అప్పటికే ధర్మజుడు గొప్ప నాయకత్వ లక్షణాలు కలిగిన వాడు కాబట్టి, అతనికి ఈ అంశాలన్నీ తెలిసినవే కాబట్టి, అతనికి ఇంత విస్తారంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ నేటి తరానికి ఇది చాలా అవసరం. ఇందులో మనం నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. ఒక నాయకుడిగా ఎదగడానికి అవసరమైన ప్రతి అంశాన్ని ఇక్కడ మనం తెలుసుకోవచ్చు. ఒక నాయకుడు ప్రజలను కన్నబిడ్డల్ల పాలించాలి, ఎక్కడ పక్షపాత ధోరణి అనేది చూపించకూడదు, నిత్య నూతనమైన శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ ఉండాలి, చరాచర జీవకోటిపై దయ కలిగి ఉండాలి, అజ్ఞానం ప్రబలకుండా నాయకుడే కాపాడాలి, ఇవన్నీ చేయగలిగినప్పుడే అతను నాయకుడు అవుతాడు. ఒకవేళ ప్రజలు అజ్ఞానవంతులుగా ఉంటే రాజ్యం నశించిపోతుంది. రాజ్యం అభివృద్ధి, పతనం అన్న విషయాలు ఎప్పుడూ నాయకుడి పాలన మీదనే ఆధారపడి ఉంటాయి. కాబట్టి నాయకుడు ప్రజలను నడిపించే మార్గాన్ని తన నాయకత్వ లక్షణాల ద్వారా మెరుగ్గా తీర్చిదిద్దగలిగే వాడై ఉండాలి. నేడు ప్రజలను ముళ్ళబాటలో నడిపిస్తూ వారిపై నాయకుడు నడవడం జరుగుతూనే ఉంది, ఇలాంటి నాయకులు నశించాలి అంటే నూతన యువ నాయకులు ఉద్భవించాలి, వారు ఇటువంటి నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలి, అప్పుడే ప్రజలు బాధ్యతగల, విజ్ఞానవంతమైన పౌరులుగా రాజ్యాన్ని అభివృద్ధి పరచగలరు.

## పంచలక్షణాలను పేర్కొన్న కుబేరుడు

ఒక నాయకుడు గొప్ప ధైర్యం, శౌర్యం వాటికి తగ్గ సామర్థ్యం కలిగిన వాడు అయినంత మాత్రాన అతను గొప్ప నాయకుడు కాలేడు, దానితోపాటు దేశకాలాల పరిస్థితులను అంచన వేయగలిగి, రహస్య వ్యూహాలు పన్నగలిగే సామర్థ్యం అనే మరో రెండు లక్షణాలను కూడా కలిగి ఉండాలి. ఎందుకంటే ధైర్యం, శౌర్యం, సామర్థ్యంతో ఉన్నవాడు ఆవేశపరుడు అవుతాడు, ఆలోచించకుండా కేవలం తన బలంపై ఉన్న నమ్మకంతో ఎదుటి వాడి బలాబలాలను తెలుసుకోకుండా అజాగ్రత్తతో ఓటమిపాలవుతాడు. అదే మిగిలిన రెండు లక్షణాలు ఉన్నవారైతే శత్రువుతోనైనా లేదా పరిస్థితులతో అయినా తెలివిగా సమర్థవంతంగా గెలవగలుగుతారు. అందుకే వీరుడైన నాయకుడికి ఈ పంచ లక్షణాలు ఉండాలని కుబేరుడు అరణ్యపర్వంలో ధర్మరాజుతో చెబుతాడు.

**వ. మఱియు నీ యక్ష రాక్షస బలంబులు వాని చేత నిహతు లగుద్మ రిద్దురితంబు దర్శనంబునం బాయు నానియెం గావున నిట్టి శాపఫలంబునకు నీ యనుజుండు నిమిత్తం బయే అని చెప్పి, వెండియు ని ట్లనియె ' ధృతియును**

**దాక్ష్యంబును దేశ కాలములను బరాక్రమంబును మంత్ర విధానంబునను పంచ విధాంగంబు నేఱింగిన క్షత్రియుడు ధర్మవిదుండై ధరణిచక్రంబు నిర్వక్రమంగా రక్షించి పుణ్యలోకంబు పడయ్మఁ గర్మ విశేషంబు లెరంగుక వృథారంభుం డై సాహసంబుధ వర్ధిల్లువానికిం బాతకం బగుట నిశ్చయంబు. (ఆంధ్ర మహాభారతం, అరణ్య పర్వం, ఆశ్వాసం 4, పద్యం31)**

"ఇక్కడ ఈ ఐదు లక్షణాలు కలవాడే సమర్ధవంతంగా, విజయవంతంగా పరిపాలన చేయగలరని, రాజకీయ పరంగా నాయకులకు ఈ లక్షణాలను బోధించారు. ఈ ఐదింటిలో ఏ ఒక్క లక్షణం లేకపోయిన అతను ఎప్పటికీ ఒక విజయవంతమైన నాయకుడు అవ్వలేడు. ఒకవేళ నాయకుడిగా వ్యవహరించినప్పటికీ అతను ఓటమి పాలవుతాడని చెప్పడం జరిగింది. నిజంగానే నేటి కాలంలో నాయకులు ఈ ఐదు లక్షణాలను కలిగి ఉన్నారని చెప్పవచ్చు. అయినప్పటికీ స్వార్ధపూరిత బుద్ధి వల్ల "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది" అన్నట్టుగా దేశం అభివృద్ధి చెందకుండా ఉండిపోయింది. ఈ ఐదు లక్షణాలను తమ పదవులు పోకుండా, తమను తమ వారిని రక్షించుకోవడానికి, తమ అవినీతి ఆస్తులను దాచడానికి, ప్రజల సొమ్మును దోచుకోవడానికి ఉపయోగిస్తున్నారు. ఈ విధానం మారాలని భారతం ద్వారా మనం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

### నాయకుడంటే ధర్మరాజు

మహాభారతంలో ప్రధానమైన నాయకులు పాండవులే అయినా, ఉపకథలో ఎంతోమంది ఆదర్శ నాయకులు ఉన్నారు. వారు ప్రజలను ప్రభావితం చేయగలిగే నాయకులుగా ఉండడమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లో సైతం ప్రజలను ధర్మం వైపు నడిపించే వారిగా ఉన్నారు. నిజానికి మహాభారతం యొక్క ముఖ్య ఉద్దేశం కూడా ఒక నాయకుడు ఎటువంటి కష్ట కాలంలో అయినా తన వెనక నడిచే వారిని ధర్మ మార్గంలో పయనింప చేయడమే. అటువంటి గొప్ప నాయకుడు, పైన పేర్కొన్న లక్షణాలన్నీ తనలో ఆకలింపు చేసుకున్న వాడిగా ధర్మరాజు మనకు కనిపిస్తాడు. తాను ఎటువంటి కష్టాలు అనుభవించిన ధర్మాన్ని తప్పకుండా తన కష్టాలను అధిగమిస్తాడు, అధర్మాన్ని ఎదిరిస్తాడు, ధర్మ పాలనా చేస్తాడు. కావున పంచమ వేదానికి తిరుగులేని నాయకుడు అయ్యాడు. అందుకే ద్రౌపదీదేవి విరాట పర్వంలో ధర్మరాజు యొక్క లక్షణాలను ఇలా వివరిస్తుంది....

ధర్మరాజు ఒక చక్రవర్తి. అతను ఎంతటి గొప్ప చక్రవర్తి అంటే తనని సందర్శించడానికి వచ్చిన మహారాజులు ఒకరినొకరు తాకడం వల్ల వారు ధరించిన ఆభరణాల రాపిడికి రాలిన పొట్టు, తన ముంగిట్లో ఉన్న మదగజాల యొక్క మదం వల్ల ఏర్పడ్డ బురదను సైతం కప్పేలాగా ఉంది. అంటే ధర్మరాజు ఎంతటి సద్గుణ సంపన్నుడు అయి ఉంటే అంతటి గొప్ప చక్రవర్తిగా పేరును పొందుతాడు. అందులోనూ వినయం, శాంతి, దానగుణం, సంపదలు, పరాక్రమం, ఔదార్యం, ధర్మనిష్ట, సత్యం ఇలా చెప్పుకుంటూ పోతే ధర్మరాజు సద్గుణలకు పోటీగా నిలిచే వారే లేరు. అంతటి గొప్పటి నాయకత్వ లక్షణాలను కలిగి ఉన్న వాడు ధర్మరాజు. ఇటువంటి గొప్ప నాయకులు జన్మించిన ఈ దేశంలో నేడు స్వార్ధపూరితమైన నాయకులతో, ఏటు వైపుకు వెళ్తున్నాము తెలియని సమాజంలో, పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో కలిసిపోయి తమ మానవులం అని మర్చిపోతున్న నేటి తరం సమాజంలో ఇటువంటి గొప్ప లక్షణాలున్న నాయకులు కనిపించరు. ధర్మరాజులో ఉన్న గొప్ప లక్షణాలన్నింటినీ కాకపోయినా నేటి సమాజంలో వారు కేవలం కొన్నింటిని తమలో ఆకలింపు చేసుకున్న ప్రపంచంలోనే ఒక గొప్ప నాయకుడిగా ఎదగ గలుగుతాడు.

ఇలా కేవలం ధర్మరాజు మాత్రమే కాకుండా భీష్ముడు, శ్రీకృష్ణుడు, పరీక్షిత్తు, నలుడు, దుష్యంతుడు వంటి ఎంతోమంది గొప్ప నాయకత్వ లక్షణాలను కలిగిన వారు మనకు మార్గదర్శకంగా మహాభారతంలో కనిపిస్తారు. ఇంతటి గొప్ప నాయకుల ఆదర్శాలను, సిద్ధాంతాలను, వారు అనుసరించిన మార్గాలను, వారిలో ఉన్న నాయకత్వ లక్షణాలను, మనం అనుసరించి, పాటించగలిగినప్పుడే దేశం అన్ని రంగాలలో గొప్ప నాయకుల పరిధిలో అభివృద్ధిని నోచుకోగలదు. ఈ తరంలో నూతన యువ నాయకులు ఉద్భవించి దేశం, ప్రజలు అభివృద్ధి వైపు తమ పతాకాలను ఎగురవేయగలరు అంటే ఇటువంటి గొప్ప ఆదర్శాలు కలిగిన వారిన అనుసరించడం వలన మాత్రమే. ముందు, ముందు మహాత్మ, వివేకానంద, ఏపీజే అబ్దుల్ కలాం

వంటి గొప్ప నాయకులను మనం చూడలి అన్నా,అలాంటివారు మళ్లీమళ్లీ సమాజంలో జన్మించాలి అన్నా మహాభారతంలో చెప్పిన నాయకత్వ లక్షణాలను నేటి సమాజంలోని నాయకులైన, రాబోయే నూతన తరం నాయకులైన సరే పంచమువేదంలో చెప్పబడిన నాయకత్వ లక్షణాలను పూర్తిగా కాకపోయినా వీలైనంతవరకు తమలో ఆకలింపు చేసుకొని, వాటిని పదును పెట్టి, నేర్పుగా ఉపయోగించుకోవాలి అప్పుడే నూతన అభివృద్ధి, నూతన సమాజం ఏర్పడతాయి.

## నాయకునికి ఉండకూడని 14 లక్షణాలు

మహాభారతంలో కేవలం నాయకునికి ఉండాల్సిన లక్షణాలు మాత్రమే కాదు, ఏ ఏ లక్షణాలు ఉంటే అతను నాయకుడు అనిపించుకోడో అన్న లక్షణాల గురించి కూడా వివరంగా చెప్పారు. అంటే నాయకుడికి ఉండకూడని అంశాలును గురించి చర్చించారు. అయితే సభాపర్వంలో, ఒకటవ అశ్వాసంలో నారదుడుకి, ధర్మరాజుకి మధ్య జరిగిన సంభాషణలో ఒక నాయకునికి లేదా రాజుకి లేదా పాలకునికి ఏ లక్షణాలు ఉండకూడదో స్పష్టంగా తెలుపుతోంది.

**వ. మఱియు నాస్తిక్యం బనృతంబు ప్రమాదం బాలస్యం బనార్థజ్ఞులతోడి చింతనంబు క్రోధంబు దీర్ఘచిందా దీర్ఘ సూత్రత యెఱుకగలవారి నఱుంగమి యర్థంబుల యదనర్థక చింత నిశ్చితకార్యంబులు సేయమి మంత్రంబుల రక్షింపమి శుభంబులఁ బ్రాయోగింపమి విషయంబులం దగులుట యనంబరఁగిన పదునాలుగు రాజదోషంబులఁ బరిహరితె? యని యడిగిన నారదునకు ధర్మరా జి ట్లనియె. (ఆంధ్ర మహాభారతం, సభాపర్వం, ఆశ్వాసం 1, వచనం 56)**

ఇక్కడ పేర్కొన్న 14 దోషాలు నాయకుడిలో ఉండటం వలన అతను సమర్ధవంతంగా పాలన చేయలేడు. అందుకే నారదుడు ఎటువంటి దుర్గుణాలను త్యాజించాలో స్పష్టంగా వివరించాడు. కేవలం ఇది భారత కాలంలో ఉన్న నాయకులకు మాత్రమే కాక నేడు, భవిష్యత్తులో కూడా ఈ లక్షణాలు ఉన్న నాయకులు సమర్ధవంతమైన పాలన చేయలేరు. వారిలో ఉన్న దోషాల కారణంగా, వారిలో ఉన్న అసమర్ధత కారణంగా రాజ్యం చిన్నాభిన్నం అవుతుంది. ఇలాంటి లక్షణాలు ఉన్న నాయకుడిని ఎన్నుకుంటే ఎన్ని ఇబ్బందులు పడాలో ప్రజలు స్పష్టంగా గ్రహిస్తారు. ప్రస్తుత మన ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలకు ఈ మాటలు ఒక చెంపపెట్టులా భావించవచ్చు. బలహీనతలు, దుర్గుణాలు ఉన్న నాయకుడి వల్ల ప్రజలు పీడింపబడతారే తప్ప ప్రజలకు, దేశానికి ఎటువంటి శుభము కలుగదు. నేడు దేశంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు కారణం అసమర్ధత కలిగి, నాయకత్వం అంటే ఏమిటో కూడా తెలియని వారు నాయకులుగా చలామణి కావటడం. కావునే ప్రజలు కూడా మంచి నాయకత్వ లక్షణాలు కలిగిన నాయకుడిని ఎన్నుకోగలిగే సామర్ధ్యం కలిగి ఉండాలి. అసలు మంచి లక్షణాలు ఏవి, చెడు లక్షణాలు ఏవి అన్న విషయాలన్నీ ప్రజలకు తెలియాలి అంటే మహాభారతం వంటి ఇతిహాస గ్రంథాలను చదివి, వాటిలోని అంశాలను అవగాహన చేసుకుని, నూతన మార్గంలో, ధర్మబద్ధంగా జీవించటానికి ప్రయత్నించాలి. ఈ ఆంధ్ర మహాభారతంలోని పాత్రుల ద్వారా ఒక వ్యక్తి ఒక నాయకునిగా మార్పు చెందటానికి అతనిపై ప్రభావం చూపించగల శక్తి ఏమిటి అని తెలుసుకోవడానికి ఎంతో అవకాశం ఉంది. ఈ పాత్రల ద్వారా వారి నాయకత్వ లక్షణాల ద్వారా నేటి సమాజంలోని నాయకులలో మార్పు రాగలిగిన లేదా ఈ లక్షణాలతో నూతన తరం ఆవిర్భవించిన మన దేశం ధర్మదేశంగా విరాజిల్లుతుంది.

## ఆధార గ్రంథాలు

1. ఆంధ్ర మహాభారతం. 2000. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

2. కవిత్రయం( నన్నయ, తిక్కన, ఎర్రన). 2014. శ్రీమదాంధ్ర మహాభారతము. (15 సంపుటాలు) తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానములు.

3.ఆంధ్ర మహాభారతోపన్యాసములు. 2007. హైదరాబాద్ ఆంధ్ర సారస్వత పరిషత్తు.

4.డా. గురజాడ గరికపాటి. 2022. ఆంధ్ర మహాభారతం ఆధునిక జీవితం. హైదరాబాద్.

# 43. ఆంధ్రమహాభారతం - నేటి ఆధునిక జీవితం - ప్రేమ, ఒత్తిడి

– పొందుగుల బాలు భీంరావ్, అనంతపురము

మహాభారతం జరిగిన దగ్గర నుంచి అది అప్పటి కాలానికి ఇప్పుడు ప్రస్తుతం ఆధునికంగా మారిన కాలానికి అన్ని విషయాలనూ పొందుపరచుకొని ఉన్నది అనడం అందరికీ తెలిసిన విషయం "భారతంలో ఉన్నది ఎక్కడైనా ఉంటుంది ఇందులో లేనిది ఎక్కడ ఉండదు" అనే విషయాన్ని బట్టి ఇప్పటివరకు ఎవరు ఏ దృష్టితో వెతికితే అవి భారతంలో దొరకబడ్డాయి. అయితే ఇప్పటివరకు జరిగిన పరిశోధనలు ఎన్ని ఉన్నా ఇప్పుడు వెతికినా సరికొత్త విషయాలతో మరియు ఆధునిక జీవితం ఎలా ఉంది ఏం చేస్తే మనం దాన్ని జయించగలమో అలాగే ఎటువంటి సమస్యలకైనా దానిలో సమాధానాలు దొరకడం తెలుస్తుంది.

ప్రస్తుతం యువతలో ఎక్కువగా రెండు విషయాలు కనబడుతున్నవి వాటిలో మొదటిది ప్రేమ. ప్రేమ అనగానే మనకు కావ్యాలలో కనిపించే ఒక ఆదరణమైన ప్రేమ మరియు ధర్మబద్ధమైన ప్రేమ కాకుండా అనేకమైన వ్యర్థ ఆలోచనలతో, అవసరాల కోసం మరియు ఎవరైనా చూసి తాము కూడా పొందాలని ఆశతో ఉంటారు. అసలు ప్రేమంటే అర్థం సహజంగా కలిగే ఒక నమ్మకం. కానీ ఇప్పుడు అది ఒక అత్యవసర విషయం అవడం దురదృష్టం. ఇప్పుడు జరుగుతున్న ప్రేమ వ్యవహారాలన్నీ అందాన్ని, శరీరాన్ని మరియు డబ్బుని ఇలా ఏదో ఒక దాన్ని ఆశిస్తూ పుడుతున్నవే కానీ సహజమైన ప్రేమ ఈరోజుల్లో చూడడం చాలా అరుదుగా కనపడుతుంది. మరొక అంశం ఒత్తిడి. ఈ ఒత్తిడి మనుషులను, మనుషుల ఆలోచనలను శాసిస్తున్న మరొక అంశం. ప్రస్తుత కాలంలో చిన్న విషయానికి కూడా ఏం జరుగుతుందో అనే ధోరణిలో ఆలోచిస్తూ వాళ్లని వాళ్లే ఒత్తిడిలోకి నెట్టేసుకుంటున్నారు. ఈ విషయాలన్నీ చూడగా ఈ ఆధునిక సమాజానికి సరిపోయే విధంగా మరియు ఈ రెండు అంశాలను ఎలా రూపుమాపాలి, అలాగే ఈ పరిస్థితుల్లో ఉన్నప్పుడు మనిషి యొక్క ఆలోచన విధానాన్ని ఎలా మార్చుకోవాలి అనే విషయాన్ని మహాభారతం నుంచి తెలుసుకోవచ్చు.

విదురుడు, ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనం చేయు సందర్భం స్త్రీ పర్వమున ప్రథమాశ్వాసములో చూసుకొనవచ్చు. ఆ సందర్భంలో భాగంగా కొన్ని మాటలు పైన పేర్కొన్న విషయాలకు అనుగుణంగా మరియు వాటికి పరిష్కారాలుగా ఎలా ఆలోచించొచ్చు అనే విషయాల్ని పొందుపరిచి ఉన్నాయి.

**"పెరుఁగుట ప్రర్గంగ, రుచులం**
**బొరయుట యరుచంబుఁ గాగ,బుట్టుట సావం,**
**బెరయుట పాయఁ, బదార్థో**
**త్వరముల నైజ: మది యెట్లు దప్పింప నగున్?"**

**(స్త్రీ – ప్రథమ – 24వ పద్యం, పుట 537)**

ఇక్కడ విదురుడు ధృతరాష్ట్రునితో పలికిన మాటల్లో తెలుస్తున్న విషయాలు చూసుకుంటే అసలు పెరిగేది తరిగిపోవటానికి, రుచులు ఆసక్తిగా చూస్తున్నారంటే ఇకపై రచనలను పోగొట్టుకోవడం కొరకే, పుట్టడం చావడం కోసం, దగ్గర ఏది దూరం కావడం కోసం ఇది పదార్థ స్వభావం మనం మార్చలేం. అని అర్థంలో చెప్పిన దీని అంతరంలో చూసుకుంటే ఇప్పుడు జరిగే ప్రేమలో కూడా అప్పటికప్పుడు జరిగేవిగా మరియు అందాన్ని చూసి వచ్చేవిగా ఉన్నాయి. ఎదుటివారు చెప్పిన మాటల్లో చూసుకుంటే ఏ విషయమైనా, రుచి అయినా ఎలాగైతే కొంతకాలమే ఉంటాయో, అందం కూడా నిత్యం ఉండదు. కాలం మారే కొలది అందం క్షీణిస్తుంది. ఆ క్రమంలోనే అందాన్ని చూసి పుట్టిన ప్రేమ కూడా క్షీణిస్తుంది.

"యౌవనంబును రూపంబు జీవితంబు
ద్రవ్య సంచయములు ననిత్యములు గావే?
వీని హానికి వగ పవివేక మగుటఁ
బండితులు వగఁ గూరరు పౌరవేంద్ర"

**(స్త్రీ – ప్రథమ – 27వ పద్యం, పుట 539)**

మనిషి ముఖ్యం అనుకునే వయస్సు, అందము, జీవితము ఇలా ఈ విషయాలన్నీ శాశ్వతం కానివి కానీ మనిషి వాటిని చూసుకొని లేదా వాటిని దృష్టిలో పెట్టుకొని తన జీవితాన్ని మొత్తం ఒక ఊహా ప్రపంచంలో ఊహించుకోవడం జరుగుతుంది. అందువల్ల అవి శాశ్వతం కావని తెలుసుకున్న వాళ్ళు ఎంతమంది ఉన్నారు? ఎవరూ వాటి గురించి బాధపడరు. ఆ తీరుగానే ఏదో ఉందని ఊహించుకొని ఊహాజనిత లోకంలో ఉండడం కంటే ఏది శాశ్వతం ఏది అశాశ్వతం అని తెలుసుకొని మెలగడం నేర్చుకోవాలి. అనేది ఈ పద్యం ద్వారా తెలియజేయవచ్చు.

అలాగే మనిషి వీటిని కోల్పోతానని తనలో తానే ఆలోచిస్తూ, తనకు ఏదో ఆపద వాటిల్లుతుందని ముందుగానే తలుచుకుంటూ, తనలో తానే ఒత్తిడికి గురవుతూ, మామూలు జీవితాన్ని జీవించడానికి బదులు ఏదో కోల్పోయినట్టు ఉంటారు. అలాగే ఏదో కోరుకొని అది దక్కక దుఃఖించి ఇదే నా జీవితం అనుకుంటూ నిరాశతో మరి కొందరు ఉండటం చూడవచ్చు. అలాంటివారికి కూడా తెలిసేలా విదురుడు ఉపదేశించడం జరిగింది.

ఇం. ప్ర "చింతాపరత్వంబునఁ జెందు దుఃఖా
క్రాంతత్వ ముర్వీశ్వర! కానఁ గీడుం
జింతింపఁ దార్యాత్ముఁ దచింతనుండై
యంతః పరీతాపము నార్పఁ జాలున్"

**(స్త్రీ – ప్రథమ – 29వ పద్యం, పుట 540)**

కోరుకున్నది దక్కలేదని అదే చింతతో బాధపడుతూ కూర్చుంటే జీవితాంతం దు:ఖిస్తూ ఉండాలి. దాని వలన జీవితం ఆగిపోతుంది గాని, తాను అనుకున్నది సాధించలేరు. ఆ బాధను వదిలి నీలో ఉన్న నమ్మకాన్ని మరియు ధైర్యాన్ని ఉపయోగించి లోపల ఉన్న క్రియాశీలతను బయటపెట్టి అనుకున్న దానికన్నా మెరుగైన ఫలితాలను అందుకునే అవకాశం ఉంది. అలా అందుకున్న తర్వాత ఇక ఏ నిరాశ, ఒత్తిడి నీ చెంతకు చేరదు. ప్రశాంతంగా ఉండేందుకు దోహదపడుతుంది. మనిషి ఆ విధంగా తన ఆలోచన విధానాన్ని మార్చుకుని మెలగాలే కానీ ఏదో చిన్న బాధ రాగానే ఒత్తిడికి గురై ఆ ఒత్తిడిలో ఏ నిర్ణయాలు తీసుకోకూడదు అని విదురుడు ధృతరాష్ట్రునకు తమ వంద మంది కొడుకులు యుద్ధమున వీరత్వం పొందగా ఆయన ఎలా ఉండాలో ఉద్దేశించి మాట్లాడిన సందర్భంలోనిది. వందమంది కుమారులను కోల్పోయిన ఆయన తర్వాతి జరగవలసిన దాని గురించి ఉన్నంత ఆలోచన మనలో కూడా రావాలని చిన్న చిన్న సమస్యలకు పెద్ద నిర్ణయాలు తీసుకొని జీవితాలు చేతులారా పోగొట్టుకోకుండా ఉండాలని ఈ సందేశం ద్వారా మనకు తెలుస్తున్నది. నేటి కాలంలో ఒత్తిడితో అధికశాతం మంది అర్థాంతరంగా తనువలు చాలిస్తున్నారని ఆధునిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇలాంటి ఒత్తిడులను అధిగమించడానికి మహాభారతం నుండి మనం అనేక మార్గాలను నేటి తరానికి అందించడం ద్వారా వారిలో నూతనోత్తేజం కలుగుతుంది. తద్వారా యువతకు ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం చేకూరుతుంది.

మనిషి కొన్నింటిని ఇష్టంగా చూసుకోవడం సహజం, వాటిపై ఎక్కువ మమకారంతో వాటికి అలవాటు పడిన వాటికి దూరమైతే తట్టుకోలేనంతగా చింతించడం జరుగుతుంది, అదేవిధంగా ఎలాంటి క్లిష్టమైన పరిస్థితి వచ్చినా తాను ఒక్కడికే ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆలోచనలో పడడమే మనిషి యొక్క నైజం.

**"ప్రియవస్తు వెడలుటయు న**
**ప్రియంబు వాటిల్లుటయుఁ బరిజ్ఞాన విని**
**శ్చయ హీనులైన యల్పా,**
**శయులకు 'దుఃఖంబుఁ జేయు' జగతీనాథా!"**

**(స్త్రీ – ప్రథమ – 30వ పద్యం, పుట 540)**

మనుషులకి ఉండే చిన్న చిన్న ఆశలు, ఆ ఆశల వెనక తమ జీవితపుదారిని కొనసాగించుకుంటూ వెళ్తున్న వారికి జ్ఞానం తక్కువ. అందువలన వారికి ఇష్టమైన ఏ వస్తువు గాని, మనిషి గాని నశిస్తే దుఃఖిస్తారు. ఏమాత్రం క్లిష్ట పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కోలేరు. పైన చెప్పిన విధంగా వస్తువులు గాని మనుషులు గాని శాశ్వతం కాదు అని తెలుసుకున్న వారికి మాత్రం అవి నశించినా, ఆ బాధలు వారిని ఏమి చేయలేవు.

జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని పొందాలంటే ఈ జ్ఞానాన్ని తెలుసుకోవడం చాలా అవసరం.

**"ఒక యింటనుండి వేరొక యింటి కరిగిన**
**విధమును వస్త్రంబు విడిచి యొందు**
**వస్త్రంబు గట్టిన వడువును నై యుండు**
**నొడలు దొఱంగి యొండొక్క యొడలు**
**గైకొంట నృప! విను కడవకు సారెపై**
**నమర మృత్తిక యిడినపుడు విరియు**
**టయు వెరవారఁ బట్టఁగరాక చెడుటయు,**
**వాని యెత్తెడు నెడ ప్రయ్యుటయును**
**నెత్తి యొకచోట డించిన నెడలుటయును,**
**నెండి యవియుటయును నావ మిడినఁ బగిలి**
**పోవుటయు వాడు జనులచేఁ బొలియుటయును**
**గలుగు గతి మేనికెట్లును గలుగుఁ జేటు"**

**(స్త్రీ – ప్రథమ – 34వ పద్యం, పుట 542)**

జీవితం ఒక మట్టికుండలాంటిది. ఆ మట్టికుండ చేసే విధానంలో మట్టి ఎన్నిసార్లైనా విడిపోయి మరల మరల కుమ్మరిసారెపై తీర్చిదిద్దబడుతుంది. అలా తీర్చిదిద్దిన కుండ సారెపైనుంచి దించినప్పుడు కాని, కింద పెట్టు సమయంలో కానీ, ఎండబెట్టు సమయంలో కానీ, చివరికి ఆ కొండను ఉపయోగించేవారి చేతిలో గాని పగలకుండా ఉండడం కుదరదు. అలానే మనం ఎంత ఆలోచించినా మరియు ఎంత ఒత్తిడికి గురైన జీవితం యొక్క గమ్యం చివరకు మరణమే దానిని ఆపడం ఎవరికి సాధ్యం కాదు. అందువలన ఏదో కోల్పోయానని నిరాశ పడకుండా తర్వాత ఏం చేయాలనే ఆలోచనతో ముందుకెళ్లే ధైర్యం తెచ్చుకొని నీలో ఉన్న నిరాశను తొలగించే ఒక ఆశయంగా వెళ్లాలని విదురుడు ధృతరాష్ట్రుడికి చెప్పిన సందేశంలో కనబడటం జరుగుతుంది. అక్కడ విదురుడు చెప్పిన సందర్భం, విషయం వేరైనా ఆ మాటల్లో ఉన్న సందేశం మరియు ఆ సందేశంలో ఉన్న ఉదాహరణలు ప్రస్తుతం సమాజంలో ప్రేమ అనే ముసుగులో మరియు నిరాశ అనే బాధలో ఉంటున్న యువతకు దాన్ని అధిగమించడానికి సహాయపడే సందేశంగా భావించడం వల్ల నేటి యువత పునరుత్తేజితమవుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఈ విధంగా భారతం ఏ తరానికైనా, ఏ కాలానికైనా, ఏ విషయానికైనా, ఏ సమస్యకైనా ప్రతి ఒక్క ప్రశ్నకు సమాధానం దొరికే విధంగా ఉంటుందని తెలుస్తుంది. అందువలన "దీనిలో ఉండేది ఎక్కడైనా ఉంటుంది, దీనిలో లేనిది ఎక్కడ ఉండదు" అనే మాట భారతం విషయంలో నిజమనిపించక మానదన్న విషయాన్ని మనం గమనించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆధార గ్రంధాలు**

1. ఆంధ్ర మహాభారతం. 2000. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

2. కవిత్రయం( నన్నయ, తిక్కన, ఎర్రన). 2014. శ్రీమదాంధ్ర మహాభారతము. (15 సంపుటాలు) తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానములు.

3. డా॥ శ్రీరాములు, డక్కీపురం (2014), నన్నయభారతం -ఉపాఖ్యానాల విశ్లేషణ - (అముద్రిత పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం)

4. డా॥ రామప్రసాద్‌రెడ్డి, తప్పెట (2010) తిక్కన మహాభారత ఉపాఖ్యానాలు మానవ స్వభావ చిత్రణ- స్వీయప్రచురణ, కడప

5. శేషగిరిరావు, దేవరకొండ (1967) భారత కథలు - అంతరార్థము - శ్రీపతి ప్రెస్, కాకినాడ.

6. రామకృష్ణమాచార్య, నండూరి (2005), కవిత్రయము - సాహిత్యపీఠం, సికింద్రాబాదు

7. శ్రీరామచంద్రుడు, పుల్లెల (2012), మహాభారత సార సంగ్రహము, శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాదు.

8. ఆచార్య లక్ష్మీ రంజనం ఖండవల్లి & ఆచార్య వేంకటావధాని, దివాకర్ల (1972) ఆంధ్ర మహాభరతం సంశోధిత ముద్రణము( కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు), భారత ప్రభుత్వము & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ముద్రణ.

9. డా. జయరామి రెడ్డి . డి (1993) ఆధ్ర మహాభారతంలో వరాలు, శాపాలు ఒక పరిశీలన ముద్రిత పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి.

# 44. సత్యా ద్రౌపదీ సంవాదం - ద్రౌపది దాంపత్య ధర్మం

– డా॥ సంగీతరావు మెదతోటి, హైదరాబాద్.

'ప్రబంధ పరమేశ్వరుని'గా తాత ఎఱపోతసూరి గారిచే బిరుదాంకితులై తరువాతి వారందరితో గౌరవించబడుతున్న' (ఆచార్య సుబ్రహ్మణ్యం. జి.వి. 2012, 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు', తెలుగు అకాడమి, హైదరాబాదు, పుట: 80) ఎఱ్ఱన, క్రీ.శ. 1280 – 1360 ప్రాంతం నాటి ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. ఈయన గురువు శంకరస్వామి వల్ల శివభక్తుడై 'శంభుదాసుడు' అనే బిరుదాన్ని కూడా పొందారు. (డా. ద్వా.నా. శాస్త్రి, జూన్ 2008, 'తెలుగు సాహిత్య చరిత్ర', ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్, పుట: 39) 'ప్రతిభా పాండిత్యములందు నన్నయ తిక్కనల కెనయై భారతారణ్య పర్వ శేషమునే కాక హరిహంశమును గూడ సమర్థతతో నిర్వహించి కవిత్రయంలో స్థానము సంపాదింపఁజాలెను. ఈయన ఆరణ్య పర్వ శేషమును నన్నయ పేరు మీఁదుగనే తెనిగించి రాజరాజునకే అంకితము చేసెను. ఇది ఎఱ్ఱన సహజమైన వినయమును నన్నయపైఁగల భక్తిని చాటుచున్నది. ఈయన ఆరణ్యపర్వశేషమును నన్నయశైలితో ఆరంభించి తిక్కన శైలితో ముగించెను'. (డా. వేంకటావధాని, దివాకర్ల, 2009, 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము', ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్. పుట: 23) నేను ఎఱ్ఱన రచించిన ఆరణ్య పర్వం, పంచమాశ్వాసంను నా పత్ర సమర్పణకు అంశంగా గ్రహించి మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ వారికి పత్రాన్ని సమర్పిస్తున్నాను.

"పాండవులు పాంచాలీ (ద్రౌపది) సహితులై ఆరణ్యవాసం చేస్తున్నారు. శరదృతువులో సర్వస్వతీ నదీ తీరాన ఉన్నారు. అక్కడనుంచి బయలుదేరి కామ్యక వనంలో ధౌమ్యాది పురోహితులూ, ఇంద్రసేనాది మూలభృత్యులూ ఉన్న సమయంలో"' (రామబ్రహ్మం బేతవోలు, జనవరి – 2000, 'పద్య కవితా పరిచయం' అప్పజ్యోసుల – విష్ణుబొట్ల ఫౌండేషన్ ప్రచురణ, U.S.A, పుట: 77) పాండవులను దర్శించుటకు మార్కండేయ మహర్షుల వారు వచ్చి కుశల ప్రశ్నలనంతరం పాండవులకు మహిషాసుర సంహార గాథను, కుమారస్వామి పరాక్రమ ప్రభావాలను వినిపించారు. పాండవులు భక్తి శ్రద్ధలతో విని సంతృప్తులైన పిదప ఆ మహర్షిని పూజించి అభినందించారు.

అదే సమయంలో శ్రీకృష్ణుల వారు సత్యభామ సమేతంగా పాండవులను పరామర్శించుటకు వచ్చారు. ఆ సమయంలో పురుషులైన పాండవులు, శ్రీకృష్ణుల వారు ఒక వైపు కూర్చుండి ముచ్చటిస్తుంటే మరొ వైపు సత్యభామ, ద్రౌపది కూర్చొని ఆంతర్గతమైన ఇష్ట సల్లాపాలలో నిమగ్నులైనారు.

ఆ సమయంలో సత్యభామ స్వార్థ చింతనను మనస్సునందుంచుకొని తన భర్త శ్రీకృషుల వారు మిగిలిన ఏడుగురి భార్యలకు వశం కాకుండా తనకే వశం (సొంతం) కావాలనే దుర్బుద్ధితో భర్తలను ఎలా వశీకరణం చేసుకొంటారో, ఆ విద్యలను గూర్చి ద్రౌపదిని పొగుడుతూ నీ భర్తలు ఐదుగురు కూడా నీ యెడల ఒకరిని మించి ఒకరు నిరంతరం ప్రేమానురాగాలు చూపుటకు వశీకరణ విద్యలేమైనా ప్రయోగిస్తున్నావా? అని అడిగింది సత్య. ఆ మాటలను శ్రద్ధతో విన్న ద్రౌపది మనస్సులో నొచ్చుకొని, పైకి చిరునవ్వుతో సత్యతో నీవు ఎంతటి అందగత్తెవైనా నన్ను అందరి స్త్రీల వలె మాట్లాడటం చూస్తే పురుషోత్తముడైన శ్రీ కృష్ణుడికి భార్యగా నీవు ఉండుటకు తగవు, అని సుతి మెత్తగా నవ్వుతూనే చురక అంటిస్తూ వశీకరణ విద్య గూర్చి తెలుపుతుంది, సత్యా ఆ విద్యలు ప్రయోగించినట్లు భర్తలకు తెలిస్తే ముందు చూపిన ప్రేమను చూపక నీతో కాపురం చేయడం పాముతో స్నేహంగా భర్తలు భావిస్తారని ఈ విధంగా పలికింది.

**'నీ ప్రియభర్తల నిర్మలచరితులఁ**
**ప్రకటతేజుల లోకపాలనిభులఁ**

**బార్థుల నీ వొకభంగిన వదలక**
**చెలువ! యెబ్బంగి భజింతు దగిలి?**
**యొక్క రొక్కనికంటె నువిద! నీ కేవురు**
**ననురక్తు లగుట యత్యద్భుతంబుబీ**
**నగుమొగంబుల కాని నలినాక్షి!**
**నీ దెసఁ బతులకుఁ గింకిరిపాటు లేదుబీ**
**వ్రతము పెంపొ? మంత్రౌషధ వైభవంబొ?**
**సరస నైపథ్యకర్మ కౌశలమొ? చతుర**
**విభ్రమోల్లస రేఖయొ? వెలది! నీ వి**
**శేష సౌభాగ్య హేతువు సెపుమ నాకు.**

(డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 854)

**అని యడిగిన మది నించుక**
**గినుక వొడమ నడఁచుకొనుచుఁ గృష్ణ మృదులహా**
**సిని యగుచుఁ గృష్ణభామినిఁ**
**గనుఁగొని యిట్లనియె నిర్వకారాకృతియై.**
**'నను నిట్లు దుష్టవనితా**
**జనమునటులుగాఁ దలంపఁ జనునే నీకున్?**
**మన సొప్పదు పురుషోత్తము**
**వనితవుగాఁ దగవు నీవు వనరుహనయనా!'**

(డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 855)

ఇలాగే ఒక వేళ భర్తను వశం చేసుకోవాలని ఆత్రుతపడి మంత్ర తంత్ర వివిధ ఔషదాలను ప్రయోగిస్తే వాటి ప్రభావం ప్రతికూలమై బెడిసి కొట్టి భర్తకు మూగతనం, మనస్సు, శరీరం మొద్దుబారటం మొదలైన జబ్బులు రావడం జరుగును. కొన్ని సార్లు ప్రాణం పోయే పరిస్థితులు కూడా రావచ్చు. అలా వస్తే ఆ స్త్రీ సౌభాగ్యం కోల్పోయి అపకీర్తి తెచ్చుకొని చివరకు జీవితమే నరకయాతనగును.

కావున ఏ భార్యయైన తన భర్త పట్ల తెలిసిగాని, తెలియకగాని మోసపు పనులు చేయరాదు. భర్త మనస్సు ఎరిగి అనుకూలంగా ప్రవర్తిస్తే ఆ దాంపత్యమే దాంపత్యమని అదే సకల రీతులుగా భర్తను ఆ కట్టుకొనే ఉత్తమ రీతియని గ్రహించాలని హిత బోధను చేస్తుంది.

**'అలయక మంత్ర తంత్ర వివిధౌషధ భంగులఁ జేసి యెంతయున్**
**వలతురు నాథు లంట మగువా! కడుబేలతనంబుబీ దాన మున్**
**గలిగిన ప్రేమయుం బొలియుఁ గాని యొకండును సిద్ధిఁబొందబీ ద**
**ప్పొలఁతుక తోడి మన్కి యహిపొత్తుగఁ జూచు విభుం దెఱింగినన్.**

**మగువ యొనర్చు వశ్యవిధి మందులు మాఁకులు నొందుచందమై**
**మగనికిఁ దెచ్చు రోగములు, మానక మూకజడాదిభావముల్**
**మొగి నొనరించు, నద్దురితముల్ దన చేసిన చేఁత లై తుదిన్**
**జగమున కెక్కి నిందయును సద్గతిహానియు వచ్చు నింతికిన్.**

(డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 856)

మరియు ద్రౌపది సత్యభామతో తన భర్తల పట్ల తాను ఎలా వ్యవహరిస్తానో తెలిపెదను వినుమని ఇలా పలికింది. భర్తలు అన్యకాంతల వైపు అనురక్తులై వారిని కూడినప్పటికీ నేను బాధపడను. ఎప్పుడూ స్వాభిలాషను, స్వాతిశయంను చూపను. భర్తల యెడల వినయంతో, పూజ్య భావంతో వారికి సహకరిస్తూ పరిచర్య చేస్తాను. వింతైన పనులుగాని, వింతైన మాటలుగాని మాట్లాడక, పర పురుషులు అందగాళ్ళైనా, గొప్పవారైనా, దేవతలైనా, యక్షులైనా గడ్డిపోచతో సమానంగా చూస్తాను. భర్తలు పనులపై బయటకు వెళ్ళి వచ్చేదాకా ఎదురు చూస్తుంటాను. వారు వచ్చిన పిదప ఉచితాసన సదుపాయాలు, స్నాన, భోజన, శయన సౌకర్యాలు కల్పించిన తర్వాతనే నేను వాటిని అనుభవిస్తాను. మరియు భర్తలు ఇంటనున్నప్పుడుగాని లేక బయటకు వెళ్ళి వచ్చినప్పుడు గాని వారి కొరకు సేవకులను ఉపయోగించక నేనే అన్ని పనులు భర్తలకు చేస్తానని ఇలా పలికింది.

**పతు లాత్మ నొండొక్క పడఁతులఁ**
**గలసిన నలుగు, నెయ్యెడల నహంకరింపబీ**
**మదముఁ బ్రమాదంబు మాని వారికిఁ జిత్త**
**మేకముఖంబుగ నెల్లప్రొద్దు**
**భక్తి సేయుదుఁబీ జూపుఁ బలుకును గోర్కియుఁ**
**జెయ్యులు వింతగాఁ జేయ నెపుడుబీ**
**నమర గంధర్వ యక్షాదులం దైనను**
**బురుష నన్యునిఁ దృణంబుగఁ దలంతుబీ**
**స్నాన భోజన శయనాది సంప్రయోగ**
**మర్థిఁ బతులకు మున్నెందు నాచరింపఁబీ**
**బతులు వచ్చిన నాసన పాద్య విధుల**
**భక్తితో నేన కావింతుఁ బనుప నొరుల.**

(డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 857)

అలాగే నా భర్తలకు క్రమం తప్పకుండా అన్ని సౌకర్యాలు కల్పించి, ఏది వ్యర్థం కానివ్వకుండా ఇంటిని, ఇంటిలోని పాత్రలను, ఇంటిలోని వారిని, ఇంటికి వచ్చిన అతిథి మిత్రాదులకు సదా సంతోషం కలిగిస్తానని పద్యరూపంలో ఇలా పలికింది.

**తగియెడు వేళలందు నియతంబుగ మజ్జన భోజన క్రియల్**
**దగ నొడఁగూర్తు భర్తలకుబీ ధాన్యధనంబులు రిత్తమై వ్యయం**
**బగుటకు నోర్వ నెప్పుడు, గృహస్థలభాండ విశోధనంబు లి**
**మ్ముగ నొకనాఁడు నేమఱఁ, బ్రమోదము సల్పుదు బంధుకోటికిన్.**

(డా. నరసింహారావు, వి.వి.యల్, ప్ర. విభాగాధికారి, శుక్ల – ఉగాది (1989), 'తెలుగు కావ్యపరంపర: ఆంధ్ర మహాభారతము', ప్రచురణ, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, పుట: 520)

అంతేగాక భర్తలు ఇంటిలో నున్నపుడుగాని, లేనప్పుడుగాని ఇంటి గుమ్మం దగ్గరగాని, ముందరగాని అదే పనిగా తిరుగాడటం, వచ్చిపోయేవారితో అతిగా ముచ్చటించడం చేయను. ప్రత్యేకించి చెడ్డ వారితో అసలు స్నేహం చేయడంగాని, గొడవపడటంగాని, హాస్యపు మాటలు మితి మీరి మాట్లాడటంగాని చేయను. మరియు అలాంటి ఆలోచనగాని, పనులుగాని నేను ఎప్పుడు చేయనని ఇలా తెలిపింది.

**పలుమాఱుం దలవాకిట**
**మెలఁగుట, యసతీజనైకమిత్రత, కలహం**
**బుల కెలయుట, నగుపలుకులఁ**
**బెలుచ నగుట నాకుఁ గానిపేరివి మగువా!**

(డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 859)

అదే విధంగా అత్తగారి పట్ల పూజ్యభావంతో ఆమెకు అనుకూలమైన దినచర్యకు కావాలసిన సపర్యలను నేనే దగ్గరుండి చేస్తాను. ఇందుకు సేవకులను పురమాయించను. అతిథులు, గురు బ్రాహ్మణులు ఇంటికి వచ్చినప్పుడు కూడా సేవకులను వినియోగించక పూజ్యభావంతో నేనే పరిచర్యలు చేస్తాను. నేను ఎల్లపుడూ సంప్రీతి, క్షమ, వినయం, మంచితనం అనే శుభగుణాలను నిత్యం విడువక సదా మసలుకుంటానని ఈ పద్యం ద్వారా తెలిపింది.

**అత్తకు భక్తి గల్గి మది నాయమ సెప్పిన మాడ్కి జీవికా**
**వృత్తము లావహింతుబీ గురువిప్రజనాతిథి పూజనంబు ల**
**త్యుత్తమభక్తి నేన తగ నోపి యొనర్తుఁబీ ప్రియంబుఁ దాల్మియున్**
**మెత్తఁదనంబు సన్మతియు మేలుగఁ దాల్తు సమస్తభంగులన్.**

(డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 859)

అలాగే ధర్మరాజు దినచర్య గొప్ప వైభవంగా ఉంటుంది. ఆయనతో పాటు ఉన్న నూరు వేల మంది సేవకులు రత్నాలతో పొదగబడిన బంగారు ఆభరాణాలు ధరించి రాత్రి పగలు సేవచేస్తారు. వారు ఎల్లప్పుడు అతిథులకు, అభ్యాగతులకు ఆహార పానియాలు సమకూరుస్తూ ఉపచారాలు చేస్తుంటారు. వీరందరిని కనిపెడుతూ అపచారాలు చేయకుండా జాగరూకతతో వారిని కనిపెడుతుంటాను. అంతేగాక మదపుటేనుగులు, గొప్ప బలం గల గుర్రాలు అనేక లక్షలు వున్నాయి. వాటిని క్రమ శిక్షణతో నిర్వహించడానికి తగిన వారిని నేనే నియమించి వాటి ఆలనా పాలనా వైపు దృష్టి సారిస్తాను.

ధనాగారంలో నున్న రత్నరాసులు, బంగారు వస్తువులు ఇలా నిత్యం జరిగే ఆదాయ, వ్యయాలపైన దృష్టి సారిస్తాను. ఇలా నాకు తెలియని అంశం ఏ ఒకటి కూడా లేదు. అందరికి జీతభత్యాలు నేనే ఇస్తాను. అందువల్ల పాండవులు సంసారపు బరువు బాధ్యతలను నా పై మోపి వారు హాయిగా ఇష్టతావులలో విహరిస్తారు. కావున వారు నా మీద నమ్మకం వుంచుతారు. నేను వారి పట్ల గాని, అన్ని విషయాల పట్ల గాని ఎల్లప్పుడు జాగరూకతతో మసలుకుంటాను. ఇంత చేయడం వల్ల నేను కడుపునిండా తినడానికి గాని, నిదురపోవడానికి గాని తీరిక వుండదని తెలిపింది.

వ. మఱియు ధర్మరాజునగరియందుఁ గనకమణిమయ భూషణాలంకృతు లయిన పరిచారకులు నూఱువేలు రేయును బగలును బాత్రహస్తులై యభ్యాగత భోజనంబు లొడఁగూర్చువారు నందఱ గలరుబీ వీరెల్ల నిట్టిట్టిమెలఁకువ మెలంగుదు రని తత్కృతాకృతంబు లేన యెఱుంగుదుబీ నిరంతర మదధార తరంగిత కపోలంబు లయిన భద్రగజశతసహస్రంబులుఁ బ్రభూతజవసత్త్వసన్నుతంబు లయిన యుత్త్వమాశ్వశతసహస్రంబులుం గలవుబీ వానికి నన్నింటికి నిత్యోచితంబు లయిన ఖాద్యంబు లొనరింపను బాలింపను దగినవారి నేన నియమింతుబీ నఖండభాండాగారపూరితంబు లయిన యగణ్యమణి కనకాదివస్తువులను బ్రతిదినవిహితంబు లయిన యాయ వ్యయంబులు నా యెఱుంగని యవియు లేవుబీ గోపాల జనంబులు దుదిగాఁ గల సకల భృత్య జనంబుల జీవితంబుల నరసి యేన నడపుదుంబీ బరమయశోధను లగు పాండునందనులు నిజకుటుంబభారంబు సర్వంబు నాయంద సమర్పించి తారు నిర్భరులై యిష్టవిహారంబుల నుందుదుబీ రే నెల్ల వెంటల నప్రమత్త నై వర్తింతు. (డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 861)

**వేగ జాము గలుగ వెదనిద్రఁ బొందుదుఁ**
**గాని రాజ్యభారకార్యయుక్తి**
**నబ్జనయన! నాకు నాహార నిద్రల**
**కెడయు లేదు సువ్వె యెల్లప్రొద్దు.**

(డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, పుట: 862)

ఇలాగా అన్ని విషయాల పట్ల భర్తలకు అనుకూలంగా ఉండి వారి గౌరవ మర్యాదలకు, వారి సంతోషానికి భంగం కలిగించకుండా పతుల సేవలో తరించడమే నాకు తెలుసు. అంతేగాని నీవు అడిగిన మంత్ర తంత్ర ఔషధాలు, ఇంద్రజాల విద్యలు నాకు తెలియనే తెలియవు. అని స్నేహపూర్వక సంభాషణలతో చురకలంటిస్తూ, చక్కని దాంపత్య జీవితానికి కావలసిన పరిస్థితులను భార్యగా ఏర్పాటు చేసుకుంటే ఏ భర్తలైనా నిత్యం ప్రేమిస్తూ, పరాయి స్త్రీని తలచకుండా, అలాంటి వారి జోలికి పోకుండా, భార్యకు అనుకూలంగా వుంటారు. అంతే తప్ప నీవు అడిగిన విధంగా భార్య ప్రవర్తిస్తే, పెళ్ళైన తెల్లారో లేక ఆ తర్వాతో సంసార బంధం తెగిపోయి ఇరువురి కుటుంబీకులకు బాధని, దుఃఖాన్ని మిగిల్చి కుటుంబ పతనానికి మనమే దారులు వేసుకుంటామని చక్కని ఉపదేశాన్ని ద్రౌపది సత్యభామను పురస్కరిచుకొని నాటి, నేటి, రేపటి స్త్రీలకు హితోపదేశం చేయడం జరిగింది. కావున భార్యాభర్తల మధ్య ప్రేమ వికసించుటకు ద్రౌపది చెప్పిన విధంగా కాకుండా వేరొక విధంగా మూడవ వ్యక్తిని వారి మధ్యలోకి సలహాలు, సూచనలకు అవకాశం కల్పిస్తే కొన్ని సార్లు మూడవ వ్యక్తి మంచివారు కాకపోతే మంచి జరుగక పోగా కుటుంబ పతనానికి దారి తీయవచ్చు. అందువల్ల భార్యాభర్తలే ఒకరిని ఒకరు అర్థం చేసుకొని, సర్దుకు పోతూవుండాలని, ద్రౌపది తన భర్తల పట్ల ప్రవర్తించిన తీరుగానే భర్తలు భార్యల పట్ల అదే ప్రవర్తనతో ప్రవర్తిస్తూ వుండాలని తెలిపింది. ఇలా వుంటే భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఉ ండటమే కాక వారి దాంపత్య జీవితం మూడుపువ్వులు ఆరు కాయలులాగా వర్థిల్లుతూ, పిల్ల పాపలతో సకుటుంబ జీవితాన్ని కలకాలం ఆదర్శవంతంగా జీవిస్తూ స్పూర్తిదాయకంగా ఉంటారని, దాంపత్య ధర్మాన్ని సూక్ష్మంలో మోక్షంలాగా వివరించింది ద్రౌపది. 'ద్రౌపది పంచకన్యలలో ఒకరుగా పేర్కొనబడినది, పాతివ్రత్యమునంగాక తదితర కుటుంబ, వ్యవహారదక్షత విషయాలలో నేటికిని భారతవర్ష వనితామతల్లికల కాదర్శముగా నుండదగినదై నేటికి ఆదర్శప్రాయురాలైంది'.

(వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల, జనవరి, 2018, 'మహాభారతము చరిత్రము', విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, పుట: 157)

## ఆధార గ్రంథాలు

1. ఆచార్య సుబ్రహ్మణ్యం. జి.వి. 2012, 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు', తెలుగు అకాడమి, హైదరాబాదు.

2. డా. ద్వా.నా. శాస్త్రి, జూన్ 2008, 'తెలుగు సాహిత్య చరిత్ర', ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్.

3. డా. వేంకటావధాని, దివాకర్ల, 2009, 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము', ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

4. రామబ్రహ్మం బేతవోలు, జనవరి – 2000, 'పద్య కవితా పరిచయం' అప్పజ్యోస్యుల – విష్ణుభొట్ల ఫౌండేషన్ ప్రచురణ, U.S.A. (అమెరికా)

5. డా. సుబ్రహ్మణ్యం జి.వి. ప్ర.సంపా., 2017, 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము', ప్రచురణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

6. డా. నరసింహారావు, వి.వి.యల్, ప్ర. విభాగాధికారి, శుక్ల – ఉగాది (1989), 'తెలుగు కావ్యపరంపర: ఆంధ్ర మహాభారతము', ప్రచురణ, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

7. వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల, జనవరి, 2018, 'మహాభారతము చరిత్రము', విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

# 45. నన్నయ భారతం - వ్యక్తిత్వ వికాసానికి ప్రతీక

- యం.భీమయ్య గారు, రేపల్లె

తెలుగు సాహిత్యం 11వ శతాబ్ది నుండి నన్నయ గారితో ప్రారంభం. సమాజానికి హితాన్ని గొలిపేది. విశ్వ శ్రేయస్సును కోరేది సాహిత్యం. కావ్యం కమనీయంగా, రమణీయంగా ఉండేది. కవికర్మకార్యం, కావ్యం ద్వారా ఒకజాతి యొక్క అంతర్మూర్తిని సంస్కృతిని తెలుపుతుంది. నీతి, ధర్మబోధకమైన ఉత్తమ రచన సముదాయం సాహిత్యం. అలాంటి తెలుగు సాహిత్యంలో ఆదికవి వాగనుశాసనుడు వ్రాసిన మహాభారతం పంచమ వేదంగా ప్రసిద్ధి.(Encyclopedia of Indian Wisdom and future) దీనిని వివిధ రాజుల పాలనలో ఆంధ్రీకరించిన వారు కవిత్రయం అనబడే నన్నయ, తిక్కన, ఎర్రన గార్లు. భారతం 18 పర్వాలు: సంస్కృతంలో వేదవ్యాసుడు (జయ సంహిత) సంస్కృత భారతాన్ని వ్రాశారు. దీనిలో నాలుగు పురుషార్థాలను సాధించడానికి గల విజ్ఞానం పరిపూర్ణంగా ఉంది.

కవిత్రయములో ప్రథములుగా పేరు గాంచిన నన్నయ 11వ శతాబ్ది వాడు రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి. రాజరాజు కోరిక మేరకు వైదిక మతపునరుద్ధరణకై భారతాన్ని ఆంధ్రీకరించ తలపెట్టారు. భారత ఇతిహాసం పాండవ కౌరవులకు సంబంధించినది. ప్రధాన కథకు ఉపాఖ్యానాలు ఉన్నాయి. ఇది ఒక విజ్ఞాన సర్వస్వంగా చెప్పవచ్చు. మహాభారత ప్రశస్తిని కొనియాడుతూ నన్నయ "ధర్మతత్త్వజ్ఞులు, ధర్మశాస్త్రంబని, యాధ్యాత్మ విధులు వేదాంతమనియు" ఇదొక విశ్వశ్రేయస్సు కోరే మహా కావ్యంగా తీర్చిదిద్దాడు. గురుపద్య విద్య ఆద్యుడైన నన్నయ రచనకు తగినవాడు అని భావించిన రాజరాజుతో నన్నయ విద్వజ్జనుల యనుగ్రహంబు చేత నానేర్చు విధంబున నిక్కావ్యంబు రచించెదనని పలికి, భారత రచనకు ఉపక్రమించి " శ్రీవాణీగిరిజాచ్చ" అని త్రిమూర్తును స్తుతించుటతో కావ్య ప్రారంభం నారాయణ భట్టు సహాయం తోడ్పడింది. నన్నయ కవిత గుణాలు ప్రసన్న కథాకలి తార్థయుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధిత్వం. వీరి కథలు ప్రసన్నంగా వీనులు విందుగా ఉంటాయి.

వ్యక్తి యొక్క తత్త్వమే వ్యక్తిత్వం. వ్యక్తి స్వభావం. శిశువు పుట్టిన తరువాత ఇంటినుండి తన చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితి నుండి సంక్రమించిన కొన్ని లక్షణాలను, తనలో నిలుపుకుని, తన ప్రయత్నం ద్వారా మరికొన్ని విశిష్ట లక్షణాలను సంపాదించుకుని వాటిని సమన్వయించుకున్న మూర్తి మత్వమే వ్యక్తిత్వం. వ్యక్తి సమూహం పట్ల స్పందించే తీరు. చుట్టూ ఉన్న సమాజంతో మనం ఏర్పరచుకునే ఆరోగ్యకరమైన సంబంధమే వ్యక్తిత్వం. ఇది నైతిక విలువలతో కూడినది మనిషి ప్రవర్తన తీర్చిదిద్దే విధంగా ఉంటుంది. విలువలతో కూడిన జీవన విధానం అలవడును.

మహాభారతంలో నన్నయ అరిషడ్వర్గాలను జయించడం ద్వారా వ్యక్తి పరిపూర్ణుడు కాగలడని కొన్ని ఉదంతాలను తెలిపారు. తింటే గారెలే తినాలి. వింటే భారతంమే వినాలి అనే నానుడి ఉంది. భారత కథలు శ్రవణాశక్తి కలిగించడమే కాదు. మన జీవితాల్ని మంచి మార్గంలో నడిపించేవిగా ఉంటాయి. ధర్మ, అర్థ, కామ, మోక్షం, ధర్మం ద్వారానే మోక్షాన్ని చేరడం. వీటిలో అత్యంత ప్రధానమైన అంశం మోక్షం. కొన్ని ధర్మ సూక్ష్మాలను తెలియజేస్తుంది. నన్నయ భారతంలో వ్యక్తి వికాసానికి తోడ్పడే కొన్ని కథలు మచ్చు తునకలు.

## శ్వేతకేతు మహర్షి చేసిన కట్టడి

ప్రాచీన కాలంలో ఋతువతి అయిన స్త్రీని ఒకే కులానికి చెందిన ఏ పురుషుడైనా కామించవచ్చుననే నియమం ఉండేది. దానిని వ్యతిరేకించిన శ్వేతకేతు మహర్షి క్రొత్త నియమాన్ని రూపొందించాడు. ఉద్దాలక మహర్షి కుమారుడు శ్వేతకేతు. గొప్పతపశ్శాలి. తన కళ్ళ ఎదుటే తన ఇంటికి అతిధిగా వచ్చిన విప్రుడు పుత్రార్థియై తన తల్లిని కామించడం చూసి భరించలేకపోయాడు. ఇది సనాతన ధర్మమే కదా అని సమర్థించిన తండ్రిని వ్యతిరేకించాడు. సనాతనమే అయినా ఈ విధానాన్ని సవరించి తీరాలి అని క్రొత్త ధర్మాన్ని నిర్దేశించాడు.

సని ధర్మమైన మర్యాద మానవులకు దద్దయు హితముగా ధర్మ మూర్తి ......

"ఇక మీదట వివాహిత స్త్రీలు పరపురుష సంగమం చేస్తే సకల పాతకాలు కలుగుతాయి. ఒక స్త్రీకి ఒకడే భర్త, భర్తను వదిలి అన్యపురుషుడితో సంగమించే భార్య, భార్యను వదిలి అన్య స్త్రీతో పోయే భర్తా భ్రూణహత్య చేసిన పాపానికి గురవుతారు. ఇది నా శాసనం". అంటూ శ్వేతకేతు మహర్షి ధర్మ బద్ధమైన కట్టడిచేశాడు. శ్వేతకేతు మహర్షి చేసిన ఈ కట్టడి వల్ల సమాజానికి ఎంతో మేలు జరిగింది. శ్వేతకేతు మహర్షి చేసిన ఈ నియమం నాగరిక సమాజ నిర్మాణానికి దోహదపడింది. ఈ కథ ద్వారా సమాజం సన్మార్గంలో నడవగలదు.

### శుక్రాచార్యుడు చేసిన కట్టడి

ప్రాచీన కాలంలో సురాపానం తప్పుగా భావించబడేది కాదు. దాని వల్ల కలిగే చేటును గమనించిన శుక్రాచార్యుడు సురాపానం కూడదని శాసించాడు. సురాపాన ప్రియత్వం వల్ల శుక్రాచార్యుడు తన శిష్యుడైన కచుని రాక్షసులు చంపి బూడిదచేసి సురలో కలిపి ఇచ్చినా గమనించలేకపోయాడు. దేవయాని కోరిక మేరకు కచుని బ్రతికించాలంటే తాను మరణించవలసిన పరిస్థితి ఎదురైంది. తిరిగి తాను బ్రతకాలంటే పొట్టలో భస్మరూపంలో ఉన్న కచునికి మృత సంజీవని విద్యను బోధించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇదంతా తన సురాపాన ప్రీతి వల్లనే జరిగిందని గ్రహించిన శుక్రాచార్యుడు సురాపానం చేయరాదని శాసించాడు.

**భూ సురులాదిగ గలజను**
**లీ సుర సేవించిరేని యిది మొదలుగ బా**
**పా సక్తి బతితులగుదురు**
**చేసితి మర్యాద దీని జే కొనుడు జనుల్**

ఈనాడు జరుగుతున్న అనేక నేరాలు, ఘోరాలు మద్యపానం వల్లనే కనుక ఆనాడు శుక్రాచార్యుడు చేసిన కట్టడిని నేటి సమాజానికి మంచిదని నేర్పాడు. మద్యపాన నిషేధం జాతి పురోగతికి తార్కాణం.

### యయాతి మార్చిన ధర్మం

క్షత్రియులలో పెద్ద కుమారునికే రాజ్యాధికారం అప్పగించడం ధర్మం కాగా యయాతి దానిని త్రోసిపుచ్చాడు. యయాతి శర్మిష్ఠ వల్ల సంతానాన్ని పొందినందుకు కోపించిన శుక్రాచార్యుడు అతనికి ముసలితనాన్ని శాపంగా ఇచ్చాడు. కోపం తగ్గాక యయాతిని క్షమించిన శుక్రాచార్యుడు "నీ కుమారులలో ఒకనికి ఈ ముసలితనాన్ని ఇచ్చివాడి యౌవనాన్ని నీవు గ్రహించి రాజ్య సుఖాలను అనుభవించు. నీవు తృప్తి పొందిన తరువాత నీ ముసలితనాన్ని నీవే గ్రహించి నీ కొడుకు యౌవనాన్ని వాడికి ఇచ్చివేయి. ఆ విధంగా నీ ముసలి తనాన్ని గ్రహించిన కుమారుడే రాజ్యార్హుడు" అని శాపవిముక్తిని ప్రసాదించాడు.

శుక్రాచార్యుని శాపం వల్ల ముసలితనాన్ని పొందిన యయాతి తన కుమారులను పిలిచి తన ముసలి తనాన్ని గ్రహించి యౌవనాన్ని ఇవ్వవలసిందిగా కోరగా యదువు, తుర్వసుడు, ద్రుహ్యు, అనువు అనే కుమారులు అందుకు అంగీకరించలేదు. చిన్నకుమారుడైన పూరువు మాత్రమే అందుకు అంగీకరించాడు. ఆ విధంగా యయాతి తిరిగి యౌవన సుఖాలను కోరినంత కాలం అనుభవించి, తరువాత కుమారుని యౌవనాన్ని అతనికే ఇచ్చివేశాడు. పూరునికి రాజ్యాభిషేకం చేసాడు.

పెద్దకుమారుడు, సమర్థుడు అయిన యదువును కాదని పూరునికి రాజ్యాభిషేకం చేయడం తగదని పురజనులు యయాతిని వారించబోయారు. అపుడు యయాతి.

**తనయుండు తల్లిదండ్రులు**
**పనిచిన పని సేయడేని పలుకెడలో జే**

**కొనదేని వాడు తనయుం**

**దనబడునే పితృధనమున కర్హుండగునే**

అని తండ్రి మాట వినని కొడుకు కొడుకే కాదని, అట్టివాడు పితృధనానికి అర్హుడు కాడని తేల్చి చెప్పాడు. స్వార్జితాన్ని ఎవరికైనా ఇచ్చుకోవచ్చుననే క్రొత్త నియమాన్ని యయాతి ప్రవేశపెట్టాడు. అది ఈనాటికి న్యాయశాస్త్రంలో సైతం ఆమోదించబడి పాటింపబడుతూ ఉన్నది. ఋషులు మహాత్ములు ఎల్లప్పుడూ సమాజ క్షేమాన్ని కాంక్షిస్తారు. కాబట్టే ధర్మంగా భావించి ఆచరింపబడుతున్న అంశంలో చిన్న లోపం కనిపించినా వెంటనే ఆ లోపాన్ని సవరించి క్రొత్త ధర్మాన్ని పాటించవలసిందిగా ప్రజలకు నిర్దేశిస్తారు. తద్వారా ఉత్తమ సమాజ నిర్మాణానికి బాటలు వేస్తారు. ఈ విషయం మనకు శ్వేతకేతు, శుక్రాచార్యుల వృత్తాంతాల ద్వారా చక్కగా తెలుస్తున్నది.

కాబట్టి ఇది ధర్మము అని భావించి మనం ఆచరిస్తున్న అంశంలో లోపం కనిపించినపుడు మూర్ఖంగా దానికే కట్టుబడి ఉండనవసరం లేదని, కాలానుగుణంగా మరింత ఉత్తమమైన ధర్మాన్ని రూపొందించుకుని అనుసరించ వచ్చుననే సందేశం ఆదిపర్వం ద్వారా మనకు అందుతున్నది.

**అరిషడ్వర్గాల బారిన పడిన మానవుడు పొందే కీడు**

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాల బారిన పడకుండా మానవుడు తనను తాను రక్షించుకోవాలి. అలా చేయలేకపోతే ఎటువంటి కీడు కలుగుతుందో ఆది పర్వంలో చక్కగా వివరింపబడింది.

**కామం**

కామానికి వశులైతే ఎటువంటి దుష్పరిణామాలు కలుగుతాయో విచిత్ర వీర్యుని వృత్తాంతంలోను, యయాతి వృత్తాంతంలోనూ చక్కగా వివరించబడింది. కామానికి వశుడై బాధ్యతలను విడిచిపెట్టిన విచిత్రవీర్యుడు శుష్కించి మరణించాడు. తా లసుడయ్యె గామికి నయంబున నొండు దలంప బోలునే.

ఇంద్రియ సుఖాలకు వశుడైనవాడు ఇతర ఆలోచనలను చేయలేడు. చక్కని రాజ్యపాలనతో ప్రజల ఆదరాభిమానాలను చూరగొనవలసిన విచిత్రవీర్యుడు అతి కాముకుడై రాజ్యపాలనకు దూరమయ్యాడు. నూరేళ్ళు జీవించవలసినవాడు అతి కాముకత వల్ల శుష్కించి వివాహమైన ఏడు సంవత్సరాలకే మరణించాడు. శుక్రాచార్యుని శాపానికి గురైన యయాతి ఇంద్రియ భోగాలపై ఆసక్తిని చంపుకోలేక పోవడం వల్లనే తన కుమారులలో ఒకరిని వృద్ధాప్యాన్ని ఇచ్చి యౌవనాన్ని పొందడానికి ప్రయత్నించాడు. అందుకు అంగీకరించని కుమారులను శపించాడు. విషయ వాంఛలకు లొంగిపోయి తన కోరికలను తీర్చుకోవడానికి సహకరించని బిడ్డలను రాజ్య భ్రష్టులుగా, అల్పాయుష్కులుగా శపించడం గమనిస్తే కామం ఎలా పతనానికి దారితీస్తుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు.

**క్రోధం**

క్రోధం వల్ల ఎంత వినాశనం జరుగుతుందో, ఎటువంటి దుష్ఫలితాలు ఉంటాయో ఉదంకుని కథ ద్వారా, శమీకుని వృత్తాంతం ద్వారా చక్కగా వివరింపబడింది. ఉదంకుడు తాను గురుపత్ని కోసం సేకరించిన కుండలాలను తక్షకుడు అపహరించి తనను ఇబ్బంది పెట్టాడన్న కోపంతో, కుండలాలను పొంది గురుదక్షిణ చెల్లించిన తరువాత కూడా తక్షకుని క్షమించలేకపోయాడు. ఆ కోపం వల్లనే జనమేజయుని వద్దకు వెళ్ళి పరీక్షిత్తు మరణ వృత్తాంతాన్ని ఆయనకు వినిపించి సర్పజాతి మీద ఆయన పగబట్టేలా చేశాడు. ఉదంకుడు తన తపశ్శక్తిని నష్టపరుచుకోకుండా జనమేజయుని ద్వారా తన పగ తీర్చుకోవడానికి ప్రయత్నించాడు. జనమే జయుడు తనపెట్టిన సర్పయాగానికి, తద్వారా అనేక సర్పాల మరణానికి కారణమయ్యాడు.

పరీక్షిత్తు మహారాజు ధర్మబద్ధంగా పరిపాలించేవాడు. ప్రజల గౌరవాభిమానాలను పొందినవాడు అని తెలిసికూడా తండ్రి పట్ల ఆయన చేసిన చిన్న అపరాధాన్ని క్షమించలేక కోపంతో ఆయనను పాము కాటు వల్ల మరణించమని శపించాడు శమీక మహర్షి కుమారుడైన శృంగిని శాపాన్ని ఉపసంహరించుకోమని కోరుతూ క్రోధం వల్ల కలిగే అనర్థాలను చక్కగా వివరించాడు.

**క్రోధమ తపముం జెఱచును**
**క్రోధమ యణిమాదులైన గుణముల బాపుం**
**క్రోధమ ధర్మ క్రియలకు**
**బాధయగుం గ్రోధిగా దపస్వికి జన్నే**

ఉదంకుడు, శృంగి ఈ విధంగా క్రోధానికి వశులు కావడం సర్ప జాతికి వినాశనాన్ని తెచ్చి పెట్టింది.

**లోభం**

ధనలోభం కారణంగా ఉన్నతమైన మానవ జన్మను కోల్పోయి గజ కచ్ఛపాలుగా జన్మించిన విభావసుడు, సుప్రతీకుడు అనే అన్నదమ్ముల కథ లోభం కూడదని తెలియజేస్తుంది. తల్లిదండ్రులు, తాతముత్తాల నుండి వచ్చిన సంపదను సమానంగా పంచకుండా అంతా తానే అనుభవించాలని భావించిన విభావసుడు తమ్ముని ఏనుగువు కమ్మని శపించాడు. సంపదపై మక్కువను విడిచిపెట్టలేని సుప్రతీకుడు అన్నను తాబేలువు కమ్మని శపించాడు. ఆ విధంగా ధన లోభంతో ఉత్తమమైన మానవ జన్మను వారు కోల్పోయారు. అయినా వైరాన్ని విడిచిపెట్టకుండా ఒకరితో ఒకరు పోరాడుతూ జీవించారు. చివరికి గరుత్మంతునికి ఆహారమయ్యారు. లోభగుణం వల్ల ఇద్దరిలో ఎవరూ సంపదను అనుభవించలేకపోగా దుర్మరణం పాలయ్యారు.

**మోహం**

మోహానికి వశులైతే కలిగే దుష్ఫలితం ఎలా ఉంటుందో శంతనుని కథ తెలియజేస్తుంది. గంగా దేవి మోహానికి గురైన శంతనుడు తన కుమారులను ఏడుగురిని పుట్టిన వారిని పుట్టినట్లుగా ఆమె నదిలో పడవేస్తుంటే ఏమీ మాట్లాడలేకపోయాడు. ఏడుగురు కుమారుల మరణాన్ని చూస్తూ ఉండిపోయాడు. చివరికి దేవ వ్రతుని మాత్రమే కాపాడుకోగలిగాడు. సత్యవతిపై శంతనునికి కలిగిన మోహం దేవవ్రతుడు రాజ్యాన్ని పరిత్యజించి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోవడానికి కారణమైంది. మోహానికి వశం కావడం వల్ల శంతనుడు బిడ్డలకు కలిగిన కీడును నివారించలేని స్థితిలో ఉండిపోయాడు.

**మదం**

రాజ్యమదంతో వ్యక్తులు మంచి చెడులను విస్మరించి ప్రవర్తిస్తారని, ఐశ్వర్య గర్వంతో దగ్గరి వారిని కూడా అవమానిస్తారని దుష్యంతుని కథ, ద్రుపదుని కథ ద్వారా వివరించబడింది. రాజ్యమదంతో దుష్యంతుడు తాను గాంధర్వ వివాహం చేసుకొన్న శకుంతలను గుర్తించనట్లుగా నటించాడు. శకుంతలను, మేనకా విశ్వామిత్రులను అనౌచిత్యంతో కూడిన నిందా వాక్యాలతో అధిక్షేపించాడు. ఆకాశవాణి నిజాన్ని చెప్పిన తరువాత మాత్రమే శకుంతలను భార్యగా, భరతుని కుమారునిగా అంగీకరించాడు. తాను ఏం చేసినా చెల్లుతుందనే అహంకారం మనిషిని ఉచితానుచిత్రాలు మరిచిపోయేలా చేస్తుందని దుష్యంతుని ప్రవర్తన తెలియజేస్తుంది. ద్రుపదుడు తన సహాయం అర్థించి వచ్చిన బాల్య స్నేహితుడైన ద్రోణుని ఐశ్వర్య గర్వంతో నిందించాడు. "బేద విప్రులకును ధారుణీశులకు బోలగ సఖ్యము సంభవించునే? అని అవమానించాడు. అయితే అందుకు తగ్గ ఫలితాన్ని అనుభవించాడు. తిరస్కారం భారంతో రగిలిపోయిన ద్రోణుడు తాను పొందిన అవమానానికి తగిన ప్రతీకారం చేయాలని నిశ్చయించుకొని శిష్యుడైన అర్జునుని తనకు గురుదక్షిణగా ద్రుపదుని బంధించి తెమ్మని

కోరాడు. అర్జునుడు ద్రుపదుని యుద్ధంలో ఓడించి రథచక్రానికి కట్టి తెచ్చి ద్రోణునికి గురుదక్షిణగా సమర్పించాడు. రాజ్య మదంతో ఐశ్వర్యగర్వంతో ప్రవర్తించిన ద్రుపదుడు చివరికి ద్రోణుని చేత అవమానింపబడి ద్రోణుడు పెట్టిన భిక్షగా రాజ్యాన్ని పొందవలసివచ్చింది. గర్వం ఎన్నటికి ఉండరాదు. అది మన పతనానికి కారణమవుతుంది.

**మాత్సర్యం**

వినత, కద్రువల కథలో అసూయ, ద్వేషం వల్ల కలిగే నష్టం చక్కగా వివరించబడింది. కద్రువ సంతానాన్ని మించిన బలం కలిగిన కుమారులు కావాలని వినత కోరుకోవడం మాత్సర్యం వల్లనే. కద్రువకు ముందుగా బిడ్డలు జన్మించారనే అసూయతో వినత తన అండాన్ని పక్వం కాకుండానే పగులగొట్టి అసూరుడు వికలాంగుడిగా జన్మించడానికి కారణమైంది. ఉచ్చైశ్రవం తోక మీద మచ్చలేకపోయినా ఉందని వాదించిన కద్రువ వినతపైగల మాత్సర్యం తోనే తన మాట నెగ్గించుకోవాలని ప్రయత్నించింది. ఎవరు ఓడిపోతే వారు దాసిగా ఉండాలనే నియమానికి ఒడబడేలా వినతను ప్రేరేపించింది. ఉచ్చైశ్రవం తోక మీద మచ్చలా కనబడితనకు సహకరించాలని కుమారులను కోరింది. అందుకు అంగీకరించని కుమారులను సర్పయాగం కారణంగా మరణించమని శపించింది. శాప భయంతో సహకరించని కర్కోటకుని సాయంతో పందెం గెలిచి వినతను దాసిగా చేసుకుంది.

ఈ కథలో సవతుల మాత్సర్యం వల్ల వారి బిడ్లకు కలిగిన హాని చక్కగా వివరించబడింది. ఈ విధంగా కథల రూపంలో అరిషడ్వర్గాలకు లోబడితే, కుటుంబానికి, సమాజానికి కూడా కీడు కలుగుతుందని తెలియజేయడం. వీటిని చదివినవారు అరిషడ్వర్గాలకు లోబడకుండా ఉండడం, కష్ట సాధ్యమైనా సాధ్యమైనంత అప్రమత్తంగా ఉండగలరు. సత్క్రమమార్గంలో నడవగలరు. తద్వారా క్రమంగా ఉత్తమ వ్యక్తిత్వాన్ని సంతరించుకొని సమాజాభివృద్ధికి దోహదపడగలరు. ఈ విధంగా వ్యక్తిత్వాలను తీర్చిదిద్దే గొప్పకావ్యం నన్నయ భారతం.

పుత్రమోహంతో, రాజ్యలోభంతో ధృతరాష్ట్రుడు, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలతో దుర్యోధనుడు కురుక్షేత్ర యుద్ధానికి కారణమయ్యారు. తద్వారా ఆత్మీయులు, బంధువులతో సహా పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం మరణానికి కారణమయ్యారు. అరిషడ్వర్గాలకు లోబడితే ఇంత నష్టం జరుగుతుందన్న విషయం మహా భారతం చెబుతుంది. ఈ విధంగానూ ఆదిపర్వం విశిష్టమైనది. ఉత్తమ సమాజ నిర్మాణానికి, ఉత్తమ జాతివికాసానికి కాలానుగుణంగా నూతన ధర్మాలను రూపొందించుకోవడం తెలుసుకొనుట ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి అరిషడ్వర్గాల బారిన పడకుండా ఉండడానికి ఈ కావ్యం దోహదపడుతుంది. ఈ రెండు అంశాలు ఈనాటి సమాజానికి ఉపయోగపడేలా, మనకు నన్నయ భారతం తెలుపుతుంది.

అంతర్గత శత్రువులైన అరిషడ్వర్గాలు మనిషి పతనానికి, ప్రకృతి వినాశనానికి కారణం. ఇవి మనిషికి నిజమైన శత్రువులు. కావున వీటిని జయిస్తే భగవంతుని తత్త్వం బోధపడుతుంది. నన్నయ భారతం ఉత్తమ వ్యక్తిత్వానికి ప్రతీక. కథల ద్వారా ప్రజలను సన్మార్గంలో నడవడానికి రూపొందినవి. ఇవి జాతి శ్రేయస్సును కాంక్షించి ప్రగతి మార్గంలో నడిపించి, మంచి వ్యక్తిత్వం గల సమాజ నిర్మాణానికి బాటలు వేస్తాయి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. స్వార్థం, సంకుచిత భావాలు లేని సమాజ నిర్మాణమే కావ్య లక్ష్యం. లోక కళ్యాణం దీని పరమావధి.

**ఆధార గ్రంథాలు**

1. మహాభారతం – ఆదిపర్వం.
2. భారతం – ఉషశ్రీ పురాణ పండ (తిరుమల తిరుపతి దేవస్థానం).
3. ఆంధ్రమహాభారతం – శ్రీ మల్లంపల్లి దుర్గామల్లికార్జున ప్రసాద్ శాస్త్రి.
4. ద్రౌపది – డా॥ కాటూరు ప్రభాకరరెడ్డి
5. నన్నయ వ్యాసపీఠం – తిరుమల తిరుపతి దేవస్థానం.
6. ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డిగారు – వ్యక్తిత్వ వికాసం.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 46. మహాభారతం నేటి మానవ స్వభావాలు

- డా॥. జి. నళిని, చెన్నై.

## పరిచయం

మహాభారతంలోని కొన్ని ప్రత్యేకమైన పాత్రలు తమ పాత్ర చిత్రణల ద్వారా మానవులు మానవ జీవితంలో ఎలా జీవించాలో, ఎలా జీవించకూడదో మన కళ్ళు ముందు కదలాడుతూ మనకు బోధన చేస్తాయి. భారతీయుల ప్రాచీన ఇతిహాస కావ్యాలలో మహాభారతం ఒకటి. సర్వ సర్వస్వమైన విజ్ఞాన భాండాగారముగా కీర్తింపబడినది. పంచమవేదంగా ప్రసిద్ధి చెందినది. అయితే ప్రస్తుతం ఈ కలియుగ సమాజం నందు ఆధునికత పేరుతో కేవలం మహాభారతాన్ని ఒక మత గ్రంథంగానో, దేవుడి పుస్తకంగానో చూస్తున్నాము. కానీ నిజానికి ఇప్పటి రోజులకి సరిపడేటట్లు మహాభారతంలోని పలుపాత్రల ద్వారా, మన సామాజిక జీవనశైలిని ఎలా మలుచుకోవాలో నేర్చుకోవచ్చు. మహాభారతంలోని పాత్రలు నేటి మన సమాజంలోని జీవన విధానానికి సజీవ సాక్ష్యాలు. మహాభారతం మనకి మన దేశచరిత్రను చెప్పటంలతో పాటు జీవితంలో విజయం సాధించాలంటే ఎలా ఉండాలో కూడా చెప్తుంది. ఎలా జీవించాలో కూడా నేర్పిస్తుంది.

## మహాభారతం ఇతివృత్తాంతం

మన కలియుగ మానవుల మనస్తత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారములు, మానవ జీవితానుభవములు, అనుభూతులు భారతం నందు ప్రతిబింబిస్తాయి. నేటి మన మానవుని నిత్యజీవితం నందలి రాగద్వేషాలను మరియు అంతరంగము నందలి, అనుభవాలను, సంఘర్షణలను మరియు జయపజయాలను, ఉన్నది ఉన్నట్లుగా వాస్తవ పరిస్థితులను, సన్నివేశ సంఘటనలను మహాభారతం చిత్రించినది. కనుక నేటి ప్రజల జీవితమునకు మహాభారతం నందలి ప్రజల జీవితమునకు సన్నిహిత సంబంధం ఉన్నది. మహాభారతం నందలి కవిత్రయ కవిత్వం ఉన్నతస్థానము నందు కీర్తింపబడుచున్నది.

## భారతం యొక్క ప్రాధాన్యత

మహాభారతం యొక్క ప్రాశస్త్యం, ధర్మాధర్మమునకు మధ్య జరిగిన సంఘర్షనే మహాభారతం. ఇది ఏ యుగానికో కాలానికో పరిమితం కాదు, నాటి నుంచి నేటి దాకా ఇది నిత్యనూతనమైనది, మహాభారతంలోని పాత్రలు, కథలు అందరికి సుపరిచితమే, మానవుని మనసు అనేక భావనలకు నిలయమై ఉంటుంది. ఈర్ష , అసూయ, ద్వేషము, ప్రతికారేక్ష, అధికారకాంక్ష, తీరని కామము, లోభము ఇవన్ని మనస్సు పొందే వికారాలే. అలాగే సత్యదీక్ష, ధర్మనిష్ట, శాంతికాముకత మొదలైనవి మనో వైకల్పికాలే. ఈ భావాలకు భారతంలోని ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క ప్రతీక.

మహాభారతం ఒక అమృతబాండము. అనగా మృతి లేనిది అర్థం. విశ్వజనీనమైన ధర్మాలను బోధిస్తూ శాశ్వతంగా లోకంలో నిలిచి ఉండేది మహాభారతం. మహాభారతము శ్రేష్ఠమగు ధర్మశాస్త్రం, ఉత్కృష్టమగు అర్థశాస్త్రం, అగ్రశేణికి చెందిన కామశాస్త్రం, ఉత్తమమగు మోక్ష శాస్త్రం. పెద్దలు చెప్తున్నట్లుగా పుడుతా అన్నదమ్ములు పెరుగుతూ దాయాదులు అవుతారని, పిల్లలు పెరిగి పెద్దవారు అవుతుండగా వారిలో ధనకాంక్ష, రాజ్యకాంక్ష పెరగడం చేత, ఆ రాజ్యము కొరకు, ఆ ధనం కొరకు, వారు కావించిన మహాభారత యుద్ధము. క్షత్రియ కులమునకు చెందిన ఇరువురు అన్నదమ్ముల కుమారుల వైరగాధ మహాభారతం నందలి ప్రధాన ఇతివృత్తం. వారి మధ్య వైరము శృతిమించి కురుక్షేత్ర సంగ్రామంగా పరణమించినంది. ఆ కురుక్షేత్ర సంగ్రామము నందు ప్రఖ్యాతములగు రాజవంశములన్నియు ఎట్లు ఆహుతైపోయినవో, మనం కవిత్రయ భారతం చదివినాము, చలనచిత్రం యందు వీక్షించినాము, ఒక ప్రత్యేకమైన రాజకుటుంబం యొక్క చరిత్ర ఆధారంగా కొంతమంది సమగ్ర జీవిత విధానం చిత్రీకరించుచున్నది.

ఈ ఇతిహాసము భరతవంశం మహారాజుల చరిత్ర, ధర్మధర్మములకు, సత్యాసత్యములకు, న్యాయాన్యాయములకు జరుగు సంఘర్షణమును మన కళ్ళకు కట్టినట్లు కళ్ళ ముందు ఆ పాత్రలు కదలాడినట్లు చిత్రించడం జరిగినది. కురు పాండవుల వంశమునకు జరిగిన పోరాటమిది. ఈ భారతం ఇతిహాసం, ఇతిహాసమే కాదు కావ్యం, కావ్యమే కాదు శాస్త్రం, శాస్త్రమే కాదు సమగ్ర రాజనీతి శాస్త్రం, మోక్ష ధర్మమును తెలుపు తత్వగ్రంథం. మహాభారతమునకు ఉన్న శక్తి దేశ కాలాలకు అతీతమైనది. నేటి భారతీయ ప్రజాస్వామ్య రాజ్యమునకు, ఆదర్శప్రాయంలకు సంబంధించిన అంశములు భారతం నందు పెక్కుకలవు నామరూపములు మారినను, దేశ కాలములు మారినను ఆనాటి రాజనీతి విధానం ఈనాటికి బహుబంగిమల అనుసరింపబడుచునే ఉన్నది. ఏనుగు యొక్క అడుగు నందు తక్కిన జంతువుల పాదములన్నియును ఇమిడిపోయినట్లు మహాభారతం నందలి రాజధర్మం నందు సమస్త ధర్మములు ఒదిగిపోవుచున్నవి. తక్కిన ధర్మములు అల్పశ్రేయములు, అల్పపదములు అగుచున్నవి, రాజధర్మము విశాల ఆశ్రయము, మహోతర్త ఫలము కలది, భారతం కర్మభూమి తక్కిన భూములు భోగ భూములు, కనుక భరత భూమి ఇష్టమైనది.

భారతము నందలి రాజుల చరిత్రలు కర్మ ప్రధానమైనవి. శాంతిపర్వం నందు భీష్ముడు పట్టాభిషిక్తుడవుతూ ధర్మజునితో పలికిన పలుకులు నేడు రాజైన ప్రతివాడును స్వర్ణాక్షరములతో లిఖించి ప్రతినిత్యం పాటింపదగిన అమూల్యమైన సుభాషితములు రాజు ప్రజారంజకుడు కావలెను నిత్యము చక్కటి చిత్తమును కలిగి జనుల చిత్తములను నొప్పింపక ప్రవర్తింపవలెను. అప్పుడే ప్రభువు ప్రజావల్లభుడై వర్ధిల్లును. మహాభారతం నందు అనేకమైనటువంటి పాత్రలు కొన్ని ఉత్కృష్టమైనటువంటి ఉన్నతమైనటువంటి పాత్రల నడవడిక,ఆలోచనలు, సంభాషణలు గురించి తెలుసుకుందాం.

## భారతంలోని కొన్ని ప్రధానపాత్రలు

### దృతరాష్ట్రుడు

కౌరవుల తండ్రి దృతరాష్ట్రుడు అటు బిడ్డల మీద ప్రేమ, ఇటు తాను నమ్ముకున్న సిద్ధాలతాల మధ్య ఎలా నలిగిపోతున్నాడు. కొడుకుల వినాశనం కళ్ళతో చూడలేకపోయినా తనకు నాడు జరుగుతున్న యదార్థ సంఘటనలను, సన్నివేశములను పూసగుచ్చినట్టు తెలియజేస్తున్నా, కానీ తన బిడ్డల మీద ఉన్న ప్రేమానురాగములను పెంచుకోక వారిని క్రమశిక్షణలో పెట్టి రాజ్యాన్ని తన తమ్ముడి బిడ్డలకు పంచిపెట్టి ఉంటే కురుక్షేత్ర సంగ్రామం జరిగేదే కాదేమో కనుక ఎవరైనా తమ పుత్రులపై వాత్సల్యము అతి ప్రేమ అతి నమ్మకము వారి వంశ వినాశనానికి, దారితీస్తాయని గ్రహించాలి.

### గాంధారి

గాంధారి కౌరవుల తల్లి గాంధారి. గాంధారికి 100 మంది కుమారులు ఒక కుమార్తె ఉండటం వలన వారిని పెంచి పెద్ద చేయడంలో చాలా కష్టపడాల్సి వచ్చింది. రాజ్యాన్ని అన్నదమ్ముల బిడ్డలకు సమంగా పంచి వారి బాగోగులు చూస్తూ క్రమశిక్షణతో పెంచి ఉంటే అన్నదమ్ముల మధ్య అంత వైష్యమ్యము, ద్వేషము, అధికమైన కోపము, అధికమైన రాజ్యకాంక్ష కలుగ ఉంటే కౌరవులు నాశనం అయ్యే వారు కాదు.

### శకుని

శకుని పరోక్షంగా కౌరవ సామ్రాజ్యాన్ని మొత్తం నాశనం చేసి వారితో స్నేహంగా, వారి ఆస్థానంలో నే ఉంటూ వారికి కలలో కూడా ఊహించని పరాజయాన్ని, పరాభావాన్ని మిగిల్చాడు. శకుని లాంటి వారు నేటి మానవ జీవితంలో చాలా మంది మనకు రక్తసంబంధంలో మరియు హితులు, మిత్రులు, సన్నిహితులు, శ్రేయోభిషుల రూపంలో ఎదురువుతుంటారు. అలాంటి వారి చెడు సలహాలను, సూచనలను వదలిపెట్టాలి.

**కర్ణుడు**

కర్ణుడు అంటేనే మంచితనానికి దానధర్మాలకు పెట్టింది పేరు. కానీ సమయాన్ని బట్టి నిర్ణయాలను తీసుకోకపోవడం వలన కౌరవుల వైపు చెడు వైపు నిలబడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. కావున జీవితంలో గెలవాలంటే మంచితనంతో పాటు చూట్టూ ఉండే సమాజంలోని పరిస్థితులను సమయ సందర్భాన్ని బట్టి మంచి మార్గాన్ని ఎంచుకోవాలి. చెడు స్నేహం మిగిల్చే దు:ఖం అంతా ఇంతా కాదు. జీవితాన్ని సర్వనాశము చేస్తుందనే సందేశాన్ని కర్ణుని పాత్ర ద్వారా నేటి సమాజానికి తెలుపవచ్చును.

**అర్జునుడు**

అర్జునుడు తన జీవితము అసాంతము విద్యను నేర్చుకుంటూనే ఉన్నాడు. ద్రోణాచార్యుల నుండి యుద్ధశాస్త్రము, తన తండ్రి ఇంద్రుని ద్వారా దైవ సంబంధమైన ఆయుధాలను, ఈశ్వరుడు(మహాదేవుడు) ద్వారా పాశుపతాస్త్రం, యదిష్టరుడు, కృష్ణుడు నుండి మరెన్నో రాజనీతులు ఇలా ప్రతి దశలోనూ అభ్యసించడమే వలన అర్జునుడికి ఓ ప్రత్యేక స్థానం దక్కింది. అను నిత్యం ఏదో ఒక విషయం నేర్చుకోవడం వలన ఖచ్చితంగా విజయం చేకూరుతుందనే విశ్వాసం ఉంటుంది. చాలామందికి తెలిసినంత వరకు అర్జునుడే ప్రపంచం మొత్తంలో అతిపెద్ద విలుకాడు, కాని కుటిల రాజకీయాల వలన తన వేలును కోల్పోయిన ఏకలవ్యుడు అర్జునుడు మించిన విలుకాడు, వీరుడు. అతనికి ఉన్న ఆసక్తి అర్జునుని కన్నా గొప్ప యుద్ధ వీరున్ని చేసింది. కావున ఏదైనా సాధించాలంటే ముందుగా మనకు ఆ విద్యపై అమితమైన ఆసక్తి ఉండాలి. లేకపోతే వాటిని సాధించడం అతి కష్టము, అతి దుర్లభం.

**ద్రౌపది**

పంచపాండవుల భార్య. మాయజూదంలో ఓడిన ధర్మజుని వలన కౌరవుల చేత పరాభవించబడిన ద్రౌపది. మనసులో చెలరేగే ప్రతీకార జ్వాల ఎటువంటి ఈమె ద్వారా మనకు తెలుస్తుంది. సహనంలో, ఓర్పులో భూదేవి వంటిది అని చెప్తారు. అయినా ఆమె సహనానికి ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దులు చెరిగిపోయినప్పుడు ఆమె మనసులో ప్రతీకారేక్ష చెలరేగుతుంది. దీనికి మహాభారతంలో నిలువెత్తు ఉదాహరణ ద్రౌపది. ద్రౌపది సామాన్య స్త్రీ కాదు ఆమె అయానిజ. అగ్ని సంభవ, పాండవుల పట్టమహిషి. పరాక్రమవంతులైన ఆరివీర భయంకరులైన పాండవులను భర్తలుగా పొందింది.శౌర్య పరాక్రమవంతులైన, ఉన్నతులైనా పుత్రులను పొందింది. తోడబుట్టినవాడు దుష్టద్యుమ్యులు శత్రుబయంకరుడు, అన్నింటినిమించి దుష్టశిక్షకుడు. శిష్ట రక్షకుడైన కృష్ణుడు ఉన్నాడు. ఇంత రక్షణ ఉన్న ఆమె కౌరవసభలో కురువృద్ధులు, గురువృద్ధులు, బంధువులు, భర్తలు ముందు దారుణంగా అవమానించబడింది. పంచుకోవడానికి ఎవరూ లేరు. యుద్ధం ముంచుకోస్తున్న ధర్మజుని శాంతికాముత్వము సహింపరానిదిగా ఉంది. అందుకనే కౌరవ సభకు రాయబారిగే వెళ్లే కృష్ణుని ముందు తన మనసులోని గోడు వెళ్ళబోసుకుంది. ఆప్తులను చూసి పళ్లబిగువున పట్టి ఉంచిన దు:ఖం ఒక్కసారిగా పెల్లుబకుతుంది. ఆక్రోషం కట్టలు తెచ్చుకుంటుంది. ద్రౌపది పరిస్థితి కూడా, అదే అందుకనే కుండ బద్దలు కొట్టినట్లు తన అభిప్రాయాలను నిర్మహమాటంగా చెప్పింది. రాజవంశపు స్త్రీ అయిన తనకే రక్షణ లేకపోతే ఇక సామాన్య స్త్రీ లెవరికి రక్షణ ఉంటుంది. దుర్మార్గులు ఎలా శిక్షంపబడతారు.పాండవుల పరాక్రమానికి అర్థం ఏముంటుంది. కేవలం నీతి ధర్మాలు అందిస్తూ కూర్చుంటే సామాన్యుని స్థితి ఏమిటి? అయినా ఆనాడు కురుసభలో తనను అవమానింపబడి భీముడు చేసిన ప్రతిజ్ఞలు నెరవేరే మార్గము ఏది? కాబట్టి యుద్ధం తప్పక జరగాలి? దుష్టశిక్షణ, శిష్టరక్షణ జరగాలి? దానికి మూలకారకుడు కృష్ణుడే అందుకు సమర్ధుడు కూడా ఆయనే ఇది ద్రౌపది మనసులోని ఆలోచన అందుకనే కృష్ణునితో తన మనసులోని ఇన్నాళ్లు దాచుకున్న బాధ,దు:ఖము, అక్రోషము, కౌరవుల పట్ల క్రోధము ఇవన్ని ఒక్కసారి వీటన్నిటితో కలిసిన ద్రౌపది హృదయవేదనను నేటి సమాజంలో ఉన్న స్త్రీలలో మనం కూడా చూడవచ్చు.

**ముగింపు**

పైన చెప్పిన విధముగా ప్రతి యొక్క చిన్న పాత్ర కూడా మహాభారతంలో లాగా నేటి కలియుగంలో కూడా అన్వయిస్తుంది. ఉదాహరణకు మానవ స్వభావలే కాకుండా ఆదిపర్వంలోని కొన్ని విషయాలు సాంకేతికరంగములో మరియు న్యాయశాస్త్రములో కూడా పేరుగాంచినవి. అవి ఏమిటంటే

మొదటిగా కౌరవుల పుట్టుక, కుంతి కంటే ముందుగా గర్భం దాల్చిన గాంధారి ముందుగా ప్రసవించులేక పోయాననే, అసూయతో మాంసం ముద్దలను కుండలలో  అసూయతో తన గర్భాన్ని కొట్టుకుంటుంది. దాంతో ఆమెకు గర్భస్రావం కలుగుతుంది. దాంతో ఈ విషయం తెలిసిన వేదవ్యాసుడు అక్కడకు వచ్చి ఆ మాంసం ముద్దులను నూట ఒక్క నేతి కుండలలో భద్రపరిచి వాటి నుండి నూరుగురు కుమారులు, ఒక్క కుమార్తె పుట్టారు.

దీనిని ఆసరాగా తీసుకునే నేటి మానవులు (CLONING) టెస్ట్ ట్యూబ్ బేబీ నాళిక శిశువు "మొట్ట మొదటగా భారతంలో గాంధారి జరిగిన తర్వాత దీనిని కొంచెం కృతిమ పరంగా 1973వ సంవత్సరంలో మొట్ట మొదటి నాళికా శిశు వు జన్మించాడు. ఈ ప్రయోగం చేసిన రాబర్ట్ జి.ఎడ్వర్డ్‌కు 2010లో వైద్య నోబుల్ బహుమతి అందించారు. భారతంలో కౌరవులు 100మంది దుస్సల జన్మించారు. ఈ కలియుగంలో భారతదేశంలో తొలి నాళికా శిశువు దుర్గ అనే పాప జన్మించింది. ఇది సాంకేతిక రంగానికి ఉదాహరణ.

ఇప్పుడు మరియొక ఉదాహరణ చట్టరీత్యా ప్రకటింపబడినది. మన మహాభారతంలో మాండవ్య మహర్షి గురించి చూశామంటే మాండవ్య మహర్షిపై ఒక అపనిందబడింది. అది ఏమనగా కొంతమంది దొంగలు రాజభవనంలో దొంగలించి మాండవ్య ఆశ్రమములో దాగుకొనగా రాజభటులు దొంగలతో సహా ఇతనిని కూడా తీసుకెళ్లి ఏపాపమెరుగాని మహర్షికి శిక్ష విధించెను. అప్పుడు మాండవ్యుడు యమునితో నేను చేయని తప్పుకు శిక్షవిధించారని అడుగగా యముడు మాండవ్యునితో నీవు నీ పసితనమున తూనీగలను చంపి పాపం చేసితివి అని దానికి బదులు ఇప్పుడు శిక్ష విధిస్తున్నామని చెప్పెను. అప్పుడు మాండవ్యుడు యమధర్మరాజుతో అజ్ఞానదశలో పన్నెండేళ్ళ లోపునే చేసిన పాపము ధర్మశాస్త్ర రీత్యానాకంటదని వారించెను. దానిని ఆచరిస్తూ మన నేటి కాలంలో బాల న్యాయ చట్టం (JUVENILE ACT) అనేడిది మన మహాభారతం నుండి వచ్చినదే. పై విధంగా మహాభారతంలో జరిగినవన్నియు నేటి మానవ స్వభావాలలో కొనసాగుతున్నాయి.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్రమహాభారతము ఆదిపర్వము (నన్నయకవి ప్రణీతము) – కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ.
2. నన్నయ భారతి – బేతవోలు రామబ్రహ్మం, డా.గొల్లకోరు సూర్యభాస్కరరావు
3. శ్రీమదాంధ్ర మహాభారతము (కవిత్రయ విరచిత ఆదిపర్వం)
– కృతికర్త నన్నయ భట్టారకుడు – తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 47. కవిత్రయ భారతం - ఆధునిక సమాజం : స్త్రీల స్థితిగతులు

– కిదాంబి శ్రావణి, మదురై

ఇతిహాసాలు పూర్వం జరిగిన కథలను గురించి తెలియచేస్తాయి.ధర్మాన్ని బోధిస్తూ నీతిని గురించికూడా తెలియచేస్తాయి. రామాయణ, మహాభారతాలు తెలుగు ఇతిహాసాలు. కవిత్రయ భారతమును పరిశీలించినట్లైతే ఆనాటి కాలపరిస్థితులు, మానవ స్వభావాలు, పరిపాలనాంశాలు మొ॥ వాటితోపాటు నాటి స్త్రీల జీవనస్థితిగతులను కూడా మనం తెలుసుకోవచ్చు.

స్త్రీ అంటే ప్రకృతి. మనచుట్టూ ఉన్న ప్రకృతిలోని ప్రతి వస్తువులో స్త్రీత్వం గోచరిస్తుంది. ప్రకృతి ఏ క్షణాన ఎలాఉంటుందో ఎవరికీ అంతుబట్టదు. ఆహ్లాదంగా ఉన్న ప్రకృతి అరక్షణంలో ప్రళయ భీకరంగా మారగలదు. అంత విలయంలోనూ ప్రశాంతతను చూపగలదు. అదేవిధంగా వనిత కూడా తన మనోభావాలతో, ప్రవర్తనతో తన పరిసరాలను ఆనందము, ఆవేశము రెండిటితో నింపగలదు. కనుకనే పడతిని ప్రకృతితో పోల్చిఉంటారు. ప్రకృతితో, స్త్రీతో సామరస్యభావంతో జీవించగలగాలి. అటువంటప్పుడే మానవ జీవితం సుఖసంతోషాలతో నిండిఉంటుంది.

అలాంటి స్త్రీ జీవన స్థితిగతులలో వేదకాలంనుండి నేటివరకూ అనేక మార్పులు సంభవించాయి. దానిలో భాగంగా కవిత్రయ భారతంలోని స్త్రీల పరిస్థితులు, సమాజం వారికిచ్చిన విలువ, ఎదుర్కొన్న సమస్యలు, సాధించిన ప్రగతి, వివిధ అంశాలలో వారి స్థానం మొ॥ విషయాలను, నేటి సమాజంలోని స్త్రీ స్థితిగతులను ఈ వ్యాసంలో చర్చించడమైనది. సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులలో స్త్రీల భాగస్వామ్యం, మనోవైఖరులను వివరించడమైనది.

## సాంఘిక పరిస్థితులు

సమాజంలో భాగమైన కుటుంబంలో మహిళల పాత్ర, వారు ఎదుర్కొన్న సమస్యలు, అనుభవించిన కష్టాలు, లోకరీతి, వనితల వ్యక్తిత్వం, విద్య మొ॥ అంశాలు ఈ విభాగంలోకి వస్తాయి. కుటుంబంలో మగువ స్థానం కీలకమైనది. తల్లిగా, భార్యగా, సోదరిగా, తనయగా ఎన్నో రూపాలలో నేర్పుగా ప్రవర్తిస్తుంది. గృహిణిగా గృహభారాన్ని ఆనందంగా భరిస్తుంది. భర్తకు, ఇంటిలోని పెద్దలకు సేవలుచేసి తృప్తిపడుతుంది. కవిత్రయభారతంలోని స్త్రీ పాత్రలైన మత్స్యగంధి, కుంతి, మాద్రి, ద్రౌపది మొ॥వారు కుటుంబంలో తమ పాత్రను ఎంతో నేర్పుతో నిర్వహించారు. నేటి వనితలూ కుటుంబ నిర్వహణలో వారిని అనుసరించారు.

## తల్లిగా స్త్రీ

'నమాతు: పరదైవతమ్' అని ఆర్యోక్తి. భారతంలో మత్స్యగంధి(సత్యవతి) తన పుత్రులు అసమర్ధులు అని తెలుసుకొని బాధపడుతూ కూర్చోకుండా వంశాన్ని నిలబెట్టడం కోసం సవతిబిడ్డ అయిన భీష్ముడ్ని పెళ్లి చేసుకోమని కోరుతుంది. అది కుదరదని భీష్ముడు చెప్పిన తర్వాత, అతనికి వేదవ్యాసుని జన్మవృత్తాంతం చెప్పి వ్యాసుడ్ని తలుచుకుంటుంది. గొప్పమహాముని, ధర్మశాస్త్రకోవిదుడైన వేదవ్యాసుడి అంతటివాడ్నికూడా కురువంశాన్ని నిలపమని ఆజ్ఞాపిస్తుంది. కొడుకుల విషయంలో తండ్రికి ఏవిధంగా అయితే ఆజ్ఞాపించే అధికారం ఉంటుందో తల్లికికూడా అటువంటి అధికారముంటుందని చెప్తుంది. శకుంతల అయితే తల్లి కాకముందే మాతృస్థానంలో ఉండి కుమారుడి క్షేమాన్ని కోరుకుంటుంది. దుష్యంతుడు గాంధర్వపద్ధతిలో వివాహాన్ని కోరినప్పుడు తనకు పుట్టిన కొడుకుని యౌవరాజ్యపదవిలో అభిషేకించాలనే షరతుతో అంగీకరిస్తుంది.

పాండవమాత కుంతి దుర్వాసుడి వరాన్ని పరీక్షించి సూర్యుని వలన కర్ణుని కుమారునిగా పొందుతుంది. కన్యగా ఉన్న కుంతిలో ఒకపక్క లోకాపవాదభయం మరోపక్క పుత్రుడిపై మమకారం కన్పిస్తాయి. కానీ కుంతి కన్యగా లోకం నుండి

వచ్చే అపవాదానికే ఎక్కువగా భయపడి, తల్లిప్రేమను చంపుకొని కొడుకుని వదిలివెళ్ళిపోతుంది. ఇక్కడ కుంతి అనుభవించిన మనోవేదన వర్ణనాతీతమైనది. అనంతరకాలంలో సవతి కుమారులనుకూడా సొంతబిడ్డలవలె పెంచిపెద్దచేస్తుంది. తరువాతికాలంలో హిడింబి అణకువకు, భవిష్యత్తును తెలుసుకోగల వివేకానికి సంతోషించి ఆమెను వివాహమాడమని భీమున్ని ఆజ్ఞాపిస్తుంది. ద్రౌపదిని స్వయంవరంలో గెలిచి తీసుకొని వచ్చినప్పుడు తెలియక ఐదుగురినీ సమానంగా పంచుకోమని ఆదేశిస్తుంది. తల్లి ఆదేశానుసారం బిడ్డలు వర్తించడం ఇక్కడ గమనించవచ్చు.

పై విషయాలలో వంశనాశనం జరగకూడదని నిస్వార్థంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవడం, కుటుంబ క్షేమంకోసం తండ్రితో సమానమైన బాధ్యతలు, అధికారాలు తల్లికి కూడా ఉంటాయని తెలుస్తుంది. ఆధునిక మహిళలు ఈ విషయాలలో ఒక అడుగు ముందే ఉన్నారని చెప్పవచ్చు. పిల్లల పెంపకం, అభివృద్ధి మొ॥ విషయాలలో క్రియాశీలమైన పాత్ర పోషిస్తున్నారు.

### భార్యగా స్త్రీ

శాపగ్రస్తుడైన పాండురాజు మునివృత్తిని స్వీకరించి తపోవనానికి వెళ్ళేటప్పుడు కుంతి, మాద్రి కూడా అతనిని అనుసరిస్తారు. రాజమందిరమైనా, అరణ్యమైనా, తపోవనమైనా భర్తతోడిదే జీవితమని భావించి తాపసవృత్తిని స్వీకరించి భర్తతోవెళ్తారు. వనవాస సమయంలో పాండురాజు కుంతిని దేవరన్యాయంచేత తనకుసంతానం కలిగించమని కోరుతాడు. అప్పుడు కుంతి పరపురుషులను మనసులోనైనా తలవడానికి, కలవడానికి ఒప్పుకోలేమంటుంది. భర్త మరణానంతరం సహగమనం చేయుటకు కుంతి, మాద్రి పోటీపడినట్లుగా తెలుస్తుంది. ఇదేవిధంగా దమయంతి కూడా జూదంలో ఓడిన నలునిఒప్పించి అతనితో కలిసి అడవులకు వెళ్తుంది. నలుడు ఆమెను అడవిలో ఒంటరిగా వదిలి వెళ్లిపోయినప్పుడు అపరిమితంగా వేదనపడుతుంది. తన ఒంటరితనానికి, బలహీనతకు, క్రూరజంతువుల భయానికి ఆమె బాధపడలేదు కానీ నలుడికి తోడులేదని, అతడు భరించరాని ఆకలిదప్పులు, బడలికల వలన కలిగే వేదన అనుభవించాలని విచారించింది. భర్త విడిచిపెట్టినప్పటికీ చాలాకాలం పుట్టింటికి వెళ్ళకుండా అనేక కష్టాలను ఎదుర్కొంటూ ఆ అడవిలోనే తిరుగుతుంటుంది. సావిత్రి కూడా సత్యవంతుడు అరణ్యంలో జీవిస్తున్నాడని, అతడు ఏడాదితర్వాత మరణిస్తాడని తెలిసికూడా మనసారా ప్రేమించాక ఇతరులను పెళ్ళాడలేనని, అతనినే వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుంటుంది. యమధర్మరాజు వెంటవెళ్ళి తనభర్త ప్రాణాలను కాపాడుకొంటుంది.

పై అంశాలనుబట్టి ఆ కాలంలో సతికి పతియే పరమదైవమని, అతనితోడిదే జీవితమని తెలుస్తుంది. అనవసరంగా పరపురుషులతో మాట్లాడటానికి సైతం ఇష్టపడరని దమయంతి చేదిదేశ రాజమాతతో పలికిన మాటలవలన తెలుస్తుంది. పతివ్రత, గుణవతి. సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కారభావంతో చూసేవారికి ఇహపరసుఖాలు ఉండవని శకుంతల చెప్తుంది. భార్య కలిగినవాడే అన్ని కర్మలను, గార్హస్థ్యధర్మాన్ని ఆచరించి ఫలాన్నిపొందగలడని చెప్తుంది. ఈ మాటలవలన ఆనాడు గృహస్థాశ్రమానికి ఉన్న ప్రాధాన్యత తెలుస్తుంది. నాటిసమాజంలో గృహిణికి ఎంతటి ఉన్నతస్థానమిచ్చారో తెలుస్తుంది. పురుషుడు ఏ పని చేయాలన్నా తప్పనిసరిగా స్త్రీ సహాయసహకారాలు అవసరమని తెలుస్తుంది. అంతేకాకుండా భర్తకు నిర్మలమైనశీలాన్ని బోధించే గురువుగా భార్యకు స్థానమివ్వబడింది.

నేటి సమాజంలో కొంతమంది ఈ విలువలను అనుసరిస్తున్నప్పటికీ, ఆధునిక సతులు ఇవన్నీ అభూత కల్పనలుగా భావించి కొట్టిపడేస్తున్నారు. తమ భావాలకు అనుకూలంగా ఉంటేనే కలిసినడవడానికి ఇష్టపడుతున్నారు. అనుసరించడం మాట అటుంచితే కట్టుబాట్లు, నియమాలు అంటే కలిసి ఉండడమే కష్టంగా భావిస్తున్నారు. అన్నిటిలో సమాన హోదా కావాలనుకోవడం తప్పుకాదు కానీ కష్టంలో తోడు నడవడానికి ఆలోచించడం తప్పు. అందరూ ఇలా ఉన్నారనేది నా అభిప్రాయం కాదు. ఎక్కువశాతం ఈ తరహాలోనే ఆలోచించడం శోచనీయం. పరాయి మగవారిని చూడడం, మాట్లాడడం, వారి గురించి మనసులో ఆలోచించడం కూడా తప్పనీ, ఇష్టపడరనే ఆనాటి సమాజ స్త్రీల భావనను ఈనాడు వ్యతిరేకించేవాళ్లు కూడా ఉన్నారనడం అతిశయోక్తి కాదు.

భర్త వదిలినప్పుడు దమయంతి తన స్థితిని గురించి ఆలోచించకుండా అతని గురించి ఆలోచిస్తూ, బాధపడుతూ అడవిలోనే ఉంటుంది. ఇదే పరిస్థితిలో నేటి స్త్రీలైతే వెంటనే తమ పరిస్థితి గురించి ఆలోచిస్తారు. పుట్టింటికో లేదా స్వయంపోషణా శక్తి ఉన్నవారు తమ ఇంటికో వెళ్ళిపోతారు. ఇక్కడ బాధ ఉండదని కాదు కానీ బాధలో అలాగే నిర్లిప్తంగా ఉండకుండా ధైర్యంగా ఒంటరి జీవితాన్ని కూడా గడుపగలరు. నేటి మహిళ అధైర్యమనే బలహీనతను జయించిందని చెప్పవచ్చు. ప్రాణాపాయస్థితిలో ఉన్న భర్తను కాపాడడానికి యమధర్మరాజుతో పోరాటం చేయలేకపోయినా చివరివరకూ అతని ఆరోగ్యాన్ని కాపాడుతూ, తగినసేవలు చేస్తూ ప్రాణాలు కాపాడడానికి వైద్యులతో సైతం పోరాడడానికి వెనుకంజ వేయట్లేదు.

కాలమేదైనా స్త్రీ ప్రేమ విషయంలో మార్పులేదు. ప్రయత్నాలు మారుతున్నాయి. మూఢనమ్మకాల స్థానంలో బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించడం కనపడుతుంది. ఆనాడైనా ఈనాడైనా భార్యను తిరస్కార భావంతో చూడకూడదని, గృహిణికి ఉన్నతస్థానమివ్వాలని, సహాయ సహకారాలు అందించాలని స్త్రీలు కోరుకుంటున్నారు.

**ఎదుర్కొన్న సమస్యలు**

ఆనాడు స్త్రీలు ఎన్నోకష్టాలను అనుభవించారు. పతితోపాటు వనవాసములకు వెళ్ళి కష్టాలుపడిన వారు కొందరైతే వీరికి భిన్నంగా ఇతర కష్టాలను అనుభవించినవారు కొందరు. శకుంతల గాంధర్వ పద్ధతిలో వివాహమాడిన భర్త తనని గుర్తించకుండా అవమానిస్తాడు. అప్పుడు అధైర్యపడకుండా, పట్టుదలతో, సడలని ధైర్యంతో జరిగిన కథంతా గుర్తుచేసి, కుమారుడిని దుష్యంతునికి చూపిస్తానని మనస్సులో స్థిరంగా నిశ్చయించుకుంటుంది. ఆపదలు వచ్చినప్పుడు భయపడి, బాధపడకుండా ధైర్యంతో ఆలోచించి కష్టాలను ఎదుర్కోవాలని తెల్పిన ప్రతిభాశాలి శకుంతల.

నలునిచే అరణ్యాలలో విడిచిపెట్టబడిన దమయంతి అతనిని వెతుకుతూ కొండచిలువ చేతిలో చిక్కుకుంటుంది. దానిబారినుండి రక్షించిన కిరాతుడు ఆమె కథనంతా తెలుసుకొని అందమైన దమయంతిని కోరుకుంటాడు. కోపంతో కిరాతుని శపించగా అతడు మరణిస్తాడు. ఆపదనుండి గట్టెక్కుతుంది. పాండవసతి ద్రౌపది ధర్మరాజు తనను జూదంలో పెట్టి ఓడిపోయినప్పుడు ఏ యుగంలోకూడా భర్త భార్యను పణంగా పెట్టడంటుంది. "మున్ను దన్నోటువడి మతి నన్ను నోటు, వడియెనో,నన్ను మున్నోటువడి విభుండు, గ్రన్నదన్నోటు వడియెనో యన్న, నాకు నెఱుగజెప్పుము దీని నీ వెఱుగుదేని." అంటుంది. ఇలాంటి సందర్భంలో మరోస్త్రీ అయితే బాధతో, భయంతో ఉండిపోయేది. కానీ ద్రౌపది వివేకంతో మాట్లాడింది. భర్తలోని దుర్వ్యసనంపట్ల వ్యతిరేకభావాన్ని వ్యక్తంచేసింది. దుర్యోధనుడి చెడ్డపనులకు, ధర్మరాజు అంగీకారానికి భయపడుతుంది. రజస్వల,ఏకవస్త్రయైన ద్రౌపదిని దుశ్శాసనుడు జుట్టుపట్టుకొని సభలోకి ఈడ్చుకొనివచ్చి వస్త్రాపహరణానికి పూనుకొంటాడు. కృష్ణుని కృపచే ద్రౌపది వివస్త్ర కాకుండా రక్షింపబడుతుంది. తరువాతికాలంలో సైంధవుడు కోరికతో తనతో రమ్మన్నప్పుడు అతడికి మంచిమాటలతో సోదరుడివౌతావని చెప్తుంది. అజ్ఞాతవాసకాలంలో కీచకుడి వలన ఇబ్బందులకు గురవుతుంది. తన భర్తల పరాక్రమం గురించి చెప్పి బెదిరిస్తుంది.

ధైర్యంలో, స్థైర్యంలో నాటి స్త్రీలకు ఏమాత్రం తీసిపోనివారు ఆధునిక స్త్రీలు. ఆపద వచ్చినప్పుడు మొదట భయపడినా బయటపడే మార్గం గురించి ఆలోచిస్తారు. బాధ, భయంతోపాటూ వివేకాన్ని కూడా కలిగి ఉన్నారు.

**లోకరీతి**

> **"ఎట్టి సాధ్వులకును బుట్టినయిండ్లను**
> **బెద్దకాల మునికి తద్దతగదు**
> **పతులకడన యునికి సతులకు ధర్మువు**
> **సతుల కేడుగడయు బతుల చూవె."**

అన్న కణ్వుని మాటలనుబట్టి వివాహమైన స్త్రీ పుట్టింటిలో ఎక్కువకాలం ఉండకూడదని, భార్య భర్త దగ్గర ఉండటమే ఆనాడు విధిగా పాటించిన ధర్మమని తెలుస్తుంది. భార్యలకు భర్తలే సర్వరక్షకులని చెప్పడం వలన తమనితాము రక్షించుకోలేని స్త్రీలు ఎప్పుడూ భర్తవద్దే ఉంటూ వారి మాటప్రకారం నడుచుకోవాలని దానికి అనుగుణంగా భర్త ఎల్లప్పుడూ భార్యను రక్షించేతత్వం కలిగిఉండాలని తెలుస్తుంది. శకుంతల దుష్యంతుని సభలో కణ్వాశ్రమంలో జరిగిన సంగతి గుర్తుచేసుకోమని, ఇచ్చినమాట నిలబెట్టుకోమని చెప్తుంది. అయినప్పటికీ దుష్యంతుడు అంగీకరించక "మానినులసత్యవచనలు" (భార,ఆది,చతుర్ధ-100) అంటాడు. నాటి సమాజంలో ఉన్న ఈ మాటనుబట్టి స్త్రీలను అసత్యాలు చెప్పేవారుగా నిర్ధారించినట్లు తెలుస్తుంది.

అలాగే దుర్వాసముని తనకు ఇచ్చిన వరాన్ని పరీక్షించిన కుంతికి సూర్యుడు ప్రత్యక్షమైనప్పుడు భయంతో "ఎఱుకలేమి జేసి యింతులెప్పుడు నపరాధయుతలు సాపరాధలయిన వారి గరుణ నెల్లవారును రక్షింతురు" (భార,ఆది-పంచ-22) అని రక్షించమంటుంది. దీనివలన పడతులు తమ అజ్ఞానంచేత ఎప్పుడూ తప్పులు చేస్తుంటారనే అభిప్రాయం నాడు ఉన్నట్లు తెలుస్తుంది. తప్పులు చేసినప్పటికీతెలియకచేస్తారు కాబట్టి అలాంటివనితలను అందరూ దయతో కాపాడుతారని తెలుస్తుంది.

భర్త రక్షణలోనే ఉండాలనే కణ్వుని మాటలు నేటి స్త్రీలకు పూర్తి అంగీకారయోగ్యం కాదు. ఎందుచేతనంటే వారు స్వయంపోషణ, స్వీయసంరక్షణలలో అనేక విధాలైన నైపుణ్యాలను కలిగి ఉన్నారు. జీవితాంతం భర్తే దైవము, ప్రభువు అనేమాటను సమర్థించక భర్త తమ స్నేహితునిగా, సహచరుడిగా ఉంటూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకునే తోడుగా ఉండాలని కోరుకుంటున్నారు. దుష్యంతుడు చెప్పినట్లు నేటి సమాజంలో స్త్రీలు మాత్రమే కాదు చిన్నా, పెద్దా, ఆడా, మగా తేడాలేకుండా ప్రతి ఒక్కరూ యథేచ్ఛగా అబద్దాలు చెప్తున్నారు. కుంతీదేవి చెప్పినట్లు నేటి సమాజంలో అజ్ఞానంతో ఎల్లప్పుడూ కాదుకదా తెలియక అప్పుడప్పుడూ పొరపాట్లు, తప్పులూ చేసినప్పటికీ దయతో కాపాడరు. పైగా అవహేళన చేస్తూ అనుక్షణం సూటిపోటి మాటలతో బాధ పెడుతుంటారు.

**విద్య**

మహాభారత స్త్రీలు వచించిన ధర్మాలను పరిశీలిస్తే ఆనాటి మహిళలు విద్యావంతులని తెలుస్తుంది. వారు నేరుగా విద్యను అభ్యసించినా లేకపోయినా కేవల వినికిడి జ్ఞాన మాత్రముచే గొప్ప ధర్మాలను తెలిపారు. సైరంధ్రి వృత్తి చేపట్టుట వలన కూడా వివేకవంతులని తెలుస్తుంది. అంతేకాకుండా నాటి స్త్రీలకు ఆటలు, రథచోదనం మొ॥అంశాలలో ప్రావీణ్యం ఉందని తెలుస్తుంది.

పరాశరమహర్షి తనను కోరినప్పుడు కన్యాత్వం అంతరించిన స్త్రీ తండ్రివద్ద ఉండరాదనే ధర్మాన్ని మత్స్యగంధి తెలియచేస్తుంది. గాంధర్వవివాహమైన శకుంతలను ఆశీర్వదించి కణ్వుడు వరం కోరుకొమ్మన్నప్పుడు ఆమె 'నామనసెల్లప్పుడూ ధర్మంలోనే లగ్నమై ఉండాలి.' అని కోరుకుంటుంది. ధర్మశాస్త్ర విషయాలు తెలిసినది కాబట్టే ఆమె అటువంటి వరం కోరుతుంది. దుష్యంతుని సభలో ఆమె మాట్లాడిన తీరుని గమనిస్తే నిండుసభలో ఎలా మాట్లాడాలో తెలిసిన మనిషని, సభాగౌరవం, రాజమర్యాదను కాపాడడం ధర్మమని తెలిసిన స్త్రీగా కనిపిస్తుంది.

ఏకచక్రపురంలో బకాసురునికి భీమున్ని ఆహారంగా పంపుతున్న కుంతి ధర్మరాజుకి యుక్తాయుక్త వివేకాన్ని గురించి, బ్రాహ్మణభక్తి గురించి, ధర్మాచరణ గురించి తెల్పిన వివేకవతి. సావిత్రి అయితే ఇంకో అడుగు ముందుకువేసి ధర్మశ్రేష్ఠుడైన యమధర్మరాజుకే ధర్మపన్నాలను వివరిస్తూ తన భర్త ప్రాణాలను వరంగా పొందుతుంది. కురుసభలో ద్రౌపది "వైశ్యసతికి నొక్కవరము సత్క్షత్రియ, సతికి రెండు శూద్రసతికి మూడు, విప్రసతికి నూఱు వేడజన్వరములు, గాన యింకవేడగాదు నాకు." అని వివరిస్తుంది. అరణ్యవాసంలో ధర్మరాజుకి అనేక ధార్మిక అంశాలను చెప్తూ 'ఎఱుగనిదానగాదు ధర్మతత్త్వయుక్తి' అనుటవలన ద్రౌపది విద్యాధికురాలని తెలుస్తుంది. విద్వాంసులు తన తండ్రితో మాట్లాడేటప్పుడు విన్నానని చెప్తుంది. చేయవలసిన పనినిచేయకుండా కేవలం దైవాన్ని నమ్ముకునేవాడు కార్యసాఫల్యం పొందలేడని చెప్తుంది.

మహాభారతంలో మనకు దమయంతి, ద్రౌపది కొంతకాలం సైరంధ్రీవృత్తిని అవలంబించినట్లు తెలుస్తుంది. సైరంధ్రి అంటే అరవైనాలుగు కళలలో పండితురాలు, శీలం,రూపం కలది, వస్త్రాది అలంకరణలు చేసే నైపుణ్యం కలది అని అర్థం. నలుడు పుష్కరునితో పాచికలాడుతున్నప్పుడు ఆట పుష్కరుడికి అనుకూలంగా ఉన్నట్లు దమయంతి గమనిస్తుంది. దీన్నిబట్టి ఆమెకు ఆ ఆట ఆడేవిధానం తెలసని అర్థమౌతుంది. ఇంకా సుభద్ర రథచోదకురాలిగా కన్పిస్తుంది. పై అంశాలనుబట్టి ఆనాటి రాజకుటుంబ స్త్రీలకు అనేక అంశాలలో ప్రావీణ్యం ఉన్నట్లు తెలుస్తుంది.

ఆనాడే కాదు నేడు కూడా స్త్రీలు సకల విద్యా పారంగతులు. ఈనాటి మహిళ సాధారణ విద్యలోనే కాక శాస్త్ర, సాంకేతిక రంగాలలో నైపుణ్యాన్ని సాధించింది. సామాజిక, సేవ, విద్య, వైద్య, వర్తక, వాణిజ్య, సాహిత్య, సాంస్కృతిక, యుద్ధరంగాలలో కూడా విశేషమైన ప్రతిభ కనబరుస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటుగా ఆటోలు, కార్లు, జీపులు, విమానాలు కూడా నడుపుతున్నారు. ఎన్నో విద్యలు నేర్చి, నైపుణ్యంతో ఎన్నో విశిష్ఠ పదవులను అలంకరించిన అపర సరస్వతులు నేటి నారీమణులు.

**ఆర్థిక పరిస్థితులు**

సత్యభామతో ద్రౌపది తనభర్తలు తనపట్ల అనురాగం కలిగి ఉండుటకు కారణాలను చెప్తూ ఎన్నో విషయాలను తెలియచేస్తుంది. వాటిలో ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన విషయాలు కూడా ఉన్నాయి. తానెప్పుడూ ధన,ధాన్యాలను వ్యర్థం చేయనని చెప్తుంది. సేవకులను నియమించడం, వారి పనులను ఎల్లప్పుడూ గమనించడం అన్నీ దగ్గరుండి చూస్తానని చెప్తుంది. ఆదాయవ్యయాలన్నీ పూర్తిగా తనకు తెలుసంటుంది. ఒక్కవిషయం కూడా తనకు తెలియనిది లేదని చెప్తుంది. సేవకులలో చివరిశ్రేణి వారికి ఇచ్చే జీతభత్యాలు కూడా తానే సరిచూస్తానని చెప్తుంది. కుటుంబంలో అన్ని బరువు బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహిస్తానని చెప్తుంది. పై అంశాల వలన స్త్రీ కుటుంబంలో వంటపనులు, ఇంటిపనులు వంటి బాధ్యతలనే కాకుండా ఆదాయ పరిరక్షణ, ఖర్చులు మొ॥ఆర్థిక వ్యవహారాలు సమర్థంగా నిర్వహించేదని తెలుస్తుంది.

ఈనాడు కూడా పడతులు అన్ని పనులనూ దగ్గరుండి గమనించుకుంటూ ఉన్నారు. ఇంటా బయటా నేర్పుతో పనులను చక్కబెడుతున్నారు. ఆర్థిక వ్యవహారాలను చూసుకుంటూ బరువు, బాధ్యతలను నిర్వహించడంలో తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవహారాలను నిర్వహిస్తున్న గౌ॥ మంత్రివర్యులు నిర్మలా సీతారామన్ గారు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ.

**రాజకీయ పరిస్థితులు**

ఆనాటి స్త్రీలలో చాలామందికి రాజధర్మాలు, రాజకీయ అంశాలలో పరిజ్ఞానం ఉన్నదని కింది విషయాలను గమనిస్తే తెలుస్తుంది.

మహాభారతంలో శకుంతల దుష్యంతుని సభలో రాజులకు సంబంధించి కొన్ని అంశాలను చెప్తుంది. దుష్యంతుడు తనని గుర్తించనప్పుడు బాధలో ఉండి కూడా రాజు అనేక కార్యకలాపాలలో నిమగ్నమై ఉంటాడు కాబట్టి మరిచిపోయుంటాడు, రాజులకు మరుపు సహజం అని ఆలోచిస్తుంది. కొత్తవాటిని ఇష్టపడే రాజులను బుద్ధిమంతులు నమ్మకూడదనుకుంటుంది. మత్స్యగంధి భీష్ముని వివాహం చేసుకోమని చెప్తూ అనేక రాజధర్మాలను తెలియచేస్తుంది. రాజులేని ప్రజలకు ఒక క్షణకాలమైనా సహజ శాంతస్వభావంతో ఉండడం అశక్యం అంటుంది. రాజ్యంలో రాజు లేకుండాపోయిన వెంటనే రాజ్య ప్రజలలో ధర్మాలన్నీ తొలగిపోతాయి, దేవఋషి శ్రేష్ఠులు రాజ్యాన్ని వదిలిపోతారు, క్రమంగా వానలు లేకుండా పోతాయి, వస్తువుల విలువలు పడిపోతాయి అని పెద్దలు చెప్తారు అంటూ అనేక ధర్మశాస్త్ర విషయాలను వెల్లడిస్తుంది. ఈ సందర్భంలో తనకి తెల్సిన విషయాలను కూడా నేరుగా తాను చెప్పకుండా పెద్దలు చెప్తారు కనుక ఖచ్చితంగా పాటించాలి అనే అర్థంలో చెప్తుంది.

నలుడు జూదంలో ఓడిపోయే సందర్భంలో దమయంతి గమనించి అతడిని వారిస్తుంది, అతడు వినకపోయేసరికి అతని అనుమతితో పిల్లలను పుట్టింటికి పంపిస్తుంది. దమయంతి దూరాలోచనతో, ముందుచూపుతో అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయాన్ని ఆప్తులు, గురువులు, మంత్రులు ఆమోదిస్తారు. ఇక్కడ దమయంతి రాజు ఓడిపోతే సంపదలు కోల్పోవడమేగాక రాజ్య బహిష్కారానికి కూడా గురవుతాడని ముందుగానే ఊహిస్తుంది.

పై అంశాలను బట్టి నాటి స్త్రీలకు నేరుగా రాజ్యపరిపాలనావకాశం లేకపోయినా పరిపాలనకు సంబంధించిన అనేక అంశాలలో విషయజ్ఞానం ఉన్నదని తెలుస్తుంది. శకుంతల, మత్స్యగంధి, దమయంతి మొ॥వారు రాజు ఎలా ప్రవర్తించాలో, రాజులేని రాజ్యం ఎలాఉంటుందో తమ మాటలలో తెలియచేశారు. రాజకీయ అంశాలలో స్త్రీలకు కూడా ప్రాధాన్యతనిచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించినట్లు తెలుస్తుంది. ధృతరాష్ట్రసభలో గాంధారి కూడా రాజుతో పాటుగా సభాభవనంలో ఉన్నట్లు తెలుస్తుంది.

కవిత్రయ భారతంలో స్త్రీలకు ప్రత్యక్ష్య పాలనాధికారం లేనప్పటికీ వారు గొప్ప రాజనీతిజ్ఞులుగా ఉన్నారు. నేటి స్త్రీలకు ప్రత్యక్ష్య పాలనాధికారం ఉంది. రాజకీయంగా ఉన్నత స్థానాలలో వనితలు నియమితులై ఉన్నారు. వార్డు, గ్రామ, నగర స్థాయిలలో సభ్యులుగా, ఛైర్మన్లుగా, శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులుగా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా, రాష్ట్రపతి, ప్రధానమంత్రులుగా ఉన్నతమైన పదవీ బాధ్యతలను నిర్వహించారు, నిర్వహిస్తున్నారు.

**ఉపసంహారం**

పైన తెలిపిన విషయాలను బట్టి భారత స్త్రీలు ధర్మానుసారంగా ప్రవర్తించారని అర్థమౌతుంది. పతిభక్తిని కలిగి ఉన్నారని తెలుస్తుంది. భర్త తోడిదే జీవితమని భావించి దుర్గమ అరణ్యాలకు సైతం వెళ్ళారు. ఎన్నో సమస్యలు వచ్చినప్పటికీ ధైర్యంగా వాటిని ఎదుర్కొని గెలిచారు. అంతేకాకుండా నాటి స్త్రీలు ఆలోచనావిధానం, పరిశీలనాశక్తి, ప్రవర్తన మొ॥ అంశాలలో ఆదర్శవనితలుగా నిలిచారు. ముందుచూపుతో వ్యవహరించారు. జ్ఞానవంతులుగా ప్రకాశించారు. ఆపదలు వచ్చినప్పుడు భయపడి, బాధపడకుండా ధైర్యంతో ఆలోచించి కష్టాలను ఎదుర్కోవాలని తెల్పిన ప్రతిభాశాలులు.

ఎన్ని కట్టుబాట్లు ఉన్నప్పటికీ తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరిచే అవకాశం నాటి మహిళలకు ఉండేది. ఓర్పు, నేర్పు కలిగినవారు, సకల ధర్మాచరణను తెలిసిన వివేకవంతులు. సపత్నులతో స్నేహంగా మెలిగేవారు. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం, క్షమను కలిగిఉండడం మొ॥ ఉత్తమలక్షణాలు కలిగి ఉన్నారు. గృహంలో అత్యధిక ప్రాముఖ్యత కలిగిఉన్నారు. పెద్దలపట్ల గౌరవభావం కలిగిఉన్నారు. స్త్రీలు ఇంటిముందు తిరగడం, చెడుస్త్రీలతో ఎక్కువగా స్నేహం చేయడం, వాదులాడడం, ఎక్కువగా నవ్వడం మొ॥పనులు చేయకూడదని తెలుస్తుంది. అభిమానవంతులని తెలుస్తుంది. సమాజంలో ఎంతటి ఉన్నతస్థానంలో ఉన్నా నాటి స్త్రీలకు కూడా మానసంరక్షణలో అనేక కష్టాలు ఎదురయ్యాయి.

ఏవిధమైన పరిస్థితులు ఎదురైనప్పటికీ అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ వనితలు మానసికంగా దుర్బలులు కారు. తాము చేసే ప్రతి పనిలో ధైర్యంగా, వివేకంతో ప్రవర్తించే నేర్పరులు. భయం అనే బలహీనతను జయించి వారి నడవడికతో ఆదర్శ మహిళలుగా ఉన్నారు.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్ర మహాభారతము – కవిత్రయము.
2. ఉషశ్రీ మహాభారతం.
3. పూర్వగాథాలహరి.

# 48. ఆంధ్రమహాభారతంలో అబ్బురపరిచే మానవీయ విలువలు - ఆచరణ యోగ్యములు

– డా॥ భూక్య జ్యోతి, మదనపల్లి

## ఉపోద్ఘాతం

భారతీయ ఇతిహాసాలలో రామాయణం, మహాభారతం నేటికీ మానవాళికి ఆదర్శంగా ఉంటున్నాయి. రామాయణం ఆదర్శ దాంపత్యానికి గీటురాయి, భారతం పాలనాధక్షతకు, యుక్తికి నిలువెత్తు న్యాయశాస్త్రమని చెప్పవచ్చు. వేదవ్యాస విరచిత ఈ భారత ఇతిహాసం కవిత్రయ విరచిత 18 పర్వాల ఆంధ్రమహాభారతంగా అవతరించింది.

ఈ భారతంలో లేని అంశం ప్రపంచంలో లేదు. ప్రపంచంలో ఉండేవన్నీ ఈ భారతంలో ఉన్నాయి. అనతంలో అతిశయోక్తి కాదు. కావున ఈ భారత గ్రంథాన్ని ధర్మతత్వవేత్తలు ధర్మశాస్త్రమని, నీతికోవిదులు, నీతిశాస్త్రం అని, కవి పండితులు మహాకావ్యమని, చరిత్రకారులు, ఇతిహాసమని, పౌరాణికులు పురాణమని భారతగ్రంథాన్ని అనేక విధాలుగా కొనియాడారు.

కృష్ణద్వైపాయన విరాచిత ఈ భారతాన్ని నారదుడు దేవతలకు, శుకమహర్షులవారు యక్ష, రాక్షస, గాంధర్వలకూ, వైశలపాయనుడు పరీక్షిత్తు మహారాజు కుమారుడైన జనమేజయ మహారాజుకు, నైమిషారణ్యంలో సూతమహర్షి శౌనకాది మహాఋషులకు, మునిపండితులకు వివరించి చెప్పారు.

ఆదికవి నన్నయ తన రాజుగారు రాజరాజనరేంద్రుని అభీష్టముకై ఆనాడు ఈ పరమ పవిత్ర భారతాన్ని గోదావరి పుష్కరతీరాన తాళపత్రాలకు పసుపురాసి తెలుగులో శ్రీకారం చుట్టాడు. కాని కొన్ని అనివార్య కారణాల వలన భారతాన్ని కేవలం ఆది, సభ, ఉద్యోగపర్వాలలో సగం అనగా రెండున్నర పర్వాలు రాశారు. తరువాత 15 పర్వాలు తిక్కనగారు, అర్థపర్వం ఎఱ్ఱనగారు రాసిన పిమ్మట సంపూర్ణ ఆంధ్రమహాభారతంగా అవతరించి, జనుల హృదయాలలో పద్య, గేయ, నాటక, సంభాషణల రూపంలో తులలాడుతుంది నేటికి.

### భారతం నేటి ఆధునిక మనిషికి మనుషులకు ఆవశ్యకత

### 1. తండ్రి హృదయమెరిగిన భీష్ముడు

నేడు బంధాలు – అనుబంధాలు కరెన్సీ నోట్ల మాటున దాగున్నాయి. ఆధునిక విద్యా విధానం సాంకేతికను అందిపుచ్చుకునిందేగాని నాటి సాంప్రదాయాలను విస్మరించింది. లక్షల సంపాదనే విద్యాధ్యేయంగా ప్రపంచం నడుస్తుంది. సాంప్రదాయ విలువలను నేటి ఆధునిక ఆచారం మంటగలిపింది. ఆస్తులపై ఉన్న మమకారం అమ్మానాన్నలపై లేదు. సెల్‌ఫోన్ బానిసలకు సొంత అనుబంధాలు అడ్డమై అనాథ ఆశ్రమాలు చేరుతున్నాయి.

నాడు భారత ఇతిహాసంలో దేవవ్రతుని త్యాగమును, భీషణమైన ప్రతిన నేటి మానవులు తెలుసుకోవడం ఎంతైన అవసరముంది.

ప్రతీప మహారాజు తన కుమారుడైన శంతనునికి పట్టాభిషేకం చేసి, తాను వానప్రస్థానికి వెళ్ళుతూ శంతనుని పిలిచి “నాయనా పూర్వం జరిగిన సుందరి విషయం చెప్పి, ఆ సుందరాంగి నీ వద్దకు వచ్చి నన్ను నీ భార్యగా స్వీకరించమనినా అభ్యంతరం చెప్పిక నీ ధర్మపత్నిగా స్వీకరించు అని చెప్పి వెళ్ళిపోయాడు. తండ్రి మాటను ఆజ్ఞగా స్వీకరించి ధర్మపాలన చేయుచుండెను.

వేటకు వచ్చిన శంతనుడు ఒకనాడు సాయంత్రం గంగాతీరంలో విశ్రాంతి తీసుకొనే సమయంలో గంగాదేవిని చూసి తనను వివాహం ఆడమన్నాడు. అందుకు గంగాదేవి అంగీకరిస్తూనే "నేను ఏ పని చేస్తున్నా మీరు అంగీకరించాలి" ఎదురు చెప్పకూడదు. ఏ నాడైతే నువ్వు నాకు అడ్డుపడతావో నేను అప్పుడు వెళ్ళిపోతాను" అని నియమం పెట్టింది. అలాగేనని తనను వివాహమాడి తొలి సంతానంగా మగబిడ్డను ప్రసవించడం, ఆ బిడ్డను గంగాదేవి గంగలో పారివేయడం ఆ తరువాత పుట్టిన ఆరు మందిని ఇలాగా చేయడం వలన గంగపై శంతనుడు కినుకు వహించాడు.

ఆ తరువాత కొంతకాలానికి ఎనిమిదవ కుమారుడు కలిగాడు. ఆ బిడ్డ అల్లారుముద్దుగా ఉన్నాడు. ఈ బిడ్డను కూడా గంగ గంగలో వేయడానికి సిద్ధపడగా అడ్డుపడిన శంతనునితో ఓ రాజా నువ్వు నేను విధించిన నియమాన్ని పాటించని కారణంగా నిన్ను విడచి నేను వెళ్ళుతున్నాను. అలాగే ఈ బిడ్డను నేను తీసుకువెళ్ళి సకలశాస్త్రాలను నేర్పి మీ వద్దకు పంపుతానని గంగాదేవి వెళ్ళిపోయింది. కొంతకాలం తరువాత గంగా తీరమున తారసపడిన బాలుడి అస్త్రవిద్య నైపుణ్యముకు ఆశ్చర్యపడుతుండగా గంగాదేవి ప్రత్యక్షమై ఈ బిడ్డ ఆనాడు తీసుకెళ్ళిన మన బిడ్డేనని ఇతని పేరు దేవవ్రతుడు అని చెప్పి ఇతను బుద్ధిలో బృహస్పత్తి, విద్యలలో వశిష్ఠుని అంతటి వాడు అని చెప్పి తాను వెళ్ళిపోయింది.

అనంతరం శంతనుడు తన కుమారున్ని రాజ్యమునకు తీసుకెళ్ళి యువరాజుగా పట్టాభిషేకం చేశాడు. ఒకనాడు యమునా నదీతీరమున సత్యవతిని చూసిన శంతనుడు తనను వివాహం ఆడమని చెప్పడం అందుకామె తన తండ్రి నిషాదరాజుని అడగమనటం, ఇది వరకూ నీకు పెళ్ళై ఒక బిడ్డ యువరాజుగా రాజ్యంలో ఉండటం నీ తరువాత నా బిడ్డ సంతానానికి రాజ్యప్రాప్తి లభించకపోవడం వంటి విషయాలను శంతనుని మౌనచిత్తుడిని చేశాయి. ఆ రోజు నుండి విచారంతో ఉన్న శంతన మహారాజు యొక్క మౌనమునకు కారణం మంత్రి ద్వారా తెలుసుకున్న దేవవ్రతుడు ఏ విధంగానైనా తన తండ్రి బాధను తీర్చాలి అనుకున్నాడు. తండ్రి సుఖమే తన సుఖంగా భావించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

**భీషణ ప్రతిజ్ఞ**

దేవవ్రతుడు దాసిరాజు వద్దకు వెళ్ళి సత్యవతితో తన తండ్రి వివాహం జరపాలని కోరగా, "నువ్వు రాజ్యపాలన చేయకుండా తన కూతురి సంతానానికి బాధ్యత చెందాలని, నువ్వు వివాహమాడనని నాకు మాట ఇస్తే తన కూతురిని నీ తండ్రికిచ్చి వివాహం జరుపగలనని తెలుపగా అలాగేనని తండ్రి సుఖం కోసం రాజ్యమును పాలించనని, వివాహం చేసుకోనని భీషణమైన ప్రతిజ్ఞ చేశాడు. ఆ రోజు నుండి దేవవ్రతుడు భీష్ముడు అని నామధేయం పొందాడు.

ఇంతటి మహోన్నత త్యాగం, వ్యక్తిత్వం తండ్రి సుఖము గూర్చి త్యాగం చేయువారు నేడు ఎందరున్నారు.

**2. మాయాజూదము**

దుర్యోధనుడు మయసభా పరాభవ సంఘటనను గుర్తుకు తెచ్చుకొంటూ తనలో తాను మధన పడసాగాడు. అసూయ మనసులో రగులుతుంది. పాండవులను ఏ విధంగానైనా అవమానించి రాజ్యం నుండి వెళ్ళగొట్టాలని చూస్తున్న దుర్యోధనునికి శకుని మాయాజూదంతో పాండవులను రాజ్య విహీనులను చేసి పంపవచ్చన్నాడు. శకుని మామ మాటలకు సంతోషించిన దుర్యోధనుడు తన తండ్రి ధ్రుతరాష్ట్రుడిని ఒప్పించి విదురిని ద్వారా జూదం ఆడుటకు పాండవులకు ఆహ్వానం పంపాడు.

విదురుని ఆహ్వానం అందుకున్న ధర్మరాజు ద్రౌపతి అన్నదమ్ముల సమేతుడై కౌరవ సభకు వెళ్ళాడు. శకుని ధర్మరాజును కవ్వించి మాయాజూదంలోకి దింపాడు. ధర్మరాజు చేసేదిలేక "శకుని మామ యుద్ధానికి దూత్యక్రీడకు ఆహ్వానిస్తే తిరస్కరించడం రాజు ధర్మం కాదు. ఎవరితో ఆడాలో చెప్పు" అన్నాడు. ధర్మరాజు అప్పుడు దుర్యోధనుడు కలుగజేసుకొని మా వైపు శకుని మామ ఆడుతాడని అనగా మా వైపు నేను ఆడుతాను అని ధర్మనందనుడు పలికి జూదమును ప్రారంభించారు.

శకుని మామపాచికల ప్రభావం వలన ధర్మరాజుకు ఏ పందెంలోనూ విజయం లభించక ప్రతి పందెంలోనూ ఓడిపోయి ధనరాశులను, ధనాగారంలోని ధనరాశులను, రత్నా భరణములను, మరకతమణులను, వస్తు వాహనములను, తన రాజ్యం మొత్తం పందెంలో ఓడి సర్వమూ కోల్పోయాడు. తదనంతరం కౌరవుల కవ్వింపు మాటల వలన ద్రౌపతిని కూడా పందెంలో పెట్టి ఓడిపోయాడు. పాండవుల హృదయం క్రోదంతో నిండిపోయింది. జూదంలో ద్రౌపతిని గెలుచుకున్న దుర్యోధనుడు ద్రౌపతిని సభకు తీసుకురమ్మని దుశ్శాసనుని ఆజ్ఞాపించాడు.

## నేటి యువత – రేపటి భవిత

జూదం వలన ఎవరో ఒకరు ఓడక తప్పదు. గెలిచిన వారు అతి ఉత్సాహంతో మరలా మరలా ఇతరులతో జూదం ఆడుటకు ప్రయత్నించి చివరకు వీరు కూడా ఓటములను మూటగట్టుకుని ఉన్న సమయాన్ని, సంపదలను, గౌరవమర్యాదలను ఒక్క క్షణంలో పోగొట్టుకుందురు. చివరికి ప్రాణములు సైతం త్యజించెదరు. కౌరవ పాండవ జూదములో నిజముగా కౌరవులు గెలిచినా అది చరిత్రలో మాయాజూదముగానే ప్రసిద్ధికెక్కినది. అసలు ఫలితం శకుని పొందగా అవమానాన్ని పాండవులు అనుభవించారు. అల్పసంతోషులై కౌరవులు పబ్బం చేసుకున్నారు. కాబట్టి నేటి యువత బంగారు భవితను జూదముల పాలు చెయ్యకూడదని భారత కథ మనకు కనువిప్పు కలిగించినది.

## 3. గీతోపదేశం

ఆరుకాండల రామాయణం, 18 పర్వాల భారతం, 18 పురాణాల సారమే ఈ గీత. మొత్తం ఈ గీతలో 700 శ్లోకాలు కలవు. కృష్ణుడు 574 శ్లోకాలు అర్జునుడు 84 శ్లోకాలు, ధృతరాష్ట్రుడు1, మొత్తం 700 శ్లోకాలు గీతోపదేశం. కురుక్షేత్ర యుద్ధంలో రథసారిధియైన కృష్ణుడు విష్ణువు అవతారంతో అర్జునునికి విశ్వరూపదర్శనం చేసి గీతోపదేశం చేశారు. ఇది 18 అధ్యాయాలతో మహాభారతంలోని భీష్మపర్వంతో వివరించడం జరిగింది. అర్జునుని విషాదయోగం మొదలు మోక్ష సన్యాసయోగం వరకు 18 అధ్యాయముల భగవద్గీత.

భారత ఉద్యోగపర్వంలో కృష్ణుడు పాండవుల పక్షమై రాయభారిగా కౌరవుల వద్దకు వచ్చి యుద్ధం వలన అందరూ బాధపడతారని శాంతియే రాజ్యక్షేమమని, ధర్మరాజు అభిమతం కూడా అదేనని వివరిస్తాడు ధృతరాష్ట్రుని ముందు. అందుకు దుర్యోధనుడు శ్రీకృష్ణుని వచనములను పెడచవిన పెట్టి హేళన చేస్తూ “పందెంలో ఓడిననాడే రాజ్యమును పోగొట్టుకొన్నారు. ఇప్పుడు రాయభారిగా ఏమి ఉద్ధరిద్దామని వచ్చావు కృష్ణా” అని అనగా! కనీసం ఐదూళ్ళు అయినా ఇమ్మనగా సూదిమొన మోపినంత అయినా ఇవ్వజాలం అనగా యుద్ధం అనివార్యం అయినది.

## కురుక్షేత్ర సంగ్రామం

రాయభారిగా వచ్చిన కృష్ణుని బంధింపమనడం, కృష్ణుడు విశ్వరూపదర్శనంతో రాయభారం సమరశంఖం ఊదినట్లెయ్యింది. యుద్ధం రానే వచ్చింది. కౌరవ–పాండవ దాయాదులకు రాజ్యనికై భీష్ముడు సర్వసైన్యాధికారిగా 11 అక్షౌహిణుల కౌరవసేనలు యుద్ధ భూమికి నడిచాయి.

పాండవ గుడారమున కృష్ణ–ధర్మరాజులు మన సైన్యాధ్యక్షుడుగా ధృష్టద్యుమ్నుడు తగిన వాడని నిర్ణయించి శిఖండి మూలంగా భీష్మపితామహులను నిలువరించవచ్చని ప్రణాళికలు రచించారు. అర్జునుడు అధిరోహించిన రథాన్ని శరవేగంతో నడుపుతూ వచ్చి ఉభయసేనల మధ్య నిలిపాడు. రథసారధి కృష్ణుడు ఇరువైపుల సేనలలోని భీష్మపితామహులను, తనను వీరునిగా తీర్చిన గురువైన ద్రోణాచార్యులను, చూసి రాజ్యమునకై పూజనీయులను సంహరించాలా అని కలత చెంది ఇది ఎంత దారుణం అని మనస్సున తలచి ఆవేదన చెందాడు. ధనుర్బాణములను నేల జార విడిచాడు.

అర్జునుని చూసిన కృష్ణుడు నవ్వుతూ ఇదేమిటి బావ నిరుత్సాహంగా ఉన్నావన్నాడు. కృష్ణా! ఇంత మంది బంధుమిత్రులను చంపి, వారి రక్తం ఏరులైపారి తడిసిన ఈ రాజ్య సంపదలు నాకు వద్దు అని అర్జునుడన్నాడు. అప్పుడు భగవానుడైన కృష్ణుడు మందహాసం చిందిస్తూ భగవద్గీత మహోపదేశం చేశాడు. అర్జునా, నీవు నిమిత్తమాత్రుడవు. ఈ సకల చరాచర జగతి మొత్తం సృష్టి, స్థితి, లయ అంతా నేనే. లోకంలో అధర్మం మీరినప్పుడు ధర్మాన్ని రక్షించుటకై నేను అవతరిస్తుంటా.

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థా య సంభవామి యుగేయుగే॥**

**ముగింపు**

18 పర్వాలు భారతం నేటి మానవజీవనానికి అత్యంత ఆవశ్యకం. శాంతి ప్రధానంగా రాయబడిన ఈ మహేతిహాసం భావితరాలకు ఆచరణీయ గ్రంథం. యుక్తి-కీయుక్తి, రాజధర్మం, గురూపదేశం, శిష్యగురుదక్షిణం, బంధుప్రీతి, ధర్మయోగసాధనా, గీతోపదేశం ఇలా అన్ని విషయాలను భారత గ్రంథాన వివరించబడింది.

**ఆధారగ్రంథాలు**

1. శ్రీమదాంధ్ర మహాభారతము – చిలుకూరు వెంకటేశ్వర్లు.
2. శ్రీమదాంధ్ర సంపూర్ణ మహాభారతం – బి. వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి.

# 49. కవిత్రయ భారతం పాత్రలు - మనస్తత్త్వ చిత్రణ

- రామాపురం శ్రీనివాసులు, చెన్నై మరియు బి. రజని, చెన్నై

"యది హాస్తి తదన్యత్ర, యన్నే హాస్తి నతత్ క్వచిత్" అనేవారు కొందరు. అనగా ఇందులో ఉన్నవే అన్ని చోట్లా ఉన్నాయి. ఇందులో లేనివి వేరే ఎచ్చటా లేదు... అనేవారు కొందరు. మహాభారతానికి సమానమైన గ్రంథం ప్రపంచం మొత్తం మీద వేరే ఏ భాషలలోను లేదు అని చెప్పేవారు కొందరు.

ఈ మహాభారతాన్ని సంస్కృత భాషలో శ్రీ మహావిష్ణు అవతారమైన వేదవ్యాసముని రచించారు. ఈ మహాభారతానికి జయం, పంచమ వేదం అనే పేర్లు కూడా కలదు.

ఈ మహాభారతాన్ని ఎందరో కవులు ఎన్నో భాషలలోనికి అనువాదం చేశారు. మనకు తెలుగు భాషలో ముఖ్యమైన అనువాదం నన్నయ్య, తిక్కన, ఎర్రన అనే కవిత్రయం వారు చేసిన అనువాదం చాలా ప్రసిద్ధి చెందింది, ఈ మహాభారతం ప్రపంచంలోని అన్ని భాషలలోకి కూడా అనువాదం చేయబడింది.

శకుంతల, దుష్యంతుల పుత్రుడైన భరతుడు, భరతవంశ ప్రతిష్ఠాపకుడయ్యాడు. ఈ భరతవంశంలో అనేక మంది రాజులు జన్మించారు. వారిలో విచిత్ర వీర్య, చిత్రంగదులు సంతానం లేకుండా మరణించుట వలన, విచిత్ర వీర్యుని తల్లి సత్యవతీ నియోగం చేత అతని భార్యయైన అంబిక, అంబాలికలకు వ్యాసుని వలన ధృతరాష్ట్ర, పాండురాజులు జన్మించారు. వీరి కుమారులు కౌరవులు, పాండవులు రాజ్యభాగం కొరకు కురుక్షేత్ర మహాక్షేత్రంలో 18 రోజులు మహాయుద్ధం జరిగింది. అవే 18 పర్వాలు. వీటన్నింటిని కవిత్రయ కవులు చక్కగా అనువదించారు. ఇందులో కథలు, నీతులు, వంశచరిత్రలు, దేవీ దేవతాస్తుతులు కూర్చడం జరిగింది. ఈ మహాభారతంలోని వ్యక్తుల మనస్తత్వంలను ఒక్కసారి పరిశీలిద్దాం.

## దుర్యోధనుడు

ఎంతో అహంకారంతో ప్రవర్తించే దుర్యోధనుడుని చూస్తే అతనిని ఆత్మాధిక్యత భావనకు ప్రతీకగా చాలామంది చెప్తారు. ఆ విధంగా దుర్యోధనుడి ప్రవర్తనకు కారణం మహారాజు కుమారునిగా పుట్టి 100 మంది సోదరులకు పెద్దవాడిగా అధికారం చెలాయిస్తూ పెరిగాడు. తనే యువరాజుగా వెలిగిపోవాలి అణుకున్న సమయంలో, పాండవులు హస్తినకు ప్రవేశించి, దుర్యోధనునికి సమస్య అయ్యారు. పాండవుల శక్తి సామర్థ్యాలు, సుగుణాలు, మంచిప్రవర్తన అందరినీ ఆకట్టుకోవడం కురువృద్ధుల, గురువులదృష్టి క్రమంగా ధర్మరాజుపై ఆకర్షితమవటం ఇవన్నీ చూసిన దుర్యోధనునికి అభద్రతా భావాన్ని పెంచినది. తన తండ్రి తరువాత రాజ్యాన్ని పరిపాలించాలి అణుకున్న దుర్యోధనుకి పాండవుల రాజసూయాధి యాగాలతో బలపడటంతో ఇతని మనస్సు అసూయ క్రోధాలతో నిండిపోయినది.

కుమారాస్త్ర విద్యాప్రదర్శనలో దుర్యోధనుని అసూయ మరింత పెరిగింది. చివరకు ద్రౌపదీ వస్త్రాపహరణకు పురికొల్పింది. అతని మనస్సులోని కరుడుగట్టిన జంతుప్రవృత్తికి ఇది ప్రభల నిదర్శనమని మనం గ్రహించవచ్చు.

దుర్యోధనుని పరిపాలనా కాలములో ప్రజలను మాత్రం కన్నబిడ్డల వలె చూసుకొనుచుండెను. స్నేహమునకు అత్యంత విలువ ఇచ్చే వ్యక్తి దుర్యోధనుడు. ఇతని పరిపాలనా కాలములో భూమాత ప్రజలకు సిరిసంపదలను సమకూర్చుతూ ఇందేదని తెలుస్తుంది. ఇలా పాండవులపై అక్రమ విజయంతో అతని అహంకారం మరింత పెరిగింది. మైత్రేయ మహాముని హితవు చెప్పినప్పుడు కూడా మారలేదు. ఘోషయాత్రకు వెళ్ళి అవమానపడ్డాడు. అప్పటికీ తను మాత్రం మారలేదు.

చివరకు తాను నమ్ముకున్న కర్ణుని వధతో, శల్యవధతో దిక్కుతోచక పరుగెత్తి మడుగులో తలదాచుకున్నాడు. తొడలు తెగిపడిపోయాక కూడా సంజయునితో పాండవులను ఉద్దేశించి ఇలా అన్నాడు "పాండవులు తనను ఓడించడం

ఎలా ఉందంటే, ఎదురుగా ఏమీ చేయలేక, చేతగాక దొంగచాటుగా పగవాడు నిద్రపోతున్న సమయంలో చంపినట్లు, తెలియకుండా విషాన్నం పెట్టి చంపినట్లు, ఇంటికి అగ్గిపెట్టి చంపినట్లు ఉన్నదని" అన్నాడు.

తను చేసిన అధర్మపు పనుల్ని లోకం అధర్మం అంటుందిగానీ పాండవులు చేసిన యుద్ధం ఏమంత ధర్మంగా ఉంది? భీష్ముణ్ణి, ద్రోణుణ్ణి, కర్ణుణ్ణి పడగొట్టినట్లే అధర్మయుద్ధంలో నన్ను పడగొట్టారు అని, నాకంటే పాండవులేమి ఉత్తములు, పుణ్యాత్ములు కారని పశ్చాత్తాపంతో అతని మనస్సులో నుండి రావడం అతని వ్యక్తిత్వం ఆవిష్కృతమవుతుంది. ఇలా అసూయ క్రోదాలతో రగిలి హతమైన దుర్యోధనుడు తనకుతానే స్వయం నాశకుడైనాడు.

**కర్ణుడు**

కర్ణుడు ప్రతిచోట కులవివక్ష కులపరీక్షలలో అవమాన భారంతో అల్లాడిపోయాడు. ఎంతో సామర్థ్యం ఉండి కూడా కులము దురదృష్టముగా మారింది. ఇతని జీవితంలో ఎదురైన అనుభవాలే కర్ణున్ని అలాగ తయారుచేసాయి. సంఘంపై తన కసి తీర్చుకోవడానికి, తాను గొప్పవాణ్ణి అనిపించుకోవటానికి, కురుపాండవ వైరాన్ని మరింత పెంచిపోషించాడు.

కుమారాస్త్ర విద్యాప్రదర్శన సందర్భంలో, అగ్రరాజ్య పట్టాభిషేకం చేసి కర్ణుని మానాన్ని దుర్యోధనుడు కాపాడాడు. దానికి ప్రత్యుపకారంగానే స్వామి భక్తి తన జీవితాంతం పాటించాడు.

తన తల్లి తనకిచ్చిన మంత్రం పనిచేస్తుందో లేదో అని ప్రయత్నించి, తనకు జన్మనిచ్చి, లోకానికి భయపడి గంగపాలు చేసినా తన కుమారుడైన అర్జునున్ని కాపాడడం కోసం వచ్చి అర్థిస్తే తన తల్లికి అర్జునునిపై నాగాస్త్రాన్ని ఒక్కసారే ప్రయోగిస్తానని ఒకవేళ అర్జునుడు మరణిస్తే నేనూ నీకు బిడ్డగా ఉంటానని, ఒకవేళ నేను మరణించినా నీకు పంచపాండవులుగానే ఉంటారని ఇచ్చిన మాటకు కట్టుబడి కురుక్షేత్ర యుద్ధంలో ఒక్కసారి నాగాస్త్రం విఫలమైన మరలా అర్జునునిపై ప్రయోగించలేదు.

కుంతీదేవి నీవూ నాకు ఆరవ కుమారుడుగా వుండమని అర్థించినపుడు, ద్రౌపది కూడా అతనిని భర్తగా అంగీకరిస్తానని చెప్పగా శ్రీకృష్ణుడు ఎంతగా చెప్పినా తన మనస్సు మార్చుకోనటువంటి ధీశాలి. చివరకు తనకున్న బంగారం పన్ను దానం చేయమని మారువేషంలో వచ్చి అడిగిన వెంటనే కాదనకుండా కృష్ణునికి తన బంగారు పంటిని ఇచ్చిన వ్యక్తి, అపుడే తన కవచకుండలాలను అంతా పోగొట్టుకొని చివరిదశలో ఉండి కూడా అడిగిన వెంటనే కృష్ణునికి బంగారు పంటిని దానం చేసిన దానశీలి కర్ణుడు.

అర్జునుని దుర్యోధనుడు చంపాలని ఏవిధంగా భావించాడో, కర్ణుడు కూడా అలాగే భావించాడు. కావుననే అసూయాపరులైన ఈ ఇద్దరికీ స్నేహం కుదిరి ఉండవచ్చు. అందుకే దుర్యోధనుడు తన వారందరి మాట కంటే ఎక్కువ కర్ణుని మాటకు విలువనిచ్చేవాడు.

కర్ణునిలో ప్రధానంగా 2 గుణాలు గమనించవచ్చు.

1. దాన వ్రతము 2. స్వామి భక్తి

ఇవి రెండు గుణాలు తెచ్చిన కీర్తితో పాటు నష్టము కూడా ఎక్కువగానే కలిగినది. స్వామి భక్తి కంటే ముందు నుంచే దానవ్రతమును ఆచరించాడు.

కర్ణుని జీవితాన్ని పరిశీలిస్తే పుట్టుకనుండి మరణం వరకు ఇచ్చిన మాటకు కట్టుబడి జీవించాడు. కుమారాస్త్ర విద్యాప్రదర్శనలో తనను అవమానిస్తున్న అర్జునుని వద్ద కాపాడిన దుర్యోదునికి జీవితాంతం వరకు అతని పట్ల స్వామిభక్తి కనబరిచాడు.

ఇలా కురుక్షేత్రంలో నాగాస్త్రం వ్యర్థం కావడం, శల్య సారధ్యం, భార్గవాస్త్రం స్ఫురించకపోవడం, బ్రహ్మాస్త్రం వెనుదిరిగి రావడం, మొదలైన విషయాలను కర్ణుని జీవితాన్ని చూస్తే అయ్యోపాపం కర్ణుడు అని ఎవరికైనా అనిపిస్తుంది.

**ధర్మరాజు**

మహాభారతంలో ధర్మరాజు పాత్ర చాలా గొప్పగా చిత్రించారు. ధర్మరాజులో ఎన్ని మంచి గుణాలున్నా, ఎంత కీర్తిప్రతిష్టలున్నా "ద్రౌపదిని ఒడ్డి" జూదం ఆడి చరిత్రలో ఏ స్త్రీకి జరగని అన్యాయానికి, సోదరుల అవమానానికి కారకుడైనాడు. ఇది ధర్మరాజు మనస్సులో ఎల్లప్పుడు బాధపట్టేది.

ఎదుటివారి మనస్తత్వాన్ని తెలిసి ప్రయోజనాన్ని నెరవేర్చుకోవడంలో ధర్మరాజు గొప్ప నేర్పరి. అందువలననే వైరి పక్షంలో ఉన్న శల్యుణ్ణి, భీష్ముణ్ణి, ద్రోణులతోపాటు కురుగురువృద్ధ భాందవుల మనసుల్ని తన అనుకూలంగా త్రిప్పుకోవటంతో సఫలీకృతుడైనాడు.

ధర్మరాజు ఎల్లప్పుడు సత్యాన్నే మాట్లాడతాడు. అబద్ధమాడడు అని అందరి భావన కాని ధర్మరాజు నీతైన నిగూడమైన మనసు కలవాడు. దానిని తెలుసుకున్న వ్యక్తి కేవలం కృష్ణుడు మాత్రమే. చివరకు విరోధి అయిన దుర్యోధనుడు కూడా ధర్మరాజు మాటను నమ్ముతాడు. "ఉత్తర గోగ్రహణ సందర్భంలో అర్జునుడు బయటపడటాన్ని సమయ భంగమని దుర్యోధనుడు అంటే భీష్ముడు అజ్ఞాతవాస సంవత్సరం పూర్తి అయిందన్నాడు. పాండవ పక్షపాతి కాబట్టి అబద్ధమాడవచ్చు. కాని ధర్మరాజు అబద్ధమాడడు అని చెప్పి వాస్తవాన్ని చెప్పమని దూతను పంపిస్తాడు దుర్యోధనుడు. ధర్మరాజు సత్యనిష్ట అంతటిది. అయినా అప్పుడు అబద్ధమాడతాడు ధర్మరాజు. పైకెంతగా యుద్ధం వద్దని చెపుతున్నా సామ్రాజ్యవాంఛ ధర్మరాజు మనస్సులో ఎక్కువగానే ఉండేది.

కర్ణుని చేత చావుదెబ్బలు తిని, శిబిరానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించడానికి వచ్చిన కృష్ణార్జులను చూచి, కర్ణున్ని వధించి వచ్చారని ప్రశంసించాడు. అర్జునుడు కర్ణుణ్ని ఇంకా చంపలేదని చెప్పగానే, నీ యోగక్షేమాలు విచారించి పోవాలని వచ్చామని చెప్పగానే చాలా తీవ్రంగా తిట్టాడు. ఇలా మనస్సులో ఎక్కువ ప్రతీకార భావం కలిగిన వ్యక్తి. అందుకే అశ్వత్థామ ధర్మరాజును "అంతర్మద దుష్టుడు" అంటాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విషయాలు కనిపిస్తాయి. మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు అన్ని శలలోను లోనయ్యే మానసిక సంఘర్షణను వివరించవచ్చు. వీటిని మహాభారతంలోని పాత్రలను పరిశీలిస్తే అదే పెద్ద గ్రంథమవుతుంది.

**ఆధారగ్రంథాలు**

1. నన్నయ్య – ఆంధ్రమహాభారతం
2. తిక్కన – ఆంధ్రమహాభారతం
3. ఎర్రన – ఆంధ్రమహాభారతం

# 50. శకుంతల దుష్యంతల కథ - సార్వకాలికం

– దేవిశెట్టి రామన్న మరియు పాండవ హరీష్ బాబు, పెనుగొండ

**కథా పరిచయం**

శకుంతల దుష్యంతుల కథ అనగా మనకి వారి ప్రణయము దుష్యంతునికి శాపము భరతుని జననము లాంటి ఇతిహాసిక కథా విషయాలు స్మరణకు వస్తాయి. మహాభారతం వేదవ్యాస విరచత మహాభారత సమగ్ర స్వరూపాన్ని నన్నయ మహాకవి ఈ లోకానికి పరిచయం చేశారు.మహా కావ్య లక్షణాలు కలిగి ఉండి పురాణా సముచ్ఛయంగా దృశ్యమానమై లాక్షణకుల విధి విధానాలతో విరాజిల్లూతూ ధర్మాన్ని నీతిని ప్రజలకు అందించి ఇదేనా సహితం సాహిత్యమని రుజువు చేస్తూనే కాంత సమ్మితంగా సందేశాన్ని మన కందించిందని ఆ కారణంగానే అందులో ప్రతిపాదించిన ధర్మం నీతి సర్వకాలికంగా గోచరిస్తుంది వ్యాసుడు ఏ రాజకీయ సామాజిక సాహిత్య ఆర్థిక పరిస్థితులలో రచించిన కవిత్రయం ఏ దృష్టితో అనువదించిన ఎవరి బావ ఆవిష్కరణ వారిచే మహాభారతంలో చెప్పుకోదగిన ఉపాఖ్యానలలో శకుంతలో భాగ్యానం ఒకటి. సందేశాత్మకమైనది శకుంతలోపాఖ్యానంలో కథంతా ముగింపు వరకు పాఠకులను ఆందోళనకు గురిచేసి ముగింపు మాత్రం పాటువులకు ఉపకరిస్తుంది. శకుంతల తల్లి నేను కథ ఆనాటి వేశ్య వ్యవస్థకు అద్దం పడుతూ పురుష ప్రయోజనాలకే ఉపకరణంగా ఉపయోగించుకోబడుతున్న వారి దీనావస్థ మన కళ్ళ ముందు కదలాడుతున్నది.

నేటి ఆధునిక పాఠక లోకానికి నన్నయ ఆంధ్రమహాభారతంలోని ఆదిపర్వము చతుర్థాశ్వాసంలో శకుంతలోపాఖ్యానము నందు శకుంతల దుష్యంతల సంభాషణా, గొప్పతనం, నైతిక విలువలు ఉపదేశము, బోధనలు, ధర్మసూక్ష్మాలు, లోకజీవన పద్ధతులు, లోకజ్ఞానం నన్నయ మహాభారతం నందు కనిపిస్తాయి. పండితుల, పామరజనుల, నిరక్షరాస్యుల, ఆమోదం పొంది, జన బహుళ్యంలోకి చొచ్చుకపోయి, అమరత్వాన్ని పొంది ప్రజల నాలుకలపై నిరంతరము నన్నయ పద్య సాహితీ ప్రక్రియ నాట్యమాడుతున్నది. తెలుగు కవిత్వ ప్రక్రియలలో నన్నయ భారతం జన బహుళ్యంను చూరగొన్నది. నన్నయ్య పద్య సాహిత్యము నందు సంప్రదాయాలు, అలంకారాలు, చందోరీతులు ఉండటం వలన వారి పద్య సాహిత్యంను పరిపుష్ఠం చేశాయి. శకుంతల దుష్యంతో పాఖ్యానం నందు, శకుంతల దుష్యంతుల కుమారుడైన భరతుని కుటుంబ చరితను, నైతిక విలువల ప్రాధాన్యతను నేటి సామాజిక ప్రగతికి, మానవ జీవన వికాసానికి విలువలను, వివిధ పాత్రల ద్వారా, సంభాషణల ద్వారా విశదపరిచి గొప్ప మార్గదర్శకుడయ్యాడు. నన్నయ గారి మహాభారతం నందు శబ్దాలంకారాలు ఉండటం వలన చందోబద్ధంగా ఉండి లయన్వితముగా సాగినది. నన్నయ గారి మూలభారతం నందలి ఈ కథ మూల రచనా విధానంతో భావయుక్తముగా, అర్థయుక్తంగా అలారారుచున్నది.

మహాభారతంలోని ఆదిపర్వంలో పాండవుల జననం విద్యాభ్యాసం, వివాహం మొదలైన ప్రధాన అంశాలు ఉన్నాయి. ఇంకా ఆ వంశానికి సంబంధించిన పూర్వ రాజుల కథలు యయాతి, దుష్యంతుడు మొదలైన కథలు కలవు. దుష్యంతోపాఖ్యానం పరమ రమనీయమైన కథ అనేక ప్రాచ్య, పాశ్చాత్యుల, విధ్యాంసుల ప్రశంసలకు పాత్రమైంది. దుష్యంతుడు ఒకసారి వేటకు వెళ్లి వేటాడి, అరణ్యంలో వెళ్లి వెళ్లి కణ్వమహార్షిని ఆశ్రమాన్ని చూశాడు. కన్వమహర్షిని దర్శిద్దామని ఒంటరిగా వెళ్లి శకుంతలను చూశాడు. ఆమె సౌందర్యాన్ని చూసి సంచలిత హృదయుడయ్యాడు. ఆమె మేనక విశ్వామిత్రుల సంతామని తెలుసుకున్నాడు. గాంధర్వ వివాహ స్వరూపాన్ని వివరించి శకుంతలను అంగీకరింపజేశాడు.

శకుంతల అతని వల్ల తనకు పుట్టే పుత్రుని యువరాజుగా చేయమని వరం కోరింది. దుష్యంతుడు వరదానం చేశాడు. అభిమత సుఖములు అనుభవించి ఆమెను వీడ్కోని వెళుతూ నిన్ను తోడుకొని రావడానికి కన్వమహర్షి దగ్గరకు మంత్రుల్ని పంపిస్తానని చెప్పి వెళ్ళిపోతాడు.

కన్వమహర్షి శకుంతలను పిలిచి భర్త లేని స్త్రీ నలుగురు నాలుగు రకాలుగా ఆడిపోసుకుంటారు అని చెప్పి శిష్యులను తోడుగా చేసి దుష్యంతుని సభకు పంపగా శకుంతలా దృశ్యంతుని సభకు కుమారునితో సహా వెళ్తుంది. దుష్యంతుడు తెలిసి తెలియనట్లు నీవు ఎవరు ఎందుకు ఇటు వచ్చావు అంటూ తెలియనట్లు నటిస్తాడు. అప్పుడు శకుంతల రాజసభలో ధర్మం గొప్పతనము గురించి, సత్యం గొప్పతనము గురించి, భార్య గొప్పతనం గురించి, కుమారుని గొప్పతనం గురించి శకుంతల మాట్లాడిన మాటలు నేటి స్త్రీ సమస్యలను ఆనాడే శకుంతల ఎదుర్కొంది. ధర్మము, సత్యము, మిత్రుడు గొప్పతనమును స్త్రీ పురుష సమానత్వము లేని కాలములో ధైర్యంగా సభలో చెప్పడం జరిగింది.

భార్య గొప్పతనం చెప్పడం ద్వారా స్త్రీ ఔన్నత్యాన్ని జన బహుళ్యానికి తెలియజెప్పడం అంటే ఒక స్త్రీగా తాను ధైర్యంతో సభలో పెదవి విప్పడం, ఒక స్త్రీ పురోగతి సాధించిన విధానం కాబట్టి శకుంతల ఆ కాలంలోనే స్త్రీల సమస్యల కోసం పోరాడిన మహిళగా ఆమె ధైర్య సాహసాలను గుర్తించడం, ఆమె మాట్లాడిన ప్రతి మాటలో స్త్రీ సమస్యతో పాటు దాని పరిష్కారం వలన సమాజానికి కలిగే మేలు మరియు నన్నయ కాలానికి ఉన్న స్త్రీల స్థితిగతులు, కట్టుబాట్లు కూడా మనకు శకుంతల ధార్మిక ఉపన్యాసంలో కనబడుతుంది. దుష్యంతుడు నీవెవరో నాకు తెలియదు నిన్ను చూడలేదు అని అనగానే సహజంగా శకుంతల బాధపడింది. కానీ వెంటనే తప్పు పలకనగునే ధార్మికులకు అంటూ చాలా ధైర్యంతో అన్నది.

శకుంతలోపాఖ్యానం నందు శకుంతుల దుష్యంతునికి నిండు సభలో తన వాక్చాతుర్యము ద్వారా ప్రత్యక్షంగా స్త్రీ జాతికి కీర్తిని, ఖ్యాతిని, యశస్సును తెచ్చి పెట్టినది. శకుంతలోపాఖ్యానం కథ ఈనాటికి ఇచ్చే సందేశం ఏమిటి అనే ప్రశ్న ఇందులో మనస్తత్వపరిశీలన మన వ్యక్తిత్వాలను సమాజంలో మన స్వభావమును వెల్లడిచేస్తుంది. నేడు దుష్యంతుడు వంటి రాజులు లేకపోవచ్చు. కన్వమహర్షి లాంటి ఋషులు లేకపోవచ్చు కానీ, అలాంటి స్వభావం గల మరో పేరున్న మనుషులు ఉన్నారు. దుష్యంతుడు వేట నేపంతో ఒంటరిగా కన్వాశ్రమమునకు వచ్చాడు. కన్వ మహర్షి లేడు, అయినా శకుంతల దుష్యంత మహారాజుకు అతిథ్యమిచ్చింది. అతిథ్యము స్వీకరించి, ఆమె అందముపై కన్నేశాడు. ఆమె మహర్షి కూతురు కాదని తెలుసుకొని మనసుపడ్డాడు. ఇది మానవ స్వభావం. విశ్వామిత్ర మేనకల అక్రమ సంబంధానికి పుట్టినది అనగానే అలుసు, పైగా నేను రాజును అని అహం దుష్యంతునికి ఉన్నది. ఈ కథలు మగవాడి స్వభావాన్ని, ఆడదాన్ని స్వభావాన్ని మనం తెరసి చూడవచ్చు. మనసు పడిన ఆడదానిని ఎలాగైనా లొంగదీసుకోవాలనేది మగవాడి స్వభావం లేదా అనుభవించాలనే మగవాడి బుద్ధి ఇలానే ఉంటుంది. తల్లిదండ్రులు లేని అమ్మాయిని ట్రాప్ చేయడం, చాలా సులువు. శకుంతలకు కూడా దుష్యంతునిపై మనసు పడింది. ఆమె అందమైన రూపం. ఆమె మేను కాంతి, మచ్చలేని గుణాలు, నార చీరలు కట్టడం, అడవిలో కాయలు తినడం, ఆకుల గుడిసెలో నివసించడం వంటి ఆమె ప్రస్తుత జీవన విధానముపై వ్యతిరేక భావనలు కలిగించి తన రాజభోగాలపై మనసు పడేలా చేశాడు. అమ్మాయిలకు లేని వాటిని ఎరవేసి తనపై ప్రేమ పుట్టే విధంగా చేసే ఉపాయం కనిపిస్తుంది. అయితే దుష్యంతుడు అనుభవిస్తానని అనకుండా నాకు భార్యవై సౌఖ్యములు మేలుగా నొందుము అన్నాడు. మానవులకు ఎవ్వరికైనా సుఖాలపట్ల మక్కువ ఎక్కువ కాబట్టి పైగా మహారాజుకు భార్యగా వెళ్లడం అంటే అంతకన్నా అదృష్టం ఏముంటుందని ఆశ్రమంలో ఉండే జీవితాన్ని రాజ్యంలో రాణిగా ఉండే జీవితంలో పోల్చుకుంటే ఎటువంటి స్త్రీ అయినా సుఖాలపట్ల, భోగాలపట్ల ఆకర్షితులవుతారు. మనకు లేనిది పొందనిది అలవోకగా వస్తే ఎవ్వరైనా కాదనగలమా ఇది మానవమాత్రుల మనస్తత్వం.

దుష్యంతుడు శకుంతలను దీన, హీన స్థితి నుండి పెళ్లి స్థాయికి, రాజ్యంలో బోగస్థితికి తీసుకువచ్చేలా, దుష్యంతుడు మాట్లాడి మచ్చిక చేసుకుంటాడు. దుష్యంతుడు ఎత్తుకు పై ఎత్తు వేశాడు. గాంధర్వ వివాహం మేలైనది ఉత్తమమైనదని నమ్మ పలుకుతాడు. అయితే శకుంతల దిక్కు లేక చెట్టు చాటున ఉన్న శకుంతల తీసుకువచ్చి పెంచి పోషించిన కన్న కూతురిలా చూసుకున్న కన్వమహర్షి పట్ల కృతజ్ఞతతో మహర్షి అంగీకరిస్తే పెళ్లి చేసుకోవచ్చు అంటుంది. ఇది శకుంతలకు

ఉన్న సుగుణం అయితే ఈ గుణం ఆమెకు తాత్కాలికమైనది. మంచి గుణాన్ని మార్చుకుంది ఇక్కడ స్త్రీ చపలచిత్తము కనిపించింది. కన్వాశ్రమంలో పెరిగింది కాబట్టి తెలివిగా నాకు పుట్టిన కుమారుని యువరాజును చేస్తే నాకు అభ్యంతరం లేదన్నది. దుష్యంతుడు వెనక ముందు ఆలోచన చేయకుండా సరే అన్నాడు. ఇక్కడ మగవాడి కామ బుద్ధి ప్రస్ఫుటమైనది. మగాడు స్త్రీ వ్యామోహంలో ఉన్నప్పుడు స్త్రీ ఏ కోరిక కోరిన సరేనంటాడు. తన కామ కోరికను తీర్చుకోవడమే తక్షణ కర్తవ్యంగా దుష్యంతుని మనస్తత్వం కనిపిస్తుంది. మహారాజుపై నమ్మకంతో పడక సుఖాన్ని ఇచ్చింది. కొడుకు పుట్టాడు. ఇటువంటి పరిస్థితి నేడు యవ్వనంలో ఉన్న యువతి యువకులలో చూస్తున్నాము.

ఓ విమల యశోనిధి మనిషి చేసే తప్పులను పంచభూతములు ధర్మము, సంధ్యలు, అంతరాత్మ, యముడు, రాత్రి, పగలు. ఇవన్ని చూస్తుంటాయి. నీవు తప్పించుకోలేవు అని రాజైన భర్తను సభలో ప్రతిఘటించింది. అంటే ఆమె ఎంత ధైర్యవంతురాలో మరియు ఆమెలో స్త్రీ వాద లక్షణాలు కనిపిస్తాయి. గాంధర్వ వివాహం రహస్యంగా దుష్యంతుడు చేసుకోవడం వలన సాక్షాధారాలు లేకుండా పోయాయి. భార్యని ఎడబావుకుంటే ఇహపరాలు ఉండవని హెచ్చరించింది. మాటలు విని తీరాల్సిందే అని సభలో శకుంతల దుష్యంతునితో చెప్పింది. పురుషుడు భార్య సహకారం లేకుండా ముందుకు వెళ్లలేడు. కచ్చితంగా భార్య సహకారం వల్ల కర్మలను ఆచరించ గలుగుతారు. ఇంద్రియాలను నిగ్రహించగలుగుతాడు. పుత్ర సంతాన్ని పొందగలుగుతాడు. దుష్యంతుడుతో భార్య విలువ తెలుసుకోమ్మన్నది. శకుంతల ఇల్లాలు గొప్పతనాన్ని ఇలా తెలియజేసింది. ధర్మాది సాధనకు ఉపకరణంబు, గృహనీతి విద్యకు నెలవు. నిర్మలమైన శీలాన్ని ప్రభోధించడంలో గురువు, వంశం నిలబడటానికి ఆధారము. ఉత్తమ గతులు పొందటానికి ఊత కర్ర, మన్ననకు ముఖ్య హేతువు అని చెబుతూ మగనికి ఇల్లాలి కంటే ఇంపైనది, సమానమైనది వేరొకటి లేదు. ఎటువంటి ఆపదలు చుట్టుముట్టిన అన్నీ తొలగిపోతాయి భర్త రాజైన, కింకరుడైన ఈ మాటలు విని తీరాల్సిందే అని సభలో శకుంతల ఉద్ఘాటించింది.

భార్య గొప్పతనాన్ని మరింత ఉన్నతీకరిస్తూ భార్య భర్త లిద్దరూ చెరి సగం కాబట్టి మగని కంటే ముందే చనిపోయిన పతివ్రత పరలోకంలో కూడా తన భర్తతో కూడి ఉండాలని అతని రాక కోసం ఎదురు చూస్తూ ఉంటుందట భర్త ముందుగా చనిపోతే తాను కూడా వెంటనే వెళ్లి భర్తను చేరుతుందట అటువంటి భార్యను అవమానించడం ధర్మవిరుద్ధమని శకుంతల చెప్తుంది. ఇది స్త్రీ ఔన్నత్యానికి పరాకాష్ఠ పతివ్రత అంటే భర్త మనోవర్తియై మసలుకోనేది. అది కూడా కేవలం ప్రేమానురాగపూర్వక ధర్మబద్ధమైన అంశాలందున మాత్రమే అని అర్థం. ఇది శకుంతల భార్య గొప్పతనాన్ని తెలియజేస్తూ స్త్రీకి విలువ ఇమ్మని నిండు సభలో తన మాటల ద్వారా పోరాడింది. కాబట్టి ఇది స్త్రీవాదమే. ఆ తరువాత కుమారుని గొప్పతనాన్ని, ధర్మం గొప్పతనాన్ని, సత్యవాక్యం గొప్పతనాన్ని కూడా చెప్పి ఎట్టకేలకు దుష్యంతుని చరిత్రలో భార్యగా అంగీకరింపజేసుకుని తన గెలుపు ద్వారా లోకాన్ని గెలిపించిన ఆదర్శ నారీ శకుంతల.

### సత్యవాక్యం ప్రశస్తి

సత్యవాక్య పాలనయే వ్రతముగా కలిగిన ఓ దుష్యంత మహారాజా వంద ఉప్పునీటి బావుల కన్నా ఒక మంచి నీటి బావి మేలు, వంద మంచి నీటి బావుల కన్నా ఒక యజ్ఞము మేలు, వంద యజ్ఞముల కన్న ఒక కుమారుడు మేలు, వందమంది కుమారులు కన్నా ఒక సత్య వాక్యం శ్రేష్ఠమైనదని శకుంతల దుష్యంతునితో చెప్పడం, ఈనాటి స్త్రీలు తమ భర్తల నుండి ఆపద కలిగితే, తమ భర్తలను కూడా శకుంతల లాగా నిలదీసి తమ భర్త మన్ననలు పొందగలుగవచ్చునని గ్రహించాలి.

### కుమారుని గొప్పతనం

భర్త భార్య గర్భములో ప్రవేశించి తాను పుత్రుడై ఉద్భవిస్తాడు, కనుక తండ్రి కొడుకు అనే తేడా లేదు గార్హపత్యం

అని అగ్ని వేరే ప్రదేశంలో అహావనీయమనే పేరుతో ప్రకాశించేటట్లు తండ్రి తానే కుమారుడిగా, తన తేజస్సుతో వెలుగుతుంటాడు. తన ప్రతిబింబాన్ని నీళ్లలో స్పష్టంగా చూసేటట్లు తండ్రి తన కొడుకును తాను చూసి అధిక ప్రీతితో మహానందాన్ని పొందుతాడు. కాబట్టి పుణ్యాచారుడైన పుత్రుడు తల్లి వంక వారిని, తండ్రి వంక ఆ వారిని ఉద్ధరిస్తాడు. వారికి ఉత్తమ గతులు కలిగిస్తాడు. కాబట్టి దీపం నుంచి మరొక దీపం పుట్టినట్లు నీ పుణ్య శరీరం నుంచి ఈ కుమారుడు పుట్టి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఓ మహారాజా ఈ కుమారుని శరీరాన్ని కౌగిలించుకోవడం వలనే కలిగే సుఖాన్ని పొందు, ముత్యాలహారం, కర్పూరదూళి, మంచి గంధము, వెన్నెల, కుమారుని శరీర అలింగనం లాగా జీవులకు హాయిని కలిగిస్తాయా? అధికమైన చల్లదనాన్ని కలిగిస్తాయా? కలిగించవు. నీ కుమారుడు పుణ్యాత్ముడు వంశోద్ధారకుడై వర్ధిల్లునని ఆకాశవాణి పలికినది.

## సింహావలోకనం

గాంధర్వ వివాహానికి ప్రకృతి సాక్ష్యమని నమ్ముతున్న కాలంలో ఆ ప్రకృతే సాక్ష్యంగా వచ్చి శకుంతలను ఆమె కొడుకును రక్షించింది. ఒక నమ్మకం ఆధారంగా చేసుకున్న వివాహ బంధాన్ని ఆ నమ్మకమే రక్షించింది. అయితే ఈ మధ్య కాలంలో సంఘటనలకు ఏ మాత్రం తీసుపోని విధంగా నడిచిన ప్రేమ కథ ఈ శకుంతల కథ. వివాహానకి మరియు ముఖ్యంగా ప్రేమించే రోజుల్లో లేని అభ్యంతరాలు, అనుమానాలు, అపోహలు, దానధర్మాలు, వివేచణ, విశ్లేషణలు, వివాహ సందర్భంగా లేదా వివాహానంతరము వారి ఆర్థిక స్థాయిలననుసరించి, హెూదాలను అనుసరించి, ముందుకు వస్తాయి. గాంధర్వ వివాహం కాకపోయినా ప్రేమ పేరిట గుళ్ళు గోపురాలలో స్నేహితుల సమక్షంలో పెళ్లాడటం మామూలైపోయింది. యుక్తవయసులో ఉన్న యువతీ యువకులు ఏమాత్రం ముందు చూపు లేకుండా మంచి చెడ్డ విచక్షణ లేకుండా ప్రేమ వ్యవహారంలో పడుతున్నారు. ప్రేమించుకున్న వారందరూ పెళ్లి వరకు వస్తారని ఖచ్చితమైన నమ్మకం ఏమిలేదు. ఒక సందర్భంలో అమ్మాయి పెళ్లి జరిగిన సజావుగా కాపురాలను కొనసాగిస్తారని నమ్మకం ఏమి లేదు. ఒక సందర్భంలో అమ్మాయి పెళ్లి జరిగిన ఆ అమ్మాయి ఇంటి ఆర్థిక స్థితిగతులు, ఆమె వద్దనున్న నగలు, నగదును ఆశించి అబ్బాయిలు ఆ అమ్మాయిలను ప్రేమ పేరిట లొంగదీసుకుంటున్నారు. మరికొన్ని సందర్భాలలో అబ్బాయిల అందచందాలను చూసి అమ్మాయిలు ఆకర్షితులవుతున్నారు. ఇటువంటి ప్రేమపెళ్లిళ్లు మహాభారతంలో కనిపించే శకుంతల దుష్యంతుల ప్రేమ గాథ తదుపరి గాంధార్వ వివాహం మనకు దర్శనమిస్తుంది.

### ఆధార గ్రంథాలు

1. కవిత్రయం విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము ఆదిపర్వం – కృతికర్త నన్నయభట్టారకుడు
– తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# 51. నన్నయ్య గారి సభా పర్వం లోని సూక్తులు నేటి కాల ఉపయోగం

- డా॥ అద్దంకి ప్రజాపతి, వడ్డేశ్వరం, గుంటూరు

నన్నయను మన తెలుగు భాషలో లేదా తెలుగు సాహిత్యంలో ఆదికవిగా పేర్కొంటాం. మనతెలుగు భాషలో రాసిన ఆది గ్రంధం ఆంధ్రమహాభారతం సంస్కృతంలో రాసిన రామాయణం రాసిని వాల్మికిని సంస్కృత భాష ఆది కవి అని పేర్కొంటాం. తెలుగు భాషలో కవిత్రయం ఉన్నట్లు కన్నడ భాషలో కూడా కన్నడ త్రయం కవులు ఉన్నారు. తెలుగులో మహాభారత రచనకు ఉపక్రమించిన నన్నయ ఆదికవి కాగా కన్నడ భాషలో మహాభారతం రచనకు ఉపక్రమించిన పంపకవి కన్నడ భాషా ఆదికవి కావడం తెలుగు- కన్నడ భాషల సామ్యంగా కనిపిస్తుంది. ద్రావిడ భాషా కుటుంబంలో వున్న లేదా దక్షిణ భారతదేశంలో ఉన్న ఈ రెండు భాషలలో మాత్రమే ఈ సామ్యం కనిపిస్తుంది. తమిళ భాష రాసిన మొదటి తోల్కాప్పిటియమ్ దీని రచయితగా తొల్కాప్పియర్ అని పేర్కొంటున్నారు.

చారిత్రకంగా ఆంధ్ర మహాభారత రచన ఏవిధంగా ప్రారంభమయింది అని గమనించినట్లయితే సంస్కృత భాషలలో మొట్టమొదటి సారిగా మహాభారత రచన చేసిన వారు వేద వ్యాసుడు. దీనిని తెలుగు భాషలోకి అనువదించవలసినదిగా రాజరాజనరేంద్రుడు అనే తూర్పు చాళుక్య రాజు అతని ఆస్థాన కవి మరియు విధ్యాధికారిగా ఉన్న కుల బ్రాహ్మణుడుగా ఉన్న నన్నయను కోరినట్లు ఆధారలను బట్టి తెలుస్తుంది.

రాజరాజ నరేంద్రుడి చరిత్రను గమనిస్తే ఇతను చోళ చాళుక్యుల వంశంలో పుట్టిన మొదటి రాజు. ఇతని తండ్రి పేరు విమలాదిత్యుడు, తల్లి కుందవ్వ లేదా కుందన మహాదేవి. ఈమె చోళ సామ్రాజ్య రాజు అయిన రాజరాజు -1 కుమార్తె. విమలాదిత్యుడు తూర్పు చాళుక్య వంశ రాజులలో దానార్ణవుడు అనే రాజు కుమారుడు. ఇతని అన్న పేరు శక్తి వర్మ. దానర్ణవుడు అనే తూర్పు చాళుక్య రాజును అతని బావమరిది జటాచోట భీముడు హత్య చేయగా ఆసమయంలో దార్ణవుడి కుమారులైన శక్తి వర్మ, వివలాదిత్యుడు ఇద్దరూ చోళ సామ్రాజ్య పరిపాలకుడు అయిన రాజరాజు -1 ని ఆశ్రయించగా అతను సైనిక సహాయం చేయగా శక్తి వర్మ తన మేనమామ అయిన జటాచోట భీముడిని ఓడించి తూర్పు చాళుక్య సామ్రాజ్యాన్ని తిరిగి చేపట్టాడు. ఇలా అధికారంలోకి శక్తి వర్మ అనంతరం ఇతని తమ్ముడు విమలాదిత్యుడు అధికారంలోకి వచ్చాడు. ఇతను జైనమతం అనుసరించిన రాజు విమలాదిత్యుడు మాత్రమే. ఇతని కుమారుడే రాజరాజ నరేంద్రుడు. ఇతని ఆస్థానంలో ఉన్న నన్నయను మహాభారతం తెలుగులోకి అనువదించమని కోరగా నన్నయ మహాభారత రచనను పూనుకోవడం జరిగింది.

తూర్పు చాళుక్యులు తమ పరిపాలన క్రీ.శ.625-1097 వరకు పరిపాలించినట్లు శాసన ఆధారాలను బట్టి తెలుస్తుంది. తూర్పు చాళుక్య సామ్రాజ్యం అంతరించలేదు కానీ దీనిని చోళ సామ్రాజ్యంలో కలిపి పరిపాలిచిన రాజు కుళత్తుంగ చోళుడు, ఇతనే మన ఆంధ్ర రాష్ట్రంలో విశాఖ పట్టణాన్ని కుళోత్తుంగ చోళ పురం అనే పేరుతో నిర్మించినట్లు తెలుస్తుంది.

అయితే నన్నయగారు ఆంధ్ర మహాభారతాన్ని దాదాపు 1054-1061 మధ్య రచన చేసి మరణించినట్లు ఆధారాలు ఉన్నాయి. ఆంధ్ర మహాభారతంలో ఆది సభా అరణ్య పర్వంలో సగభాగం రచించి మరణించారు. రాజారాజ నరేంద్రుడు ఒక రకంగా తెలుగుభాషకు మరియు తెలుగు సాహిత్య రచనకు జీవం పోసినట్లు అయింది. ఇతని పై తరచు దండెత్తే విజయాదిత్యుడు కూడా మహా భారత రచనను అంగీకరించినట్లు ఆధారాలు కనబడుతున్నాయి. విజయాదిత్యుడు ఎవరంటే విమలాదిత్యుడి రెండవ భార్య అయిన మేళన కుమారుడు. దీనిని బట్టి అర్ధమయ్యేది ఏమంటే రాజారాజనరేంద్రుడి శత్రువుని కూడా మెప్పించిన రచన ఆంధ్ర మహాభారతం.

నన్నయ్య మహాభారతంనకు సహాయం చేసినవారు నారాయణ భట్టు . ఇతను నన్నయకు అన్ని విధాల మహాభారత రచనలో సహాయం చేశాడు. నారాయణ భట్టు కర్ణాటక రాష్ట్రానికి చెందిన పశ్చిమ చాళుక్య సామ్రాజ్యంలో స్థానాపతిగా ఉండేవారు. ఇతను వేంగిని దర్శించిన సమయంలో తూర్పు చాళుక్య సామ్రాజ్య రాజు అయిన రాజరాజనరేంద్రుని కోరిక మేరకు ఆంధ్ర రాష్ట్రంలో స్థిరపడి పోయాడు.

నన్నయకు అనేక రకాల బిరుదులు ఉన్నప్పటికి ఆదికవి, విప్రం శబ్ద శాసననుడు అనగా శబ్దాన్ని శాసించే స్థాయిని పొందిన వారు నన్నయ.

నన్నయ మహాభారతాన్ని అనువదించడం కాకుండా అనుసక్మ్రిజనంగా తీర్చి దిద్దాడు. అనువదించడం వల్ల కలిగే ఆనందం కన్నా అనుసృజన వల్ల వచ్చే ఆనందం అమితంగా ఉంటుంది.

నన్నయ్య రాసిన (2 1/2) పర్వాలలో అత్యంత కీలకమైన ది సభా పర్వం. నన్నయ రాసినదే కాక మొత్తం ఆంధ్ర మహా భారతంలో సభా పర్వం అత్యంత కీలకమైనదని తెలుగు సాహిత్యకారుల అభిప్రాయం. సభా పర్వం లేనిదే మహాభారతం కథ లేదని అభిప్రాయం తెలియజేసినవారు లేక పోలేదు.

ఆంధ్ర మహాభారత రచన చేయడం ప్రాంభించిన నన్నయ ఒక మంగళ శ్లోకంతో ప్రారంభించాడు.

శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాజేష యే లోకానం స్థితి మావహస్త్య విహతాం స్త్రీపుంస యోగోద్భవా అనేన మంగళ శ్లోకంలో త్రిమూర్తులను కీర్తిస్తూ రచన ప్రారంభించాడు.

నన్నయ రచనా విధానం గురించి ఆయనే ఒక పద్యంలో విపులంగా, సవివరంగా వివరించడం జరిగింది.

**సారమదీం గవీంద్రులు ప్రసన్న కథా కలి(ని) తొర్ధయుక్తిలో**
**నారసి మేలునానితరులక్షర రమ్యతనాదరింప నా**
**నారుచిరార్థసూక్తినిధి నన్నయ బట్టు తెనుంగునన మహా**
**భారత సంహితరచన బందురదయ్యే జగద్ధితంబుగన్**

ఈ పద్యంలో నన్నయ తన కవితా లక్షణాలు పేర్కొన్నారు. (1) ప్రసన్న కథ కలితార్థయుక్తి (2) అక్షర రమ్మత (3) నానారుచిరార్ధ సూక్తినిధి, పై రెండు లక్షణాలను వివరించడం చేయని కారణం నా పత్ర సమర్పణ అంశం నన్నయ సూక్తులను వివరించడం నేటి కాలంలో వాటి ప్రయోగం ఏవిధంగా ఉందో తెలపడం నా ప్రధాన కర్తవ్యం.

నానారుచిరార్ధ సూక్తి నిధిత్యం అంటే నన్నయ గారి సూక్తులు నానా విధాలైన అర్ధాలను ఇస్తూ వివిధ ప్రయోజనాలను ఏర్పరుస్తాయి. వీరి రచనలో చాలా వరకు మన అనుభవంలోకి వచ్చే సూక్తులే ఉండటం గమనార్హం. వీరి సూక్తుల కారణంగా వీరు కలకాలం ప్రజల జీవన విధానంలో ఇమిడిపోయారని చెప్పవచ్చు. సూక్తి అంటే సాధారణంగా సుభాషితం అనే అర్ధం కూడా ఉంది. శుభప్రదమైన పలుకులను సుభాషితం అనవచ్చు. ఇవి రకరకాలుగా ఉంటాయి. లోకరీతిని వివరించేవి, నీతి మార్గాన్ని బోధించేవి, రాజనీతిని అందించేవి, ఆధ్యాత్మిక ప్రభోదాలను అందించేవి, లోకనీతిని ప్రదర్శించేవి ఉంటాయి.

నన్నయ రచనలలో ఇవి కలిసికట్టుగా కనిపిస్తాయి.

సూక్తి అంటే రుచిరమైన చమత్కారయుక్తమైన కూర్పు అని అర్ధం చెప్పారు. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు ఇలాంటి చమత్కారాలు అనేక విధాలుగా ప్రయోగించవచ్చు. పదాల రూపంలోను, పదబందాల రూపంలోనూ వాక్య రూపంలోను చూపించవచ్చు నానరుచిరార్ధ సూక్తి నిధి అనే విశ్లేషణ మొదటిసారిగా ఉపయోగించింది నన్నయ మాత్రమే.

నన్నయ భారతంలో అన్ని పర్వాలలో (2 1/2) పర్వాలలో అనేక సూక్తులు ప్రయోగించినప్పటికీ వీటిని అధ్యయనం చేయడం అసాధ్యమైన పని కావున ఒక పర్వంలో అందునా మహాభారతానికి కీలకమైన పర్వం అయిన సభా పర్వం నుండి కొన్ని సూక్తులను తీసుకొని వాటిని నేటి కాలానికి ఎలా ఆవర్తింపచేయవచ్చో వివరించే ప్రయత్నం చేశాను.

ముందుగా సభా పర్వంలోని 1 వ ఆశ్వాసంలో ఉన్న 51 వ పద్యంలో చెప్పిన సూక్తిని వివరిస్తాను.

**"వార్తయందు జగము వర్ధిల్లుచున్నది. యదియు లేని నాడు యఖిల జనులు నందకారమ మగ్నులగుదురు గావున వార్త నిర్విహింపవలయు బతికి)"**

ఇక్కడ ప్రయోగించిన సూక్తి "పెద్దల । చరితం బల్పులకు నెఱుగ శక్యమై యెందున్" దీనిలో ప్రధానంగా కనిపించేది పెద్దల చరిత్రను తెలుసుకోవడం సామాన్యులకు సాధ్యమేనా అని ప్రశ్నించడం జరిగింది. ఇలాంటి చమత్కారమే ప్రస్తుతం మన సమాజంలో కూడా ఈ సూక్తి నేటి సమాజానికీ పూర్తిగా వర్తించే విధంగా ఉంది. నేటి కాలంలో చరవాణి లేకుండా జీవితం నడవదు. చరవాణి కాని జీవితం అందుకొరకు ఎందుకంటే దానిలో ప్రధానంగా చూసేది సమాచారమే సుమారు వెయ్యి సం॥రాల క్రితమే నేటి సమాజాన్ని ఊహించినట్లుగా తెలస్తుంది. ఈ సూక్తి నేటి సమాజం లో ప్రజల జీవన విధానానికి సరిపడినట్లు కనిపిస్తూంది. నేటి కాలంలో వార్తను ప్రచారం చేయడానికి కేవలం పత్రికలు మాత్రమే పనిచేయడం కాదు సామాజిక మాధ్యమాలు అనునిత్యం ప్రయత్నిస్తున్నాయి. ఒక వార్తను ఒక్క సెకనులో ప్రంచానికి మొత్తానికి వ్యాపింపచేసే మాధ్యమాలు నేటి కాలంలో ఉన్నాయి. చాలాకాలం క్రితం జీవితంలో కొన్ని వార్తలు ఉండేవి. కానీ నేటి కాలంలో వార్తలే జీవితం అయ్యాయి.

(సభా. 1.51) (తిరుమల తిరుపతి దేవస్థానం కవిత్రయ మహా భారతం –పేజి 1184)

సూక్తి "వృద్ధుల బుద్ధులు సంచలింపవే" ఇప్పటికి కూడా మన సమాజంలో గమనిస్తే వృద్ధులకు అనేక కోరికలు ఉంటాయి. కానీ ఏ ఒక్క కోరిక మీద స్థిరంగా ఉండరు. అనేక విధాలుగా తమ ఆలోచనా విధానాన్ని మార్చుకుంటూ ఉంటారు. ఏది సరిగ్గా చెప్పరు కదా, ఏమాట వినరు ఇది అందరి విషయంలో జరగక పోవచ్చు కానీ చాలా మంది విషయంలో జరుగుతుంది.

సభాపర్వంలోనే మరో సంధర్భంలో నన్నయ గొప్పవారి చరిత్రను సామాన్యులు అర్థం చేసుకోగలరా అని చమత్కారంగా వుపయోగించారు. అది :

సభా పర్వంలో 2వ ఆశ్వాసంలోని 19వ పద్యంలో

**"పరమార్ధ ప్రతిభ ।దమో। హరు నచ్చుతు భీష్మడితిగినట్లుగగనీ**
**కరిది శిశుపాల! పెద్దల । చరితం బల్పులకు నెమిగశిక్షయె యెందున్?**

నన్నయ కేవలం సూక్తులను పద్యాల రూపంలోనే కాకుండా కొన్న సంధర్భాలలో వ్యంగ్యంగా, హాస్యంగా కూడా ప్రయోగించారు. ఉదాహరణకు

**'కదుకొని ధర్మతత్వమెఱుగంగ నశక్యము ధర్మ భాహ్యుని**
**న్నొడబడ నిష్టుడై కఱపియుత్తములుండగ వాసుదేవుడు**
**న్గడునకు బూజు యిమ్మని విచార విదూరుడు భీష్ముడెంతయున్**
**వెడగుదనంబునం బనిచె వృద్ధులబుద్ధులు సంచలింపవే**

భీష్ముడిని ఆలోచన విధానాన్ని వివరిస్తూ నన్నయ చెప్పిన సూక్తినిధి ఇది ఇందులో ప్రధానంగా ఉంది.

వృద్ధుల స్వభావాన్ని ఒక చిన్న సూక్తి వాక్యంలో నన్నయ వివరించడం ఆయన సూక్తి నిధత్వానికి నిదర్శనం.

అది పెద్ద మహాత్ముల మాటలు సామాన్యులకు అర్థం కావు అని అంటారు. దీనిని బహుశా నన్నయ సూక్తినే ఇలా మలచి ఉంటారని అనుకోవచ్చు. నన్నయ సూక్తులు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రజాజీవితంలో నేటికి వాడుకలో ఉన్నాయి అనడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఈ సూక్తి అని చెప్పవచ్చు.

మరొక సంధర్భంలో మరో సూక్తిని ప్రయోగించాడు నన్నయ్య.

**ఉత్తమ జ్ఞాన వృద్ధునా నుండి నేని బాలుదయ్యును బూజ్యుండు బ్రాహ్మంణుందు**
**క్షత్రియుదు పూజ్యుదమితవిక్రమ సమృద్ధి నుర్విపతులలోనదజకుదైయుండినేని**

ఇది సభా పర్వంలో ద్వితీయాశ్వాసంలో 25 వ పద్యంలో కలదు. దీనని మనం ఒక చిన్న సామెతలో కూడా అర్థం చేసుకోవచ్చు. పిట్టకొంచెం కూత ఘనం అంటే వయస్సు చేత బాలుడిగా ఉండి ఉండవచ్చు కానీ జ్ఞానం గొప్పగా ఉన్నపుడు బ్రాహ్మణుడైనా పూజింపదగిన వాడే అని చెప్పి అమిత పరాక్రమం గల రాజుల్లో అధికుడైతే క్షత్రియుడు కూడా పూజార్హుడు అవుతాడు అని దీనిలోని భావం. ఇలా చాలా ప్రయోగాలు నన్నయ చేశారు.

మరికొన్ని సోదాహరణలు చెప్పవచ్చు.

సభా పర్వంలో ద్వితీయాశ్వాసంలో 48వ పద్యంలో "బూతు వోగడినట్లు వోగడెదు" అని ఇదే ఆశ్వాసంలో 98వ పద్యంలో 'భూపతి సహియింవోపుని సవతుల వృద్ధియు వాత్మహానియున్ 181 వ పద్యంలో 'ఒక్క నక్కనిచ్చి సింహమ్ములవిల్చికోలుందె' ఇలా చాలా ప్రయోగించాడు నన్నయ.

ఆది, సభా, అరణ్య పర్వాలలో విరివిగా సూక్తులు ఉపయోగించారు. నేటి సమాజానికి కూడా ఇవి వర్తింప చేసేలా వెయ్యి సంవత్సరాల క్రితమే రచించి భద్రపరచిన నన్నయ ధన్యులు.క్రీ.శ11వ శతాబ్దంలో ప్రారంభమైన మహాభారత గ్రంధరచన అనేక ఒడిదొడుకుల అనంతరం 14వ శతాబ్దంలో ఎర్రన 1/2 పర్వ రచనతో అంతం అయింది. నన్నయ రచనలో నాటకీయత, సూక్తి నిధిత్వం, అక్షర రమ్యత, ప్రసన్న కధాలితార్ధయుక్తి ఎన్నదగినవి. నా ప్రయత్నంలో ఒక నీటి చుక్క ను మాత్రమే నన్నయ రచనా విధానంలో చూడగలిగాను.

**ఆధారగ్రంథాలు**

1. కృతికర నన్నయ కవిత్రయ విరచిత శ్రమదాంధ్ర మహాభారతము, ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానం, 2013
2. పులిపండా అప్పలస్వామి వ్యావహారికాంధ్ర మహా భారతం, ఆది, సభా పర్వాలు - ముద్రణ ప్రాచీన గ్రంధావళి, రాజమహేంద్రవరం
3. డా॥ సంధ్యా వందనం గోదావరిబాబు, భారతము - రాజనీతివిశేషాలు. ముద్రణ - తిరుమల తిరుపతి దేవస్థానం
4. బ్రహ్మశ్రీ గుత్తికొండ వెంకటేశ్వర శర్మ, పంచమ వేదం, ప్రచురణ-మోహన్ పబ్లికేషన్స్, రాజమండ్రి,2012.

# 52. ఆంధ్రమహాభారతం - గురుశిష్య సంబంధాలు

- బొమ్ము మహాలక్ష్మి, అనంతపురము

**"నారాయణం నమస్కృత్య నరంచైవ నారోత్తమమ్**
**దేవీం సరస్వతిం వ్యాసం తతో జయ ముదిరయేత్"**

(శ్రీమదాంధ్ర మహాభారతము. (15సం.) తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానములు, సంపాదకీయం, పుట-1)

మహా భారతం మన జాతీయ కావ్యం (National Epic) ఈ ఇతిహాసంలో వ్యాస మహర్షి ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలను సాధించడానికి అవసరమయ్యే విజ్ఞానం అంతా చక్కగా అందించారు. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారం ఇందులో సముచితంగా చోటు చేసుకొన్నందువల్ల ఈ గ్రంథం పంచమవేదంగా భారతీయ విజ్ఞాన సర్వస్వంగా ప్రశస్తి పొందింది.

**" యదిహస్తి తదన్యత్ర, యన్నేహస్తి నతత్ క్వచిత్"**

(శ్రీమదాంధ్ర మహాభారతము. (15సం.) తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానములు, సంపాదకీయం, పుట-2)

ఇందులో ఉండేది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడ లేదు. మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ! అన్నారు పెద్దలు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే. ఆ జన్మకు ఒక సార్థకత చేకూర్చేది ఒక ఆచార్యుడు మాత్రమే. ఆచార్యులు నివసించే ప్రదేశాన్ని గురుకులం అని పిలిచేవారు. అందులో ప్రవేశ మార్గములే బహుకష్ట సాధ్యమైనవి. ఎందుకంటే ఒక శిష్యుడు గురువును పలు విధములుగా సంతృప్తి పరచిన తరువాతనే, తనకు ప్రవేశ అర్హత కలిగేది. ఒక్కసారి ప్రవేశించాక గురువును అతి దగ్గరగా చూసి నేర్చుకునే అదృష్టం వారికి కలిగేది. అందువలనే వారు పెరిగి పెద్దయ్యాక ఒక్క చదువులోనేకాదు, సంస్కారములో గుణగణలలో అన్నింటిలోనూ రాణించ్చి. సమాజంలో ఒక బాధ్యతయుతమైన పౌరులుగా మసులుకును భాగ్యం లభించింది. కాలక్రమేణా ఈ విద్యా వ్యవస్థ, పాఠశాల, కళాశాలలు,విశ్వ విద్యాలయలుగా రూపాంతరం చెంది, ఒకప్పటి శ్రద్ధ భక్తులతో విద్యను అభ్యసించు స్థాయి నుండి ఈనాడు చదువు'కొనే ' దౌర్భాగ్యపు స్థితికి చేరుకుంది.

గురువు యొక్క ప్రధాన కర్తవ్యం ఆధ్యాత్మిక సాధకుని పరిణామానికి మార్గ నిర్దేశం చేయడం ద్వారా ఆ విద్య యొక్క, మానసిక మరియు ఆధ్యాత్మిక మార్గాలపై అన్ని రకాల సాధనాలను బోధిస్తుంది మరియు శిష్యుడికి సరైన మార్గాన్ని అనుసరించడానికి సహాయం చేస్తారు, శిష్యుని కర్తవ్యం ఏమిటంటే, గురువును సేవించడం మరియు పాటించడం మరియు గురువు బోధనల నుండి నేర్చుకోవడం అతని జ్ఞానాన్ని పొందడం మరియు ఆత్మశుద్ధి పొందడం.

ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలనుకునే వ్యక్తులకు గురువు అవసరం మరియు సంబంధం సరిగ్గా ఏర్పడడం ముఖ్యం, ధ్యాన మార్గాన్ని అభ్యసించలనుకే వారికి, రాజయోగ గురువు అవసరం, వారు కర్మ, యోగ, మార్గం ద్వారా అధిగమించాలనుకుంటే, జ్ఞాన యోగ సాధకులకు కూడా ఇది వర్తిస్తుంది.

పైలుడు వ్యాసుడి ప్రధాన శిష్యులలో ఒకడు. ఉదంకుడు వేద్యుడి శిష్యుడు. గురుగృహంలో పూజ్యులైన పెద్దలకు సేవలు చేసి అధికమైన భక్తియందు ఆసక్తి కలవాడై గురువుల దయతో అష్టసిద్ధులు నేర్చుకున్నాడు.

## పౌష్యుడు - ఉదంకుడుల గురుభక్తి

మహాభారతంలో మనకు కనిపించే గురుశిష్య సంబంధాల్లో పౌష్యుడు- ఉదంకులది చాలా అన్యోన్యమైన గురుభక్తి. గురువుగారి మాటకోసం రాజు వద్దకు వెళ్ళి మరీ ధైర్యంగా గురువుకార్యనిమిత్తుడై తాను వచ్చిన విషయాన్ని ధైర్యంగా చెబుతాడు.

**ఏను గుర్వర్థ మర్థి నై మానవేశ!**
**కడఁగి వచ్చితి నిపుడు నీకడకు వేడ్క**
**దండితారాతి! నీ దేవికుండలమ్ము**
**లిమ్ము నా పూన్కి యిదిసఫలమ్ము గాఁగ**

**(శ్రీమదాంధ్ర మహాభారతం- ఆదిపర్వం, ఆశ్వాసం-1 :94వచనం)**

ఓ రాజా! నేను గురువుగారిప్రయోజనంకొరకు యాచకుడ నై పూని ఇపుడు సంతోషంతో నీచెంతకు వచ్చాను. శిక్షింపబడిన శత్రువులు కల ఓ రాజా! నా ఈ కోరిక (ప్రయత్నం) సిద్ధించేటట్లుగా నీ రాణి ధరించే కర్ణాభరణాలు నాకు ఇమ్ము అని అడగగలగడం సామాన్యులకు సాధ్యమయ్యే పని కాదు. కానీ తాను మాత్రం ఎంతో ధైర్యంగా గురువుగారి మాటలమీద అచంచలమైన విశ్వాసంతో ఆ మాటలను మాట్లాడి, అవి తెచ్చే క్రమంగా శపానికి సైతం గురవుతాడు.

**యావృషభగోమయ భక్షణానంతరంబున నాచ మింపమీనైన నా యశుచిభావంబునగా కేమి యప్పరమ పతివ్రత మదియ దృష్టి గోచర గా కున్నదయ్యే (శ్రీమదాంధ్ర మహాభారతం- ఆదిపర్వం, ఆశ్వాసం-1 :97వచనం)**

పౌష్యుడు పలికినట్లుగా విని ఉదంకుడు ఆలోచించి, దివ్య పురుషుడు చెప్పినట్లు ఎద్దుపేట తినిన తరువాత పరిశుద్ధికై ఆచమనం చేయక పోవడం చేత కలిగిన అపవిత్ర తచేకాక మరే కారణాన ఆ మహా పతివ్రత జలాలతో కడుగబడిన చేతులు, పాదాలు, ముఖం కలవాడై ఆచమనంచేసి, పౌష్యమహారాజు అనుమతితో అతడి దేవేరి చెంతకు పోగా, ఆ దేవి మహాముని అయిన ఉదంకుడికి నమస్కారం చేసి తన కర్ణాభరణాలు ఇచ్చింది.

ఇందులో ఉదంకుడు గురువు గారి కోరిక కొరకు ఎం చేయడానికైనా సిద్ధపడి కర్ణాభరణాలు సాధించాడు. ఒక శిష్యుడు గురువు గారు అప్పగించిన పనిని ఎన్ని ఆటంకాలు వచ్చినా, తనవల్ల కాకపోయిన గురువుగారి కోసం చేశారు.ఇటువంటి నిష్టత ఆధునికలో జీవిస్తున్న శిష్యులకు లేదు. టీచర్ హోమ్ వర్క్ ఇస్తేనే చెయ్యలేని పిల్లలని మనం నిత్యం చూస్తుంటాం ఉదంకుడి పాత్రను ఆధారంగా చేసుకుని నేటితరపు పిల్లలు భక్తి శ్రద్ధలను అనుసరించవచ్చు. కార్య నిర్వాహణ చెయ్యడానికి పూనుకోవచ్చు.

నేటికీ నాల్గవ రోజున కుండలాలను వేగంగా తీసుకొని రమ్మని గురువు గారి భార్య పట్టుదలతో నన్ను పంపింది. ఆ కుండలాలు ధరించే దినం ఈనాడే. ఈరోజు దాటకుండా నేను అక్కడికి పోవటం ఏ విధంగా సమకూరుతుంది? ఈ నాగలోకం నుండి ఎట్ల బయటికి వెళ్ళవచ్చు! నేను వెళ్లకపోతే నేను చేసిన ఈ మహాప్రయత్నమంతా నిష్ప్రయోజనం అవుతుంది. అని మిక్కిలి విచారంతో కలతనొంది యున్న ఉదంకుడి భావం తెలుసుకొని తూరగారుఢుడైనా దివ్య పురుషుడు ఇట్లా పలికాడు" నీవు ఈ గుర్రం ఎక్కి వెళ్ళుము. ఇది మనసు కంటే, గాలి కంటే వేగం కలిగినది.

ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆ సమస్యకు పరిష్కార మార్గాన్ని ఆలోచించి సమస్యను పరిష్కరించుకునే దృష్టి కోణంలో ఉదంకుడు ఆలోచించకుండా కంగారు పడిపోయాడు, విచారణ చెందాడు. ఉదంకుడు చేసినట్లే నేటితరం పిల్లలు కూడా పరీక్షల్లో విఫలం అయ్యారని ఆత్మహత్యలు లాంటివి చేసుకుంటున్నారు. అక్కడ ఉదంకుడు పరిష్కార మార్గాన్ని గుర్తించి తన మనస్సుతో గమ్యాన్ని చేరుకున్నాడు. సమస్యల్లో పరిష్కారాన్ని వెతకడం శిష్యులకు ఉండవలసిన ప్రధాన లక్షణం. చిన్న చిన్న సమస్యలకు అతిగా ఆలోచించి విచారణ చెంది కళతలకు గురవుతున్నా నేటి తరానికి ఉదంగుని కథ ఎంతగానో ప్రభావితం చేయగలదు. ఈ విధంగా ఉదంకుడు గురువు మాట కోసం తక్షకుడితో యుద్ధం చేసి కుండలాలను దక్కించుకొని గురువుగారి భార్యకు ఇచ్చి మాట నిలుపుకున్నాడు.

**ద్రోణుడు – ఏకలవ్యుల సంబంధం**

**"వినయమున ద్రోణురూపు మన్నున సమర్చి**
**దాని కతిభక్తి తోడ బ్రదక్షిణంబు**
**జేసి మ్రొక్కుచు సంతాతభ్యాస శక్తి**
**నస్త్ర విద్యారహస్యంబు లర్థి బడసె"**

**(శ్రీమదాంధ్ర మహాభారతం– ఆదిపర్వం, ఆశ్వాసం–5, 232 పద్యం)**

ద్రోణుడు ఏకలవ్యుడికి శిక్షణ ఇవ్వకపోయేసరికి ఏకలవ్యుడు వినయంతో ద్రోణుని బొమ్మను మట్టితో చేసి నిలిపి, దానికి భక్తితో ప్రదక్షిణ నమస్కారాలు చేస్తూ, ఎడతెగని సాధనం బలం చేత తానే విలువిద్య రహస్యాలని గ్రహించాడు. ఇది ఏకలవ్యుని ముఖ్యమైన స్థిర భక్తికి అద్దం పట్టే పద్యం. గురు ముఖతా నేర్చుకున్న విద్య అంటే గురువుకు దూరంగా ఉన్నా, భక్తితో అదికమైన విద్యను సాధించవచ్చునని, విద్యా ప్రాప్తికి గురువు సాహిత్యం కంటే గురుభక్తియే ముఖ్యమని ఈ పద్యం బోధిస్తుంది. గురు భక్తికి మించిన శక్తి లేదని తెలుస్తుంది.

ఈ పాత్రల ఆధారంగా అప్పటి గురువులు రాజపుత్రులకే విద్య బోధనలు చేసేవారు. కానీ ఏకలవ్యుడు లాంటి శిష్యులు దూరం నుండి విద్యను నేర్చుకుంటున్నారు. ఆధునికంలో గమనిస్తే విద్య నేర్పించడంలో తేడాలు లేకపోవడం సంతోషకరం. అయినా నేటి తరపు విద్యార్థులకు ఏకలవ్యుడు అంతటి భక్తిశ్రద్ధలు లేవని చెప్పవచ్చు. ద్రోణుని వంటి గురువులు కూడా ఆధునికంలో ఉన్నారని గమనించవచ్చు. గురు శిష్యులు అనేవారు ఒక అనుబంధంలో సత్యతను కలిగి ఉండాలి. గురువుగా ఒక స్థానంలో ఉన్నప్పుడు అందరి విద్యార్థులకు సమానమైన బోధన, శ్రద్ధ చూపించాలి. చదివే పిల్లలకు ఎక్కువ ప్రోత్సహిం,చి కొంచెం వెనుకబడిన పిల్లలను అశ్రద్ధ చేయకూడదు. వాళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంలో తప్పులేదు, '**Feavoreitesm**' చూపించకూడదు. నేడు అధికంగా ఇలా అనేక ప్రదేశాలలో జరుగుతుంది.

అలాగే ఏకలవ్యుని వంటి శిష్యులు ఉన్నారని అనుకోవడం కూడా ఆలోచించాల్సిన విషయము. ఎందుకంటే గురువు చెప్పే పాఠాలు విని ఆచరించేవారు కొందరు ఉంటే, కొన్ని కారణాలవల్ల పాఠాలను వినడానికి రాని పిల్లలు కూడా ఉన్నారు. అటువంటి విద్యార్థులు కూడా సమాజంలో గొప్ప స్థానాలను చేరుకున్నారు. ఏకలవ్యుని నుంచి నేటి విద్యార్థులు నేర్చుకోవాల్సింది పట్టుదల, శ్రద్ధ, విద్య పైన ఇష్టం వీటిని అనుసరిస్తే నేటి ఆధునిక తరపు విద్యార్థులు గురువులకు గౌరవాన్ని తెచ్చిపెట్టే ఫలితాన్ని గురుదక్షిణగా ఇవ్వగలుగుతారు.

**"ఇది దేహం బిది యర్థం**
**విధినా పాలిజన సమూహ మిన్నింటిలోనె**
**య్యది మీకు ఇష్టము దానిన**
**ముదవగా నిత్తు గొను దమోఘం' బనినన్"**

**(శ్రీమదాంధ్ర మహాభారతం– ఆదిపర్వం, ఆశ్వాసం–5, 242 పద్యం)**

ఇది నా దేహం, ఇది నా ధనం, ఇది నా సేవక సమూహం. వీటిలో మీకు ఏది ఇష్టమో దానిని తప్పకుండా, సంతోషంగా ఇస్తాను తీసుకోనండి. దీనికి తిరుగులేదు అని, అంతటి వరకు తానే వచ్చి గురుదక్షిణ కోరడమే కొండంత భాగ్యంగా భావించి ఉన్నదంతా ఆయన ముందుంచిన ఏకలవ్యుని ఉన్నతోన్నత గురుభక్తికి, అతని మాటలలో సమర్పణ భావంతోడి ముగ్ధ భక్తి మూర్తి కట్టింది.

**"నెమ్మిని నీ దక్షిణహ**
**స్తమ్మున పెనుప్రేలు దునిమి దక్షిణ యి; మ్మి**
**ష్టమ్మిది నా 'కనపుడు విన**
**యమ్మున వా డిచ్చె దాని నాచార్యునకున్"**

**(శ్రీమదాంధ్ర మహాభారతం- ఆదిపర్వం, ఆశ్వాసం-5, 243 పద్యం)**

నీ కుడి చేతి బ్రొటనవేలిని కోసి ప్రీతితో నాకు మురుదక్షిణగా ఇవ్వు అది నాకిష్టమని ద్రోణుడు అనగానే ఏకలవ్యుడు వినయంతో దానిని ఆచార్యునికి సమర్పించాడు.

ద్రోణుడు ఏకలవ్యుడిని గురుదక్షిణము అడగగా మీకు ఏం కావాలి అని ఏకలవ్యుడు తన సర్వస్వం మీరేనని సమాధానమిచ్చాడు ద్రోణుడు ఏకలవ్యుడిని గురుదక్షిణగా తన బొటనవేలు అని అడగగా మారు మాట్లాడకుండా బ్రొటనవేలిని కోసి ఇస్తాడు. ఇక్కడ గురువుపై ఉన్న భక్తి గౌరవములు తేటతెల్లమవుతున్నాయి ఇటువంటి శిష్యుడిని ఎవరు చూసి ఉండరేమో బహుశా నేర్చుకునే వారి గురుదక్షిణ ఇవ్వమంటే వస్తారు కానీ తన శరీరం తన సర్వస్వంత అని చెప్పే గొప్ప శిష్యుడు అతనికి గురువు పైన అంతటి గౌరవం ఉంది. ఆధునికత విద్యార్థులు దీని నుంచి గురుశిష్య సంబంధం తెలుసుకోవచ్చు అయినా గురుదక్షిణను ఇచ్చాడు. నేటి విద్యార్థులు గురువు తరగతిలో గంటలు గంటలు పాఠాలు బోధించినా అవి వినడం కాదు కదా తరగతిలో గురువుగారికి కనీస గౌరవం కూడా ఇవ్వరు. తండ్రిలాగా, దైవంలాగా గురువును అనుకున్నాడు కాబట్టే ఏకలవ్యుడు ఎంతో సంస్కార వంతంగా తన గురువుకు గురుదక్షిణ చెల్లించాడు. విద్య వలన విద్యార్థికి సంస్కారం అనేది తెలుస్తుంది. నేటి పిల్లలలో అది లోపించడాన్ని మనం నిత్యం గమనిస్తూనే ఉన్నాము. గురువుగారు కనిపిస్తే కనీస మర్యాద లేకుండా కూర్చునే ఉంటారు. కనీసం నమస్కారాలు చెప్పి గౌరవంచడం కూడా చేయలేకున్నాం. ఈ పరిస్థితి మారాలి. గురువును గౌరవించే సంప్రదాయం విద్యపట్ల మనం చూపే వినయానికి ప్రతీకగా ఉండాలి. అందుకే మన పూర్వీకులు

**మాతృదేవోభవ - నువ్వు తల్లిని దేవతగా భావించేవాడివి కావాలి.**
**పితృదేవోభవ - నువ్వు తండ్రిని దైవంగా భావించేవాడివి కావాలి.**
**ఆచార్యదేవోభవ - నువ్వు గురువును దైవంగా భావించేవాడివి కావాలి.**

అని మనకు బోధించారు.

తల్లి భూదేవి, తండ్రి ప్రజాపతి, గురువు పరబ్రహ్మ స్వరూపుడు. అన్ని వర్ణాల వారికి ఇది వర్తిస్తుంది. వీళ్ళు ముగ్గురు మూడు లోకాలు. గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాసాశ్రమాలు వీరే! మూడు వేదములు వీరే ! మూడు అగ్నులు వీరే! వీరిలో తల్లి దక్షిణాగ్ని, తండ్రి గార్హపత్యగ్ని, ఆచార్యుడు ఆహవనయాగ్ని.

మాతృభక్తి ఉంటే భూలోకం, తండ్రి భక్తి ఉంటే అంతరిక్షం, గురుభక్తి ఉంటే బ్రహ్మ లోకం ప్రాప్తిస్తాయి. వందమంది ఉపాధ్యాయుల కన్నా ఒక ఆచార్యుడు, వందమంది ఆచార్యుల కన్నా జన్మనిచ్చిన తండ్రి, వందమంది తండ్రుల కన్నా జన్మనిచ్చిన తల్లి ఎంతో గొప్పవారు. అలాగే ఉపనయనం చేసి బ్రహ్మోపదేశాన్ని చేసే ఆచార్యుడు తండ్రి కన్నా గొప్పవాడు.

**"గూ శబ్దస్త్వంధకార స్స్యాత్ రు శబ్దస్తన్ని రోధకః,**
**అంధకార నిరోధిత్వాత్ గురు రిత్యభిధీయతే"**

**(సనాతన ధర్మం, పుట 43)**

'గు' అంటే చీకటి, 'రు' అంటే నాశనం చేసేది, అజ్ఞానం అనే చీకటిని నాశనం చేసేవారు గురువు.

**"గురురేవ పరం బ్రహ్మ గురు రేవ పరాగతి:,**
**గురురేవ పరా విద్యా గురు రేవ పరాయణం"**

**(సనాతన ధర్మం, పుట 43)**

గురువు కరుణ ఉంటే కోరికల్ని జయించడం తృణప్రాయం. లేకపోతే అసాధ్యం. అందువల్ల శిష్యుడి ప్రథమ కర్తవ్యం గురువు అనుగ్రహాన్ని పొందడం. లోకంలో గురువులు మూడు రకాలు 1.చోదకుడు – మార్గాన్ని చూపి నడిపించేవాడు. 2.బోధకు – తగిన విద్యను బోధించేవాడు. 3.మోక్షాదుడు – మోక్షాన్ని సాధించే మార్గాన్ని చూపేవాడు. గురువు వచ్చినప్పుడు లేచి నిలబడి పాదాభివందనం చేయకున్నా, కనీసం నమస్కారం అయినా చేయాలి. శిష్యుడికి గురువు పై విశ్వాసం ఉండాలి, చేసే పని మీద, చదివే శాస్త్రం మీద, చెప్పే గురువు మీద విశ్వాసం లేని వారు శిష్యులు కాలేరు. నేటి ఆధునిక విద్యావ్యవస్థలో విద్యను నేర్చుకుంటున్నప్పటికీ, విలువలను మాత్రం నేర్చుకోవడం లేదు. గురువును గౌరవించాలని, అయితే ఆయన చెప్పిందంతా గుడ్డిగా నమ్మడం, మౌర్ఖంగా అనుకరించమని చెప్పడం ఈ వ్యాసకర్త అభిప్రాయం కాదు. గురువును గౌరవిస్తూ, మానవత, నైతిక విలువలను పెంపొందించుకొని విద్యార్థులు మాత్రమే కాకుండా విలువలున్న మనుషులుగా నేటి ఆధునిక విద్యార్థులు తయారు కావాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**ఆధార గ్రంధాలు**

1. ఆంధ్ర మహాభారతం. 2000. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

2. కవిత్రయం( నన్నయ, తిక్కన, ఎర్రన). 2014. శ్రీమదాంధ్ర మహాభారతము. (15 సంపుటాలు) తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానములు.

3. శేషగిరిరావు, దేవరకొండ (1967) భారత కథలు – అంతరార్థము – శ్రీపతి ప్రెస్, కాకినాడ.

4. రామకృష్ణమాచార్య, నండూరి (2005), కవిత్రయము – సాహిత్యపీఠం, సికింద్రాబాదు

5. శ్రీరామచంద్రుడు, పుల్లెల (2012), మహాభారత సార సంగ్రహము, శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాదు.

6. ఆచార్య లక్ష్మీ రంజనం ఖండవల్లి & ఆచార్య వేంకటావధాని, దివాకర్ల (1972) ఆంధ్ర మహాభరతం సంశోధిత ముద్రణము( కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు), భారత ప్రభుత్వము & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ముద్రణ.

# 53. ఆంధ్ర మహాభారతం కుటుంబ -వ్యవస్థ ఆధునిక జీవనం

- కొమరం అనిత, అనంతపురము

ఆంధ్రజాతి తరతరాల వారసత్వం శ్రీమదాంధ్రమహాభారతం. "శ్రీ వాణిగిరిజాశ్చిరామ" అని నన్నయ్య భట్టు ఏ సుముహూర్తన శ్రీకారం చుట్టాడోగాని, ఎన్నో వేల సంవత్సరాలు దాటిపోయిన కానీ ఆదికావ్యం మానవ ధైనందిన జీవితంలో అది భాగమైపోయింది. మహాభారత కథసన్నివేశాలు, సంఘటనలు, పాత్రలు నిత్యజీవితంలో మన కళ్ళ ముందు కనబడే సజీవచిత్రాలు.

వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ధర్మశాస్త్రాలు, వివిధ పురాణాలు మన సనాతన ధర్మానికి, సంస్కృతి సంప్రదాయాలకు, జీవనవిధానానికి, జీవిత పరమార్ధానికి పునాదులే అయినా అవి, ఎంతమందికి అందాయి ? అవి ఎంతమందికి అర్ధమయ్యాయి ? అవి, ఎంతమందిని ప్రభావితం చేసాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకడం చాలా కష్టం. అయితే భారతీయజన సామాన్యాన్ని ప్రభావితం చేయడంలో రామాయణ, భారత, భాగవతాల పాత్రను మనం ఎన్నటికీ కాదనలేము.

ధగధగ మేరిసే కాంక్రీటు భవనాల నుండి పూరి గుడిసెలలో సైతం వ్రేలాడే రామకృష్ణుల చిత్రపటాలు భారతీయుల గుండెల్లో గుడికట్టుకొన్న ఆ మహాపురుషుల దివ్యరూపాలు. భారతీయుల పెదవుల మీద నిత్యం స్మరించే ఆ అవతారపురుషుల పవిత్ర నామాలు, రామాయణ భారతకథలు భారతీయులని ఎంతగానో ప్రభావితం చేసాయి. రామాయణం త్రేతయుగ రాకుమారుని చరిత్ర. ధర్మ స్వరూపుడైన ఒక మానవుని కథ. ఆదర్శపురుషుని కథ. ఆదర్శ ప్రభువు కథ. మహాభారతం ద్వాపరయుగరాజవంశ చరిత్ర - కురువంశ చరిత్ర అంతే కాదు, ఆనాటి రాజకీయ, సాంఘిక, సంస్కృతిక, చరిత్ర అన్నింటినీ మించి - మానవ స్వభావానికి, మానవ జీవితానికి అద్దంపట్టే కథ.

## భారతీయకుటుంబవ్యవస్థ - మహాభారతంలో కుటుంబ వ్యవస్థ

ప్రపంచంలో సకలచలచర జీవకోటిలో ఉన్నతమైనది మాట్లాడగలిగేది తమ భావాలను ఎదుటివారితో పంచుకోగలిగేది ఆలోచన మరియు విచక్షణ జ్ఞానం కలిగినది మానవజాతి ఒక్కటే. మానవుడు నేల మిద పుట్టింది మొదలు అతడు సాధించిన నాగరికతలో ఒక మహోన్నత శిఖరం అతని కుటుంబవ్యవస్థ. ఈ కుటుంబవ్యవస్థే లేకుంటే అతనిది జంతుజీవితమేకదా. మానవజీవితాన్ని క్రమబద్ధం చేయడంలో, తమ భావాలను ఇతర వ్యక్తులతో పంచుకోవడం, మనిషితో మనిషి కలిసి జీవించే సహజీవన సంస్కృతిని నేర్పించింది అతని కుటుంబ వ్యవస్థే. మానవ జీవితానికి ఒక అర్ధాన్ని, పరమార్ధాన్ని ఏర్పరచింది.

భారతీయ కుటుంబ వ్యవస్థకు యావత్ప్రపంచంలో ఒక విశిష్టత ఉంది. ఒక పవిత్రత, పారమార్ధికత ఉంది. "మహాభారత కుటుంబ వ్యవస్థ స్థూలంగా భారతీయ కుటుంబ వ్యవస్థే. ఇది మానవ జీవితంలో అర్ధకామాల అనుభవానికి సంబంధించిన భాగం . చతుర్విధాశ్రమాల్లో గృహస్థాశ్రమానికి సంబంధించిన భాగం.

## కుటుంబ వ్యవస్థ - వివాహవ్యవస్థ

భారతీయకుటుంబ వ్యవస్థకు పునాది వివాహవ్యవస్థ. భారతీయ కుటుంబ వ్యవస్థకే కాదు, ఏ జాతి కుటుంబ వ్యవస్థ కైనా పునాది వివాహ వ్యవస్తే. వివాహ వ్యవస్థకు పునాది స్త్రీ పురుష ఆకర్షణ. ఇది సమాజంలో తరువాత తరువాత ఏర్పడిన జాతి, మత, కుల, స్థాయీ భేదాలకు - ఒక్కోసారి వయోబేధాలకు కూడా అతీతమైనది. ఈ ఆకర్షణ ఎంత బలీయమైనదో మనం మహాభారతంలో వ్యాసమహాముని జన్మ సందర్భంలో చూడవచ్చు, వసిష్ఠ పౌత్రుడు, శక్తి పుత్రుడు,

ఎంతో తపశక్తి కలిగిన మహర్షి అయిన పరాశర మహర్షి ఎక్కడ? ఒక జాలరి దాసికన్య ఎక్కడ? ఆమె యొక్క సౌందర్యనికి పడవనడిపే ఆమె వయ్యారానికి ఆ మహర్షి మనస్సునే చలింపచేశాయి. ఆమెపట్ల అతడు ఆకర్షితుడయ్యాడు.

ఈ స్త్రీ పురుష ఆకర్షణకు నాగరికము, సంస్కార సంపన్నము అయిన వ్యవస్థీకృత రూపమే వివాహవ్యవస్థ భార్యాభర్తల సంబంధం దాంపత్య ధర్మం. కుటుంబ వ్యవస్థకు, సహజీవన సంస్కృతికి దాని ప్రగతికి దాంపత్యధర్మమే బలమైన పునాది. అందుకే భారతీయ సంస్కృతి అతి ప్రాచీన కాలంలోనే దాంపత్యధర్మానికి అంత ప్రాధాన్యమిచ్చింది అంత పవిత్రతను సమకూర్చింది.

భారతీయ సంస్కృతి దాంపత్యాన్ని ఇద్దరు స్త్రీ పురుష వైవాహిక శృంగార జీవిత వ్యవహారంగా భావించలేదు. ఒక బాధ్యతాగల జీవన విధానంగా భావించింది. భార్యాభర్తలు కుటుంబానికి వేరు-వృక్షంలాంటి వారు వేరు దృఢంగా ఉంటేనే వృక్షం అనేది నిలబడగలదు. అలాగే భార్యాభర్తలు ఇద్దరూ కూడా ఎప్పుడు అన్యోన్యంగా కలిసి ఉంటేనే ఆ బంధం నిలబలగలదు అప్పుడే ఆ కుటుంబ వ్యవస్థ బాగుంటుంది.

భార్యాభర్తల అనుబందానికి చక్కటి నిదర్శనం నలదమయంతిల వృత్తాంతం. నలుడు ఎంతో పరాక్రమంతుడు ఎన్నో రాజ్యాలను ఓడించి తన రాజ్యాన్ని విస్తరించినవాడు. దమయంతిని ఇష్టపడి వివాహం చేసుకుంటాడు. దమయంతి ఎంతో సౌందర్యవతి మంచి శరీరంగలది. నలుడు తనకున్న జూదం వ్యామోహంతో రాజ్యాన్ని, కీర్తిని, అధికారాన్ని, బంధుమిత్రులను, కోల్పోయి భార్యతో సహా కట్టుబట్టలతో రాజ్యాన్ని విడిచి వస్తాడు. క్రూరమైన అడవిలో సంచరిస్తూ ఉండగా దారిలో కొన్ని పక్షుల గుంపు కనిపిస్తుంది. అప్పుడే తన వస్త్రంతో వాటిని పట్టుకొని తినాలని అనుకుంటాడు.

**వ 'నలుండును వానిం జూచి విస్మయం బంది 'యీ యక్షంబుల దోషంబునం గానేమి? నాకిట్టిదయ్యే ననుచుదమయంతి కట్టిన పుట్టంబుచెఱంగు గట్టుకొనియే నట్లిద్దఱు నేక వస్త్రులయి యొండోరుల యొగంబుల సూచి దుఃఖించు చో నలుండు దమయంతి కిట్లనియే.**

**(ఆంధ్రమహాభారతం - అరణ్యపర్వం, ఆశ్వాసం-2, వచనం 69)**

వస్త్రాన్ని తీసి పిట్టలపై వెయ్యగా అవి వస్త్రంతో సహా ఎగిరిపోతు ఇలా అంటాయి. "ఓరాజా నీ సంపద, రాజ్యం మోసగించిన పాచికలం మేము పక్షుల రూపం దరించి మీ ఒంటిమీద వస్త్రాన్ని కూడా అపహరించడానికి వచ్చాం. అపహరించాం అని పక్షులు ఆకాశమార్గానికి ఎగిరిపోతాయి. నలుడు కూడా ఆ పక్షి మాటలు విని ఆశ్చర్యపోయాడు. నా ఈ దు:స్థితి దాపరించటానికి ఈ పాచికల దోషం అలాగే నా చెడు అలవాటే కారణమని విలపిస్తూ దమయంతి కట్టిన వస్త్రంయొక్క చెరుగునే తాను కూడా ధరించాడు. ఇలా ఇద్దరు ఒకే వస్త్రాన్ని ధరిస్తారు. అప్పుడు నలుడు దమయంతితో నీవు మీ పుట్టింటికి వెళ్ళిపో నువ్వైనా సుఖంగా జీవించు అనగా దమయంతి మీరు ఎక్కడ ఉంటే అదే నాకు సుఖం అంటుంది.

ఇలాంటి ఆదర్శ స్త్రీ నుంచి మనం ఎంతో నేర్చుకోవాలి. తను కట్టుకున్న వస్త్రంలో సగ భాగం భర్తకు ఇచ్చి కూడా చిరకాలం భర్తతోనే ఉండాలనుకుంటుంది. కానీ ఈ కాలంలో భార్యలు భర్తకి తోడుగా ఉండాల్సింది పోయి అనేక కారణాలవల్ల విడిపోతున్నారు.

**అధికదుఃఖ:రోగార్తున కౌషధంబు**
**సురుచిరంబుగ భార్యయ చూవె యెందు;**
**నొనర భార్యాసమేతుడై యున్నవాని**
**కెంతలయ్యును నాపద లెఱుకపడవు"**

**(ఆంధ్రమహాభారతం - అరణ్యపర్వం, ఆశ్వాసం-2, పద్యం 74)**

అని చెప్పడం ద్వారా దాంపత్య ధర్మానికున్న విలువ ఏమిటో అర్థమవుతుంది.

మహాభారతంలో దుష్యంతుని ఆస్థానంలో శకుంతల ప్రసంగం "దాంపత్య జీవన మాధుర్యాన్ని దూరం చేసుకునే దౌర్భాగ్యులందరికీ అద్భుత సందేశం". నేటి కాలంలో ఆడపిల్లలు చేస్తున్న తప్పు ఇదే తల్లిదండ్రులకు చెప్పకుండా ప్రేమ వివాహాలు చేసుకుంటారు. తమ జీవితాలను నాశనం చేసుకుంటారు. శకుంతల కథ ద్వారా ఆడపిల్లలు నేర్చుకోవలసింది ఎవరో తెలియని వ్యక్తులను నమ్మి జీవితాలను నాశనం చేసుకోకూడదు. శకుంతలని కాపాడడానికి తన పతివ్రత్యం మూలంగా ఆకాశవాణి వచ్చింది. కానీ నేటి ఆడపిల్లలను ఎవరు కాపాడుతున్నారు. తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని ఇవ్వాలి తమ అనుమతితో వివాహం చేసుకోవాలి.

భారతీయ సంస్కృతి దాంపత్యజీవితానికి ఏపత్నీవ్రత పాతివ్రత్యాలను ముఖ్య ధర్మాలుగా నిర్దేశించినా కాలం. మారుతున్న కొద్ది పురుషాధిపత్య సమాజంలో అనేక కారణాలవల్ల బహు భార్యత్వం వచ్చింది. మారుతున్న సమాజంలో వివాహేతర సంబంధాలు కూడా ఎక్కువయ్యాయి. ప్రాచీన కాలంలో భారతీయ వివాహ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కానీ కాలక్రమేన పాశ్చాత్యుల సంప్రదాయాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పూర్తిగా మార్చి వేశాయి.

**కుటుంబ వ్యవస్థ – సంతానము**

భారతీయ సంస్కృతిలో కుటుంబవ్యవస్థకు పునాది అయిన వివాహ వ్యవస్థ కేవలం స్త్రీ పురుషుల ధర్మబద్ధ కామానుభావానికి కాదు – ప్రయోజనాకరమైన సంతానోత్పత్తికి – వంశవృద్ధికి. కుటుంబ వ్యవస్థలో భార్యాభర్త, సంతానము, సత్యం ఈ నాలుగు కూడా ఎంతో ముఖ్యం ఒకరిపై ఒకరు ప్రేమ అప్యయతలతో ఉండాలి పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలి.

పిల్లలు తల్లిదండ్రుల పట్ల గౌరవం, అంకిత భావాన్ని కలిగి ఉండాలి. చిన్నప్పుడు మనల్ని ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ పెంచి పెద్ద చేస్తారు అమ్మానాన్నలు. మనం పెద్దయ్యేసరికి వాళ్ళు ముసలి వాళ్ళు అవుతారు. క్రమంగా వారి పనులు వారు చేసుకోనంతగా బలహీనమైపోతారు. అలాంటప్పుడు వాళ్ళని కనిపెట్టుకొని ఉండటం వాళ్ళ ఇష్టాలను గౌరవించడం వాళ్ళని కంటికి రెప్పలా చూసుకోవడం మన బాధ్యత అదే ధర్మం.

కాని నేటి కాలంలో పిల్లలు తమ తల్లిదండ్రులని కనీసం పట్టించుకోవడం లేదు సరికదా, వారిని వృద్ధాశ్రమాలలో వదిలిపెట్టడం వారికి తిండి పెట్టడం కూడా వ్యర్థంగా భావిస్తున్నారు. తమ తల్లిదండ్రులని ఒంటరిగా వదిలేసి, డబ్బుపట్ల వ్యామోహంతో ఇతర దేశాలకు వలస వెళ్లిపోతున్నారు. తమ తల్లిదండ్రులు కనీసం బ్రతికి ఉన్నారా అని కూడా తిరిగి చూడటం లేదు. పిల్లల కోసం తమ ఇష్టాలను చంపుకొని తమ పిల్లలే లోకంగా బ్రతికిన తల్లిదండ్రుల కోసం పిల్లలు ఏం చేస్తున్నారు?

మహాభారతంలో మాతృ–పితృ సేవలో మహనీయుడైన మాంస వ్యాపారి ధర్మవ్యాధుడైతే , మాతృ పితృసేవను విస్మరించి ధర్మవ్యాధుని ముందు తలదించుకొన్న తపస్వీ కౌశికుడు. భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రేమాభిమానాలతో పిల్లల్ని పెంచి పెద్ద చేయటం తల్లిదండ్రుల బాధ్యత. అలాగే తల్లిదండ్రులను సేవించటం సంతాన ధర్మం. కానీ ఈనాడు తల్లిదండ్రులు, పిల్లల పెంపక బాధితులను ఇతరులకు అప్పగిస్తే పిల్లలు తల్లిదండ్రుల సేవా బాధ్యతలను వృద్ధాశ్రమాలకు అప్పగిస్తున్నారు. మహాభారతంలో తండ్రి యాయాతి కొరకు తనయవ్వనాన్ని ధారపోసిన తనయుడు పూరురుడైతే, తండ్రి శాంతనుడి కొరకు తన గృహస్థాశ్రమాన్ని, రాజ్యాధికారాన్ని, అంటే అర్థకామాలు రెండింటినీ – త్యాగం చేసి, యావజ్జీవ బ్రహ్మచారిగా నిలిచి, తన శక్తి సామర్థ్యాలనన్నింటిని చివరి వరకు కుటుంబం కొరకు ధారవోసిన అద్వితీయ పితృ భక్తుడు భీష్ముడు.

**ధృతిబ్రూని బ్రహ్మచర్య**
**వ్రతమున్నతి దాల్చి తిని – ధ్రువంబుగననప**
**తృత యైనను లోకములా**
**యతి బెక్కులు గలవు నాకు ననుభావ్యములై (అరణ్యపర్వం, ఆశ్వాసం–4, పద్యం 190)**

తండ్రి కోసం నిజరాజ్య పరిత్యాగం బ్రహ్మచర్య వ్రత పరిగ్రహం చేశాదు కాబట్టి దేవర్షి గణాలు పుష్పవృష్టి " కురిపించి" భీష్ముడు అని పొగిడారు. కాగా తన మాట వినలేదని పరమ దారుణంగా పుత్రులను శపించిన తల్లి కూడా ఉంది. సవత మీద కోపంతో అధర్మమైన కోరికకోరి, అది తీర్చలేదని కొడుకులను క్రూరంగా శపించిన తల్లి – కద్రువ నాగమాత.

**కుటుంబ వ్యవస్థ – బంధుమిత్రులు**

భారతీయ కుటుంబ వ్యవస్థ మీద బంధుమిత్రుల ప్రభావం ఎంతో ఉంది. భార్య తరపు వారిని ఆత్మబంధువులన్నారు – వీరు ఆస్తుల్లో భాగాలు పంచుకోరు కనుక. తమ కూతురి కాపురం సుఖశాంతులతో సాగాలని కోరుకుంటారు కనుక. భర్త తరపు వారిని దయాదులన్నారు. వీరికి ఆస్తిలో హక్కూ, ఆశా రెండు ఉంటాయి కాబట్టి వీరిని జ్ఞాతులని కూడా అన్నారు. జ్ఞాతి అంటే వేరే నిప్పు అక్కర్లేదు – ఆ కుటుంబాన్ని కాల్చటానికి, బంధించడానికి.

మహాభారతంలో పిల్లనిచ్చిన మామలుగా గాంధారి తండ్రి సుబలుడుగాని, కుంతీ తండ్రి కుంతీ భోజుడుగాని, మాద్రి తండ్రి మాద్రదేశాధీశ్వరుడుగాని, ధృతరాష్ట్ర, పాండురాజుల కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకోలేదు, నిజానికి పాండవులకు జరిగిన అన్యాయ విషయంలో, ద్రౌపదికి జరిగిన అవమాన విషయంలో ద్రుపద ధృష్టద్యుమ్నులు కలుగ చేసుకోవలసిన వారే. అయినా అది వాళ్ళ కుటుంబ వ్యవహారమని సరి పెట్టుకుకొన్నట్లున్నారు. ద్రౌపది మొరపెట్టుకొంది కనుక కృష్ణుడు ఆమెకు అక్షయ వస్త్ర ప్రదానం చేశాడు.

మహాభారతంలో కురుపాండవు కుటుంబ వ్యవహారాల్లో మొదటి నుండి విపరీతంగా జోక్యం పుచ్చుకున్నవాడు, ఇద్దరి మధ్య కక్షలు పెంచినవాడు, కయ్యానికి బీజం వేసినవాడు, ధృతరాష్ట్రుని బావమరిది, కౌరవుల మేనమామ శకుని. శకుని గాంధారి వెంటవచ్చి, హస్తినలోనే ఉండటం వల్లనే కురుపాండవకుటుంబానికి అంత కీడు జరిగింది. గాంధారి ధృతరాష్ట్రులు అతనిని తన దేశానికి తిరిగి పంపి ఉంటే, మహాభారత కథ కురుపాండవ కుటుంబ చరిత్ర మరో విధంగా ఉండేదేమో!.

ఇక మిత్రుల విషయానికి వస్తే... మహాభారతంలో దుర్యోధనుని మిత్రుడు కర్ణుడు – కౌరవపక్ష కార్యనిర్ణేత అయ్యాడు. అలాగే శ్రీకృష్ణుడు కూడా పాండవులకు బంధువుకంటే మిత్రుడుగా కురుపాండవ కుటుంబ వ్యవహారాలను ఎంతో ప్రభావితం చేశాడు. పాండవపక్ష కార్యనిర్ణేత అయ్యాడు.

నేటి కాలంలో కూడా బంధుమిత్రుల ప్రభావం కుటుంబ వ్యవస్థ పై ఎంతో తీవ్రంగా ఉంది. ఉమ్మడి కుటుంబాలుగా ఉన్నవారు చిన్న చిన్న కుటుంబాలుగా విడిపోవడం ప్రత్యేకంగా బంధువుల జోక్యం వల్ల రెండు కుటుంబాలలో కలతలు చెలరేగి అవి క్రమంగా కుటుంబం విడిపోవడానికి దారితీస్తున్నాయి. చిన్న చిన్న విషయాలకు గొడవలు పెట్టుకుని రక్తసంబంధం వారే ఒకరిపై ఒకరు నిందలు మోపుకొని చివరకు న్యాయస్థానాల చుట్టూ తిరగవలసి వస్తుంది.

భారతం నుండి మనం చాలా నేర్చుకోవాలి. శకుని లాంటి వాళ్లను ముక్కలుగా ఉన్నప్పుడే తీసేయ్యాలి అది పెరిగి వృక్షంలా పాతుకు పోతే దాన్ని వేళ్ళతో సహా పెగిలించడం కష్టం అవుతుంది. మన సమస్యలు మనమే కోరి తెచ్చుకున్న వాళ్ళం అవుతాం.

**కుటుంబ వ్యవస్థ - అన్నదమ్ముల అనుబంధం**

భారతీయ కుటుంబవ్యవస్థలో కుటుంబసభ్యుల ఐకమత్యం, కుటుంబ సుఖశాంతులు, కుటుంబ అభ్యున్నతి ఆధారపడి ఉండేది అన్నదమ్ముల అనుబంధాలమీద, ఆత్మీయతలమీద, అంతకంటే ఎక్కువగా తరువాతి తరం వారైనా అన్నదమ్ముల కొడుకుల అనుబంధాలమీద, ఆస్తి విషయంలో,కుటుంబాధిపత్యం విషయంలో భారతీయ సంస్కృతిలోని కుటుంబవ్యవస్థలో తండ్రి తరువాత కుటుంబ ఆధిపత్యం జేష్ఠ పుత్రునిదే. అందుకే "జేష్ఠం పిత సమం" అన్నారు. తండ్రి తరువాత అన్నగారి ఆజ్ఞను కుటుంబంలో తమ్ములందరూ పాటించవలసిందే. అన్నగారిని అనుసరించి నడువవలసిందే. కానీ అన్నదమ్ముల అనుబంధాలల్లో, ఆత్మీయతల్లో తేడావస్తే ఇందులో తేడా వస్తుంది. కుటుంబ ఐకమత్యం దెబ్బతింటుంది. ఉమ్మడి కుటుంబ విచ్ఛిన్నమౌతుంది. ఆస్తుల పంపకాలకు దారితీస్తుంది. ఆస్తి పంపకం జరిగినా పెద్దవాడిదే పెద్ద భాగం. ఇది భారతీయ కుటుంబధర్మం.

ధృతరాష్ట్రపాండు రాజులు ఇద్దరు ఒకే తల్లి పిల్లలు కాకున్నా ఆ అన్నదమ్ముల మధ్య అనుబంధం ఎంతో ఆత్మీయంగానే సాగింది. రాజ్యవారసత్వం జ్యేష్ఠుడైన ధృతరాష్ట్రునిదే అయినా, అంధత్వం వల్ల ఆయన రాజ్యాధిపత్యానికి అనర్హుడయి తమ్ముడు పాండురాజు రాజైనందువల్ల రాజ్య వారస్వత్వం, వారిద్దరి మధ్య వైరానికి దారి తీయలేదు. ధర్మాత్ముడైన పాండురాజు అన్నగారికి ఏ అసంతృప్తి కలగకుండా, అన్ని అన్నగారిని సంప్రదించే చేశాడు. ప్రజారంజకుడైన పాలకుడుగా, రాజ్యాన్ని విస్తరించిన విజేతగా ఖ్యాతి గడించాడు.

కురువంశ కుటుంబంలో ఏర్పడిన సమస్య అంతా ఆ అన్నదమ్ముల కొడుకులైనా కౌరవులు పాండవుల మధ్య. కానీ కౌరవులు వందమంది అయినా ఆ అన్నదమ్ముల మధ్య కలతలు లేవు. అందరు అన్నగారైన దుర్యోధనుని అనుసరించి నడుచుకొన్నవారే. పాండవులైదుగురు ఒకే తల్లి పిల్లలు కాకుంన్నా. సవతుల పిల్లలైనా వారిది ఎంతో ఆత్మీయమైన అనుబంధం. ధర్మరాజుకు తమ్ముళ్లు పంచప్రాణాల్లో నాల్గు ప్రాణాలు. తమ్ములు నలుగురు యక్షుని నిరాకరించి విషజలం తాగి మూర్ఛపోతారు. వారిని చూసి ధర్మరాజు మూర్ఛపోతాడు, చిత్రంలో రూపులాగా నిశ్చే ష్టుడౌతాడు .

> **కని డెందంబున దల్లడం బడర దీర్ఘశ్వాస వైవర్ణ్యముల్**
> **దనుకుం దాల్మి చలింప విస్మయపరీత స్వాంతుండై శోకబా**
> **ష్పనిరుద్ధాకులలోచనుం దగుచు మూర్ఛల్ పైకొనం గొంతసే**
> **పు సరెంద్రోత్తముడండె జిత్రమున రూపుంబోలె దానచ్చటన్.**

**(ఆంధ్రమహాభారతం - అరణ్యపర్వం, ఆశ్వాసం-7, పద్యం 407)**

మా తల్లి కుంతీదేవి మేము అడవులకువెళ్ళినప్పటి నుండి ఎంతో దుఃఖిస్తూ ఉంటుంది . నేను తిరిగి వెళ్తే తమ్ములేరు అంటే నేనేం చెప్పేది? భీష్ముడు వంటి పెద్దలకు క్షేమమేనా అంటే ఏమని చెప్పాలి అని ధర్మరాజు తమ్ముల్ని చూసి కుమిలి పోయాడు. కురువంశరాజ కుటుంబం సమస్య యావద్భారత సమస్యగా మారటానికి, మానవజాతి మరువలేని మహామరణ హోమం జరగటానికి దోహదం చేసింది. ఓడిన వాళ్ళు యుద్ధరంగంలో ఏడిస్తే, గెలిచిన వాళ్ళు ఇంటికి వెళ్లి ఎంతకాలమో ఏడ్చారు. ఇంతకీ ఒక కుటుంబంలో అన్నదమ్ముల మధ్య ఇంత యుద్ధం ఎందుకు జరిగింది ? కేవలం భూమి కొరకు మాత్రమే.

నేటి సమాజంలో కూడా ఇలాంటి కుటుంబం వారే మనకు తారస పడుతుంటారు. కురువంశంవలే నేటి ఆధునిక మానవుడు కూడా ఆస్తికోసం, భూమికోసం, కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఆస్తివ్యామోహంలో తోడబుట్టిన వారిని సైతం హత్యాయత్నానికి పాల్పడుతున్నారు. దీనివల్ల జరిగే అనర్థాలను తెలుసుకోవడానికి మహాభారతం ఒక చక్కని నిదర్శనం.

## మహాభారతంలో కుటుంబ వ్యవస్థ – మానవాళికి సందేశం

మానవుడు భూమి మీదికి వచ్చాడు గాని, ఏ మానవుడూ ఈ భూమిని తాను తేలేదు. భూమి అందరిదీ. అందరూ మానవులకు మౌలికమైన ఆస్తి ఈ భూమే. కానీ ఈ మౌలిక సత్యాన్ని మరచి బలవంతుడు మొత్తం తనకే చెందలి అంటు బలహీనులపై ఆధిపత్యం చెల ఇస్తున్నారు. దీని కారణంగా హింసలకు పాల్పడుతున్నారు. ఉన్నవాళ్లు స్వార్థాన్ని తగ్గించుకొని పరార్థ భావాన్ని పెంచుకొంటే మంచిదని భారతం ద్వారా నేటి సమాజం గ్రహించాల్సింది ఎంతో ఉంది.

భారతీయులది ప్రధానంగా వ్యవసాయిక సంస్కృతి. మానవత్వపు విలువలతో కూడిన సంస్కృతి. పాశ్చాత్యులది ప్రధానంగా పారిశ్రామిక సంస్కృతి. అంగడి వీధి సంస్కృతి ఆర్థిక సంస్కృతి. ఈనాడు ప్రపంచమంతా పాశ్చాత్య సంస్కృతే వ్యాపించి ఉంది. మానవుడు మితిమీరిన ధనాశతో మానవత్వపు విలువల్ని విస్మరించి అధర్మ మార్గంలో పరుగులు తీస్తున్నాడు. తల్లిదండ్రులని, భార్య పిల్లల్ని , ప్రేమతో చూడాల్సింది. లాభనష్టాలతో చూస్తున్నాడు. అభివృద్ధి కోసం తమ జీవితాన్ని, ఆనందాన్ని, సంతోషల్ని, కోల్పోతున్నాడు. మహాభారతంలో కురువంశ కుటుంబ పరిణామాలు మానవుడికి కనువిప్పు కలిగిస్తాయి. మానవ జీవితతత్వాన్ని గూర్చి ప్రతి మానవుడు ఆలోచించుకొనేటట్లు చేస్తాయి. మానవుడు కుటుంబవ్యవస్థను తన ఐహిక జీవితానికి వరంగా చేసుకోవాలిగానీ , కుటుంబవిచ్ఛిన్నానికి శాపంగా మార్చుకోకూడదు.

### ఆధార గ్రంథాలు

1. కవిత్రయం( నన్నయ, తిక్కన, ఎర్రన). 2014. శ్రీమదాంధ్ర మహాభారతము. (15 సంపుటాలు) తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానములు.

2. ఆంధ్ర మహాభారతోపన్యాసములు. 2007. హైదరాబాద్ ఆంధ్ర సారస్వత పరిషత్తు.

3. శేషగిరిరావు, దేవరకొండ (1967) భారత కథలు – అంతరార్థము – శ్రీపతి ప్రెస్, కాకినాడ.

4. రామకృష్ణమాచార్య, నందూరి (2005), కవిత్రయము – సాహిత్యపీఠం, సికింద్రాబాదు

5. శ్రీరామచంద్రుడు, పుల్లెల (2012), మహాభారత సార సంగ్రహము, శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్, కూకట్‌పల్లి, హైదరాబాదు.

6. డా॥ గురజాడ, గరికిపాటి (2022) ఆంధ్రమహాభారతం – ఆధునిక జీవితం, ఎస్.ఆర్. పబ్లికేషన్స్, విజయవాడ

7. భూమన్ (2007) (సంపాదకులు), కవిత్రయ మహాభారతము – జాతీయ సదస్సు ఉపన్యాస సంకలనం, తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ, తిరుపతి

# 54. నన్నయ 'యయాతి చరిత్ర' కథ - వర్తమాన సమాజానికి బోధించే నీతి

- షేక్ జరీనా, చెన్నై

## 1.0. నన్నయ పరిచయం

11వ శతాబ్దంలో ఆంధ్రమహాభారత అనువాదంతో మొదలైన తెలుగు సాహిత్య చరిత్ర ఆంధ్రజాతికి ఒక దిశానిర్దేశం చేసింది. అంతరిస్తున్న హైందవధర్మాన్ని రక్షించడానికి కంకణం కట్టుకున్నాడు నన్నయ. రాజరాజు కోరిక మేరకు సంస్కృత మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన నన్నయ తెలుగు సంప్రదాయాలకు, ఆచారాలకు పెద్ద పీట వేసి తర్వాత వచ్చిన కవులకు ఆదర్శప్రాయుడయ్యాడు. అక్షర రమ్యత, నానా రుచిరార్థ సూక్తి, ప్రసన్న కథా కలితార్థయుక్తి అనే కవితా లక్షణాలను ప్రకటించి ఆంధ్ర సాహిత్య చరిత్రను మలుపు తిప్పాడు. తెలుగులో మొట్టమొదట కావ్యరచనకు పూనుకున్న నన్నయ ఆదికవిగా, వాగనుశాసనుడిగా, శబ్దశాసనుడిగా కీర్తించబడ్డాడు.

మహాభారతంలో కథాకథన పద్ధతిని ప్రవేశపెట్టి ఎన్నో కథలకు ప్రాణం పోశాడు. చిన్న చిన్న ఉపాఖ్యానాల ద్వారా ఉన్నతమైన పాత్రలను, వాటి వ్యక్తిత్వాలను ఆంధ్రజాతికి అందించాడు. వర్తమాన సమాజం నడుచుకోవాల్సిన రీతుల్ని, పాటించాల్సిన నీతుల్ని మహాగ్రంథంగా తీర్చిదిద్ది మనకు అందించాడు. మహాభారతంలోని వేల కథల్లో యయాతి కథ ఎంతో విశిష్టమైంది. మానవుడు తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోడానికి అవసరమైన నీతులతో ఈ కథ ఏ కాలమైనా తన విశిష్టతను కనబర్చుతూనే ఉంది. రాజ్య పట్టాభిషేకం చేస్తూ యయాతి తన కొడుకైన పూరుడికి ఎన్నో నీతుల్ని బోధించాడు. అందులో కేవలం రాజధర్మాలనే కాకుండా నేటి వర్తమాన సమాజానికి అవసరమైన ఎన్నో విషయాలను పొందుపర్చాడు. యయాతి తన కుమారుడికి బోధించిన నీతుల ద్వారా వర్తమాన సమాజం నేర్చుకోవాల్సిన విషయాలను తెలియజేయడం ఈ వ్యాస ఉద్దేశం.

## 1.1. యయాతి కథ

ఆంధ్రమహాభారతం ఆదిపర్వం తృతీయాశ్వాసంలోని యయాతి కథ ఉన్నతమైంది. ఇతని తల్లి ప్రియంవద, తండ్రి నహుషుడు. చంద్రవంశానికి చెందిన యయాతి ఆరురోజుల్లో యావత్ మహీ మండలాన్ని జయించిన ఘనుడిగా పేరుపొందాడు. శర్మిష్ఠ, దేవయాని ద్వారా యదువు, తుర్వసుడు, ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే కుమారులను సంతానంగా పొందాడు. ఎన్నో యుద్ధాలను చేశాడు. ఎన్నో రాజ్యాలను జయించాడు. వార్ధక్యదశలో సన్యాసం తీసుకోవడానికి సిద్ధమయ్యాడు. శరీరం ముసలిదయింది కానీ మనసులోని కోరికలు నశించలేదు. మళ్ళీ యవ్వనం వస్తే యవ్వన సౌఖ్యాలను అనుభవించవచ్చునే ఆలోచన కలిగింది.

భార్యల ద్వారా కలిగిన ఐదుగురు కుమారులనూ పిల్చి తన మనసులోని కోరికను బయటపెట్టాడు. కానీ వాళ్లెవరూ తండ్రి ముసలితనాన్ని స్వీకరించి తమ యవ్వనాన్ని ధారపోయడానికి సిద్ధపడలేదు. తండ్రిని యవ్వనాన్ని ఇచ్చి ముసలితనాన్ని తీసుకోడానికి నిరాకరించిన యదువునితో యదువంశం రాజ్యపాలనకు పనికిరాదని శపించాడు. ధర్మాధర్మ వివేకం లేని కిరాతులుగా ఉంటారని తుర్వసువంశాన్ని శపిస్తాడు. క్షత్రియుల్ని శూద్రులయ్యేలా, ద్రుహ్యుని వంశం ముసలితనం రాకుండానే మరణిస్తారని శపిస్తాడు.

చివరికి ఆఖరి కుమారుడైన పూరుడు తన యవ్వనాన్ని తండ్రికి ధారపోసి తండ్రి ముసలితనాన్ని తాను గ్రహించడానికి సిద్ధపడ్డాడు. కుమారుడి నుంచి యవ్వనాన్ని గ్రహించిన యయాతి కామం అంతాన్ని వెతుకుతూ భూమంతా వెతుకుతాడు. స్వర్గలోక సుఖాలనూ అనుభవిస్తాడు. చివరకు కోరికలు ఎంత తీర్చుకుంటే అంత పెరుగుతాయనే విషయాన్ని గ్రహించి

పశ్చాత్తాప పడతాడు. కోరికలకు అంతం లేదనీ, నిరంతరం పుట్టగొడుగుల్లా పుట్టే కొత్తకొత్త కోరికలు మనిషికి మనశ్శాంతి లేకుండా చేస్తాయని తెలుసుకున్నాడు. తన యవ్వనాన్ని ఇచ్చి తండ్రి మాటకు విధేయత చూపిన పూరుడిని రాజుగా ప్రకటించి పట్టాభిషేకం చేస్తాడు. తండ్రి ఆస్తుల్లోనే కాదు ఇబ్బందుల్లో కూడా కొడుకులు తోడుగా ఉండాలనే విషయంతో పాటు తండ్రి కుమారుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలో చెప్తాడు. అరిషడ్వర్గాన్ని అదుపులో ఉంచుకోకపోతే కలిగే అనర్థాలను కూడా వర్తమాన సమాజానికి బోధిస్తాడు. యయాతి తన కుమారుడికి బోధించిన నీతుల్ని కొన్ని పద్యాల ద్వారా వివరించే ప్రయత్నం చేస్తాను.

### 1.1.1. జ్ఞానుల చరిత్రలు తెలుసుకోవాలి

దేశాన్ని పరిపాలించే రాజుకు ఎన్నో విషయాల్లో నైపుణ్యం ఉండాలి. ఎంతోమందితో సంబంధాలుంటాయి. శత్రు రాజ్యాల కదలికలను పసిగట్టాలి. సొంతరాజ్యంలోని అసంతృప్తుల కుట్రలను తిప్పికొట్టాలి. ఇవన్నీ ఉండాలంటే రాజుకు ఎంతో జ్ఞానం ఉండాలి. తమ తమ వృత్తుల్లో నిపుణులైన వ్యక్తుల్ని కలిసి వారి గురించి తెలుసుకుని వారి నుంచి జ్ఞానాన్ని గ్రహించాలని ఈ కింది పద్యం ద్వారా చెప్తాడు.

**ఎఱుక గల వారి చరితలు / గఱచుచు, సజ్జనుల గోష్ఠి గదలక ధర్మం**
**బెఱుగుచు, నెరిగిన దానిని / మఱువ కనిష్ఠించునది సమంజస బుద్ధిన్**

మన చుట్టూ ఉన్న సమాజంలో ఎంతోమంది గొప్పవాళ్ళున్నారు. జ్ఞానవంతులుగా వెలుగొందిన మహానుభావులున్నారు. వారి జీవిత చరిత్రలను చదివినా, జ్ఞానులైన వారి సన్నిధిలో కొద్ది సమయం గడిపినా మనిషి ఎంతో జ్ఞానం అలవడుతుంది. అందుకే గొప్పవారి చరిత్రలు చదవడాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలి. సజ్జనులైన వారి సాంగత్యంలో విషయాలను నేర్చుకోవడం, నేర్చుకున్న విషయాలను మర్చిపోకుండా న్యాయబద్ధంగా ఆచరించడం అనే మూడు విషయాలను కుమారుడికి బోధిస్తాడు యయాతి. లోకంలో నిజమైన జ్ఞానుల్ని గుర్తించి వారితో సాంగత్యం చేస్తే మనకు జ్ఞానం అలవడుతుంది. తద్వారా రాజ్యాన్ని ఎలా పరిపాలించాలో అవగాహన కలుగుతుంది. పరిపాలన పట్ల సరైన అవగాహన లేని వ్యక్తుల్ని ప్రస్తుత సమాజంలో ఎంతోమందిని మనం చూస్తున్నాం. ఈ విషయాలను తన కొడుకుతో చెప్పిన యయాతి చరితార్థుడిగా నిల్చిపోయాడు.

### 1.1.2. అర్హులకే దానంచేయాలి:

భారతదేశం గొప్ప వారసత్వ సంపద కలిగిన దేశం. ఎంతోమంది త్యాగధనుల్ని, దానమూర్తుల్ని ప్రసాదించిన దేశం. ఆతిథ్యధర్మాన్ని, దాన విశిష్టతను ఎన్నో కథల ద్వారా ఆనాటి నుంచి ఈనాటి వరకూ తెల్పుతూనే ఉంది. శిబి చక్రవర్తి, బలి చక్రవరి, కర్ణుడు లాంటి ఎంతోమంది దానశ్రేష్ఠుల్ని మన కళ్లముందు ఉంచుతూనే ఉంది. అంటువంటి దానం గురించి యయాతి తన కొడుకైన పూరుడికి ఇలా చెప్తున్నాడు.

**ఇచ్చునది పాత్రునకు ధన / మచ్చుగ నొరు వేడకుండునది యభిముఖులై**
**వచ్చిన యాశార్థుల వృథ / పుచ్చక చేయునది సర్వభూత ప్రీతిన్**

దానం ఎవరికివ్వాలి? ఎలా ఇవ్వాలి? అనే ప్రశ్నలు అందరిలోనూ సహజంగా కలుగుతాయి. ఎంతోమంది తమ అవసరాల నిమిత్తం రాజాస్థానాలను దర్శిస్తారు. రాజులను పొగిడి అనేక రకాలైన దానాలను కానుకలుగా తీసుకెళ్తుంటారు. వారిలో నిజమైన అవసరంలో ఉన్నవారిని గుర్తించడం అనేది ఎవరికైనా కత్తిమీద సాములాగానే ఉంటుంది. కానీ రాజైన వాడికి నిజమైన వ్యక్తుల్ని గుర్తించడం అనేది ఎంతో అవసరం అని చెప్తున్నాడు యయాతి.

దానం తీసుకుని వాటిని తమ జల్సాలకు ఖర్చుచేసే మనుషులు కూడా మన మధ్య తిరుగుతూనే ఉన్నారు. నిజమైన అవసరాలలో ఉన్నవారికి కాకుండా వాటిని జల్సాలకు ఖర్చు చేసేవారికి దానం చేస్తే దాని వల్ల తగిన ఫలం లభించదు. అందుకే దానం పొందడానికి లేదా నిజమైన అవసరాలలో ఎవరున్నారో వారిని గుర్తించి వారికి మాత్రమే దానం చేయాలి. రాజు అనేవాడు ఎవరినీ దానం అడగకూడదు. వెళ్ళే దారిలో ఎవరైనా యాచకులు ఎదురై దానమడిగితే వారిని నిరాశపర్చకుండా దానమిచ్చి సంతోషపర్చాలి. ఎదుటివ్యక్తి అవసరాన్ని తీర్చి వారికి సంతోషాన్ని కలిగించేలా మనం చేసే దానధర్మాలుండాలి. అలాకాకుండా అడిగిన ప్రతీవారికి అనవసరమైన దానాలు చేయడం వల్ల ప్రతిఫలం ఉండదు అని యయాతి పూరుడికి బోధించాడు.

### 1.1.3. సంభాషణా చాతుర్యం కలిగివుండాలి:

మాట్లాడడం అనేది మనిషికి దేవుడిచ్చిన వరం. ఎంతోమంది కవులు, కళాకారులు తమ సంభాషణా చాతుర్యం చేత రాజుల్ని మెప్పించి బంగారాన్ని, భూముల్ని బహుమతులుగా పొందిన సందర్భాలు సాహిత్యంలో ఎన్నో కనిపిస్తాయి. ఎదుటివ్యక్తిని నొప్పించాలన్నా, మెప్పించాలన్నా మన మాటతీరు వల్లే సాధ్యమవుతుంది. కష్టాలలో ఉన్నవాళ్లను ఓదార్చడానికి చెప్పే మాటలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి. బతుకు పైన ఆశను పుట్టిస్తాయి. అసూయతో కూడిన మాటల వల్ల అవతలి వ్యక్తిలో ఆత్మన్యూనత పెరుగుతుంది. కనుకనే ఏ స్థాయిలో ఉన్నా మన మాటతీరు జాగ్రత్తగా ఉండాలనే గొప్ప సందేశం యయాతి తన కుమారుడితో చెప్తున్నాడు. రాజు స్థానంలో ఉన్నవాళ్లైనా లేదా మామూలు వ్యక్తులైనా తమలోని సంభాషణా చాతుర్యాన్ని పెంచుకోడానికి పనికొచ్చే కొన్ని లక్షణాలను ఈ కింది పద్యంలో ఎంతో హృద్యంగా చెప్తాడు యయాతి.

**మనమునకు ప్రియంబును హిత / మును బథ్యము తథ్యమును నమోఘము మధురం**
**బును బరిమితమును నగు పలు / కొనరగ పలుకునది ధర్మయుతముగ సభలన్**

ఇతరులతో మాట్లాడేటప్పుడు వారికి ఇష్టం కలిగేటట్లు మాట్లాడాలి. వారికి మేలు చేకూర్చే మాటలే మాట్లాడాలి. ఇతరులను అవమానించేటట్లు, చులకన చేసేటట్లు మన మాటలు ఉండకూడదు. సభలలో మాట్లాడేటప్పుడు తగిన విధంగా, అమోఘంగా మాట్లాడాలి. మధురమైన మాటలు మాట్లాడుతూ ఎదుటివారికి ఆహ్లాదాన్ని కలిగించాలి. ఆశీర్వాదం కలిగేలా మన మాటతీరు ఉండాలి. సమయం, సందర్భం తెలుసుకోకుండా ఇష్టం వచ్చినంతసేపు, ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడకూడదు. అన్నిటినీ మించి మన మాటతీరు పరిమితంగా ఉంటే ఎంతో మంచిది. ఈ పద్యంలో యయాతి చెప్పిన నీతులు ఏనాటికైనా ఆచరణీయమే.

### 1.1.4. గర్వాన్ని ప్రదర్శించకూడదు

మనిషి తనకున్న అందాన్ని బట్టి, సంపదలను బట్టి, అధికారాన్ని బట్టి, అనుచరుల్ని బట్టి అతిశయ పడుతుంటాడు. తనను మించినవాడు లేడని విర్రవీగుతుంటాడు. తన దగ్గరున్న ధనంతో ఎలాంటి పనినైనా చేయొచ్చని, ఎంతటి వారినైనా తనకు లొంగివుండేలా చేసుకోవచ్చనీ ఆలోచన చేస్తుంటాడు. తనకంటే ఎవరూ ఎక్కువవారు కాదని, తాను తల్చుకుంటే ఏమైనా చేయగలననీ ఇతరుల్ని చులకన చేస్తుంటాడు. ఆ పద్ధతి దేశాన్ని పాలించే రాజుకైనా, మామూలు జీవితాన్ని గడిపేవారికైనా మంచిది కాదని ఈ కింది పద్యంలో చెప్తాడు యయాతి.

**అమరవిభుండు దాని విని యల్గి 'మదంబున నుత్తమావమా**
**నము దగునయ్య చేయ' నని నన్ను నధోభువన ప్రపాతన సం**

భ్రమ వివశాత్ము జేసి నది పాడియ యెందును నల్పమయ్యు ద
ర్పము బహుకాల సంచిత తపః ఫలహాని యునర్పకుందునే

గొప్పగొప్ప తపస్సులు చేసిన యయాతి ఇంద్రలోకానికి చేరుకుంటాడు. పుణ్యగతులు కలిగినందుకు ఆనంద పడతాడు. 'నీవెంతో గొప్ప తపస్సు చేశావు. శత సహస్ర సంవత్సరాలు తపస్సు ఎలా చేశావు' అని అడిగిన ఇంద్రుడిని ధిక్కరించి మాట్లాడతాడు. తాను గొప్పవాడిని కాబట్టే దేవతలకంటే, యక్షులకంటే, రాక్షసులకంటే, ఖేచరుల కంటే, సిద్ధుల కంటే, మునిగణ ప్రవరుల కంటే గొప్ప తపస్సు చేయగలిగానని ఇంద్రుడిని అవమానిస్తూ చులకన చేస్తూ మాట్లాడతాడు. దానికి కోపించిన ఇంద్రుడు 'నీ గర్వపు మాటల వల్ల ఇంద్రలోకంలో ఉండే అర్హత కోల్పోయావు. కనుక అధోలోకానికి వెళ్లమని శపిస్తాడు. ఇంద్రుడి తల పొగరు దిగుతుంది. గర్వంతో తానెంత పొరపాటు చేశాడో గ్రహిస్తాడు. ఎన్నో వేల సంవత్సరాల తన తపస్సంతా గర్వంతో పలికిన మాటల వల్ల కోల్పోయానని తెలుసుకుంటాడు. యయాతి తన గర్వం వల్ల ఎంత నష్టపోయాడో చెప్తూనే గర్వం మనిషికి మంచిది కాదని చెప్తాడు నన్నయ. మనిషి జీవితంలో ఏదైనా చేయగలడు, ఎన్నైనా సాధించగలడు గానీ గర్వాన్ని అదుపులో పెట్టుకోకపోతే వాటిని కోల్పోతాడనే అంతర్లీన సందేశాన్ని నన్నయ మనకు ఈ యయాతికథ ద్వారా చెప్తాడు.

### 1.1.5. సర్వభూతదయ కలిగి వుండాలి

జన్మలన్నిటిలోనూ మానవజన్మ ఎంతో ఉత్తమమైంది. మనిషి అరిషడ్వర్గాన్ని జయించి అహింసతో జీవించడం అలవాటు చేసుకోవాలి. ఆశానిగ్రహం, రుజుత్వం, ఇంద్రియ నిగ్రహం, శుచిత్వం అనే వాటిని మనసులో ఉంచుకోవాలి. ఎల్లప్పుడూ అంతఃకరణశుద్ధితో ఇతరులకు మేలు చేస్తూ, ఇతరుల పట్ల ప్రేమను, దయను కనపరుస్తూ జీవితాన్ని గడపాలి. ఉత్తమమైన ఈ మానవజన్మను సర్వభూతదయ ద్వారా సార్థకత చేసుకోవాలి అని ఈ కింది పద్యం ద్వారా చెప్తాడు.

సర్వభూత దయకు సత్యవాక్యమునకు / నుత్తమంబు ధర్మ మొండెరుంగ
నొరుల నొప్పికోడ కుపతాప మొనరించు / నదియు కడు నధర్మ మనిరి బుధులు

మనిషి ధర్మయుతంగా జీవించడానికి కావలసిన మార్గదర్శక సూత్రాలను మహాభారతం మనకు అందించింది. ఇతరుల పట్ల దయచూపడం ద్వారా మనిషి ధర్మబద్ధమైన జీవితాన్ని జీవించవచ్చు. అందుకే సర్వభూత దయకు, సత్య వాక్యానికి మహాభారతం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. మనసులో కల్మషం లేకుండా మనిషిని మనిషిగా చూడగలగడం, సత్యానికి కట్టుబడి జీవించడం అనేవి ధార్మిక జీవితానికి సోపానాలుగా ఉంటాయి. ఇతరుల్ని హింసించడం ద్వారా మనంతట మనమే అధర్మ జీవితాన్ని ఆహ్వానిస్తున్నాం. కనుక మనిషి తనను తాను సంస్కరించుకుంటూ నలుగురికీ మార్గదర్శకంగా నిలబడడం ధర్మాలలోకెల్లా ఉత్తమమైన ధర్మం అని చెప్తాడు యయాతి.

### 1.1.6. ఉత్తమ స్థితిగతుల్ని పొందడానికి ప్రయత్నించాలి

ధర్మం నాలుగు పాదాలమీద నడవాలంటే ప్రతీ మనిషి తనను తాను సంస్కరించుకోవాలి. పుణ్యగతుల్ని పొందడానికి ప్రయత్నించాలి. జ్ఞానానికి కొలమానాలుగా నిల్చే వేదాల సారాన్ని గ్రహించాలి. వాటిని జీవితానికి అన్వయించుకోవాలి. వేదంలో చెప్పిన మంచిపనులు చేస్తూ, సర్వభూత దయను పాటిస్తూ నడవడిక సాగిస్తే మనిషికి ఉత్తమ గతులు కలుగుతాయని ఈ కింది పద్యంలో చెప్తాడు యయాతి.

వేదవిహిత విధుల నాదరించుట యూర్ధ్వ / గతికి తెరువుబీ విధుల గడచి యెందు
నాగబడినవాని లోగక చేయుట / యధమగతికి మార్గమనిరి మునులు

వేదాలలో చెప్పిన పనులను చేస్తే మానవాళికి ఉత్తమ గతులు ప్రాప్తిస్తాయి. అవే ఉన్నత స్థానాలకు మార్గదర్శనంగా మారతాయి. అలాకాకుండా హింసతో మనిషి ప్రవర్తిస్తే అధమగతులు కలుగుతాయి. వేదాలు చెప్పిన మాటలను అతిక్రమించడం, నిషేధించబడిన వాటిని చేయడానికి ఉత్సుకత చూపించడం మనుషులకు అధమ గతులను కలిగిస్తాయి. కనుకనే వేదాల ధర్మాన్ని ఆచరిస్తే ఉత్తమగతులు, వాటిని అతిక్రమిస్తే నీచగతులు కలుగుతాయని పూరుడికి బోధిస్తున్నాడు యయాతి. మనుషులంతా ఉత్తమమైన దాన్ని ఆచరిస్తూ, ఉత్తమ మార్గాలను ఎన్నుకుంటూ మనుగడ సాగిస్తే లోకం ఉన్నతపథంలో పయనిస్తుందనే సందేశాన్ని నన్నయ యయాతి కథ ద్వారా లోకానికి అందించాడు.

## ముగింపు

యయాతి చరిత్ర కథ వర్తమాన సమాజానికి గొప్ప సందేశాన్ని అందించింది. పరిపాలకులే కాకుండా పరిపాలితులు కూడా గ్రహించాల్సిన ఎన్నో విలువైన అంశాలను నన్నయ ఈ కథలో పొందుపర్చాడు. ఎన్నో యాగాలు చేసి ఉత్తమ గతులు పొందిన యయాతి తన అతిశయం వల్ల వాటిని కోల్పోయాడు. ఎంత అనుభవించినా సంతృప్తి చెందని సుఖభోగాల పట్ల, విషయలాలస పట్ల మనుషులు వ్యామోహాన్ని వదులుకోవాలనే విషయాన్ని తెలియజేశాడు. మనసులోనే ఉండి భ్రాంతికి గురిచేసే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు లొంగిపోకుండా, చతురాశ్రమ ధర్మాలను మానవాళి పాటించాలనే గొప్ప నీతిని వర్తమాన సమాజానికి అందించాడు.

## ఆధారగ్రంథాలు

1. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతము (సరళ వ్యాఖ్యాన సహితం), సంపుటం-1, 2013, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

2. ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, తృతీయాశ్వాసం, వావిళ్ల రామస్వామి శాస్త్రులు & సన్స్, చెన్నపురి.

3. కవిత్వంలో వ్యక్తిత్వ వికాసం -2, ద్వానాశాస్త్రి, సుజనరంజని మాసపత్రిక, ఏప్రియల్ 2007.

# 55. మహాభారతం సత్య ప్రాధాన్యం

- డా॥ ఎన్ ఎలిజబెత్ జయకుమారి, చెన్నై

## 1.0. పరిచయం

ఆంధ్రమహాభారతం సత్యవాక్ప్రబంధం. భారత వీరులైన పాండవులు సత్యాన్ని మాట్లాడేవారు. వారి పరిపాలన సత్యవాక్పరిపాలన. కాబట్టి భారతం చదివేటప్పుడు సమయ సందర్భాలు వచ్చేటప్పుడు సత్యాన్వేషణ, సత్యశోధన, సత్యనిరూపణ,సత్యస్థాపన వంటి విషయాలు అడుగడుగునా కనబడుతుంది. ప్రస్తుత సమాజంలో సత్యం మాట్లాడేవారు కరువయ్యి పోయారు. సత్యాన్ని సమాధి చేశారు. సత్యవాది లోక ప్రియుడుకాలేకపోతున్నాడు. అసత్యవాది లోక ప్రియుడవుతున్నాడు. మన న్యాయవ్యవస్థలో న్యాయదేవత కళ్ళు కప్పి ఉంచుతారు దాని అర్థం మనకు తెలుసు గదా ! అసత్యానికి ఉన్న విలువ సత్యానికి లేదు. సత్యం మాట్లాడితే వీడు పెద్ద సత్యహరిశ్చంద్రుడు అని మనం నిత్యజీవితంలో సత్యం మాట్లిడేవారిని ఎగతాళి చేస్తాం. ఒకని జీవితం ఒక సత్యవాక్కుతో నిలబడుతుంది కొన్ని జీవితాలు ఒక అసత్యవాక్కు మీద నాశనం అవుతుంది.ఒక అసత్య వాక్కుతో ఒకని జీవితం నిలబడుతుందనటంలో కూడా సందేహం లేదు. ప్రస్తుత సమాజం సత్యం మాట్లిడే వారిని పక్కన పెడుతుంది. ఈ నా వ్యాసంలో భారతంలోని సత్య ప్రాధాన్యం ఎలా ఉందో వివరించటానికి ఈ అంశాన్ని ఎన్నుకున్నాను.

## 1.1. సత్యపద ప్రయోగము

సత్యము అనే పదం మొదట ఋగ్వేదములో ఉంది. బ్రాహ్మణులు నేటికి పఠిస్తున్న మంత్రములో 'ఋతం వదిష్యామి,సత్యం వదిష్యామి' అనే మంత్రం ఉంది. ఇక్కడ ఋతము వేరు సత్యం వేరు. ఋతము స్థిరమైనది. దీనికి మార్పుగాని పరిణతిగాని ఉండదు. ఋతము కంటే భిన్నమైనది సత్యము ఇది కాలాను గుణముగాను దేశాను గుణముగాను మార్పు చెందుతుంది. కాబట్టి ఋతము సత్యము వేరు వేరు. ఆంగ్లములో ఋతము అనగా ట్రూత్, సత్యము అనగా రియాలిటీ.

## 1.2.సత్యం నిర్వచనము

ఋతము కానిది అనృతము సత్యముకానిది అసత్యము. రామాయణ కాలం నాటికి ఈ రెండు పదాలకున్న భేదమంతరించి పోయింది. భారతకాలం నుంచి నేటి వరకు ఈ రెండు పదాలు సమాంతరంగానే వాడుతున్నాము. ఋతము పలుకుచున్నాడు అంటే సత్యము పలుకుచున్నాడు. అనృతము చెప్పవద్దు. అంటే అసత్యము పలుకవద్దు. ఇలా మనము ప్రయోగిస్తున్నాము.

## 1.3.సత్యవాక్ప్రబంధం

ఆంధ్రమహాభారతం పారిజాత వృక్షముకాగా ఆంధ్రమహాభాగవతము కల్పతరువైనది.. మహాభారత మహిమ గ్రంథాదిని మాత్రమే కాకుండా గ్రంథ మధ్యమమున కూడా కనబడుతోంది.

**కమనీయధర్మార్థ కామ మోక్షములకు**
**నత్యంత సాధనం బయిన దాని**
**వేడ్కతో దవిలితన్ వినుచున్న వారల**
**కభిమత శుభకరంబయిన దాని**

రాజుల అఖిల భూరాజ్యాభివృద్ధిని
త్యాభ్యుదయ ప్రదంబయిన దాని
వాఙ్మన: కాయప్రవర్తితానేక జ
న్మాఘ నిబర్హణంబయిన దాని
సత్యవాక్ప్రబంధ శత సహస్ర శ్లోక
సంఖ్యమయిన దాని సర్వలోక
పూజ్యమయిన దాని బుధనుత వ్యాస మ
హా ముని ప్రణీత మయిన దాని. (ఆది 3-9)

అని శత సహస్ర శ్లోక సంఖ్యతో విరాజిల్లుచున్న మహాభారతమును సత్య వాక్ప్రబంధముగా పేర్కొన్నారు.

## 1.4. మౌనవ్రతము

కొంత మందికి నోరుతెరిస్తే సత్యం మాట్లాడతారు మరికొంత మంది నోరు తెరిస్తే అబద్ధాలు మాట్టాడతారు. మరి కొన్ని సమయాల్లో నిజం చెప్పాల్సి వస్తుందనే భయంతో నేను ఈ రోజు మౌనవ్రతం అని అంటారు. ఒకవేళ అబద్ధం చెప్పాల్సి వస్తున్నప్పుడు ఈ వేళ నేను మౌనవ్రతం అని తప్పించుకునే మనుష్యులను మనం నిత్యం చూస్తూనే ఉంటున్నాం. ఈ నేపథ్యానికి సంబంధించి భారతంలో మాండవ్యమౌని మౌనవ్రతాన్ని పేర్కోవచ్చు. మాండవ్యుడను మహర్షి అడవిలో ఆశ్రమాన్ని నిర్మించుకుని మౌనవ్రతాన్ని ఆచరిస్తూ తపస్సును చేస్తున్నాడు. రాజు ధనమును దొంగిలించిన దొంగలు ఆ వైపుగా వచ్చి మాండవ్యుని ఆశ్రమములో దాక్కున్నారు. వారిని తరుముతూ వచ్చిన ఆరెకులు అనగా రక్షకులు మాండవ్యుని చూచి దొంగలను చూశావా అని అడిగారు. అందుకు మౌనవ్రతములో ఉన్న మాండవ్యుడు సత్యము చెప్పలేక పోయాడు. రక్షకులు ఆశ్రమాన్ని వెతికి ధనముతో ఉన్న ఆ దొంగలను పట్టుకున్నారు. మాండవ్యుడే ఆ దొంగలకు ఆశ్రయమిచ్చాడని మాండవ్యునితో సహా దొంగలను రాజు దగ్గరకు తీసుకెళ్ళారు. రాజు దొంగలకు మరణదండన విధిస్తూ తపో వేషములో ఉన్న మాండవ్యుని పురము వెలుపల శూలప్రోతుని గావించాడు. అయినా మాండవ్యుడు నిరాహారదీక్షుడై తన తపస్సును కొనసాగిస్తున్నాడు. అతని తపస్సుకు మెచ్చి మహామునులు ఒకనాటి రాత్రి పక్షులై వచ్చి దు:ఖాన్ని కలిగించిన వారెవరని అడిగారు. సుఖదు:ఖములకు కారణము తన కర్మఫలమేగాని అన్యులు కాదు అని సమాధానమిచ్చాడు. ఆ మాటలు విన్న ఆ నగర రక్షకులు రాజుకు చేరవేశారు.రాజు దీనమస్కుడై ఆ మాండవ్యుని దగ్గరకు వెళ్ళి నమస్కరించి తన అజ్ఞానమును సహింపమని వేడి శూలము లాగినను రాకపోయే సరికి మొనలు రెండు ఖండించాడు. ఇటువంటి దారుణ శిక్ష అనుభవించటానికి మాండవ్యుని మౌనవ్రతమే కారణము కాబట్టి మౌనవ్రతము వలన ప్రమాదాలు కూడా ఉన్నాయి అనటానికి ఈ ఉదాహరణ సరిపోతుంది. అందుకే సత్యం వద అంటే సత్యం పలకటమే మేలు.

## 1.5. పలుకుల భేదాలు

పలుకులు రెండు రకాలుగా ఉంటాయి. 1.మృదువుగా మాట్లాడటం 2.పరుషంగా మాట్లాడటం. మనకు ఓ సామెత ఉంది 'నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందట'. అంటే మృదువుగా మాట్లాడేవారికి లోకములో గౌరవము ఉంటుంది. పరుషపు పలుకులు సప్తవ్యసనాలలో ఒకటి. కాబట్టి 'పలుకు ప్రల్లదము దీనినే వాక్పారుష్యముగా ధర్మరాజు పేర్కొన్నాడు. వాక్పారుష్యము మహాదారుణమైనది. ఇది విషం కంటే దహనం, కంటెను మిగుల సంతాపకారి. తెలిసిన వారు ఎవ్వరు పరుషపు మాటలు పలుకరు.

మృదువుగా మాట్లాడేవారికి మహోన్నతి కలుగుతున్నది. మృదుమధురమైన వాక్యములతో ఇంపొదవెడు చిరునగవుతో రాజు తన మంత్రులతోడను ప్రజలతోడను సంభాషించుట మంచిదట. (శాంతి 2-371).

**మృదు భాషణములు దుర్జన**
**హృదయములు ప్రసన్నతా మహిమ బొందునె యె**
**ల్లిదముగ గొని యంతంతకు**
**మద మెక్కుం గాక దురభిమానము పేర్మిన్ (ఉద్యోగ 1-34)**

మృదు భాషణము పనికివచ్చును కాని దుర్మార్గులైనవారికి అవి ఇంపును పెంపవు పైగా ఆ మాటలను లెక్కింపక దురభిమానముతో మదము పెరుగుతుందది. పరుషపు పలుకులు పలికి శ్రీకృష్ణునికి విసుగు కలిగించిన శిశుపాలుని గతి ఏమైందో మనకు తెలుసు కాబట్టి జీవితంలో పరషపు పలుకులు విసర్జించాలి. ఈ సందర్భంలో గుర్తుకు వచ్చే సామెత 'పడితే కాలైన వెనుకకు తీసుకోవచ్చుగాని మాట మాత్రం వెనుకకు తీసుకోలేం'. కాలు జారితే తీసుకోవచ్చుగాని నోరు జారితే తీసుకోలేము కదా! కాబట్టి నోరుజారటం అంటే పరుషంగా మాట్లాడటం అని అర్థం.

## 1.6. పలుకుల ఒప్పు

మహాభారతంలో పలుకులు నాలుగు రకాలు. అవి పలుకుట, సత్యము పలుకుట, ధర్మమార్గమున పలుకుట, సర్వజన ప్రియముగా పలుకుట.

**పలుకక యుండుకంటె దగ బల్కుట మేలు వినుండు సత్యముం**
**బలుకుట ధర్మ మార్గమునబల్కుట సర్వజన ప్రియంబుగా**
**బలుకుట యోలి నెక్కుడగు భంగులు వీనినెఱింగి యుండుమై**
**బలుకక నాల్గు చందముల బల్కగమెత్తురు వాని దేవతల్ (శాంతి 5-555)**

ఆ నాలుగు రకాల్లో పలుకులు ఒకేరీతిలో పలకకుండ నాలుగు రకాలుగా పలికితే దేవతలు కూడా మెచ్చు కుంటారట. పలుకులు అందరు పలుక గలరు కాని పలికిన దానిని ఎందరు అనురింపగలరు? పలికినట్లుగా ఉండటం ఎంతమంది వల్లఅవుతుంది.? ఎంత మంది పలికన మాట తప్పుతారు? ఇతరులను ఒక్క మాట అనకూడదు. మాట పడిన వానికి పాపములు పోవును. ఇతరులను మాట అన్న వానికి పాపములు ప్రాప్తించును. ఇతరులను మాటలు అననేల? పాపము ఊరక తెచ్చుకొననేల? జీవితంలో ఇవి నగ్నసత్యాలు. తెలుసుకుని జీవితంలో పొరపాట్లు చేయకుండా ఉంటే సరిపోతుంది.

**పలుకువడినతని బాపం**
**బులు విడుచుం పలికినతని బొందును బాపం**
**బులు నొరు పాపము తనపై**
**నొలయింపగ నేల నింద యుడిగిన గాదే (శాంతి 5-553)**

## 1.7. అప్రియమగుపల్కు

సాధారణంగా మనము మనకు ప్రియమైన మాటలు పలికిన వారిని ఎక్కువగా ఇష్టపడుతుంటాం. అప్రియంగా మాట్లాడితే మెచ్చుకోం. ఒకవేళ అది సరైనదైనా మనం వినటానికి ఇష్టపడం. కావున ప్రతిభావంతులైన వారీ విషయం గ్రహించి మాట్లాడకుండా ఉంటారు. దీనికి సంస్కృతంలో ఇలా అంటారు.

శ్లో. సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్
న బ్రూయాత్ సత్య మప్రియమ్

కౌరవుల దగ్గరమంత్రిగా ఉన్న విదురుడు ఎన్ని అప్రియమైన సత్యాలను పల్కాడో చెప్పలేం. ధృతరాష్ట్రునకు ధుర్యోధనునికి అప్రియమైన సత్యాలు చెప్పటం వలన విదురునికి కలిగిన లాభం ఏంటి. ధృతరాష్ట్రునిచే ఒక మారు వెళ్ళగొట్టబడి అరణ్యవాసము చేస్తున్న పాండవుల దగ్గర విదురుడు చేరాడు. అంతకు ముందు సభలో జూదమాడ వద్దని పాండవులకు వికృతి సేయుట సేమము కాదనియు అప్రియమైన సత్యము చెప్పినందులకు విదురుడు దుర్యోధనునిచే దూషింపబడినాడు. అప్రియమైన సత్యము పలకరాదని విదురునికి తెలిసి మరి ఎందుకు పలికాడో విదురుడే స్వయంగా సభలో ఇలా చెప్పాడు. హస్తినాపుర వల్లభుని మంత్రి విదురుడు భూ వల్లభునికి మంత్రిగా ఉండి సహాయము చేయువాడు పలుకవలసిన పలుకులవి పథ్యమగు పలుకులు ఎప్పుడు దుర్మార్గులకు మొదట అప్రియముగానే ఉండుననుటలో ఎట్టి సందేహము లేదు. మంత్రికి మోమాటము పనికి రాదు. మోమాటము పడినచో మొదటకే మోసము వచ్చును కౌరవులకురాబోవు కీడును శంకించి విదురుడట్లు పలుకవలసిన వాడయ్యాడు.

## 1.8. సత్యపరిశీలన

ప్రాణికోటికి మేలు జరగాలంటే చెప్పబడిన అసత్యం, సత్యం కంటె కూడా గొప్పది. ప్రాణికోటికి కీడు కలిగించే సత్యం అసత్యంతో సమానం.ప్రాణరక్షణకు, వివాహం జరిపించటానికి, ఆడిన అసత్యం సత్యం కంటె ఘనమైనది. ఇవి ధర్మ సూక్ష్మాలు. ఈ అంశమే భాగవతములో 'వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణవిత్తమాన భంగమందు చరిత గోకులాగ్ర జన్మ రక్షణయందు బొంకవచ్చునఘము వొంద దధిప' వామన చరిత్ర ఘట్టములో ఉంది.

ఈ లోకంలో హింస చేయనివాడు ఒక్కడైనా ఉండడు. అయినప్పటికీ తమకు వీలైనంత మేరకు హింస చేయకుండా జీవయాత్ర సాగించాలి. ధర్మాన్ని తెలియజేయటం కష్టం ధర్మం పెక్కు రకాలుగా ప్రవర్తిల్లుతుంది. ధర్మసూక్ష్మత తెలియరానట్టిది. కాబట్టి ధర్మాన్ని తెలియటానికి వేదాల ప్రమాణం, పెద్దల నడవడిక ఆధారాలుగా గ్రహించదగును.

**చిరముగ ధర్మముల్ నడపజిత్తము దేఱుబ్రసన్నచిత్తుడై**
**పరువడి నింద్రియార్థముల భంగులు రిత్తలుగా నెఱింగి చె**
**చ్చెర నవి యంతవట్టు నిరసించి తపోదమ సత్యశీలతం**
**బరిణతి నొందు బొందు బిదపం బరమార్థపద ప్రభావమున్ (ఆరణ్య 5-77)**

చిరకాలం ధర్మాలను ఆచరించటం వలన మనస్సు నిర్మల మౌతుంది. మనస్సు ప్రశాంతి పొందటం వలన ఇంద్రియ సౌఖ్యాలు వ్యర్థాలైనవి అని తెలుస్తుంది. అట్టి జ్ఞానం లభించిన వెంటనే వాటిని విడనాడి తపస్సు ఇంద్రియ నిగ్రహం, సత్య వ్రతం వంటి సద్గుణాలు చేత ఆధ్యాత్మికమైన ఉన్నత స్థితి మహిమ మనకు కలుగుతుంది.

అర్జునుడు తన గాండీవము నింకొకరికిమ్మని ఎవ్వరు చెప్పుదురో వాని శిరము గ్రక్కున పగుల వేయుదునని పిన్ననాడు ప్రతిజ్ఞ చేసితినని కృష్ణునకు చెప్పి ధర్మరాజును చంపబోవును సత్యరక్షణము సేయుటకై కర్మ సూక్ష్మ భంగి తెలిసికొనలేక పోవుచున్నావని కృష్ణుడు ఇలా అన్నాడు.

**విను పిన్ననాడు నీ వీ**
**యనుచిత మగు వ్రతము పట్టి తది గాకయు బె**
**ట్ట నృతము సూనృతమును నీ**
**కని యెదు చందంబు బుధులు గయికొన రెందున్ (కర్ణ3-75)**

అనృతము సూనృతము అర్జునుడు చూచిన రీతిని బుధులు గైకొనరనియు, సూక్ష్మ పరిశీలనము గావింపవలయును అని కృష్ణుడు చెప్పాడు. ప్రతి వ్యక్తికి హితాలాపము మంచిది. సత్యహితాలాప చతురత అర్హమైనది సత్యాలాపము సర్వవర్ణ నియత గుణమని భారతము చెబుతోంది.

## 1.9.సత్యవ్రతము

సత్యనిష్ఠ కలిగి సత్యవ్రతము నాచరించటం కత్తిమీద సాము వంటిది. అంటే కష్టసాధ్యమైనది. సృష్టి మొదలైనప్పటి నుంచి సత్యవ్రతాన్ని ఆచరించిన వారు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. కృతయుగములో హరిశ్చంద్రుడు వ్రతము పూనినాడు. వేదాల్లో పేర్కొనబడిన హరిశ్చంద్రుని సత్యవ్రతము అంత గొప్పది కాదేమో కాని, పురాణ ప్రసిద్ధమైన హరిశ్చంద్రుడు ప్రసిద్ధుడైనాడు.సత్యము కొరకు సర్వనాశనమైనను శ్రమించి సత్యమునే పల్కువాడు సత్యహరిశ్చంద్రుడు. విశ్వామిత్రుని వంటి రాజర్షి కూడా హరిశ్చంద్రునిచే అసత్యము ఆడించలేకపోవుట పురాణ ప్రసిద్ధము. ఆ పిమ్మట ఆడినమాట తప్పనివాడు బలిచక్రవర్తి శుక్రాచార్యుడు ఎంతచెప్పినా వినక వామనుని దానమీయకడంగినాడేకాని ఆడిన మాట తప్పలేదు. సర్వనాశనము తనకు కలిగినను తనదు జిహ్వతిరగ నేరదనినాడు.

సత్యం అహింస అనే ఈ రెండు ధర్మాల్లో అహింసతో సత్యాన్ని కాపాడాలి. అసత్యంతో అహింసను కాపాడవలసి ఉంటుంది అని జ్ఞాన ధనులంటారు.

**సత్యంబు నహింసయు నను**
**నత్యుత్తమ ధర్మ యుగళ మందు**
**నహింసన్ సత్యముగాచుట ధర్మమ**
**సత్యమున నహింసగావ జనునంద్రు బుధుల్** (కర్ణ 3-73)

పెద్దల నుండి తెలుసుకొనని కౌశికడనే బ్రాహ్మణుడు ఒక మంచి గ్రామంలో కొద్ది దూరంగా ఉన్ననదీ సంగమ పుణ్యక్షేత్రములో నివసిస్తూ సత్యమే పలకాలని వ్రతం పట్టి సత్యవాది అని ప్రసిద్ధుడై తపస్సు చేసుకుంటూ ఉన్నాడు. ఒకరోజు దొంగలు వెంబడించగా జనులు భయంతో పారిపోయి అతడి ఆశ్రమంలో ఉన్న పొదలో దూరి దాక్కొని ఉన్నారు దొంగలువచ్చి ఆ జనులు ఎక్కడికి వెళ్ళారని ఆ తపస్విని అడిగారు. అతడు సత్యాసత్య నిరూపణ వివేకం లేనివాడు కావటం చేత తనకు అసత్యదోషం కలుగుతుందని భావించి ఆ పొదరిళ్ళుఎదాగి ఉన్న జనులను చూపించాడు. ఆ దొంగలు వారిని చంపి వారి ధనాన్ని దోచుకున్నారు. ఆ ముని తానుచేసిన దోషం వలన నరకాన్ని పొందాడు ఈ ఇతిహాసం లోకంలో ప్రసిద్ధికెక్కింది. హింసకు దారితీసే సత్యం ధర్మం కాదు తనకు తెలిసిందే ధర్మమని భావించి పెద్దలనడిగి తెలుసుకొనని మూఢుడు దుర్గతి పొందుతాడు.

## 1.10.సత్య మహిమ

సత్యము గొప్పతనము ప్రశంసనీయమైనది. సత్యాన్నేమాట్లాడేవారికి సాధింపరానిది ఏదీ లేదు. అమృతము మృత్యువు సత్యము మోహము శాంతి శాంతి పరుడై సమ సుఖదు:ఖుండగుచు సత్యమునన మృతుత్యువు గెలువనగునట (శాంతి4-26) సత్యము మాహాత్మ్యము వంటిది. అసత్యము కంటె మహాపాపము మరొకటి లేదు. అశ్వమేధయాగ సహస్రము కంటె కూడా సత్యము గొప్పది.

**నుతజల పూరితంబులగు నూతులు నూటిటికంటె సూనృత**
**వ్రత యొకబావి మేలు మరి బావులు నూటిటి కంటె నొక్క స**

**క్రతువది మేలు తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు త**
**త్సుత శతంబు కంటె నొక సూనృత వాక్యమ్మది మేలు సూడగన్ (ఆది 4-94.)**

జలపూరితములైన నూతులు నూటిటి కంటె నొక బావి మేలు. ఎందువలన అనగా నూతి నుండి నీరు పాంథుడు తీసికొని త్రాగటానికి చేద పాత్ర కావాలి. ఈ రెండు లేనిదే నూతిలో నున్న నీటి వలన ప్రయోజనము ఏమి? కావున నూరునూతుల కంటె ఒకబావి మేలు. బావి అనగా దిగుడుబావి అని అర్థము దప్పిగొన్న వారు దిగుడు బావిలో దిగి నీరు త్రాగుతారు. బావులను త్రవ్వించేది పాంథుల దాహము తీర్చుటానికే దాహము తీర్చిన వారికి పుణ్యము కలుగును. వంద బావులు త్రవ్వించి వందలాది ప్రజల దాహము తీర్చువారికి పుణ్యమెంత కలుగును. అంతటి పుణ్యము కంటె ఒక యజ్ఞము ఒనర్చిన పుణ్య ప్రాప్తి ఎక్కువట. మరి బావులు నూరిటి కంటె ఒక సత్క్రతువది మేలు అట్టి శతక్రతువుల వలన ప్రయోజనమేమి? సుతుడు లేనిచో పున్నామో నరకా యత ఇతి పుత్ర: అనునది వేద వచనము. కావున క్రతువు లొనర్చుట కంటె నొక సుతుడు మేలగుచున్నాడు. పుణ్యవర్తనుడగు పుత్రుడు ఉభయ పక్షముల వారిని ఉద్ధరించునట. అటువంటి పుత్ర శతకము కంటెను ఒక సూనృత వాక్యము శ్రేష్ఠమని సత్యమహిమను శకుంతల దుష్యంతుని సభలో వక్కాణించింది.

**పాపవర్తనుండు బ్రాహ్మణుండయ్యును**
**నిజము శూద్రుకంటె నీచతముడు**
**సత్యశౌచ ధర్మశాలి శూద్రుండయ్యు**
**నతడు సద్విజుండ యనిరి మునులు (అరణ్య 5-137)**

చెడు ప్రవర్తనకలవాడు బ్రాహ్మణ కులంలో పుట్టినప్పటికీ శూద్రుడి కంటె అధముడే ఇది నిజం. పరిశుభ్రత పాటించి సత్యాన్ని పలికే ధర్మాత్ముడు శూద్రకులంలో జన్మించినప్పటికీ అతడు సద్బ్రాహ్మణుడే అని మునులు తీర్పు చెప్పారు.

## 1.11. సత్యఫలము

సత్యవాది దీర్ఘకాలము బ్రతుకునట సత్య ధర్మరతులగు మానవులకు కార్యసిద్ధి వెనువెంటనే సిద్ధించును సంసారం ఒక అరణ్యం సంసారంలో పడి జీవించటమంటే అడవిలోపడి నడవటం. అడవిలో పడి నడిచేవాడు. ఒకచోట ఆగడు ఇంకా పైపైకి నడిచి వెళ్తాడు ఆయా దృశ్యాలను చూస్తూ వింత తీరు తెన్నులతో తిరుగుతుంటాడు. అతడికి నిజమైన సుఖమూ శాంతి లభించవు. రోగం పోవటానికి మందు కావాలి.మందుకొరకు యత్నించి పొందవలసి ఉంటుంది. ఆ విధంగా శరీరం మీద వ్యామోహం ఒక రోగము. దానిని పారద్రోలాలంటే నరుడు తన మనస్సులో సత్యాన్ని పరిశుభ్రతను నిగ్రహాన్ని శాంతిని నెలకొల్పుకోవాలి. ఈ సద్గుణాలన్నీ భేషజం వలె పని చేసి నరుడికి శరీరాభిమానం నుండి విముక్తిని ప్రసాదిస్తాయి.

**విను తెవులుడుపగ భేషజ**
**మునకుం దలకొనిన చందమున మది సత్యం**
**బును శౌచము శమమును దమ**
**మును నెలకొలుపంగ వలయు మోహచ్యుతికిన్ (శాంతి 4-286)**

అహింసయు దానము సత్యము క్రోధ వర్జనము మున్నగునవి ఉత్తమమైన ధర్మరాశి. ఇవి ధర్మమునకు పరసీమగా పరిగణింపవచ్చును. వీనిని మనసుకు లంగించాలి. .క్రోధము హింస అసత్యం అనే వాటిని లేకుండా చూసుకోవాలి. సంధ్యాకాలం వచ్చినపుడు సంధ్యను ఉపాసించాలి. ప్రతిఉదయం దేవతలను అర్చించాలి. ఈ పనులే మనకు ఆయువును పెంచుతాయి.

**1.12. అసత్య ఫలము**

అసత్యమాడువారిని జనులు నమ్మరు. అనృతోక్తులు మాట్లాడు వారిని లోకము నిందిస్తుంది. జీవిత సత్యము చక్కనిపద్యములో ప్రజాకవి వేమన ఇలా చెప్పాడు.

**నిజము నాడు వాడు నిర్మలుండై యుండు**
**నిజమునాడు వాడె నీతి పరుడు**
**నిజముపల్కకున్న నీచ చండాలుండు**
**విశ్వదాభి రామ వినురవేమ.**

సభకు వచ్చి ఎవరైనారే ధర్మసందేహం అడిగితే తెలిసి చెప్ప కుంటే సభ్యులు అసత్యమాడే తప్పువల్ల కలిగే ఫలంలో సగం పొందుతారని ధర్మ మెరిగిన మునులు చెప్పారు.

**సభకు వచ్చి ధర్మసందేహ మడిగిన**
**నెఱిగి చెప్ప కుండిరేని సభ్యు**
**లనృత దోషఫలము నందర్థ మొందుదు**
**రనిరి ధర్మ వేదులైనమునులు (సభా 2-237)**

ధర్మాన్నితెలిసి కూడా లాభం చేతనో, లోభం చేతనో పక్షపాతం చేతనో ఊగిసలాడే బుద్ధితోనో సభల్లో ఎవడైనా దానిని మరొక విధంగా పలికితే అతడు అసత్యమాడే దోషం వల్ల కలిగే ఫలాన్ని అనుభవిస్తాడు. ధర్మాన్ని దర్శించే న్యాయమూర్తి అయినవాడు సాక్షి నియమాలు ధర్మనియమాలను తప్పి నీచంగా ప్రవర్తించి సాక్ష్యం, ధర్మం చెప్పితే అలాంటి వాణ్ణి వెయ్యి వరుణ పాశాలు బంధిస్తాయి ఏటేట ఒక్కో పాశం వంతున వదులుతాయి. అన్ని సందర్భాల్లో సత్యాన్ని పలకటం వీలుపడదు. నీచులతో నిజము చెప్పరాదు. అసత్యఫలం ఏంటంటే కఠినంగా మాట్లాడటం అబద్దాలు చెప్పటం, పరుల ధనాన్ని ఆపేక్షించటం, పరస్త్రీలను వాంఛించటం, బంధువుల యందు సత్య పురుషులయందు ద్వేషం వహించటం, చెడు నడవడికగల వారితో స్నేహం చెయ్యటం నరకం పాలయ్యే లక్షణాలు (అను5-220)

**1.13. సత్యమాడరాని సందర్భాలు**

సత్యమాడరాని సందర్భాలు కొన్నిఉన్నాయి.

**సత్యంబు అహింసయు నను**
**నత్యుత్తమ ధర్మయుగళమందు నహింసన్**
**సత్యము గాచుట ధర్మ మ**
**సత్యమున నహింసగావ జనునంద్రు బుధుల్ (కర్ణ 3-73)**

అసత్యమాడియైనను అహింసను రక్షించాలి. అనిబుధులుచెబుతున్నారు. సత్యం పల్కటం సర్వ ధర్మాలకు మంచిది. ఇతరులధనము ప్రాణము అపహరింపదలచినపుడు అసత్యముపలకరాదు. పలికినయెడల అది పాపము. బొంకులు పలికినను ఆ పాతకులనుహింసించినను అది ధర్మమే అగును.

**సత్యంబుపల్కుట సర్వ ధర్మములకు**
**మిక్కిలి యనృతంబు మేటి పాత**

**కము తద్విశేషంబు గలదు చెప్పెద నొరు**
**నర్థంబు ప్రాణంబు నపహరింప**
**జూచుపాతకులతో సూనృతం బాడుట**
**పాపంబు బొంకులుపలికి యట్టి**
**వారి హింసించుట పరధర్మమిది యొక్క**
**దేలభూతములకు హితము సేయు**

**బొంకులెల్లను ధర్మముల్ భూత బాధ**
**కంబులగు నిక్కములు పాతకములు వినుము**
**భూతముల దుష్ట శిష్టత్వములు వివేక**
**సూక్ష్మతా వేద్యములు వాని జూడవలయును (శాంతి 3-45)**

ధర్మలోకాలకెల్ల ఉత్తమమైన ధర్మం నిజం చెప్పటం పాపాలలో కెల్ల మహాపాపం అబద్ధాలాడటం ఈ రెండింటి గురించి చెప్పుకొనదగినది ఒకటి ఉంది. పరాయివాడి సొమ్మును ఉసురును దోచుకోవాలనే పాపులతో నిజం చెప్పటం కన్నా చేటు మరొకటి ఉండదు. అబద్ధాలు ఆడైనా అటువంటివారిని బాధించటం ఎంతో న్యాయం అంతేకాదు ప్రజలకు మేలుకలిగించే అబద్ధాలన్నీ పుణ్యాలు అవుతాయి. సాటిజీవులను వేధించే సత్యాలన్నీ పాపాలవుతాయి. అందరిలోనుఉన్న మంచిచెడు అనేవి అతిసూక్ష్మమైనవి. వివేకంతో తెలుసుకోవాలి.

## 1.14. సత్యాసత్యముల ధర్మ సూక్ష్మత

మనము కొన్ని సందర్భాల్లో పలికిన సత్యము అసత్య దోషమవలె పాతకమగును. అలాగే మరి కొన్ని సందర్భాల్లో పలికిన అసత్యము సత్యము వలె కనిపిస్తాయి. కాబట్టి సత్యాసత్యములు పలుకుటలోని ఆంతర్యము సూక్ష్మంగా ఉండును. ఆ ధర్మ సూక్ష్మతను ఎరిగిన మానవుడు సత్యాసత్యములను సమయ సందర్భములను గమనించి పలుకవలెను అని భారతం బోధిస్తుంది. ప్రాణహాని వచ్చుసందర్భమున సర్వధనాపహరణము జరుగునపుడు సత్యము అనృత తుల్యము ఆ సందర్భము నందు అసత్యము పలికినను అది సూనృత సమము కాబట్టి ఇట్టి సమయములో ధర్మము ఎరింగి సత్యాసత్యములందు ఏది పలుకవలెనో తెలుసుకోవటం మంచిది.

**ప్రాణహాని వచ్చు పట్టున సర్వ ధ**
**నాపహార వేళయందు నడుపు**
**సత్య మనృతమండ్రు సత్యంబు సూనృత**
**మని పరిగ్రహింతు రార్య జనులు (కర్ణ3-77)**

సర్వభూత హితము గోరి పలుకు బొంకు కూడా సత్యఫల ప్రదాయిని అవుతుంది. పరిణయము విషయములో పలుకు అసత్యము సత్యాతిశయముగ పరిగణింపనగును. ఇటువంటి ధర్మసూక్ష్మములు తెలుసుకుని మానవుడు ప్రవర్తిసే మంచిదనిపెద్దలంటారు.

## 1.15. అసత్య ము పలుకనగు సందర్భాలు

అసత్యము పలుకుట పాపమైనను కొన్నిసందర్భాల్లో పలికినను ఫరవాలేదట. అసత్యదోషము అంటదు. ప్రాణవచనసమయమున అసత్యవచనదోషమురాదు తన ప్రాణమురక్షించుట కొనుటకుగాని, ఇతరుల ప్రాణమును రక్షించుటకు

గాని వ్యక్తి అసత్యము పలికినను పలుకవచ్చును. అసత్యము చెప్పటం పాపమే అయినా ఈ సందర్భాల్లో చెప్పవచ్చు. వనితవిషయములోను, వివాహ విషయములోను పరిహాసముకొరకు ప్రాణాపాయ సమయములో అనగాచావువచ్చినవేళలో సర్వధనాపహరణజరుగుసందర్భంలో అసత్యము పలికిననుఅది పాపముకాదని భారతం చెబుతోంది.

**అనృతము పాతకమగు నై**
**ననువనితల యెడను బెండ్లి నవ్వున మృతి వ**
**చ్చిన సర్వధనము జెడు చో**
**వినుమది పాపంబు కాదు విమల చరిత్రా! (శాంతి 3-438)**

శుక్రుని వచనమునకు ఒడంబడిన యయాతితానెట్లు బొంకనేర్తునని శర్మిష్ఠకు చెప్పాడు. శర్మిష్ఠ బొంకనగుసమయసందర్భాలను ఈ విధంగా ఏకరువుపెట్టింది. ప్రాణముపోవుచున్న సమయంలోను సర్వధనా పహరణమునందు, వధగా వచ్చిన విప్రార్ధమునందు వధూజన సమయమందు వివాహ సమయములందు బొంక వచ్చు. కృష్ణద్వైపాయనుడు ధర్మరాజునకు శాంతి పర్వము నందు ధర్మాధర్మము లెరింగించును పాపముల వలె ద్వేషములు అన్ని విషయములు చెప్పుచు వ్యాసభగవానుడిట్లు వాక్రుచ్చినాడు. ఎప్పుడు బొంకవలెనో చెప్పుచున్నాడు. ప్రాణహాని తప్పింపదలచినపుడు పరిణయము నందు, గురు జనకార్యార్థమునందు అంగనతో సంభాషించునపుడు సర్వధనము చెడునపుడు ...

**ప్రాణహాని దప్పించుచో బరిణయంబు**
**నందు గురుజన కార్యార్థమయ్యు నంగ**
**నాజనముతోడి సంభాషణమున సర్వ**
**ధనము జెడియెడు నెడ బొంక జను నృపాల (శాంతి1-299)**

### 1.16. ముగింపు

సత్యస్థాపన. సత్యమే పరబ్రహ్మము. విమల సత్యమునకు బొంకు కారణముగ ప్రమాదము వాటిల్లినపుడు దక్షులైనవారు ఉపేక్షింపరాదు. అట్లు ఉపేక్ష చేసినచో అది ఆ ఉపేక్షించిన వారికే చేటు కలిగించును సత్య స్థాపన అంతమున జరుగును. సత్య శుభదాయకమైన దైవము ఉండనే ఉన్నది. ఆ దైవమే ఆ పరబ్రహ్మమే సత్యరక్షణము గావించి సత్యమును స్థాపించును. (ఉద్యో 3-273)

**ఆధారగ్రంథాలు**

1.కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

# 56. శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాములవారి గీతాభక్తితత్వం

– డా॥ ఎం.దీనదయాళ్, తిరుపతి

## గీతాస్వరూపులు

### శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఆనందనామసంవత్సరచైత్ర బహుళతృతీయ సోమవారం అనూరాధనక్షత్రం అనగా 1914–4–13వ తేదీన పవిత్రమైన సమయంలో భారతదేశంలో ఆంధ్రావనిలో అవతరించిన దివ్యాత్మస్వరూపులే శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

**"శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టో ఽభిజాయతే"।**
**"అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్"।**

అని భగవద్గీత చెప్పినట్లుగా యోగిపుంగవులైన శ్రీరామ స్వామిగారు శ్రీమతి సుశీలాదేవి గార్ల ఆధ్యాత్మిక శిక్షణలో దినదిన ప్రవర్ధమానులై శ్రీస్వాములవారుండిరి.

**"వనే ఽ పి దోషాః ప్రభవన్ని రాగిణాం,**
**గృహే ఽ పి పంచేంద్రియ నిగ్రహస్తపః ।**
**అకుత్సితే కర్మణి యః ప్రవర్తతే,**
**నివృత్తరాగస్య గృహం తపోవనమ్" ॥**

వైరాగ్యం లేనివారు దట్టమైన అడవిలో నివసించినను, అంతఃకరణంలో నంటి పెట్టుకున్న వాసనాయుతమైన దోషాలు వెంటాడుతూనే యుంటాయి. తెలుగులో ఒక సామెత వాడెదరు – "రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరుడు వదలలేదు" అని. విషయాసక్తిలేనివారు ఇంటిలోయున్నా – ఇంద్రియాలను విషయములనుండి మరల్చి తపోనిష్ఠులగుదురు. వేదవిహితమైన పవిత్ర కర్మనాచరిస్తూ జ్ఞానార్జనకై శరీరపోషణకు కావలసిన శబ్దాది విషయాలను స్వీకరిస్తూ విరక్తిగా నుండే గృహస్థుని గృహమే తపోవనం. అటువంటి తపోవనమైన గృహంలో అవతరించి, పితృస్వరూపలైన శ్రీరామస్వామిగారి ముఖారవిందం నుండి వేదాన్తపంచదశి, ఆత్మబోధ, జీవన్ముక్తి ప్రకాశిక మొదలగు ఆధ్యాత్మిక గ్రంథాలను బాల్యకాలములోనే శ్రవణం చేసిన సుధీరులే శ్రీస్వాములవారు. 'గ్రహణధారణపటుర్బాలః' అన్నట్లు వీరు శాస్త్రవిషయాలను చక్కగా ధారణచేసినవారు. న్యాయవాద వృత్తిలో నిపుణులైన తండ్రిగారు గీతాప్రవచనాలు గంటల తరబడి అనేక స్థలాలలో చేస్తుండగా ఆ ప్రవచనాలు శ్రద్ధతో విని ప్రగాఢమైన భగవద్గీత బీజం హృదయంలో నాటుకొన్నది శ్రీస్వాములవారికి. ఆధ్యాత్మిక బీజంతో పాటు లౌకిక విద్యలో బి.ఏ డిగ్రీ వరకు కళాశాలలో చదివిరి. ఆ సమయంలో తిరుమల గోగర్భంలో ద్వాదశసంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మ నిష్ఠాగరిష్ఠులై 1926లో శ్రీవ్యాసాశ్రమమును స్థాపించిన మహర్షిశ్రీమలయాళ స్వాములవారు ప్రవచన పర్యటనలో కృష్ణాజిల్లా మచిలీపట్నం వెళ్ళారు. అచ్చటనే పంచాక్షరీ మహామంత్రం శ్రీవిద్యా ప్రకాశానందస్వాముల వారికి ఉపదేశించిరి. (వీరి పూర్వ నామధేయం ఆనందమోహన్) తదుపరి వీరు కాశీ క్షేత్రము వెళ్ళి హిందీ విద్యాధ్యయనముచేసిరి.

1936 సంవత్సరంలో శ్రీవ్యాసాశ్రమం చేరుకొన్నారు. సద్గురు శ్రీమలయాళస్వాములవారికి ముఖ్యమైన ప్రియశిష్యులైనారు. శ్రీవారి దివ్యకరుణా కటాక్షవీక్షణములు సంపూర్ణముగా వీరియందున్నవి. వీరు వ్యాసాశ్రమం చేరిన కొలది దినాలలోనే అపక్వాహారమును ప్రారంభించి 12 సంవత్సరములు ఆ ఆహారమునే స్వీకరించి తపోనిష్ఠాగరిష్ఠులైరి.

శ్రీకాళహస్తీశ్వరుడు వేంచేయు బాటయందు, 1950లో సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు శ్రీశుకబ్రహ్మాశ్రమమును స్థాపించిరి. ఈ ఆశ్రమ స్థాపనకు సద్గురు దేవులైన శ్రీమలయాళస్వాములవారిని సవినయంగా నాహ్వానించిరి.

శ్రీసద్గురుదేవుల ఆశీర్వాదంతో శ్రీవారి అమృత హస్తాలతో ఈ ఆశ్రమమును ప్రారంభించిరి. శ్రీవారే, పూజామందిరములో శ్రీశివలింగమును స్థాపించిరి. ఈ పవిత్రప్రదేశంలో శుకుడు తపస్సుచేసినట్లు పురాణాలు చెపుతున్నాయి. రోమశుడు, మార్కండేయుడు, అగస్త్యుడు, నారదుడు మొదలైన మహర్షులు ఈ క్షేత్రంలో పూర్వం తపస్సు చేశారు. ఇంత విశేషపుణ్యఫలదాయకమైన, జ్ఞానపల ప్రదాయకమైనదీ క్షేత్రమని బాగుగా తెలుసుకొని సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు ఇచ్చటనే ఆశ్రమమును స్థాపించిరి. పూర్వము శ్రీస్వాములవారు ఋషికేశ్–ఒకపర్యాయం ఆశ్రమాలు, పూజ్యమహాత్ముల సందర్శనార్థం వెళ్లారు. ఆ సమయంలో గంగానదిలో పడవపై పోతున్నపుడు చిన్న గడ్డికుప్పలో భగవద్గీతాగ్రంథం తన పడవ సమీపమునకు వచ్చినది. నాగరిలిపిలో నున్న ఆ గ్రంథమును శ్రీవారు స్వీకరించారు. పరమసంతోషమును పొందినారు. నాటినుండి గీతాభావమును సంపూర్ణముగా తెలుసుకొని ఆచరించిన ప్రజ్ఞాశీలురే శ్రీసద్గురు స్వాములవారు. 'స్వయం తీర్ణఃనిపరాంస్తారయతి' అనే సూక్తి ననుసరించి తాను బాగుగా నాచరించి, తరించి, ఇతరులను తరింపజేయుటకు భగవద్గీతా ప్రబోధం అవసరమని నిశ్చయించిరి.

'సమస్త వేదార్థసార సంగ్రహమిదం గీతాశాస్త్రమ్' ఋగ్వేదం, యుజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం ఈ నాలుగు వేదములలో యున్న సారబూతమైన విషయమే గీతాశాస్త్రం. భగవద్గీతలో భావమును సమగ్రముగా తెలుసుకొంటే నాలుగు వేదముల భావమును తెలిసికొన్నట్లే యగును. పై సూక్తిని జగద్గురు శంకరభగవత్పాదులవారు గీతాభాష్యములో చెప్పియున్నారు.

**"భగవన్ పరమేశాన భక్తిరవ్యభిచారిణీ" ।**
**ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో ॥**

వరాహపురాణంలో – మానవుడు మోక్షమునకు ముఖ్యహేతువైన అవ్యభిచారిణీ భక్తిని ఏవిధముగా పొందగల్గునని భూదేవి శ్రీమహావిష్ణుని ప్రశ్నించెను.

**"ప్రారబ్ధం భుజ్యమానో ఽపి గీతాభ్యాసరతస్సదా ।**
**సముక్తస్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే" ॥**

పూర్వజన్మార్జిత పుణ్యపాపముల మూలమున మానవుడు ఈజన్మములో సుఖదుఃఖ ఫలభోగముల ననుభవించుచున్నను ఎల్లపుడు గీతాభావమును తెలుసుకొని ఆచరణయందు నిమగ్నుడైన వానికి అవ్యభిచారిణీభక్తి సిద్ధించును. ఇది సిద్ధించినవాడు ముక్తుడగును. ముక్తి నొందినవాడు సుఖశాంతులను పొందును. అవ్యభిచారణీ భక్తి ద్వారా బ్రహ్మాది దేవతలందరిలో విరాజమానమైన చైతన్యం, మానవులందరిలో యున్న చైతన్యం, పశుపక్ష్యాది జంతుజాలములన్నిటిలోను వెలిగే చైతన్యం, ఒకటేయని తెలిసికొని 'సమస్సర్వేషుభూతేషు మద్భక్తింలభతే పరామ్' అని గీతాచార్యుల వారు చెప్పినట్లు అందరియందు సమమైన భావముంచి పరమప్రీతిగలిగియుండుట, అందరిలోనున్న చైతన్యమే నాలోయున్నదని దృఢభావం గలిగియుండుటే అవ్యభిచారిణీభక్తియనబడును.

18 అధ్యాయములలో కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞానములుగా యున్న రహస్యములను బాగుగా తెలిసికొని, హృదయస్థం చేసుకొని, ఆచరణీయాత్మకముగా లోకములో ఆదర్శరూపులైన వారే శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

శ్రీమహర్షిమలయాళస్వాములవారు ప్రతి సంవత్సరం సనాతన వేదాంత జ్ఞాన మహాసభలను ఒక్కొక్క గ్రామములో జరుపుచున్నారు. 1955 సంవత్సరమున కోలారు జిల్లాలో అగరం గ్రామంలో జరిగిన సభకు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామువారిని సభాధ్యక్షులుగా ఉండమని ఆజ్ఞాపించి, ప్రతీసంవత్సరం జరిగే సభలకు మీరే ఉండాలని నిర్ణయించారు. శ్రీగురుదేవులయాజ్ఞ మేరకు వారి జీవితాంతం అధ్యక్షులుగా ఉండి సభలన్నీ దివ్యంగా భవ్యంగా అద్భుతంగా నడిపించారు.

లోకములో ప్రతిమానవునికీ గీతాజ్ఞానం గలిగించాలని, వారందరూ సుఖశాంతులతో యుండాలని, మానవులు మానవధర్మాన్ని తెలుసుకోవాలని, ఈ జన్మలో జీవన్ముక్తులు గావాలని సంకల్పించి గీతాజ్ఞానయజ్ఞమనే పేరుతో ప్రవచనములు ప్రారంభించారు సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు. ప్రథమ గీతాయజ్ఞం 1957 డిశంబరులో గుంటూరు జిల్లా నరసారావుపేటలో 3-12-1957 నుండి 20-12-1957 వరకు అత్యద్భుతముగా విశేషప్రజానీకముతో జరిగింది. ఆ విధముగా 108 గీతా జ్ఞానయజ్ఞాలను జరిపిరి. ఒక్కొక్క జ్ఞానయజ్ఞము లక్షలాది జనులు వినేవారు, విద్యాంసులు, వివిధ పండితులు, ఉన్నతోద్యోగులు, సామాన్యమానవులు, వ్యాపారస్థులు, వాహనములు నడిపేవారు, రిక్షాలునడిపేవారు, యువకులు, పిల్లలు, వృద్ధులు స్త్రీలు, పురుషులు -ఉపన్యాస ప్రారంభమునకు 15 నిముషంలు ముందే వెళ్ళి కూర్చొనేవారు. వారి ప్రవచనలు అందరికి అర్థమయ్యేవి. అర్థముకాని శ్రోతలు లేనేలేరు. పామరజనులకును తెలిసేటట్లు ప్రవచనం గావించిన మేధాసంపన్నులు శ్రీసుద్గురు స్వాములవారు. 108వ గీతాజ్ఞానయజ్ఞం సికింద్రాబాద్‌లో 13.5.82 నుండి 1.6.82 వరకు జరిగినది.

గీతా ప్రవచనాలతో ప్రజలలో జాగృతిని గలిగించి ఆ జాగృతి సదాయుండుటకు గాను, అందరికీ అర్థమయిన విధముగా విస్తారంగా 'గీతామకరందము' అనే గ్రంథమును రచించి లోకమునకందజేసిన లోకోద్ధారకులే సద్గురు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు. ఈ గ్రంథమును లక్షలాది జనులు చదువుచూ, సుఖశాంతుల నొందుచూ, ఆత్మజ్ఞానమును పొంది జీవన్ముక్తులై విరాజమానులై యున్నారు. అటువంటి దివ్యపురుషుని శతజయంతి సందర్భంగా వారి దివ్యపాదారవిందములకు ఈ వ్యాసమనే పుష్పమును సమర్పించుకొనుచూ నమస్కారం చేయుచున్నాను.

## గీతయందు భక్తి యోగం

భగవద్గీత యందు భిన్నభిన్న సిద్ధాంతములు ప్రతిపాదింపబడినప్పటికిని ఒకే విచారధార సర్వత్ర ప్రవహించుచున్నది. అదియే యోగం. సిద్ధాంతమును ఆచరణలోనికి తెచ్చు కళయే యోగమనబడును. జీవుని శివునితో కలుపు సాధనమే యోగమని పేర్కొనబడును. జనులయొక్క సంస్కారములు, మనస్తత్వములు భిన్నముగా నున్నందున భగవత్ప్రాప్తికి వారవలంబించు సాధనలున్ను వేఱు వేఱుగా నుండుటచే యోగములున్ను అనేకములుగా రూపొందుటకు హేతువైనది. మరియు రోగం లనేకములుగా నున్నపుడు మందులున్ను అధికముగానే యండవలసివచ్చును. ఈ కారణముననే పెక్కు యోగములు, గీతయందు పేర్కొనవలసివచ్చినది. జైమినియొక్క కర్మసిద్ధాంతం, నారదునియొక్క భక్తిసిద్ధాంతం, పతంజలియొక్క యోగసిద్ధాంతం, వేదవ్యాసులయొక్క జ్ఞానసిద్ధాంతం - అన్నియును గీతయందు చక్కగ ప్రతిపాధింపబడినవి. అన్నివస్తువులు దొరుకునట్టి పెద్ద అంగడియే భగవద్గీత. ఎవరికి ఏదేది అవసరమో వారికది గీతయందు లభించును. ఇన్ని యోగములు, ఇన్ని మార్గములు రచింపబడినప్పటికిని వాని యన్నిటిమధ్య చక్కని సమన్వయమును సాధించుట గీతయొక్క మహిమావిశేషం. మోక్షమునొందుటకు కర్మ, భక్తి, ధ్యానం జ్ఞానం - అన్నియు కొంత కొంత మోతాదులో అవసరమే అయియున్నవి. ఏ యొక్క దానినిగూడ విడిచిపెట్టుటకు వీలులేదు. కర్మచే పవిత్రత (Purification), భక్తిధ్యానములచే ప్రకాశము (Illumination), జ్ఞానముచే ఐక్యత (Union) సిద్ధించగలవు. ఇల్లు కట్టుటకు ఇటుక, సున్నం, కొయ్య ఎట్లావశ్యకములో, రొట్టె చేయుటకు పిండి, నెయ్యి, వేడిమి ఎట్లవసరములో, అట్లే కైవల్యప్రాప్తికిని కర్మ, భక్త్యాది సాధనములన్నియు ఆవశ్యకములై యున్నవి. ముక్కాలిపీటకు ఏకాలు లేకున్నను పీట నిలువదు. అట్లే పైసాధనలలో ఏదికొరతగానున్నను సాధన పరిపూర్ణం కానేరదు. కనుకనే మహనీయులగువారు తమ జీవితములో అన్నిటిని సాధించివేసి పరమశాంతిని బొందుచుందురు. అయితే ఒక్కొక్కరి మనస్తత్వమును బట్టి ఒక్కొక్కటి అధికముగా నుండవచ్చును. తక్కినవి గౌణముగానుండును. అన్ని మార్గములయొక్క ప్రధానలక్ష్యం అహంకారం (జుస్రశీ) ను తొలగించుటయే యగును.

ఇక నిపుడు భక్తిమార్గమును గూర్చి ఒకింత విచారించెదము. భగవంతునియందు ప్రీతిగలిగి యుండుటయే భక్తి. భక్తియందు తన్మయత్వమును బొందినవాడు "నీవే తప్ప ఇతఃపరం బెరుగ" నని వచించును. 'నాది యేమియునులేదు.

అంతయు మీదే, మీరే తల్లి, మీరే తండ్రి; నేను మీ దాసానుదాసుడను' అని భగవంతుని ఉద్దేశించి పలుకును. అర్జునుడున్ను శ్రీ కృష్ణపరమాత్మకు సర్వసమర్పణము చేసికొని "శాధి మాంత్వాం ప్రపన్నమ్" – 'అజ్ఞాపింపుడు' అని వేడుకొనెను. అయితే సామాన్యభక్తితో గీత తృప్తిపడదు. 'అనన్యభక్తి' కావలెనని కోరుచుండును. 'అనన్య' అను పదం గీతయందు పదేపదే ప్రయోగింపబడుట గమనించదగినది. అన్యభావం లేకుండుట 'అనన్య' మనబడును. అనగా భగవంతునియందు తప్ప అన్యత్ర చిత్తం లగ్నం కాకుండుటయే అనన్యభక్తియగును. "ఇట్టి అనన్యభక్తి, ఇట్టి అవ్యభిచారిణీ భక్తికలవాడు నాకత్యంతప్రియుడు. అట్టివానిని నేను మృత్యురూపమగు సంసారసాగరం నుండి సముద్ధరించెదను," అని శ్రీ కృష్ణమూర్తి కరుణతో నుపదేశించిరి. ఒకవేళ మనస్సు దైవమునందు నిలుకడబొందనిచో అభ్యాసముచే నెట్టైన దానిని సాధించవలెనేకాని పట్టుదలను వదలరాదని సూచించిరి. కారణమేమనగా, ప్రపంచములో స్థిరమైనది. నాశరహితమైనదియునగు పదార్థ మొకటియే కలదు. అదియే పరమాత్మ. తక్కిన వస్తువులన్నియు క్షణికములు, నాశవంతములు, అస్థిరములు. వానిని నమ్ముకొనినచో శాంతి సుఖములు ఏ కాలమందును లభించజాలవు. కావుననే మాయాతీతుడగు పరమేశ్వరుని మాయంతర్గతుడగు జీవుడు తప్పక ఆశ్రయించవలసి యున్నాడు. తరించుటకు వేరుమార్గములేదు. అట్లు ఆశ్రయించుటనే భక్తి యని యందురు.

మరియు సర్వేశ్వరునియొక్కయు, సద్గురుల యొక్కయు అనుగ్రహముండిననే తప్ప జీవుడీ భయంకర సంసార సాగరమును దాటలేడు. ఇదియొక పరమరహస్యం. ఈ రహస్యమును తెలియక ఎందఱో తమతమ స్వీయలౌకిక ప్రజ్ఞచే ప్రకృతిని జయింపజూచి తుదకు విఫలులైరి. ఏలననిన ప్రకృతి పరమాత్మకు అధీనమైయున్నది. పరమాత్మనాశ్రయించని వారికి ఆ ప్రకృతి విఘ్నములున్ను తొలగవు. పరమాత్మయే భక్తికి అధీనుడు. భక్తితో తన్నారాధించువారికి, తనయందు చిత్తమును నెలకొల్పువారికి వారు అనుగ్రహమును ప్రసాదించి వారి యాపదలను తొలగించి, తనయందు చేర్చుకొనును. వారి యోగక్షేమములను విచారించును.

**1. మచ్చిత్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి**

**2. తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్.**

ఇత్యాది గీతావాక్యములద్వారా శ్రీకృష్ణపరమాత్మ పై యర్థమునే చక్కగ విశదీకరించిరి.

మరియు మోక్షమునకు ప్రత్యక్ష హేతువైన ఆత్మానాత్మ విచారణారూపమైన జ్ఞానం కలుగవలెననిన, మున్ముందు భక్తి పరిపూర్ణముగ హృదయమున నావిర్భవించవలెను. "భక్త్యా జ్ఞానం ప్రజాయతే" – భక్తివలననే జ్ఞానం ప్రాదుర్భవించునని శాస్త్రములు వచించుచున్నవి. మహాత్ముల యనుభవములున్ను అట్లే కానుపించుచున్నవి. భక్తియను పుష్పం వికసించినపుడు మాత్రమే జ్ఞానమను ఫలము ఆవిర్భవించును. జీవుని భక్తికి మెచ్చి భగవానుడే ఆ జ్ఞానఫలమును, ఆ బుద్ధియోగమును అతని కిచ్చునని గీతయందు విభూతియోగమున తెలుపబడినది. దీనిని బట్టి భక్తియొక్క ప్రాశస్త్యమెట్టిదో స్పష్టపడుచున్నది.

అయితే గీతాచార్యులు ప్రాథమికభక్తితో పరితృప్తినొందక పరాభక్తిని కూడ తెలియజేసిరి. ఫలపుష్పాదులతో దేవుని అర్చించుట సామాన్యపూజ. ఏలననగా ఆ పుష్పాదులు భగవన్నిర్మితములు. మానవుడు నిర్మించినవికావు. దేవుడు నిర్మించినదానిని దేవునికి ఒప్పజెప్పుట సామాన్యమైనపని. మానవుడు తన హృదయక్షేత్రమున, హృదయోద్యానమున సొంతముగపెంచి పోషించినట్టి సుగుణములను పుష్పములను, దైవీసంపదయను పుష్పరాశిని భగవంతునికి అర్పించినపుడు మాత్రమే ఆ పరాత్పరుడు అపరిమితముగ సంతోషించును. ఇదియే పరాపూజ యనబడును. ఇదియే పరాభక్తియనియు పేర్కొనబడును. కనుకనే శ్రీకృష్ణపరమాత్మ భక్తియోగమను (12వ) అధ్యాయమున చిన్నచిన్న పూజలను ఎక్కువగ వర్ణించక, ద్వేషరాహిత్యం, మైత్రి, కరుణ మొదలగు ముప్పదియైదు సుగుణరాజములను (అద్వేష్టా స్సర్వభూతానాం... ఇత్యాదులను) వర్ణించి చెప్పిరి. ఇట్టి సద్గుణకుసుమమాలలచే హృదయక్షేత్రమును అలంకరించుకొనువాడే నిజమైన భక్తుడు. అట్టి గుణగ్రహణమే నిజమైన భక్తి. 'భక్తిమాన్యస్సమే ప్రియః' అని పదేపదే చెప్పుచు అట్టి అద్వేష్టృత్వాది గుణములు కలవాడే నాకత్యంతప్రియుడని

భగవానుడు గీతయందు ఘోషించిరి. కాబట్టి భక్తియోగు లొకింత జాగరూకులై సామాన్యపూజ, ఆరాధనలతో బాటు మైత్ర్యాది సుగుణములను గూడ సంపాదించి భగవానుని కృపకు పాత్రులు కావలయును. అపుడే భక్తియోగం పరిపూర్ణమై చక్కగ రాణించును.

అన్ని యోగములకంటెను భక్తియోగం చాల సులభమైనది. ప్రతివానికిని అందుబాటులోనున్నది. కఠినమైన సాధనలెవ్వియును దీనియందులేవు. భగవానునిపై నిష్కళంక ప్రేమ కలిగియున్నచాలును. ఇవ్విధముగ సర్వులకును సులభ సాధ్యమైన మార్గమగుటచే గీతయందియ్యది విశేషముగ వర్ణించి చెప్పబడినది. దాదాపు ప్రతి అధ్యాయమందును దీనిని గూర్చిన ప్రస్తావన ఏదియో కొంత ఉండనే ఉన్నది. అఖండమైన జ్ఞానోపదేశం చేయబడిన 14వ అధ్యాయమందుకూడ చిట్టచివర–

**మాంచ యో ఽ వ్యభిచారేణ భక్తియోగేన సేవతే.**
**సగుణాన్సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే.**

'ఎవడు అచంచలమైన భక్తియోగముచే నన్ను సేవించుచున్నాడో, అతడీ త్రిగుణములను అతిక్రమించినవాడై బ్రహ్మసాక్షాత్కారమున కర్హుడగుచున్నాడు' – అని ఈ ప్రకారముగ భక్తియొక్క మహిమ కీర్తింపబడినది. మరియు విశ్వరూపసందర్శన యోగమున చివరిభాగములో ఒకానొక అద్భుతరహస్యమును శ్రీకృష్ణపరమాత్మ బహిర్గతమొనర్చివేసిరి. అది యేదియనిన –

**భక్త్యాత్వనన్యయా శక్య అహమేవంవిధో ఽ ర్జున**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుంచ పరన్తప.**

"ఈ ప్రకారమగు విశ్వరూపమును తెలిసికొనుటగాని, చూచుటగాని, అందు ప్రవేశించుటగాని అనన్యభక్తిచేతనే సాధ్యపడగలదు. ఇతరమగు దేనిచేతనుగాదు" అని. దీనినిబట్టి భగవదైక్యమునకుగాని, భగవద్దర్శనమునకుగాని భక్తియే ప్రధానకారణమని స్పష్టపడుచున్నది. మరియు అక్షరపరబ్రహ్మయోగమున "పరమపురుషుడగు పరమాత్మ అనన్యభక్తిచేతనే లభ్యమగునని" అసందిగ్ధముగ ప్రకటింపబడియుండెను. గీతయం దొక చోట "నన్నెవరును తెలిసికొనలేరు" (మాంతు వేదన కశ్చన) అను భగవద్వాక్యమును వినగనే నిర్విణ్ణహృదయులైన ముముక్షుజనులను వెనువెంటనే మరల "భక్తిచే నన్ను తెలిసికొనగలరు" (భక్త్యామామభిజానాతి) అను వాక్యమును చెప్పి శ్రీకృష్ణపరమాత్మ ఊరడించిరి. దీనినిబట్టి భక్తికి ఎట్టి అలౌకిక ప్రతిభ కలదో తేటతెల్లమగుచున్నది. కాబట్టి భగద్వాక్యమునందు విశ్వాసముగల్గి సులభతరమైనట్టి ఈ భక్తియోగమును సర్వులను ఆశ్రయించి బ్రహ్మానందవారాశి యందు ఓలలాడుదురుగాక!

**పూజ్యులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారి దివ్య సందేశం**

మిత్రమా! ఎందుకు బాధపడుతున్నావు! అయిందేదో అయింది – పోయిందేదో పోయింది.

ఈ లోకానికి వచ్చేటప్పుడు–వట్టిచేతులతో వచ్చావు! పోయేటప్పుడు – లగేజితో పోవాలనుకుంటున్నావు!

అందుకే నీకీ ఆరాటం, అశాంతి. నీవేమి పోగొట్టుకున్నావని విచారిస్తున్నావు!

నీవేమి తెచ్చావని– నీవు పోగొట్టుకుంటావు? నీవేమి సృష్టించావని – నీకు నష్టం వచ్చింది?

నీవు ఏదైతే ఇచ్చావో – ఇక్కడిదే ఇచ్చావు

ఈనాడు నీవు నీ సొంతం అనుకున్నదంతా నిన్న ఇంకొకరి సొంతం కాదా?

రేపు మరొకరి సొంతం కాగలదు.

కావున జరిగేదేదో జరుగక మానదు - అనవసరంగా ఆందోళన పడకు.

అందోళన అనారోగ్యానికి మూలం. ప్రయత్నలోపం లేకుండా ప్రయత్నించు.

ఫలితం ఏదైనా దైవ ప్రసాదంగా స్వీకరించు.

కారు లేదని చింతించవద్దు- కాలు వున్నందుకు సంతోషించు.

కోట్లు లేవని చింతించవద్దు - కూటికి వుందిగా! సంతోషించు.

కాలిలో ముల్లుగుచ్చుకున్నదని చింతించవద్దు- కంటిలో గుచ్చుకోలేదని సంతోషించు.

కాలం విలువైనది - రేపు అను దానికి రూపులేదు. మంచిపనులు వాయిదా వేయకు.

అసూయను రూపుమాపు- అహంకారాన్ని అణగద్రొక్కు

హింసను విడనాడు - అహింసను పాటించు.

కోపాన్ని దరిచేర్చకు - ఆవేశంతో ఆలోచించకు.

ఉపకారం చేయలేకపోయినా- అపకారం తలపెట్టకు.

మతిని శుద్ధం చేసేది మతం- మానవత్వం లేని మతం మతంకాదు.

దేవుని పూజించు- ప్రాణికోట్లకు సహకరించు, తద్వారా భగవదాశీర్వాదంతో

శాంతి నీ వెంట, ఇంట, చెంత వుండగలదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## శ్రీస్వామివారి రచనలు చదివిన వారికి జన్మరాహిత్యమే

"శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి " వారు అనగానే ముందుగా నాకు గుర్తుకు వచ్చేది "గీతామకరందం" పేరు మీద చెప్పబడిన శ్రీ స్వామీజీ యొక్క గీతోపన్యాసములే. ఈ గీతామకరందం నిజంగా మకరందమే. కేసెట్ల రూపంలో ఉన్న ఈ ఉపన్యాసములను మా నాన్నగారు తరచుగా వినేవారు. నేను అప్పడప్పడు వినేవానిని. ఆ తరువాత 18 అధ్యాయాల 18కేసెట్లను పూర్తిగా వినడం జరిగినది. అలా వినడం కొన్నాళ్లు అలవాటుగా మారింది. అవి ఎన్నిమార్లు విన్నా ఏదో క్రొత్తదనం మనసుకి ఆహ్లాదం, ఆనందం కలుగుతుంది. వింటున్నంత సేపూ స్వామీజీ ధర్మప్రబోధం మనసును ఏదో అలౌకికస్థితికి తీసుకెళ్ళడమే కాక ఏదో ఆత్మానుభూతి కలుగుతుంది.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" "శ్రద్ధకలవాడే జ్ఞానమును పొందును" గీతలోని ఈ వాక్యం నాకు ఏ పని చేస్తున్నా గుర్తుకు వస్తుంది. పరిస్థితులను బట్టి, వయస్సుని బట్టి అనగా బాల్యదశలో అక్షరవిద్యా జ్ఞానం; కౌమార దశలో చదువు; వృత్తి, ఉద్యోగ ధర్మాలజ్ఞానం; యవ్వనదశలో సాంసారిక, లౌకిక జ్ఞానం బ్రతుకు తెరువు కోసం; వార్ధక్యంలో పారలౌకిక జ్ఞానం అదే బ్రహ్మజ్ఞానం, మోక్షజ్ఞానం మనిషికి తప్పక అవసరం.

నిజంగా జ్ఞానియైనవారు వయసుతో సంబంధం లేకుండా బ్రహ్మజ్ఞానమును సంపాదించుకొని తద్వారా మోక్షప్రాప్తిని పొందడమెట్లో శ్రీస్వామివారి గీతోపదేశ ప్రవచనముల ద్వారా తెలుసుకొన గలుగుతాం.

గీతామకరంద శ్రవణం, మననం, నిధిధ్యాసనం ద్వారా మనసును ఆపి ఆలౌకిక స్థితికి చేరడం అనేది అందరికీ అనుభమౌతుంది ప్రయత్నంచేయగలిగితే.

నాకు స్వామీజీతో ప్రత్యక్ష పరిచయానుభవం లేకున్నా-గీతా మకరందం ఉపన్యాసాలను వింటున్నా, గీతామకరందం గ్రంథాన్ని చదువుతున్నా ప్రత్యక్షానుభవం కలుగుతుంది. స్వామి నా ఎదురుగా ఉండి నాతోనే మాట్లాడుతున్నట్లుగా

ఉంటుంది. కొండంత దూదిని ఒక్క నిప్పురవ్వతో బూడిద చేయగలిగినట్లుగా మన సంచితకర్మల నన్నింటిని ధ్వంసం చేయగలశక్తి ఒక్క గీతా పారాయణమునకే కలదని శ్రీస్వామి వారు చెప్పినట్లుగా వేరెవరూ తెలియజెప్ప లేరనేది పరమసత్యం. సంచిత కర్మలను ధ్వంసం చేసుకోవడమెలాగో, ఆగామి కర్మలు అంటకుండా చేసుకోవడ మెలాగో అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పడం స్వామీజీకే చెల్లింది. ఇక ప్రారబ్ధకర్మలు అవశ్యభోజ్యం కనుక అవి శరీరానికే, మనసుకే కాని ఆత్మకు కాదనుకొనే తత్త్వం ఈ గీతా మకరందం ద్వారా అలవడుతుంది. కనుక అంతా పరమాత్మ కృపగా భావించి ఆనందంగా స్వీకరించడానికి ప్రయత్నిస్తాం. ఇది గీతామకరందం ద్వారా నేను అనుభవిస్తున్న విషయం.

నాకు ఏదైనా దుఃఖం కలిగినపుడు శ్రీస్వామివారి ప్రవచనం ఏది విన్నప్పటికి మనఃక్లేశం తగ్గి, నేను ఆత్మనను భావనను కలుగజేస్తుంది.

**శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు హృదయకుహరమందు జీవించే వున్నారు**

ఒక రామకృష్ణ పరమహంస !

ఒక వివేకానందుడు !

ఒక రమణ మహర్షి !

ఒక సత్యసాయి బాబా !

ఒక విద్యాప్రకాశానందగిరి స్వామి !

వీరందరూ వీరికి వీరేసాటి ! వీరితో పోల్చగలవారు కనబడడంలేదు. తరులూ, గిరులూ, నదులూ, నరులూ ఉన్నంతకాలం వీరిస్థానం వీరిదే ! మరొకరు వారి స్థానాలను పూరించలేరు.

సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారు మా హృదయకుహరములందు జీవించి ఉన్నారు. మహాత్ములకూ మరణం లేదని వేదమే చెబుతున్నది. గీతాచార్యులు భగవద్గీత యందుదాహరించి ఉన్నారు. అలాంటిది 'గీతామకరంద' కర్తయైన, పరివ్రాజకులైన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి వర్యులు మరణించినారనిన నమ్మదగునా? నిండు నూరేండ్లైనా వారు పూర్తి చేసుకోనేలేదే! వారిప్పుడు నూరేండ్లవయసుకు వచ్చారు. వారింకా జీవించే ఉన్నారు.

నూటయేబది యేండ్లు అయినప్పటికినీ వివేకానందులవారు మనల్ని వీడిపోలేదు. వారి గురువులు శ్రీరామకృష్ణ పరమహంస మనల్నింకా జ్ఞానబోధామృతాలలో మునకలు వేయిస్తున్నారే! రమణ మహర్షి ఇంకా స్మృతిపథం నుండీ పోలేదు. కావ్యకంఠ గణపతిముని రమణుని మనసుల నుండి విడిపోని 'మహర్షిగా చేసి యున్నారు. అలానే సద్గురు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని మన మనస్సుల్లో మరో వంద సంవత్సరములు నిలిచేట్టు శతజయస్తుత్సవములు తలపెట్టడం వారి గ్రంథాలను పునఃపునః ముద్రిస్తూండడం చూస్తుంటే నైమిశైరాణ్యంలోని సూతమహర్షి యావన్మంది మహనీయులకూ పురాణేతిహాసాలు వివరిస్తూన్న విధంగా దేశంలోని మహర్షులనూ, సాధుసత్తములనూ, పీఠాధిపతులను శుకబ్రహ్మాశ్రమంలో సమావేశపరుస్తూ, తమ గురువుల గీతాయజ్ఞశైలిని పునఃస్మరణకు తెస్తున్నట్టుగా ఉన్నది.

గీతాచార్యుడు 'భగవద్గీత'లో రుచిచూపించిన మకరందమును శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు 'గీతామకరందం'లో గీతాజ్ఞానయజ్ఞలములను సప్తాహములుగా చేసి, పల్లె పల్లెలకూ పరమాత్ముని పరమబోధ పామరజనుల మెదళ్ళలో నిలిచేట్టు చేసారు. అపక్వాహారాన్నే వారు భుజించారు. పక్వం కాబడిన గీతామకరందాన్ని ప్రపంచానికందించారు. వారిశిష్యులు 'గీతామకరందం' బృహద్గ్రంథాన్ని ఆంగ్లమువంటి అన్యభాషలలోకి అనువదింప చేసి 'గీత' వలె 'గీతామకరందం' గ్రంథమును ప్రపంచ ప్రజల మనస్సులో భక్తి ప్రపత్తులు ప్రభవిల్లడానికి చేసిన కృషి అపారం, అమేయం.

స్వామి విద్యా ప్రకాశనందగిరి స్వాముల వారు తన గీతోపన్యాసాల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేయడానికి తన జీవితాంతం కృషి చేసినారు. ఆయన యొక్క ముఖ్య ఉద్దేశం ఏమనగా, న్యాయం, ధర్మం, అదే విధంగా ప్రజల్లో సత్ భావన, సత్ ప్రవర్తన అనేది ఉండవలెనని ఆయన యొక్క ఆకాంక్ష. అందుకోసం ఆయన నిరంతరం ప్రజలను చైతన్య వంతులను చేయడానికి కృషి చేసినారు. భక్తి భావన వ్యాప్తి చేసుకుంటూ మరో వైపు సాంఘిక, సామాజిక సేవలు కూడా ఆయన చేసేవారు. ఉదాహరణగా శ్రీకాళహస్తిలో స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రి కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు, బాలికలు) కళాశాలల స్థాపనకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన ప్రారంభించిన కళాశాలలు ఎంతో మందికి విద్యాదానం అందిస్తున్నది. ఈ మూడు కళాశాలలు స్వామి విద్యా ప్రకాశానందగిరి పేరు మీదగానే ఉన్నవి. మరియు భక్త కన్నప్ప ఉచిత కంటి ఆసుపత్రిని ప్రారాంభించి కొన్ని లక్షల మందకి నేత్ర దానం ఉచితంగా అందించినారు. స్వాముల వారు ఒకవైపు భక్తి భావనను, ప్రచారం చేస్తూ మరోవైపు సాంఘిక, సామాజిక సేవలు చేసినారు. కాబట్టి ఆయన చిరస్మరనీయుడు. స్వాముల వారి శిష్యుడు అయినటువంటి శ్రీ విద్యా స్వరూపనందగిరి స్వాములవారు, మరియు ఈశ్వర్‌గారూ, శ్రీ సంపూర్ణ నందగిరిస్వామి వారు, స్వాముల వారి ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చడానికి అదే విధంగా శ్రీ శుకబ్రహ్మా శ్రమం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు అనుటలో సందేహం లేదు.

**ఆధారగ్రంథాలు**

1. శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి, ప్రసుత్త పీఠాధిపతి అయిన శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారితో పరిశోధకుడు డా॥. యం. దీనదయాళ్ ప్రత్యేక ఇంటర్వ్యూ.

2. శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి, ప్రస్తుత ఉత్తర అధికారి అయిన శ్రీ సంపూర్ణనందగిరి స్వాముల వారితో పరిశోధకుడు డా॥యం. దీనదయాళ్ ప్రత్యేక ఇంటర్వ్యూ.

3. శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి, శ్రీ సంపూర్ణా నందగిరి స్వాముల వారు, గీతా స్వరూపులు, శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వాముల వారు శతజయన్తిసంచిక, శ్రీ శుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి.

4. శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి , ప్రస్తుత ఆశ్రమ మేనేజర్ ఈశ్వర్‌గారితో పరిశోధకుడు డా॥యం. దీనదయాళ్ ప్రత్యేక ఇంటర్వ్యూ.

5. శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి , శ్రీ విజయానందస్వామి మరియు మాతాజి అమ్మగారితో పరిశోధకుడు డా॥యం. దీనదయాళ్ ప్రత్యేక ఇంటర్వ్యూ.

6. తెలుగు విశ్రాంతి ఆచార్యులు కె. మునిరత్నం సూచనలు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి

7. గొడుగుచింత గోవిందయ్య విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు, ఆంధ్ర ప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల-శ్రీకాళహస్తి, వారి సూచనలు.

8. డా॥ సముద్రాల లక్ష్మణయ్య, శ్రీవిద్యాప్రకాశనందగిరి స్వాములవారి జీవిత చరిత్ర, శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రచురణలు, శ్రీకాళహస్తి, 2012.

9. శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములు, భారత రత్నాకరము, గీతా పబ్లికేషన్స్, శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి, 1987.

10. శ్రీమతి వై. ఓంకార వివేకచూడామణి, ఆదర్శ జననీ జనకులు (శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వామి శతజయంత్యుత్సవ సందర్భమున ప్రకాశితము), శ్రీమతి ఓంకారం, పుట్టపర్తి, 2013.

11. శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములు, గీతామకరందం, గీతాపబ్లికేషన్స్, శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తి, 1963.

12. గోటేటి శ్రీరామారావు, శ్రీవిద్యాప్రకాశ నందగిరి స్వాముల వారు హృదయకుహర మందు జీవించే వున్నారు, వ్యాసం శత జయన్తి సంచిక, శ్రీశుకబ్రహ్మాశ్రమం శ్రీకాళహస్తి 2013.

13. డా॥యం. దీనదయాళ్‌గారి, శ్రీకాళహస్తి, శ్రీశుకబ్రహ్మాశ్రమం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి, వ్యాసం, ఆంధ్రప్రదేశ్ హిస్టరి కాంగ్రెస్ 43వ సంచిక రాజ మహేంద్రవరము 2019.

# 57. సినీరచనల్లో మహాభారతం (పాటలు మరియు సంభాషణలు)

-డా॥ ఉడాలి విష్ణుప్రియ, హైదరాబాదు

భారతీయుల పంచమ వేదం మహాభారతం. సంస్కృతంలో భారతాన్ని వ్యాసుడు రాస్తే తెలుగులో నన్నయ, తిక్కన, ఎఱ్ఱన మాత్యులు ఆంధ్రీకరించారు. "తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి" అనే సామెత తెలుగులో ఊరికే రాలేదు. పూర్వం పురప్రజలకు కాలక్షేపమైన పురాణ శ్రవణం, పురాణ పఠనం, వీధి నాటకాలు, తోలుబొమ్మలాటలు, బుర్రకథలు, హరికథలు.. ఇలా పలు ప్రక్రియల్లో భారత కథ చోటు చేసుకునేది. తదనంతరం చలన చిత్రాలు సైతం ఈ కావ్యాన్ని తమ భుజాలకెత్తుకున్నాయి. ఈ క్రమంలో ముఖ్యంగా రామాయణ, భారతేతిహాసాలు ప్రజల మనోభావాలతో మమేకమయ్యాయంటే అతిశయోక్తి కాదు. ఇతిహాసాల్లో ప్రముఖ పాత్రలు సామాన్య మానవ స్వభావ వైచిత్రి కి దగ్గరగా ఉండటం మూలంగా ఎన్నో విపత్కర ఘట్టాలను ఆయా పాత్రల మనోధర్మాలను అనుసరించి సునాయాసంగా దాటే అవకాశం ఏర్పరిచింది. "దుష్టులకు దూరంగా ఉండండి", "పెద్దల మాట సద్ది మూట" లాంటి సామెతలు ఉత్తినే రాలేదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ధర్మో రక్షతి రక్షితః అనే సునయుక్తులు మన ఇతిహాసాల సంస్కారం వల్లే ఏర్పడతాయి.

నేటి సమాజానికి ప్రతిబింబాలుగా రెండు రంగాలని పేర్కొనాలి. ఒకటి పత్రికలు, మరొకటి చలనచిత్రాలు. ఇందులో చలనచిత్ర మాధ్యమమైతే పండిత, పామర లోకానికి మరింత సాన్నిహిత్య పాత్రని పోషిస్తుందనడంలో సందేహం లేదు. తెలుగులో తొలి టాకీ చిత్రం భాగవతానికి చెందిన భక్త ప్రహ్లాద. హెచ్.ఎమ్.రెడ్డి గారు నిర్మించారు. ఇది ముంబైలో నిర్మించడం జరిగింది. ఈ చిత్రం సెప్టెంబర్ 15, 1931వ సంవత్సరం విడుదలైంది. ఈ చిత్రంలో నటించిన సురభి కమలాబాయి తొలి తెలుగు కథానాయికగా తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలచిపోయింది. మునిపల్లె సుబ్బయ్య గారు హిరణ్యకశిపుడిగా నటించారు. నిజానికి ఈ చిత్రం విడుదల కాకముందే భారతేతిహాసాల ఘట్టాలతోనే రెండు మూకీ చిత్రాలు కూడా నిర్మించడం జరిగింది. అవి 1922లో రఘుపతి వెంకయ్య గారు తన కుమారుడు ఆర్.ఎస్. ప్రకాష్ దర్శకుడు గా ఇతిహాస కథలే సినిమాలుగా మొదట్లో తీశారు. ఇతర భారతీయ భాషల్లో కన్నా తెలుగులో పౌరాణిక చిత్రాలు అధికంగా వచ్చాయి. విరాట పర్వం, దానవీరశూరకర్ణ, శ్రీకృష్ణ పాండవీయం, నర్తనశాల ఇంకా కల్పిత కథే అయినా భారత కథను దన్నుగా చేసుకొని మాయాబజార్ వంటి అజరామర కీర్తిని గడించిన చిత్రాలెన్నో రూపొందించబడ్డాయి. అధర్మం ఉన్నంత వరకు ధర్మం ఉంటుంది. ముఖ్యంగా భారతంలో కొన్ని పర్వాల్లోని ఘట్టాలు సమాజ నీతిని ప్రతిబింబించేవిగా ఉన్నాయి. ఆ ఘట్టాలను సినిమాలుగా నిర్మించారు. కొన్ని సినిమాల్లో నైతే పాత్ర ఔచిత్యం బహుముఖంగా పోషింపబడింది. ఆ చిత్రాల్లో పాటలు, కవులు రాసిన పద్యాలు, సంభాషణలు భహుళ ప్రాచుర్యం పొంది, తెలుగు వారి నాలుకల మీద నర్తిస్తూ ఇప్పటికి సజీవంగా నిలిచి ఉన్నాయి.

ఆంధ్ర మహాభారతంలో కర్ణునికి దుర్యోధనుడు అంగ రాజ్యాన్నిచ్చి పట్టాభిషేకం చేసే ఘట్టం "దానవీరశూరకర్ణ" చిత్రంలో అద్భుతంగా తెరకెక్కింది..

కురు రాజ కుమారుల అస్త్ర శస్త్ర ప్రదర్శన సందర్భంగా కర్ణుడు కూడా వచ్చాడు. అర్జునుడితో ద్వంద్వ యుద్ధం ఎంతో భీకరంగా జరుగుతున్నది.

ఆ సమయంలో కృపాచార్యుడు వారి మధ్యకు వెళ్లి కర్ణుని ఉద్దేశించి "అర్జునుడు కురు రాజ కుమారుడు, పాండురాజుకు, కుంతి దేవికి జన్మించినవాడు. రాజ పుత్రుడు, క్షత్రియ కులానికి చెందినవాడు. అతనితో ద్వంద్వ యుద్ధానికి సిద్ధమవ్వాలంటే నీ తల్లిదండ్రుల వివరాలతో పాటు నీదే కులమో, ఏ వంశమో విశదపరుచు" అంటాడు. అది విని కర్ణుడు అవమానభారంతో తల వంచుకొని మధనపడుతుండగా.. అంతట దుర్యోధనుడు కురువృద్ధుల నుద్దేశించి మాట్లాడే సందర్భం చుడండి.

**ఆచార్య దేవా!**

**ఏమంటివి.... ఏమంటివి..?**

**జాతి నెపమున సూత సుతునకిందు నిలువ అర్హత లేదందువా ?**

**హా .. ఎంత మాట.. ఎంత మాట..!**

**ఇది క్షాత్ర పరీక్ష గాని క్షత్రియ పరీక్ష కాదే ..?**

**కాదు.. కాకూడదు..**

**ఇది కుల పరీక్షయే అంధువా ?**

**నీ తండ్రి భరధ్వాజుని జననమెట్టిది..?**

**మట్టికుండలో పుట్టితివి కదా.....?**

**హ హ హ హ ..... నీది యే కులము ....?**

**ఇంత యేలా ..?**

**అస్మత్ పితామహుడు, కురుకుల వృద్ధుడైన ఈ శాంతనవుడు......**

**శివ సముద్రాల భార్యయగు గంగా గర్భమున జనియించలేదా....?**

**ఈయనది ఏ కులమో ....?**

**నాతో చెప్పింతువేమయ్యా....**

**మా వంశమునకు మూలపురుషుడైన వసిష్ఠుడు, దేవ వేశ్య అగు ఊర్వశి పుత్రుడు కాదా..!**

**అతడు పంచమీ జాతి కన్య అయిన అరుంధతి యందు శక్తినీ..**

**ఆ శక్తి ఛండాలంగాన యందు పరాశరుని ..**

**ఆ పరాశరుదు పల్లె పడుచైన మత్స్యగంధి యందు మా తాత వ్యాసుని ....**

**ఆ వ్యాసుడు విధవ్రాన్థరైనా మా పితామ్మ అంబికతో మా తండ్రిని**

**పిత్తమ్మ అంబాలికతో మా పినతండ్రి పాండు రాజును**

మా ఇంటి దాసితో ధర్మ నిర్మాణచరుడని మీచే కీర్తింప బడుచున్న ఈ విదుర దేవుని కనలేదా సందర్భ అవసరముల బట్టి క్షేత్రబీజ ప్రాధాన్యములతో సాకారమైన మా కురువంశము ఏనాడో కులహీనమైనది. కాగా నేడు కులము కులము అను వ్యర్థ వాదమెందులకు..?

భీష్ముడు : నాయనా.. సుయోధన ..

దుర్యోధనుడు : తాతా...

భీష్ముడు: మునుల, బ్రహ్మ,ఋషుల జననము మనము విచారించదగినది కాదు. ఇది నువ్వన్నట్లు ముమ్మాటికీ క్షాత్ర పరీక్షే. క్షాత్రమున్నవారెల్లరూ క్షత్రియులే. వారిలో స్వరాజ్యమున్న వారే రాజులు. అట్టి రాజులే ఈ భువి రాజ పరిషత్తులో పాల్గొనుటకు అర్హులు.

దుర్యోధనుడు : ఓహో.... రాచరికమా ..... అర్హతను నిర్ణయించునది..

అయినా మా సామ్రాజ్యములో సస్యశ్యామలమై.

సంపద విరాళమై వెలుగొందు అంగ రాజ్యమునకిప్పుడు

యీతని మూర్ధభిషిక్తుని గావించుచున్నాను..

సోదరా దుశ్శాసనా..

అనర్ఘ నవరత్న శక్త కిరీటమును వేగముగా గొనితెమ్ము..

మామా .. గాంధర సార్వభౌమా...

సురుచిర మణిమయ మండిత సువర్ణ సింహాసనమును తెప్పింపుము..

పరిజనులారా...

పుణ్య భగీరథీ నాదీ తోయములనందుకొనుడు..

కళ్యాణ భట్టులారా ....

మంగళ తూర్యారవములు సుస్వరముగ మ్రోగనిండు....

వందిమాగధులారా....

కర్ణ మహారాజును కైవారము గావింపుడు..

పుణ్యాంగనలారా ....

ఈ రాధా సుతునకు పాలభాగమున కస్తూరి తిలకం తీర్చిదిద్ది...

బహుజన్మసుకృత పరీపాకసౌలబ్ధ సహజ కవచ కర్ష వైడూర్య ప్రభాధిత్యోలికి వాంఛలు చెలరేగ వీర గంధము విదరాల్పుడు...

నేనీ సకల మహాజన సమక్షమున.. పండిత పరిషత్ మధ్యమున..!

సర్వధా సర్వదా ... శతధా సహస్రధా...

ఈ కుల కళంక మహాపంకిలమును శాశ్వతముగా

ప్రక్షాళణ గావించెదను...

హితుడా..!

అప్రతిహాత వీరవరేణ్యుడవగు నీకు...

అంగ రాజ్యమే కాదు, నా అర్ధ సింహాసనార్ధమిచ్చి గౌరవించుచున్నాను...

అని అంగ రంగ వైభవంగా కర్ణుని రాజుగా పట్టాభిషిక్తుడిని చేసిన దృశ్యం అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించే విధంగా చిత్రీకరించారు. ఈ సంభాషణలు ఇప్పటికీ తెలుగు వారి మదిలో, సభల్లో, కొత్తగా సినిమాల్లో అవకాశం కోసం ఎదురు చూసే వారి నాలుకల్లో ఇంకా కదలాడుతూనే ఉన్నాయి.

నన్నయ ఆంధ్ర మహా భారతం ఆదిపర్వం షష్టమాశ్వాసంలో కర్ణుడిని దుర్యోధనుడు అంగ రాజ్యానికి అభిషిక్తుని చేసిన తర్వాత భీముడు కర్ణుడిని ఉద్దేశించి..

**ఉత్తమ క్షత్రియప్రవరోపయోగ్య**
**మైన యంగరాజ్యంబు నీ కర్హ మగునె ?**
**మంత్రపూత మై గురుయజమానభక్ష్య**
**మగుపురోడాశ మది గుక్క కర్హ మగునె**

అని దెప్పి పొడవగా .. మూల కథలో భీమునికి శరవేగంగా దుర్యోధనుడిచ్చిన జవాబు ఈ క్రింది పద్యం.

**అనిలజ! నీ కిట్లని ప ల్కను దలపను నగునె? లేడి కడుపున బులి పు**
**ట్టునె ? యిట్టి దివ్యతేజం బున వా దధ మాన్వయమున బుట్టునే చెపుమా ।**
**శూరుల జన్మంబు సురలజన్మంబును నేఱుల జన్మంబు నెఱుగ నగునె?**
**మొగిని దధీచి యెమ్మున బుట్టదయ్యేనే వాసవాయుధ మైన వజ్ర మదియు**
**గాంగేయుఁ డ న మఱి కార్తికేయుండన నాగ్నేయు దన రౌద్రుడనగ శరన**
**నోద్భవుం డ న గుహుండుద్భవిల్లడె ? శర స్తంభజన్ముడు గాడే ధర్మవిధుడు**
**గృపుఁడు ? ఘటసంభవుడు గాడే కీర్తి పరుడు వరుడు ద్రోణుండు విప్రులవలన బుట్ట**
**రైరె సత్క్షత్రియుల్ ఘను లేవని గావ ? గడఁగి మీ జన్ములు నోట్ల కావె వినగ**

అనే నన్నయ్య గారి పద్యానికి సంభాషణ ఆణిముత్యాలు అందించి తన అభినయంతో అందరిని అలరించి దుర్యోధన పాత్ర ఔచిత్యాన్ని, కర్ణుని పట్ల స్నేహ పాత్రతని, ప్రముఖుల జన్మ రహస్యాలను తేటతెల్లం చేశారు.

ఆంధ్ర మహాభారతంలో విరాట పర్వానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ పర్వం నర్తనశాల పేరుతో తెరకెక్కింది. తిక్కన గారి నాటకీయ శైలితో సాగే పద్యాలు రసరమ్యముగా అలరారుతాయి. పాండవులు అజ్ఞాతవాసం చేస్తున్న వేళ.. విరాటుని కొలువులో పాండవులతో పాటు ద్రౌపది మారు వేషాలు వేసుకొని తలదాచుకున్నారు. విరాట మహారాజు భార్య తమ్ముడు కీచకుడు సైరంధ్రి గా మారిన ద్రౌపదిపై కన్నేసి ఆమెను లొంగబరుచుకునేప్పుడు వారి మధ్య జరిగే సంఘర్షణలో సాగే వాగ్వివాద ఘట్టాలు సముద్రాల గారి కలం నుంచి జాలువారిన అక్షర సుమాలతో గుబాళిస్తాయి. అవి నభూతో నభవిష్యతి!

అలాగే కౌరవ సేనను ఎదుర్కొని అజ్ఞాత వాసం వీడి అర్జునుడు దుర్యోధనుని చూస్తూ చెప్పే ఈ పద్యం తిక్కన గారి విరచితమే.

**కుప్పించి ఎగసినఁ గుండలంబుల కాంతి**
**గగన భాగంబెల్లఁ గప్పి కొనఁగ**
**నుఱికిన నోర్వక యుదరంబులోనున్న**
**జగముల వ్రేఁగున జగతి గదలఁ**
**జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ**
**బైనున్న పచ్చని పటము జాఱ**
**నమ్మితి నాలావు నగుఁబాటు సేయక**
**మన్నింపు మని క్రీడి మఱల దిగువఁ**
**గరికి లంఘించు సింహంబు కరణి మెఱసి**
**నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు**
**విడువు మర్జున! యనుచు మద్విశిఖ వృష్టిఁ**
**దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు..**

వీరి నాటకీయ శైలికి ఎన్.టి.ఆర్ గారి అభినయం, ఘంటసాల గారి గానం వెరసి ఒక పద్యనాటకాన్ని తలపించాయనాలి.

అర్జునుని శంఖారావం విన్న కృపాచార్యులు, ఇతర పెద్దలకు బహు ఆనందం కలిగిన వేళలో ఈ పద్యం కూడా ఎంతోమంది మదిని దోచిందనాలి. తిక్కన గారి సాహిత్యం గారి సాహిత్యం, సుసర్ల దక్షిణామూర్తి సంగీతం, NTR అద్భుతమైన అభినయం, ఘంటసాల గానంతో హిందోళ రాగంలో ఆలపించిన మధురమైన గీతమిది.

నర్తనశాల సినిమాలో ఘంటసాల గానం చేసిన ఈ పద్యం చాలామంది విని వుంటారు. భారతం విరాటపర్వం లోనిది ఈ పద్యం. కవి తిక్కన సోమయాజి. సందర్భం ఉత్తర గోగ్రహణ సమయంలో కురుసేనను కకలావికలం చేసి, దుర్యోధనుణ్ణి ఓడించి, అతని ఎదురుగా నిలిచి, అతన్ని ఉద్దేశించి అర్జునుడు ఎగతాళిగా ఎత్తిపొడుస్తూ చెప్పిన మాటలు ఇవి.

ఏనుగునెక్కి ఆ పక్క, ఈ పక్క ఏనుగులు నడుస్తుండగా రాజధాని వీధుల్లో రాజసం ఒలకబోస్తూ ఊరేగడం కాదు. రత్నమాణిక్య హారాలనూ, ఆభరణాలనూ ఒంటినిండా వేసుకొని సింహాసనం మీద కూర్చుని హొయలు పోవడం కాదు. పెత్తనం ఉంది గదాని అందగత్తెలను రప్పించుకొని వారితో కులకడం కాదు. తేరగా వచ్చిన సుగంధ ద్రవ్యాలతో భోగాలు అనుభవించడం గాదు. ఇప్పుడు నీ గతి చూసుకో. అసలు నీకు సిగ్గంటే ఉంటే ఎక్కడన్నా పడి చావు. తొల్లింటి చూఱగలదె (చూఱ అంటే కొల్ల, దోచుకోవడం) – ఇంతకు ముందు లాగా ఇంకా కొల్లగొడదామనుకుంటున్నావేమో – ఇక్కడ నీ జూదపుటెత్తులు పనిజేయవు సుమా. ఇదీ పద్యభావం. నిజానికి పై వివరమంతా చెప్పాల్సిన పని లేదు. పద్యం చదువుతుంటేనే జ్వర తీవ్రత శరీరం వేడెక్కుతున్నట్టుగా పఠితకు పద్య భావం ఎంతో తాదాత్మ్యత కలిగిస్తుంది. “జూదమిక్కడ ఆడంగ రాదు సుమ్ము” అని ఆఖరు పాదం చెప్పడం, పద్యంలోని నాటకీయతకు ఎంత అందమైన కొసమెరుపు నిచ్చిందో గమనించారు గదా..!

**ఏనుంగు నెక్కి పెక్కేనుంగు లిరుగడ**
**రా పురవీధుల గ్రాలగలదె**
**మణిమయంబగు భూషణ జాలములనొప్పి**
**ఒడ్డోలగంబున నుండగలదె**
**కర్పూర చందన కస్తూరి కాదుల**
**నింపు సొంపార భోగింపగలదె**
**అతి మనోహరలగు చతురాంగనల తోడి**
**సంగతి వేడ్కలు సలుపగలదె**
**కయ్యమున నోడిపోయిన కౌరవేంద్ర**
**వినుము నాబుద్ధి మరలి ఈ తనువు విడిచి**
**సుగతి బడయుము తొల్లింటి చూఱగలదె**
**జూదమిచ్చట నాడంగరాదు సుమ్ము**

ఆకలితో దహించుకు పోతూ గుహ లోపలినుంచి బయటకు వేటాడదామని వచ్చిన సింహం లాగా, యెక్కడో అడవిలో నివాసముంటూ దిగులుగా వున్న నా (ద్రాణాచార్యుల వారి) మనస్సు ఒక్క సారిగా ఆనందంతో పరవశమై పోయేటట్లు వచ్చెను కుంతీ సుత మధ్యముడు (కుంతికి ముగ్గురు బిడ్డలే అయినా ఇక్కడ తిక్కన సోమయాజి గారు మాద్రి పుత్రులిరువురూ కూడా ఆమె బిడ్డలే అని వర్ణించడం విశేషం).

సింగం బాకటితో గుహాంతరమ్మునన్

చేట్పాటుమైనుండి

మాతంగ స్ఫూర్జిత యూద దర్శన

సముద్యన్మోదమై వచ్చు రోజన్

కాంతారనివాస ఖిన్న మతిన్

అస్మత్ సేన పై వీడే వచ్చెన్

కుంతీ సుత మధ్యముండు

సమరత్ సేమాభి రామాకృతిన్ అని కురు పితామహుడైన భీష్ముడు ఆ సందర్భంలో దుర్యోధనునితో చెప్పిన పద్యమిది.

వచ్చినవాడు అర్జునుడు యుద్ధం చేస్తే మనమే గెలుస్తామని వక్కాణించి చెప్పలేము. యుద్ధంలో రెండు పక్షాలు గెలవలేవు కదా. జయాపజయాలకు మనం సిద్ధంగా ఉండాలి. దేనికైనా ఓర్చుకోవాలి. ఈ సమయంలో సంధి చేసుకోవడం కూడా సరిఐయినదే.:

అనుభవంతో పండిపోయిన వారి ఆలోచనలు ఈ విధంగా ఉంటాయి. అర్జునుడితో యుద్ధం అంత సులభం కాదనే భావన వ్యక్తం చేసాడు. ఒకవేళ ఓడిపోతే కలిగే అవమానం భరించరానిది కనుక సంధి చేసుకోవడంలో తప్పులేదని సూచించాడు. దాయాదుల మధ్య పాగా ప్రతీకారాలు ఉండకూడదు. అది వంశ నాశనానికి దారితీస్తుందని ఈ మాటలు వ్యక్తీకరిస్తున్నాయి. ఇలాంటి ఘట్టాలు సినిమాల్లో ఉండడం మూలంగా బంధుత్వాలు మధ్య ప్రేమ ఉండాలన్నా సూక్తి అందరిని చేరుకుంటుంది.

అన్న పద్య పంక్తులు ఆయా పాత్ర స్వాభావికాలను తిక్కన మలచిన వైనం అనిర్వచనీయం. అదొక సారి పద్యం రూపంలో తిలకించండి....

**వచ్చిన వాడు పల్గుణుడు అవశ్యము గెల్తు మనంగ రాదు రా**
**లచ్చికినై పెసంగిన బలంబులు రెండును గెల్వ నేర్చునే**
**హెచ్చేగుంగుందగున్ దొడరుతెల్ల విధంబులఁ కోర్చు టట్లుగా**
**కిచ్చ దలంచి యొక్కమెయి నిత్తరి బొందగు చేతయున్ దగున్ ।**

ఇక ఈ కింది పద్యం "పాండవ వనవాసం" చిత్రంలో ద్రౌపదిని నిండు సభలో దుశ్శాసనుడు ఈడ్చుకొచ్చిన వేళ వస్తుంది... భీముడి పాత్రలో నందమూరి తారక రామారావు తన గదను గిరా గిరా తిప్పుతూ రౌద్రంతో ఊగిపోతూ ఈ పద్యం అందుకుంటాడు.. ఈ సన్నివేశం ఒక్కసారిగా మనల్ని రోమాంచితుల్ని చేస్తుంది. ఇది నన్నయ రాసిన పద్యం. దీనిని ఈ చిత్ర సంగీత దర్శకులు ఘంటసాల గారు స్వరపరిచి ఆయనే గానం చేశారు.

**ధారుణి రాజ్య సంపద మదంబున కోమలి కృష్ణజూచి రం**
**భోరుని జోరు దేశమున నుండగబిల్చిన యిద్దురాత్ము దు**
**ర్వార మదీయ బాహు పరివర్తిత చండ గదాభిఘాత భ**
**గ్నోరుతరోరు జేయుదు సుయోధను ఉగ్ర రణాంతరంబునన్!**

**కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ చూచుచుండన్ మదో**
**ద్ధురుడై ద్రౌపదినిట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ**
**కర లీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ ని**
**రర ముర్వీపతి చూచుచుండ అని నాస్వాదింతు నుగ్రాకృతిన్!**

అని సభా సదుల ముందు శపథం చేస్తాడు భీముడు.

ధర్మరాజు యొక్క గొప్పతనాన్ని ద్రౌపది చే అర్జునుడు, భీముడు వినేటట్లు తిక్కన రాస్తే. నర్తనశాల చిత్రంలో బృహన్నల అంటే అర్జునుని చే చెప్పించారు ఈ పద్యాన్ని

**ఎవ్వాని వాకిట నిభమద పంకంబురాజభూషణ రజోరాజి నడగు**
**ఎవ్వాని చారిత్ర మెల్లలోకములకునొజ్జయై వినయంబు నొఅపు గఅపు**
**ఎవ్వాని కడకంట నివ్వటిల్లెడు చూడ్కిమానిత సంపద లీనుచుండు**
**ఎవ్వాని గుణలత లేదువారాశుల కడపటి కొండపై గలయ బ్రాకు**
**నతడు భూరిప్రతాప మహాప్రదీప**
**దూర విఘటిత గర్వాంధకార వైరి**
**వీర కోటీర మణిఘృణి వేష్టితం ఘ్రి**
**తలుడు కేవల మర్త్యుడే ధర్మ సుతుడు.....**

తాత్పర్యం లోకి వెళితే...

ఎవ్వని వాకిట్లో ఏనుగుల మదజలం రాజుల మణిభూషణ నుంచి రాలి పడిన పొడితో కలిసిపోతుందో.. (మామూలు మనుషులు వాకిట్లో కాపలాగా కుక్కను కట్టుకుంటారు. ఒక మహారాజు ఏనుగును కట్టుకుంటాడు. ధర్మరాజు చక్రవర్తి. ఏనుగుల బారు అతని వాకిట్లో ఉంటాయి. అవి నిరంతరం మదజలాన్ని స్రవిస్తూ ఉంటాయి. ఆ మదజలంతో రాజుల భూషణాలకు ఉండే మణుల పొడులు కలిసి వాకిట్లో బురదగా ఏర్పడ్డదట. మామూలుగా రాజులు నిలుచుని ఉంటే వారి భూషణాలకు ఉండే మణుల నుండి పొడి దానిమటుకు అదే రాలి పడదు. పొడి రావాలంటే మరో మణితో రాపిడికి గురవ్వాలి. అంటే నిత్యం ధర్మజుడిని చూసి పోవడానికి ఎందరో రాజులు వచ్చే వారు. దర్శనానికి వచ్చేవారు కొందరు, దర్శనం చేసుకు పోయేవారు కొందరు. అలాగే, ఒకేసారి అందరూ లోపలికి పోలేరు కనుక, ధర్మజుడికి ఇతర రాజకార్యాలనేకం కనుక, వాకిట్లో మరికొంతమంది అతని దర్శనానికై వేచి ఉండేవారు. ఇలా ఏర్పడిన రద్దీలో ఒకరి మణులు ఇంకొకరి మణులతో రాసుకుపోయి అక్కడ మణుల పొడి రాలి పడుతూండేది. ఆ పొడి అక్కడే ధర్మజుడి వాకిట్లో కట్టి ఉంచిన ఏనుగుల నుండి స్రవించిన మదజలంలో తడిసి అణిగి ఉండేది. ఇది రాజుగా ధర్మరాజు వైభవాన్ని సూచించేది.)

ఎవ్వని చరిత్ర అన్నిలోకాలకు గురువుగా నిలిచి అందరికీ అతని వినయసంపద విషయమై పాఠాలు నేర్పుతుందో.. (ధర్మరాజు తండ్రిని కోల్పోయి ధృతరాష్ట్రుని పంచలో చేరినప్పుడు ఎలా ఉండేవాడో, రాజసూయం చేసి సకల భూమండల చక్రవర్తిగా ఉన్నప్పుడు కూడా గురువుల పట్ల, పెద్దల పట్ల అంతే వినయంగా ఉండేవాడు. ఎంత సంపద కలిగినా ఒదిగి ఉండాలన్నది అతడిని చూసి లోకం నేర్చుకోవాల్సిన పాఠం. ఇది వ్యక్తిగా అతని ప్రవర్తనను తెలియజేస్తుంది

ఎవ్వని కడకంటి చూపు అనేక సంపదలను కలిగజేస్తుందో..

(అతని సభలో నిత్యం ఎంతమందో అర్థులు వచ్చి నిలుచుండేవారు. వారు నోరుతెరిచి అడగాల్సిన పని లేకుండా, వారి మీద అతని దృష్టి సోకితే చాలు, అతని ఇంట కనకవర్షమే కురిసేది. ఆర్తుల/అర్థుల పాలిటి కల్పవృక్షంగా ఉండేవాడు. ఇది అతని దానగుణాన్ని తెలియజేస్తుంది.)

ఎవ్వని గుణాలు ఏడు సముద్రాలకు అవతల ఉండే కొండపైకి కూడా పాకేవో..

(అతని గుణాలు – ధర్మం, సత్యం, దయ, వినయం, ధీరత, అన్నిటినీ, అందరినీ చెడు దృష్టితో చూసే దుర్యోధనుడికి కూడా శత్రువు కాలే ని అతని అజాత శత్రుత్వం ఇవన్నీ కూడా లోక ప్రసిద్ధం. ఇది అతని కీర్తిని తెలియజేస్తుంది.)

అతడు తన ప్రతాపం అనే వెలుగు చేత శత్రువుల గర్వం అనే అంధకారాన్ని పారతరిమినవాడు. వారి కిరీటాల్లో ఉండే మణుల కాంతులు ధర్మరాజు పాదాలను ప్రకాశింపజేసేవి. (అంటే తన ప్రతాపంచేత శత్రు వీరులను పాదాక్రాంతం చేసుకున్నవాడు. ఇది అతని ప్రతాపాన్ని తెలియజేస్తుంది.)

పైన పేర్కొన్న ఎన్నో గొప్ప గుణాలు కలిగిన ధర్మరాజు కేవలం సామాన్య మానవుడు!

నిజానికి తిక్కన భారతంలో ఈ పద్యం ద్రౌపది భీముడితో అన్నట్లుగా ఉంటుంది. సినిమా కోసం బృహన్నల పాత్రధారి చేత చెప్పించారు.

ఉత్తర గోగ్రహణంలో ఉత్తరానికి బృహన్నల ఆవల కౌరవసేనలను గురించి వివరించే సందర్భములోనిది పద్యం.. కవి తిక్కన, గానం ఘంటసాల

కాంచనమయ వేదికా కనత్కేతనోజ్వల విభ్రమం వాడు కలశజుండు
సింహ లాంగూల భూషిత నభో భాగం కేతు ప్రేంఖణము వాడు ద్రోణ సుతుడు
కనక గోవృష సాంద్రకాంతి పరిస్ఫుటధ్వజ సముల్లాసము బువాడు కృపుడు
లలిత కంబు ప్రభా కలిత పతాక విహారంబువాడు రాధాత్మజుండు
మణిమయోరగ రుచిజాల మహితమైన
పడగవాడు కురుక్షితిపతి
మహోగ్ర శిఖర ఘన తాళ తర్వగా సిడము వాడు
సురనదీసూనుడేర్పడ జూచికొనుము

కౌరవ సేనను చూసి జడుసుకుంటాడు ఉత్తర కుమారుడు. అప్పుడు తిరుగు ముఖం పడుతూ చెప్పిన పద్యమే ఇది.

**కౌరవసేనజూచె వణకెన్‌దొడగెన్ మదితోన మేనున్ నీ**
**వూరక పోవుచుంటి యిది వొప్పునే ఇప్పటి భంగి జూచినన్**
**వీరలనేను మార్కొనది నిశ్చయము అట్లగుటన్ రయమునన్**
**తేరు మరల్పు ప్రాణములు తీపన మున్వినదే బృహన్నలా!**

అర్జునుడు సురపతియైన దేవేంద్రుని ప్రేయసి దగ్గర నాట్యం నేర్చుకున్నాడు. అర్జునుని మోహించిన ఇంద్రుని ప్రేయసి తనని వరించమని అర్జునుని కోరుతుంది. అర్జునుడు ఆమె కోర్కెను తిరస్కరించాడు. గురువు భార్య తల్లితో సమానమని, మానవునకు ఇది తగదని ఆమెతో అంటాడు. అప్పుడామె అర్జునునితో ఇలా అంటుంది...

**అన్న ఇల్లాలు తమ్మునికి అమ్మగాదే**
**ఎటుల పాంచాలి పొందు చిత్తగించితీవు?**
**తాళి ఎరుగని నేనెట్టి తల్లినయ్యా**
**వావి వరుసలు తెలుపగా వలదు విజయా విజయా..**

అనగా దానికి పార్థుడు ఆమె నుద్దేశించి ఇలా వివరించాడు..

**ఆడి తప్పని మాయమ్మ అభిమతాన**

**సత్యమెరిగిన వ్యాసుని శాసనాన**

**పడతికి ఈశ్వరుడొసగిన వరబలాన**

**నడచుచున్నట్టి ధర్మబంధమది వనితా...ఆ..ఆ..ఆ**

అని సాగే ఈ తేట తెలుగు పద్యాల విందు మరెన్నో చిత్రాలలో సైతం చూడవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే భారత కథలోని ప్రతి ఘట్టంతోను సుసంపన్నమైన తెలుగు సినీ రచనలు కోకొల్లలు.

మన తెలుగు భాషలోని అక్షరాల ధ్వని సౌందర్యం ఈ క్రింది సంభాషణలు వింటే అర్థం అవుతుంది.

దానవీరశూరకర్ణ లోని దుర్యోధనుని పాత్ర ను పోషించిన ఎం.టి.ఆర్. కనపరిచిన తీరు అత్యద్భుతం.

**"పాంచాలి పంచ భర్తృకా..**

**ఏమే.. ఏమేమే.. నీ ఉన్మత్త వికటాట్టహాసము..**

**ఎంత మరువ యత్నించినను మరపునకు రాక... హృదయ శరీరాయ మానములైన నీ పరిహాసారావములే నా కర్ణపటంబులు వ్రయ్యలు చేయుచున్నవే...**

**అహెూ క్షీర వారాసి జనిత రాక సుధాకర వర వంశ సముత్పన్న మహెూత్తమ క్షత్రియ పరిపాలిత భరత సామ్రాజ్య దౌరేయుడ్నినై....**

**నిజ భుజ వీర్య ప్రకంపిత చతుర్దశ భువన ఘోరవరీన్యులగు శత సోదరులకు అగ్రజుండునై....**

**పరమేశ్వర పాధభిరత పరుశురామ సద్గురు ప్రాప్త శస్త్రాస్త్ర విద్యా పారేయుండయిన రాధేయునికి మిత్రుడ్నై....**

**మానధనుడనై.. మనుగడ సాగించు నన్ను చూచి ఒక్క ఆడుది పరిచారికా పరివృత్తయయి పగులబడి నవ్వుటయా....**

**అహెూ తన పతులతో తుల్యుడనగు నన్ను బావగా సంభావింపక.. సమ్మానిమ్పక..**

**గృహిణీ ధర్మ పరిచత్యయై.. లజ్జా విముక్త్యయై.. ఆ భందకి ఎట్ట ఎదుట ఏల గేలి చేయవలె..**

హహ.. అవునులే ఆ వయసు మాలిన భామకి ఎగ్గేమి సిగ్గేమి.. వంతు వంతున మగలముందొక మగనిని వచ్చర పర్యంతము రెచ్చిన కను పిచ్చితో పచ్చి పచ్చి వైభవమున తేలించు ఆలి గేలి చేసిన మాత్రమున హ హహ.. నేనేల కటకట పడవలే.. ఊరకుక్క ఉచితానుచిత జ్ఞానముతో మొరెత్తి కూతలిడునా.. అని సరిపెట్టుకుందునా.. హ.. ఈ లోకము మూయ మూకుడున్నునా...

ఐనను ధుర్వియాజమున సాగించు యాగమని తెలిసితెలిసి నేనేల రావలే.. వచ్చితిమి పో.. దివ్యరత్న ప్రభా సౌపేతమైన సర్వత్ర శౌశోభితమైన ఆ మయసభా భవనము మాకేలా విడిధి కావలె.. ఇనది పో.. అందు చిత్ర విచిత్ర లావణ్య లహరులలో ఈదులాడు దుర్భిక్షపేక్ష మాకేల కలుగవలె.. కలిగినది పో.. సజీవ జలాచర సంతానవితానములకు ఆలవలమగు ఆ జలాశయమున మేమేల కాలుమోపవలె.. మోపితిమి పో.. సకల రాజన్య కోటిర కోటిత కోచిప్త రత్న ప్రభా నిరంజిత మగు మా పాద పద్మమేల అపభ్రమ్సుమొన్దవలె..

ఎత్తసమయమునకే పరిచారికా పరివ్రుతయై ఆ పాతకి పాంచాలి ఏల రావలె.. వీక్షించవలె.. పరిహసించవలె..

హా హతవిధీ.. హా హతవిధీ.. హా హతవిధీ..

ఆజన్మ శత్రువులే అని అనుమానించుచునే అరుదెంచిన మమ్ము అవమానబడబాలన జ్వాలలు ధగ్ధమొనర్చుచున్నవి మామా.. విముకుని సుముకునిచేసి మమ్మిటకు విజయము చేయించిన నీ విజ్ఞాన విశేష విభాతి క్యములేమైనవి మామా..

పాంచాలి క్రుధావమాన మానసుడనై మానాతి మాన వంచితుడనై మర్యాదాతిక్రమనముగా మనుటయా.. పరిహాసా పాత్రమైన ఈ బ్రతుకోపలేక మరనిచుటయా..

ఇచ్చీ ఆడదాని పై పగ సాదించలేక ఆశు పరిత్యాగము గావించినాడన్న అపఖ్యాతి ఆ పైన వేరొకటి యా.. ఇప్పుడు ఏదీ కర్తవ్యము..?

మనుటయా.. మరణించుటయా.. ఏదీ కర్తవ్యము

ఇటువంటి అప్రతిహత సంభాషణా స్రోతస్సు ఆనాటి చలన చిత్రాలే కాదు.. ఆ మధ్య విడుదలైన 'యమదొంగ' వంటి కమర్షియల్ చిత్రాలలోనూ కనిపిస్తుంది. అప్పటికి , ఇప్పటికి ఆటవిడుపు సందర్భాల్లోనో, నోరు తిరగాలన్నా, భాష మీద పట్టు సంపాదించాలన్నా ఇటువంటి సంభాషణలు ఉపకరిస్తాయని పెద్దలు చెబుతారు.

ఆధునిక కాలంలో చలన చిత్ర సన్నివేశాల్లో భారత, రామాయణాల్లో ఉన్న కొన్ని ఉదాహరణాలని సందర్భోచితంగా ప్రముఖ దర్శకులు వాడుతున్నారు. ప్రత్యేకించి మాటల మాంత్రికుడిగా పేరుగాంచిన త్రివిక్రమ్ శ్రీనివాస్ గారి చిత్రాల్లోనూ మనం చూడొచ్చు.

తనికెళ్ల భరణి: ఒక్కసారి ధర్మరాజు జూదమాడి తే కురుక్షేత్రం జరిగింది రవి.. అని ఒక సందర్భంలోను, మరో సన్నివేశంలో .. గొప్ప యుద్ధాలన్నీ నా అనుకునే వాళ్లతోనే. అంటూ "ఆల వైకుంఠపురంలో.." చిత్రంలో సంభాషణలు వినిపిస్తాయి.

యుద్ధం గెలవడానికి ధర్మరాజులాంటి వాడే ఒక అబద్ధం ఆడాడు. చిత్రం: సన్నాఫ్ సత్యమూర్తి

మహేష్ బాబు : టాక్సీ డ్రైవర్ అని చెప్పొచ్చు కదా

హీరోయిన్ : కృష్ణుడిని అర్జునుడు డ్రైవర్ అనే చెప్పాడు..

కౌరవులు జూదంలో గెలిచారు... కురుక్షేత్రంలో పోయారు... జూదంలో ఓడిపోయి ఉంటే బ్రదర్స్ అందరూ కలిసుండి ఇలా పార్టీ చేసుకుంటూ రాజ్యం ఏలేవారేమో.. చిత్రం: సన్నాఫ్ సత్యమూర్తి

భారతంలో కర్ణుడి లాగా అన్నీ ఇచ్చేసి అనాథలైపోతారు.. చిత్రం: సన్నాఫ్ సత్యమూర్తి

పవన్ కళ్యాణ్: పాండవులు అజ్ఞాత వాసం చేసేటప్పుడు కౌరవుల్లో గూఢచారులు కొందరు పాండవుల్ని గుర్తించారు. అప్పుడు నకులుడు ఒక ఉపాయం చెప్పాడు. అలా నిశ్శబ్దంగా చంపడాన్ని నకుల ధర్మం అంటారు.. చిత్రం: అజ్ఞాతవాసి

బ్రహ్మానందం: వినటానికి విల్లింగ్-గా ఉంటే శ్రీకృష్ణుడు భగవద్గీతలో అర్జునుడికి ఇంత చెప్పాడు. చిత్రం: అతడు

హీరోయిన్ : భీముడు, అర్జునుడు వొంటి చేత్తో వందమందిని చంపగలరు..

వాళ్ళ ఐదుగురికి కలసి ఒక్క ద్రౌపది. కృష్ణుడు కత్తి పట్టుకున్న ఫోటో అయినా చూసావా.. ఆయనకి ఎనిమిది మంది భార్యలు.. చిత్రం: అరవింద సమేత వీర రాఘవ

సంభాషణలే కాకుండా పాటల్లో కూడా సమాజంలోని రుగ్మతల్ని భారతంతో పోల్చి రాసిన గీత రచయితలున్నారు.

"ప్రతిఘటన" చిత్రంలో విజయశాంతి పై చిత్రీకరించిన పాట ఇది. వేటూరి సుందర రామమూర్తి రచించారు.

**ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో**
**రక్తాశ్రులు చిందిస్తూ రాస్తున్నా శోకంతో**
**మరో మహాభారతం... ఆరవ వేదం**
**మానభంగ పర్వంలో... మాతృహృదయ నిర్వేదం**

**మగసిరితో బ్రతకలేక కీచకులె... కుటిల కామ మేచకులై**
**స్త్రీ జాతిని అవమానిస్తే**
**మీ అమ్మల స్తన్యంతో... మీ అక్కల రక్తంతో**
**రంగరించి రాస్తున్నా ఈనాడే మీకోసం**
**మరో మహాభారతం... ఆరవ వేదం..**

సగటు స్త్రీ అవమాన భారంతో బాధతో కుమిలిపోతున్న దృశ్యం భారతంలో ద్రౌపది పాత్రని దృష్టిలో పెట్టుకుని కళ్ళకు కట్టే విధంగా గీత రచయిత రాశారు. ఇప్పటికీ కలియుగ దుశ్శాసనుల, కీచకుల ఆకృత్యాలకు ఈ సన్నివేశ గీతాన్నే టి.వి. చానెల్స్ ఉపయోగిస్తున్నాయి.

స్థలాభావం, సమయాభావం మేరకు చిత్రాలు, సన్నివేశాలు, సందర్భాలు, సినీ సాహిత్య గీతాలు మాత్రమే ఇక్కడ ఉటంకించడం జరిగింది. పండిత లోకానికే పరిమితమైన ఈ కావ్యం పామర జనులకు సైతం ప్రభావ వంతంగా తెలియజేయడానికి సినీ రంగం సైతం ఇతోధికంగా తోడ్పడిందని చెప్పడమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశం. ఆంధ్ర మహాభారత కావ్యం గొప్పతనం గురించి విజ్ఞులు చెప్పేటప్పుడు "ఈ ప్రపంచంలో ఉన్నదంతా ఈ మహాభారత గ్రంథములో ఉందనీ, ఇందులో లేనిది మరెక్కడా లేదని" చెప్పడం మనకు తెలిసిందే! అదే విధంగా భారత కథ ప్రస్తావన లేని ఏ కళా ప్రక్రియ కూడా ఈ ప్రపంచంలో లేదని ఘంటాపథంగా చెప్పవచ్చునడానికి మిగతా సాహిత్య, కళా ప్రక్రియలతో పాటు ఆధునిక వినోద ప్రధాన కళా రూపమైన చలన చిత్రం కూడా ఏమాత్రం మినహాయింపు కాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్ర మహాభారతము
2. నర్తనశాల చిత్రం యూట్యూబ్
3. కొమ్మ కొమ్మకో సన్నాయి – వేటూరి సుందర రామమూర్తి
4. పాండవ వనవాసం చిత్రం యూట్యూబ్
5. దానవీరశూరకర్ణ చిత్రం యూట్యూబ్
6. ప్రతిఘటన చిత్రం యూట్యూబ్
7. వికీపీడియా

# 58. మహాభారతం-వర్తమాన సమాజం...తులనాత్మక విశ్లేషణ

- డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి, హైదరాబాదు

మహాకావ్యాలు శ్రీమద్రామాయణం, శ్రీమత్ మహాభారతంలో మొదటిది ఆదర్శ సమాజానికి ప్రతిరూపమైతే, రెండవది వాస్తవ సమాజ జీవనానికి ప్రతీక. భారతం మానవుడి సామాజిక జీవనాన్ని స్పష్టంగా, సంపూర్ణంగా అభివర్ణించింది, అవిష్కరించింది. అందుకే దీనిని తొలి సమాజ గ్రంథంగా పేర్కొంటున్నారు. సమాజ శాస్త్ర అధ్యయనానికి దీనినిన ఒక అపురూప ప్రాచీన సాహిత్య సంపదగా విమర్శకులు పేర్కొంటున్నారు. ఈ ఐతిహ్యాలు సనాతన భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు. హిందూ సంస్కృతిలోని జీవనమూల్యాల సమగ్ర దర్శనం. వీటిని కేవలం ఆధ్యాత్మిక దృష్టితో కాక సామాన్య దృక్పథంతో అధ్యయనం చేస్తే అనేక విశేషాలు అవగతమవుతాయి. అష్టాదశ పురాణాలను వెలయించిన వేద వ్యాసుడు మహాభారతాన్ని 'ఇతి హాసంగా' పేర్కొన్నారు. పురాణ లక్షణాలతో పాటు ఇంకా ఎన్నో విశేషాలు ఇందులో ఉన్నాయి. 'పంచమవేదమైన మహాభారతం సర్వ ధర్మ సంగ్రహం, సర్వ విజ్ఞానకోశం' అని ఐదువేల ఏళ్లుగా భారతీయులు భావిస్తున్నారు.

**'ధర్మేవ అర్థకామేచ**
**మోక్షేచ, భరతర్షభ!**
**యదిహాస్తి తదన్యత్ర,**
**యన్నేహాస్తి నతత్ క్వచిత్'**

'ధర్మ, అర్థ, కామ, మోక్షమనే చతుర్విధ పురుషార్థాలకు సంబంధించిన విషయాలు మహాభారతంలో ఉన్నవే ఇతర చోట్ల ఉన్నాయి. మహాభారతంలోని లేనివి మరెక్కడా లేవు. 'మహాభారతంలో లేని అంశాలు భారత్ లోనూ లేవు (What is not in Bharata (Mahabharata) is not in Bharat (India) అనే వాక్యం భారతానికి, భారత్ కు గల అవినాభావ సంబంధాన్ని పట్టి చూపుతోంది. క్రీ.పూ.ఐదు వేల సంవత్సరాల క్రితమే వ్యాసమహర్షి ఆధునిక కాలాన్ని ఊహించిన తీరును చదివితే ఆయన దూరదృష్టి ఆశ్చర్యం కలిగిస్తుంది. అరణ్యపర్వంలో ధర్మరాజుకు మార్కండేయుడు కలియుగంలోని 'సత్యహాని'ని 'సత్యం సంక్షేప్స్యతే లోక సత్తైః పండిత మానిభిః/సత్యహాన్యా తతస్తేషాం అయురల్పం భవిష్యతి' అని చెప్పిన దానిని ఎర్రన కవి 'సత్యంబు నరులకు సంక్షిప్తమగు సత్య/హాని నాయువు గడు తఱిగిపోవు/నాయువు దఱిగిన నల్పంబుగుని విద్య/అల్ప విద్యల విమోహంబు మిగులు'అని ఎర్రన కవి వివరించారు.

ఈ రెండు మహాకావ్యాల గురించి చాలా మీమాంసలు..అవి జరిగాయా?కట్టుకథలా?అని సందేహాలు ఉన్నాయి. వాటి వాస్తవ అవాస్తవాలను పక్కన పెడితే, ఇవి వ్యక్తిత్వ వికాస గ్రంథాలు లాంటివి. ఆయా కాలాలకు సంబంధించి చారిత్రక ఆధారాలు. ఇవి ప్రధానంగా ధర్మాన్ని ప్రతిపాదించాయి. విశ్వమానవాళికి సత్యధర్మాలే శాంతిమార్గ సాధనాలని, ప్రశాంత జీవన పథాలని బోధించాయి. అయితే తప్పులు చేసిన వారు అన్ని కాలాల్లోనూ ఉన్నారు...అందుకు మూల్యం చెల్లించిన వైనాన్ని వివరిస్తున్నాయి.సత్య ధర్మాల గురించే ప్రధానంగా ప్రస్తావించాయి. మహాభారతంలో శాంతి,అనుశాసనిక పర్వాలు ధర్మం గురించి పూసగుచ్చినట్లు వివరిస్తాయి. యుగానికి యుగానికి ధర్మాచరణలో అంతరం కనిపిస్తుంది. అలా ధర్మం అడుగంటుతున్నందునే దానికి గురించి మరింత చెప్పవలసిన అవసరం ఏర్పడిందనే వ్యాఖ్యలూ లేకపోలేదు.'దేశకాలమాన పరిస్థితులు ధర్మాన్ని నియంత్రిస్తాయి' అని భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశించాడు. అంటే, ఒకకాలంలో, ఒక చోట ధర్మంగా భావించేది, మరోనాడు, మరోచోట ధర్మం కాకపోవచ్చన్న మాట.

**'న రాజ్యం నైవరాజాచ న దండ్యో నచ దండిక**
**ధర్మేనైవ ప్రజా సర్వే రక్షంతి స్మపరస్పరం'**

'ధర్మం ద్వారానే ప్రజలు పరస్పరం రక్షణ పొందగలుగుతారు కానీ రాజు వల్లనో, దండధరులవల్లనో కాదని భీష్ముడు (శాంతిపర్వం)లో పేర్కొన్నారు. ఇది తరువాతి యుగానికి...అంటే వర్తమాన సమాజానికి అన్వయిస్తుందనడంలో సందేహం లేదు. రామాయణాది వివిధ పురాణాలు, ఇతిహాసాలలో మాదిరిగానే మహాభారతంలోనూ ఎన్నో అంశాలు ప్రక్షిప్తాలుగా చేరాయి. అయితే వాటిలో చాలా వరకు ప్రధాన కథాంశానికి ఆలంబన చేకూర్చేవే కానీ ఎటువంటి భంగకరం కావని చెబుతారు. వ్యాసభారతం ఆధారంగా వెలువడిన పలు గ్రంథాలలో కవులు స్వేచ్ఛానువాద పద్ధతిలో ఉప కథనాలను కల్పిస్తుంటారు. భారతంలోని ధర్మం తదితర లక్షణాలు,వాటి ఆచరణ తీరును నేటి సమాజానికి అన్వయిస్తూ తులనాత్మకంగా పరిశీలిస్తే.....

మానవ జీవితాన్ని సనాతన ధర్మం నాలుగు దశలుగా విభజించింది. ఆ ప్రకారమే, బ్రహ్మచర్యం,గృహస్థాశ్రమం తరువాత వానప్రస్థం (తపోవనం) స్వీకరించాలనుకున్నాడు ధృతరాష్ట్రుడు. వానప్రస్థాశ్రమం స్వీకరణకు కుటుంబ సభ్యుల అనుమతి...ముఖ్యంగా రాజుకు ఆ రాజ్య ప్రజల ఆమోదం అవసరమని భారతం చెబుతోంది. ఆ క్రమంలో ఆయన తమ్ముడి కుమారులను (తన సంతానం కురుక్షేత్రంలో హతులు కావడంతో పాండుపుత్రుల ప్రాపకంలో గడుపుతున్నాడు) అంగీకారం అడిగాడు.

**'సమర మరణమొండె విమల తపమునకు**
**జొచ్చి యందు నిలిచి చచ్చుటొండె**
**వలయు నస్మదీయ కుల ముఖ్యులిట్టుల**
**నడపి రనువు నన్ను నడవి కనఘ...' (ఆశ్ర)**

అని వానప్రస్థాశ్రమ స్వీకారానికి రాజైన ధర్మజుని అనుమతి కోరాడు.అందుకు ఆయన పితృభావనతో అంగీకరించకపోవడంతో వ్యాసభగవానుడు చొరవ తీసుకుని నచ్చచెప్పవలసి వచ్చింది. అయినా ధృతరాష్ట్రుడు తృప్తి పడలేదు. ప్రజల అనుమతిని కూడా కోరారు.

**'కౌరవ కోటియు మీరుఁ బెద్దయుఁ గాల**
**మనిఁగి పెనంగి యన్యోన్యసంభృ**
**తాధిక స్నేహులరై ప్రవర్తించితి**
**రసఘవర్తనులార! వినుడు నాదు**
**పలుకు వృద్ధునకుఁ దపశ్చరణంబున**
**కై వనంబున కేగుఁ టర్హకర్మ**
**ముచిత కృత్యంబుల యోజ మీరెఱింగిన**
**యదియకా మది ముదమార మీం**
**లెల్ల నా కనుజ్ఞ యిచ్చి కానకుఁబుచ్చు**
**డనుడు సర్వజనులు నశ్రుపిహిత**
**దృష్టులగుచు గద్గదిక నెలుంగెడలఁగ**

నార్తిఁదోప వేడ్చి రధిపముఖ్య (ఆశ్ర) కడుపుతీపి కొద్ది కుమారుడి చేష్టలను సమర్థించి వంశ నాశనానికి స్వయం కారకుడయ్యాడే తప్ప పాలన విషయంలో ప్రజలకు ఎలాంటి లోపం చేయలేదు. అందుకే, ప్రజలు కూడా ఆయన తపోవన పయనం విన్నపాన్ని వ్యతిరేకించారు. ఆయనతో తమతోనే ఉండాలని కోరుకున్నారు. 'పాలకుని బట్టే పాలితులు' అనేందుకు

ఇదో ఉదాహరణ. నాటి పరిస్థితులను నేడు అన్వయించడానికి అవకాశం ఉందా? అని ప్రశ్నించుకుంటే సమాధానం రాకపోవచ్చు. కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో పాటు పాలకులలో జవాబుదారీతనం లోపిస్తోంది. వానప్రస్థానం స్థానంలో 'వృద్ధ/అనాథశ్రమాలు'వచ్చి చేరాయి. కన్నవారు, పితృసమానాలు కానలకు వెళ్లడానికి అంగీకరించని స్థితి నుంచి, సజీవులుగానే 'కాటి'కి పంపే స్థాయికి సమాజం ఎదుగుతోంది. ఇష్టానుసారంగా వ్యవహరించదగిన రాచరిక వ్యవస్థలో ప్రజాభిప్రాయం మన్ననలు అందుకుంటే, ప్రజాస్వామ్యంలో పాలితుల మాటకు ఎంత విలువ దక్కుతున్నదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

నాయకత్వాన్ని సుస్థిరం చేసుకునే క్రమంలో ప్రజలను ఆకట్టుకునే మార్గాలు (నేటి ఉచిత పథకాలు/తాయిలాలు వంటివి) భారత కాలంలోనే మొదలయ్యాయని దుర్యోధనుడి తీరునిబట్టి తెలుస్తుంది.ప్రజల దృష్టిని పాండవుల నుంచి తప్పించి వారిని ప్రీతులుగా చేసికొని, తనకు అనుకూలంగా మార్చుకోవాలన్నది ఆతని ఉద్దేశం.

'... తొల్లి పాండురాజు రాజై గుణంబులం బ్రజానురాగంబు పడయుటం జేసి యెల్లవారును ధర్మరాజు రాజ్యం వలతురు. దాని నెరిగియె కాదె మేను నిత్యదాన సమ్మానంబులం ప్రకృతి జనంబులకు సంతోషంబును సేయుదనుండుదు." (ఆది). దుర్యోధనుడు తండ్రితో అన్నాడు. పాండవులు అరణ్య,అజ్ఞాతవాస కాలంలో తన ప్రాపకం పెంచుకునేందుకు దుర్యోధనుడు దుర్వ్యయానికి పాల్పడి కోశాగారాన్ని ఖాళీ చేశాడు. ముఖ్యంగా మహా సైన్యాన్ని సమకూర్చుకునేందుకు అధిక వ్యయమే అయి ఉంటుంది. 'మాతోడి యీసునం జేసి పెక్కండ్రు మ్రుక్కడి మూకలనుం గూడబెట్టి భూమియు భండారంబునుం బాడుసేసె..' అని ధర్మరాజే అన్నాడు.

### సార్వకాలీన పాత్రలు

మహాభారతం విశాల విశ్వంలోని ప్రతి అంశాన్నీ ప్రతిబింబిస్తుంది. ఈ మహేతిహాసంలోని పాత్రలన్నీ ఏ కాలానికైనా పోల్చదగినవి. భిన్న మనస్తత్వాలు, చిత్రవిచిత్రమైన గుణగణాలు కలిగిన వారు ఇందులో కనిపిస్తారు. చాలా పాత్రలలో బలహీనతలతో పాటు బలాలు కనిపిస్తాయి. కురుకుల పితామహుడు భీష్ముడు సహా ధృతరాష్ట్ర దంపతులు, ధర్మరాజు, అర్జునుడు, ద్రౌపది, కర్ణుడు తదితర అనేక పాత్రలు విభిన్న వ్యక్తిత్వాలు గలవారితో ఎలా వ్యవహరించాలన్నది చెబుతాయి. ఉదాహరణకు... సహజ కవచకుండలాలతో పుట్టి,సద్గుణ లక్షణాలతో తేజరిల్లిన కర్ణుడు, అధర్మ వర్తనులతో చేతులు కలపడం స్వయం కృతాపరాధం కావచ్చుకానీ కృతజ్ఞతకు మారు పేరుగా నిలిచాడు. సూతపుత్రుడిగా పెరిగి, దుర్యోధనుడి ప్రాపకంతో అంగరాజు అయ్యాడు. తన జన్మ రహస్యం తెలిసిన తరువాత కూడా రాజ్యకాంక్ష, అధికార వ్యామోహంతో పాండవ శిబిరాన్ని ఆశ్రయించాలనుకోలేదు. ఆదరించి,అక్కున చేర్చుకున్న వారికి (సూతదంపతులు, దుర్యోధనుడు) విశ్వాస పాత్రుడిగా ఉండాలన్నది ఆయన విధానం. పదవులు/అధికారం కోసం అవసరానికి అనుగుణంగా అభిప్రాయాలను మార్చుకుంటూ, అవకాశాలు ఇచ్చి ఆదరించిన వారిని, సంస్థలను విస్మరించే వర్తమాన వ్యక్తులను,నాయకులను గమనిస్తే 'స్వామిభక్తి' విషయంలో కర్ణుడి చిత్తశుద్ధి వెల్లడవుతుంది. 'కాకుల మధ్యలో కోకిల' మాదిరిగా, కర్ణుడు ఎంత సుగుణ సంపన్నుడైనా, దురాలోచనపరుడైన దుర్యోధనుడితో చెలిమితో ఆయన ప్రతిష్ఠ మసకబారింది.అయినా నమ్మిన సిద్ధాంతం కోసం నిందలు భరించాడు.

'మీ ఉప్పు తిన్న కారణంగా మీ పక్షాన యుద్ధం చేస్తున్నాను కాని, ఈ యుద్ధంలో ధర్మబద్ధులైన పాండవులకే విజయం లభిస్తుంది' అని భీష్ముడు అన్నట్లు భారత కథనం. ఆయన ఇంతకాలం అధర్మానికి వంత పాడాడా? అనే సామాన్యులకు కలిగే సందేహాలను పక్కనపెడితే, 'పాలకుడు చెప్పింది చేయడం సేవకుల విధి' అనే ధర్మ భావం వ్యక్తమవుతోంది. గాంధారి కూడా ధర్మం వైపే మొగ్గు చూపింది. ఆమె సహజ సిద్ధమైన పుత్ర వాత్సల్యాన్ని చూపింది తప్ప ధర్మాన్ని విస్మరించలేదు. యుద్ధానికి వెళుతూ కుమారుడు దుర్యోధనుడు ఆమె దీవెనలు కోరినప్పుడు "ధర్మం ఉన్న చోటే విజయం ఉంటుంది

('యతోధర్మః స్తతోజయః....') అని ఆశీర్వదించింది తప్ప 'నువ్వే గెలుస్తావు' అనలేదు. తాను ధర్మమార్గములో నడవడం లేదు' అని అంతరాత్మ చేస్తున్న హెచ్చరికతో దుర్యోధనునికి అప్పుడు ఏమీ అనడానికి అవకాశం లేకపోయినట్లయింది.

### వివాహ వ్యవస్థ

నియమ నిబంధనలు, నియంత్రణ లేని సమాజం ప్రగతి సాధించలేదు. మానవబంధాలు, అనుబంధాలు, సక్రమంగా సాగినపుడే సమాజాభ్యుదయం సాధ్యం. అందుకే ద్వాపరయుగ (భారత) కాలంలోని కొందరు పెద్దలు దూరదృష్టితో వివాహ వ్యవస్థ పటిష్ఠతకు పాటుపడ్డారని వివిధ పాత్రలను బట్టి తెలుస్తోంది. ధర్మస్థాపన, ప్రత్యుత్పత్తి, రతి (కామం)అనే అంశాలకు వివాహం ప్రధానమని మహాభారతం పేర్కొంటోంది. మానవ జీవితంలో వివాహం అనివార్యమని, వివాహితులే యజ్ఞయాగాది క్రతువుల నిర్వహణకు అర్హులను కట్టడి చేసింది. నాటి పాలకులు,పాలితులు అలానే భావించారు.

స్వేచ్ఛా సంభోగాలు, సంపర్కాల స్థానంలో మహాభాతర కాలం నాటికి వివాహ వ్యవస్థ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. నేటి వివాహ వ్యవస్థకు అక్కడే పునాది పడిందని చెప్పవచ్చు. ఆది పర్వంలోని రెండు ఉదంతాలు పరిశీలిస్తే వివాహ వ్యవస్థ ఆవశ్యకత తెలుస్తుంది. ఉద్దాలకుడు అనే రుషి ఆశ్రమానికి అతిథిగా వచ్చిన బ్రాహ్మణుడు ఆయన అర్ధాంగి పట్ల అనుచితంగా ప్రవర్తిస్తాడు. అయినా ఉద్దలకుడు స్పందికకపోవడంతో ఆయన కుమారుడు శ్వేతకేతు ఆగ్రహంతో ఊగిపోతాడు. 'కుమారా. ...శాంతించు. ఇది పూర్వం నుంచి వస్తున్న ఆచారమే. ప్రతి స్త్రీకి స్వేచ్ఛ ఉంది' అని ఉద్దాలకుడు కుమారుడికి నచ్చచెప్పబోతాడు. దాంతో మునికుమారుడికి మరింత కోపం వస్తుంది.

**'ఇది యాదిగా సతులెన్నండు బరపురుషార్థముల్ గా జనదన్య పురుష**
**సంగమంబున జేసి సకల పాతకములు నగు బరిగ్రహ భూతలమయిన సతుల**
**కిట్టిది మర్యాద యమ్మునుషులకెల్ల జేసితి లోక ప్రసిద్ధిగాక**
**నని ధర్మమైన మర్యాద మానవులకు దద్దయు హితముగా ధర్మమూర్తి (ఆదిపర్వం)**

(నేటి నుంచి స్త్రీలు పర పురుషుల ఫొందుకూడదు. అలా వ్యవహరించేవారు సమస్త పాపాలు అనుభవిస్తారు)అని శపించాడు.

స్త్రీ పురుషులకు పురుషులకు వివాహం అతి ముఖ్యమని 'శల్యపర్వం'లోని ఒక పాత్ర ద్వారా తెలుస్తోంది. అవివాహితగా ఉంటూ మోక్షం సాధించాలన్న ఉద్దేశం గల కునీ అనే మహర్షి కుమార్తె శుభకు, వివాహ ప్రాముఖ్యత గురించి నారదుడు వివరిస్తాడు. చతుర్విత పురుషార్థాలలోని మూడు అంశాలు...ధర్మ, అర్థ, కామం వల్లనే మోక్షం సాధ్యమని, వివాహంతోనే ఆశయసిద్ధి కలుగుతుందని హితవు పలికాడు. దీనిని మరో కోణంలో విశ్లేషించుకుంటే.... మనుగడకు,ముఖ్యంగా స్త్రీ రక్షణకు పెళ్లి అనే బంధం ప్రధానమన్నది పెద్దల మాట. భీష్ముడి లాంటి వారి ప్రతిజ్ఞలకు, నారదుడు లాంటి కారనజన్ములకు- శుభలాంటి వారి పట్టింపులకు సాపత్యం ఉండదని విమర్శకుల భావన. కలియుగ వివాహ వేడుకలకు ద్వాపరంలోని ఉత్తరాభిమన్యుల వివాహాన్ని స్ఫూర్తిగా తీసుకోవచ్చు. వివాహ సమయంలో పెళ్లి పెద్దలను గౌరవించడం తదితర అంశాలలో కన్యాదాత అనుసరించవలసిన తీరును విరాటరాజు పరంగా చెప్పించాడు తిక్కన కవి. విరటుడు నూతన వస్త్రాలు, మణిభూషణాదులు, కర్పూరం తదితర పరిమళ ద్రవ్యాలు, తాంబూలంతో కూడిన పళ్లెంను మొదట భక్తిపూర్వకంగా శ్రీకృష్ణుడికి సమర్పించాడు. అంతఃపురం స్త్రీలతో ద్రౌపది, సుభద్ర తదితరులకు వస్త్రాభరణాలు ఇప్పించాడు.

### షరతుల పెళ్లిళ్లు

వివాహాలు ఎనిమిది రకాలు. వాటిలో ఉప విభాగాలుగా పరిగణించే మరికొన్నిటిలో 'షరతుల పెళ్లి' ముఖ్యమైనది. ఈ తరహా వివాహాలు భారతంలో తప్ప వేదకాలంలో ఉన్నట్లు ఆధారాలు లభించడం లేదని సాహితీవేత్తలు చెబుతున్నారు. ఇది కూడా శకుంతల-దుష్యంతల నుంచే ప్రారంభమైందని తెలుస్తోంది.తనను పెళ్లాడాలనుకుంటున్నదుష్యంతునితో...

**'నరునుత నీ ప్రసాదమున నాకుదయించిన నందనున్ మహీ**
**గురుతర యౌరాజ్యమునకున్ దయతో నభిషిక్తుజేయగా**
**వరము ప్రసన్నబుద్ధి నవద్యముగా దయసేయునెమ్మతి**
**నిరుపమాన కీర్తియట్లయిన నీకున్ నాకున్ సంగమంబగున్ (ఆది)**

(ఓ మహారాజా.. నీ ప్రసాదంగా నాకు జన్మించే పుత్రుడినే పట్టాభిషిక్తుడిని చేస్తానని మాట ఇవ్వు. అప్పుడే మన ఇద్దరికి పెళ్లి)అని శకుంతల షరతు విధించింది. అనంతరం శంతన మహారాజు గంగను, సత్యవతిని పెళ్లాడుతూ షరతులకు అంగీకరించ వలసి వచ్చింది.

'మంచికాని, చెడు కాని నేను ఏం చేసిన నాకు అడ్డు రాకూడదు. నా చర్యలను ఆపరాదు. ఆగ్రహించరాదు. అందుకు భిన్నంగా జరిగితే వదిలి వెళ్లిపోతాను' అని షరతు పెట్టిన గంగ, పుట్టిన ఏడుగురిని నీటిపాలు చేసింది. ఎనిమిదో సంతానానికి అదే పరిస్థితి దాపురించడాన్ని సహించలేని శంతనుడు...

**'పదయంగరాని కొడుకుల**
**గడు బలువుర బడపి పుత్రఘాతినివైతీ**
**కొడుకును దయార్క తేజుని**
**విడువగనో ననుచు వేడుక తోడన్'**

(ఇప్పటి వరకు ఏడుగురు కుమారులను చంపి పుత్రఘాత్రివి అయ్యావు. సూర్యకాంతితో వెలిగే కుమారుడినైనా వదిలిపెట్టు) అని కోపంగా మందలించాడు. శంతనుడి వాగ్దాన భంగం ఫలితంగా గంగ కుమారుడి తీసుకొని భర్తకు దూరంగా వెళ్లింది.

తన కూతురు సత్యవతిని శంతనుడికి ఇచ్చి చేయాలంటే, ఆమె సంతతికే రాజ్యాధికారం దక్కాలని షరతు పెట్టాడు దాశరాజు. అయితే జ్యేష్ఠుడు (దేవవ్రతుడు) ఉండగా అది సబబు కాదని శంతనుడు అంగీకరించడు. అలాఅని సత్యవతిని మరువలేక పోతున్నాడు. తండ్రి మనోరథం తీర్చేందుకు దేవవ్రతుడు చొరవ చూపాడు. తనకు రాజ్యాధికారం అక్కర లేదని సత్యవతికి జన్మించే పుత్రుడే రాజు కాగలడని, అందుకు ఆజన్మ బ్రహ్మచర్యం పాటిస్తానని దాశరాజుకు హామీ ఇస్తాడు.

**"అద్య ప్రభృతిమే దాశ**
**బ్రహ్మ చర్యం భవిష్యతి,**
**అపుత్రస్యాపిమే లోకాః**

భవిష్యంతి అక్షయా దివి" అని భీకర ప్రతిజ్ఞతో భీష్ముడయ్యాడు. శంతన సత్యవతి దంపతులకు జన్మించిన చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అకాల మరణంతో వంశం నిలిచేందుకు బ్రహ్మచర్యం ప్రతిజ్ఞ ఉపసంహరించు కోవాలని సూచిస్తుంది సత్యపతి. కానీ భీష్ముడు ససేమిరా అంటాడు. ఇది ఆయన నీతి,ధర్మజ్ఞత. పరకాంతలను అవమానించి, వశపరుచుకోవాలనుకునే దుర్యోధన, సైంధవ, కీచకుడి లాంటి వారి కాలంలోనే అన్నమాటకు కట్టుబడిన వ్యక్తి భీష్ముడు.

కలియుగంలో ...ప్రత్యేకించి వర్తమాన సమాజంలో 'షరతుల పెళ్లిళ్లు' కంటే 'ఒప్పందపు వివాహాలు' , 'సహజీవనం' గురించి తరచూ వింటూనే ఉంటాం. వాటి గురించి ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. మాధ్యమాలలో కథనాలు, ప్రత్యక్ష సన్నివేశాలే అందుకు సాక్ష్యాలు.

ఇక చిన్నపాటి కారణాలతో సంసారాలను విచ్ఛిన్నం చేసుకుంటున్న ఆధునికతరం పోకడలకు పురాణాలలోనే బీజం పడిందనడానికి ఆది పర్యంలోని ఉదంతం ఓ ఉదాహరణ.....

జలత్కరుడనే యువకుడు అదే పేరుగల (సనామ్ని) యువతిన ఏరికోరి పెళ్లి చేసుకున్నాడు. అదీ 'నా అభీష్టాన్ని వ్యతిరేకించకూడదు. నాకు కోపం తెప్పించకూడదు'అనే షరతుతో. దాంపత్యం కొంతకాలం బాగానే సాగింది. కుమారుడు కూడా కలిగాడు. ఒకరోజు అతను భార్య తొడపై తలపెట్టుకుని నిద్రిస్తూ సాయంత్రమైనా లేవలేదు. పూజకు వేళమించి పోతుందన్న ఆందోళనతో భార్య అతనిని ప్రాధేయపూర్వకంగా, మృదువుగా నిద్రలేపింది. తుళ్లిపాటుగా లేచిన జలాత్కరుడు ఆగ్రహించితన షరతు మేరకు సతీసుతులను వదిలివెళ్లిపోయాడు.

### సగోత్ర, వావివరుసలు

వివాహాల విషయంలో సగోత్ర పట్టింపు,వావివరుసలను భారతం చక్కగా ఆవిష్కరించింది. వేదకాలం నాటి సగోత్ర, సప్రవర వివాహ నిషేధాలు భారత కాలంలో మరింత బలపడి, ఆధునిక యుగంలోనూ కొనసాగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సామాజిక వర్గాలు, పేద-ధనికవర్గాల మధ్య అంతరాలనైనా తాత్కాలికంగా పక్కన పెడతారేమో కానీ, సగోత్రం విషయంలో రాజీపడని పరిస్థితి. అయితే అదే సమయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అక్కడక్కడ సర్దుబాటు వైఖరి కనిపిస్తుంది. ఉదాహరణకు, వధూవరులు పరస్పరం నచ్చి,అన్ని విధాలా అనుకూలమైన సంబంధం అనుకుంటే వధువు తండ్రి బంధువర్గంలోని ఇతర గోత్రీకులతో కన్యాదానం చేయించే సర్దుబాటు ధోరణి చోటుచేసుకుంటోంది.

సగోత్రాలతో పాటే వావివరుసల పట్టింపు కూడా నాడు ఉంది. గురుపుత్రికను, సొంత శిష్యురాలని పెళ్లాడడం విరుద్ధ సంబంధాలుగా పరిగణించి, ప్రకటించారు. శుక్రాచార్యుడి శిష్యుడు కచుడు. అతనిని గురుపుత్రిక దేవయాని వరిస్తుంది. 'మీ తండ్రి శుక్రాచార్యుడు నాకు గురువు, పితృసమానులు. కనుక...నీవు నాకు సోదరివి...

**'గురులకు శిష్యులు పుత్రులు**
**పరమార్థము లోకధర్మపథమిది దీనిం**
**బరికింపక యీ పలుకులు**
**తరుణీ గురుపుత్రి నీకు దగునే పలుకన్ (ఆది)..**

అని నచ్చచెబుతాడు. వావివరుసల విషయంలో మరో ఉదాహరణను పరిశీలిస్తే....

'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్...'అని ఏదో అనుకున్నా, అందులోని విశేషాన్ని భారతం వివరిస్తుంది. అది ఏ నాటికి ఆచరణనీయమని విజ్ఞులు భావిస్తారు. భారత గాథ ప్రకారం, శంతనుడి తండ్రి ప్రతీప మహారాజు.. ఓ సాయంత్రం వేళ నదీతీరంలో సేదతీరుతుండగా, దివ్యశోభలతో విలసిల్లే అందమైన యువతి (గంగాదేవి) వచ్చి ఆయన కుడ తొడపై కూర్చుని, తనను భార్యగా స్వీకరించమని కోరుతుంది. అర్థకామాల కంటే ధర్మానికి ప్రాధాన్యమిచ్చే ప్రతీపుడు 'నీవు నా కుడి తొడపై వచ్చి కూచున్నావు. అలా కూర్చోవడానికి కొడుకులు, కూతుళ్లు, కోడళ్లు అర్హులు. భార్య కూర్చోవలసిన స్థానం ఎడమవైపు. కుడితొడపై కూర్చున్న నిన్ను కోడలుగా స్వీకరిస్తాను' అని నచ్చచెబుతాడు. ఆయన ధర్మనిష్ఠకు గంగాదేవి మెచ్చుకొని వెళ్లిపోతుంది. తరువాత గంగ శంతనుడిని వివాహమాడుతుంది. గంగ అలా వ్యవహరించడానికి గల నేపథ్యాన్ని పరిశీలిస్తే... గత జన్మలో మహాభిషుడు అని పేరుగల శంతనుడికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. స్వర్గవాసులతో కలసి బ్రహ్మదేవుని దర్శనం కోసం వెడతాడు. ఆ సమయంలో అనుకోకుండా గంగాదేవి వస్త్రాలు కొంచెం తొలగినప్పుడు మహాభిషుడు తప్ప మిగిలిన వారంతా తలలు వంచుకుంటారు. కానీ ఆతడితో పాటు ఆమె పరస్పరం చూసుకుంటారు. భూలోక వాసనలు తొలగని మహాభిషుడు మళ్లీ భూలోకంలో జన్మించాలని బ్రహ్మ ఆదేశిస్తాడు. అలా ప్రతీప మహారాజు కుమారుడి(శంతనుడు)గా

పుడతాడు. బ్రహ్మ శాపం కారణంగా, తాను శంతనుడి భార్యగా కొంతకాలం భూలోకంలో గడపాలి కనుక గంగ ఆతని తండ్రి ఎలాంటివాడో ముందుగా పరీక్షించిందని కథనం.

వర్తమానంలో ప్రతీప మహారాజు ఆదర్శం అడుగంటిపోతోంది. వావివరుసలు మరచి,కడుపున పుట్టిన వారినే కామిస్తూ,, మృగాలు సైతం తలదించుకునేలా కొందరు వ్యహరిస్తున్నతీరును ప్రసార, ప్రచురణ మాధ్యమాలు బట్టబయలు చేస్తూనే ఉన్నాయి.

## భారతంలో కొన్ని స్త్రీ పాత్రలు -విశిష్టత

వేదకాలంలో మహిళలు పురుషులతో సమాన హక్కులు, సమాన గౌరవం పొందేవారు. కొన్ని సందర్భాలలో వారిదే పైచేయిగా ఉండేది. కాలక్రమేణ పరిస్థితులలో మార్పు వస్తూ, మహాభారత కాలానికి పురుషాధిక్యం బాగా పెరిగింది. అయినప్పటికీ కొందరు తమ ప్రత్యేకతను, అస్థిత్వాన్ని నిలుపుకున్నారని శకుంతల, గంగ, గాంధారి,కుంతి, ద్రౌపది లాంటి పాత్రలను పరిశీలిస్తే అవగతమవుతుంది. కలియుగంలో…అందునా నవీన భారతంలో మహిళల సబలత్వానికి వారే స్ఫూర్తి ప్రదాతలుగా భావించవచ్చు. వేదకాలంలో కనిపించని ఆ దురాచారం మహాభారత కాలంలో వేళ్లూనుకుంది. ఆదిపర్వంలో మాద్రితో మొదలైన ఈ ఆచారం మౌసల పర్వానికి వచ్చేసరికి తారస్థాయికి చేరింది. ఆధునిక భారతదేశంలో సతీసహగమన నిషేధచట్టం వచ్చేంత వరకు ఈ దురాచారం కొనసాగింది. దీని నిర్మూలన మాత్రం ఆధునిక యుగం విజయమనే చెప్పాలి.

## ఆధారగ్రంథాలు

1. కవిత్రయ భారతం
2. టీటీడీ ప్రచురణలు
3. 'జాగృతి'వార పత్రిక వ్యాసాలు.

# 59. మహాభారతం - వర్తమాన విద్యారీతులు

- డాక్టర్ ఎం.మురళి, చెన్నై

మహాభారత ఆంధ్రీకరణ సందర్భంగా దీనిని 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంగా, ఆధ్యాత్మికవిదులు వేదాంతమని, నీతి కోవిదులు నీతిశాస్త్రం అని, కవివృషభులు మహాకావ్యమని, లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహంగా..భావిస్తారంటూ నన్నయ ప్రశంసించారు. "ఇందు గలుగునదియు మొందెడల గల్గుయొ దీన లేకుండు చొప్పు దక్కొకంటను లేదు వేదజ్ఞులార" అని తిక్కన భారతాన్ని అన్నాడు. చిన్నాపెద్ద, మంచిచెడు, ప్రాధాన్య అప్రాధాన్యాలు...ఇలా ఏ కాలానికైనా పోల్చదగిన అంశాలు, పాత్రలతో నిండి ఉంది. అలా ప్రపంచంలోని సమస్త విషయాలను చేర్చుకొని,విజ్ఞాన సర్వస్వంగా రూపొందిన ఈ మహాకావ్యంలో , నాటి విద్యావిషయక అంశాలను స్థూలంగా పరిశీలిస్తే....

పరశురాముడు, ద్రోణాచార్యుడు, సాందీపుడు వంటి గురువులు, శ్రీకృష్ణ బలరాములు, కౌరవ పాండవులు, కర్ణుడు, ఏకలవ్యుడు లాంటి శిష్యులు కనిపిస్తారు. కారణజన్ములైన వీరంతా తమ బలాలు, బలహీనలతో అనంతర కాలానికి వివిధ ప్రవృత్తులకు సంబంధించిన ప్రతీకాత్మకలుగా నిలిచిపోయారు. 'విద్యావంతులు, వినయశీలురు, జ్ఞానసంపూర్ణులైన వారిని రాజు ప్రత్యేకంగా సత్కరించాలి. అలాంటి వారిని నిండు సభలో ప్రత్యేకంగా గౌరవించాలి' అని భారతం చెబుతోంది. ఆ కోణంలోనే ద్రోణాచార్యులకు కురుసభలో సముచిత స్థానం లభించిందని భావించాలి.

సనాతన భారతీయ సంస్కృతిలో గురువు స్థానం గల విలువ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించనవసరంలేదు. గురుకులాలు జ్ఞాననిలయాలు. గురువులు జ్ఞానస్వరూపులు. వశిష్ట, విశ్వామిత్ర, సాందీపమహర్షి తదితరులు సద్గురువులుగా ప్రసిద్ధులు. అవతారధారుడైన పరమాత్మ వారి ఎదుట దోసిలి ఒగ్గి జ్ఞానభిక్ష అర్థించాడు. గురువులు తమ జ్ఞానభాండారం నుంచి అమూల్యమనదగిన జ్ఞానాన్ని ప్రసాదించారు. గురువు శిష్యుని యోగ్యతలను పరిశీలించి అంగీకరించడమో నిరాకరించడమో జరిగేది. గురువు అనుగ్రహం పొందిన వారు గురుకులంలోనే నివసిస్తూ 'గురు శుశ్రూషయా విద్యా" అన్నట్లు గురు సేవ చేసుకుంటూ విద్యార్జన చేసేవారు. గురుశిష్య సంబంధం తండ్రీకుమారుల అనుబంధంలా పరిగణించేవారు. తైత్తరీయ ఉపనిషత్తుల్లోని "ఆచార్యదేవో భవ" అన్న మంత్రం గురువును కన్నవారి సరసన ప్రతిష్ఠించింది.తండ్రి నుంచి పిత్రార్జితంలా గురువు నుంచి జ్ఞాన సంపద సంక్రమిస్తుంది.

మహనీయులైన గురువులను ఆశ్రయించి తన మనస్సులోని సందేహాలను విన్నవించి నివృత్తి చేసుకోవాలని గీతాచార్యుడు శ్రీకృష్ణభగవానుడే చెప్పాడు. సాక్షాత్తు అవతార పురుషులైన రామకృష్ణులు హంగుఆర్భాటాలు లేకుండా సామాన్యులు మాదిరిగానే విద్యాభ్యాసం చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. విద్యాభ్యాస కాలంలో శిష్యుడికి గురువు పట్ల గౌరవం, ఆయన ఆదేశ సందేశాలను శిరసావహించాలనే భక్తి భావం ఉండాలి.విద్యార్థి నిత్య జ్ఞాన భిక్షువై ఉండాలి. నేర్చుకోవాలన్న తపన ఉండాలి. నిత్యఅధ్యయనశీలి కావాలి. 'సర్వజ్ఞుడిని. మహాజ్ఞానిని. మహా పండితుడిని అనుకుంటే అదంతా డొల్లతనమే. స్వీకరించినట్టే వివేకులు సద్గురువుల నుంచి సుమధురజ్ఞానసుధను పొందుతారు.వీటన్నిటికి భారత పాత్రలు ప్రతీకలు. 'గురువు నా శ్రేయోభిలాషి. ఏం చెప్పినా నా మంచికే' అనే భావన శిష్యుడిలో, 'శిష్యుడు వినయ సంపన్నుడు. గురువాక్కును ధిక్కరించడు' అనే ప్రేమానురాగాలు గురువుకు కలగాలి. అప్పుడే బోధనాభ్యాసాలకు సార్థకత. అలా తనకు జ్ఞానభిక్ష ప్రసాదించిన పలానా వ్యక్తి 'నా గురువు' అని చెప్పుకునే శిష్యులు ఉన్నట్లే, పలానా వ్యక్తి 'నా శిష్యుడు' అని చెప్పుకునే గురువులూ కనిపిస్తారు. అయితే కొన్ని సందర్భాలలో మనసు మోహవేశం కావడం, విభిన్నంగా ఆలోచించడం. ఒక్కొక్కసారి పరస్పర విరుద్ధ పనులు చేయవలసి రావడం ప్రకృతి సహజం అంటారు పెద్దలు, అందరి విషయంలో కాకపోయినా కొందరిలోనైనా ఈ లక్షణాలు పొడుకుంటాయి. యుగంతో పాటే విధానం మారవచ్చు కానీ ధర్మం

శాశ్వతం. నాడు చదివినంత కాలం గురుకులాలలో అంకితమైతే, ఆధునిక కాల పరిస్థితిని బట్టి విద్యాసంస్థలలో గడిపేది రోజులో కొన్ని గంటలు మాత్రమే. అది ఈ యుగధర్మం కావచ్చు. కానీ గురువులను గౌరవించడం,శిష్యులను ఆదరించడం ఏ కాలంలో అయినా ఒకటే. అది నేడు ఎంత వరకు ఉందో ఎవరికి వారే ఆలోచన చేసుకోవలసి ఉంది. శిష్యురాలిని పుత్రికా సమానురాలిగా భావించే గురువులు, గురు పుత్రికను సోదరిలా పరిగణించే కచుని లాంటి శిష్యులు కనిపిస్తారా?

భారతకాలంలో వర్ణాశ్రమధర్మాలు ఎక్కువుగా కనిపిస్తున్నాయి. బ్రహ్మణ, క్షత్రియ, వైశ్యులు కాని వారు వృత్తి విద్యలు తప్ప, తక్కిన విద్యలు నేర్చుకోవడానికి ఆకాలంలో అవకాశం ఉండేదికాదు. రాజధర్మం ప్రకారం కురుపాండవులు ధనుర్విద్యను అభ్యసిస్తారు. సూతపుత్రుడిగా పెరుగుతున్న కర్ణుడికి, నిషాదుడు ఏకలవ్యుడికి విద్య పట్ల అభిలాష. కానీ వారికి విద్యను బోధించడానికి ద్రోణుడు నిరాకరిస్తాడు. అభిజాత్యం అందుకు ప్రధానంగా అడ్డునిలుస్తుంది. దీనినిబట్టి అందరికి సమాన విద్య అనేది నాడు గగన కుసుమమే అని భావించాలి. అలాంటప్పుడే 'అణిచివేతకు తిరుగుబాటే మందు' అన్నట్లు ఏదో విధంగా ఆశయాలను సాధించాలన్న పంతం పెరుగుతుంది. కర్ణుడు విద్య కోసం బ్రాహ్మణుడిగా పరశు రాముడిని ఆశ్రయించడం అలాంటిదేనని చెప్పవచ్చు. స్వతంత్ర గురుకులాలో తప్ప రాజాశ్రయంతో నడిచిన చోట రాజవంశేతరులకు చదువుకునే అవకాశం లేదని తెలుస్తుంది.

చదువు పూర్తయిన తరువాత 'కుమార విద్యా ప్రదర్శన'లో పాండవ, కౌరవులు తమ అస్త్రశస్త్ర విన్యాసాలను ప్రదర్శించే సమయంలో 'అర్జునుడిని మించిన విలుకాడు లేడు'అన్న ద్రోణుడి ప్రకటనతో 'నేనున్నాను.అర్జునుడితో పోరాడగలను'అంటూ ముందుకు వస్తాడు కర్ణుడు. అంతలో భీష్ముడు జోక్యం చేసుకుంటూ' నీవు క్షత్రియుడవు కానందున రాజుగా అర్హుడవు కావు. కనుక ఈ విలువిద్య ప్రదర్శనలో పాల్గొనే అర్హత లేదు' అని నిలువరిస్తాడు. ఆ నిరసన భావమే కర్ణుడిని అంగరాజును చేసింది. కులం, శౌర్యం, సేవాభావం కలవారు రాజుతోసమానమని, కర్ణుడికి రాజ్యమే లేకపోవడం లోటు అనుకుంటే ఇప్పుడే అంగరాజ్యానికి రాజును చేస్తున్నానని దుర్యోధనుడు ప్రకటించాడు.

భారతకాలంలో ఇతరులు సంగతి ఎలా ఉన్నా పోటీదారులు, ప్రత్యర్థులు విద్యా విషయకంగా శాపగ్రస్థులైన వారు ఉన్నారు. కనిపిస్తారు. కచుడు, ఏకలవ్యుడు, కర్ణుడు ప్రధానంగా కనిపిస్తారు. బృహస్పతి కుమారుడు కచుడు దానవ గురువు శుక్రాచార్యుడి వద్ద మృతసంజీవని విద్యను నేర్చుకుంటాడు. శుక్రుని కుమార్తె దేవయాని అతడిపై వలపు పెంచుకుని, వివాహం చేసుకోవాలని కోరుతుంది. కచుడు ఆమె కోరికను తిరస్కరిస్తూ, 'నీవు గురుపుత్రికవు.కావున సోదరివంటిదానవు.నిన్ను పరిణయము కాదగదు' నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తాడు. ఆగ్రహించిన ఆమె 'నీవు నేర్చిన విద్య ఉపకరించదు'అని శపిస్తుంది. కర్ణుడిది కూడా అదే పరిస్థితి. బ్రహ్మాస్త్ర ప్రయోగ విద్యను నేర్పడానికి ద్రోణుడు నిరాకరించడంతో బ్రాహ్మణ రూపంలో పరశు రాముడిని ఆశ్రయిస్తాడు. అయితే ఆతని గురించి తెలిసి 'మోసగించి తెలుసుకున్న అస్త్రవిద్య అత్యవసర సమయంలో ఉ పకరించదు'అని శపిస్తాడు. ఏకలవ్యుడు తన ప్రియశిష్యుడు అర్జునుడి మించిపోతాడేమోనని ద్రోణుడు అతని బొటన వేలును గురుదక్షిణగా కోరి అతనిని నిర్వీరుని చేశాడు. ఒకవైపు విదుర నీతితో పాటు ఇలాంటి ధోరణులతో మిశ్రమ ధోరణిని పట్టి చూపుతాయి. శాపాలు,శిక్షలను తొందరపాటు చర్యలుగా చెబుతారు ఆధునిక కాలంలో శాపాలు లాంటవి లేకపోయినప్పటకీ ఆశ్రిత పక్షపాతం లేదని చెప్పలేం.

### గురుదక్షిణ

గురువు త్రిమూర్త్యాత్మకుడు. జ్ఞానోపార్జనకు , జ్ఞానోపదేశానికి ఎంతో సమయం వెచ్చిస్తారు. చదువు చెప్పడంలో ప్రతిఫలాన్ని ఆశించరు. అయితే ఆయన సంసారం సుఖంగా సాగడానిక శిష్యులు గురుదక్షిణ సమర్పించుకోవాలి. రామాయణ, భారత కాలాలలో గురుపోషణ బాధ్యతను రాజులు, మహారాజులు చూసుకునేవారు. కొందరు గురువులు పాలకుల నుంచి

ఎలాంటి సహాయాన్ని ఆశించకుండానే గురుకులాలు నిర్వహించేవారని పురాణాలు చెబుతున్నాయి. విద్యార్థులు గురుశుశ్రూష చేస్తూ విద్యను అభ్యసించేవారు. గురువుల జీవనానికి లోటు లేకపోయినప్పటికీ, చదువు పూర్తయిన తరువాత శిష్యులు గురుదక్షిణ సమర్పించుకునేవారు. ఇది వారి పట్ల గల భక్తి, గౌరవ భావాలను ప్రదర్శించే ప్రక్రియ మాత్రమే. కొందరు గురువులు ఇచ్చింది స్వీకరిస్తే, ఇంకొందరు అడిగి తీసుకుంటారనే ఉదాంతాలు భారతంలో కనిపిస్తాయి. ద్రోణాచార్యుడు తనకు గురుదక్షిణగా ఏకలవ్యుడి బొటనవేలు కోరుకోవడం, ఒకనాడు తనను అవమానించిన ద్రుపదరాజును బంధించి తేవాలని ప్రియశిష్యుడు అర్జునుడిని అడగడం, మృత్యుముఖంలో ఉన్న గురుపుత్రుడిని శ్రీకృష్ణుడు కాపాడడం వంటివి అందుకు ఉదాహరణలు. వీటిలో మొదటి రెండు ఉదంతాలలో రాగద్వేషాలు, మూడవదానిలో గురుభక్తి కనిపిస్తుంది. హిరణ్యధన్వుడనే ఎరుక రాజు కుమారుడు ఏకలవ్యుడు తనను శిష్యుడిగా చేర్చుకోవాలని ద్రోణుడిని అర్థిస్తాడు. అందుకు నిరాకరిస్తాడు ద్రోణుడు. విలువిద్యపై మమకారంతో, ద్రోణుడినే గురువుగా మనసులో నిలుపుకొని, మట్టితో చేసిన ఆయన ప్రతిమను ఎదుట పెట్టుకొని సాధన చేసి ప్రావీణ్యుడవుతాడు. అది విన్న ద్రోణుడికి గర్వకారణమే. కానీ శిష్యపక్షపాతం దానిని మరుగుపరచింది. 'ఇతరులు ఎవ్వరూ నిన్ను మించిపోని విధంగా తీర్చిదిద్దుతాను'అని అర్జునుడికి ఇచ్చిన మాట మేరకు ద్రోణుడు...ఏకలవ్యుడి బొటనవేలిని గురుదక్షిణగా కోరాడు.

ఇక్కడ ధర్మాధర్మాలను పక్కన పెడితే, ఏకలవ్యుడి త్యాగంతో గురువుల పట్ల విద్యార్థులకు గల గురి, భక్తిభావం వెల్లడవుతుంది. అలాగే తన బాల్యమిత్రుడు, ద్రుపద మహారాజు అనుచితంగా వ్యవహరించడాన్ని మనసులో పెట్టుకున్న ద్రోణుడు, ఆయనను పట్టి తన ఎదుట నిలబెట్టాలని అర్జునుడిని కోరతాడు.అర్జునుడు దానిని అమలు చేస్తాడు. ఈ రెండు సంఘటనలను బట్టి గురుదక్షిణ ద్వారా పక్షపాతం వైఖరి,పంతం తీర్చుకున్న తీరు వెల్లడవుతుంది. అల్పాయుష్కుడైన గురువు సాందీప మహర్షి కుమారుడికి ప్రాణదానం చేశాడు శ్రీకృష్ణుడు.'విద్యార్థులు సోమరితనాన్ని దరికి చేరనివ్వకూడదు. సర్వభోగాలలో తేలియాడేవారికి చదువు రాదు. విద్యాభ్యాస కాలంలో వినయం, కష్టాలను భరించే శక్తిని అలవరచుకోవాలి. వేదవేదాంగాలు చదివిన వారు నిత్యం సత్కర్మలే చేస్తూ లోకకళ్యాణానికి పాటుపడాలి. శాస్త్రాలన చదివిన వారు అందులోని సదాచారాలను పాటించి, ఎదుటివారికి చెప్పాలి' అని విదురుడు చదువు ప్రాధాన్యాన్ని, విద్య ప్రయోజనాలను వివరించాడు.అయితే భారత కథా క్రమాన్ని బట్టి పైన ఉదహరించిన సంఘటనల తరువాతే విదురుడు నీతిని బోధించినట్లు అవగతమవుతుంది.

మహాభారతం ఆదిపర్వంలో మార్కండేయుడు అన్నట్లుగా ప్రచారంలో ఉన్న కథ ప్రకారం, కలి ప్రభావం అప్పటికే కనిపిస్తుందనిపిస్తుంది. 'అన్నం పెట్టి, నీడనిచ్చి, చదువు చెప్పే అశ్రమాలను చూస్తున్నాం. ఆకలితో 'దేహి'అన్నవారికి ఆదరణతో అన్నదానం చేస్తున్న వారు కనిపిస్తున్నారు. రాబోయే కలియుగంలో అన్నదాన విద్యాదానాలు ఉండవు. అన్నం విక్రయ వస్తువు, విద్య వ్యాపారం అవుతుందని సుమారు అయిదు వేల సంవత్సరాల క్రితమే మార్కండేయ మహర్షి నోట పలికించాడు వ్యాసుడు. ఏకలవ్యుడిని కోరిన గురుదక్షిణను వర్తమాన సమాజానికి అన్వయించి చూస్తే...ఒక స్వయంకృషితో అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థిని కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు తమ విద్యార్థిగా ప్రకటించుకోవడం, పరీక్షలకు ముందే ప్రశ్న పత్రాలు బయటపడడం, అర్జునుడిలా ....ఎవరిదో కష్టార్జితాన్ని తనదిగా చెప్పుకోవడం వంటివి గుర్తుకు వస్తాయి.

గురుకులాల్లో విద్యతో పాటు ఆధ్యాత్మిక బోధనాంశాలు భాగంగా ఉండేవి. లౌకిక అలౌకిక అంశాలు సహన సాధనలతోనే సాధ్యమవుతాయని విద్యార్థులను సుశిక్షితులుగా తీర్చిదిద్దేవారు. నేడు విజ్ఞాన వికాసాలకు బదులు విపరీత ధోరణులకు తెరతీస్తున్నారు.అందుకు కేవలం విద్యార్థులనే తప్పుపట్టనవసరం లేదు. తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉంటుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. గురువుల బోధనతోనే, స్వయం కృషితోనో ఉత్తమ శ్రేణిలో రాణిస్తే సరిపోదు. చదివిన

చదువుకు సార్థకత ఉండాలంటే...పెద్దల పట్ల, కన్నవారి పట్ల వినయవిధేయతలు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో ఆదరాభిమానాలు కలిగి ఉండాలి. అందుకు మహాభారతంలో పాండవులు, బలరామకృష్ణులను ఉదాహరణగా చెప్పవచ్చు.

ఆదర్శ గురువులతో పాటు ఆశ్రిత పక్షపాతులు కూడా ఉన్నారని రామాయణ, భారత గాథల ద్వారా తెలుస్తుంది.

సాక్షాత్తు అవతారమూర్తులైన శ్రీరామకృష్ణులకు వశిష్ఠ, సాందీప మహర్షులు వారికి గురువులు. ఆ శిష్యుల వల్ల శిష్యులకు గౌరవమా? శిష్యుల కారణంగా గురువులకు ఖ్యాతా? అనే ప్రశ్న ఉదయించినప్పుడు విత్తుముందా? చెట్టు ముందా? అనే సందేహం ఎదురుకాకమానదు. శ్రీకృష్ణుడు అనంతరకాలం 'గీతాచార్యుడు' వెనుక ఆయన అవతారతత్వం ఉండిఉండవచ్చుకానీ సాందీపుని శిష్యుడిగానే చెప్పుకునేవాడంటారు.'శిష్యాధిచ్చేత్ పరాజయం'అనే ఆర్యోక్తి ఇలాంటి సందర్భాలలోనే జ్ఞప్తికి వస్తుంటుంది. ఆధునిక కాలంలోనూ ఎందరో ఉత్తమ గురువులు, వారిని మించిన, వారు మెచ్చిన శిష్యులు లేకపోలేదు. భారత రాష్ట్రపతులుగా సేవలు అందించిన ప్రఖ్యాత విద్యావేత్తలు సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం తదితరులు అలాంటి కోవకు చెందిన మచ్చుకు కొందరు. అదే సమయంలో వృత్తిరీత్యా గురుస్థానంలో ఉన్నప్పటికీ దాని గౌరవాన్ని కాపాడలేని వారి గురించీ వింటుంటాం. సందర్భం వచ్చిన ప్రతిసారి పురాణ పురుషులనో, గత తరం ప్రముఖులనో ప్రస్తావించుకోవడం పరిపాటి. వర్తమాన గురుశిష్యులు ఆ స్థాయికి చేరేందుకు మరో మహాభారతం నాటి ఉత్తమ గురుశిష్య సంబంధాలు సాక్షాత్కారమవుతాయి.

**ఆధారగ్రంథాలు :**

ఆంధ్రమహాభారతం– టిటిడి ప్రచురణలు

# 60. ఎర్రన ఆరణ్యపర్వభాగంలో యక్షప్రశ్నలు

- డా॥ తిరుమల ఆముక్తమాల్యద, చెన్నై

రామాయణం, భారతం, భాగవతం మన భారతీయులకు అతి పవిత్రమైన, ప్రామాణిక గ్రంథాలైనా, భారతమే అందరికీ అత్యంత ప్రియమైన గ్రంథమని 'వింటే భారతమే వినాలి తింటే గారెలే తినాలి' అన్న నానుడి తెలుపుతుంది. వేదసారాన్ని తనలో ఇముడ్చుకున్న భారతం పంచమవేదమయ్యింది.

కవిత్రయంలో చివరివాడైన ఎర్రన ఆరణ్యపర్వశేషంలో మూలంలోని 5000 శ్లోకాలను 1599 గద్యపద్యాల్లో నిర్మించాడు. ఇందులోని ధర్మవ్యాధోపాఖ్యానం, కుమారస్వామి అవతారం, సావిత్రీ సత్యవంతుల ఉపాఖ్యానం, కర్ణుని జననం లాంటి ప్రధాన ఘట్టాలలో యక్షప్రశ్నలకు ధర్మరాజు ఇచ్చే సమాధానాలు కూడా ఒక ప్రధానమైన ఘట్టం.

ఆరణ్యపర్వంలోని కొన్ని సంస్కృత భారత ప్రతుల్లో యక్షప్రశ్నలు 122 వరకు ఉన్నా, ఎర్రన ఆంధ్రీకరించిన మనకు ఇచ్చిన ప్రశ్నలు 47 మాత్రమే. ఈ యక్షప్రశ్నల ప్రారంభ ఘట్టం నుండే మనం వర్తమాన సమాజానికి అన్వయించుకో దగిన విషయాలు కనిపిస్తాయి.

పంచపాండవులు అరణ్యవాసం చేసే సమయంలో వారిని పరీక్షించడానికి ధర్మరాజు తండ్రియైన యమధర్మరాజు ఒక లేడిరూపంలో వచ్చి చెట్టుకొమ్మకు వ్రేలాడదీసిన అరణిని అంటే నిప్పుకొయ్య తన కొమ్ముకు తగిలేట్లు చెట్టును వేగంగా ఢీకొని పారిపోతుంది. ఆరణి లేకపోతే వైదికవిప్రుల దినచర్య స్తంభించిపోతుంది కాబట్టి ఆ బ్రాహ్మణుని ప్రార్థన మేరకు పాండవులు ఆ లేడిని వెంబడిస్తారు. కానీ విఫలురవుతారు. వారు ప్రయోగించిన బాణాలు ఒక్క బాణం కూడా ఆ లేడిని చేరలేదు, తానకు లేదు. ఆ లేడిని చాలా దూరం వెంబడించడం వలన వారు బడలికతో ఒక మఱ్ఱిచెట్టు నీడన విశ్రమిస్తారు. అప్పుడు నకులుడు ధర్మరాజుని "మంచివంశంలో జన్మించి, సత్ప్రవర్తన కలిగి, దయావ్రతాన్ని పాటిస్తూ,ధర్మవర్తులైన మనకు ఈ ఆపద కలగడానికి కారణమేమిటని" ప్రశ్నిస్తాడు. ధర్మజుడు " సుఖదుఃఖాలకు కారణం చేసిన పూర్వకర్మయే" అంటాడు.

ఈ సమాధానం ఇప్పటికీ వర్తిస్తుంది. కర్మసిద్ధాంతాన్ని అంత సులభంగా తెలపడంలో ధర్మరాజు వివేకాన్ని తెలుపుతుంది. ఈ సిద్ధాంతాన్ని నాస్తికదర్శనాలు కూడా అంగీకరిస్తాయి.

అప్పుడు పాండవులు తాము చేసిన అపరాధాలను జ్ఞాపకం చేసుకుంటారు. భీముడు నిండుసభకి ప్రాతికామి ద్రౌపదిని పిలుచుకుని వచ్చినపుడే కౌరవులను సంహరించకపోవడమే ఈ ఆపదకు కారణమంటే, అర్జునుడు సభలో కర్ణుని పరుషవచనాలకి ఆగ్రహించక, పిరికివాని వలె తాను అడవికి వెళ్ళడం కారణమంటాడు. సహదేవుడు మాయజూదమాడే శకునిని ఆనాడే చంపకపోవడమే ఇప్పటి కష్టాలకు కారణమంటాడు.

ధర్మరాజుకు తాత్త్వికంగా సోదరులు నలుగురూ విముఖులైనా, ఆచరణలో అతనికి విధేయులే. అటువంటి ఐక్యత ఉంటే నేడు కూడా ఉమ్మడికుటుంబాలు సజీవంగా ఉండేవి.

బడలిక వలన బాగా దప్పిగొన్న సోదరులకు నీటిని తెమ్మని ధర్మజుడు నకులుని ఆజ్ఞాపిస్తాడు. నకులుడు అన్న ఆజ్ఞ శిరసావహించి, చెట్టుపైకెక్కి నీరున్న చోటిని గుర్తించి, అక్కడికి వెళతాడు. అక్కడున్న అందమైన తటాకంలోని నీటిని తాగడానికి ఉపక్రమించినపుడు శరీరం లేని ఒక భూతం ఆ చెరువు తనదనీ, అందులోని నీటిని తాగాలంటే బుద్ధిమంతుడై, తను అడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వాలని అంటుంది. ఆ మాటలను చులకన చేసి, నీరు తాగిన నకులుడు ఒడ్డున చైతన్యం లేకుండా కూలిపోతాడు. ఎంత సేపైనా రాని నకులుని కొరకు ధర్మరాజు పంపిన సహదేవుడు, అర్జునుడు, భీముడు కూడా నీరు తాగి, అచేతనులవుతారు.

బలవంతులైనవారు పరాయివారి స్థలానికి వెళ్ళి, వారి శక్తిసామర్థ్యాలు తెలుసుకోకుండా, దర్పంతో ప్రవర్తిస్తే వచ్చే ముప్పు గురించి ఇక్కడ చక్కగా తెలపబడింది. ఇది నేటికీ వర్తిస్తుంది.

వెళ్ళిన నలుగురు సోదరులు తిరిగి రాకపోవడంతో ధర్మరాజు వారిని వెతుక్కుంటూ ఆ తటాకం దగ్గరికి వస్తాడు. అక్కడ ఒడ్డున స్పృహ లేక పడి ఉన్న తమ్ములను చూచి, కొయ్యబారిపోయి చిత్తరువు వలె కొంతసేపు నిశ్చేష్టుడవుతాడు. దుఃఖితుడవుతాడు. తరువాత తేరుకుని, ధైర్యాన్ని కూడదీసుకుని, తమ్ములను, నలుదిక్కులను పరీక్షించి చూస్తాడు. అక్కడకు ఇతరులు ఎవ్వరూ వచ్చిన, వెళ్ళిన అడుగుజాడలు లేకపోవడంతో, అసమాన బలపరాక్రములైన తమ్ములు అలా నేల కూలడానికి కారణం దుర్యోధనుడు, శకునేమో అనుకుంటాడు. ఎంతటి వివేకులకైనా ప్రియమైనవారిని కోల్పోయినపుడు యెన్నెన్నో సందేహాలు వస్తాయి, అందరినీ అనుమానించే దుస్థితి కలుగుతుందని ఈ ఘట్టం తెలుపుతుంది. ఇది అన్ని కాలాలలోను వర్తిస్తుంది.

నేలకూలిన సోదరుల ముఖాలు ప్రసన్నంగా, కళ తప్పకుండా ఉండడంతో ఆ నీరు విషపూరితం కాదనుకుంటాడు. విజ్ఞుడు కనుక అన్నింటినీ సూక్ష్మంగా పరిశీలించ గలిగాడు ధర్మజుడు.

తమ్ముల గురించి తల్లి కుంతీదేవి అడిగితే యేమని సమాధానమీయాలో అని మథనపడతాడు. ఇలా దుఃఖించి దాహానికి తాళలేక కొలనులోకి దిగిన ధర్మరాజుని ఆ అశరీరవాణి వారిస్తూ, "ధర్మనందనా! నేనొక కొంగను. ఈ సరోవరం నా ఆస్తి. నా హెచ్చరికను పాటించక ఇందులోని నీరు తాగి, నీ సోదరులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. నా ప్రశ్నలకు సముచితమైన సమాధానాలిచ్చి, ఆ తరువాత ఈ కొలనులోని నీరు తాగు" అన్నది.

వివేకి అయిన ధర్మరాజు "నీవు కొంగవు కాజాలవు. కొంగరూపం ధరించిన శివుడవో, అగ్నిదేవుడవో, పవనుడవో తెలుపు. కులపర్వత సమానులు,వీరాధివీరులైన వీరిని నేలకూల్చిన నీవెవరవు?" అని అడుగుతాడు.

తన సోదరులపై ధర్మజునికి అంతటి నమ్మకం,భరోసా. అలాంటి నమ్మకం, విశ్వాసం కనుక నేటికి ఉంటే విశ్వంలో అసలు హింసకాండకు తావే ఉండదు.

అప్పుడు ఆ అశరీరవాణి తానొక యక్షనాయకుడనీ, భీమాదులు తనను అవమానించినందున కుప్పకూలారని చెప్పి, భయంకరమైన ఆకారంతో, దేదీప్యమానమైన వర్చస్సుతో ప్రత్యక్షమవుతాడు. తన అనుమతి లేనిదే ఆ కొలనులోని నీరు తాగినవారు ఎంతటి గొప్పవారైనా మరణిస్తారని అంటూ, తన ప్రశ్నలకి సమాధానాలిమ్మంటాడు.

పన్నెండేళ్ళ అరణ్యవిశ్వవిద్యాలయంలో జిజ్ఞాసువుగా మహర్షుల ద్వారా జ్ఞానాన్ని పొందిన ధర్మరాజు, తన సమాధానాల మీదే తన తమ్ముల ప్రాణాలు ఆధారపడియున్నాయన్నది గ్రహిస్తాడు. ఇది అతడికి అసిధారావ్రతం. స్నాతకపరీక్ష.

వివేకి క్లిష్ట పరిస్థితులలో మనసుని యెలా ఉంచుకోవాలో ఈ ఘట్టం ద్వారా తెలుస్తుంది. ఎంతో జాగ్రత్తగా, మనసుని స్థిరంగా ఉంచుకుని, ఏకాగ్రతతో, తన తెలివితేటలన్నింటినీ ఉపయోగించి, సమర్థవంతంగా, మనసులో ఎటువంటి దుఃఖాన్ని, క్లేశాన్ని ఉంచుకోకుండా, సందేహాలకు తావివ్వకుండా సమాధానాలని ధర్మరాజు యెలా ఇస్తాడో వివరించబడింది.

అందుకే యెంతో నమ్రతతో తనకు తెలిసినమేరకు సమాధానాలు చెపుతానంటాడు.

యక్షుడు తన ప్రశ్నలపరంపరను ఇలా మొదలుపెడతాడు:

**"దినకరు నెయ్యది నడపును? దిన్కరు నెవ్వారు గొలిచి తిరుగుదు? రద్దే**
**వుని యస్తమించు టేమిట? ననఘ! తదాధారభూత మది యెద్దియొకో?**

సూర్యుడిని నడిపేది ఏది? సూర్యుడిని సేవించి తిరిగేవారు ఎవరు? సూర్యుడు దేనివలన అస్తమిస్తాడు? సూర్యుడికి ఆధారమయినది ఏది?

సమాధానంగా "సూర్యుడిని బ్రహ్మం నడుపుతుంది. సూర్యుడిని సేవించి తిరిగేవారు వేల్పులు. సూర్యుడు ధర్మంచేత అస్తమిస్తాడు. ఆ మహాత్ముడిని ఆధారం సత్యం అని పెద్దలంటారు" అని ధర్మరాజు అనడంలో పెద్దలందు అతడికి గల విశ్వాసం తెలుస్తుంది.

**అత్యంత ఆశ్చర్యకరమైనదేమిటి?** అన్న ప్రశ్నకి ధర్మజుడిచ్చిన సమాధానం "ప్రతిదినం ప్రాణులు చనిపోవటం మానవులు చూస్తూనే ఉన్నా, తాము మాత్రం స్థిరంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇంతకంటే అత్యాంతాశ్చర్యకరమైనదేదని అద్భుతంగాఉంటుంది.

"దేనివలన శ్రోత్రియుడు ఔతాడు? దేనివలన పురుషుడు గొప్పమహిమను ఒప్పిదంగా పడయగలుగుతాడు? దేనివలన సాయం పొందినవాడు ఔతాడు? దేనివలన బుద్ధిమంతుడు ఔతాడు? అన్న ప్రశ్నలకు ధర్మరాజు

**"శ్రుతమువలన శ్రోత్రియుడగు: నతులతపోయుక్తి గడుమహత్త్వము పడయున్:**
**ధృతిచే సహాయయుతుడగు: నతిశయముగ బుద్ధిమంతుడగు బుధసేవన్ "**

అని సమాధానమిస్తాడు. అంటే వేదాభ్యాసం వలన శ్రోత్రియుడు కాగలుగుతాడు, నిరుపమానమైన తపస్సువలన గొప్పప్రభావం సిద్ధిస్తుంది. ధైర్యంవలన సహాయం పొందుతాడు, పెద్దల పరిచర్య వలన బుద్ధిమంతుడవుతాడు.

**యక్షప్రశ్న:** "దేనివలన బ్రాహ్మణుడు దివ్యత్వాన్ని సాధిస్తాడు? బ్రాహ్మణుడికి నిర్మలత్వం ఎట్లా ఏర్పడుతుంది? మాలిన్యం ఎట్లా కలుగుతుంది? దేనివలన బ్రాహ్మణుడు మర్త్యుడవుతాడు?

**సమాధానం:** విప్రుడు వేదపఠనం వలన దివ్యత్వం, మిక్కుటమైన నిష్ఠ వలన సాధుభావం సంపాదిస్తాడు. సద్వర్తనాన్ని వీడినపుడు కలుషితుడవుతాడు. శుచిత్వనియమాలను పాటించక మరణభీతితో కూడిన మర్త్యుడవుతాడు.

బ్రాహ్మణత్వమన్నది కులంచేత కాని గోత్రం చేత కానీ సిద్ధించదు. అది సౌశీల్యం వలన మాత్రమే సిద్ధిస్తుందన్నది ఇక్కడ చెప్పబడింది. ఇక్కడ శుచిత్వమన్నది త్రికరణశుద్ధి – అంటే మనోవాక్కాయకర్మలలో పారిశుద్ధ్యం గలిగి ఉండటం. ప్రస్తుతం ఈ విషయం అందరూ గ్రహించగలిగితే మన దేశం ప్రశాంతనిలయంగా మారి, రామరాజ్యమే అవుతుంది.

జీవన్మృతుడెట్టివాడు? అన్న ప్రశ్నకి " దేవతలకు పితృదేవతలకు అతిథులకు సేవకులు మున్నగువారికి పెట్టకుండా తాను భోజనం చేసేవాడు బ్రదికిఉండగనే మరణించినవాడితో సమానుడ"ని సమాధానమిస్తాడు ధర్మజుడు.

" భూమికన్నా బరువైనది ఏది? ఆకాశం కంటే కూడా నిడివి కలది ఏది? గాలికంటే వేగంగా పోగలిగింది ఏది? గడ్డికంటే విరివిగా పెరిగేది ఏది?" అన్న ప్రశ్నలకు ధర్మనందనుడు " భూమికన్నా బరువైనది కన్నతల్లి, ఆకాశం కంటే పొడవు తండ్రి, గాలికంటె వేగగమనం కలది మనస్సు, గడ్డికంటే విరివి ఐనది చింత" అని సమాధానమిస్తాడు.

ఈ సమాధానాలు అన్ని కాలాలకు వర్తిస్తాయి.

**"మొనసి నిద్రించియును గన్ను మూయదెద్ది? పుట్టియును జేతనత్వంబు బొరయ దెద్ది?**
**యరయ రూపు గల్గియు హృదయంబు లేని దెద్ది? వేగంబుకతమున నెద్ది వొదలు?"**

అన్న ప్రశ్నలకు

"చేప నిదురిస్తూ కూడా కళ్ళు మూయదు. గ్రుడ్డు జన్మించి కూడా ప్రాణం లేనిదే. రాయి రూపం కలిగి కూడా గుండె లేనిది. ఏఱు వేగం వలన వర్ధిల్లుతుంది" అని సమాధానం ఇస్తాడు ధర్మజుడు.

"బాటసారికి, రోగికి, గృహస్థుడికి, మరణించినవాడికి చుట్టాలు ఎవరు? " అన్న ప్రశ్నలకు

"బాటసారికి సార్థం – అంటే వివిధ పదార్థాలతో వర్తకుల గుంపు ప్రయాణం చేస్తున్నప్పుడు వారివెంట జంతువాహనాలు, ఆయుధపాణులైన భటులు, మార్గదర్శకులు, జ్ఞానవృద్ధులుఉండేవారు. అలాంటివారు కొన్ని సమయాలలో బాటసారికి దారిలో కలిసి సహాయపడవచ్చు. రోగికి చుట్టం వైద్యుడు, గృహస్థుడికి చుట్టం మంచిభార్య, మరణించినవాడికి చుట్టం వాడు చేసిన ధర్మమ"ని సమాధానమిస్తాడు.

**ఎయ్యది ధర్మువునకు గుదురెయ్యది యాశ్రయము గీర్తి కిమ్మగు మార్గం**
**బెయ్యది సురలోకమునకు నెయ్యది సుఖమునకు నిక్కయేర్పడ జెపుమా !**

" ధర్మానికి కుదురు, కీర్తికి ఆధారం, స్వర్గానికి సరియైన మార్గం, సుఖానికి నెలవు ఏది? "అన్న ప్రశ్నలకు "దాక్షిణ్యం అంటే కారుణ్యం, దానం, సత్యం, శీలం" అన్న సమాధానాలు ఇప్పటికీ అక్షర సత్యాలే.

" నరుడికి ఆత్మ ఎవ్వరు? అతడికి దైవికంగా ఏర్పడే చుట్టం ఎవ్వరు? అతడు బ్రతుకు నెట్లా నిర్వహిస్తాడు? ఆతడు ఏ విధంగా మంచితనాన్ని పొందుతాడు?" అన్న ప్రశ్నలకు

నరుడికి ఆత్మ పుత్రుడు, దైవికమైన చుట్టం – భార్య, అతడికి బ్రతుకు ప్రసాదించేది – మేఘుడు, అతడికి గొప్పతనం చేకూర్చేది దానం" అని అంటాడు ధర్మజుడు.

మన సనాతన ధర్మంలో ప్రతివిషయమూ ఆధ్యాత్మికతో ముడిపడి ఉంటుంది. ఆత్మ అంటే సారమని అర్థం. ఆత్మకు అమరత్వమున్నది. అందుచేత నరుడికి ఆత్మ – ఆత్మజుడు. ఇక భార్యాభర్తల అనుబంధమన్నది దైవికంగా ఏర్పడేది. ఎక్కడెక్కడో ఉన్నవారిని ఒక్కటిగా కలిపే బంధం. కోటివిద్యలూ కూటికొరకే కనుక ఆహారాన్ని లభింపజేసేవాడు మేఘుడు. మానవుడికి గొప్పదనం చేకూర్చేది త్యాగంతో కూడిన దానం.

ఇప్పుడు ధర్మం గురించిన ప్రశ్నలని ఇలా అడుగుతాడు యక్షుడు:

"ధర్మాలన్నింటిలోనూ గొప్పదైనదేది? ఏది ఎల్లప్పుడూ పరిపూర్ణంగా ఫలితాన్ని చేకూరుస్తుంది? ఏది వదిలిపెడితే సంతోషం చేకూరుతుంది? ఎవరితోడి పొత్తు ఎప్పుడూ చెడకుండా ఉంటుంది?" – వీటికి ధర్మజుని సమాధానాలు –

**"విను మహింస మేటి యనజను ధర్మంబుబీ యాగకర్మమెపుడు నమర బండి**
**యుండుబీ మనసుక్రొవ్వు ఖండింపగా మోద మెసగుబీ సుజనసంది యెడల దెందు"**

అంటే అహింస అన్నిధర్మాలలోను మేటిధర్మం. యజ్ఞం యెప్పుడూ పంటనిచ్చే కార్యం. అహంభావం పోతే సంతోషం కలుగుతుంది. సజ్జనసహవాసం ఎప్పుడూ భగ్నం కాదు

"లోకంలోని ప్రజలను ఆదుకొని సాయం చేసేవారు ఎవరు? దేనివలన నీరు, అన్నం లభిస్తాయి? విషం అనగా ఏమిటి? పితృతర్పణాలకు అనుకూలమైన కాలం ఏది? అన్న ప్రశ్నలకు ధర్మజుడిచ్చిన సమాధాలు –

**"సజ్జనులు దిక్కు సూవె యీ సర్వమునకుబీ నభము ధరణియు జలము న్నమ్ము నుద్భ**
**వించు నెలవులుబీ విషమగు విప్రధనముబీ లనఘ! శ్రాద్ధకాలము బ్రాహ్మణాగమంబు"**

అంటే ఈ సృష్టి అంతటికీ దిక్కు సజ్జనులు. ఆకాశం నీటికి, భూమి అన్నానికి పుట్టే నెలవులు. బ్రాహ్మణుల సొత్తులు విషం. పితృతర్పణాలను బ్రాహ్మణుల రాక అనువైన కాలం.

"మనుజుండెయ్యది పరిత్యజించి సర్వజనప్రియుండును, నిశ్శోకుండును, నర్థవంతుండును, సుఖియును నగు?" అన్నదానికి " గర్వం విడనాడితే అందరికీ ఇష్టుడు కాగలడు. కోపం విడనాడితే నిశ్శోకుడౌతాడు. లోభం వదలిపెట్టితే సంపన్నుడౌతాడు. తృష్ణ వీడితే సుఖి అవుతాడు" అంటాడు ధర్మజుడు.

" పురుషుడు అని అనదగినవాడు ఎవడు? సర్వధని ఎవడు?" అని యక్షుడు అడగగా,ధర్మజుడు

" భూమ్యాకాశాలను ఆవరించి ఎవడి కీర్తివైభవం మిరుమిట్లు కొలుపుతూ విస్తరిస్తుందో అట్టి మహానుభావుడే పురుషుడు. ప్రియం అప్రియం, సుఖం దుఃఖం, జరిగిన కార్యాలు జరుగబోయే కార్యాలు ఎవనికి సమానములో అట్టి మహానుభావుడు సర్వధని అని సమాధానమిస్తాడు. అంటే ద్వంద్వాతీతుడ్ సర్వధని అంటే సర్వ సంపదలు కలవాడన్నమాట.

నిత్యసంతోషి ఎవరన్న ప్రశ్నకి ధర్మజుడిచ్చిన రమణీయమైన సమాధానం – " ఐదు దినాలకో ఆరు దినాలకో తన గృహంలో కూర ఇంత ఉడికించుకుని కాలక్షేపం చేస్తూ, ఒకరికి ఋణపడకుండా ఒక చోటికి పోకుండా ఎవడుంటాడో వాడే నిత్యసంతోషి."

ధర్మజుని సమాధానలకు తృప్తుడైన యక్షుడు "నీ తమ్ములలో ఒకటి ప్రాణాలను ఇస్తాను.కోరుకో" అనగానే నకులుని వర్ణిస్తూ, అతడిని బ్రతికించమంటాడు ధర్మజుడు. యక్షుడు లోకోత్తరవీరులైన భీమార్జునులలో ఒకరిని కోరక, నకులుడిని బ్రతికించమని కోరడానికి కారణమడగగా, ధర్మజుడు "నా తండ్రికి ఇద్దరు భార్యలు. కుంతీసుతులలో పెద్దవాడైన నేను బ్రతికి ఉన్నాను కదా. ఇక మాద్రీతనయులలో ఒక్కడు బతకాలి కాదా. అదే కదా ధర్మం. ధర్మహాని చేయలేను" అని అంటాడు.

ధర్మనందనుడి ధర్మజ్ఞతకు మెచ్చి, యక్షుడు " నీ తమ్ములందరూ బ్రతుకుతారుగాక" అన్న వెంటనే భీమార్జున నకుల సహదేవూ ఆకలిదప్పులు లేనివరై, నిద్రనుండి మేల్కొన్నట్లు లేచారు. వారిని చూసి,ఆశ్చర్యచకితుడైన ధర్మజుడు యక్షుడితో " నీవు సామాన్యుడవైన యక్షుడివి కావు. నీవు దేవేంద్రుడవో, కుబేరుడవో, అనలుడవో, సమీరుడవో అయి ఉండాలి. కాకపోతే జగన్నుతుడైన నా జనకుడైన ధర్మదేవతవే అయి ఉండాలి. దయచేసి నీవు ఎవరవో తెలుపు" అని ప్రార్థించగా, ఆ మహాత్ముడు మందహాసంతో, " నేను యమధర్మరాజును. నా పుత్రుడు, పరమధర్మమూర్తివైన నిన్ను చూచే వేడుకతో ఇప్పుడు వచ్చాను.సత్యం, శౌచం, దానం, తపస్సు, శమం, కీర్తి, వివేకం నా మూర్తులు. నన్ను ఆధారంగా చేసుకున్న మనుజులు దుర్గతిని పొందరు. నీవు నన్న ఆశ్రయించావు. నీవు కోరే వరాలను ఇస్తాను, కోరుకో" అనగానే ధర్మరాజు అతడికి వినమ్రంగా నమస్కరించి, అతడిని కీర్తించి "దేవా! నా ఆశ్రమంలో వసిస్తున్న బ్రాహ్మణోత్తముడి అరణిని ఒక లేడి హరించింది. అతడి నిత్యానుష్టానానికి భంగం లేకుండా దయచేసి ఆ అరణిని ప్రసాదించమని కోరగా, యముడు తృప్తుడై " అనఘా! నీ మానసికప్రవృత్తిని తెలుసుకోడానికి నేనే ఆ అరణిని లేడి రూపం ధరించి అపహరించాను" అని ఆ అరణిని ధర్మరాజుకి ఇచ్చి, " మీ అరణ్యవాసం ముగిసింది. అజ్ఞాతవాసంలో మీరు కోరుకున్న రూపాలు మీ అందరికీ అలవడగలవు. మిమ్మల్ని ఇతరులు ఎవ్వరూ గుర్తించకుండేట్లు మీకు వరం ప్రసాదించాను. మరొక వరం కోరుకో" అన్నాడు. అప్పుడు ధర్మరాజు " దేవా! నీవు కరుణించి నాకు ప్రత్యక్షమై నన్ను మన్నించడం వలన నా జన్మ ధన్యమైంది. నా చిత్తం సదా ధర్మమందే లగ్నమై ఉండేట్లు వరం ప్రసాదించు. నా మనస్సు ఇక కోపతాపాలకు, మద మాత్సర్యాదులకు, అజ్ఞానానికి లోనుగాకుండా చేయి" అని కోరుకుంటాడు.యముడు ఆ వరాన్ని అనుగ్రహించి, అదృశ్యుడవుతాడు. పాండవులు ఆశ్రమానికి తిరిగివచ్చి, అరణిని బ్రాహ్మణుడికి ఇచ్చి, అతడి ఆశీస్సులను పొందుతారు.

ఈ యక్షప్రశ్నల ఘట్టంలో నేటికీ వర్తించే విషయాలు యెన్నో ఉన్నాయి. అవి కేవలం న్యాయ, ధర్మాల పరంగా, వైజ్ఞానిక పరంగానే కాక ఆధ్యాత్మికతని తెలిపడమే కాకుండా ఆలోచింపజేసేవిగా, స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.

మానవుడు ఎలా జీవించాలి? అతడి విద్యుక్త ధర్మమేమిటి? ఎవరు అతడి చుట్టాలు, సుఖానికి మార్గం, బ్రాహ్మణుడు ఎవరు? జీవితంలో స్థిరమైనదేమిటి? అన్న అరిషడ్వర్గాలను వీడడం వలన కలిగే ప్రయోజనాలు, కర్మసిద్ధాంతం – ఒకటేమిటి అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలిపే మహత్తరమైన ఘట్టం.

అందుకే బాల్యంనుండే పిల్లలకు పెద్దలు మన ఇతిహాసాలను, పురాణాలను, శతకాలను, పద్యాలను నేర్పి, వారికి జీవితమంతే యేమిటన్న అవగాహన, మంచి చెడుల పరిచయం, మంచి వర్తనను బోధించేవారు. వారికి ఎటువంటి సమస్యలనైనా నేర్పుగా, ఓపికగా ఎదుర్కొనేట్లు చేసే మానసిక పరిణతిని కలిపించేవారు. కాలగతిలో ఈ బాధ్యతను నేడు మోటివేషనల్ స్పీకర్స్ తీసుకుని, విద్యార్థులకు, ఉద్యోగులకు ముఖ్యంగా మహాభారతంలోని భగవద్గీతను ఆధారం చేసుకుని పాఠాలు నేర్పుతున్నారు.

**ఆధారగ్రంథాలు**

1.కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 61. కవిత్రయ మహాభారతం - సామ, దాన, భేద, దండ చాతుర్యము

- ముక్కామల సాయి అనిరుధ్, నంగనల్లూర్, చెన్నై

## 1. ఉపోద్ఘాతము

"నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమం
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్"

సర్వధర్మ సమ్మేళితము, వేదోపనిషత్సారము, మహోజ్వలము, మహేతిహాసము, పంచమవేదముగా ప్రఖ్యాతమైన శ్రీకృష్ణద్వైపాయనవిరచిత 'జయసంహిత' మహాకావ్యము జ్ఞానపెన్నిధి, విజ్ఞానభాండాగారము. ఈ మహాభారత కావ్యమునకు ప్రస్తావన సర్వకాలములందునూ అనువర్తింపదగును.

ఈ మహోత్కృష్ట కావ్యమును దీక్షాదక్షతలతో ఆంధ్రీకరణ ప్రారంభించి, రసాలంకారాలతో తెలుగుభాషా సౌందర్యమునే ఇనుమడింపజేసి, పద్యగద్యవచనములతో అచిరకాలమూ భాసిల్లేటట్లు చేసిన ఆదికవి నన్నయ్యకు, ఆ మహాకార్యమును కొనసాగించి సంపూర్ణము చేసిన తిక్కన సోమయాజి, ఎఱ్ఱాప్రగడామాత్యులకు వందనమొనర్చుట ప్రతీ తెలుగువాడి కనీస కర్తవ్యము.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్"

అన్నట్లు జయకావ్యమునందు ఉటంకింపబడనిది ధరిత్రీతలమునందు కానశక్యము కాదు అని అనుటలో అతిశయోక్తిలేదు. అట్టి ఆ మహాభారతములోని ఉద్యోగపర్వముయొక్క తృతీయాశ్వాశమునందు కార్యసాధనకు అతి ముఖ్యమైన సామ, దాన, భేద, దండనీతుల విస్తార వివరణ మనకు గోచరిస్తుంది. ఇందు భాగమైన శ్రీకృష్ణరాయబార మహాద్భుతఘట్టమునందు ఈ చతుర్గుణాల ప్రయోగమునకు పరిపూర్ణమైన ఉదాహరణమైతే, ఆ సన్నివేశమునకు ముందర జరిగే ద్రౌపదీ-శ్రీకృష్ణుల సంవాదము వాక్చాతుర్యమునకూ, మాటనేర్పరితనమునకూ పరాకాష్ఠ. దౌత్యప్రధానమైన ఈ ఆశ్వాశఘట్టములలోని సామ, దాన, భేద, దండ చాతుర్యాన్ని తిక్కన తన పద్యాలలో అతిమధురంగా చిత్రించి, నాటకీయతను జోడించి, ప్రతీ సన్నివేశాన్నీ మనకు నయనానందకరముగా కూడా ఉండే భావాన్ని కలిగించాడు.

## 2. సామము

మాయాజూదముయొక్క పందెమును అంగీరించి, ధర్మమునకు కట్టుబడి, అరణ్యాజ్ఞాతవాసములను సంపూర్ణముజేసిన పిదప, పాండవాగ్రజుడైన యుధిష్టిరుడు శాంతికాముకుడై, యుద్ధకాంక్షవలన అనర్థములు తప్పవని ఎరిగి, తమ అర్ధరాజ్యమును తిరిగి తమకిప్పించమని ధృతరాష్ట్రుని కోరుతూ ధౌమ్యుని కురుసభకు పంపగా, దుర్యోధనునిమీదగల గుడ్డిప్రేమతో, రాజ్యభాగమును తిరిగివ్వ మనసొప్పక, సంజయుని రాజ్యవిభజన ప్రస్తావన మళ్ళీ రాకుండా ఉండేవిధంగా సంధిచేసుకొని రమ్మని ఉపప్లావ్యమునకు పంపెను. సంజయునిద్వారా పెదతండ్రి ఉద్దేశ్యమును గ్రహించిన పాండవులు ధర్మానువర్తులై, అందరి శ్రేయమునూ కోరినవారై, "పగ కూడనిదని", సౌమ్యమైన సామమార్గమునవలంబించి, హృషీకేశుని రాయబారమునకు చివరి ప్రయత్నముగా పంపారు. తిక్కనయొక్క చిక్కనైన చక్కటి ఈ మాటలలో ధర్మజుని ధర్మచింతన, దీర్ఘదృష్టి తేటతెల్లమవుతాయి.

**కావున శాంతి బొందుటయ కర్జము; దా నది యట్టులుండె; శ్రీ**
**గావలె నంచు, బోరితము గామియు గోరెద; మెల్లసొమ్ములుం**
**బోవుటయుం గులక్షయము పుట్టుటున్ వెలిగాగ నొందుమై**
**నే విధినైన జక్కబడు టెంతయు నొప్పుజుమీ జనార్దనా!**

జనార్దనుడైన శ్రీకృష్ణుని సంబోధిస్తూ ధర్మనందనుడు ఇట్లనగా సర్వాంతర్యామి అయిన వాసుదేవుడు, "నా ప్రయత్నము నేను చేస్తాను, ఆ పైన దైవ నిర్ణయం" అంటూ సుయోధనుడు సంధికి ఒప్పుకొనడని తెలిసియుండికూడా సామమార్గాన కార్యం సాధించడానికే ఉద్యుక్తుడైయ్యాడు. జగద్గురువు ఈ విధంగా అగ్రతాంబూలం సామానికే ఇచ్చి, మనకి సౌమ్యంగా సమస్యలను పరిష్కరించుకొనమని బోధిస్తున్నాడు.

### 3. దానము

కార్యసాధనలో రెండవ మెట్టు దానము. సామమార్గం విఫలమైతే అవలంబించవలసినది దానము. ధర్మనందనుడు ధౌమ్యుని రాయబారంలోనే తన దానోపాయ ప్రయోగ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. యుద్ధనివారణకోసం న్యాయపరంగా పాండవుల ఆస్తి అయిన అర్ధరాజ్యాన్ని వదులుకొని, కేవలం ఇంద్రప్రస్థం, కుశస్థలం, వృకస్థలం, వాసంతి, వారణావతం అనే ఐదు ఊళ్ళు మాత్రమే స్వీకరించేందుకు సిద్ధపడ్డాడు. చివరకు ఐదు ఆవులను ఒసంగితే చాలని, పరస్పర శాంతి, శ్రేయమే తన అభిమతమని తెలియపరచాడు. అయిననూ అతని ఔదార్యమంతా బూడిదలో పోసిన పన్నీటి వలె వ్యర్థమైపోయింది. కనుక ఆతడే భేద విధానంతో సంధి కుదుర్చుకొనుటకు ద్వారకాధీశుని హస్తినాపురికి రాయబారిగా పంపించాడు.

### 4. భేదము

కార్యసాధనకు సమయస్ఫూర్తిని, తర్కశీలతను, వాక్చాతుర్యమును ప్రదర్శించి వ్యూహరచన చేయుట భేదోపాయము. దౌత్యప్రాధాన్యతతో ఉభయవర్గాల కుశలమునకు సలిపే సంధి ఉత్తమమైన, ఉచితమైన భేదము. స్వార్థప్రయోజనములను ఉద్దేశించి, కుటిలత్వముతో పన్నాగములు పన్నుట నైచ్యం.

ఉద్యోగపర్వంలోని తృతీయాశ్వాశమంతయూ భేదనీతి ఉటంకింపబడిననూ, ముఖ్యముగా రెండు సన్నివేశములలో దానిని రసాత్మకముగా తిక్కన సోమయాజి, తనదైన నాటకీయశైలిలో మన కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించాడు – 1. ద్రౌపదీ–శ్రీకృష్ణుల సంవాదము 2. శ్రీకృష్ణరాయబారము.

ద్రౌపది శ్రీకృష్ణునితో తన మనస్తాపానికి గల కారణాలను తెలియజేస్తూనే సంధికి ఆమె అయిష్టతను ప్రకటించింది. సున్నితమైన వ్యంగ్యముతో సంధి గురించి ప్రయత్నిస్తున్న ధర్మరాజునూ, బలపరాక్రమసంపన్నులైయుండి కూడా అన్నగారి నిర్ణయానికి వత్తాసు పలికిన భీమార్జునులను అధిక్షేపిస్తోంది. గూఢార్థాలు గల మాటలలో తన మనోవేదనను, దుర్యోధనదుశ్శాసనులమీద తన పగనూ, ప్రతీకారేచ్ఛనూ కలబోసి శ్రీకృషునివద్ద తన ఆవేదనను వెళ్ళగ్రక్కుకుంటోంది. ఆమె మానసిక వేదనను తిక్కన మాటలలో మచ్చుకు:

**నీవు సుభద్రకంటె గదు నెయ్యము గారవముం దలిర్ప సం**
**భావన సేయు; దిట్టి నను బంకజనాభ! యొకండు రాజసూ**
**యావభృథంబు నందు శుచియై పెనుపొందిన వేణి వట్టి యీ**
**యేవురు జూడగా సభకు నీడ్చె గులాంగన ని ట్లొనర్తురే?**

"రాజనీతి పేరుతో గృహనీతిని ధ్వంసం చేయుట అవినీతి" అని కొట్టిపారేసింది. ఆమె అంతరంగంలోని కోపాగ్నిని "రాక్షస ఓర్పుతో (రక్కెస తాల్మి)" ఓరుస్తోందని వాపోయింది. ఏక సమయంలో విషాదాన్ని, పరితాపాన్నీ, వేదననీ, సంధి ప్రయత్నాలపై అయిష్టతనీ, క్రోధాన్నీ, ప్రతీకారవాంఛనీ మాధవునకు తెలియజేసిన పాంచాలి వ్యంగ్య వాగ్విన్యాసము, వాక్చాతుర్యము, వాఙ్నైపుణ్యము శ్లాఘనీయము.

పరమాత్ముడు హస్తినలో ప్రవేశించిన తరుణంనుండే భేదనీతిని అలవర్చాడు. డాంబికంగా మధుసూదనుని మరిపించి, దర్పంతోకూడిన ఆతిథ్యంతో అతడిని వారి పక్షమునకు త్రిప్పుకోవాలని యత్నించిన దుష్టచతుష్టయంయొక్క కుటిల పన్నాగాన్ని

పారనివ్వకుండా, నిజభక్తుడైన విదురుని ఇంట బసచేసి, భక్తవత్సలుడు ఆతని భక్తికి అనుగ్రహించాడు. కురుసభలో అంధరాజుయొక్క బుద్ధికి కళ్ళు తెరుచుకొనేటట్లు, రారాజుకు మొండితనాన్ని, భ్రమనూ వీడి సత్యమును గ్రహించమని హితవచనములు పలికాడు. తర్కాన్ని, న్యాయాన్నీ నొక్కి వక్కాణిస్తూ, ధృతరాష్ట్రునిచెంతనే సంధి–సమరం తేల్చే అధికారముందని ఉటంకించాడు. సర్వసామ్రాజ్యాధికారం ఇంకా ధృతరాష్ట్రునిదేనని, దుర్యోధనుడు అతని ఇష్టరీతిలో ప్రభుత్వయంత్రాగాన్ని వాడుకొనలేదని కుండబద్దలుకొట్టి తెలియచెప్పాడు. ఉభయపక్షములకూ రక్తపాతంకంటే సంధే అన్నివిధాలా లాభతరమైనదని నచ్చచెప్పాడు. శౌరి ఇంకా ధర్మజుని ఋజువర్తనము, సత్యసంధతనూ కొనియాడి, అవి ఉర్వీరమణుని ప్రతిష్ఠనే పెంచుతున్నాయని, సుయోధనుని మానధనము కురువంశప్రతిష్ఠకే కళంకమని చెరిగేసాడు.

నందనందనుని హితవుమాటలు లేశమాత్రము గ్రహింపక సుయోధనుడు సమరముపై మంకుపట్టు వీడలేదు. పైపెచ్చు జగన్నాటకసూత్రధారిని బంధించాలనే దుస్సాహసానికి ఒడిగట్టగా, పరమాత్మ తానే పరబ్రహ్మమని, ధర్మస్వరూపమని తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ తప్పవని, యుద్ధం, దాని కారణంగా వినాశనం తథ్యమని, ధర్మానిదే విజయమని తేల్చిచెప్పాడు.

**5. దండము**

"యతో ధర్మస్తతో జయ:" అన్న సూక్తిని అనుసరిస్తూ, భగవానుడు స్వయంగా పాండవపక్షమునుండి, విజయసారథియై, అధర్మప్రతిరూపమైన కురుసేనలను పరాజితుల్నిగావించి, ధర్మసంస్థానమొనర్చాడు. "దండం దశగుణం భవేత్" అన్నందుకు సామ, దాన, భేదములన్నీ విఫలమైతే దండనీతిని చేపట్టి స్వధర్మానుసారమైన కార్యము సాధింపవలెనని మహాభారత ఇతిహాసము మనకు తెలియజేస్తుంది. కాలధర్మాన్ననుసరించి చాతుర్యముతో దండనీతిని అవలంబించుట ఉత్తమము, దేశమునకు, దేశప్రజలకూ శ్రేయస్కరము. వర్తమాన సమాజమునందు కూడా "ధర్మో రక్షతి రక్షిత:" అన్న భావనను మనమందరం విజ్ఞులమై గ్రహించి, మన స్వధర్మాలను ఆచరించుటకు, యుక్తితో కార్యసాధన చేయుటకు సామ, దాన, భేద, దండనీతులను ధర్మానువర్తనముతో అవలంబించాలి. విదేశములతో సత్సంబంధములు నిలుపుకొంటూ స్వదేశమును అభివృద్ధి చేసేందుకు ఈ చతుర్గుణములు ఆచరణయోగ్యములు అని, భావితరాలకు కూడా ఈ నీతి సర్వవిషములయందును అనువర్తింపదగును అని మనమందరం గ్రహించవలెను.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. ఆంధ్రమహాభారత పీఠికలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 62. మహాభారతంలో సంజయ రాయబారం-వర్తమాన సమాజం

- అన్నపూర్ణ బత్తుల, చెన్నై

**ఉపోద్ఘాతం**

యావత్ ప్రపంచ సాహిత్యంలో భారతీయ సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. అందులో తెలుగు సాహిత్యం మరింత ప్రత్యేకమైనదిగా చెప్పవచ్చు. అడుగడుగునా వైవిధ్యంతో కూడిన తెలుగు సాహిత్యం ఇతర భాషల సామర్థ్యాల కంటే ఎంతో భిన్నంగా కన్పిస్తుంది. ఆదికవి నన్నయ్యతో మొదలుకొని నేటి కవుల వరకూ అందరూ వివిధ ప్రక్రియలో వివిధ రచనలు చేశారు. మార్గాలు వేరైనా ప్రతి ఒక్కరూ సమాజానికి ఏదో ఒక రకంగా మంచి చేయడానికి రచనలు చేస్తున్నారు. ప్రతి మనిషికి నైతిక జీవితం అనేది చాలా అవసరం. కానీ మనం ప్రస్తుతం జీవిస్తున్న సమాజంలో నైతిక ప్రవర్తన అనేది కొరవడుతుంది. ప్రతి వ్యక్తి కూడా వ్యక్తిగతంగా నీతిగా నిజాయితిగా ఉండాలి అనుకుంటాడు. కాని అది ఇప్పటి సమాజంలో సాధ్యపడటం లేదు. ప్రతి ఒక్కరు కూడా నీతితో ఉంటున్నాము అనే ముసుగును ధరిస్తున్నారు. అది ఎప్పటికైనా మంచిది కాదు. విలువలతో కూడిన నీతివంతమైన జీవితానికి ప్రాధాన్యతనివ్వాలి. ప్రతి మనిషి మంచి అలవాట్లు అలవాటు చేసుకోవడం వలన మన తర్వాత తరాల వారు కూడా అనుసరిస్తారు అనేది మనం గ్రహించాలి. ఈ విషయాన్ని తిక్కన మహాభారతంలో చిత్రించారు. మహాభారతం ఒక విజ్ఞాన సర్వస్వం. ప్రతి పాత్ర దేనికదే ఒక ప్రత్యేకం. అలాంటి పాత్రలకు జీవం పోసినట్లుగా చిత్రించారు తిక్కన. పాత్రల బాహ్య అంతరంగిక చిత్రణలో తిక్కన తనకు తానేసాటి అని చెప్పాలి.

**తిక్కన మహాభారతం :- ఉద్యోగపర్వంలోని సంజయ రాయబారము**

**అసలు సంజయుడు ఎవరూ ?**

సంజయుడు ధృతరాష్ట్రుని కొలువులో మంత్రి, సూతుడు కూడా, ఇతను గవల్ఘనుడు అనే సూతుని కుమారుడు. సంజయుడి తండ్రి కూడా ధృతరాష్ట్రుని కొలువులో పని చేసినాడు. సంజయునికి వ్యాస మహర్షి ఒక గొప్ప వరాన్ని ప్రసాదించాడు. అదేంటంటే ' దివ్యదృష్టి' ఈ దివ్యదృష్టి మూలంగానే సంజయుడు కురుక్షేత్ర యుద్ధంలో జరిగే ప్రతి విషయాన్ని పూస గుచ్చినట్లు ధృతరాష్ట్ర మహారాజుకు విన్నవించేవాడు. అంతేకాదు, అక్కడ జరిగిన భగవద్గీతను కూడా ధృతరాష్ట్రునికి వివరంగా చెప్పాడు. అంతటి గొప్పవాడు సంజయుడు, చాలా పుణ్యాత్ముడు. ఎందుకంటే ఒక దివ్యదృష్టి అనే గొప్ప వరాన్ని పొందగలిగాడు. ఒక గొప్ప వరాన్ని పొందాలంటే ఎన్నో మంచి లక్షణాలు ఉండాలి. ఈ వరాన్ని ధృతరాష్ట్రునికి ఇవ్వలేదు కదా వ్యాసమహర్షి, సంజయునికే ఇచ్చాడు. అంటే మన స్థాయి ఏది అనేది కాదు ఇక్కడ, రాజా,మంత్రా అనేది కాదు సంజయునికి ఉన్న సద్బుద్ధి మంచి లక్షణాలు అతను ప్రవర్తించే తీరు ఎదుటి వారితో అతను ఎలా నడుచుకున్నాడు అనేది ముఖ్యం.ఇవన్నీ లక్షణాలు సంజయునిలో ఉన్నాయి. కాబట్టి వ్యాస మహర్షి సంజయునికి దివ్యదృష్టి అనే వరాన్ని ప్రసాదించాడు.

అందుకే సంజయుడు ధన్యుడు, అంతే కాకుండా సంజయుడు, పాండవులకి నివృత్తినిష్టిని, కర్మ త్యాగ విశిష్టతని, గృహస్థాశ్రమ ధర్మ ఔన్నత్యాన్ని శ్రీకృష్ణుని సమక్షంలోనే చాలా సరళంగా వివరించాడు పాండవులకి. పాండవులే అసలు గొప్పవాళ్లు. ఎన్నో ధర్మాలు తెలిసినవాడు ధర్మరాజు. అలాంటి వాళ్లకి శ్రీకృష్ణుడి వంటి మహానుభావుడి సమక్షంలో తెలియ చేశాడు అంటేనే సంజయుడు ఎంత గొప్ప మహానుభావుడనేది అర్థం అవుతుంది. కావున నేటికి కూడా మంచితనానికి సద్గుణాలకి ఉన్న విలువ ఎప్పటికైనా మనం అర్థం చేసుకోవాలి. దివ్యదృష్టి అనేది ఒక గొప్ప వరమని అనుకున్నాం. కాని ఈ రోజుల్లో కూడా మనం ఎక్కడున్నా, ఎక్కడో జరిగిన సంఘటనలు, ఎవరో పాడిన పాటలు మనం టీవిల్లో చూస్తున్నాం. దీనికంటే ముందు ఎక్కడో జరిగిన విషయాలను రేడియోలో వినేవారం. ఇప్పుడు టీవిల్లో చూస్తున్నాం. అంటే ఎక్కడో ఉన్న విషయాన్ని ఒక పరికరం ద్వారా మనం చూడగలుగుతున్నాం.

ఉదాహరణకి ఫోన్, ఇంతకు ముందు ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్లం, కానీ ఇప్పుడు ఫోన్ ద్వారా ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నాం, చూడగలుగుతున్నాం. ప్రపంచమే మన చేతుల్లో ఉన్నట్లయింది ఫోన్ ద్వారా. అదే విధంగా ఆ రోజుల్లో కూడా ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. కానీ మనం ఇప్పటివి నమ్ముతున్నాం కానీ అప్పటి వాటిని మాత్రం ఆశ్చర్యంగా చూస్తున్నాం అవసరం లేదు కదా, ఈ రోజు యంత్రం అనేది మనకు అనుసంధానం అయితే, అప్పుడు వాళ్ల మనసు, వాళ్ల ప్రవర్తన, అవే వాళ్లకి అంత శక్తిని ప్రసాదించేవి. కాబట్టి ఏ కాలంలో అయినా ఈ సృష్టిలో సాధించలేనిది, కనిపెట్టలేనిది అంటూ ఏది లేదు. ఎన్నో ఉన్నాయి. అనేది మనం తెలుసుకోవాలి అంతే ఎన్నో శక్తులు ఉన్నాయి. అవన్నీ మనకు సహకరిస్తాయి. మనకు ఇలాంటి పురాణాలు ఇలాంటి కథలు ఇవన్నీ చదువుతున్నపుడే మనకు తెలుస్తాయి. కాబట్టి పురాణాలు, ఇతిహాసాలు తెలుసుకోవడం వల్లనే మనకు ఎన్నో మంచి విషయాలు అర్థం అవుతాయి. నేడు విమానాలు, రాకెట్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అనేకం ఉన్నాయి. వాటికి ఆధారం ఏంటి అని మనం ఆలోచించాలి, అది కనిపెట్టిన వాళ్లు చెప్పాలి.కావున మనం ఏదైతే గొప్ప శక్తి అనుకుంటున్నామో అద్వితీయమైన శక్తి అంటున్నామో అవి ఈ రోజుల్లో ఇప్పటి మనుషుల్లో కూడా ఉన్నాయి. అందుకే కదా మనలాంటి మామూలు మనుషులే కదా ఇవన్నీ కనిపెట్టింది. అందుకే ఎప్పుడు కూడా శక్తి అనేది ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదు. అది అందరూ పొందవచ్చు, కాకపోతే దానికి ఏమి అవసరమో, అది తెలుసుకోగలగాలి. అలా మనం ఉండగలగాలి, ఆ శక్తిని పొందగలగాలి, ఆ శక్తి వచ్చినప్పుడు అలాంటి ఆలోచనలు చేయగలుగుతాం. ఇంకా ఎన్నో ఈ సృష్టిలోకి తీసుకురాగలుగుతాం. అలాగే నలుగురికి అందచేయగలుగుతాం. ఇక్కడ సంజయుడు కూడా అదే చేశాడు. తన సత్ప్రవర్తనతో ఒక వరాన్ని పొందాడు. ఆ శక్తి ద్వారానే కళ్లులేని ధృతరాష్ట్రుడికి అన్ని చెప్పగలిగాడు. కాబట్టి ఏ కాలంలో అయినా సరే, ఏ యుగంలో అయినా సరే, ఏ జనరేషన్‌లో అయినా సరే, స్థాయి కాదు ప్రవర్తన గొప్పది అని మనం తెలుసుకోవాలి.

పంచమవేదమైన మహాభారతం ఉద్యోగ పర్వంలో సంజయ రాయబారము అతి ముఖ్యమైన ఘట్టం.

సంజయుడిని ధృతరాష్ట్రుడు ఏకాంతముగా పిలిపించి సంజయా నీవు ఉపప్లావ్యం వెళ్లి పాండవులను కలిసి నేను పంపినట్లుగా వారికి తెలియ చేయుము. ఆ తరువాత వారి యోగక్షేమాలు విచారించు. పాండవులు స్వతహాగా పాలవలె స్వచ్ఛమైన వారు. మాయామర్మాలు, కపటాలు తెలియని వారు. పెద్దలంటే వారికి అమితమైన గౌరవం, పాండవులు రాజ్యాలనెదిరించి తెచ్చిన సంపదనంతా నా అధీనములోనే భద్రపరిచేవారు. కేవలం దుర్యోధనాదుల దుష్టబుద్ధి వల్లనే వాళ్లలో యుద్ధం చేయాలనే కోరికలు మనకు కన్పిస్తున్నాయి. సంజయా, దుర్యోధనుడు దుష్టబుద్ధితో పాండవుల రాజ్యభాగం అపహరించాలని చూస్తున్నాడు. ఇప్పుడు యుద్ధం దాకా తెచ్చుకుంటున్నాడు. శ్రీకృష్ణుడు అర్జుని పక్కనుండగా యుద్ధ రంగంలో ఎవరు వారికి ఎదురరెళ్లగలరు. పగతో రగులుతున్న భీమున్ని ఎవరు ఆపగలరు. నా కుమారులను అమానుషంగా ఆ భీమసేనుడు హతమారుస్తాడు. నకుల సహదేవులు కూడా పరాక్రమవంతులే. సంఖ్యాపరంగా కౌరవసేన ఎక్కువే అయినా, పాండవసేనకు వారు సాటిరారు. కాబట్టి సంజయా నీవు వెళ్లి ధర్మరాజుకు యుద్ధం వలన కలిగే చెడును వివరించి వారి బుద్ధి యుద్ధం వైపు మళ్లకుండా చూడు. నాకు పుత్రశోకం కలుగకుండా కాపాడు అని ధృతరాష్ట్రుడు సంజయుడికి విన్నవించుకున్నాడు. అంతేకానీ, యుద్ధం ఆగకుండా పాండవులకు అర్థరాజ్యం ఇస్తానని చెప్పమని సంజయునితో ధృతరాష్ట్రుడు చెప్పలేదు.

ఈ రాయబారం వలన పాండవులు యుద్ధ ప్రతిపాదన ఉపసంహరించుకునే అవకాశం సంజయునకు కనబడలేదు. పాండవులను అరణ్యవాస సమయంలో భిక్షాటన చేసుకొని బ్రతికినట్లే మళ్లీ అలాగే బ్రతకమని ధృతరాష్ట్రుడు సూచించునట్లుగా సంజయుడికి అర్థం అయింది. అయినా రాజు మాట జవదాటని సంజయుడు ఉపప్లావ్యానికి బయలు దేరాడు.

సంజయ రాయబార వర్తమానం తెలుసుకుని పాండవులు, శ్రీకృష్ణుడు ఎంతో సంతోషించి అతనిని సాదరంగా ఆహ్వానించారు. ఏదో ఉభయుల క్షేమము కోరే విషయము సంజయుడు తీసుకువచ్చాడని అక్కడి పాండవసేన మరియు

శ్రీకృష్ణుడు భావించారు. సంజయుడు పాండవులతో సంభాషించే ముందు ధర్మరాజు సంజయుడిని ఆత్మీయంగా కౌగిలించుకుని పలకరించి తమ పెద్దల యోగ క్షేమముల గురించి పేరు, పేరున అడిగి తెలుసుకున్నాడు. మా పట్ల భీష్మ, ద్రోణ ఇతర పెద్దలందరు ఏ విధమైన అభిప్రాయంతో ఉన్నారో చాలా కుతూహలంతో అడిగి తెలుసుకున్నారు. ధర్మరాజు ఈ పదమూడు సంవత్సరాలు తాము పడిన బాధలు వాటిని వారు అధిగమించిన విధానం ఆప్తునితో నెమరువేసుకున్నట్లు, నెమరువేసుకున్నాడు సంజయునితో, సంజయుడు కూడా ఎంతో ఓపికతో, శ్రద్ధతో, ధర్మరాజు చెప్పినదంతా వినయంగా ఆలకించాడు. ధృతరాష్ట్రుడిని, ఆయన కుమారుల విషయాలు కూడా అడిగి తెలుసుకున్నాడు ధర్మరాజు. ఈ విధంగా ఉభయకుశలోపరి అయిన తరువాత సంజయుడు తాను మోసుకు వచ్చిన రాయబారాన్ని ప్రారంభించాడు.

ధర్మరాజా, మీరు ఏనాడు దుర్యోధనాధులకు చిన్న అపకారము కూడా చేసిన సందర్భం లేదు. కానీ వారే అడుగడుగునా మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేసేవారు. ధృతరాష్ట్రుడు ఆ విషయంలో ఎప్పుడు చింతిస్తూ ఉండేవాడు. మీలాంటి ధర్మాత్ములకు అలాంటి కష్టాలు రాకూడదని ఎప్పుడూ అందరితో చెప్తూనే ఉండేవాడు.

ధర్మజా ఇప్పుడు నీ మంచితనంతో ఇరువురికి (ఉభయులకి) ఏ నష్టం కలుగకుండా అందరూ సంతోషంగా జీవించే ఉపాయం నీవే ఆలోచించాలి. ఎవరికి ప్రాణనష్టం కలుగకుండాలనే ధృతరాష్ట్రుని ఆలోచన, ఆయన ఖచ్చితంగా శాంతినే కోరుకుంటున్నాడు. మీరు ధర్మాత్ములు, యుద్ధమే జరిగితే ఆ తరువాత మిగిలేది శూన్యమే. కురుపాండవ సంగ్రామం ఊహించడానికే మనసు రావడం లేదు. మీ ప్రక్కన ఉన్న యోధులు మీకు విజయం తప్పక తెచ్చిపెడతారు. అలాగే అటు ప్రక్కన భీష్మ, ద్రోణ, కృప, శల్య, అశ్వత్థామ, కర్ణులు కూడా తక్కువ వారేమి కాదు. అయినా జయాపజయాలు దైవాధీనాలు. అర్థకామాల గురించి మీలాంటి సత్పురుషులు యుద్ధం కోసం ముందుకెళ్తారని ఎవరూ అనుకోరు. పెద్దలు ద్రుపదుడు, శ్రీకృష్ణుడు ఇక్కడే ఉన్నారు. వీరి సమక్షంలో మిమ్ములని ధృతరాష్ట్రుని మాటగా నమస్కరిస్తూ వేడుకుంటున్నాను. భీష్ముడు కూడా సంధినే కోరుకుంటున్నాడు. అదియే మంచిదని అక్కడి పెద్దలందరూ భావిస్తున్నారు. అని చెప్పి మౌనంగా కూర్చున్నాడు సంజయుడు. దానికి ధర్మనందనుడు బదులు చెప్తూ సంజయా అయితే ధృతరాష్ట్రుని కుమారులు చాలా అదృష్టవంతులవుతారు, బ్రతికిపోతారు. మేము కూడా గొప్ప దు:ఖాల బారి నుండి తప్పుకుంటూ నేను కూడా సంధి కావాలనే కోరుతున్నాను. యుద్ధం అవసరం లేకుండా కార్యసిద్ధి జరిగితే ఇరువురికి మంచిదే. మనం సంకల్పించినంత మాత్రాన జరిగేది జరుగక మానదు. కాబట్టి పాండవులని యుద్ధరంగంలో నిలబెట్టాలో, లేక ఆయన ప్రక్కన కూర్చోబెట్టు కోవాలో ధృతరాష్ట్రుడే నిర్ణయించుకోవాలి.

సంజయా, ధృతరాష్ట్రుడు నిజంగా పుణ్యాత్ముడు, ధర్మాత్ముడు అయితే మమ్మల్ని రాజభోగాలకు ఎందుకు దూరం చేస్తాడు. పుత్రుని మీద ఉన్న మమకారంతో రాయబారానికి పంపాడు మిమ్మల్ని. మీ మీద మాకు ఎటువంటి కోపము లేదు సంజయా, నీవు నీ బాధ్యతలను నెరవేరుస్తున్నావు. అందుకు మాకు మిక్కిలి సంతోషంగా ఉన్నది అన్నాడు ధర్మనందనుడు.

అప్పుడు సంజయుడు నాయానా, ధర్మపుత్రా నీవు ఎల్లప్పుడు ధర్మం ప్రకారమే నడుచుకుంటివి. యుద్ధం మాత్రం తలపెట్టవద్దు. యుద్ధం చేసి ఎందరో నాశనం అయిన తరువాత పదవి, రాజ్యం దక్కితే మాత్రం వాటివల్ల కలుగు ప్రయోజనం ఏముంటుంది. అందుకే యుద్ధం ప్రారంభించనే వద్దు. సముద్ర పర్యంతం ఎల్లలు ఏర్పరచుకుని రాజ్యం ఏలినప్పటికి వార్ధక్యాన్ని మరణాన్ని, ఎవరూ జయించలేరు. దుర్యోధనాధులు మూర్ఖులు, అంత మాత్రం చేత మీరు మీ ధర్మాన్ని, సహనాన్ని విడువరాదు, వాళ్లు మీకు రాజ్యం ఇవ్వకపోయినప్పటికీ ఉత్తమమైన ధర్మనిష్టను మీరు త్యజించవద్దు నాయనా, అని సంజయుడు బోధించాడు.

దానికి ధర్మరాజు "సంజయా నీవు చెప్పింది నిజమే, ధర్మమే చిరకాలం నిలిచే సంపత్తు. కాని, మేము అధర్మంచేస్తున్నామంటావా, శ్రీకృష్ణుడికి ధర్మరహస్యాలు తెలుసు. ఉభయుల క్షేమం కోరే వాసుదేవుడు ఎలా చేయమంటే అలాగే చేస్తాను" అన్నాడు ధర్మరాజు.

అప్పుడు శ్రీకృష్ణుడు మృదు మధుర గంభీర స్వరంతో తన అభిప్రాయాన్ని చెప్పసాగాడు. సంజయా, కురపాండవులు ఇరువురు నాకు యిష్టులే, మీరు కలిసిమెలసి ఉండాలని కోరుకునే వారిలో నేను మొదటివాడిని. నాకేకాదు ఇరువర్గాలకు సంధి అంటే సంతోషమే, కాని ధృతరాష్ట్రుడికి రాజ్యం పంచే ఉద్దేశ్యమే లేదు కదా, ధర్మరాజు ధర్మం తప్పడని నీవే చెప్పావు. మరి అకారణరంగా అజాత శత్రువు యుద్ధానికి సిద్ధపడుతున్నాడని ఎలా అభియోగం మోపుతున్నావు ధర్మరాజు పై. మోక్షానికి కర్మ చేయుటే మార్గమని కొందరు, జ్ఞానమే మార్గమని కొందరు అంటుంటారు. దేవతలు కూడా, కర్మాచరణ చేస్తూనే ఉన్నారు. వాయువు చలనము, సూర్యుని ఉదయాస్తములు, భూభ్రమణము, చంద్రుని హెచ్చుతుగ్గులూ ఇవన్నీ ఆయా దేవతల కర్మలలో భాగాలే కదా, భూమిని మోసే భూమాతా, జలాలను తీసుకువెళ్లే నదీమ తల్లులు, వర్షించే మేఘుడు, గతి తప్పని నక్షత్రాలు, రుద్రులు, ఆదిత్యుడు అందరూ వారి వారి పరిధిలో కర్మాచరణలో ఉన్నవారే కదా, సంజయా నీవు కూడా ధర్మములన్ని తెలిసినవాడవని మేము అభిప్రాయపడుతుండగా నీవు మాత్రం కేవలం కౌరవశ్రేయస్సు కోరి ఉచితానుచితాలు మరిచి పాండవులను నిందించి అవమానిస్తున్నావు. పాండవులకు యుద్ధం చేయకుండా వారి రాజ్యభాగం వారికి పంచియిస్తే కౌరవులను సంహరించే ప్రశ్నే ఉత్పన్నం కాదుకదా, మీ ధృతరాష్ట్రుడు పుత్రశోకం గురించి ఇబ్బంది పడనవసరం లేదు కదా. శాంతి, క్షమ అనే విషయాలు నీవు చెప్పావు, కానీ రాజధర్మం గురించి చెప్పడం మరిచావు. రాజ్యం వీరభోజ్యం, ఇప్పుడు యుద్ధం చేసి రాజ్యం పొందకుండా వీరిని రాజధర్మాన్ని తప్పమని ధృతరాష్ట్రుని మాటగా నీవు వీరిని నిరుత్సాహపరుస్తున్నావు. సంజయా కౌరవులు దొంగ బుద్ధి కల్గిన వారు. వారి తండ్రిగా ధృతరాష్ట్రుడు, ఆయన పంపిన నీవు అదే ప్రోత్సహిస్తున్నారు. అంటే ఆ చోర గణంలో అందరూ భాగస్వామ్యులే అవుతున్నారు. యుద్ధం అనివార్యమే అని నాకు అనిపిస్తుంది. ఈ విషయాన్ని నీవు కూడా కౌరవసభలో స్పష్టంగా చెప్పు. రాజ్యభాగం వదులుకునే ఉద్దేశ్యం లేకపోతే యింకా విలువైనవి పోగొట్టుకునే అవకాశం ఉందని కూడా మా మాటగా వారికి చెప్పు.

సంజయా, ద్రౌపదిని దుశ్శాసనుడు పరాభవించినపుడు నిండు సభలో ధృతరాష్ట్రుడు నోరు మెదపకుండా ఉన్నప్పుడే ఈ దుష్టబుద్ధికి వారిలో బీజం పడింది. ఒక్క విదురుడు తప్ప ఎవరూ ఆనాడు మాట్లాడ లేదు. నీకు ఇవన్నీ తెలిసికూడా ధర్మరాజుకు నీతి వాక్యాలు చెపుతున్నావు. ఆనాడు కర్ణుడు ఏమన్నాడు, ద్రౌపదిని దుర్యోధనుడి దాసిగా ఉండమన్నాడు. మరెవరినైనా భర్తగా చూసుకోమన్నాడు.

ఆనాటి కర్ణుని పలుకులు అర్జుని గుండెని వక్కలు చేసినా భిక్షాటన చేసుకుంటూ క్షత్రియ కుమారుడు జీవించాలా అదే కదా నీవు చెబుతున్నది.

సంజయా, పాండవులు అరణ్య వాసానికి బయలు దేరినపుడు దుశ్శాసనుడు వీరిని నపుంసకులు అని ఎగతాలి చేయలేదా, దానిని నిజం చేస్తూ వీరు తిరిగి అరణ్య మార్గం పట్టాలా, అదేనా ధృతరాష్ట్రుని మాటగా నీవు చెబుతున్నది. వెయ్యి మాటలేలా, ఈ దుష్ట ఆలోచనను కౌరవ సభలోనే ఎండగట్టాలి. నేనే ఆ పనిని చక్కబెట్టి దానికి హస్తినాపురమునకు వస్తున్నానని చెప్పు. పాండవుల రాజ్య భాగం ఇచ్చారా సరే ? అయినా మాకు చెందవలసిన న్యాయమైన ఆస్తినే కదా మేము అడుగుతున్నాము.

ఇతరుల సొత్తు కోసం ఆశపడవద్దు మేం అయిదుగురం ఉన్నాం కదా, మా అయిదుగురికి అయిదు ఊళ్లు ఇచ్చినా చాలు రాజీపడతాం, భారత కులసింహామా, అందరం హాయిగా ఉంటాం అని ఈ మాటలు దుర్యోధునిడితో చెప్పు సంజయా. ఏది ఏమైయినాసరే అటు సంధికి కాని, ఇటు యుద్ధానికి గాని రెండింటికి మేము సిద్ధంగానే ఉన్నామని చెప్పాడు. ధర్మారాజు మాటలు విని సంజయుడు, పాండవుల వద్ద, శ్రీకృష్ణుడి వద్ద సెలవు తీసుకొని మరల హస్తినాపురానికి బయలు దేరి వెళ్లాడు.

**ముగింపు**

మహాభారతంలోని ఉద్యోగ పర్వం నుండి తీసుకున్న సంజయ రాయబారం, ధర్మవిశిష్టతను, లోక శ్రేయస్సును కోరే విధంగా ఉంది. సంజయుడు తన విధి నిర్వహణలో ఎవిరినీ నొప్పించకుండా తన వంతు కర్తవ్యం తాను నిర్వర్తించాడు. ఇన్ని చేసిన ఈ సంజయుడు క్షత్రియుడు కాదు. ధృతరాష్ట్రుడికి బంధువు కాదు, కేవలం సూత పుత్రుడు.సూత కులంలో పుట్టినవారు, గుర్రాలను తోమడం,రథాలను తోలడం, రథచక్రాలు తయారు చేయడం. రథాలను ప్రయాణాలకు సిద్దంగా చేయడం ఇలాంటి వృత్తులు చేసే వారికి సూతకులం అని పేరు. ఒక విధంగా చూస్తే క్షత్రియ కులం కంటే తక్కువది. కాని సంజయుడిని ఎవ్వరూ ఎన్నడూ సూతపుత్రునిగా చులకనగా చూడలేదు, గౌరవించారు. మహారాజులు కనబడితే సాటి మహారాజును ఎలా గౌరవిస్తారో అలా గౌరవించేవారు. మహర్షులు కనబడితే చాలా ఆదరంగా పలకరించేవారు. ఎందువల్ల అంటే పుట్టిన కులంతో నిమిత్తం లేకుండా ప్రవర్తనలో ఎంతమంచి గుణమో అతను కలిగిన వాడు కాబట్టి. అంటే మహాభారత కథ కులానికి కాకుండా గుణానికే ప్రాధాన్యత నిస్తుందని సంజయుడి ద్వారా మనకు తెలుస్తుంది. భారతంలో సంజయుడి పాత్ర చిన్నది, పాత్రత పెద్దది. సంజయుడు అంటే " సమ్యక్ జయము కలిగినవాడు" అంటే గొప్పదైన జయము కలిగిన వాడు అని అర్థం. వ్యాసమహర్షి మహాభారతంలో సంజయుడిని గొప్ప ఆదర్శమూర్తిగా నిరూపించాడు. అని చెప్పడంలో ఏటువంటి సందేశం లేదు. ఈ విధంగా సంజయుడు తన రాయబారాన్ని దిగ్విజయంగా ముగించాడు.

**ఆధార గ్రంథాలు**

1. రాజాజీ మహాభారతం- ప్రథమ ముద్రణ 1961
2. మహాభారతము-జన చైతన్య ఆధ్యాత్మిక కేంద్ర ప్రచురణ
3. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్రమహాభారతము ఉద్యోగ పర్వము-సంపుట 07

# 63. కవిత్రయ మహాభారత నాటకాలు - సామాజిక దృక్పథాలు

- డా॥ చుక్కా యశోద, విజయవాడ

## ఉపోద్ఘాతం

రామాయణ, భారత, భాగవతాలు పురాణేతిహాసాలలో తలమానికాలు. వీటి కథల ఆధారంగానే అధిక సంఖ్యలో కావ్యనాటకాలు వెలువడి వాఙ్మయం సుసంపన్నమైంది. ఈ మూడింటిలో కూడా మహాభారతానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇతిహాస రూపమైన భారతానికి నాటక రూపం కల్పించి, వందల సంఖ్యలో మన తెలుగు కవులు నాటకాలు రచించారు. కావ్య ప్రక్రియలో నాటకం ఉత్తమమైంది. కవిత్రయ మహాభారతం 'కథ' ఆధారంగా రచించబడిన ప్రసిద్ధ నాటకాలు అనగా జనరంజకమైన వాటిని కొన్నింటిని మాత్రమే ప్రస్థావించి, వాటిలోని సామాజిక దృక్పథాలను ఈ పరిశోధనా వ్యాసంలో చిత్రించుట జరిగినది.

ప్రఖ్యాతమైన ఇతివృత్తాన్ని స్వీకరించినపుడు కవి మూలాన్ని మించి చెప్పగలిగిన కథాంశం ఉండదు. కథను సాధనంగా చేసుకొని తాను చెప్పదలచుకొన్నదేదో సామాజికుడికి అర్థమయ్యేట్లుగా కవి ప్రయత్నిస్తాడు. కథ అర్థం చేసుకోవడానికి శ్రమ ఉండదు కనుక కవి అభిప్రాయం త్వరగా సామాజికుడికి తెలుస్తుంది.

మక్కపాటివారి 'ద్రౌపదీమాన సంరక్షణం'లో, చిలుకూరి నారాయణరావుగారి 'అంబ' (మొండి–శిఖండి)లో, తిరుపతి వేంకటకవుల 'పాండవోద్యోగం', పాండవ ప్రవాసం మొ॥ నాటకాలలోగల విస్తృతమైన సామాజిక స్పృహను వర్తమాన సమాజానికి అందించే విధంగా కవిత్రయ మహాభారత నాటక కవులు నాటకాలు రచించి సమాజానికి అందించారు.

## ద్రౌపదీ మాన సంరక్షణం - మక్కపాటి వెంకటరత్నం

### నాటక ప్రస్థానం

ధార్వాడ నాటక సమాజం వారు ప్రదర్శించిన నాటకాల్లో ఇదొకటి. మక్కపాటి వెంకటరత్నం రచించిన ఈ నాటకం 1958లో ఆంధ్ర నాటక కళాపరిషత్‌లో ప్రదర్శితమైంది. దీన్ని ఇంకాస్త ముందే 1926లో రచించినట్లుగా గ్రంథకర్త పీఠిక వల్ల తెలుస్తుంది.

ద్రౌపది ఇతివృత్తంగా వచ్చిన నాటకాలు ఆ కాలంలో చాలా వెలువడ్డాయి. కోలాచలం వారు, మల్లాదివారు ఇదే వృత్తానికి "ద్రౌపదీ వస్త్రాపహరణం" అని పేరు పెట్టినప్పటికీ ఈ రచయిత కృష్ణభక్తి తాత్పర్యంతో దీనిని "మానసంరక్షణం" అని పేర్కొన్నారు. ఇది చాలా ఉచితమైన పేరు. ఈ కవి నాటకానికి అనుకూలంగా సభాపర్వ కథకు కొన్ని మార్పులు చేశారు.

## ద్రౌపదీ మాన సంరక్షణ - సామాజిక దృక్పథం

మక్కపాటి వెంకటరత్నంగారు ఈ నాటకానికి పేరు పెట్టటంతోనే సామాజిక దృక్పథాన్ని చూపించారు. రంగస్థలం మీద చూపించకూడని దృశ్యాల్లో వస్త్రధారణం ఒకటి. "అంబర గ్రహణా దీని ప్రత్యక్షాణిన నిర్దిశేత్" అని నాట్యశాస్త్ర నియమం. ప్రేక్షకులకు రోత కలిగించే బట్టలు కట్టుకోవటం మొదలైన దృశ్యాలు చూపవద్దని ప్రేక్షకుల మనోభావాలను దృష్టిలో పెట్టుకునే లాక్షణికులు ఇటువంటి ఏర్పాటు చేశారు.

ఒక స్త్రీ తానుగా అంగాంగ ప్రదర్శన చేస్తూ వస్త్రాన్ని ధరించటమే చూపటం తప్పైనప్పుడు ఇతరులు ఆమెను పరాభవించటం చూపటం సభ్యసమాజం చూడటానికి ఇష్టపడరు. కొద్దిపాటి పరిమితులతో ఆ ఘట్టాన్ని తప్పనిసరి అయినప్పుడు

ఇతివృత్త నిర్వహణ కొరకు ప్రదర్శించాలి. ఆ విధంగా అపరిహార్యమైన ప్రదర్శనలో కూడా ఈ కవి అశ్లీలం ధ్వనించకుండా, ప్రేక్షకుడికి ఉద్వేగం కలుగకుండా జాగ్రత్తపడ్డారు.

సభాపర్వంలో వస్త్రాపహరణానికి దుర్మార్గులు ప్రయత్నించినప్పటికీ, కృష్ణుడి అనుగ్రహంవల్ల అది జరగలేదు. కృష్ణుడు ద్రౌపది మానాన్ని రక్షించి, ఆమె గౌరవానికి భంగం కలుగకుండా చూశాడు. అప్పటికే చలనచిత్ర రూపంలో జన బాహుళ్యంలోకి వచ్చిన ఇతివృత్తాన్ని కూడా లలితంగా చిత్రించి, సామాజికుల మనసుకు కష్టం కలుగకుండా చూశారు. భారతాది గ్రంథాలమీద సామాజికులకు జుగుప్స కలుగకూడదనే కవి దృక్పథం సామాజిక దృక్పథంతో కలసిపోయి ఈ నాటకంలో కనిపిస్తుంది. ఈ ఇతివృత్తానికి వస్త్రాపహరణమను పేరిడుట కన్న "మాన సంరక్షణ" మను నామ ముంచుటయే యోగ్యము.

ఈ పేరులోనే స్త్రీ జాతిపై గౌరవం కూడా కవి వ్యక్తం చేశారు. ప్రేక్షక సమాజం సమజం (పశువుల మంద) కాదని నిరూపించారు. "వస్త్రాపహరణం" పేరు చూడగానే పశుప్రవృత్తి ఉన్నవారు ఆకర్షితులవుతారు. ఒక స్త్రీ ఎలా పరాభవింపబడుతుందో చూద్దామనుకుంటారు. వారికి కూడా ఆలోచన కలగుజేసే విధంగా "మానసంరక్షణం" అనే పేరు సార్థకమవుతుంది. స్త్రీ జాతి ఘోర పరాభవం నుంచి రక్షించబడిందని విజ్ఞులైన వారికి విశ్వాసం కలుగుతుంది. విఫలమైన వస్త్రాపహరణ యత్నాన్ని పెంచి చూపటం కంటే, స్త్రీల గౌరవం నిలిపిన సఫలమైన మాన సంరక్షణాన్ని ఎంచుకోవటం సామాజికుల మనసుకు కూడా సంతోషాన్ని కలిగిస్తుంది.

నాటకాన్ని నామకరణంతోనే సంస్కారవంతమని నిరూపించిన మక్కపాటివారు పూర్తిగా వ్యాసభారతాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నాటకాన్ని రచించినా వీరికి నన్నయ భారతమే ఆధారం.

**అంబ (మొండి-శిఖండి) - చిలుకూరి నారాయణరావు**

**నాటక నేపథ్యం**

మహాభారత స్త్రీ పాత్రలలో అంబను ప్రధానేతి వృత్తంగా స్వీకరించిన ఏకైక నాటకాన్ని చిలుకూరి నారాయణరావుగారు 1930 ప్రాంతంలో రచించారు. 1933లో ప్రథమ ముద్రణ, 1937లో దీని ద్వితీయ ముద్రణ వెలువడింది. వ్యావహారిక భాషావాదం బలపడుతున్న రోజుల్లో వ్యావహారిక భాషవల్ల విజ్ఞానం వ్యాపించగలదన్న విశ్వాసంతో రచించిన ఈ నాటకాన్ని వ్యవహారిక భాషావాదానికి రూపకర్త అయిన గిడుగు రామమూర్తి పంతులుగారికి అంకితమిచ్చారు.

తెలుగు భాష యావత్తూ సంస్కృతం నుంచే పుట్టిందని 'తెలుగు భాషా చరిత్ర'లో నారాయణరావుగారు నిరూపించారు. అలాంటివారు కూడా భాషాభివృద్ధికి వ్యవహారం ముఖ్యమని ఈ నాటకంలో భావించారు.

**అంబ (మొండి-శిఖండి) - సామాజిక దృక్పథం**

పంతొమ్మిదవ శతాబ్దం తొలినాళ్ళలో సమాజంలో మూఢాచారాలు విశేషంగా పెరిగిపోయాయి.

1. బాల్య వివాహాలు, 2. వివాహాలలో స్త్రీ ఇష్టానికి ఏమాత్రం ప్రాధాన్యం లేకపోవటం, 3. వివాహం తర్వాత స్త్రీ అన్నివిధాలుగా నీరసించిపోవటం, 4. బ్రతుకు దుర్భరం కావటం... మొదలగునవి అప్పటి సాహిత్యంలో విస్తారంగా కనిపిస్తున్నాయి. గురజాడ, కందుకూరి, ఉన్నవ లక్ష్మీనారాయణ మొ॥న రచయితల రచనల్లో ఆకాలం స్త్రీ అనుభవించే కష్టాలెన్నో కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి.

సహజంగా సంప్రదాయాభిమానులైన నారాయణరావుగారు ఈ నాటకాన్ని సామాన్య స్త్రీని దృష్టిలో పెట్టుకొని రాశారు. స్త్రీల ఆలోచనలు ఎలా ఉండేవో, అలా ఎందుకు ఉండకూడదో నారాయణరావుగారు చక్కగా వర్ణించారు. అంతేగాక

మగవాళ్ళ ముఖమే చూడని ఆడవాళ్ళున్నారని వర్ణించటం, బహుభార్యత్వం వీటన్నింటినీ వారీ నాటకంలో విమర్శించారు. పెండ్లి చేసుకున్నవాడు కాదంటే స్త్రీ పడే బాధలను స్పష్టంగా వర్ణించారు.

**కాశీరాజు**

"అది మంచిదేకాని, అట్టి ప్రేమ తాత్కాలికమేమో, గాఢ ప్రేమో తెలుసుకొనడానికి వీలులేదు. నేడు పెండ్లాడినవారు రేపు విడిపోతే ఆడదానికి గత్యంతరం లేదు. మగవానికేమి? ఆడది నవ్వుల పాలవుతుంది" (అంబ-పుట. 17)

ధర్మమన్నది మనిషి సుఖంగా బ్రతకటానికి కాలం ప్రకారం మారాలని, ధర్మం మూల స్వరూపం మారకుండా మనం ధర్మంగా భ్రాంతిపడి పాటించే ఆచారంలో మార్పు రావాలని, రచయిత ఆశించారు. ఎవ్వరికీ కష్టం కలగకూడదనేది మౌలిక ధర్మం. కులం, స్త్రీలు స్వతంత్రించక పోవటం, ఆచారం, మూలధర్మమైన ప్రాణి సుఖం దృష్టిలో ఆలోచిస్తే తాత్కాలికమైన ఆచారాన్ని ప్రాణిక్షేమం కోసం ప్రక్కన పెట్టాలనే రచయిత అభిప్రాయపడ్డారు.

**అంబ వివాహ విషయంలో తప్పెవరిదో నిర్ణయంచటం కష్టమే**

1. కన్యలను ముగ్గురినీ వీర్యశుల్కలుగా నిర్ణయించినపుడు వారి అభిప్రాయాన్ని అడగకపోవటం తండ్రిగా కాశీరాజు చేసిన అపరాధమే. అయితే బలమున్నవాడిదే అధికారం కనుక అత్యధిక బలసంపన్నుడికి ఇచ్చి వివాహం చేయాలను కోవడం అప్పటి తండ్రిగా తప్పుకాదు.

2. అంబ సాళ్వరాజును వరించినట్టు తెలిసి ఆమెను కూడా స్వయంవరంలో చేర్చటం భారతంలో కనిపిస్తుంది. ఈ విషయాన్ని తప్పించి నారాయణరావుగారు కాశీరాజును దోష విముక్తిడిని చేశాడు.

3. అంబ తన ఇష్ట ప్రకారం ఎన్నుకున్న సామాన్యుడికైనా ఇచ్చి వివాహం చేయటం ధర్మమని తండ్రితో చెప్పింది. ఆ మాట వినకపోవటమే కాశీరాజు చేసిన తప్పు.

4. అంబను ప్రేమించిన సాళ్వుడు స్వయంవరానికి ముందే ఆమె తండ్రికి విషయం చెప్పి వివాహమాడి స్వయంవరం నుంచి ఆమెను తప్పించటం ఉత్తమమైన పద్ధతి. పరాక్రమంతో గెలుచుకోగలననే దురాభిమానం అతడిని ఆ పని చేయకుండా చేసింది. ఇది సాళ్వుడి తప్పే.

5. స్వయంవరం ప్రారంభం కాగానే అంబ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. కనీసం భీష్ముడు వచ్చినపుడైనా చెప్పి ఉండవలసింది.

6. హస్తిన చేరిన తర్వాత సాళ్వుడి సంగతి చెప్పటం మరొక తప్పు. లేకపోతే ప్రేమ విఫలమైన స్త్రీలందరూ సర్దుకొని పోయినట్లే ఆమె సంసారం విచిత్ర వీర్యుడితో చక్కగా సాగిపోయేది.

7. భీష్ముడు పంపినప్పుడు సాళ్వుడామెను తీసుకోకపోవటం అప్పటి క్షత్రియ ధర్మం. యుద్ధంలో వీరుడు గెలుచుకున్న ధనం అతడి సొంతమవుతుంది. "జేతా లభేత సాంగ్రామికం విత్రం" (గౌతమ ధర్మ సూత్రాలు - గౌతముడు)

8. భీష్ముడు విచిత్రవీర్యుడి కొరకు ఈ పని చేయటం అప్పటి క్షత్రియ ధర్మమైనా దానికి విచిత్ర వీర్యుడంగీకరించటాన్ని అంబ ఆక్షేపించటం సమంజసం.

9. కాశీరాజు భీష్ముడికి ఆహ్వానం పంపలేదు. విచిత్రవీర్యుడి ప్రవర్తన సరియైనది కాదని కాశీరాజుకు తెలిసినందువల్ల అతడిని కూడా ఆహ్వానించలేదు. కనుక భీష్ముడు స్వయంవర ప్రాంతానికి వెళ్ళటం లౌకిక దృష్టిలో తప్పే.

కర్ణుడి చావుకు కారణాలనేకమన్నట్టుగా కాశీరాజు, భీష్ముడు, అంబ, సాళ్వుడు అందరూ అంబ జీవితానికి అన్యాయం జరగటంలో సమానమైన బాధ్యత వహించవలసి ఉంటుంది. భీష్ముడికి ముఖ్యంగా అక్కడికి వెళ్ళవలసిన అవసరం

లేదు. విచిత్ర వీర్యుడికి పిల్లనిచ్చేవారు ఎవరైనా దొరుకుతారు. ఈ విషయంలో భీష్ముడు ధర్మాన్నాలోచించలేదని చెప్పవచ్చు. తమను నిర్లక్ష్యం చేయటం భీష్ముడు సహించలేకపోయాడు. అది వీర ధర్మం. విచిత్రవీర్యుడి రక్షణ బాధ్యతను స్వీకరిస్తానని తల్లికి మాట ఇచ్చాడు. అతడి యోగక్షేమాల కొరకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. కనుక క్షత్రియ ధర్మాన్ని పాటించినట్లయింది. అంబ సాళ్వుడి సంగతి చెప్పగానే ఆమెను పంపటంతో తప్పు సరిదిద్దుకున్నాడు.

కనుక ధైర్యం లేని ప్రేమతో తమ జీవితాలను స్వయంగా పాడు చేసుకున్నవారు అంబాసాళ్వులే. సాళ్వుడు ప్రేమను మరచి సగటు మగవాడిగానే ప్రవర్తించాడు. అంబకు మాత్రమే అన్యాయం జరిగింది.

## పాండవ నాటక చక్రం – తిరుపతి వేంకట కవులు

తిరుపతి వేంకట కవులనగానే 'పాండవోద్యోగ విజయాలు' గుర్తుకు వస్తాయి. బావా ఎప్పుడు వచ్చితీవు... అదిగో ద్వారక... చెల్లియొ చెల్లకో.... జెండాపై కపిరాజు... మొదలైన కొన్ని పద్యాలు నాటకరంగంతో ఏమాత్రం పరిచయం లేనివారికి కూడా నాలుకపై కదులుతూ ప్రసిద్ధాలయ్యాయి. 'పాండవోద్యోగం', 'పాండవ విజయం' వేరే నాటకాలైనా కృష్ణుని రాయబారంగా కలిసిపోయి ప్రసిద్ధమయ్యాయి.

## పాండవోద్యోగం – ఇతివృత్త నిర్ణయం

ఉద్యోగపర్వం పూర్తి కథాంశంగా ఉన్నందువల్ల ఈ నాటకానికి పాండవోద్యోగమనే పేరు సార్థకమయ్యింది. ఉద్యోగం అంటే ప్రయత్నం. పాండవులు పోగొట్టుకున్న రాజ్యాన్ని తిరిగిపొందే ప్రయత్నం పాండవోద్యోగం. లోకంలోనూ నాటకంలోనూ కూడా 'పాండవోద్యోగ విజయాలు' అని కలిసిన వ్యవహారమే కనిపిస్తుంది.

ఉద్యోగ పర్వంలో సంజయ రాయబారం విఫలమైన తర్వాత కృష్ణుడు రాయబారానికి బయలుదేరే మూడవ ఆశ్వాసం కథ ఇందులో ప్రధానమైన ఇతివృత్తం.

## పాండవోద్యోగం – సామాజిక దృక్పథం

పాండవోద్యోగంలో కుంతి, ద్రౌపది పాత్రలే ప్రధానమైన స్త్రీ పాత్రలు. కార్యసాధనకు పురుషులు వెనక్కి తగ్గినపుడు వాళ్ళను కర్తవ్యం వైపు స్త్రీలే నడిపించాలని మహాభారతంలోని ద్రౌపది పాత్ర నిరూపించింది. తిరుపతి వేంకట కవులు కూడా ఈ మార్గాన్నే అనుసరించారు. కృష్ణుడు కూడా ద్రౌపది అభిప్రాయాన్నే సమర్థించడం కార్యసాధనలో స్త్రీలకున్న ప్రాధాన్యాన్ని, ప్రాముఖ్యాన్ని సూచిస్తుంది.

### ద్రౌపది

తెలుపవలసినదేమున్నది? మొన్న సంజయుడు "నీకు వారు యుద్ధము చేయనిచో రాజ్యమీయరనియు మీరు యుద్ధము చేసి రాజ్యము కోరుటకన్న నందక రాజ్యమందో, వృష్ణి రాజ్యమందో బిచ్చ మెత్తుకొని జీవించుట కొంత యుక్తమనియు బోధించెను కదా! అట్లు బిచ్చమెత్తుకొనుచు మధ్య మధ్య వనంబుల కరిగి వెనుకటి వలెనే కందమూలంబు లారగించుచు ఋషులతో ధర్మశాస్త్రంబులు ముచ్చటించుకొనుచు నుండవలసినదనియే మీ బావగారి అభిప్రాయము.

### కృష్ణుడు

అమ్మా! ద్రుపద రాజపుత్రీ! చెప్పవలసినదంతయు చెప్పనిమ్ము.దేవా! యుధిష్ఠిర మహారాజా!

**సంజయ రాయబారమున సారమెఱింగితి మాతడెంచు మీ**
**కుంజను శాంతివారలకు గోపమ యొప్పెడి మీకు బిచ్చపుం**

**గంజి రుచించు వారలకు గమ్మనిపాలు రుచించు? మీకునై**

**వీజము పుట్టె వారికయి పృథ్వి జనించెనటంచు దెల్పెడిన్**

ఈ సంధి సర్వవిధముల 'నీకంట నేను వ్రేలిడెదను నా నోట నీవు వ్రేలిడుమన్నట్లు ఉన్నది ఇది యిటు ఎన్నను నీ మనంబు యుద్ధమునకు వెనుదీయుచున్నది. అగుగాక? నీ నిశ్చయము వ్యక్తీకరింపుము' (పాండవోద్యోగము పుట. 10, 11).

కుంతీ వివాహానాకి ముందు స్త్రీల స్వేచ్ఛా వర్తనం వల్ల కలిగే దుష్ఫలితాన్ని, దానివల్ల జీవితంలో అనుకోని కష్టాలెదురయ్యేటప్పుడు పడే మనోవేదనను సూచిస్తుంది.

**కుంతి**

(ప్రవేశించి తనలో) అకటా ! నేనేమిసేయుదును? కర్ణుడర్జునునిచే మడిసినను నర్జునుండు కర్ణునిచే దెగినను నాకొక విధమైన దుఃఖమే కావున నేనెట్లేనిబోయి బోధించి పాండవుల జేర్తుగాక! (యోచించి) ఇదిగాక యతడు తప్ప దుర్యోధన సేనలో పాండవుల కపకృతి చేయదగు పేరుగల యోధులంతగా లేరు. భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ లెన్నడు నా సుతుల యెడ ప్రేమ తప్పి వర్తింపరు కావున వీని నెట్లేని దిప్పి సుఖముండెదగాక (పరిక్రమించి) అదే భాగీరథీ తీరమున గృత స్నానుండై నా యగ్రతనూజుడు సూర్యోపాస్తి యొనరించు కొనుచున్నాడు. (సమీపించును)

**కర్ణుడు**

పాండు మహిషీ! ఏను గుంతీనందనుడ నను మాట నీవెగాక యాకాశవాణి కూడ స్పష్టపరచెగదా! అయినను

**కూటికి గుడ్డకై పరుల కొంపకు జేరి త్రయోదశాబ్దము**

**ల్నాటిన దుఃఖములమ్మది కలంపగ నుంటివిగాని యిట్టి దీ**

**మాట యటంచు దెల్పితివె మానిని యాత్మహితంబు గోరి యీ**

**నాటికి జెప్పవచ్చితివి నాపయి ప్రేముడి కల్గు పోలికన్ (పాండవోద్యోగము - పుట. 60.61)**

ఇక గాంధారి జరిగే దురాగతాన్ని స్త్రీలైన నివారించే ప్రయత్నం చెయ్యవచ్చని ధర్మం ఎవరి పక్షాన ఉంటే వారికి మాత్రమే కార్యసిద్ధి కలుగుతుందనే సందేశాన్నిస్తుంది.

**గాంధారి**

మహారాజా! మన సంతానమును మందలింపజాలక యొరుల దూషించినం బ్రయోజనం బేమి? మీరన్నమాట మాత్రమసత్యము కాదు. పాండవ మధ్యమునిం గెలువ జాలదు నను కర్ణు ప్రగల్భములే సుయోధనుడిట్లు తెగుటకుం కారణములు. (పాండవోద్యోగం - పుట.37)

"ఉన్నది పుష్టి" మొదలైన కొన్ని పద్యాలలో మానవుల మానసిక ప్రవృత్తి, తద్వారా సామాజిక దృక్పథం కలిగించే విధంగా ఈ కవులు సూచించారు.

**పాండవ ప్రవాసం - నాటక నేపథ్యం**

పాండవ ప్రవాస నాటకం కొంత భాగం పాండవ జనన నాటకానికి కొనసాగింపు. పాండవుల జీవితంలో రెండు సందర్భాల్లో వారు రాజ్యం వదలిపోవలసి వచ్చింది. హస్తినా పురానికి రాకముందు తల్లిదండ్రులతో శతశృంగ పర్వతం మీద, అరణ్యవాసంలో ప్రవాసంగా ఉన్నప్పటికీ అది ప్రవాసం కాదు. ప్రవాసం అంటే ఉన్నచోటు వదలిపోవటం.

పాండురాజు పోయిన తర్వాత పాండవులను కుంతి హస్తిన చేర్చింది. కనుక వారికి అరణ్యం స్వస్థానం కాదు. శతశృంగం పాండు రాజుకు ప్రవాస స్థానం. ఇదిగాక శతశృంగంలో పాండవులకు జన్మ మాత్రం తప్ప స్వతంత్రమైన

ప్రవృత్తి లేదు. పాండవ జన్మ వృత్తాంతాన్ని పాండవ జననం, ఆరవ అంకంలో వర్ణించటం వల్ల రెండు ప్రవాస ఘట్టాలనే తిరుపతి వేంకట కవులు పాండవ నాటక ప్రవాసంలో గ్రహించారు.

మొదటిది హస్తిన విడిచి లక్కఇల్లు చేరి అక్కడ నుండి ప్రాణాలతో బయటపడి ఏక చక్రపురం చేరటం, రెండవది అరణ్యవాసం. ఈ మధ్య కాలంలో ఇరవై మూడు సంవత్సరాలు ఇంద్రప్రస్థ పురంలో రాజ్యం చేశారు. వారణావతం బయలుదేరింది మొదలు యుద్ధానంతరం పట్టాభిషేకం తరువాత శాశ్వతంగా పాండవ రాజ్యం ఏర్పడి హస్తినకు వచ్చినంత వరకు పాండవులు ప్రవాసం చేసినట్లే. ద్రౌపదిని వివాహమాడిన తరువాత అరణ్య వాసానికి వెళ్ళేవరకు ఉన్న సభాపర్వ కథ రెండు ప్రవాసాలకు విశ్రాంతి కాలం. సంధి కాలం, హస్తిన దృష్ట్యా ప్రవాస కాలం కూడా అవుతుంది. ఆ కథను ముఖ్య ప్రవాసకాలాలను తెలపటానికి ఉపయోగించి ఇతివృత్తాన్ని కవులు సమగ్రం చేశారు.

## పాండవ ప్రవాసం – సామాజిక దృక్పథం

వారణావతం నుంచి ఏకచక్రపురానికి చేరిన కుంతి బ్రాహ్మణ కుటుంబాన్ని బకాసురుడి నుండి రక్షించిన సందర్భంలో ఇతరులకు మనచేతనైన సహాయం చేయాలనే సందేశం కనిపిస్తుంది. మన కష్టాలు ప్రక్కనపెట్టి ఎదుటివారికి సహాయపడగలిగితే అది మనసుకు గొప్ప తృప్తినిస్తుంది. ఈ సందేశంతోపాటు ఉపకారం చేసిన వారి ఋణం ఎలాగైనా తీర్చుకోవాలని భీముడి పాత్ర ద్వారా కుంతి చెప్పిస్తుంది.

**కుంతి**

తండ్రీ! శాంతింపుము. ఎన్నటికేని యాసుయోధనునికి మంచి బుద్ధి కలుగకపోవునా? కలిగినచో మీరును మీరు నేకముగా నుండకపోదురా?

**భీముడు**

తల్లీ! ఎంత వెఱ్ఱిదానవు?

**పుట్టిన బుద్ధి వానికిక బుల్లల తోడనే కానిపోదు నీ**
**దెట్టి యమాయ కత్వమొకొ? యించుకయేని యెఱుంగవక్కటా**
**పెట్టగ జేయడీ విషము పెద్దనదింబడ ద్రోయ జేయడే**
**బెట్టిదుడై విషాహులను బెట్టి ననుంగఱపింప జేయడే**

**కుంతి**

తండ్రీ! పడ్డవారెప్పుడును జెడ్డవారలు కారు. సారెసారెకు నదియే తలపోయకుము. ఈ మాట వినుము. మన వలన మన ఇంటి గృహస్థుని కొక యుపకారము కావలసియున్నదటోయి. (పాండవ ప్రవాసం – పుట. 13)

షష్ఠాంకంలో పాండవులు ధౌమ్యుడిని మాత్రమే తోడుగా ఉంచి వేటకు వెళ్ళినప్పుడు సైంధవుడి ప్రవేశాన్ని వర్ణించి ఆశ్రితుల రక్షణ విషయంలో అశ్రద్ధ చూపకూడదనే సామాజిక సందేశాన్ని కవులు సూచించారు.

ఐదవ అంకంలో అర్జునుడు –ఊర్వశి సంభాషణ ద్వారా ఇంద్రియ నిగ్రహం ప్రాశస్త్యాన్ని వివరించారు. షష్ఠాంకంలోనే ద్రౌపది మాటల్లో దేవుడికి కూడా దుర్మార్గులను సంస్కరించటం చేతగాదని చెప్పటం అతిశయోక్తి అయినప్పటికీ దుర్మార్గుల వల్ల లోకానికి కలిగే బాధలు అపరిమితమైనవని" (పాండవ ప్రవాసం – పుట 79,80) సూచించారు.

పరస్త్రీ వ్యామోహం కష్టకారణమని, వారు పశువులేయని సూచనగా ధర్మరాజు పాత్రతో చెప్పించి అతికాముకత్వాన్ని నిరసించారు.

ధర్మ

ఓయీ సింధురాజా!

**చపలులు లేరె? యెందు బెఱ చానలె కావలెనే? స్వకాంతలే**
**ల పనికిరారు? రారనుము లంజలు లేరె? భవాదృశుల్ నృపా**
**ల పశువు లంగనా జనములన్ గికురింతు రటంచుగాదె?శు**
**ద్ధ పశు సమాన జాతి నొక దానిని ధీవరు లొప్పిరోజడా !**

ఇది యిట్లుంచుము

**చాపల్యమెంత గల్గిన**
**చాపమునకు వెఱవకున్న బర భార్యయకా**
**దీ పడతి తోడబుట్టువు**
**ఛీ! పాపీ! తొలగిపొమ్ము చెడుగా! తులువా! (పాండవ ప్రవాసం – పుట. 89)**

కథ తెలిసినప్పుడు కవి ఎందుకు ఈ వృత్తాన్ని తీసుకున్నాడనే ఆలోచన సహజంగా కలుగుతుంది. ఆ నాటకంలో ప్రస్తుత కాలానికి ఉపయోగించే అంశం ఏదైనా ఉంటే గ్రహించాలి.

ఈ విధంగా ప్రతి నాటకంలోనూ ఏదో ఒక సామాజిక అంశాన్ని కవులు చిత్రించారు.

## భరత వాక్యం

భారతం ఒక మహాసముద్రం. వేదవ్యాసుని ప్రతిభకు ఉదాహరణ ప్రాయం మహాభారతం. ఇందులో మహర్షి వివిధ పాత్రల ద్వారా మానవ స్వభావాన్ని ప్రత్యక్షీకరించిరి. ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలలో పూర్తి జ్ఞానం కలిగించగలిగింది భారతం ఒక్కటేనని వ్యాస మహర్షి ప్రతిజ్ఞ. సుఖ దుఃఖ సమ్మిళితమైన మానవ జీవితం నందలి సన్నివేశాలే నాటకేతి వృత్తములగును. ఈ ప్రపంచమే ఒక నాటక రంగమని, మానవులే పాత్రధారులని, జనన మరణాలే ప్రవేశ నిష్క్రమణములని, కామ క్రోధాలే నవరసాలని, భగవంతుడే సూత్రధారుడని మన పండితుల అభిప్రాయం.

వేదవ్యాస ప్రణీతమై కవిత్రయం వారిచే ఆంధ్రీకరించబడిన మహాభారతం ఒక రసవత్తర నాటకమనక తప్పదు. వ్యాసుని హృదయాన్ని కవిత్రం వారు ఆవిష్కరించినట్లుగా కవిత్రం వారి హృదయాన్ని నాటక కర్తలు ఆవిష్కరించినట్లు తోస్తుంది.

ఇంతటి విభిన్నములైన సామాజిక దృక్పథాలతో వివిధ రకాలుగా భారతేతి వృత్తాన్ని తమ ప్రతిభా పాటవాలతో నాటకాలుగా మలచి, తెలుగు సాహితీమతల్లికి కంఠహారము లొనర్చి, తెలుగువారికి గర్వకారణాలైన ఈ నాటక కవులంతా ధన్యజీవులు.

## ఆధారగ్రంథాలు

1. అంబ (మొండి–శిఖండి) – చిలుకూరి నారాయణరావు
2. తెలుగు నాటక వికాసము – పోణంగి శ్రీరామ అప్పారావు
3. ద్రౌపదీ మాన సంరక్షణం – మక్కపాటి వెంకటరత్నం
4. నాటకాలోకము – సాధన వీరాస్వామి నాయుడు
5. పాండవ ప్రవాసము – తిరుపతి వేంకటేశ్వరులు
6. పాండవోద్యోగము – తిరుపతి వేంకటేశ్వర కవులు

# 64. కవిత్రయ మహాభారతం - అరిషడ్వర్గాలు - ఆవశ్యకత

- డా॥ బి. పావని, కరీంనగర్

సాహిత్యం అనేది జీవనది లాంటిది. దానిలో ఎన్ని జలచరాలు, జీవజాలం వచ్చి చేరిన తొణకకుండా, బెణకకుండా తనలోని స్వచ్ఛమైన నీటిని మనకు అందిస్తున్నట్లు, మన తెలుగు సాహిత్యము కూడా వర్తమాన,భవిష్యత్ తరాలకు ఎన్నో ఆదర్శాలను అందించింది. వాటిలో కవిత్రయ మహాభారతం ఒకటి. సంస్కృతంలో వేదవ్యాసుడు రచించిన మహాభారతాన్ని తెలుగులో కవిత్రయం (నన్నయ ,తిక్కన ,ఎఱ్ఱన) వారు అనుసృజించారు అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. దీనిలో మన తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచారాలు, భాషా, శైలి ఉట్టిపడేవిధంగా కనిపిస్తాయి. మహాభారతంలో ఉన్నదే ఈ ప్రపంచంలో ఉన్నది. దీనిలో లేనిది ఈ ప్రపంచంలో లేదని నానుడి. కావున మహాభారతంలో ఉన్న ఎన్నో అంశాలను, ఘట్టాలను, పాత్రలను మన వర్తమాన సమాజానికి అనువర్తించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చతుర్విధ ఆశ్రమాలు, చతుర్విధ పురుషార్థాలు, అరిషడ్వార్గాలు మొదలైన వాటి నుండి మనం ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు.

'అరిషడ్వార్గాలు' అనగా అరి అంటే శత్రువు. మనలో వుండే శత్రువులు ఆరు. అవి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు. ఇవి ప్రతి వ్యక్తిలో ఉంటాయి. ఇవే మనలో ఉండే అంతర్ శత్రువులు . వీటిని జయించడం చాల కష్టం వీటిని జయించాలంటే ఇంద్రియాలు మన అదుపులో ఉండాలి. ఇదే విషయాన్నీ మహాభారతంలో మనకు వివిధ పాత్రలు(వ్యక్తులు) రూపంలో దర్శనమిస్తాయి.

## 1)కామము

కామము అనగా కోరికలు అని అర్థం. అధికమైన కోరికలు కలిగి ఉండటమే కామము. దీనివల్ల అత్యాశ కలుగుతుంది. మానవులు ఆకోరికలు పొందడానికి దేనికైనా వెనుకాడరు. ఆవేశంలో చేసే తప్పుల వల్ల తనను తాను కోల్పోతాడు.

**" నెంత శాంతులయ్యు నెంత జితేంద్రిలయు**
**లయ్యు కడువివిక్తమయినచోట**
**సతులగోష్ఠి చిత్త చలన మెందుదు రెందు**
**కామ శక్తి నేర్వగలరే జనులు"**

ఎంత శాంతులు, జితేంద్రులైన ఏకాంత స్థలంలో స్త్రీల కూటమి తటస్థిస్తే చిత్త చాంచల్యానికి లోనవుతారు. మన్మథుని బలాన్ని (కామశక్తిని ) ఓర్వగల వారున్నారా? లేరుకదా!

పై సందర్భంలో పరాశరుడు సత్యవతిని చూసినపు కలిగిన మానసిక స్థితిని నన్నయ ఆదిపర్వంలో ఉపరిచారవసు వృతాంతంలో వర్ణించాడు.

ఉపచరుడు మునీద్రుడు అయినప్పటికీ కూడా ఏకాంతంగా స్త్రీని చూసినపుడు మనస్సు చంచలమైందనే విషయం అర్థమవుతుంది. ఆధునిక కాలంలో కూడా ఎంతోమంది స్వాములు స్త్రీ లోభానికి, సౌందర్యానికి ఆకర్షితులై తమ సర్వస్వాన్ని కోల్పోయారని గమనించవచ్చు.

## 2) క్రోధం

క్రోధం అనగా కోపం ఏది చాల భయంకరమైనది. మానవునికి క్షణికావేశంలో కలిగే కోపంవల్ల ఎన్నో నష్టాలు కలుగుతాయి. ఇది విషం కన్నా హీనమైనది. విషం తీసుకున్న వాడు గంటలోపే మరణిస్తే, కోపం వల్ల మనిషి ప్రతి నిమిషం మరణిస్తాడు. అంతేకాక ఇతరులను కూడా అనేక కష్టాలకు గురిచేస్తాడు. కోపంలో వ్యక్తి నిజస్వరూపం బయట పడుతుంది.

కోపంలో మాట్లాడే మాటలు చాలా ప్రమాదకరమైనవి. కోపం ఒకానొక సందర్భంలో పగగా మారుతుంది. అందుకే తిక్కన మహాభారతంలో పగ కలిగిన ఇంట్లో పాము ఉన్నట్లు ఉంటుంది అని ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఈవిధంగా చెప్తాడు.

**పగయ కలిగెనేని పాముున్న యింటిలో**
**నున్న యట్లకాక యురడిల్లి**
**యుందు నెట్లు చిత్త మొకమాటు గావున**
**వలన దధిక దీర్ఘ వైర వృత్తి . (ఆం.మ.భా.ఉ.తృ.20.ప)**

కావున పగ ఏర్పడితే పామున్న ఇంటిలో కాపురమున్నట్టు ఉంటుంది. కానీ ఒక నిమిషమైన మనస్సు నిలకడగా ఉండదు. కనుక ఎవ్వరితోను దీర్ఘకాలం విరోధం పనికిరాదు. అంతేకాక ఈ విరోధమువలన కీడు తప్ప ప్రయోజనం లేదు. కాబట్టి బుద్ధి మంతులైన మానవులు కోపాన్ని దరిచేరకుండా ఉండాలని తిక్కన సూచిస్తున్నాడు. అలాగే శిశుపాలుడు కూడా తన అగ్రహావేశం వల్ల ఎన్నో తప్పులు చేసి చివరికి శ్రీకృష్ణుని చేతిలో హతుడైనాడు.

**3) లోభం**

లోభం అనగా లోకంలో ఉన్న ప్రసిద్ధమైన అర్థం పిసినారితనం కానీ లోభం అనగా స్వార్థం. అనగా తనకు మాత్రమే సొంతం అని అర్థం కూడా వుంది. మనకు ఈ ప్రపంచంలో ఎంతోమంది స్వార్థపరులు, పిసినారులు కనిపిస్తారు. అదే విధంగా మహాభారతంలో కూడా లోభగుణము కల పాత్రలు ఉన్నాయి.

దుర్యోధనుడు రాజ్యం మొత్తం తానే అనుభవిచాలనే కోరికతో పాండవులను తమకు దూరంగా అరణ్యవాసం పంపుతాడు. అక్కడ వారిని లక్క ఇంట్లో ఉంచి రాత్రికి రాత్రి నిప్పు పురోచనునితో పెట్టిస్తాడు. కానీ ఈ దురుద్దేశం తెలిసి విదురుడు పాండవులను లక్క ఇల్లు నేతితో చేయబడినది కావున మీ ఆయుధాలను జాగ్రత్తగా ఉంచుకోండి ఎప్పుడైనా అగ్నికి ఆహుతి కావచ్చు కానీ వారికి అర్థమయ్యే విధంగా చెప్తాడు. విషయాన్ని గ్రహించిన భీముడు సొరంగ మార్గం ద్వారా అందరిని రక్షించి చివరకు తాను కూడా బయటపడతాడు. ఆ లక్క ఇంట్లో ఒక బోయస్త్రీ, ఆమె ఐదుగురు కుమారులు కాలిపోగా వారే పాండవులు అని భావించి, పాండవులు లక్క ఇంట్లో మరణించారని అందరు దుఃఖి?స్తారు. కానీ కొంతకాలానికి పాండవులు అడవులు నదులు దాటి వివిధ ప్రాంతాలలో జీవనం కొనసాగిస్తూ, చివరికి తీర్థయాత్రలు చేసి పాంచాల దేశంలో ద్రౌపది స్వయంవరంలో అర్జునుడు వివాహం చేసుకుంటాడు. ఈ విధంగా లోభగుణం వల్ల చివరికి దుర్యోధనుడు, దృతరాష్ట్రుడు తమ వ్యక్తిత్వాన్ని, ప్రతిష్టను కోల్పాయారు. లోభగుణం వల్ల ఇతరులకు కీడు చేయాలనీ అనుకుంటే చివరికి తమకే కీడు జరిగింది అని మనం తెలుసుకోవచ్చు.

**4) మోహం**

మోహము అనగా ఆకర్షణ. అవ్యాజమైన ప్రేమను మొహం అంటాము. ఈమొహం వల్ల మనిషి తన ఉనికిని చివరకు సర్వస్వాన్ని కోల్పోతాడు. భారతంలో దేవయానికి కచునిపై గల ప్రేమను మొహం అని చెప్పవచ్చు. ఒకానొక సందర్భంలో కచుడిని శుక్రాచార్యుని శిష్యులు చంపి బూడిద చేసి ఆయనచే తాగిస్తారు. దేవయాని కచుడు ఎంత వెతికిన కనపడడం లేదని తన తండ్రితో చెప్పగా చివరికి తన శరీరంలో ఉన్నాడని గ్రహిస్తాడు. అతడు బ్రతకాలంటే తన శరీరము నుండి చీల్చుకొని బయటకి రావాలి అలా జరిగితే తాను మరణిస్తాడు. కావున అతనిని బ్రతికించాలంటే మృతసంజీవనీ విద్యను తన కూతురికి నేర్పాలి కానీ స్త్రీలకూ ఈ విద్య నేర్పితే అది నశిస్తుంది అని సందేహించగా ఆమె కచునిపై మోహంతో నేర్పకుంటే, అతడు లేనిదే నేను జీవించనని చెప్తుంది. చివరికి ఆ విద్యను దేవయానికి నేర్పగా ఆమె తన తండ్రిని బ్రతికిస్తుంది. ఆమె నుండి ఈ విద్యను విని కచుడు గ్రహించి, శుక్రాచార్యుడితో ఈవిధంగా అంటాడు. ఇక్కడ ఉంటే నన్ను రాక్షసులు బ్రతకనివ్వరు అని చెప్పి సెలవుతీసుకొని బయలుదేరతాడు. అప్పుడు దేవయాని నన్ను వివాహం చేసుకొని ఇక్కడే

ఉండమని కచునితో అంటుంది. కానీ కచుడు నీవు గురువు కుమార్తెవు కావున నాకు చెల్లెలితో సమానం అని అంటాడు. అప్పుడు ఆమె నేను నిన్ను ప్రతికించాను, నీయందు ఎన్నో ఆశలు పెట్టుకున్నాను అని ఎంతో చెప్పింది కానీ అతడు ఆమె మాట లెక్కచేయక తనకు మృతసంజీవనీ విద్య లభించిందని సంతోషించాడు. చివరికి కచుడితో ఆమె నన్ను తిరస్కరించినందులకు ఈ విద్య నీకు ఉపయోగపడదు అని శపించింది. కానీ కచుడు నావల్ల విద్య నేర్చిన వారి వాళ్ళకు ప్రయోజనం కల్గుతుందని భావించి ఆమెతో "నిన్ను బ్రాహ్మణుడు కాకుండ ఇతరుడు వివాహం చేపట్టుగాక" అని ప్రతి శాపమిచ్చి అక్కడినుండి వెళ్ళిపోయాడు. ఈవిధంగా మోహం వల్ల తన ఉనికిని, సర్వస్వాన్ని కోల్పోయిందని మనకు దేవయాని వృత్తాంతం తెల్పుతుంది.

ఇంకా మహాభారతంలో మోహావేశం వల్ల కీచకుడు తన ప్రాణాలు కోల్పోయాడు

**నీవును బ్రహ్మచారి వినీతుడ, నేనును కన్యకను మహీ**
**దేవకులావతంస రవితేజ ! వివాహము నీకు నాకు మున్** ( ఆ.మ.భా.ఆది.తృ. 126)

ఇలాంటి ఎన్నో ఉదాహరణాలైన కథలు నకు కనిపిస్తాయి. కావున మోహాన్ని మానవుడు జయించాలని ఈ పాత్రలు, వృత్తాంతాలు మనకు సందేశాన్ని ఇస్తున్నాయి.

**5) మదం**

మదం అనగా గర్వం లేదా అహంకారం అని అర్థం. ఈ గర్వం అనేది ధనం, అధికారం వల్ల కల్గుతుంది. అవి లేనప్పుడు వారిలోని మదం నశిస్తుంది. దీనికి ఉదాహరణగా మహాభారతంలో అనేక కథలు కనిపిస్తాయి. వాటిలో ఒకటి రెండింటిని ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

పూర్వం పురూరవ చక్రవర్తి ఈ భూమిని, 13 ద్వీపాలను జయించి మహాశౌర్యంతో, మదాంధుడై బ్రాహ్మణ ఉత్తములను, వారి ధనాన్ని ధనాశాపరుడై అపహరించాడు.

**ఇమ్మహి త్రయోదశ ద్వీపమ్ముల దన శౌర్యశక్తి పాలించి మదాం**
**ధ్యమ్మున విప్రోత్తముల విత్తముల దానపహరించి ధన లోభమున్ !** (ఆం.మ.భా.ఆది. తృ. 60)

చివరికి తన మదం వల్ల ప్రజల వ్యతిరేకతను పొంది తన రాజ్యాన్ని కోల్పోయాడు. అదేవిధంగా మరొక సందర్భంలో విశ్వామిత్రుడు వేటకు వెళ్లి జంతువులను వేటాడి ఆ వనంలో ఉన్న వసిష్ఠుని ఆశ్రమానికి బడలికతో రాగా ఆయన తన దగ్గర వున్నా కామధేనువు వల్ల వారి ఆకలిని తీర్చాడు. ఆ ధేనువు పేరు "నందిని" దానిని చూసి విశ్వామిత్రుడు నాకు దానిని ఇస్తే వెయ్యి గోవులు, ధనము, రాజ్యము ఇస్తానని అన్నాడు. అంతేకాక మదంతో బ్రహ్మణుని దగ్గర ఈ విశిష్టమైన గోవు ఎందుకు రాజు దగ్గర ఉండాలి అని ఆయనను తక్కువ చేసి మాట్లాడతాడు కానీ ఆ బ్రహ్మర్షియైన వసిష్ఠుడు అంగీకరించలేదు. బలవంతంగా ఆగోవును తీసుకువెళ్లాలని ప్రయత్నించగా దాని నుండి అనేక బాణాలతో కూడిన సైన్యం ఆ రాజును ఓడించింది. అప్పుడు రాజర్షి కంటే బ్రహ్మర్షి గొప్పవాడని తెలుసుకుంటాడు. తన రాజ్యం, సర్వస్వాన్ని వదిలివేసి తపస్సు చేస్తాడు అనగా మదం వల్ల కలిగే నష్టాన్ని మనం గ్రహించాలి.

**6) మాత్సర్యం**

మాత్సర్యము అనగా అభిమానం. ఇది ఒక వ్యక్తికీ మరోవ్యక్తి లేదా తన పుత్రులపై, మిత్రులపై, బంధువులపై కలుగవచ్చు. ఇది కూడా అనర్థదాయకమే. ఈ మాత్సర్యము వల్లనే ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికి రాజ్యాధికారం ఇచ్చి, ఎన్ని తప్పులు చేసిన వారిని రక్షిస్తూ వచ్చాడు. దీనివల్ల పాండవులకు అన్యాయం చేశాడు. తన కుమారునికి రాజ్యాధికారం వల్ల కీర్తి, ప్రతిష్టలు వస్తాయని భావించాడు కానీ చివరికి కురు పాండవ యుద్ధంలో తన కుమారులను కోల్పోవలసి వచ్చింది. అదేవిధంగా వినత కద్రువల వృత్తాంతం కూడా ఓర్వలేని తనాన్ని గురించి తెలిపేది.

మానవుడు వీటినుండి ఏ విధంగా బయట పడాలి అని తెలుపుతూ కొన్ని ధర్మోపదేశాలు మనకు బోధించారు. వాటిలో తపతీ సంవరణోపాఖ్యానములో

**బలమారి కామక్రోధం**
**బులు రెండు జయించబడి తపో వీర్య బలం**
**బుల జేసి చేయునవి ని**
**చ్చలు నెవ్వనినియేని పాద సంవాహంబుల్ ! (ఆ.మ.భా.ఆది. సప్తమా.ఆ.64 పద్యం)**

ఎల్లప్పుడూ ఎవరి పాద సేవనం చేస్తే కామక్రోధాలు రెండు బలహీనాలై జయించబడి తపస్సు యొక్క ప్రభావాతీశాయలచేత మనకు వశ లైతాయో వారే వశిష్ఠమహర్షి. అనగా మహానుభావులైన ఋషులను సేవించాలని అర్థం.

**జలములందు యుందు సర్వ లోకంబులు**
**గాన నీమహోగ్ర కలశ వహ్ని**
**జలధిలోన విడిచి................( ఆ.మ.భా.ఆది. సప్తమా.ఆ.148 పద్యం)**

పై పద్యంలో పితృదేవతలు ఔర్వునితో ఈవిధంగా చెప్పారు. అన్ని లోకాలు నీటిలోనే ఉంటాయి కనుక మహాభయంకరమైన నీకోపాగ్నిని సముద్రంలో విడిచిపెట్టి నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకో. అది సముద్రంలో నీటిని దహిస్తుంది.

ధర్మవ్యాధుడు కౌశికునకు ధర్మవిశేషంబు ఈ విధంగా చెప్పాడు.

**విడువవలయు విషయవిష వాంఛల నెద**
**విడుపుబోలు గుణము వెదకి యందు**
**గానరైరి బుధులు గలదె పరిత్యాగ**
**శీలునకు నాసాధ్య సిద్ధి యెందు. (ఆ.మ.భా.ఆది. సప్తమా.ఆ.పంచమ.ఆ .38 పద్యం.)**

ఇంద్రియ సుఖాలపై కోరిక హృదయపూర్వకంగా వీడాలి. త్యాగంతో సమానమైన లక్షణం ఎక్కడా లేదని పెద్దలు అనుభవపూర్వకంగా వివరించారు. అంతేకాక మరికొన్ని విషయాలు బోధించారు.

మంచిగుణాలు సిద్దించాలంటే సదాచారాన్ని శిష్టాచారాన్ని పాటించాలి. కేవలం ఉపకారార్థం మన ధనాన్ని ఇతరులకు ఇవ్వాలి, ఎల్లప్పుడూ నిజమే మాట్లాడాలి. ఇంద్రియాలను, మనస్సును నిగ్రహించుకోవాలి, క్రతువులను నిర్వహించి విశ్వశ్రేయస్సుకు పాటుపడాలి, ఇతరులను మోసగించకూడదు దీనివల్ల అరిషడ్వార్గాలను జయించవచ్చు. అంతేకాక మనకు విద్యాదానం చేసిన గురువులను ఎల్లప్పుడు గౌరవించాలి, మితభాషణం, హితభాషణం, ప్రాణులపట్ల దయకలిగి ఉండాలి ఈవిధంగా మానవుడు కామక్రోధాలనే మోసాలతో కూడివున్న ఇంద్రియాలనెడినీతితో నిండిన సముద్రాన్ని దాటడానికి ధైర్యం అనే పడవ అవసరం. అప్పుడు నీ ప్రవర్తనను తీర్చిదిద్దుకొని ధన్యుడవు అవుతావు. అని ఈ ఉపదేశాన్ని కౌశికుడు ధర్మవ్యాధునితో చెప్పాడు కావున ఇంద్రియాలను అదుపులో ఉంచుకుంటే అరిషడ్వార్గాలను జయించవచ్చు అని మహాభారతం మనకు బోధిస్తుంది.

**ఆధారగ్రంథాలు**

1. వెంకటేశ్వర్లు,చిలుకూరు.శ్రీమదాంధ్రమహాభారతము(1,2).హైదరాబాద్:రామకృష్ణమఠం, 2018.
2. శ్రీమదాంధ్రమహాభారతము(సరళవ్యాఖ్యానసహితం).సంపుటలు1/15(తిరుపతి:తిరుమల తిరుపతి దేవస్థానము, 2013.
3. ఉమాదేవి,ముదిగొండ. మహాభారత ఉపాఖ్యానము. హైదరాబాద్ కిషన్ ఆర్ట్ ప్రింటర్స్, 2018.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 5 (2) హైదరాబాద్ మార్చి : 2024

# 65. నేటి మహిళలకు "గాంధారి" ఆదర్శమేనా?

- డా॥ గుంటుపల్లి గౌరి, మాచర్ల

*సర్వేత్ర సుఖనః సస్తు సర్వేసన్తు నిరామయాః*
*సర్వే భద్రాణి పశ్యన్తు మాకశ్చిద్దుఃఖమాప్నుయాత్*

అందరూ సుఖంగా ఉండాలి, అందరూ ఆరోగ్యంగా ఉండాలి అందరూ శుభానిన చూడాలి. ఏ ఒక్కనికీ దుఃఖం కలుగ కూడదు అనేది భారతీయుల భావన. ఈ భావాన్ని ప్రచారం చేయటానికే భారతీయ వేద, పురాణ, ఇతిహాస కావ్యాలు విశేషంగా కృషిచేశాయి. ఇతిహాసంగా ప్రసిద్ధిగన్న మహా గ్రంథం మహా భారతం. ఆసక్తికరమైన విషయం ఏమంటే మహాభారతం ప్రపంచంలోని గ్రంథాలన్నింటిలోకి గొప్పది. ఉదాహరణకు "ఇలియడ్," "ఒడెస్సీ," – అనేవి గ్రీకుల ప్రాచీన ప్రసిద్ధ వీరకావ్యాలు. మహాభారతం ఆరెండింటి కన్నా అనేక రెట్లు పెద్దది. ఈ పెద్దతనం ఒక్క పరిమాణంలోనేగాక, పాత్రచిత్రణ, భావాల వైవిధ్యంవంటి అంశాల్లో స్పష్టంగా తెలుస్తుంది.

ఉగ్రశ్రవసుడు (సూతుడు) శౌనకాది మహామునులకు భారత కథనంతా చెప్పి చివర ఇలా అంటాడు – "యదిహాస్తి తదన్యత్ర, యన్నే హాస్తినతత్ క్వచిత్" ఇందులో ఉన్నవే అన్నిచోట్లా ఉన్నాయి. ఇందులో లేనిది వేరే ఎచ్చటా లేదు అని ప్రచారం పొందిన మహాభారతానికి విశ్వ సాహిత్యంలోనే ప్రత్యేక స్థానం వుంది. లక్ష శ్లోకాలకు పైగా ఉన్న మహాకావ్యం మహాభారతానికి సమానమైన గ్రంథం ప్రపంచం మొత్తంమీద వేరే ఏ భాషలోనూ లేదు. ఇంత లౌకికమైన కథ, మానవ జీవితంతో పెనవేసుకుపోయిన పాత్ర చిత్రణ కూడా ఇంకే గ్రంథంలోను లేదు.

## సంస్కృత మహా భారతము

భారతీయ విజ్ఞాన సర్వస్వం, పంచమ వేదంగా ప్రసిద్ధమై, వ్యాస మహర్షి సంస్కృత భాషలో రచించబడిన మహేతిహాసము మహాభారతము. వ్యాసునికి కృష్ణద్వైపాయనుడు, విష్ణుని సన్నిభుడు, బాదరాయణుడను నామములు కూడ ఉన్నాయి. వ్యాసుడు మొట్టమొదట "జయ" మను పేర 8800 శ్లోకములలో భారతమును రచించగా తర్వాత అది 24000 శ్లోకములకు పెరిగి భారత ఇతిహాసమైనది. వ్యాసుని శిష్యులైన నారద, దేవల, శుక, జైమిని, వైశంపాయనులు భారతమును చెప్పారు. దానిని విని వచ్చి, నైమిశారణ్యంలో సాగుతున్న సత్రయాగములో, ఉగ్రశవసుడను సూతుడు శౌనకాది మహామునులకు 1,20,000 శ్లోకములతో చెప్పగా అది మహాభారతమైనది. మహాభారతము పంచమ వేదముగా ప్రసిద్ధి కెక్కినది. ఈ భారతము "భారతీయ సంస్కృతీ విజ్ఞాన సర్వస్వంని Encyclopedia of Indian Wisdom and Culture" గా ప్రశంసింపబడింది. మహాభారతము క్రీ.పూ. 1000 ప్రాంతములో వ్రాయబడి యుండునని చరిత్రకారుల అభిప్రాయం. సంస్కృత భారతము నూరు పర్వములుగా విభజింపబడినది. తెలుగు భారతము 18 పర్వముల విభాగమును పొందినది. వ్యాస మహర్షి "కౌరవ పాండవ వంశ చరిత్ర ప్రధానముగా గ్రహించి నాటి సమస్త రాజవంశాల చరిత్రను సంగ్రహించి రచించినందున మహాభారతం ఇతిహాసమైనది. మహాభారతమందు విస్తృతమైన ఇతిహాసం ప్రపంచ భాషలలో దేనిలోను లేదు. మధుర కవిత్వానికి రామాయణాన్ని, రాజనీతిజ్ఞతకు మహాభారతం, చదవాలని ప్రసిద్ధ లోకోక్తి.

## ఆదికవి నన్నయ – భారతాంధ్రీకరణ

తెలుగులో మహాభారత రచన క్రీ.శ. 11వ శతాబ్దములో ప్రారంభమైన తర్వాత 13వ శతాబ్దంలో తిక్కన, 14వ శతాబ్దములో ఎఱ్ఱన రచించుటతో పూర్తి అయినది. మహాభారతాన్ని రచించిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడలు "కవిత్రయము"గా ఆంధ్రసాహితీ జగత్తులో ఖ్యాతిగాంచారు. తూర్పు చాళుక్య వంశపు రాజు రాజరాజనరేంద్రుని ప్రేరణతో మహాకవినన్నయ

మహాభారత రచనకు పూనుకొన్నట్లు భారతావతారికవల్ల తెలుస్తుంది. నన్నయ వేదవ్యాసుని దుర్భరతపోవిభవాధికునిగా, అంబురుహగర్భనిభునిగా, “గురుపద్య విద్యకు నాద్యుని”గా కొనియాడారు.

మహాభారత ప్రాశస్త్యము కొనియాడుతూ నన్నయ –

**‘ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మ విదులు వేదాంతమనియు,**
**నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని, కవి వృషభులు మహాకావ్యమనియు,**
**లాక్షిణికులు సర్వలక్షణంబనియు, యైతిహాసికులితిహాసమనియు,**
**బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చయంబని, మహిగొనియాడుచుండ**
**వివిధ వేద తత్త్వ వేది, వేదవ్యాసు**
**డాదిముని, పరాశరాత్మజుండు**
**విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై**
***పరగు చుండ జేసే భారతంబు”***

అని వర్ణించాడు. ఇతిహాసికు లితిహాసమని పొగడిన మహా భారతమును నన్నయ విశ్వశ్రేయోదాయకమైన మహాకావ్యముగా తీర్చిదిద్దాడని చెప్పవచ్చును.

మహాభారతానికి 4 వేదాల తరువాత అంతటి పవిత్రత, ప్రాముఖ్యతగల గ్రంథం అనే ప్రఖ్యాతి ఉన్నది. అందుకే దీనిని పంచమవేదం అన్నారు. మహాభారతంలో మొత్తం 18 పర్వాలున్నాయి. పండితులు దీనిని వేదాంతమని, కావ్యమని, ఇతిహాసమని, నీతిశాస్త్రమని ఎన్నో విధాలుగా ప్రశంసిస్తున్నారు. కాబట్టే వేదాల తరువాత స్థానాన్ని ఆక్రమించి పంచమవేదంగా ప్రసిద్ధి చెందింది. మహాభారతాన్ని ఎందరో కవులు ఎన్నో భాషలలోనికి అనువాదం చేసారు. మనకు తెలుగులో ముఖ్యమైన అనువాదం నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడ అనే కవిత్రయం వారు చేసిన అనువాదం. ఇది అతి శ్రేష్టమైనది. భారతానికి భారతదేశీయ భాషలలో వచ్చిన ప్రాచీన అనువాదాలలో నన్నయ అనువాదం విశిష్టత గలది. మహాభారత కథ ప్రపంచంలోని అన్ని భాషలలోనికి అనువదించబడింది. మహాభారతం ధర్మప్రబోధితం చేసినట్లు భారతీయులను మరే గ్రంథం చేయలేకపోయింది. అందుకే భారతదేశంలోని ప్రతి స్థలానికి ఏదో ఒక విధంగా భారత కథతో అవినాభావ సంబంధం కలుపబడింది. ప్రపంచాన్ని ధర్మోద్దీపితం చేసి వెలుగు దివ్వెగా వెలుగుతున్న మహా భారతం భారతీయులకే కాదు మొత్తం ప్రపంచ ప్రజలకు ధర్మ ప్రేరకమే.

## గాంధారి పాత్ర పరిచయం

గాంధార దేశపురాజు సుబలుడు. సుబలుడికి నలుగురు సంతానం. వారు (1) గాంధారి, (2) శకుని, (3) వృషకుడు, (4) అచలుడు. ఉలూకుడు శకుని కొడుకు. ఈ శకుని ధర్మరాజును జూదంలో వంచన చేస్తాడు. కురుక్షేత్ర యుద్ధంలో నకుల, సహదేవుల చేతిలో శకుని మరణిస్తాడు. సుబలుడి కూతురు మరియు శకునికి అక్క అయిన గాంధారి ధృతరాష్ట్రుడి భార్య కౌరవుల తల్లి, శివభక్తురాలు. ఈమెకు శివుడు వందమంది కొడుకులు పుడతారని వరమిస్తాడు. వారే కౌరవులు. ఈమె కూతురు దుస్సల. భర్త అంధుడని తానూ జీవితాంతం అంధురాలిగానే ఉండదల్చుకొని కళ్ళకు గంతలు కట్టుకుంటుంది. కురుక్షేత్ర యుద్ధం తరువాత వ్యాసుడి హితవచనాలు విని పాండవుల్ని తన కొడుకుల్లాగానే చూస్తుంది. తరువాత ఆమె అడవులకు పోయి దావానలంలో మరణించి కుబేర లోకం చేరుకుంటుంది.

## గాంధారి వ్యక్తిత్వం – సమకాలీనత

పగ, ద్వేషం, ప్రతీకారం, ఈర్ష్యకు లోనైన కౌరవులు పోరుకు సిద్ధపడటం, తద్వారా కలిగిన పరిణామాలకు

ఫలితంగా స్త్రీ పర్వంలో గాంధారి, కుంతి మొదలగు స్త్రీల మనఃప్రవృత్తుల చిత్రీకరణలో శోకరసం పెల్లుబికింది. ఆంధ్ర మహాభారతం 'స్త్రీ పర్వం'లో ప్రధాన పాత్ర వహించిన గాంధారి నేటి అత్యుత్తమ న్యాయ దేవతకు ప్రతీక. భారత యుద్ధానంతరం యుద్ధ భూమిలో పడిఉన్న మానవ శరీరాలను చూసినపుడు కలిగే మనోవేదనను గురించి, ప్రతి వ్యక్తియొక్క చావుకు మూల కారణాన్ని విశ్లేషిస్తూ, కళ్ళకు కట్టినట్లు కవి 'స్త్రీ పర్వం'లో పేర్కొనటం ఒక భౌతిక వాస్తవికత. దైవం దృష్టిలో జీవులందరూ ఒకటి అని, వారు చేసిన చెడ్డపనులను బట్టి చెడు ఫలితాలను పొందక తప్పదని భావిస్తుంది గాంధారి. కురుక్షేత్ర యుద్ధానికి కారణం రాజ్యకాంక్ష అని దానికోసం కౌరవ పాండవులు కొట్టుకు చచ్చారని భారతరణాన్ని గురించిన అభిప్రాయం. కాని ఆ యుద్ధాన్ని స్త్రీల దృక్కోణం నుంచి చూసినపుడు దుర్యోధనుని 'దుర్మదం' కారణంగా యుద్ధం జరిగిందని, అన్నదమ్ముల మధ్య వారసత్వపు పోటీలో విజయం సాధించలేక వారి భార్యలపై లైంగిక హక్కును కలిగి ఉండాలను కోవడంగా భారత కథ అర్థమౌతుంది. దాని పట్ల ద్రౌపది నిరసన చూపించటమే కురుక్షేత్ర యుద్ధానికి కారణం అయింది.

కుటుంబానికే పరిమితమయినా స్త్రీలది కూడా స్పందించే హృదయం, సహజ జ్ఞానము కల మెదడు గల శరీర నిర్మాణము కలది మానవ జన్మయే కాబట్టి స్త్రీ, పురుష సంబంధాలలోని సంక్లిష్టతలకు స్త్రీలు సంఘర్షిస్తూ తమ స్పందనలను మౌనంగానూ, మాటల రూపంలోనూ, చేష్టల రూపంలోనూ వ్యక్తం చేస్తారని ఈ స్త్రీ పర్వంలోని గాంధారి, కుంతి మొదలగు పాత్రల ద్వారా తెలుస్తుంది. స్త్రీకి ఎంతటి సహన శక్తి ఉన్నా పైకి ఉబికి వచ్చే మాతృత్వ మమకారాలు బాధకు గురిచేస్తాయి. అయితే ఈ స్వార్థాన్ని అధిగమించి సాటి స్త్రీల బాధలను అవగాహన చేసుకొని మాతృత్వం కంటే మహిళా న్యాయమే గొప్పదని ఋజువు చేసింది గాంధారి పాత్ర. ఇది స్త్రీ పర్వంలోని భారత రహస్యాల నగిషీ కాంతులను దర్శించి, మహిళా జనజీవన అధ్యయన దృక్పథంతో చూడగలిగినపుడే అర్థమౌతుంది.

స్త్రీ పర్వంలో పుత్ర, పౌత్ర, భాతృ, భర్తల శవాలపై పడి శోకసంద్రంలో మునిగిన స్త్రీల గుండెలలోని బాధ గాంధారి పాత్ర ముఖంగా బయటపడింది. గాంధారి ఏకకాలంలోనే దుర్యోధనుని తల్లిగా, తోటి స్త్రీల పాలిట న్యాయదేవతగా రాణించగలిగింది. స్త్రీలు న్యాయమూర్తులైతే న్యాయమైన తీర్పు ఇవ్వటానికి క్రొత్త ఒరవడిని చూపించిన పాత్ర గాంధారి. రాజసూయ యాగానంతరం పాండవులపై అధికృతను సాధించలేని దుర్యోధనుడు ప్రతీకారంతో వారి భార్యయైన ద్రౌపది యొక్క 'లైంగికత'పై అధికారాన్ని పొందాలనుకుంటాడు. అందుకనే సభలోనికి ద్రౌపదిని తెప్పించి ఆమె భర్తల ఎదుటనే ఆమెను తన తొడపై కూర్చోమని చెపుతాడు. కులగురువులు, వృద్ధులు ఉన్న ఆ సభలో నిర్భయంగా ఆమె లైంగికతపై వేధింపు రూపమున అధికారాన్ని, ఆధిపత్యాన్ని దుర్యోధనుడు కోరుకోవటమే కారణంగా కురుక్షేత్ర యుద్ధం జరిగిందంటే ఆశ్చర్యం కాదు.

కురుక్షేత్ర యుద్ధం పైపైకి రాజ్యకాంక్షకు సంబంధించినదిగా కనపడుతుంది. ప్రజలేకాక పెద్దలైన వ్యాసుడు, సంజయుడు, దృతరాష్ట్రుడు కూడా పాండవులకు వారి రాజ్యాన్ని దుర్యోధనుడు ఇచ్చి ఉంటే యుద్ధం జరిగేది కాదని భావిస్తారు. దృతరాష్ట్రుడు కొడుకును అలా ఒప్పించగలిగితే కౌరవనాశనం తప్పేదని భావించడం పైకి కనపడే పితృస్వామ్య రాజకీయ విషయం. స్త్రీ దృక్కోణం నుంచి చూస్తే దుర్యోధనుని 'దుర్మదం' కారణంగా యుద్ధం జరిగిందని అర్థమవుతుంది. ఇటువంటి స్వభావం గలిగిన దుర్యోధనుణ్ణి అసూయలేని మనస్సుతో చూడగలిగింది గాంధారి. అందుకే కొడుకు యుద్ధానికి వెళుతూ వినయ విధేయతలు చూపించి దీవించమని వచ్చినపుడు 'ధర్మం ఏ తలనుండు అచ్చట జయం కలుగుతుందని' చెప్పిన ధర్మమూర్తి. మాతృ భావనను అధిగమించి–దుష్టాత్ముడైన దుర్యోధనుడు చచ్చిపోవడం బాధగా అనిపించలేదని, పాండవులు కౌరవులను చంపినందుకు కూడా బాధపడటం లేదని భీముడు దుర్యోధనుని నాభిక్రింద కొట్టి చంపటం, క్రూరాత్ముడైన దుశ్శాసనుని పచ్చి నెత్తురు త్రాగడం, యుద్ధ నీతికి విరుద్ధంగా చంపినందుకు సమర్థించుకొనే ప్రయత్నంలో మహిళా న్యాయంకంటే కూడా పితృస్వామ్యానికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చిన విషయాన్ని గుర్తించక తప్పదు.

నూరుగురు కొడుకులు ఒక్కసారిగా మరణించినందుకు తల్లిగా తన మనస్సు తల్లడిల్లుతున్న గాంధారికి భీముని మాటలలో స్ఫురించిన ద్రౌపది అవమానం గుర్తుకు రాగానే మాతృత్వం మాయమయి ధర్మదృష్టితో మహిళా న్యాయాన్ని ఆలోచింపచేసి ఆచావు 'సావదగునన్నీచునకు' అని దుర్యోధనుణ్ణి గురించి గాంధారి భావించేటట్టు చేసింది. దుశ్శాసనుడు భీముని చేతిలో మరణించినపుడు కూడా గాంధారి తన రక్తం పంచుకు పుట్టిన కొడుకు చావుకోసం మాతృవేదన పద్ద దానికంటే కూడా ద్రౌపది వస్త్రాపహరణ గుర్తుకు వచ్చి మహిళకు జరిగిన మానహాని ముందు మాతృభావన మటుమాయమవుతుంది. అందుకే సాటి స్త్రీకి చిన్న దుఃఖం వచ్చినా దానినుండి వారిని బయట పడవేయగల శక్తి స్త్రీలకే ఉంటుందని చెప్పవచ్చు. పుత్రుల్ని కోల్పోయిన దుఃఖంలో ఉన్న ద్రౌపదితోనూ, మనవళ్ళన కోల్పోయిన కుంతి దుఃఖంలోను గాంధారి పాలుపంచుకొని మాతృవేదనను అనుభవించిన దానికన్నా మహిళా న్యాయానికే ప్రాధాన్యత నిచ్చి, మానవత్వానికి విలువనిచ్చిన వ్యక్తిగా కనబడుతుంది గాంధారి. "స్త్రీకి స్త్రీ శత్రువు" అన్న వ్యతిరేక నినాదాన్ని పునాదులతో సహా రూపుమాపిన ఒక ఉన్నతమైన స్త్రీ మూర్తిగా దర్శనమిస్తుంది.

దుర్నీతిపరుడైన దుర్యోధనుడు ద్రౌపది విషయంలో చేసిన అవినీతి పని ఆమె హృదయాన్ని తల్లడింప జేసింది. కొడుకుపైనున్న గ్రుడ్డి ప్రేమను తగ్గించుకొని అటువంటి కొడుకు బ్రతికి ఉండటం కంటే చావటం మేలని భావించింది. కొడుకు చావుకంటే కోడలి దుఃఖం ఆమెను ఎక్కువగా బాధపెడుతుంది. ఇక్కడ సాటి స్త్రీ దుఃఖాన్ని పంచుకోవటంతో పాటు గుడిపాటి వెంకటాచలంలాగా 'స్త్రీకి శరీరం ఉంది హృదయం ఉంది' – స్పందనలు సహజమని గ్రహించగలుగుతుంది. సైంధవుడు గాంధారి అల్లుడు 'దుస్సల' భర్త. సైంధవుడు అరణ్యంలో ద్రౌపదిని బలాత్కరించి, ఆమెను అపహరించిన నాడే అతను చచ్చిపోతే స్త్రీలు భవిష్యత్తులో అపహరణకు గురికాకుండా ఉంటారని ఆలోచనకు వచ్చింది. అల్లుని మరణ దుఃఖం గాని దుస్సల వైధవ్యంగాని బాధను కలిగించలేదు. దీనిని బట్టి స్త్రీలను బాధించినవాడు అల్లుడైనా, కొడుకైనా ఒకేరకంగా న్యాయనిర్ణయం చేసిన గాంధారి న్యాయదేవత. దీనిని బట్టి "మగజాతి చరిత్ర సమస్తం మహిళా వేదన పరాయణత్వం" అన్న భావన స్ఫురించక మానదు. ఒక్క గాంధారి పాత్ర పోషణ విషయంలోనే కాదు పూరాణేతిహాసాల కాలంలో సాహిత్యంలో స్త్రీశక్తి ఆవిష్కరణను రికార్డు చేయాలనుకున్న తిక్కన, ఎర్రన, పోతన, నాచన సోమనలకు గల హృదయ స్పృహ ప్రపంచ సాహిత్య చరిత్రలోని స్త్రీల సాధికారికతకు అగ్రతాంబూలం ఇచ్చిన ఘనత తెలుగు సంప్రదాయ సాహిత్య విమర్శకు దక్కగలిగింది. మరియు స్త్రీలు అబలలు కారు సబలలే అని వారి రచనల ద్వారా నిరూపించారు.

దుర్యోధన, దుశ్సాసన, సైంధవుడు, కీచకుడులాంటివాళ్ళు ఈ సమాజంలో ఉన్నంతకాలం స్త్రీలపై, బాలికలపై అత్యాచారాలు జరుగుతూనే ఉంటాయి. ఈ నాటికి నిత్యం మనకళ్ళముందు జరుగుతూనే ఉన్నాయి. గురజాడవారి కన్యకలాగా నేటికీ నిర్భయ, అక్షయ, అసిఫాలాంటి ముక్కుపచ్చలారని పసికందులు మరియు దిశాలాంటి యువతులు బలైపోతూనే ఉన్నారు, ఉంటారు కూడ.

మహాభారతంలోని స్త్రీ పర్వంలో గాంధారి ఒక న్యాయమూర్తిగా దర్శనమిస్తుంది. నేడు స్త్రీలపై బాలికలపై జరుగుతున్న లైంగిక హింసకు, నేరాలకు తగిన శిక్ష వేయగలిగే హృదయం, చైతన్యం ఉన్న మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తులు (పురుష న్యాయవాదులు, పురుష న్యాయమూర్తులు కూడా) నేటి ఆధునిక కాలంలో రాగలిగితే ఈ అత్యాచారాలను చాలావరకు అరికట్టవచ్చు. స్త్రీల విషయంలో నేరాలకు పాల్పడ్డవాడు కొడుకైనా సరే శిక్షకు గురిచేయగల హృదయం ప్రతి తల్లికీ, తండ్రికీ ఉండాలని కోరుకుంటున్నాను.

అలాగే ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి పాటిబండ్ల రజనీగారు అధ్యాపకులు విద్యార్థినులకు –

*'కప్పల్ని కబళించే పాముల్ని గురించే కాక*

**కనుపాప' ల్నే కాటేసే రెప్పల విపరీతాన్ని కూడా**

***ఒప్పుల కుప్ప వయసప్పట్నుంచే హెచ్చరించండి"* అన్నారు**

అంతేగాక ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న పరిస్థితుల్ని, స్థితిగతుల్ని వాటిని ఎదుర్కొనే ధైర్యసాహసాలను నేర్పే పాఠ్యాంశాల్ని సిలబస్‌లో చేర్చాలనే అభిప్రాయాన్ని కూడా ఆమె వ్యక్తం చేశారు.

పై అంశాలన్నింటిని బట్టి కవిత్రయ మహాభారతం – స్త్రీ పర్వంలోని ప్రధానపాత్ర వహించిన "గాంధారి" నేటి మహిళలందరికి ఆదర్శమే.

**ఆధారగ్రంథాలు**

1) ఆంధ్రమహాభారతం
2) తెలుగు సాహిత్యం – మహిళా చైతన్య ప్రస్థానం.
3) తెలుగు సాహిత్య చరిత్ర
4) 'రెప్ప కాటేసిన పాప కథ' కవిత – పాటిబండ్ల రజని.

# 66. అంబోపాఖ్యానం - వర్తమాన సమాజ సమాలోచనం

– డా॥ టి. రాజశేఖర్, తిరుపతి

భారతీయులు తమ వాఙ్మయ సంపద గురించి సగర్వంగా చెప్పుకోగలవి ప్రపంచంలో అపారమైనవి ఎన్నోవున్నాయి. వాటిలో వేదోపనిషత్తుల ద్వారా ఆవిర్భవించిన రామాయణ భారత భాగవతాలు భారతీయ సంస్కృతిని, ఆ ఆత్మను ఆవిష్కరిస్తున్నాయి. ఈ మూడు గ్రంథాల్లోకెల్లా మహాభారతం పరమోత్కృష్టమైన గ్రంథం. రామాయణ భాగవత కథలు కూడా భారతంలోనే ఉన్నాయి. పాతాళలోకం మొదలుకొని మర్త్యలోకం, స్వర్గలోకాల్లో జరిగే అన్ని కథలు ఇందులో ఉన్నాయి.

**"ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ**
**యది హాస్తి తదన్యత్రీ యన్నేహాస్తి నతత్ క్వచిత్"**

అని సంస్కృత భారతకర్త వ్యాసుడు ప్రతిజ్ఞపూని రాశాడు. ధర్మార్థకామమోక్ష సాధన గావించడం కోసం ఈ గ్రంథం రాయబడింది. ఇందులో ఉన్నది ప్రపంచమంతా ఉంది. భారతంలో లేనిది ఎక్కడా లేదని ప్రతిపాదించాడు. అందుకే మహాభారతం పంచమవేదంగా భాసిల్లింది. మానవులకు మహాభారత స్వరూపం సమగ్రంగా అర్థమయితే పరమాత్మ సాక్షాత్కారం లభించినట్లేనని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన మహాభారతం తెలుగుసాహిత్యంలో ఆదికావ్యంగా రాయబడింది.

కవిత్రయ మహాభారతం సర్వలక్షణ గ్రంథం. ఆంధ్రమహాభారతం లాంటి గ్రంథం మరే ఇతర భాషల్లో లేదనడం అతిశయోక్తి కాదు. ఇది సోత్కర్ష కాదు. వాస్తవం. ఆంధ్ర మహాభారతాన్ని ఆమూలాగ్రం చదివి వాస్తవంగా అర్థం చేసుకున్న ప్రతిఒక్కరు తెలుగుభాషను, మాధుర్యాన్ని, ధర్మార్థకామమోక్ష సూక్ష్మాలను, సత్యాసత్య విమర్శలను, వీరత్వాన్ని, భీరత్వాన్ని, ధనప్రాధాన్యతను, ధనేతర వస్తువుల ఆధిక్యతను, రాజరికాన్ని, బానిసత్వాన్ని ... ఇలా ప్రపంచంలో కనిపించే ప్రతిఒక్క అంశాన్ని గ్రహించగలుగుతాడు. సకలార్థ సారమని ఒప్పుకొని తీరుతాడు. అలాంటి మహాభారతం ప్రధానంగా కౌరవపాండవుల కథగా బాహ్యప్రపంచానికి తెలిసినప్పటికి ఆ భారత ఆఖ్యాన పరంపరలో ఎన్నో ఉపాఖ్యానాలు చోటుచేసుకున్నాయి. ఆంధ్రమహాభారతం దాదాపు 158 ఉపాఖ్యానాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి కథకు ఒక నిబద్ధత ఉంటుంది. దాని వెనక ధర్మార్థ సూక్ష్మము ఎంతో ప్రేరణ కలిగిస్తుంది. తెలుసుకున్న క్షణం జన్మ సార్థకత అనిపించక మానదు.

ప్రత్యేకంగా కథలు చెప్పే పద్ధతిని 'ఆఖ్యానం' అంటారు. అది ప్రధాన కథ. ఆ ప్రధాన కథలో ఆఖ్యానం కంటే చిన్న కథను "ఆఖ్యానం" అంటారు. స్వయంగా చూసి చెప్పే కథను ఆఖ్యానం అంటారు. దీనికంటే భిన్నమైనది ఉపాఖ్యానం. ప్రధాన కథకు ఉపాఖ్యానాలు కానీ, ఆఖ్యానకాలు కానీ చోదకత్వాన్ని కలిగిస్తాయి. ప్రధానకథకు శ్రేష్ఠత్వాన్ని కలిగిస్తాయి. కవిత్రయ భారతంలో అలా ప్రధాన కథకు శ్రేష్ఠత్వాన్ని సార్థకతను చేకూర్చిన కథ అంబోపాఖ్యానం. ఈ అంబోపాఖ్యానం మహాభారత ఘట్టాన్ని మహాకవి కవిబ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు అనే బిరుదులు కలిగిన తిక్కన సోమయాజి రచించిన ఉద్యోగపర్వం నాలుగో ఆశ్వాసంలో ఉంది. కానీ ఈ అంబవృత్తాంతం ఆదిపర్వంలో కూడా నన్నయ భట్టారకుడు కూడా ప్రస్తావించాడు. కానీ ఈ అంబకు సంబంధించినటువంటి సంపూర్ణమైన తత్వం ఆమె యొక్క పాత్ర, ఆమె స్వభావం, ఆమె పడినటువంటి బాధలు మొదలైనవన్నీ కూడా ఉద్యోగపర్వం నాలుగో ఆశ్వాసంలో భీష్ముడిచేత చెప్పబడ్డాయి. అందువల్ల ఇది ఆఖ్యానకం అయింది. ఈ విషయాన్ని గురించి "భీష్ముడు చెప్పిన అంబోపాఖ్యానం ఆఖ్యానకం వంటిది. ఈ కథలో భీష్ముడు కన్నది, విన్నది, మునులు వివరించినటువంటి మూడు రకాల కథలు ముడిపడివుంది. భీష్ముడి ఆత్మకథలోని అంతర్భాగంగానే భీష్ముడి విషాదాంతానికి సూచికగాను, కౌరవ మహాసేనాధ్యక్షుడు చనిపోక తప్పదనీ కథార్థ సూచనానికి సంకేతంగాను ఈ ఉపాఖ్యానం చెప్పబడింది. ఇదే కథను కథకుడు చెబితే ఆఖ్యానమై ఉండేది. భీష్ముడు చెప్పడం మూలాన ఆఖ్యానకమయింది. అందులోనూ నారదుడు

చెప్పిన అంబవృత్తాంతం ఉపాఖ్యానంగా భాసిస్తోంది. అందువలన ఈ కథ ఆఖ్యానక, ఉపాఖ్యాన, కథాశిల్పాల త్రివేణీ సంగమం" అంటారు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు. అటువంటి విశిష్ట ఉపాఖ్యాన గ్రంథం ఈ అంబోపాఖ్యానం గురించి చర్చిస్తూ, అందులోని అంశాలను వర్తమాన సమాజంతో చర్చించడం ఈ వ్యాసోద్దేశ్యం.

'మనిషి' తనకు తెలియకుండానే జీవితంలో ఎంతో కొంత త్యాగాన్ని ఎవరో ఒకరికొరకు, ఏదో ఒక ఆశయసిద్ధి కొరకు చేయడం జరుగుతుంది. అయితే ఒకానొక సమయంలో కొందరి జీవితాల్లో తమ అభిరుచులకు, ఆశయాలకు, ఆవేశాలకు, వాంఛలకు విరుద్ధంగా, బలవంతంగా, తమకు తాముగా ఏదో ఒక త్యాగాన్ని, ఏదో ఒక రూపంలో చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడినప్పుడు ధీరులైనవారు వెనుదియ్యరు. అటువంటి ధీరులైన మగవారిలో 'భీష్ముడు', స్త్రీలలో 'అంబ' మనకు మహాభారంలో కనిపిస్తారు. అయితే భీష్ముడు తన తండ్రికోసం జీవితాన్ని పణంగా పెట్టాడు. 'అంబ' తన ప్రతీకారం తీర్చుకోవటానికి జీవితాన్ని వెచ్చించింది. పేరు ప్రఖ్యాతులు భీష్మునికి మాత్రమే వచ్చాయి.

దురదృష్టవంతులైన యీ ఇద్దరు పరస్పరం శత్రువులై ఎదురెదురుగా నిల్చి సాగించిన జీవితాన్ని గురించి చెప్పటమే నా ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

తండ్రి అభీష్టం నెరవేర్చటానికి భీష్ముడు తాను వివాహం మానివేశాడు. తండ్రికి వివాహం జరిపించాడు. ఇంతటి త్యాగి తన తమ్ములకు వివాహం జరిపించదలచి, ఆ ప్రయత్నంలో ఉండగా, గూఢచారుల ద్వారా కాశీరాజు తన కుమార్తెలకు వివాహం జరిపింపదలచాడని తెలుసుకున్నాడు. ఇక్కడొక విషయాన్ని మనం గ్రహించాలి. కాశీరాజు తన కుమార్తెలకు స్వయంవరం చాటాడు. కానీ హస్తినకు ఆహ్వానం రాలేదు. కాబట్టి భీష్ముడు గూఢచారులద్వారా (వేగులు) విషయం తెలుసుకున్నాడు. ప్రసిద్ధి చెందిన చంద్రవంశపురాజులైన హస్తినవారికి ఆహ్వానం అందలేదు. ఇది కూడా ఒక వింతే? ఇది భీష్ముని వంటివారికి భరింపరానిది. భీష్ముడు బ్రహ్మచర్యదీక్షాబద్ధుడు. యవ్వనంలోకి అడుగిడిన అతనితమ్ములు చిత్రాంగద, విచిత్రవీర్యుల్ని గురించి కాశీరాజుకు తెలియదు అని అనుకోలేము, రహస్యాలు తెలియవు. కానీ, బహిరంగ విషయాలు ఎప్పటికప్పుడు దేశం నలుమూలలకు వార్తలు అందుతూ ఉండేది. కాశీరాజు హస్తినకు ఆహ్వానం పంపలేదంటే ఇది నిర్లక్ష్యం అయి ఉండవచ్చు. దీనిని చూసి సహించలేక భీష్ముడు ధనుర్బాణపాణియై రథంలో ఒక్కడే కాశీరాజ్యం చేరాడు. స్వయంవరానికి వచ్చిన రాజుల ఎదుటే కాశీరాజు కుమార్తెలయిన అంబ, అంబిక, అంబాలికలను రథం ఎక్కించుకున్నాడు. తాను చేయదలచుకున్నది, అక్కడ రాజులకు చెప్పి బయలుదేరాడు. అక్కడున్న రాజులు అడ్డుకున్నారు. వారిని ఓడించాడు. పరాక్రమలబద్ధలైన ఆ కాశీరాజు కుమార్తెలలో పెద్దకుమార్తె అయిన అంబ ఇలా అన్నది. నేను సాళ్వుణ్ణి ప్రేమించాను. అతన్నే పెళ్ళి చేసుకుంటాను. ఇది విన్నంతనే భీష్మునికి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయింది. సర్వధర్మవిధులైన బ్రాహ్మణుల్ని సంప్రదించాడు. అంబను సాళ్వుని వద్దకు పంపివేశాడు. ఆమె భీష్ముని వద్ద నుండి సాళ్వుని వద్దకు చేరింది. అంబను పంపివేసిన తర్వాత అంబిక, అంబాలికలను విచిత్ర వీర్యుడికిచ్చి వివాహం చేశాడు.

సాళ్వుని వద్దకు వెళ్ళిన అంబ ఊహించని పరిణామం ఎదుర్కొంది.

**"అంబయు నట సాళ్వుని కడ**
**కుం బోయిన నతడు 'భీష్మ కొని పోయిన దా**
**నిం బరుచుం గైకొన ధ**
**ర్మంబే? కన్యాత్వ మెడలె మగువా నీకున్"**

నువ్వు భీష్ముని చేత అపహరింపబడిన కులటువు అని పరుషంగా మాట్లాడాడు. 'నిన్ను పత్నిగా స్వీకరించనని' తేల్చేశాడు. ఈ విపత్కరస్థితిలో కూడా అంబ ధైర్యం కోల్పోలేదు. తనకు సాళ్వరాజును వలచిన సంగతి తన తండ్రికి తెలియక స్వయం ఏర్పాటు చేశాడన్నది. భీష్ముడు తన తమ్ముడికోసం బలాత్కారంగా తీసుకెళ్ళాడే గానీ విషయం తెలుసుకొని

తనను నీ వద్దకే పంపాడని వాస్తవం చెప్పింది సాళ్వుడు అర్థం చేసుకోలేదు. ఆమెను తన మందిరం నుండి తరిమివేశాడు. అంబ ఏడుస్తూ భీష్ముని దగ్గరకు వెళ్ళి జరిగినదంతా చెప్పింది. నీ వల్లనే నాకు అపకారం జరిగింది. నా ప్రణయనాథుడు నాకు కాకుండా పోయాడు. చిరకాల సంకల్పం భగ్నమైంది. ఇక చేసేదేంలేదు. వచ్చిన అపవాదు ఎలాగూ వచ్చింది. నీ తమ్ముణ్ణే పెళ్ళి చేసుకుంటా అంది. అందుకు భీష్ముడు ఒప్పుకోలేదు.

సాళ్వుడే నా ప్రియుడిని బాహాటంగా ప్రకటించిన నీవు నా తమ్ముణ్ణెలా చేసుకుంటావు? మనసొకచోట మనువొకచోట కుదరదని నువ్వేగా చెప్పావు. కాబట్టి నీకూ మా తమ్ముడికి పొసగదు అన్నాడు. అంబ మొహంలో నెత్తురుచుక్క లేకుండా పోయింది. భీష్ముడి కఠినతకు ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. నా కష్టాలకు నువ్వే కారణం. నా బ్రతుకు అల్లరిపాలు కావడానికి నువ్వే కారణం. నీ మీద ప్రతీకారం తీర్చుకుంటాను అని అడవికి వెళ్ళి అడవుల్లో తపస్సు ప్రారంభించింది. యుద్ధంలో భీష్ముని గెలవగలిగినవారు లేరు. అందువలన తన తపశ్శక్తితో సాధింపదలచింది. ఒక పుణ్యస్థలంలో ఉన్న ఋషులదగ్గరకు వెళ్ళి తన విషాదగాథంతా చెప్పుకుంది. వాళ్ళేమో ఇది రాజులు చేసిన పని సాధువులేం చేయగలరన్నారు. అయితే అంబ నిరుత్సాహపడకుండా నేను తపస్సు చేయటానికి వచ్చాను అన్నది. నీవు సుకుమారివి. నీవల్ల అయ్యేపనికాదు. నీవు తిరిగి నీ తండ్రి దగ్గరకు వెళ్ళమన్నారు ఆ మునులు. అప్పుడు అంబ ఎవరికి తెలియకుండా ఈ అరణ్యంలో తపస్సు చేస్తానన్నది. శూద్రుడికి తపస్సు చేసే హక్కు లేదేమో గాని స్త్రీకి మనదేశంలో ఆ హక్కు ఉంది. రామాయణంలో వేదవతిగూడా తపస్సు చేసింది. అంబ మునులతో సంభాషిస్తూ ఉండగా అక్కడకు హోత్రవాహనుడు అనే రాజర్షి వచ్చాడు. మాటల సందర్భంగా అంబ తన మనుమరాలు (కూతురుబిడ్డ)గా గుర్తించి ఆమెను పరశరాముని వద్దకు పంపాలనుకున్నాడు. కానీ, పరశురాముడే తామున్న ప్రదేశానికి వస్తాడని తెలుసుకొని ఆయన వచ్చాక అంబగాథను ఆమె చేతనే చెప్పించాడు. అంతా విన్న తరువాత పరశురాముడు సాళ్వుని శిక్షించేదా? లేక భీష్ముణ్ణి శిక్షించేదా? నీకు ఏది ఇష్టమైతే అది చేస్తానని మాట ఇచ్చాడు. ఆమె భీష్ముణ్ణి దండించమన్నది. భీష్ముడు తన శిష్యుడే కాబట్టి, తన మాట కాదనడు అనుకున్నాడు భార్గవుడు. సరస్వతి నది ఒడ్డున నిలచి తనరాకను భీష్మునికి తెలియపరిచాడు. ఆయన గురువుకు తగినవిధంగా ఉపచారాలు చేశాడు. తరువాత అంబను విచిత్రవీర్యునికిచ్చి పెండ్లి చేయమన్నాడు. అది ధర్మం కాదన్నాడు భీష్ముడు. వివాదం మొదలైంది. యుద్ధం దాకా వచ్చింది. యుద్ధంలో గురుశిష్యులు ఇద్దరు సమానులే అని తేలింది. భీష్మునివైపు అష్టవసువులు, భార్గవునివైపు జమదగ్ని అయిన పితృదేవతలు మధ్యవర్తిత్వం వహించి ఉభయులను శాంతపరచినారు. గాంగేయుడు గురువుగా రైన పరశురామునకు సాష్టాంగ దండప్రణామం ఆచరించాడు. ఇక అంబను నీవు నీ దారి చూచుకో తల్లీ అని చెప్పి పంపివేశాడు. పరశురాముడు తన కోసం ఎంతో ప్రయాసపడటాన్ని అంబ కళ్ళారా చూచింది. అప్పటి తన దురదృష్టానికి బాధపడింది. ఆమె తపస్సు కఠిన నియమనిష్ఠలతో కూడుకున్నది. ఆమె ఎందుకు తపస్సు చేస్తున్నదో తెలుసుకున్న గంగాదేవి ఆమెను శపించింది. గంగ ఇచ్చిన శాపం సగమే ఫలించింది. కారణం ఆమె తపశ్శక్తి అలాంటిది. చివరకు పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. వరం కోరింది. మరుజన్మలో ద్రుపదుని కూతురుగా పుట్టింది. మగవాడుగా పెరిగి దశార్ణవరాజకుమార్తెను పెండ్లాడి దైవికంగా పురుషత్వాన్ని పొందింది. అప్పటినుండి శిఖండిగా ఆమె పేరు ప్రఖ్యాతమయింది. ద్రోణునివద్ద ధనుర్విద్య నేర్చుకున్నాడు. కురుక్షేత్రసంగ్రామంలో భీష్ముణ్ణి పడగొట్టాడు. ఇంత శ్రమపడి సాధించింది కురుపాండవసేవల్లోని వృద్ధులందరిలోకి వృద్ధుడైన భీష్ముణ్ణి చంపటం. కానీ భీష్మునికి తండ్రి వరం వల్ల కోరుకున్నప్పుడే మరణం వస్తుంది. ఒక చిన్న పొరపాటు ఒక్కోసారి జీవితకడలిలో ఎంత కల్లోలాన్ని రేపుతుందో అది చివరకు ఎన్నెన్ని రూపాంతరాలు పొందుతుందో గాంగేయాంబల కలహం తెలియజేస్తుంది. తన మనసులోని మాట స్వయంవరం కన్నా ముందే తండ్రికి చెప్పి ఉండవలసింది అంబ. ఆ పని చేయలేదు. భీష్ముడైనా తాను తీసుకుపోదలచిన కన్యల అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. భీష్ముడు కేవలం బలపరాక్రమాలకే విలువనివ్వడం అదే ఖ్యాతిగా భావించడం వల్లనే ఇంతటి అనర్థాలు జరిగాయి.

ఆధునిక సమాజంలో కూడా వధువుల మనసు తెలుసుకోకుండా వివాహాలు చేయడం, తదనంతర పర్యవసానాలు మనందరికి తెలిసిన విషయాలే. పోనీ ఆ వధువు తాను వలచిన వాడితో ప్రేమ వివాహం చేసుకుంటే పరవుహత్యలు జరుగుతున్న సందర్భం. కాబట్టి వధువరుల మనసులనెరిగి వివాహాలు జరిపించడం సమంజసంగా మనం అర్థం చేసుకోవాలి. ప్రేమించిన యువతి కోసం ప్రాణాలైనా అర్పిస్తామనే ప్రేమికుడు ఆమె హృదయాన్ని అర్థం చేసుకోకపోతే ఆ ప్రేమకు విలువలేదు. గాంగేయుడు తాను తెలియక అంబను తన తమ్ముడికిచ్చి వివాహం చేయడానికి తీసుకెళ్ళినపుడు అంబ సాళ్వుని వద్దకు వచ్చి విషయం తెలిపినపుడు ఆమె హృదయాన్ని అర్థం చేసుకోకుండా, వాస్తవాన్ని గ్రహించకుండా పరుషంగా మాట్లాడటం, ఆమెను తన మందిరం నుండి వెడలగొట్టడం అతని మూర్ఖత్వాన్ని తెలియజేస్తుంది. అలాంటి ప్రేమికుడిని నమ్మి వెళ్లడం అంబ అమాయకత్వం. తనను నమ్మి వచ్చిన అమ్మాయిని పంతానికి వెళ్ళి వదిలించుకోవడం లాంటి వాళ్ళు ఆధునిక సమాజంలో కోకొల్లలు. ఈ విషయంలో కట్టుబాటైన వివాహాలు ఉన్నతమైనవి. అలాగే సాళ్వుడు అంబను 'కులటువు' అని సంబోధించినపుడు అంబ బతిమాలలేదు. నీచుడైన సాళ్వుణ్ణి సాధించకుండా వెళ్ళిపోతుంది. తన సమస్యకు పరిష్కారం కోసం అడువులంటూ చెట్లంటూ పుట్లంటూ వెళ్ళి తపస్సుకు పూనుకోవడం ఆమెలో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని వర్తమాన సమాజ యువతులు అర్థం చేసుకోవాలి.

జరిగిన సంఘటనలోని పూర్వాపరాలను తెలుసుకోకుండా ఆశ్రయించినవారికి అభయమిచ్చే ప్రదాతలు వర్తమాన సమాజంలో తారసపడుతుంటారు. అలాంటి పాత్రే పరశురాముని పాత్ర. భీష్ముడు తన శిష్యుడేగా తాను చెబితే వింటాడులే అని పలికాడు. చివరకు గురుశిష్యుల మధ్య ద్వంద్వయుద్ధానికి దారి తీసింది. ఈ సందర్భంలో తిక్కన సోమయాజి ఆణిముత్యం లాంటి మాటను తేటతెలుగులో అందిస్తాడు.

**"గర్వియై కార్యమిట్ట దకార్యమిట్టి**
**దని యెఱుంగక లోకంబు చనుపథమునఁ**
**దిరుగ కూన్మదవృత్తి వర్తించునట్టి**
**వాని గురువైన దండింప వలయునండ్రు"**

అహంకారంతో ఇది చేయదగినపని, ఇది చేయరానిపని, తెలుసుకోకుండా ప్రజలు నడిచే మార్గంలో నడవక, వెర్రియై ఎవడు ప్రవర్తిస్తాడో అతడు గురువైనా దండనార్హుడని పెద్దలు చెపుతారు.

పరుశురాముడికి చివరకు శిష్యుడి చేతిలో పరాభవం తప్పలేదు. సాళ్వుడు వద్దన్నాక అంబ తనను తిరిగి విచిత్రవీర్యుడితో పెళ్ళి చేయమని కోరడం హేయమైన చర్య. అంబ చంచల మనస్తత్వం కలిగినదిగా అర్థంచేసుకోవాలి. చంచల మనస్తత్వం, పగ ప్రతీకారాలు స్త్రీలకు పనికిరావని ఈ ఘట్టం ద్వారా అర్థం చేసుకోవాలి. అందుకే అంబకు ఈ తిప్పలు తప్పలేదు. స్త్రీ మనోభావాలకు తావివ్వకుండా భీష్ముడు కేవలం బలపరాక్రమాలనే ఖ్యాతి వల్లనే ఇటువంటి అనర్థం జరిగిందనేది గుర్తించవలసిన అసలు విషయం. అంబగాథ వల్ల మనకు తెలియవచ్చిన వాస్తవమిది. మహాభారతంలో భీష్ముడు వంటి త్యాగి మరొకరు కనిపించరు. అంబ శిఖండిగా పుట్టి నడుమ పురుషాత్వాన్ని పొంది ఏ కారణంచేతనైనా సుఖాల ననుభవించి వుండవచ్చుగాక. అయినా, శిఖండి జీవితం చివరివరకు క్రోధపరవశమైన కష్టజీవితమే. ఈ ఇరువురిలో భీష్మునిదే అత్యంత దుర్లభమైన జీవితం. అందువల్లనే మనవారు 'భీష్మ' ఏకాదశిని మరువలేదు. శిఖండికి ఆ గౌరవం దక్కలేదు.

**ఆధారగ్రంథాలు**

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం (ఆదిపర్వం, ఉద్యో...) – తి.తి.దే. ప్రచురణలు.
2. అంబోపాఖ్యానం (వ్యాఖ్య) – ముదివర్తి కొండమాచార్యులు

# 67. ప్రమద్వరోపాఖ్యానం - వర్తమానసమాజ సమాలోచనం

– డా॥ సింగమాల చంద్రయ్య, తిరుపతి

చతుర్విధ పురుషార్థాలయిన ధర్మార్థ కామమోక్షాలను ఉపదేశిస్తూ సమాజ హితాన్ని కోరేది మహాభారతం. అందుకే పంచమ వేదంగా ప్రసిద్ధిగాంచింది. వేదాలు ప్రతిపాదించిన ధర్మ విజ్ఞానం మహాభారతం ఉండటం వల్ల పంచమవేదం అయింది. అందుకే 'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్" అనే లోలోక్తి ఏర్పడింది. భారతంలో ఉన్నది అంతటా ఉన్నది. భారతంలో లేనిది ఇంకెక్కడా లేదని వ్యాసుడే స్వయంగా చెప్పినమాట అది. అటువంటి భారతంలో కౌరవ పాండవుల కథ చోటు చేసుకొని ఉంది. చంద్రవంశపు రాజులయిన వీరి పూర్వీకుల గాథ నుండి ధర్మరాజు పట్టాభిషేకం వరకు ప్రధానంగా కథ నడుస్తుంది. ఇది భారత ఆఖ్యానం. ఈ భారతాఖ్యానం 18 పర్వాల సుదీర్ఘ గ్రంథం. ఈ ఆఖ్యాన పరంపరలో ఎన్నో ఉపాఖ్యానాలు చోటు చేసుకొన్నాయి. మహాభారతంలో దాదాపు 158 ఉపాఖ్యానాలున్నట్లు తెలుస్తోంది. కవి ప్రత్యక్షంగా కథలు చెప్పే పద్ధతిని 'ఆఖ్యానం' అంటారు. అది ప్రధానకథ. ఈ 'ఆఖ్యానం' కంటే చిన్న కథను "ఆఖ్యానకం" అంటారు. వీటికంటే భిన్నమైనది ఉపాఖ్యానము. ఈ ఉపాఖ్యానాలను ఉపాఖ్యానాలే కదా తేలికగా తీసివేయడానికి వీల్లేదు. ప్రతి ఉపాఖ్యానం కూడా విలువైన విలువను అందించేదే. ప్రతి ఉపాఖ్యాన కథ ఒక విశిష్టత కలిగి ఉంది. ఎంతో నిబద్ధతతో ముందుకు సాగుతుంది. ప్రధాన కథకు చోదకంగా సాయపడుతుంది. ధర్మ సూక్ష్మాలను ప్రధాన పాత్రలకు అందిస్తుంది. ఎంతో ఉత్ప్రేరకాన్ని కలిగిస్తుంది. ప్రేరణను రగిలిస్తుంది.

ప్రతి ఉపాఖ్యానం కూడా ప్రధాన కథకు శ్రేష్ఠత్వాన్ని, సార్థకతను చేకూరుస్తుంది. అందుకే "శ్రుత స్వార్థస్య కథనముఖ్యానం ప్రచక్షతే" అన్నారు పెద్దలు. నేరుగా కథను విని అర్థం చేసుకొని దానిని ఇతరులకు చెప్పడమే ఉపాఖ్యానం అని మనం గ్రహించాలి. అటువంటి అనేక ఉపాఖ్యానం అని మనం గ్రహించాలి. అటువంటి అనేక ఉపాఖ్యానాలు కలిగిన మహాభారతంలో ప్రమద్వరోపాఖ్యానం అనే ఒక ఉపాఖ్యానం చోటు చేసుకొంది. ఆ ప్రమద్వరోపాఖ్యాన ఘట్టాన్ని సమకాలీన వర్తమాన సమాజ విలువలతో సమన్వయపరచడం ఈ వ్యాసోద్దేశం.

ఆంధ్రమహాభారతంలో ప్రమద్వరోపాఖ్యానం అనే ఉపాఖ్యానం అంత ప్రసిద్ధి చెందిన ఉపాఖ్యానం కాకపోవచ్చు. అసలు ఈ ఉపాఖ్యానం ఉందని కూడా చాలామందికి తెలియకపోవచ్చు. అసలు దీనికి ఉపాఖ్యానం అనే పేరు కూడా మహాభారత గ్రంథ విషయ సూచికలో కనబడదు. కానీ భృగువంశ కీర్తనం అనే ఒక ఘట్టంలో ఈ ప్రమద్వరోపాఖ్యానం అనే ఒక చిన్న కథ చోటు చేసుకుంటుంది. ఈ ఉపాఖ్యానం అంత ప్రసిద్ధి కానంత మాత్రాన దీని విలువను తక్కువగా అంచనా వేయలేము. ఎందుకంటే ఈ ఘట్టం సమస్త మహాభారతానికి జరగబోయే ఘట్టాన్ని ముందుగా తెలియజేసే అంశం ఈ చిన్న కథలో చోటు చేసుకుంటుంది. ప్రధాన కథ జనమేజయుడు వినడానికి బీజాలు పడింది ఈ ఘట్టంలోనే. అలాగే యువతీయువకులు మధ్య ఆదర్శ ప్రేమ ఎలా ఉండాలి? ప్రేమ ఏమికోరుకుంటుంది? ప్రేమ ఎలా ఉండాలి అని మహోన్నత నిర్వచనాన్ని ఈ కథ అందిస్తుంది. 'అహింసా పరమోధర్మ ః' అనే గొప్ప మాటను ఈ కథ సిద్ధాంతరీకస్తుంది. ఇన్ని బహుళ విలువలు అందిస్తున్న ఈ ప్రమద్వరోపాఖ్యానం శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం ప్రథమాశ్వాసంలో ఉంది. ఆ ఘట్టానికి పరిమితమై నా పరిశోధన పత్ర విశ్లేషణ సాగుతుంది.

సప్త ఋషులలో ఒకడయిన భృగువు సామాన్యుడేమికాదు. కలియుగారంభంలో సత్రయాగం చేస్తున్న సందర్భంలో యాగఫలం ఎవరికి ఇవ్వాలి అని నిర్ణయించే బాధ్యత స్వీకరించిన ఋషీశ్వరుడు. సాక్షాత్తు సృష్టికర్త బ్రహ్మకు, లయకర్త పరమశివునికి శాపాలిచ్చినవాడు. విష్ణుమూర్తి వక్షస్థలాన్ని తన్నినవాడు. విష్ణువు ఈ ఋషి అహంకార నేత్రాన్ని చిదిమియడంతో జ్ఞానోదయం పొందిన మునిశ్రేష్ఠుడు. ఈ మునిశ్రేష్ఠునికి చ్యవనుడు జన్మించాడు. చ్యవనుడికి, సుకన్య దంపతులకు ప్రమతి

పుట్టాడు. ప్రమతి, ఘృతాచి దంపతులకు 'రురుడు' జన్మించాడు. ఈ రురుడు భృగు వంశంలో జన్మించిన మునిశ్రేష్ఠుడు ఇదిలా ఉంటే విశ్వావసుడనే గంధర్వరాజుకు, కునక అనే అప్సరసకు పుట్టి స్థూలకేశుడనే ముని ఆశ్రమంలో పెరుగుతున్న ప్రమద్వర అంటే రురుడికి చాలా యిష్టం. రూపంలోను, సౌందర్యంలోను, గుణాలలోను శ్రేష్ఠురాలైన మునిబాలిక ప్రమద్వర. ఆమెను పెండ్లి చేసుకోవాలే దృఢ సంకల్పంతో ఉన్నాడు రురుడు. స్నేహితురాండ్రతో ఆడుకుంటున్న ప్రమద్వర తనకు తెలియకనే విషసర్పాన్ని తొక్కింది. వెంటనే ఆ పాము కాటుకు గురైంది. స్నేహితురాళ్ళు భయాందోళనతో కేకలుపెడుతూ పరుగులు తీసారు. ప్రమద్వర నేలకొరిగింది. నేలకొరిగిన ప్రమద్వరను గౌతముడు, కణ్వుడు, కుత్సుడు, కౌశికుడు, శంఖుడు, మేఖలుడు, భరద్వాజుడు, వాలఖిల్యుడు, ఉద్దాలకుడు, శ్వేతకేతువు, మైత్రేయుడు మొదలైన వారు చూసి విలపించారు. రురుడు తమ తండ్రి ప్రమతితో కలసి స్థూలకేశుని ఆశ్రమానికి వచ్చారు. నేలపై చచ్చిపడి ఉన్న ప్రమద్వరును చూశారు. రురుడి హృదయం భగ్గుమంది. తాను ప్రాణపదంగా ప్రేమించిన ప్రియురాలు నిశ్చేష్ఠురాలై ఉండడాన్ని రురుడు జీర్ణించుకోలేకపోయాడు. దుఃఖాన్ని ఆపలేకపోయాడు. కలతో ఒంటరిగా అడవిలోకి వెళ్లి దిక్కులు పిక్కటిల్లేలా విలపించాడు. దుఃఖాతిశయం కట్టలు తెంచుకుంది.

**అలయక యేన దేవయజనాధ్యయన వ్రత పుణ్యకర్మముల్**
**సలుపుదు నేని యేన గురుసద్విజభక్తుఁడనేని, యేన య**
**త్య లఘుతపస్వినేని దివిజాధిప భూసురులారా! మన్మనో**
**నిలయకు నీప్రద్వరకు నిర్విష మయ్యెడు నేఁప మీదయన్** **(ఆదిపర్వం - 1- 148)**

ఓ దేవతలారా! బ్రాహ్మణులారా! నేను అలసట లేకుండా దేవతలను పూజించడం, యజ్ఞలను ఆచరించడం, వేదాలను పఠించడం, వ్రతాలను ఆచరించడం అనే పుణ్యకార్యాలను చేసేవాడనైతే, నేను గురువులకు ఉత్తమ బ్రాహ్మణులకు భక్తుడనైతే నేను గొప్ప తపస్సు కలవాడనైతే నేడు నామనస్సే నిలయంగాగల నా ప్రాణనాయిక అయిన ఈ ప్రమద్వర మీ దయచేత విముక్తురాలు అగుగాక! అంటూ విలపించాడు దైన్యంతో ఎలుగెత్తి ఏడుస్తున్న రురునికి ఆకాశం నుండి ఒక దేవ దూత వాక్కులు వినబడ్డాయి. "మరణం కలిగితే దానిని ఎవ్వరూ ఆపలేరు. అయినా సరే ఒక మార్గముంది. నీ ఆయుర్ధాయంలో సగాన్ని ఆ బాలికకు ఇస్తే ఆమె విషం నుండి విముక్తి పొందగలదని" రురుడు విన్నాడు. వెంటనే ఆనందంగా అంగీకరించాడు. ఆ దేవ దూత యముడి అనుమతితో చెప్పిన మాటలను ఉపాయం వల్ల ఆచరించి ప్రమద్వరకు ఆయుష్షు పోశాడు. మృత్యు విముక్తి కలిగించాడు.

భారతంలో సావిత్రి తన భర్త అయిన సత్యవంతుని బతికించుకోవడానికి యమలోకం దాకా వెళుతుంది. చరిత్రలో నిలిచిపోయింది. కానీ భార్య మరణిస్తే ఆమెను పునరుజ్జీవితురాలిని చేయాలని భావించలేనట్లు కనబడరు. కానీ తనకు కాబోయే భార్య, ప్రేయసి మరణిస్తే ఆమెకోసం తన ఆయుష్షును దారబోసిన రురుడు ఆదర్శ ప్రేమికునిగా నేటి సమాజం గుర్తించి స్ఫూర్తి పొందాలి. వర్తమాన సమాజంలో అమ్మాయి ప్రేమించకపోతే యాసిడ్‌తో దాడి, కత్తితో గొంతు కోసిన సంఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట కనిపిస్తున్నాయి. అలాంటివారు తాను నిజంగా ప్రేమించి కనిపిస్తున్నాయి. అలాంటివారు తాను నిజంగా ప్రేమించి ఉంటే వాళ్ళను బ్రతకనివ్వాలేగాని కడతేర్చకూడదనే ఆలోచనతో ముందుకు సాగాలి. ఈ కలియుగంలో రురుడిలాగా ఆయుర్ధాయాన్ని ఏ ప్రేయసికి ఎంతటి భగ్న ప్రేమికుడైనా పంచిఇవ్వలేడు. కానీ ప్రేమను పంచగలడు. ప్రేమ అంటే త్యాగం అనే అర్థం సరిగ్గా సరిపోతుంది. ప్రేమించిన వారికోసం ఏదైనా త్యాగం చేయగల సహృదయత ఉంటే దాని కంటే మించిన నిజమైన ప్రేమ ఏదీలేదు. ఈ విషయాన్ని నేటి వర్తమాన సమాజంలో యువతీయువకులు గ్రహించాలి.

అలాగే ప్రమద్వర విషనాగు కాటుకు గురైన సందర్భంలో గౌతమాది ప్రముఖ మునులంతా స్థూలకేశుని ఆశ్రమానికి వచ్చి దయాహృదయంతో కన్నీరు కార్చడం ఋషుల్లో ఉన్న సహృదయతను, ఐకమత్యాన్ని విశదం చేస్తోంది. ఈ ఆధునిక

సమాజంలో ఏదైన ప్రమాదం సంభవిస్తే 'మనకెందుకులే', కాలం వృధా అనుకుంటున్న ఈ కాలంలో మన మధ్యలేని ఐకమత్యాన్ని ఈ వృత్తాంతం గుర్తు చేస్తోంది.

**తనసతి కపకారము సే**
**సిన పాముల కలిగి బాధ సేయుదు నని చి**
**క్కని దండము గొని పాముల**
**గని నప్పుడు యదువ దొడఁగె గహనములోనన్ (ఆదిపర్వం 1 – 151)**

తన భార్యకు హానిచేసిన పాములను పెద్దకర్రతో రురుడు దండించనారంభించాడు. అడవుల్లో తిరుగుతూ కనబడిన పాములను చంపివేశాడు. ఆ సందర్భంలో సహస్రపాదుడనే ముని రురుని ద్వారా శాపవిముక్తుడై అహింసా సిద్ధాంతాన్ని ప్రబోధిస్తూ, ఈ సర్పజాతి కద్రువ శాపం వల్ల జనకుజయుని యాగంలో పడుతాయని ప్రబోధించడం మహాభారత కథకు బీజాలు కూడా ఈ వృత్తాంతంలోనే పడ్డాయని చెప్పవచ్చు.

ఈ ప్రదమ్వరోపాఖ్యానం చాలా చిన్నది అయినప్పటికి విలువలు కలిగిన ఉపాఖ్యానంగా వివరించవచ్చు.

**ఆధారగ్రంథాలు**

1. శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం – తి.తి.దే. ప్రచురణలు.

# 68. నాటి యయాతి - నేటి దృక్కోణాలు

– డా॥ యం. రమాదేవి, బాసర, నిర్మల్, తెలంగాణ

## 1.1. పరిచయం

మహాభారతం మనదేశ ఇతిహాసం. మన సంస్కృతి సంప్రదాయాలకు పట్టుకొమ్మ. మహాభారతం చదువుతుంటే మనలో ఉన్న ఒక్కో అజ్ఞానపు పొర తొలగిపోయి కడిగిన ముత్యంలా తయారవుతాము. భారతంలో వేదార్థాలు వివరించబడ్డాయి. కనుకనే దీనికి పంచమవేదమని ప్రఖ్యాతి ఏర్పడింది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, శాస్త్రాల సారం భారతంలో నిబిఢీకృతమై ఉండటం వల్ల ఇది భారతీయ విజ్ఞాన సర్వస్వంగా ప్రశస్తి పొందింది.

“యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్” అంటే ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదని అర్థం. ఇంతకంటే ఈ గ్రంథం ప్రాశస్త్యం చెప్పడానికి వేరేది అవసరం లేదు.

భారతం కౌరవులకి, పాండవులకి సంబంధించిన కథ. ఆస్తి తగాదా వలన ఇరుపక్షాలకి యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో పాండవులు కౌరవులను ఓడించి రాజ్యాన్ని చేజిక్కించుకుంటారు. క్లుప్తంగా ఇది అన్నదమ్ముల కథ. అయితే ఈ కథతోపాటు భారతంలో మనకు ధర్మాన్ని, నీతిని బోధించే ఉపకథలు, రాజుల చరిత్రలు ఎన్నో ఉన్నాయి.

మహాభారతం మహాసముద్రం లాంటిది. అందులో ముత్యాలు ఉన్నాయి. రత్నాలు ఉన్నాయి. అవే భారతంలో ఉన్న ఉపాఖ్యానాలు. ఈ ఉపాఖ్యానాలు శాశ్వత ధర్మాలను, విశేషధర్మాలను, జన్మ మృత్యు రహస్యాలను, కాల ప్రభావాన్ని, విధి విలాసాన్ని అనేక రకాలుగా పునరుద్ఘాటించాయి. మనిషి జీవితంలో అతను చేసే పనులను బట్టి అతని జీవన విధానం, జీవితానంతరం శాశ్వతపథం నిర్ణయింపబడతాయి. కనుకనే మానవుడు ధర్మాన్ని అనుసరించి శాశ్వతపథాన్ని చేరుకునేందుకు ప్రయత్నించాలని ఈ ఉపకథల ద్వారా భారతం వివరిస్తున్నది.

పాండవుల పూర్వుల్లో యయాతి మహారాజు ఒకరు. భారతంలో యయాతిరాజు చరిత్రను నన్నయ ఆదిపర్వం తృతీయాశ్వాసంలో మొత్తం 134 పద్య గద్యాలలో వివరించారు. ఈ యయాతి ప్రస్తావన మహాభారతంతోపాటు, భాగవత పురాణం మరియు మత్స్య పురాణాలలో కనిపిస్తుంది. సా.శ. 1520–1600కాలానికి చెందిన పొన్నెగంటి తెలగన్న అచ్చ తెనుగులో “యయాతి చరిత్రము”ను అనే అచ్చతెనుగు కావ్యం రాసి, గోల్కొండ సామ్రాజ్యాన్ని పరిపాలించిన ఇబ్రహీం కుతుబ్ షా (మల్కిభ రామ్) దగ్గర అమీన్ గా ఉన్న అమీన్ ఖాన్ కు అంకితం చేశారు.

## 2.1. యయాతి చరిత్ర–సంగ్రహం

నహుషుడు, ప్రియంవద దంపతులకు కలిగిన ఆరుగురు కుమారులలో యయాతి రెండవవాడు. యయాతి తండ్రి తర్వాత రాజై అనేక యాగాలు చేసి జనరంజకంగా పరిపాలన చేశాడు.

ఈ యయాతి చరిత్ర బృహస్పతి కుమారుడైన కచుడు మృతసంజీవని విద్య కోసం శుక్రాచార్యుడిని ఆశ్రయించడంతో ప్రారంభమవుతుంది. రెండుసార్లు దైత్యుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకొని ఎట్టకేలకు మృతసంజీవని విద్య నేర్చుకుంటాడు. సెలవు తీసుకుని వెళ్ళే కచుడ్ని తనను పెళ్ళి చేసుకొమ్మని శుక్రాచార్యుని కుమార్తె దేవయాని అడుగుతుంది. దాన్ని తిరస్కరించగా కోపంతో మృతసంజీవని విద్య తనకు పనికి రాకుండా పోతుందని దేవయాని శాపం ఇస్తుంది. కచుడు కూడా నీకు భర్త అయ్యేవాడు బ్రాహ్మణుడు కానివాడుగా ఉండుగాక అని ప్రతిశాపం ఇచ్చి వెనుతిరుగుతాడు.

వనవిహారానికి వెళ్ళిన దైత్యరాజు వృషపర్వుడి కుమార్తె శర్మిష్ఠకు దేవయానికి మాటామాటా పెరుగుతుంది. దానితో శర్మిష్ఠ దేవయానిని బావిలోకి తోసి తన చెలికత్తెలతో అంతఃపురానికి వెళుతుంది. వేటకు వచ్చిన యయాతి ఆమెను రక్షిస్తాడు.

శర్మిష్ఠ చేసిన అవమానానికి ప్రతిగా తన తండ్రిని అడ్డుపెట్టుకుని దేవయాని, శర్మిష్ఠను ఆమె వెయ్యిమంది చెలికత్తెలను దాసీలుగా చేసుకుంటుంది. కొంతకాలానికి శుక్రాచార్యుని ఆశీర్వాదంతో యయాతి, దేవయానిల వివాహం అంగరంగవైభవంగా జరుగుతుంది. దేవయానితోపాటు శర్మిష్ఠ ఆమె వెయ్యిమంది చెలికత్తెలు కూడా యయాతి రాజ్యానికి వెళ్తారు. శయ్య విషయంలో శర్మిష్ఠను పరిహరించవలసిందిగా శుక్రాచార్యుడు యయాతికి కట్టడి విధిస్తాడు.

ఆ శాప ప్రభావంతో అకాల జరాభారం వలన గజగజా వణికిపోయాడు. తన కుటుంబాన్ని, రాజ్యాన్ని ఈ ముసలితనంతో చూసుకోలేనని శాపాన్ని ఉపసంహరించుకోమని వేడుకుంటాడు. తన శాపానికి తిరుగుండదని నీ వార్ధక్యాన్ని ఎవరికైనా ఇచ్చి వారి యవ్వనాన్ని తీసుకోవచ్చంటాడు.

యయాతి వార్ధక్యాన్ని తీసుకుని, తమ యవ్వనాన్ని ధారపోయడానికి శర్మిష్ఠ చిన్న కుమారుడు పూరుడు తప్ప ఎవరూ ముందుకు రారు. ఆ విధంగా పూరుడు యవ్వనాన్ని స్వీకరించి వెయ్యి సంవత్సరాలు రాజ్యపాలన చేసి, తన తర్వాత పూరుడిని రాజ్యానికి రాజుగా చేస్తాడు. తాను వానప్రస్థాశ్రమం స్వీకరించి వెయ్యి సంవత్సరాలు ఘోర తపస్సు చేసి ఆ పుణ్యఫలంతో దివ్య విమానారూఢుడై బ్రహ్మలోకం, స్వర్గలోకానికి వెళ్తాడు.

ఒకనాడు దేవేంద్రుడు రాజ్యాన్ని అప్పగించినపుడు, పూరుడికి చేసిన ధర్మోపదేశం చెప్పమని అడగగా, జ్ఞానాన్ని ఎలా సంపాదించాలి, ధనాన్ని ఎలా సద్వినియోగం చేయాలి, మనం మాట్లాడే మాటలు ఎలా ఉండాలో మొదలైన విషయాలు చెప్పానని చెప్తాడు. ఆ మాటలకు సంతోషించిన ఇంద్రుడు నువ్వెంత తపస్సు చేశావో కదా అందుకే వెయ్యి సంవత్సరాలు స్వర్గలోకంలో ఉన్నావని అంటాడు. ఆ మాటలకు పొంగిపోయి దేవతలు, గంధర్వులు, యక్షులు, కిన్నెరలు, రాక్షసులు మొదలైన వారెవ్వరూ కూడా నా అంత గొప్ప తపస్సు చెయ్యలేదని అహంకారంతో చులకనగా మాట్లాడగా, దేవేంద్రుడికి కోపం వచ్చి భూలోకం వెళ్ళమంటాడు. కాని యయాతి ఇంద్రుడ్ని ప్రార్థించి నక్షత్రమండలానికి వెళ్తాడు. అక్కడ తన దౌహిత్రు(కూతురు పిల్లలు)లైన అష్టకుడు, వసుమంతుడు, ప్రతర్దనుడు మొదలైన వారిని కలుసుకుంటాడు. వారికి తన అహంకారంతో స్వర్గలోకం నుండి నక్షత్రలోకానికి ఏ విధంగా పతనమైనది చెప్తాడు. వారి కోరిక మీద ధర్మం, అధర్మం, చతురాశ్రమధర్మాలు, జీవుల జన్మ మరణ రహస్యాలను గూర్చి వివరిస్తాడు. ఆ విశేషాలన్నీ విన్న అష్టకాదులు తమకు స్వర్గలోక ప్రాప్తి ఉన్నదా అని ప్రశ్నించగా, వారందరికీ ఉత్తమలోక నివాసమున్నదని, శీఘ్రంగానే అది జరుగుతుందని చెప్తాడు. అచిరకాలంలోనే తళతళామెరుస్తూ కాంచన రత్నాలంకారాలతో ఉన్న దివ్య రథాలు ప్రత్యక్షమవగా వారితోపాటు యయాతి కూడా ఊర్ధ్వలోకాలు చేరుకున్నాడు. సజ్జన సాంగత్యమే ఆ యయాతికి అటువంటి మహాభాగ్యం ప్రసాదించింది.

స్వర్గానికి వెళ్ళిన యయాతికి, ఇంద్రునికి మధ్య జరిగిన సంభాషణ వలన మనం తెలుసుకోదగిన నీతి ఏమిటో పరిశీలించటం ఈ వ్యాసం ప్రధానోద్దేశ్యం.

### 3.1. జ్ఞానసముపార్జన

వ్యక్తిత్వ వికాసానికి, నలుగురిలో గౌరవ మర్యాదలు, పేరుప్రఖ్యాతులు పొందడానికి జ్ఞానం ఎంతో అవసరం. కింది పద్యంలో జ్ఞానాన్ని ఎలా సముపార్జించాలో చెబుతున్నాడు.

**“ఎఱుక గలవారి చరితలు**
**గఱచుచు, సజ్జనుల గోష్టి గదలక ధర్మం**
**బెఱుగుచు, నెరిగిన దానిని**
**మఱవ కనుష్టించునది సమంజసబుద్ధిన్”**

అంటూ జ్ఞానుల చరిత్రలు చదివి, సజ్జనుల సాన్నిహిత్యంలో ధర్మం తెలుసుకొని, వాటిని ఆచరణలో పెట్టాలి. తద్వారా తన వ్యక్తిత్వాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. ప్రతి విద్యార్థికి ఇది అత్యంత ఆచరణీయం.

### 3.2. ధనాన్ని సద్వినియోగపరచడం

**"ఇచ్చునది పాత్రునకు ధన**
**మచ్చుగా నోరు వేడకుండునది యభిముఖులై**
**వచ్చిన యాశార్థుల వృథ**
**పుచ్చక చేయునది సర్వభూతప్రీతిన్"**

ధనాన్ని ఎలా సద్వినియోగం చేయాలో ఈ పద్యం తెలియచేస్తుంది. అర్హుడికి తగినట్లుగా దానమివ్వాలి. ఇంకొకరిని అడగకుండా ఇవ్వాలి. దానం కోసం వచ్చిన వారిని నిరాశ పరచకూడదు. సకల జీవులకు తృప్తిని కలిగించాలి. మనమెప్పుడు ఇతరులకు ఇచ్చే స్థితిలో ఉండాలి కాని, అడిగే స్థితిలో ఉండకూడదు. అర్హుడికి దానమివ్వడం వలన దానఫలం మహత్తరంగా ఉంటుంది. అనర్హుడికి దానమిస్తే అనర్థం కలుగుతుంది.

### 3.3. మాటతీరు

మాట్లాడడం మనిషికి దేవుడిచ్చిన వరం. మనంఎలా మాట్లాడాలో చెప్పే పద్యమిది.

**"మనమునకు బ్రియంబును హిత**
**మును బథ్యము దథ్యమును నమోఘము మధురం**
**బును బరిమితమును నగు పలు**
**కొనరగ బలుకునది ధర్మయుతముగ సభలన్"**

నలుగురిలో మనసుకి ప్రీతిని కలిగించేది, మేలైనదీ, ఉచితమైనదీ, సత్యమైనదీ, తీయనిదీ, విస్తృతం కానిదీ, అయినమాటను ధర్మంతోకూడుకొని ఉండేటట్లుగా పలకాలి. మనిషి మాట్లాడే విధానం వల్లనే మనిషి వ్యక్తిత్వం, మంచితనం తెలుస్తుంది కాబట్టి హితం, మితం అయిన మాటలను పలకటం ఉత్తమం. ఇటువంటి మాటలు లోకానికి కూడా మేలు చేస్తాయి!

### 3.4. సద్గుణాలను అలవర్చుకోవడం

దుష్టులకు, దుష్ట గుణాలకు దూరంగా ఉండడం మంచిది.

**వదన బాణాసన వ్యక్తముక్తములైన**
**పలుకుల న్కడు వాడిబాణతతుల**
**బరమర్మ లక్ష్యముల్ పాయక భేదించు**

కాలక్రమేణ దేవయానికి యదువు, తుర్వసుడు అను ఇద్దరు కుమారులు జన్మిస్తారు. శర్మిష్ఠకు కూడా ద్రుహ్యుడు, అనువు, పూరుడు అను ముగ్గురు కుమారులు జన్మిస్తారు. ఈ విషయం తెలిసిన దేవయాని యయాతి మీద అలిగి పట్టరాని కోపంతో పుట్టింటికి వెళ్ళి యయాతి చేసిన ద్రోహం గురించి తండ్రికి చెపుతుంది. "ఏ యవ్వనాన్ని చూసి గర్వించి నా దేవయానికి అన్యాయం చేశావో ఆ యవ్వనం దూరమై అకాల వార్ధక్యం సంభవించునని" శపిస్తాడు.

**చుండెడి దుర్జనయోధవరుల**
**కడనుండ కున్నది కరుణ యార్జవమక్ష**

**జయము సత్యంబును శమము శౌచ**
**మను నివి యెద నిల్పునది శత్రు షడ్వర్గ**
**జయమందునది శుద్ధశాంతబుద్ధి**
**మదము గామము గ్రోధంబు మత్సరంబు**
**లోభంబును మోహమును నను లోని సహజ**
**వైరివర్గంబు నోడచివాడ యొడుచు**
**నశ్రమంబున వెలుపలి యహితతతుల"**

ముఖమనే విల్లు నుండి వెలువడిన మాటలనే వాడియైన బాణాల సముహంతో, ఇతరుల జీవస్థానాలనే లక్ష్యాలనే చీల్చుతూ ఉండే దుష్టులైన యోధశ్రేష్టుల చెంత నివసించకూడదు. దుష్టులకు దూరంగా ఉంటూ, ఋజుత్వం, ఇంద్రియనిగ్రహం, సత్యం, శుచిత్వం అనే వాటితో హృదయం నింపాలి. నిర్మలమైన బుద్ధితో కామాదివైరిలనే అరిషడ్వర్గాలు జయించాలి. కామం, క్రోధం, లోభం, మొహం, మదం, మాత్సరం అనే ఈ అంతర్గత శత్రువులను జయించినవాడే, బాహ్య శత్రువులను శ్రమ లేకుండా ఓడిస్తాడు.

**"సర్వభూత దయకు సత్యవాక్యమునకు**
**నుత్తమంబు దారము వొందేరుంగ**
**నొరుల నొప్పి కోడ కుపతాప మొనరించు**
**నదియ కడు నధర్మ మనిరి బుధులు"**

ఎల్ల జీవులయందు దయ కలిగి ఉండడం కంటెను, సత్య వాక్యం పలకటం కంటెను, శ్రేష్ఠమైన ధర్మం ఇంకోటి లేదు, జంకు లేకుండా ఇతరులను బాధించడం మిక్కిలి అధర్మమని పేర్కొన్నాడు. కాలాతీతంగా అందరికి ఇది ఆచరణీయం!

### 3.5. అహంకారం

మనమే గొప్ప అని ఎప్పుడూ అహంకరించద్దు. పెద్దల్ని, పిన్నల్ని కూడా ఇష్టమొచ్చినట్లు మాట్లాడకూడదు. అహంకారి హృదయం తృప్తి పొందినట్లు కనిపిస్తున్నప్పటికీ బాధ పొందును. సంతోషం కంటే వారికి సంకటమే ఎక్కువ.

ఇక వెయ్యి సంవత్సరాలు స్వర్గలోక సౌఖ్యాన్ని అనుభవించిన పుణ్యశాలి యయాతి. అటువంటి యయాతిని ఇంద్రుడు నీవు ఏమి తపస్సు చేశావు? స్వర్గలోక భోగాలను, మిక్కిలి తేజస్సుతో లక్షసంవత్సరాలు అనుభవించావు, ఇది సామాన్యమా? అని అనగా యయాతి అహంకారంతో

**"సురదైత్య యక్షరాక్షస**
**నరఖేచర సిద్ధమునిగణ ప్రవరుల భా**
**సురతపములు నాదగు దు**
**ష్కరఘోరతపంబు సరియు గా వమరేంద్ర"**

అని, తన తపస్సు దేవతలు, సిద్ధులు, మునులు, యక్షులు, గంధర్వులు మొదలైన దేవగణాల కంటే గొప్పదని ఇంద్రుడితో పలకగా, వెంటనే అతను స్వర్గలోక నివాసాన్ని కోల్పోయాడు. యయాతి మహారాజు అహంకారాన్ని ప్రదర్శించిన పద్యమిది! ఎవరు కూడా తనగొప్పదనాన్ని తానే చెప్పుకోకూడదు. అది గర్వమవుతుంది. ఆ గర్వం వాళ్ళ పతనానికి దారి తీస్తుంది. తనను తను పొగుడుకోవడం అహంకారమే అవుతుంది.

అహంకారంతో ఇతరులను కించపరచడం మన నాశనాన్ని మనమే కొని తెచ్చుకోవడం వంటిది! కాబట్టి అహంకారం వినాశహేతువు. అందరినీ గౌరవించడం నేర్చుకోవాలి, ఎంత జ్ఞానవంతుడైనా అహంకారం పనికిరాదని వినయవిధేయతలు కలిగి ఉండాలని తెలుసుకోవాలి. సద్గతికి సత్ప్రవర్తన ముఖ్యం. అహంకారం, క్రోధం అంతరించినపుడే పరిపూర్ణమైన శాంతి నెలకొంటుందంటాడు బుద్ధుడు.

### 3.6. సజ్జన సాంగత్యం

"Tell me about your friend, I will tell about you" అన్నట్టుగా మన వ్యక్తిత్వాలు మన స్నేహితులను బట్టి తెలుస్తాయి. సజ్జన సాంగత్యం మనల్ని ఉత్తములుగా తీర్చిదిద్దుతుంది. "కుత్సితుండు చేరి గుణవంతు చేర్చురా" అంటూ వేమన చెడు స్వభావం ఉన్న వారితో సంబంధ బాంధవ్యాలు పెట్టుకుంటే జరిగే అనర్థాన్ని చెప్పకనే చెప్పారు. "అసూయ, అత్యాశ, కోపం, పరుషమైన మాట ఈ నాలుగు వదిలిపెట్టినవాడే సజ్జనుడు" అంటాడు తిరుక్కురళ్.

తన అహంకారంతో స్వర్గలోక వాసం కోల్పోయాడు యయాతి. "మనుష్యలోకంబునకు బోవనోప నంతరిక్షమున సద్భువనంబున సత్సంగతి నుండు నట్లుగా నాకు బ్రసాదింపు"మని ఇంద్రుని అనుమతితో నక్షత్ర లోకానికి వచ్చిన యయాతికి అష్టకుడు, ప్రతర్దనుడు, వసుమంతుడు, శిబి అనే సజ్జనసాంగత్యాన్ని పొంది చివరికి వారితోపాటు తిరిగి స్వర్గలోకానికి చేరుకుంటాడు. "సజ్జనులతోడి సఖిత్వంబు సంభాషణ మాత్ర సిద్ధంబు" అన్నట్టు యయాతి ఆ సజ్జన సాంగత్యం వల్ల తాను కోల్పోయిన స్వర్గాన్ని తిరిగి చేరుకున్నాడు. సజ్జన సాంగత్యం వల్ల సర్వ సుఖాలు కలుగుతాయి. "త్యజ దుర్జన సంసర్గమ్, భజ సాధు సమాగమమ్" కాబట్టి దుష్టసాంగత్యానికి దూరంగా ఉండి సజ్జన సాంగత్యాన్ని పొందాలి.

### 3.7. తప్పును సరిదిద్దుకోడం

యయాతి తన మనుమలైన అష్టకుడు, వసుమంతుడు, ప్రతర్దనుడు మదలైన వారితో మాట్లాడుతూ అహంకారం కూడదని చెబుతూ–

**"అమరావిభుండు దాని విని యల్గి 'మదంబున నుత్తమావమా**
**నముదగునయ్య చేయ' నని నన్ను నధోభువనప్రపాతాసం**
**భ్రమ వివశాత్ము జేసి నది పాడియ యెందును నల్ప మయ్యు ద**
**ర్పము బహుకాలసంచిత తపః ఫలహాని యొనర్పకుండునే"**

తప్పులు చేయడం మానవ సహజం. అయితే దుర్జనులు తాము చేసిన తప్పును అంగీకరించరు. వాటిని ఎదుటివారిమీద రుద్దడానికి ప్రయత్నిస్తారు. కేవలం సజ్జనులు మాత్రమే తాము చేసిన తప్పును తెలుసుకుంటారు. వాటిని అంగీకరిస్తారు. ఇంకోసారి ఆ తప్పు జరగకుండా తమను తాము సరిదిద్దుకుంటారు. యయాతి తన తప్పుని అంగీకరించడం గొప్ప విషయం. ఇంద్రుని శాపం సరైనదిగానే చెప్పడం, యయాతి ఔదార్యగుణాన్ని సూచిస్తుంది. ఈ లక్షణం చేతనే యయాతి నక్షత్రమండలంలోని అష్టకాదులతో తాను అహంకారంతో పలికిన మాటలే స్వర్గలోకం విడిచి నక్షత్రలోకానికి రావడానికి కారణమయ్యాయనీ, మీరు అటువంటి తప్పు ఎప్పుడూ చేయవద్దని తెలియజేస్తాడు. స్వల్పమైన గర్వం కూడా గొప్ప పుణ్యాన్ని నాశనం చేస్తుంది.

### 4. యయాతి కథ మీద నవల

యయాతి ప్రధాన పాత్రగా మరాఠీనుంచి తెలుగులోకి వచ్చిన అనువాద నవల "యయాతి". ఈ నవలను పద్మభూషణ్, జ్ఞానపీఠ(ఈ నవలకే వచ్చింది) వంటి విశిష్ట పురస్కారాలు పొందిన మరాఠీ రచయిత విష్ణు సఖారామ్

ఖాండేకర్ మరాఠీలో రాశారు. దీన్ని తెలుగులో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అనువదించారు. ఈ శీర్షికబట్టే కథాగమనంలో వ్యక్తిప్రాధాన్యత ఉంటుందని తెలుస్తుంది. అయితే ఆ వ్యక్తిఎవరు? యయాతిగా భావిస్తారు. కానీ అతడు కాదు. అతడు ఒక ఉత్సుకతను రేపే వ్యక్తి. అది ఒక ఉత్కంఠ. యయాతే కథను చెబుతాడు. యయాతి ఒక రాజు, నహుషుడి కుమారుడు అరిషడ్వర్గాలలో కామం మొదటి స్థానాన్ని ఆక్రమించింది. చతుర్విధ పురుషార్థాలలో కామానికి మూడో స్థానం ఉంది. కామం గురించి చెప్పని కవుల జాబితా లేదేమో!. శృంగారం రసరాజంగా మారింది. "కామీ స్వతాం పశ్యతి" అని కాళిదాసు అంటే, "కామి కానివాడు మోక్ష గామికాడు" అని వేమన చెప్పాడు.

**"అర్థశాస్త్రమిదం ప్రోక్తం, ధర్మశాస్త్ర మిదం మహత్,**
**కామ శాస్త్రమిదం ప్రోక్తం, వ్యాసేనామిత బుద్ధినా"**

సమస్తాంశాలను విశదీకరించేందుకు సహకారిగా భారతాన్ని పేర్కొంటారు ఆర్యులు. అర్థ, కామాలు ధర్మ0నుంచే పుట్టాయి. అలాంటప్పుడు బయటకు కనబడే అర్థ, కామాలను సేవిస్తూ మూలభూతమైన ధర్మం గురించి ఆలోచించక పోవడం ఆశ్చర్యకరం. స్వయంగా వ్యాసుడే మహాభారతంలో –

**"ఊర్ధ్వ బాహుర్విరౌ మ్యేషః, నతుకశ్చిచ్ఛృణోతిమామ్,**
**ధర్మార్థశ్చ కామాశ్చ, సకిమర్థం ససేవ్యతే?"**

చేతులెత్తి చీవాట్లతో వ్యాసుడే తెలియజేస్తున్నాడు. ధర్మంనుంచి అర్థ, కామ, మోక్షాలు పుడుతున్నాయి. కాబట్టి వాటికి మూలమైన ధర్మాన్ని వదిలేయవద్దు. ధర్మ పరమైన కామం లేకపోతే పడిన అవస్థలకు ప్రతిరూపం యయాతి నవల.

**నజాతు కామః కామానాముపభోగేన శామ్యతి**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్థతే"**

విషయాలను అనుభవించడంవల్ల విషయ భోగేచ్ఛ వృద్ధి చెందుతూనే ఉంటుంది. ఎలాగంటే బాగా మండుతున్న అగ్నిలో నెయ్యి పోసినట్లుగా అనే ఉపమానాన్ని చెప్పాడు, వ్యాసుడు. అందుకే దానికి తగిన విధంగా పరిధులను నిర్ణయించుకొని ప్రవర్తించాలి. అలాకాకపోతే దానిలో పడి కొట్టుకోవాల్సిందే. ధార్మిక తత్త్వాన్ని అలవాటు చేసుకోవాలి. కామంలోనే సుఖం ఉంటుంది కదండి. అందుకే దానిపట్ల ఆకర్షణ కూడా ఉంటుంది. అసలు స్త్రీలతో సంభోగమే నేరమా? అంటే దాన్ని పూర్తిగా నేరం అనడానికి లేదు. వేద మంత్రాలలో పుత్రుల జాతక కర్మాదులను అనుష్ఠిస్తున్నప్పుడు–

**"అంగాదంగా త్సంభవసి హృదయాదధి జాయతే**
**ఆత్మవై పుత్రనామాసి సజీవ శరదశ్శతమ్**
**జీవితం త్వదధీనం మే పుత్ర సంతానమపి చాక్షయమ్**
**తస్మాత్ త్వం జీవ మే పుత్ర ను సుఖీ శరదాం శతమ్"**

ఈ మంత్రాన్ని చెబుతారు. దీనిద్వారా పుత్రులను పొందమని పుత్రానందాన్ని అనుభవించమని చెబుతున్నారు. స్పర్శ సుఖాన్ని ఇచ్చే వారిలో శ్రేష్ఠుడు పుత్రుడు. వాడే పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని ఆర్యుల భావన. వీటికన్నిటికి పరిమితులు ఉన్నాయి. వాటిని ఎప్పటికీ మరువకూడదు. ప్రపంచ దేశాలన్నీ కామ, మోహాలమీద దృష్టి పెడితే భారతదేశం మూడు పురుషార్థాలకు ముందు ధర్మాన్ని అనుసరించాలని చెబుతూనే ఉంది.

యయాతి కథలో సాధారణంగానే సామాజిక అంశాలను ఈ నవలలో జోడించాడు. ప్రేమ, కామం, మోహం, వాత్సల్యం వాటి మధ్య అంతరాలను సూచించే ప్రయత్నం చేయడం గమనించ దగింది.

**5. ముగింపు**

వ్యక్తిత్వవికాసం పొందడానికి, సంభాషణ విధానం తెలుసుకోడానికి, మనవ సంబంధాలను అర్థం చేసుకోడానికి, సద్గుణాలను పెంపొందించుకోడానికి, అహంకారం వాళ్ళ కలిగే అనర్థాన్ని గ్రహించడానికి ఈ యయాతి చరిత్ర ఒక దిక్సూచిగా పని చేస్తుంది. తండ్రికుమారుల సంబంధాలు ఎలా ఉండాలి అనేది తెలుస్తుంది తండ్రికి కలిగిన ఏతువంటి కష్టాన్నైనా తీర్చడానికి సంసిద్ధుడయ్యే కుమారుడే అసలైన పుత్రుడు.అలంటి వాడే తండ్రి సంపాదకు నిజమైన వారసుడు తండ్రి మంచిచెడ్డలు చూడలేని పుత్రుడు తండ్రి ఆస్తిని మాత్రం గ్రహించడానికి ఎలా అర్హుడవుతాడు. ఈ కాలంలో తల్లితండ్రుల కష్టసుఖాలను పట్టించుకోకుండా వారి సంపాదనను మాత్రం అనుభవించే కుమారులు కొందరున్నారు అటువంటి వారికీ తల్లితండ్రుల పట్ల పుత్ర్య బాధ్యతను గుర్తు చేస్తుంది నిజ జీవితం లో ప్రతి వ్యక్తి ధర్మాన్ని ఎలా గ్రహించాలి, ధనాన్ని ఎలా ఉపయోగించాలి, ఎవరితో ఎలా మాట్లాడాలి. ఎలాంటి సద్గుణాలను అలవర్చుకోవాలి మదలైన అంశాలన్నీ ఈ యయాతి చరిత్ర వల్ల తెలుస్తుంది.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్రమహాభారతం(ప్ర.సంపు.). పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
2. ఆంధ్రమహాభారతం-ధర్మతత్వం. విద్వేశ్వేరి, డి. 1998. కర్షక ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.
3. ప్రాచీనకవిత్వంలో వ్యక్తిత్వవికాసం. శాస్త్రి, ద్వా.నా. 2010. సూర్య ప్రచురణలు, హైదరాబాదు.
4. భారతంలో చిన్నకథలు. రామకృష్ణ, ప్రయాగ. 2007. కర్షక ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.
5. మహాభారతం(ఆది, సభా పర్వాలు). గణపతిశాస్త్రి, పిలకా. 1991. త్రివేణి బుక్లస్టు, మచిలీపట్నం.
6. వచన మహాభారతం(ఆది, సభా పర్వాలు). గోపాలకృష్ణ, రెంటాల. 1992. జయంతి పబ్లికేషన్స్, విజయవాడ.
7. శ్రీ నవలా భారతం- డా. జాడ సీతాపతి రావు, 2014 శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ.

# 69. మహాభారతంలో ద్రౌపది పాత్ర - మనస్తత్వ చిత్రణ

– యు.లావణ్య, పి.హెచ్‌డి., స్కాలర్, తెలుగు, యూనివర్శిటీ ఆఫ్ మద్రాస్, చెన్నై.

కవిత్రయ మహాభారతంలోని స్త్రీ పాత్రలు ఏటికవే ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క నీతిని, సత్యాన్ని, ధర్మాన్ని, న్యాయాన్ని బోధించే విధంగా ఉంటాయి. మహాభారతంలో ఒక విలక్షణమైన స్త్రీ పాత్ర ద్రౌపది. మహాభారత మొత్తాన్ని ఒక మాలగా చూస్తే వాటిల్లో అంతర్లీనంగా ఏకసూత్రం దారం ద్రౌపది. ఒక్కమాటలో చెప్పాలంటే మహాభారత కథకు కీలకమైన పాత్ర ద్రౌపది అని చెప్పవచ్చు.

– మహాభారతంలోని ప్రతి సంఘటన మనిషి జీవితానికి ఒక గుణపాఠమే.

## ద్రౌపదిపాత్ర పరిశీలనావశ్యకత

పాంచాల రాజ్యానికి రాజు అయినటువంటి ద్రుపదుడు పుత్ర సంతానం కోసం తపస్సు చేస్తాడు. ఆ కారణంగా అగ్ని నుండి ముందుగా దృష్టద్యుమ్న కుమారుడు. ఆ తరువాత ద్రౌపది 'అయోనిజ'గా (యజ్ఞగుండం) నుంచి జన్మించడం జరుగుతుంది. ప్రపంచ సాహిత్యంలో మహాభారతం వంటి మరో గ్రంథం ఉంటే ఉండవచ్చునేమో గానీ ద్రౌపది వంటి మహోన్నతమైన పాత్ర ఎక్కడ కనిపించదు. మహోన్నతమైన ప్రభావాలను మహాదారుణమైన అవమానాలను ఆమె అనుభవించడం అసాధారణమైన విషయాలు. మహాభారత యుద్ధానికి ద్రౌపదియే మూలకారణమని తెలుస్తున్నది. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యము 18 రోజులలో కురుక్షేత్రము జరిగెను. ఈ యుద్ధమునకు కారణం ద్రౌపది. ఆమె శక్తి స్వరూపిణి, పాండవుల రుద్రపత్ని. పాంచాలరాజు కుమార్తె. ఈమెను వ్యాసమహర్షి వీరపత్నిగా చిత్రించెను.

ద్రౌపది దేవి కారణంగా కురువంశం నాశనం అయిందని వస్తున్న అభిప్రాయం తప్పనీ, ధర్మం కోసమే జరిగిందని అనుకోవచ్చు. ద్రౌపది ఆయా సన్నివేశాలలో ప్రదర్శించిన ఓర్పు, నేర్పు లోకానికి ఆదర్శప్రాయం. ఆమె చరిత్రను నేటి సమాజానికి మన జీవితాలను మనం తీర్చిదిద్దుకోవడం కోసమని వ్యాసభగవానుడు మనకు అందించాడు.

## ద్రౌపది ప్రాముఖ్యత

ద్రౌపది కారణజన్మురాలు. ఇది ఒక కారణమైంది. ఒకానొక మునికన్య కర్మవశాన పతిని పొందలేక శివుని గూర్చి ఘోరతపస్సు చేసింది. శివుడు ఆమెకు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. ఆమె ఆతురతతో 5 సార్లు పతిదానం వేడుకుంది. వెంటనే శివుడు అలాగే, నీకు దేహాంతరాన అయిదుగురు పతులవుతారు. ఇది పరమార్థం అని దయతో ఆమెను అనుగ్రహిస్తాడు. ఆ మునికన్య పాంచాలపతికి కృష్ణగా జన్మించింది. ఆమె ద్రౌపది అని చెప్పవచ్చును.

పాండవుల జీవితంలోకి శ్రీకృష్ణుడు ప్రత్యక్షంగా ప్రవేశించినది కూడా ద్రౌపది వివాహ సందర్భంగానే అనే విషయాన్ని గమనించినపుడు ఆమె పుట్టుక వెనుక గల పరమార్థం కొంతవరకు తెలుస్తుంది. ఒక విధంగా చూస్తే పాండవులను వివాహం వరకూ, కుంతి, వ్యాస భగవానుడూ, వివాహానంతరం ద్రౌపది, శ్రీకృష్ణుడూ నడిపించారనిపిస్తుది. అయితే పరమ ధార్మికులైన ద్రోణాది వీరులూ, కురువృద్ధులూ, ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో శ్రీకృష్ణుని సారధ్యంలో పాండవుల చేత వధింపబడటానికి కర్ణ, దుర్యోధన, దుశ్శాసన పాపం పండటానికి కారణమైనది ఒకే ఒక సంఘటన. అది కురుసభలో కులసతి అయిన ద్రౌపది పరాభవం. భారతకథలో ప్రాముఖ్యం వహించిన పాంచాలి కథను ఇతిహాస దృష్టిలో పరిశీలించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఆమె పుట్టుక, వివాహం, దాంపత్యం, పొందిన పరాభవాలు, అనుభవించిన కష్టాలు, అవమాన పడిన బాధలు ఇవన్నీ కూడా ఆమె జీవితగాధను పరమార్థ దృష్టితో చూసినవారు ఆమెను స్త్రీమూర్తిగా దర్శించి పరవశించిపోతారు. మానవ జీవితంలో సంఘర్షణే భారత యుద్ధమని చెబుతారు.

భారతం ఆధారంగా ఆగాథలో ద్రౌపది పాత్ర ఆమె ప్రాముఖ్యత, విశిష్టత చెప్పుకోదగినది. అంతేకాకుండా నాకు తెలిసి దుర్యోధనునికి అవమానం జరిగిన అందుకు పాండవులను శిక్షిస్తే సరిపోతుంది. కాని ఒక స్త్రీని నిండు సభలో అలా అవమానించడం చాలా బాధాకరం. ఆమె అన్ని కష్టనష్టాలను తట్టుకొని ఒక పుణ్యస్త్రీగా నిలబడుతుంది. అది ద్రౌపది గొప్పతనం.

## ద్రౌపది జన్మవృత్తాంతం, వివాహం

ద్రుపద మహారాజు కోకిలాదేవి పుత్రకామేష్ఠి చేయడంతో అగ్నిదేవుడు ప్రత్యక్షమయ్యాడు. దృష్టిద్యుమ్నునితో పాటుగా

**"కుల పవిత్ర సితౌతరోత్పల కోమలామలవర్ణ యు**
**త్పలను గంధి లసన్మహోత్పల పత్ర నేత్ర యరాళకుం**
**తల విభాసిని దివ్య తీక ముదాల్చి యొక్క కుమారి త**
**జ్జ్వలన కుండమునందు బుట్టి ప్రసన్నమూర్తి ముదంబుతిన్"** **(ఆదిపర్వం – పుట – 7-19)**

కులకుంత ద్రౌపది జన్మంచింది. ఆమెకు కృష్ణ అని ఆకాశవాణి అని నామకరణం చేసింది. శివుని దగ్గర వరం కోరిన ఆ మునికన్యే ఇప్పుడు పాంచాలపతికి 'కృష్ణ' అనే పేరుతో జన్మించి పెరుగుతుంది. ఆ రాజు ఆమెకు స్వయంవరం ఏర్పాటు చేశాడు. బ్రాహ్మణ రూపంలో ఉన్న అర్జునుడు స్వయంవరంలో ద్రౌపదిని గెలిచాడు. కృష్ణుడి అనుమతిని పొంది పాండవులు తల్లి ఆదేశం మేరకు పాండవులు ఐదుగురు ద్రౌపదిని వివాహం చేసుకున్నారు. అప్పుడు కూడా ఆమె ఏమాత్రం కృంగిపోకుండా, తన మనస్థత్వాన్ని నిలకడగా ఉంచుకొని వాళ్ళతో సహజీవనం సాగించడానికి ముందుకు సాగిపోయింది పాంచాలి.

## దాంపత్య జీవితం

అగణ్య పుణ్య లావణ్య గుణ సమన్విత అయిన ద్రౌపది. లోకంలో చాలామంది ద్రౌపదికి ఐదుగురు భర్తలు అయినా ఆమెను పతివ్రతట అంటూ చులకనగా తొందరపాటు మాట్లాడతారే కాని ఐదుగురితో ఆమె దాంపత్యం ఎలా సాగింది అని ఎవరు ఆలోచించరు. అప్పటి నుండి నేటి సమాజం వరకు అలా తప్పుగా అర్థం చేసుకోవడం తప్ప ఆలోచించే గుణం లేకుండా పోయింది.

దాంపత్యానికి ప్రధానమైనది అన్యోన్యానురాగం. ఆ అనురాగం స్త్రీ మూర్తిలో ఆరాధనగా పరిణయించి భక్తిగా పర్యవసించడమే పాతివ్రత్యం. భార్య అంటే భర్త చేత భరింపబడేది. కాని భర్త కొరకు బాధ్యత పడగలిగినపుడే స్త్రీమూర్తికి పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది. అలాంటి పరిపూర్ణత్వం సిద్ధింప చేసుకున్న మహా పతివ్రత ద్రౌపది దేవి. ఆమెకు ధర్మజుని వల్ల ప్రతివింధ్యుడు, భీముడి వల్ల శుత్రసోముడు, అర్జునివల్ల శుశ్రుతకర్మ, నకులుని వల్ల శతనికుడు, సహదేవుని వల్ల శ్రు తసేనుడు అనే కుమారులు ఉప పాండవులుగా జన్మించారు. ఇక్కడ కూడా ఆమె మనస్థత్వం ఎట్టిదో తెలుస్తుంది.

## ద్రౌపది నవ్వు

అపూర్వమైన ఆ సభావ భవన రమణీయతకు ముగ్ధుడై దుర్యోధనుడు ఒకనాడు ఒంటరిగా 'మయ' సభలోని ఆయా ప్రదేశాలను చూడసాగాడు. అక్కడ జలశయాన్ని చూసి మామూలు ప్రదేశమని నడవబోయాడు. బట్టలు తడిసిపోగ వెనుకకు వచ్చాడు. అది చూసి ద్రౌపది నవ్వింది. దుర్యోధనుడు సిగ్గుపడి వెళ్ళిపోయాడు. అక్కడ అతనికి జరిగింది అవమానంగా భావించి సిగ్గుపడ్డాడు.

ద్రౌపది నవ్వటాన్ని గూర్చి దుర్యోధనుని కంటే మహాభారత విమర్శకులే ఎక్కువగా బాధపడ్డారనిపిస్తుంది. ఈ నవ్వు కారణంగా దుర్యోధనుడు కక్షకట్టి కురుసభలో ద్రౌపదిని అవమానించాడు. సమర్ధించాలని కూడ ప్రయత్నించాడు. మరికొందరు ఆ సన్నివేశంలో ద్రౌపది నవ్వడంలో తప్పులేదనే దుర్యోధనుడు అంతగా పగపెట్టుకోవడం తప్పని అన్నారు.

ఇలా నవ్వడం అపరాధం మాత్రము కాదు. అయినా ఈ చిన్న పొరపాటును దుర్యోధనుడు సహించలేకపోయాడు. ఆమెను అమానుషంగా కురుసభలో అవమానించడం జరిగింది. ద్రౌపదికి అక్కడ ఎన్ని అవమానాలు ఎదురైన కాని ఆమె పటిష్ఠంగా నిలబడింది. తనను తాను కాపాడుకున్నది. ఇక్కడ ద్రౌపది మనస్థత్వాన్ని మనం గ్రహించగలం.

**కురుసభలో పరాభవం**

పాండవుల సర్వసంపదలూ అన్ని మాయాజూదంలో శకుని గెలుచుకున్నాడు. చివరకు ద్రౌపదిని కూడా ధర్మరాజు పణంగా పెట్టి ఓడిపోయాడు. ఆ సందర్భంలో దుర్యోధనుడు గర్వితుడై విదురునితో ద్రౌపదిని తీసుకురా... ఆమె నా దాసీ. "దాసీలతో" కలిసి ఇల్లు తుడుస్తుంది అని అన్నాడు. అది సహించలేకపోయాడు విదురుడు. జరిగినదంతా అధర్మం అని అన్నాడు. ద్రౌపది తీసుకురమ్మని ప్రతికారుని పంపాడు. ద్రౌపది వద్దకి వెళ్ళి విషయం చెప్పి నిన్ను కురుసభకు తీసుకుపోవడానికి వచ్చాను. వెంటనే రావలసింది అన్నాడు అప్పుడు

**"ద్రౌపది అదరలేదు, బెదరలేదు స్థిర బుద్ధితో**
**ఏ యుగంబు నందు నెట్టి దుష్కింతవుండు**
**గలదె యిది వినంగ గదు నపూర్వం బయ్యె**
**నిట్టు సేయునక్కా యిందుకులుడు? సభాపర్వం (పుట - 2 - 208)**

ద్రౌపది సభకు రాక తప్పలేదు. దుశ్శాసనుడు ఆమెను కురులు పట్టి ఈడ్చుకొని సభలో పడవేశాడు. కురువృద్ధుల సమీపంలో నిలబడింది. ద్రౌపదిని చూడలేక సిగ్గుతోను, దు:ఖంతోను తలవంచుకొని ఉండిపోయారు పాండవులు నివ్వెరపోయి నిలబడ్డారు. నిన్ను జూదంలో శకుని గెలిచాడు. నీ భర్తలైన పాండవులు నిన్నూ, రాజ్యాన్ని ఓడిపోయారు. నిన్ను తీసుకొనిపోక తప్పదు అంటూ సభలోని వారంతా ఆశ్చర్యంగా చూస్తూ ఉండగా ఆమె జుట్టు పట్టుకొని ఈడ్చుకువచ్చాడు, దుశ్శాసనుడు. ఏ మాత్రం సంకోచించక ద్రౌపది కట్టుబట్టను విప్పబోయాడు. ఒక వస్త్రాన్ని తీస్తే అలాంటిదే మరో వస్త్రం వస్తుంది. ఇలా చేసే కొద్ది ఒంటిపై వస్త్రాలు వస్తూనే ఉన్నాయి. అక్కడ ఉన్న కురువృద్ధులు, గురువృద్ధులు, బంధువులు అనేకులు ఆనందపడ్డారు. దుశ్శాసనుడు ఒలిచి, ఒలిచి, ఆ వస్త్రాలు కొండంత రాశిపోసి శక్తి తగ్గిపోయి ఒలవలేక సిగ్గుపడి మానివేశాడు.

సభలో అందరూ చూస్తుండగా విజృంభించి "ద్రౌపది ఇలా నన్ను అవమానించిన ఈ దుశ్శాసనుణ్ణి చంపి, గుండెలు చీల్చి రక్తం త్రాగుతా" నని భీముడు ప్రతిజ్ఞ చేశాడు. ఐదుగురు కంటే ఒక్క భర్త ఉండటం మంచిది అంటూ హేళన చేస్తాడు కర్ణుడు. అప్పుడు దుర్యోధనుడు ఆమెను రా... నా తొడపై కూర్చో అని చెప్తాడు. గుడ్డిదైన కురు న్యాయస్థానం నోరు విప్పి న్యాయాన్ని ధర్మాన్ని చెప్పలేకపోయింది. ద్రౌపది నాకు ఇంత అవమానం జరిగిన తరువాత నేను చూస్తూ ఉండను అంటూ వాళ్ళకు శాపం పెట్టబోతుంది. అక్కడ వున్న వాళ్ళు ఆమె పరాక్రమాన్ని చూసి భయపడి అమ్మా ద్రౌపది ద్రుపద మహారాజ కుమార్తె, పాండవుల పత్ని శాంతించమ్మా అంటూ కోరుతారు.

మయసభలో పాండవుల పట్ల బాధ్యత పడిన శ్రీకృష్ణుడే కురుసభలో కూడా పాండవులకు దిక్కు అయి, ద్రౌపది మాన సంరక్షణ కాపాడాడు. ద్రౌపది కారణంగా మొదటిసారి తప్పిపోయిన యుద్ధాన్ని పదమూడేళ్ళ తరువాత తామంత తాముగా కోరి తెచ్చుకొని పతనమయ్యారు. కౌరవులు 12 సం॥ వనవాసం, 1 సంవత్సరం అజ్ఞాతవాసం చేశారు పాండవులు.

శ్రీకృష్ణుడిని నమ్ముకొని ధర్మానికి కట్టుబడి అవమానాలు సహించి, కష్టాలకు, నష్టాలకు లోనయినా చలించకుండా నిలబడింది. శ్రీకృష్ణుడ్ని హృదయంలో నిలుపుకొని తన పాతివ్రత్యాన్ని ప్రకటితం చేసుకున్న మహా మహిమాన్విత ద్రౌపది దేవి. ఇక్కడ కూడా ఆమె మనస్థత్వానికి భంగం కలగకుండా చూసుకుంది.

**ద్రౌపది శక్తి సామర్థ్యాలు**

ద్రౌపది వేరు వేరు వ్యక్తిత్వాలు గల ఐదుగురు మహా పురుషులకు భార్యగా ద్రౌపది సమర్థతో తన పాత్రను తాను పోషించుకుంటూ, ధర్మ నిర్వహణలో భర్తలకు సహకరిస్తూ, ప్రపంచ వాఙ్మయంలోనే విశిష్టమైన స్థానాన్ని పొందింది. పవిత్రమైన ద్రుపదుని వంశంలో పుట్టిన ప్రఖ్యాతమైన భారత వంశాన్ని మెట్టి సర్వసమర్థులైన పాండవుల ధర్మపత్ని అయి, మహా సామ్రాజ్ఞిగాను, వ్యక్తిగతంగాను ఆమె పొందిన అవమానాలు ఏ యుగంలోనూ ఏ స్త్రీకి సంభవించి ఉండవు.

ఈ విలక్షణతతో మానావమానాలకు అతీతంగా ఒకానొక యోగస్థితిలో నిలిచి ఆమె తన పాత్రను తాను నిర్వహించిన తీరు అద్భుతం అని చెప్పవచ్చు. వ్యక్తుల యొక్క మాటను బట్టి మనస్సును, చేతలను బట్టి ఆంతర్యాన్ని గ్రహించగల సామర్థ్యం ద్రౌపదికి ఉంది. ద్రౌపది శక్తి సామర్థ్యాలు కురుసభలో జరిగేటటువంటి అనర్థాన్ని అంతా గుర్తించి ఆమె ఒక్కసారిగా మాట్లాడటం, శాపాలు పెట్టడం వంటివి జరిగాయి. కాని ఆమెను అక్కడ అడ్డుకున్నారు శాపం పెట్టనీయకుండా ద్రౌపదిని వేడుకున్నారు.

**ముగింపు**

ద్రౌపది పాత్ర ఆమె మనస్తత్వం ఎలా ఉంటుంది. అంటే ద్రౌపదీ దేవి దివ్యత్వమూ, సౌందర్యమూ, శక్తిసామర్థ్యాలు, ప్రజ్ఞాపాటవం, పాతివ్రత్యం మహిమ, అనన్య భక్తి, ద్రౌపది మాతృత్వం, ఇవన్నీ కూడ ఆమెలో కలిగి ఉన్నాయి. అంతటి సామర్థ్యం గల స్త్రీ పాంచాలి. ఎక్కడ ఎన్ని అవమానాలు ఎదురైన తన మనస్థత్వాన్ని మాత్రం ఎక్కడ పోగొట్టుకోలేదు. ఆమె అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని పాండవులతో ముందుకు సాగింది. ఆనాటి నుండి ఈనాటి వరకు స్త్రీలు, ఎన్ని రకాలుగా ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇంక ఈ సమాజం మారనే లేదు. అన్నింటిని ఎదుర్కొని మహాభారతంలోనే చెప్పుకోదగిన స్త్రీ పాత్ర ద్రౌపది.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్ర మహాభారతమూ ద్రౌపది – డాక్టర్ వాడవల్లి చక్రపాని రావు
2. ఆంధ్ర మహాభాగవతము – పోతన మహాకవి
3. శ్రీమదాంధ్ర మహాభారతము – వావిళ్ళవారి ప్రతులు

# మూసీ ప్రత్యేక సంచిక

UGC Care List Approved Journals Under Arts and Humanities Category

Vol. : 27 Issue : 5 Spl. Edition MARCH - 2024 ISSN No. : 2457-0796

## అంతర్జాతీయ సదస్సు



# కవిత్రయ మహాభారతం

## వర్తమాన సమాజం : సమాలోచనం

మార్చి 4, 5 & 6, 2024



తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం